# లెనిన్

## సంకలిత రచనలు

### తొమ్మిది సంపుటాల్లో

## 2

ఒక అడుగు ముందుకి, రెండడుగులు వెనక్కి • రష్యాలో విప్లవారంభం • ప్రజాతంత్ర విప్లవంలో సోషల్ డెమోక్రసీయొక్క రెండు యెత్తుగడలు •

"ప్రగతి" ప్రచురణాలయం, మాస్కో



సకల దేశాల కార్మికులారా, ఏకంకండి!



В. Ульянов (Ленин)

# వి.ఐ. లెనిన్

# సంకలిత రచనలు

## తొమ్మిది సంపుటాల్లో

## 2

"ప్రగతి" ప్రచురణాలయం
మాస్కో

అనువాదం: కొండేపూడి లక్ష్మీనారాయణ

నిడమర్తి ఉమారాజేశ్వరరావు

రాచమల్లు రామచంద్రారెడ్డి

**В. И. Ленин**

ИЗБРАННЫЕ ПРОИЗВЕДЕНИЯ В 9 ТОМАХ

ТОМ II

*на языке телугу*

**V. I. Lenin**

SELECTED WORKS IN NINE VOLUMES

**Volume II**

*in Telugu*

© తెలుగు అనువాదం ''ప్రగతి'' ప్రచురణాలయం 1984

Л $\frac{0101020000—404}{014(01)—84}$ 345—84

# విషయసూచిక


ప్రచురణకర్తల మాట . . . . . . . . . . . . . . . . 9

ఒక అడుగు ముందుకి, రెండడుగులు వెనక్కి (అను: కొండేపూడి లక్ష్మీనారాయణ) 13

ముందుమాట . . . . . . . . . . . . . . 13

అ) మహాసభకు సన్నాహాలు . . . . . . . . . 17

ఆ) మహాసభలో వివిధ గ్రూపింగుల ప్రాముఖ్యం . . . . . 19

ఇ) మహాసభ ప్రారంభం. ఆర్గనైజింగు కమిటీ ఘటన . . . . . 23

ఈ) ''యూజ్నీ రబోచి'' గ్రూపు రద్దు . . . . . . . 32

ఉ) భాషల సమానత్వం ఘటన . . . . . . . . . 36

ఊ) వ్యవసాయ కార్యక్రమం . . . . . . . . . . 44

ఎ) పార్టీ నిబంధనావళి. కామ్రేడ్ మార్తొవ్ ముసాయిదా. . . . . 52

ఏ) ''ఇస్క్రా''వాళ్ల మధ్య చీలికకు పూర్వం కేంద్రీకరణపై చర్చలు . 63

ఐ) నిబంధనావళిలో మొదటి నిబంధన . . . . . . . . 67

ఒ) అవకాశవాదులు అనే తప్పుడు నిందారోపణకు గురి అయిన నిరపరాధులు 92

ఓ) నిబంధనావళిపై చర్చల కొనసాగింపు. కౌన్సిలు కూర్పు . . . . 104

ఔ) నిబంధనావళిపై చర్చల ముగింపు. కేంద్ర సంస్థలకు కో-ఆప్టు చేసుకోవడం. ''రబోచెయె దేలొ'' ప్రతినిధుల ఉపసంహరణ . . . 111

క) ఎన్నికలు. మహాసభ ముగింపు . . . . . . . . . 126

ఖ) మహాసభలో జరిగిన పోరాటపు సమగ్ర చిత్రణ. పార్టీలోని విప్లవకర, అవకాశవాద పక్షాలు . . . . . . . . . . . . 157

గ) మహాసభానంతరం. రెండు పోరాట పద్ధతులు . . . . . . 172
ఘ) గొప్ప సుఖానికి స్వల్పమైన బాధలు అడ్డురాకూడదు . . . 194
ఙ) కొత్త ''ఇస్క్రా.'' నిర్మాణ సమస్యలలో అవకాశవాదం . . . 207
చ) గతితర్కం గురించి కొద్ది మాటలు. రెండు విప్లవాలు . . . 240
అనుబంధం. కామ్రేడ్స్ గూసెవ్, డేయ్చ్‌ల మధ్య జరిగిన ఘటన . 246

రష్యాలో విప్లవారంభం (అను: నిడమర్తి ఉమారాజేశ్వరరావు) . . . . . 256

ప్రజాతంత్ర విప్లవంలో సోషల్ డెమోక్రసీయొక్క రెండు యెత్తుగడలు (అను: రాచమల్లు రామచంద్రారెడ్డి) . . . . . . . . . . . 260
పీఠిక . . . . . . . . . . . . . . . 260
1. జరూరు రాజకీయ సమస్య . . . . . . . . . 264
2. తాత్కాలిక విప్లవ ప్రభుత్వం గురించి ఆర్.ఎస్.డి.ఎల్.పి. మూడవ మహాసభ చేసిన తీర్మానంనుండి మనం నేర్చుకొనగలది యేమిటి? . 267
3. ''జారిజంమీద విప్లవంయొక్క నిర్ణయాత్మక విజయం'' అంటే యేమిటి? 274
4. రాజరికం రద్దు, రిపబ్లిక్ స్థాపన . . . . . . . 281
5. ''విప్లవాన్ని ముందుకు తీసుకపోవడం'' యెలా? . . . . . 287
6. అస్థిర బూర్జువావర్గంతో చేసే పోరాటంలో తన చేతులు కట్టి వేయబడే ప్రమాదం శ్రామికవర్గానికి యెక్కడనుండి వస్తున్నది? . 291
7. ''ప్రభుత్వంనుండి యధాతథవాదులను తొలగించే'' యెత్తుగడలు . 305
8. ''ఒస్వొబొజ్దేనియె,'' కొత్త ''ఇస్క్రా''ల ధోరణులు . . . . . 310
9. విప్లవ కాలంలో తీవ్ర ప్రతిపక్ష పార్టీగా వుండడమంటే యేమిటి? . 319
10. ''విప్లవ కమ్యూన్లూ,'' కార్మికవర్గంయొక్కా, రైతాంగంయొక్కా విప్లవ ప్రజాతంత్ర నియంతృత్వమూ . . . . . . . 323
11. ఆర్.ఎస్.డి.ఎల్.పి. మూడవ మహాసభయొక్క కొన్ని తీర్మానాలనూ, ''కాన్ఫరెన్సు'' తీర్మానాలనూ స్థూలంగా పోల్చిచూడడం . . . 333
12. ప్రజాతంత్ర విప్లవంనుండి బూర్జువావర్గం వెనక్కి పోతే, ఆ విప్లవ విస్తృతి తగ్గుతుందా? . . . . . . . . . . . 338

13. ముగింపు. మనకు గెలిచే ధైర్యం వుందా? . . . . . . 347
ఉత్తరకాండ (మరొకసారి ''ఒస్వాబొజ్దేనియె'' ధోరణి, మరొకసారి కొత్త ''ఇస్క్రా'' ధోరణి) . . . . . . . . . . . . . 359
I. బూర్జువా ఉదారవాద వాస్తవికవాదులు సోషల్ డెమోక్రటిక్ ''వాస్తవికవాదు''లను యెందుకు పొగడుతారు? . . . . . . . . 359
II. కామ్రేడ్ మర్తీనొవ్ సమస్యను మళ్లీ ''ప్రగాఢత్వం'' చేస్తున్నాడు 367
III. నియంతృత్వంమీద అపభ్రంశ బూర్జువా అభిప్రాయాలూ, మార్క్సిస్టు అభిప్రాయాలూ . . . . . . . . . . . . . . 376

వివరణలు . . . . . . . . . . . . . . . . 386

పేర్ల సూచి . . . . . . . . . . . . . . . . 415

# ప్రచురణకర్తల మాట

లెనిన్ ''సంకలిత రచనలు'' రెండవ సంపుటంలో 1904–1905 సంవత్సరాల్లో ఆయన రచించిన ''ఒక అడుగు ముందుకి, రెండడుగులు వెనక్కి (మన పార్టీలో సంక్షోభం),'' ''రష్యాలో విప్లవారంభం,'' ''ప్రజాతంత్ర విప్లవంలో సోషల్ డెమోక్రసీయొక్క రెండు ఎత్తుగడలు'' వున్నాయి.

రష్యాలో విప్లవోద్యమం విజృంభించిన, రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలో తీవ్ర పోరాటం జరిగిన దశ అది. 1903 వేసవిలో రష్యన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ రెండవ మహాసభ జరిగింది. దానిలో పార్టీలో వున్న నిశితమైన వైరుధ్యాలు బయటపడ్డాయి. అవే దరిమిలా పార్టీ చీలికకూ, స్వతంత్రమైన రెండు పార్టీలు – విప్లవాత్మకమైన బోల్షెవిక్ పార్టీ, అవకాశవాద మెన్షెవిక్ పార్టీ – ఏర్పడడానికీ దారితీశాయి. మొదట్లో యీ వైరుధ్యాలు వ్యక్తమైనది ప్రధానాంశాల్లో కాదు. ఆ మహాసభ, సోషలిజం సంస్థాపనను తన అంతిమ లక్ష్యంగానూ, సోషలిస్టు విప్లవాన్నీ, శ్రామికవర్గ నియంతృత్వాన్నీ ఆ విప్లవ విజయానికి అవసర షరతులుగానూ గుర్తించే మార్క్సిస్టు దృక్పథాన్ని ఆమోదించింది. పార్టీ నిబంధనావళిని గురించీ, అందునా ప్రత్యేకించి పార్టీ నిర్మాణ స్వరూపానికి సంబంధించిన నిర్మాణపరమైన సూత్రాల సమస్యపైనా జరిగిన చర్చల క్రమంలో తీవ్రమైన పోరాటం జరిగింది. లెనినూ, ఆయన అనుచరులూ కార్మికవర్గపు సమరశీల విప్లవకర పార్టీ ఏర్పాటు కోసం ప్రయత్నించారు. ఊగిసలాడే, అస్థిర వ్యక్తులెవ్వరూ పార్టీలో చేరకుండా నిరోధించే నిబంధనావళిని ఆమోదించడం అవసరమని భావించారు. పార్టీని కార్మికవర్గపు అగ్రగామి సంఘటిత విభాగంగా పరిగణించే లెనినిస్టు అభిప్రాయానికి, మెన్షెవిక్ నాయకుడు మార్తొవ్, పార్టీలో చేరాలనుకున్న వాళ్లందరినీ సభ్యులుగా చేర్చుకోవాలన్న అసంబద్ధమైన, సారాంశంలో పెటీబూర్జువా, అవకాశవాద ఆర్గనైజేషనల్ విధానాన్ని పోటీగా ప్రతిపాదించాడు.

ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభ అనంతరం మెన్షెవిక్కులు పార్టీ కేంద్ర పత్రిక అయిన ''ఇస్క్రా''లో తిష్ఠవేసి బోల్షెవిక్కులకు వ్యతిరేకంగా దండయాత్ర మొదలు

పెట్టారు. కొత్త "ఇస్క్రా"లో నిర్మాణపరమైన అసంబద్ధతను ప్రతిపాదించి, అరాజకవాద క్రమశిక్షణా రాహిత్యాన్ని సమర్థించే మెన్షెవిక్ నాయకుల వ్యాసాలూ, ప్రకటనలూ అనేకం వెలువడుతూ వుండేవి. లెనిన్‌కీ, బోల్షెవిక్కులకీ వ్యతిరేకంగా ఉన్ముఖంచెయ్యబడిన ట్రాట్స్కీ వ్యాసాలు ప్రత్యేకించి మిక్కిలి నిశితంగానూ, నిందాపూర్వకంగానూ వుండేవి. ప్లెహానోవ్, మార్తొవ్, అక్సెల్‌రోడ్, జసూలిచ్ వంటి ప్రముఖ పార్టీ నాయకులూ, తదితరులూ మెన్షెవిక్కుల పక్షాన ఉండటంతో పరిస్థితి మరింత గడ్డుగా తయారైంది. కౌట్స్కీ నాయకత్వంలో రెండవ ఇంటర్నేషనల్ నాయకులు కూడా మెన్షెవిక్కులను బాహాటంగా సమర్థించారు.

మెన్షెవిక్కులను కృతనిశ్చితంగా తిప్పికొట్టి, అనిపుణ అధ్యయన కేంద్రాల ప్రభావానికి వ్యతిరేకంగా పార్టీని కాపాడి, బృందపు సరళికి వ్యతిరేకంగా పోరాడవలసిన తక్షణ కర్తవ్యం లెనిన్‌నీ, బోల్షెవిక్కులనీ ఎదుర్కొంది. లెనిన్ రచించిన "ఒక అడుగు ముందుకి, రెండడుగులు వెనక్కి (మన పార్టీలో సంక్షోభం)" అన్న పుస్తకం ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభలో పార్టీలో జరిగిన పోరాటాన్ని వర్ణించడం ద్వారా ఒక ముఖ్యమైన పాత్ర వహించింది. లెనిన్ యీ పుస్తకాన్ని ఎనిమిది నెలల్లో తయారుచేశాడు, అందులో ఆయన ఆ మహాసభ మినిట్స్‌నూ, ఆ దశకు సంబంధించిన తదితర పత్రాలనూ కూలంకషంగా అధ్యయనంచేసి, విశ్లేషించాడు. ఆ గ్రంథశీర్షికలో లెనిన్ ఆ కాలపు పరిస్థితిని అత్యంత సముచితంగానూ, సుస్పష్టంగానూ ప్రతిబింబించాడు. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభలో విప్లవకర సోషల్ డెమోక్రట్లు అధ్యయన బృందాల విచ్ఛిన్నాన్ని అధిగమించడంలోనూ, కేంద్రీకృతమైన పార్టీని సృష్టించడంలోనూ విజయం పొందారు గనుక, దాన్ని "ముందుకి ఒక అడుగు"గా ఆయన పరిగణించాడు. కానైతే, ఆ మహాసభలో కేంద్ర పార్టీ సంస్థల ఎన్నికల్లో ఓడింపబడిన మెన్షెవిక్కులు యితర అవకాశవాద శక్తులతో కలిసి పార్టీ ఉన్నత సంస్థల్లో పాల్గొనకుండా వాటిని బాయ్‌కాట్ చెయ్యడం మొదలెట్టి, పార్టీని తిరిగి అనిపుణ అధ్యయన బృందాల దశకు వెనక్కి లాగారు. ఇవి "వెనక్కి రెండడుగులు."

లెనిన్ రచించిన యీ పుస్తకం, పార్టీ నిర్మాణానికి సంబంధించిన విషయాల్లో మెన్షెవిక్కుల అవకాశవాదంమీద చావు దెబ్బ కొట్టింది. అంతేకాక యీ పుస్తకంతో మరో ముఖ్యమైన అడుగు — పార్టీ మార్క్సిస్టు సిద్ధాంత విపులీకరణలో, కార్మికవర్గపు నికరమైన విప్లవాత్మక పార్టీని, ఓ కొత్త తరహా పార్టీని, ఏర్పాటు చేసుకోవడంలోనూ రష్యన్ మార్క్సిస్టులు చేసిన పోరాటంలోనూ వేసిన అడుగు — ముడిబడివుంది.

19వ శతాబ్ది మలుపులో రష్యా సామ్రాజ్యవాద దశలో ప్రవేశించింది. 1900–03 నాటి తీవ్రమైన ఆర్థిక సంక్షోభం మూలంగా గుత్త దశలోకి పెట్టుబడిదారీ విధాన పరివ

ర్తన త్వరితమైంది. ఆ సంక్షోభ సంవత్సరాల్లో కార్మికవర్గంపై పెట్టుబడి చేసిన భీకరమైన దాడి మూలంగా సమ్మెలు ఎక్కువయ్యాయి. కార్మికులు ఆర్థిక సమ్మెలనుంచి రాజకీయ సమ్మెలకు మారారు. రైతుల్లో అశాంతి పెరిగింది. అలాగే విద్యార్థి ఉద్యమం ముమ్మరమైంది. జపానుకు వ్యతిరేకంగా 1904 జనవరిలో మొదలైన యుద్ధం రష్యా సామాజిక జీవితంలోని వైరుధ్యాలన్నింటినీ తీవ్రతరంచేసి, విప్లవాత్మక సంఘటనలను త్వరితం చేసింది.

1905వ సంవత్సరం ముఖ్యమైన చారిత్రక సంఘటనలతో మొదలైంది. జనవరి 3వ తేదీన సెంట్ పీటర్స్‌బుర్గ్‌లోని పుతీలొవ్ కర్మాగారం (యిప్పటి లెనిన్‌గ్రాడ్‌లోని కీరొవ్ కర్మాగారం)లోని పదమూడు వేలమంది కార్మికులు సమ్మె చేశారు. ఇతర పరిశ్రమల్లోని కార్మికులు పుతీలొవ్ కర్మాగారంలోని తమ కామ్రేడ్సును బలపరిచారు, జనవరి 7న ఆ సమ్మె సార్వత్రిక సమ్మె అయింది. జనవరి 9వ తేదీన సెంట్ పీటర్స్‌బుర్గ్ వీధుల్లో రక్తం ఏరులై పారింది — జారు దగ్గరకి మహజరు తీసుకువెళ్తున్న కార్మికుల శాంతియుత ప్రదర్శనమీద జారు సైనికులు కాల్పులు జరిపారు. ఈ రక్తపాతం ద్వారా కార్మికుల పోరాట సంకల్పాన్ని అణచివెయ్యాలనీ, వాళ్లని విధేయులుగా చేసుకోవాలనీ ప్రభుత్వం సంకల్పించింది. కాని జారు ప్రభుత్వపు అంచనాలు తప్పాయి. శాంతియుతులూ, నిరాయుధులూ అయిన ప్రజలపై జరిగిన కాల్పులు సాయుధ పోరాటం ద్వారా మాత్రమే స్వేచ్ఛను సాధించుకోవడం సంభవమన్న విషయాన్ని తిరుగులేకుండా నిరూపించాయి.

విదేశాల్లో ప్రవాసిగా నివసించవలసివచ్చిన లెనిన్ రష్యాలో జరుగుతున్న ఘటనలను అతి సన్నిహితంగా గమనించుతూ, వాటిని ప్రగాఢంగా విశ్లేషించి, సరైన అంచనా వేస్తూ, వాటికి ప్రతిస్పందిస్తూ వచ్చాడు. జనవరి 9వ తేదీ సంఘటనలను గురించి తెలుసుకున్న లెనిన్, వెంటనే "రష్యాలో విప్లవం" అన్న శీర్షికతో ఒక వ్యాసం రాశాడు. మరి కొద్ది రోజుల తర్వాత "రష్యాలో విప్లవారంభం" పేర రచించిన మరో వ్యాసంలో ప్రపంచ కార్మికోద్యమ భవితవ్యాన్ని ప్రభావితం చెయ్యడంలో రష్యన్ శ్రామికవర్గానికీ, దాని వీరోచిత పోరాటానికీ గల మహత్తర పాత్రను గురించి నొక్కిచెప్పాడు. "యావత్ప్రపంచపు శ్రామిక వర్గమూ యిప్పుడు యావత్తు రష్యా శ్రామికవర్గం వంక ఆతృతగా చూస్తోంది. రష్యాలో మన శ్రామికవర్గంచేత వీరోచితంగా ప్రారంభించబడిన జారిజం కూల్చివేత, సకల దేశాల చరిత్రలోనూ ఒక మూలమలుపు అవుతుంది. అన్ని దేశాల్లోని, ప్రపంచపు అన్ని భాగాల్లోని, అన్ని జాతుల కార్మికుల కర్తవ్య నిర్వహణనూ యిది సుగమం చేస్తుంది." (యీ సంపుటంలో 259 పేజి చూడండి.)


విప్లవ కాలంలో ఆర్.ఎస్.డి.ఎల్.పి. లోపలి వైరుధ్యం మరింత వ్యగ్రమైంది. విప్లవ చోదక శక్తులను గురించి వాళ్లు వేసిన అంచనాలోనూ, వాళ్ల ఎత్తుగడల్లోనూ మెన్షెవిక్కుల

అవకాశవాదం ప్రత్యేకించి విస్పష్టంగా వ్యక్తమైంది. పార్టీలో సంక్షోభం ప్రగాఢమవుతోంది. విప్లవంలో శ్రామికవర్గపు సమైక్య ఎత్తుగడలను రూపొందించేందుకుగాను వెన్వెంటనే పార్టీ మహాసభను జరపవలసిన ఆవశ్యకత ఏర్పడింది. బోల్షెవిక్, మెన్షెవిక్ పార్టీ కమిటీలు రెండింటినీ ఆ మహాసభకి ఆహ్వానించాలని లెనిన్ ప్రతిపాదించాడు. అయితే, మెన్షెవిక్కులు, మూడవ మహాసభ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నిరాకరించారు, వాళ్లు పార్టీ నుంచి విడిపోయిన ఒక భాగంగా వ్యవహరించి, జెనీవాలో తమ సొంత మహాసభను ఏర్పాటు చేశారు, కాని ప్రతినిధులు స్వల్ప సంఖ్యలో హాజరైన కారణంగా దాన్ని వాళ్లు కాన్ఫరెన్సు అని పిలిచారు. లెనిన్ దాన్ని ''రెండు మహాసభలు – రెండు పార్టీలు'' అని వర్ణించాడు.

ఆర్.ఎస్.డి.ఎల్.పి. మూడవ మహాసభ 1905 ఏప్రిల్ 12 (25)న లండన్‌లో ప్రారంభమైంది. బోల్షెవిక్ మహాసభ బూర్జువా ప్రజాతంత్ర విప్లవంలో పార్టీ వ్యూహాత్మక పథకాన్నీ, ఎత్తుగడలనూ రూపొందించింది. ఆ పథకపు సారాంశం ఏమిటంటే, శ్రామిక వర్గం, రైతాంగమంతటి పొత్తుతో, ఉదారవాద బూర్జువావర్గాన్ని తటస్థంచేసి, బూర్జువా ప్రజాతంత్ర విప్లవాన్ని అంతిమ విజయందాకా సాగించాలి, ఆ విధంగా సోషలిస్టు విప్లవానికి మార్గాన్ని సుగమంచెయ్యాలి.

ఆర్.ఎస్.డి.ఎల్.పి. మూడవ మహాసభ తీర్మానాల ప్రచారానికీ, మెన్షెవిక్కుల అవకాశవాదంపై విమర్శకీ లెనిన్ బృహత్తర ప్రాముఖ్యాన్ని ఆపాదించాడు. 1905 జూన్ – జూలై దశలో ఆయన ''ప్రజాతంత్ర విప్లవంలో సోషల్ డెమోక్రసీయొక్క రెండు ఎత్తుగడలు'' అనే పుస్తకాన్ని రచించాడు. దానిలో ఆయన, మూడవ పార్టీ మహాసభ తీర్మానాలకూ, గుత్తపెట్టుబడిదారీ విధాన పరిస్థితుల్లో బోల్షెవిక్కుల వ్యూహానికీ, ఎత్తుగడలకీ సిద్ధాంతపరమైన ఆధారాలు చూపి నిరూపించాడు. మొదటి రష్యన్ విప్లవ సంవత్సరాల్లో లెనిన్ రూపొందించిన సోషలిస్టు విప్లవ సిద్ధాంతంలో, విప్లవంలో శ్రామికవర్గపు ఆధిపత్యాన్ని గురించీ, శ్రామికవర్గానికీ రైతాంగానికీ మధ్య పొత్తుని గురించీ, ఒక కొత్త తరహా పార్టీ నాయక, మార్గదర్శక పాత్రని గురించీ, శ్రామికవర్గ, రైతాంగాల విప్లవ ప్రజాతంత్ర నియంతృత్వాన్ని గురించీ, బూర్జువా ప్రజాతంత్ర విప్లవం సోషలిస్టు విప్లవంగా పెంపొందడాన్ని గురించీ, యీ పరిణామ పద్ధతులను గురించీ అతి ముఖ్యమైన అనేక అంశాలు ఉన్నాయి.

''ప్రజాతంత్ర విప్లవంలో సోషల్ డెమోక్రసీయొక్క రెండు ఎత్తుగడలు'' అన్న పుస్తకంలో లెనిన్ విపులీకరించిన భావాలు మార్క్సిజం భాండాగారానికి ఓ కొత్త చేర్పు. ప్రజాస్వామ్యం, సోషలిజాల విజయం కోసం ప్రపంచమంతటిలోనూ విప్లవ పార్టీలు జరిపే పోరాటంలో, ఆ భావాలకు సమకాలిక రాజకీయ, సైద్ధాంతిక ప్రాముఖ్యం వుంది.



N. LENIN. Ein Schritt vorwärts, zwei Schritt rückwärts
(Über die Krise in unserer Partei).

Россійская Соціальдемократическая Рабочая Партія

Н. ЛЕНИНЪ.

Шагъ впередъ,
два шага назадъ

(Кризисъ въ нашей Партіи).

ЖЕНЕВА
Типографія Партіи. Rue de la Coulouvreniere, 27.
1904

''ఒక అడుగు ముందుకి, రెండడుగులు వెనక్కి'' (1904)
అనే పుస్తకం ముఖ పత్రం

# ఒక అడుగు ముందుకి, రెండడుగులు వెనక్కి

(మన పార్టీలో సంక్షోభం)

## ముందుమాట

ఒక సుదీర్ఘమైన, పట్టుదలతో కూడిన, ఉద్రిక్తమైన పోరాటం సాగుతూన్నప్పుడు, సాధారణంగా కొంత కాలం అయిన తరువాత వివాదంలో వున్న విషయాలకు సంబంధించిన ముఖ్యమైన, మౌలికమైన అంశాలు బయటపడ నారంభిస్తాయి. వాటి పరిష్కారంపైనే ఆ ఉద్యమంయొక్క తుది ఫలితం ఆధారపడి వుంటుంది, వాటితో పోల్చితే పోరాటంలోని స్వల్పమైన చిన్నవైన ఘటనలన్నీ అంతకంతకు వెనక్కి పోతాయి.

మన పార్టీలోపల సాగుతూన్న పోరాట విషయం కూడా అలాగే వుంది. ఈ పోరాటం ఇప్పటికి ఆరు నెలలుగా పార్టీ సభ్యులందరి దృష్టినీ ఆకట్టి వుంచుతోంది. మొత్తం పోరాటం గురించి పాఠకులకు సమర్పిస్తున్న యీ పుస్తకంలో అత్యంత తక్కువ ఆసక్తికరమైన చాలా వివరాలనూ, నిజానికి ఎలాంటి ఆసక్తికరమైనవీ కాని చాలా జగడాలనూ ప్రస్తావించ వలసివచ్చినందున నేను మొట్టమొదట నిజంగా ముఖ్యమైన, మౌలికమైన రెండు అంశాలు పాఠకుని దృష్టికి తేదల్చుకున్నాను. అవి ఎంతో ఆసక్తికరమైనవీ, నిస్సందేహంగా చారిత్రక ప్రాముఖ్యం గలవీ, నేడు మన పార్టీని ఎదుర్కొంటున్న అత్యంత జరూరైన రాజకీయ సమస్యలు.

మొదటి సమస్య, మన పార్టీ ''మెజారిటీ'' ''మైనారిటీ''లుగా విడిపోవడంయొక్క రాజకీయ ప్రాముఖ్యం గురించిన సమస్య. అది పార్టీ రెండవ మహాసభలో ఒక రూపం ధరించింది, రష్యన్ సోషల్ డెమోక్రట్లలో అంతకు పూర్వం వున్న చీలికలన్నిటినీ వెనక్కి తోసివేసింది.

రెండవ సమస్య, నిర్మాణ సంబంధమైన విషయాలపై కొత్త ''ఇస్క్రా''[1] తీసుకుంటున్న వైఖరిని గురించి, ఆ వైఖరి నిజంగా సూత్రంమీద ఆధారపడి వున్నంతమేరకు, సూత్ర ప్రాముఖ్యంగల సమస్య.

మొదటి సమస్య, మన పార్టీలో పోరాటం ఎక్కడ ఆరంభమైంది, దాని మూలం, దానికి కారణాలు, దాని మౌలిక రాజకీయ స్వభావం ఏమిటి అనే వాటికి సంబంధించినది.

రెండవ సమస్య, యీ పోరాటపు తుది ఫలితాలకూ, దాని ముగింపుకీ సంబంధించినది, సూత్ర రంగానికి చెందిన అన్నిటినీ కూడి అందులోనుంచి జగడాల రంగానికి సంబంధించిన అన్నిటినీ తీసివేస్తే మిగిలిన సూత్రాల మొత్తానికి సంబంధించినది. మొదటి సమస్యకు సమాధానం, పార్టీ మహాసభలో జరిగిన పోరాటాన్ని విశ్లేషించడం ద్వారా లభిస్తుంది; రెండవ దానికి సమాధానం, కొత్త ''ఇస్క్రా'' సూత్రాలలోని కొత్త విషయం ఏమిటో విశ్లేషించడం ద్వారా లభిస్తుంది. నా పుస్తకంలో పదింట తొమ్మిది వంతులు అయివున్న యీ రెండు విశ్లేషణలూ మన పార్టీలో ''మెజారిటీ'' విప్లవకర పక్షమూ, ''మైనారిటీ'' అవకాశవాద పక్షమూ అయివున్నారనే నిర్ణయానికి దారితీశాయి; ఈ రెండు పక్షాలనూ విడదీసే అభిప్రాయభేదాలు, ప్రస్తుతం చాలవరకు కార్యక్రమానికి గాని ఎత్తుగడలకు గాని సంబంధించిన సమస్యలపై గాక, నిర్మాణ సమస్యలకు మాత్రమే సంబంధించినవై వున్నాయి; కొత్త ''ఇస్క్రా'' తన స్థానానికి మరింత గంభీరతను కలుగజేయడానికి ప్రయత్నిస్తున్న కొలదీ, ఆ స్థానం సభ్యులను కో-ఆప్ట్ చేసుకోడం గురించిన జగడాలనుంచి బయట పడుతున్నకొలదీ, కొత్త ''ఇస్క్రా''లో మరింత స్పష్టంగా వెల్లడవుతున్న దృక్పథాల నూతన క్రమం నిర్మాణానికి సంబంధించిన విషయాలలో అవకాశవాదమే.

వాస్తవాలను లోతుగా పరిశీలించడానికీ, వాటిని వివరించడానికీ సంబంధించినంతవరకు, మన పార్టీలోని సంక్షోభంపై ఇప్పుడున్న సాహిత్యంలోని ప్రధాన లోపం పార్టీ మహాసభ మినిట్స్ విశ్లేషణ దాదాపు అసలు జరగకపోవడం; నిర్మాణం గురించిన మౌలిక సూత్రాల విశదీకరణకు సంబంధించినంతవరకు, ఒకవైపున పార్టీ నిబంధనావళి మొదటి నిబంధనను సూత్రీకరించడంలోనూ, ఆ సూత్రీకరణను సమర్థించుకోడంలోనూ, కామ్రేడ్ మార్తొవ్, కామ్రేడ్ అక్సెల్‌రోడ్ చేసిన మౌలికమైన పొరపాటుకూ, రెండోవైపున నిర్మాణం గురించి ''ఇస్క్రా'' ప్రస్తుత సూత్రాల మొత్తం ''క్రమానికీ'' మధ్య (ఒక క్రమాన్ని గురించి మనం మాట్లాడగల్గినంతవరకు) నిస్సందేహంగా వున్న సంబంధాన్ని విశ్లేషించకపోవడం. మొదటి నిబంధనపై జరిగిన వివాదపు ప్రాముఖ్యం ''మెజారిటీ'' సాహిత్యంలో పదే పదే ఉదహరింపబడినప్పటికీ ''ఇస్క్రా'' ప్రస్తుత సంపాదకులు యీ సంబంధాన్ని కనీసం గమనించి నట్టుగా కూడా కనబడదు. వాస్తవానికి, కామ్రేడ్ అక్సెల్‌రోడ్, కామ్రేడ్ మార్తొవ్‌లు మొదటి నిబంధన విషయంలో తమ మొదటి పొరపాటును ఇప్పుడు మరింత ప్రగాఢం చేస్తున్నారు, పెంచుతున్నారు, విస్తరింపజేస్తున్నారు. వాస్తవానికి, నిర్మాణానికి సంబంధించిన సమస్యలపై అవకాశవాదుల వైఖరి యావత్తూ మొదటి నిబంధనపై జరిగిన వివాదంలో యింతకుముందే బయటపడ నారంభించింది: గట్టిగా సంఘటితపర్చబడకుండా వికీర్ణమైన పార్టీ నిర్మాణానికి వారి సమర్థన; మహాసభతోనూ, దానిచే నెలకొల్పబడిన శాఖల

తోనూ ప్రారంభించి పార్టీని పైనుంచి కిందికి నిర్మించుకురావాలనే భావానికి ("బ్యూరాక్రటిక్" భావానికి) వారి వ్యతిరేకత; ప్రతి ఆచార్యుడినీ, ప్రతి హైస్కూలు విద్యార్థినీ, "ప్రతి సమ్మెదారునీ" తాను పార్టీ సభ్యుడనని ప్రకటించుకునేటందుకు అంగీకరిస్తూ, కిందినుంచి పైకి వెళ్లాలనే వారి ధోరణి; పార్టీ సభ్యుడు పార్టీచే గుర్తింపబడిన శాఖలలో దేనికో ఒకదానికి చెందివుండాలని డిమాండుచేసే "లాంఛన ప్రాధాన్యవాదా"నికి వారి వ్యతిరేకత; "నిర్మాణపరమైన సంబంధాలను నిర్లిప్తంగా గుర్తించే"ందుకు మాత్రమే సిద్ధపడే బూర్జువా మేధావి మనస్తత్వంవైపు వారి మొగ్గుదల; అవకాశవాద నిగూఢతకూ అరాజకవాద పదజాలానికీ వారి మొగ్గు; కేంద్రీకరణకు వ్యతిరేకంగా స్వేచ్ఛానువర్తన కావాలనే వారి ధోరణి – ఒక్క మాటలో చెప్పాలంటే, ఇప్పుడు కొత్త "ఇస్క్రా"లో ఎంతో పుష్కలంగా వికసించుతున్నదీ, వారి మొదటి పొరపాటును పూర్తిగానూ స్పష్టంగానూ బయట పెట్టడానికి అంతకంతకు ఎక్కువ సహాయపడుతున్నదీ అయినదంతా యింతకుముందే వెల్లడి కాసాగింది.

పార్టీ మహాసభ మినిట్స్ విషయానికి వస్తే, నిజంగా అనుచితంగా వాటిని నిర్లక్ష్యం చేయడానికి కారణం మన వివాదాలు జగడాల గోలలో పడిపోవడమూ, బహుశా యీ మినిట్స్‌లో చాలా ఎక్కువ భాగం చాలా చేదు నిజంతో నిండివుండడమూ అని మాత్రమే చెప్పవచ్చు. పార్టీ మహాసభ మినిట్స్ మన పార్టీలోని వ్యవహారాల వాస్తవ పరిస్థితి చిత్రణను చూపుతాయి, అది ఆ రకమైనదాంట్లో అద్వితీయమూ, దాని కచ్చితత్వానికీ, పరిపూర్ణతకూ, సమగ్రతకూ, విషయసంపన్నతకూ, ప్రామాణికతకూ అసమానమైనదీ; అది ఉద్యమంలో పాల్గొన్నవారే స్వయంగా చిత్రించిన దృక్పథాల, మనోభావాల, పథకాల చిత్రం; పార్టీలో వున్న వివిధ రాజకీయ ధోరణుల చిత్రం, అది వాటి సాపేక్ష బలాన్నీ, వాటి పరస్పర సంబంధాలనూ, వాటి పోరాటాలనూ చూపుతుంది. కేవలం రాజకీయ అధ్యయన బృందాల సరళిలోనే వుండిన పాత అవశేషాలను పూర్తిగా తుడిచివేసి వాటి స్థానే ఏకైక మహత్తర పార్టీ బంధాన్ని ప్రవేశపెట్టడంలో మనం నిజంగా ఎంతవరకు విజయం పొందామో చూపేది పార్టీ మహాసభ మినిట్సే, అవి మాత్రమే చూపుతాయి. మన పార్టీ మహాసభను గురించి జాగ్రత్తగా అధ్యయనం చేయడం, తన పార్టీ వ్యవహారాలలో సూక్ష్మబుద్ధితో పాల్గొనగోరే ప్రతి పార్టీ సభ్యుని కర్తవ్యం. అధ్యయనం చేయడం అని ఉద్దేశపూర్వకంగానే అంటున్నాను, ఎందుకంటే మినిట్స్‌లో వున్న బోలెడంత ముడిసమాచారాన్ని వూరికే చదవడం మహాసభ యొక్క సమగ్ర చిత్రాన్ని చూడడానికి చాలదు. జాగ్రత్తగానూ స్వతంత్రంగానూ చేసే అధ్యయనం ద్వారా మాత్రమే మనం, ప్రసంగాల సంగ్రహ సారాంశాలు, చర్చలనుండి తీసిన శుష్క భాగాలు, చిన్న (పైకి చిన్నవిగా కనబడే) సమస్యలపై సాగిన స్వల్పమైన తగా

దాలు ఒక ఏకమొత్తంగా సమ్మిళితమై, పార్టీ సభ్యులు ప్రతి ప్రముఖ ఉపన్యాసకుని సజీవ స్వరూపాన్ని వూహించుకోడానికీ, పార్టీ మహాసభకు వచ్చిన ప్రతినిధుల ప్రతి గ్రూపుయొక్క రాజకీయ రంగు ఏమిటో ఒక సంపూర్ణమైన అభిప్రాయాన్ని ఏర్పరచుకోడానికీ వీలుకలిగించే ఒక దశను చేరుకోగల్గుతాము (చేరుకుని తీరాలి). పార్టీ మహాసభ మినిట్స్‌ని సవిస్తరమైన స్వతంత్రమైన అధ్యయనం చేయడానికి పాఠకుని ఉత్తేజపర్చడంలో ఈ రచయిత కృతకృత్యుడైతే అతడు తన కృషి వృథా కాలేదని భావిస్తాడు.

సోషల్ డెమోక్రసీని వ్యతిరేకించే వారి గురించి మరో మాట. వారు మన తగాదాలను చూసి సంతోషిస్తారు, మనల్ని వెక్కిరిస్తారు; వారు తప్పకుండా నా పుస్తకంనుంచి, మన పార్టీ వైఫల్యాలను గురించిన, లోపాలను గురించిన విషయాలలోని విడివిడి భాగాలను ఏరి తీయడానికీ, వాటిని తమ ప్రయోజనాల కోసం వినియోగించుకోడానికీ ప్రయత్నిస్తారు. రష్యన్ సోషల్ డెమోక్రట్లు యీ ముల్లు పోట్లకు త్రొటుపడకుండా వుండేందుకూ, వాటిని లెక్కజేయకుండా తమ ఆత్మవిమర్శనూ, తమ లోపాలనూ నిర్దాక్షిణ్యంగా బట్టబయలు చేయడాన్ని కొనసాగించేటందుకూ జరిపే పోరాటంలో ఇప్పటికే తగినంతగా రాటుదేలారు, కార్మికవర్గ ఉద్యమం అభివృద్ధి చెందినకొలదీ యీ లోపాలు నిస్సందేహంగానూ తప్పనిసరిగానూ అధిగమింపబడతాయి. ఇక మా వ్యతిరేకుల విషయానికి వస్తే, మన పార్టీ రెండవ మహాసభ మినిట్స్‌లో ఇవ్వబడిన దానికి ఏ కొంచెం ఇంచుమించుగా అయినా సరే తమ ''పార్టీల''లోని వ్యవహారాల నిజ పరిస్థితి గురించిన చిత్రాన్ని మనకి చూపమనండి!

ఎన్. లెనిన్

1904 మే

# అ) మహాసభకు సన్నాహాలు

ప్రతివాదూ తన న్యాయాధిపతులను ఇరవై నాలుగు గంటల సేపు తిట్టడానికి హక్కు కలిగి వుంటాడని ఒక నానుడి వుంది. ఏ ఇతర పార్టీయొక్క ఏ మహాసభ లాగనే మన పార్టీ మహాసభ కూడా, నాయకుల స్థానం తమకు వుండాలని వాదించిన, కాని అప జయం పొందిన కొందరు వ్యక్తులపై తీర్పు చెప్పింది. ఈనాడు ''మైనారిటీకి'' ప్రతిని ధులైన వీరు దాదాపు దయనీయంగా ''తమ న్యాయాధిపతులను తిడుతున్నారు,'' మహాసభను అపఖ్యాతి పాలుచేయడానికీ, దాని ప్రాముఖ్యతనూ అధికారాన్నీ కొంచపర్చడానికీ తాము చేయ గల్గినదంతా చేస్తున్నారు. ఈ ప్రయత్నం ''ఇస్క్రా'' నెం. 57లో ''కార్యకర్త''[2]చే రాయ బడిన ఒక వ్యాసంలో బహుశా అత్యంత స్పష్టంగా ప్రకటితమైంది. ఈయన పార్టీ మహా సభ ఒక సర్వాధికార ''దేవత'' అనే భావంపట్ల ఆగ్రహం చెందుతున్నాడు. కొత్త ''ఇస్క్రా''కు ఇది ఎంత ప్రత్యేక లక్షణంగా వుందంటే దానిని గురించి మాట్లాడకుండా వుండ లేను. దాని సంపాదకులు, వారిలో అధికసంఖ్యాకులు పార్టీ మహాసభచే తోసిపుచ్చబడ్డారు, ఒక వైపున తాము ''పార్టీ'' పత్రికా సంపాదకవర్గం అని చెప్పకుంటూ, మరోవైపున మహాసభ దైవాంశసంభూతం కాదని ప్రకటించేవారిని చేతులు చాచి చేరదీస్తున్నారు. మనో హరం, కాదా? పెద్దమనుషులారా, నిశ్చయంగానే మహాసభ దైవాంశసంభూతం కాదు; కాని, ఆ మహాసభలో ఓటమి పొందిన తరువాత దానిని ''దూషించ'' నారంభించిన వారిని గురించి మనం ఏమనుకోవాలి?

నిజానికి, మహాసభకు జరిగిన సన్నాహాల చరిత్రలో ముఖ్యమైన వాస్తవాలను జ్ఞాపకం చేసుకుందాం.

మనం ఐక్యం కావడానికి ముందు భేదస్పష్టీకరణ జరగాలని 1900లో ''ఇస్క్రా'' పత్రిక దాని ప్రచురణను ఆరంభిస్తూ చేసిన ప్రకటనలో[3] మొట్టమొదటే చెప్పింది. 1902 కాన్ఫరెన్సును[4] ఒక పార్టీ మహాసభగా కాక ఒక ప్రయివేటు సమావేశంగా చేయడానికి ''ఇస్క్రా'' ప్రయత్నించింది. ఆ కాన్ఫరెన్సులో ఎన్నుకోబడిన ఆర్గనైజింగు కమిటీని అది

తిరిగి వెలకొల్పినప్పుడు 1902 వేసవిలోనూ, శరదృతువులోనూ "ఇస్క్రా" ఎంతో జాగ్రత్తతో వ్యవహరించింది. మనం అందరమూ సమ్మతించినట్టుగా ఎట్టకేలకు భేదస్పష్టీకరణ పని పూర్తి చేయబడింది. ఆర్గనైజింగు కమిటీ 1902 అంతంలోనే ఏర్పాటుచేయబడింది. దానిని దృఢంగా వెలకొల్పడాన్ని "ఇస్క్రా" హర్షించింది, తన 32వ సంచికలో రాసిన ఒక సంపాదకీయ వ్యాసంలో, పార్టీ మహాసభను ఏర్పాటుచేయడం అత్యంత జరూరైన అగత్యమైన అవసరం అని ప్రకటించింది. అంతమట్టుకు, మాపై ఆరోపింపబడే ఆఖరి నింద పార్టీ రెండవ మహాసభను ఏర్పాటుచేయడంలో తొందరపడ్డామనేదే అవగలదు. వాస్తవానికి మేము ఈ కింది సూత్రాన్ని అనుసరించాము: గుడ్డను కత్తిరించేముందు ఏడు సార్లు కొలు; గుడ్డ కత్తిరించివేయబడిన తరువాత మన కామ్రేడ్స్ ఫిర్యాదులు చేయడం మొదలు పెట్టరనీ, గుడ్డను మళ్లీ కొలవడం మొదలుపెట్టరనీ ఆశించడానికి మాకు పూర్తి నైతిక హక్కు ఏర్పడింది.

ఆర్గనైజింగు కమిటీ రెండవ మహాసభ కోసం అత్యంత కూలంకషమైన నిబంధనావళిని (అది లాంఛన ప్రధానమైనదనీ నిరంకుశమైనదనీ, ఇప్పుడీ పదాలను ఉపయోగించుతున్నవారు తమ రాజకీయ అస్థిరత్వాన్ని కప్పిపుచ్చుకోడానికి అంటారు) తయారుచేసి, దాన్ని అన్ని కమిటీలచేతనూ ఆమోదింపజేసి చివరకు దాన్ని బలపర్చింది. దానిలో 18వ నిబంధనలో ఇలా వుంది: "మహాసభ చేసే నిర్ణయాలన్నీను, అది జరిపే ఎన్నికలన్నీను పార్టీ నిర్ణయాలే అవుతాయి, అన్ని పార్టీ శాఖలకూ అవశ్యపాలనీయాలు అవుతాయి. వాటిని ఎవరూ ఏ వంకతోనూ సవాలుచేయడానికి వీలులేదు, తరువాతి పార్టీ మహాసభచే మాత్రమే అవి రద్దుచేయబడటం గాని, సవరించబడటం గాని జరగాలి." అప్పుడు ఎలాంటి గొణుగుడూ లేకుండా ఒక స్వతస్సిద్ధాంశంలాగ అంగీకరించబడిన ఆ మాటలు ఎంత నిష్కపటంగా వున్నాయో; అయినా ఈ నాడవి ఎంత వింతగా — "మైనారిటీ"పై ఒక తీర్పులాగ — ధ్వనిస్తున్నాయో! ఈ నిబంధన ఎందుకు చేర్చబడింది? కేవలం ఒక లాంఛనంగానా? ఎంత మాత్రం కాదు. ఈ నిబంధన అవసరం అనిపించింది, నిజంగా అవసరమైవుంది, ఎందుచేతనంటే అప్పుడు పార్టీ అనేక వేరువేరు, స్వతంత్రమైన గ్రూపులతో కూడివుంది, అవి మహాసభను గుర్తించడానికి నిరాకరించవచ్చు. వాస్తవానికి ఈ నిబంధన విప్లవవాదులందరి స్వేచ్ఛాయుత సంకల్పాన్ని వెల్లడించింది. (ఇప్పుడు దానిని గురించి ఎంతో చెప్పబడుతోంది, "స్వేచ్ఛ" అనే పదం ఎంతో అసందర్భంగా ఎంతో మృదువుగా వర్తింపజేయబడుతోంది, నిజంగా దానికి "చలచిత్తం" అనే విశేషణం తగివుంటుంది.) అది రష్యన్ సోషల్ డెమొక్రట్లు అందరిచేతా పరస్పరం చేసుకోబడిన ఒక ఖరారుతో సమానం. మహాసభ చేసిన బ్రహ్మాండమైన కృషి, అది ఎదుర్కొన్న ప్రమాదం, చేసిన ఖర్చు వృధా కాదని,

మహాసభ ఒక ప్రహసనంగా తయారు చేయబడకూడదని హామీ ఇవ్వడం కోసం అది ఉద్దేశించ బడింది. మహాసభలో జరిగిన నిర్ణయాలనూ, *ఎన్నికలనూ* గుర్తించడానికి ఎవరు నిరాకరించినా అది *నమ్మక ద్రోహం* అవుతుందని అది ముందుగానే నిర్ధారణచేసింది.

అయితే, మహాసభ దైవాంశసంభూతం కాదనీ, దాని నిర్ణయాలు పవిత్రమైనవి కావనీ ఒక కొత్త విషయాన్ని కనిపెట్టి చెప్పడంలో కొత్త "ఇస్క్రా" ఎవరిని అపహసించుతున్నట్టు? ఈ కొత్తగా కనిపెట్టిన విషయంలో అంతర్గర్భితమైవున్నది "నిర్మాణం గురించిన కొత్త అభిప్రాయాలా," లేక పాత ధోరణిని కప్పిపుచ్చడానికి చేసే కొత్త ప్రయత్నాలు మాత్రమేనా?

## ఆ) మహాసభలో వివిధ గ్రూపింగుల ప్రాముఖ్యం

ఆ విధంగా, మహాసభ, అత్యంత జాగ్రత్త అయిన సన్నాహాల తరువాతనూ, పూర్తి ప్రాతినిధ్య ప్రాతిపదికపైనా సమావేశమైంది. దాని కూర్పు సరిగానే వుందనీ, దాని నిర్ణయాలు *పూర్తిగా* విధాయకములనీ సార్వత్రికంగా గుర్తింపబడిన సంగతి, మహాసభ సమావేశమైన తరువాత అధ్యక్షుడు చేసిన ప్రకటనలో కూడా తెలుపబడింది. (మినిట్స్, పేజి 54.)

మహాసభ ప్రధాన కర్తవ్యం ఏమిటి? "ఇస్క్రా"చే ప్రతిపాదించబడి వివరించ బడిన సూత్రాల, నిర్మాణ సంబంధమైన భావాల ప్రాతిపదికపై *నిజమైన* పార్టీని నిర్మించడం. మహాసభ అందుకోసం పనిచేయవలసి వుంటుందనేది, "ఇస్క్రా" కొనసాగించిన మూడేళ్ల కార్యకలాపాలచేతనూ, దానిని అధికసంఖ్యాక కమిటీలు గుర్తించడం ద్వారానూ ముందే నిర్ణయం అయింది. "ఇస్క్రా" ఇచ్చిన కార్యక్రమమూ, అది అనుసరించే ధోరణీ పార్టీయొక్క కార్యక్రమమూ ధోరణీ అవవలసి వుంది; నిర్మాణం గురించి "ఇస్క్రా" వేసిన పథకాలు, పార్టీ నిర్మాణ నిబంధనావళిలో రూపొందించబడవలసి వుంది. అయితే యిది పోరాటం లేకుండా సాధింపబడలేదని వేరే చెప్పనక్కరలేదు: ఎందుకంటే మహాసభ ఎంత పూర్తి ప్రాతినిధ్యం కల్గినదైవుందంటే దానిలో పాల్గొన్నవాటిలో "ఇస్క్రా"ను గట్టిగా వ్యతిరేకించి పోరాడిన శాఖలూ (బుండ్, "రబోచెయె దేలో"[5]), మాట వరసకి "ఇస్క్రా"ను ప్రధాన పత్రికగా మాటలలో గుర్తిస్తూ వాస్తవంలో తమ స్వంత ప్రత్యేక పథకాలను అనుసరిస్తూన్న, సూత్రాలకు సంబంధించిన విషయాలలో నిలకడలేని శాఖలూ ("యూజ్నీ రబోచీ" గ్రూపు,[6] దానితో సన్నిహిత సంబంధం కలిగివుండిన కొన్ని కమిటీల ప్రతినిధులు)

చేరి వున్నాయి. ఈ పరిస్థితులలో మహాసభ, ''ఇస్క్రా'' ధోరణి విజయం కొరకు ఒక పోరాట రంగం కాక తప్పలేదు. అది అటువంటి రంగం అయిందనే విషయం, మహాసభ మినిట్స్‌ని ఏ కొంచెం శ్రద్ధతో చదివిన వాడికైనా వెంటనే కనబడుతుంది. ఇప్పుడు మన కర్తవ్యం మహాసభలో వివిధ సమస్యలపై బయటపడిన ప్రధానమైన గ్రూపింగులను వివరంగా పరిశీలించడం, మినిట్స్‌లోని కచ్చితమైన సమాచారం ఆధారంగా ప్రధానమైన గ్రూపులు ప్రతిదానియొక్క రాజకీయ వైఖరి ఏమిటో తిరిగి నిరూపణచేయడం. మహాసభలో ''ఇస్క్రా'' నాయకత్వంకింద ఒకే పార్టీగా ఐక్యం కావలసిన యీ గ్రూపులు, ధోరణులు, వైఖరులు సరిగ్గా ఏమిటి? — చర్చలనూ, వోటింగునూ విశ్లేషించడం ద్వారా నేను చూపవలసింది అదే. దీని స్పష్టీకరణ, మన సోషల్ డెమోక్రట్లు నిజంగా ఎలాంటివారో పరిశీలించేటందుకూ, వారిలో వచ్చిన చీలికలకు కారణాలు ఏమిటో అర్థంచేసుకునేటందుకూ కూడా మౌలికమైన ప్రాధాన్యం కలిగివుంది. అందుచేతనే, లీగు[7] మహాసభలో నేను చేసిన ప్రసంగంలోనూ, కొత్త ''ఇస్క్రా'' సంపాదకులకు నేను రాసిన లేఖలోనూ వివిధ గ్రూపింగుల విశ్లేషణకు ప్రధాన స్థానం యిచ్చాను. ''మైనారిటీ''కి చెందిన (మార్తొవ్ నాయకత్వం వహించిన) నా వ్యతిరేకులు ఈ సమస్యయొక్క సారాంశాన్ని బొత్తిగా గ్రహించలేదు. లీగు మహాసభలో వారు అవకాశవాదం వైపు మొగ్గారనే అభియోగంనుంచి తాము ''నిర్దోషులమని నిరూపించుకునేందుకు'' ప్రయత్నిస్తూ వివరాలను సరిదిద్దడానికి పరిమితపడి వున్నారే గాని, మహాసభలో గ్రూపింగులను గురించి నేను ఇచ్చిన చిత్రణకు ప్రతిగా వేరొక చిత్రణను దేనినీ ఇవ్వడానికి కూడా ప్రయత్నం చేయలేదు. ఇప్పుడు మార్తొవ్ ''ఇస్క్రా''లో (నెం. 56) మహాసభలో ఏర్పడిన వివిధ రాజకీయ గ్రూపుల హద్దులను స్పష్టంగా నిర్ణయించడానికి జరిగిన ప్రతి ప్రయత్నాన్నీ కేవలం ''బృందపు తరహా రాజకీయాలు''గా చూపడానికి ప్రయత్నిస్తున్నాడు. ఇది తీవ్రమైన పదం, కామ్రేడ్ మార్తొవ్! కాని కొత్త ''ఇస్క్రా'' ఉపయోగించే తీవ్రమైన పదాలకు ఈ కింది విశిష్ట లక్షణం వుంది: పార్టీ మహాసభ నాటినుంచీ మనలో వచ్చిన చీలికల అన్ని దశలనూ తిరిగి చూపితే చాలు — ఈ తీవ్రమైన పదాలన్నీ పూర్తిగానూ, ప్రధానంగానూ ప్రస్తుతపు సంపాదకవర్గానికి వ్యతిరేకంగా మారుతాయి. బృందపు తరహా రాజకీయాలను గురించి మాట్లాడే పార్టీ పత్రికా సంపాదకులనబడే మీరు ఒకసారి మీకేసి చూసుకోండి!

మహాసభలో మన పోరాటానికి సంబంధించిన వాస్తవాలు ఇప్పుడు మార్తొవ్‌కి ఎంత చేదుగా వున్నాయంటే ఆయన వాటిని పూర్తిగా మరుగుపర్చడానికి ప్రయత్నిస్తున్నాడు. ఆయనిలా అంటున్నాడు: ''పార్టీ మహాసభలోనూ, అంతకు పూర్వమూ ''ఇస్క్రా''తో తన పూర్తి సంఘీభావాన్ని ప్రకటించినవాడూ, దాని కార్యక్రమాన్నీ, నిర్మాణంపై దాని అభి

ప్రాయాలనూ సమర్థించినవాడూ, దాని నిర్మాణ విధానాన్ని బలపర్చినవాడే 'ఇస్క్రా' అనుయాయి అవుతాడు. మహాసభలో అలాంటి 'ఇస్క్రా'వాళ్లు నలభై మందికి పైగా వున్నారు — అది 'ఇస్క్రా' కార్యక్రమానికీ, 'ఇస్క్రా'ను పార్టీ కేంద్ర పత్రికగా ఆమోదించే తీర్మానానికీ అనుకూలంగా పడిన వోట్ల సంఖ్య.'' మహాసభ మినిట్స్‌ను తెరిచి చూడండి, కార్యక్రమం, వోటింగులో పాల్గొనకుండా వున్న అకీమొవ్ తప్ప అందరి ఓట్లతోనూ ఆమోదింపబడింది (మినిట్స్, పేజి 233). ఆ విధంగా, కామ్రేడ్ మార్తొవ్, బుంద్‌వాళ్లు, బ్రూకెర్, మర్తీనొవ్‌లు ''ఇస్క్రా''తో తమ ''పూర్తి సంఘీభావాన్ని'' ప్రదర్శించినట్లు, నిర్మాణంపై దాని అభిప్రాయాలను సమర్థించినట్లు మనల్ని నమ్మించ గోరుతున్నాడు! ఇది హాస్యాస్పదం. మహాసభ తరువాత మహాసభలో పాల్గొన్న వారందరూ పార్టీలో సమాన హోదాగల సభ్యులయారనే వాస్తవం (అందరూ కాదు, ఎందుకంటే బుంద్‌వాళ్లు ఉపసంహరించుకున్నారు) ఇక్కడ, మహాసభలోనే పోరాటాన్ని రెచ్చగొట్టిన గ్రూపింగుతో కలగాపులగం చేయబడుతుంది. మహాసభ తరువాత ''మెజారిటీ''గానూ, ''మైనారిటీ''గానూ ఎవరిచేత ఏర్పరచబడినదీ పరిశీలనకు బదులు మనకి ''కార్యక్రమాన్ని ఆమోదించారు'' అనే అధికారిక పదబంధం వస్తుంది!

''ఇస్క్రా''ను పార్టీ కేంద్ర పత్రికగా ఆమోదించడంపై జరిగిన వోటింగును తీసుకు చూడండి. ఎవరినైతే కామ్రేడ్ మార్తొవ్, ఒక ఉత్తమ ఆశయానికి వుండదగినంత ధైర్యంతో, ''ఇస్క్రా''యొక్క నిర్మాణ భావాలనూ, నిర్మాణ విధానాన్నీ సమర్థించినట్లు ఇప్పుడు చెబుతున్నాడో ఆ మర్తీనొవే తీర్మానంలోని రెండు భాగాలను: ''ఇస్క్రా''ను కేంద్ర పత్రికగా కేవలం ఆమోదించడం, దాని సేవలను గుర్తించడం అనే వాటిని విడదీయాలని పట్టుబట్టాడు. తీర్మానంలో మొదటి భాగం (''ఇస్క్రా'' సేవలను గుర్తించడం, దానితో సంఘీభావాన్ని ప్రకటించడం) ఓటుకు పెట్టబడినప్పుడు, ముప్ఫయి అయిదు వోట్లు మాత్రమే దానికి అనుకూలంగా పడ్డాయి; రెండు వోట్లు వ్యతిరేకంగా పడ్డాయి (అకీమొవ్, బ్రూకెర్), పదకొండుమంది ఓటింగులో పాల్గొనలేదు (మర్తీనొవ్, అయిదుగురు బుంద్ వాళ్లు, సంపాదకవర్గం వోట్లు అయిదు: మార్తొవ్‌వీ, నావీ రెండేసి, ప్లెహానొవ్‌ది ఒకటి). కనుక, ''ఇస్క్రా'' వ్యతిరేక గ్రూపు (అయిదుగురు బుంద్‌వాళ్లు, ముగ్గురు ''రబోచెయె దేలో''వాళ్లు) ఈ సందర్భంలో కూడా విస్పష్టంగా కనిపిస్తోంది, ఇది మార్తొవ్‌చే స్వయంగా ఎంపికచేసుకోబడిన ప్రస్తుత భావాలకు అత్యంత అనుకూలం. తీర్మానం రెండవ భాగంపై జరిగిన వోటింగును తీసుకు చూడండి — ఎలాంటి ఉద్దేశాలను ప్రకటించడంగాని, సంఘీభావ ప్రకటనగాని లేకుండా ''ఇస్క్రా''ను కేంద్ర పత్రికగా ఆమోదించడం (మినిట్స్, పేజి 147): నలభై నాలుగు ఓట్లు దానికి అనుకూలంగా పడ్డాయి, వీటినే నేడు మార్తొవ్,

''ఇస్క్రా''వాళ్లవిగా పరిగణిస్తున్నాడు. మొత్తం పడవలసిన వోట్లు యాభై ఒకటి; అందు లోనుంచి వోటింగులో పాల్గొనని సంపాదకుల అయిదు వోట్లనూ తీసివేస్తే మనకి నలభై ఆరు వోట్లు వచ్చాయి; ఇద్దరు (అకీమొవ్, బ్రూకెర్) వ్యతిరేకంగా వోటుచేశారు; కనుక మిగిలిన నలభై నాలుగులోనూ అయిదుగురు బుంద్‌వాళ్లు చేరివున్నారు. ఈవిధంగా, మహాసభలో బుంద్‌వాళ్లు '''ఇస్క్రా'తో తమ పూర్తి సంఘీభావాన్ని ప్రకటించారు'' — అధికారిక ''ఇస్క్రా''చే అధికారిక చరిత్ర ఆవిధంగా రాయబడింది! కొంచెం ముందుకు పోయి యీ అధికారిక సత్యానికి నిజమైన కారణాలు ఏమిటో పాఠకునికి వివరిస్తాను: బుంద్ వాళ్లూ ''రబోచెయె దేలొ''వాళ్లూ మహాసభనుంచి ఉపసంహరించుకుని వుండకపోతే, ''ఇస్క్రా'' ప్రస్తుతపు సంపాదకవర్గం, నిజమైన పార్టీ (ఇప్పుడున్నట్టుగా బూటకపు పార్టీ కాదు) సంపాదకవర్గం అవగలిగీ, అయీ వుండేవారు; అందుచేతనే ప్రస్తుతపు పార్టీ సంపాదకవర్గం అనబడే యీ విశ్వసనీయులైన సంరక్షకులను ''ఇస్క్రా''వాళ్లు ప్రకటించవలసి వచ్చింది. అయితే, దీనిని గురించి మరింత వివరంగా తరువాత చెబుతాను.

తరువాతి ప్రశ్న యిది: మహాసభ, ''ఇస్క్రా'' అనుయాయులకూ, ''ఇస్క్రా'' వ్యతిరేకులకూ మధ్య జరిగిన పోరాటమే అయితే, వీరిద్దరికీ నడుమ మధ్యస్థులూ, ఇరు పక్షాల మధ్యా వూగిసలాడిన అస్థిరమైనవారూ ఎవరూ లేరా? మా పార్టీని గురించీ, అన్ని రకాల మహాసభలలోనూ సాధారణంగా కనబడే చిత్రం గురించీ ఏమాత్రమైనా తెలిసినవారు ఎవరైనా ఈ ప్రశ్నకు ఔనని సమాధానం చెప్పడానికి ముందుగానే మొగ్గుతారు. ఈ అస్థిరమైనవారిని జ్ఞాపకం తెచ్చుకోడానికి కామ్రేడ్ మార్తొవ్ ఇప్పుడు చాలా అయిష్టంగా వున్నాడు, అందుచేత ఆయన ''యూజ్నీ రబోచీ'' గ్రూపునూ, దాని వైపుకు మొగ్గిన ప్రతినిధులనూ విశిష్టమైన ''ఇస్క్రా''వాళ్లుగా వర్ణిస్తున్నాడు, వారితో మనకున్న అభిప్రాయభేదాలు చాలా స్వల్పమైనవనీ, అముఖ్యమైనవనీ చెబుతున్నాడు. అదృష్టవశాత్తూ, ఇప్పుడు మనముందు మినిట్స్ పూర్తి పాఠం వుంది, పత్రాల సాక్ష్యంతో ఆ ప్రశ్నకు మనం సమాధానం చెప్పగలిగి వున్నాం — అది వాస్తవానికి సంబంధించిన ప్రశ్నే అనడంలో సందేహం లేదు. మహాసభలో సాధారణ గ్రూపింగు గురించి మనం పైన చెప్పినది ఈ సమస్యకు సమాధానం కాని మాట నిజమే, అది దానిని సరిగా రూపొందించడానికి మాత్రమే.

రాజకీయ గ్రూపింగులను విశ్లేషించకుండానూ, రెండు స్పష్టమైన రాజకీయ వైఖరుల మధ్య జరిగిన పోరాటంగా మహాసభను చూడకుండానూ మన మధ్య వున్న వేర్పాటును ఎంత మాత్రమూ అవగాహన చేసుకోవడం సాధ్యం కాదు. బుంద్ అనుయాయులను సహితం ''ఇస్క్రా''వాళ్లుగా జమకట్టడం ద్వారా అభిప్రాయభేదాలను మరుగుపరచడానికి మార్తొవ్ చేస్తున్న ప్రయత్నం కేవలం సమస్యను తప్పించుకోడమే. మహాసభ ముందున్న

రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమ చరిత్ర ఆధారంగా చూసినా, a priori* మూడు ప్రధానమైన గ్రూపులు (తరువాత సరి చూడడానికీ, వివరంగా పరిశీలించడానికీ) కనబడేవి: "ఇస్క్రా"వాళ్ళ, "ఇస్క్రా" వ్యతిరేకులు, అస్థిరమైన, వూగిసలాడే, సంకోచాత్మక వ్యక్తులు.

## ఇ) మహాసభ ప్రారంభం. ఆర్గనైజింగు కమిటీ ఘటన

మహాసభలో జరిగిన చర్చలనూ వోటింగునూ విశ్లేషించే అత్యంత అనువైన పద్ధతి వాటిని మహాసభ సమావేశాల వరుసక్రమంలో తీసుకోడం, ఈవిధంగా అంతకంతకు స్పష్టం అవుతూవచ్చిన రాజకీయ అభిప్రాయభేదాలను క్రమానుసారంగా గమనించవచ్చు. ఎంతో అవసరం అయినప్పుడు మాత్రమే సన్నిహిత సంబంధం గల సమస్యలను గాని, ఒకే రకం గ్రూపింగులను గాని కలిపి పరిశీలించేటందుకుగాను, ఈ వరుసనుంచి వైదొలగడం జరుగుతుంది. నిష్పక్షపాతంగా వుండటం కోసం, మన మహాసభలో మితిమీరిన కాలాన్ని హరించిన చిన్న సమస్యలపై జరిగిన అసంఖ్యాకమైన వోటింగులను మినహాయిస్తూ, ఎక్కువ ముఖ్యం అయిన అన్ని వోటులనూ పేర్కొనడానికి ప్రయత్నిద్దాము. (అనుభవం లేకపోడం మూలంగా కొంత, కమిషన్లకూ ప్లీనరీ సమావేశాలకూ మధ్య చర్చాంశాలలోని విషయాలను పంపకం చేయడంలో అసమర్థతవల్ల కొంత, దాదాపు అవరోధంగా పరిణమించిన ద్వంద్వార్థ వాగ్వివాదాల మూలంగా కొంతా చిన్న సమస్యలు ఎక్కువ కాలాన్ని హరించాయి.)

అభిప్రాయభేదాలను బయటపెట్ట నారంభించి చర్చను రేపిన మొట్టమొదటి సమస్య "పార్టీలో బుంద్ స్థానం" (మినిట్స్, పేజీలు 29–33) అన్న అంశానికి (మహాసభ "వ్యవహార వరుసక్రమంలో") ప్రథమ స్థానం ఇవ్వాలా వద్దా అన్నది. "ఇస్క్రా"వాళ్ల దృక్పథంనుంచి, ప్లెహానొవ్, మార్తొవ్, ట్రాట్స్కీ, నేనూ సమర్థించిన దాని ప్రకారం, యీ విషయంలో యే సందేహం అక్కర్లేకపోయింది. పార్టీనుంచి బుంద్ ఉపసంహరణ మా అభిప్రాయాలు సరియైనవి అని స్పష్టంగా రుజువుచేసింది: బుంద్ మనతోపాటు రావడానికీ, "ఇస్క్రా"తో ఏకీభవిస్తూ పార్టీలో అధికసంఖ్యాకులు ఆమోదించిన నిర్మాణ సూత్రాలను అంగీకరించడానికీ నిరాకరించినప్పుడు మనం అదే మార్గంలో వెడుతున్నామని

* ముందుగానే. — సం.

''నమ్మించబూనడం,'' మహాసభను ఎక్కువకాలం యీడ్చడం (బుంద్‌వాళ్లు చేసినట్టుగా) నిరుపయోగం, అర్థరహితం. ఈ విషయం మన సాహిత్యంలో ఇదివరకే పూర్తిగా విశదీకరించబడింది, ఇక మిగిలినదంతా సమస్యను దాపరికంలేకుండానూ, నిర్మొగమాటంగానూ అందరి ముందూ పెట్టడం, స్వేచ్ఛానువర్తనమా (అలా అయితే ఇదే మార్గంలో వెడతాం) లేక సమాఖ్యయా (అలా అయితే మన దారులు విడిపోతాయి) అనే దానిని నిజాయితీతో ఎంపిక చేయడం మాత్రమేనని ఏ మాత్రం ఆలోచనాపరులైన పార్టీ సభ్యులకు ఎవరికైనా కనబడుతుంది.

తమ మొత్తం విధానంలోనే టలాయించే స్వభావం గల బుంద్‌వాళ్లు ఇక్కడ కూడా టలాయించాలనీ, సమస్య పరిష్కారాన్ని వాయిదావేయాలనీ అనుకున్నారు. కామ్రేడ్ అకీమొవ్ వారి పక్షం చేరాడు. ఆయన వెంటనే బహుశా ''రబోచెయె దేలొ'' అనుచరులందరి తరపునా, నిర్మాణ సమస్యలపై ''ఇస్క్రా''తో వున్న అభిప్రాయభేదాలను లేవనెత్తాడు (మినిట్స్, పేజి 31). బుంద్, ''రబోచెయె దేలొ''లను కామ్రేడ్ మాహొవ్ బలపర్చాడు. (నికొలాయెవ్ కమిటీ తాలూకు రెండు వోట్లకు ప్రాతినిధ్యం వహించాడు — ఆ కమిటీ అంతకు కొద్దికాలం క్రితమే ''ఇస్క్రా''తో తన సంఘీభావాన్ని ప్రకటించింది!) కామ్రేడ్ మాహొవ్‌కు ఈ సమస్య బొత్తిగా అస్పష్టంగా వుండి, ఆయన ఆలోచించిన మరో ''బాధాకరమైన సమస్య'' ''ప్రజాస్వామిక పద్ధతియా లేక దానికి విరుద్ధంగా (ఈ మాటను గమనించండి!) కేంద్రీకరణయా అన్న సమస్య'' — సరిగా, మహాసభలో యీ ''బాధాకరమైన సమస్యను'' ఇంకా గమనించని ప్రస్తుతపు ''పార్టీ'' పత్రికా సంపాదకవర్గంలోని అధికసంఖ్యాకుల లాగనే!

ఆవిధంగా ''ఇస్క్రా''వాళ్లను బుంద్, ''రబోచెయె దేలొ,'' కామ్రేడ్ మాహొవ్ వ్యతిరేకించారు, వారందరి చేతిలో పది వోట్లు వున్నాయి. అవి మనకి వ్యతిరేకంగా వేయబడ్డాయి (పేజి 33). ముప్పయి ఓట్లు అనుకూలంగా వేయబడ్డాయి — మనం తరువాత చూసేటట్టుగా, ఈ అంకె దరిదాపుల్లోనే ''ఇస్క్రా''వాళ్ల వోట్లు తరచు హెచ్చుతూ తగ్గుతూ వున్నాయి. పదకొండుమంది ఓటింగులో పాల్గొనలేదని తేలింది: వారు పోటీ చేస్తున్న ''పార్టీల''లో దేని పక్షమూ వహించదలచుకోలేదని స్పష్టం. బుంద్ నిబంధనావళి రెండవ నిబంధనపై మేము వోటు తీసుకున్నప్పుడు (ఈ రెండవ నిబంధనను తోసిపుచ్చిన మూలంగానే బుంద్ పార్టీనుంచి ఉపసంహరించుకుంది). దానికి అనుకూలంగా పది వోట్లు రావడం, ఓటింగులో పాల్గొనకుండా వున్నవారి సంఖ్య కూడా పదిమందే కావడం (మినిట్స్, పేజి 289) గమనించదగినది, ఓటింగులో పాల్గొనకుండా వున్నవారు ముగ్గురు ''రబోచెయె దేలొ''వాళ్లూ (బ్రూకెర్, మర్తినొవ్, అకీమొవ్), కామ్రేడ్ మాహొవ్. ఎజెండాలో బుంద్ అంశం స్థానంపై జరిగిన వోటింగులో యీ గ్రూపింగు యాదృచ్ఛికం కాద

నేది స్పష్టం. స్పష్టంగానే, యీ కామ్రేడ్స్ అందరూ, చర్చ ఏ క్రమంలో జరగాలనే పద్ధతి సమస్యపైనే గాక, దాని సారాంశం విషయంలో కూడా ''ఇస్క్రా''తో భేదించారు. ''రబోచెయె దేలో'' విషయంలో యీ సారాంశ సంబంధమైన భేదం ప్రతివారికీ స్పష్టం అయింది, కామ్రేడ్ మాహోవ్ బుంద్ ఉపసంహరణపై చేసిన ప్రసంగంలో తన వైఖరిని సాటిలేని విధంగా వివరించాడు (మినిట్స్, పేజీలు 289–290). ఆయన ప్రసంగం పరిశీలించ దగినది. సమాఖ్యను తోసిపుచ్చుతూ చేసిన తీర్మానం తరువాత ''రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబరు పార్టీలో బుంద్ స్థానం నా దృష్టిలో ఒక సూత్రబద్ధమైన సమస్య కాకుండా, చారిత్రకంగా ఏర్పడిన ఒక జాతీయ సంఘంపట్ల ఆచరణాత్మక రాజకీయ విధానపు సమస్య అయింది'' అని కామ్రేడ్ మాహోవ్ అన్నాడు. ఆయనింకా ఇలా అన్నాడు: ''ఇక్కడ నేను మన వోటింగువల్ల సంభవించగల ఫలితార్థాలను అన్నిటినీ పరిగణనలోకి తీసుకోకుండా వుండలేకపోయాను, అందుచేత రెండవ నిబంధన మొత్తం అంతకీ అనుకూలంగా వోటు చేసి వుండేవాడిని.'' కామ్రేడ్ మాహోవ్ ప్రశంసనీయంగా ''ఆచరణాత్మక రాజకీయ విధాన'' సరళిని అలవర్చుకున్నాడు: సూత్రరీత్యా ఆయన సమాఖ్యను ఇదివరకే తోసిపుచ్చాడు, అందుచేత ఆచరణలో నిబంధనావళిలో సమాఖ్యను సూచించే ఒక అంశాన్ని చేర్చేటందుకు అనుకూలంగా వోటు చేసి వుండేవాడు! ఈ ''కార్యవాది'' కామ్రేడ్ తన సమగ్ర సూత్రబద్ధమైన వైఖరిని ఈ కింది మాటలలో వివరించాడు: ''కాని, (శ్చెద్రీన్ ఉపయోగించిన సుప్రసిద్ధ ''కాని''!) నేను ఏదో ఒక పక్షాన వోటు చేసివుంటే అది సూత్రబద్ధమైన (!!) ప్రాధాన్యం మాత్రమే కలిగివుంటుంది కనుక, మహాసభకు వచ్చిన అందరు ఇతర ప్రతినిధుల దాదాపు ఏకగ్రీవ వోటింగు దృష్ట్యా ఆచరణాత్మక ప్రాముఖ్యం ఏమీ కలిగివుండదు కనుక, సూత్ర రీత్యా (ఇలాంటి సూత్రబద్ధతనుంచి భగవంతుడు మనలను కాపాడు గాక!) ఈ సమస్యపై నా వైఖరికీ, అనుకూలంగా వోటుచేసిన బుంద్ ప్రతినిధుల వైఖరికీ మధ్యనున్న తేడాను చూపడం కోసమని నేను వోటింగులో పాల్గొనకుండా వుండటం మేలని అనుకున్నాను. బుంద్ ప్రతినిధులు మొదట పట్టుబట్టినట్టుగా వోటింగులో పాల్గొనకుండా వుండివుంటే, నేను అనుకూలంగా వోటు చేసి వుండేవాడిని.'' దీని తలా తోకా ఏమిటో మీరు తెలుసుకోగలరా? సూత్రబద్ధుడైన ఒక మనిషి, అందరూ ''లేదు'' అని చెబుతున్నప్పుడు తాను గట్టిగా ''ఔను'' అని చెప్పడం వాస్తవానికి నిరుపయోగం కనుక మాట్లాడకుండా వూరుకోడం.

ఎజెండాలో బుంద్ విషయంయొక్క స్థానం ఎన్నోదిగా వుండాలనే సమస్యపై జరిగిన వోటింగు తరువాత మహాసభలో ''బొర్బా'' గ్రూపు సమస్య ముందుకు వచ్చింది; అది కూడా ఎంతో ఆసక్తిదాయకమైన గ్రూపింగుకు దారితీసింది, అది మహాసభలో అత్యంత

''బాధాకరమైన'' అంశంతో, అంటే కేంద్ర సంస్థలలోని వ్యక్తుల కూర్పుతో సన్నిహితంగా ముడివడివుంది. మహాసభ కూర్పును నిర్ణయించేటందుకు నియమించబడిన కమిటీ, ఆర్గనైజింగు కమిటీచే రెండు సార్లు ఆమోదించబడిన నిర్ణయాన్ని అనుసరించి (మినిట్స్, పేజీలు 383, 375), ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధులు ఈ కమిటీలో ఇచ్చిన నివేదికను అనుసరించి (మినిట్స్, పేజి 35), ''బొర్బా'' గ్రూపును ఆహ్వానించకూడదని ప్రకటించింది.

దానిమీద ఆర్గనైజింగు కమిటీలో ఒక సభ్యుడైన కామ్రేడ్ యెగోరొవ్ '''బొర్బా' సమస్య'' (ఆ గ్రూపులో ఫలానా సభ్యుని గురించి కాదు ''బొర్బా''ను గురించే అని గమనించండి) ''తనకు కొత్తది'' అని చెప్పి, ఆ విషయాన్ని వాయిదా వేయాలని డిమాండు చేశాడు. దానిపై ఆర్గనైజింగు కమిటీ రెండు సార్లు నిర్ణయం తీసుకున్న విషయం ఆర్గనైజింగు కమిటీ సభ్యునికి కొత్తది ఎలా అవుతుందో అగోచరమే. విరామ సమయంలో ఆర్గనైజింగు కమిటీ ఒక సమావేశం జరిపింది (మినిట్స్, పేజి 40), దానికి మహాసభలో వున్న ఆ కమిటీ సభ్యులు హాజరయ్యారు (''ఇస్క్రా'' శాఖ పాత సభ్యులైన ఆర్గనైజింగు కమిటీలోని కొందరు సభ్యులు మహాసభలో లేరు).* అప్పుడు ''బొర్బా'' గురించి చర్చ ప్రారంభమైంది. ''రబోచెయె దేలొ''వాళ్లు (మర్తీనొవ్, అకీమొవ్, బ్రూకెర్, పేజీలు 36-38) అనుకూలంగా మాట్లాడారు, ''ఇస్క్రా''వాళ్లు (పవ్లోవిచ్, సొరోకిన్, లాంగె, ట్రాట్స్కీ, మార్తొవ్ తదితరులూ) వ్యతిరేకంగా మాట్లాడారు. మహాసభ మళ్లీ మనకి ఇదివరకే తెలిసిన గ్రూపులుగా విడిపోయింది. ''బొర్బా'' విషయమై జరిగిన పోరాటం మొండి పోరాటం, కామ్రేడ్ మార్తొవ్ చాలా వివరమైన (పేజి 38) ''సమరశీలమైన'' ఉపన్యాసం ఇచ్చాడు, అందులో ఆయన రష్యాలోని, విదేశాలలోని గ్రూపులకు ఇవ్వబడిన ''ప్రాతినిధ్యంలోని అసమానత్వాన్ని'' గురించి సరిగానే ప్రస్తావించాడు, విదేశీ గ్రూపులకు ఎలాంటి ''ప్రత్యేక హక్కు'' ఇవ్వడం ఎంత మాత్రం ''మంచిది కాదు'' అని (మహాసభ తరువాతి ఘటనల దృష్ట్యా, ప్రత్యేకించి యీనాడు జ్ఞానవర్ధకమైన చక్కని మాటలు!), ''సూత్రరీత్యా ఎంతమాత్రం సమర్థనీయంకాని అనైక్యతా స్వభావం గల నిర్మాణ సంబంధమైన అరాజకత్వాన్ని పార్టీలో'' ప్రోత్సహించకూడదని చెప్పాడు.

---

* ఈ సమావేశం గురించి, ఆర్గనైజింగు కమిటీ సభ్యుడూ, మహాసభకు పూర్వం సంపాదకవర్గానికి నమ్మకస్థుడైన ప్రతినిధిగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడినవాడూ, సంపాదక వర్గంలో ఏడవ సభ్యుడూ అయిన పవ్లోవిచ్ రాసిన ''లేఖ''[9] చూడండి (లీగు మినిట్స్, పేజి 44).

(మన పార్టీ మహాసభలో ''మైనారిటీకి'' సూటి దెబ్బ!) ప్రసంగించేవారి జాబితా ముగిసే వరకూ ''రబోచెయె దేలో'' అనుచరులు తప్ప ఇంకెవరూ బహిరంగంగానూ, సబబైన ఉద్దేశాలతోనూ ''బొర్బా''కు అనుకూలంగా మాట్లాడలేదు (పేజి 40). కామ్రేడ్ అకీమొవ్ గురించీ, ఆయన మిత్రులను గురించీ న్యాయంగా చెప్పవలసింది ఏమంటే, వారు వూగిసలాటా, దాపరికం లేకుండా తమ విధానాన్ని నిర్మొగమాటంగా సమర్థించుకున్నారు, తాము చెప్పదల్చుకున్న దానిని నిర్మొగమాటంగా చెప్పారు.

ప్రసంగించేవారి పేర్ల జాబితా ముగించబడిన తరువాత, నిజానికి మాట్లాడటం అప్పటికే అక్రమం అయిపోయిన తరువాత కామ్రేడ్ యెగోరొవ్ ''ఆర్గనైజింగు కమిటీచే అప్పుడే ఆమోదింపబడిన నిర్ణయాన్ని వినిపించాలి అని గట్టిగా డిమాండు చేశాడు.'' ఈ పన్నుగడకి మహాసభ ప్రతినిధులు ఆగ్రహం చెందడంలో ఆశ్చర్యం ఏమీలేదు, అధ్యక్షుడైన కామ్రేడ్ ప్లెహానొవ్, ''కామ్రేడ్ యెగోరొవ్ తన డిమాండుమీద పట్టుబట్టడానికి ఆశ్చర్యాన్ని'' ప్రకటించాడు. ఎవరైనా ఈ రెండింటిలో ఏదో ఒకటి చేయాలి: వివాదంలో వున్న సమస్యపై మహాసభ అంతటి ముందూ ఒక బహిరంగమైన, స్పష్టమైన వైఖరిని తీసుకోడమూ లేక ఏమీ చెప్పకుండా వూరుకోడమూ. కాని, ప్రసంగించేవారి పేర్ల జాబితా ముగింపబడేవరకూ వూరుకుని ఆ తరువాత, ''ముగింపు మాట'' అనే ముసుగుతో చర్చలో వున్న విషయంమీదనే ఆర్గనైజింగు కమిటీయొక్క కొత్త నిర్ణయంతో మహాసభను ఎదుర్కోడం, వెన్నుపోటు లాంటిది!

మధ్యాహ్నం సమావేశం తిరిగి కూడినప్పుడు, ఇంకా గందరగోళంలో వున్న బ్యూరో, ''లాంఛనాలను'' విడిచిపెట్టి మహాసభలో అత్యావశ్యకమైన సందర్భాలలో మాత్రమే వినియోగింపబడిన ''కామ్రేడ్లీ వివరణ'' అనే ఆఖరి పద్ధతిని అవలంబించాలని నిర్ణయించింది. ఆర్గనైజింగు కమిటీ ప్రతినిధి పొపొవ్ మాట్లాడుతూ, పవ్లొవిచ్ తప్ప మిగతా కమిటీ సభ్యులు అందరిచేతా ఆమోదించబడిన (పేజి 43), ర్యజానొవ్‌ను ఆహ్వానించాలని మహాసభకు సిఫారసు చేసిన కమిటీ నిర్ణయాన్ని ప్రకటించాడు.

పవ్లొవిచ్, తాను ఆర్గనైజింగు కమిటీ సమావేశపు న్యాయబద్ధతను సవాలు చేశాననీ, ఇంకా సవాలు చేస్తూనే వున్నాననీ, ఆర్గనైజింగు కమిటీ చేసిన కొత్త నిర్ణయం ''అంతకు పూర్వం అది చేసిన నిర్ణయానికి విరుద్ధం'' అనీ ప్రకటించాడు. ఈ ప్రకటనతో గొడవ రేగింది. ఆర్గనైజింగు కమిటీ సభ్యుడూ, ''యూజ్నీ రబోచీ'' గ్రూపు సభ్యుడూ అయిన కామ్రేడ్ యెగోరొవ్ వివాదంలో వున్న అసలు విషయానికి సమాధానం చెప్పకుండా తప్పించి, క్రమశిక్షణకు సంబంధించిన విషయాన్ని అసలు విషయంగా చేయడానికి ప్రయత్నించాడు. కామ్రేడ్ పవ్లొవిచ్ పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించాడని (!) వాదించాడు, ఎందుచేతనంటే,

ఆయన ఆక్షేపణను విన్న తరువాత ఆర్గనైజింగు కమిటీ "పవ్లోవిచ్ భిన్నాభిప్రాయాన్ని మహాసభ ముందు పెట్టకూడదని" నిర్ణయించింది. చర్చ పార్టీ క్రమశిక్షణ సమస్యమీదికి మారింది, ప్రతినిధుల పెద్ద హర్షధ్వనుల మధ్య ప్లెహానొవ్ కామ్రేడ్ యెగోరొవ్‌కు స్పష్ట పరచడం కోసం "విధిగా కట్టుబడి వుండాలనే ఆదేశాలు[10] లాంటివి ఏవీ మనకు లేవు" అని వివరించాడు. (పేజి 42, పేజి 379, మహాసభ నిబంధనావళి 7వ నిబంధన: "విధిగా కట్టుబడి వుండాలనే ఆదేశాలతో ప్రతినిధుల అధికారాలను పరిమితపర్చకూడదు. తమ అధికారాలను ఉపయోగించుకోడంలో ప్రతినిధులకు పూర్తి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం వున్నాయి.") "మహాసభయే పార్టీలో అత్యున్నతాధికార సంస్థ" కాబట్టే, పార్టీ జీవితానికి సంబంధించిన ఏ సమస్యను అయినా నేరుగా మహాసభకు నివేదించడానికి ఏ ప్రతినిధిని అయినా ఏవిధంగానైనా పరిమితపర్చే వాడే పార్టీ క్రమశిక్షణనూ, మహాసభ నిబంధనావళినీ ఉల్లంఘించుతున్నాడు. ఈ సమస్య సారాంశం ఇది: బృందాలా లేక ఒక పార్టీయా? వివిధ సంఘాల, బృందాల వ్యూహాజనిత హక్కులు లేక నిబంధనావళుల పేరుతో మహాసభలో ప్రతి నిధుల హక్కులను పరిమితపర్చాలా లేక నిజమైన పార్టీ అధికారిక సంస్థల నిర్మాణం జరిగే వరకూ పార్టీ మహాసభ జరిగేముందు అన్ని కింది శాఖలూ, పాత గ్రూపులూ పూర్తిగానూ, నామకార్థంగా కాకుండా వాస్తవంగానూ, రద్దు చేయబడాలా? దీనినిబట్టి పార్టీని వాస్తవంగా పునరుద్ధరించడమే తన పని అయిన యీ మహాసభ ఆరంభంలో (మూడవ సమావేశంలో) సూత్రరీత్యా యిది ఎంత ప్రగాఢ ప్రాముఖ్యం గల విషయమో పాఠకుడు ఇప్పటికే తెలుసుకుని వుంటాడు. ఈ తగాదాలో పాత బృందాలూ చిన్న గ్రూపులకూ ("యుజ్నీ రబోచీ" లాంటివి), పునరుద్భవించే పార్టీకీ మధ్య ఘర్షణ కేంద్రీకృతం అయినట్టు కనబడుతుంది. "ఇస్క్రా" వ్యతిరేక గ్రూపులు వెంటనే తమ రంగు బయటపెట్టుకున్నాయి: బుంద్‌వాళ్లు అక్రిమొవ్, కామ్రేడ్ మర్తీనొవ్, ప్రస్తుతపు "ఇస్క్రా" సంపాదకవర్గ మనఃపూర్వక మిత్రుడు, మన మిత్రుడు అయిన కామ్రేడ్ మాఖొవ్ అందరూ పవ్లోవిచ్‌కి వ్యతిరేకంగా యెగోరొవ్ పక్షం, "యుజ్నీ రబోచీ" పక్షం వహించారు. నిర్మాణంలో "ప్రజాస్వామ్యం"తో ఆటలాడటంలో మార్తొవ్‌తోనూ, అక్సెల్‌రోడ్‌తోనూ ఇప్పుడు పోటీచేస్తున్న కామ్రేడ్ మర్తీనొవ్, సైన్యం ఉదాహరణను సహితం పేర్కొన్నాడు, అందులో పై అధికార్లకు చేసుకునే విజ్ఞప్తి కింది అధికారి ద్వారా మాత్రమే చేయవలసివుంటుంది!! ఈ "ఘనిష్ఠమైన" "ఇస్క్రా" వ్యతిరేక ప్రతికూలతయొక్క అసలు అర్థం ఏమిటో మహాసభకు హాజరైన ప్రతివారికీ, లేదా మహాసభకు పూర్వం మన పార్టీయొక్క ఆంతరంగిక చరిత్రను జాగ్రత్తగా చూసిన వారికీ బాగా స్పష్టం అయింది. ఈ ప్రతిపక్షంయొక్క ఉద్దేశం (బహుశా దాని ప్రతినిధులు అందరూ ఎల్లప్పుడూ దానిని గ్రహించి వుండరు, ఒక్కొక్క

ప్పుడు అది అలవాటు మూలంగా కూడా అనుసరింపబడవచ్చు) "ఇస్క్రా" సూత్రాలపై నిర్మింపబడుతున్న విస్తృతమైన పార్టీచే మింగివేయబడకుండా చిన్న చిన్న గ్రూపుల స్వతంత్రాన్నీ, వ్యక్తిత్వాన్నీ, సంకుచిత ప్రయోజనాలనూ కాపాడటం.

అప్పటికింకా మర్తినావ్‌తో కలవకుండా వున్న కామ్రేడ్ మార్తొవ్ సరిగ్గా ఈ దృక్కోణంనుంచే సమస్యను చూశాడు. "పార్టీ క్రమశిక్షణను గురించి ఎవరి భావం అయితే తను చెంది వున్న కింది అంతరపు ఆ ప్రత్యేక గ్రూపుపట్ల ఒక విప్లవవాది కర్తవ్య పరిధిని దాటిపోదో" వారికి వ్యతిరేకంగా కామ్రేడ్ మార్తొవ్ శక్తివంతంగా వేదికను తీసుకున్నాడు, అది సరి అయినదే కూడా. "ఐక్య పార్టీ లోపల ఏ నిర్బంధపు గ్రూపింగూ (కిందిగీత మార్తొవ్‌ది) సహింపబడజాలదు" అని బృందం మనస్తత్వాన్ని బలపరుస్తున్న వారికి ఆయన వివరించాడు. మహాసభ చివరిలోనూ, ఆ తరువాతనూ తన రాజకీయ ప్రవర్తనకు ఈ మాటలు ఎలాంటి బడితె అవుతాయో ఆయన ముందుగా వూహించలేదు.... ఆర్గనైజింగు కమిటీ విషయంలో నిర్బంధపు గ్రూపింగు సహింపబడజాలదు, కాని సంపాదకవర్గం విషయంలో ఎంతో చక్కగా సహింపబడగలదు. కేంద్రంనుంచి దానికేసి చూసినప్పుడు నిర్బంధపు గ్రూపింగును మార్తొవ్ ఖండిస్తున్నాడు. కాని, కేంద్రంయొక్క కూర్పుతో తాను అసంతృప్తి చెందినప్పుడు దానిని సమర్థిస్తున్నాడు....

కామ్రేడ్ మార్తొవ్ తన ప్రసంగంలో కామ్రేడ్ యెగోరొవ్ చేసిన "తీవ్రమైన పొరపాటు" గురించే గాక, ఆర్గనైజింగు కమిటీ ప్రదర్శించిన రాజకీయ అస్థిరతను గురించి కూడా ప్రత్యేకించి నొక్కిచెప్పాడు. "ఆర్గనైజింగు కమిటీ తరఫున ఒక సిఫారసు సమర్పించబడింది, అది కమిటీ నివేదికకూ (ఆర్గనైజింగు కమిటీ సభ్యుల నివేదికమీద ఆధారపడినది అని మనం మరో వాక్యంచేరుద్దాము – పేజి 43, కొల్‌త్సోవ్ వ్యాఖ్యలు), ఆర్గనైజింగు కమిటీయే అంతకుముందు చేసిన సిఫారసులకూ భిన్నంగా వుంది" అని న్యాయమైన ఆగ్రహంతో ఆయన ప్రకటించాడు. (కిందిగీతలు నావి.) అప్పుడు, అంటే మార్తొవ్ "అటు పక్కకు పోవడానికి" పూర్వం, "బొర్బా"కు బదులు ర్యజానొవ్‌ను తెచ్చిపెట్టడం, ఆర్గనైజింగు కమిటీ చర్యలలోని పూర్తి పరస్పరవిరుద్ధతనూ, అసంగతత్వాన్నీ ఏవిధంగానూ తొలగించదని ఆయన గుర్తించాడని మనం చూస్తాం. (అటు పక్కకు పోయిన తరువాత మార్తొవ్ ఈ విషయాన్ని ఎలా భావించాడో లీగు మహాసభ మినిట్స్ – పేజి 57 – నుంచి పార్టీ సభ్యులు తెలుసుకోవచ్చు.) అప్పుడు మార్తొవ్, క్రమశిక్షణ సమస్యను విశ్లేషించడానికి మాత్రమే పరిమితపడి వుండలేదు: "మార్పు చేయవలసి రావడానికి ఏ కొత్త పరిస్థితి ఏర్పడింది?" అని ఆయన ఆర్గనైజింగు కమిటీని నిర్మొగమాటంగా అడిగాడు. (కిందిగీతలు నావి.) నిజానికి, ఆర్గనైజింగు కమిటీ తన సిఫారసును చేసినప్పుడు, అకీమొవ్, తది

తరులూ చేసినట్టుగా తన అభిప్రాయాన్ని బహిరంగంగా సమర్థించుకునే ధైర్యం కూడా దానికి లేకపోయింది. మార్తొవ్ దీనిని కాదంటున్నాడు (లీగు మినిట్స్, పేజి 56), కాని మహాసభ మినిట్స్‌ను చదివిన వారు ఎవరైనా ఆయన పొరపాటు పడ్డాడని తెలుసుకుంటారు. ఆర్గనైజింగు కమిటీ తరఫున సిఫారసును సమర్పిస్తూ పొపోవ్ దాని ఉద్దేశాలను గురించి ఒక్క మాట కూడా చెప్పలేదు (పార్టీ మహాసభ మినిట్స్, పేజి 41). యెగోరొవ్ సమస్యను క్రమశిక్షణకు సంబంధించినదిగా మార్చాడు. అసలు సమస్యను గురించి ఆయన చెప్పినదంతా ఇది: "ఆర్గనైజింగు కమిటీకి కొత్త కారణాలు వుంటే వుండి వుండవచ్చు (కాని అవి వున్నాయా, వుంటే, ఆ కొత్త కారణాలు ఏమిటి అనేది తెలియదు); అది ఎవరో ఒకరిని నామినేటు చేయడం మరచిపోయి వుండవచ్చు, ఇంకా అటువంటివే కావచ్చు. ("ఇంకా అటువంటివి" అనేది ఉపన్యాసకుని ఏకమాత్ర రక్షణము, ఎందుచేతనంటే ఆర్గనైజింగు కమిటీ, మహాసభకు ముందు రెండు సార్లూ, కమిటీలో ఒక సారీ చర్చించి వున్న "బొర్బా" విషయం మరచిపోయి వుండజాలదు.) "ఆర్గనైజింగు కమిటీ 'బొర్బా' గ్రూపుపట్ల తన వైఖరిని మార్చుకున్నందువల్ల యీ నిర్ణయం తీసుకోలేదు, కార్యకలాపాల ఆరంభంలోనే పార్టీయొక్క భవిష్య కేంద్ర సంస్థ మార్గంలో వున్న అనవసరమైన బండలను తొలగించ గోరుతోంది కనుకనే ఆ నిర్ణయం తీసుకుంది." ఇది ఒక కారణం కాదు, కారణాన్ని తప్పించుకోడమే. నిజాయితీపరుడైన ప్రతి సోషల్ డెమొక్రటూ (మహాసభ ప్రతినిధులలో ఏ ఒక్కరి నిజాయితీని గురించీ మాకు ఎలాంటి సందేహమూ లేదు) క్రుంగి వున్నాయని తాను అనుకునే బండలను తొలగించడం పట్లనూ, ఉచితమైనవని తాను భావించే పద్ధతుల ద్వారా తొలగించడం పట్లనూ ఆసక్తి కలిగి వుంటాడు. కారణాలు చెప్పడమంటే విషయాల పట్ల తన అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పడమూ వివరించడమూ అవుతుంది, గాని ప్రత్యక్ష సత్యంతో తప్పించుకోవడం కాదు. "'బొర్బా' పట్ల తమ వైఖరిని మార్చుకోకుండా" వారు కారణం చెప్పజాలరు, ఎందుచేతనంటే ఆర్గనైజింగు కమిటీ తాను అంతకుముందు తీసుకున్న, విరుద్ధమైన నిర్ణయాలలో కూడా క్రుంగి వున్న బండలను తొలగించడం పట్లనే ఆసక్తి కలిగి వుంది, కాని అప్పుడది పూర్తిగా భిన్నమైన వాటిని "బండలు"గా పరిగణించింది. కామ్రేడ్ మార్తొవ్ ఈ వాదనను చాలా తీవ్రంగానూ ఎంతో సరిగానూ ఎదిరించాడు. అది "స్వల్ప విషయం" అనీ, "సమస్యను తప్పించుకోవాలి" అనే కోరికచే ప్రోత్సహింపబడినదనీ చెప్పాడు. "ఇతరులు ఏమంటారోనని భయపడవద్దు" అని ఆర్గనైజింగు కమిటీకి సలహా యిచ్చాడు. ఈ మాటలు, మహాసభలో ఎంతో పెద్ద పాత్రను నిర్వహించిన రాజకీయ అభిప్రాయభేదంయొక్క ముఖ్య లక్షణాన్ని చక్కగా వర్ణిస్తాయి. దాని కున్న ప్రత్యేకత సరిగ్గా ఏమిటంటే, స్వతంత్ర వైఖరి లోపించడం, అల్పత్వం, స్వంత విధానం అనేది లేకపోడం,

ఇతరులు ఏమంటారోననే భయం, రెండు నిర్దిష్టమైన పక్షాల మధ్య నిరంతరం వూగిస లాడటం, తన credo* ఏమిటో నిర్మొగమాటంగా చెప్పడానికి భయపడటం — ఒక్క మాటలో చెప్పాలంటే ''ఊబి''**కి వున్న లక్షణాలు అన్నీ వున్నాయి.

సందర్భవశాత్తూ, నిలకడలేని యీ గ్రూపుయొక్క రాజకీయ బలహీనత పర్యవసానం ఏమిటంటే, ''బొర్బా'' గ్రూపు సభ్యులలో ఒకరిని ఆహ్వానించాలని మహాసభలో ఒక తీర్మా నాన్ని బుంద్‌కు చెందిన యూదిన్ తప్ప మరెవరూ ప్రవేశపెట్టలేదు. యూదిన్ తీర్మా నానికి అయిదు వోట్లు వచ్చాయి — బుంద్ అనుయాయులు అందరూ వోటు చేశారనేది స్పష్టం: వూగిసలాడే సభ్యులు మళ్లీ పక్షాలు మారారు! మధ్యస్థ గ్రూపు వోట్లు ఎంత ఎక్కువో ఈ సమస్యమీద కొల్‌త్సోవ్, యూదిన్‌ల తీర్మానాలపై జరిగిన వోటింగులో రహూరమిగా తెలిసింది: ''ఇస్క్రా'' అనుయాయికి ముప్ఫయి రెండు వోట్లు వచ్చాయి (పేజి 47), బుంద్ అనుయాయికి పదహారు వోట్లు వచ్చాయి, అంటే ''ఇస్క్రా'' వ్యతిరేక వోట్లు ఎనిమిదికి తోడు కామ్రేడ్ మాహొవ్ కున్న రెండు వోట్లు (పేజి 46), ''యూజ్నీ రబోచీ'' గ్రూపు సభ్యుల వోట్లు నాలుగు, ఇతరులవి రెండు. ఈ గ్రూపింగును యాదృచ్ఛికమైనదిగా ఏవిధంగానూ పరిగణింపకూడదని ఇప్పుడే చూపుతాను: కాని మొదట ఈ ఆర్గనైజింగు కమిటీ ఘటన గురించి మార్తొవ్ ప్రస్తుతపు అభిప్రాయాన్ని క్లుప్తంగా చూద్దాం. ''పవ్లోవిచ్, తదితరులూ ఉద్రేకాలను రెచ్చగొట్టారు'' అని లీగులో మార్తొవ్ వాదించాడు. ''బొర్బా''కీ, ఆర్గనైజింగు కమిటికీ వ్యతిరేకంగా మార్తొవే అందరి కంటే పెద్ద, అత్యంత తీవ్రమైన నిశితమైన ప్రసంగం చేశాడన్న సంగతి తెలుసుకోడానికి మహా సభ మినిట్స్ చూస్తే చాలు. పవ్లోవిచ్‌మీద ''నిందను'' మోపడానికి ప్రయత్నించడం ద్వారా

* నమ్మకం, కార్యక్రమం. — సం.

** నేడు మన పార్టీలో ఈ మాట వింటే భయపడేవాళ్లూ, వివాదంలో అనుచితమైన పద్ధతులను ఉపయోగిస్తున్నారని గోల చేసేవాళ్లూ కొందరు వున్నారు. అది, అధికారిక పద్ధతిని గురించిన తప్పుడు భావం మూలంగా వచ్చే వక్రించిన తెలివి! ఈ పదాన్ని ఉపయో గించకుండా ఆంతరంగిక పోరాటాలలో వ్యవహరించిన రాజకీయ పార్టీ ఏదీ లేదు. పోటీపడు తున్న పక్షాల మధ్య వూగిసలాడే నిలకడలేని సభ్యులు ఎప్పుడూ ఆ మాటతోనే పిలువబడతారు. తమ ఆంతరంగిక పోరాటాలను నిజంగా చాలా నిర్ణీతమైన హద్దుల లోపల వుంచుకోడం ఎలాగో తెలిసిన జర్మన్లు సహితం "versumpft" (ఊబిలో దిగబడిన — సం.) అనే మాటకు కోపం తెచ్చుకోలేదు, భయపడలేదు, పరిహాసాస్పదమైన అధికారిక నంగనాచి తనాన్ని ప్రదర్శించలేదు.

ఆయన తన అస్థిరతను ప్రదర్శించుకుంటున్నాడు అంతే: మహాసభకు ముందు సంపాదక వర్గంలో ఏడవ సభ్యుడుగా ఎన్నుకోబడడానికి పవ్లోవిచ్‌కి సహాయం చేసినది ఆయనే; మహాసభలో యెగోరొవ్‌కి వ్యతిరేకంగా ఆయన పూర్తిగా పవ్లోవిచ్‌తో జత కలిశాడు (పేజి 44). కాని పవ్లోవిచ్ చేతులలో ఓటమి పొందిన తరువాత ఆయనను "ఉద్రేకాలు రెచ్చగొట్టాడని" నిందిస్తున్నాడు. ఇది హాస్యాస్పదం.

ఫలానావారిని ఆహ్వానించాలి అనే విషయానికి ఇవ్వబడిన ప్రాధాన్యం గురించి "ఇస్క్రా" (నెం. 56)లో మార్తొవ్ వ్యంగ్యంగా రాశాడు. కాని మళ్లీ ఈ వ్యంగ్యం మార్తొవ్‌కే వ్యతిరేకం అవుతుంది, ఎందుచేతనంటే ఈ ఆర్గనైజింగు కమిటీ ఘటనయే కేంద్ర కమిటీలోకి గాని, కేంద్ర పత్రికలోకి గాని ఎవరిని ఆహ్వానించాలి అనే "ముఖ్యమైన" సమస్యపై వివాదాన్ని ప్రారంభించింది. వ్యవహారం "కింది అంతస్తు గ్రూపు" (పార్టీతో పోల్చితే) అయిన నీ స్వంత గ్రూపుకు సంబంధించినదా లేక ఇతరుల గ్రూపుకు సంబంధించినదా అనే దానిమీద ఆధారపడుతూ రెండు వేరు వేరు కొలబద్దలను ఉపయోగించడం అనుచితం. ఇది సరిగ్గా కూపస్థమండూకత్వం, బృందతత్వం గాని, వ్యవహారం పట్ల పార్టీ వైఖరి కాదు. మార్తొవ్ లీగులో చేసిన ప్రసంగాన్ని (పేజి 57) ఆయనే మహాసభలో చేసిన ప్రసంగంతో (పేజి 44) పోల్చిచూస్తే యీ విషయం బాగా కనబడుతుంది. మార్తొవ్ లీగులో ఇతర విషయాలతో పాటు ఇలా చెప్పాడు: "కొంతమంది తాము 'ఇస్క్రా'వాళ్లమని గట్టిగా చెప్పుకుంటూ అదే సమయంలో 'ఇస్క్రా'వాళ్లుగా వున్నందుకు సిగ్గుపడటం ఏమిటో నేను అర్థం చేసుకోలేను." "తాను ఫలానా అని చెప్పుకోడానికీ," "అలా అయివుండడానికీ" గల తేడాను — మాటలకూ, చేతలకూ మధ్య గల తేడాను — అర్థం చేసుకోడంలో ఇది వింతరకం వైఫల్యం. మహాసభలో మార్తొవ్ తాను నిర్బంధపు గ్రూపింగులకు వ్యతిరేకినని చెప్పుకున్నాడు కాని, మహాసభ తరువాత వాటిని బలపర్చేవాడు అయ్యాడు....

## ఈ) "యూజ్నీ రబోచీ" గ్రూపు రద్దు

ఆర్గనైజింగు కమిటీ సమస్యపై ప్రతినిధుల శ్రేణీకరణ బహుశా యాదృచ్ఛికంగా కనబడవచ్చు. కాని అలాంటి అభిప్రాయం తప్పు అవుతుంది, దానిని తొలగించేటందుకు మనం వరుసక్రమాన్ని వదలి మహాసభ చివరలో జరిగినదీ, ఇప్పుడు చర్చించిన సమస్యతో సన్నిహిత సంబంధం కలదీ అయిన ఒక ఘటనను పరిశీలిద్దాం. అది "యూజ్నీ రబోచీ" గ్రూపు

రద్దు చేయబడటం. నిర్మాణ వ్యవహారంలో "ఇస్క్రా" వైఖరి — పార్టీ శక్తులను సంపూర్ణంగా ఏకీకరణ మొనర్చడం, వాటిని విడదీసే గందరగోళాన్ని తొలగించడం — ఇక్కడ గ్రూపులలో ఒకదాని ప్రయోజనాలతో ఘర్షణలో పడింది. ఆ గ్రూపు నిజమైన పార్టీ లేకుండా వుండినప్పుడు ఉపయోగకరమైన పని చేసింది, కాని ఇప్పుడు పని కేంద్రీకరణ మొనర్చబడుతోంది కనుక ఆ గ్రూపు అనావశ్యకం అయింది. బృందం ప్రయోజనాల దృష్ట్యా "యూజ్నీ రబోచీ" గ్రూపు తన "అనుస్యూతి"ని అనతిక్రమణీయతకు హక్కు కలిగి వున్నానని చెప్పడంలో పాత "ఇస్క్రా" సంపాదకవర్గంకంటే తక్కువ అర్హత కలదేమీ కాదు. కాని పార్టీ ప్రయోజనాల దృష్ట్యా అది తన బలగాలను "తగిన పార్టీ శాఖలకు" బదలాయించేటందుకు లోబడవలసి వుండింది. (మహాసభలో ఆమోదింపబడిన తీర్మానం చివరి భాగం, పేజి 313.) బృందం ప్రయోజనాల దృష్ట్యానూ "కూపస్థమండూక బుద్ధి" దృష్ట్యానూ చూస్తే పాత "ఇస్క్రా" సంపాదకవర్గం కోరుకున్న దానికంటే ఎక్కువ ఏమీ కోరుకోని ఒక ఉపయోగకరమైన గ్రూపును రద్దుచేయడం "సున్నితమైన వ్యవహారం"లాగ కనిపించక మానదు (కామ్రేడ్ రూసొవ్, కామ్రేడ్ డేయ్‌చ్ ఉపయోగించిన పదం). కాని పార్టీ ప్రయోజనాల దృష్ట్యా చూస్తే దానిని రద్దుచేయడమూ పార్టీలో దాన్ని "కలిపివేసుకోడమూ" (గూసెవ్ ఉపయోగించిన పదం) ఆవశ్యకం అయింది. "యూజ్నీ రబోచీ" గ్రూపు తనంతటతానే రద్దుచేసుకున్నట్టు ప్రకటించడం "అవసరమని తాను భావించడం లేదు" అని నిర్మొగమాటంగా చెప్పింది, "మహాసభ తన అభిప్రాయాన్ని స్పష్టంగా ప్రకటించాలి" అనీ, "ఔనో కాదో వెంటనే ప్రకటించాలి" అనీ డిమాండు చేసింది. రద్దుచేయబడిన తరువాత పాత "ఇస్క్రా" సంపాదకవర్గం ప్రస్తావించడం ఆరంభించినట్టుగానే "యూజ్నీ రబోచీ" గ్రూపు కూడా తన "అనుస్యూతి" గురించి నేరుగా ప్రస్తావించడం మొదలుపెట్టింది! కామ్రేడ్ యెగోరొవ్ ఇలా అన్నాడు: "మనమంతా వ్యక్తిగతంగా ఒకే పార్టీలో సభ్యులం అయివున్నప్పటికీ, అది అనేక శాఖలతో కూడినదై వుంది, వాటిని మనం చారిత్రక వాస్తవాలుగా గుర్తించాల్సి వుంది.... అలాంటి శాఖ పార్టీకి హానికరం కాకపోతే దానిని రద్దుచేయవలసిన అవసరం లేదు."

ఆవిధంగా సూత్రానికి సంబంధించిన ఒక ముఖ్యమైన సమస్య ఎంతో నిష్కర్షగా లేవదీయబడింది, "ఇస్క్రా" అనుయాయులు అందరూ — వారి బృందం ప్రయోజనాలు ఇంకా ముందుకు రానంతవరకూ — అస్థిరమైన వారికి వ్యతిరేకంగా ఒక నిర్ణయాత్మకమైన వైఖరిని అవలంబించారు. (బుండ్‌వాళ్ళూ, "రబోచెయె దేలొ"వాళ్ళు ఇద్దరూ ఇదివరకే మహాసభనుంచి ఉపసంహరించుకున్నారు; వారు నిస్సందేహంగా మనస్ఫూర్తిగా "చారిత్రక వాస్తవాలను గుర్తించడం" అనే దానికి అనుకూలంగా వుండి వుండేవారు.) వోటింగు ఫలితం

ఇలా వుంది, అనుకూలంగా ముప్పయి ఒక్కరు, వ్యతిరేకంగా అయిదుగురు, ఓటింగులో పాల్గొననివారు అయిదుగురు. (''యూజ్నీ రబోచీ'' గ్రూపు సభ్యులవి నాలుగు వోట్లు, బెలోవ్‌ది ఒకటి, ఈయన బహుశా తాను అంతకు పూర్వం చేసిన ప్రకటనలను బట్టి అలా చేసి వుంటాడు, పేజి 308.) ''ఇస్క్రా''యొక్క స్థిరమైన నిర్మాణ పథకానికి స్పష్టంగా వ్యతిరేకంగానూ, పార్టీ సరళికి భిన్నంగా బృందపు సరళిని సమర్థిస్తూ పడిన పది వోట్లనూ ఇక్కడ ఎంతో స్పష్టంగా చూడవచ్చు. చర్చ క్రమంలో ''ఇస్క్రా''వాళ్లు ఈ సమస్యను సరిగ్గా సూత్రరీత్యా ప్రవేశపెట్టారు (లాంగె ప్రసంగం చూడండి, పేజి 315), సంకుచి తత్వంతో కూడిన అనుభవరాహిత్యాన్నీ, అనైక్యతనూ వ్యతిరేకించారు, విడివిడి శాఖల ''సాను భూతులను'' లెక్కజేయలేదు, స్పష్టంగా ఇలా అని ప్రకటించారు: '' 'యూజ్నీ రబోచీ' కామ్రేడ్స్ ఇంతకు ముందు, అంటే ఒకటి రెండు సంవత్సరాలకు పూర్వం సూత్రానికి మరింత ఖచ్చితంగా కట్టుబడి వుండివుంటే, పార్టీ ఐక్యతా, ఇక్కడ మనం స్థిరపర్చిన కార్యక్రమ సూత్రాల విజయమూ ఇంకా తొందరగానే సాధింపబడి వుండేవి.'' ఒర్లోవ్, గూసెవ్, ల్యాదొవ్, మురవ్యోవ్, రూసొవ్, పవ్లోవిచ్, గ్లెబొవ్, గోరిన్ అందరూ ఈ ధోరణిలోనే మాట్లాడారు. ''యూజ్నీ రబోచీ,'' మాహొవ్, తదితరులూ అనుసరించిన విధానంలోనూ ''పంథా''లోనూ ఒక సూత్రమనేది లేకపోవడం గురించి మహాసభలో స్పష్టంగానూ, పదే పదేనూ చేయ బడిన ప్రస్తావనలకు ఏమాత్రం అసమ్మతి తెలుపకుండానూ, అందువల్ల ఎలాంటి మినహా యింపులులేకుండా ''మైనారిటీ''కి చెందిన ''ఇస్క్రా''వాళ్లు డేయిచ్ ద్వారా యీ భావాలతో గట్టిగా ఏకీభవించారు, ''గందరగోళాన్ని'' ఖండించి, కామ్రేడ్ రూసొవ్‌చే ''సమస్యను నిర్మొ గమాటంగా లేవనెత్తే పద్ధతిని'' మెచ్చుకున్నారు (పేజి 315). అదే కామ్రేడ్ రూసొవ్ యిదే సమావేశంలో పాత సంపాదకవర్గ సమస్యను కూడా కేవలం పార్టీ ప్రాతిపదికమీద ''నిర్మొగమాటంగా లేవనెత్తే'' సిగ్గుమాలిన సాహసం కలిగి వున్నాడు — ఎంత ఘోరం! (పేజి 325.)

''యూజ్నీ రబోచీ'' గ్రూపు విషయానికి వస్తే దానిని రద్దు చేయాలనే ప్రతిపాదన తీవ్రమైన ఆగ్రహాన్ని రేకెత్తించింది, దాని చిహ్నాలు మినిట్స్‌లో కనబడతాయి (మినిట్స్ చర్చలను కొద్దిగా మాత్రమే ప్రతిబింబిస్తాయన్న సంగతి మర్చిపోకూడదు, ఎందుచేతనంటే, అందులో పూర్తి ఉపన్యాసాలు వుండవు, వాటి సంగ్రహాలూ సారాంశాలూ మాత్రమే వుం టాయి). ''యూజ్నీ రబోచీ''తో పాటు ''రబోచయ మీస్ల్'' గ్రూపు[11] పేరును చెప్పడమే ఒక ''అబద్ధం'' అని కూడా కామ్రేడ్ యెగోరొవ్ వర్ణించాడు — స్థిరమైన ఆర్థికవాదం[12] పట్ల మహాసభలో ప్రబలంగా వుండిన వైఖరికి ఇది ఒక ప్రత్యేకమైన ఉదాహరణ. ఆ తరు వాత కూడా, 37వ సమావేశంలో యెగోరొవ్, ''యూజ్నీ రబోచీ'' రద్దును గురించి

అత్యంత ఆగ్రహంతో మాట్లాడాడు (పేజి 356). ''యూజ్నీ రబోచి''పై జరిగిన చర్చలో ప్రచురణ నిధులను గురించి గాని, కేంద్ర పత్రికచేత లేక కేంద్ర కమిటీచేత అజమాయిషీ చేయబడటం గురించి గాని ఆ గ్రూపు సభ్యులను ఎవరూ అడగలేదనే విషయాన్ని మినిట్స్‌లో నమోదుచేయాలని కోరాడు. ''యూజ్నీ రబోచి''పై జరిగిన చర్చలో, ఆ గ్రూపుయొక్క భవిష్యత్తును ఒక ఘనిష్ట మెజారిటీ ఇదివరకే నిర్ణయించి వుంది అన్న విషయాన్ని కామ్రేడ్ పాపోవ్ సూచించాడు. ''ఇప్పుడు, కామ్రేడ్స్ గూసెవ్, ఒర్లోవ్‌ల ప్రసంగాల తరువాత, అంతా స్పష్టం అయింది'' అన్నాడతడు (పేజి 316). ఈ మాటల అర్థం స్పష్టమే: ఇప్పుడు ''ఇస్క్రా''వాళ్లు తమ అభిప్రాయాన్ని ప్రకటించి, ఒక తీర్మానాన్ని ప్రతిపాదించిన తరువాత అంతా స్పష్టమే, అంటే, ''యూజ్నీ రబోచి'' గ్రూపు, దాని అభీష్టానికి వ్యతిరేకంగా రద్దు చేయబడుతుందనేది స్పష్టం. ఈ సందర్భంలో ''యూజ్నీ రబోచి'' గ్రూపు ప్రతినిధియే నిర్మాణ విధానం గురించి విభిన్న ''పంథా''లకు ప్రాతినిధ్యం వహించే ''ఇస్క్రా''వాళ్లకూ (గూసెవ్, ఒర్లోవ్ లాంటి ''ఇస్క్రా''వాళ్లకు కూడా) తనను బలపర్చేవారికీ మధ్య నున్న తేడాను చూపాడు. నేటి ''ఇస్క్రా'' ''యూజ్నీ రబోచి'' గ్రూపును (బహుశా మాహోవ్‌ను కూడా?) ''విశిష్ట 'ఇస్క్రా'వాళ్లు''గా చూపుతోందంటే, మహాసభలో జరిగిన అత్యంత ముఖ్యమైన ఘటనలను (ఈ గ్రూపు దృక్పథంనుంచి) కొత్త సంపాదకవర్గం మరచిపోయిందనీ, ''మైనారిటీ'' అనబడే గ్రూపు ఏర్పడటానికి ఎవరు అటు వెళ్లారో తెలిపే సాక్ష్యాన్ని కప్పిపుచ్చడానికి ఆతురపడుతోందనీ తెలుస్తుంది.

దురదృష్టవశాత్తూ, జనప్రియమైన మరో పత్రికను ప్రారంభించే విషయం మహాసభలో చర్చింపబడలేదు. దానిని గురించి ''ఇస్క్రా''వాళ్లు అందరూ, మహాసభకు పూర్వమూ, మహాసభ సమయంలోనూ, సమావేశాల వెలుపల, చురుకుగా చర్చించారు. పార్టీ జీవితపు ప్రస్తుత సమయంలో అలాంటి ప్రచురణను ప్రారంభించడం గాని, వున్నవాటిలో దేనినైనా ఆవిధంగా మార్చడం గాని పూర్తిగా అవివేకం అవుతుందని అంగీకరించారు. ''ఇస్క్రా'' వ్యతిరేకులు, మహాసభలో అందుకు భిన్నమైన అభిప్రాయాన్ని వెల్లడించారు; ''యూజ్నీ రబోచి'' గ్రూపు కూడా తన నివేదికలో అదే పని చేసింది; అందుకోసం పది సంతకాలతో ఒక తీర్మానం ప్రవేశపెట్టబడలేదనే వాస్తవం యాదృచ్ఛికం అయినా కావచ్చు లేదా నెగ్గుతుందనే ''ఆశలేని'' సమస్యను లేవదీయడం పట్ల అయిష్టత అయినా కావచ్చు.

# ఉ) భాషల సమానత్వం ఘటన

మహాసభ సమావేశాల వరుసక్రమానికి తిరిగి వద్దాం.

మహాసభ తన అసలు వ్యవహారాన్ని చర్చించనారంభించడానికి పూర్వమే స్పష్టంగా ఏర్పడివున్న ''ఇస్క్రా'' వ్యతిరేకుల గ్రూపు (ఎనిమిది వోట్లు) మాత్రమే గాక, ఆ ఎనిమిది మంది ''ఇస్క్రా'' వ్యతిరేకులను బలపర్చడానికి వారి వోట్లను సుమారుగా పదహారుకి లేక పద్దెనిమిదికి పెంచడానికి సిద్ధపడి వున్న మధ్యస్థుల, అస్థిరుల గ్రూపు కూడా ఒకటి వుందని స్పష్టంగా బయటపడిన సంగతి ఇప్పుడు చూశాం.

మహాసభలో అత్యంత వివరంగా చర్చించబడిన సమస్య, పార్టీలో బుంద్ స్థానం ఏమిటి అనేది సూత్రాన్ని గురించి నిర్ణయించే సమస్యగా తయారైంది, ఆ సమస్యపై నిర్ణయం నిర్మాణ సమస్యపై చర్చ జరిగేవరకూ వాయిదా వేయబడింది. ఈ సమస్యలో ఇమిడివున్న అంశాలు మహాసభకు ముందు పత్రికలలో సవిస్తరంగా ప్రచురింపబడి వున్నందున మహాసభలో జరిగిన చర్చలో సాపేక్షంగా చూస్తే కొత్త విషయాలు చాలా తక్కువ వచ్చాయి. అయినప్పటికీ ఒక విషయం మాత్రం చెప్పాలి, అదేమంటే ''రబోచెయె దేలొ''ను బల పర్చినవారు (మర్తీనొవ్, అకీమొవ్, బ్రూకెర్) మార్తొవ్ తీర్మానంతో ఏకీభవిస్తూనే, అది చాలదని తాము అనుకుంటున్నట్టు చెప్పి ఆ తీర్మానంనుండి వచ్చిన నిర్ధారణలకు అంగీక రించలేదు (పేజీలు 69, 73, 83, 86).

బుంద్ స్థానం గురించి చర్చించిన తరువాత, మహాసభ కార్యక్రమం విషయం చేప ట్టింది. ఈ చర్చ ప్రధానంగా వివరాలకు సంబంధించిన సవరణలపై కేంద్రీకరింపబడింది. అవి చాలా స్వల్పమైన ఆసక్తిని మాత్రమే కలిగిస్తున్నాయి. సద్యోజనితత్వాన్నీ చైతన్యాన్నీ గురించిన సుప్రసిద్ధ సమస్య రూపొందడంపై కామ్రేడ్ మర్తీనొవ్ చేసిన దాడిలో మాత్రమే ''ఇస్క్రా'' వ్యతిరేకుల వ్యతిరేకత సూత్రరీత్యా బయటపడింది. బుంద్‌వాళ్లూ, ''రబోచెయె దేలొ'' అనుయాయులూ మర్తీనొవ్‌ను ఏకగ్రీవంగా బలపర్చారు. ఆయన అభ్యంతరాలలోని నిస్సారతను ఇతరులతోపాటు మార్తొవ్, ప్లెహానొవ్‌లు చూపించారు. విచిత్రమైన విష యంగా గమనించవలసింది ఏమిటంటే, ''ఇస్క్రా'' సంపాదకవర్గం (పునరాలోచించినమీదట అనిపిస్తుంది) ఇప్పుడు మర్తీనొవ్ పక్షానికి మారారు, మహాసభలో తామే చెప్పిన దానికి వ్యతి రేకంగా మాట్లాడుతున్నారు. బహుశా ఇది ప్రసిద్ధికెక్కిన ''అనుస్యూతి'' సూత్రాన్ని అనుసరించి అయివుంటుంది.... మనం ఇక చేయగలిగినదంతా సంపాదకవర్గం ఈ సమస్యను సంపూర్ణంగా పరిష్కరించి, మర్తీనొవ్‌తో తాను ఎంతవరకు ఏకీభవిస్తున్నదీ, సరిగ్గా ఏ అంశాలమీద ఏకీభవిస్తున్నదీ, ఎప్పటినుంచి ఏకీభవిస్తున్నదీ మనకు వివరించేటంత వరకూ

వేచివుండటం. ఈలోగా మనం ఒకటే అడుగుతాం: మహాసభలో తాను చెప్పినదానికి పూర్తిగా వ్యతిరేకంగా మహాసభానంతరం మాట్లాడిన సంపాదకవర్గంగల పార్టీ పత్రికను ఎవరైనా ఎప్పుడైనా చూశారా?

''ఇస్క్రా''ను కేంద్ర పత్రికగా గుర్తించడం గురించిన వాదాలను (వీటిని గురించి పైన చర్చించాము) నిబంధనావళిపై చర్చ ఆరంభం కావడాన్ని (దీనిని నిబంధనావళిపై జరిగిన మొత్తం చర్చ సందర్భంగా పరిశీలించడం మరింత సులువుగా వుంటుంది) దాట వేసి, మనం కార్యక్రమంపై జరిగిన చర్చలో బయటపడిన సూత్రాల గురించిన వివిధ అభిప్రాయాలను పరిశీలిద్దాం. మొట్టమొదట అత్యంత విశిష్ట స్వభావం గల్గిన ఒక వివ రాన్ని గమనిద్దాం. అదేమిటంటే, దామాషా ప్రాతినిధ్యంపై జరిగిన చర్చ. ''యూజ్నీ రబోచి''కి చెందిన కామ్రేడ్ యెగోరొవ్, కార్యక్రమంలో ఈ అంశాన్ని చేర్చాలని వాదిం చాడు. అది ఏవిధంగా చెప్పాడంటే, ఈ విషయంమీద ''తీవ్రమైన అభిప్రాయభేదం'' వుంది అని పొసదోవ్స్కి (మైనారిటీకి చెందిన ''ఇస్క్రా''వాడు) సబబుగానే ఎత్తి చెప్ప వలసి వచ్చింది. కామ్రేడ్ పొసదోవ్స్కి ఇలా అన్నాడు: ''ఈకింది మౌలిక సమస్యపై మేము ఏకీభవించడం లేదనడంలో సందేహం అక్కరలేదు: మన భవిష్యత్ విధానాన్ని కొన్ని మౌలిక ప్రజాస్వామిక సూత్రాలకు విధేయమై వుండేటట్లు చేసి వాటికి పరమమైన విలువ నివ్వాలా లేక ప్రజాస్వామిక సూత్రాలన్నీ పార్టీ ప్రయోజనాలకు ప్రత్యేకించి విధేయమై వుండేటట్లు చేయాలా? నేను నిశ్చయంగా రెండవ దానికే అనుకూలం.'' ప్లెహానొవ్ పొసదోవ్స్కితో ''పూర్తిగా ఏకీభవించాడు.'' ''ప్రజాస్వామిక సూత్రాలకు పరమమైన విలువ'' ఇవ్వడాన్నీ, వాటిని నిరాకారంగా ''ప్రత్యేకంగా పరిగణించడాన్నీ మరింత నిష్కర్షగానూ గట్టిగానూ వ్యతిరేకించాడు. ఆయనిలా అన్నాడు: ''సోషల్ డెమోక్రట్లమైన మనం సార్వత్రిక ఓటింగు హక్కును వ్యతిరేకించే సందర్భం వ్యూహాత్మకంగానే సాధ్యం. ఒకప్పుడు ఇటాలియన్ రిపబ్లిక్‌ల లోని బూర్జువావర్గం ప్రభువుల వంశంలో పుట్టిన వారికి రాజకీయ హక్కులు లేకుండా చేసింది. అదే విధంగా విప్లవకర శ్రామికవర్గం, తన రాజకీయ హక్కులను పరిమిత పరు స్తున్న పైవర్గాల వారిలాగే తాను కూడా పైవర్గాల వారి రాజకీయ హక్కులను పరిమిత పర్చవచ్చు.'' ప్లెహానొవ్ ప్రసంగానికి హర్షధ్వానాలూ హుస్సుమనే శబ్దాలూ చేయబడ్డాయి, ''మీరలాంటి హుస్సు శబ్దాలు చేయకూడదు'' అని Zwischenruf*కు ప్లెహానొవ్ తన అసమ్మతిని తెల్పి కామ్రేడ్స్‌కు వారి అభిప్రాయ ప్రకటలనను ఆపవద్దని చెప్పాడు, కామ్రేడ్ యెగోరొవ్ లేచి ఇలా అన్నాడు: ''అలాంటి ప్రసంగాలకు హర్షధ్వనులు వస్తున్నాయి

* ప్రసంగం మధ్యలో సభనుంచి వచ్చిన అభ్యంతరం. — సం.

కనుక నేను హుస్ శబ్దం చేయవలసి వచ్చింది.'' కా(మేడ్ గోల్డ్‌బ్లాత్ (బుంద్ (పతినిధి)తో కా(మేడ్ యెగోరొవ్ కూడా కలిసి పొసదోవ్‌స్కీ, ప్లెహానొవ్‌ల అభి(పాయాలను సవాలు చేశాడు. దురదృష్టవశాత్తూ చర్చ ముగించబడింది, అందులో తల ఎత్తిన ఈ సమస్య వెంటనే రంగంనుంచి అంతర్ధానమైపోయింది. కాని కా(మేడ్ మార్తొవ్ లీగు మహాసభలో ఈకింది విధంగా మాట్లాడటం ద్వారా దాని (పాధాన్యతను కొంచెపర్చడానికి గాని, మొత్తం గానే నిరాకరించడానికి గాని ఇప్పుడు (పయత్నించడం నిరుపయోగం: ''ఈ మాటలు (ప్లెహా నొవ్ మాటలు) కొంతమంది (పతినిధులకు ఆ(గహం కలిగించాయి; కాని (శామికవర్గం తన విజయాన్ని సుస్థిర మొనర్చుకునేటందుకు ప(తికా స్వాతం(త్యం లాంటి రాజకీయ హక్కులను అణచివేయవలసి రావడం వంటి విషాదకర పరిస్థితిని గురించి వూహించడం అసం భవం అని కూడా కా(మేడ్ ప్లెహానొవ్ కనక అని వుంటే ఇది జరగకుండా తేలికగా తప్పించే పని.... (ప్లె హా నొ వ్ "Merci"* అన్నాడు)'' (లీగ్ మినిట్స్, పేజి 58). ఈ వ్యాఖ్యానం ''మౌలిక సమస్య''పై ''తీ(వమైన అభి(పాయభేదం,'' అనంగీకారం గురించి మహాసభలో కా(మేడ్ పొసదోవ్‌స్కీ చేసిన నిశ్చయమైన (పకటనకు సూటిగా విరుద్ధమైనది. ఈ మౌలిక సమస్యమీద, మహాసభలో ''ఇ(స్కా''వాళ్లు అందరూ ''ఇ(స్కా'' వ్యతిరేక ''మితవాద'' పక్ష (పతినిధీ (గోల్డ్‌బ్లాత్) మహాసభలో ''మధ్యస్థవర్గ'' (పతినిధీ (యెగోరొవ్) వ్యతిరేకించారు. ఇది వాస్తవం. ''మధ్యస్థవర్గం'' కనుక (ఈ మాట సాధుత్వాన్ని బలపర్చే ''ఆధికారిక'' మద్దతుదార్లకు ఇతరు లెవరి కంటె కూడా తక్కువ విస్మయం కలిగిస్తుందని ఆశిస్తాను...) ఈ సమస్యమీద గాని సదృశమైన సమస్యలమీద గాని ''నిర్బంధం లేకుండా'' (కా(మేడ్ యెగోరొవ్ నోటి ద్వారా గాని మాహొవ్ నోటి ద్వారా గాని) మాట్లాడే సందర్భం ఏర్పడివుంటే తీ(వమైన అభి(పాయభేదం వెంటనే బయట పడివుండేది.

''భాషల సమానత్వం'' విషయంపై ఇది మరింత స్పష్టంగా బైటపడింది (మినిట్స్, పేజి 171, తర్వాతి పేజీలు). ఈ అంశంమీద అంత స్పష్టంగా తెలియజేసినది చర్చ కాదు, వోటింగు: మొత్తం వోటింగు జరిగిన సందర్భాలను లెక్కిస్తే మనకి నమ్మశక్యంగాని సంఖ్య పదహారు తేలుతుంది! దేనిమీద? అందరు పౌరులకూ (స్త్రీ పురుషభేదం వగైరాలతో నిమి త్తం లేకుండా, భాషతో నిమిత్తం లేకుండా సమానత్వం వుండాలనేది కార్య(కమంలో నిబం ధన చేస్తే సరిపోతుందా లేక ''భాషా స్వాతం(త్యం'' లేక ''భాషల సమానత్వం'' అనేదానిని నిబంధన చేయడం అవసరమా అన్న విషయంమీద. లీగు మహాసభలో కా(మేడ్ మార్తొవ్

---

* ధన్యవాదాలు. — సం.

ఈ ఉదంతాన్ని ఎంతో సరిగా వర్ణించాడు. ఆయనిలా అన్నాడు: ''కార్యక్రమంలో ఒక అంశాన్ని స్వీకరించడంపై సాగిన అల్పమైన వాగ్వాదం సూత్రానికి సంబంధించిన వ్యవహారం అయింది, ఎందుచేతనంటే మహాసభలో సగ భాగం కార్యక్రమ కమిటీని కూల దోయడానికి సిద్ధమై వున్నారు.'' అల్లాగే.* సంఘర్షణకు తక్షణ కారణం నిజంగా అల్ప మైనది, అయినా అది సూత్రానికి సంబంధించిన విషయం అయింది, పర్యవసానంగా చాలా తీవ్ర రూపాలను తీసుకుంది. కార్యక్రమ కమిటీని ''కూలదోసే''టందుకు ప్రయత్నించే దశకూ, ''మహాసభను తప్పుదారిని పట్టించాలనే'' కోరిక కలిగివున్నారని కొందరిని అను మానించే దశకూ (యెగోరొవ్, మార్తొవ్‌ని అనుమానించినట్టు!), అత్యంత... నిందా పూర్వకమైన వ్యక్తిగత దూషణలకు దిగే దశకూ (పేజి 178) కూడా పోయింది. కామ్రేడ్ పొపొవ్ సహితం ''కేవలం అల్పమైన అంశాలు, మూడు సమావేశాలలో (16, 17, 18వ సమావేశాలు) ప్రబలం అయిన అలాంటి వాతావరణానికి (కిందిగీతలు నావి, పేజి 182) దారితీసినందుకు విచారాన్ని ప్రకటించాడు.''

ఈ ప్రకటనలు అన్నీ కూడా ఒక అత్యంత ముఖ్యమైన వాస్తవాన్ని ఎంతో స్పష్టం

---

*మార్తొవ్ ఇంకా ఇలా అన్నాడు: ''ఈ సందర్భంలో ప్లెహానొవ్ గాడిదలను గురించి చేసిన చతురోక్తి చాలా హాని చేసింది.'' (భాషా స్వాతంత్ర్యం గురించి చర్చ జరుగుతున్న ప్పుడు, ఒక బుంద్ అనుయాయుడు అనుకుంటాను, ఇతర సంస్థలతోపాటు గుర్రాల సంవ ర్ధన క్షేత్రాలను కూడా పేర్కొన్నాడు, దానిపై ప్లెహానొవ్ అందరికీ వినబడేలాగ ''గుర్రాలు మాట్లాడవు, కాని గాడిదలు మాత్రం ఒక్కొక్కప్పుడు మాట్లాడతాయి'' అని చమత్కరిం చాడు.) ఈ చతురోక్తిలో ప్రత్యేకించి ఏ మాత్రం మృదుత్వంగాని, ఓరిమిగాని, యుక్తిగాని, వెసులుబాటుతనంగాని నాకేమీ కనబడ్డంలేదు. కాని ఈ విషయం సూత్రానికి సంబంధిం చినది అయిందని అంగీకరించిన మార్తొవ్, ఆ సూత్రం ఏమిటో, ఇక్కడ ఎలాంటి అభి ప్రాయభేదాలు పొడసూపాయో వివరించడానికి ఎంత మాత్రం ప్రయత్నించలేదు, కాని చతురోక్తుల ''హాని'' గురించి మాట్లాడటానికి మాత్రమే పరిమితపడి వున్నాడు. ఇది నిజంగా బ్యూరాక్రటిక్, లాంఛన ప్రధాన వైఖరి! బుంద్‌వాళ్ల మీదనే గాక, ఒక్కొక్క ప్పుడు బుంద్‌వాళ్లు బలపర్చిన వారిమీద, ఓటమినుంచి కాపాడిన వారిమీద కూడా చతురో క్తులు విసరడంవల్ల ''మహాసభలో చాలా హాని కలిగిన'' మాట నిజమే. ఏమైనా, ఈ ఘటనలో సూత్రాలు ఇమిడి వున్నాయని మీరు ఒకసారి అంగీకరించిన తరువాత, మీరు కొన్ని చతురోక్తుల ''అయుక్తత''ను గురించిన పదజాలాలకు మాత్రమే పరిమితపడి వుండ కూడదు (లీగు మినిట్స్, పేజి 58).

గానూ నిశ్చయంగానూ, తెలియజేస్తాయి. అదేమిటంటే, ''అనుమాన'' వాతావరణం ఏర్ప డటమూ, సంఘర్షణ అత్యంత తీవ్ర రూపాలు (''కూలదోయడం'') తీసుకోడమూ— ఇందుకు తరువాత, లీగు మహాసభలో, ''ఇస్క్రా''వాళ్ల మెజారిటీ వర్గమే బాధ్యులని చెప్ప బడింది!—వాస్తవంగా మనం మెజారిటీగానూ, మైనారిటీగానూ చీలిపోడానికి చాలా పూర్వమే జరిగింది. ఇది అపార ప్రాముఖ్యంగల వాస్తవం అనీ, ఒక మౌలికమైన వాస్తవం అనీ దీనిని అర్థం చేసుకోలేకపోవడం చాలా మంది మహాసభ అయేసరికి మెజారిటీ అనేది కృత్రిమం అనే ఆలోచనారహితమైన నిర్ణయాలకు వచ్చేటందుకు దారితీస్తుంది. మహాసభ ప్రతినిధులలో పదింట తొమ్మిది వంతులు ''ఇస్క్రా''వాళ్లేనని నొక్కి చెప్పే కామ్రేడ్ మార్తొవ్ ప్రస్తుత దృక్పథంనుంచి, ''కేవలం అల్పవిషయాలు'' ఒక ''అల్పమైన'' కారణం ''సూత్రానికి సంబంధించిన వ్యవహారం'' అయిన సంఘర్షణకు అవకాశం కల్పించడమూ, మహాసభ కమిటీని కూలదోయడానికి దాదాపు దారితీయడమూ అన్నది పూర్తిగా అనిర్వా చ్యమూ అసంబద్ధమూ అవుతుంది. ఈ వాస్తవాన్ని ''హానికరమైన'' చతురోక్తుల గురిం చిన శోకన్నాలతోనూ, విచార ప్రకటనలతోనూ తప్పించ చూడటం హాస్యాస్పదం అవుతుంది. చతురోక్తులు విసరడం అన్నది సంఘర్షణను సూత్రానికి సంబంధించిన వ్యవహారంగా తయారుచేయదు; మహాసభలో ఏర్పడిన రాజకీయ గ్రూపింగుల లక్షణం మూలంగానే అది అటువంటి వ్యవహారం అవగలదు. వ్యాఖ్యానాలు చేయడం, చతురోక్తులు విసరడం కాదు సంఘర్షణను లేవదీసినది—మహాసభలోని రాజకీయ గ్రూపింగులోనే ''వైరుధ్యం'' వుందనీ, సంఘర్షణకు దారితీసే లక్షణాలన్నీ దానిలోనే వున్నాయనీ, ఒక అల్పమైన, అత్యంత అల్పమైన కారణం మీద సహితం, అంతర్గర్భితమైన శక్తితో బయలుపడిన ఒక ఆంతరంగిక వైజాత్య లక్షణం దానిలోనే వుందనే వాస్తవానికి అవి కేవలం ఒక చిహ్నం మాత్రమే.

తద్విరుద్ధంగా, నేను ఈ మహాసభను వేరు దృక్పథంనుంచి చూస్తున్నాను. ఘటనలకు ఒక స్పష్టమైన రాజకీయ వ్యాఖ్యానం చెప్పడం, ఆ వ్యాఖ్యానం కొంతమందికి కోపం కలి గించినా సరే, దానిని సమర్థించడం నా విధి అని అనుకుంటున్నాను. ఈ దృక్పథంనుంచి చూస్తే ఒక ''అల్పమైన'' కారణం మూలంగా ఉదయించిన సూత్రానికి సంబంధించిన తీవ్రమైన సంఘర్షణ ఎంతో స్పష్టమైనదీ తప్పని సరి అయినదీ. ''ఇస్క్రా'' అనుయా యులకూ ''ఇస్క్రా'' వ్యతిరేకులకూ మధ్య పోరాటం మన మహాసభ జరిగినంత కాలమూ సాగింది కనుకనూ, ఇద్దరి మధ్యనూ అస్థిరులైన సభ్యులు కొందరు వుండి వున్నందువల్లనూ, వారు ''ఇస్క్రా'' వ్యతిరేకులతో కలిసి మొత్తం వోట్లలో మూడో వంతు వోట్లు కలిగి వున్నారు కనుకనూ (నా అంచనా ప్రకారం 51లో $8+10=18$. ఇది సుమారుగా వేసిన అంచ నాయే అనుకోండి) చిన్న మైనారిటీ అయినా సరే ''ఇస్క్రా''వాళ్లనుంచి విడిపోవడం

''ఇస్క్రా'' వ్యతిరేక వైఖరి విజయం పొందడానికి అవకాశం కల్పించిందని అందుచేత అది ''ఆవేశంతో కూడిన'' పోరాటాన్ని రెచ్చగొట్టిందనేది పూర్తిగా స్పష్టమూ, సహజమూ. ఇది రాజకీయ సంసర్గ ఫలితమే, గాని అనుచితమైన దూషణల, దాడుల ఫలితం కాదు. రాజకీయ సంఘర్షణలకు దారితీసినది నిశితమైన వ్యాఖ్యానాలు కాదు; మహాసభలో రాజకీయ గ్రూపింగులలోనే రాజకీయ సంఘర్షణ వుండటమన్నదే దాడులకూ, దూషణలకూ దారి తీసింది — మహాసభయొక్క, దాని ఫలితాలయొక్క రాజకీయ ప్రాధాన్యాన్ని మదింపు వేయ డంలో నాకూ మార్తొవ్‌కీ మధ్య సూత్రరీత్యా వచ్చిన ముఖ్యమైన భేదాభిప్రాయాన్ని యీ తేడాయే తెల్పుతుంది.

మొత్తంమీద మహాసభలో మూడు ముఖ్యమైన సందర్భాలలో — భాషల సమానత్వం సమస్యపైన, నిబంధనావళిలో 1వ నిబంధనపైన, ఎన్నికలపైన — కొద్దిమంది ''ఇస్క్రా'' వాళ్లు మెజారిటీనుంచి వేరైపోయారు, ఈ మూడు సందర్భాలలోనూ తీవ్రమైన పోరాటం జరిగింది, చివరికది యీనాడు మన పార్టీలో మనకి వున్న తీవ్రమైన సంక్షోభానికి దారి తీసింది. ఈ సంక్షోభాన్నీ, యీ పోరాటాన్నీ రాజకీయ దృష్టితో అవగాహన చేసుకోడానికి మనం చతురోక్తుల అయుక్తతను గురించిన పదజాలాలకు మాత్రమే పరిమితపడి వుండ కూడదు, మహాసభలో ఘర్షణ పడిన రాజకీయ గ్రూపింగును పరిశీలించాలి. అందుచేత చీలిపోడానికి గల కారణాలను తెలుసుకోడానికి సంబంధించినంతవరకు ''భాషల సమానత్వం'' ఘటన మరింత ఆసక్తిదాయకమైనది అవుతుంది, ఎందుచేతనంటే, ఈ సందర్భంలో మార్తొవ్ ''ఇస్క్రా''వాడై వున్నాడు (అప్పటికీ వున్నాడు!) ''ఇస్క్రా'' వ్యతిరేకులనూ, ''మధ్యస్థవర్గా''న్నీ ఎదిరించి, బహుశా ఇతరులు ఎవరికంటెనూ కూడా గట్టిగానే పోరాడాడు.

కామ్రేడ్ మార్తొవ్‌కీ బుందిస్టుల నాయకుడు కామ్రేడ్ లీబెర్‌కీ మధ్య వాగ్వాదంతో యుద్ధం ప్రారంభమైంది (పేజీలు 171–172). ''పౌరులకు సమానత్వం'' డిమాండు చాలునని మార్తొవ్ వాదించాడు. ''భాషా స్వాతంత్ర్యం'' తోసిపుచ్చబడింది, కాని ''భాషల సమానత్వం'' వెంటనే ప్రతిపాదించబడింది, ఈ పోరాటంలో కామ్రేడ్ యెగోరొవ్, లీబెర్‌తో కలిశాడు. ''ఉపన్యాసకులు, అన్ని జాతుల ప్రజలూ సమానులే నని నొక్కిచెబుతూ అస మానత్వాన్ని భాషా రంగానికి బదలాయించడం 'మూఢారాధన,' ఈ సమస్య అందుకు పూర్తిగా భిన్నమైన దృక్కోణంనుంచి పరిశీలింపబడాలి: అదేమిటంటే, వివిధ జాతుల మధ్య అసమా నత్వం వుంది, అది బయటపడుతున్న రూపాలలో ఒకటేమిటంటే నిర్దిష్ట జాతులకు చెందిన ప్రజలకు తమ మాతృభాషను ఉపయోగించుకునే హక్కు లేకుండా చేయటం'' అని మార్తొవ్ ప్రకటించాడు (పేజి 172). ఈ విషయంలో మార్తొవ్ చెప్పినది పూర్తిగా

సరి అయినది: తమ సూత్రీకరణ సరి అయినదేనని నొక్కిచెప్పడానికీ, మనం జాతుల సమానత్వ సూత్రాన్ని బలపర్చడానికి అయిష్టంగా వున్నామని లేక ఆ పని చేయలేకపోతున్నామని చూపడానికీ లీబెర్, యెగోరొవ్‌లు చేసిన కేవల నిరాధారమైన ప్రయత్నం నిజంగా ఒక రకమైన మూఢారాధనే. వాస్తవంగా ''మూఢ ఆరాధకుల'' లాగనే వున్నారు, సూత్రాన్ని గాక మాటను సమర్ధిస్తున్నారు, సూత్రానికి సంబంధించిన పొరపాటు చేస్తామేమో ననే భయంతో గాక ఇతరులు ఏమంటారో ననే భయంతో వ్యవహరించారు. ఈ పిరికి మనస్తత్వం (''ఇతరులు'' దీనికి మనల్ని నిందిస్తే ఏమిటి?) — దీనిని గురించి ఆర్గనైజింగు కమిటీ ఘటన సందర్భంగా మనం ఇదివరకే గమనించాం — ఈ సందర్భంలో మన ''మధ్యస్థ వర్గం'' అంతటిచేతా ఎంతో స్పష్టంగా ప్రదర్శింపబడింది. దాని తరఫునే మాట్లాడిన మరొకడూ, ''యూజ్నీ రబోచీ''కి సన్నిహితుడూ, గనుల ప్రాంతం ప్రతినిధీ అయిన ల్వోవ్ ఇలా ప్రకటించాడు: ''సరిహద్దు జిల్లాలచే లేవనెత్తబడిన భాషల అణచివేత సమస్య చాలా గంభీరమైనది. మన కార్యక్రమంలో భాష గురించిన అంశం చేర్చడం, ఆవిధంగా అందరి మీదా రష్యను భాషను రుద్దే ధోరణులు సోషల్ డెమోక్రట్లకు వున్నాయని అనుమానించడానికి ఎలాంటి అవకాశమూ లేకుండా చేయడం ముఖ్యం.'' ఇది ఈ సమస్యకున్న ''గంభీర స్వభావం'' గురించిన ఒక అసాధారణమైన వివరణ. సరిహద్దు జిల్లాల వారికి కలగగల అనుమానాలు తొలగింపబడి తీరాలి గనుక ఇది చాలా తీవ్రమైనది! ఈ ఉపన్యాసకుడు సమస్య సారాంశాన్ని గురించి ఏమీ చెప్పలేదు, మూఢారాధన అనే అభియోగాన్ని ఖండించలేదు సరికదా, దానిని పూర్తిగా ధృవపర్చాడు, ఎందుచేతనంటే అతనికి తన స్వంత వాదాలు ఏమీ లేవు, సరిహద్దు జిల్లాలు ఏమి చెప్పవచ్చునో కేవలం దానిని గురించే మాట్లాడాడు. వాళ్లు ఏమి చెప్పవచ్చునో, అది నిజంకాదని — ఆయనకి చెప్పారు. కాని అది నిజమా కాదా అని పరిశీలించడానికి బదులు ''వారు అనుమానించవచ్చు'' అని ఆయన సమాధానం చెప్పాడు.

సమస్యను ఆవిధంగా నిర్వచించడమూ, దానితో పాటు అది గంభీరమైనదీ ముఖ్యమైనదీ అని వాదించడమూ నిజంగా సిద్ధాంతానికి సంబంధించిన ప్రశ్నను లేవదీస్తాయి, అయితే అది లీబెర్‌లూ, యెగోరొవ్‌లూ, ల్వోవ్‌లూ అందులో చూసేది ఎంత మాత్రం కాదు. అందులో ఇమిడి వున్న సూత్రం ఇది: కార్యక్రమానికి సంబంధించిన సాధారణ, మౌలిక సిద్ధాంతాలను వారి ప్రత్యేక పరిస్థితులకు అన్వయించుకునేటందుకూ అలా అన్వయించుకునేటందుకోసం అభివృద్ధిపరచేటందుకూ పార్టీ శాఖలకూ, పార్టీ సభ్యులకూ వదలివేయడమా లేక కేవలం మనలను అనుమానిస్తారేమోనన్న భయంతో మనమే కార్యక్రమాన్ని చిన్నచిన్న వివరాలతోనూ, సూక్ష్మమైన అంశాలతోనూ, పునశ్చరణలతోనూ, కుతర్కాలతోనూ నింపడమా? ఇందులో ఇమిడివున్న ప్రశ్న ఇది: కుతర్కాలకు వ్యతిరేకంగా

సాగే పోరాటంలో ప్రాథమిక ప్రజాస్వామిక హక్కులనూ స్వాతంత్ర్యాలనూ పరిమిత పర్చే ప్రయత్నాన్ని సోషల్ డెమోక్రట్లు ఎలా కనుగొన ("అనుమానించ") గలరు? మనం ఎట్టకేలకు యీ కుతర్క మూఢ ఆరాధననుండి బైటపడేది ఎప్పుడు? — "భాషల"పై సాగిన పోరాటాన్ని పరికించుతున్నప్పుడు మాకు వచ్చిన ఆలోచన అదీ.

ఈ పోరాటంలో జరిగిన ప్రతినిధుల గ్రూపింగు ప్రత్యేకించి పేరు పేరు వరుసనా పిల్చిన పుష్కలమైన వోటింగుల ద్వారా స్పష్టమైంది. అలాంటి వోటింగులు మూడు సార్లు జరిగాయి. అన్ని సార్లూ కూడా "ఇస్క్రా" ముఖ్య భాగం "ఇస్క్రా" వ్యతిరేకులచేతనూ (8 వోట్లు), అతి స్వల్పమైన హెచ్చుతగ్గులతో మధ్యస్థవర్గం అంతటిచేతనూ గట్టిగా వ్యతిరేకించబడింది. (మధ్యస్థవర్గం అంటే మాహొవ్, ల్వోవ్, యెగోరొవ్, పొపొవ్, మెద్వేదెవ్, ఇవనోవ్, త్సర్యోవ్, బెలోవ్ — వీరిలో చివరి ఇద్దరూ మొదట్లో వూగిసలాడారు, ఒక సారి వోటింగులో పాల్గొనకుండానూ, మరో సారి మాకు వోటు చేసివున్నారు, మూడో సారి జరిగిన వోటింగులో మాత్రమే వారి వైఖరి పూర్తిగా స్పష్టపడింది.) "ఇస్క్రా" వాళ్లల్లో కొందరు వేరైపోయారు — ముఖ్యంగా కకేసియన్లు (ఆరు వోట్లతో ముగ్గురు) — దీని మూలంగా "**మూఢారాధన**" ధోరణిది పైచేయి అయింది. మూడో వోటింగులో, రెండు ధోరణుల అనుచరులూ తమ వైఖరిని ఎంతో స్పష్టంగా బైటపెట్టినప్పుడు, ఆరు వోట్లున్న ముగ్గురు కకేసియన్లూ మెజారిటీ "ఇస్క్రా"వాళ్లనుంచి వేరై రెండో పక్షంలో చేరారు; ఇద్దరు ప్రతినిధులు — పొసదోవ్‌స్కీ, కోస్తిచ్ — రెండు వోట్లతో, మైనారిటీ "ఇస్క్రా" వాళ్లనుండి విడిపోయారు. మొదటి రెండు వోటింగులలోనూ ఈకింది వారు రెండో పక్షానికి పోయారు లేదా వోటింగులో పాల్గొనకుండా వున్నారు. "ఇస్క్రా"వాళ్ల మెజారిటీకి చెందిన లెన్‌స్కీ, స్తెపొనొవ్, గోర్‌స్కీ, మైనారిటీకి చెందిన డేయిచ్. "ఇస్క్రా"వాళ్లకున్న మొత్తం ముప్ఫయి మూడు వోట్లలోనూ ఎనిమిది విడిపోడం మూలంగా "ఇస్క్రా" వ్యతిరేకుల, అస్థిర సభ్యుల మిశ్రమ పక్షానికి ఆధిక్యత వచ్చింది. మహాసభ గ్రూపింగులో సరిగ్గా ఈ మౌలికమైన వాస్తవమే నిబంధనావళి మొదటి నిబంధనపై జరిగిన వోటింగులోనూ ఎన్నికలలోనూ (ఇతర "ఇస్క్రా"వాళ్లు విడిపోవడంతో మాత్రమే) పునరావృతం అయింది. ఎన్నికలలో ఓడిపోయిన వారు తమ వోటమికి, అస్థిరమైన, రాజకీయంగా బలహీనులు అయిన సభ్యులను బైటపెట్టిన, పార్టీ దృష్టిలో వారిని మరింత నిర్దయాత్మకంగా బట్టబయలు చేసిన అభిప్రాయభేదాల ఘర్షణ ఎక్కడ ఆరంభం అయిందో దానికి గల రాజకీయ కారణాలను చూడకుండా ఇప్పుడు జాగ్రత్తగా కళ్లు మూసుకోడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. సందర్భ వశాత్తూ భాషల సమానత్వం ఘటన ఈ సంఘర్షణను మరింత స్పష్టంగా చూపుతోంది, ఎందుకంటే అప్పుడు కామ్రేడ్ మార్తొవ్ ఇంకా అకీమొవ్, మాహొవ్‌ల ప్రశంసలనూ ఆమోదాన్నీ పొంది వుండలేదు.

# ఊ) వ్యవసాయ కార్యక్రమం[13]

''ఇస్క్రా'' వ్యతిరేకుల, ''మధ్యస్థవర్గీ''యుల సూత్ర విషయిక అస్థిరత, వ్యవసాయ కార్యక్రమంపై జరిగిన చర్చలో కూడా స్పష్టంగా బైటపడింది. ఈ చర్చ మహాసభలో చాలా సేపు జరిగి (మినిట్స్, పేజీలు 190–226), ఎంతో ఆసక్తిదాయకమైన అనేక అంశాలను లేవనెత్తింది. అనుకున్న విధంగానే, కార్యక్రమానికి వ్యతిరేకంగా కామ్రేడ్ మర్తీనొవ్ దాడి ప్రారంభించాడు (కామ్రేడ్స్ లీబెర్, యెగోరొవ్‌ల కొన్ని చిన్న వ్యాఖ్యల తరువాత). ''ఈ ప్రత్యేక చారిత్రక అన్యాయాన్ని'' నివారించడం గురించి పాత వాదాన్నే ఆయన తీసుకువచ్చాడు, అందుమూలంగా మనం పరోక్షంగా ''ఇతర చారిత్రక అన్యాయాలకు పవిత్రతను కలుగజేస్తూ వున్నామ''ని ఇంకా ఏమేమో వాదించాడు. కామ్రేడ్ యెగోరొవ్ ఆయనకి జతకలిశాడు, ఆయనకి ''ఈ కార్యక్రమ ప్రాముఖ్యం స్పష్టంగా లేదు. ఈ కార్యక్రమం మన కోసమేనా అంటే, అది మన డిమాండులను నిర్వచిస్తోందా లేక మనం దానిని జనసమ్మతమైనదిగా చేయగోరుతున్నామా?'' (!?!?) కామ్రేడ్ లీబెర్ తాను కూడా ''కామ్రేడ్ యెగోరొవ్ చెప్పిన అంశాలనే చెప్ప దల్చుకున్నట్టు'' చెప్పాడు. కామ్రేడ్ మాహొవ్ తన మామూలు నిశ్చయాత్మక ధోరణిలో మాట్లాడాడు, ''ప్రతిపాదించబడిన కార్యక్రమం అర్థం ఏమిటో దాని లక్ష్యాలు ఏమిటో, ఇక్కడ ప్రసంగించిన వారిలో అధిక సంఖ్యాకులు (?) నిశ్చయంగా అవగాహన చేసుకోలేరు'' అని ప్రకటించాడు. ప్రతిపాదించబడిన కార్యక్రమం, ''సోషల్ డెమోక్రటిక్ వ్యవసాయ కార్యక్రమంగా ఎంత మాత్రం పరిగణింపబడజాలదు;'' అది ''చారిత్రక అన్యాయాలను నివారించడం లాంటి ఒక ఆటలా వుంది;'' దానిలో ''వాగాడంబరపు, దుస్సాహసికపు ధోరణులున్నాయి.'' ఈ పాండిత్యానికి ఒక సైద్ధాంతిక సమర్థనగా, వక్రీకరింపబడిన మార్క్సిజానికి ఎంతో మామూలు అయిన అతిశయ చిత్రణ అతి సూక్ష్మీకరణ వచ్చాయి: ''ఇస్క్రా''వాళ్ళు ''రైతులను ఒక సమరూప సమ్మేళనంగా పరిగణించగోరుతున్నార''ట. ''కాని రైతాంగం చాల కాలం క్రితమే (?) వర్గాలుగా చీలిపోయింది గనుక ఒకే కార్యక్రమాన్ని ప్రతిపాదించడం తప్పనిసరిగా మొత్తం కార్యక్రమాన్ని వాగాడంబరమైనది గానూ, ఆచరణలో పెట్టినప్పుడు దుస్సాహసికమైనది గానూ తయారు చేస్తుంద''ని కామ్రేడ్ మార్తొవ్ చెప్పాడు (పేజి 202). ఈ సందర్భంలో కామ్రేడ్ మాహొవ్, ''ఇస్క్రా''ను ''గుర్తించడానికి'' సిద్ధపడుతూ, అయినా దాని ధోరణిని, సైద్ధాంతిక, వ్యూహాత్మక స్థానాన్నీ అవగాహన చేసుకోడంలో (మాహొవ్ చేసినట్టుగానే) పూర్తిగా విఫలురైన చాలా మంది సోషల్ డెమోక్రట్లు మన వ్యవసాయ కార్యక్రమాన్ని ఆమోదించకపోవడానికి గల అసలు కారణాన్ని ''బయటపెట్టాడు.'' ఈ కార్యక్రమాన్ని

అర్థంచేసుకోడంలో వైఫల్యానికి ఇదివరకూ ఇప్పుడూ కూడా కారణం నేటి రష్యన్ రైతాంగ ఆర్థిక వ్యవస్థ లాంటి ఎంతో సంక్లిష్టమైన, బహుముఖమైన విషయానికి సంబంధించి నంత వరకు మార్క్సిజాన్ని వక్రీకింపజేయడమే గాని వివరాల విషయంలో అభిప్రాయభేదాలు కాదు. ఈ వక్రీకింపబడిన మార్క్సిజం దృక్పథంనుంచి ''ఇస్క్రా'' వ్యతిరేకవర్గాల నాయ కులూ (లీబెర్, మర్తీనొవ్), ''మధ్యస్థవర్గ'' నాయకులూ (యెగోరొవ్, మాహొవ్) వెంటనే సామరస్యం పొందారు. కామ్రేడ్ యెగోరొవ్ ''యూజ్నీ రబోచీ,'' దాని వైపుకు మొగ్గుతున్న గ్రూపుల, బృందాల విశిష్ట లక్షణాలలో ఒక దానిని గురించి, అంటే, రైతు ఉద్యమ ప్రాముఖ్యతను అర్థంచేసుకోడంలో వారి వైఫల్యాన్ని, ప్రసిద్ధి చెందిన తొలి రైతు తిరుగు బాట్ల కాలంలో మన సోషల్ డెమోక్రట్ల బలహీనత దాని గురించి ఎక్కువ అంచనా వేయడం కాక, తద్భిన్నంగా దాని ప్రాముఖ్యతను తక్కువ అంచనా వేయడం (దానిని ఉప యోగించుకునే శక్తులు లేకపోవడము) మాత్రమేనని అర్థం చేసుకోడంలో వారి వైఫల్యాన్ని కూడా దాపరికం లేకుండా వెల్లడించాడు. కామ్రేడ్ యెగోరొవ్ ఇలా అన్నాడు: ''రైతు ఉద్యమం పట్ల సంపాదకవర్గం పొందిన వ్యామోహంలో నేను ఎంత మాత్రం పాలు పంచు కోను. రైతుల ఆందోళన ప్రారంభం అయినప్పటినుంచీ చాలా మంది సోషల్ డెమోక్రట్లు ఆ వ్యామోహానికి గురి అయారు.'' కాని, దురదృష్టవశాత్తూ, కామ్రేడ్ యెగోరొవ్ సంపా దకవర్గానికి వున్న వ్యామోహం దేనిలో వుందో మహాసభకు ఖచ్చితంగా చెప్పడానికి ప్రయత్నించ లేదు, ''ఇస్క్రా''లో ప్రచురింపబడిన వాటిని వేటినీ స్పష్టంగా ఉదహరించడానికి ప్రయత్నించలేదు. అంతే కాదు, రైతు ఆందోళనలకు చాలా పూర్వమే ''ఇస్క్రా'' పత్రిక తన మూడవ సంచికలోనే మన వ్యవసాయ కార్యక్రమంలోని అన్ని ప్రధాన అంశాలనూ వివ రించిందని ఆయన మర్చిపోయాడు. ''ఇస్క్రా''కు తమ ''గుర్తింపు'' కేవలం మాటలలో మాత్రమే కానివారు, దాని సైద్ధాంతిక, యెత్తుగడల సూత్రాల పట్ల మరికొంచెం శ్రద్ధ వహించివుండవలసింది!

''లేదు, రైతుల మధ్య మనం ఎక్కువ పని చేయలేము!'' అని కామ్రేడ్ యెగోరొవ్ ప్రకటించాడు. అంతే గాక, ఈ ప్రకటన ప్రత్యేకించి ఏ ''వ్యామోహాని''కీ అసమ్మతిగా ఉద్దేశింపబడినది కాదనీ, మొత్తం మన వైఖరికే నిరాకరణ అనీ సూచించాడు: ''దీని అర్థం ఏమిటంటే, మన నినాదం దుస్సాహసికుల నినాదంతో పోటీ చేయజాలదు'' అని అన్నాడు. అన్నిటినీ వివిధ పార్టీల నినాదాల మధ్య ''పోటీ'' స్థితికి తగ్గించి వేసే నీతినియమ రహిత వైఖరికి మిక్కిలి స్వభావసిద్ధమైన సూత్రీకరణ! పైగా ఇది, సైద్ధాంతిక వివరణలతో తాను ''సంతృప్తి చెందాన''ని ఆయన ప్రకటించిన తరువాత చెప్పిన మాట: ఆ వివరణలు, తాత్కాలిక అపజయాలకు దిగ్భ్రమ చెందకుండా మన ప్రచారాందోళనలో సుస్థిర విజయం

సాధించేటందుకు మనం ప్రయత్నించామనీ, కార్యక్రమానికి ఒక గట్టి సైద్ధాంతిక పునాది లేనిదే (కొద్ది కాలం... మన ''పోటీదార్ల'' గోలకు వ్యతిరేకంగా) సుస్థిర విజయం సాధించడం అసంభవం అనీ పేర్కొన్నాయి (పేజి 196). ''సంతృప్తి చెందాన''నే యీ అభయంతోపాటు పాత ఆర్థికవాదంనుంచి సంక్రమించిన వక్రనీతి సూత్రాలను వల్లించడంలో ఎంత గందరగోళం వెల్లడి అయింది; ఆర్థికవాదం ప్రకారం ''నినాదాల పోటీయే'' అన్నిటినీ – వ్యవసాయ సమస్యలనే గాక ఆర్థిక, రాజకీయ పోరాటపు యావత్తు కార్యక్రమాన్నీ ఎత్తుగడలనూ నిర్ణయిస్తుంది. కామ్రేడ్ యెగోరొవ్ ఇలా అన్నాడు: ''చీల్చివేయబడిన పొలాల'' కోసం – ఇప్పుడు చాలా భాగం ధనిక రైతుల చేతులలో వున్నవాటి కోసం – ధనిక రైతులతోపాటు వ్యవసాయ కూలీలను మీరు పోరాడేటట్లు చేయజాలరు.''

అందులో కూడా సూక్ష్మీకరణ, నిస్సందేహంగా మన అవకాశవాద ఆర్థికవాదానికి సంబంధించినది, మనకి కనబడుతుంది. అది చాలవరకు బూర్జువా చేతులలో వున్న, భవిష్యత్తులో ఇంకా ఎక్కువగా తమ చేతులలోకి పోయే దాని కోసం శ్రామికవర్గాన్ని పోరాడేటట్లు ''చేయడం'' అసంభవం అని నొక్కిచెప్పింది. అందులో మళ్లీ అదే వక్రీకరణ మనకి కనిపిస్తుంది. అది వ్యవసాయ కూలీలకూ ధనిక రైతులకూ మధ్య వున్న సాధారణ పెట్టుబడిదారీ సంబంధాలలోని రష్యన్ విశిష్టతలను విస్మరిస్తోంది. వాస్తవంగా, చీల్చివేయబడిన పొలాలు యీనాడు వ్యవసాయ కూలీలను కూడా పీడిస్తున్నాయి, వారిని తమ దాస్యంనుంచి విముక్తి కోసం పోరాడేటట్లు ''చేయవలసిన'' అవసరం వేరే లేదు. కొంతమంది మేధావులనే పోరాడేటట్లు ''చేయవలసి'' వుంది – తమ కర్తవ్యాలను మరింత విశాల దృక్పథంతో చూసేటట్లు చేయవలసి వుంది, నిర్ణీతమైన సమస్యలను చర్చించేటప్పుడు మారని ఒకే మాదిరి సూత్రాలను విడిచిపెట్టేటట్లు చేయవలసి వుంది, మన లక్ష్యాలను సంక్లిష్టంచేసి దిద్దుబాటు చేసే చారిత్రక పరిస్థితిని పరిగణనలోకి తీసుకొనేటట్లు చేయవలసి వుంది. రష్యన్ రైతు తెలివి తక్కువవాడు అనుకోడం కేవలం మూఢనమ్మకమే – కామ్రేడ్ మార్తొవ్ సరిగానే వ్యాఖ్యానించినట్లుగా (పేజి 202) వ్యవసాయ కార్యక్రమాన్ని వ్యతిరేకించిన కామ్రేడ్ మాహొవ్ ప్రసంగంలోనూ, తదితరుల ప్రసంగాల్లోనూ ఈ మూఢనమ్మకం కనిపిస్తుంది – ఈ మూఢనమ్మకం మూలంగానే వీరు మన వ్యవసాయ కూలీల వాస్తవ జీవిత పరిస్థితులను మరచిపోతున్నారు.

ఈ సమస్యను కార్మికునికీ పెట్టుబడిదారునికీ మధ్య వుండే నగ్నమైన వ్యత్యాసంగా సూక్ష్మీకరిస్తూ మన ''మధ్యస్థవర్గ'' ప్రతినిధులు, తరచుగా చేస్తున్నట్లే, తమ సంకుచిత మనస్తత్వాన్నే రైతుకు ఆరోపించచూస్తున్నారు. కామ్రేడ్ మాహొవ్ యిలా అన్నాడు: ''రష్యన్ రైతు తన సంకుచితమైన వర్గ దృక్పథం పరిధులలో తెలివిగల వాడు అని నేను పరిగణిం

చుతున్నందువల్లనే అతడు పెటీబూర్జువా ఆశయమైన కైవసం చేసుకోడం, పంచడం అనే దానికి నిలబడతాడని నమ్ముతున్నాను.'' ఇక్కడ రెండు విషయాలు తారుమారు చేయ బడ్డట్టు స్పష్టం అవుతోంది: రైతు వర్గ దృక్పథాన్ని పెటీబూర్జువావర్గ దృక్పథంగా నిర్వ చించడం, ఈ దృక్పథాన్ని ''సంకుచిత పరిధుల''కు పరిమితపర్చడం. యెగోరొవ్‌లూ, మాహొవ్‌లూ చేసిన తప్పు ఈ తగ్గింపులోనే వుంది (ఇది శ్రామికవర్గ దృక్పథాన్ని ''సంకు చిత పరిధుల''లోకి తగ్గించడంలో మర్తీనొవ్‌లూ అకీమొవ్‌లూ చేసిన తప్పు లాంటిదే). పెటీబూర్జువావర్గం ద్వంద్వ ప్రతిపత్తిని కలిగివున్నందువల్లనే పెటీబూర్జువావర్గ దృక్పథం కొద్దో గొప్పో సంకుచితమైనదిగానూ, కొద్దో గొప్పో అభ్యుదయకరమైనదిగానూ వుండ వచ్చునని తర్కమూ, చరిత్రా మనకు నేర్పుతున్నాయి. రైతుయొక్క సంకుచితత్వం (''తెలివి తక్కువతనం'') మూలంగానూ లేదా అతడు ''దురభిప్రాయాల''చే నడపబడుతూ వుంటాడు కనుకనూ మనం నిరాశతో చేతులు ముడుచుకుని కూర్చోకుండా అతని దృక్పథాన్ని విస్తృత పర్చడానికీ, దురభిప్రాయాలపై వివేకం విజయం పొందేటట్లు సహాయపడడానికీ నిర్విరా మంగా కృషిచేయాలి.

రష్యన్ వ్యవసాయ సమస్యపై వక్రీకరింపబడిన ''మార్క్సిస్టు'' దృక్పథం కామ్రేడ్ మాహొవ్ ఉపన్యాసం ముగింపు మాటలలో పరాకాష్ఠ చెందింది. అందులో పాత ''ఇస్క్రా'' సంపాదకవర్గానికి విశ్వాసపాత్రుడైన ఈ సమర్థకుడు తన సూత్రాలను వివరించాడు. ఈ మాటలకు హర్షధ్వనులు వూరికే రాలేదు.... అవి వ్యంగ్యంతో కూడిన హర్షధ్వనులన్న మాట నిజం. సాధారణ పునఃపంపకం[14] కోసం సాగే ఉద్యమానికి. మేము ఎంత మాత్రం ఆందోళన చెందడం లేదనీ, ఈ అభ్యుదయకర (బూర్జువా అభ్యుదయకర) ఉద్యమాన్ని ఆటంకపర్చే వాళ్లుగా వుండమనీ ప్లెహానొవ్ చేసిన ప్రకటనకు ఆగ్రహం చెంది కామ్రేడ్ మాహొవ్ యిలా అన్నాడు: ''ఉపద్రవాన్ని ఏమని పిలవాలో నాకు తెలియదనుకోండి, కాని ఈ విప్లవం, దీనిని అలా పిలవవచ్చుననుకుంటే, విప్లవాత్మకమైనదిగా వుండదు. దీనిని విప్లవం అని కాక అభివృద్ధినిరోధకత్వం అని (నవ్వు), ఎక్కువగా అల్లరిని పోలిన విప్లవం అని అనడం మరింత సరిగా వుంటుంది.... అలాంటి విప్లవం మనలను వెనక్కి నెట్టుతుంది, నేడు మనం వున్న స్థితికి తిరిగి రావాలంటే కొంత కాలం పడుతుంది. ఈ నాడు మనం ఫ్రెంచి విప్లవ కాలం నాటికంటె చాలా మెరుగుగా వున్నాం (వ్యంగ్యంతో కూడిన హర్ష ధ్వనులు), మనకి ఒక సోషల్ డెమోక్రటిక్ పార్టీ వుంది (నవ్వు)....'' ఔను, మాహొవ్ లాగ వాదించిన లేక మాహొవ్ ప్రోద్బలంతో ఏర్పడిన కేంద్ర సంస్థలను కలిగి వున్న సోషల్ డెమోక్రటిక్ పార్టీ నిజంగా పరిహసింపబడటానికే అర్హమై వుంటుంది....

ఆవిధంగా వ్యవసాయ కార్యక్రమం లేవనెత్తిన కేవల సైద్ధాంతిక సమస్యలపై సహితం,

ఇదివరకే మనకి పరిచయం అయివున్న గ్రూపింగు వెంటనే బయటపడింది. ''ఇస్క్రా'' వ్యతిరేకులు (ఎనిమిది వోట్లు) వక్రీకరింపబడిన మార్క్సిజం తరఫున జగడంలోకి దిగారు, ''మధ్యస్థవర్గ'' నాయకులూ, యెగోరొవ్‌లూ, మాహొవ్‌లూ నిరంతరం పొరపాట్లు చేస్తూ దోవతప్పి అదే సంకుచిత దృక్పథంలోకి పోతూ వారిని అనుసరించారు. అందుచేత, వ్యవసాయ కార్యక్రమంలోని కొన్ని అంశాలమీద జరిగిన వోటింగులో అనుకూలంగా ముప్ఫయి — ముప్ఫయి అయిదు వోట్లు రావడం (పేజీలు 225, 226) ఎంతో సహజం, అంటే, ఎజెండాలో బుంద్ సమస్యయొక్క స్థానం గురించి జరిగిన వివాదంలోనూ, ఆర్గనైజింగు కమిటీ ఘటనలోనూ, ''యూజ్నీ రబోచీ'' గ్రూపును రద్దుచేసే విషయంలోనూ మనం చూసినట్టుగా అదే సంఖ్య వోట్లు పడ్డాయి. ఇదివరకే స్థిరపడివున్న అలవాటైన సరళిలోకి పూర్తిగా రానిది, విశిష్టమైన నూతనమైన (జర్మన్‌లకు కొత్తది) సామాజిక ఆర్థిక సంబంధాలకు మార్క్సు సిద్ధాంతాన్ని స్వతంత్రంగా అన్వయింపజేయవలసిన సమస్య తలెత్తవలసివస్తే, ఆ సమస్యల పరిష్కారానికి తగినవారని రుజువు అయిన ''ఇస్క్రా''వాళ్లకు అయిదింట మూడు వంతుల వోట్లు మాత్రమే వచ్చాయి, ''మధ్యస్థవర్గం'' యావత్తూ అటు తిరిగి లీబెర్‌లనూ, మర్తీనొవ్‌లనూ అనుసరించింది. అయినా కామ్రేడ్ మార్తొవ్ అభిప్రాయభేదాలను స్పష్టంగా బైటపెట్టిన వోటులను గురించి ఏమీ పేర్కొనకుండా భయంతో తప్పించుకుంటూ స్పష్టంగా కనబడే యీ వాస్తవాన్ని మరుగుపరచడానికి ప్రయత్నిస్తున్నాడు!

వ్యవసాయ కార్యక్రమంపై జరిగిన చర్చను బట్టి ''ఇస్క్రా''వాళ్లు మహాసభ ప్రతినిధులలో అయిదింట రెండు వంతుల మందిని ఎదిరించి పోరాడవలసివచ్చిందని స్పష్టం అయింది. ఈ సమస్యమీద కకేసియన్ ప్రతినిధులు పూర్తిగా సరి అయిన వైఖరిని అవలంబించారు — ఇది చాలవరకు, తమ ప్రాంతాలలో ఫ్యూడలిజంయొక్క అనేక అవశేషాలు తీసుకున్న రూపాలను గురించి వారికి స్వయంగా తెలిసివుండటంవల్ల మాహొవ్‌లను సంతృప్తిపరచిన బడిపిల్లకాయతత్వపు నగ్నమైన తారతమ్య నిర్వచననుంచి వారిని దూరంగా వుంచిందేమో. మర్తీనొవ్‌నూ, లీబెర్‌నూ, మాహొవ్‌నూ, యెగోరొవ్‌నూ, ప్లెహానొవ్, గూసెవ్ (ఈయన, ''రష్యాలో పని చేస్తున్న కామ్రేడ్స్‌లో'' కామ్రేడ్ యెగోరొవ్ నిరాశావాదం మాదిరిగా ''గ్రామీణ ప్రాంతాలలో మన పనిని గురించి వున్న నిరాశావాద దృక్పథాన్ని తరచుగా ఎదుర్కొంటు''న్నట్టు ప్రకటించాడు), కొస్త్రొవ్, కార్‌స్కీ, ట్రాట్‌స్కీ ఎదిరించారు. వ్యవసాయ కార్యక్రమ విమర్శకులు ''సదుద్దేశంతో ఇచ్చిన సలహాలో కూపస్థమండూకత్వం ఎక్కువగా కనిపిస్తున్నట్టు'' ట్రాట్‌స్కీ సరిగానే వ్యాఖ్యానించాడు. అయితే, ఒక విషయం మాత్రం చెప్పాలి, మనం మహాసభలో రాజకీయ గ్రూపింగును పరిశీలిస్తున్నాం

కనుక, ఆయన తన ఉపన్యాసంలోని యీ భాగంలో (పేజి 208) కామ్రేడ్ లాంగెని యెగో రొవ్‌తోనూ, మాహొవ్‌తోనూ జతపర్చడం ఎంత మాత్రం సరి కాదు. మినిట్స్‌ను శ్రద్ధగా చదివినవారెవరైనా యెగొరొవ్, మాహొవ్‌లకంటె లాంగె, గోరిన్‌లు భిన్న వైఖరిని అవలం బించారని చూస్తారు. లాంగె, గోరిన్‌లు చీల్చివేయబడిన పొలాల విషయంపై చేయబడిన సూత్రీకరణను ఒప్పుకోలేదు; వారు మన వ్యవసాయ కార్యక్రమంయొక్క భావాన్ని పూర్తిగా అర్థం చేసుకున్నారు, కాని దానిని మరో విధంగా ఆచరణలో అన్వయించడానికి ప్రయత్నిం చారు, మరింత దోషరహితమైనది అని తాము భావించిన సూత్రీకరణను కనుగొనడానికి నిర్మాణాత్మకంగా కృషి చేశారు, కార్యక్రమ రచయితలను ఒప్పించడానికి లేదా ''ఇస్క్రా'' వాళ్ళు కానివారి అందరికీ వ్యతిరేకంగా కార్యక్రమ రచయితలను బలపర్చడానికీ తమ తీర్మా నాలను ప్రవేశపెట్టారు. మాహొవ్ వైఖరికీ లాంగె వైఖరికీ మధ్య నున్న మౌలిక భేదాన్ని గురించి నమ్మకం కుదిరేటందుకు, వ్యవసాయ కార్యక్రమాన్ని మొత్తంగా తోసిపుచ్చమని మాహొవ్ ప్రవేశపెట్టిన తీర్మానాలనూ (పేజి 212: దానికి అనుకూలంగా తొమ్మిది వోట్లు, వ్యతిరేకంగా ముప్ఫయి ఎనిమిది వోట్లు పడ్డాయి) లేదా విడివిడి అంశాలనూ (పేజి 216, వగైరా) చీల్చివేయబడిన పొలాల విషయంపై తన స్వంత సూత్రీకరణను ప్రవేశపెట్టిన లాంగె వైఖరితో (పేజి 225) పోల్చి చూస్తే చాలు.*

కూపస్థమండూకత్వం కనిపిస్తున్న వాదనలను గురించి ప్రస్తావిస్తూ కామ్రేడ్ ట్రాట్స్కీ ''ఆసన్నమౌతున్న విప్లవ కాలంలో మనం రైతాంగంతో సంబంధం పెట్టుకో వాలి'' అని చెప్పాడు. ''ఈ కర్తవ్య నిర్వహణలో మాహొవ్, యెగొరొవ్‌ల సందేహతత్వమూ రాజకీయ 'దూరదృష్టి' ఏ హ్రస్వదృష్టి కంటే కూడా ఎక్కువ హానికరం'' అన్నాడు. మరో మైనారిటీ ''ఇస్క్రా''వాడైన కామ్రేడ్ కోస్త్రిచ్ తన ప్రసంగంలో, కామ్రేడ్ మాహొవ్‌కు ''తనమీద తనకే గాని, తన సూత్రబద్ధ నిలకడమీద గాని విశ్వాసం లేక పోవడాన్ని'' చాలా చక్కగా పేర్కొన్నాడు — ఈ వర్ణన మన ''మధ్యస్థవర్గా''నికి సరిగ్గా వర్తిస్తుంది. కామ్రేడ్ కోస్త్రిచ్ ఇంకా ఇలా అన్నాడు: ''అభిప్రాయభేదాలు వున్నప్పటికీ కామ్రేడ్ మాహొవ్ తన నిరాశావాదంలో కామ్రేడ్ యెగొరొవ్‌తో కలిశాడు. సోషల్ డెమోక్రట్లు ఇదివరకే రైతాంగంలో పనిచేస్తున్నారనీ, సాధ్యమైనంతవరకు దాని ఉద్యమాన్ని నడుపుతున్నారనీ అతడు మరచిపోతున్నాడు. ఈ నిరాశావాదం మన పనికున్న అవకాశాన్ని సంకుచితపరుస్తుంది'' (పేజి 210).

కార్యక్రమం గురించి మహాసభ చర్చ పరిశీలనను ముగించడానికి ముందు ప్రతిపక్ష ధోరణులను బలపర్చడం విషయంమీద జరిగిన క్లుప్తమైన చర్చను గురించి చెప్పడం అవ

* చూ: గోరిన్ ప్రసంగం, పేజి 213.

సరం. ''రష్యాలో ప్రస్తుతం వున్న సామాజిక రాజకీయ వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్దేశించ బడిన ప్రతిపక్షీయుల ప్రతి ఉద్యమాన్నీ, విప్లవోద్యమాన్నీ'' సోషల్ డెమోక్రటిక్ పార్టీ బలపరుస్తుందని మన కార్యక్రమం స్పష్టంగా చెబుతోంది. ''రాజకీయ'' అనే పదం, మనం సరిగ్గా ఎలాంటి ప్రతిపక్ష ధోరణులను బలపరుస్తున్నామో స్పష్టం చేసిందని ఎవరైనా అనుకుంటారు. అయినప్పటికీ, మన పార్టీలో చాలా కాలం క్రితమే ఏర్పడిన అభిప్రాయభేదాలు ఇక్కడ కూడా వెంటనే బైటపడ్డాయి, అమూలాగ్రం చర్చింపబడిన ఒక సమస్యమీద ఏవిధమైన ''గందరగోళం గాని, అపార్థం గాని'' వుండడానికి ఇంకా అవకాశం వుందని వూహించడం కష్టం! ఇది అపార్థానికి సంబంధించిన విషయం కాదనీ అభిప్రాయభేదాలకు సంబంధించినదే నన్నది స్పష్టం. మాహోవ్, లీబెర్, మర్తీనావ్‌లు వెంటనే హెచ్చరిక సంకేతం చేసి మరల ఎంతో ''ఘనిష్ఠమైన'' మైనారిటీగా వున్నారంటే, ఇది కూడా ఒక కుట్ర, దీన్ని కూడా ఒక కుట్రకీ, తంత్రానికీ, కౌటిల్యానికీ, యింకా అలాంటి యితర చక్కని విషయానికీ కామ్రేడ్ మార్తొవ్ పూనుకోవలసివచ్చేది (లీగు మహాసభలో ఆయన ప్రసంగం చూడండి). మైనారిటీకి గాని, మెజారిటీకి గాని చెందిన ''ఘనిష్ఠమైన'' గ్రూపులు ఏర్పడటానికి గల రాజకీయ కారణాలను అర్థం చేసుకోజాలనివారు అలాంటి వాటికే పూనుకుంటారు.

మాహోవ్ తిరిగి మార్క్సిజానికి అపభ్రంశ సరళీకరణతో ప్రారంభించాడు. ''మన ఏకైక విప్లవవర్గం శ్రామికవర్గమే'' అని ఆయన ప్రకటించాడు. సరి అయిన యీ ఆధారాంశం నుంచి ఆయన ఒక తప్పు నిర్ధారణకు వచ్చాడు: ''మిగతావారు పరిగణనలోకి రారు. వారు కేవలం ఆశ్రితులే (అందరూ నవ్వు).... ఔను, వారు కేవలం ఆశ్రితులే, లాభాలను పొందడం కోసమే చూస్తూ వుంటారు. వారిని బలపర్చడానికి నేను వ్యతిరేకిని'' (పేజి 226). కామ్రేడ్ మాహోవ్ తన వైఖరిని గురించి చేసిన యీ సాటిలేని సూత్రీకరణ చాలా మందికి (ఆయన మద్దతుదార్లలో) కలవరపాటు కలిగించింది, కాని వాస్తవంగా లీబెర్, మర్తీనావ్ ఆయనతో ఏకీభవించారు, వారు ''ప్రతిపక్ష'' అనే మాటను తొలగించమనీ లేదా ''ప్రజాస్వామిక ప్రతిపక్ష'' అనే మాటలను చేర్చి దానిని మితంలో పెట్టాలనీ ప్రతిపాదించారు. ప్లెహానొవ్ ఎంతో సరిగా ముందుకు వచ్చి మర్తీనావ్ ప్రతిపాదించిన యీ సవరణకు వ్యతిరేకంగా మాట్లాడాడు. ''మనం యీ ఉదారవాదులను విమర్శించి తీరాలి, వారి అర్ధమనస్కతను బట్టబయలు చేయాలి. అది నిజం.... కాని, సోషల్ డెమోక్రటిక్ ఉద్యమం కాని అన్ని ఇతర ఉద్యమాలలోని సంకుచితత్వాన్నీ, వాటి పరిమితులనూ బైట పెట్టేటప్పుడు, నిరంకుశాధికారంతో పోలిస్తే సార్వత్రిక వోటింగు హక్కును ఇవ్వని రాజ్యాంగం సహితం ఒక అడుగు ముందుకేసనీ, అందుచేత అలాంటి రాజ్యాంగానికి బదులు ఇప్పుడున్న

వ్యవస్థే వుండాలని కోరకూడదనీ శ్రామికవర్గానికి వివరించడం మన కర్తవ్యం'' అన్నాడు. కామ్రేడ్స్ మర్తీనొవ్, లీబెర్, మాహోవ్ దీనితో ఏకీభవించలేదు. వారు తమ వైఖరినే గట్టిగా సమర్థించారు. వారి వైఖరిని అక్సెల్‌రోడ్, స్త్రరోవేర్, ట్రాట్స్కీ, మరో సారి ప్లెహానొవ్ ఖండించారు. ఈ సందర్భంలో కామ్రేడ్ మాహోవ్ తన్ను తానే అధిగమించిపోయాడు. మొదట ఆయన ఇతర వర్గాలు (శ్రామికవర్గం కానివి) ''పరిగణనలోకి రావు'' అనీ, తాను ''వాటిని బలపర్చడానికి వ్యతిరేకిని'' అనీ అన్నాడు. ఆతరువాత, ''సారభూతంగా అభివృద్ధి నిరోధకమే అయినా బూర్జువావర్గం తరచు విప్లవాత్మకం అయినది — ఉదాహరణకు, ఫ్యూడలిజానికీ, దాని అవశేషాలకూ వ్యతిరేకంగా సాగే పోరాటంలో'' అని అంగీకరించడానికి సమ్మతించాడు. కాని అంతకంటె అధ్వాన్నమైన స్థితికి పోతూ ఆయన ఇలా అన్నాడు: ''కాని ఎల్లప్పుడూ(?) అభివృద్ధి నిరోధకములైన గ్రూపులు — చేతిపనివారి లాంటి గ్రూపులు కొన్ని వున్నాయి.'' మన ''మధ్యస్థవర్గ'' నాయకులు నిర్ణయానికి వచ్చిన సైద్ధాంతిక మణిపూసలు అలాంటివి! తరువాత వారు పాత సంపాదకవర్గాన్ని సమర్థిస్తూ నోట నురుగులు గక్కారు! గిల్డు వ్యవస్థ ఎంతో బలంగా వున్న పశ్చిమ యూరప్‌లో సహితం పట్టణాలలోని ఇతర పెటీబూర్జువావర్గం లాగనే యీ చేతిపనివారే నిరంకుశాధికార పతన శకంలో అసాధారణమైన విప్లవోత్సాహాన్ని ప్రదర్శించారు. ఒక రష్యన్ సోషల్ డెమోక్రట్, మన పశ్చిమ దేశాల కామ్రేడ్స్ నేటి చేతిపనివారిని గురించి, అంటే, నిరంకుశాధికారం పతనం అయిన తరువాత ఒక శతాబ్దమో అర్ధ శతాబ్దమో గడచిన యీ ప్రస్తుత శకంలోని చేతివృత్తుల వారిని గురించి, ఏమి చెబుతారో ఆలోచనారహితంగా ఆ పాత మాటలనే పునశ్చరణ చేయడం ప్రత్యేకించి అసంగతం. బూర్జువావర్గంతో పోల్చి చూస్తే రష్యాలోని చేతివృత్తులవారిని రాజకీయంగా అభివృద్ధి నిరోధకులని చెప్పడం కేవలం అర్థం తెలియకుండా కంఠస్థం చేసిన పదజాలాన్ని పునశ్చరణ చేయడమే అవుతుంది.

దురదృష్టవశాత్తూ, ఈ సమస్యమీద మర్తీనొవ్, మాహోవ్, లీబెర్ ప్రవేశపెట్టిన సవరణలను తోసివేస్తూ వేయబడిన వోట్ల సంఖ్య మినిట్స్‌లో నమోదు చేయబడలేదు. మనం చెప్పగలిగినదంతా ఏమిటంటే, ఈ సందర్భంలో కూడా ''ఇస్క్రా'' వ్యతిరేక సభ్యుల నాయకులూ, ''మధ్యస్థవర్గ'' నాయకులలో ఒకరూ* ఇదివరకే అందరికీ తెలిసిన ''ఇస్క్రా''

---

*''మధ్యస్థవర్గం'' అనబడే యిదే గ్రూపుయొక్క మరో నాయకుడు కామ్రేడ్ యెగోరొవ్, మరో సందర్భంలో, సోషలిస్టు రివల్యూషనరీలపై[15] అక్సెల్‌రోడ్ ప్రవేశపెట్టిన తీర్మానం సందర్భంగా ప్రతిపక్ష ధోరణులను బలపరచడం గురించి మాట్లాడాడు (పేజి 359). కార్యక్రమంలో ప్రతిపక్షం వారి ప్రతి ఉద్యమాన్నీ, విప్లవోద్యమాన్నీ బల

వాళ్లను వ్యతిరేకించిన గ్రూపింగుతో జత కలిశారు. కార్యక్రమంపై జరిగిన మొత్తం చర్చను వెరసి చేసి చూస్తే ఏ మాత్రం చురుకుగా సాగిన, సార్వత్రిక ఆసక్తిని రేకెత్తించిన చర్చలలో, కామ్రేడ్ మార్తొవ్, కొత్త "ఇస్క్రా" సంపాదకవర్గమూ ఇప్పుడు ఎంతో జాగ్రత్తగా అలక్ష్యం చేస్తున్న అభిప్రాయ భేదాలను బయట పెట్టకుండా వున్నది ఒక్కటి కూడా లేదని నిర్ధారణచేయకుండా వుండలేము.

## ఎ) పార్టీ నిబంధనావళి. కామ్రేడ్ మార్తొవ్ ముసాయిదా

కార్యక్రమంపై చర్చ తరువాత, మహాసభ పార్టీ నిబంధనావళిపై చర్చను తీసుకుంది. (ఇదివరకే పైన ప్రస్తావించిన కేంద్ర పత్రిక సమస్యను, ప్రతినిధుల నివేదికలను వదలివేస్తున్నాము. దురదృష్టవశాత్తూ, ప్రతినిధులలో అధికసంఖ్యాకులు సంతృప్తికరమైన రూపంలో వాటిని ఇవ్వలేకపోయారు.) నిబంధనావళి సమస్య మన అందరికీ ఎంతో ప్రాముఖ్యం గలదని వేరే చెప్పనక్కర లేదు. ఏమైనా, "ఇస్క్రా" మొదటినుంచీ ఒక పార్టీ పత్రికగానే కాక, నిర్మాణానికి సంబంధించిన మూల కేంద్రకంగా కూడా పనిచేసింది. తన నాల్గవ సంచికలో ప్రచురించిన సంపాదకీయ వ్యాసంలో ("దేనితో ప్రారంభించాలి?" అనే వ్యాసంలో[16]) "ఇస్క్రా" పార్టీ నిర్మాణానికి ఒక సమగ్రమైన పథకాన్ని ప్రతిపాదించింది.* దానిని అది

---

పర్చాలనే డిమాండుకూ, సోషలిస్టు రివల్యూషనరీల పట్లనూ, ఉదారవాదుల పట్లనూ అనుసరించే వ్యతిరేక వైఖరికీ మధ్య ఒక "పరస్పర వైరుధ్యాన్ని" కామ్రేడ్ యెగోరొవ్ కనిపెట్టాడు. మరో రూపంలో, సమస్యను మరో దృక్కోణంనుంచి చూస్తూ, కామ్రేడ్ యెగోరొవ్ ఇక్కడ మార్క్సిజం గురించిన అదే సంకుచిత అవగాహనను బైటపెట్టాడు, కామ్రేడ్స్ మాహొవ్, లీబెర్, మర్తీనొవ్‌లు చేసినట్టుగానే "ఇస్క్రా" వైఖరి పట్ల (తాను "గుర్తించిన" "ఇస్క్రా" వైఖరి పట్ల) అదే మాదిరి నిలకడలేని కొంత వ్యతిరేకమైన వైఖరిని ప్రదర్శించాడు.

* "ఇస్క్రా"ను పార్టీ కేంద్ర పత్రికగా ఆమోదించడంపై చేసిన ప్రసంగంలో కామ్రేడ్ పొపొవ్, ఇతర విషయాలతో పాటు ఇలా అన్నాడు: "'ఇస్క్రా' మూడవ, లేక

ఒక క్రమపద్ధతిలోనూ, నిలకడగానూ మూడేళ్లు అనుసరించింది. పార్టీ రెండవ మహాసభ ''ఇస్క్రా'' పత్రికను కేంద్ర పత్రికగా ఆమోదించినప్పుడు, ఆ విషయంపై ప్రతిపాదించబడిన తీర్మానం (పేజి 147) ఉపోద్ఘాతంలో చెప్పబడిన మూడు అంశాలలోనూ రెండు అంశాలు ఈ నిర్మాణ సంబంధమైన పథకానికీ, నిర్మాణం గురించిన ''ఇస్క్రా'' భావాలకీ: పార్టీయొక్క ఆచరణాత్మక కార్యకలాపాలను నడపడంలో దాని పాత్రకూ, ఐక్యతను సాధించడంలో అది నిర్వహించిన నాయకత్వ పాత్రకూ, అంకితమైనవి. అందుచేత, నిర్మాణం గురించిన నిర్దిష్టమైన భావాలు యావత్తు పార్టీచేతనూ ఆమోదింపబడేటంతవరకూను, అవి లాంఛనప్రాయంగా ధ్రువపరచబడేటంతవరకూను ''ఇస్క్రా'' చేసిన కృషి, పార్టీని నిర్మించే యావత్తు కృషి, పార్టీని వాస్తవంగా పునరుద్ధరించడానికి చేసిన మొత్తం కృషి పూర్తి అయినట్టు పరిగణింపబడజాలకపోవడం సహజమే. నిర్మాణాన్ని గురించిన పార్టీ నిబంధనావళి ఈ కర్తవ్యాన్ని నెరవేర్చవలసివుంది.

పార్టీ నిర్మాణానికి ప్రాతిపదికగా చేసేటందుకు ''ఇస్క్రా'' ప్రయత్నించిన ప్రధానమైన భావాలు ముఖ్యంగా ఈ రెండు: మొదటిది, కేంద్రీకరణ వుండాలనేది; ఇది పార్టీ నిర్మాణానికి సంబంధించిన ప్రత్యేకమైన, వివరమైన సమస్యలను నిర్ణయించే పద్ధతిని సూత్రరీత్యా నిర్వచించింది. రెండవది, సైద్ధాంతికంగా నాయకత్వం వహించే పార్టీ పత్రికయొక్క ప్రత్యేక పాత్ర అనేది. సైద్ధాంతిక నాయకత్వం కోసం పార్టీ పత్రిక ప్రత్యేకించి పనిచేయాలనేది. ఇందులో విప్లవాత్మక దాడిని నడిపించే మొదటి స్థావరాన్ని విదేశాలలో నెలకొల్పి, దేశంలో వుంటున్న రాజకీయ బానిసత్వపు పరిస్థితులలో రష్యన్ సోషల్ డెమోక్రటిక్ కార్మిక వర్గ ఉద్యమపు తాత్కాలిక, ప్రత్యేక అవసరాలు పరిగణనలోకి తీసుకోబడ్డాయి. మొదటి భావం, సూత్రానికి సంబంధించిన ముఖ్యాంశంగా, నిబంధనావళి అంతటినీ ఆవరించి వుండవలసివుంది; రెండవది, స్థలానికీ, కార్యాచరణ తీరుకూ సంబంధించిన తాత్కాలిక పరిస్థి

---

నాల్గవ సంచికలో ప్రచురింపబడిన 'దేనితో ప్రారంభించాలి?' అన్న వ్యాసాన్ని జ్ఞాపకం చేస్తున్నాను. రష్యాలో పనిచేస్తున్న చాలా మంది కామ్రేడ్స్ అది ఒక అనుచితమైన వ్యాసంగా భావించారు; ఇతరులు ఈ పథకం కల్పితమైనది అనుకున్నారు, అధికసంఖ్యాకులు (? — బహుశా కామ్రేడ్ పొపోవ్ చుట్టూ వున్న కామ్రేడ్స్‌లో అధికసంఖ్యాకులు) అది కేవలం అత్యాశతో కూడినదని ఆరోపించారు'' (పేజి 140). నా రాజకీయ భావాలు అత్యాశతో కూడినవని ఆరోపించినట్లు వినడం నాకు కొత్త విషయం కాదని పాఠకునికి తెలుసు — ఇలాంటి ఆరోపణను కామ్రేడ్ అక్సెల్‌రోడ్, కామ్రేడ్ మార్తొవ్ ఇప్పుడు ప్రోత్సహిస్తున్నారు.

తులచే అవసరం అయిన ఒక ప్రత్యేక భావం అయినందువల్ల, రెండు కేంద్రాలను, ఒక కేంద్ర పత్రికనూ, ఒక కేంద్ర కమిటీనీ నెలకొల్పాలనే ప్రతిపాదనలో కేంద్రీకరణ వుండాలనే సూత్రాన్ని విడిచిపెట్టినట్టుగా కనిపించే రూపాన్ని తీసుకుంది. పార్టీ నిర్మాణం గురించిన యీ రెండు ముఖ్యమైన "ఇస్క్రా" భావాలూ కూడా "దేనితో ప్రారంభించాలి?" అనే "ఇస్క్రా" (సంచిక 4) సంపాదకీయంలోనూ, "ఏం చెయ్యాలి?"లోనూ నేను విపులీకరించాను. "ఒక కామ్రేడ్‌కి లేఖ"లో[17] దాదాపు పరిపూరిత నిబంధనావళి రూపంలో వివరంగా విశదీకరించాను. "ఇస్క్రా"ను గుర్తించడమన్నది కేవలం ఒక నామకార్థమైన, కేవలం ఒక సాంప్రదాయికమైన పదం కాకుండా వుండాలంటే ఇక వాస్తవంగా మిగిలిన పని అంతా అదే భావాలకు ఒక రూపాన్ని ఇచ్చే నిబంధనావళి నిబంధనలను సూత్రీకరించడమే "ఒక కామ్రేడ్‌కి లేఖ" నూతన ప్రచురణకు రాసిన ఉపోద్ఘాతంలో నేను ఆ రెండింటిలోనూ నిర్మాణం గురించి వున్న భావాల పూర్తి సారూప్యాన్ని నిరూపించేటందుకు పార్టీ నిబంధనావళిని ఆ పుస్తకంతో పోల్చి చూస్తే చాలునని ఇదివరకే పేర్కొన్నాను.

నిబంధనావళిలో నిర్మాణం గురించిన "ఇస్క్రా" భావాలను సూత్రీకరించే పనికి సంబంధించి కామ్రేడ్ మార్తొవ్ ప్రస్తావించిన ఒక ఘటనను గురించి చెప్పవలసివుంది. లీగు మహాసభలో (పేజి 58) మార్తొవ్ ఇలా అన్నాడు: "ఈ నిబంధనమీద (మొదటి నిబంధనమీద) నేను అవకాశవాదంలోకి జారడం లెనిన్‌కు ఎంతవరకు అనుకోని విషయమో ఒక విషయ వివరణ ఇస్తే తెలుస్తుంది. మహాసభకు ఒకటిన్నర లేక రెండు నెలలకు ముందుగా లెనిన్‌కు నా ముసాయిదాను చూపించాను, అందులోని మొదటి నిబంధన నేను మహాసభలో ప్రతిపాదించిన దానిలాగనే సూత్రీకరించబడింది. అది ఎక్కువ వివరాలతో కూడివుందనే కారణంమీద లెనిన్ దానికి తన అభ్యంతరం చెప్పాడు. ఆయనకు నచ్చినదల్లా ఆ మొదటి నిబంధనలోని భావం — పార్టీ సభ్యత్వ నిర్వచనం — అనీ, దానిని తాను తయారుచేసే నిబంధనావళిలో కొన్ని మార్పులతో చేరుస్తాననీ, ఎందుకంటే నేను దానిని సూత్రీకరించే విధం బాగాలేదని తను అనుకుంటున్నాననీ నాతో చెప్పాడు. దానిని బట్టి, నా నిర్వచనం గురించీ, ఆ విషయంపై నా అభిప్రాయాలను గురించీ ఆయనకు చాల కాలం క్రితమే తెలుసునన్న మాట. ఆవిధంగా నేను పార్టీ మహాసభకు ఎలాంటి ముసుగూ లేకుండానే వచ్చాననీ, నా అభిప్రాయాలను దాచి పెట్టలేదనీ మీకు తెలుస్తుంది. పరస్పర కో-ఆప్టేషనునూ, కేంద్ర కమిటీకీ కేంద్ర పత్రికకూ సభ్యులను కో-ఆప్టు చేసుకునే సందర్భాలలో ఏకగ్రీవత వుండాలనే సూత్రాన్ని వగైరాలను నేను వ్యతిరేకిస్తానని ఆయనకు ముందే హెచ్చరిక చేశాను."

పరస్పర కో-ఆప్టేషనును వ్యతిరేకించడం గురించిన హెచ్చరిక విషయంలో అసలు వాస్తవాలు ఎలా వున్నాయో తగిన సమయంలో పరిశీలిద్దాం. ప్రస్తుతం మార్తొవ్ ప్రతిపాదించిన నిబంధనావళి "ఎలాంటి ముసుగూ లేకుండానే వుందనే" విషయం గురించి చూద్దాం. లీగు మహాసభలో, బాగా లేని తన ముసాయిదా ఉదంతాన్ని జ్ఞాపకం తెచ్చుకుంటూ (బాగాలేని కారణంగా పార్టీ మహాసభలో ఆయన దానిని తానుగానే ఉపసంహరించాడు, కాని మహాసభ తరువాత తనకు స్వభావసిద్ధమైన సంగతత్వంతో తిరిగి పైకి తీసుకువచ్చాడు) మార్తొవ్, చాలా తరచుగా జరుగుతున్నట్టే, చాలా విషయాలను మరచిపోయాడు, అందుచేత వ్యవహారాలను తిరిగి గందరగోళం చేశాడు. ఏకాంత సంభాషణలను ఉదహరించవద్దనీ, తన జ్ఞాపక శక్తిమీదనే ఆధారపడవద్దనీ (కొందరు తమకు అనుకూలమైన వాటిని మాత్రమే అప్రయత్న పూర్వకంగా జ్ఞాపకం తెచ్చుకుంటారు!) హెచ్చరించవలసిన సందర్భాలు ఇప్పటికే చాలా వున్నాయనుకున్నప్పటికీ, మరేదీ లేక కామ్రేడ్ మార్తొవ్ నిస్సారమైన సమాచారాన్ని ఉపయోగించాడు. ఇప్పుడు కామ్రేడ్ ప్లెహానొవ్ సహితం ఆయనను అనుకరించడం మొదలు పెడుతున్నాడు — చెడుగుణం అంటువ్యాధి లాంటిదేమో.

మార్తొవ్ ముసాయిదా మొదటి నిబంధనలోని "భావం" నాకు "నచ్చ"జాలదు, ఎందుచేతనంటే, మహాసభలో చర్చకు వచ్చిన భావమేదీ ఆ ముసాయిదాలో లేదు. ఆయన జ్ఞాపక శక్తి ఆయనను మోసగించింది. అదృష్టవశాత్తూ, నా దగ్గర వున్న కాగితాలలో మార్తొవ్ తయారుచేసిన ముసాయిదా వుంది, అందులోని "మొదటి నిబంధన మహాసభలో ప్రతిపాదింపబడిన విధంగా గాక మరోవిధంగా సూత్రీకరించబడి వుంది!" అదే "ఎలాంటి ముసుగూ లేకుండానే" అనుకోండి!

మార్తొవ్ ముసాయిదాలో మొదటి నిబంధన ఇలా వుంది: "రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబరు పార్టీ కార్యక్రమాన్ని అంగీకరించి, పార్టీ సంస్థల అజమాయిషీ నాయకత్వాల కింద (sic!)* దాని లక్ష్యాలను నెరవేర్చేటందుకు చురుకుగా పనిచేసేవాడే ఆ పార్టీ సభ్యుడు అవుతాడు."

నా ముసాయిదాలో మొదటి నిబంధన ఇలా వుంది: "పార్టీ కార్యక్రమాన్ని అంగీకరించి, ఆర్థికంగానూ, పార్టీ శాఖలలో ఒక దానిలో స్వయంగా పాల్గొనడం ద్వారానూ పార్టీని బలపర్చేవాడే పార్టీ సభ్యుడు అవుతాడు."

మహాసభలో మార్తొవ్‌చే సూత్రీకరించబడి, మహాసభచే ఆమోదింపబడిన మొదటి నిబంధన ఇలా వుంది: "రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబరు పార్టీ కార్యక్రమాన్ని అంగీ

* సరిగ్గా ఇలాగే! — సం.

కరించి, పార్టీకి ఆర్థిక సహాయం చేస్తూ, పార్టీ శాఖలలో ఒకదాని నాయకత్వం కింద క్రమం తప్పకుండా దానికి స్వయంగా సహాయాన్ని అందిస్తూ వుండేవాడే పార్టీ సభ్యుడు అవుతాడు.''

వాటిని ఒకదాని పక్కన ఒకటి వుంచి చూస్తే, మార్తొవ్ ముసాయిదాలో భావం అనేది ఏదీ లేదనీ, అది కేవలం అర్థం లేని పదజాలమే ననీ స్పష్టంగా తెలుస్తుంది. పార్టీ సభ్యులు పార్టీ సంస్థల అదుపు నాయకత్వాల కింద పనిచేసితీరాలి అనేది వేరే చెప్పనక్కర్లేదు; ఇంకోలా వుండటానికి వీలు లేదు, విషయం చెప్పకుండా వూరికే మాట్లాడటమంటే ఇష్టపడేవాళ్లు, ''నిబంధనావళులను'' పదజాలంతోనూ బ్యూరాక్రటిక్ సూత్రాలతోనూ (అంటే పనికి నిరుపయోగకరమైన సూత్రాలతోనూ, ప్రదర్శించడానికి పనికి వస్తాయని అనుకునే వాటితోనూ) ముంచెత్తడానికి ఇష్టపడేవాళ్లు మాత్రమే దానిని గురించి అలా మాట్లాడుతారు. పార్టీ శాఖలలో దేనికీ చెందివుండని పార్టీ సభ్యులపై పార్టీ శాఖలు నిజమైన నాయకత్వాన్ని వహించగలవా? అనే ప్రశ్న వేసినప్పుడే మొదటి నిబంధనలో వున్న భావం కనిపిస్తుంది. కామ్రేడ్ మార్తొవ్ ముసాయిదాలో ఈ భావం లేశం కూడా లేదు. కనుక, ''ఈ విషయంపై'' కామ్రేడ్ మార్తొవ్ ''అభిప్రాయాలు'' నేను తెలుసుకోలేకపోయాను, ఎందుకంటే కామ్రేడ్ మార్తొవ్ ముసాయిదాలో ఈ విషయంమీద అభిప్రాయాలు అనేవి ఏవీ లేవు. కామ్రేడ్ మార్తొవ్ చేసిన విషయ వివరణ ఒక గందరగోళం అని రుజువు అవుతోంది.

అంతేగాక, కామ్రేడ్ మార్తొవ్‌ని గురించి చెప్పవలసివున్న విషయం ఏమిటంటే, నా ముసాయిదాను బట్టి ''ఈ విషయంపై నా అభిప్రాయాలు ఆయనకు తెలుసు,'' మహాసభకు రెండు మూడు వారాల ముందరే నా ముసాయిదా అందరికీ చూపించబడినప్పటికీ, సంపాదక వర్గంలో గాని, నా ముసాయిదాను మాత్రమే చూసివున్న ప్రతినిధులతో మాట్లాడేటప్పుడు గాని ఆయన వాటికి తన అసమ్మతిని తెల్పలేదు, వాటిని తోసిపుచ్చలేదు. అంతేకాదు, మహాసభలో కూడా, నేను నా ముసాయిదా నిబంధనావళిని ప్రతిపాదించినప్పుడు* నిబంధనావళి కమిటీ ఎన్నికలకు ముందు నేను దానిని సమర్థించినప్పుడు కామ్రేడ్ మార్తొవ్ స్పష్టంగా

* సందర్భవశాత్తూ, మినిట్స్ కమిటీ XIవ అనుబంధంలో, ''లెనిన్‌చే మహాసభలో ప్రతిపాదించబడిన'' నిబంధనావళి ముసాయిదాను ప్రచురించింది (పేజి 393). ఈ సందర్భంలో మినిట్స్ కమిటీ కూడా వ్యవహారాలను కొంచెం గందరగోళం చేసింది. అది ప్రతినిధులందరికీ (మహాసభకు ముందే చాలా మందికీ) చూపింపబడిన నా మొదటి ముసాయిదాను మహాసభలో ప్రతిపాదించిన ముసాయిదాతో తారుమారు చేసి మొదటిదానిని రెండవదాని రూపంలో ప్రచురించింది. నా ముసాయిదాలు వాటి తయారీ దశలలో అయినాసరే ప్రచురింపబడటానికి నాకు అభ్యంతరం లేదు, కాని గందరగోళం కలుగజేయవలసిన అవసరం

ఇలా చెప్పాడు: ''కామ్రేడ్ లెనిన్ నిర్ధారణలతో నేను ఏకీభవిస్తున్నాను. రెండు అంశాల మీద మాత్రం నేను ఆయనతో ఏకీభవించడం లేదు'' (కిందిగీతలు నావి) – అవి కౌన్సిలును[18] ఏర్పాటుచేసే పద్ధతిమీదా, ఏకగ్రీవ కో-ఆప్టేషను (పేజి 157). మొదటి నిబంధనపై ఎలాంటి భేదాభిప్రాయం గురించీ ఒక్క మాట కూడా చెప్పలేదు.

ముట్టడి స్థితిపై ఆయన రాసిన పుస్తకంలో[19] కామ్రేడ్ మార్తొవ్, తను తయారు చేసిన నిబంధనావళిని మరోసారి, మరింత వివరంగా జ్ఞాపకం చేయడం సముచితం అనుకున్నాడు. కొన్ని చిన్న వివరాలు మినహా తాను ఇప్పటికీ (ఫిబ్రవరి 1904–మూడు నెలల తరువాత ఎలా వుంటుందో చెప్పలేము) అంగీకరించడానికి సిద్ధంగా వున్న తన నిబంధనావళి ''కేంద్రీకరణ అతిశయతకు తన అసమ్మతిని ఎంతో స్పష్టంగా వ్యక్తంచేసింది'' అని (పేజి IV) ఆయన మనకి హామీ యిస్తున్నాడు. ఈ ముసాయిదాను మహాసభకు సమర్పించక పోవడానికి కారణం ఏమిటో కామ్రేడ్ మార్తొవ్ ఇప్పుడు ఈవిధంగా వివరిస్తున్నాడు. మొదటిది, '' 'ఇస్క్రా'లో పొందిన శిక్షణ ఆయనలో నిబంధనావళిపట్ల తిరస్కార భావాన్ని కలిగించింద''ట. కామ్రేడ్ మార్తొవ్‌కు అనుకూలంగా వుండేటప్పుడు ''ఇస్క్రా'' అనే మాట ఆయనకు ఒక సంకుచిత బృందం సరళి కాక, అత్యంత దృఢమైన ధోరణి అవుతుంది! కాని కామ్రేడ్ మార్తొవ్‌కు ''ఇస్క్రా''లో పొందిన మూడేళ్ల శిక్షణ కాలంలోనూ ఆయనలో అరాచకవాద పదజాలంపట్ల తిరస్కార భావం కలిగించకపోవడం విచారకరం. (ఆ పదజాలంతో మేధావియొక్క అస్థిరమైన మనస్తత్వం, అందరి అనుమతితోనూ ఆమోదింపబడిన నిబంధనావళి అతిక్రమణను సమర్థించుకోగలిగి వుంటుంది.) రెండవది, కామ్రేడ్ మార్తొవ్ '' 'ఇస్క్రా' ఏర్పరచిన ప్రధాన నిర్మాణ సంబంధమైన మూల కేంద్రపు ఎత్తుగడలలో ఏ మాత్రం విరుద్ధతనూ ప్రవేశపెట్టకుండా వుండాలనుకున్నాడ''ట. అద్భుతమైన సంగతత్వం కదూ? మొదటి నిబంధనను అవకాశవాద తత్వంతో సూత్రీకరించడం విషయంలోనూ, లేక కేంద్రీకరణ అతిశయత విషయంలోనూ సూత్రబద్ధమైన సమస్యపై, కామ్రేడ్ మార్తొవ్ ఎలాంటి విరుద్ధతకైనా ఎంత భయపడ్డాడంటే (అతి సంకుచితమైన బృందం దృక్పథంనుంచి మాత్రమే ఇది భయంకరం), సంపాదకవర్గం లాంటి మూల కేంద్రానికి

---

లేదు. అయినా గందరగోళం కలుగజేయబడింది, ఎందుచేతనంటే, పొపోవ్, మార్తొవ్ (పేజీలు 154, 157) నేను మహాసభలో వాస్తవంగా ప్రతిపాదించిన ముసాయిదాలోని సూత్రీకరణలను విమర్శించారు. కాని, మినిట్స్ కమిటీ ప్రచురించిన ముసాయిదాలో అవి లేవు (పేజి 394, నిబంధనలు 7, 11). మరి కొంచెం జాగ్రత్త తీసుకుని నేను పేర్కొన్న పేజీలను పోల్చి చూస్తే ఈ పొరపాటును తేలికగా కనిపెట్టే పని.

సహితం తన అభిప్రాయభేదాన్ని తెలుపలేదు! కేంద్ర సంస్థల కూర్పు లాంటి ఆచరణాత్మక సమస్యమీద, కామ్రేడ్ మార్తొవ్ ''ఇస్క్రా'' శాఖ (ఈ నిజమైన నిర్మాణ సంబంధమైన మూల కేంద్రం)యొక్క మెజారిటీ వోటుకు వ్యతిరేకంగా బుండ్, ''రబోచెయె దేలొ'' వాళ్ల సహాయం కోసం విజ్ఞప్తిచేశాడు. తన పదజాలంలోని ''విరుద్ధత''ను కామ్రేడ్ మార్తొవ్ గమనించలేదు. ఆ పదజాలం, కుహనా సంపాదకవర్గానికి సమర్థనగా బృందం సరళిలోకి దొంగచాటుగా ప్రవేశిస్తుంది. ఉత్తమ నిర్ణేతలు అయినవారు ఈ సమస్యను గురించి వేసే మదింపులో అది ''బృందం సరళిని'' తోసిపుచ్చడం మాత్రమే చేస్తుంది. ఆయనను దండించేటందుకు, ఆయన తయారుచేసిన నిబంధనావళి ముసాయిదాను పూర్తిగా ఉదహరిద్దాము. అది ఏ అభిప్రాయాలనూ, అతిశయతనూ బయటపెడుతుందో పేర్కొందాము.*

''పార్టీ నిబంధనావళి ముసాయిదా. — I. పార్టీ సభ్యత్వం. — (1) రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబరు పార్టీ కార్యక్రమాన్ని అంగీకరించి, పార్టీ సంస్థల అజమాయిషీ నాయకత్వాల కింద దాని లక్ష్యాలను నెరవేర్చేటందుకు చురుకుగా పనిచేసేవాడే పార్టీ సభ్యుడు అవుతాడు. — (2) పార్టీ ప్రయోజనాలకు విరుద్ధంగా ప్రవర్తించే సభ్యుని పార్టీనుంచి తొలగించే విషయం కేంద్ర కమిటీచే నిర్ణయింపబడాలి. [కారణాలను చూపుతూ పార్టీనుంచి తొలగించే తీర్పు పార్టీ ఫైల్సులో భద్రపర్చబడాలి. కావాలని కోరితే అది ప్రతి పార్టీ కమిటీకీ తెలియజేయబడాలి. ఒక సభ్యుని పార్టీనుంచి తొలగించుతూ కేంద్ర కమిటీ చేసే నిర్ణయంమీద, రెండు లేక ఎక్కువ కమిటీలు డిమాండు చేస్తే, పార్టీ మహాసభకు అప్పీలు చేసుకోవచ్చు.]'' మార్తొవ్ ముసాయిదాలోని స్పష్టంగానే అర్థరహితమైనవి, ఏమీ ''భావాలు'' లేకపోవడమే గాక, ఎలాంటి నిర్దిష్టమైన షరతు గాని, డిమాండు గాని ఏమీ లేకపోవడం లాంటి విషయాలను — తొలగింపు తీర్పు సరిగా ఎక్కడ భద్రపర్చబడాలో ''నిబంధనావళి''లో సాటిలేని సూచన లాంటిది, లేదా ఒక సభ్యుని పార్టీనుంచి తొలగించుతూ కేంద్ర కమిటీ చేసిన నిర్ణయంమీద (దాని నిర్ణయాలు అన్నిటిమీద కాదా?) మహాసభకు అప్పీలుచేసుకోవచ్చుననే ప్రస్తావన లాంటిది స్క్వేర్ బ్రాకెట్లలో చూపుతాను. అనవసరమైన నిరుపయోగకరమైన లేక పాలనాజనిత జాడ్యం (రెడ్ టేపిజం) అంశాలూ పేరాలూ చేర్చడం నిజంగా, అనావశ్యక శబ్ద అతిశయత గాని, బ్యూరాక్రటిక్

---

*ఇక్కడ ఒక విషయం చెప్పాలి. దురదృష్టవశాత్తూ, కామ్రేడ్ మార్తొవ్ ముసాయిదా మొదటి ప్రతి నా దగ్గర లేదు. అందులో దాదాపు 48 నిబంధనలు వున్నాయి. అందులోని నిరుపయోగకరమైన లాంఛన ప్రాధాన్యవాదపు ''అతిశయత'' చాలా వుంది.

లాంఛనతత్వం గాని అవుతుంది. "...II. స్థానిక కమిటీలు. – (3) తన స్థానిక కార్యకలాపాలలో పార్టీకి పార్టీ కమిటీలు ప్రాతినిధ్యం వహిస్తాయి...." (ఎంత కొత్తదనం, ఎంత తెలివి!) "...(4) [పార్టీ రెండవ మహాసభ కాలంలో వుంటూండినవీ, మహాసభలో ప్రాతినిధ్యం వహించినవీ అన్నీ పార్టీ కమిటీలుగా గుర్తింపబడతాయి.] – (5) నాల్గవ నిబంధనలో పేర్కొనబడిన వాటికి అదనంగా కొత్త పార్టీ కమిటీలు కేంద్ర కమిటీచే నియమింపబడాలి [అది ఆ ప్రత్యేక స్థానిక శాఖలో వుంటున్న సభ్యత్వాన్ని కమిటీగా గుర్తిస్తుంది లేక దానిని తిరిగి సంస్కరించడం ద్వారా స్థానిక కమిటీని ఏర్పాటుచేస్తుంది]. – (6) కమిటీలు సభ్యులను కో-ఆప్టు చేసుకోడం ద్వారా తమ సభ్యత్వాన్ని పెంచుకోవచ్చు. – (7) కామ్రేడ్స్ సంఖ్య (తనకు తెలిసినవారు) ఆ కమిటీలోని మొత్తం సభ్యుల సంఖ్యకు 1/3వ వంతుకు మించకుండా వుండే లాగ స్థానిక కమిటీ సభ్యత్వాన్ని పెంచే అధికారం కేంద్ర కమిటీకి వుంటుంది." బ్యూరాక్రసీకి చక్కని మచ్చు! అది 1/3 వంతును ఎందుకు మించకూడదు? దీని ప్రయోజనం ఏమిటి? ఈ పెంపుదల మాటి మాటికీ జరిగే అవకాశం వుండటం దృష్ట్యా, దేనినీ పరిమిత పరచని యీ పరిమితిలో అర్థం ఏముంది? "(8) [స్థానిక కమిటీ విచ్ఛిన్నమైపోయే సందర్భంలో గాని, పోలీసు దాడుల మూలంగా అది విచ్ఛిన్నం అయిపోయే సందర్భంలో గాని" (దీని అర్థం పార్టీ సభ్యులందరూ అరెస్టు చేయబడరనా?) "కేంద్ర కమిటీ దానిని తిరిగి నెలకొల్పాలి.]" (7వ నిబంధనను పరిగణించకుండానా? 8వ నిబంధనకూ ఆదివారం మినహా తక్కిన రోజులలో పని చేసి సెలవు రోజులలో విశ్రాంతి తీసుకోవచ్చునని పౌరులను ఒక క్రమ ప్రవర్తనలో వుంచడం గురించిన రష్యన్ శాసనాలకూ వున్న సారూప్యాన్ని కామ్రేడ్ మార్తొవ్ చూడలేదా?) "(9) [ఏ స్థానిక కమిటీయొక్క కార్యకలాపాలైనా పార్టీ ప్రయోజనాలకు విరుద్ధంగా వున్నట్టయితే ఆ స్థానిక కమిటీని పునర్నిర్మించవలసిందిగా యధావిధిగా జరిగే పార్టీ మహాసభ కేంద్ర కమిటీని ఆదేశించవచ్చు. అలాంటి సందర్భంలో అప్పుడు వుంటున్న కమిటీ రద్దు అయినట్టుగా పరిగణింపబడాలి. అది పనిచేసే ప్రాంతంలోని కామ్రేడ్స్ దానికి లోబడివుండకుండా మినహాయించబడతారు.*]" ఈ పేరాలో వున్న నిబంధన "చిల్లర మల్లర అందరికీ తాగుబోతుతనం

---

* ఈ మాటను కామ్రేడ్ అక్సెల్‌రోడ్ దృష్టికి తెస్తాను. ఇది ఘోరం! సంపాదకవర్గం కూర్పును సహితం మార్చివేసేటంత దూరం పోయే "జాకొబినిజాని"[20]కి బీజాలు ఇక్కడే వున్నాయి.

నిషిద్ధం'' అనే రష్యన్ శాసనంలోని నిబంధన లాగే ఎంతో ఎక్కువ ఉపయోగ కరం. ''(10) [స్థానిక పార్టీ కమిటీలు తమ ప్రాంతాలలోని ప్రచార సంబంధ మైన, ప్రజాందోళన సంబంధమైన, నిర్మాణ సంబంధమైన పార్టీ కార్యకలాపాలను నడిపించాలి. పార్టీ కేంద్ర కమిటీకి కేంద్ర పత్రికలకు అప్పగించబడిన సాధారణ పార్టీ కర్తవ్యాలను నెరవేర్చడంలో వాటికి సహాయపడేటందుకు తాము చేయగలి గినదంతా చేయాలి.]'' హమ్మయ్య! దేవుడా, దీని ప్రయోజనం ఏమిటి?...'' (11) [''స్థానిక శాఖ ఆంతరంగిక ఏర్పాట్లు, కమిటీకీ దానికి లోబడి వున్న గ్రూపు లకూ మధ్య వుండే సంబంధాలు'' (కామ్రేడ్ అక్సెల్‌రోడ్, ఇది విన్నారా?), ''ఆ గ్రూపుల అర్హతకూ స్వేచ్ఛానువర్తనకూ వున్న పరిమితులు'' (అర్హతకు వున్న పరిమితులూ, స్వేచ్ఛానువర్తనకు వున్న పరిమితులూ ఒకటి కాదా?) ''ఆ కమిటీ చేతనే నిర్ణయించబడాలి, కేంద్ర కమిటీకీ కేంద్ర పత్రికల సంపాదకవర్గానికీ తెలియ పర్చబడాలి.]'' (ఒక లోపం: తెలియపర్చబడిన విషయాలు ఎక్కడ ఫైలు చేయాలి?) ''(12) [ఏ విషయంపైన అయినా సరే తమ అభిప్రాయాలూ సిఫా రసులూ పార్టీ కేంద్ర కమిటీకీ దాని కేంద్ర పత్రికలకూ తెలియపర్చాలని డిమాండు చేసే హక్కు కమిటీలకు లోబడి వున్న గ్రూపులకూ పార్టీ సభ్యులకూ వుంటుంది.]– (13) స్థానిక పార్టీ కమిటీలు తమ ఆదాయాలనుండి వాటి వంతుకు కేంద్ర కమిటీ నిర్ణయించే మొత్తాలను కేంద్ర కమిటీ నిధికి ఇవ్వాలి. – III. రష్యనే తర భాషలలో ప్రచారం సాగించేటందుకు సంస్థలను ఏర్పాటు చేయాలి. – (14) [రష్యనేతర భాషలలో దేనిలోనైనా ప్రచారం సాగించేటందుకూ, అలాంటి ప్రచారం సాగించబడుతున్న కార్మికులను సంఘటితపర్చేటందుకూ అలాంటి ప్రత్యేకమైన ప్రచా రమూ అలాంటి సంస్థలూ అవసరం అని భావించబడుతున్న చోట్ల ప్రత్యేక సంస్థ లను నెలకొల్పవచ్చు.] – (15) అటువంటి అవసరం వుందా లేదా అన్న విషయాన్ని పార్టీ కేంద్ర కమిటీ, వివాదాస్పదమైన సందర్భాలలో పార్టీ మహాసభా నిర్ణయిం చాలి.'' నిబంధనావళిలోని తరువాతి షరతుల దృష్ట్యా ఈ నిబంధనలోని మొదటి భాగం అనావశ్యకం, వివాదాలను గురించిన రెండవ భాగం కేవలం హాస్యాస్పదం. ''(16) [14వ నిబంధనలో పేర్కొనబడిన స్థానిక శాఖలు వాటి ప్రత్యేక వ్యవ హారాలలో స్వతంత్రత కలిగి వుండాలి, కాని స్థానిక పార్టీ కమిటీ అజమాయిషీ కింద పని చేయాలి, దానికి లోబడి వుండాలి, ఈ అజమాయిషీ ఏయే రూపాలలో వుండాలి, కమిటీకీ యీ ప్రత్యేక శాఖలకూ మధ్య నిర్మాణాత్మక సంబంధాల స్వభావం ఏమై వుండాలి అన్నది స్థానిక కమిటీచే నిర్ణయించబడాలి.'' (దేవుడి దయవల్ల, ఈ వట్టి మాటల

వెళ్ళిన అంతా అనావశ్యకమని ఇప్పుడు బాగా స్పష్టం అయింది.) "పార్టీ సాధారణ వ్యవహారాల విషయంలో అలాంటి సంస్థలు కమిటీ నిర్మాణంలో ఒక భాగంగా పని చేయాలి.] – (17) [14వ నిబంధనలో పేర్కొనబడిన స్థానిక సంస్థలు తమ ప్రత్యేక కర్తవ్యాలను సార్థకంగా నిర్వహించేటందుకు స్వతంత్రమైన లీగును ఏర్పాటు చేయవచ్చు. ఈ లీగుకు సొంత ప్రత్యేక పత్రికలు, కార్యనిర్వాహక సంస్థలు వుండవచ్చు, ఈ రెండూ కూడా పార్టీ కేంద్ర కమిటీ సరాసరి అజమాయిషీ కింద వుండాలి. ఈ లీగు నిబంధనావళిని అదే తయారుచేసుకోవాలి, కాని అది పార్టీ కేంద్ర కమిటీ ఆమోద ముద్రను పొందాలి.] – (18) [స్థానిక పరిస్థితుల మూలంగా పార్టీ కమిటీలు ఆ ప్రత్యేక భాషలో ఆందోళన సాగించేటందుకు ప్రధానంగా బద్ధమై వున్నప్పుడు అవి 17వ నిబంధనలో చెప్పబడిన స్వతంత్ర లీగులో చేరవచ్చు. గమనిక: స్వతంత్ర లీగులో ఒక భాగంగా ఏర్పడివుండినప్పుడు అలాంటి కమిటీ పార్టీ కమిటీ గానే వుంటుంది."]... (ఈ నిబంధన అంతా ఎంతో ఉపయోగకరం, అద్భుతమైన తెలివితో తయారుచేయబడింది, గమనిక ఇంకా బాగుంది.) "(19) [ఒక స్వతంత్ర లీగుకు చెంది వున్న స్థానిక శాఖలకు ఆ లీగు కేంద్ర సంస్థలతో వుండే సంబంధాలు స్థానిక కమిటీలచే అజమాయిషీ చేయబడాలి.] – (20) [స్వతంత్ర లీగులయొక్క కేంద్ర పత్రికలూ కార్యనిర్వాహక సంస్థలూ పార్టీ కేంద్ర కమిటీతో స్థానిక పార్టీ కమిటీలు ఎలాంటి సంబంధం కలిగి వుంటాయో అలాంటి సంబంధమే కలిగి వుండాలి.] – IV. పార్టీ కేంద్ర కమిటీ, పత్రికలు. – (21) [పార్టీ అంతటికీ దాని కేంద్ర కమిటీ, దాని రాజకీయ, సైద్ధాంతిక పత్రికలూ ప్రాతినిధ్యం వహించాలి.] – (22) కేంద్ర కమిటీ కర్తవ్యాలు ఇవి: పార్టీ నిర్వహించే కార్యకలాపాలు అన్నిటినీ నడపడం; పార్టీ శక్తులన్నీ సరిగా ఉపయోగింపబడేట్లు, సరిగా పంపకంజరిగేటట్లు చూడడం; పార్టీ అన్ని విభాగాల కార్యకలాపాల పైనా అజమాయిషీ చేయడం; స్థానిక శాఖలకు పార్టీ సాహిత్యాన్ని అందజేయడం; పార్టీ సాంకేతిక యంత్రాంగాన్ని సంఘటితం చేయడం; పార్టీ మహాసభలను సమావేశపరచడం. – (23) పార్టీ పత్రికల కర్తవ్యాలు ఇవి: పార్టీ జీవితానికి సైద్ధాంతిక నాయకత్వం వహించడం; పార్టీ కార్యక్రమం కోసం ప్రచారం సాగించడం, సోషల్ డెమొక్రసీయొక్క ప్రపంచ దృక్పథం గురించి సిద్ధాంతపరమైన సామాన్యమైన వివరణను ఇస్తూ వుండటం. – (24) అన్ని స్థానిక పార్టీ కమిటీలూ, స్వతంత్ర లీగులూ పార్టీ కేంద్ర కమిటీతోనూ, పార్టీ పత్రికల సంపాదకవర్గంతోనూ నేరుగా ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగించాలి, తమ ప్రాంతాలలో ఉద్యమంయొక్క, పార్టీ

నిర్మాణ కృషియొక్క ప్రగతిని గురించి నియమిత కాలాలలో వాటికి తెలియజేస్తూ వుండాలి. — (25) పార్టీ పత్రికల సంపాదకవర్గాన్ని పార్టీ మహాసభలో నియమించాలి. అది తరువాతి పార్టీ మహాసభ జరిగేటంతవరకూ పనిచేయాలి. — (26) [సంపాదకవర్గం తన ఆంతరంగిక వ్యవహారాలలో స్వతంత్రమైనదిగా వుండాలి], మహాసభల మధ్య కాలంలో తన సభ్యత్వాన్ని పెంచవచ్చు, మార్పులు చేయవచ్చు, అయితే ప్రతి సందర్భంలోనూ పార్టీ కేంద్ర కమిటీకి తెలియజేస్తూ వుండాలి. — (27) కేంద్ర కమిటీ విడుదలచేసే అన్ని ప్రకటనలూ, లేక దాని అనుమతి పొందిన ప్రకటనలూ, కేంద్ర కమిటీ డిమాండుపై పార్టీ పత్రికలో ప్రచురింపబడాలి. — (28) కేంద్ర కమిటీ, పార్టీ పత్రికల సంపాదకవర్గం అంగీకారంతో వివిధ రకాల సాహిత్య రచనల కోసం ప్రత్యేక రచయితల గ్రూపులను ఏర్పాటుచేయాలి. — (29) కేంద్ర కమిటీ పార్టీ మహాసభల్లో నియమింపబడాలి. తరువాతి మహాసభ జరిగేటంతవరకూ పని చేయాలి. కేంద్ర కమిటీ తన సభ్యత్వాన్ని కో-ఆప్టేషను ద్వారా సంఖ్య విషయంలో పరిమితి లేకుండా పెంచవచ్చు, ప్రతి సందర్భంలోనూ పార్టీ కేంద్ర పత్రికల సంపాదకవర్గానికి తెలియపర్చాలి. — V. దేశాంతర పార్టీ శాఖ. — (30) దేశాంతర పార్టీ శాఖ విదేశాలలో నివసిస్తున్న రష్యనులలో ప్రచారం సాగించాలి, వారిలోని సోషలిస్టులను సంఘటిత పర్చాలి. దానికి ఎన్నుకోబడిన ఒక కార్యనిర్వాహక కమిటీ నాయకత్వం వహించాలి. — (31) పార్టీకి చెందిన స్వతంత్ర లీగులు, తమ ప్రత్యేక కర్తవ్యాలను నెరవేర్చడంలో విదేశాలలో తమ శాఖలను ఏర్పరచి నడపవచ్చు. ఈ శాఖలు విదేశాలలో వున్న మొత్తం నిర్మాణం లోపల స్వతంత్ర గ్రూపులుగా ఏర్పడి వుండాలి. — VI. పార్టీ మహాసభలు. — (32) మహాసభయే పార్టీలో అత్యున్నతాధికార సంస్థ. — (33) [పార్టీ మహాసభ పార్టీ కార్యక్రమాన్నీ, నిబంధనావళినీ, పార్టీ కార్యకలాపాల మార్గదర్శక సూత్రాలనూ తయారుచేయాలి; అది పార్టీ శాఖలన్నిటి పనినీ అజమాయిషీ చేయాలి, వాటిమధ్య వచ్చే తగాదాలను తీర్చాలి.] — (34) మహాసభకు ప్రతినిధులను పంపే హక్కు: (అ) అన్ని స్థానిక పార్టీ కమిటీలకూ, (ఆ) పార్టీయొక్క అన్ని స్వతంత్ర యూనియన్ల కేంద్ర కార్యనిర్వాహక సంస్థలకూ; (ఇ) పార్టీ కేంద్ర కమిటీకీ, పార్టీ కేంద్ర పత్రికల సంపాదక వర్గానికీ; (ఈ) దేశాంతర పార్టీ శాఖలకూ వుంటుంది. — (35) ప్రతినిధి పత్రాలని మరొకరికి బదిలీ చేయవచ్చు, కాని ఏ ప్రతినిధికీ అలాంటి పత్రాలు మూడు కంటె ఎక్కువ వుండకూడదు. ప్రతినిధి పత్రం ఇద్దరు ప్రతినిధుల మధ్య విభజించవచ్చు. ఆదేశాలతో కూడిన ప్రతినిధి పత్రాలు నిషిద్ధం.

–(36) ఎవరి హాజరీ ఉపయోగకరంగా వుంటుందని భావించబడుతుందో అలాంటి కామ్రేడ్స్‌ను చర్చలలో పాల్గొనే హోదాలో మహాసభకు ఆహ్వానించే హక్కు కేంద్ర కమిటీకి వుంటుంది. –(37) పార్టీ కార్యక్రమానికి గాని, నిబంధనావళికి గాని ప్రతిపాదింపబడే సవరణలు ఆమోదింపబడటానికి మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం; ఇతర సమస్యలు సాధారణ మెజారిటీ వోటుతో నిర్ణయించబడాలి. –(38) ఉనికిలో వుంటున్న పార్టీ కమిటీలలో సగానికి పైగా మహాసభలో ప్రాతినిధ్యం పొంది వుంటే ఆ మహాసభ సక్రమమైనదిగా పరిగణింపబడాలి. –(39) సాధ్యమైనంత వరకు పార్టీ మహాసభ రెండేళ్లకు ఒకసారి జరుపబడాలి. [ఈ కాలంలో కేంద్ర కమిటీ అధీనంలో లేని కారణాల మూలంగా మహాసభ జరపడానికి వీలు లేకపోతే, కేంద్ర కమిటీ తన బాధ్యతమీద దానిని వాయిదా వేయవచ్చు."]

ఏ పాఠకుడైనా, తప్పిజారి, ఈ నిబంధనావళి అనబడే దానిని చివరిదాకా చదివే ఓపిక కలిగివుంటే, నేను దానిని గురించి యీకింది నిర్ధారణలకు రావడానికి ప్రత్యేక కారణాలు చూపాలని ఎంత మాత్రం ఆశించదు. మొదటి నిర్ధారణ: ఈ నిబంధనావళికి దాదాపు నయం కాని జలోదర వ్యాధి వుంది. రెండవ నిర్ధారణ: కేంద్రీకరణ అతిశయతకు ఆక్షేపణ తెలిపే ప్రత్యేక నిర్మాణాత్మక భేదాభిప్రాయాలను వేటినీ ఈ నిబంధనావళిలో కనుగొనడం అసాధ్యం. మూడవ నిర్ధారణ: కామ్రేడ్ మార్తొవ్ తాను తయారుచేసిన 38/39 వంతుకు పైగా నిబంధనావళిని ప్రపంచం దృష్టినుంచి మరుగుపర్చడంలో (మహాసభలో చర్చించకుండా నిలుపు చేయడంలోనూ) నిజంగా చాలా తెలివిగా ప్రవర్తించాడు. ఈ దాపరికంలో ఎలాంటి ముసుగూ లేకపోడం గురించి అప్రస్తుతంగా మాట్లాడటం ఒక్కటే కొంచెం వింతగా వుంది.

## ఏ) "ఇస్క్రా"వాళ్ల మధ్య చీలికకు పూర్వం కేంద్రీకరణపై చర్చలు

నిజంగా ఆసక్తిదాయకమైనదీ, అభిప్రాయభేదాలు వున్నాయనే విషయాన్ని నిస్సందేహంగా బయటపెట్టినదీ అయిన నిబంధనావళి మొదటి నిబంధన సూత్రీకరణ సమస్యను పరిశీలించడానికి ముందు నిబంధనావళిపై జరిగిన క్లుప్తమైన సాధారణ చర్చను కొద్దిగా పరిశీలిద్దాం. ఈ చర్చకు మహాసభ 14వ సమావేశమూ, 15వ సమావేశంలో కొంత భాగమూ పట్టింది. ఈ చర్చ కేంద్ర సంస్థల కూర్పు విషయంపై "ఇస్క్రా" శాఖ

లోపల పూర్తి చీలికకు ముందు జరిగి వున్నందువల్ల కొంత ప్రాముఖ్యం కలిగి వుంది. తద్భిన్నంగా నిబంధనావళిపై సాధారణంగానూ కో-ఆప్టేషనుపై ప్రత్యేకించీ తదనంతర చర్చ ''ఇస్క్రా'' శాఖలో యీ చీలిక వచ్చిన తరువాత జరిగింది. సహజంగానే, చీలిక రావడానికి ముందు మనం మన అభిప్రాయాలను మరింత నిష్పక్షపాతంగా వెల్లడించగలిగాము. మనం దరికీ ఎంతో ముఖ్యమైన సమస్య అయిన కేంద్ర కమిటీలోని సభ్యుల కూర్పుపై తెల్పిన అభిప్రాయాలకు మరింత భిన్నంగా వున్నాయనే తాత్పర్యంలో అవి నిష్పక్షపాతమైనవి. నేను ఇదివరకే చెప్పినట్టుగా కామ్రేడ్ మార్తొవ్, నిర్మాణం గురించిన నా అభిప్రాయాలతో ఏకీభవించాడు (పేజి 157). వివరాలకు సంబంధించిన రెండు అంశాలలో తను భేదిస్తున్నట్టు మాత్రం చెప్పాడు. తద్భిన్నంగా ''ఇస్క్రా'' వ్యతిరేకులూ ''మధ్యస్థవర్గం'' మొత్తం నిర్మాణం గురించిన ''ఇస్క్రా'' పథకంలోని రెండు మౌలిక భావాలకు వ్యతిరేకంగాను (తత్ఫలితంగా మొత్తం నిబంధనావళి అంతటికీ వ్యతిరేకంగాను): కేంద్రీకరణకు, ''రెండు కేంద్రాలకి'' వ్యతిరేకంగానూ వెంటనే రంగంలోకి వచ్చారు. నేను ప్రతిపాదించిన నిబంధనావళిని ''సంఘటిత అవిశ్వాసం''గా కామ్రేడ్ లీబెర్ పేర్కొన్నాడు, రెండు కేంద్రాలు వుండాలనే ప్రతిపాదనలో వికేంద్రీకరణను చూశాడు (కామ్రేడ్స్ పొపోవ్, యెగోరొవ్‌లూ అంతే). స్థానిక కమిటీల అధికార పరిధి విస్తృతపర్చబడాలనీ, ముఖ్యంగా, వాటికి ''తమ కూర్పును మార్చుకునే హక్కు'' ఇవ్వబడాలనీ కామ్రేడ్ అకీమొవ్ కోరాడు. ''కార్యాచరణలో వాటికి ఎక్కువ స్వాతంత్ర్యం వుండాలి.... కేంద్ర కమిటీ రష్యాలోని చురుకైన అన్ని శాఖల ప్రతినిధులచేతా ఎన్నుకోబడినట్టుగానే స్థానిక కమిటీలు వాటి ప్రాంతాలలో చురుకుగా పని చేసే కార్మికులందరిచేతా ఎన్నుకోబడాలి. దీనికీ అనుమతించడానికి వీలు లేకపోతే, స్థానిక కమిటీలకు కేంద్ర కమిటీ నియమించే సభ్యుల సంఖ్యను పరిమితపర్చాలి....'' (పేజి 158) అన్నాడు. ఆవిధంగా కామ్రేడ్ అకీమొవ్ ''కేంద్రీకరణ అతిశయత''కు వ్యతిరేకంగా ఒక వాదాన్ని సూచించాడు, కాని కామ్రేడ్ మార్తొవ్ యీ బలమైన వాదాలను పెడచెవిని పెట్టాడు. అకీమొవ్ అడుగు జాడను అనుసరించేటందుకు కేంద్ర సంస్థల కూర్పు సమస్యపై తన ఓటమిచే అప్పటికి ఇంకా ప్రేరేపింపబడలేదు. కామ్రేడ్ అకీమొవ్ తన సొంత నిబంధనావళిలోని ''భావాన్ని'' (7వ నిబంధన – స్థానిక కమిటీలకు సభ్యులను నియమించేటందుకు కేంద్ర కమిటీకి వున్న అధికారాన్ని పరిమిత పర్చాలన్నది) సూచించినప్పుడు కూడా ఆయన పెడచెవినే పెట్టాడు! ఆ సమయంలో కామ్రేడ్ మార్తొవ్ ఇంకా మనతో ఎలాంటి ''విరుద్ధత'' కోరడం లేదు. ఆ కారణం మూలంగా కామ్రేడ్ అకీమొవ్‌తోనూ, తనతో తనకూ వున్న విరుద్ధతను సహించాడు.... అప్పుడు ''ఇస్క్రా'' ... కరణ స్పష్టంగా ఎవరికైతే అననుకూలమో వారు మాత్రమే ''...

కరణ''ను వ్యతిరేకించారు; అకీమొవ్, లీబెర్, గోల్డ్‌బ్లాత్‌లు దానిని వ్యతిరేకించారు, యెగోరొవ్, ఆయన లాంటి వారూ జాగ్రత్తగానూ, సావధానతతోనూ (ఎప్పుడు కావాలంటే అప్పుడు వెనక్కి మరల గలిగేటట్టుగా) పైవారిని అనుసరించారు (పేజీలు 156, 276). అప్పటికింకా పార్టీలో అత్యధిక సంఖ్యాకులకు, కేంద్రీకరణకు వ్యతిరేకంగా అసమ్మతిని రేపినది బుంద్‌యొక్క, ''యూజ్నీ రబోచీ'' మొదలైన గ్రూపులయొక్క సంకుచిత బృందపు ప్రయోజనాలే నని స్పష్టంగానే కనబడింది. ఆ మాటకు వస్తే, పాత ''ఇస్క్రా'' సంపాదకవర్గపు అధ్యయన బృందపు ప్రయోజనాలే కేంద్రీకరణకు వ్యతిరేకంగా అసమ్మతి తెల్పడానికి కారణం అని పార్టీలో అధిక సంఖ్యాకులకు ఇప్పటికి కూడా స్పష్టమే....

ఉదాహరణకు, కామ్రేడ్ గోల్డ్‌బ్లాత్ ప్రసంగాన్ని తీసుకోండి (పేజీలు 160–161). ఆయన నా ''దారుణమైన'' కేంద్రీకరణ ప్రతిపాదనను దూషించాడు, అది కింది శాఖల ''నాశనానికి'' దారి తీస్తుందనీ, అది ''మొదటినుంచి చివరివరకూ కేంద్రానికి అదుపు లేని అధికారాలనూ, అన్ని విషయాలలోనూ జోక్యం కలిగించుకోడానికి అడ్డులేని హక్కునూ ఇవ్వాలనే కోరికతో నిండివుంద''నీ, అది కింది శాఖలకు ''ఒక ఒకే హక్కును — పైనుంచి వచ్చే ఆజ్ఞలకు నోరు మెదపకుండా లోబడివుండే హక్కును'' ఇస్తోందనీ ఇలాగే ఇంకా ఏమేమో వాదించాడు. ''ఈ ముసాయిదా ప్రతిపాదించిన కేంద్రం ఒక శూన్యంలో వుంటుంది, దాని చుట్టూ స్థానిక శాఖలు ఏమీ వుండవు, దాని కార్యనిర్వాహక ఏజెంట్లు తిరిగే ఒక రూపరహితమైన సమూహం మాత్రం వుంటుంది'' అన్నాడు. ఇది సరిగ్గా మార్తొవ్‌లూ అక్సెల్‌రోడ్‌లూ, మహాసభలో తమ ఓటమి తరవాత మమ్మల్ని గురించి చెప్పసాగిన తప్పుడు పదగుంభనం లాగనే వుంది. బుంద్ ఒక పక్కన తన స్వంత కేంద్ర కమిటీకి ఇంతకంటె ఎక్కువ ఖచ్చితమైన అదుపులేని అధికారాలను (సభ్యులను నియమించడం, తొలగించడం, మహాసభలకు ప్రతినిధులను రానివ్వకుండా నిరాకరించడం సహితం చేయగలిగే అధికారాలను) ఇస్తూ మన కేంద్రీకరణను వ్యతిరేకించి పోరాడినప్పుడు నవ్వుల పాలు అయింది. అలాగే విషయాలను వివేచన చేసినప్పుడు మైనారిటీ వర్గం వారి అరుపులు కూడా పరిహసింప బడతాయి; ఎందుచేతనంటే, వారు తాము మైనారిటీలో వున్నప్పుడు కేంద్రీకరణకూ నిబంధ నావళికీ వ్యతిరేకంగా కేకలు వేశారు, కాని మెజారిటీ సంపాదించగలగగానే నిబంధనావళిని తమ లాభానికి ఉపయోగించుకోడంలో వారు ఏ మాత్రం ఆలస్యం చేయలేదు.

రెండు కేంద్రాల సమస్యమీద కూడా గ్రూపింగు స్పష్టంగా కనబడింది: ''ఇస్క్రా'' వాళ్లందర్నీ లీబెర్ (కేంద్ర పత్రిక కౌన్సిలులో కేంద్ర కమిటీపై ప్రాబల్యం కలిగివుండటం గురించి ఇప్పుడు ఇష్టపాత్రమైన అక్సెల్‌రోడ్–మార్తొవ్‌లకు వంత పాడటంలో మొదటి వాడైన), అకీమొవ్, పొపొవ్, యెగోరొవ్ వ్యతిరేకించారు. నిర్మాణం గురించి పాత

''ఇస్క్రా'' ఎల్లప్పుడూ సమర్థిస్తూ వచ్చిన భావాలనుంచే (వాటిని పొపోవ్‌లూ యెగోరొవ్‌లూ మాటల్లో ఆమోదించారు!) రెండు కేంద్రాల పథకం తనంతట తనే వచ్చింది. పాత ''ఇస్క్రా'' విధానం ''యూజ్నీ రబోచీ''యొక్క పథకాలను, పోటీగా మరొక జన ప్రియమైన పత్రికను ప్రారంభించి వాస్తవంలో దానిని ప్రబలమైనదిగా చేయాలనే పథకాలను, భగ్నం గావించింది. ప్రథమ వీక్షణంలోనే ఎంతో వింతగా కనబడే విరుద్ధతయొక్క మూలం, ''ఇస్క్రా'' వ్యతిరేకులందరూనూ, ''ఊబి'' యావత్తూనూ ఒకే కేంద్ర సంస్థకు, అంటే మరింత ఎక్కువ కేంద్రీకరణగా కనబడేదానికి అనుకూలురనేదాని మూలం అందులోనే వుంది. ''యూజ్నీ రబోచీ''యొక్క నిర్మాణ పథకాలు ఎక్కడికి దారితీస్తాయో, వ్యవహారాల స్వభావాన్ని బట్టి దారితీయక తప్పదో బహుశా ఒక స్పష్టమైన అభిప్రాయం లేని ప్రతినిధులు కొందరు వున్నారు (ముఖ్యంగా ''ఊబి''లో) కాని, వారికి స్థిర సంకల్పం లేకపోవడం మూలంగానూ, వారిని గురించి వారికే నమ్మకం లేకపోవడం మూలంగానూ వారు ''ఇస్క్రా'' వ్యతిరేకులను అనుసరించవలసి వచ్చింది.

నిబంధనావళిపై జరిగిన యీ చర్చలో (''ఇస్క్రా''వాళ్లలో చీలిక రావడానికి ముందు జరిగిన చర్చలో) ''ఇస్క్రా''వాళ్ల ప్రసంగాలలో ప్రత్యేకించి గమనించ తగినవి కామ్రేడ్స్ మార్తొవ్ (నిర్మాణాన్ని గురించిన నా భావాలతో ''ఏకీభవించడం''), ట్రాట్స్కీలు చేసినవి. కామ్రేడ్స్ అకీమొవ్, లీబెర్‌లకు ట్రాట్స్కీ చెప్పిన సమాధానంలో ప్రతి మాటా కూడా మహాసభ తరువాత ''మైనారిటీ'' ప్రవర్తనలోని సిద్ధాంతాలలోని పూర్తి అబద్ధతను బట్టబయలు చేసింది. ''నిబంధనావళి, కేంద్ర కమిటీయొక్క అధికార పరిధిని తగినంత ఖచ్చితంగా నిర్వచించలేదని ఆయన [కామ్రేడ్ అకీమొవ్] అన్నాడు. నేను ఆయనతో ఏకీభవించలేను. తద్భిన్నంగా ఈ నిర్వచనం ఖచ్చితంగానే వుంది, పార్టీ ఒకే మొత్తం కనుక స్థానిక కమిటీలపై దాని అదుపును నిస్సందేహం చేయాలి అని దాని అర్థం. కామ్రేడ్ లీబెర్ నా మాటలను వాడుకొని ఈ నిబంధనావళి 'సంఘటిత అవిశ్వాసం' అన్నాడు. అది నిజమే, కాని నేను ఆ మాటలను బుంద్ ప్రతినిధులు ప్రతిపాదించిన నిబంధనావళి పట్ల ఉపయోగించాను, అది పార్టీలో ఒక విభాగానికి మొత్తం పార్టీ పట్ల సంఘటిత పర్చబడిన అవిశ్వాసాన్ని తెలిపింది. తద్భిన్నంగా మన నిబంధనావళి (కేంద్ర సంస్థల కూర్పు విషయంలో ఓటమికి ముందు అది 'మన' నిబంధనావళి!) పార్టీలోని అన్ని విభాగాల పట్లా పార్టీయొక్క సంఘటిత పర్చబడిన అపనమ్మకాన్ని తెలియజేస్తుంది, అంటే అన్ని స్థానిక, జిల్లా, జాతీయ, తదితర శాఖలపైనా అదుపును తెలియజేస్తుంది'' (పేజీ 158). అవును, ఇక్కడ మన నిబంధనావళి సరిగానే వర్ణించబడింది. అది ఒక జిత్తులమారి మెజారిటీ ''సంఘటిత అవిశ్వాసం'' పద్ధతిని లేక ''ముట్టడి స్థితియే'' అయినదానిని

గురించి ఆలోచించి ప్రవేశపెట్టింది అని ఇప్పుడు మనకి అతి నిర్భయంగా నచ్చచెబుతున్నవారు దీనిని తరచుగా జ్ఞాపకం చేసుకోవాలని మేము సలహా యిస్తాము. రాజకీయ బలహీనతకు ఒక మచ్చు కావాలంటే, విషయం కింది శ్రేణిలోని తమ స్వంత గ్రూపుకు సంబంధించినదా లేక ఇతరులకు సంబంధించినదా అనే దానిపై ఆధారపడుతూ మార్తొవ్ అండ్ కంపెనీ అభిప్రాయాలు ఎలా మారాయో తెలిపే మచ్చును చూడాలంటే, ఈ ప్రసంగాన్ని దేశాంతర లీగు మహాసభలో జరిగిన ప్రసంగాలతో పోల్చిచూస్తే చాలు.

## ఐ) నిబంధనావళిలో మొదటి నిబంధన

మహాసభలో ఏయే సూత్రీకరణలపై ఆసక్తిదాయకమైన చర్చ రేగిందో ఆ వివిధ సూత్రీకరణలను ఇదివరకే ఉదహరించాము. ఈ చర్చ దాదాపు రెండు సమావేశాల కాలాన్ని తీసుకుంది, రెండు హాజరు పట్టీ వోటింగులతో ముగిసింది. (నా లెక్క పొరపాటు కాకపోతే, మొత్తం మహాసభ అంతటిలోనూ ఎనిమిది హాజరు పట్టీ వోటింగులు మాత్రమే జరిగాయి, వాటి మూలంగా చాలా కాలం వృథా అయింది కనుక ఎంతో ముఖ్యమైన సందర్భాలలో మాత్రమే ఆ పద్ధతి అవలంబించబడింది.) చర్చింపబడిన సమస్య నిస్సందేహంగా సూత్రానికి సంబంధించినదే అయివుంది. చర్చపట్ల మహాసభ చూపిన ఆసక్తి అద్భుతం. ప్రతినిధులు అందరూ వోటు చేశారు — ఇది మన మహాసభలో ఒక అరుదైన సంఘటన (ఏ పెద్ద మహాసభలోనైనా అంతే), ఆవిధంగా అది, వాదించుకునే వారు ప్రదర్శించిన ఆసక్తిని నిరూపించుతుంది.

ఇక, వివాదంలో వున్న సమస్య సారాంశం ఏమిటి? ''మన అభిప్రాయభేదం (మొదటి నిబంధనపై) మన పార్టీకి జీవన్మరణ సమస్య అయేటంతటి ముఖ్యమైనదిగా నేను ఎంత మాత్రం పరిగణించడం లేదు. నిబంధనావళిలోని ఒక పనికిమాలిన వాక్యం మూలంగా మనం ఎన్నటికీ నాశనం కాము!'' అని నేను మహాసభలో ఇదివరకే చెప్పాను, తరువాత పదే పదే పునరుద్ఘాటించాను (పేజి 250). దానిని మట్టుకే తీసుకుని చూస్తే, యీ అభిప్రాయభేదం, సూత్రానికి సంబంధించిన భిన్న దృక్పథాలను బైటపెట్టినప్పటికీ, మహాసభానంతరం వచ్చిన విభిన్నతకు (నిర్మొగమాటంగా చెప్పాలంటే చీలికకు) ఏవిధంగానూ కారణం అయివుండేది కాదు. కాని, చాలా చిన్న అభిప్రాయభేదం అయినా మనం దానిపై పట్టుపడితే, దానినే ముందుకు తీసుకు వస్తే, ఈ అభిప్రాయభేదపు మూలం కోసమూ దాని శాఖల కోసమూ వెతకడం మొదలుపెడితే అది పెద్దది కావచ్చు. ప్రతి చిన్న అభిప్రాయ

భేదమూ, నిశ్చయమైన పొరపాటు అభిప్రాయాల వైపు మొగ్గడానికి ఆరంభ అంశంగా ఉపయోగపడితే, కొత్త, అదనపు విభిన్నత మూలంగా యీ పొరపాటు అభిప్రాయాలు పార్టీని చీలిపోయే దశకు తీసుకు వచ్చే అరాజక చర్యలతో జతచేయబడితే అది ప్రచండమైన ప్రాముఖ్యతను వహించవచ్చు.

ప్రస్తుత విషయంలో సరిగ్గా అదే జరిగింది. మొదటి నిబంధనపై వచ్చిన స్వల్పమైన అభిప్రాయభేదం ఇప్పుడు ప్రచండమైన ప్రాముఖ్యతను వహించింది. ఎందుచేతనంటే, మైనారిటీ పక్షం (ముఖ్యంగా లీగు మహాసభలోనూ, కొత్త ''ఇస్క్రా'' పత్రిక పేజీలలోనూ కూడా) అవకాశవాద అగాధాలలోకీ అరాజకవాద పదగుంభనంలోకీ పోవడం దీనితోనే ఆరంభమైంది. ''ఇస్క్రా''వాళ్ల మైనారిటీ ''ఇస్క్రా'' వ్యతిరేకులతోనూ, ''ఊబి'' తోనూ కలవడం దీనితోనే ప్రారంభం అయింది. ఈ కలయిక ఎన్నికల సమయానికి ఒక నిర్ణాయకమైన స్పష్టమైన రూపం తీసుకుంది. దీనిని అర్థం చేసుకోకుండా, కేంద్ర సంస్థల కూర్పు విషయంపై వచ్చిన ముఖ్యమైన మౌలికమైన చీలికను అర్థం చేసుకోడం అసాధ్యం అవుతుంది. మొదటి నిబంధన విషయంలో మార్తొవ్, అక్సెల్‌రోడ్ చేసిన చిన్న పొరపాటు మన పాత్రకు ఒక చిన్న పగులు అయింది (లీగు మహాసభలో నేను ఇదే చెప్పాను). పాత్రను దేనితోనైనా బాగా చుట్టి గట్టిగా ముడిపెట్టవచ్చు; (మార్తొవ్ లీగు మహాసభలో దాదాపు ఉన్మత్త స్థితిలో వున్నాడు, ఆయన అపార్థం చేసుకున్నట్టుగా ఉరితాడు ముడి కాదు). లేదా అన్ని ప్రయత్నాలూ ఆ పగులును పెద్దది చేయడానికీ, పాత్రను రెండు ముక్కలుగా చేయడానికీ సాగవచ్చు. మహా పట్టుదలతో వున్న మార్తొవ్ అనుచరుల బహిష్కారం మూలంగానూ అలాంటి అరాజక చర్యల మూలంగానూ అదే జరిగింది. మొదటి నిబంధనపై వచ్చిన అభిప్రాయభేదం కేంద్ర సంస్థలకు జరిగిన ఎన్నికలలో తక్కువ పాత్రనేమీ నిర్వహించలేదు, ఎన్నికలలో మార్తొవ్ ఓటమి ఆయనను ''సూత్రాల గురించిన పోరాటం''లోకి నడిపించింది. దానిలో ఆయన మొరటు అనాలోచిత పద్ధతులనూ, జగడమాడే పద్ధతులనూ సహితం ఉపయోగించాడు. (ఉదాహరణకు దేశాంతర రష్యన్ విప్లవ సోషల్ డెమోక్రట్ల లీగు మహాసభలో ఆయన ప్రసంగాలు.)

ఇప్పుడు, యీ ఘటనలన్నీ జరిగిన తరువాత, మొదటి నిబంధన సమస్య ఆవిధంగా ప్రచండ ప్రాముఖ్యతను వహించింది, ఈ నిబంధనపై జరిగిన వోటింగులో మహాసభలో ఏర్పడిన గ్రూపింగుల స్వభావాన్ని — అంతకంటే ఇంకా ముఖ్యమైనది అయిన — మొదటి నిబంధనపై జరిగిన చర్చలో బైటపడిన లేక బయటపడ నారంభించిన ధోరణుల స్వభావాన్ని మనం స్పష్టంగా గుర్తించాలి. ఇప్పుడు, జరిగిన ఘటనలు పాఠకునికి తెలిసిన తరువాత, సమస్య ఇలా వుంటుంది: అక్సెల్‌రోడ్ బలపర్చిన మార్తొవ్ సూత్రీకరణ, నేను పార్టీ

మహాసభలో చెప్పినట్టుగా (పేజి 333), ఆయన (లేక వారి) అస్థిరతనూ, వూగిసలాటనూ, రాజకీయ అస్పష్టతనూ ప్రతిబింబిస్తోందా, లీగు మహాసభలో ప్లెహానొవ్ భావించినట్టుగా (లీగు మినిట్స్, పేజి 102, తదితర చోట్లా) జోరేసిజం[21] వైపుకూ, అరాజకవాదం వైపుకూ ఆయన (లేక వారి) పెడత్రోవను ప్రతిబింబిస్తోందా? లేక ప్లెహానొవ్ బలపర్చిన కేంద్రీకరణ గురించిన నా సూత్రీకరణ ఒక తప్పుడు, బ్యూరాక్రటిక్, లాంఛనతత్వపు, తుగ్లక్ బాపతు, సోషల్ డెమోక్రటికేతర భావాన్ని ప్రతిబింబిస్తోందా? అవకాశవాదమూ అరాజకవాదమూనా లేక బ్యూరాక్రటిజమూ లాంఛన ప్రాధాన్యవాదమూనా? — చిన్న అభిప్రాయభేదం పెద్దది అయిన తరువాత సమస్య ఇప్పుడు ఆ విధంగా తయారై వుంది. నా సూత్రీకరణలోని అనుకూల ప్రతికూల వాదనలను సూత్రరీత్యా చర్చించేటప్పుడు, మనం సమస్యను సరిగా ఈ రూపంలోనే మనసులో పెట్టుకోవాలి. సంఘటనలచేత మనందరి మీదికీ రుద్దబడిన, లేదా ఎక్కువ డాంబికమైన మాట కాకపోతే, అది ఒక చారిత్రక పరిణామం అయిన సమస్య అని అంటాను.

మహాసభలో జరిగిన చర్చ విశ్లేషణతో ఈ వాదనలను పరిశీలించడం మొదలు పెడదాం. కామ్రేడ్ యెగోరొవ్ చేసిన మొదటి ప్రసంగం, ఆయన వైఖరి (non liquet, నాకది ఇంకా స్పష్టం కాలేదు, నిజం ఎందులో వుందో నాకింకా తెలియదు) చాలా మంది ప్రతినిధుల వైఖరిని బాగా వ్యక్తంచేస్తుందనే దృష్ట్యా మాత్రమే ఆసక్తికరంగా వుంది: చాలా మంది ప్రతినిధులకు నిజంగా కొత్తదీ, బాగా సంక్లిష్టమైనదీ, వివరమైనదీ అయిన ఈ సమస్యను అవగాహనచేసుకోడం కష్టం అయిపోయింది. తరువాతి ప్రసంగం, కామ్రేడ్ అక్సెల్‌రోడ్ ప్రసంగం, ఈ సమస్యను తక్షణమే సూత్రబద్ధమైనదిగా చేసివేసింది. కామ్రేడ్ అక్సెల్‌రోడ్ చేసిన మొదటి సూత్రబద్ధమైన ప్రసంగం ఇదే. సరిగ్గా చెప్పాలంటే మహాసభలో ఆయన చేసిన ప్రసంగాలలోనే ఇది మొదటిది. మొదటి ప్రసంగంలో ప్రసిద్ధికెక్కిన "ఆచార్యుల"కు ప్రస్తావన ప్రత్యేకించి అదృష్టవంతమైనదని చెప్పడం కష్టం. కామ్రేడ్ అక్సెల్‌రోడ్ ఇలా అన్నాడు: "నా అభిప్రాయంలో పార్టీ, శాఖ అనే భావనల మధ్య గల తేడాను మనం స్పష్టం చేయాలి. ఈ రెండు భావనలూ యిక్కడ గజిబిజి చేయబడుతున్నాయి. ఈ గజిబిజి ప్రమాదకరం." నా సూత్రీకరణకు వ్యతిరేకంగా ఇది మొదటి వాదం. దానిని మరింత జాగ్రత్తగా పరిశీలించండి. పార్టీ, కొన్ని శాఖల మొత్తం*

* "శాఖ" అనే మాటను సాధారణంగా రెండు అర్థాలలో ఉపయోగిస్తారు. ఒకటి విశాలమైన అర్థం, రెండవది సంకుచితమైన అర్థం. సంకుచితమైన అర్థంలో అది కనీస ప్రమాణంలో ఒక రూపం కలిగివుండిన ప్రజా సమూహపు విడి ముఖ్యభాగాన్ని తెలియజేస్తుంది. విశాలమైన అర్థంలో అది అటువంటి ముఖ్యభాగాలు ఒక మొత్తంగా ఐక్యమైన

(కేవలం గణక మొత్తం కాదు, ఒక సముదాయం) అని నేను అన్నప్పుడు దాని అర్థం నేను పార్టీ, శాఖలు అనే భావనలను "గజిబిజి చేస్తున్నాను" అనా? ఎంత మాత్రం కాదు. అందువల్ల, పార్టీ ఒక వర్గపు అగ్రదళంగా సాధ్యమైనంత సంఘటితమైనదిగా వుండాలనీ, అది తన శ్రేణులలోకి ఒక కనీస సంఘటిత రూపాన్ని అయినా అంగీకరించే సభ్యులను మాత్రమే చేర్చుకోవాలనీ అనే నా కోరికనూ, డిమాండునూ స్పష్టంగానూ ఖచ్చితంగానూ తెలుపుతున్నాను. తద్భిన్నంగా నా ప్రత్యర్థి, పార్టీలో సంఘటితులైన వారినీ సంఘటితులు కాని వారినీ, ఆదేశాలను పాటించే వారినీ, పాటించని వారినీ, ప్రగతిశీలమైన వారినీ సరిదిద్ద శక్యం కానంత వెనుకబడి వున్న వారినీ — ఎందుకంటే సరిదిద్దడం శక్యమయేంత వెనుకబడి వున్న వారు శాఖలో చేరవచ్చు — కలగాపులగం చేస్తున్నాడు, ఈ గజిబిజి నిజంగా ప్రమాదకరమే. కామ్రేడ్ అక్సెల్‌రోడ్ "గత కాలానికి చెందిన ఖచ్చితంగా రహస్యమూ కేంద్రీకృతమూ అయి వున్న శాఖలను" ("జెమ్ల్యా ఇ వోల్య,"[22] "నరోద్నయ వోల్య"[23] ప్రస్తావిస్తున్నాడు. ఆయనిలా అన్నాడు: "వాటిచుట్టూ అనేక మంది ప్రజలు సమీకృతమయారు. వారు ఆ శాఖలో చేరినవారు కారు, కాని ఏదో విధంగా దానికి సహాయపడ్డారు, వారు పార్టీ సభ్యులుగానే పరిగణింపబడ్డారు.... సోషల్ డెమోక్రటిక్ సంఘంలో యీ సూత్రం మరింత ఖచ్చితంగా పాటించబడాలి." ఇక్కడ మనం ఈ సమస్యకి సంబంధించిన ఒక కీలక అంశానికి వస్తున్నాం: "ఈ సూత్రం" — పార్టీకి సంబంధించిన ఏ శాఖలకూ చెందకుండా వుండి "ఏదో విధంగా సహాయపడే వారిని పార్టీ సభ్యులని చెప్పుకోడానికి అనుమతించే యీ సూత్రం — నిజంగా సోషల్ డెమోక్రటిక్ సూత్రమా? ఈ ప్రశ్నకున్న ఒకే ఒక తగిన సమాధానాన్ని

---

సముదాయాన్ని తెలియజేస్తుంది. ఉదాహరణకు, నౌకాదళమూ, సైన్యమూ, రాజ్యమూ ఇవి అన్నీ ఒకే సారి కొన్ని శాఖల మొత్తమూ (ఆ మాటయొక్క సంకుచితార్థంలో), ఒక రకమైన సామాజిక సంఘం (ఆ మాటయొక్క విశాలమైన అర్థంలో) కూడా అయి వుంటాయి. విద్యా శాఖ ఒక సంఘం (విశాలమైన అర్థంలో), అందులో అనేక శాఖలు (సంకుచితార్థంలో) చేరివుంటాయి. అదే విధంగా పార్టీ అన్నది ఒక సంఘం, ఒక సంఘం అయి తీరాలి (విశాలమైన అర్థంలో); అదే సమయంలో పార్టీలో అనేక విభిన్న శాఖలు (సంకుచితార్థంలో) చేరివుండాలి. అందుచేత కామ్రేడ్ అక్సెల్‌రోడ్ పార్టీ భావనకూ శాఖ భావనకూ మధ్య వ్యత్యాసాన్ని చూపుతూ మాట్లాడినప్పుడు, "శాఖ" అనే మాటకున్న విశాలమైన అర్థానికీ సంకుచితమైన అర్థానికీ మధ్య వున్న తేడాను పరిగణనలోకి తీసుకోలేదు. రెండవది, తనే సంఘటిత శక్తులనూ, సంఘటితం కాని శక్తులనూ గజిబిజి చేస్తున్నాడన్న సంగతిని గమనించలేదు.

ప్లెహానొవ్ చెప్పాడు. ఆయనిలా అన్నాడు: "1870 దశకాన్ని ప్రస్తావించడంలో అక్సెల్‌రోడ్ తప్పుచేశాడు. అప్పుడు సుసంఘటితమైన, అద్భుతమైన క్రమశిక్షణ కలిగివున్న కేంద్రం వుంది; అది నెలకొల్పిన వివిధ రకాల సంఘాలు దాని చుట్టూ వున్నాయి; ఈ సంఘాల వెలుపల మిగిలి వున్నదంతా అవ్యక్తస్థితీ, అరాజకత్వమూ. ఈ అవ్యక్తస్థితిలోని వారు కొందరు తాము పార్టీ సభ్యులమని చెప్పుకున్నారు, కాని ఇది ఆశయానికి లాభం కలిగించ డానికి బదులు హాని చేసింది. మనం 1870 దశకపు అరాజకత్వాన్ని అనుకరించకూడదు, దానినుంచి తప్పించుకోవాలి." అందుచేత కామ్రేడ్ అక్సెల్‌రోడ్ సోషల్ డెమోక్రటిక్ సూత్రంగా చిత్రించగోరే "ఈ సూత్రం" వాస్తవానికి అరాజక సూత్రం. దీనిని ఖండించ డానికి, ఒక సంఘం వెలుపల అదుపూ, నాయకత్వమూ, క్రమశిక్షణా సాధ్యమౌతాయనీ, "అరాజక వ్యక్తుల"కు పార్టీ సభ్యులనే హోదా ఇవ్వడం అవసరం అనీ నిరూపించవలసి వుంటుంది. కామ్రేడ్ మార్తొవ్ సూత్రీకరణను బలపర్చినవారు ఈ రెండింటిలో దేనినీ కూడా రుజువు చేయలేదు, చేయలేకపోయారు. "తన్ను తాను ఒక సోషల్ డెమోక్రట్‌గా పరిగణించుకుంటూ, ఆవిధంగా ప్రకటించుకునే ఒక ఆచార్యుని" కామ్రేడ్ అక్సెల్‌రోడ్ ఉదాహరణగా తీసు కున్నాడు. ఈ ఉదాహరణలో వున్న ఆలోచనను పూర్తిచేయడానికి కామ్రేడ్ అక్సెల్‌రోడ్, సంఘటితులైన సోషల్ డెమోక్రట్లు తాము ఈ ఆచార్యుని ఒక సోషల్ డెమోక్రట్‌గా పరిగణించారో లేదో కూడా చెప్పివుండవలసింది. ఈ తరువాతి ప్రశ్నను లేవనెత్తక పోవడంతో కామ్రేడ్ అక్సెల్‌రోడ్ తన వాదనను సగంలోనే వదలివేశాడు. ఏమైనా ఏదో ఒకటి అవాలి కదా. సంఘటితులైన సోషల్ డెమోక్రట్లు ఆ ఆచార్యుని ఒక సోషల్ డెమోక్రట్‌గా పరిగణించనైనా పరిగణించాలి, అలా అయితే ఆయనను సోషల్ డెమోక్రటిక్ శాఖలలో ఒక దానిలో ఎందుకు సభ్యునిగా చేర్చుకోకూడదు? ఎందుకంటే ఆ ఆచార్యుడు కనక ఆవిధంగా ఒక సభ్యుడుగా చేర్చుకొనబడితే ఆయన "ప్రకటన" చేతలకు సరిపోతుంది. వట్టి మాట కాదు (చాలా తరుచుగా ఆచార్యుల ప్రకటనలు అలాగే వుంటాయి). లేదా, సంఘటితులైన సోషల్ డెమోక్రట్‌లు ఆ ఆచార్యుని ఒక సోషల్ డెమోక్రట్‌గా పరిగణించకుండా వుండాలి, అలా అయితే ఆయనను పార్టీ సభ్యుడు అనే గౌరవనీయమైన, బాధ్యతాయుతమైన హోదాను పెట్టుకోనివ్వడం అసంగతమూ, అర్థరహితమూ, హానికరమూ అవుతుంది. అందుచేత విషయం క్లుప్తంగా యీ రెండింటిలో ఏదో ఒకటి అవుతుంది: నిర్మాణ సూత్రాన్ని ఒకే రీతిగా వర్తింపజేయడమా, లేక అనైక్యతకూ అరాజకత్వానికీ పవిత్రతను కలుగజేయడమా? ఇదివరకే ఏర్పడి, ఐక్యమైనదీ ఈ పార్టీ మహాసభను జరుపు కోడానికి అవకాశం కలిగించినదీ, అన్ని రకాల పార్టీ శాఖలనూ విస్తృతపర్చి వృద్ధిచేయవల సినదీ అయిన సోషల్ డెమోక్రట్‌ల కేంద్రం ఆధారంగా మనం పార్టీని నిర్మించాలా; లేక

సహాయపడేవారు అందరూ పార్టీ సభ్యులే అనే ఊరడింపు పదంతో సంతృప్తి చెందాలా? కామ్రేడ్ అక్సెల్‌రోడ్ ఇంకా ఇలా అన్నాడు: ''లెనిన్ సూత్రీకరణను మనం అంగీకరిస్తే, ఒక శాఖలోకి సరాసరి చేర్చుకోడానికి వీలు లేకపోయినప్పటికీ పార్టీ సభ్యులే అయిన కొంత మందిని మనం బైటికి తోసివేసిన వాళ్లం అవుతాం.'' భావనలను గురించి ఏ గజిబిజి అయితే నాకు వుందని కామ్రేడ్ అక్సెల్‌రోడ్ నిందించాలనుకున్నాడో అదే గజిబిజి ఆయనలో ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోంది: సహాయం చేసే వాళ్లంతా పార్టీ సభ్యులే అనేది అంగీకృత విషయంగా పరిగణిస్తున్నాడు. మొత్తం వాదం అంతా దానిని గురించే, అలాంటి వ్యాఖ్యానం అవసరమనీ, ఉపయోగకరమనీ మన వ్యతిరేకులు ఇంకా రుజువు చేయవలసి వుంది. ''బైటికి తోసివేయడం'' అనే మాటకు అర్థం ఏమిటి? వినగానే యీ మాట ఘోరం అనిపిస్తుంది. పార్టీ శాఖలుగా గుర్తింపబడిన శాఖల్లోనివారే పార్టీ సభ్యులుగా పరిగణింపబడినప్పటికీ ఏ పార్టీ శాఖలోనూ ''సరాసరి'' సభ్యులుగా చేరజాలని వారు పార్టీకి చెందకపోయినా పార్టీతో సంబంధం వున్న శాఖలో పని చేయవచ్చు. అందుచేత, ఎవరినీ కూడా, పని చేయకుండానూ ఉద్యమంలో పాల్గొనకుండానూ నిరోధించడమనే అర్థంలో బైటికి తోసివేయడం అనే మాటే రాదు. తద్భిన్నంగా, నిజమైన సోషల్ డెమోక్రట్లతో కూడివున్న మన పార్టీ శాఖలు ఎంత బలంగా వుంటే పార్టీలోపల వూగిసలాటా, అస్థిరతా అంత తక్కువగా వుంటాయి, పార్టీ చుట్టూ వున్నదానిచే నడుపబడుతున్న కార్మికవర్గ జన బాహుళ్యంలో పార్టీ పలుకుబడి మరింత విస్తృతమూ, మరింత బహుముఖమూ, మరింత ఘనమూ, మరింత ఫలవంతమూ అవుతుంది. కార్మికవర్గపు అగ్రదళం అయిన పార్టీ, మొత్తం కార్మికవర్గమూ ఒకటే నని ఎంతమాత్రం అనుకోకూడదు. కామ్రేడ్ అక్సెల్‌రోడ్ సరిగ్గా యీ గజిబిజినే చేస్తున్నాడు (ఇది మొత్తంమీద మన అవకాశవాద ఆర్థికవాద ప్రత్యేక లక్షణం). ఆయన ఇలా అన్నాడు: ''మొట్టమొదటి విషయం, పార్టీలోని అత్యంత చురుకైన సభ్యులతో ఒక సంఘాన్ని, విప్లవవాదుల సంఘాన్ని, మనం నిర్మిస్తున్న మాట నిజం; కాని మనం ఒక వర్గపు పార్టీ కనక, అంత చురుకుగా కాకపోయినప్పటికీ చైతన్యంతో మన పార్టీకి సన్నిహితంగా వుండే వారిని పార్టీ శ్రేణుల వెలుపలనే వదలివేయకుండా శ్రద్ధతీసుకోవాలి.'' మొదటిది, సోషల్ డెమోక్రటిక్ కార్మికవర్గ పార్టీలో చురుకుగా పనిచేసేవారిలో విప్లవవాదుల సంఘాలు మాత్రమే గాక, పార్టీ శాఖలుగా గుర్తింపబడిన కార్మిక సంఘాలు అనేకం చేరివుంటాయి. రెండవది, ఏ కారణం మూలంగా, ఏ తర్కం ప్రకారం, మనం ఒక వర్గపు పార్టీ అనే వాస్తవంనుంచి, పార్టీకి చెందినవారికీ, పార్టీకి సన్నిహితంగా వుండేవారికీ మధ్య తేడా చూపడం అవసరం లేదనే నిర్ణయానికి రావలసి వుంటుంది? విషయం అందుకు పూర్తిగా వ్యతిరేకం: చైతన్య స్థాయిలోనూ, చురుకుదనపు స్థాయిలోనూ తేడాలు వున్నాయి కనుకనే పార్టీతో

గల సాన్నిహిత్య స్థాయిలో తేడా చూపవలసి వుంటుంది. మనం ఒక వర్గపు పార్టీ, అందుచేత దాదాపు ఆ వర్గం యావత్తూ (యుద్ధకాలంలోనూ, అంతర్యుద్ధకాలంలోనూ వర్గం యావత్తూను) మన పార్టీ నాయకత్వం కింద పనిచేయాలి, మన పార్టీకి సాధ్యమైనంత సన్నిహితంగా వుండాలి. కాని, పెట్టుబడిదారీ వ్యవస్థలో ఆ వర్గం యావత్తూ గాని, దాదాపు యావత్తూ గాని తన అగ్రదళానికి, తన సోషల్ డెమోక్రటిక్ పార్టీకి వున్న చైతన్య స్థాయికి, చురుకుదనపు స్థాయికి ఎప్పటికైనా చేరుకోగలదని అనుకోడం మనీలొవిజం,[24] "తోకపట్టుకుని పోవడం" అవుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో ట్రేడ్ యూనియన్ సంఘాలు సహితం (వెనుకబడివున్న విభాగాలకు మరింత ఆదిమమూ మరింత గ్రాహ్యమూ అయి వున్నవి) కార్మికవర్గం యావత్తునూ గాని, దాదాపు యావత్తునూ గాని తమ పలుకుబడి కిందికి తెచ్చుకోజాలవు అనే విషయంలో ఇంగితజ్ఞానం గల సోషల్ డెమోక్రట్‌కు ఎవరికీ ఎన్నడూ సందేహం లేదు. అగ్రదళానికీ, దాని వైపుకు మొగ్గుతూన్న జనబాహుళ్యం మొత్తానికీ మధ్యనున్న తేడాను మరచిపోవడమూ, అంతకంతకు ఎక్కువ మందిని తన ఉన్నత స్థాయికి తీసుకురావడం అగ్రదళంయొక్క నిరంతర కర్తవ్యం అన్న సంగతిని మరచిపోవడమూ అంటే కేవలం ఆత్మవంచన చేసుకోడం, మన కర్తవ్యాల అపారతను చూడకపోవడం, ఈ కర్తవ్యాలను సంకుచితపరచడం అవుతుంది. ఈ చూడకపోవడమూ, ఈ మరుపూ మూలంగానే పార్టీకి సన్నిహితంగా వుండేవారికీ పార్టీకి చెందినవారికీ మధ్య, చైతన్యవంతులకీ చురుకుగా పనిచేసేవారికీ మనకు కేవలం సహాయపడేవారికీ మధ్య నున్న తేడా కనబడకుండా పోతోంది.

నిర్మాణపు అసంబద్ధతను సమర్థించడానికీ, నిర్మాణాన్ని నిర్మాణరాహిత్యంతో గజిబిజి చేయడాన్ని సమర్థించడానికీ మనం ఒక వర్గపు పార్టీ అని వాదించడం నదేజ్దిన్ చేసిన పొరపాటునే మరలచేయడం అవుతుంది. ఆయన "ఉద్యమపు 'లోతులోని' 'మూలాలని' గురించిన తాత్విక, సామాజిక-చారిత్రక సమస్యను... సాంకేతిక, నిర్మాణపర సమస్యతో కలగాపులగం చేశాడు" ("ఏం చెయ్యాలి?" పేజి 91*). కామ్రేడ్ అక్సెల్‌రోడ్ నేర్పుతో చేసిన యీ గజిబిజియే అప్పుడు కామ్రేడ్ మార్తొవ్ సూత్రీకరణను బలపర్చిన ఉపన్యాసకులచే కొన్ని డజనుల సార్లు పునశ్చరణ చేయబడింది. "పార్టీ సభ్యుడు అనే హోదా ఎంత ఎక్కువ విస్తృతమైతే అంత మంచిది" అన్నాడు మార్తొవ్. కాని ఈ హోదాను విస్తృతపర్చడం వల్ల కలిగే లాభం ఏమిటో ఆయన వివరించలేదు. అది వాస్తవానికి అనుగుణమైనది కాదు. పార్టీ శాఖకు చెందని పార్టీ సభ్యులపై అజమాయిషీ కేవలం ఒక కట్టుకథ

* మొదటి సంపుటంలో పేజి 229 చూడండి. – సం.

అనే విషయాన్ని కాదనగలమా? విస్తృతంగా వ్యాపించిన కట్టుకథ లాభదాయకం కాకపోగా హానికరం. ''ప్రతి సమ్మెదారుడూ ప్రదర్శనలో పాల్గొనే ప్రతి ఒక్కడూ తన చర్యలకు బాధ్యుడుగా తాను పార్టీ సభ్యుడనని ప్రకటించుకోగలిగితే మనం తప్పక ఆనందించగలం'' అన్నాడాయన (పేజి 239). అలాగా? ప్రతి సమ్మెదారునికీ తాను పార్టీ సభ్యుడనని ప్రకటించుకునే హక్కు వుండాలా? ఈ ప్రకటనలో కామ్రేడ్ మార్తొవ్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమాన్ని కేవలం సమ్మెలు చేసే స్థాయికి దిగజార్చడం ద్వారా తన పొరపాటును అసంబద్ధ స్థితికి తీసుకుపోతున్నాడు. ఆవిధంగా అకీమొవ్‌ల దుస్సంఘటనలను పునరావృతం చేస్తున్నాడు. సోషల్ డెమోక్రట్లు ప్రతి సమ్మెనూ నడపడానికి అవకాశం కలిగితే మనం తప్పక సంతోషిస్తాం, ఎందుకంటే, శ్రామికవర్గపు వర్గపోరాట ప్రత్యక్ష రూపాలను ప్రతిదానినీ నడపడం వారి స్పష్టమైన నిర్వివాదమైన కర్తవ్యం. ఆ పోరాటపు అత్యంత పరిపూర్ణమైన అత్యంత శక్తివంతమైన ప్రత్యక్ష రూపాలలో సమ్మె ఒకటి. కాని, ipso facto* ట్రేడ్‌యూనియనిస్టు రూపం అయిన యీ ప్రాథమిక పోరాట రూపమూ, సర్వతోముఖమైన చైతన్యయుతమైన సోషల్ డెమోక్రటిక్ పోరాటమూ ఒకటే ననుకుంటే మనం తోక పట్టుకుపోయేవారమే అవుతాం. సమ్మె చేసే ప్రతి వారికీ ''పార్టీ సభ్యుడనని ప్రకటించుకునే'' హక్కును ఇస్తే, మనం అవకాశవాద తత్వంతో ఒక స్పష్టమైన అబద్ధాన్ని సుబద్ధం చేసినవారం అవుతాము, ఎందుకంటే మెజారిటీ సందర్భాలలో అలాంటి ''ప్రకటన'' బూటకం అవుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ కింద ''తర్ఫీదు పొందని,'' నేర్పులేని కార్మికులలో ఎక్కువ మందికి నష్టకరం అయితీరే అంతులేని అనైక్యత, పీడన, బుద్ధిమాంద్యం వున్న పరిస్థితులలో ప్రతి సమ్మెదారుడూ ఒక సోషల్ డెమోక్రటూ, సోషల్ డెమోక్రటిక్ పార్టీ సభ్యుడూ కాగలడని మనమూ నమ్మి, ఇతరులనూ నమ్మించడానికి ప్రయత్నిస్తే మనం పగటి కలలుకంటున్నట్టు అవుతుంది. ఈ ''సమ్మెదారుని'' ఉదాహరణ ప్రతి సమ్మెనూ సోషల్ డెమోక్రటిక్ పద్ధతిలో నడిపే విప్లవాత్మక ప్రయత్నానికీ, ప్రతి సమ్మెదారుడూ పార్టీ సభ్యుడేనని ప్రకటించే అవకాశవాద పదగుంభనానికీ మధ్య నున్న తేడాను ప్రత్యేకించి స్పష్టం చేస్తుంది. దాదాపు యావత్తు శ్రామికవర్గాన్నీ లేక యావత్తు శ్రామికవర్గాన్నీ సోషల్ డెమోక్రటిక్ పద్ధతిలో వాస్తవంగా నడిపేటంత మేరకు మనం ఒక వర్గపు పార్టీ; కాని దీనినుంచి, అకీమొవ్‌లు మాత్రమే మాటలలో మనం పార్టీనీ వర్గాన్నీ ఒకటిగానే పరిగణించాలనే నిర్ధారణ చెయ్యగల్గుతారు.

''కుట్రదారీ సంఘం అంటే నేను భయపడటం లేదు'' అన్నాడు కామ్రేడ్ మార్తొవ్

* వాస్తవానికి. — సం.

అదే ప్రసంగంలో. కాని తరువాత ఇంకా ఇలా అన్నాడు: ''నా అభిప్రాయంలో ఒక కుట్రదారీ సంఘం విస్తృతమైన సోషల్ డెమోక్రటిక్ కార్మికవర్గ పార్టీచే పరివేష్టితమై వున్నప్పుడే దానికి అర్థం వుంటుంది'' (పేజి 239). సరిగ్గా చెప్పాలంటే, అది ఒక విస్తృతమైన సోషల్ డెమోక్రటిక్ కార్మికవర్గ ఉద్యమంచే పరివేష్టితమై వున్నప్పుడే అని ఆయన అని వుండాల్సింది. ఆ రూపంలో వుండివుంటే కామ్రేడ్ మార్తొవ్ ప్రతిపాదన నిర్వివాదమైనదే గాక ప్రత్యక్ష సత్యం కూడా అయి వుండేది. నేను యీ విషయం గురించి ఎందుకు చెప్పానంటే, తరువాత మాట్లాడిన వారు మార్తొవ్ మాటలలో వున్న స్పష్టమైన సత్యాన్ని ఒక ప్రబలమైన చాలా అపభ్రంశమైన వాదంగా మార్చారు. లెనిన్ ''పార్టీ సభ్యుల మొత్తాన్ని కుట్రదారుల ముఠాకి పరిమితం చేయగోరుతున్నాడని అన్నారు. నవ్వుపుట్టించే యీ నిర్ధారణకు కామ్రేడ్ పొసదోవ్స్కీ, కామ్రేడ్ పొపోవ్ వచ్చారు; ఈ వాదాన్ని మర్తీనొవ్, అకీమొవ్ చేపట్టినప్పుడు దాని నిజలక్షణం, అవకాశవాద వాగాడంబరపు లక్షణం, బాగా ప్రదర్శితమైంది. ఈనాడు కామ్రేడ్ అక్సెల్‌రోడ్ కొత్త ''ఇస్క్రా''లో, నిర్మాణం గురించి కొత్త సంపాదకవర్గపు కొత్త అభిప్రాయాలను పాఠకులకు తెలియజేయడానికి అదే వాదాన్ని విస్తరింపజేస్తున్నాడు. మహాసభలో నిబంధనావళిలోని మొదటి నిబంధన చర్చింపబడిన మొదటి సమావేశంలోనే మన వ్యతిరేకులు యీ చౌకబారు ఆయుధాన్ని ఉపయోగించుకొన గోరుతున్నారని నేను గమనించి నా ప్రసంగంలో ఇలా హెచ్చరించాను (పేజి 240): ''పార్టీ శాఖలలో వృత్తి విప్లవకారులు మాత్రమే వుండాలని భావించకూడదు. మనకి అత్యంత పరిమితమైన రహస్యమైన సంఘాలు మొదలు ఎంతో విశాలమైన, స్వేచ్ఛాయుతమైన, వదులు అయిన సంఘాలవరకూ అన్ని రకాల సంఘాలతోనూ, శ్రేణులతోనూ, దృక్పథాలతోనూ కూడిన అత్యంత బహుముఖమైన సంఘాలు అవసరం.'' ఇంతటి స్పష్టమైన ప్రత్యక్షమైన సత్యాన్ని గురించి వివరించి చెప్పడం అనవసరమని అనుకున్నాను. కాని నేడు, అనేక విధాలుగా మనం వెనక్కి లాగబడి వున్నాం కనుక, ఈ విషయంమీద కూడా ''పాత పాఠాలను వల్లించ'' వలసి వస్తోంది. అందుకోసమని ''ఏం చెయ్యాలి?,'' ''ఒక కామ్రేడ్‌కి లేఖ''లనుండి కొన్ని భాగాలను ఉదహరిస్తాను:

''అలెక్సేయెవ్, మీష్కిన్, హల్తూరిన్, జెల్యాబొవ్ మాదిరి నాయకుల బృందం యీ రాజకీయ కర్తవ్యాలతో నిజాయితీగానూ, అత్యంత క్రియాపరమైన అర్థంలోనూ, సరితూగగలుగుతుంది. వాళ్ళు ఏ కారణంగా, ఏ మేరకు అలా చేయగలుగుతారంటే వాళ్ళు చేసే ఆవేశపూరిత ప్రచారానికి సద్యోజనితంగా జాగృతులవుతున్న జనసామాన్యం ప్రతిస్పందించింది కనుక, ప్రతిస్పందించిన మేరకు, వాళ్ళ పొంగిపొర్లే శక్త్యుత్సాహాలకు విప్లవ వర్గపు

ప్రతిస్పందనా, తోడ్పాటూ లభించింది కనుక, లభించిన మేరకు అలా చేయగలుగుతుంది.''* సోషల్ డెమోక్రటిక్ పార్టీగా వుండేటందుకు మనం సరిగ్గా వర్గపు మద్దతును సంపాదించి తీరాలి. కామ్రేడ్ మార్తొవ్ అనుకున్నట్టుగా, పార్టీ కుట్రదారీ సంఘాన్ని పరివేష్టించుకోవడం కాదు, విప్లవకర వర్గం అయిన శ్రామికవర్గం పార్టీని పరివేష్టించి వుండాలి. పార్టీలో కుట్రదారీ సంఘాలూ, కుట్రదారీవి కాని సంఘాలూ కూడా చేరివుండాలి.

''...ఆర్థిక పోరాటం జరిపే కార్మికుల సంఘాలు వృత్తిపరమైనవిగా ఉండాలి. ప్రతి సోషల్ డెమోక్రటిక్ కార్మికుడూ యీ సంఘాలకు సాధ్యమైనంత ఎక్కువగా తోడ్పడాల్సిందే, యీ సంఘాల్లో క్రియాశీలంగా కృషి జరపాల్సిందే. అయితే, యిదంతా నిజమే కాని, సోషల్ డెమోక్రట్లకు మాత్రమే ''ట్రేడ్'' యూనియన్ సభ్యులయ్యేందుకు హక్కుండాలి అనడం మాత్రం మన ప్రయోజనాలకు ఎంతమాత్రం దోహదంచెయ్యదు. ఎందుకంటే, అలా చేస్తే జనసామాన్యంమీద మనం వేయగల ప్రభావం తగ్గిపోతుంది. యజమానులకూ, ప్రభుత్వానికీ వ్యతిరేకంగా జరిగే పోరాటం కోసం ఐక్యం కావలసిన ఆవశ్యకతను అర్థంచేసుకున్న కార్మికులందర్నీ ట్రేడ్ యూనియన్లలో చేరనివ్వండి. కనీసం యీ అవగాహన స్థాయికైనా చేరుకున్న వాళ్లందర్నీ ఐక్యం చేయకపోయినట్లైతే, అవి బాగా విస్తృత సంఘాలు కాకపోయినట్లయితే, ట్రేడ్ యూనియన్ల లక్ష్యాన్ని సాధించడమే దుస్సాధ్యమైపోతుంది. ఈ సంఘాలు ఎంత ఎక్కువ విస్తృతమైనవైతే, వాటిమీద మన ప్రభావం అంత ఎక్కువ విస్తృతంగా ఉంటుంది — ఈ ప్రభావం కేవలం ఆర్థిక పోరాటపు సద్యోజనిత అభివృద్ధి కారణంగానే ఉత్పన్నం కాదు, సోషలిస్టు ట్రేడ్ యూనియన్ సభ్యులు తమ సహచరులను ప్రభావితం చేసేందుకు ప్రత్యక్షంగానూ, చైతన్య పూరితంగానూ చేసే కృషిపైననే అది ఆధారపడివుంటుంది'' (పేజి 86).** సందర్భవశాత్తూ, ట్రేడ్‌యూనియన్ల ఉదాహరణ నిబంధనావళి మొదటి నిబంధన గురించిన వివాదాస్పద సమస్యను అంచనావేయడానికి ప్రత్యేకించి ముఖ్యమైనది. ఈ ట్రేడ్‌యూనియన్లు సోషల్ డెమోక్రటిక్ శాఖల ''అజమాయిషీ కింద, నాయకత్వం కింద'' పని చేయాలనే దానిపై సోషల్ డెమోక్రట్లలో రెండు అభిప్రాయాలు వుండజాలవు. కాని ఆ కారణాలచేత ట్రేడ్‌యూనియన్లలో సభ్యులైన వారందరికీ తాము సోషల్ డెమోక్రటిక్ పార్టీ సభ్యులమని ''ప్రకటించుకునే'' హక్కును ఇవ్వడం స్పష్టంగా అసంబద్ధం అవుతుంది. అందులో రెండు ప్రమాదాలున్నాయి: ఒకటి, ట్రేడ్‌యూనియన్ ఉద్యమ పరిధులను సంకుచితపరచడం, ఆవిధంగా

* మొదటి సంపుటంలో పేజి 214 చూడండి. — సం.

** మొదటి సంపుటంలో పేజీలు 221–222 చూడండి. — సం.

కార్మికుల సంఘీభావాన్ని బలహీనపర్చడం; రెండవది, సోషల్ డెమోక్రటిక్ పార్టీలోకి అస్పష్టతా, పూగిసలాటా ప్రవేశించడానికి అవకాశం ఇవ్వడం. కట్టుకూలి రేటు పద్ధతిపై పనిచేసిన హాంబుర్గ్ తాపీపనివారి సువిఖ్యాత ఘటన[25]లో జర్మన్ సోషల్ డెమోక్రసీ ఇలాంటి సమస్యను ఆచరణలో పరిష్కరించిన సందర్భం ఉంది. సోషల్ డెమోక్రటిక్ దృష్టిలో సమ్మెలను విచ్ఛిన్నం చేయడం అవమానకరమైన పని అని ప్రకటించడానికి, అంటే, సమ్మెలను నడపడం, బలపర్చడం తమ ప్రధాన ఆశయమని ఒప్పుకోడానికి క్షణ కాలం కూడా తటపటాయించలేదు; కాని అదే సమయంలో, వారు పార్టీ ప్రయోజనాలూ ట్రేడ్‌యూనియన్ ప్రయోజనాలూ ఒకటే అయివుండాలనీ, విడివిడి ట్రేడ్‌యూనియన్లు చేసే విడివిడి చర్యలకు పార్టీ బాధ్యత వహించాలనీ కోరే డిమాండును అంత గట్టిగానూ తోసిపుచ్చారు. ట్రేడ్‌యూనియన్లకు తన సరళి బాగా పట్టుబడేటందుకూ, వాటిని తన పలుకుబడి కిందికి తెచ్చుకునేటందుకూ పార్టీ ప్రయత్నించాలి, ప్రయత్నించుతుంది; కాని సరిగ్గా ఆ పని కోసం అది యీ యూనియన్లలోని పూర్తి సోషల్ డెమోక్రటిక్ సభ్యులకూ (సోషల్ డెమోక్రటిక్ పార్టీకి చెందిన సభ్యులకూ) పూర్తి వర్గ చైతన్యం లేని రాజకీయంగా క్రియాశీలురు కాని వారికీ తేడా చూపాలి, కామ్రేడ్ అక్సెల్‌రోడ్ మనలను చేయకోరుతున్నట్టుగా వారిద్దరినీ గజిబిజి చేయకూడదు.

''...విప్లవకారుల సంఘం చేతుల్లో మిక్కిలి రహస్యమైన కార్యకలాపాల కేంద్రీకరణ కార్మికుల ట్రేడ్‌యూనియన్లు, కార్మికుల స్వయం శిక్షణ కేంద్రాలు, చట్టవిరుద్ధ సాహిత్య పఠన కేంద్రాలు, జనాభాలోని యితర అన్ని విభాగాల్లోని సోషలిస్టు, అలాగే ప్రజాస్వామిక కేంద్రాలు వగైరా, వగైరాల వంటి, విస్తృత ప్రజానీకం కోసం ఉద్దేశింపబడి, తత్కారణంగా వదులుగానూ, సాధ్యమైనంత తక్కువ రహస్యంగానూ ఉండే చాలా సంఘాల కార్యకలాపాల పరిధినీ, నాణ్యాన్నీ తగ్గించదు సరికదా పెంపొందించుతుంది. మనకి అలాంటి బృందాలూ, ట్రేడ్ యూనియన్లూ, సంఘాలూ అన్నిచోట్లా, సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో, అత్యధిక వైవిధ్యం కలిగిన కార్యకలాపాలను కలిగివుండటం తప్పనిసరి అవసరం; అయితే వాటిని విప్లవకారుల సంఘంతో కలగాపులగం చెయ్యడం, వాటిమధ్య సరిహద్దు రేఖని చెరిపెయ్యడం, అవకతవక పనే కాకుండా, హానికరం కూడా....'' (పేజి 96).* విప్లవకారుల సంఘాన్ని విస్తృతమైన కార్మిక సంఘాలు పరివేష్టించి వుండాలి అని కామ్రేడ్ మార్తొవ్ నాకు జ్ఞాపకం చేయడం ఎంత అసంగతమైనదో పైన చెప్పిన మాటలు తెల్పుతాయి. నేను ఈ విషయాన్ని ''ఏం చెయ్యాలి?'' అన్న పుస్తకంలో ఇదివరకే పేర్కొన్నాను —

* మొదటి సంపుటంలో పేజి 235 చూడండి. — సం.

''ఒక కామ్రేడ్‌కి లేఖ''లో ఈ భావాన్ని మరింత స్పష్టంగా వివరించాను. అందులో ఇలా రాశాను: ''ఫ్యాక్టరీ అధ్యయన బృందాలు మనకి ప్రత్యేకించి ముఖ్యం — పెద్ద ఫ్యాక్టరీలలోని కార్మికులను సంఘటితపర్చడంలోనే ఉద్యమ మూలబలం వుంది, ఎందుచేతనంటే పెద్ద ఫ్యాక్టరీలలోనూ (మరియూ మిల్లులలోనూ) సంఖ్య విషయంలోనే గాక పలుకుబడి, వికాసం, పోరాట సామర్థ్యం విషయంలో కూడా కార్మికవర్గంలోని అధికభాగం వీటిలోనే వుంటుంది. ప్రతి ఫ్యాక్టరీ మన దుర్గం కావాలి.... ఫ్యాక్టరీ ఉపసంఘం అన్ని రకాల అధ్యయన బృందాల (లేక ఏజెంట్ల) జాలముతో ఫ్యాక్టరీ అంతటినీ, కార్మికులలో సాధ్యమైనంత ఎక్కువ మందినీ తన పలుకుబడి కిందికి తెచ్చుకోవాలి.... అన్ని గ్రూపులకూ, అధ్యయన బృందాలకూ, ఉపసంఘాలు వగైరాలకూ కమిటీ సంస్థల లేక కమిటీ శాఖల ప్రతిపత్తి వుండాలి. వాటిలో కొన్ని రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబరు పార్టీలో చేరాలనే తమ కోరికను బహిరంగంగా ప్రకటించుతాయి, కమిటీ కనక ఆమోదిస్తే పార్టీలో చేరుతాయి, నిర్దిష్టమైన బాధ్యతలను (కమిటీ ఆదేశాలపై గాని, కమిటీ అనుమతితో గాని) స్వీకరిస్తాయి; పార్టీ శాఖల ఆజ్ఞలను పాటించడానికి అంగీకరిస్తాయి, అందరు పార్టీ సభ్యులకుండే హక్కులనే పొందుతాయి, పార్టీ కమిటీలో సభ్యత్వానికి తక్షణ కేండిడేట్లు అవుతాయి, వగైరా. తదితరమైనవి రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబరు పార్టీలో చేరవు. పార్టీ సభ్యులచే ఏర్పాటు చేయబడిన అధ్యయన బృందాల లేక ఏదో ఒక పార్టీ గ్రూపుతో చేరి వున్న అధ్యయన బృందాల ప్రతిపత్తిని కలిగి వుంటాయి'' (పేజీలు 17, 18). ఇందులో నేను కిందిగీతలు గీసిన మాటలు నిబంధనావళి మొదటి నిబంధన గురించిన నా సూత్రీకరణలోని భావాన్ని నేను ''ఒక కామ్రేడ్‌కి లేఖ''లో ఇదివరకే పూర్తిగా వెల్లడించినట్లు ప్రత్యేకించి స్పష్టం చేస్తాయి. పార్టీలో చేరడానికి వుండే షరతులు అక్కడ స్పష్టంగా సూచించబడ్డాయి. అవి: (1) నిర్దిష్ట స్థాయిలో నిర్మాణం వుండాలి, (2) ఒక పార్టీ కమిటీ ఆమోదం కావాలి. తరువాతి పేజీలో ఎటువంటి గ్రూపులనూ, సంఘాలనూ పార్టీలో చేర్చుకోవాలో (వేటిని చేర్చుకోకూడదో), ఏ కారణాలవల్లనో కూడా సుమారుగా సూచించాను. ''సాహిత్యాన్ని పంపకం చేసే గ్రూపు రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబరు పార్టీకి చెంది వుండాలి, దాని సభ్యులలోనూ, కార్యకర్తలలోనూ కొంత మందిని ఎరిగివుండాలి. కార్మికుల పరిస్థితులను పరిశీలించి ట్రేడ్‌యూనియన్ కోర్కెలను తయారు చేసే గ్రూపు తప్పనిసరిగా రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబరు పార్టీకి చెంది వుండనవసరం లేదు. ఒకరిద్దరు పార్టీ సభ్యులతో కలసి స్వయం బోధనకు పూనుకొని వుండే విద్యార్థుల, ఆఫీసర్ల, ఆఫీసు ఉద్యోగుల గ్రూపుకు కొన్ని సందర్భాలలో వారు పార్టీకి చెందినవనే సంగతి తెలియనవసరం కూడా లేదు'' (పేజీలు 18–19).

అందులో ''ఎలాంటి ముసుగూ లేకుండానే'' అనే విషయంమీద అదనపు సమాచారం వుంది! కామ్రేడ్ మార్తొవ్ ముసాయిదా సూత్రీకరణ పార్టీకీ ఇతర సంఘాలకూ మధ్య సంబంధాల గురించి ప్రస్తావించనే లేదు, కాని నేను పార్టీ మహాసభకు దాదాపు ఒక సంవత్సరం ముందే కొన్ని సంఘాలు పార్టీకి చెందినవై వుండాలనీ కొన్ని అలా వుండనవసరం లేదనీ సూచించాను. మహాసభలో నేను సమర్థించిన భావం ''ఒక కామ్రేడ్‌కి లేఖ''లో ఇదివరకే వివరించబడింది. ఆ విషయాన్ని స్పష్టంగా ఇలా చెప్పవచ్చు. మొత్తంమీద నిర్మాణ స్థాయిని బట్టీ, ప్రత్యేకించి ఆ సంఘం రహస్య స్థితిని బట్టీ సుమారుగా యీ కింది తరగతలుగా విడదీయవచ్చు: (1) విప్లవకారుల సంఘాలు; (2) సాధ్యమైనంత విశాలమైన వివిధములైన కార్మికవర్గ సంఘాలు (ఇక్కడ కార్మికవర్గం అని మాత్రమే ఎందుకు అంటున్నానంటే కొన్ని పరిస్థితులలో ఇతర వర్గాలకు చెందిన కొందరు కూడా ఇందులో చేరివుంటారనేది సుస్పష్టమే గనుక). ఈ రెండు తరగతులూ పార్టీ అవుతాయి. అంతేగాక (3) పార్టీకి అనుబంధంగా వున్న కార్మికుల సంఘాలు; (4) పార్టీకి అనుబంధంగా వుండనివి అయినా దాని అజమాయిషీ కింద, నాయకత్వం కింద వున్న కార్మికుల సంఘాలు; (5) అసంఘటితులైన కార్మికవర్గ సభ్యులు. వీరిలో కొందరు ఏదేమైనా వర్గపోరాటం తీవ్ర రూపాలను తీసుకున్నప్పుడు సోషల్ డెమోక్రటిక్ పార్టీ నాయకత్వం కిందికి వస్తారు. రమారమిగా నా దృష్టిలో విషయం అలా వుంది. తద్భిన్నంగా కామ్రేడ్ మార్తొవ్ చూస్తున్నట్టుగా అయితే పార్టీ సరిహద్దు రేఖ పూర్తిగా అస్పష్టంగా వుండిపోతుంది. ఎందుచేతనంటే ''ప్రతి సమ్మెదారుడూ తాను పార్టీ సభ్యుడనని ప్రకటించుకో''వచ్చు. ఈ సడలింపువల్ల ప్రయోజనం ఏమిటి? విస్తారమైన ''హోదా.'' కాని దానివల్ల కలిగే హాని ఏమిటంటే అది విసంఘటన భావాన్ని ప్రవేశపెడుతుంది, వర్గాన్నీ పార్టీనీ గజిబిజి చేస్తుంది.

నేను ఉదహరించిన యీ సాధారణ ప్రతిపాదనలను విశదపర్చేటందుకు, మహాసభలో నిబంధనావళి మొదటి నిబంధనపై తదుపరి చర్చలను శీఘ్ర పరిశీలన జరుపుదాం. కామ్రేడ్ బ్రూకెర్ (కామ్రేడ్ మార్తొవ్‌కి సంతృప్తి కలిగించేలాగ) నా సూత్రీకరణకు తాను అనుకూలం అని ప్రకటించాడు, కాని నాతో ఆయన కలయిక, మార్తొవ్‌తో కామ్రేడ్ అకీమొవ్ కలయికలాగ కాక, పొరపాటు అవగాహనతో జరిగిందని తేలింది. కామ్రేడ్ బ్రూకెర్ ''నిబంధనావళి అంతటితోనూ, దాని మొత్తం సరళితోనూ ఏకీభవించలేదు'' (పేజి 239), నా సూత్రీకరణను ప్రజాస్వామ్యానికి ప్రాతిపదికగా బలపర్చాడు. ''రబోచెయె దేలొ'' మద్దతుదార్లు కోరినది అదే. రాజకీయ పోరాటంలో తక్కువ కీడు ఏదో దానిని ఎంచుకోడం ఒక్కొక్కసారి అవసరమౌతుందనే అభిప్రాయానికి కామ్రేడ్ బ్రూకెర్ ఇంకా పెరగలేదు; మన మహాసభలాంటి దాంట్లో ప్రజాస్వామ్యాన్ని సమర్థించడం నిరుపయోగమని కామ్రేడ్ బ్రూకెర్

గుర్తించలేదు. కామ్రేడ్ అకీమొవ్‌కి ఎక్కువ దూరదృష్టి వుంది. ఆయన సమస్యను ఎంతో సరిగా అందరి ముందూ వుంచాడు. ఆయన ఇలా అన్నాడు: ''కామ్రేడ్స్ మార్తొవ్, లెనినూ, తమ ఉమ్మడి లక్ష్యాన్ని సాధించేటందుకు ఏది (ఏ సూత్రీకరణ) ఉత్తమం అని వాదిస్తున్నారు'' (పేజి 252). ఆయనింకా ఇలా అన్నాడు: ''నేనూ, బ్రూకెర్ ఆ లక్ష్యాన్ని అతి కొంచమైనా సాధించేది ఏది అని ఎంపిక చేయగోరుతున్నాము. ఈ దృక్కోణంనుంచి నేను మార్తొవ్ సూత్రీకరణను ఎంపికచేస్తాను.'' ''వారి లక్ష్యమే'' (అంటే, ప్లెహానొవ్, మార్తొవ్‌ల లక్ష్యమూ, నా లక్ష్యమూ — విప్లవకారులను నడిపే సంఘాన్ని నెలకొల్పడం అనే లక్ష్యం) ''ఆచరణయోగ్యం కాదనీ, హానికరం'' అనీ తాను భావిస్తున్నట్టు కామ్రేడ్ అకీమొవ్ దాపరికం లేకుండా వివరించాడు. కామ్రేడ్ మర్తీనొవ్ లాగనే* ''విప్లవకారుల సంఘం'' అనవసరం అనే ఆర్థికతత్వ భావాన్ని సమర్థించాడు. ''మార్తొవ్ సూత్రీకరణతో గాని, లెనిన్ సూత్రీకరణతో గాని వాటి దారిని అడ్డగించినప్పటికీ జీవిత వాస్తవాలు చివరకు మన పార్టీ నిర్మాణంలోకి తప్పక చొచ్చుకుని వస్తాయి అనే గట్టి నమ్మకం'' ఆయనకి వుంది. కామ్రేడ్ మార్తొవ్ విషయంలో కూడా మనకిది ఎదురై వుండకపోతే ''జీవిత వాస్తవాలను'' గురించిన యీ ''తోకపట్టుకొని పోయే'' భావన విషయం ఆలోచించడం అనవసరం అవుతుంది. కామ్రేడ్ మార్తొవ్ రెండో ప్రసంగం (పేజి 245) మొత్తంమీద వివరంగా పరిశీలించ తగినంత ఆసక్తిదాయకంగా వుంది.

కామ్రేడ్ మార్తొవ్ మొదటి వాదం ఇదీ: పార్టీ శాఖలకు చెందని పార్టీ సభ్యులపై పార్టీ సంఘాల అజమాయిషీ ''సాధ్యం, ఎందుచేతంటే ఎవరికైనా ఒక పని అప్పగించినప్పుడు దానిపై కమిటీ కనిపెట్టి చూడగల్గుతుంది'' (పేజి 245). ఈ సూత్రీకరణ ప్రత్యే

---

* కామ్రేడ్ మర్తీనొవ్ కామ్రేడ్ అకీమొవ్ వైఖరికి భిన్నమైన వైఖరిని తీసుకో దలచిన మాట నిజం. కుట్రదారీ అంటే రహస్య అనే అర్థం కాదనీ, ఆ రెండు మాటలూ రెండు వేరు వేరు భావనలనీ ఆయన చూపదలచాడు. ఆ తేడా ఏమిటో కామ్రేడ్ మర్తీనొవ్ గాని, ఇప్పుడు ఆయన అడుగుజాడలను అనుసరిస్తూ వున్న కామ్రేడ్ అక్సెల్‌రోడ్ గాని ఎప్పుడూ వివరించలేదు. ''రాజకీయ పోరాటాన్ని ఒక కుట్రకు పరిమితం చెయ్యడాన్ని'' గట్టిగా వ్యతిరేకించినది తనే అన్నట్టు, నేను — ఉదాహరణకు ''ఏం చెయ్యాలి?''లో (''కర్తవ్యాలు''[26]లో కూడా) — కృతనిశ్చితంగా వ్యతిరేకించలేదన్నట్టూ కామ్రేడ్ మర్తీనొవ్ ''నటించాడు.'' నేను వ్యతిరేకిస్తున్నవారు విప్లవకారుల సంఘం వుండవలసిన అవసరం ఏదీ వున్నట్టు అనుకోడం లేదు — ఇప్పుడు కామ్రేడ్ అకీమొవ్ అనుకోనట్టుగా — అనే విషయాన్ని తన శ్రోతలు మరిచిపోయేటట్టు చేయాలని కామ్రేడ్ మర్తీనొవ్ ఆతురపడ్డాడు.

కించి విలక్షణమైనది, ఎందుకంటే, మార్తొవ్ సూత్రీకరణ ఎవరికి అవసరమో, వాస్తవంలో అది ఎవరికి ఉపయోగపడుతుందో – అంటే, స్వేచ్ఛావిహారి మేధావులకా లేక కార్మికుల గ్రూపులకా, కార్మిక జనబాహుళ్యానికా, మనం యీ మాట అనవచ్చుననుకుంటే, "బయట పెడుతుంది." వాస్తవం ఏమిటంటే, మార్తొవ్ సూత్రీకరణకు రెండు రకాల వ్యాఖ్యానం చెప్పడానికి అవకాశం వుంది: (1) పార్టీ శాఖలలో ఏదో ఒక దాని మార్గదర్శకత్వం కింద పార్టీకి ఎప్పుడూ వ్యక్తిగతంగా సహాయం చేస్తూ వుండే వ్యక్తి "తాను" పార్టీ సభ్యుడనని "ప్రకటించుకునే" హక్కు కలిగి వుంటాడు (కామ్రేడ్ మార్తొవ్ స్వయంగా అన్న మాటే); (2) పార్టీ శాఖ తన ఆదేశాల కింద ఎప్పుడూ తనకు వ్యక్తిగతంగా సహాయం చేసే వ్యక్తిని ఎవరినైనా సరే పార్టీ సభ్యునిగా గుర్తించే హక్కు కలిగివుంటుంది. ఇందులో మొదటి వ్యాఖ్యానం మాత్రమే "ప్రతి సమ్మెదారునికీ" తాను పార్టీ సభ్యుడనని ప్రకటించుకునే అవకాశాన్ని నిజంగా యిస్తుంది. అందుచేత అది మాత్రమే లీబెర్‌ల, అకీమొవ్‌ల, మర్తీనొవ్‌ల హృదయాలను వెంటనే చూరగొంది. కాని యీ వ్యాఖ్యానం స్పష్టంగా ఒక పదబంధం తప్ప మరేమీ కాదు, ఎందుకంటే అది కార్మికవర్గం అంతటికీ వర్తిస్తుంది, పార్టీకీ వర్గానికీ మధ్య వున్న తేడా తుడుచుకుపోతుంది; "ప్రతి సమ్మెదారుని"పైనా అజమాయిషీ, మార్గదర్శకత్వం అనే మాటలు "లాంఛనప్రాయం" మాత్రమే అవుతాయి. అందుచేతనే కామ్రేడ్ మార్తొవ్ తన రెండవ ప్రసంగంలో వెంటనే రెండో వ్యాఖ్యానంలోకి జారాడు (స్పష్టత కోసం చెప్పాలంటే, కోస్తిచ్ తీర్మానాన్ని నిరాకరించడం ద్వారా మహాసభ దానిని ప్రత్యక్షంగా తోసిపుచ్చింది[27] – పేజి 255), అంటే కమిటీ వారికి పనులను అప్పగించి అవి నెరవేరాయో లేదో కనిపెట్టి చూస్తూవుంటుంది. అలాంటి ప్రత్యేకమైన పనులు కార్మిక జనబాహుళ్యానికి, వేలాది శ్రామికులకు (వారిని గురించే కామ్రేడ్ అక్సెల్‌రోడ్, కామ్రేడ్ మర్తీనొవ్ మాట్లాడారు) ఎన్నడూ అప్పగించబడవు – సరిగ్గా ఆ పనులు తరచుగా కామ్రేడ్ అక్సెల్‌రోడ్ పేర్కొన్న ఆచార్యులకూ, కామ్రేడ్ లీబెర్, కామ్రేడ్ పొపొవ్ ఎంతో ఆసక్తి చూపే హైస్కూలు విద్యార్థులకూ (పేజి 241), కామ్రేడ్ అక్సెల్‌రోడ్ తన రెండవ ప్రసంగంలో పేర్కొన్న విప్లవ యువజనానికీ (పేజి 242) అప్పగించబడతాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, కామ్రేడ్ మార్తొవ్ సూత్రీకరణ ఒక నిరుపయోగకరమైన మాటగానూ, ఒక అర్థంలేని మాటగానూ అయినా వుండిపోతుంది, లేదా "బూర్జువా వ్యక్తితత్వంతో పూర్తిగా నిండివున్న" ఏ సంఘాల్లోనూ చేరకుండా వుండాలనే "మేధావులకు" ప్రధానంగానూ దాదాపు ప్రత్యేకించీ లాభకరంగా వుంటుంది. మార్తొవ్ సూత్రీకరణ మాటలలో శ్రామికవర్గంలో ఎక్కువమంది ప్రయోజనాలను సమర్థిస్తుంది, కాని చేతలలో శ్రామికవర్గ క్రమశిక్షణకూ, సంఘ నిర్మాణానికీ ఇష్టపడని బూర్జువా మేధావుల

ప్రయోజనాలకు ఉపయోగపడుతుంది. ఆధునిక పెట్టుబడిదారీ సమాజంలో ఒక ప్రత్యేక తరగతిగా మేధావివర్గపు ప్రత్యేక లక్షణం ఎక్కువగా వ్యష్టితత్వమూ, క్రమశిక్షణకూ నిర్మాణానికీ కట్టుబడి వుండలేకపోవడమూ నన్న విషయాన్ని కాదనడానికి ఎవరూ సాహసించరు (ఉదాహరణకు మేధావివర్గం గురించి కౌట్స్కీ రాసిన సుప్రసిద్ధ వ్యాసాలు). సందర్భవశాత్తూ, ఇది యీ సామాజిక తరగతికీ శ్రామికవర్గానికీ వున్న ప్రతికూలమైన తేడాను చూపే లక్షణం; మేధావిలోని బలహీనతకూ అస్థిరత్వానికీ గల కారణాలలో ఇది ఒకటి — శ్రామికవర్గం తరచు దీనిని చూస్తోంది. మేధావివర్గానికున్న యీ లక్షణం దానికి అలవాటు అయిన జీవిత పరిస్థితులతోనూ, జీవనోపాధిని సంపాదించే దాని పద్ధతితోనూ సన్నిహితంగా ముడిపడి వుంది, ఇది చాలావరకు పెటీబూర్జువా జీవితపద్ధతికి సమానంగా వుంటుంది (ఒంటరిగానో లేక చాలా చిన్న గ్రూపులుగానో పనిచేయడం వగైరా). కడపటికి, కామ్రేడ్ మార్తొవ్ సూత్రీకరణను సమర్థించిన వారు ఆచార్యుల హైస్కూలు విద్యార్థుల ఉదాహరణను ఇవ్వవలసి వచ్చిన వారు కావడం యాదృచ్ఛికమూ కాదు! కామ్రేడ్స్ మర్తీనొవ్, అక్సెల్‌రోడ్ అనుకున్నట్టుగా నిబంధనావళి మొదటి నిబంధనపై జరిగిన వాగ్వివాదంలో, తీవ్ర కుట్రదారీ సంస్థను సమర్థించిన వారికి వ్యతిరేకంగా వేదికను తీసుకున్నవారు విస్తృతమైన శ్రామికవర్గ పోరాటాన్ని బలపర్చేవారు కారు, బూర్జువా మేధావి వర్గపు వ్యష్టితత్వాన్ని బలపర్చేవారే శ్రామికవర్గ నిర్మాణాన్నీ, క్రమశిక్షణనీ బలపర్చేవారితో తలపడ్డారు.

కామ్రేడ్ పాపోవ్ ఇలా అన్నాడు: ''నికొలాయెవ్‌లో లేక ఒడెస్సాలో లాగ సెంట్ పీటర్స్‌బుర్గ్‌లోనూ ప్రతిచోటా, ఈ పట్టణాలనుంచి వచ్చిన ప్రతినిధులు నిరూపిస్తున్నట్టుగా, సాహిత్యాన్ని పంపకం చేస్తున్న, నోటి మాటతో ప్రచారం సాగిస్తున్న కార్మికులు డజన్ల కొలది వున్నారు. కాని వారు శాఖ సభ్యులు కాజాలరు. వారిని ఒక శాఖకి జతచేయవచ్చు అయితే సభ్యులుగా పరిగణింపబడజాలరు'' (పేజి 241). వారు ఒక శాఖ సభ్యులు ఎందుకు కాకూడదో కామ్రేడ్ పాపోవ్‌యొక్క రహస్యంగానే వుండిపోయింది. ''ఒక కామ్రేడ్‌కు లేఖ'' నుంచి నేను ఇదివరకే ఒక భాగం ఉదహరించాను. అందులో, అలాంటి కార్మికులను అందర్నీ (డజన్ల సంఖ్యలో కాదు, వందల సంఖ్యలో) ఒక శాఖలో చేర్చుకోడం సాధ్యమూ, అవసరమూ కూడా అనీ, అంతే గాక వాటిలో చాలా శాఖలు పార్టీకి చెందివుండవచ్చుననీ, చెందివుండాలనీ చెప్పబడింది.

కామ్రేడ్ మార్తొవ్ రెండో వాదం ఇది: ''లెనిన్ అభిప్రాయంలో పార్టీలో పార్టీ శాఖలు తప్ప ఇతర శాఖలు వుండకూడదు....'' పూర్తిగా నిజం! ''నా అభిప్రాయంలో, తద్భిన్నంగా, అలాంటి శాఖలు వుండాలి. జీవితం శాఖలను, మనం వాటిని మన వృత్తి విప్లవకారుల సమరశీల సంస్థాగతనిశ్రేణిలో చేర్చుకోగలదానికంటె, వేగంగా సృష్టిస్తుంది,

పెంచుతుంది....'' రెండు విధాలుగా ఇది తప్పు: (1) ''జీవితం'' సృష్టించి పెంచే సార్థకమైన విప్లవకారుల సంఘాల సంఖ్య మనకు కావలసినదానికంటె, కార్మికవర్గ ఉద్యమానికి అవసరమైనదానికంటె చాలా తక్కువ; (2) మన పార్టీ విప్లవకారుల సంస్థాగతని శ్రేణి మాత్రమే గాక కార్మిక సంఘాల సమూహపు సంస్థాగతని శ్రేణి కూడా అయి వుండాలి.... ''సూత్రాల విషయంలో పూర్తిగా నమ్మదగిన వాటికి మాత్రమే పార్టీ శాఖలు అనే హోదాను కేంద్ర కమిటీ ఇస్తుందని లెనిన్ అనుకుంటున్నాడు. కాని, జీవితానిది (sic!) పైచేయి అవుతుంది; పార్టీ వెలుపల అనేక సంఘాలను వదలివేయకుండా వుండేటందుకు కేంద్ర కమిటీ ఆ సంస్థలను, వాటిని పూర్తిగా నమ్మడానికి వీలులేకపోయినప్పటికీ అంగీకారయోగ్యం చేయవలసి వుంటుందనీ కామ్రేడ్ బ్రూకెర్ బాగా అర్థం చేసుకుంటున్నాడు; అందుకనే కామ్రేడ్ బ్రూకెర్ లెనిన్‌తో ఏకీభవిస్తున్నాడు....'' ''జీవితా''న్ని గురించి ఎంత నిజమైన తోకపట్టుకొని పోయే భావన! నిజమే, కేంద్ర కమిటీలో తమ స్వంత అభిప్రాయాలచే గాక ఇతరులు ఏమంటారో అనేదానిచే నడపబడేవారుంటే (చూ: ఆర్గనైజింగు కమిటీ ఘటన), పార్టీలో అత్యంత వెనుకబడి వున్న వారిది పైచేయి అవుతుందనే తాత్పర్యంలో (వాస్తవానికి ఇప్పుడు జరిగినట్లుగా, వెనుకబడి వున్నవారు పార్టీ ''మైనారిటీ''గా ఏర్పడినట్లుగా) ''జీవితానిది పైచేయి అవుతుంది.'' కాని వివేకం గల ఏ కేంద్ర కమిటీని ''నమ్మడానికి వీలులేని'' వారిని పార్టీలోకి చేర్చుకోడానికి సమ్మతింపజేసే తెలివిగల కారణం ఏదీ చూపలేము. నమ్మడానికి వీలులేని వారిని ''సృష్టించే జీవితా''న్ని ఉదహరించడంలో కామ్రేడ్ మార్తొవ్ పార్టీ నిర్మాణం గురించిన తన పథకపు అవకాశవాద స్వభావాన్ని స్పష్టంగా బైటపెట్టాడు!... ఆయనింకా ఇలా అన్నాడు: ''నా మట్టుకు నేను, అలాంటి శాఖ (పూర్తిగా నమ్మడానికి వీలులేనిది) పార్టీ కార్యక్రమాన్నీ, పార్టీ అజమాయిషీనీ అంగీకరించడానికి సిద్ధం అయివుంటే దానిని మనం పార్టీలోకి చేర్చుకోవచ్చు. దానిని పార్టీ శాఖగా చేయకుండానే ఆ పని చేయవచ్చు. ఉదాహరణకు, ఏదైనా ఒక 'స్వతంత్రుల' యూనియన్ తాము సోషల్ డెమోక్రసీ భావాలనూ దాని కార్యక్రమాన్నీ అంగీకరించి పార్టీలో చేరుతున్నామని ప్రకటించితే అది మన పార్టీకి గొప్ప విజయంగా నేను పరిగణిస్తాను; అయితే దాని అర్థం మనం ఆ యూనియన్‌ని పార్టీ శాఖలోకి చేర్చుకుంటామని కాదు....'' మార్తొవ్ సూత్రీకరణ ఎలాంటి గంద్రగోళానికి దారితీస్తుందంటే: పార్టీయేతర సంఘాలు పార్టీకి చెంది వుంటాయి! ఆయన పథకం ఏమిటో ఒక సారి వూహించుకోండి: పార్టీ అంటే (1) విప్లవకారుల సంఘాలూ + (2) పార్టీ శాఖలుగా గుర్తించబడిన కార్మిక సంఘాలూ + (3) పార్టీ శాఖలుగా గుర్తించబడని కార్మిక సంఘాలు (ప్రధానంగా ''స్వతంత్రుల''తో కూడిన సంఘాలు) + (4) వేరు వేరు పనులను నిర్వహించే వ్యక్తులు –

ఆచార్యులు, హైస్కూలు విద్యార్థులు వగైరా + (5) "ప్రతి సమ్మెదారుడూ." అద్భుత మైన యీ పథకానికి కామ్రేడ్ లీబెర్ చెప్పిన మాటలు చేర్చవచ్చు: "మన కర్తవ్యం ఒక సంఘాన్ని నిర్మించడమే కాదు (!!) మనం పార్టీని నిర్మించగలం, నిర్మించి తీరాలి" (పేజి 241). ఔను, మనం ఆ పని చేయగలం, చేసి తీరాలి నిజమే! కాని మనకు కావల సింది "సంఘాన్ని నిర్మించడం" గురించి అర్థం లేని మాటలు కాదు, పార్టీ సభ్యులు వాస్తవంలో ఒక సంఘాన్ని నెలకొల్పేటందుకు పని చేసి తీరాలని ప్రత్యక్షంగా డిమాండు చేయడం. "పార్టీని నిర్మించడం" గురించి మాట్లాడుతూ, మళ్లీ అదే సమయంలో అన్ని రకాల నిర్మాణరాహిత్యాన్నీ అనైక్యతనూ మరుగుపర్చేటందుకు పార్టీ అనే మాటను ఉపయోగించడాన్ని సమర్థించడం కేవలం వట్టి మాటలు చెప్పడమే అవుతుంది.

కామ్రేడ్ మార్తొవ్ ఇలా అన్నాడు: "మా సూత్రీకరణ విప్లవకారుల సంఘానికీ, ప్రజానీకానికీ మధ్య వరుసగా కొన్ని సంఘాల శ్రేణి వుండాలనే ఆశయాన్ని వ్యక్తం చేస్తోంది." అది అలా కాదు. నిజంగా ఆవశ్యకమైన యీ ఆశయాన్ని మార్తొవ్ సూత్రీకరణ వ్యక్తం చేయడం లేదు. ఎందుచేతనంటే అది సంఘ నిర్మాణానికి ప్రోత్సాహ కాన్ని దేనినీ ఇవ్వడం లేదు, అందులో సంఘటితం కావాలనే డిమాండు లేదు, అది సంఘటితమైనదానికీ సంఘటితం కాని దానికీ తేడాను చూపడం లేదు. అది ఇచ్చేదల్లా ఒక హోదా* మాత్రమే, ఈ సందర్భంలో కామ్రేడ్ అక్సెల్‌రోడ్ అన్న మాటలను మనం జ్ఞాపకం చేసుకోకుండా వుండలేము. ఆయనిలా అన్నాడు: "ఏ శాసనం ద్వారా కూడా వాటిని (విప్లవకర యువజనుల అధ్యయన బృందాల లాంటి వాటిని) గాని లేక వ్యక్తులను

---

* లీగు మహాసభలో కామ్రేడ్ మార్తొవ్ తన సూత్రీకరణకు మద్దతుగా పరిహా సాస్పదమైన మరో వాదాన్ని తీసుకువచ్చాడు. ఆయనిలా అన్నాడు: "మనం ఒక విషయాన్ని పేర్కొనవచ్చు. అదేమిటంటే వాక్యార్థంలో తీసుకుంటే లెనిన్ సూత్రీకరణ కేంద్ర కమిటీ ఏజెంట్లను పార్టీనుంచి వేరుచేస్తుంది, ఎందుకంటే వారు ఒక సంఘం కారు కనుక" (పేజి 59). మినిట్స్‌లో నమోదు చేయబడినట్లుగా లీగు మహాసభలో సహితం యీ వాదం నవ్వుల పాలైంది. తాను పేర్కొన్న "చిక్కు"ను కేంద్ర కమిటీ ఏజెంట్లను "కేంద్ర కమిటీ సంస్థ"లలో చేర్చుకోడం ద్వారానే పరిష్కరించగల మని కామ్రేడ్ మార్తొవ్ భావిస్తున్నాడు. కాని విషయం అది కాదు. సంగతేమిటంటే కామ్రేడ్ మార్తొవ్ ఇచ్చిన ఉదాహరణ, ఆయన మొదటి నిబంధనలోని భావాన్ని ఎంత మాత్రం అర్థం చేసుకోలేక పోయాడని స్పష్టంగా తెలుపుతోంది; అది కుహనా పాండిత్య ప్రకర్షక విమర్శనకు కేవలం ఒక మచ్చుతునక, నిజంగా అది నవ్వులపాలు కావలసిందే, లాంఛన ప్రాయంగా చెప్పాలంటే

గాని, తాము సోషల్ డెమోక్రట్లమని చెప్పుకోకుండానూ'' (చాలా నిజం!) ''తాము పార్టీలో ఒక భాగమని పరిగణించుకోకుండానూ నిషేధించజాలదు''—ఇప్పుడిది ఎంత మాత్రం నిజం కాదు! ఎవరినైనా సరే తాను సోషల్ డెమోక్రటునని చెప్పుకోకుండా నిషేధించడం అసాధ్యమూ అర్థరహితమూ, ఎందుకంటే, దాని ప్రత్యక్ష అర్థంలో ఈ మాట, నమ్మకాల రీతిని మాత్రమే తెల్పుతుంది గాని నిర్దిష్టమైన నిర్మాణపరమైన సంబంధాలను కాదు. వివిధ అధ్యయన బృందాలనూ, వ్యక్తులనూ ''తాము పార్టీలో ఒక భాగమని పరిగణించుకోడాన్ని'' నిషేధించే విషయంలో, ఈ అధ్యయన బృందాలూ వ్యక్తులూ కనక పార్టీకి హాని చేసి, దానిని భ్రష్టపరచడం గాని భగ్నపరచడం గాని చేస్తే అలా నిషేధించవచ్చు, నిషేధించి తీరాలి. ఒక అధ్యయన బృందాన్ని పార్టీ మొత్తంలో తానొక భాగంగా పరిగణించుకోడాన్ని ''శాసనం ద్వారా నిషేధించ''జాలక పోతే పార్టీని ఒక అఖండమైనదనీ, ఒక రాజకీయ సంఘం అనీ అనడం అసంగతం అవుతుంది! అలా అయితే పార్టీనుంచి తొలగించే క్రమాన్నీ పరిస్థితులనూ నిర్వచించే అంశం ఏదవుతుంది? మార్తొవ్ చేసిన మౌలికమైన తప్పును కామ్రేడ్ అక్సెల్‌రోడ్ ఒక స్పష్టమైన అసంగతంగా తయారు చేశాడు; ఆయన యీ కింది మాటలు

---

మనం చేయవలసినదంతా, ''కేంద్ర కమిటీ ఏజెంట్ల సంస్థ'' ఒక దానిని ఏర్పాటు చేయడం, దానిని పార్టీలో చేర్చాలని తీర్మానం చేయడం, కామ్రేడ్ మార్తొవ్ ఇంతగా బుర్రబద్దలు కొట్టుకోవలసివచ్చిన ''చిక్కు'' వెంటనే అంతర్థానమైపోతుంది. నేను సూత్రీకరించిన మొదటి నిబంధనలోని భావం ''సంఘటితులు కండి!'' అనే ప్రోత్సాహకంలోనే వుంది; దానిపై అజమాయిషీనీ, మార్గదర్శకత్వాన్నీ వాస్తవంగా నిస్సందేహం చేయడంలోనే వుంది. అవశ్యంగా, కేంద్ర కమిటీ ఏజెంట్లు పార్టీకి చెందిన వారేనా అనే ప్రశ్నే హాస్యాస్పదమైనది, వాస్తవంలో వారిపై అదుపు వుంటుందనే విషయాన్ని, వారు కేంద్ర కమిటీచే నియమింపబడిన ఏజెంట్లు అనే వాస్తవమూ, వారు ఏజెంట్లుగా వుంచబడ్డారనే విషయమూ పూర్తిగా, పరమ నిస్సందేహం చేస్తాయి. అందుచేత, ఇక్కడ సంఘటితులైన వారూ సంఘటితులు కాని వారూ అని గందరగోళపడే సమస్యే లేదు. (కామ్రేడ్ మార్తొవ్ సూత్రీకరణలోని మౌలికమైన పొరపాటు అదే.) మార్తొవ్ సూత్రీకరణ ఎందుకు పనికిమాలినదంటే అది ఎవరినైనా, ఏ అవకాశవాదినైనా, ఏ వాగుడుపిట్టనైనా, ఏ ''ఆచార్యునై''నా, ఏ ''హైస్కూలు విద్యార్థినై''నా పార్టీ సభ్యుడనని ప్రకటించుకునేటందుకు అనుమతించుతుంది. ఎవరూ కూడా తమంతటత తాము పార్టీ సభ్యులుగా ప్రకటించుకునే సమస్య వుండజాలదంటూ ఉదాహరణలనివ్వడం ద్వారా కామ్రేడ్ మార్తొవ్ తన సూత్రీకరణలోని బలహీనత విషయంలో బుకాయించడానికి వృథా ప్రయత్నం చేస్తున్నాడు.

చెప్పి ఈ తప్పును ఒక అవకాశవాద సిద్ధాంతం స్థాయికి లేవనెత్తాడు కూడా. ''లెనిన్ సూత్రీకరించిన విధంగా, మొదటి నిబంధన సూత్రరీత్యా శ్రామికవర్గ సోషల్ డెమోక్రటిక్ పార్టీయొక్క అసలు సారానికీ (!!), లక్ష్యాలకూ ప్రత్యక్షంగా విరుద్ధం'' అన్నాడు (పేజి 243). వర్గంకంటే పార్టీపై మరింత ఉన్నతమైన డిమాండులు చేయడమంటే శ్రామికవర్గ లక్ష్యాల అసలు సారానికి సూత్రరీత్యా విరుద్ధం అని దీని అర్థం. అంతకు తక్కువేం కాదు. అకీమొవ్ అలాంటి సిద్ధాంతానికి హృదయపూర్వక అనుకూలతను చూపడంలో ఆశ్చర్యం ఏమీ లేదు.

నిష్పక్షపాతంగా ఒక మాట చెప్పాలి. స్పష్టంగా అవకాశవాదం వైపు మొగ్గుతున్న యీ పొరపాటు సూత్రీకరణను నూతన భావాల బీజంగా చేయాలని ఇప్పుడు అనుకుంటున్న కామ్రేడ్ అక్సెల్‌రోడ్ మహాసభలో తద్భిన్నంగా ''బేరమాడటానికి'' తన సంసిద్ధతను వ్యక్తం చేశాడు. ఆయనిలా అన్నాడు: ''కాని నేను తెరచి వున్న తలుపును తట్టుతున్నానని గమనిస్తున్నాను'' (ఈ విషయాన్ని నేను కొత్త ''ఇస్క్రా''లో కూడా గమనిస్తున్నాను), ''ఎందుకంటే, కామ్రేడ్ లెనిన్, పార్టీ నిర్మాణంలో ఒక భాగంగా పరిగణింపబడవలసి వున్న తన కైవారపు బృందాలతో నా డిమాండును నెరవేర్చడానికి ముందుకు వస్తున్నాడు'' (కైవారపు బృందాలతోనే కాదు, అన్నిరకాల కార్మిక సంఘాలతోనూ కూడా: మినిట్స్ 242 పేజిని, కామ్రేడ్ స్త్రాహోవ్ ప్రసంగాన్నీ, ''ఏమి చెయ్యాలి?'' అనే పుస్తకంనుంచీ, ''ఒక కామ్రేడ్‌కు లేఖ''నుంచీ పైన ఉదహరించిన భాగాలనూ చూడండి). ''అక్కడ ఇంకా కొందరు వ్యక్తులున్నారు, కాని ఇక్కడ కూడా మనం బేరమాడవచ్చు.'' కామ్రేడ్ అక్సెల్‌రోడ్‌కి నేను సమాధానం చెప్పాను, మొత్తంమీద చెప్పాలంటే బేరమాడటానికి నేను వ్యతిరేకం కాదని, దాని ఉద్దేశం ఏమిటో నేనిప్పుడు వివరించాలి. వ్యక్తుల విషయంలో — ఆచార్యులు, హైస్కూలు విద్యార్థులు వగైరా అందరూ — రాయితీలు ఇవ్వడానికి నేను ఎంత మాత్రం అంగీకరించను; కాని కార్మికుల సంఘాల విషయంలో సందేహాలు వస్తే మాత్రం నా మొదటి నిబంధనకు ఈకింది విధంగా ఒక వివరణను చేర్చడానికి అంగీకరించి వుండేవాడిని (నేను పైన రుజువు చేసినట్టుగా ఆ సందేహాలు పూర్తిగా నిరాధారాలు అయినప్పటికీ): ''రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబరు పార్టీ కార్యక్రమాన్నీ నిబంధనావళినీ అంగీకరించే కార్మికుల సంఘాలు సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో పార్టీ సంఘాలలో చేర్చబడాలి.'' ఖచ్చితంగా చెప్పాలంటే, శాసనాత్మక నిర్వచనాలకు పరిమితమై వుండవలసిన నిబంధనావళిలో ఇలాంటి సిఫారసుకు స్థానం లేని మాట నిజం, వివరణాత్మక వ్యాఖ్యానాలలోనూ పుస్తకాలలోనే దాని స్థానం. (ఈ నిబంధనావళి తయారు చేయబడటానికి చాలా రోజులు ముందుగానే నేను నా పుస్తకాలలో అలాంటి వివరణలు ఇచ్చి వున్నానని ఇదివరకే పేర్కొన్నాను.)

కాని, కనీసం అలాంటి వివరణలో, కామ్రేడ్ మార్తొవ్ సూత్రీకరణలో నిస్సందేహంగా అంతర్గతమై వున్న సంస్థానిర్మాణ భంగానికి దారితీయగల తప్పుడు భావాల ఛాయలు, అవకాశవాద వాదాల ఛాయలు* "అరాజక భావాల" ఛాయలు ఎంత మాత్రం వుండకూడదు.

---

*మార్తొవ్ సూత్రీకరణను సమర్థించడానికి ప్రయత్నాలు జరిగినప్పుడు తప్పనిసరిగా యీ రకమైన వాదాలు వస్తాయి. అవి ప్రత్యేకించి కామ్రేడ్ ట్రాట్స్కీ ప్రకటనలో కనబడతాయి (పేజీలు 248, 346). ఆయనిలా అన్నాడు: "అవకాశవాదం నిబంధనావళిలోని ఏదో ఒక అంశం మూలంగా గాక మరింత సంక్లిష్టమైన కారణాలవల్ల ఉద్భవం అవుతుంది (లేదా మరింత లోతైన కారణాలచే నిర్ణయింపబడుతుంది): అది బూర్జువా ప్రజాస్వామ్యంయొక్క శ్రామికవర్గంయొక్క సాపేక్ష అభివృద్ధి స్థాయిని బట్టి వస్తుంది...." ఇక్కడ వున్న విషయం నిబంధనావళిలోని అంశాలు అవకాశవాదానికి దారితీయవచ్చుననేది కాదు, వాటి సహాయంతో అవకాశవాదానికి వ్యతిరేకంగా ఇంచుమించు నిశితమైన ఒక ఆయుధాన్ని తయారు చేయవచ్చు. అవకాశవాదానికి కారణాలు ఎంత లోతైనవి అయితే యీ ఆయుధం కూడా అంత ఎక్కువ నిశితమైనదిగా వుండాలి. అందుచేత, అవకాశవాదానికి "లోతైన కారణాలు" వున్నాయనే హేతువుతో అవకాశవాదానికి తలుపు తెరిచివుంచే సూత్రీకరణను సమర్థించడం ఒకటోరకం తోకపట్టుకుని పోయే విధానమే అవుతుంది. కామ్రేడ్ లీబెర్‌ను కామ్రేడ్ ట్రాట్స్కీ వ్యతిరేకించినప్పుడు నిబంధనావళిలో ఒక భాగం పట్ల మొత్తం అందరియొక్క, వెనుకబడిన దళం పట్ల అగ్రదళంయొక్క "సంఘటితపర్చబడిన అపనమ్మకం" వుందని అర్థం చేసుకున్నాడు. కాని కామ్రేడ్ ట్రాట్స్కీ కామ్రేడ్ లీబెర్ పక్షం వహించినప్పుడు ఈ విషయం మరచిపోయి, "సంక్లిష్టమైన కారణాలు," "శ్రామికవర్గ అభివృద్ధి స్థాయి," వగైరాలను గురించి మాట్లాడటం ద్వారా ఈ సంఘటితపర్చబడిన మన అపనమ్మకం వ్యవస్థీకరణయొక్క (అవకాశవాదంపట్ల అపనమ్మకం) బలహీనతనూ అస్థిరత్వాన్నీ సమర్థించడం కూడా మొదలుపెట్టాడు. కామ్రేడ్ ట్రాట్స్కీ వాదాలలో మరొకటి ఇది: "ఏదో విధంగా సంఘటితులై వున్న మేధావి యువజనం తమంతట తాము (కింది గీతలు నావి) పార్టీలో చేరడం చాలా తేలిక." సరిగ్గా అంతే. అందుకనే అసంఘటితులైన వారు కూడా పార్టీ సభ్యులమని తమంతట తామే ప్రకటించుకోడానికి అవకాశం యిచ్చే యీ సూత్రీకరణలో మేధోపరమైన అస్పష్టత వుంది గాని, "తనంతట తానుగా" పార్టీలో చేరే హక్కును తొలగించే నా సూత్రీకరణలో కాదు. కేంద్ర కమిటీ ఒక అవకాశవాదుల సంఘాన్ని "గుర్తించ నిరాకరించింది" అంటే, అది కొంతమంది వ్యక్తుల నడవడి మూలంగానే అవుతుంది, ఈ వ్యక్తులు రాజకీయ ప్రముఖులుగా తెలిసి

ఇందులో చివరిదైన ''అరాజక భావాలు'' అనే మాట కామ్రేడ్ పవ్లోవిచ్ ఉపయోగించిన మాట. ''బాధ్యతా రహితులైన స్వయం సభ్యత్వం పొందిన'' పార్టీ సభ్యులను గుర్తించడాన్ని అరాజకవాదంగా ఆయన ఎంతో సరిగానే అభివర్ణించాడు. కామ్రేడ్ పవ్లోవిచ్ నా సూత్రీకరణను కామ్రేడ్ లీబెర్‌కు వివరిస్తూ ఇలా చెప్పాడు: ''సరళమైన మాటలలోకి తర్జుమా చేస్తే దాని అర్థం ఇది: 'నీవు పార్టీ సభ్యునిగా వుండగోరితే, నిర్మాణపరమైన సంబంధాలను నీవు అంగీకరించడమనేది కూడా కేవలం నిర్లిప్తమైనది కాకూడదు.''' ఈ ''తర్జుమా'' సరళం అయినదిగా వున్నప్పటికీ, అది అనావశ్యకమైనది కాదని తేలింది (మహాసభానంతర ఘటనలు చూపినట్లుగా). అది వివిధ సందిగ్ధ ఆచార్యులకూ, హైస్కూలు

---

వుంటారు గనుక వారు ప్రమాదకారులుగా వుండరు, యావత్తు పార్టీచే బహిష్కరింపబడటం ద్వారా వారిని తొలగించవచ్చు అన్నాడు కామ్రేడ్ ట్రాట్స్కీ. ఎవరినైనా పార్టీనుంచి తొలగించవలసివచ్చిన సందర్భాలలో మాత్రమే ఇది నిజం (ఒక సంఘటితమైన పార్టీ తన సభ్యులను ఎవరినైనా తొలగించవలసివస్తే వోటింగు ద్వారా తొలగిస్తుంది గాని బహిష్కరించడం ద్వారా కాదు కనుక ఇది ఆ విషయంలో సగం నిజమే అవుతుంది). పార్టీనుంచి తొలగించడం అసంగతమై, కావలసినదంతా అదుపులో పెట్టడమే అయినవి తరచుగా సంభవించేవీ అయిన సందర్భాలలో ఇది పూర్తిగా అసత్యం. అదుపులో పెట్టడం కోసం, పూర్తిగా నమ్మతగినది కాకపోయినా పని చేయగలది అయిన ఒక శాఖను కేంద్ర కమిటీ కొన్ని షరతులపై, బుద్ధిపూర్వకంగా పార్టీలోకి చేర్చుకోవచ్చు; దానిని పరీక్షించే ఉద్దేశంతోనూ, దానిని సరి అయిన మార్గంలో పెట్టడానికి ప్రయత్నించే ఉద్దేశంతోనూ, మార్గదర్శకత్వం వహించడం ద్వారా దాని పాక్షిక అపమార్గాన్ని సరిదిద్దే ఉద్దేశంతోనూ, వగైరాతోనూ అది ఆ పని చేయవచ్చు. ముత్తంమీద, పార్టీలోకి ''సాధారణంగా'' అంగీకరించక పోతే ఈ చేరడం ప్రమాదకరం కాదు. పొరపాటు భావాలను గురించీ, పొరపాటు ఎత్తుగడలను గురించీ బహిరంగమైన బాధ్యతాయుతమైన నియంత్రిత అభిప్రాయ ప్రకటనకూ (చర్చకూ) అది తరచు ఉపయోగకరంగా వుంటుంది. కామ్రేడ్ ట్రాట్స్కీ ఇంకా ఇలా అన్నాడు: ''కాని, శాసనాత్మక నిర్వచనాలు వాస్తవ సంబంధాలకు అనుగుణంగా వుండాలంటే కామ్రేడ్ లెనిన్ సూత్రీకరణను తోసిపుచ్చాలి.'' ఇక్కడ మళ్లీ అయన ఒక అవకాశవాదిలాగ మాట్లాడాడు. వాస్తవ సంబంధాలు జడమైనవి కావు. అవి సజీవమైనవి, పరిణామం చెందేవి. శాసనాత్మక నిర్వచనాలు ఈ సంబంధాల అభ్యుదయకర పరిణామానికి సరిపడవచ్చు. కాని అవి (ఈ నిర్వచనాలు చెడ్డవి అయితే) వెనుకకు పోవడానికీ లేక నిస్తబ్ధతకూ ''అనుకూలం'' కావచ్చు: ఇందులో రెండవదే కామ్రేడ్ మార్తొవ్ ''విషయం.''

విద్యార్థులకూ మాత్రమే గాక నిజాయితీపరులైన పార్టీ సభ్యులకూ, ఉన్నత స్థానాలలో వున్నవారికీ కూడా అవశ్యకమే.... కామ్రేడ్ మార్తొవ్ సూత్రీకరణకూ, "మన పార్టీ చైతన్య రహితమైన క్రమానికి చైతన్యయుతమైన ప్రతినిధి" అని మార్తొవ్ ఎంతో అనుచితంగా ఉదహరించిన శాస్త్రీయ సోషలిజం గురించిన నిర్వివాదమైన భావానికీ మధ్య గల వైరుధ్యాన్ని కామ్రేడ్ పవ్లోవిచ్ అంత సరిగానూ ఎత్తి చూపాడు. సరిగ్గా అంతే, సరిగ్గా ఆ కారణం చేతనే, "ప్రతి సమ్మెదారుడూ" తాను పార్టీ సభ్యుడనని చెప్పుకునే హక్కు కలిగి వుండాలని కోరడం తప్పు. ఎందుచేతనంటే, "ప్రతి సమ్మె" శక్తివంతమైన వర్గ ప్రవృత్తియొక్క, సామాజిక విప్లవానికి తప్పని సరిగా దారితీసే వర్గ పోరాటంయొక్క సద్యోజనిత వ్యక్తీకరణ మాత్రమే గాక ఆ క్రమంయొక్క చైతన్యయుత వ్యక్తీకరణయే అయితే, అప్పుడు సార్వత్రిక సమ్మె ఒక అరాజక పదం అవదు, అప్పుడు మన పార్టీ తక్షణమూ నూ ఒక్క సారిగానూ కార్మికవర్గం యావత్తుకూ వ్యాపించుతుంది, బూర్జువా సమాజం అంతటినీ ఒకే సారిగా అంతమొందించుతుంది. వాస్తవంగా పార్టీ కనక చైతన్యయుతమైన ప్రతినిధి అవాలంటే అది ఒక నిర్దిష్టమైన చైతన్య స్థాయిని సాధించేవీ ఆ స్థాయిని క్రమబద్ధంగా పెంచేవీ అయిన నిర్మాణపర సంబంధాలను రూపొందించగలిగి వుండితీరాలి. కామ్రేడ్ పవ్లోవిచ్ ఇలా అన్నాడు: "మనం మార్తొవ్ మార్గంలోనే వెళ్లవలసివస్తే కార్యక్రమాన్ని అంగీకరించడం గురించిన అంశాన్ని మొట్టమొదట ఎత్తివేయాలి, ఎందుకంటే, కార్యక్రమాన్ని అంగీకరించడానికి ముందు దానిని కరతలామలకం చేసుకోవాలి, దానిని అవగాహన చేసుకోవాలి.... కార్యక్రమాన్ని అంగీకరించేటందుకు బాగా ఉన్నతమైన రాజకీయ చైతన్య స్థాయి వుండాలి." సోషల్ డెమోక్రటిక్ ఉద్యమానికి మద్దతును, అది నడిపే పోరాటంలో పాల్గొనడాన్ని, ఏ షరతుల చేతనూ (కరతలామలకం చేసుకోడం, అవగాహన వగైరాలతో) కృత్రిమంగా పరిమితపర్చడాన్ని మనం ఎన్నటికీ అనుమతించం, ఎందుచేతనంటే, ఈ పాల్గొనడమన్నదే చైతన్యాన్నీ, నిర్మాణయుతం కావాలనే సహజప్రవృత్తినీ పెంపొందిస్తుంది; కాని, క్రమబద్ధమైన కృషిని కొనసాగించేటందుకు మనం ఒక పార్టీగా ఏర్పడ్డాం గనుక ఆ కృషి క్రమబద్ధంగా వుండేటట్లు మనం చూడాలి.

కార్యక్రమం విషయంలో కామ్రేడ్ పవ్లోవిచ్ చేసిన హెచ్చరిక అనావశ్యకం కాదన్న సంగతి వెంటనే, అదే సమావేశంలో వెల్లడైంది. కామ్రేడ్ మార్తొవ్ సూత్రీకరణ ఆమోదింపబడేటట్లు చేసిన* కామ్రేడ్స్ అకీమొవ్, లీబెర్‌లు వెంటనే తమ నిజ స్వభావాన్ని బైటపెట్టారు. కార్యక్రమం విషయంలో కూడా నిర్లిప్తమైన అంగీకారం మాత్రమే, దాని

* దానికి 28 ఓట్లు అనుకూలంగానూ, 22 వ్యతిరేకంగానూ వడ్డాయి. ఎనిమిది

''మౌలిక సూత్రాలను'' అంగీకరించడం మాత్రమే (పార్టీలో ''సభ్యత్వానికి'') చాలునని డిమాండు చేశారు (పేజీలు 254–255). ''కామ్రేడ్ మార్తోవ్ దృక్పథంనుంచి కామ్రేడ్ అకీమొవ్ ప్రతిపాదన పూర్తిగా హేతుబద్ధం'' అని కామ్రేడ్ పవ్లోవిచ్ చెప్పాడు. దురదృష్టవశాత్తూ, అకీమొవ్ చేసిన యీ ప్రతిపాదనకు ఎన్ని వోట్లు వచ్చాయో మనకి మినిట్స్‌లో కనబడలేదు — బహుశా ఏడు ఓట్లకు తక్కువ కాకుండా వచ్చివుంటాయి (అయిదుగురు బుంద్ అనుయాయులు, అకీమొవ్, బ్రూకెర్). మహాసభనుంచి ఏడు గురు ప్రతినిధులు ఉపసంహరించుకోడంతో, నిబంధనావళిలోని మొదటి నిబంధనపై ఏర్పడ నారంభించిన ''ఘనిష్టమైన మెజారిటీ'' (''ఇస్క్రా'' వ్యతిరేకులు, ''మధ్యస్థవర్గాలు,'' మార్తోవ్ అనుచరులు) ఒక ఘనిష్టమైన మైనారిటీగా మారిపోయింది! ఈ ఏడుగురు ప్రతినిధుల ఉపసంహరణ ఫలితంగానే పాత సంపాదకవర్గాన్ని ఆమోదించాలనే ప్రతిపాదన వీగిపోయింది — ''ఇస్క్రా'' సంపాదకత్వంలో ''అనుస్యూతి'' ఘోరంగా ఉల్లంఘించబడుతోంద నేది! ఇది ''ఇస్క్రా'' ''అనుస్యూతి''కి ఏకైక సాధనగా హామీగా తయారైన వింత సప్త కూటమి: బుంద్‌వాళ్లు, అకీమొవ్, బ్రూకెర్ అంటే, ''ఇస్క్రా''ను కేంద్ర పత్రికగా గుర్తించాలన్న ఉద్దేశాలను వ్యతిరేకించినవారే, ఎవరి అవకాశవాద వైఖరి అయితే మహాసభలో కొన్ని డజన్ల సార్లు గుర్తించబడిందో, కార్యక్రమానికి సంబంధించి మొదటి నిబంధనను బలహీనపర్చడం విషయంలో ప్రత్యేకించి మార్తోవ్ చేతనూ, ప్లెహానొవ్ చేతనూ గుర్తింప బడిందో ఆ ప్రతినిధులే వీరు. ''ఇస్క్రా'' ''అనుస్యూతి'' ''ఇస్క్రా'' వ్యతిరేకులచే కాపాడ బడింది! — దీనితోనే మహాసభానంతరకాలపు విషాదసుఖమిశ్రమ పరిస్థితి ప్రారంభం అయింది.

* * *

నిబంధనావళి మొదటి నిబంధనపై జరిగిన వోటుల గ్రూపింగులో సరిగ్గా భాషల సమా నత్వం ఘటన లాంటి విషయం వెల్లడి అయింది: ''ఇస్క్రా'' మెజారిటీలో (రమారమి) నాలుగోవంతు తగ్గిపోవడం మూలంగా ''మధ్యస్థవర్గం''చే బలపర్చబడిన ''ఇస్క్రా''

---

మంది ''ఇస్క్రా'' వ్యతిరేకులలోనూ ఏడుగురు మార్తోవ్‌ను బలపర్చారు, ఒక్కడే నన్ను బలపర్చాడు. అవకాశవాదుల సహాయం లేకపోతే కామ్రేడ్ మార్తోవ్ తన అవకాశవాద సూత్రీకరణకు ఆమోదాన్ని సంపాదించి వుండేవాడు కాదు. (లీగు మహాసభలో కామ్రేడ్ మార్తోవ్ యీ నిస్సందేహమైన వాస్తవాన్ని కాదనడానికి విఫల ప్రయత్నం చేశాడు, ఏ కారణం చేతనో బుంద్ అనుయాయుల ఓట్లను మాత్రమే పేర్కొన్నాడు; కామ్రేడ్ అకీమొవ్‌నూ, ఆయన మిత్రులనూ గురించి మరచిపోయాడు — నాకు వ్యతిరేకంగా, కామ్రేడ్

వ్యతిరేకులు విజయం పొందగలిగారు. ఇక్కడ కూడా చిత్రణయొక్క పూర్తి అనురూపతను భగ్నపరచిన వ్యక్తిగత వోట్లు వున్నాయి — మన మహాసభ లాంటి పెద్ద సమావేశంలో ముఖ్యంగా మొదటి నిబంధన లాంటి సమస్యమీద ఆకస్మికంగా ఒక పక్షంనుంచి మరో పక్షానికి మారుతూ వుండే కొంతమంది "దారితప్పినవాళ్లు" తప్పకుండా వుంటారు. మొదటి నిబంధన సమస్యలో భిన్నత్వపు నిజమైన లక్షణం అప్పుడే బైటపడ నారంభించింది, చాలామంది ప్రతినిధులు (ఆ సమస్య ముందుగా పత్రికలలో చర్చించబడకపోవడం మూలంగా) తమ వైఖరి ఎలా వుండాలో ఇంకా నిర్ణయించుకోలేదు. మెజారిటీ "ఇస్క్రా" అనుయాయుల వోట్లు అయిదు పోయాయి (రెండేసి వోట్లున్న రూసొవ్, కార్స్కీ ఒక వోటున్న లెన్స్కీ); మరో వైపున ఒక "ఇస్క్రా" వ్యతిరేకి (బ్రూకెర్) మధ్యస్థవర్గంనుంచి ముగ్గురు (మెద్వేదెవ్, యెగోరొవ్, త్సర్యోవ్) వారితో కలిశారు; ఫలితంగా మొత్తం ఇరవైమూడు వోట్లు వచ్చాయి $(24-5+4)$, ఎన్నికలలో తుది గ్రూపింగు కంటె ఒక వోటు తక్కువ. "ఇస్క్రా" వ్యతిరేకులే మార్తొవ్‌కు మెజారిటీ వచ్చేటట్లు చేశారు, వారిలో ఏడుగురు ఆయనకు వోటు చేశారు, ఒకడు నాకు వోటు చేశాడు ("మధ్యస్థవర్గం"కు చెందిన వారిలో కూడా ఏడుగురు మార్తొవ్‌కు వోటు చేశారు, ముగ్గురు నాకు వోటు చేశారు). "ఇస్క్రా" అనుయాయి మైనారిటీ "ఇస్క్రా" వ్యతిరేకులతోనూ "మధ్యస్థ వర్గం"తోనూ మిశ్రమపక్షంగా ఏర్పడటం ఒక రూపం ధరించ నారంభించింది, మహాసభ ముగిసే నాటికీ, మహాసభానంతరమూ ఇది ఒక ఘనిష్టమైన మైనారిటీగా ఏర్పడింది. మొదటి నిబంధనను సూత్రీకరించడంలోనూ, ముఖ్యంగా ఆ సూత్రీకరణను సమర్థించడంలోనూ నిస్సందేహంగా అవకాశవాదం వైపు, అరాజకపు వ్యక్తితత్వం వైపు అడుగు వేసిన మార్తొవ్, అక్సెల్‌రోడ్‌ల రాజకీయ పొరపాటు మహాసభ యిచ్చిన స్వేచ్ఛాయుతమైన బహిరంగమైన రంగస్థలం మూలంగా వెంటనేనూ స్పష్టంగానూ బైట పడింది; అత్యంత తక్కువ నిలకడ కలిగినవారూ, సూత్రరీత్యా అత్యంత తక్కువ దృఢ నిశ్చయం గలవారూ విప్లవకర సోషల్ డెమోక్రట్ల అభిప్రాయాలలో వచ్చిన బీటను పెద్దది చేయడానికి వెంటనే తమ బలగాలనన్నిటినీ ఉపయోగించారనే వాస్తవంలోనే అది వెల్లడి అయింది. నిర్మాణ సంబంధమైన విషయాలలో బహిరంగంగా విభిన్న లక్ష్యాలు (అకీమొవ్ ప్రసంగం చూడండి) కలిగి వున్న వారు మహాసభలో ఒకటిగా పని చేశారు — ఈ పరిస్థితి సూత్రరీత్యా మన నిర్మాణ పథకానికీ నిబంధనావళికీ వ్యతిరేకులైనవారిని

---

బ్రూకెర్ నాతో ఏకీభవించడానికి వ్యతిరేకంగా, అది ఉపయోగపడుతుంది అనుకున్నప్పుడు మాత్రమే, వారు ఆయనకు జ్ఞాపకం వచ్చారు.)

కా(మేడ్స్ మార్తొవ్, అక్సెల్‌రోడ్‌ల పొరపాట్లను బలపర్చేటట్లు వెంటనే ప్రోత్సహించింది. ఈ సమస్యమీద కూడా విప్లవకర సోషల్ డెమోక్రటిక్ ఉద్యమ భావాలకు విశ్వాసంతో కట్టుబడివున్న "ఇస్క్రా" అనుయాయులు మైనారిటీ అయిపోయారు. ఇది అత్యంత ప్రాముఖ్యంగల విషయం. ఎందుచేతనంటే దీనిని గ్రహించితేనే తప్ప నిబంధనావళి వివరాలపై జరిగిన పోరాటాన్నీ, కేంద్ర పత్రికలోని కేంద్ర కమిటీలోని వ్యక్తుల కూర్పుపై జరిగిన పోరాటాన్నీ అర్థంచేసుకోడం పూర్తిగా అసంభవం అవుతుంది.

## ఒ) అవకాశవాదులు అనే తప్పుడు నిందారోపణకు గురి అయిన నిరపరాధులు

నిబంధనావళిపై జరిగిన తదుపరి చర్చలను పరిశీలించడానికి ముందు, కేంద్ర సంస్థలలో వ్యక్తుల కూర్పు విషయమై మన అభిప్రాయ భేదాన్ని వివరించడం కోసం, మహాసభ సమయంలో "ఇస్క్రా" సంస్థ ప్రయివేటు సమావేశాలను గురించి ప్రస్తావించడం అవసరం. ఇలా జరిగిన నాలుగు సమావేశాలలోనూ ఆఖరిదీ అత్యంత ముఖ్యమైనదీ నిబంధనావళి మొదటి నిబంధనపై వోటింగు అయిన వెనువెంటనే జరిగింది — ఆవిధంగా ఈ సమావేశంలో "ఇస్క్రా" శాఖలో వచ్చిన చీలిక సమయరీత్యానూ తర్కరీత్యానూ తరువాతి పోరాటానికి నాంది.

కేంద్ర కమిటీకి కాగల అభ్యర్థుల గురించిన చర్చను లేవనెత్తిన ఆర్గనైజింగు కమిటీ ఘటన వెనువెంటనే "ఇస్క్రా" శాఖ ప్రయివేటు సమావేశాలు* జరపడం ఆరంభించింది. కట్టుబడి వుండాలనే ఆదేశాలు రద్దు చేయబడ్డాయి గనుక ఈ సమావేశాలు కేవలం సంప్రదింపుల స్వభావం మాత్రమే కలిగి వుండటం సబబే. ఆ సమావేశ నిర్ణయాలు ఎవరికీ ఆవశ్యపాలనీయాలు కావు; అయినప్పటికీ వాటికున్న ప్రాముఖ్యం మాత్రం అపారం. కేంద్ర

* ఈ ప్రయివేటు సమావేశాలలో ఏమి జరిగిందో లీగు మహాసభలో నేను ఇదివరకే వివరించడానికి ప్రయత్నించాను. పరిష్కారంలేని వాగ్వివాదాలను నివారించడం కోసమని కేవలం ఆవశ్యకమైన విషయాలను గురించే చెప్పాను. ప్రధానమైన విషయాలు "'ఇస్క్రా' సంపాదకవర్గానికి లేఖ"[28]లో కూడా చెప్పబడ్డాయి (పేజి 4). కామేడ్ మార్తొవ్ తన "సమాధానం"లో వాటిని సవాలు చేయలేదు.

కమిటీకి అభ్యర్థులను ఎంపిక చేయడం మహాసభ ప్రతినిధులకు చాలా చిక్కు అయిన విషయం. ఎందుకంటే వారికి రహస్య నామధేయాలు తెలియవు, ''ఇస్క్రా'' శాఖలోపల జరిగే కృషితో పరిచయంలేదు. ''ఇస్క్రా'' శాఖే వాస్తవంగా పార్టీ ఐక్యతను సాధించింది. ఆచరణలో ఉద్యమానికి అది వహించిన నాయకత్వమే ''ఇస్క్రా''ను లాంఛన పూర్వకంగా గుర్తించడానికి గల హేతువులలో ఒకటి. ఐక్యంగా వుంటే ''ఇస్క్రా'' అనుయాయులకు మహాసభలో పెద్ద మెజారిటీ, అయిదింట మూడువంతుల మెజారిటీ పూర్తిగా వుంటుందని మనం ఇదివరకే చూశాం, ప్రతినిధులందరూ ఈ విషయాన్ని బాగా అర్థం చేసుకున్నారు. నిజానికి, కేంద్ర కమిటీ సభ్యుల కూర్పు గురించి ''ఇస్క్రా'' శాఖ నిర్దిష్టమైన సిఫారసులు చేస్తుందని ''ఇస్క్రా''వాళ్ళు అందరూ ఆశించారు, ఆ శాఖ లోపల కేంద్ర కమిటీ కూర్పును గురించి జరిగిన ప్రాథమిక చర్చలో ఒక్క సభ్యుడు కూడా ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు; ఆర్గనైజింగు కమిటీ సభ్యులందరినీ బలపర్చడం గురించి, అంటే ఆ కమిటీని కేంద్ర కమిటీగా మార్చడం గురించి గానీ, కేంద్ర కమిటీ అభ్యర్థుల విషయమై ఆర్గనైజింగు కమిటీ అంతటినీ సంప్రదించాలని గానీ వారిలో ఒక్కరు కూడా సూచించలేదు. ఈ పరిస్థితి కూడా ఎంతో ప్రాధాన్యంగల విషయం. దానిని దృష్టిలో పెట్టుకోడం ఎంతో ముఖ్యం. ఎందుకంటే, ఇప్పుడు, ఆ ఘటన తరువాత, మార్తొవ్ అనుయాయులు ఆర్గనైజింగు కమిటీని ఉత్సాహంతో సమర్థిస్తున్నారు. ఆవిధంగా వారు తమ రాజకీయ బలహీనతను నూరవ సారో వెయ్యోసారో నిరూపించుకుంటున్నారు.* కేంద్ర సంస్థల కూర్పు విషయమై వచ్చిన చీలిక మార్తొవ్‌ను అకీమొవ్‌లతో కలిసేటట్లు చేసేటంతవరకూ మహాసభలో ప్రతివారూ, ఆర్గనైజింగు కమిటీ ప్రధానంగా మహాసభను ఏర్పాటు చేయడానికి నెలకొల్పబడిన ఒక కమిషన్ అనీ, అది బుంద్ అనుయాయులతో సహా వివిధ అభిప్రాయాలు కలిగి వున్న ప్రతినిధులతో బుద్ధిపూర్వకంగా కూర్చబడిన కమిషన్ అనీ గుర్తించారు. ఈ

---

* ఈ ''నీతి నియమాల చిత్రణ''ను గురించి పర్యాలోచన చేయండి: ''ఇస్క్రా'' శాఖ ప్రతినిధి మహాసభలో దానితో మాత్రమే సంప్రదిస్తాడు, ఆర్గనైజింగు కమిటీతో సంప్రదించే విషయం గురించి సూచన కూడా చేయడు. కాని తాను ఈ శాఖలోనూ మహాసభలోనూ ఓడిపోయిన తరువాత అతడు ఆర్గనైజింగు కమిటీ ఆమోదింపబడలేదని విచారపడటం, కాలం గతించిన తరువాత దానిని పొగడటం తనకి వోటు హక్కు యిచ్చిన శాఖను ఆడంబరంగా అలక్ష్యం చేయడం మొదలు పెడతాడు! నిజమైన ఏ సోషల్ డెమోక్రటిక్ పార్టీయొక్క నిజమైన ఏ కార్మికవర్గ పార్టీయొక్క చరిత్రలోనూ దీనికి సదృశమైన ఉదాహరణ ఏదీ దొరకదని గట్టిగా చెప్పవచ్చు.

విషయాన్ని మహాసభ మినిట్స్‌నుంచి "ఇస్క్రా" చరిత్ర యావత్తునుంచీ నిష్పక్షపాతి అయిన వ్యక్తి ఎవరైనాసరే సులువుగా తెలుసుకోవచ్చు; కాని సంఘటితమైన పార్టీ ఐక్యతను నిర్మించే నిజమైన కృషి అంతా "ఇస్క్రా" శాఖే చేసింది (ఇంకో విషయాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలి; ఆర్గనైజింగు కమిటీలో సభ్యులుగా వుండిన కొందరు "ఇస్క్రా" అనుయాయులు అరెస్టు చేయబడటం మూలంగా గాని, "అనివార్యమైన" కారణాలవల్ల గాని, మహాసభకు రాలేకపోయారు). మహాసభకు హాజరైన "ఇస్క్రా" శాఖ సభ్యుల పేర్లు కామ్రేడ్ పవ్లోవిచ్ పుస్తకంలో ఇదివరకే చెప్పబడ్డాయి (ఆయన "రెండవ మహాసభ గురించిన లేఖ"ను చూడండి, పేజి 13).[29]

"ఇస్క్రా" శాఖలో జరిగిన ఉద్రిక్తమైన చర్చల తుది ఫలితం నేను "సంపాదకవర్గానికి లేఖ"లో ఇదివరకే పేర్కొన్న రెండు వోటింగులు. మొదటి వోటింగు: "తొమ్మిదిమంది అనుకూలం, నలుగురు వ్యతిరేకం, ముగ్గురు వోటింగులో పాల్గొనలేదు, మార్తొవ్ బలపర్చిన అభ్యర్థులలో ఒకరు తోసివుచ్చబడ్డారు." అలాంటి వాస్తవం కంటె మరింత స్పష్టమైనది మరింత సహజమైనది ఏమి వుండగలదని ఎవరైనా అనుకోవచ్చు. మహాసభలో వున్న పదహారు మంది "ఇస్క్రా" శాఖ సభ్యుల ఉమ్మడి అంగీకారంతో అభ్యర్థులుగా వుండగల వారి పేర్లు చర్చించబడ్డాయి. కామ్రేడ్ మార్తొవ్ అభ్యర్థులలో ఒకరి పేరు మెజారిటీచే నిరాకరింపబడింది (ఆయన కామ్రేడ్ ష్టెయిన్, ఇప్పుడు కామ్రేడ్ మార్తొవ్ దానిని బైటపెట్టాడు — "ముట్టడి స్థితి" పేజి 69). ఏమైనా, మహాసభలో మనమంతా సమకూడిన నిమిత్తాలలో ఒకటి ఎవరికి "సారథ్యం" అప్పగించాలో చర్చించి నిర్ణయించడం. — ఎజెండాలో వున్న ఈ అంశం పట్ల అత్యంత శ్రద్ధ చూపడం. "కూపస్థమండూక మనోభావ" దృష్టితో గాక (కామ్రేడ్ రూసొవ్ ఆ తరువాత ఎంతో సరిగా చెప్పినట్టుగా) పని ప్రయోజనాల దృక్పథంనుంచే యీ సమస్యను పరిష్కరించడం, పార్టీ సభ్యులుగా మనందరి ఉమ్మడి కర్తవ్యం. కేంద్ర కమిటీ అభ్యర్థులను గురించి మహాసభలో చర్చించేటప్పుడు మనం కొన్ని వ్యక్తిగత లక్షణాలను గురించి తప్పక ప్రస్తావించాలి, ముఖ్యంగా అనధికార, సన్నిహిత సమావేశంలో మన అంగీకారాన్ని లేక అనంగీకారాన్ని తప్పకుండా వెల్లడించాలి.* ఒక అభ్యర్థి పేరును ఆమోదించకపోతే అతనిని "అవమానించి"నట్లుగా

---

* నేను అనంగీకారాన్ని తెల్పిన ఉగ్రతకు లీగులో కామ్రేడ్ మార్తొవ్ దీనంగా ఫిర్యాదు చేశాడు, తన అభ్యంతరం తనకే వ్యతిరేకంగా ఒక వాదం అవుతుందని గ్రహించలేదు. ఆయన మాటలలోనే చెప్పాలంటే లెనిన్ ఆవేశమెత్తిన వానిలాగ ప్రవర్తించాడు (లీగు మినిట్స్, పేజి 63). అది నిజమే. ఆయన దఢాలున తలుపులు మూసివేశాడు. నిజమే.

భావించడం (లీగు మినిట్స్, పేజి 49), దానిపై ఒక "గోల" చేయడం, నాయకులను అంతఃకరణ పూర్వకంగానూ వివేకవంతంగానూ ఎంపికచేయడమనేది పార్టీ సభ్యుని కర్తవ్యంలో ఒక భాగం అయే విషయంపై ఉన్మత్తత ప్రదర్శించడం అయుక్తమని లీగు మహాసభలో నేను ఇదివరకే చెప్పాను. అయినప్పటికీ మన మైనారిటీకి సంబంధించి నంతవరకు అగ్నిలో ఆజ్యం పోసినది అదే. మహాసభ అయిపోయిన తరువాత వారు "పేరు ప్రతిష్ఠలను నాశనం చేయడం" గురించి గోలచేయడం మొదలుపెట్టారు (లీగు మినిట్స్, పేజి 70), కామ్రేడ్ ష్టెయిన్ పాత ఆర్గనైజింగు కమిటీలో "ప్రధాన వ్యక్తి"గా వున్నాడనీ, నిష్కారణంగా అతనిపై "దుష్ట పథకాలు" వేస్తున్నట్టు ఆరోపించబడిందనీ అచ్చులో విశాల ప్రజానీకానికి నచ్చజెప్పడానికి పూనుకున్నారు ("ముట్టడి స్థితి," పేజి 69). అభ్యర్థులను ఆమోదించడం లేక ఆమోదించకపోవడం సందర్భంలో "పేరు ప్రతిష్ఠలను నాశనం చేయడం" గురించి కేకలు వేయడం ఉన్మత్తత కాదా? "ఇస్క్రా" శాఖ ప్రయివేటు సమావేశంలోనూ, పార్టీయొక్క ఆధికారిక అత్యున్నతాధికార సంస్థ అయిన మహాసభలోనూ కూడా ఓడిపోయిన తరువాత అందరికీ ఫిర్యాదులు చేయడం, నిరాకరింపబడిన అభ్యర్థులను "ప్రధాన వ్యక్తులు"గా ప్రజలకు సిఫారసు చేయడం, ఆ తరువాత పార్టీలో చీలిక తీసుకురావడం ద్వారానూ, కో-ఆప్టు చేసుకోవాలని డిమాండు చేయడం ద్వారానూ తమ అభ్యర్థులను పార్టీమీద బలవంతాన రుద్దడానికి ప్రయత్నించడం జగడమాడటం కాదా? వికారమైన మన ప్రవాస వాతావరణంలో రాజకీయ భావనలు ఎంత గందరగోళం అయాయంటే, కామ్రేడ్ మార్తొవ్ పార్టీ కర్తవ్యానికీ బంధుప్రీతికీ, బృందపరమైన భక్తి విశ్వాసాలకూ గల వ్యత్యాసాన్ని ఎంత మాత్రమూ తెలుసుకోలేకపోతున్నాడు! అభ్యర్థులను గురించి మహాసభలో మాత్రమే చర్చించి

---

ఆయన ప్రవర్తన ("ఇస్క్రా" శాఖ రెండవ లేక మూడవ సమావేశంలో) ఆ సమావేశంలో మిగిలి వున్న సభ్యులకు ఆగ్రహం కలిగించింది. నిజంగానే కలిగించింది. కాని దానినుంచి ఏమి తేలుతుంది? వివాదంలో వున్న సమస్యల సారాంశంపై నేను చేసిన వాదనలే నమ్మకం కలిగించేవిగా వున్నాయి, మహాసభ జరిగిన తీరు వాటిని సమర్థించింది. ఎందుచేతనంటే, వాస్తవానికి "ఇస్క్రా" శాఖలోని పదహారు మంది సభ్యులలోనూ తొమ్మిది మంది చివరకి నా పక్షం వహించారంటే నా అనంగీకార ప్రకటన గర్హ్యమైనంత ఉగ్రంగా వున్నప్పటికీ కూడా అలా జరిగిందనేది స్పష్టం. కనుక నా అనంగీకార ప్రకటన ఉగ్రంగా ఉండకపోతే బహుశా తొమ్మిది మంది కంటె ఇంకా ఎక్కువమందే నా పక్షానికి వచ్చి వుండేవారు. నా వాదనలూ వాస్తవాలూ ఎంత ఎక్కువ "ఆగ్రహాన్ని" అధిగమించవలసి వస్తే అవి అంత ఎక్కువ నమ్మకం కలిగించేవిగా వుండి వుండాలి.

నిర్ణయించడం సరి అయినదని అనుకోడం బ్యూరాక్రసీ, లాంఛనప్రాయమూ అని మనం నమ్మాలన్న మాట. మహాసభలో ప్రతినిధులు ప్రధానంగా ముఖ్యమైన సూత్రబద్ధమైన సమస్యలను చర్చించడానికి సమావేశమవుతారు. అక్కడ ఉద్యమ ప్రతినిధులు సమావేశమవుతారు. వారు వ్యక్తులను గురించిన సమస్యను నిష్పక్షపాతంగా చూడగల్గుతారు. వారు తమ వోట్లు వేసేముందు అభ్యర్థులను గురించి అవసరమైన సమాచారాన్నంతనీ సేకరించగల్గుతారు, డిమాండు చేయగల్గుతారు (అలా చేయాలి). అప్పుడు సారథ్యంపై వాదోపవాదాలు సహజమూ ఆవశ్యకమూ అవుతాయి. ఈ బ్యూరాక్రటిక్, లాంఛనప్రాయ దృక్పథానికి బదులు మనకు ఇప్పుడు కొత్త సద్ప్రయోగాలూ ఆచారాలూ వచ్చాయి: మహాసభల తరువాత మనం ఇవాన్ ఇవానొవిచ్ రాజకీయ అంత్యక్రియల గురించీ, లేక ఇవాన్ నికీఫొరొవిచ్[30]యొక్క నాశనమైన పేరు ప్రతిష్ఠల గురించీ ఇష్టమొచ్చినట్టు మాట్లాడవలసివస్తోంది. రచయితలు పుస్తకాలలో అభ్యర్థులను సిఫారసు చేయ వలసివస్తోంది. వారు తమ గుండెలు బాదుకుని, ''ఇది బృందం కాదు ఇది పార్టీ...'' అని కుటిలంగా ఉద్ఘాటిస్తారు. అపవాదులంటే ఇష్టపడే పాఠకులు మార్తొవ్ ఇచ్చే హామీలమీద ఫలానా వారు ఆర్గనైజింగు కమిటీలో ప్రధాన వ్యక్తి అనే సంచలనాత్మక వార్తలను ఆతృతతో రుచి చూస్తారు.* మెజారిటీ వోటుతో మొరటు యాంత్రిక నిర్ణయాలు చేసే మహాసభ లాంటి లాంఛనప్రాయమైన సంస్థలకంటె యీ పాఠకులే ఈ సమస్యను చర్చించి నిర్ణయించడానికి ఎంతో ఎక్కువ అర్హులు అవుతారన్న మాట.... నిజమే, మన నిజమైన పార్టీ కార్యకర్తలు శుభ్రం చేయవలసిన ప్రవాస తగాదాల తాలూకు వాస్తవమైన ఔగేయన్ గుర్రపుశాలలు[31] ఇంకా వున్నాయి!

---

* మార్తొవ్ లాగనే నేను కూడా ''ఇస్క్రా'' శాఖలో కేంద్ర కమిటీకి ఒక అభ్యర్థిని నామినేటు చేయించడానికి ప్రయత్నించి విఫలుడనయాను. మహాసభకు పూర్వమూ, మహాసభ ఆరంభంలోనూ అద్భుతమైన పేరు ప్రతిష్ఠలు గల అభ్యర్థి ఆయన. విశిష్టమైన వాస్తవాలే దానిని నిరూపించాయి. నేను కూడా దానిని గురించి మాట్లాడగలను. కాని దానిని గురించి నేను ఆలోచించనే లేదు. మహాసభ తరువాత తనను అచ్చులో నామినేటు చేయడానికి గాని, రాజకీయ అంత్యక్రియలను, నాశనం చేయబడిన పేరు ప్రతిష్ఠలు వగైరాలను గురించి ఫిర్యాదులు చేయడానికి గాని అనుమతించనంతటి ఆత్మగౌరవం గల అభ్యర్థి ఆయన.

"ఇస్క్రా" శాఖలో జరిగిన రెండవ వోటింగులో: "పది – రెండు వోట్లతో – నలుగురు వోటింగులో పాల్గొనలేదు – అయిదు మంది పేర్లు (కేంద్ర కమిటీకి అభ్యర్థులు) ఆమోదింపబడ్డాయి. నా ప్రతిపాదనమీద వారిలో 'ఇస్క్రా' అనుయాయులు కానివారి నాయకుడు ఒకడూ, 'ఇస్క్రా' అనుయాయుల మైనారిటీ నాయకుడు ఒకడూ చేర్చబడ్డారు." ఈ వోటింగు అత్యంత ముఖ్యమైనది. ఎందుకంటే ఆ తరువాత జగడాల వాతావరణంలో కల్పించబడిన కట్టుకథలు పూర్తిగా అబద్ధాలని అది స్పష్టంగానూ నిర్ద్వంద్వంగానూ రుజువుచేస్తుంది. ఆ కట్టుకథలలో మేము "ఇస్క్రా" అనుయాయులు కానివారిని పార్టీనుంచి వెళ్లగొట్టడం గాని, పక్కకు నెట్టివేయడం గాని చేయగోరుతున్నామనీ, మెజారిటీ మహాసభలో సగంమందిలోనుంచే అభ్యర్థులను ఎంపిక చేసి ఆ సగంమందే వారిని ఎన్నుకున్నారనీ వగైరా వగైరా కల్పించబడ్డాయి. ఇదంతా కేవలం అబద్ధం. నేను పైన ఉదహరించిన వోటింగు, "ఇస్క్రా" అనుయాయులు కానివారిని మేము పార్టీనుంచి బహిష్కరించడం మాట అటుంచి కేంద్ర కమిటీనుంచి సహితం బహిష్కరించలేదనీ, మేము మా ప్రతికక్షులను చాలా బలమైన మైనారిటీగా వుండేటట్లే చేశామనీ తెలియజేస్తుంది. అసలు విషయం ఏమిటంటే, వారు మెజారిటీగా వుండాలని కోరుతున్నారు, ఈ నమ్రతగల కోరిక నెరవేరకపోవడంతో రగడ మొదలుపెట్టారు, కేంద్ర సంస్థలలో ఎంత మాత్రం సభ్యులుగా వుండటానికి నిరాకరించారు. లీగులో కామ్రేడ్ మార్తొవ్ చెప్పినది ఏమైనప్పటికీ అసలు సంగతి అదేనని ఈ కింది లేఖ తెలియజేస్తోంది. మహాసభ నిబంధనావళిలోని మొదటి నిబంధనను ఆమోదించిన వెనువెంటనే "ఇస్క్రా" శాఖలోని మైనారిటీ "ఇస్క్రా" అనుయాయి మెజారిటీ పక్షం (ఏడుగురు ఉపసంహరించుకున్న తరువాత మహాసభలో వున్న మెజారిటీ) అయిన మాకు ఈ లేఖను రాసింది. (ఈ సందర్భంలో నేను చెబుతున్న "ఇస్క్రా" శాఖ సమావేశం ఆఖరుదని గమనించాలి; దాని తరువాత శాఖ వాస్తవంగా విచ్ఛిన్నం అయిపోయింది. అందులో ప్రతి ఒక్క పక్షమూ తాను చెబుతున్నదే సరిఅయినదని మహాసభలోని ఇతర ప్రతినిధులను నమ్మించడానికి ప్రయత్నించింది.)

ఆ లేఖ పూర్తి పాఠం ఇది:

"(ఫలానా రోజున జరిగిన*) సమావేశానికి హాజరు కావాలనే సంపాదకవర్గ

---

* నాకు జ్ఞాపకం వున్నంతవరకు ఈ లేఖలో పేర్కొన్న రోజు ఒక మంగళవారం. ఆ సమావేశం మంగళవారం సాయంత్రం, అంటే మహాసభ 28వ సమావేశానంతరం జరిగింది.

మెజారిటీయొక్క, "శ్రమ విమోచన" గ్రూపుయొక్క[32] కోరికను గురించి ప్రతినిధులు సారోకిన్, సాబ్లినా యిచ్చిన వివరణను విన్నాము. క్రిందటి సమావేశంలో కేంద్ర కమిటీకి అభ్యర్థుల జాబితా చదువబడిందని యీ ప్రతినిధుల సహాయంతో తెలుసుకున్నాము. అది మా రాజకీయ వైఖరి యావత్తునూ తప్పుగా చిత్రించడానికి ఉపయోగించుకోబడింది. మొదటి విషయం, ఆ జాబితాయొక్క వాస్తవమైన మూలం ఏమిటో నిజం తెలుసుకోడానికి ఎలాంటి ప్రయత్నమూ జరగలేదు; రెండవది, ఈ పరిస్థితి "ఇస్క్రా" సంపాదకవర్గ మెజారిటీ, "శ్రమ విమోచన" గ్రూపులకు వ్యతిరేకంగా బహిరంగంగా అందరికీ తెలియజేయబడిన అవకాశవాదం అనే నిందారోపణకు నిస్సందేహంగా సంబంధించినది; మూడవది, మాకు పూర్తిగా స్పష్టం అయినట్టుగా, ఈ ఆరోపణ "ఇస్క్రా" సంపాదకవర్గ కూర్పును మార్చాలనే ఒక నిర్దిష్టమైన పథకంతో సంబంధం కలిగివుంది — వీటిని మనసులో పెట్టుకుని ఇది మమ్మలను సమావేశంనుంచి మినహాయించడానికి గల కారణాలను తెల్పుతూ మాకు యిచ్చిన వివరణలను అసంతృప్తికరమైనవిగానూ, మమ్మలను సమావేశానికి రాకుండా నిరాకరించడం పైన చెప్పిన ఆరోపణలను ఖండించే అవకాశం మాకు ఇవ్వకుండా చేయదలచడానికి ఒక నిదర్శనంగానూ మేము పరిగణిస్తున్నాము.

"కేంద్ర కమిటీకి అభ్యర్థుల విషయంలో ఒక సంయుక్త జాబితాను సమర్పించడంపై మేము ఒక ఒప్పందానికి రావడానికి గల అవకాశం విషయానికి వస్తే, ఆ ఒప్పందానికి ప్రాతిపదికగా మేము అంగీకరించగల ఒకే ఒక జాబితా: పొపోవ్,

---

ఈ కాలక్రమ పరిగణన చాలా ముఖ్యం. మేము విడిపోయినది కేంద్ర సంస్థల నిర్మాణం గురించిన సమస్యమీదనే గాని, వాటిలోని వ్యక్తుల కూర్పును గురించిన సమస్యమీద కాదనే కామ్రేడ్ మార్తొవ్ అభిప్రాయానికి ఇది లిఖిత పత్ర పూర్వకమైన ఖండన. ఈ విషయమై నేను లీగు మహాసభలోనూ, "సంపాదకవర్గానికి లేఖ"లోనూ చెప్పినవి సరి అయినవే ననడానికి ఇది ఒక లిఖిత పత్ర పూర్వకమైన రుజువు. మహాసభ 28వ సమావేశం తరువాత అవకాశవాదం అనే అబద్ధపు ఆరోపణపై కామ్రేడ్స్ మార్తొవ్, స్తరొవేర్‌లు చాలా చెప్పారు, కాని వారు కొన్నిలు కూర్పు విషయంమీద గాని, కేంద్ర సంస్థలకు కో-ఆప్టు చేసుకోడం విషయంమీద గాని వున్న భేదాభిప్రాయాలను గురించి ఒక్క మాట కూడా చెప్పలేదు (వీటిని గురించి మహాసభ 25వ, 26వ, 27వ సమావేశాలలో వాదోపవాదాలు జరిగాయి).

ట్రోట్స్కీ, గ్లేబొవ్‌ల పేర్లు అని మేము ప్రకటిస్తున్నాము. ఇది ఒక రాజీ జాబితా అని మేము నొక్కిచెబుతున్నాము. ఎందుకంటే కామ్రేడ్ గ్లేబొవ్ పేరును చేర్చడం మెజారిటీ కోరికలకు యివ్వబడిన ఒక రాయితీ మాత్రమే నని భావించాలి; కారణం మహాసభలో ఆయన నిర్వహించిన పాత్ర మాకు స్పష్టం అయింది కనుక కేంద్ర కమిటీ అభ్యర్థిగా వుండదగిన వ్యక్తిగా కామ్రేడ్ గ్లేబొవ్‌ను మేము పరిగణించడంలేదు.

"అదే సమయంలో మేము ఒక విషయాన్ని నొక్కిచెబుతున్నాము. కేంద్ర కమిటీ అభ్యర్థుల విషయంలో మేము సంప్రదింపులకు దిగడం కేంద్ర పత్రిక సంపాదకవర్గ కూర్పు సమస్యతో ఎలాంటి సంబంధమూ కలిగిలేదు. ఎందుకంటే ఈ సమస్యమీద (సంపాదకవర్గ కూర్పుమీద) ఎలాంటి సంప్రదింపుకీ దిగడానికి మేము సంసిద్ధులుగా లేము.

"కామ్రేడ్స్ తరఫున మార్తొవ్, స్త్రొవేర్."

వివాదపడుతున్న పక్షాల మనోస్థితినీ, వివాద స్థితినీ ఎంతో సరిగా ప్రతిబింబిస్తున్న యీ లేఖ ప్రారంభం అవుతున్న చీలికయొక్క "మూలం" ఏమిటో మనకి వెంటనే చూపుతుంది, దానికి గల అసలు కారణాలు ఏమిటో తెలియజేస్తుంది. "ఇస్క్రా" శాఖలోని యీ మైనారిటీ మెజారిటీతో ఏకీభవించడానికి నిరాకరించి, మహాసభలో ప్రచార స్వేచ్ఛ వుండాలని ఎంచుకుంది (దానికా హక్కు పూర్తిగా వున్న మాట నిజమే), అయినప్పటికీ, తమను మెజారిటీ వాళ్ల ప్రయివేటు సమావేశంలోకి రానివ్వాలని మెజారిటీ "ప్రతినిధులను" సమ్మతింప జేయడానికి ప్రయత్నించింది! సహజంగానే, యీ వినోదకరమైన డిమాండుకు మా సమావేశంలో చిరునవ్వూ, బుజాలు కదలడమూ ఎదురయాయి. (అందులో ఈ లేఖ చదివి వినిపించబడిందని వేరే చెప్పనక్కర్లేదు.) "అవకాశవాదం అనే తప్పుడు నిందారోపణల" గురించి దాదాపు ఉన్మత్తతతో కూడిన వారి గోల పెద్ద పెట్టున నవ్వునే తెప్పించింది. అయినప్పటికీ మొట్టమొదట మార్తొవ్, స్త్రొవేర్‌ల దీనమైన ఫిర్యాదులను ఒక్కొక్క అంశమే తీసుకుని పరిశీలిద్దాం.

ఆ పేర్ల జాబితా వారిదని తప్పుగా ఆపాదించబడింది; వారి రాజకీయ వైఖరి తప్పుగా చిత్రించబడుతోంది — కాని మార్తొవ్ స్వయంగానే అంగీకరించినట్టుగా (లీగు మినిట్స్, పేజి 64) ఆ జాబితాను తయారుచేసినది తాను కాదనే ప్రకటనలోని నిజాన్ని శంకించాలనే ఆలోచన నాకెన్నడూ రాలేదు. మొత్తంమీద, ఆ జాబితాను ఎవరు తయారుచేశారనే దానికి అసలు విషయంతో సంబంధం లేదు. ఆ జాబితాను ఒక "ఇస్క్రా" అనుయాయుడు తయారుచేశాడా లేక "మధ్యస్థవర్గ"పు ప్రతినిధి తయారుచేశాడా, మరెవరైనా తయారు

చేశారా అనేది ఎంత మాత్రం ముఖ్యం కాదు. ముఖ్యమైన విషయం ఏమిటంటే, ప్రస్తుతపు మైనారిటీ సభ్యుల యావన్మంది పేర్లతోనే నిండివున్న ఆ జాబితా మహాసభలో అందరికీ అందజేయబడిన ఆ జాబితా, కేవలం ఒక వూహా గాని భావన గాని కాదు. కడపటిగా, అన్నిటి కంటె అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే, మహాసభలో కామ్రేడ్ మార్తొవ్ ఏ జాబితానైతే ఇప్పుడు ఆయన సంతోషంతో అభినందించుతాడో ఆ జాబితాకూ తనకూ సంబంధం లేదని అత్యంత ఉగ్రతతో చెప్పుకోవలసివచ్చింది, మనుషులనూ అభిప్రాయ భేదాలనూ అంచనా వేయడంలో పూర్తిగా అటునుంచి ఇటు మారిపోయిన చాంచల్యానికి ఇంతకంటే స్పష్టమైన ఉదాహరణ మరోటి వుండదు. ''పరువునష్టం కలిగించే పుకార్లు'' వేశారనే అరపులనుంచి పరువునష్టం కలిగిస్తుందని భావించబడిన ఈ జాబితాలోని అభ్యర్థులనే పార్టీ కేంద్ర సంస్థలోకి తీసుకోవాలని బలవంతపెట్టే స్థితికి రెండు నెలలలో మారిపోయాడు!*

లీగు మహాసభలో కామ్రేడ్ మార్తొవ్ ఇలా అన్నాడు: ''ఈ జాబితా రాజకీయంగా ఒక వైపున మనకీ 'యూజ్నీ రబోచి'కీ, మరో వైపున బుండ్‌కీ మధ్య ఒక కలయికను, ప్రత్యక్ష ఒప్పందం అనే అర్థంలో కలయికను తెలియజేసింది'' (పేజి 64). అది నిజం కాదు. ఎందుకంటే మొదటిది, ఒక్క బుండ్ అనుయాయుని పేరు కూడా చేర్చబడని జాబితాపై బుండ్ ఎన్నటికీ ఒక ''ఒప్పందం'' కుదుర్చుకుని వుండదు; రెండవది, బుండ్ మాట అటుంచి ''యూజ్నీ రబోచి'' గ్రూపుతో సహితం ఒప్పందం చేసుకునే ప్రశ్నే లేదు (దీనిని కామ్రేడ్ మార్తొవ్ అవమానకరంగా భావించాడు). వివాదంలో వున్న విషయం కలయిక గాని ఒప్పందం కాదు; కామ్రేడ్ మార్తొవ్ ఒప్పందం కుదుర్చుకున్నాడని కాదు, కాని మహాసభ ప్రథమార్థంలో ఎవరితో అయితే ఆయన పోరాడాడో, ఎవరైతే నిబంధనావళి మొదటి నిబంధనలో ఆయన తప్పును పట్టుకుని విమర్శించారో ఆ ''ఇస్క్రా'' వ్యతిరేకుల యొక్క, నిలకడలేని వారియొక్క మద్దతును పొందవలసి వచ్చిందనే ''వ్యథకు'' మూలకారణం, ఆయనది అవకాశవాదమని బహిరంగంగానూ పైపెచ్చు అబద్ధంగానూ చేయబడిన ఆరోపణలోనే వుందని నేను పైన ఉదహరించిన లేఖ నిర్ద్వంద్వంగా రుజువు చేస్తుంది. అగ్నిలో ఆజ్యం పోసినదీ, ''సంపాదకవర్గానికి లేఖ''లో నేను జ్ఞాపకం చేసినప్పటికీ కూడా కామ్రేడ్ మార్తొవ్ ఇప్పుడు అంత జాగ్రత్తగా తప్పించుకుంటున్నదీ

---

*కామ్రేడ్ గూసెవ్, కామ్రేడ్ డేయ్‌చ్‌ల మధ్య జరిగిన ఘటన గురించిన వార్త వచ్చేసరికే ఈ పంక్తులు కంపోజు చెయ్యబడ్డాయి. అనుబంధంలో ఈ ఘటనను విడిగా పరిశీలిద్దాం. (ఈ సంపుటంలో పేజీలు 246 – 255 చూడండి. – సం.)

అయిన ''నిందారోపణ'' ద్విముఖమైనది. మొదటి విషయం నిబంధనావళి మొదటి నిబంధనపై జరిగిన చర్చలలో ఆ నిబంధన ''అన్ని రకాల అవకాశవాద ప్రతినిధులనూ దూరంగా వుంచడం'' అనే సమస్య అనీ, నా ముసాయిదా వారు పార్టీపై దాడి చేయకుండా కాపాడే రక్షణదుర్గమనీ, ''అందుకనే అవకాశవాదానికి శత్రువులైన వారందరి వోట్లు దానికి పడ్డాయి'' అనీ ప్లెహానొవ్ నిర్మొగమాటంగా ప్రకటించాడు (మహాసభ మినిట్స్, పేజి 246). నేను కొంచెం మృదువుగా చెప్పినప్పటికీ (పేజి 250) ఈ తీవ్రమైన మాటలు సంచలనం కలిగించాయి. అది కామ్రేడ్స్ రూసొవ్ (పేజి 247), ట్రాట్స్కీ (పేజి 248), అకీమొవ్ (పేజి 253) ప్రసంగాలలో స్పష్టంగా వెల్లడించబడింది. మన ''పార్లమెంటు'' ''అభిజ్ఞవర్గాల''లో ప్లెహానొవ్ వాదం తీవ్రంగా విమర్శించబడింది. మొదటి నిబంధనపై అనేక రకాలుగా అంతులేని వాదోపవాదాలు జరిగాయి. కాని మన ప్రియమైన కామ్రేడ్స్ తమ వాదాన్ని దాని యోగ్యతను పట్టి సమర్థించడానికి బదులు తమకు అవమానం జరిగినట్టు పరిహాసాస్పదమైన వైఖరిని అవలంబించారు, ''అవకాశవాదమనే తప్పుడు నిందారోపణ'' గురించి వ్రాత మూలంగా ఫిర్యాదులు చేసేటంతవరకూ కూడా వెళ్లారు!

అందరి సమక్షంలోనూ బహిరంగ వాదోపవాదం అనే స్వచ్ఛమైన వాతావరణానికి తట్టుకోజాలని వారి సంకుచిత బృందం సరళి మనస్తత్వమూ, పార్టీ సభ్యులుగా ఆశ్చర్యకరమైన వారి అపరిపక్వతా ఇందులో స్పష్టంగా వెల్లడి అయాయి. అందితే జుట్టు లేకపోతే కాళ్లు పట్టుకోడం అనే లోకోక్తిలో చెప్పబడినట్టుగా ఇది రష్యనులకు బాగా తెలిసిన మనస్తత్వం. వీరు ఒక సన్నిహితమైన సుఖమైన చిన్న బృందం అనే ఏకాంతవాసానికి ఎంత ఎక్కువగా అలవాటుపడి వున్నారంటే, మీలో ఎవరైనా ఒకరు స్వేచ్ఛాయుతమైన బహిరంగమైన వేదికమీద తన స్వంత బాధ్యతమీద మాట్లాడిన వెనువెంటనే అతనికి స్పృహ తప్పిపోయినంత పని జరుగుతుంది. అవకాశవాదం అనే ఆరోపణలు! – ఎవరిమీద? ''శ్రమ విమోచన'' గ్రూపుమీద, దానికున్న మెజారిటీమీద – ఇంతకంటె ఘోరమైన దాన్ని మీరు వూహించగలరా? చెరిపివేయలేని ఈ అవమానం మూలంగా పార్టీని చీల్చైనా చీల్చాలి లేదా ఏకాంతవాసపు ''అనుస్యూతిని'' పునరుద్ధరించడం ద్వారా ఈ ''గృహచ్ఛిద్రాన్ని'' కప్పిపెట్టాలి – ఈ ప్రత్యామ్నాయం మన మిప్పుడు పరిశీలించుతున్న లేఖలో ఇదివరకే చాలా స్పష్టంగా సూచించబడింది. మేధోపరమైన వ్యక్తి అహంభావమూ బృందం సరళి మనస్తత్వమూ, పార్టీ ముందు దాపరికం లేకుండా మాట్లాడటమనే ఆవశ్యకతతో ఘర్షణ పడ్డాయి. జర్మన్ పార్టీలో ''అవకాశవాదం అనే తప్పుడు నిందారోపణ'' గురించి ఇలాంటి అసందర్భాన్ని, ఇలాంటి జగడాన్ని, ఇలాంటి ఫిర్యాదును మీరు వూహించగలరా? అక్కడ, శ్రామిక సంస్థా నిర్మాణమూ క్రమశిక్షణా అలాంటి మేధావి బలహీనతను ఏనాడో తొలగించి

వేశాయి. ప్రతివారికీ లీబ్‌క్నెఖ్ట్ పట్ల ప్రగాఢమైన గౌరవభావం తప్ప మరేమీలేదనే అనుకుందాం; కాని వ్యవసాయ సమస్యమీద ఆయన అపఖ్యాతిపాలైన అవకాశవాది ఫోల్మర్‌తోనూ అతని మిత్రులతోనూ చెడుసావాసంలో చేరినప్పుడు 1895 మహాసభలో[33] ఆయన (బేబెల్‌తో పాటు) "అవకాశవాది అని బహిరంగంగా నిందించ"బడినందుకు ఫిర్యాదు చేస్తే వారు ఎంతగానో నవ్వి వుండేవారు. లీబ్‌క్నెఖ్ట్ పేరు జర్మన్ కార్మికోద్యమ చరిత్రతో విడదీయరాని విధంగా ముడివడివుంది. అయితే అది తారతమ్య రీత్యా చిన్నదీ, అముఖ్యమైనదీ అయిన అలాంటి సమస్యమీద ఆయన అవకాశవాదంలోకి దారితప్పి పోయినందుకు మాత్రం కాదు, దానితో నిమిత్తం లేకుండానే. అలాగే మాటవరసకి మన పోరాటం ఎంత తీవ్రమైనది అయినప్పటికీ కామ్రేడ్ అక్సెల్‌రోడ్ పేరు ప్రతి రష్యన్ సోషల్ డెమోక్రట్‌లోనూ ఆయన పట్ల గౌరవభావాన్ని కలిగిస్తోంది, ఎల్లప్పుడూ కలిగిస్తుంది; అయితే అది కామ్రేడ్ అక్సెల్‌రోడ్ మన పార్టీ రెండవ మహాసభలో అవకాశవాద భావాన్ని సమర్థించడం, లీగు రెండవ మహాసభలో పాత అరాజకవాద చెత్తను తిరగదోడటం జరిగినందుకు కాదు, దానితో నిమిత్తం లేకుండానే. అత్యంత మూఢాభిమానంతో కూడిన బృందం సరళి మనస్తత్వం మాత్రమే "అందితే జుట్టు లేకపోతే కాళ్లు పట్టుకోడం" అనే తన తర్కంతో, "'శ్రమ విమోచన' గ్రూపులో మెజారిటీపై అవకాశవాదులనే తప్పుడు నిందారోపణ" జరిగినందుకు ఆగ్రహావేశాలకు, జగడాలకు, పార్టీలో చీలికకు దారి తీయగలిగింది.

ఘోరమైన యీ నిందారోపణలోని మరొక అంశం దాని ముందరి అంశంతో సన్నిహిత సంబంధం కలిగివుంది (లీగు మహాసభలో (పేజి 63) ఈ ఘటనలో ఒక పార్శ్వాన్ని తప్పించడానికీ కప్పిపుచ్చడానికీ కామ్రేడ్ మార్తొవ్ విఫల ప్రయత్నం చేశాడు). అది కామ్రేడ్ మార్తొవ్‌తో "ఇస్క్రా" వ్యతిరేకులూ, వూగిసలాడేవారూ కలవడానికి సంబంధించినదే. ఈ కలయిక నిబంధనావళి మొదటి నిబంధన సందర్భంగా తలెత్త నారంభించింది. సహజంగానే, కామ్రేడ్ మార్తొవ్‌కి "ఇస్క్రా" వ్యతిరేకులకూ మధ్య ప్రత్యక్షమైన లేక పరోక్షమైన ఒప్పందం ఏదీ లేదు, వుండజాలదు, ఎవరూ కూడా ఆయనలా చేస్తాడని అనుమానించలేదు: భయంలో ఆయనకి అలా అనిపించింది అంతే. కాని రాజకీయంగా ఆయన పొరపాటు ఈ కింది వాస్తవంలో బయటపడింది. నిస్సందేహంగా అవకాశవాదం వైపు మొగ్గుతున్న వారు ఆయన చుట్టూ ఇదివరకటి కంటె ఎక్కువ బలమైన "ఘనిష్టమైన" మెజారిటీగా చేరడం మొదలుపెట్టారు (ఏడుగురు ప్రతినిధులు "యాదృచ్ఛికంగా" ఉపసంహరించుకోడం మూలంగా మాత్రమే ఇప్పుడది మైనారిటీ అయింది). మొదటి నిబంధన విషయం అయిన వెంటనే ఈ "కలయిక"ను గురించి మేము బహిరంగంగా కూడా మహాసభలోనూ (ఇదివరకే ఉదహరించబడిన కామ్రేడ్ పవ్లోవిచ్ వ్యాఖ్యానాలను

చూడండి: మహాసభ మినిట్స్, పేజి 255), ''ఇస్క్రా'' శాఖలోనూ (నాకు జ్ఞాపకం వున్నంతవరకు, స్లెహానొవ్ దీనిని ప్రత్యేకించి పేర్కొన్నాడు) పేర్కొన్నాము. సరిగ్గా ఇదే విషయం ఇదే వెక్కిరింపు క్లారా జెట్కిన్ 1895లో బేబెల్‌నూ, లీబ్‌క్నెఖ్ట్‌నూ ఉద్దేశించి చెప్పింది. ఆమె ఇలా అంది: "Es tut mir in der Seele weh, daß ich dich in der Gesellschaft seh" (''నిన్ను [బేబెల్‌ను] అలాంటి వారి మధ్య [ఫోల్మర్ అండ్ కో] చూడటం నాకు బాధ కలిగించింది'')[34]. నిజంగా, బేబెల్, లీబ్‌క్నెఖ్ట్‌లు కౌట్స్కీకి, జెట్కిన్‌కీ అవకాశవాదులనే తప్పుడు నిందారోపణ గురించి ఫిర్యాదు చేస్తూ ఆగ్రహావేశ పూరితమైన లేఖను పంపక పోవడం వింతగానే వుంది....

కేంద్ర కమిటీకి అభ్యర్థుల జాబితా విషయానికి వస్తే, లీగు మహాసభలో మాతో ఒక ఒప్పందానికి రావడానికి నిరాకరించడం ఇంకా తుది నిర్ణయం కాదని ప్రకటించడంలో కామ్రేడ్ మార్తొవ్ పొరపడ్డాడని యీ లేఖ తెల్పుతుంది – రాజకీయ పోరాటంలో లిఖిత పత్రాలమీద ఆధారపడటానికి బదులు చెప్పిన మాటలను జ్ఞాపకాలనుంచి తిరిగి చెప్పడానికి ప్రయత్నించడం ఎంత అవివేకమో తెల్పడానికి ఇది మరో ఉదాహరణ. వాస్తవంగా, ''మైనారిటీ'' ''మెజారిటీకి'' తుది హెచ్చరికను చేయడంలో ఎంతో నమ్రతను చూపారు: ''మైనారిటీ''నుంచి ఇద్దరినీ, ''మెజారిటీ''నుంచి ఒకరినీ (సరిగా చెప్పాలంటే, రాజీగానూ రాయితీ కల్పించడంగానూ మాత్రమే!) తీసివేయాలని చెప్పారు. ఇది ఘోరం, కాని వాస్తవం. ''మెజారిటీ'' మహాసభలో సగభాగంనుంచి మాత్రమే ప్రతినిధులను ఎంపిక చేసి ఆ సగ భాగం చేతనే వారు ఎన్నిక అయేటట్లు చేసిందని ఇప్పుడు ప్రచారం చేసే కట్టుకథలు ఎంత అసందర్భమో ఈ వాస్తవం స్పష్టంగా తెలియజేస్తోంది. జరిగిన దానికి ఇది పూర్తిగా విరుద్ధం: మూడు స్థానాలలోనూ ఒకటి మాత్రమే ఒక రాయితీగా మార్తొవ్ అనుయాయులు మాకు ఇస్తామన్నారు, ఫలితంగా, ఈ అద్వితీయమైన ''రాయితీ''కి మేము అంగీకరించని పక్షంలో స్థానాలన్నిటినీ తమ తమ స్వంత అభ్యర్థులతోనే నింపాలని వారు తల పోశారు! మార్తొవ్ అనుయాయుల యీ నమ్రతకు మా ప్రయివేటు సమావేశంలో మేము బాగా నవ్వుకున్నాము. మా స్వంత జాబితాను తయారు చేశాము: గ్లేబొవ్ – త్రవీన్‌స్కీ (తరువాత కేంద్ర కమిటీకి ఎన్నుకోబడ్డాడు) – పొపొవ్. మూడోవానికి బదులు కామ్రేడ్ వసీల్యెవ్‌ను (ఇది కూడా ఇరవై నలుగురుతో జరిగిన ప్రయివేటు సమావేశంలోనే) ప్రత్యామ్నాయంగా పెట్టాము (తరువాత ఆయన కేంద్ర కమిటీకి ఎన్నుకోబడ్డాడు). ఇది ఎందుకు జరిగిందంటే కామ్రేడ్ పొపొవ్ తన పేరును మా జాబితాలో చేర్చడానికి, మొదట ప్రయివేటు సమావేశంలోనూ ఆతరువాత బహిరంగంగా మహాసభలోనూ నిరాకరించాడు కనుకనే (పేజి 338).

వ్యవహారాలు నిజంగా అలా వున్నాయి.

వినమ్రమైన "మైనారిటీ" వినమ్రంగానే మెజారిటీలో వుండాలని కోరారు. ఈ వినమ్రమైన కోరిక నెరవేరకపోయేసరికి ఆ "మైనారిటీ" అసలేమీ వద్దని అల్లరి చేయడానికి పూనుకుంది. అయినప్పటికీ, "మెజారిటీ"యొక్క "రాజీ వ్యతిరేకతను" గురించి ఇప్పుడు మాట్లాడేవారు ఇంకా వున్నారు!

మహాసభలో స్వేచ్ఛాప్రచార రంగంలో జగడానికి దిగి, "మైనారిటీ" "మెజారిటీకి" వినోదకరమైన తుది హెచ్చరికలు చేసింది. ఓడిపోయి మన వీరులు కన్నీరు కార్చారు. ముట్టడి స్థితి అంటూ ఏడవడం మొదలుపెట్టారు. Voilà tout.*

మేము సంపాదకవర్గ కూర్పును మార్చదలచామనే ఘోరమైన నిందారోపణ కూడా (ఇరవై నలుగురుతో కూడిన మా ప్రయివేటు సమావేశంలో) పరిహసించబడింది: మహాసభ ఆరంభంనుంచీ, మహాసభకు పూర్వం కూడా ప్రథమంగా ముగ్గుర్ని ఎన్నుకోడం ద్వారా సంపాదకవర్గాన్ని పునర్వ్యవస్థీకరించాలనే పథకం వున్నదన్న సంగతి అందరికీ బాగా తెలుసు (మహాసభలో సంపాదకవర్గ ఎన్నిక విషయానికి వచ్చినప్పుడు దీన్ని గురించి మరింత వివరంగా చెబుతాను). ఈ పథకం సరైనదేనని గ్రహించిన తరువాత "మైనారిటీ" భయపడిందనే సంగతి వారు "ఇస్క్రా" వ్యతిరేకులతో కలవడంతో చక్కగా ధృవపడింది. ఇది మాకు ఆశ్చర్యం కలిగించలేదు—అది ఎంతో సహజం. మహాసభలో ఎలాంటి పోరాటం లేకుండా మా అంతట మేము మైనారిటీగా మారిపోవాలనే ప్రతిపాదనను మేము పట్టించుకోని మాట నిజమే. ఈ లేఖను యావత్తునూ కూడా మేము పట్టించుకోలేము. ఈ లేఖా రచయితలు "అవకాశవాదమనే తప్పుడు నిందారోపణలను" గురించి మాట్లాడేటంతటి నమ్మశక్యంగాని కోపోద్రేక స్థితిలో వున్నారు. వారిలోని పార్టీ కర్తవ్యతా భావం త్వరలోనే వారిని స్వస్థులను చేస్తుందని మేము గట్టిగా నమ్మాం.

## ఓ) నిబంధనావళిపై చర్చల కొనసాగింపు. కౌన్సిలు కూర్పు

నిబంధనావళికి సంబంధించిన తరువాతి అంశాలు నిర్మాణ సూత్రాలపై కంటె వివరాలపై చాలా ఎక్కువ వాదోపవాదాలను రేపాయి. మహాసభ 24వ సమావేశం పూర్తిగా

* అంతే. — సం.

పార్టీ మహాసభలలో ప్రాతినిధ్యం సమస్యకు వినియోగింపబడింది. ''ఇస్క్రా'' అనుయాయులందరి ఉమ్మడి పథకాలకు వ్యతిరేకంగా తిరిగి ఒక నిశ్చితమైన నిష్కర్షయైన పోరాటం బుంద్ అనుయాయులచేతనూ (గోల్డ్‌బ్లాత్, లీబెర్‌లు – పేజీలు 258–259), కామ్రేడ్ అకీమొవ్‌చేతనూ మాత్రమే సాగించబడింది. కామ్రేడ్ అకీమొవ్ ప్రశంసనీయమైన నిష్కాపట్యంతో మహాసభలో తన పాత్రను గురించి ఒప్పుకున్నాడు. ఆయన ఇలా అన్నాడు: ''నేను మాట్లాడినప్పుడల్లా, నా వాదనలు కామ్రేడ్స్‌ను ప్రభావితం చేయవనీ తద్భిన్నంగా నేను సమర్థిస్తున్న అంశానికి హాని చేస్తాయనీ పూర్తిగా గుర్తిస్తూనే మాట్లాడాను'' (పేజి 261). నిబంధనావళి మొదటి నిబంధనపై చర్చ అయిన వెనువెంటనే వచ్చిన యీ యుక్తమైన వ్యాఖ్య ప్రత్యేకించి తగినదిగా వుంది. ''తద్భిన్నంగా'' అనే మాట మాత్రమే ఇక్కడ అంత సక్రమంగా లేదు. ఎందుచేతనంటే కామ్రేడ్ అకీమొవ్ వివిధ అంశాలకు హాని చేయగల్గడం మాత్రమే గాక, అదే సమయంలో అలా చేయడం ద్వారా ''కామ్రేడ్స్‌ను ప్రభావితం చేయగల్గాడు.'' అవకాశవాద పదజాల ప్రయోగంవైపు మొగ్గిన ఏమాత్రం నిలకడలేని ''ఇస్క్రా''వాళ్లను ప్రభావితం చేయగల్గాడు.

మహాసభలో ప్రాతినిధ్య షరతులను నిర్వచించిన నిబంధనావళి మూడవ నిబంధన తుదకు మెజారిటీచే ఆమోదించబడింది. ఏడుగురు వోటు చేయలేదు (పేజి 263) – వారు ''ఇస్క్రా'' వ్యతిరేకులనేది స్పష్టం.

కౌన్సిలు కూర్పుపై జరిగిన వాదోపవాదాలు మహాసభ 25వ సమావేశంలో ఎక్కువ కాలాన్ని తీసుకున్నాయి. అవి అనేక ప్రతిపాదనల చుట్టూ అసాధారణ సంఖ్యలో గ్రూపింగులు ఏర్పడటాన్ని బయటపెట్టాయి. అబ్రమ్సన్, త్సర్యోవ్‌లు ఒక కౌన్సిలు వుండాలనే పథకాన్నే తోసిపుచ్చారు. కౌన్సిలును ప్రత్యేకించి మధ్యవర్తిత్వ కోర్టుగా తయారుచేయాలని పానిన్ పట్టుబట్టాడు. అందుకని దానికి పూర్తి అనుగుణంగానే కౌన్సిలు అత్యున్నతాధికార సంస్థ అనీ, దాని సభ్యులలో ఎవరైనా ఇద్దరు దానిని సమావేశపర్చవచ్చును అనే నిర్వచనాన్ని తొలగించాలని ఆయన సవరణ ప్రతిపాదించాడు.* గేర్ట్స్ రూసొవ్‌లు కౌన్సిలును ఏర్పాటు చేయడానికి నిబంధనావళి కమిటీలోని అయిదుగురు సభ్యులు ప్రతిపాదించిన మూడు పద్ధతులకు అదనంగా వేరు వేరు పద్ధతులను సూచించారు.

---

* కామ్రేడ్ స్త్రొవేర్ కూడా కామ్రేడ్ పానిన్ అభిప్రాయంవైపే మొగ్గాడు. కాని వారిద్దరికీ వున్న తేడా ఏమిటంటే తనకు ఏమి కావాలో పానిన్‌కు తెలుసు. అందుకు ఎంతో అనుగుణంగానే ఆయన కౌన్సిలును కేవలం మధ్యవర్తిత్వ సంస్థగానో లేక రాజీ సంస్థగానో మార్చేటందుకు ఉద్దేశించిన సవరణ తీర్మానాలు ప్రతిపాదించాడు. కామ్రేడ్ స్త్రొవేర్‌కు

వివాదంలో వున్న సమస్యలు ప్రధానంగా కౌన్సిలు కర్తవ్యాల నిర్వచనం ఏమిటనే దాని కిందికి దిగాయి: అది మధ్యవర్తిత్వ కోర్టుగా వుండాలా, లేక పార్టీయొక్క ఉన్నతాధికార సంస్థగా వుండాలా. నేను పైన చెప్పినట్టుగా కామ్రేడ్ పానిన్ నిలకడగా మొదటి దానికే అనుకూలంగా వున్నాడు. కాని ఆయన ఏకాకిగా వున్నాడు. కామ్రేడ్ మార్తొవ్ దానిని గట్టిగా వ్యతిరేకించాడు. ఆయన ఇలా అన్నాడు: "'కౌన్సిలు అత్యున్నతాధికార సంస్థ' అనే మాటలను తొలగించాలనే సవరణ తీర్మానాన్ని తోసిపుచ్చాలని నేను ప్రతిపాదిస్తున్నాను. మన సూత్రీకరణ (అంటే, నిబంధనావళి కమిటీలో మనం అంగీకరించిన కౌన్సిలు కర్తవ్యాల సూత్రీకరణ), కౌన్సిలు పార్టీ అత్యున్నతాధికార సంస్థగా అభివృద్ధి చెందే అవకాశాన్ని బుద్ధిపూర్వకంగానే కలుగజేస్తోంది. మన దృష్టిలో కౌన్సిలు కేవలం ఒక రాజీ సంస్థ కాదు." అయినప్పటికీ, కామ్రేడ్ మార్తొవ్ ప్రతిపాదించిన విధంగా అయితే కౌన్సిలు కూర్పు కేవలమూనూ ప్రత్యేకంగానూ "రాజీ సంస్థ" లేక మధ్యవర్తిత్వ కోర్టు లాగే వుంటుంది: కేంద్ర సంస్థలు ప్రతి ఒక్కటినుంచీ ఇద్దరేసి సభ్యులు అందులో వుండాలనీ, అయిదవ సభ్యుని యీ నలుగురూ ఆహ్వానించాలనీ ఆయన ప్రతిపాదన. అలాంటి కౌన్సిలు కూర్పు మాత్రమే గాక కామ్రేడ్స్ రూసొవ్, గేర్ట్స్ ప్రతిపాదనపై మహాసభ ఆమోదించిన కూర్పు (అయిదవ సభ్యుని మహాసభ నియమించాలనేది) కూడా దానిని కేవలం రాజీ సంస్థ లేక మధ్యవర్తిత్వ కోర్టుగానే చేస్తుంది. అలాంటి కౌన్సిలు కూర్పుకూ పార్టీ అత్యున్నతాధికార సంస్థగా తయారయే దాని కర్తవ్యానికీ మధ్య తీరని వైరుధ్యం వుంది. పార్టీ అత్యున్నతాధికార సంస్థ కూర్పు స్థిరమైనదిగా వుండాలి. కేంద్ర సంస్థల కూర్పులో వచ్చే ఆగంతుక మార్పుల (ఒక్కొక్కప్పుడు అరెస్టుల మూలంగా వచ్చే మార్పుల)మీద ఆధారపడి వుండకూడదు. ఈ అత్యున్నతాధికార సంస్థ పార్టీ మహాసభతో సూటి సంబంధం కలిగివుండాలి, తన అధికారాలను మహాసభనుంచి పొందాలే గాని మహాసభకు లోబడివుండే రెండు ఇతర పార్టీ సంస్థలనుంచి కాదు. ఈ అత్యున్నతాధికార సంస్థలో పార్టీ మహాసభకు తెలిసిన వ్యక్తులే వుండాలి. కడపటి విషయం, ఈ అత్యున్నతాధికార సంస్థ, దాని ఉనికియే యాదృచ్ఛికతమీద ఆధారపడి వుండేటట్లుగా నిర్మించబడకూడదు — రెండు సంస్థలూ అయిదవ సభ్యుని ఎంపిక విషయంలో ఏకాభిప్రాయానికి రాలేకపోతే పార్టీకి అత్యున్నతాధికార సంస్థయే లేకుండా పోతుంది! దీనికి అభ్యంతరాలు చెప్పబడ్డాయి: 1) ఈ అయిదుగురిలోనూ ఒకరు వోటింగులో పాల్గొనకుండా వుండి మిగతా నలుగురూ సమానంగా విడిపోతే అప్పుడు కూడా పరిస్థితి

---

తనకు ఏమి కావాలో తెలియదు. ముసాయిదా ప్రకారం కౌన్సిలు "పక్షాల కోరికపై మాత్రమే సమావేశం కాగలదని" చెప్పాడు (పేజి 266). ఇది ఎంత మాత్రం సరి అయినది కాదు.

విషమించవచ్చు (యెగోరొవ్). ఈ అభ్యంతరం నిరాధారమైనది. ఎందుచేతనంటే ఒక నిర్ణయాన్ని ఆమోదించడం అసాధ్యం కావడమన్నది ఏ సంస్థ విషయంలోనైనా ఒక్కొక్కప్పుడు తప్పనిసరి అయిన విషయం, కాని ఒక సంస్థను ఏర్పాటు చేయడం అసాధ్యమవడానికీ దీనికీ చాలా తేడా వుంది. రెండవ అభ్యంతరం: "కౌన్సిలు లాంటి సంస్థ అయిదవ సభ్యుని ఎంపిక చేయజాలకపోతే దాని అర్థం అది మొత్తంమీద నిష్ఫలమే అవుతుంది" (జసూలిచ్). కాని ఇక్కడ అసలు విషయం అది నిష్ఫలమౌతుందన్నది కాదు, ఒక అత్యున్నతాధికార సంస్థయే లేకుండా పోతుంది: అయిదవ సభ్యుడు లేకపోతే ఏ కౌన్సిలూ వుండదు, ఏ "సంస్థ" వుండదు, అది సార్థకమైనదా కాదా అనే ప్రశ్నే రాదు. కడపటిగా, దానిపైన మరో ఉన్నత సంస్థ వుండివున్న పార్టీ సంస్థను ఏర్పాటు చేయడం సాధ్యంకాక పోవడమన్నదే చిక్కు అయితే దాన్ని పరిష్కరించవచ్చు, ఎందుకంటే అత్యవసర సందర్భాలలో ఉన్నత సంస్థ ఆ లోటును ఏదో విధంగా భర్తీ చేస్తుంది. కాని కౌన్సిలు కంటె ఉన్నతమైన సంస్థ పార్టీ మహాసభ తప్ప మరోటి ఏదీ లేదు కనుక కౌన్సిలును ఏర్పాటు చేయడం కూడా సాధ్యం కాని విధంగా నిబంధనావళిని తయారు చేయడం హేతువిరుద్ధం అనేది స్పష్టం.

ఈ సమస్యపై మహాసభలో నేను చేసిన రెండు క్లుప్తమైన ప్రసంగాలనూ కూడా (పేజీలు 267, 269) ఈ రెండు తప్పుడు అభ్యంతరాలను మాత్రమే పరిశీలించడానికి వినియోగించాను. మార్తొవ్, ఇతర కామ్రేడ్లూ ఆయన ప్రతిపాదనను సమర్థించుకోడానికి వాటిని ఉదహరించారు. కౌన్సిలులో కేంద్ర పత్రిక లేక కేంద్ర కమిటీ ప్రాబల్యం ఏర్పడటం గురించిన సమస్యలను నేను అసలు ప్రస్తావించనే లేదు. ఈ సమస్యను మహాసభ 14వ సమావేశంలోనే (పేజి 157) కామ్రేడ్ అకీమొవ్ లేవనెత్తాడు. కేంద్ర పత్రిక ప్రాబల్యం ఏర్పడే ప్రమాదం గురించి మొట్టమొదట మాట్లాడింది ఆయనే; కామ్రేడ్స్ మార్తొవ్, అక్సెల్‌రోడ్ తదితరులూ, మహాసభానంతరం అకీమొవ్ అడుగు జాడలను మాత్రం అనుసరించారు. "మెజారిటీ" కేంద్ర కమిటీని సంపాదకవర్గపు పరికరంగా మార్చగోరుతోందనే అసందర్భపు వాగాడంబర కట్టుకథను కల్పించారు. కామ్రేడ్ మార్తొవ్ తన "ముట్టడి స్థితి"లో ఈ సమస్యను ప్రస్తావించినప్పుడు దాని అసలు ప్రారంభకుడెవరో చెప్పకుండా నమ్రతతో తప్పించుకున్నాడు!

కేంద్ర కమిటీపై కేంద్ర పత్రిక ప్రాబల్యం వహించే సమస్య పార్టీ మహాసభలో ప్రస్తావించబడిన తీరును యావత్తునూ తెలుసుకొనగోరేవారూ, సందర్భ రహితమైన విడివిడి ఉల్లేఖనాలతో సంతృప్తి చెందనివారూ కామ్రేడ్ మార్తొవ్ విషయాన్ని ఎలా వక్రించి చూపాడో తేలికగా గ్రహించగలరు. మహాసభ 14వ సమావేశంలోనే కామ్రేడ్ అకీమొవ్ భావాలకు వ్యతిరేకంగా వాదోపవాదాలను ప్రారంభించినది కామ్రేడ్ పాపోవే

తప్ప మరెవరూ కాదు. ''కేంద్ర పత్రిక పలుకుబడిని తగ్గించేటందుకు పార్టీ శిఖరంలో 'కచ్చితమైన కేంద్రీకరణ' వుండాలని'' కామ్రేడ్ అకీమొవ్ కోరుతున్నాడు (పేజి 154, కిందిగీతలు నావి), ''నిజానికి ఇదే ఈ వ్యవస్థ (అకీమొవ్ చెప్పే వ్యవస్థ)యొక్క అర్థమంతా.'' కామ్రేడ్ పొపోవ్ ఇంకా ఇలా అన్నాడు: ''అలాంటి కేంద్రీకరణను ఎంత మాత్రం బల పర్చకపోగా నా చేతనైన అన్ని విధాలా దానిని వ్యతిరేకించడానికి నేను సిద్ధంగా వున్నాను. ఎందుచేతనంటే అది అవకాశవాద పతాకం.'' కేంద్ర కమిటీపై కేంద్ర పత్రిక ప్రాబల్యం అనే ప్రఖ్యాత సమస్యయొక్క మూలం మనకిక్కడ కనబడుతుంది. కామ్రేడ్ మార్తొవ్ ఇప్పుడు ఈ సమస్యయొక్క నిజమైన మూలాన్ని చల్లగా దాటవేయవలసి రావడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. కేంద్ర పత్రిక ప్రాబల్యం గురించి అకీమొవ్ చెప్పే మాటలలోని అవకాశవాద స్వభావాన్ని కామ్రేడ్ పొపోవ్ సహితం తెలుసుకోగల్గాడు.* కామ్రేడ్ అకీమొవ్‌నుండి పూర్తిగా వేరుపడేటందుకు కామ్రేడ్ పొపోవ్ నిర్ద్వంద్వంగా ఇలా ప్రకటించాడు: ''ఈ కేంద్ర సంస్థ (కౌన్సిలు)లో సంపాదకవర్గంనుంచి ముగ్గురూ కేంద్ర కమిటీనుంచి ఇద్దరూ సభ్యులుగా వుండవచ్చు. ఇది అప్రధాన సమస్య (కిందిగీతలు నావి), ముఖ్యమైన విషయం ఏమిటంటే నాయకత్వం, పార్టీయొక్క అత్యున్నత నాయకత్వం ఒక మూలాధారంనుంచే రావాలి'' (పేజి 155). కామ్రేడ్ అకీమొవ్ దానికిలా అభ్యంతరం చెప్పాడు: ''ముసాయిదాను బట్టి సంపాదకవర్గం కూర్పు స్థిరమైనదిగా వుండి కేంద్ర కమిటీ కూర్పు మారేదిగా

---

*కామ్రేడ్ అకీమొవ్‌ను అవకాశవాది అని అనడానికి కామ్రేడ్ పొపోవ్ గాని కామ్రేడ్ మార్తొవ్ గాని వెనుకాడలేదు; ఆ మాట తమకి వర్తింపజేయబడినప్పుడు మాత్రం అభ్యం తరం చెప్పి ఆగ్రహావేశపరులయారు. ''భాషల సమానత్వం,'' లేక నిబంధనావళి మొదటి నిబంధన సందర్భాలలో అది వారికి న్యాయంగానే వర్తింపజేయబడింది. ఎవరి అడుగు జాడలనైతే కామ్రేడ్ మార్తొవ్ అనుసరించాడో ఆ కామ్రేడ్ అకీమొవ్ పార్టీ మహాసభలో కామ్రేడ్ మార్తొవ్, ఆయన సహచరులూ లీగు మహాసభలో ప్రవర్తించిన దానికంటె ఎంతో హుందాగానూ ధైర్యంగానూ ప్రవర్తించాడు. పార్టీ మహాసభలో కామ్రేడ్ అకీమొవ్ ఇలా అన్నాడు: ''నన్నిక్కడ అవకాశవాది అని అన్నారు. వ్యక్తిగతంగా నేనా మాటను ఒక తిట్టుగా, అవమానంగా భావిస్తాను. ఆ మాట అనిపించుకోడానికి తగినంత చెడ్డపని నేనేదీ చేయలేదనుకుంటాను. అయినప్పటికీ నేను ఆక్షేపణ తెల్పడం లేదు'' (పేజి 296). అవకాశవాదులనే తప్పుడు నిందారోపణలకు తాము తెల్పే ఆక్షేపణమీద ఆయనను సంతకం పెట్టవలసిందిగా కామ్రేడ్స్ మార్తొవ్, స్తరొవేర్‌లు కామ్రేడ్ అకీమొవ్‌ను కోరితే, అందుకు కామ్రేడ్ అకీమొవ్ నిరాకరించాడా?

వున్నందువల్లనే కౌన్సిలుపై కేంద్ర పత్రిక ప్రాబల్యం నిస్సందేహం అవుతోంది'' (పేజి 157) — ఈ వాదం సూత్రానికి సంబంధించిన విషయాలలో నాయకత్వ ''స్థిరత్వానికి'' మాత్రమే (అది సహజమూ వాంఛనీయమూ అయిన విషయం) వర్తిస్తుంది గాని స్వాతంత్ర్యంలో జోక్యం కలిగించుకోడం లేదా అతిక్రమించడం అనే భావంలో ''ప్రాబల్యానికి'' ఎంత మాత్రం వర్తించదు. కేంద్ర కమిటీకి స్వాతంత్ర్యం లేదనే కట్టు కథలను వ్యాపింప జేయడం ద్వారా కేంద్ర సంస్థల కూర్పు పట్టు తమ అసంతృప్తిని కప్పిపుచ్చుకునే ''మైనారిటీకి'' అప్పటికింకా చెంది వుండని కామ్రేడ్ పాపోవ్, కామ్రేడ్ అకీమొవ్‌కి ఇలా అని ఎంతో హేతుబద్ధంగా చెప్పాడు: ''దానిని (కౌన్సిల్‌ను) పార్టీయొక్క మార్గదర్శక కేంద్రంగా పరిగణించాలని నేను ప్రతిపాదిస్తున్నాను. అలాంటి సందర్భంలో కౌన్సిలులో కేంద్ర పత్రిక నుంచి ఎక్కువమంది ప్రతినిధులుంటారా లేక కేంద్ర కమిటీనుంచి ఎక్కువమంది ప్రతినిధులుంటారా అన్నది పూర్తిగా అముఖ్యం అవుతుంది'' (పేజీలు 157 – 158. కిందిగీతలు నావి).

25వ సమావేశంలో కౌన్సిలు కూర్పును గురించిన చర్చ తిరిగి సాగినప్పుడు, పాత చర్చలను కొనసాగించుతూ కామ్రేడ్ పవ్లోవిచ్, ''కేంద్ర పత్రిక స్థిరత్వం దృష్ట్యా'' కేంద్ర కమిటీపై దాని ప్రాబల్యం వుండాలని ప్రకటించాడు (పేజి 264). ఆయన మనస్సులో ఉన్నది సూత్రానికి సంబంధించిన విషయాలలో స్థిరత్వం. కామ్రేడ్ మార్తొవ్ దానిని అలాగే అర్థం చేసుకున్నాడు. కామ్రేడ్ పవ్లోవిచ్ ప్రసంగించిన వెనువెంటనే మాట్లాడుతూ ఆయన ''ఒక సంస్థపై మరో సంస్థ ప్రాబల్యాన్ని నెలకొల్పడం'' అనవసరం అని భావించాడు. కేంద్ర కమిటీ సభ్యులలో ఒకరు విదేశాలలో వుండే అవకాశాన్ని గురించి పేర్కొన్నాడు. ''ఆవిధంగా సూత్రానికి సంబంధించిన విషయాలలో కేంద్ర కమిటీ యొక్క స్థిరత్వం కొంతవరకు నిలుస్తుంది'' అన్నాడు (పేజి 264). ఈ సందర్భంలో సూత్రానికి సంబంధించిన విషయాలలో స్థిరత్వాన్నీ దానిని కాపాడటాన్నీ కేంద్ర కమిటీ స్వాతంత్ర్యాన్నీ చొరవనూ కాపాడటంతో వాగాడంబరంగా గందరగోళపర్చే లక్షణలేశం సహితం అప్పటికింకా లేదు. మహాసభానంతరం ఈ గందరగోళం వాస్తవంగా కామ్రేడ్ మార్తొవ్‌కు తురుపు ముక్క అయింది కనుక, మహాసభలో ఇది కామ్రేడ్ అకీమొవ్‌చేత మాత్రమే అధికం చేయబడింది. అప్పటికే ఆయన ''నిబంధనావళిలో అరక్చేయెవ్ సరళి''[35]ని గురించి మాట్లాడి వున్నాడు (పేజి 268). ఆయన ఇలా అన్నాడు: ''పార్టీ కౌన్సిలులో ముగ్గురు సభ్యులు కేంద్ర పత్రికనుంచి వచ్చిన వారే అయితే కేంద్ర కమిటీ కేవలం సంపాదకవర్గ పరికరంగా మారిపోతుంది (కిందిగీతలు నావి). విదేశాలలో నివసించే ముగ్గురు వ్యక్తులకు పార్టీ అంతటి (!!) పనిని ఆజ్ఞాపించే హద్దూపద్దూలేని (!!) అధికారం వస్తుంది. వారి

భద్రతకు హామీ వుంటుంది. కనుక వారి అధికారం జీవితాంతం వరకూ వుంటుంది'' (పేజి 268). సైద్ధాంతిక నాయకత్వం అంటే పార్టీ అంతటి పనిలోనూ జోక్యం కలిగించుకోడం అని చెప్పబడుతున్న యీ పూర్తి అసంబద్ధపు వాగాడంబరపు మాటలతోనే, (మహాసభానంతరం ఇది కామ్రేడ్ అక్సెల్‌రోడ్‌కు ''థియోక్రసీ''[36] అనే చౌకబారు నినాదాన్ని సమకూర్చిపెట్టింది) — సరిగ్గా దీనితోనే కామ్రేడ్ పవ్లోవిచ్ అభ్యంతరం చెప్పాడు. '' 'ఇస్క్రా' ప్రాతినిధ్యం వహించే సూత్రాల స్థిరత్వాన్నీ పరిశుద్ధతనూ నేను సమర్థిస్తాను. కేంద్ర పత్రిక సంపాదకవర్గానికి ప్రాబల్యాన్ని ఇవ్వడం ద్వారా నేను యీ సూత్రాలను స్థిరపరచ గోరుతున్నాను'' అని ఆయన నొక్కి చెప్పాడు (పేజి 268).

కేంద్ర కమిటీపై కేంద్ర పత్రిక ప్రాబల్యం గురించిన ప్రసిద్ధ సమస్య వాస్తవంగా అలా వుంది. కామ్రేడ్స్ అక్సెల్‌రోడ్, మార్తొవ్‌లు చెప్పే యీ సుప్రసిద్ధ ''సూత్ర భేదం'' కామ్రేడ్ అకీమొవ్‌యొక్క అవకాశవాద వాగాడంబరపు పదజాల పునశ్చరణ తప్ప మరేమీ కాదు. వాటి నిజస్వభావాన్ని కామ్రేడ్ పొపోవ్ సహితం, కేంద్ర సంస్థల కూర్పు సమస్యపై ఆయనింకా ఓటమిని పొందని రోజుల్లో, స్పష్టంగా తెలుసుకున్నాడు!

* * *

కౌన్సిలు కూర్పు సమస్య సంక్షిప్తంగా ఇది: ''సంపాదకవర్గానికి లేఖ''లో యీ విషయం గురించిన నా ప్రకటన పరస్పర విరుద్ధంగా వుందనీ, సరి అయినది కాదనీ రుజువు చేయడానికి కామ్రేడ్ మార్తొవ్ తన ''ముట్టడి స్థితి''లో ప్రయత్నించినప్పటికీ మహాసభ మినిట్స్ చూస్తే నిబంధనావళి మొదటి నిబంధనతో పోల్చినప్పుడు ఈ సమస్య నిజంగా ఒక వివరణ మాత్రమేననీ, పార్టీ కేంద్ర సంస్థల గురించి ''దాదాపు ప్రత్యేకంగా'' మేము వాదించామంటూ ''మన మహాసభ'' అనే శీర్షికతో ప్రచురింపబడిన వ్యాసంలో (''ఇస్క్రా'' నెం. 53) చెప్పడం పూర్తిగా వక్రీకరణ అనీ స్పష్టంగా తెలుస్తుంది. ఆ వ్యాసకర్త నిబంధనావళి మొదటి నిబంధనపై జరిగిన వాగ్వివాదాన్ని పూర్తిగా ఉపేక్షించినందువల్ల అది మరింత ఎక్కువ వక్రీకరణ అవుతుంది. అంతే కాదు, కౌన్సిలు కూర్పు విషయమై ''ఇస్క్రా''వాళ్ల స్పష్టమైన గ్రూపింగు ఏదీ లేదనేదాన్ని కూడా మహాసభ మినిట్స్ ధృవపరుస్తున్నాయి: హాజరుపట్టీ వోటింగులు లేవు; పానిన్‌తో మార్తొవ్ విభేదించాడు; పొపోవ్‌తో నేను ఏకీభవించాను; యెగోరొవ్, గూసెవ్ వేరే వైఖరిని తీసుకున్నారు... వగైరా. చివరకు ''ఇస్క్రా'' వ్యతిరేకులతో మార్తొవ్ అనుయాయుల కలయిక క్రమంగా

బలపడిందని నేను చేసిన ఆఖరి ప్రకటన ("విదేశాలలోని రష్యన్ విప్లవ సోషల్ డెమోక్రసీ లీగు" మహాసభలో చేసిన ప్రకటన) కామ్రేడ్ మార్తొవ్, కామ్రేడ్ అక్సెల్‌రోడ్‌లు ఈ సమస్యమీద కూడా కామ్రేడ్ అకీమొవ్ వైపు మొగ్గడం ద్వారా – ఇప్పుడిది అందరికీ స్పష్టమైంది – సహితం రుజువు అయిది.

## ఔ) నిబంధనావళిపై చర్చల ముగింపు. కేంద్ర సంస్థలకు కో-ఆప్టు చేసుకోవడం. "రబోచెయె దేలొ" ప్రతినిధుల ఉపసంహరణ

నిబంధనావళిపై జరిగిన తదుపరి చర్చలలో (మహాసభ 26వ సమావేశం) కేంద్ర కమిటీ అధికారాలను పరిమితపర్చే సమస్య మాత్రమే పేర్కొన తగినది. ఎందుకంటే అది అతి కేంద్రీకరణపై మార్తొవ్ అనుచరులు ఇప్పుడు చేస్తున్న దాడుల స్వభావాన్ని తెలియజేస్తుంది. కామ్రేడ్స్ యెగోరొవ్, పొపోవ్‌లు తమ అభ్యర్థిత్వంతో గాని, లేక తాము బలపరచిన వారి అభ్యర్థిత్వంతో గాని నిమిత్తం లేకుండా కేంద్రీకరణను పరిమితపర్చడం కోసం మరింత దృఢనమ్మకంతో ప్రయత్నించారు. ఈ సమస్య ఇంకా నిబంధనావళి కమిషన్‌లోనే చర్చలో వున్నప్పుడు, స్థానిక కమిటీలను రద్దుచేయడానికి కేంద్ర కమిటీకి గల హక్కు కౌన్సిలు అనుమతిపొందవలసినదిగా వుండాలనీ, దానికితోడు ప్రత్యేకించి పేర్కొన బడిన కేసులకు పరిమితపర్చబడాలనీ వారు ప్రతిపాదించారు (పేజి 272, వివరణ 1). నిబంధనావళి కమిషన్‌లో ముగ్గురు సభ్యులు (గ్లేబొవ్, మార్తొవ్, నేను) దీనిని వ్యతిరేకించారు. మహాసభలో కామ్రేడ్ మార్తొవ్ మా అభిప్రాయాన్ని సమర్థించాడు (పేజి 273). యెగోరొవ్, పొపోవ్‌లకు ఇలా అని సమాధానం చెప్పాడు: "ఒక శాఖను రద్దు చేయడం లాంటి తీవ్రమైన చర్యను తీసుకునేముందు కేంద్ర కమిటీ ఎలాగైనా బాగా చర్చిస్తుంది." అప్పటికింకా కామ్రేడ్ మార్తొవ్ కేంద్రీకరణ వ్యతిరేక పథకాలన్నిటినీ పెడ చెవిని పెట్టాడని మీకు తెలుస్తుంది. యెగోరొవ్, పొపోవ్‌ల ప్రతిపాదనను మహాసభ తోసి పుచ్చింది. – అయితే దురదృష్టవశాత్తూ ఎన్ని వోట్లతో తోసిపుచ్చిందో మినిట్స్‌లో లేదు.

పార్టీ నిబంధనావళి ఆరవ నిబంధనలో కేంద్ర కమిటీ ఇతర కమిటీలను నెలకొల్పుతుంది వగైరా మాటలలో "'నెలకొల్పుతుంది' అనే మాటకు బదులు 'ధ్రువపరుస్తుంది' అనే మాటను పెట్టడానికి" పార్టీ మహాసభలో కామ్రేడ్ మార్తొవ్ కూడా "వ్యతిరేకించాడు.

దానికి ఇతర కమిటీలను నెలకొల్పే హక్కు వుండి తీరాల''ని అన్నాడు. అయితే అది ఆయన అప్పుడు చెప్పిన మాట. ''నెలకొల్పడం'' అనే భావనలో ధ్రువపరచడం అన్నది లేదనే అద్భుతమైన భావం అప్పుడాయనకి కలగలేదు. లీగు మహాసభలో మాత్రమే ఆయన ఆ విషయాన్ని కనిపెట్టాడు.

ఈ రెండు అంశాలనూ మినహాయిస్తే నిబంధనావళిలోని 5నుంచి 11వరకూ నిబంధనలపై జరిగిన చర్చలలో ఆసక్తికరమైనది ఏదీ లేదు (మినిట్స్, పేజీలు 273 – 276). చర్చ అంతా వివరాలపై చాలా స్వల్పమైన వాదాలకు పరిమితమై వుంది. ఆ తరువాత 12వ నిబంధన – మొత్తంమీద అన్ని పార్టీ సంస్థలకూ, ప్రత్యేకించి కేంద్ర సంస్థలకూ సభ్యులను కో-ఆప్టు చేసుకునే సమస్య వచ్చింది. కో-ఆప్టు చేసుకునేందుకు కావలసిన మెజారిటీని మూడింట రెండు వంతులనుంచి అయిదింట నాలుగు వంతులకు పెంచాలని కమిషన్ ప్రతిపాదించింది. కమిషన్ నివేదికను సమర్పించిన గ్లేబొవ్ కేంద్ర కమిటీకి ఎవరినైనా కో-ఆప్టు చేసుకోవాలని చేసే నిర్ణయం ఏకగ్రీవమైనదిగా వుండాలని ప్రతిపాదించాడు. కామ్రేడ్ యెగోరొవ్ అపశ్రుతులు అవాంఛనీయమని గుర్తిస్తూనే సహేతుకమైన వీటో జరగనప్పుడు సాధారణ మెజారిటీ చాలునన్నాడు. కామ్రేడ్ పొపోవ్ కమిషన్ ప్రతిపాదనతో గాని, కామ్రేడ్ యెగోరొవ్ ప్రతిపాదనతో గాని ఏకీభవించలేదు. సాధారణ మెజారిటీ (వీటో హక్కు లేకుండా) గాని, ఏకగ్రీవత గాని వుండాలని డిమాండు చేశాడు. కామ్రేడ్ మార్తొవ్ కమిషన్‌తో గాని, గ్లేబొవ్‌తో గాని యెగోరొవ్‌తో గాని, పొపొవ్‌తో గాని, ఏకీభవించలేదు. ఏకగ్రీవతకూ, అయిదింట నాలుగు వంతుల మెజారిటీకి (మూడింట రెండు వంతుల మెజారిటీకి అనుకూలంగా), ''పరస్పర కో-ఆప్టేషనుకు,'' అంటే కేంద్ర కమిటీకి జరిగే కో-ఆప్టేషనుకు అభ్యంతరం చెప్పే హక్కు కేంద్ర పత్రిక సంపాదకవర్గానికి వుండటానికీ, దానికి ప్రతిగా కేంద్ర కమిటీకి కూడా అలాంటి హక్కే వుండటానికీ (''కో-ఆప్టేషనుపై పరస్పర అజమాయిషీ హక్కు''కి) తాను వ్యతిరేకినని ప్రకటించాడు.

వీటినిబట్టి గ్రూపింగులు ఎంతో వైవిధ్యం గలవిగా వున్నాయనీ, అభిప్రాయభేదాలు ప్రతి ప్రతినిధియొక్క అభిప్రాయాలకూ దాదాపు ''అసాదృశ్యత''ను కల్పించేటంత ఎక్కువగా వున్నాయనీ పాఠకునికి తెలుస్తుంది.

కామ్రేడ్ మార్తొవ్ ఇలా అన్నాడు: ''అయిష్టులైన మనుషులతో కలిసి పని చేయడం మనస్తత్వరీత్యా అసంభవమని నేను ఒప్పుకుంటాను. కాని మన సంఘం శక్తివంతమైనదిగానూ సార్థకమైనదిగానూ వుండటం కూడా ముఖ్యం.... కో-ఆప్టేషను చేసుకోవలసిన సందర్భాలలో కేంద్ర కమిటీకీ కేంద్ర పత్రిక సంపాదకవర్గానికీ పరస్పర అజమాయిషీ హక్కు అనవసరం. నేను దీనిని వ్యతిరేకిస్తున్నది వాటిలో ఒకటి రెండవదాని రంగంలో

అసమర్థమైనదని అనుకోడంవల్ల కాదు. ఎంత మాత్రం కాదు! ఉదాహరణకు కేంద్ర పత్రిక సంపాదకవర్గం, మాటవరసకి నదేజ్దిన్‌గారిని కేంద్ర కమిటీలో చేర్చుకోవాలా వద్దా అనే విషయంలో కేంద్ర కమిటీకి మంచి సలహా ఇవ్వవచ్చు. పరస్పరం ఉద్రేకాలు కలిగించే రెడ్ టేప్ వుండకూడదని అనుకుంటున్నాను కనుకనే దానికి వ్యతిరేకిస్తున్నాను.''

నేను ఆయనకి ఇలా అభ్యంతరం చెప్పాను: ''ఇక్కడ రెండు సమస్యలున్నాయి. మొదటిది ఎంత మెజారిటీ కావాలన్నది. దానిని అయిదింట నాలుగు వంతులనుంచి మూడింట రెండు వంతులకు తగ్గించడానికి నేను వ్యతిరేకం. హేతుబద్ధమైన అసమ్మతికి ఒడంబడిక అనవసరం. నేను దానికి వ్యతిరేకం. కేంద్ర కమిటీకీ కేంద్ర పత్రిక సంపాదకవర్గానికీ కో-ఆప్టేషన్ విషయంలో పరస్పర అజమాయిషీ హక్కు వుండటమనే రెండవ సమస్య అనుపమానంగా మరింత ముఖ్యమైనది. సామరస్యానికి రెండు కేంద్ర సంస్థల మధ్య పరస్పర అంగీకారం వుండటం ఆవశ్యకం. ఇక్కడ వున్న సమస్య రెండు కేంద్ర సంస్థల మధ్య కలహం రావచ్చుననేది. చీలిక రాకూడదని కోరేవారు సామరస్యాన్ని కాపాడటంపట్ల శ్రద్ధ కలిగి వుండాలి. చీలికలు తెచ్చిపెట్టినవారు కొందరున్నారని పార్టీ చరిత్ర మనకి తెల్పుతోంది. ఇది సూత్రానికి సంబంధించిన సమస్య, చాలా ముఖ్యమైన సమస్య. పార్టీయొక్క భవిష్యత్తు యావత్తూ దానిమీద ఆధారపడి వుండవచ్చు'' (పేజీలు 276-277). మహాసభలో నమోదు చేయబడిన నా ప్రసంగపు పూర్తి పాఠం అది. ఈ ప్రసంగానికి కామ్రేడ్ మార్తొవ్ ప్రత్యేకించి ఘనమైన ప్రాముఖ్యత నిచ్చాడు. దురదృష్టవశాత్తూ, దీనికి ఘనమైన ప్రాముఖ్యత ఇచ్చినా, ఈ ప్రసంగం చేయబడినప్పుడు మహాసభలో మొత్తం చర్చతోనూ, యావత్తు రాజకీయ పరిస్థితితోనూ సంబంధించినదిగా దీనిని గురించి ఆలోచించే శ్రమ తీసుకోలేదు.

ఈ సందర్భంలో ఉదయించే మొదటి ప్రశ్న: నా మొదటి ముసాయిదాలో (పేజి 394, 11వ నిబంధన) మూడింట రెండు వంతులు మెజారిటీ వుండాలని నేను ఎందుకు రాశాను అనీ, కేంద్ర సంస్థలకు కో-ఆప్టు చేసుకునే విషయంలో పరస్పర అజమాయిషీ వుండాలని ఎందుకు డిమాండు చేయలేదు అనీ. నా తరువాత మాట్లాడిన కామ్రేడ్ ట్రాట్స్కీ నిజానికి ఈ ప్రశ్నను వెంటనే లేవనెత్తాడు (పేజి 277).

దీనికి సమాధానం లీగు మహాసభలో నేను చేసిన ప్రసంగంలోనూ, రెండవ మహాసభ గురించి కామ్రేడ్ పవ్లోవిచ్ రాసిన లేఖలోనూ ఇవ్వబడింది. నిబంధనావళిలోని మొదటి నిబంధన ''పాతను బీటలు వారజేసింది'' అనీ దానిని ''రెండు చుట్లు'' చుట్టి కట్టాలి అని నేను లీగు మహాసభలో చెప్పాను. దాని అర్థం మొట్టమొదట, ఒక కేవల సైద్ధాంతిక సమస్యమీద మార్తొవ్ అవకాశవాది అని రుజువైంది, ఆయన తప్పును లీబెర్, అకీమొవ్‌లు సమర్థించారు. రెండవది, మార్తొవ్ అనుయాయులు (''ఇస్క్రా''వాళ్లలో

అత్యల్ప మైనారిటీ) ''ఇస్క్రా'' వ్యతిరేకులతో కలవడం మూలంగా కేంద్ర సంస్థలలో వ్యక్తుల కూర్పుపై జరిగిన వోటింగులో మహాసభలో వారికి మెజారిటీ లభించింది. కేంద్ర సంస్థలలో వ్యక్తుల కూర్పును గురించే నేనిక్కడ మాట్లాడింది, సామరస్యం వుండవలసిన ఆవశ్యకతను గురించి నొక్కి చెప్పినది, ''చీలికలు తెచ్చిపెట్టేవారిని'' గురించి హెచ్చరించినది. సూత్రరీత్యా ఈ హెచ్చరిక నిజంగా ఎంతో ముఖ్యమైనది. ఎందుకంటే ''ఇస్క్రా'' శాఖ ఈ విషయంమీద తన సిఫారసులను ఇదివరకే చేసింది, సందేహాస్పదులైన అభ్యర్థుల విషయమైన నిర్ణయం తీసుకుంది (''ఇస్క్రా''కి అన్ని విషయాలతోనూ, అందరు అభ్యర్థులతోనూ అత్యంత సన్నిహితమైన ప్రత్యక్ష పరిచయం వుండింది గనుక కేంద్ర సంస్థలలోని వ్యక్తుల కూర్పును గురించి నిర్ణయించడంలో నిస్సందేహంగా అది ఉత్తమమైన యోగ్యత కలిగి వుంది). నైతికంగానూ దానికున్న యోగ్యతలను పట్టీ (అంటే నిర్ణయించ గల సామర్థ్యాన్ని పట్టి) ''ఇస్క్రా'' శాఖకు సున్నితమైన యీ విషయంలో నిర్ణయించి చెప్పే హక్కు వుండాలి. కాని, లాంఛనప్రాయంగా చెప్పాలంటే, ''ఇస్క్రా'' శాఖ మెజారిటీకి వ్యతిరేకంగా లీబెర్‌లకూ, అకీమొవ్‌లకూ విజ్ఞప్తి చేసుకునే హక్కు కామ్రేడ్ మార్తొవ్‌కు పూర్తిగా వుంది. కామ్రేడ్ అకీమొవ్ మొదటి నిబంధనపై చేసిన ఉజ్వలమైన ప్రసంగంలో అద్భుతమైన స్పష్టతతోనూ వివేకంతోనూ ఇలా అన్నాడు: ''ఇస్క్రా''వాళ్లలో తమ ఉమ్మడి, ''ఇస్క్రా'' లక్ష్య సాధన విషయంలో అనుసరించవలసిన పద్ధతులపై అభిప్రాయ భేదం తనకు కనబడినప్పుడల్లా తాను చైతన్యవంతంగానూ బుద్ధిపూర్వకంగానూ అందులో చెడ్డ పద్ధతికే అనుకూలంగా వోటు చేశాడు. ఎందుకంటే తన లక్ష్యాలు ''ఇస్క్రా''వాళ్ల లక్ష్యాలకు పూర్తిగా విరుద్ధం. అందుచేత కామ్రేడ్ మార్తొవ్‌యొక్క కోరికలూ ఉద్దేశాలూ ఏవైనప్పటికీ, కేంద్ర సంస్థల కూర్పులో అతి చెడ్డదానికే లీబెర్‌ల అకీమొవ్‌ల మద్దతు లభిస్తుందనే విషయంలో ఎలాంటి సందేహమూ వుండజాలదు. ''చీలికలు తెచ్చిపెట్టేవారు'' వుండే జాబితాకే వారు వోటు చేయగలరు, తప్పకుండా వోటు చేసి తీరుతారు (వారి మాటలను పట్టి గాక, వారి చర్యలను పట్టీ, మొదటి నిబంధనపై వారి వోటింగును పట్టీ ఇది మనకు తెలుస్తుంది). ''చీలికలు తెచ్చిపెట్టడం'' కోసమని వారు అలా చేస్తారు. ఈ పరిస్థితి దృష్ట్యా ఇది సూత్రానికి సంబంధించిన (రెండు కేంద్ర సంస్థల మధ్య సామరస్యం గురించిన) ముఖ్యమైన సమస్య అనీ, పార్టీ భవిష్యత్తు యావత్తూ దీనిమీద ఆధారపడి వుండవచ్చుననీ నేను అనడం ఆశ్చర్యం కలిగిస్తుందా?

''ఇస్క్రా'' భావాలనూ, పథకాలనూ, ఉద్యమ చరిత్రనూ ఏ మాత్రమైనా తెలిసి వుండి ఆ భావాలతో ఏ మాత్రమైనా ఏకీభవించే ఏ సోషల్ డెమొక్రటూ కూడా కేంద్ర సంస్థల కూర్పుపై ''ఇస్క్రా'' శాఖలోపల వున్న వివాదం లీబెర్‌లచేతా అకీమొవ్‌లచేతా

పరిష్కరించబడటం లాంఛనప్రాయంగా సరిఅయినదీ సమంజసమైనదీ అయితే అది సాధ్యమైనంత అతి చెడ్డ ఫలితాలను ఇస్తుందని ఒక క్షణం కూడా సందేహించజాలడు. ఈ సాధ్యమైనంత అతి చెడ్డ ఫలితాలను నివారించేటందుకు పోరాడటం విధాయకం అయింది.

వాటిని మేము ఎలా ఎదిరించి పోరాడవలసింది? ఆగ్రహావేశాలతోనూ జగడాలతోనూ కాదు, ఎంతో విశ్వాసపూరితమైన ఎంతో న్యాయసమ్మతమైన పద్ధతులతోనే పోరాడాము: మేము మైనారిటీలో వున్నామని గ్రహించి (మొదటి నిబంధన సమస్యమీద లాగనే) మైనారిటీ హక్కులను కాపాడవలసిందిగా మహాసభకు మేము విజ్ఞప్తి చేశాము. సభ్యులను చేర్చుకోడానికి కావలసిన మెజారిటీ విషయంలో ఎంతో ఖచ్చితత్వమూ (మూడింట రెండు వంతులకు బదులు అయిదింట నాలుగు వంతులు వుండాలని), కో-ఆప్టేషను విషయంలో ఏకగ్రీవతా, కేంద్ర సంస్థలకు కో-ఆప్టేషనుపై పరస్పర అజమాయిషీ ఇదంతా కూడా కేంద్ర సంస్థలలో వ్యక్తుల కూర్పు సమస్యమీద మేము మైనారిటీలో వున్నామని తెలుసుకున్నప్పుడు మేము సమర్థించ సాగాము. ఈ వాస్తవాన్ని పుల్లాయలూ ఎల్లాయలూ నిరంతరం అలక్ష్యం చేస్తారు. వారు పార్టీ మినిట్స్‌ను అన్నిటినీ, అందుకు సంబంధించిన వ్యక్తుల ''సాక్ష్యాన్ని'' అంతటినీ శ్రద్ధగా అధ్యయనం చేయకుండా స్నేహితులతో కొద్దిగా ముచ్చటలాడేసి మహాసభను గురించి తేలికగా తమ అభిప్రాయాలను చెప్పడానికి సిద్ధం అవుతారు. అయినప్పటికీ ఈ మినిట్స్‌నూ ఈ సాక్ష్యాన్నీ మనస్సాక్షిగా అధ్యయనం చేయదలచినవారు ఎవరైనా నేను పేర్కొన్న వాస్తవాన్ని తప్పకుండా తెలుసుకుంటారు. అంటే, మహాసభలో ఆ సమయంలో ఈ వివాదానికి మూలం కేంద్ర సంస్థలలో వ్యక్తుల కూర్పు అనీ, మేము మైనారిటీలో వున్నాము కనుకనే అజమాయిషీకి మరింత కచ్చితమైన షరతులకోసం ప్రయత్నించామనీ, విజయోత్సాహంతోనూ లీబెర్‌ల అకీమొవ్‌ల ఉత్సాహపూరిత సహాయంతోనూ మార్తొవ్ చిట్లగొట్టిన ''పాత్రను రెండు చుట్లు చుట్టి కట్టాలని'' కోరామనీ తప్పకుండా తెలుసుకుంటారు.

మహాసభలో ఈ సమయాన్ని గురించి మాట్లాడుతూ కామ్రేడ్ పవ్లొవిచ్ ఇలా అన్నాడు: ''అలా కాకపోతే కో-ఆప్టేషన్ సందర్భంలో ఏకగ్రీవత గురించిన విషయాన్ని ప్రతిపాదించడంలో మేము మా వ్యతిరేకుల ప్రయోజనాలపట్ల శ్రద్ధ కలిగివున్నామని అనుకోవలసి వస్తుంది; ఎందుకంటే ఏ సంస్థలోనైనా ప్రాబల్యం కలిగివున్న పక్షానికి ఏకగ్రీవత అవసరం లేదు, అది నష్టకరం కూడా'' (''రెండవ మహాసభ గురించిన లేఖ,'' పేజి 14). కాని నేడు, ఘటనల వరుసక్రమం విషయం చాలా తరచుగా విస్మరింపబడుతోంది; ప్రస్తుతం మైనారిటీగా వున్నది (లీబెర్‌లు, అకీమొవ్‌లు పాల్గొనడం మూలంగా) మెజారిటీగా వుండిన దశ ఒకటి మహాసభలో వుండిందన్న విషయమూ, సరిగ్గా ఆ దశలోనే

కేంద్ర సంస్థలకు కో-ఆప్టేషనుపై వివాదం జరిగిందన్న విషయమూ విస్మరింపబడుతోంది. కేంద్ర సంస్థలలో వ్యక్తుల కూర్పుపై "ఇస్క్రా" శాఖలోపల వచ్చిన అభిప్రాయభేదమే వివాదానికి మూల కారణం. ఈ వాస్తవాన్ని గ్రహించినవారు మా చర్చలలోని ఉద్రేకాన్ని అవగాహన చేసుకుంటారు. వివరాలకు సంబంధించిన అల్ప భేదాభిప్రాయాలు సూత్రానికి సంబంధించిన, నిజంగా ముఖ్యమైన సమస్యలకు దారి తీశాయన్నట్టు కనిపించే విరుద్ధతకు ఆశ్చర్యపడరు.

అదే సమావేశంలో మాట్లాడుతూ కామ్రేడ్ డేయ్చ్ చెప్పిన మాటలు (పేజి 277) చాలా విధాలుగా సరి అయినవి. ఆయనిలా అన్నాడు: "ఈ ప్రతిపాదన నిస్సందేహంగా ఈ నిర్దిష్ట సమయానికి ఉద్దేశించబడింది." నిజంగా అంతే, ఈ నిర్దిష్ట సమయాన్ని దానిలోని సంక్లిష్టత అంతటితో అర్థం చేసుకున్నప్పుడే ఈ వివాదంయొక్క నిజమైన అర్థం ఏమిటో మనం గ్రహించగల్గుతాము. మేము మైనారిటీలో వున్నప్పుడు ఏ యూరపియన్ సోషల్ డెమోక్రట్ అయినా సరే న్యాయసమ్మతమైనవిగానూ, ఒప్పిదమైనవిగానూ అంగీకరించే పద్ధతుల ద్వారా, అంటే కేంద్ర సంస్థలలో వ్యక్తుల కూర్పుపై మరింత ఖచ్చితమైన అజమాయిషీ కోసం మహాసభకు విజ్ఞప్తి చేయడం ద్వారా, మైనారిటీ హక్కులను కాపాడామన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకోడం చాలా ముఖ్యం. అదే విధంగా కామ్రేడ్ యెగోరొవ్ మహాసభ మరో సమావేశంలో చెప్పిన యీ కింది మాటలు కూడా చాలా విధాలుగా సరి అయినవి: "ఈ చర్చలలో సూత్రాలను గురించి తిరిగి ప్రస్తావన రావడం నాకు ఎంతో ఆశ్చర్యం కలిగించింది...." (ఇది, మహాసభ 31వ సమావేశంలో కేంద్ర కమిటీకి జరిగిన ఎన్నికల సందర్భంలో చెప్పబడింది. అంటే నాది పొరపాటు కాకపోతే, గురువారం ఉదయం జరిగిన సమావేశం. ఇప్పుడు మనం ప్రస్తావిస్తున్న 26వ సమావేశం సోమవారం సాయంత్రం జరిగింది). "గత కొద్ది రోజులలోనూ చర్చలన్నీ సూత్రానికి సంబంధించిన ఏ సమస్య చుట్టూనూ తిరగలేదనీ, కేంద్ర సంస్థలలో ఈ వ్యక్తిని గాని, ఆ వ్యక్తిని గాని చేర్చుకోడం లేక నిరోధించడం అన్నదానిపైనే ప్రత్యేకించి జరిగాయనీ ప్రతివారికీ స్పష్టం అయిందని నేను అనుకుంటున్నాను. ఈ మహాసభలో సూత్రాలు చాలా కాలం కిందటనే వదలివేయబడ్డాయని మనమంతా గుర్తించాలి, నందిని నందే అని పిలవాలి. (సభ అంతా నవ్వులు. మురవ్యోవ్: 'కామ్రేడ్ మార్తొవ్ నవ్వాడని మినిట్స్‌లో నమోదు చేయాలని నా మనవి')" (పేజి 337). నిజంగా పరిహాసాస్పదమైన కామ్రేడ్ యెగోరొవ్ ఫిర్యాదులకు మా అందరి లాగనే కామ్రేడ్ మార్తొవ్ కూడా నవ్వడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. ఔను, "గత కొద్ది రోజులలోనూ" చర్చ ఎక్కువగా కేంద్ర సంస్థలలో వ్యక్తుల కూర్పు సమస్య చుట్టూ తిరిగింది. అది నిజమే, ఆ సంగతి నిజానికి మహాసభలో అందరికీ స్పష్టం అయింది (ఇప్పుడు

మాత్రమే మైనారిటీ పక్షం స్పష్టమైన యీ వాస్తవాన్ని మరుగుపర్చడానికి ప్రయత్నిస్తోంది). కడపటిగా, నందిని నందే అని పిలవాలనేది నిజం. కాని, ఇందులో "సూత్రాలను వదలి వేయడం" ఎక్కడుంది?? ఏమైనా మనం మహాసభలో సమావేశమైనది, మొదటి రోజులలో (మహాసభ ఎజెండా 10వ పేజి) కార్యక్రమాన్ని, ఎత్తుగడలను, నిబంధనావళిని గురించి చర్చించేటందుకూ వాటికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేటందుకూ, చివరి రోజులలో (ఎజెండాలోని 18, 19వ అంశాలు) కేంద్ర సంస్థలలో వ్యక్తుల కూర్పు గురించి చర్చించేటందుకూ ఆ సమస్యలను పరిష్కరించేటందుకూ. మహాసభల చివరి రోజులు సారథ్యంపై పోరాటానికి వినియోగించబడ్డాయంటే అది సహజమూ, పూర్తిగా న్యాయ సమ్మతమూ. (కాని సారథ్యంపై మహాసభల అనంతరం పోరాటం ప్రారంభించడమంటే అది జగడాలు ఆడటమే.) మహాసభలో కేంద్ర సంస్థలలో వ్యక్తుల కూర్పు సమస్యపై ఎవరైనా ఓటమి చెందితే (కామ్రేడ్ యెగోరొవ్ చేసినట్టుగా), ఆ తరువాత "సూత్రాలను వదలి వేయడం" గురించి చెప్పడం కేవలం పరిహాసాస్పదం అవుతుంది. అందుచేత ప్రతి వారూ కామ్రేడ్ యెగోరొవ్‌ను ఎందుకు పరిహసించారో అర్థం చేసుకోవచ్చు. ఆ నవ్వులో కామ్రేడ్ మార్తొవ్ కూడా పాల్గొన్నాడని మినిట్స్‌లో నమోదు చేయవలసిందిగా కామ్రేడ్ మురవ్యోవ్ కోరడాన్ని కూడా అర్థం చేసుకోవచ్చు: కామ్రేడ్ యెగోరొవ్‌ను పరిహసించడంలో కామ్రేడ్ మార్తొవ్ తన్ను తానే పరిహసించుకున్నాడు....

కామ్రేడ్ మురవ్యోవ్ వ్యంగ్యానికి తోడుగా ఈ కింది విషయాన్ని పేర్కొనడం బహుశా అనవసరం అవదు. మనం వేరైపోవడంలో ముఖ్యమైన పాత్రను నిర్వహించినది కేంద్ర సంస్థలకు కో-ఆప్టు చేసుకునే సమస్య అనీ "పాత సంపాదకవర్గంలో మెజారిటీ" కేంద్ర సంస్థలకు కో-ఆప్టు చేసుకోడంపై పరస్పర అజమాయిషీని గట్టిగా వ్యతిరేకించిందనీ మహాసభానంతరం కామ్రేడ్ మార్తొవ్ తన యిష్టం వచ్చినట్టు అందరిని నమ్మించిన సంగతి మనం చూశాం. మహాసభకు పూర్వం, రెండు సంస్థలకూ ముగ్గురేసి సభ్యులను ఎన్నుకోడం, మూడింట రెండు వంతుల మెజారిటీతో పరస్పర కో-ఆప్టేషను జరగాలనే నా పథకాన్ని ఆమోదిస్తూ కామ్రేడ్ మార్తొవ్ ఆ విషయంమీద నాకు ఇలా రాశాడు: "ఈ పరస్పర కో-ఆప్టేషను పద్ధతిని ఆమోదించడంలో మహాసభ తరువాత ప్రతి సంస్థకూ జరిగే చేర్పులు వేరే పద్ధతులలో జరుగుతాయని నొక్కిచెప్పాలి. (ఈ విధంగా వుండాలని నేను సలహా యిస్తాను: ప్రతి సంస్థా, రెండో సంస్థకు తన ఉద్దేశాన్ని తెలియజేస్తూ కొత్త సభ్యులను కో-ఆప్టు చేసుకుంటుంది; రెండవ సంస్థ తన అసమ్మతిని తెల్పవచ్చు, అలాంటి సందర్భంలో ఈ వివాదాన్ని కౌన్సిలు తీర్చాలి. ఆలస్యాలు జరగకుండా వుండేటందుకు గాను, ముందుగా నామినేటు చేయబడిన అభ్యర్థుల విషయంలో — కనీసం

కేంద్ర కమిటీ విషయంలో — ఈ పద్ధతి అవలంబించబడాలి. కేంద్ర కమిటీ సభ్యుల సంఖ్యకు అదనపు చేర్పులు అప్పుడు మరింత త్వరగా చేయవచ్చు.) తరువాత జరిగే కో-ఆప్టేషను పార్టీ నిబంధనావళిలో చెప్పబడిన విధంగా జరుగుతుందని నొక్కిచెప్పేటందుకు 22వ నిబంధనకి ఈకింది మాటలను జత చేయాలి:* '... తీసుకోబడిన నిర్ణయాలు దీని ద్వారా ధ్రువపరచబడి తీరాలి.''' (కిందిగీతలు నావి).

దీనిపై వ్యాఖ్య అనవసరం.

---

కేంద్ర సంస్థకు కో-ఆప్టు చేసుకోడంపై వివాదం జరిగిన సమయపు ప్రాముఖ్యత వివరించబడిన తరువాత, ఈ విషయంపై జరిగిన వోటింగును పరిశీలించవలసివుంది — చర్చలను గురించి పరిశీలించడం అనవసరం. ఎందుకంటే కామ్రేడ్ మార్తొవ్ ప్రసంగమూ, నా ప్రసంగమూ ఇదివరకే ఉదహరింపబడ్డాయి. వాటి తరువాత కొద్ది వాదోపవాదాలు మాత్రమే జరిగాయి. వాటిలో చాలా కొద్దిమంది ప్రతినిధులు పాల్గొన్నారు (మినిట్స్, పేజీలు 277 – 280 చూడండి). వోటింగుకు సంబంధించి దానిపై నేను ఇచ్చిన వివరణలో ''నిబంధనావళి గురించి జరిగిన పోరాటాన్ని (కామ్రేడ్ మార్తొవ్ తనకు తెలియకుండానే పూర్తి నిజాన్ని చెప్పాడు: మొదటి నిబంధన తరువాత జరిగిన ఉద్రిక్తమైన వివాదాలన్నీ నిజంగా నిబంధనావళి గురించే జరిగాయి) బుంద్‌తో కలిసిన మార్తొవ్ అనుయాయులకు వ్యతిరేకంగా 'ఇస్క్రా' జరిపిన పోరాటంగా చెప్పడంలో అత్యంత పెద్ద వక్రీకరణ'' (లీగు మినిట్స్, పేజి 60) చేసిన నేరం నాపై వుందని లీగు మహాసభలో కామ్రేడ్ మార్తొవ్ అన్నాడు.

ఆసక్తిదాయకమైన యీ ''అత్యంత పెద్ద వక్రీకరణ''ను పరిశీలిద్దాం. కామ్రేడ్

---

*ఇది మహాసభకు నేను తయారుచేసిన ఎజెండా మొదటి ముసాయిదాకూ, దానికి నా వ్యాఖ్యకూ ప్రస్తావన. ప్రతినిధులందరికీ ఆ ఎజెండా తెలుసు. ఈ ముసాయిదాలోని 22వ నిబంధన ప్రకారం రెండు సంస్థలకూ — కేంద్ర పత్రికకూ, కేంద్ర కమిటీకీ — ముగ్గురేసి సభ్యులు ఎన్నుకోబడాలి. ఈ ఆరుగురూ మూడింట రెండు వంతుల మెజారిటీతో ''పరస్పర కో-ఆప్టేషను'' చేయాలి. ఈ పరస్పర కో-ఆప్టేషను మహాసభచే ధ్రువపరచబడాలి. తదుపరి జరిగే కో-ఆప్టేషను కేంద్ర పత్రికచేతనూ, కేంద్ర కమిటీచేతనూ విడివిడిగా ధ్రువపరచబడాలి.

మార్తొవ్ కౌన్సిలు కూర్పుమీదా, కో-ఆప్టేషనుమీదా జరిగిన వోటింగులను కలిపి మొత్తం ఎనిమిది వోటింగుల జాబితాను యిచ్చాడు: (1) కేంద్ర పత్రికనుంచీ కేంద్ర కమిటీనుంచీ ఇద్దరేసి సభ్యుల చొప్పున కౌన్సిలుకు జరిగిన ఎన్నిక – 27 అనుకూలం (ఎమ్), 16 వ్యతిరేకం (ఎల్),* 7 గురు వోటింగులో పాల్గొనలేదు. (స్పష్టత కోసం ఒకటి చెబుతాను. వోటింగులో పాల్గొనని వారి సంఖ్య 8 అని మినిట్స్ – 270 పేజిలో వుంది. కాని అది ఒక వివరము.) (2) అయిదవ కౌన్సిలు సభ్యునికి మహాసభలో జరిగిన ఎన్నిక – 23 అనుకూలం (ఎల్), 18 వ్యతిరేకం (ఎమ్), 7 గురు వోటింగులో పాల్గొనలేదు. (3) రద్దు అయిన కౌన్సిలు సభ్యుల స్థానే కొత్తవారిని కౌన్సిలే నియమించడం – 23 వ్యతిరేకం (ఎమ్), 16 అనుకూలం (ఎల్), 12 మంది వోటింగులో పాల్గొనలేదు. (4) కేంద్ర కమిటీకి కో-ఆప్టు చేసుకోడంలో ఏకగ్రీవత – 25 అనుకూలం (ఎల్), 19 వ్యతిరేకం (ఎమ్), 7 గురు వోటింగులో పాల్గొనలేదు. (5) కో-ఆప్టు చేసుకోకుండా వుండేటందుకు ఒక హేతుబద్ధమైన అసమ్మతి గురించిన ఒడంబడిక – 21 అనుకూలం (ఎల్), 19 వ్యతిరేకం (ఎమ్), 11 మంది వోటింగులో పాల్గొనలేదు. (6) కేంద్ర పత్రికకు కో-ఆప్టు చేసుకోడంపై ఏకగ్రీవత – 23 అనుకూలం (ఎల్), 21 వ్యతిరేకం (ఎమ్), 7 గురు వోటింగులో పాల్గొనలేదు. (7) కొత్త సభ్యుని కో-ఆప్టు చేసుకోకూడదని కేంద్ర పత్రిక గాని, కేంద్ర కమిటీ గాని చేసిన నిర్ణయాన్ని రద్దు చేసే హక్కును కౌన్సిలుకు ఇస్తూ చేయబడిన ప్రతిపాదనపై వోటింగు జరగాలా అక్కరలేదా – 25 అనుకూలం (ఎమ్), 19 వ్యతిరేకం (ఎల్), 7గురు వోటింగులో పాల్గొనలేదు. (8) ఆ ప్రతిపాదనపై 24 అనుకూలం (ఎమ్), 23 వ్యతిరేకం (ఎల్), 4 గురు వోటింగులో పాల్గొనలేదు. దీనిపై మార్తొవ్ ఈ కింది నిశ్చయానికి వచ్చాడు (లీగు మినిట్స్, పేజి 61): "ఇక్కడ, ఒక బుంద్ ప్రతినిధి ప్రతిపాదనకు అనుకూలంగా వోటు చేశాడనీ, మిగిలినవాళ్లు వోటింగులో పాల్గొనలేదనీ స్పష్టం అవుతోంది." (కిందిగీతలు నావి.)

హాజరుపట్టీ వోటింగు జరగనప్పుడు ఒక బుంద్ ప్రతినిధి తనకు అనుకూలంగా వోటు చేశాడనేది స్పష్టం అని కామ్రేడ్ మార్తొవ్ ఎందుకు అనుకున్నాడు? అని ఎవరైనా అడగవచ్చు.

ఎందుకంటే ఆయన వేయబడిన వోట్లను లెక్క పెట్టాడు. బుంద్ వోటింగులో పాల్గొందని తెలిసినప్పుడు అది తన పక్షానికే పడిన వోటు అనడంలో కామ్రేడ్ మార్తొవ్‌కు సందేహం లేదు.

---

* "ఎమ్" అంటే మార్తొవ్, "ఎల్" అంటే నేను వున్న పక్షాలు.

అయితే నేను చేసిన "అత్యంత పెద్ద వక్రీకరణ" ఎక్కడ?

మొత్తం వోట్లు 51. బుండ్‌వాళ్లను మినహాయిస్తే 46. "రబోచెయె దేలో" వాళ్లను మినహాయిస్తే 43. కామ్రేడ్ మార్తొవ్ పేర్కొన్న ఎనిమిది వోటింగులలోనూ ఏడింటిలో 43, 41, 39, 44, 40, 44, 44 మంది ప్రతినిధుల చొప్పున పాల్గొన్నారు; మిగిలిన ఒక వోటింగులో 47 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. దీనిలో ఒక బుండ్ అనుయాయుడు తనను బలపర్చాడని కామ్రేడ్ మార్తొవ్ అంగీకరించాడు. ఆవిధంగా మార్తొవ్ ఇచ్చిన చిత్రణ (ఇది అసంపూర్తి చిత్రణ అనే విషయాన్ని మనం త్వరలోనే చూస్తాము) పోరాటాన్ని గురించిన నా వివరణనే ధ్రువపరుస్తుంది, బలపరుస్తుంది! చాలా సందర్భాలలో వోటింగులో పాల్గొనకుండా వున్న వారి సంఖ్య చాలా ఎక్కువ: ఇది కొన్ని చిన్న విషయాలలో మహాసభ మొత్తంగా తక్కువ – సాపేక్షంగా తక్కువ – ఆసక్తిని చూపిందనీ, ఈ సమస్యలపై "ఇస్క్రా" వాళ్లలో నిర్దిష్టమైన గ్రూపింగు ఏదీ లేదనీ తెలియజేస్తుంది. బుండ్‌వాళ్లు "వోటింగులో పాల్గొనకుండా వుండటం ద్వారా లెనిన్‌కు స్పష్టంగా తోడ్పడ్డారు" అనే మార్తొవ్ ప్రకటన (లీగు మినిట్స్, పేజి 62) వాస్తవానికి మార్తొవ్‌కే వ్యతిరేకం: దాని అర్థం బుండ్‌వాళ్లు గైరుహాజరు అయినప్పుడు లేదా వోటింగులో పాల్గొనకుండా వున్నప్పుడు మాత్రమే నేను ఒక్కొక్కప్పుడు విజయం పొందగలిగాను అని. కాని బుండ్‌వాళ్లు తాము పోరాటంలో కలుగజేసుకోడం అవసరం అనుకున్నప్పుడల్లా వారు మార్తొవ్‌నే బలపర్చారు: వారు కలుగజేసుకున్నది పైన చెప్పిన 47 వోట్లు పడిన సందర్భం ఒక్కటే కాదు. మహాసభ మినిట్స్‌ను తిరగవేయ దలచినవారికి ఎవరికైనా కామ్రేడ్ మార్తొవ్ చిత్రీకరణలో చాలా విపరీతమైన అసంపూర్తిత్వం కనబడుతుంది. బుండ్ వోటింగులో పాల్గొన్న మూడే మూడు సందర్భాలను కామ్రేడ్ మార్తొవ్ మాత్రం చెప్పలేదు. ఆ సందర్భాలన్నిటిలోనూ కామ్రేడ్ మార్తొవే విజేత అని వేరే చెప్పనక్కరలేదు. ఆ మూడు సందర్భాలూ ఇవి: (1) కావలసిన మెజారిటీని అయిదింట నాలుగు వంతులనుండి, మూడింట రెండు వంతులకు తగ్గించాలనే కామ్రేడ్ ఫొమీన్ సవరణ ఆమోదింపబడినప్పుడు – 27 గురు అనుకూలం, 21 మంది ప్రతికూలం (పేజి 278), అంటే 48 వోట్లు పడ్డాయి. (2) పరస్పర కో-ఆప్టేషనును తొలగించాలనే కామ్రేడ్ మార్తొవ్ ప్రతిపాదన ఆమోదింపబడినప్పుడు – 26 గురు అనుకూలం, 24 మంది ప్రతికూలం (పేజి 279), అంటే 50 వోట్లు పడ్డాయి. కడపటిగా (3) కౌన్సిలులోని సభ్యులందరి ఆమోదంతో మాత్రమే కేంద్ర పత్రికకు గాని, కేంద్ర కమిటీకి గాని కో-ఆప్టు చేసుకోడానికి అనుమతించాలి అనే నా ప్రతిపాదన తిరస్కరింపబడినప్పుడు (పేజి 280), 27 గురు ప్రతికూలం, 22 మంది అనుకూలం, అంటే 49 వోట్లు (హాజరు పట్టీ వోటింగు సహితం జరిగింది. కాని దురదృష్టవశాత్తూ దాన్ని గురించి మినిట్స్‌లో రాయలేదు).

ఫలితాలు: కేంద్ర సంస్థలకు కో-ఆప్టు చేసుకునే సమస్యమీద బుంద్‌వాళ్లు నాలుగు వోటింగులలో మాత్రమే పాల్గొన్నారు (అందులో మూడు నేనిప్పుడు పైన చెప్పినవి, వాటిలో పడిన మొత్తం వోట్లు 48, 50, 49 చొప్పున వున్నాయి. ఒకటి కామ్రేడ్ మార్తొవ్ పేర్కొన్నది. అందులో 47 వోట్లు పడ్డాయి). ఈ వోటింగులు అన్నిటిలోనూ కామ్రేడ్ మార్తొవ్ విజేత. ఈ సందర్భాలను గురించిన నా వివరణ ప్రతి వివరంతో సహా సరైనదేనని రుజువైంది: బుంద్‌తో కలయిక జరిగిందనీ, సాపేక్షంగా సమస్యలు స్వల్పమైనవనీ (చాలా సందర్భాలలో చాలా మంది వోటింగులో పాల్గొనకుండా వున్నారు), ''ఇస్క్రా'' వాళ్లలో నిర్దిష్టమైన గ్రూపింగు ఏదీ లేదనీ (హాజరు పట్టీ వోటింగులు లేవు; చర్చలలో చాలా తక్కువమంది మాట్లాడారు) చెప్పడం సరి అయినదేననీ రుజువైంది.

నా వివరణలో వైరుధ్యం వుందని కనిపెట్టడానికి కామ్రేడ్ మార్తొవ్ చేసిన ప్రయత్నం సబబైనది కాదని తేలింది. ఎందుకంటే ఆయన సందర్భరహితంగా మాటలను విడదీశాడు. పరిపూర్ణమైన చిత్రణను చూపడానికి శ్రమపడలేదు.

---

నిబంధనావళిలో దేశాంతర పార్టీ శాఖను గురించిన ఆఖరి నిబంధన తిరిగి చర్చలకూ వోటింగులకూ దారి తీసింది. మహాసభలో గ్రూపింగుల దృష్ట్యా అవి ఎంతో ముఖ్యమైనవి. అక్కడ వున్న సమస్య లీగును విదేశాలలోని పార్టీ శాఖగా గుర్తించాలా వద్దా అన్నది. కామ్రేడ్ అకీమొవ్, వెంటనే లేచి మొదటి మహాసభచే ఆమోదింపబడిన దేశాంతర యూనియన్‌ను గురించి మహాసభకు[37] జ్ఞాపకం చేశాడు. ఈ సమస్య సూత్రానికి సంబంధించినదని పేర్కొన్నాడు. ఆయనిలా అన్నాడు: ''నేను మొట్టమొదట ఒక విషయం చెప్పాలి. అదేమిటంటే, ఈ సమస్య ఏవిధంగా పరిష్కరింపబడుతుందనే దానికి నేను ఎలాంటి ప్రత్యేక ఆచరణాత్మక ప్రాముఖ్యతనూ ఇవ్వడంలేదు. మన పార్టీలో కొనసాగుతూ వున్న సైద్ధాంతిక పోరాటం ఇంకా ముగియ లేదనేది నిస్సందేహం; కాని అది వేరొక స్థాయిలో, బలాబలాలలో వేరొక అమరికలో కొనసాగుతుంది.... నిబంధనావళిలోని 13వ నిబంధన, మన మహాసభను పార్టీ మహాసభనుంచి ముఠా మహాసభగా మార్చాలనే ధోరణిని మరో సారి మరింత స్పష్టంగా ప్రతిబింబిస్తోంది. రష్యాలోని సోషల్ డెమోక్రట్లు అందరూ, పార్టీ ఐక్యత కోసం పార్టీ శాఖల నన్నిటినీ ఐక్యపర్చడం ద్వారా పార్టీ మహాసభ నిర్ణయాలకు నమ్రతతో కట్టుబడి వుండేటట్లు చేయడానికి బదులు, మహాసభ మైనారిటీ సంఘాన్ని నాశనంచేసి మైనారిటీని రంగంలో లేకుండా చేయాలని ప్రతిపాదించబడింది'' (పేజి 281). పాఠకుడు చూస్తున్నట్లు

కేంద్ర సంస్థల కూర్పు సమస్యపై ఓటమి పొందిన తరువాత కామ్రేడ్ మార్తొవ్‌కు ఎంతో ప్రియమైన విషయం అయిన "అనుస్మృతి" కామ్రేడ్ అకీమొవ్‌కి కూడా తక్కువ ప్రియమైన విషయం ఏమీ కాదు. కాని మహాసభలో తమకొక ప్రమాణమూ ఇతురులకు వేరొక ప్రమాణమూ వర్తింపజేసే వీరు, కామ్రేడ్ అకీమొవ్‌కు వ్యతిరేకంగా తీవ్ర అసమ్మతి తెలియజేశారు. కార్యక్రమం ఆమోదింపబడి "ఇస్క్రా" గుర్తింపబడినప్పటికీ, నిబంధ నావళి దాదాపు అంతా ఆమోదింపబడినప్పటికీ "సూత్రరీత్యా" లీగూ, యూనియనూ వేరు వేరు అని చెప్పిన "సూత్రం" ముందుకు తీసుకురాబడింది. కామ్రేడ్ మార్తొవ్ ఇలా అన్నాడు: "కామ్రేడ్ అకీమొవ్ ఈ సమస్యను సూత్రానికి సంబంధించిన సమస్యగా చేయ గోరితే దానికి మాకు అభ్యంతరం ఏమీ లేదు; ప్రత్యేకించి ఎందుకంటే కామ్రేడ్ అకీమొవ్ రెండు ధోరణులతో జరిగే పోరాటంలో వీలైన సంయోగాలను గురించి మాట్లాడాడు. ఏదో ఒక ధోరణి విజయం పొంది తీరాలి (ఈ మాట మహాసభ 27వ సమావేశంలో చెప్ప బడిందన్న సంగతి గుర్తుంచుకోండి!) అంటే "ఇస్క్రా"కు మేము మరో సారి తలవంచు తామనే తాత్పర్యంలో కాదు. కామ్రేడ్ అకీమొవ్ మాట్లాడిన వీలైన అన్ని రకాల సంయో గాలకూ కడపటి వీడ్కోలు చెప్పే సూచనగా తలవంచుతామనే తాత్పర్యంలో మాత్రమే" (పేజి 282. కిందిగీతలు నావి).

ఎలాంటి చిత్రణ! మహాసభలో కార్యక్రమం గురించిన వాదాలన్నీ ఇదివరకే అయిపోయిన తరువాత కామ్రేడ్ మార్తొవ్, కేంద్ర సంస్థల కూర్పు సమస్యపై ఓటమిని పొందేటంత వరకూ వీలైన అన్ని రకాల సంయోగాలకూ కడపటి వీడ్కోలు ఇస్తూనే వున్నాడు! మహా సభలో కామ్రేడ్ మార్తొవ్ "కడపటి వీడ్కోలు చెప్పిన" సంభావ్య సంయోగం మహాసభ అయిన మర్నాడే ఆయన తేలికగా అమలులోకి తెచ్చాడు. కాని అప్పుడు కూడా కామ్రేడ్ అకీమొవ్ కామ్రేడ్ మార్తొవ్ కంటె ఎక్కువ దూరదృష్టిగలవాడని రుజువు చేసుకున్నాడు; కామ్రేడ్ అకీమొవ్ "మొదటి మహాసభ అభీష్టం ప్రకారం కమిటీ అనే పేరు వహించిన పాత పార్టీ"యొక్క అయిదేళ్ల కృషిని గురించి ప్రస్తావించాడు, అత్యంత విషపూరిత మైన జోస్యంతో కూడిన ఎత్తిపొడుపుమాటలతో ముగించాడు: "మన పార్టీలో నూతన ధోరణి వస్తుందనే నా ఆశలు వృథా అయాయనే కామ్రేడ్ మార్తొవ్ అభిప్రాయం విష యానికి వస్తే, అతడే అలాంటి ఆశలతో నన్ను ఉత్తేజపరుస్తున్నాడని చెప్పాలి" (పేజి 283. కిందిగీతలు నావి).

ఔను, కామ్రేడ్ అకీమొవ్ ఆశలను కామ్రేడ్ మార్తొవ్ పూర్తిగా నెరవేర్చాడని ఒప్పుకోవలసిందే!

కామ్రేడ్ అకీమొవ్ చెప్పేదే సరి అయినదని కామ్రేడ్ మార్తొవ్‌కు నమ్మకం కుదిరి,

మూడేళ్లపాటు పని చేస్తోందని తలపోయబడిన పార్టీ సంస్థలో ''అనుస్యూతి'' చెడ గొట్టబడిన తరువాత ఆయనతో కలిశాడు. ఎక్కువ శ్రమపడకుండానే కామ్రేడ్ అకీమొవ్‌కు విజయం లభించింది.

కాని మహాసభలో కామ్రేడ్ అకీమొవ్‌ను బలపర్చినది — నిలకడగా బలపర్చినది — కామ్రేడ్స్ మర్తీనొవ్, బ్రూకెర్, బుంద్‌వాళ్లూ (8 వోట్లు) మాత్రమే. ''మధ్యస్థవర్గా'' నికి నిజమైన నాయకుడైన కామ్రేడ్ యెగోరొవ్ ఉత్తమమైన మధ్యేమార్గానికే అంటి పెట్టుకుని వున్నాడు: మీరు చూసేవున్నారు, ఆయన ''ఇస్క్రా''వాళ్లతో ఏకీభవించాడు, వారి పట్ల ''సానుభూతి'' చూపాడు (పేజి 282), సూత్రబద్ధమైన సమస్యను పూర్తిగానే వదిలి వేయాలని, లీగును గురించి గాని, యూనియనును గురించి గాని ఏమీ చెప్పకుండా వుండాలనే ప్రతిపాదన ద్వారా (పేజి 283) తన సానుభూతిని రుజువు చేసుకున్నాడు. ఈ ప్రతిపాదన 27 — 15 వోట్లతో తోసిపుచ్చబడింది. ''ఇస్క్రా'' వ్యతిరేకులు (8)కి తోడుగా దాదాపు ''మధ్యస్థవర్గం'' యావత్తూ (10) కామ్రేడ్ యెగోరొవ్ పక్షానికి వోటు చేశారు. (మొత్తం 42 వోట్లు పడ్డాయి. చాలామంది వోటింగులో పాల్గొనక పోవడమో హాజరు కాకపోవడమో జరిగింది. ఆసక్తికరంగాని వోటింగులలోనూ లేదా ఫలితం ఏమ వుతుందో ముందుగానే తెలిసి పోయిన సందర్భాలలోనూ తరచు ఇలాగే జరిగింది.) ''ఇస్క్రా'' సూత్రాలను చేతలలో అమలు జరపడమనే సమస్య తలెత్తినప్పుడల్లా ''మధ్యస్థవర్గం'' యొక్క ''సానుభూతి'' కేవలం మాటలలో మాత్రమేనని తేలుతోంది. మాకు ముప్పయి లేక కొద్దిగా ఎక్కువ వోట్లు మాత్రమే వచ్చాయి. రూసొవ్ ప్రతిపాదన (లీగును విదేశాలలోని ఏకైక శాఖగా గుర్తించాలనే ప్రతిపాదన)పై జరిగిన చర్చలలోనూ వోటింగులలోనూ ఇది మరింత స్పష్టంగా కనబడింది. ఈ విషయంలో ''ఇస్క్రా'' వ్యతిరేకులూ, ''ఊబీ'' స్పష్టంగా సూత్రబద్ధమైన వైఖరిని తీసుకున్నారు. దాని సమర్థకులైన కామ్రేడ్స్ లీబెర్, యెగోరొవ్‌లు కామ్రేడ్ రూసొవ్ ప్రతిపాదన వోటు చేయరానిది అనీ, అనుమతింపరానిదనీ ప్రకటించారు: ''అది దేశాంతర శాఖల నన్నిటినీ సంహరిస్తుంది'' (యెగోరొవ్ మాటలు). ''శాఖలను సంహరించడంలో'' ఎలాంటి సంబంధమూ లేకుండా వుండగోరుతూ ఆయన వోటింగులో పాల్గొనడానికి నిరాకరించడమే గాక హాలులో నుంచి బైటికి కూడా వెళ్లిపోయాడు. కాని ''మధ్యస్థవర్గ'' నాయకునికి అర్హమైన ప్రశంస చేయవలసిందే: ఆయన కామ్రేడ్ మార్తొవ్, ఆయన అనుయాయులకంటె పదిరెట్లు ఎక్కువ రాజకీయ పరాక్రమాన్నీ, గట్టి నమ్మకాన్నీ (తన పొరపాటు సూత్రాలలో) ప్రదర్శించాడు. ఎందు చేతనంటే ఆయన ''సంహరింప''బడుతున్న శాఖను, ఆ శాఖ తన స్వంత బృందంగా వుండి బహిరంగ పోరాటంలో ఓడిపోయినప్పుడు మాత్రమే గాక, సమర్థించాడు.

కామ్రేడ్ రూసొవ్ ప్రతిపాదన వోటింగుకు అర్హమైనదని 27 – 15 వోట్లతో భావించబడింది. ఆతరువాత 25 – 17 వోట్లతో ఆమోదించబడింది. ఈ 17 వోట్లకీ, గైరుహాజరైన కామ్రేడ్ యెగోరొవ్ వోటు కూడా కలిపితే, ''ఇస్క్రా'' వ్యతిరేకుల, ''మధ్యస్థ వర్గం''యొక్క పూర్తి సంకలనం (18) వస్తుంది.

దేశాంతర శాఖ గురించిన నిబంధనావళిలోని 13వ నిబంధన మొత్తంగా 31 – 12 వోట్లతో మాత్రమే ఆమోదింపబడింది. ఆరుగురు వోటింగులో పాల్గొనలేదు. ఈ 31 సంఖ్య మహాసభలో ''ఇస్క్రా''వాళ్ల రమారమి సంఖ్యను తెల్పుతుంది. అంటే, ''ఇస్క్రా'' భావాలను నిలకడగా సమర్థించి, వాటిని ఆచరణలో పెట్టిన వారన్న మాట – మహాసభలో జరిగిన వోటింగును గురించిన మన విశ్లేషణలో (ఎజెండాలో బుంద్ స్థానం సమస్య, ఆర్గనైజింగు కమిటీ ఘటన, ''యూజ్నీ రబోచీ'' రద్దు, వ్యవసాయ కార్యక్రమంపై రెండు వోట్లు) ఇది కనీసం ఆరవది. అయినప్పటికీ కామ్రేడ్ మార్తొవ్, ''ఇస్క్రా'' వాళ్లలాంటి ''చిన్న'' గ్రూపును ఎత్తి చూపడానికి తగిన ఆధారాలు లేవని మనలను నమ్మించడానికి నిజంగానే తలపోస్తున్నాడు!

నిబంధనావళిలో 13వ నిబంధనను ఆమోదించడమన్నది తాము ''వోటింగులో పాల్గొనడానికి నిరాకరిస్తున్నాము'' అని కామ్రేడ్స్ అకీమొవ్, మర్తీనొవ్‌లు చేసిన ప్రకటన (పేజి 288) సందర్భంగా అత్యంత విశిష్టమైన చర్చలను రేపిందనే విషయాన్ని కూడా చెప్పకుండా వుండలేము. మహాసభ బ్యూరో ఈ ప్రకటనను చర్చించింది. యూనియన్‌ను రద్దు చేసివేయడమనేది కూడా దాని ప్రతినిధులకు మహాసభ కార్యకలాపాలలో పాల్గొనను నిరాకరించడానికి హక్కునివ్వదు అని – అత్యంత సబబుగా – చెప్పింది. వోటు చేయడానికి నిరాకరించడమనేది పూర్తిగా అసాధారణమనీ అనుమతింపరానిదనీ బ్యూరో అభిప్రాయపడింది. 28వ సమావేశంలో తాము తీవ్రంగా ఖండించిన తప్పనే 31వ సమావేశంలో చేసిన (1) మైనారిటీకి చెందిన ''ఇస్క్రా''వాళ్లతో సహా మహాసభ యావత్తూ బ్యూరో అభిప్రాయంతో ఏకీభవించింది. కామ్రేడ్ మర్తీనొవ్ తన ప్రకటనను సమర్థించ సాగినప్పుడు (పేజి 291) పవ్లోవిచ్, ట్రాట్స్కీ, కార్‌స్కీ, మార్తొవ్‌లు ఆయనను వ్యతిరేకించారు. కామ్రేడ్ మార్తొవ్ అసంతృప్తి చెందిన మైనారిటీ (ఆయన మైనారిటీలో వున్నంత వరకు!) కర్తవ్యాల విషయంలో ప్రత్యేకించి స్పష్టమైన అభిప్రాయాలు కలిగివున్నాడు. ఆ విషయంమీద ఎంతో నీతిబోధకమైన విధంగా మాట్లాడాడు. కామ్రేడ్స్ అకీమొవ్‌తోనూ మర్తీనొవ్‌తోనూ ఆయనిలా అన్నాడు: ''మీరు మహాసభకు ప్రతినిధులు అయినా అయి వుండాలి కాకుండానైనా పోవాలి. ప్రతినిధులైతే దాని కార్యకలాపాలు అన్నిటిలోనూ పాల్గొని తీరాలి'' (కిందిగీతలు నావి; మైనారిటీ మెజారిటీకి లోబడి వుండాలనడంలో కామ్రేడ్ మార్తొవ్

అప్పటికింకా లాంఛన ప్రాధాన్యతనూ, బ్యూరాక్రసీనీ కనిపెట్టలేదు!) "ప్రతినిధులు కాని పక్షంలో మీరీ సమావేశంలో వుండటానికి వీలులేదు.... యూనియన్ ప్రతినిధుల ప్రకటననుబట్టి నేను రెండు ప్రశ్నలు అడగవలసి వస్తోంది: వారు పార్టీ సభ్యులేనా? వారు మహాసభకు ప్రతినిధులేనా?" (పేజి 292).

కామ్రేడ్ అకీమొవ్‌కి కామ్రేడ్ మార్తొవ్ పార్టీ సభ్యుని కర్తవ్యాలను గురించి బోధించడం! కాని, కామ్రేడ్ మార్తొవ్‌పై తాను కొన్ని ఆశలుపెట్టుకుని వున్నానని కామ్రేడ్ అకీమొవ్ అనడానికి కారణం లేకపోలేదు.... ఏమైనా, ఎన్నికలలో కామ్రేడ్ మార్తొవ్ ఓడిపోయిన తరువాత మాత్రమే ఈ ఆశలు నెరవేరవలసి వుంది. విషయం తనకు సంబంధించినది కాక ఇతరులకు సంబంధించినది అయినప్పుడు, కామ్రేడ్ మర్తీనొవ్ మొట్టమొదట ప్రయోగించిన (నేను పొరపాటుపడకుండా వుంటే) "అత్యవసర చట్టం" లాంటి ఘోరమైన వూతపదాన్ని సహితం పెడచెవిపెట్టాడు. తన ప్రకటనను ఉపసంహరించుకోమని కోరిన వారికి కామ్రేడ్ మర్తీనొవ్ ఇలా జవాబు చెప్పాడు: "మాకు ఇవ్వబడిన వివరణలో ఈ నిర్ణయం సూత్రానికి సంబంధించినదా లేక యూనియన్‌కు వ్యతిరేకంగా తీసుకోబడిన ఒక అత్యవసర చర్యా అనేది స్పష్టం చేయబడలేదు. ఇలా అయితే యూనియన్‌ను అవమాన పర్చినట్లే మేము భావిస్తాము. కామ్రేడ్ యెగోరొవ్‌కు కూడా మాకు ఏర్పడిన అభిప్రాయమే ఏర్పడింది, అంటే, అది యూనియన్‌కు వ్యతిరేకంగా చేయబడిన అత్యవసర చట్టం (కిందిగీతలు నావి) అందుచేతనే ఆయన సభనుంచి బయటికి వెళ్ళిపోయాడు" (పేజి 295). మహాసభలో జరిగిన వోటింగును ఒక అవమానంగా పరిగణించే అసంబద్ధపు, నిజంగా అసంబద్ధపు భావానికి ప్లెహానొవ్‌తో పాటు కామ్రేడ్ మార్తొవ్, కామ్రేడ్ ట్రాట్స్కీ కూడా తీవ్ర అసమ్మతిని తెల్పారు. కామ్రేడ్ ట్రాట్స్కీ తన ప్రతిపాదనపై మహాసభచే ఆమోదింపబడిన తీర్మానాన్ని (కామ్రేడ్స్ అకీమొవ్, మర్తీనొవ్‌లు తమకు పూర్తి సంతృప్తి కలిగినట్లు భావించవచ్చునని) ఇలా సమర్థించాడు: "తీర్మానం సూత్రానికి సంబంధించినది, కూపస్థమండూకతత్వంతో కూడినది కాదు. అది తమను అవమానపర్చినట్లుగా ఎవరైనా భావిస్తే మనం పట్టించుకోనక్కరలేదు" (పేజి 296). కాని మన పార్టీలో బృందం సరళి మనస్తత్వమూ కూపస్థమండూకతత్వమూ ఇంకా చాలా బలంగానే వున్నాయనీ, పైన నేను కిందిగీతలు గీసి చూపిన గొప్ప మాటలు కేవలం వాగాడంబర పదజాలం మాత్రమేననీ త్వరలోనే రుజువైంది.

కామ్రేడ్స్ అకీమొవ్, మర్తీనొవ్‌లు తమ ప్రకటనను ఉపసంహరించుకోడానికి నిరాకరించారు. "పూర్తిగా అనవసర చర్య!" అని ప్రతినిధులందరూ కేకలు పెడుతున్నా మహాసభనుంచి బైటికి వెళ్ళిపోయారు.

## క) ఎన్నికలు. మహాసభ ముగింపు

పార్టీ నిబంధనావళిని ఆమోదించిన తరువాత, మహాసభ జిల్లా శాఖల గురించి ఒక తీర్మానాన్నీ, విడి పార్టీ శాఖలను గురించి కొన్ని తీర్మానాలనూ చేసింది. నేను పైన విశ్లేషించిన ''యూజ్నీ రబోచీ'' గ్రూపుపై జరిగిన అత్యంత సుబోధకమైన చర్చల తరువాత పార్టీ కేంద్ర సంస్థల ఎన్నికలను గురించి చర్చించడానికి ఉపక్రమించింది.

దేనినుంచి అయితే మహాసభ యావత్తూ ఒక అధికారిక సిఫారసు వస్తుందని ఆశించిందో ఆ ''ఇస్క్రా'' శాఖ ఈ సమస్యపై చీలివుందని మనకు ఇదివరకే తెలుసు. ఎందుకంటే ఆ శాఖలోని మైనారిటీ, మహాసభలో తాను మెజారిటీని సాధించగలదేమో స్వేచ్ఛాయుతమైన బాహాటమైన పోరాటంలో తేల్చుకోవాలనుకుంది. కేంద్ర పత్రికకు ముగ్గుర్నీ కేంద్ర కమిటీకి ముగ్గుర్నీ చొప్పున ఎన్నుకోడం ద్వారా సంపాదకవర్గాన్ని పునర్వ్యవస్థీకరించడానికి ఒక పథకం వుందని మహాసభకు చాలా పూర్వమునుంచీనూ — మహాసభకు వచ్చిన ప్రతినిధులందరికీనూ — తెలుసునని కూడా మనం ఎరుగుదుం. మహాసభలో జరిగిన చర్చలను స్పష్టం చేయడానికి ఈ పథకం గురించి మరింత వివరంగా పరిశీలిద్దాం.

మహాసభ Tagesordnung (ఎజెండా) ముసాయిదాపై నా వ్యాఖ్యకు[38] సరి అయిన పాఠం ఇక్కడ ఇస్తున్నాను. ఈ పథకం అందులోనే వివరించబడింది:* ''కేంద్ర పత్రిక సంపాదకవర్గానికి ముగ్గుర్నీ, కేంద్ర కమిటీకి ముగ్గుర్నీ మహాసభ ఎన్నుకోవాలి. అవసరమైతే ఈ ఆరుగురూ కలసి సంయుక్తంగా మూడింట రెండు వంతుల మెజారిటీ వోటుతో కేంద్ర పత్రిక సంపాదకవర్గానికీ కేంద్ర కమిటీకీ అదనపు సభ్యులను కో-అప్టు చేసుకుని అలా చేసినట్టు మహాసభకు తెలియజేయాలి. ఆ నివేదికను మహాసభ ఆమోదించిన తరువాత మాత్రమే ఈ తదుపరి కో-ఆప్టేషనును కేంద్ర పత్రిక సంపాదకవర్గమూ కేంద్ర కమిటీ విడివిడిగా అమలుజరపాలి.''

ఇందులో ఆ పథకం ఎంతో నిర్దిష్టంగానూ నిర్ద్వంద్వంగానూ చెప్పబడింది: దాని ప్రకారం ప్రత్యక్ష కార్యాచరణలో అత్యంత పలుకుబడిగల నాయకుల భాగస్వామ్యంతో సంపాదకవర్గం పునర్వ్యవస్థీకరింపబడుతుంది. ఈ వ్యాఖ్య పాఠాన్ని ఏ మాత్రం శ్రద్ధగా చదివినవారికైనా నేను నొక్కిచెప్పిన పథకంయొక్క రెండు లక్షణాలూ వెంటనే కనిపిస్తాయి. కాని ఈ రోజుల్లో మనం అత్యంత ప్రాథమికమైన విషయాలను వివరించవలసి వుంటుంది. ఆ పథకంలో వున్నది సరిగ్గా సంపాదకవర్గాన్ని పునర్వ్యవస్థీకరించడమే — దానిని విస్తృత

* '' 'ఇస్క్రా' సంపాదకవర్గానికి లేఖ,'' పేజి 5, లీగు మినిట్స్, పేజి 53 చూడండి.

పర్చడమూ కాదు, దాని సభ్యుల సంఖ్యను తగ్గించడమూ కాదు. కేవలం దానిని పునర్ వ్యవస్థీకరించడమే; ఎందుచేతనంటే దానిని విస్తృతపర్చడం లేక తగ్గించడం సమస్య అపరిష్కృతంగానే ఉండిపోయింది: ఆవశ్యకం అయినప్పుడు మాత్రమే కో-ఆప్టు చేసుకునే అవకాశం ఇవ్వబడింది. అలాంటి పునర్వ్యవస్థీకరణను వివిధ వ్యక్తులు చేసిన సూచనలలో కొన్ని సంపాదకవర్గ సభ్యుల సంఖ్యను తగ్గించాలనీ, కొన్ని ఆ సంఖ్యను ఏడుకి పెంచాలనీ (వ్యక్తిగతంగా నేను ఎల్లప్పుడూ ఆరుగురు కంటె ఏడుగురు వుండటమే మంచిదనుకుంటాను), కొన్ని పదకొండు వరకూ పెంచాలనీ (మొత్తంమీద సోషల్ డెమొక్రటిక్ శాఖ లన్నిటితోనూ, బుంద్‌తోనూ, ముఖ్యంగా పోలిష్ సోషల్ డెమొక్రట్లతోనూ శాంతి యుతంగా ఐక్యం అయినప్పుడు ఇది సాధ్యపడుతుందని నేను భావిస్తున్నాను) కోరుతున్నాయి. కాని అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే, కేంద్ర పత్రికకు అదనంగా సభ్యులను కో-ఆప్టు చేసుకునే విషయం కేంద్ర కమిటీ సభ్యుల భాగస్వామ్యంతో నిర్ణయించబడవలసి వుంది. "ముగ్గురు" గురించి మాట్లాడేటప్పుడు సాధారణంగా ఇది ఉపేక్షింపబడుతోంది. శాఖలోని "మైనారిటీ" సభ్యులలో గాని, మహాసభ ప్రతినిధులలో గాని ఒక్క కామ్రేడ్ కూడా దీని అర్థాన్ని వివరించడానికి ప్రయత్నించలేదు. వారందరికీ యీ పథకం తెలుసు. వారు దానిని ఆమోదించారు (స్పష్టంగా గాని మౌనంగా గాని). మొదటి విషయం, సంపాదక వర్గ పునర్వ్యవస్థీకరణకు ఆరంభ అంశంగా ముగ్గురిని, ముగ్గురిని మాత్రమే ఎందుకు తీసు కోవలసివచ్చింది? ఏకైక ఉద్దేశమూ లేక ప్రధానోద్దేశమూ ఈ సంపాదకవర్గాన్ని విస్తృత పర్చడమే అయివున్నా, ఈ సంపాదకవర్గం నిజంగా "సమరసమైనదిగా" పరిగణింపబడినా ఇది పూర్తిగా అర్థరహితం అవుతుందనేది స్పష్టం. ఈ "సమసరమైన" సంపాదకవర్గాన్ని విస్తృతపర్చడమే ఉద్దేశమైతే మొత్తం సంపాదకవర్గం అంతటిని గాక దానిలోని ఒక భాగం మాత్రమే అనుకోవడం వింతగా వుంటుంది. సంపాదకవర్గాన్ని పునర్వ్యవస్థీకరించే విషయాన్నీ పాత సంపాదకవర్గాన్ని పార్టీ సంస్థగా మార్చే విషయాన్నీ చర్చించేటందుకూ నిర్ణయించేటందుకూ సంపాదకవర్గంలోని సభ్యులందరూ తగినవారు కారని పరిగణింపబడుతు న్నట్టు స్పష్టం అవుతోంది. ఈ పునర్వ్యవస్థీకరణ దానిని విస్తృతపర్చడమై వుండాలని వ్యక్తిగతంగా అభిలషించేవారు సహితం సంపాదకవర్గపు పూర్వపు కూర్పు సమరసమైనదిగా లేదనీ, ఒక పార్టీ సంస్థ ఆదర్శానికి తగినట్టుగా లేదనీ గుర్తించారనేది స్పష్టం: ఎందుచే తనంటే మరోలా అయితే తరువాత విస్తృతపర్చేటందుకు గాను మొట్టమొదటగా ఆరు సంఖ్యను మూడుకి తగ్గించవలసిన అవసరమే వుండదు. ఇది సుస్పష్టమేననీ, దీనిని విస్మరించడానికి కారణం "వ్యక్తులను" గురించిన సమస్య తెచ్చిపెట్టిన తాత్కాలిక గందరగోళమే అనీ నేను మళ్లీ చెబుతున్నాను.

రెండవది, మూడు సంఖ్యను విస్తృతపర్చేటందుకు కేంద్ర పత్రికలోని సభ్యులు ముగ్గురూ అంగీకరించినప్పటికీ అది చాలదని పైన ఉదహరించిన వ్యాఖ్య పాఠాన్ని బట్టి తెలుస్తుంది. ఇది కూడా ఎల్లప్పుడూ విస్మరించబడుతోంది. ఎవరినైనా కో-ఆప్టు చేసుకోడానికి అనుకూలంగా ఆరుగురిలోనూ మూడింట రెండు వంతుల మంది, అంటే నలుగురు వోటు చేయవలసివుంటుంది. అందుచేత కేంద్ర కమిటీకి ఎన్నుకోబడిన ముగ్గురు సభ్యులూ తమ వీటోను ఉపయోగిస్తే అప్పుడు మూడు సంఖ్యను విస్తృతపర్చడం సాధ్యం కాదు. తద్భిన్నంగా, కేంద్ర పత్రిక సంపాదకవర్గంలోని ముగ్గురు సభ్యులలోనూ ఇద్దరు తర్వాతి కో-ఆప్టేషనును వ్యతిరేకించినా, కేంద్ర కమిటీ సభ్యులు ముగ్గురూ దానికి అనుకూలంగా వున్నట్టయితే అది సాధ్యమవుతుంది. ఆ విధంగా పాత బృందాన్ని పార్టీ సంస్థగా మార్చడంలో గల ఉద్దేశం మహాసభచే ఎన్నుకోబడిన ప్రత్యక్ష కార్యాచరణ నాయకులకు నిర్ణయాత్మక అధికారాన్ని ఇవ్వడమేనని స్పష్టం అవుతుంది. ఏ కామ్రేడ్లు మా దృష్టిలో చూచాయగా వున్నారో ఈ కింది వాస్తవాన్ని బట్టి తెలుసుకోవచ్చు. మహాసభలో సంపాదకవర్గం తరఫున ఒక ప్రకటన చేయడం ఆవశ్యకమయే పక్షంలో: మహాసభకు పూర్వం సంపాదకవర్గం తమ సంస్థలో ఏడవ సభ్యునిగా కామ్రేడ్ పవ్లోవిచ్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. కామ్రేడ్ పవ్లోవిచ్ పేరుకు తోడుగా ''ఇస్క్రా'' శాఖలో ఒక పాత సభ్యుడూ ఆర్గనైజింగు కమిటీ సభ్యుడూ, తరువాత కేంద్ర కమిటీకి ఎన్నుకోబడిన వాడూ అయిన మరొకరి పేరు ఏడవ స్థానానికి ప్రతిపాదించబడింది.[39]

ఆవిధంగా, రెండు సంస్థలకూ ముగ్గురేసి సభ్యులను ఎన్నుకోవాలనే పథకం ఈ కింది వాటికి ఉద్దేశింపబడిందనేది స్పష్టం: (1) సంపాదకవర్గాన్ని పునర్వ్యవస్థీకరించడం; (2) పార్టీ సంస్థలో వుండతగని పాత బృందం సరళికి చెందిన కొన్ని లక్షణాలను వదిలించుకోడం (వదిలించుకోవలసిన దేదీ లేకపోతే ప్రారంభంలో ముగ్గురితో ఏర్పాటు చేయాలనే భావంలో అర్థం లేదు!); కడపటిగా, (3) రచయితవర్గంలో ''దైవాంశ సంభూత'' లక్షణాలను వదిలించుకోడం (ముగ్గురు సంఖ్యను విస్తృతపర్చే సమస్యను పరిష్కరించడంలో ప్రముఖులైన ప్రత్యక్ష కార్యకర్తలను చేర్చుకోడం ద్వారా వాటిని వదిలించుకోడం). సంపాదకులు అందరికీ తెలిసివున్న యీ పథకం, పనిలో మూడు సంవత్సరాల అనుభవంమీద ఆధారపడి వుందనేదీ, మనం పట్టువిడువకుండా ప్రవేశపెడుతున్న విప్లవ సంఘ సూత్రాలకు పూర్తిగా అనుగుణంగా వుందనేదీ స్పష్టం. ''ఇస్క్రా'' రంగంలోకి ప్రవేశించిన అనైక్యతా కాలంలో వ్యష్టి గ్రూపులు తరచుగా అకస్మాత్తుగానూ వాటంతట అవేగానూ ఏర్పడుతూ వుండేవి. అవి తప్పనిసరిగా బృందం సరళిని తెలిపే కొన్ని హానికరమైన లక్షణాలను కలిగి వుండేవి. పార్టీని నిర్మించాలంటే ముందు ఈ లక్షణాలు తొలగింపబడాలి. ఈ తొలగింపులో

ప్రముఖులైన ప్రత్యక్ష కార్యకర్తలు పాల్గొనడం ఆవశ్యకం, ఎందుకంటే సంపాదకవర్గంలోని కొందరు సభ్యులు ఎల్లప్పుడూ నిర్మాణాత్మక వ్యవహారాలను చూస్తూ వుండేవారు, పార్టీ సంస్థల వ్యవస్థలో ప్రవేశించవలసిన సంస్థ కేవలం రచయితల వర్గం గాక రాజకీయ నాయకుల వర్గం అయివుండాలి. "ఇస్క్రా" ఎల్లప్పుడూ అనుసరించిన విధానం దృష్ట్యా ప్రారంభంలో ఎన్నుకునే ముగ్గురు సభ్యుల ఎంపిక మహాసభకు వదిలిపెట్టడం సహజం: మహాసభకు సన్నాహాలు చేయడంలో మేము అత్యంత జాగ్రత్త వహించాము. కార్యక్రమానికీ, ఎత్తుగడలకూ, నిర్మాణానికీ సంబంధించిన సూత్రబద్ధమైన వివాదాస్పదమైన సమస్యలన్నీ పూర్తిగా స్పష్టీకరింపబడేటంతవరకూ వేచివున్నాము, మౌలిక సమస్యలపై అత్యధిక సంఖ్యాకులు ఒకటిగా వుండటమనే తాత్పర్యంలో మహాసభ "ఇస్క్రా"వాళ్ల మహాసభగా వుంటుందనడంలో మాకు సందేహం లేదు ("ఇస్క్రా"ను కేంద్ర పత్రికగా గుర్తించడం గురించిన తీర్మానాలలో ఇది కొంతవరకు సూచించబడింది కూడా); అందుచేత, "ఇస్క్రా" భావాలను వ్యాపింపజేసే పనిలోనూ, దానిని ఒక పార్టీగా మార్చే సన్నాహంలోనూ కార్యభారాన్నంతనీ మోసిన కామ్రేడ్స్‌కే కొత్త పార్టీ సంస్థకు అత్యంతంగా తగివుండే అభ్యర్థులు ఎవరో తామే నిర్ణయించే బాధ్యతను వదలివేయడం మన విధి. రెండు సంస్థలకూ ముగ్గురేసి చొప్పున ఎన్నుకోబడాలనే యీ పథకం సహజమైనది అనే విషయం మూలంగానే, అది "ఇస్క్రా" యొక్క యావత్తు విధానానికీ, పనితో ఏ మాత్రమైనా సన్నిహిత సంబంధం కలిగివున్న వారికి "ఇస్క్రా"ను గురించి తెలిసిన ప్రతి విషయానికీ పూర్తిగా అనువైనదిగా వుండటం మూలంగానే ఈ పథకాన్ని అందరూ ఆమోదించారనీ దీనికి పోటీగా మరే ఇతర పథకమూ ప్రతిపాదింపబడలేదనీ చెప్పవలసి వుంటుంది.

ఆవిధంగా మహాసభలో కామ్రేడ్ రూసొవ్ మొట్టమొదట రెండు సంస్థలకూ ముగ్గురేసి సభ్యులను ఎన్నుకోవాలని ప్రతిపాదించాడు. ఈ పథకానికీ, అవకాశవాదులనే తప్పుడు నిందారోపణకూ సంబంధం వుందని రాత మూలంగా మాకు తెలియజేసిన మార్తొవ్ అనుయాయులకు ఆరుగురితోనో లేక ముగ్గురితోనో కూడిన సంపాదకవర్గమూ అనే విషయంపై వచ్చిన యీ వివాదాన్ని ఆ నిందారోపణ సరి అయినదా కాదా అనే సమస్యగా తయారు చేయాలనే భావం తోచనైనా తోచలేదు. వారిలో ఒక్కరు కూడా అలాంటి సూచన చేయలేదు! ఆరుగురా లేక ముగ్గురా అన్న విషయమై రేగిన వివాదంలో ఇమిడి వున్న సూత్రబద్ధమైన భిన్న దృక్పథాలను గురించి వారిలో ఎవరూ ఒక్క మాట అనడానికి కూడా సాహసించలేదు. అతి సామాన్యమైన చవుకబారు అయిన పద్ధతిని, అంటే, జాలి కలిగించేటట్లు చేయడం, తమ మనసులు బాధపడగలవని చెప్పడం "ఇస్క్రా"ను కేంద్ర పత్రికగా నియమించడం ద్వారా సంపాదకవర్గం గురించిన సమస్య ఇదివరకే పరిష్కరింపబడిందని నటించడం అనే

పద్ధతిని అనుసరించడం మేలు అనుకున్నారు. కామ్రేడ్ రూసొవ్‌కు వ్యతిరేకంగా కామ్రేడ్ కొల్‌త్సోవ్ తెచ్చిన ఈ ఆఖరు వాదం పచ్చి అబద్ధం. మహాసభ ఎజెండాలో రెండు విడి విషయాలు చేర్చబడ్డాయి—ఆకస్మికంగా కాదు లెండి (మినిట్స్, పేజి 10): 4వ అంశం—"పార్టీ కేంద్ర పత్రిక," 18వ అంశం—"కేంద్ర కమిటీని, కేంద్ర పత్రిక సంపాదకవర్గాన్ని ఎన్నుకోడం." అది మొదటి విషయం. రెండవది, కేంద్ర పత్రిక నియమింపబడుతున్నప్పుడు దాని అర్థం సంపాదకవర్గాన్ని ధ్రువపరచడం కాదని ఆ ధోరణిని ధ్రువపరచడం మాత్రమేనని ప్రతినిధులు అందరూ నిశ్చయంగా ప్రకటించారు.* ఈ ప్రకటనలకు వ్యతిరేకంగా ఒక్క అసమ్మతి కూడా తెలుపబడలేదు.

ఆవిధంగా, ఒక నిర్ణీత పత్రికను ధ్రువపరచడం ద్వారా మహాసభ వాస్తవంలో సంపాదకవర్గాన్ని ధ్రువపరచిందనే ప్రకటన—మైనారిటీకి అంటిపెట్టుకుని వున్నవారు (కొల్‌త్సోవ్, పేజి 321, పొసదోవ్‌స్కీ, పేజి 321, పొపొవ్, పేజి 322 చాలామంది ఇతరులూ) చాలా సార్లు పునరుద్ఘాటించిన ప్రకటన—వాస్తవానికి కేవలం తప్పు. కేంద్ర సంస్థల కూర్పు సమస్య అందరిచేతనూ నిజంగా నిష్పక్షపాతమైన దృష్టితో ఇంకనూ పరిగణింపగల సమయంలో తాము తీసుకున్న వైఖరినుంచి తిరోగమనాన్ని కప్పిపుచ్చుకునేందుకు అది

* మినిట్స్ 140వ పేజి చూడండి. అకీమొవ్ ప్రసంగం: "కేంద్ర పత్రిక ఎన్నికల విషయం చివరన చర్చిస్తామని నాకు చెప్పారు;" అకీమొవ్‌కి వ్యతిరేకంగా మురవ్యోవ్ ప్రసంగం, "కేంద్ర పత్రిక భవిష్యత్ సంపాదకవర్గం సమస్యను గురించి అంత ఎక్కువ బాధపడేది ఎవరు" (పేజి 141), "పార్టీ పత్రికను నియమించిన తరువాత మనకు కామ్రేడ్ అకీమొవ్ ఎంతో ఆందోళన చెందుతున్న చర్యలను నెరవేర్చడానికి కావలసిన నిర్దిష్టమైన సమాచారం లభించింది" అనీ, "పార్టీ నిర్ణయాలకు 'ఇస్క్రా' లోబడి వుంటుందనడంలో సందేహం ఎంత మాత్రం వుండద''నీ చెప్పిన పవ్లోవిచ్ ప్రసంగం (పేజి 142); ట్రాట్స్కీ ప్రసంగం: "సంపాదకవర్గాన్ని మనం ధ్రువపరచడం లేదంటే 'ఇస్క్రా'లో మనం ధ్రువపరుస్తున్నది ఏమిటి?... పేరును కాదు, ధోరణిని... పేరును కాదు, పతకాన్ని" (పేజి 142); మర్తీనొవ్ ప్రసంగం: "...చాలామంది ఇతర కామ్రేడ్స్ లాగనే నేను 'ఇస్క్రా'ను ఒక నిర్ణీతమైన ధోరణి గల వార్తాపత్రికగా, మన కేంద్ర పత్రికగా, గుర్తించాలనే విషయాన్ని చర్చిస్తూ, ఈ సమయంలో దాని సంపాదకవర్గాన్ని ఎన్నుకోడానికి, లేక దాన్ని ధ్రువపరచడానికి సంబంధించిన పద్ధతిని గురించి చర్చించకూడదని అనుకుంటున్నాను, ఎజెండాలో తగిన వరుసలో తరువాత దానిని చర్చిద్దాము...." (పేజి 143).

అందరికీ స్పష్టమైన ఒక ఎత్తు. సూత్రబద్ధమైన ఉద్దేశాలచేత గాని (ఎందుచేతనంటే ''అవకాశవాదం అనే తప్పుడు నిందారోపణ'' సమస్యను మహాసభలో లేవనెత్తడం మైనారిటీకి చాలా అననుకూలం, వారు దానిని గురించి సూచనగానైనా చెప్పలేదు), ఆరుగురా లేక ముగ్గురా అనే దాన్ని వాస్తవంగా మరింత ఫలకరమైనదిగా చూపే యథార్థ సమాచారాన్ని ఉదహరించడంచేత గాని (ఎందుకంటే, ఈ వాస్తవాలను పేర్కొన్నంత మాత్రంచేతనే మైనారిటీ పక్షానికి వ్యతిరేకంగా బోలెడన్ని వాదనలు వచ్చివుండేవి) ఈ తిరోగమనం సమర్థనీయం కాజాలదు. ''అనురూప మొత్తం'' గురించీ, ''సమరసమైన బృందం'' గురించీ, ''అనురూపమైన నిర్మల అభిన్న సంస్థ'' గురించీ ఇంకా ఏమోమో గురించీ వట్టి మాటలను చెప్పవలసివచ్చింది. ఈ వాదనల నిజమైన పేరు ''చెత్త మాటలు'' అని వెంటనే చెప్పడం ఆశ్చర్యకరమైనదేమీ కాదు (పేజి 328). ముగ్గురు వుండాలనే పథకమే ''సామరస్యం'' లేకపోవడాన్ని స్పష్టంగా రుజువుచేసింది. నెలరోజులకు పైగా కలసి పనిచేయడంలో ప్రతినిధులకు కలిగిన అభిప్రాయాలు వారంతకువారే మంచిచెడ్డలను నిర్ణయించ గలిగేట్టు చేసే బోలెడంత సమాచారాన్ని వారికి ఇచ్చాయనేది స్పష్టం. కామ్రేడ్ పొసదోవ్‌స్కీ ఈ సమాచారం గురించి సూచించినప్పుడు (తాను ''అపశ్రుతులు'' అనే మాట ''ప్రత్యేక అర్థంలో'' ఉపయోగించి తన అభిప్రాయంలోనే అజాగ్రత్తగానూ అవివేకంగానూ మాట్లాడాడు – పేజీలు 321, 325) కామ్రేడ్ మురవ్యోవ్ నిర్మొగమాటంగా ఇలా అన్నాడు: ''నా అభిప్రాయంలో అలాంటి* అపశ్రుతులు నిస్సందేహంగా వున్నాయని మహాసభలో అధికసంఖ్యాకులకు ఇప్పుడు బాగా స్పష్టం అయింది'' (పేజి 321). ''అపశ్రుతులు అనే మాటను (దీనిని ప్రచారంలో పెట్టినది పొసదోవ్‌స్కీయే గాని మురవ్యోవ్ కాదు) కేవలం వ్యక్తిగత తాత్పర్యంలో అన్వయించి చెప్పడానికి మైనారిటీ ఇష్టపడింది. కామ్రేడ్ మురవ్యోవ్ విసిరిన సవాలును అంగీకరించడానికి సాహసించలేదు. విషయ సారాన్ని పట్టి ఆరుగురితో కూడిన సంపాదకవర్గాన్ని సమర్థిస్తూ ఒక్క వాదాన్ని

* కామ్రేడ్ పొసదోవ్‌స్కీ మనస్సులో సరిగ్గా ఎలాంటి ''అపశ్రుతులు'' వున్నాయో మహాసభకు ఎన్నడూ తెలియలేదు. కామ్రేడ్ మురవ్యోవ్, తనవంతుకు తాను, తన అభిప్రాయం తప్పుగా చిత్రించబడిందని అదే సమావేశంలో (పేజి 322) చెప్పాడు. మినిట్స్ ఆమోదింప బడుతున్నప్పుడు ''వివిధ విషయాలపై చర్చలలో మహాసభలో బైటపడిన అపశ్రుతులను గురించి, సూత్రాలకు సంబంధించిన అపశ్రుతులను గురించి చెబుతున్నారు. వాటి ఉనికి ఇప్పుడు దురదృష్టవశాత్తూ ఎవరూ కాదనలేని వాస్తవం అయింది'' అని స్పష్టంగా ప్రకటించాడు (పేజి 353).

కూడా ముందుకు తీసుకురావడానికి సాహసించలేదు. ఫలితంగా దాని నిష్ఫలతనుపట్టి హాస్యాన్ని మించిన వివాదం ఏర్పడింది: ఆరుగురా లేక ముగ్గురా అనే సమస్యయొక్క నిజమైన ప్రాధాన్యం తనకు ఎంతో స్పష్టం అయిందని మెజారిటీ (కామ్రేడ్ మురవ్యోవ్ నోటి ద్వారా) ప్రకటించింది, కాని మైనారిటీయే వినడానికి మొండిగా నిరాకరించిందనీ, ''మేము దానిని పరిశీలించే స్థితిలో లేము'' అని గట్టిగా చెప్పింది. మెజారిటీ తాను దానిని పరిశీలించే స్థితిలో వున్నట్లు భావించడమే గాక ఇదివరకే ''దానిని పరిశీలించింది.'' ఆ పరిశీలన ఫలితాలు వారికి బాగా స్పష్టం అయాయనీ కాని మైనారిటీయే పరిశీలనకు భయపడినట్లు కనిపించిందనీ ''చెత్త మాటల'' మాటున దాగిందనీ ప్రకటించింది. ''మన కేంద్ర పత్రిక ఒక సాహితీ బృందం కంటె ఎక్కువైనదేనని మనసులో వుంచుకోవాలని'' మెజారిటీ మనలను కోరింది; ''కేంద్ర పత్రిక నిర్ణీత వ్యక్తులచేత, మహాసభకు తెలిసిన వ్యక్తులచేత, నేను పైన పేర్కొన్న అవసరాలను (కామ్రేడ్ లాంగె ప్రసంగంలో చెప్పబడిన సాహిత్య అవసరాలు మాత్రమే కాదు – పేజి 327) తీర్చగల వ్యక్తులచేత నిర్వహింపబడాలని మెజారిటీ కోరింది. ఇక్కడ కూడా మైనారిటీ సవాలును అంగీకరించడానికి సాహసించలేదు. సాహితీ బృందంకంటె ఎక్కువదే అయిన సంపాదకవర్గానికి తమ అభిప్రాయంలో ఎవరు తగినవారో ''మహాసభకు తెలిసిన'' పరిమాణంలో ''నిర్ణీతమైన'' వ్యక్తి ఎవరో ఒక్క మాట కూడా చెప్పలేదు. మైనారిటీ తన ప్రఖ్యాత ''సామరస్యం'' మాటున రక్షణ తీసుకోసాగింది. అంతే కాదు. మైనారిటీ సూత్రరీత్యా పూర్తిగా తప్పుడు వాదనలను చర్చలలో ప్రవేశపెట్టింది కూడా. అందుచేతనే అవి ఎంతో సరిగానూ తీవ్రంగానూ తిప్పికొట్టబడ్డాయి. ''సంపాదక వర్గాన్ని పునర్వ్యవస్థీకరించే హక్కు మహాసభకు నైతికంగా గాని రాజకీయంగా గాని లేదు'' (ట్రాట్స్కీ, పేజి 326), ''ఇది చాలా సున్నితమైన (sic!) సమస్య'' (ట్రాట్స్కీయే), ''తిరిగి ఎన్నుకోబడని సంపాదకులు, తాము ఇంకెంత మాత్రమూ సంపాదకవర్గంలో వుండటం మహాసభకు ఇష్టం లేదనే విషయం గురించి ఎంత బాధపడతారు?'' (త్సరోవ్, పేజి 324).*

అలాంటి వాదనలు మొత్తం సమస్యనంతనీ కేవలం జాలి కలిగించడం, మనసులు

---

* కామ్రేడ్ పొసదోవ్‌స్కీ ప్రసంగంతో పోల్చిచూడండి: ''....పాత సంపాదకవర్గంలోని ఆరుగురు సభ్యులలోనూ ముగ్గురినే ఎన్నుకోడం ద్వారా మిగతా ముగ్గురూ అనవసరమైన వారనీ అక్కరలేని వారనీ మీరు ప్రకటిస్తున్నారు. ఆ పని చేయడానికి మీకు ఎలాంటి హక్కు గాని ఎలాంటి ఆధారాలు గాని లేవు.''

బాధపడటం అనే స్థాయిలో పెట్టాయి. అది సూత్రబద్ధమైన నిజమైన వాదనలలోనూ, నిజమైన రాజకీయ వాదనలలోనూ దివాలాకోరుతనాన్ని అంగీకరించడమే. మెజారిటీ ఈ వైఖరికి సరి అయిన పేరు పెట్టింది: కూపస్థమండూకతత్వం (కామ్రేడ్ రూసొవ్). కామ్రేడ్ రూసొవ్ సబబుగానే ఇలా వ్యాఖ్యానించాడు: "విప్లవవాదుల నోటినుంచి మనం వింత ప్రసంగాలను వింటున్నాము. పార్టీ పని, పార్టీ నీతినియమాలు గురించిన భావాలకు స్పష్టంగా విరుద్ధమైన ప్రసంగాలు అవి. ముగ్గురేసి చొప్పున ఎన్నుకోడాన్ని వ్యతిరేకించేవారి ప్రధానమైన వాదం పార్టీ వ్యవహారాల గురించి కేవలం కూపస్థమండూక భావమే అవుతుంది (కింది గీతలు నావి)... కూపస్థమండూక, పార్టీ దృక్పథం కానిదీ అయిన ఈ వైఖరిని మనం అవలంబిస్తే ప్రతి ఎన్నికలోనూ మనం యీవిధంగా ఆలోచించవలసి వస్తుంది: పుల్లయ్య గాకుండా ఎల్లయ్య ఎన్నుకోబడితే పుల్లయ్యకి కోపం రాదా? ఆయనను గాకుండా మరో ఆర్గనైజింగు కమిటీ సభ్యుని కేంద్ర కమిటీకి ఎన్నుకుంటే ఆ సభ్యునికి కోపం రాదా? ఇది మనలను ఎక్కడికి తీసుకుపోతుంది, కామ్రేడ్స్? మనం ఇక్కడ సమావేశమైనది పరస్పరం శ్లాఘించుకోడానికీ, కూపస్థమండూక మనోభావ లోలత్వానికీ గాక పార్టీని నిర్మించడానికి అయితే అలాంటి అభిప్రాయాలను మనం ఎన్నటికీ ఒప్పుకోలేము. మనం నిర్వాహకులను ఎన్నుకోబోతున్నాము, ఎన్నుకొనబడని ఏ వ్యక్తిలోనూ విశ్వాసం లేకపోవడమనే మాటలకు తావు లేదు; "మనం ఆలోచించవలసిన ఒకే ఒక విషయం: పని ప్రయోజనాలను గురించీ ఎన్నుకొనబడే స్థానానికి ఆ వ్యక్తి తగినవాడేనా అని మాత్రమే" (పేజి 325).

పార్టీ చీలికకు కారణాలను స్వతంత్రంగా పరిశీలింపగోరేవారికీ మహాసభలో ఆ చీలికకు గల మూలాన్ని తెలుసుకొనగోరేవారికీ అందరికీ కామ్రేడ్ రూసొవ్ చేసిన ఈ ప్రసంగాన్ని పదే పదే చదవమని మేము సలహా యిస్తాము; ఆయన వాదనలను మైనారిటీ ఖండించడం మాట అటుంచి కనీసం ప్రతివాదం కూడా చేయలేదు. నిజానికి అలాంటి ప్రాథమికమైన మూలగతమైన సత్యాలకు ప్రతివాదం లేదు. కామ్రేడ్ రూసొవ్ సరిగా వివరించినట్టుగా అవి "ఉద్రేకం" మూలంగా మాత్రమే విస్మరింపబడ్డాయి. కూపస్థమండూకతత్వపు, బృంద దృక్పథం కోసం పార్టీ దృక్పథాన్ని మైనారిటీ ఎలా విడిచిపెట్టగలిగిందో తెలపడంలో ఇది నిజంగా దానికి అత్యంత తక్కువ అపకీర్తికరమైన వివరణ.*

---

* తన "ముట్టడి స్థితి"లో కామ్రేడ్ మార్తొవ్, ఈ సమస్యను కూడా సరిగ్గా తాను ప్రస్తావించిన అన్ని ఇతర సమస్యల లాగనే పరిగణించాడు. ఈ వివాదంయొక్క పూర్తి చిత్రణను ఇవ్వడానికి ఆయనేమీ ప్రయత్నించలేదు. ఈ వివాదంలో తలెత్తి నిజంగా సూత్రబద్ధమైన ఒకే ఒక సమస్యను, కూపస్థమండూక మనోభావ తత్వమా

కాని మైనారిటీ ఎన్నికలకు వ్యతిరేకంగా సబబైన వ్యవహార సరళితో కూడిన వాదనలను కనుగొనడానికి కేవలం ఎంత అసమర్థంగా వుండిందంటే పార్టీ వ్యవహారాలలోకి కూపస్థమండూక తత్వాన్ని ప్రవేశపెట్టడానికి తోడు వచ్చి అపనిందాకరమైన చర్యలకు పూనుకుంది. కామ్రేడ్

---

లేక కార్యకర్తల ఎన్నికయా? పార్టీ దృక్పథమా, పుల్లయ్యకూ ఎల్లయ్యకూ కలిగిన బాధా? అనే సమస్యను, ఆయన వినమ్రతతో దాటవేశాడు. ఈ సందర్భంలో కూడా కామ్రేడ్ మార్తొవ్ జరిగిన ఘటనలోనుంచి సందర్భరహితంగా విడి విడి మాటలను ఏరి చూపే పనికీ, నామీద అన్ని రకాల దూషణలనూ జోడించడానికీ మాత్రమే పరిమితపడివున్నాడు. అది ఎంతమాత్రం చాలదు, కామ్రేడ్ మార్తొవ్!

మహాసభలో కామ్రేడ్స్ అక్సెల్‌రోడ్, జసూలిచ్, స్త్రొవేర్ ఎందుకు ఎన్నుకొనబడ లేదనే ప్రశ్నతో కామ్రేడ్ మార్తొవ్ ప్రత్యేకించి నన్ను వేధిస్తున్నాడు. ఆయన అనుసరించే కూపస్థమండూక వైఖరి మూలంగా ఈ ప్రశ్నలు ఎంత అనుచితమైనవో చూడలేకపోతు న్నాడు (సంపాదకవర్గంలో తన సహచరుడైన కామ్రేడ్ ప్లెహానొవ్‌ని ఆయన ఎందుకు అడగడు?) ఆరుగురు సమస్యపై మహాసభలో మైనారిటీ పక్ష ప్రవర్తనను "అయుక్తికము"గా నేను పరిగణిస్తూనే అదే సమయంలో పార్టీ ప్రచారం కావాలని డిమాండు చేయడంలో వైరుధ్యం వుందని ఆయన అంటున్నాడు. ఇందులో వైరుధ్యం లేదు. కేవలం చిన్న చిన్న అంశాలను గాక మొత్తం విషయాన్ని అంతనూ గురించి ఒక పొందిక అయిన వివరణను ఇవ్వడానికి ప్రయత్నించి వుంటే మార్తొవే దీనిని తేలికగా గ్రహించి వుండగల్గేవాడు. ఈ సమస్యను కూపస్థమండూక దృక్పథంనుంచి చూడటం, జాలిదలచాలనీ, మనసులు బాధ పడకుండా చూడాలనీ విజ్ఞప్తి చేయడం అయుక్తికం; పార్టీ ప్రచార ప్రయోజనాల కోసం ముగ్గురితో పోలిస్తే ఆరుగురివల్ల కలిగే లాభాలను గురించి వాస్తవికమైన అంచనా, పదవులకు అభ్యర్థులైన వారిని గురించిన అంచనా, అభిప్రాయభేదాల గురించిన అంచనా అవసరం: మహాసభలో మైనారిటీ వీటిలో దేనిని గురించీ కూడా సూచన అయినా చేయలేదు.

మినిట్స్‌ని శ్రద్ధగా పరిశీలించినట్టయితే కామ్రేడ్ మార్తొవ్, ప్రతినిధులు చేసిన ప్రసంగాలలో ఆరుగురుతో కూడిన సంపాదకవర్గానికి వ్యతిరేకంగా బోలెడన్ని వాదాలను కనుగొని వుండేవాడు. ఈ ప్రసంగాలనుంచి కొన్ని భాగాలు యివి: మొదటి విషయం, సూత్రానికి సంబంధించిన అభిప్రాయభేదాల తాత్పర్యంలో పాత ఆరుగురు మధ్య అపశ్రుతులు స్పష్టంగా తెలుస్తాయి; రెండవది, సాంకేతికంగా పత్రికా నిర్వహణ పనిని సరళం చేయడం వాంఛనీయం; మూడవది, కూపస్థమండూక మనోభావ లోలత్వం కంటే పని ప్రయోజనాలు

పొపోవ్ కా|్రమేడ్ మురవ్యోవ్‌కు "సున్నితమైన పనులను చేపట్టవద్దు" (పేజి 322) అని సలహా ఇచ్చినప్పుడు నిజంగా ఆ చర్యను ఇంకేమని అనాలి? కా|్రమేడ్ సొరోకిన్ సరిగానే చెప్పినట్లుగా ఇది "వ్యక్తిగత వ్యవహారాలలో జోక్యం" గాక మరేమవుతుంది (పేజి 328)? రాజకీయ వాదాలు తీసుకురాలేక "వ్యక్తుల"పై జూదమాడటం గాక మరేమిటి? "అలాంటి పనులకు వ్యతిరేకంగా మనం ఎల్లప్పుడూ అసమ్మతి తెల్పాం" అని కా|్రమేడ్ సొరోకిన్ అనడం సరి అయినదా కాదా? తనతో ఏకీభవించని కా|్రమేడ్స్‌ను నిర్దేశించి కొరతను వేయడానికి |్రపయత్నించడం కా|్రమేడ్ డేయ్‌చ్ చెయ్యదగిన పనియేనా?"* (పేజి 328.)

---

|్రపధానం; ఎంపిక చేయబడిన వ్యక్తులు తమ పదవులకు తగిన వారనేది ఎన్నికల ద్వారానే నిస్సందేహమవుతుంది; నాల్గవది, వారిని ఎంపిక చేయడంలో మహాసభకున్న హక్కును పరిమితపరచకూడదు; అయిదవది, పార్టీకి ఇప్పుడు కేం|్రద ప|్రతిక సంపాదకవర్గంలో సాహితీ బృందానికి మించినది అవసరం. కేం|్రద ప|్రతికకు రచయితలు మా|్రతమే గాక కార్యనిర్వాహకులు కూడా అవసరం; ఆరవది, కేం|్రద ప|్రతికలో కేవలం నిర్ణీతమైన వ్యక్తులు, మహాసభకు తెలిసిన వ్యక్తులు వుండాలి; ఏడవది, ఆరుగురుతో కూడిన సంపాదకవర్గం తరచుగా నిష్ఫలమైనదిగా వుంటోంది, దాని పని దాని అసాధారణ నిర్మాణం మూలంగా గాక అలా కాకుండానే నెరవేర్చబడుతోంది; ఎనిమిదవది, వార్తాప|్రతికా నిర్వహణ అన్నది పార్టీ వ్యవహారం (ఒక అధ్యయన బృందం వ్యవహారం కాదు), వగైరా. ఈ వ్యక్తులను ఎన్నుకొనకపోడానికి గల కారణాలపట్ల అంత ఆసక్తి కలిగివుంటే కా|్రమేడ్ మార్తొవ్ ఈ ఆలోచనలలో |్రపతి ఒక్క దాని అర్థం ఏమిటో లోతుగా తరచి చూసి వాటిలో ఏ ఒక్క దానిని అయినా సరే కాదని చెప్పమనండి.

* అదే సమావేశంలో కా|్రమేడ్ డేయ్‌చ్ అన్న మాటలను (చూ. పేజి 324 – "ఒర్లోవ్‌తో జరిగిన తీ|్రవ వాదోపవాదాన్ని") కా|్రమేడ్ సొరోకిన్ ఆవిధంగానే అర్థం చేసుకున్నాడు. తాను "అలాంటి దేమీ అనలేదు" అని కా|్రమేడ్ డేయ్‌చ్ సమాధానం చెప్పాడు (పేజి 351). కాని అదే నోటితో దానికి చాలా వరకు పోలినది ఏదో ఒకటి అన్నానని అంగీకరించాడు. కా|్రమేడ్ డేయ్‌చ్ ఇలా వివరించాడు: "'ఎవరు సాహసిస్తారు' అని నేను అనలేదు. నేను అన్నది ఇది: 'ముగ్గురుతో కూడిన సంపాదకవర్గాన్ని ఎన్నుకోవాలనే నేరస్థపు |్రపతిపాదనలు (sic!) బలపర్చడానికి సాహసించే వారిని చూడటం నాకు ఆసక్తికరంగా వుంటుంది'" (పేజి 351) (sic! కా|్రమేడ్ డేయ్‌చ్ పెనంమీదనుంచి పొయ్యిలోకి దూకాడు!). కా|్రమేడ్ డేయ్‌చ్ కా|్రమేడ్ సొరోకిన్ మాటలను ఖండించలేదు సరికదా వాటిని |్రధువపర్చాడు. "ఇక్కడ అన్ని భావాలూ కలగాపులగం చేయబడ్డాయి" (ఆరుగురికి అనుకూలంగా మైనారిటీ

సంపాదకవర్గం గురించి జరిగిన చర్చలను క్రోడీకరిద్దాం. ముగ్గుర్ని ఎన్నుకోవాలనే పథకం ప్రతినిధులకు మహాసభ ఆరంభంలోనూ మహాసభకు పూర్వమూ కూడా తెలుసుననీ, అందుచేత ఈ పథకం మహాసభలో జరిగిన ఘటనలకూ వివాదాలకూ సంబంధంలేని ఆలోచనలమీదనూ వాస్తవాలమీదనూ ఆధారపడి వున్నదనీ మెజారిటీ చేసిన అనేక ప్రకటనలను మైనారిటీ ఖండించలేదు (ఖండించడానికి ప్రయత్నం కూడా చేయలేదు). ఆరుగురితో కూడిన సంపాదకవర్గాన్ని సమర్థించడంలో మైనారిటీ సూత్రరీత్యా తప్పు అయిన, అనుమతింపరాని వైఖరిని, కూపస్థమండూక ఆలోచనలపై ఆధారపడిన వైఖరిని అవలంబించింది. మైనారిటీ కార్యకర్తల ఎన్నికపట్ల పార్టీ వైఖరిని పూర్తిగా విస్మరించింది. పదవికి ప్రతిపాదింపబడిన ప్రతి అభ్యర్థిని గురించీ ఆ పదవికి సంబంధించిన కర్తవ్యాలకు అతడు తగినవాడా కాదా అని అంచనా ఇవ్వడానికి ప్రయత్నం కూడా చేయలేదు. సమస్యను దాని యోగ్యతనుపట్టి చర్చించకుండా మైనారిటీ తప్పించుకుంది. అందుకు బదులుగా తమ ప్రసిద్ధ సామరస్యం గురించి మాట్లాడింది, ''ఎవరో ఖూనీ చేయబడుతున్నట్టు''గా ''కన్నీరు కార్చింది,'' ''శోకరసం కురిపించ సాగింది'' (లాంగె ప్రసంగం, పేజి 327). తన ''ఉద్రిక్తతా'' స్థితిలో (పేజి 325) మైనారిటీ ''వ్యక్తిగత వ్యవహారాలలో జోక్యానికి దిగే''టంత దూరం, ఎన్నికలు ''నేరం'' అని అరవడం ఇంకా అలాంటి అనుమతింపరాని చర్యలకు దిగేటంత దూరం కూడా పోయింది.

ఆరుగురా ముగ్గురా అనే విషయంపై మహాసభ 30వ సమావేశంలో పోరాటం కూపస్థమండూకతత్వానికీ పార్టీ సరళికీ మధ్యనూ, హీనులైన ''వ్యక్తులకూ రాజకీయ ప్రతిఫలాలకూ మధ్యనూ, నీచమైన మాటలకూ విప్లవ కర్తవ్యం గురించిన అత్యంత ప్రాథమిక భావాలకూ మధ్యనూ జరిగిన పోరాటం.

31వ సమావేశంలో మహాసభ 19–17 మెజారిటీతోనూ, ముగ్గురు వోటింగులో పాల్గొనకుండానూ, పాత సంపాదకవర్గాన్ని మొత్తంగా ఆమోదించాలనే ప్రతిపాదనను తోసిపుచ్చినప్పుడు (పేజి 330, మరియు తప్పొప్పుల పట్టిక చూడండి), పూర్వపు సంపాదకులు సమావేశపు హాలులోకి తిరిగి వచ్చినప్పుడు, ''పూర్వపు సంపాదకవర్గంలో మెజారిటీ

---

వాదాలలో) అన్న కామ్రేడ్ సొరోకిన్ మందలింపులోని సత్యాన్ని కామ్రేడ్ డేయ్‌చ్ ధ్రువపర్చాడు అంతే. ''మనం పార్టీ సభ్యులం, మనం ప్రత్యేకించి రాజకీయ ప్రతిఫల దృష్టితో వ్యవహరించాలి'' అన్న ప్రాథమిక సత్యం గురించి కామ్రేడ్ సొరోకిన్ జ్ఞాపకం చేసిన దాని ఉపయుక్తతను కామ్రేడ్ డేయ్‌చ్ ధ్రువపర్చాడు అంతే. ఎన్నికలు ''నేరం'' అని అరవడం కూపస్థమండూకతత్వంలో మునగడమే గాక సచ్చి అపనిందా కరమైన పనులలో మునగడం కూడా!

తరఫున చేసిన ప్రకటన''లో (పేజీలు 330–331) కామ్రేడ్ మార్తొవ్ ఇదే వూగిసలాటనూ, రాజకీయ వైఖరియొక్క రాజకీయ భావాలయొక్క అస్థిరతనూ మరింత ఎక్కువగా ప్రదర్శించాడు. ఈ సమష్టి ప్రకటనలోని, దానికి నా సమాధానంలోని (పేజీలు 332–333) ప్రతి అంశాన్నీ వివరంగా పరిశీలించుదాం.

పాత సంపాదకవర్గం ఆమోదింపబడకపోయినప్పుడు కామ్రేడ్ మార్తొవ్ ఇలా అన్నాడు: ''ఇకనుంచి పాత 'ఇస్క్రా' ఉనికిలో వుండదు. దాని పేరును మార్చడం మరింత అనుగుణంగా వుంటుంది. ఏమైనా, మహాసభ చేసిన కొత్త తీర్మానంలో మహాసభ తొలి సమావేశాలలో ఒక దానిలో 'ఇస్క్రా' పట్ల విశ్వాస ప్రకటన వోటు బాగా పరిమితపర్చబడినట్టు మేము తెలుసుకున్నాము.''

కామ్రేడ్ మార్తొవ్, ఆయన సహచరులూ రాజకీయ నిలకడకు సంబంధించిన ఎంతో ఆసక్తిదాయకమైన, చాలా విధాలుగా జ్ఞానదాయకమైన సమస్యను లేవనెత్తారు. ''ఇస్క్రా'' ఆమోదింపబడుతున్నప్పుడు ప్రతివారూ ఏమి చెప్పారో ఉదహరించడం ద్వారా దీనికి నేను ఇదివరకే సమాధానం చెప్పాను (మినిట్స్, పేజి 349, పైన పేజి 82 చూడండి).* ఇక్కడ మనకి నిస్సందేహంగా ఒక ఘోరమైన రాజకీయ అస్థిరత కనిపిస్తుంది. కాని అది మహాసభలో మెజారిటీలోనా లేక పాత సంపాదకవర్గ మెజారిటీలోనా అన్న విషయాన్ని నిర్ణయించే పని పాఠకునికి వదిలేద్దాం. కామ్రేడ్ మార్తొవ్, ఆయన సహచరులూ చాలా సందర్భోచితంగా లేవనెత్తిన సమస్యలు మరో రెండు వున్నాయి. వాటిని నిర్ణయించే పని కూడా పాఠకునికే వదిలేద్దాం: అవి (1) కేంద్ర పత్రిక సంపాదకవర్గానికి కార్యకర్తలను ఎన్నుకోవాలనే మహాసభ నిర్ణయంలో '''ఇస్క్రా' పట్ల విశ్వాస ప్రకటన వోటును పరిమిత పర్చడం'' వుందని కనిపెట్టాలనే కోరిక, కూపస్థమండూక వైఖరిని తెలియజేస్తుందా లేక పార్టీ వైఖరిని తెలియజేస్తుందా? (2) పాత ''ఇస్క్రా'' ఎప్పటినుంచి నిజంగా ఉనికిలో లేకుండా పోతుంది – నేనూ, ప్లెహానొవ్వూ దానిని నడపడం ఆరంభించిన 46వ సంచికనుంచా లేక పాత సంపాదకవర్గంలో మెజారిటీ పక్షం దానిని తీసుకున్న 53వ సంచికనుంచా? మొదటి ప్రశ్న సూత్రరీత్యా అత్యంత ఆసక్తిదాయకమైన ప్రశ్న అయితే, రెండవది వాస్తవం రీత్యా అత్యంత ఆసక్తిదాయకమైన ప్రశ్న అవుతుంది.

కామ్రేడ్ మార్తొవ్ ఇంకా ఇలా అన్నాడు: ''ముగ్గురుతో కూడిన సంపాదకవర్గాన్ని ఎన్నుకోవాలని ఇప్పుడు నిర్ణయింపబడింది కనుక, మేము ఎవరమూ ఈ కొత్త సంపాదక

---

* ఈ సంపుటంలో పేజీలు 129–130 చూడండి. – సం.

వర్గంలో వుండమని నేను నా తరఫునా, మిగతా ముగ్గురు కామ్రేడ్స్ తరఫునా ప్రకటిం చాల్సి వుంది. నా విషయానికి వస్తే మరో సంగతి చెప్పాలి. ముగ్గురు సంపాదకవర్గ అభ్యర్థుల జాబితాలో నా పేరును చేర్చాలని కొంతమంది కామ్రేడ్స్ కోరుతున్న మాటే నిజమైతే అది నన్ను అకారణంగా అవమానపర్చడమే నని నేను భావించాలి (sic!). సంపాదక వర్గాన్ని మార్చాలని నిర్ణయించబడిన పరిస్థితుల దృష్ట్యా నేనిది చెబుతున్నాను. ఒక రకమైన "సంఘర్షణ"* కారణంగానూ, పాత సంపాదకవర్గం అసమర్థంగా వున్న కారణంగానూ ఈ నిర్ణయం చేయబడింది. అంతే కాదు, మహాసభ ఈ సమస్యను నిర్ణీత పద్ధతులలో పరిష్కరించింది; ఈ సంఘర్షణ గురించి సంపాదకవర్గాన్ని ప్రశ్నించలేదు, సంపాదకవర్గం అసమర్థంగా వుందా అని విచారించి నివేదించేటందుకు ఒక కమిషన్‌ని అయినా నియమించలేదు...." ("సంపాదకవర్గాన్ని ప్రశ్నించాలని" గాని ఒక విచారణ కమిషన్‌ని నియమించాలని గాని మహాసభకు ప్రతిపాదించాలనే ఆలోచన మైనారిటీలోని ఏ ఒక్క సభ్యునికీ తట్టకపోవడం వింతగానే వుంది! దానికి కారణం, "ఇస్క్రా" శాఖలో చీలిక వచ్చిన తరువాతనూ కామ్రేడ్స్ మార్తొవ్, స్తరొవేర్‌లు వేటిని గురించి అయితే రాశారో ఆ సంప్రదింపులు విఫలం కావడంచేతనూ దానివల్ల ప్రయోజనం వుండదనేగదా?) "ఈ పరిస్థితులలో, ఈవిధంగా పునర్వ్యవస్థీకరింపబడిన సంపాదకవర్గంలో పనిచేయడానికి నేను

---

* కామ్రేడ్ మార్తొవ్ బహుశా కామ్రేడ్ పొసదోవ్‌స్కీ అన్న "అప్రశుతులు" అనే మాటను గురించి ప్రస్తావిస్తూ వుండాలి. ఆ మాటను ఉపయోగించడంలో తన ఉద్దేశం ఏమిటో కామ్రేడ్ పొసదోవ్‌స్కీ మహాసభకు ఎప్పుడూ వివరించలేదనీ, అదే మాటను ఉపయోగించిన కామ్రేడ్ మురవ్యోవ్ మహాసభ చర్చలలో బైటపడిన సూత్ర విషయక అప్రశుతులు అని వివరించాడని నేను మళ్లీ చెబుతున్నాను. నిజంగా సూత్రబద్ధమైన ఏకైక చర్చ, సంపాదకులలో నలుగురు (ప్లెహానొవ్, మార్తొవ్, అక్సెల్‌రోడ్, నేను) పాల్గొన్న చర్చ నిబంధనావళిలోని మొదటి నిబంధన సందర్భంగా జరిగిందనీ, "అవకాశవాదం అనే తప్పుడు నిందారోపణ" సంపాదకవర్గాన్ని "మార్చేటందుకు" చెప్పబడిన వాదాలలో ఒకటిగా కామ్రేడ్స్ మార్తొవ్, స్తరొవేర్ రాతమూలకంగా ఫిర్యాదు చేశారనీ పాఠకునికి జ్ఞాపకం వుంటుంది. ఈ లేఖలో కామ్రేడ్ మార్తొవ్ "అవకాశవాదానికీ" సంపాదకవర్గాన్ని మార్చే పథకానికీ స్పష్టమైన సంబంధం వుందని కనిపెట్టాడు, కాని మహాసభలో "ఒకరకమైన సంఘర్షణ" అని అస్పష్టంగా సూచించడానికి పరిమితపడ్డాడు. "అవకాశవాదం అనే తప్పుడు నిందారోపణ" అప్పటికే విస్మరింపబడింది!

అంగీకరిస్తానని కొంతమంది కామ్రేడ్స్ వూహించడాన్ని నా రాజకీయ ప్రతిష్ఠకు కళంకంగా నేను పరిగణించి తీరాలి....''*

పాఠకునికి ఒక మచ్చుతునకను చూపడం కోసమూ, మహాసభ తరువాత ఎంతో విస్తారంగా వెల్లివిరిసినదీ, జగడమాడటం అని తప్ప మరో పేరుతో పిలువబడజాలనిదీ అయిన దాని ఆరంభం గురించి తెలియజేయడం కోసమూ నేను కావాలనే యీ వాదనను ఉదహరించాను. సంపాదకవర్గానికి బాధ కలిగించినప్పటికీ నేను దానిని తిరిగి అనవలసి వస్తోంది. ఎందుచేతనంటే అది సరి అయిన పదం అనేది నిర్వివాదమైన విషయం. జగడాలు ఆడటానికి ''క్షుద్రమైన ఉద్దేశాలు'' ముందే వుండి వుండాలని (కొత్త ''ఇస్క్రా'' సంపాదకవర్గం అన్నట్టుగా) అనుకోడం పొరపాటు: మన ప్రవాసుల, రాజకీయ కారణాలవల్ల వలసపోయినవాళ్ల కాలనీలతో ఏ మాత్రం పరిచయం వున్న విప్లవవాది ఎవరైనా అత్యంత అసందర్భమైన నిందారోపణలు, అనుమానాలూ, ఆత్మనిందలూ, ''వ్యక్తులు'' వగైరా ఆరోపణలు చేయబడి అదేపనిగా రాపాడించబడిన జగడాలను కొన్ని డజన్లు చూసివుంటాడు.

---

*కామ్రేడ్ మార్తొవ్ ఇంకా ఇలా అన్నాడు: ''అలాంటి పాత్రకు ర్యజానొవ్ అంగీకరించవచ్చునేమో గాని ఆయన పని ద్వారా మీరు ఎరిగిన మార్తొవ్ మాత్రం కాదని అనుకుంటాను.'' ఇది ర్యజానొవ్‌మీద వ్యక్తిగత దాడి గనుక, కామ్రేడ్ మార్తొవ్ ఈ విమర్శను ఉపసంహరించుకున్నాడు. దీనికి కారణం ర్యజానొవ్‌యొక్క వ్యక్తిగత లక్షణాల మూలంగా (వాటిని గురించి ప్రస్తావించడం అప్రస్తుతం కావచ్చు) ఆయన పేరు మహాసభలో ఒక వాడుక మాట అవడం కాదు; ''బొర్బా'' గ్రూపుయొక్క రాజకీయ రంగు — దాని రాజకీయ పొరపాట్లే అందుకు కారణం. నిజమైనవి అయినా లేక వూహాజనితములైనా వ్యక్తిగత అవమానకరమైన మాటలను ఉపసంహరించుకోడంలో కామ్రేడ్ మార్తొవ్ మంచి పనే చేశాడు, కాని ఇది మనలను రాజకీయ పొరపాట్లను మరచిపోయేటట్లు చేయకూడదు, అవి పార్టీకి గుణపాఠంగా ఉపయోగపడాలి. ''బొర్బా'' గ్రూపు ''నిర్మాణాత్మక అవ్యక్త స్థితిని'' ''సూత్రరీత్యా ఏవిధంగానూ సమర్థనీయంగాని అనైక్యతను'' కల్పించిందని మహాసభలో నిందించబడింది (కామ్రేడ్ మార్తొవ్ ప్రసంగం, పేజి 38). అలాంటి రాజకీయ ప్రవర్తనను తప్పక ఖండించవలసిందే. పార్టీ మహాసభకు పూర్వం సార్వత్రిక అవ్యక్త స్థితి వున్న కాలంలో, చిన్న గ్రూపులలో కనిపించినప్పుడు మాత్రమే కాదు, పార్టీ మహాసభ తరువాత, అవ్యక్తస్థితి తొలగింపబడిన కాలంలో కనిపించినా '''ఇస్క్రా' సంపాదకవర్గంలో మెజారిటీ, 'శ్రమ విమోచన' గ్రూపులో మెజారిటీ'' సభ్యులు అందుకు లోబడు అయినప్పటికీ దానిని ఖండించవలసిందే.

అవన్నీ ''ఉద్రిక్తత'' మూలంగానూ, అసాధారణమైన, నిస్తబ్ధమైన జీవిత పరిస్థితుల మూలంగానూ సంభవించినవి. ఇవి ఎంత క్షుద్రమైన రూపాలలో ప్రదర్శితమైనప్పటికీ, వివేకవంతుడెవరూ ఈ జగడాలలో క్షుద్రమైన ఉద్దేశాల కోసం వెతకరు. పైన ఉదహరించిన కామ్రేడ్ మార్తొవ్ ప్రసంగ భాగంలోని అసందర్భాల, వ్యక్తిత్వాల, చోద్యమైన ఘోరాల, ''వ్యక్తిగత వ్యవహారాలలో జోక్యం'' వూహాజనితమైన అవమానాల కళంకాల గజిబిజికి కారణం ''ఉద్రిక్తత'' మాత్రమే నని చెప్పాలి. నిస్తబ్ధమైన జీవిత పరిస్థితులు మనలో మనకు వందలాది జగడాలను కల్పిస్తాయి. రాజకీయ పార్టీకి, తన రుగ్మతయొక్క నిజమైన పేరేమిటో చెప్పి, నిర్దయాత్మకంగా రోగ లక్షణ నిర్ణయం చేసి దానిని నయం చేయడానికి ప్రయత్నించే ధైర్యం లేకపోతే ఆ పార్టీ గౌరవించ తగినది కాదు.

ఈ చిక్కుల దారంనుంచి ముఖ్య సూత్రాలకు సంబంధించిన దానిని దేనినైనా వెలికి తీయగల్గితే, అది తప్పనిసరిగా ఒక నిర్ధారణకు దారి తీస్తుంది. అదేమిటంటే ''రాజకీయ ప్రతిష్ఠలపై వచ్చే ఎలాంటి కళంకాలతోనూ ఎన్నికలకు నిమిత్తం లేదు,'' ''కొత్త ఎన్నికలు జరిపి, కొత్త నియామకాలు చేసి, తన అధికారిక సంస్థల కూర్పులో మార్పులు చేసే హక్కు మహాసభకు లేదనడం'' సమస్యను గందరగోళపర్చడమే అవుతుంది. ''పాత సంపాదక వర్గంలో ఒక భాగాన్ని ఎన్నుకోడం అనుమతించతగినదా అన్న విషయంపై కామ్రేడ్ మార్తొవ్ అభిప్రాయాలు రాజకీయ భావాల అతి గజిబిజిని ప్రతిబింబిస్తాయి'' (మహాసభలో నేనీ విషయాన్ని తెల్పాను, పేజి 332).

ముగ్గుర్ని ఎన్నుకోవాలనే పథకాన్ని ఎవరు ప్రవేశపెట్టారు అనే విషయంపై కామ్రేడ్ మార్తొవ్ చేసిన ''వ్యక్తిగత'' విమర్శను వదిలేసి పాత సంపాదకవర్గాన్ని ఆమోదించక పోవడానికి గల ప్రాధాన్యత గురించి ఆయన ''రాజకీయ'' లాక్షణీకరణను తీసుకుంటాను. ఆయనిలా అన్నాడు: ''...ఇప్పుడు జరిగినది, మహాసభ ద్వితీయార్ధంలో రేగిన పోరాటపు చివరి అంశము....'' (పూర్తిగా నిజం! మహాసభయొక్క యీ ద్వితీయార్ధం నిబంధనావళిలోని మొదటి నిబంధన గురించిన విషయంలో కామ్రేడ్ అకీమొవ్‌యొక్క గట్టి పట్టులోకి మార్తొవ్ పడినప్పుడు ప్రారంభమైంది.) ''ఈ సంస్కరణలో వున్నది 'సమర్థంగా' వుండటమనే సమస్య కాదు, కేంద్ర కమిటీపై పలుకుబడి సంపాదించడం కోసం సాగే పోరాట సమస్య అన్నది బహిరంగ రహస్యం....'' (మొదటిది, అది ఫలకరంగా వుండటం గురించిన సమస్య అయివుండటమే గాక కేంద్ర కమిటీ కూర్పు విషయమై వేరు తోవ తొక్కడం సమస్య కూడా అనేది బహిరంగ రహస్యమే. ఎందుకంటే, ఈ ''సంస్కరణల'' పథకం ఈ వేరు తోవ తొక్కడ మన్నది కనుచూపు మేరలో ఎక్కడా లేనప్పుడు, సంపాదకవర్గంలో ఏడవ సభ్యునిగా కామ్రేడ్ పవ్లోవిచ్‌ని ఎన్నుకోడంలో కామ్రేడ్ మార్తొవ్ మాతో కలిసి

నప్పుడు ప్రతిపాదించబడింది! రెండవది, అది కేంద్ర కమిటీలో వ్యక్తుల కూర్పు సమస్య అనీ, à la fin des fins* యీ వ్యవహారం జాబితాల తేడాగా తయారైందనీ: గ్లేబొవ్ – త్రవీన్‌స్కీ – పొపోవ్‌లా లేక గ్లేబొవ్ – ట్రాట్స్కీ – పొపోవ్‌లా అనేదిగా తయారైందనీ పత్రాల సాక్ష్యంతో ఇదివరకే చూపబడింది.) "కేంద్ర కమిటీ సంపాదకవర్గ పరికరంగా మార్చబడటం తమకు ఇష్టంలేదని సంపాదకవర్గంలో మెజారిటీ తెల్పింది...." (అది అకీమొవ్ పాడిన పాట: ఏ పలుకుబడిని సంపాదించి ఆతరువాత కేంద్ర సంస్థలలోని మెజారిటీ సహాయంతో దానిని సుస్థిరం చేసుకునేటందుకు ప్రతి మెజారిటీ పక్షమూ ప్రతి పార్టీ మహాసభలోనూ పోరాడుతుందో ఆ పలుకుబడి సమస్య, సంపాదకవర్గం చేతిలోని "పరికరం" అవడం గురించీ, కామ్రేడ్ మార్తొవే ఆతరువాత చెప్పినట్టుగా (పేజి 334) "కేవలం ఉపాంగంగా" తయారవడం గురించీ అవకాశవాద అపనిందలు వేసే స్థాయికి మార్చబడింది.) "అందుకనే సంపాదకవర్గంలోని సభ్యుల సంఖ్యను తగ్గించడం అవసరమని తలచబడింది(!!). అందుకనే నేను అలాంటి సంపాదకవర్గంలో చేరజాలను...." (ఈ "అందుకనే" అనే మాటను మరి కొంచెం జాగ్రత్తగా పరిశీలించండి. సంపాదకవర్గం ఏవిధంగా కేంద్ర కమిటీని ఒక ఉపాంగంగా గాని పరికరంగా గాని మార్చ గలదు? కౌన్సిలులో దానికి మూడు వోట్లు వున్నప్పుడూ, తన ఆధిక్యతను అది దుర్వినియోగ పర్చినప్పుడూ మాత్రమే. అది స్పష్టం కాదా? అదే విధంగా మూడో సభ్యునిగా ఎన్నుకో బడిన తరువాత కామ్రేడ్ మార్తొవ్ అలాంటి ఆధిక్యతా దుర్వినియోగం జరగకుండా ఎల్లప్పుడూ నిరోధించగలడనేదీ, తన ఒక్క వోటుతోనే కౌన్సిలుపై సంపాదక వర్గానికున్న ఆధిక్యతనంతనూ నాశనం చేయగలడనేదీ కూడా స్పష్టమే కదా? అందుచేత విషయమంతా కేంద్ర కమిటీలో సభ్యుల కూర్పు గురించినదిగా తయారవుతుంది. పరికరం కావడం, ఉపాంగం కావడం గురించిన మాటలన్నీ అపనిందలు వేయడమే నని వెంటనే స్పష్టం అవుతుంది.) "పాత సంపాదకవర్గం మెజారిటీతోపాటు ఈ మహాసభ పార్టీలో 'ముట్టడి స్థితి'ని అంతంచేస్తుందనీ వ్యవహారాలలో మామూలు స్థితిని నెలకొల్పుతుందనీ నేను అను కున్నాను. కాని వాస్తవానికి కొన్ని ప్రత్యేక గ్రూపులకు వ్యతిరేకంగా తన అత్యవసర చట్టా లతో ముట్టడి స్థితి ఇంకా కొనసాగుతోంది. అంతే గాక అది మరింత తీవ్రం కూడా అయింది. పాత సంపాదకవర్గం మొత్తం అలాగే వున్నప్పుడు మాత్రమే నిబంధనావళిచే సంపాదకవర్గానికి ఇవ్వబడిన అధికారాలు పార్టీకి నష్టకరమైన విధంగా ఉపయోగించ బడవనే హామీని మనం ఇవ్వగల్గుతాము...."

---

* చిట్ట చివరకు. – సం.

కామ్రేడ్ మార్తొవ్ ''ముట్టడి స్థితి'' అనే కుఖ్యాత నినాదాన్ని మొట్టమొదట ముందుకు తీసుకువచ్చిన ప్రసంగంలోని ఒక భాగం మొత్తం అది. ఆయనకి నేనిచ్చిన సమాధానాన్ని ఇప్పుడు చూడండి.

''...అయినప్పటికీ, ముగ్గురేసి చొప్పున రెండు సంస్థలను ఎన్నుకోవాలనే పథకపు ప్రయివేటు స్వభావాన్ని గురించిన మార్తొవ్ ప్రకటనను సరిదిద్దడంలో, పాత సంపాదక వర్గాన్ని బలపర్చకపోవడంలో మేము తీసుకున్న చర్యయొక్క 'రాజకీయ ప్రాముఖ్యత'ను గురించి మార్తొవ్ ఉద్ఘాటనను నిరాకరించే ఉద్దేశం నాకు లేదు. తద్భిన్నంగా, ఈ చర్యకు గొప్ప రాజకీయ ప్రాముఖ్యం గలదనడంలో — దానికి మార్తొవ్ ఆపాదించే ప్రాముఖ్యం మాత్రం కాదు — కామ్రేడ్ మార్తొవ్‌తో నేను పూర్తిగా, మినహాయింపులు లేకుండా ఏకీభవిస్తాను. రష్యాలో కేంద్ర కమిటీపై పలుకుబడికోసం సాగే పోరాటంలో అది ఒక చర్య అని ఆయన అన్నాడు. నేను మార్తొవ్ కంటె ఇంకా ముందుకు వెడతాను. ఒక ప్రత్యేక గ్రూపుగా 'ఇస్క్రా'యొక్క కార్యకలాపం యావత్తూ ఇంతవరకూ పలుకుబడి కోసం సాగించిన పోరాటమే; కాని ఇప్పుడది అంతకు మించిన విషయం, అందుకోసం పోరాటం మాత్రమే కాదు, ఈ పలుకుబడిని నిర్మాణాత్మకంగా సుస్థిరం చేసుకోడం. ఈ విషయంమీద కామ్రేడ్ మార్తొవూ నేనూ రాజకీయంగా ఎంత పూర్తిగా భేదిస్తామో ఈ వాస్తవంలో తెలుస్తుంది. కేంద్ర కమిటీని ప్రభావితం చేయాలనే కోరిక నాకు వుందని ఆయన నిందిస్తున్నాడు, నేను నిర్మాణాత్మక సాధనాల ద్వారా ఈ పలుకుబడిని సుస్థిరమొనర్చడానికి ప్రయత్నించాను, ఇంకా ప్రయత్నిస్తున్నాను, అది నాకొక గౌరవంగా పరిగణిస్తున్నాను. మేము వేరు వేరు భాషలలో మాట్లాడుతున్నట్లు కూడా కనిపిస్తోంది! మా కృషీ మా ప్రయత్నాలూ అన్నీ పలుకుబడిని పూర్తిగా సంపాదించడంలో, స్థిరపర్చుకోడంలో గాక దానికోసం సాగే పాత పోరాటంలోనే అంతం అయితే అర్థమేముంది? ఔను, కామ్రేడ్ మార్తొవ్ చెప్పినది పూర్తిగా సరి అయినది: మేము తీసుకున్నది నిస్సందేహంగా ఒక ముఖ్యమైన రాజకీయ చర్య. ఇప్పుడున్న ధోరణులలో ఒకటి మన పార్టీ భవిష్యత్ కృషికి ఎంపిక చేయబడిందని చూపే చర్య. 'పార్టీలో ముట్టడి స్థితి,' కొందరు వ్యక్తులకూ గ్రూపులకూ వ్యతిరేకంగా అత్యవసర చట్టాలు వగైరా భయంకరమైన మాటలకు నేను ఎంత మాత్రమూ భయపడను. నిలకడలేని, వూగిసలాడే వారి విషయంలో మనం ఒక 'ముట్టడి స్థితి'ని కల్పించగల్గడమే కాక కల్పించి తీరాలి. మన పార్టీ నిబంధనావళి అంతానూ, మహాసభచే ఇప్పుడు ఆమోదింపబడిన కేంద్రీకరణ పద్ధతి అంతానూ రాజకీయ అస్పష్టతయొక్క అనేకమైన మూలాధారాల విషయంలో 'ముట్టడి స్థితి' తప్ప మరేమీ కాదు. అవి అత్యవసర చట్టాలు అయినా సరే యీ అస్పష్టతకు వ్యతిరేకంగా తీసుకోవలసిన చర్యలుగా ప్రత్యేక చట్టాలు

అవసరం. మహాసభ తీసుకున్న చర్య అలాంటి చట్టాలకూ అలాంటి చర్యలకూ ఒక గట్టి ప్రాతిపదికను కల్పించి అనుసరించవలసిన రాజకీయ మార్గాన్ని సరిగా సూచించింది.''

మహాసభలో నా ప్రసంగపు యీ సంగ్రహ పాఠంలో కామ్రేడ్ మార్తొవ్ తన ''ముట్టడి స్థితి''లో వదలివేయదలచిన వాక్యాన్ని (పేజి 16) నేనిక్కడ కిందిగీతలు గీసి చూపాను. ఆయనకి ఆ వాక్యం నచ్చకపోవడంలోనూ, స్పష్టంగా కనబడే దాని అర్థాన్ని అవగాహన చేసుకోదలచకపోవడంలోనూ ఆశ్చర్యం ఏమీ లేదు.

''భయంకరమైన మాటలు'' అనే ఉక్తిలో ఇమిడివున్నది ఏమిటి కామ్రేడ్ మార్తొవ్?

అందులో వెక్కిరింపు వుంది, చిన్న విషయాలకు పెద్ద పేర్లు పెట్టేవారినీ, సామాన్య సమస్యను అహంకార పూరితమైన వాగాడంబరంతో గందరగోళపర్చేవారినీ వెక్కిరించడం. కామ్రేడ్ మార్తొవ్‌కి ''ఉద్రిక్తత''ను కలిగించి వుండగలిగినదీ వాస్తవంగా కలిగించినదీ అయిన ఒకే ఒక స్వల్పమైన సాధారణమైన వాస్తవం, కేంద్ర సంస్థలలో వ్యక్తుల కూర్పు విషయంపై మహాసభలో ఆయన పొందిన ఓటమి తప్ప మరేమీ కాదు. ఈ సాధారణ వాస్తవంయొక్క రాజకీయ ప్రాముఖ్యం ఏమిటైవుందంటే, పార్టీ మహాసభలో మెజారిటీ విజయం పొంది పార్టీ నాయకత్వంలో కూడా తన మెజారిటీని నెలకొల్పుకోడం ద్వారానూ, ఈ మెజారిటీ వేటినైతే వూగిసలాటగానూ, అస్థిరతగానూ, అస్పష్టతగానూ పరిగణించిందో వాటికి వ్యతిరేకంగా పోరాటం సాగించేటందుకు నిబంధనావళి సహాయంతో నిర్మాణాత్మక ప్రాతిపదికను నెలకొల్పుకోడం ద్వారానూ తన పలుకుబడిని సుస్థిరం చేసుకుంది.* తమ కళ్లలో భీతితో ''పలుకుబడి కోసం పోరాటం'' గురించి మాట్లాడటానికీ ''ముట్టడి స్థితి'' అని ఫిర్యాదు చేయడానికీ దీనిని ఒక సందర్భం చేయడం అహంకారపూరిత వాగాడంబరత, భయంకరమైన మాటలు తప్ప మరేమీ కాదు.

కామ్రేడ్ మార్తొవ్ దీనితో ఏకీభవించడా? అయితే బహుశా ఆయన పార్టీ మహాసభ

* ''ఇస్క్రా'' మైనారిటీ పక్షపు అస్థిరత, వూగిసలాట, అస్పష్టత మహాసభలో ఎలా ప్రదర్శితమయాయి? మొదటిది, నిబంధనావళిలోని మొదటి నిబంధనపై వారి అవకాశవాద పదజాల ప్రయోగం ద్వారా; రెండవది, కామ్రేడ్స్ అకీమొవ్, లీబెర్‌లతో వారి కలయిక ద్వారా, మహాసభ ద్వితీయార్ధంలో యీ కలయిక త్వరత్వరగా మరింత ప్రస్ఫుటం అయింది; మూడవది, కేంద్ర పత్రికకు కార్యకర్తలను ఎన్నుకునే సమస్యను కూపస్థమండూకత్వ స్థాయికీ, నీచమైన మాటల స్థాయికీ చివరికి వ్యక్తిగత వ్యవహారాలలో జోక్యానికి దిగజార్చడానికి వారి సంసిద్ధతద్వారా, మహాసభానంతరం ఈ మనోహరమైన లక్షణాలన్నీ మొగ్గల స్థితినుంచి వికసించిన పూవుల సిత్థికీ ఫలాల స్థితికీ అభివృద్ధి చెందాయి.

అసలు జరగనేలేదని లేదా మెజారిటీ (1) కేంద్ర సంస్థలలో మెజారిటీ సంపాదించడం ద్వారాను, (2) వూగిసలాటనూ, అస్థిరతనూ, అస్పష్టతనూ నివారించేటందుకు దానికి అధికారాలను ఇవ్వడం ద్వారాను సంపాదించిన పలుకుబడిని సుస్థిరమొనర్చుకోడానికి ముందుకు సాగని విధంగా అది మొత్తంమీద వ్యూహ్యమైనదని రుజువు చేయడానికి ప్రయత్నిస్తాడు.

ఎన్నికలకు పూర్వం, మన మహాసభ, కేంద్ర పత్రికలోనూ కేంద్ర కమిటీలోనూ, మూడింట ఒక వంతు వోట్లను పార్టీ మెజారిటీకివ్వాలా లేక మైనారిటీకివ్వాలా అన్నది నిర్ణయించవలసి వచ్చింది. ఆరుగురుతో కూడిన సంపాదకవర్గ ప్రతిపాదన, కామ్రేడ్ మార్తొవ్ ఇచ్చిన జాబితాయొక్క ఉద్దేశం మూడింట ఒక వంతు మాకు ఇవ్వడం, రెండువంతులు ఆయన అనుచరులకు ఇవ్వడం. కేంద్ర పత్రికలో ముగ్గురే వుండాలనే ప్రతిపాదన, మేము ఇచ్చిన జాబితా ఉద్దేశం మూడింట రెండు వంతులు మాకు, ఒక వంతు కామ్రేడ్ మార్తొవ్ అనుచరులకూ ఇవ్వడం. కామ్రేడ్ మార్తొవ్ మాతో రాజీపడటానికి గాని, లొంగిపోడానికి గాని నిరాకరించి మహాసభలో పోరాటానికి రమ్మని రాతమూలకంగా సవాలు చేశాడు. మహాసభలో ఓడిపోయిన తరువాత ఏడవడమూ, ''ముట్టడి స్థితి'' అని ఫిర్యాదు చేయడమూ మొదలుపెట్టాడు! మరి ఇది జగడమాడటం కాదా? అది మేధావియొక్క నైతిక బలహీనతను మరోసారి వ్యక్తంచేయడం కాదా?

ఈ సందర్భంలో ఈ రెండో లక్షణం గురించి కార్ల్ కౌట్స్కీ ఇటీవల ఇచ్చిన అద్భుతమైన సాంఘిక, మానసిక లాక్షణీకరణను జ్ఞాపకం చేసుకోకుండా వుండలేము. వివిధ దేశాలలోని సోషల్ డెమోక్రటిక్ పార్టీలు యీ రోజులలో అలాంటి వ్యాధులతో తరచుగా బాధపడుతున్నాయి. వాటికి సరిఅయిన రోగ నిర్ణయం గురించీ, సరిఅయిన చికిత్స గురించీ ఎక్కువ అనుభవజ్ఞులైన కామ్రేడ్స్‌నుంచి తెలుసుకోడం మనకి ఎంతో ఉపయోగకరం. అందుచేత కొంతమంది మేధావులను గురించి కార్ల్ కౌట్స్కీ యిచ్చిన లాక్షణీకరణ ఇక్కడ అప్రస్తుతం కాదు.

''...నేడు మనకు మరల అత్యంత ఆసక్తిని కలిగించే సమస్య మేధావి వర్గానికి* శ్రామికవర్గానికీ మధ్యనున్న వైరుధ్యం. నా సహచరులు [కౌట్స్కీ తాను ఒక

---

*జర్మను భాషలోని Literat, Literatentum అనే మాటలను అనువదించడానికి మేధావి, మేధావి వర్గం అనే మాటలను ఉపయోగించాను. వీరిలో రచయితలు మాత్రమే గాక, మొత్తంమీద విద్యావంతులైన వారందరూ, స్వేచ్ఛాయుత వృత్తులలోని వారందరూ, శారీరక శ్రమ చేసే వారికి భిన్నంగా మానసిక శ్రమ చేసే వారందరూ (ఇంగ్లీషువారు చెప్పేట్టుగా brain workers) చేరుతారు.

మేధావి, రచయిత, పత్రికా సంపాదకుడు] ఎక్కువ మందికి నేనీ వైరుధ్యాన్ని ఒప్పుకుంటున్నందుకు కోపం వస్తుంది. కాని వాస్తవంలో ఈ వైరుధ్యం వుంది. ఇతర సందర్భాలలో లాగనే లేదని చెప్పడం ద్వారా వాస్తవాన్ని తప్పించుకోడానికి ప్రయత్నించడం అత్యంత అయుక్తమైన ఎత్తుగడ అవుతుంది. ఈ వైరుధ్యం సాంఘిక మైనది. అది వర్గాలకు సంబంధించినది గాని వ్యక్తులకు సంబంధించినది కాదు. ఒకానొక మేధావి ఒకానొక పెట్టుబడిదారు శ్రామికవర్గంతో దాని వర్గ పోరాటంలో చేరవచ్చు. ఆ మేధావి అలా చేసినప్పుడు అతని స్వభావం కూడా మారిపోతుంది. ఈ కింద మనం ప్రధానంగా చెప్పేది ఈ రకమైన మేధావిని గురించి కాదు. తన వర్గంలో అతడింకా ఒక మినహాయింపుగానే వున్నాడు. ఈ పుస్తకపు తరువాతి పాఠంలో మేధావి అనే మాటను బూర్జువా సమాజపు వైఖరినే తీసుకునే సామాన్య మేధావి అనే అర్థంలో మాత్రమే ఉపయోగిస్తాను. ఒక వర్గంగా మేధావి వర్గపు ప్రత్యేక లక్షణం గల ప్రతినిధి అతడే. ఈ వర్గం శ్రామికవర్గానికి కొంత విరుద్ధంగానే వుంటుంది.

"కాని ఈ వైరుధ్యానికీ, శ్రమకూ పెట్టుబడికీ మధ్యనుండే వైరుధ్యానికీ తేడా వుంది. మేధావి పెట్టుబడిదారు కాదు. అతని జీవన ప్రమాణం బూర్జువా జీవన ప్రమాణమన్న మాట నిజమే, అతడు దరిద్రుడు కాకుండా వుండాలంటే దానిని కొనసాగించాలి; కాని అదే సమయంలో అతడు తన శ్రమ ఫలితాన్ని, తరచు తన శ్రమ శక్తిని, అమ్ముకోక తప్పదు. అందులో అతడు కూడా పెట్టుబడిదారునిచే తరచుగా బాగా దోచుకొనబడతాడు, అవమానింపబడతాడు. అందుచేత మేధావి శ్రామిక వర్గంతో ఏవిధమైన ఆర్థిక వైరుధ్యం కలిగి వుండడు. కాని అతని జీవిత ప్రతిపత్తీ, అతని శ్రమ పరిస్థితులూ శ్రామికవర్గ లక్షణం కలిగినవి కావు, ఇది మనోభావాలలోనూ అభిప్రాయాలలోనూ కొంత వైరుధ్యాన్ని కల్పిస్తుంది.

"ఒక విడి వ్యక్తిగా శ్రామికుడు ఏమీ కాడు. అతని యావత్తు బలమూ, అతని యావత్తు అభ్యుదయమూ అతని ఆశలూ అపేక్షలూ అన్నీ కూడా సంఘం నుంచీ, తన తోటివారితో కలిసి చేసే క్రమబద్ధమైన కార్యాచరణనుంచీ వస్తాయి. ఒక బ్రహ్మాండమైన బలమైన నిర్మాణ రూపంలో తానొక భాగం అయినప్పుడు అతడు తానెంతో గొప్పవాడుగానూ బలవంతుడుగానూ భావిస్తాడు. ఈ నిర్మాణ స్వరూపమే అతనికి ముఖ్యమైన విషయం: తారతమ్యరీత్యా చూస్తే వ్యక్తి చాలా అల్పుడు. శ్రామికుడు వ్యక్తిగత లాభానికి గాని వ్యక్తిగత కీర్తికి గాని చూడకుండా అనామధేయమైన రాశిలో ఒక లేశంగా అత్యంత భక్తిశ్రద్ధలతో పోరాడుతాడు. తనకు ఏ

పని అప్పగించినా స్వచ్ఛంద క్రమశిక్షణతో తన కర్తవ్యాన్ని నెరవేరుస్తాడు. ఈ స్వచ్ఛంద క్రమశిక్షణ అతని ఆలోచనలలోనూ అనుభూతులలోనూ అంతటా వ్యాపించి వుంటుంది.

''మేధావి విషయం పూర్తిగా వేరు. అతడు శక్తి నుపయోగించి పోరాడడు. వాదాన్ని ఉపయోగించి పోరాడుతాడు. తన వ్యక్తిగత విజ్ఞానం, తన వ్యక్తిగత సామర్థ్యం, తన వ్యక్తిగత నమ్మకాలు ఇవే అతని ఆయుధాలు, అతడు తన వ్యక్తిగత యోగ్యతల ద్వారా మాత్రమే ఏ పదవినైనా సాధించగలడు. అందుచేత తన వ్యక్తిత్వానికి అత్యంత స్వేచ్ఛాయుతమైన అవకాశం వుండటం విజయవంతమైన కార్యకలాపానికి ప్రధాన అవసరం అని అతనికి అనిపిస్తుంది. ఎంతో కష్టంమీద మాత్రమే అతడు మొత్తంలో ఒక భాగంగా వుండగల్గుతాడు. అది కూడా అవసరాన్నిబట్టి మాత్రమే గాని ఇష్టంతో కాదు. క్రమశిక్షణ సమూహానికే గాని ప్రత్యేక మనుషులకు అవసరం లేదని అతను అనుకుంటాడు. తాను రెండవ రకానికి చెందినవాడినని అతను అనుకునేమాట నిజం....

''తన స్వంత వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకోడమే సర్వస్వమూ అయేదీ ఆ వ్యక్తిత్వాన్ని ఒక మహత్తర సామాజిక లక్ష్యానికి లోబరచడం అసభ్యమూ హేయమూ అనే అతీత మానవ పూజా అయిన నీత్షె తర్కం మేధావియొక్క నిజమైన తర్కం అవుతుంది; అది అతనిని శ్రామికవర్గపు వర్గపోరాటంలో పాల్గొనడానికి పూర్తిగా అనర్హుని చేస్తుంది.

''నీత్షె తరువాత మేధావి వర్గపు మనోభావాలకు అనుగుణంగా వున్న తర్కాన్ని వివరించిన అత్యంత ప్రముఖుడు బహుశా ఇబ్సన్. ఆయన సృష్టించిన డాక్టర్ స్టాక్‌మన్ పాత్ర (''ప్రజాశత్రువు'' అనే నాటకంలోని పాత్ర) చాలా మంది అనుకున్నట్టు సోషలిస్టు కాడు. శ్రామికవర్గ ఉద్యమంలో గాని మొత్తంమీద ప్రజా ఉద్యమం దేనిలోనైనా గాని పని చేయడానికి ప్రయత్నించిన వెంటనే దానితో ఘర్షణలో పడితీరే రకం మేధావి అతడు. ఎందుచేతనంటే ప్రతి ప్రజాస్వామిక*

---

* నిర్మాణ సంబంధమైన అన్ని సమస్యల్లోకీ మన మార్తొవ్ అనుయాయులు తెచ్చిపెట్టిన గందరగోళానికి అత్యంత ప్రత్యేకమైన లక్షణం ఏమిటంటే వారు అకీమొవ్ వైపుకు, తప్పుగా అన్వయింపబడిన ప్రజాస్వామ్యం వైపుకు మొగ్గినప్పటికీ అదే సమయంలో వారు, అందరిచేతా చాలా ముందుగానే పథకం వేయబడిన విధంగా మహాసభలో సంపాదకవర్గాన్ని ప్రజాస్వామిక పద్ధతిలో ఎన్నుకోడంపట్ల ఆగ్రహం చెందారు! అయ్యా! బహుశా అది తమ ముఖ్య సూత్రమా?

ఉద్యమం లాగనే శ్రామికవర్గ ఉద్యమానికి ప్రాతిపదిక తన తోటివారిలో మెజారిటీని గౌర వించడం. ఒక రకానికి ప్రాతినిధ్యం వహించే మేధావి అయిన ష్టాక్‌మన్‌లాగా ''ఘనిష్ఠ మెజారిటీ''ని కూలదోసి తీరవలసిన క్రూరజంతువుగా పరిగణిస్తాడు....

''శ్రామికవర్గ మనోభావాలతో పూర్తిగా నిండివున్న మేధావికి ఒక చక్కని ఉదాహరణ అయినవాడూ, తానొక ఉజ్వల రచయిత అయినప్పటికీ మేధావికుండే ప్రత్యేక మనస్తత్వాన్ని పూర్తిగా కోల్పోయి సంతోషంతో సామాన్యులతోపాటు ముందుకు సాగినవాడూ, తనకు ఏ పని అప్పగించినా నెరవేర్చి మన మహత్తర ఆశయానికి మనస్ఫూర్తిగా లోబడినవాడూ, ఇబ్సన్, నీత్‌షే పద్ధతిలో తర్ఫీదైన మేధావి తాను మైనారిటీలో వున్నప్పుడు తన వ్యక్తిత్వం అణచివేయబడుతోందని ఏడ్చే సన్నని ఏడుపులను (weichliches Gewinsel) అసహ్యించుకున్నవాడూ, సోషలిస్టు వుద్యమానికి కావలసిన రకం మేధావికి ఒక చక్కని ఉదాహరణ అయినవాడూ లీబ్‌క్నెఖ్ట అనే చెప్పాలి. ఈ సందర్భంలో మనం కార్ల్ మార్క్స్‌ను కూడా పేర్కొనవచ్చు. ఆయనెప్పుడూ ప్రాముఖ్యతలోకి రావాలని ప్రయత్నించలేదు. ఇంట ర్నేషనల్‌లో తరచుగా మైనారిటీలోనే వుంటున్నా ఆయన పార్టీ క్రమశిక్షణ ఆదర్శ ప్రాయం.''*

కేవలం పాత బృందం ధ్రువపరచబడలేదు కనక ఆఫీసు కార్యనిర్వాహకుల జాబితాలో తమ పేర్లను జేర్చడానికి మార్తొవ్, ఆయన మిత్రుల నిరాకరణ మైనారిటీలో వున్న మేధా వుల సన్నని ఏడుపు లాంటిదే తప్ప మరేమీ కాదు. ముట్టడి స్థితి, ''కొన్ని గ్రూపులకు వ్యతి రేకంగా'' అత్యవసర చట్టాలు అనే వారి ఫిర్యాదులు కూడా అంతే. ఆ గ్రూపులు రద్దు చేయబడిన ''యూజ్నీ రబోచీ,'' ''రబోచెయె దేలొ'' గ్రూపులు. అంతకు ముందు మార్తొవ్ వాటిని పట్టించుకోలేదు. తన గ్రూపు రద్దు చేయబడినప్పుడు మాత్రమే వాటిని పట్టిం చుకో నారంభించాడు.

''ఘనిష్ఠ మెజారిటీ'' గురించి అంతులేని ప్రవాహంగా కురిపింపబడిన ఫిర్యాదులూ, దూషణలూ, హెచ్చరికలూ, నిందారోపణలూ, అపనిందలూ మైనారిటీలో వున్న మేధావుల సన్నని ఏడుపు లాంటివే. వాటిని మార్తొవ్ ప్రారంభించాడు. అవి పార్టీ మహాసభలో వెల్లు వలై ప్రవహించాయి.** (మహాసభానంతరం ఇంకా ఎక్కువ అయ్యాయి.)

---

* Karl Kautsky, "Franz Mehring" (''ఫ్రాన్జ్ మేరింగ్''), "Neue Zeit," XXII, 1, S. 99–101, 1903, №. 4.

**మహాసభ మినిట్స్, పేజీలు 337, 338, 340, 352 వగైరా చూడండి.

ఘనిష్ఠ మెజారిటీ ప్రయివేటు సమావేశాలు జరిపిందని మైనారిటీ తీవ్రంగా ఫిర్యాదు చేసింది. అంతే, మైనారిటీ తనకు అసంతోషకరమైన ఒక విషయాన్ని కప్పిపుచ్చడానికి ఏదో ఒకటి చేయవలసి వచ్చింది. ఆ విషయం ఏమిటంటే, అది తన ప్రయివేటు సమావేశానికి ఆహ్వానించిన ప్రతినిధులు దానికి వెళ్లడానికి నిరాకరించారు. ఆ సమావేశానికి ఇష్టపూర్వకంగా హాజరు అయివుండేవారిని (యెగోరొవ్, మాహొవ్, బ్రూకెర్‌లను) మైనారిటీ ఆహ్వానించలేకపోయింది. ఎందుకంటే మహాసభలో అది వారితో తీవ్రంగా పోరాడింది.

''అవకాశవాదమనే తప్పుడు నిందారోపణ'' గురించి మైనారిటీ పక్షం తీవ్రంగా ఫిర్యాదు చేసింది. అంతే, చాలా సందర్భాలలో ''ఇస్క్రా'' వ్యతిరేకులను అనుసరించిన అవకాశవాదులే – ఈ ''ఇస్క్రా'' వ్యతిరేకులలోనే కొంతమందీ – ఘనిష్ఠ మైనారిటీగా తయారయారనే అసంతోషకరమైన వాస్తవాన్ని కప్పిపుచ్చడానికి అది ఏదో ఒకటి చేయవలసి వచ్చింది. వీరు పార్టీ సంస్థలలో బృందంసరళినీ, వాదనలలో అవకాశవాదాన్నీ, పార్టీ విషయాలలో కూపస్థమండూకత్వాన్నీ మేధావికుండే అస్థిరతనూ బలహీనతనూ సమర్థించే పనిని రెండుచేతులా చేపట్టారు.

''ఘనిష్ఠ మెజారిటీ'' మహాసభ చివరిలో ఏర్పడిందనే అత్యంత ఆసక్తిదాయకమైన రాజకీయ వాస్తవానికి వివరణ ఏమిటో, ప్రతి సవాలునూ లెక్కచేయకుండా మైనారిటీ తాను ఏర్పడడానికి గల కారణాలనూ తాను ఏర్పడే చరిత్రనూ చెప్పకుండా అంత ఎక్కువ అప్రమత్తతతో ఎందుకు తప్పించుకుందో తరువాతి అధ్యాయంలో చెబుతాము. మొదట మహాసభ చర్చలను గురించిన మన విశ్లేషణలను పూర్తి చేద్దాం.

కేంద్ర కమిటీ ఎన్నికల సందర్భంలో, కామ్రేడ్ మార్తొవ్ అత్యంత స్వభావసిద్ధమైన తీర్మానాన్ని ప్రతిపాదించాడు (పేజి 336). ఆ తీర్మానంయొక్క మూడు ముఖ్య లక్షణాలను ఒక సందర్భంలో నేను ''మూడు ఎత్తులలో ఆటకట్టు'' అని పేర్కొన్నాను. అవి ఇవి: (1) కేంద్ర కమిటీకి విడివిడిగా అభ్యర్థుల పేర్లు కాకుండా అభ్యర్థుల జాబితాలను వోటింగుకు పెట్టడం; (2) ఈ జాబితాలు ప్రకటించబడిన తరువాత రెండు సమావేశాలు దాటవేయడం (చర్చల కోసం అనేది స్పష్టం); (3) పూర్తి మెజారిటీ రాని పక్షంలో రెండవ బాలెట్‌ను తుది నిర్ణయంగా పరిగణించడం. ఈ తీర్మానం అత్యంత జాగ్రత్తగా వ్యూహించబడిన ఎత్తుగడ. (ప్రతిస్పర్ధికి అర్హమైన గౌరవాన్ని మనం ఇవ్వాలి!) కామ్రేడ్ యెగోరొవ్ దీనికి అంగీకరించలేదు (పేజి 337) కాని, ఏడుగురు బుంద్‌వాళ్లూ, ''రబోచెయె దేలో''వాళ్లూ మహాసభనుంచి వెళ్లిపోయి వుండకపోతే ఇది మార్తొవ్‌కు తప్పకుండా పూర్తి విజయాన్ని చేకూర్చి వుండేది. ఈ ఎత్తుగడకు కారణం బుంద్, బ్రూకెర్‌ల మాట అటుంచి కామ్రేడ్స్ యెగోరొవ్‌ల

తోనూ, మాహోవ్‌లతోనూ అయినా "ఇస్క్రా"వాళ్ల మైనారిటీ ఒక "ప్రత్యక్ష ఒప్పందం" ("ఇస్క్రా"వాళ్ల మెజారిటీ మధ్యవున్నలాంటి దానిని) చేసుకుని వుండ లేదు, చేసుకుని వుండగలిగేది కాదు.

"అవకాశవాదం అనే తప్పుడు నిందారోపణ"లో తనకీ బుండ్‌కీ మధ్య ప్రత్యక్ష ఒప్పందం వుందని భావించబడిందని లీగు మహాసభలో కామ్రేడ్ మార్తొవ్ ఫిర్యాదు చేసిన సంగతిని జ్ఞాపకం చేసుకోండి. నేను మళ్లీ చెబుతున్నాను. ఆయనకున్న భయంలో కామ్రేడ్ మార్తొవ్‌కి అలా అనిపించింది అంతే. జాబితాలను వోటింగుకు పెట్టడానికి కామ్రేడ్ యెగోరొవ్ అంగీకరించకపోవడమే (కామ్రేడ్ యెగోరొవ్ "అప్పటికింకా తన మూల సూత్రాలను వదలుకోలేదు"— బహుశా యీ మూలసూత్రాలే ప్రజాస్వామిక గ్యారంటీల పూర్తి ప్రాముఖ్యతను అంచనా కట్టడంలో గోల్డ్‌బ్లాత్‌తో ఆయన కలిసేటట్లు చేశాయి) యెగోరొవ్‌తోనైనా "ప్రత్యక్ష ఒప్పందం" చేసుకునే సమస్య వుండజాలదనే అత్యంత ముఖ్యమైన వాస్తవాన్ని స్పష్టంగా తెలియజేసింది. కాని యెగోరొవ్‌తోనూ బ్రూకెర్‌తోనూ కలయిక వుండివుండవచ్చు, వుండింది కూడా. అది ఏ తాత్పర్యంలో అంటే, మార్తొవ్ అనుయాయులు మాతో తీవ్రమైన ఘర్షణలో పడినప్పుడల్లా, అకీమొవ్ ఆయన మిత్రులూ తక్కువ కీడును ఎంపిక చేసుకోవలసివచ్చినప్పుడల్లా వారికి పైవారి మద్దతు తప్పక వుండ గలిగింది. కామ్రేడ్స్ అకీమొవ్ లీబెర్‌లు తక్కువ కీడుగానూ, "ఇస్క్రా" లక్ష్యాలను అత్యంత తక్కువగా సాధించేటట్లు చేసేదిగానూ ఎంచి కేంద్ర పత్రిక సంపాదకవర్గంలో ఆరుగురు వుండాలనే ప్రతిపాదనకూ, కేంద్ర కమిటీకి మార్తొవ్ ప్రతిపాదించిన జాబితాకూ అనుకూలంగా తప్పకుండా వోటుచేసి వుండేవారనడంలో ఎంత మాత్రం సందేహం ఇదివరకూ లేదు ఇప్పుడూ లేదు (నిబంధనావళి మొదటి నిబంధనపై అకీమొవ్ ప్రసంగాన్నీ మార్తొవ్‌పై ఆయన పెట్టుకున్న "ఆశలను" చూడండి). జాబితాలను రహస్య వోటింగుకు పెట్టమనడం, తరువాత రెండు సమావేశాలు జరిగిపోయేటంతవరకూ వూరుకోమనడం, తిరిగి రహస్య వోటింగు జరపాలనడం, ఇవన్నీ ప్రత్యక్ష ఒప్పందం లేకుండానే దాదాపు యాంత్రికంగా ఖచ్చితమైనంత రూఢిగా ఇదే ఫలితాన్ని సాధించడానికి ఉద్దేశించబడ్డాయి.

కాని మా ఘనిష్ట మెజారిటీ ఒక ఘనిష్ట మెజారిటీగానే వుండిపోయింది గనుక, కామ్రేడ్ మార్తొవ్ జాప్యం మాత్రమే కలిగించవచ్చు, మేము దానిని తోసిపుచ్చి తీరాలి. అందువల్లనే మైనారిటీ తమ ఫిర్యాదులను రాతపూర్వకంగా కుమ్మరించింది (ప్రకటనలో పేజి 341), మర్తినొవ్, అకీమొవ్‌లను అనుకరించుతూ కేంద్ర కమిటీకి జరిగిన ఎన్నికలలో, "అవి జరపబడిన పరిస్థితుల దృష్ట్యా" వోటు చేయడానికి నిరాకరించింది. మహాసభ తరువాత, ఎన్నికలలో అసాధారణ పరిస్థితులు ఏర్పడ్డాయనే ఫిర్యాదులు

(చూ: ''ముట్టడి స్థితి,'' పేజి 31) వందలాది పార్టీ ముచ్చట్లలో అదే పనిగా కురిపించ బడ్డాయి. అయితే యీ అసాధారణత ఎందులో వుంది? మహాసభయొక్క స్థాయీ నియ మాలలో (మినిట్స్, పేజి 11, నిబంధన 6) ముందుగానే ఏర్పాటు చేసుకోబడినదీ అందులో ఎలాంటి ''కాపట్యాన్ని'' గాని ''అన్యాయాన్ని'' గాని కనుగొనడానికి వీలులేనిదీ అయిన రహస్య వోటింగు పద్ధతిలోనా? నైతికంగా బలహీనులైన మేధావుల దృష్టిలో ''క్రూరజంతువు'' అయిన ఘనిష్ఠ మెజారిటీ ఏర్పడటంలోనా? లేక మహాసభ జరిపే అన్ని ఎన్నికలనూ గుర్తిస్తామని మహాసభకు పూర్వం తామిచ్చిన వాగ్దానాన్ని ఉల్లంఘించాలనే యీ ఘనమైన మేధావులకు కలిగిన అసాధారణ కోరికలోనా? (పేజి 380, మహాసభ నిబంధనావళిలోని నిబంధన 18.)

మహాసభలో ఎన్నికల రోజున కా|మేడ్ పొపోవ్ యీ కోరికను గురించి అన్యాపదేశంగా సూచించాడు. ఆయనిలా సూటిగా ప్రశ్నించాడు: ''ప్రతినిధులలో సగం మంది వోటు చేయడానికి నిరాకరించినప్పుడు మహాసభ చేసే నిర్ణయం చెల్లతగినదీ సక్రమమైనదీ అవు తుందని బ్యూరో నిశ్చయంగా చెప్పగలదా?''* సహజంగానే తాను నిశ్చయంగా చెప్పగలనని బ్యూరో సమాధానం చెప్పి, కా|మేడ్స్ అకీమొవ్ మర్తీనొవ్‌ల ఘటనను జ్ఞాపకం చేసింది. కా|మేడ్ మార్తొవ్ బ్యూరోతో ఏకీభవించాడు. కా|మేడ్ పొపోవ్ పొరపడ్డాడనీ, ''మహా సభ నిర్ణయాలు చెల్లుతాయి'' అనీ స్పష్టంగా ప్రకటించాడు (పేజి 343). పార్టీ విచా రణలో ఆయన చేసిన యీ ప్రకటనను మహాసభ తరువాత ఆయన ప్రవర్తనతోనూ, తన ''ముట్టడి స్థితి''లోని ''మహాసభలో ఇప్పటికే ఆరంభమైన సగం పార్టీ తిరుగుబాటు'' (పేజి 20) అనే మాటలతోనూ పోల్చి చూస్తే బయటపడే రాజకీయ నిలకడను గురించి— ఇది ఎంతో సాధారణం అని మనం అనుకోవాలి—పాఠకుడే తన ఇష్టం వచ్చిన అభిప్రా యాన్ని ఏర్పర్చుకోవచ్చు. కా|మేడ్ మార్తొవ్‌లో కా|మేడ్ అకీమొవ్ పెట్టుకున్న ఆశలు మార్తొవ్‌కున్న క్షణభంగుర సదుద్దేశాలను మించిపోయాయి.

''నీవు జయించావు'' కా|మేడ్ అకీమొవ్!

* * *

* పేజి 342. ఇది కౌన్సిలుకు అయిదవ సభ్యుని ఎన్నికకు ప్రస్తావన. ఇరవై నాలుగు బ్యాలట్ పత్రాలు (మొత్తం నలభై నాలుగు వోట్లలో) పడ్డాయి. వాటిలో రెండు ఎవరికీ వోటు చేయని ఖాళీ పత్రాలు.

''ముట్టడి స్థితి'' అనే అపఖ్యాత పదబంధం ఎంత ''భయంకరమైన మాటో'' తెల్పడానికి — ఇది ఇప్పుడు శాశ్వతంగా విషాదమిళిత సుఖాంత అర్థాన్ని సంతరించుకుంది — మహాసభ ముగింపుకు సంబంధించినవీ, ఎన్నికల తరువాతివీ, పైకి అల్పమైనవిగా కనిపించినా నిజానికి చాలా ముఖ్యమైనవీ అయిన కొన్ని లక్షణాలు ఉపయోగపడవచ్చు. కామ్రేడ్ మార్తొవ్ ఇప్పుడు యీ విషాదమిళిత సుఖాంత ''ముట్టడి స్థితి''ని గురించి ఘనంగా చెప్పుకుంటున్నాడు. తాను స్వయంగా కల్పించిన యీ భూతంలో ''మెజారిటీ పక్షం'' ''మైనారిటీ పక్షా''న్ని పీడించడం, వేటాడడం, బెదిరించి లొంగదీసుకోవడం లాంటి అసాధారణ చర్యలు ఇమిడి వున్నాయని ఆయన తననూ తన పాఠకులనూ కూడా నిజంగానే నమ్మించుతున్నాడు. మహాసభానంతరం వ్యవహారాలు ఎలా వున్నాయో ఇప్పుడే చూద్దాం. కాని మహాసభ ముగింపునే చూడండి. ఎన్నికల అనంతరం ''ఘనిష్ట మెజారిటీ''చే బెదిరించబడి అవమానింపబడి సంహరింపబడుతున్నారని భావించబడిన దురదృష్టవంతులైన మార్తొవ్ అనుయాయులను పీడించకపోగా ఆ ''ఘనిష్ట మెజారిటీ''యే వారికి మినిట్స్ కమిటీలోని మూడు స్థానాలలోనూ రెండు స్థానాలు ఇస్తానని (ల్యాదొవ్ ద్వారా) చెప్పింది (పేజి 354). ఎత్తుగడల గురించిన, ఇతర సమస్యల గురించిన తీర్మానాలను తీసుకోండి (పేజి 355, అటు తర్వాతా) అవి వాటి యోగ్యతలనుపట్టి కేవలం వ్యవహార సరళిలో చర్చింపబడ్డాయనీ, వాటిలో చాలా తీర్మానాలపై సంతకాలు చేసినవారిలో క్రూరమైన ఘనిష్ట ''మెజారిటీ'' ప్రతినిధులూ ''అణచబడిన అవమానించబడిన'' ''మైనారిటీ'' అనుచరులూ కూడా వున్నారనీ మీకు తెలుస్తుంది (మినిట్స్, పేజీలు 355, 357, 363, 365, 367). ఇది మొత్తంమీద ''పనిలో పాల్గొనకుండా చేయడం,'' ''బెదిరించి లొంగదీసుకోడం'' లాగ కనిపిస్తుంది కదూ?

సూత్రానికి సంబంధించిన ఏకైక ఆసక్తిదాయకమైన — కాని దురదృష్టవశాత్తూ చాలా క్లుప్తమైన — వివాదం లిబరల్స్‌పై స్త్రొవేర్ ప్రవేశపెట్టిన తీర్మానం సందర్భంగా రేగింది. దానిమీద సంతకాలను చూస్తే (పేజీలు 357, 358) ''మెజారిటీ''ని బలపర్చేవారిలో ముగ్గురు (బ్రౌన్, ఒర్లోవ్, ఓసిపొవ్) దానికీ, ప్లెహానొవ్ తీర్మానానికీ మధ్యనున్న రాజీలేని వైరుధ్యాన్ని చూడకుండా ఆ రెండింటికీ అనుకూలంగా వోటుచేసినందువల్లనే మహాసభచే అది ఆమోదింపబడిందని తెలుస్తుంది. చూసీ చూడగానే ఈ రాజీలేని వైరుధ్యం కనబడదు, ఎందుచేతనంటే ప్లెహానొవ్ తీర్మానం రష్యాలోని బూర్జువా లిబరలిజంపట్ల అనుసరించవలసిన సూత్రాలు ఎత్తుగడల విషయంలో సాధారణ సూత్రాన్ని రూపొందించి, ఒక నిర్ణీతమైన వైఖరిని వివరిస్తుంది. కాగా స్త్రొవేర్ తీర్మానం ''లిబరల్ లేక లిబరల్ డెమోక్రటిక్ ధోరణుల''తో ''తాత్కాలిక ఒప్పందాలు'' అనుమతించదగినవి అయే నిర్దిష్ట

పరిస్థితులను నిర్వచించడానికి ప్రయత్నిస్తుంది. ఈ రెండు తీర్మానాలలోని విషయాలూ వేరు. కాని స్త్రువేర్ తీర్మానంలో రాజకీయ అస్పష్టత వుంది. పర్యవసానంగా అది అల్పమూ, నిస్సారమూ అవుతుంది. అది రష్యన్ లిబరలిజంయొక్క వర్గ స్వభావాన్ని నిర్వచించదు, అది వెల్లడి అయే నిర్ణీతమైన రాజకీయ ధోరణులను సూచించదు. ఈ నిర్ణీతమైన ధోరణులకు సంబంధించి సాగించవలసిన ప్రచారంయొక్క, ఆందోళనయొక్క ప్రధాన కర్తవ్యాలను గురించి శ్రామికవర్గానికి వివరించదు; దాని అస్పష్టత మూలంగా అది విద్యార్థి ఉద్యమం, "ఒస్వొబొజ్దేనియె" లాంటి వేరు వేరు విషయాలను గజిబిజి చేస్తుంది, "తాత్కాలిక ఒప్పందాలు" అనుమతించతగినవి అయే మూడు నిర్దిష్టమైన షరతులను అతి అల్పబుద్ధితోనూ కుతర్కంతోనూ విధిస్తుంది. చాలా ఇతర సందర్భాలలో లాగనే ఇక్కడ కూడా రాజకీయ అస్పష్టత కుతర్కానికి దారితీస్తుంది. సాధారణ సూత్రం ఏదీ లేకపోవడమూ, "షరతులను" లెక్కపెట్టి చెప్పడానికి ప్రయత్నించడమూ ఫలితంగా యీ షరతులను నిస్సారంగానూ, ఖచ్చితంగా చెప్పాలంటే తప్పుగానూ వివరించడం జరుగుతుంది. స్త్రువేర్ చెప్పే మూడు షరతులను ఒక్కసారి పరిశీలించండి: (1) "నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రష్యన్ సోషల్ డెమోక్రట్లు సాగించే పోరాటంలో దృఢ నిశ్చయంతో వారి పక్షం వహిస్తామని లిబరల్ లేక లిబరల్ డెమోక్రటిక్ ధోరణులు స్పష్టంగానూ అసందిగ్ధంగానూ ప్రకటించాలి." లిబరల్ ధోరణులకూ, లిబరల్ డెమోక్రటిక్ ధోరణులకూ మధ్యవున్న తేడా ఏమిటి? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పే విషయమేదీ ఆ తీర్మానంలో లేదు. లిబరల్ ధోరణులు బూర్జువావర్గంలో రాజకీయంగా కనీస అభ్యుదయకర విభాగాల తరఫుననూ, లిబరల్ డెమోక్రటిక్ ధోరణులు బూర్జువావర్గంలోని, పెటీ బూర్జువావర్గంలోని మరింత అభ్యుదయకర విభాగాల తరఫుననూ మాట్లాడతాయని కాదా? అలా అయితే బూర్జువావర్గంలో కనీస అభ్యుదయకర విభాగాలు (అయినా అభ్యుదయకరమైనవే, ఎందుకంటే అలా కాకపోతే లిబరలిజం గురించిన వూసే వుండదు)" "దృఢ నిశ్చయంతో సోషల్ డెమోక్రట్ల పక్షం వహించ" గలరని కామ్రేడ్ స్త్రువేర్ అనుకో గలడా?? అది అసంబద్ధం. ఒకవేళ అలాంటి ధోరణియొక్క ప్రతినిధులు "స్పష్టంగానూ అసందిగ్ధంగానూ ప్రకటించి" నప్పటికీ (ఇది పూర్తిగా అసంభవమైన వూహ) శ్రామికవర్గ పార్టీ అయిన మనం వారి ప్రకటనలను నమ్మకుండా ఉండడం మన విధి. లిబరల్ అయి వుండి సోషల్ డెమోక్రట్ల పక్షం వహించడం — ఒక దానికొకటి కుదరదు.

అంతేగాక, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా వారు సాగించే పోరాటంలో సోషలిస్టు రివల్యూషనరీల పక్షం వహిస్తామని "లిబరల్ లేక లిబరల్ డెమోక్రటిక్ ధోరణులు" స్పష్టంగానూ అసందిగ్ధంగానూ ప్రకటించే సందర్భాన్ని వూహిద్దాం. అలాంటి వూహకు కామ్రేడ్

స్త్రరోవేర్ చెప్పే దానికంటె ఎక్కువ అవకాశమే వుంటుంది (సోషలిస్టు రివల్యూషనరీల ధోరణిలో వున్న బూర్జువా డెమొక్రటిక్ స్వభావం మూలంగా). ఆయన తీర్మానం అస్పష్టంగానూ కుతర్కంతో కూడినదిగానూ వున్నందువల్ల దానిని బట్టి అనిపించేది ఏమిటంటే అలాంటి సందర్భంలో అలాంటి లిబరల్స్‌తో తాత్కాలిక ఒప్పందాలు అనుమతింపరానివి అవుతాయి. కాని కామ్రేడ్ స్త్రరోవేర్ తీర్మానంనుంచి తప్పనిసరిగా వచ్చే యీ నిర్ధారణ పూర్తిగా తప్పు అవుతుంది. సోషలిస్టు రివల్యూషనరీలతో కూడా తాత్కాలిక ఒప్పందాలు చేసుకోవచ్చు (దానిని గురించి మహాసభ చేసిన తీర్మానం చూడండి), దానిని బట్టి సోషలిస్టు రివల్యూషనరీల పక్షం వహించే లిబరల్స్‌తో కూడా అలాంటివి కుదుర్చుకోవచ్చు.

రెండవ విషయం: ఈ ధోరణులు "తమ కార్యక్రమాలలో కార్మికవర్గంయొక్క లేదా మొత్తంమీద ప్రజాస్వామ్యంయొక్క ప్రయోజనాలకు వ్యతిరేకమైన లేదా వారి రాజకీయ చైతన్యాన్ని మరుగుపర్చేవి అయిన డిమాండ్లను వేటినీ చేర్చకూడదు." ఇక్కడ కూడా మనకు మళ్లీ అదే పొరపాటు కనిపిస్తుంది: తమ కార్యక్రమాలలో కార్మికవర్గ ప్రయోజనాలకు వ్యతిరేకమైన, దాని (శ్రామికవర్గంయొక్క) రాజకీయ చైతన్యాన్ని మరుగుపర్చేవి అయిన డిమాండ్లు చేర్చని లిబరల్ డెమొక్రటిక్ ధోరణులు ఎన్నడూ లేవు, వుండజాలవు. మన లిబరల్ డెమొక్రటిక్ ధోరణిలోని అత్యంత ప్రజాస్వామిక విభాగాలలో ఒకటి అయిన సోషలిస్టు రివల్యూషనరీల విభాగం సహితం తన కార్యక్రమంలో – అన్ని లిబరల్ కార్యక్రమాల లాగనే అది కూడా ఒక గందరగోళం కార్యక్రమమే – కార్మికవర్గ ప్రయోజనాలకు వ్యతిరేకమైన, దాని రాజకీయ చైతన్యాన్ని మరుగుపర్చేవి అయిన డిమాండ్లను ముందుకు తెచ్చింది. దీనినిబట్టి మనం నిర్ధారణ చేయవలసింది ఏమిటంటే "బూర్జువా విమోచనోద్యమంయొక్క సంకుచితత్వాన్నీ లోపాన్నీ బట్టబయలు చేయడం" ఆవశ్యకం అని, అంతేగాని తాత్కాలిక ఒప్పందాలు చేసుకోకూడదని కాదు.

చివరి విషయం, కామ్రేడ్ స్త్రరోవేర్ మూడవ "షరతు," అది చెప్పబడిన సాధారణ రూపంలో (లిబరల్ డెమొక్రట్లు సార్వత్రిక, సమాన, రహస్య, ప్రత్యక్ష వోటు హక్కును తమ పోరాట నినాదం చేయాలి అనే షరతు), కూడా సరిఅయినది కాదు: పరిమిత వోటు హక్కుతో కూడిన రాజ్యాంగం లేక మొత్తంమీద "తగ్గించిన" రాజ్యాంగం కావాలనేది తమ నినాదం అయిన లిబరల్ డెమొక్రటిక్ ధోరణులతో అన్ని సందర్భాలలోనూ తాత్కాలిక ఒప్పందాలు, పాక్షిక ఒప్పందాలు చేసుకో కూడదనడం అవివేకం అవుతుంది. నిజానికి "ఒస్వొబొజ్దేనియె"వాళ్ల "ధోరణి" సరిగ్గా యీ రకమైనదే, కాని అత్యంత పిరికివారైన లిబరల్సుతో సహితం "తాత్కాలిక ఒప్పందాలను" ముందుగానే నిషేధించడం ద్వారా చేతులు

కట్టివేయడం మార్క్సిజం సూత్రాలకు పొసగనిది అయిన రాజకీయ హ్రస్వదృష్టి అవుతుంది.

క్రోడీకరించి చెప్పాలంటే, కామ్రేడ్స్ మార్తొవ్, అక్సెల్‌రోడ్‌లు కూడా సంతకాలు చేసిన కామ్రేడ్ స్త్రరొవేర్ తీర్మానం ఒక పొరపాటు. తృతీయ మహాసభ దానిని రద్దు చేస్తే వివేకవంతమైన పని చేసినట్టు అవుతుంది. దాని సైద్ధాంతిక ఎత్తుగడల వైఖరిలో రాజకీయ అస్పష్టత వుంది. అది పెట్టిన ఆచరణాత్మక "షరతులలో" కుతర్కం వుంది. అది రెండు సమస్యలను గజిబిజిచేస్తుంది: (1) లిబరల్ డెమొక్రటిక్ ధోరణులన్నిటిలోని "విప్లవ వ్యతిరేక, శ్రామికవర్గ వ్యతిరేక" లక్షణాలను బట్టబయలు చేయడమూ, యీ లక్షణాలతో పోరాటం సాగించవలసిన ఆవశ్యకతా; (2) ఈ ధోరణులతో దేనితోనూ కూడా తాత్కాలిక, పాక్షిక ఒప్పందాలకు షరతులు పెట్టడం. అది చేయవలసిన పని చేయడంలేదు (లిబరలిజంయొక్క వర్గ స్వభావాన్ని విశ్లేషణ చేయడంలేదు), చేయకూడని పని చేస్తుంది ("షరతులు" పెట్టడం). వీలవుతాయని అనుకునే అలాంటి ఒప్పందాలకు నిర్ణీతమైన భాగస్వామి అయినా లేనప్పుడు పార్టీ మహాసభలో తాత్కాలిక ఒప్పందాలకు నిర్దిష్టమైన "షరతులు" తయారు చేయడం మొత్తంమీద అసంబద్ధం అవుతుంది; ఒకవేళ అలాంటి నిర్ణీతమైన భాగస్వాములు ఎవరైనా వున్నప్పటికీ తాత్కాలిక ఒప్పందాలకు "షరతులను" నిర్వచించే పనిని పార్టీ కేంద్ర సంస్థలకు వదలిపెట్టడం వందరెట్లు ఎక్కువ వివేకవంతం అవుతుంది. సోషలిస్టు రివల్యూషనరీ "ధోరణి" విషయంలో మహాసభ ఆ పనే చేసింది (కామ్రేడ్ అక్సెల్‌రోడ్ తీర్మానం చివరిభాగానికి ప్లెహానొవ్ చేసిన సవరణ చూడండి — మినిట్స్, పేజీలు 362, 15).

ప్లెహానొవ్ తీర్మానానికి "మైనారిటీ" పక్షం చెప్పే అభ్యంతరాల విషయానికి వస్తే, కామ్రేడ్ మార్తొవ్ చెప్పిన ఒకే ఒక వాదం ఇది: ప్లెహానొవ్ "ఒకానొక రచయితను బట్టబయలు చేయాలనే పనికి మాలిన నిర్ధారణతో ముగుస్తుంది. ఇది 'ఒక ఈగను చంపడానికి సమ్మెటని ఉపయోగించడం' కాదా?" (పేజి 358). "పనికి మాలిన నిర్ధారణ" అనే తీక్ష్ణమైన మాటలతో దాని నిస్సారత మరుగుపర్చబడిన ఈ వాదం వాగాడంబరతకు మరో మచ్చుతునక. మొదటిది, ప్లెహానొవ్ తీర్మానం, "బూర్జువా విమోచనోద్యమంయొక్క సంకుచితత్వాన్నీ లోపాన్నీ గురించి, ఈ సంకుచితతత్వమూ లోపమూ ప్రదర్శితమైన చోటల్లా, శ్రామికవర్గ దృష్టిలో వాటిని బట్టబయలు చేయడం" గురించి చెబుతుంది. అందుచేత "దృష్టి అంతా ఒకే ఒక లిబరల్‌మీద, స్త్రూవెమీద కేంద్రీకరింపబడవలసి వుంది" అనే కామ్రేడ్ మార్తొవ్ ఉద్ఘాటన (లీగు మహాసభలో, మినిట్స్, పేజి 88) పూర్తిగా అర్థరహితం. రెండవది, రష్యన్ లిబరల్స్‌తో తాత్కాలిక ఒప్పందాలకు గల అవ

కాశం సందేహాస్పదంగా వున్నప్పుడు స్ట్రూవెని "ఈగ"తో పోల్చడం ఒక ప్రాథమికమైన ప్రస్ఫుటమైన రాజకీయ వాస్తవాన్ని ఒక చురుకైన మాటకు బలిచేయడమే అవుతుంది. కాదు, స్ట్రూవె ఒక ఈగ కాదు. రాజకీయంగా ఆయనొక ఘనుడు. వ్యక్తిగతంగా ఆయన ఘనమైన వ్యక్తి అయి వున్నందువల్ల కాదు, చట్టవ్యతిరేక ప్రపంచంలో రష్యన్ లిబరలిజానికి — బాగా శక్తివంతమైన సంఘటితమైన లిబరలిజానికి — ఏకైక ప్రతినిధిగా ఆయనకున్న స్థానాన్ని బట్టి. అందుచేత స్ట్రూవెనీ, "ఒస్వొబొజ్దేనియె"నూ మనసులో పెట్టుకోకుండా రష్యన్ లిబరల్సును గురించీ, వారి పట్ల మన పార్టీ వైఖరి ఎలా వుండాలనే విషయం గురించీ మాట్లాడడం, విషయం చెప్పకుండా మాట్లాడడమే అవుతుంది. లేదా, రష్యాలో ఈనాడు "ఒస్వొబొజ్దేనియె" ధోరణితో ఏమాత్రమైనా పోల్చదగిన "లిబరల్ లేక లిబరల్ డెమోక్రటిక్ ధోరణిని" ఒక్క దానినైనా కామ్రేడ్ మార్తొవ్ చూపగలడా? ఆయన అందుకు ప్రయత్నించగా చూడటం ఆసక్తిదాయకంగానే వుంటుంది!*

కామ్రేడ్ మార్తొవ్‌ను బలపరుస్తూ కామ్రేడ్ కొస్త్రొవ్ ఇలా అన్నాడు: "కార్మికులకు స్ట్రూవె పేరు తెలియదు." ఈ వాదం పూర్తిగా అకీమొవ్ ఫక్కీలో వుందంటే కామ్రేడ్ కొస్త్రొవ్‌కీ, కామ్రేడ్ మార్తొవ్‌కీ కోపం రాదనుకుంటాను. అది షష్ఠీవిభక్తిలో (సంబంధ బోధక అర్థంలో) శ్రామికవర్గం గురించిన వాదం లాగ వుంది.[40]

స్ట్రూవె పేరు (కామ్రేడ్ ప్లెహానొవ్ తీర్మానంలో స్ట్రూవె పేరుతోపాటు పేర్కొనబడిన "ఒస్వొబొజ్దేనియె" పేరూ) "తెలియని" కార్మికులు ఎవరు? రష్యాలోని "లిబరల్,

---

* లీగు మహాసభలో కామ్రేడ్ ప్లెహానొవ్ తీర్మానానికి వ్యతిరేకంగా కామ్రేడ్ మార్తొవ్ ఈ కింది వాదాన్ని కూడా తీసుకువచ్చాడు: "దానికి ప్రధానమైన అభ్యంతరమూ, యీ తీర్మానంలోని ప్రధానమైన లోపమూ ఏమిటంటే, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా సాగే పోరాటంలో లిబరల్ డెమొక్రటిక్ వర్గాలతో మైత్రికి వెనుకాడకుండా వుండటం మన కర్తవ్యం అనే విషయాన్ని అది పూర్తిగా అలక్ష్యం చేస్తోంది. కామ్రేడ్ లెనిన్ దీనిని మర్తీనొవ్ పోకడ అని అనవచ్చు. ఈ పోకడ కొత్త 'ఇస్క్రా'లో ఇప్పటికే వెల్లడి అవుతోంది" (పేజి 88).

ఇందులో వున్న "ఆణిముత్యాలకు" ఇది నిజంగా అరుదైన ఉపన్యాస భాగం. (1) లిబరల్స్‌తో పొత్తు అనే మాట పూర్తి గజిబిజి. పొత్తును గురించి ఎవరూ చెప్పలేదు, కామ్రేడ్ మార్తొవ్, తాత్కాలిక లేక పాక్షిక ఒప్పందాలను గురించే చెప్పారు. అది పూర్తిగా వేరు విషయం. (2) ప్లెహానొవ్ తీర్మానం నమ్మరాని "పొత్తును" అలక్ష్యంచేసి మొత్తం మీద "మద్దతు"ను గురించి మాత్రమే చెబితే అది దాని మంచిలక్షణాలలో ఒకటే గాని

లిబరల్ డెమొక్రటిక్ ధోరణుల'' గురించి చాలా కొద్దిగా తెలిసిన లేక అసలేమీ తెలియని వారై వుండాలి. అలాంటి కార్మికుల పట్ల మన పార్టీ మహాసభ వైఖరి ఏమై వుండాలి అని ఎవరైనా అడుగుతారు: అది రష్యాలోని ఒకే నిర్ణీతమైన లిబరల్ ధోరణిని గురించి కార్మికులకు తెలియజేయమని పార్టీ సభ్యులను ఆదేశించాలా? లేక రాజకీయాలు తెలియనందువల్ల కార్మికులకు తెలియని పేరును చెప్పకుండా వూరుకోవాలా? కామ్రేడ్ అకీమొవ్ జాడలో ఒక అడుగు వేసిన కామ్రేడ్ క్రొస్తొవ్ మరో అడుగు వేయకుండా వుండాలనుకుంటే ఈ ప్రశ్నకు మొదటి అర్థంలోనే సమాధానం చెబుతాడు. మొదటి అర్థంలో సమాధానం చెప్పిన తరువాత ఆయన వాదం ఎంత నిరాధారమైనదో తెలుసుకుంటాడు. ఏమైనా ప్లెహానొవ్ తీర్మానంలోని ''ప్రూవె,'' ''ఒస్వొబొజ్దేనియె''41 అనే మాటలకు కార్మికుల విషయంలో స్తరొవేర్ తీర్మానంలోని ''లిబరల్, లిబరల్ డెమొక్రటిక్ ధోరణులు'' అనే మాటల కంటె చాలా ఎక్కువ విలువే వుండవచ్చు.

''ఒస్వొబొజ్దేనియె'' ద్వారా తప్ప ఈనాడు రష్యన్ కార్మికునికి ఆచరణలో మన లిబరలిజంయొక్క రాజకీయ పోకడల స్పష్టమైన స్వరూపం ఏదీ తెలియదు. చట్టబద్ధమైన లిబరల్ సాహిత్యం అందుకు పనికి రాదు, ఎందుచేతనంటే అది ఎంతో అస్పష్టమైనది. మనం సాధ్యమైనంత ఓపికతో (సాధ్యమైనంత విస్తృత కార్మిక జనాలలో) ''ఒస్వొబొజ్దేనియె''వాళ్లకు వ్యతిరేకంగా మన విమర్శ అనే ఆయుధాన్ని తిప్పాలి. భవిష్యత్‌లో విప్లవం సంభవించినప్పుడు ఆ విప్లవంయొక్క ప్రజాస్వామిక స్వభావాన్ని తగ్గించేటందుకు ''ఒస్వొబొజ్దేనియె'' పెద్ద మనుషులు తప్పకుండా చేసే ప్రయత్నాలను రష్యన్ శ్రామిక వర్గం నిజమైన విమర్శ అనే ఆయుధాలతో వమ్ము చేయగలందుకు అది అవసరం.

---

ప్రతిఘటనాత్మక, విప్లవాత్మక ఉద్యమాన్ని మనం ''బలపర్చడం'' అనే సమస్యపైన పేర్కొన్న కామ్రేడ్ యెగొరొవ్ ''కలవరపాటు'' తప్పితే తీర్మానాలపై జరిగిన చర్చలూ ఆసక్తిదాయకంగా లేవు; నిజానికి అసలు ఏ చర్చా లేదని చెప్పాలి.

---

లోపం కాదు. (3) ''మర్తినొవ్ పోకడలు'' అంటే ఏమిటో కామ్రేడ్ మార్తొవ్ కొంచెం శ్రమ తీసుకుని వివరించగలడా? ఈ పోకడలకూ అవకాశవాదానికీ గల సంబంధం ఏమిటో ఆయన మనకి చెబుతాడా? ఈ పోకడలకూ నిబంధనావళిలోని మొదటి నిబంధనకూ గల సంబంధాన్ని ఆయన పరిశీలిస్తాడా? (4) ''కొత్త'' ''ఇస్క్రా''లో ''మర్తినొవ్ పోకడలు'' ఎలా ప్రదర్శితమయాయో కామ్రేడ్ మార్తొవ్ చెప్పగా విందామని నేను తహతహలాడుతున్నాను. కామ్రేడ్ మార్తొవ్! దయచేసి నాకీ సందేహ బాధా నివృత్తి చెయ్యండి!

మహాసభ చేసిన నిర్ణయాలను పార్టీ సభ్యులందరూ శిరసావహించాలని అధ్యక్షుడు చేసిన చిన్న హెచ్చరికతో మహాసభ ముగిసింది.

## ఖ) మహాసభలో జరిగిన పోరాటపు సమగ్ర చిత్రణ. పార్టీలోని విప్లవకర, అవకాశవాద పక్షాలు


మహాసభ చర్చలనూ వోటింగునూ గురించిన విశ్లేషణను పూర్తిచేసిన తరువాత, మహాసభ తాలూకు మొత్తం సమాచారం ప్రాతిపదికపై ఈ కింది ప్రశ్నకు సమాధానం చెప్పేటందుకు ఇప్పుడు మనం దానిని క్రోడీకరించాలి. ఆ ప్రశ్న ఇది: ఎన్నికలలో మనం చూసినవీ, కొంతకాలం వరకూ మన పార్టీ ప్రధానమైన చీలికగా తయారై తీరేవీ అయిన కడపటి మెజారిటీ మైనారిటీలుగా ఏర్పడిన వ్యక్తులూ, గ్రూపులూ, రాజకీయ రంగులూ ఏవి? మూల సూత్రానికీ, సిద్ధాంతానికీ, ఎత్తుగడలకూ సంబంధించిన రాజకీయ రంగుల తాలూకు సమాచారాన్నంతటినీ బేరీజు వేయాలి. మహాసభ మినిట్స్‌లో ఆ సమాచారం బోలెడంత వుంది. ఒక సాధారణ ''సారాంశ సంగ్రహం'' లేకపోయినా, మొత్తం మహాసభ అంతటియొక్క, వోటింగులో ప్రధాన గ్రూపింగులు అన్నిటియొక్క సమగ్ర చిత్రణ లేకపోయినా ఈ సమాచారమంతా ఎంత వికలంగానూ, ఎంత అసంబద్ధంగానూ వుంటుందంటే చూసీ చూడగానే ఆయా గ్రూపింగులు ఆకస్మికంగా ఏర్పడ్డాయని అనిపిస్తుంది. అందులో ముఖ్యంగా మహాసభ మినిట్స్‌ను స్వతంత్రంగానూ సమగ్రంగానూ అధ్యయనం చేసే శ్రమ తీసుకోనివారికి అలాగే కనిపిస్తుంది. (ఎంతమంది పాఠకులు ఆ శ్రమ తీసుకున్నారు?)

ఇంగ్లీషు పార్లమెంటరీ నివేదికలలో మనకి తరచుగా "division" – ''చీలిక'' అనే లాక్షణిక పదం కనిపిస్తుంది. ఒక సమస్యపై వోటింగు జరిగినప్పుడు శాసనసభ ఫలానా ఫలానా మెజారిటీ మైనారిటీలుగా ''చీలిపోయింది'' అని అంటారు. మహాసభలో చర్చించబడిన వివిధ సమస్యలపై మన సోషల్ డెమోక్రటిక్ సభలో వచ్చిన ''చీలిక'' పార్టీలోపల జరిగే పోరాటంయొక్క, అభిప్రాయ భేదాలయొక్క, గ్రూపులయొక్క చిత్రాన్ని చూపుతుంది. ఈ రకమైన దానిలో అది అద్వితీయమైనది, సమగ్రతలోనూ కచ్చితత్వంలోనూ అసమానమైనది. ఈ చిత్రాన్ని స్పష్టమైనదిగా చేసేటందుకూ, ఒక దానికొకటి సంబంధంలేని పొందికలేని విడివిడి వాస్తవాల సంఘటనల పోగుగా కాకుండా ఒక నిజమైన చిత్రాన్ని

చూడగల్గేటందుకూ, ఫలానా వోటింగులపై (ఎవరు ఎవరికి అనుకూలంగా వోటు చేశారు? ఎవరు ఎవరిని బలపర్చారు? అనే) అంతులేని అర్థంలేని వాదోపవాదాలను ఆపుచేసేటందుకూ మన మహాసభలో వచ్చిన అన్ని రకాల మౌలిక "చీలికల"నూ ఒక రేఖా చిత్రంగా చూపడానికి ప్రయత్నించాలని నిర్ణయించాను. ఇది చాలా మందికి బహుశా వింతగా కనబడవచ్చు. కాని, ఫలితాలను సాధ్యమైనంత సంపూర్ణమైన కచ్చితమైన విధంగా సాధారణీకరించి సంక్షిప్తం చేసి చూపగల మరో పద్ధతి ఏదైనా వుంటుందా అని నా సందేహం. హాజరుపట్టీ వోటింగు తీసుకోబడిన సందర్భాలలో ఫలానా ప్రతినిధి ఎటు వోటు చేశాడో కచ్చితంగా రూఢి చేసుకోవచ్చు; కొన్ని ముఖ్యమైన సందర్భాలలో హాజరుపట్టీ వోటింగు తీసుకోనప్పుడు ఈ విషయాన్ని మినిట్స్‌ను బట్టి నిర్ణయించవచ్చు. కాని అది నిజానికి రమారమీగా మాత్రమే వుంటుంది, ఎక్కువగా బహుశా అలా జరిగి వుండవచ్చు నన్నదిగానే వుంటుంది. హాజరుపట్టీ వోటింగులు అన్నిటినీనూ, ప్రాముఖ్యంగల సమస్యలపై జరిగిన అన్ని ఇతర వోటింగులనూ (ఉదాహరణకు చర్చల సమగ్రతనూ ఉత్సాహాన్నీ పట్టి నిర్ణయించిన విధంగా) పరిగణనలోకి తీసుకుంటే మన దగ్గర వున్న సమాచారం మేరకు మన అంతరంగిక పార్టీ పోరాటం గురించిన అత్యంత స్థూలమైన చిత్రం మనకు లభిస్తుంది. అలా చేయడంలో ప్రతి వోటింగుయొక్క ప్రతిబింబాన్నీ ఒక ఫొటోగ్రాఫ్ లాగ చూపడం కాకుండా, దాని చిత్రణను అంటే విషయాలను గందరగోళ పరిచేవీ, సాపేక్షంగా అముఖ్యమైనవీ అయిన ప్రత్యేక విషయాలనూ తేడాలనూ వదిలేసి వోటింగులో ప్రధానమైన తరహాలను అన్నింటినీ చూపడానికి ప్రయత్నిద్దాం. ఏమైనా, ఎవరైనా మినిట్స్ సహాయంతో మనం యిచ్చే చిత్రంలో ప్రతి వివరాన్నీ తనిఖీ చేసుకోగల్గుతాడు. ఆయనకు ఇష్టమైన ఏ ప్రత్యేక వోటింగుతోనైనా దానిని పెద్దది చేసుకోగల్గుతారు. ఒక్క మాటలో చెప్పాలంటే వాదించడం ద్వారానూ, సందేహాలు వెలిబుచ్చడం ద్వారానూ, విడివిడి సంఘటనలను ఉదహరించడం ద్వారానూ మాత్రమే గాక, అదే సమాచారం ఆధారంగా వేరొక చిత్రాన్ని చిత్రించడం ద్వారా కూడా దానిని విమర్శించగల్గుతాడు.


వోటింగులో పాల్గొన్న ప్రతి ఒక్క ప్రతినిధినీ ఆ రేఖా చిత్రంలో గుర్తుపెట్టి చూపడంలో మహాసభ చర్చలన్నిటిలోనూ వివరంగా చూపిన నాలుగు ప్రధాన గ్రూపులనూ ప్రత్యేక గీతల ద్వారా సూచించాను. ఆ గ్రూపులు ఇవి: (1) మెజారిటీకి చెందిన "ఇస్క్రా" వాళ్లు; (2) మైనారిటీకి చెందిన "ఇస్క్రా"వాళ్లు; (3) "మధ్యస్థవర్గం"; (4) "ఇస్క్రా" వ్యతిరేకులు. సూత్రం విషయమై యీ గ్రూపుల అభిప్రాయాలలో వున్న తేడాలను మనం అనేక ఉదాహరణలలో చూశాం. వక్రతా ప్రియులకు "ఇస్క్రా" శాఖ గురించీ, "ఇస్క్రా" ధోరణిని గురించీ ఎక్కువగా జ్ఞాపకం చేసే గ్రూపుల పేర్లు

## మహాసభలో జరిగిన పోరాటపు సమగ్ర చిత్రం




ఇందులోని +, − గుర్తులు ఒక్కొక్క సమస్యపై అనుకూలంగానూ, వ్యతిరేకంగానూ పడిన మొత్తం వోట్లను తెలుపుతాయి. పట్టీలకు దిగువన ఇచ్చిన అంకెలు నాలుగు గ్రూపులలోనూ ప్రతి ఒక్క గ్రూపు వేసిన వోట్లను తెలుపుతాయి. పైన యిచ్చిన అ—ఉ పట్టీలలోని వోటింగులో ప్రధాన తరహాలు 160—163వ పేజీలలో వివరించబడ్డాయి.

గ్రూపుల సూచికలు



మెజారిటీ "ఇస్క్రా"వాళ్లు
మైనారిటీ "ఇస్క్రా"వాళ్లు
మధ్యస్థవర్గం
"ఇస్క్రా" వ్యతిరేకులు

ఎవరికైనా ఇష్టం లేకపోతే, పేరు అంత ముఖ్యం కాదని వారికి చెబుతాము. మహాసభలో జరిగిన చర్చలు అన్నిటి ద్వారానూ రాజకీయ రంగులను తెలుసుకున్నాం గనుక ఇది వరకే స్థిరపడిన బాగా పరిచయం అయిన పార్టీ పేర్లకు బదులు (ఇవి కొంతమంది చెవులకు కటువుగా వుంటాయి) గ్రూపుల మధ్యనున్న రాజకీయ రంగుల సారాంశ లక్షణాలను చెప్పడం తేలిక. ఈ మార్పును చేస్తే అదే నాలుగు గ్రూపులకూ యీ కింది పేర్లు వస్తాయి: (1) నికడ అయిన విప్లవ సోషల్ డెమోక్రట్లు; (2) చిన్న అవకాశవాదులు; (3) మధ్యరకం అవకాశవాదులు; (4) పెద్ద అవకాశవాదులు (మన రష్యన్ ప్రమాణాల ప్రకారం పెద్ద). "ఇస్క్రా"వాళ్లు అనే పేరు ఒక "అధ్యయన బృందాన్ని" మాత్రమే తెలియజేస్తుంది గాని ఒక ధోరణిని కాదని ఇటీవల తమ్ము తామూ ఇతరులనూ నమ్మించ బూనుకున్న వారికి యీ పేర్లు తక్కువ బాధాకరంగా వుంటాయని ఆశిద్దాం.

ఈ రేఖా చిత్రంలో యథార్థ వోటింగుల తరహాలను వివరంగా విశదీకరించుదాము. ("మహాసభలో జరిగిన పోరాటపు సమగ్ర చిత్రం" అనే రేఖా చిత్రాన్ని చూడండి — పేజి 159.)

మొదటి తరహా వోటింగు (అ) "ఇస్క్రా" వ్యతిరేకులకూ లేక వారిలో కొంత భాగానికీ వ్యతిరేకంగా "మధ్యస్థవర్గం" "ఇస్క్రా"వాళ్లతో కలిసిన సందర్భాలను తెలియజేస్తుంది. అందులో కార్యక్రమం అంతటి పైనా జరిగిన వోటింగు (కామ్రేడ్ అకీమొవ్ ఒక్కడు మాత్రమే వోటు చేయలేదు, మిగతా అందరూ అనుకూలంగా వోటు చేశారు), సూత్రరీత్యా ఫెడరేషన్‌ను ఖండిస్తూ చేసిన తీర్మానం (అయిదుగురు బుండ్‌వాళ్లు మినహా మిగతా అందరూ అనుకూలంగా వోటు చేశారు); బుండ్ నిబంధనావళిలోని రెండవ నిబంధనపై జరిగిన వోటింగు (అయిదుగురు బుండ్‌వాళ్లు మాకు వ్యతిరేకంగా వోటు చేశారు, అయిదుగురు అంటే, మర్తీనొవ్, అకీమొవ్, బ్రూకెర్, తన రెండు వోట్లతో మాహొవ్ వోటింగులో పాల్గొనలేదు, మిగతా వారందరూ మా పక్షాన వున్నారు), ఈ వోటింగే రేఖా చిత్రం (అ)లో చూపబడింది. అంతే కాదు. "ఇస్క్రా"ను పార్టీ కేంద్ర పత్రికగా ఆమోదించే సమస్యపై జరిగిన మూడు వోటింగులూ కూడా ఈ తరహాకు చెందినవే: సంపాదక వర్గం (అయిదు వోట్లు) వోటింగులో పాల్గొనలేదు, మొత్తం మూడు వోటింగులలోనూ రెండు వోట్లు (అకీమొవ్, బ్రూకెర్) వ్యతిరేకంగా పడ్డాయి. దానికితోడు, "ఇస్క్రా"ను ఆమోదించడానికి గల కారణాలపై జరిగిన వోటింగులో అయిదుగురు బుండ్‌వాళ్లూ, కామ్రేడ్ మర్తీనొవ్ పాల్గొనలేదు.*

---

* బుండ్ నిబంధనావళిలోని రెండవ నిబంధనపై జరిగిన వోటింగు ఎందుకు రేఖా చిత్రంలోకి తీసుకోబడింది? "ఇస్క్రా" గుర్తింపుపై జరిగిన వోటింగులు అంత సంపూర్ణ

ఈ తరహా వోటింగు, చాలా ఆసక్తిదాయకమైన ముఖ్యమైన ప్రశ్నకు అంటే, మహా సభ "మధ్యస్థవర్గం" "ఇస్క్రా"వాళ్లతో కలసి ఎప్పుడు వోటుచేసింది? అనేదానికి సమాధానం యిస్తుంది. కొద్దిమంది మినహా (కార్యక్రమం ఆమోదింపబడినప్పుడు, లేదా కారణాలతో నిమిత్తం లేకుండా "ఇస్క్రా"ను బలపర్చినప్పుడు) "ఇస్క్రా" వ్యతిరేకులు కూడా మాతో కలిసినప్పుడు గాని, లేదా ఒక నిర్ణీతమైన రాజకీయ వైఖరికి ప్రత్యక్ష ఒప్పుదల కాకుండా వుండే ప్రకటన చేసే సమస్యపై గాని మాత్రమే అది మాతో వుంది. ("ఇస్క్రా" చేసిన పార్టీ నిర్మాణ కృషిని గుర్తించడమన్నది ఫలానా గ్రూపులకు సంబంధించి దాని నిర్మాణ విధానాన్ని అమలు జరుపుతామని ఒప్పుకోడం కాదు; ఫెడరేషన్ సూత్రాన్ని నిరాకరించడమన్నది, కామ్రేడ్ మాహోవ్ విషయంలో మనం చూసినట్టుగా, ఫెడరేషన్‌యొక్క ఒక నిర్ణీత ముసాయిదాపై జరిగే వోటింగులో పాల్గొనకుండా వుండేటందుకు ప్రతిబంధకం కాదు.) మొత్తంమీద మహాసభలో గ్రూపింగుల ప్రాముఖ్యం గురించి మాట్లాడినప్పుడు ఈ విషయం అధికారిక "ఇస్క్రా"యొక్క అధికారిక నివేదికలో ఎంత తప్పుగా చెప్ప బడిందో మనం ఇదివరకే చూశాం. అది (కామ్రేడ్ మార్తొవ్ నోటి ద్వారా) "ఇస్క్రా" వ్యతిరేకులు కూడా మాతో కలిసి వోటు చేసిన సందర్భాలను ఉదహరించడం ద్వారా "ఇస్క్రా" వాళ్లకూ "మధ్యస్థవర్గానికీ" మధ్యనున్న తేడాను, నిలకడ అయిన విప్లవకర సోషల్ డెమోక్రట్లకూ అవకాశవాదులకూ మధ్యనున్న తేడాను తక్కువ చేసి మరుగుపరుస్తోంది! జర్మన్, ఫ్రెంచి సోషల్ డెమోక్రటిక్ పార్టీలలోని అవకాశవాదులలో అత్యంత "మితవాద పక్షం" సహితం కార్యక్రమాన్ని మొత్తంగా ఆమోదించడం లాంటి విషయాలకు వ్యతిరేకంగా ఎన్నడూ వోటు చేయలేదు.

రెండవ తరహా వోటింగు (ఆ) నిలకడ అయిన, నిలకడలేని "ఇస్క్రా" అనుయాయులు "ఇస్క్రా" వ్యతిరేకులందరికీ, మొత్తం "మధ్యస్థవర్గా"నికీ వ్యతిరేకంగా కలసి వోటు చేసిన సందర్భాలను తెల్పుతుంది. ఇవి ముఖ్యంగా "ఇస్క్రా" విధానపు నిర్ణీతమైన నిర్దిష్టమైన పథకాలను అమలు జరపడం గురించిన సందర్భాలు, అంటే, మాటలలో మాత్రమే గాక చేతలలో కూడ "ఇస్క్రా"ను గుర్తించే సందర్భాలు. ఆర్గనైజింగు కమిటీ

---

మైనవి కావు. కార్యక్రమంమీదా, ఫెడరేషను సమస్యమీదా జరిగిన వోటింగులు తక్కువ నిర్దిష్టమైన నిర్ణీతమైన రాజకీయ స్వభావం కలిగిన నిర్ణయాలను తెల్పుతున్నాయి. మొత్తంమీద చెప్పాలంటే ఒకే తరహా వోటింగుల పరంపరనుండి ఏదో ఒక వోటింగును ఎంచుకోడం మొత్తం చిత్రంయొక్క ప్రధాన లక్షణాలను ఎంతమాత్రం మార్చదు. అనుగుణమైన మార్పులను చేయడం ద్వారా ఎవరైనా అది చూడవచ్చు.

ఘటన,* పార్టీలో బుంద్ స్థానాన్ని ఎజెండాలో మొదటి అంశంగా చేసే సమస్య, "యూజ్నీ రబోచీ" గ్రూపును రద్దు చేయడం, వ్యవసాయ కార్యక్రమంపై రెండు వోటింగులు, ఆరవదీ, కడపటిదీ, దేశాంతర రష్యన్ సోషల్ డెమోక్రట్ల యూనియన్ ("రబోచెయె దేలో")కి వ్యతిరేకంగా జరిగిన వోటింగులు, అంటే, లీగును విదేశాలలోని ఏకైక పార్టీ శాఖగా గుర్తించడం. ఈ విషయంలో పాత పార్టీ పూర్వపు బృందం సరళీ, అవకాశవాద శాఖల గ్రూపుల ప్రయోజనాలూ, మార్క్సిజం గురించిన సంకుచిత అవగాహనా, విప్లవ కర సోషల్ డెమోక్రసీయొక్క కచ్చితంగా నిలకడ అయిన సూత్రబద్ధమైన విధానానికి వ్యతిరేకంగా పోరాడుతూ వున్నాయి; మైనారిటీకి చెందిన "ఇస్క్రా"వాళ్లు వారి స్వంత బృందం సరళీ, వారి అసంబద్ధత గురించిన ప్రశ్న వచ్చేవరకూ, అనేక సందర్భాలలో, అత్యంత ముఖ్యమైన అనేక వోటింగులలో (ఆర్గనైజింగు కమిటీయొక్క, "యూజ్నీ రబోచీ," "రబోచెయె దేలో"లయొక్క దృక్పథంనుంచి ముఖ్యమైనవి) మా పక్షాన్నే వున్నారు. ఈ తరహా "చీలికలు," మన సూత్రాలను ఆచరణలో పెట్టడానికి సంబంధించిన అనేక సమస్యలపై మధ్యస్థవర్గం "ఇస్క్రా" వ్యతిరేకులతో జతకలిసిందనీ, మనతో కంటె వారితోనే మరింత ఎక్కువ బాంధవ్యాన్ని కనబరిచిందనీ, ఆచరణలో సోషల్ డెమోక్రసీయొక్క విప్లవకర పక్షం వైపు కంటె అవకాశవాద పక్షం వైపుకే ఎక్కువ మొగ్గిందనీ అతి స్పష్టంగా తెలియజేస్తాయి. పేరుకు మాత్రమే "ఇస్క్రా"వాళ్లుగా వుండి "ఇస్క్రా"

---

*ఆ అనే రేఖా చిత్రంలో ఈ వోటింగే చూపబడింది; "ఇస్క్రా"వాళ్లకు 32 వోట్లూ, బుంద్ అనుయాయి తీర్మానానికి 16 వోట్లూ వచ్చాయి. ఈ తరహా వోటింగుల్లో హాజరు పట్టీ వోటింగు ఒక్కటి కూడా లేదు అన్న విషయాన్ని గమనించాలి. వ్యక్తిగత ప్రతినిధులు వోటు చేసిన పద్ధతిని — కానైతే చాలవరకు అలా జరిగి వుండవచ్చు నన్నట్టుగా — రెండు వరుసల సాక్ష్యంతో మాత్రమే నిరూపించవచ్చు: (1) చర్చలలో "ఇస్క్రా"వాళ్ల లోని రెండు గ్రూపుల ప్రతినిధులూ అనుకూలంగానూ, "ఇస్క్రా" వ్యతిరేకుల, మధ్యస్థ వర్గంయొక్క ప్రతినిధులు వ్యతిరేకంగానూ మాట్లాడారు; (2) అనుకూలంగా పడిన వోట్లు ఎల్లప్పుడూ దాదాపు 33కు దగ్గరగా వున్నాయి. మహాసభ చర్చలను విశ్లేషించడంలో వోటింగుతో సంబంధం ఎంత మాత్రం లేకుండా "మధ్యస్థవర్గం" మాకు వ్యతిరేకంగా "ఇస్క్రా" వ్యతిరేకులతో (అవకాశవాదులతో) కలిసిన అనేక సందర్భాలను మేము పేర్కొన్న సంగతి మరచిపోకూడదు. ఆ సమస్యలలో కొన్ని ఇవి: డెమోక్రటిక్ డిమాండ్ల పరమ విలువ, మనం ప్రతిపక్షులను బలపర్చాలా కూడదా అనే సమస్య, కేంద్రీకరణను పరిమిత పరచడం వగైరా.

వాళ్లు అవడానికి సిగ్గుపడేవారు తమ నిజ స్వభావాన్ని బైటపెట్టుకున్నారు. తప్పనిసరిగా సంభవించిన పోరాటంలో చాలా పరుషమైన వాగ్వాదాలు జరిగాయి. అవి ఆ పోరాటంలో బయటపడిన సూత్రబద్ధమైన రాజకీయ రంగుల ప్రాధాన్యతను తక్కువ ఆలోచనాపరుల నుంచీ ఎక్కువ మెత్తని మనసులు గలవారినుంచీ మరుగుపర్చాయి. కాని ఇప్పుడు ఆ పోరాటపు తీవ్రత కొంత తగ్గింది గనుకనూ, వరుసగా జరిగిన తీవ్ర వాగ్వాదాల నిష్పక్షపాతమైన సారాంశంగా మినిట్స్ వున్నాయి గనుకనూ అకీమొవ్‌లతోనూ లీబెర్‌లతోనూ మాహోవ్‌ల యెగోరొవ్‌ల కలయిక యాదృచ్ఛికమైనది కాదనీ కాజాలదనీ కళ్లుమూసుకునే వారు మాత్రమే చూడలేకపోతారు. మార్తొవ్, అక్సెల్‌రోడ్‌లు చేయగలిగిన ఒకే ఒక పని మినిట్స్‌ను సమగ్రంగానూ కచ్చితంగానూ విశ్లేషణ జరుపకుండా వుండటం, లేదా ఇంత ఆలస్యం అయిపోయిన తరువాత అన్ని రకాల పశ్చాత్తాప ప్రకటనల ద్వారా మహాసభలో తమ ప్రవర్తనను చెరిపి వేసుకోడం. పశ్చాత్తాప ప్రకటనలు అభిప్రాయభేదాలనూ రాజకీయాల విషయంలో వున్న భేదాలనూ తొలగించగల్గినట్టు! అకీమొవ్‌తోనూ, బ్రూకెర్‌తోనూ, మర్తీనొవ్‌తోనూ మార్తొవ్ అక్సెల్‌రోడ్‌ల ప్రస్తుత మైత్రి రెండవ మహాసభలో పునరుద్ధరించబడిన మన పార్టీని, మహాసభ జరిగినంతసేపూ "ఇస్క్రా" వ్యతిరేకులతో "ఇస్క్రా"వాళ్లు సాగించిన పోరాటాన్ని మరచిపోయేలాగ చేయగలిగినట్టు!

రేఖా చిత్రం అయిదు భాగాలలో మిగతా మూడు భాగాలలోనూ (ఇ, ఈ, ఉ) కనిపించే మహాసభలోని మూడో తరహా వోటింగుయొక్క ప్రత్యేక లక్షణం ఏమిటంటే, "ఇస్క్రా" వాళ్లలో ఒక చిన్న విభాగం విడిపోయి "ఇస్క్రా" వ్యతిరేకులతో కలిసింది. "ఇస్క్రా" వ్యతిరేకులు ఆవిధంగా విజయం పొందారు (వారు మహాసభలో వున్నంత సేపూ). ఏ కలయికను గురించి విన్నంత మాత్రానసే మార్తొవ్ మహాసభలో ఉన్మత్తపూరితమైన లేఖలు రాయడం మొదలుపెట్టాడో ఆ "ఇస్క్రా" మైనారిటీ "ఇస్క్రా" వ్యతిరేకుల ప్రసిద్ధ కలయికయొక్క పరిణామాన్ని ఏ మాత్రం హెచ్చు తగ్గులు లేకుండా కచ్చితంగా వివరించేటందుకు ఈ తరహా వోటింగులో ముఖ్యమైన మూడు రకాల హాజరుపట్టీ వోటింగులనూ తిరిగి చూపాము. ఇ—పట్టీలో వున్నది భాషల సమానత్వంపై జరిగిన వోటింగు (ఈ సమస్యపై జరిగిన హాజరుపట్టీ వోటింగులు మూడింటిలోనూ చివరిది ఇక్కడ ఇవ్వబడింది. ఎందుకంటే అదే సంపూర్ణమైనది). "ఇస్క్రా" వ్యతిరేకులందరూనూ, మధ్యస్థవర్గం అంతానూ ఒకటిగా మమ్మల్ని వ్యతిరేకించారు; "ఇస్క్రా"వాళ్లలో మెజారిటీనుంచి కొంత మందీ, మైనారిటీనుంచి కొంతమందీ విడిపోయారు. ఏ "ఇస్క్రా"వాళ్లలో ఎవరు మహాసభలోని "మితవాద" అవకాశవాదులతో నిర్దిష్టమైన సుస్థిరమైన కలయికను కుదుర్చుకోగల్గివున్నారో ఇంకా స్పష్టం కాలేదు. తరువాత ఈ—పట్టీలోని తరహా వోటింగు—

ఇది నిబంధనావళిలోని మొదటి నిబంధనపై జరిగిన వోటింగు (దీనిపై జరిగిన రెండు వోటింగులలోనూ ఎక్కువ స్పష్టంగా వున్నదానిని అంటే అందరూ వోటింగులో పాల్గొన్న దానిని తీసుకున్నాము). ఈ కలయిక మరింత దృఢమైన రూపాన్ని పొంది పటిష్టంగా వున్నట్లుంటోంది.* మైనారిటీకి చెందిన "ఇస్క్రా"వాళ్లందరూ ఇప్పుడు అకీమొవ్, లీబెర్ల పక్షాన వున్నారు, మెజారిటీకి చెందిన "ఇస్క్రా"వాళ్ల చాలా కొద్దిమంది మాత్రమే అటున్నారు. వీరు, మా వైపుకు వచ్చిన "మధ్యస్థవర్గం" తాలూకు ముగ్గురికీ, "ఇస్క్రా" వ్యతిరేకులలో ఒకరికీ తుల్యం అవుతారు. వారిలో యాదృచ్ఛికంగా, తాత్కాలికంగా ఒక పక్షంనుండి మరో పక్షానికి ఎవరు వెళ్లుతూ ఉన్నారో, ఎవరు అకీమొవ్లతో సుస్థిర కలయిక కుదుర్చుకొనేందుకు అప్రతిహతమైన శక్తితో వెళ్లుతూ ఉన్నారో ఈ రేఖాచిత్రం ఒక్కసారి చూస్తే తేటతెల్లం అవుతుంది. కడపటి వోటింగు (ఉ – పట్టీలోనిది కేంద్ర పత్రికకు, కేంద్ర కమిటీకి, పార్టీ కౌన్సిలుకు జరిగిన ఎన్నికలు), ఇది పార్టీ మెజారిటీగానూ, మైనారిటీగానూ తుదిగా చీలిపోవడాన్ని తెలియజేస్తుంది. "ఇస్క్రా" మైనారిటీ యావత్తు "మధ్యస్థవర్గం"తోనూ, "ఇస్క్రా" వ్యతిరేకుల అవశేషాలతోనూ పూర్తిగా కలిసిపోవడాన్ని స్పష్టంగా తెల్పుతుంది. అప్పటికి, ఎనిమిదిమంది "ఇస్క్రా" వ్యతిరేకులలోనూ కామ్రేడ్ బ్రూకెర్ మాత్రమే మహాసభలో మిగిలి వున్నాడు (కామ్రేడ్ అకీమొవ్ అప్పటికే ఆయన పొరపాటును ఆయనకి వివరించి చెప్పాడు. ఆయన మార్తొవ్ అనుయాయులలో తన ఉచిత స్థానాన్ని తీసుకున్నాడు). ఏడుగురు అత్యంత "మితవాద" అవకాశవాదుల ఉపసంహరణ మూలంగా ఎన్నికల సమస్య మార్తొవ్కు వ్యతిరేకంగా నిర్ణయించబడింది.**

---

* సూచనలన్నిటినీబట్టి చూస్తే నిబంధనావళిపై జరిగిన మరో నాలుగు వోటింగులూ ఒకే తరహాకు చెందినవి, పేజి 278 – ఫొమీన్కు 27, మాకు 21, పేజి 279 – మార్తొవ్కు 26, మాకు 24; పేజి 280 – నాకు వ్యతిరేకంగా 27, అనుకూలంగా 22; అదే పేజిలో మార్తొవ్కు 24, మాకు 23. ఇవి కేంద్ర సంస్థలకు కో-ఆప్టేషను సమస్యపై జరిగిన వోటింగులు. వీటిని గురించి నేను ఇదివరకే చెప్పాను. హాజరుపట్టీ వోటింగులు లభించలేదు (ఒకటి జరిగింది, కాని అది నమోదు చేసిన రికార్డు పోయింది). బుంద్ వాళ్లు (అందరూ గాని కొందరు గాని) మార్తొవ్ను కాపాడారు అనేది స్పష్టం. ఈ వోటింగుల గురించి మార్తొవ్ చేసిన పొరపాటు ప్రకటనలు (లీగులో) పైన సరిచేయబడ్డాయి.

** రెండవ మహాసభనుంచి ఉపసంహరించుకున్న ఏడుగురు అవకాశవాదులు ఎవరంటే, అయిదుగురు బుంద్వాళ్లు (రెండవ మహాసభ ఫెడరేషన్ సూత్రాన్ని తోసిపుచ్చిన తరువాత పార్టీనుండి బుంద్ ఉపసంహరించుకుంది), ఇద్దరు "రబోచెయె దేలొ"వాళ్లు: కామ్రేడ్

ఇప్పుడు అన్ని తరహాల వోటింగుల వస్తుగత వాస్తవాల సహాయంతో మహాసభ ఫలితాలను క్రోడీకరిద్దాము.

మన మహాసభలో మెజారిటీ ఏర్పడటం ''యాదృచ్ఛికం'' అనే మాటలు చాలా వింటున్నాము. ఇది కామ్రేడ్ మార్తొవ్ ''మరోసారి మైనారిటీలో'' తనకు ఏకైక ఓదార్పుపొందే వాదన. ఒక తాత్పర్యంలో మాత్రమే ఈ మెజారిటీని యాదృచ్ఛికం అనవచ్చునని రేఖా చిత్రం స్పష్టంగా చూపుతోంది. అదేమిటంటే, ''మితవాద'' పక్షానికి చెందిన అత్యంత అవకాశవాదులైన ఏడుగురు ప్రతినిధుల ఉపసంహరణ—అనే తాత్పర్యంలోనే—యాదృచ్ఛికం అయి వుండటం. ఈ ఉపసంహరణ ఏ మేరకు యాదృచ్ఛికమైతే ఆ మేరకే (అంతకు మించి మాత్రం కాదు) మా మెజారిటీ యాదృచ్ఛికం. ఈ ఏడుగురూ ఎవరి పక్షాన వుండి వుండేవారో, వుండి తీరేవారో* సుదీర్ఘమైన వాదనల కంటె ఈ రేఖా చిత్రాన్ని ఒకసారి చూస్తే బాగా తెలుస్తుంది. కాని అసలు ప్రశ్న ఏమిటంటే, ఈ ఏడుగురి ఉపసంహరణ ఎంతవరకు నిజంగా యాదృచ్ఛికం? మెజారిటీయొక్క ''యాదృచ్ఛికత'' గురించి అంత స్వేచ్ఛగా మాట్లాడేవారు యీ ప్రశ్నను వేసుకోడానికి ఇష్టపడరు. అది వారికి అసంతోషకరమైన ప్రశ్న. మన పార్టీలోని వామపక్షీయులు గాకుండా, మితవాద పక్షానికి చెందిన అత్యంత అతివాద ప్రతినిధులు మాత్రమే ఉపసంహరించుకోడం యాదృచ్ఛికమా? నిలకడ అయిన విప్లవకర సోషల్ డెమోక్రట్లు గాకుండా, అవకాశవాదులు మాత్రమే ఉపసంహరించుకోడం యాదృచ్ఛికమా? ఈ ''యాదృచ్ఛిక'' ఉపసంహరణకూ, మహాసభ జరిగినంత కాలమూ అవకాశవాద పక్షానికి వ్యతిరేకంగా సాగిన పోరాటానికీ సంబంధం లేదా? మన రేఖా చిత్రంలో అది ఎంతో స్పష్టంగా తెలియడం లేదా?

మెజారిటీయొక్క యాదృచ్ఛికత గురించి చెప్పబడేదంతా ఏ వాస్తవాన్ని మరుగుపర్చడానికి ఉద్దేశింపబడిందో గ్రహించడానికి మనం మైనారిటీకి చాలా అసంతోషకరమైన ఈ ప్రశ్నలు అడిగితే చాలు. మన పార్టీలో అవకాశవాదంవైపు ఎక్కువగా మొగ్గిన వారితోనే మైనా

---

మర్తినొవ్, కామ్రేడ్ అకీమొవ్. విదేశాలలోని ఏకైక పార్టీ శాఖగా ''ఇస్క్రా'' లీగును మహాసభ గుర్తించిన తరువాత, అంటే, దేశాంతర ''రబోచెయె దేలొ'' రష్యన్ సోషల్ డెమోక్రట్ల యూనియన్ రద్దు చేయబడిన తరువాత, వీరిద్దరూ మహాసభనుంచి వెళ్లిపోయారు. (1907 ప్రచురణకు గ్రంథకర్త రాసిన వివరణ.—సం.)

* మహాసభానంతరం కామ్రేడ్ అకీమొవ్, ఆయనతో అతి సన్నిహితమైన బంధుత్వం కలిగి వున్న వొరొనెజ్ కమిటీ, ''మైనారిటీ'' పట్ల తమ సానుభూతిని స్పష్టంగా వెల్లడించారన్న సంగతి తరువాత చూస్తాం.

రిటీ ఏర్పడింది అనేది నిస్సందేహమైన నిరాక్షేపణీయమైన వాస్తవం. పార్టీలో సైద్ధాంతికంగా అత్యంత తక్కువ నిలకడగల వారితోనూ, సూత్రాలకు సంబంధించిన విషయాలలో అత్యంత తక్కువ దృఢమైన వారితోనూ ఈ మైనారిటీ ఏర్పడింది. మెజారిటీగానూ మైనారిటీగానూ ఏర్పడిన చీలిక సోషల్ డెమోక్రట్లు విప్లవకర పక్షంగానూ అవకాశవాద పక్షంగానూ, ఒక మహీధరంగానూ ఒక జిరోండా[42] గానూ ఏర్పడిన చీలికయొక్క ప్రత్యక్షమైన తప్పని సరిఅయిన కొనసాగింపే. ఇది నిన్ననే వచ్చినదిగాని, రష్యన్ కార్మిక పార్టీలో మాత్రమే వచ్చినదిగాని కాదు. అది రేపే అంతర్థానమై పోదు కూడా.

మన అభిప్రాయభేదాలకు గల కారణాలనూ, వాటిలోని వివిధ దశలనూ విశదీకరించడానికి ఈ వాస్తవం అత్యంత ముఖ్యమైనది. మహాసభలో జరిగిన పోరాటాన్నీ, అది బయట పెట్టిన సూత్రబద్ధమైన రాజకీయ రంగులనూ కాదనడం ద్వారా గానీ, కప్పిపుచ్చడం ద్వారా గానీ యీ వాస్తవాన్ని తప్పించుకోడానికి ప్రయత్నించడం తన మేధోపరమైన రాజకీయపరమైన దివాళాకోరుతనాన్ని కేవలం రుజువు చేసుకోవడం అవుతుంది. ఈ వాస్తవాన్ని కాదని రుజువు చేయాలంటే, మొట్టమొదటిది, మన పార్టీ మహాసభలో జరిగిన వోటింగుల యొక్క, "చీలికల"యొక్క సాధారణ చిత్రం వర్ణింపబడిన దానికి భిన్నమని రుజువు చేయాలి; రెండవది, రష్యాలో "ఇస్క్రా"వాళ్లనీ పేరు పెట్టుకున్న* అత్యంత నిలకడ అయిన విప్లవకర సోషల్ డెమోక్రట్లే మన మహాసభ ఏ సమస్యలపై "చీలిపోయిందో" ఆ సారాంశం విషయంలో తప్పు వైఖరిని తీసుకున్నారని రుజువు చేయాలి. ఏదీ, అలా రుజువు చేయండి చూద్దాం పెద్దమనుషులారా!

సందర్భవశాత్తూ, పార్టీలోని అత్యంత అవకాశవాదులైన, అత్యంత తక్కువ నిలకడ, తక్కువ స్థిరమైన సభ్యులతో మైనారిటీ ఏర్పడిందనే వాస్తవమే, విషయం పూర్తిగా తెలియనివారూ, లేక దానిని గురించి సరిగా ఆలోచించనివారూ మెజారిటీకి చెప్పిన అనేక అభ్యంతరాలకూ, వెలిబుచ్చిన సందేహాలకూ సమాధానం చెబుతుంది. కామ్రేడ్ మార్తొవ్, కామ్రేడ్ అక్సెల్‌రోడ్‌లు చేసిన చిన్న తప్పు, వారు వేరై పోడానికి కారణమని చెప్పడం అల్ప మనస్కత కాదా? అని మమ్మల్ని అడుగుతున్నారు. అవును, పెద్దమనుషులారా, కామ్రేడ్ మార్తొవ్ చేసిన తప్పు చిన్నదే (పోరాటం తీవ్రంగా వున్నప్పుడు మహాసభలో నేను అలా అని చెప్పాను

* కామ్రేడ్ మార్తొవ్‌ను ఉద్దేశించిన గమనిక. "ఇస్క్రా"వాడు అంటే ఒక రాజకీయ ధోరణిని అనుసరించేవాడే గాని ఒక బృందం సభ్యుడు కాదనే విషయాన్ని ఇప్పుడు కామ్రేడ్ మార్తొవ్ మరిచిపోయివుంటే, ఈ విషయంమీద కామ్రేడ్ ట్రాట్స్కీ, కామ్రేడ్ అకీమొవ్‌కి ఇచ్చిన వివరణను మహాసభ మినిట్స్‌లో చదవమని సలహా. మహాసభలో (పార్టీకి

కూడా), కాని యీ చిన్న తప్పు ఎంతో హాని చేయగలదు (చేసింది కూడా), ఎందుకంటే వరుసగా అనేక తప్పులు చేసిన ప్రతినిధులు, వరుసగా అనేక సమస్యలమీద అవకాశవాదం వైపు మొగ్గనూ సూత్రపరమైన అస్థిరతనూ ప్రదర్శించినవాళ్లు, తమ పక్షానికి కామ్రేడ్ మార్తొవ్‌ను లాగివేశారు. కామ్రేడ్ మార్తొవ్, కామ్రేడ్ అక్సెల్‌రోడ్‌లు అస్థిరతను ప్రదర్శించడం వ్యక్తులకు సంబంధించినంతవరకు అముఖ్యమైన విషయమే. కాని, అత్యంత తక్కువ నిలకడ గలవారు అందరూ, "ఇస్క్రా" ధోరణిని పూర్తిగానూ బహిరంగంగానూ వ్యతిరేకించిన లేక దానిని కేవలం మాటలలో సమర్థించి చేతలలో మాటి మాటికీ "ఇస్క్రా" వ్యతిరేకులతో కలిసిన వారు అందరూ ఎంతో గణనీయమైన మైనారిటీగా ఏర్పడ్డారన్న విషయం వ్యక్తిగతమైన విషయం కాదు, పార్టీ విషయం, ఎంత మాత్రం అముఖ్యమైనది కాదు.

వారు వేరైపోవడానికి కారణం "ఇస్క్రా" పాత సంపాదకవర్గంతో కూడిన ఒక చిన్న బృందంలో స్థిరపడిపోయి వున్న బృందం సరళీ, విప్లవాత్మక కూపస్థమండూకతత్వమూ ప్రబలమై వుండటమేనని చెప్పడం అసంగతం కాదా? కాదు, అది అసంగతం కాదు. ఎందుకంటే, మన పార్టీలో మహాసభ జరిగినంత సేపూ అన్ని రకాల బృందం సరళి కోసం పోరాడిన వారందరూ, విప్లవాత్మక కూపస్థమండూకతత్వాన్ని అధిగమించడానికి మొత్తంమీద అశక్తులైన వారందరూ, ఆ చెడుగును సమర్థించడానికీ కాపాడడానికీ కూపస్థమండూకతత్వంయొక్క "చారిత్రక" స్వభావాన్ని గురించీ బృందం సరళిని గురించీ మాట్లాడిన వారందరూ, ఈ వ్యక్తిగత బృందం సరళిని బలపరుస్తూ ముందుకు వచ్చారు. "ఇస్క్రా" సంపాదకవర్గంలోని ఒక చిన్న బృందంలో సంకుచిత బృందం ప్రయోజనాలు పార్టీ ప్రయో

---

సంబంధించి) మూడు "ఇస్క్రా" బృందాలు వున్నాయి: అవి "శ్రమ విమోచన" బృందం, "ఇస్క్రా" సంపాదకవర్గం, "ఇస్క్రా" శాఖ. ఇందులో రెండు బృందాలు తమ్ము తాము రద్దు చేసుకోవాలనే సద్భావాన్ని చూపాయి. మూడవది అలా చేయడానికి తగిన పార్టీ సరళిని చూపలేదు, అందుచేత మహాసభ దానిని రద్దు చేసింది. "ఇస్క్రా" బృందాలలో పెద్దది అయిన "ఇస్క్రా" శాఖకు (ఇందులో సంపాదకవర్గమూ, "శ్రమ విమోచన" బృందం చేరి వున్నాయి) మహాసభలో 16మంది సభ్యులు వున్నారు. వారిలో 11 మందికి మాత్రమే వోటు చేసే హక్కు వుంది. మరో వైపున, ఏదో ఒక "ఇస్క్రా" "బృందంలో" సభ్యత్వం వల్లగాక, ధోరణివల్ల "ఇస్క్రా"వాళ్లు అయిన వారు మహాసభలో, నా లెక్కప్రకారం, 27గురు. వారికి 31వోట్లు వున్నాయి. అందుచేత "ఇస్క్రా"వాళ్లలో సగం కంటె తక్కువ మందే "ఇస్క్రా" బృందాలకు చెంది వున్నారు.

జనాలకంటే ప్రబలమై వున్నాయనే వాస్తవం బహుశా యాదృచ్ఛికమైనదిగా పరిగణింప బడవచ్చు. కాని, ఈ బృందం సరళికి గట్టి మద్దతుగా, సుప్రసిద్ధ వొరోనెజ్ కమిటీయొక్క, అపఖ్యాత సెంట్ పీటర్స్‌బుర్గ్ "కార్మిక సంఘం"[43]యొక్క "చారిత్రక అనుస్యూతి"కి ఏమాత్రం తక్కువ విలువను (ఎక్కువ కాకపోయినా) యివ్వని కామ్రేడ్స్ అకీమొవ్‌లూ, బ్రూకెర్‌లూ; పాత సంపాదకవర్గ "హత్య"కు దుఃఖించినంత తీవ్రంగానూ (అంత కంటె ఎక్కువ కాకపోయినా) "రబోచెయె దేలొ" "హత్య"కు దుఃఖించిన కామ్రేడ్స్ యెగోరొవ్‌లూ, మాహొవ్‌లూ, వగైరా వగైరాలు ముందుకు రావడం మాత్రం యాదృ చ్ఛికం కాదు. అతని మిత్రులను పట్టి ఆ మనిషి ఎటువంటివాడో చెప్పవచ్చు అని సామెత. అలాగే ఒక మనిషియొక్క రాజకీయ రంగు ఏమిటో అతని రాజకీయ మిత్రులను పట్టీ, అతనికి అనుకూలంగా వోటు చేసే వారిని పట్టీ చెప్పవచ్చు.

కామ్రేడ్ మార్తొవ్, కామ్రేడ్ అక్సెల్‌రోడ్‌లు చేసిన చిన్న తప్పు వారికీ మన పార్టీలోని అవకాశవాద పక్షానికి అంతకూ మధ్య ఒక సుస్థిర పొత్తు ప్రారంభ స్థానం అయేటంత వరకూనూ, ఆ పొత్తు ఫలితంగా అది అవకాశవాద ప్రకోపానికీ, "ఇస్క్రా" ఎవరితో అయితే పోరాడిందో వారందరూ పగతీర్చుకోడానికీ దారితీసేటంత వరకూనూ చిన్నదిగానే వుండి వుండేది. వారంతా ఇప్పుడు విప్లవకర సోషల్ డెమొక్రసీకి నిలకడగా కట్టుబడివున్న వారిపై తమ అక్కసును వెళ్లబోసే అవకాశం లభించినందుకు ఎంతో సంతోషిస్తున్నారు. మహా సభానంతర ఘటనల ఫలితంగా కొత్త "ఇస్క్రా"లో మనం చూస్తున్నది సరిగ్గా యీ అవకాశవాద ప్రకోపమూ, అకీమొవ్ బ్రూకెర్‌ల పగసాధింపూ (వొరోనెజ్ కమిటీ ప్రకటించిన కరపత్రం చూడండి*) తమ పాత ఇక్కట్టులు ప్రతిదానికీ జుగుప్సాకరమైన "శత్రువును" ఒక తన్ను తన్నేటందుకు జుగుప్సాకరమైన "ఇస్క్రా"లో చివరకు (చిట్టచివరకు!) అనుమతించబడిన మర్తీనొవ్‌ల ఆనందమూ. ఇదంతా "ఇస్క్రా" "అనుస్యూతి"ని కాపాడే టందుకు గాను "'ఇస్క్రా' పాత సంపాదకవర్గాన్ని పునరుద్ధరించడం" ఎంత ఆవశ్యకమో ప్రత్యేకించి స్పష్టం చేస్తుంది...." (1903 నవంబరు 3న కామ్రేడ్ స్త్రరొవేర్ యిచ్చిన తుది హెచ్చరిక[44]నుంచి ఉదహరిస్తున్నాము).

దానివరకే తీసుకుని చూస్తే మహాసభ (పార్టీ కూడా) అతివాద, మితవాద పక్షాలుగా, విప్లవాత్మక, అవకాశవాద పక్షాలుగా, చీలిపోడంలో భయంకరమైనదీ, ఖండించతగినదీ, అసాధారణమైనదీ ఏదీ లేదు. తద్భిన్నంగా, రష్యన్ డెమొక్రటిక్ ఉద్యమ చరిత్రలో (ఒక్క రష్యన్ డెమొక్రటిక్ ఉద్యమమే కాదు) గత పదేళ్లకాలమూ తప్పనిసరిగానూ నిర్దయా

* ఈ సంపుటంలో పేజీలు 237–240 చూడండి. – సం.

త్మకంగానూ అలాంటి చీలికకు దారితీస్తూ వుంది. మితవాద పక్షం చేసిన కొన్ని అతి చిన్న తప్పుల మూలంగా, (సాపేక్షంగా) చాలా అప్రధానమైన అభిప్రాయభేదాల మూలంగా (పైపైన మాత్రమే చూసే పరిశీలకులకూ కూపస్థమండూక బుద్ధిగలవారికే ఇది ఘోరంగా కనబడవచ్చు) చీలిక ఏర్పడిందనే వాస్తవం మన పార్టీ మొత్తంగా ఒక పెద్ద ముందడుగు వేయడాన్ని తెలియజేసింది. ఇంతకు ముందు మనం ముఖ్యమైన సమస్యలమీద భేదిస్తూ వచ్చాం. అలాంటి సమస్యలు కొన్ని సందర్భాలలో చీలిక రావడాన్ని సహితం సమర్థనీయం చేయవచ్చు; ఇప్పుడు మనం ముఖ్యమైన విషయాలు అన్నిటిమీదా ఒప్పందం కుదుర్చుకున్నాము. అభిప్రాయ భేదాల విషయంలో మాత్రమే తేడాలున్నాయి. వీటిని గురించి మనం వాదించుకోవచ్చు, వాదించుకోవాలి కూడా, కాని దీనిపై విడిపోవడం అసంబద్ధమూ కుర్రతనమూ అవుతుంది. ''ఏమి చేయకూడదు'' అనే ఆసక్తిదాయకమైన వ్యాసంలో కామ్రేడ్ ప్లెహానొవ్ ఈ విషయాన్ని ఎంతో సరిగా చెప్పాడు. ఇప్పుడు మహాసభ తరువాత, మైనారిటీ అరాజక ప్రవర్తన పార్టీని దాదాపు చీలిపోయే స్థితికి తీసుకు వచ్చింది గనుక, పండితమ్మన్యులు ఇలా అని అనడం మనం తరచుగా వినవచ్చు: మహాసభలో ఆర్గనైజింగు కమిటీ ఘటన, ''యుజ్నీ రబోచీ'' గ్రూపును లేక ''రబోచెయె దేలొ''ను రద్దుచేయడం, లేక నిబంధనావళిలోని మొదటి నిబంధన, లేక పాత సంపాదకవర్గాన్ని రద్దుచేయడం లాంటి స్వల్ప విషయాలమీద పోట్లాడుకోడం యోగ్యమైన పనియేనా? ఈ విధంగా వాదించేవారు* వాస్తవంలో పార్టీ వ్యవహారాలలో బృందం సరళి వైఖరిని ప్రవేశపెడుతున్నారు: అరాజకత్వానికీ చీలికలకూ దారితీయకుండా వున్నంత వరకూ, అందరు కామ్రేడ్ల, పార్టీ సభ్యుల ఉమ్మడి సమ్మతిని పొందిన పరిమితుల లోపల వున్నంతవరకూ పార్టీలో అభిప్రాయభేదాల గురించిన పోరాటం తప్పనిసరీ ఆవశ్యకమూ. మహాసభలో మితవాద పక్షానికి వ్యతిరేకంగానూ, అకీమొవ్, అక్సెల్‌రోడ్, మర్తీనొవ్, మార్తొవ్‌లకు వ్యతిరేకంగానూ మనం సాగించిన పోరాటం ఏవిధంగానూ ఆ పరిమితులను దాటలేదు. దీనిని అసందిగ్ధంగా రుజువు చేసిన రెండు వాస్తవాలను జ్ఞాపకం చేసుకుంటే చాలు: (1) కామ్రేడ్స్ మర్తీనొవ్,

* ఈ సందర్భంలో మహాసభలో ''మధ్యస్థవర్గ'' ప్రతినిధులలో ఒకరితో నేను జరిపిన సంభాషణ గురించి జ్ఞాపకం చేయకుండా వుండలేను. ఆయనిలా ఫిర్యాదు చేశాడు: ''మన మహాసభలో బాగా ఉక్కిరిబిక్కిరిచేసే వాతావరణం వుంది! ఈ తీవ్రమైన పోరాటం, ఒకరికి వ్యతిరేకంగా మరొకరు చేసే ఈ ఆందోళన, బాధాకరమైన యీ వాగ్వివాదం, కామ్రేడ్‌లకు తగని యీ వైఖరి, ఏమిటిదంతా!...'' దానికి నేను ఇలా అని సమాధానం చెప్పాను: ''మన మహాసభ ఎంత అద్భుతంగా వుంది! ఇది ఒక స్వేచ్ఛాయుతమైన బహిరంగ

అకీమొవ్‌లు మహాసభనుంచి వెళ్ళిపోడానికి ఉద్యుక్తులైనప్పుడు "అవమానం" జరిగిందనే భావాన్ని తొలగించేటందుకు చేయవలసినదంతా చేయడానికి మే మందరం సిద్ధపడ్డాం; ఇచ్చిన వివరణలు సంతృప్తికరంగా వున్నాయని అంగీకరించి తమ ప్రకటనను ఉపసంహరించుకో వలసిందని వారిని కోరుతూ కామ్రేడ్ ట్రాట్స్కీ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని (32 వోట్లతో) మే మందరం ఆమోదించాము; (2) కేంద్ర సంస్థలకు ఎన్నికల విషయం వచ్చినప్పుడు మహాసభలో మైనారిటీగా వున్న వారికి (లేదా అవకాశవాద పక్షానికి) కేంద్ర సంస్థలు రెండింటి లోనూ మైనారిటీ స్థానాలు ఇవ్వడానికి మేము సిద్ధపడ్డాము: మార్తొవ్‌ను కేంద్ర పత్రిక లోకీ, పొపోవ్‌ను కేంద్ర కమిటీలోకీ తీసుకున్నాము. పార్టీ దృక్పథంనుంచి మేము మరోలా చేయలేకపోయాము. ఎందుకంటే మహాసభకు పూర్వమే రెండు సంస్థలకూ ముగ్గురేసి చొప్పున ఎన్నుకోవాలని నిర్ణయించబడింది. మహాసభలో బైటపడిన అభిప్రాయభేదాలలో తేడా పెద్దది కాకపోతే, ఈ అభిప్రాయభేదాల మధ్య జరిగిన పోరాటంనుంచి మనం వచ్చిన ఆచ రణాత్మక నిర్ధారణ కూడా పెద్దది కాదు: ఈ నిర్ధారణ కేవలం ఇది, ముగ్గురేసి సభ్యులు వుండే రెండు సంస్థలలోనూ మహాసభలో మెజారిటీగా వున్న పక్షానికి మూడింట రెండు స్థానాలు ఇవ్వాలి.

మహాసభలో మైనారిటీ కేంద్ర సంస్థలలో మైనారిటీలో వుండడానికి నిరాకరించడమే ఓడిపోయిన మేధావులను మొదట "సన్నని ఏడుపు"కూ, ఆ తరువాత అరాజకపు మాట లకూ, అరాజకపు చేతలకూ దారి తీయించింది.

ముగింపులో రేఖా చిత్రాన్ని కేంద్ర సంస్థల కూర్పు దృక్పథంనుంచి మరో సారి చూద్దాము. సహజంగానే, అభిప్రాయభేదాల సమస్యకు తోడు ఎన్నికలలో ప్రతినిధులకు ఫలానా వ్యక్తి తగినవాడా కాదా, సమర్థుడా కాదా, వగైరా అనే సమస్య ఎదురైంది. మైనా రిటీ ఇప్పుడు ఈ రెండు సమస్యలనూ గందరగోళపరచేందుకు బాగా అభిముఖంగా వుంది.

---

మైన పోరాటం. అభిప్రాయాలు ప్రకటించబడ్డాయి. రాజకీయ రంగులు బైటపడ్డాయి. గ్రూపులు రూపొందాయి. ఓటింగు జరిగింది. నిర్ణయం తీసుకోబడింది. ఒక దశను దాటాము. ముందుకు నడుస్తున్నాము! నాకు కావలసింది అది! ఇదే జీవితం! అది మీ మేధా వులు చేసే అంతులేని విసుగెత్తించే అధిక ప్రసంగం లాంటిది కాదు. ఆ అధిక ప్రసంగం ఆ సమస్య పరిష్కరింపబడినందువల్ల ఆగదు. మాట్లాడేవారు బాగా అలసిపోయి ఇక ఎంత మాత్రం మాట్లాడలేని స్థితి వచ్చినప్పుడే ఆగుతుంది...."

"మధ్యస్థవర్గా"నికి చెందిన ఆ కామ్రేడ్ సంభ్రమాశ్చర్యాలతో నాకేసి తేరి చూసి భుజాలు ఎగురవేశాడు. మేమిద్దరం మాట్లాడే భాషలు వేరు.

అయినప్పటికీ ఈ రెండూ వేరు వేరు సమస్యలనేది ప్రత్యక్ష సత్యమే. ఉదాహరణకు, కేంద్ర పత్రికకు ప్రథమంగా ముగ్గుర్ని ఎన్నుకోవాలనేది మహాసభకు పూర్వమే మార్తొవ్ అక్సెల్‌రోడ్‌లకూ, మర్తీనొవ్ అకీమొవ్‌లకూ పొత్తు ఏర్పడుతుందని ఎవరూ వూహించి వుండని సమయంలో పథకం వేయబడిందనే సామాన్య విషయంనుంచే అది తెలుస్తుంది. వేరు వేరు ప్రశ్నలకు వేరు వేరు విధంగా సమాధానాలు చెప్పాలి: అభిప్రాయభేదాల సమస్యకు సమాధానం మహాసభ మినిట్స్‌లోనూ, బహిరంగ చర్చలలోనూ ప్రతి ఒక్క సమస్యపైనా జరిగిన వోటింగులోనూ వెతకవలసివుంది. వ్యక్తులు తగినవారా కాదా అన్న సమస్య విషయానికి వస్తే అది రహస్య వోటింగు ద్వారా పరిష్కరింపబడాలని మహాసభలో అందరూ నిర్ణయించారు. మహాసభ యావత్తూ ఏకగ్రీవంగా ఈ నిర్ణయాన్ని ఎందుకు చేసింది? ఈ ప్రశ్న ఎంత ప్రాథమికమైనదంటే దాన్ని వివరించడం వింతగా వుంటుంది. కాని (ఎన్నికలో వోడిపోయినప్పటినుంచీ) మైనారిటీ ప్రాథమిక విషయాలను సహితం మరిచిపో నారంభించింది. పాత సంపాదకవర్గాన్ని సమర్థిస్తూ దాదాపు బాధ్యతారహిత స్థాయిని అందుకున్నంత ఉద్రిక్తమైన ఆగ్రహావేశపరమైన ఉపన్యాసాల పరంపరలను మనం విన్నాము, కాని సంపాదకవర్గంలో ఆరుగురు వుండాలా, ముగ్గురు వుండాలా అన్న విషయంపై మహాసభలో జరిగిన పోరాటంలో ఇమిడివున్న అభిప్రాయభేదాలను గురించి ఏమీ వినలేదు. కేంద్ర కమిటీకి ఎన్నుకోబడిన వ్యక్తుల నిష్ఫలత్వం గురించీ, అయుక్తతను గురించీ, దురుద్దేశాలు వగైరాలను గురించీ అన్ని వైపులనుంచీ సంభాషణలనూ, ప్రలాపాలనూ విన్నాము కాని, కేంద్ర కమిటీలో ప్రాబల్యం కోసం మహాసభలో పోరాడిన అభిప్రాయభేదాలను గురించి ఏమీ వినలేదు. వ్యక్తుల గుణగణాలను గురించీ, చర్యలను గురించీ మహాసభ వెలుపల మాట్లాడటం ప్రలాపించడం అసభ్యమనీ అప్రతిష్ఠాకరమనీ నాకు అనిపిస్తోంది (ఎందుకంటే, ఈ చర్యలలో నూటికి తొంభైతొమ్మిది పార్టీ నిర్మాణానికి సంబంధించిన రహస్యం. వాటిని గురించి పార్టీ అత్యున్నతాధికార సంస్థకు మాత్రమే వెల్లడి చేయాలి). అలాంటి ప్రలాపాల ద్వారా మహాసభ వెలుపల పోరాడటం నా అభిప్రాయంలో అపవాదులు వేయడం అవుతుంది. ఈ మాటలకన్నిటికీ నేను బహిరంగంగా చెప్పగలిగిన ఒకే ఒక సమాధానం మహాసభలో జరిగిన పోరాటాన్ని చూపడం: కేంద్ర కమిటీ తక్కువ మెజారిటీతో ఎన్నుకోబడిందని మీరంటారు. నిజమే, కాని ఈ తక్కువ మెజారిటీలో "ఇస్క్రా" పథకాలను అమలు జరిపేటందుకు మాటలలోగాక చేతలో అత్యంత నిలకడగా పోరాడిన వారందరూ వున్నారు. అందుచేత ఈ మెజారిటీయొక్క నైతిక ప్రతిష్ఠ దాని లాంఛనప్రాయమైన ప్రతిష్ఠ కంటె పోల్చలేనంత ఎక్కువ అయివుండాలి. ఒక ప్రత్యేక "ఇస్క్రా" బృందపు అనుస్యూతి కంటె "ఇస్క్రా" ధోరణి అనుస్యూతిని ఎక్కువ అయినదిగా ఎంచేవారందరి దృష్టిలోనూ

అది ఎంతో ఎక్కువ అవుతుంది. "ఇస్క్రా" విధానాన్ని అమలుజరపడానికి ఏయే వ్యక్తులు తగినవారో నిర్ణయించేటందుకు ఎవరు ఎక్కువ అర్హులు — ఆ విధానం కోసం మహాసభలో పోరాడిన వారా లేక అనేక సందర్భాలలో ఆ విధానానికి వ్యతిరేకంగా పోరాడి తిరోగామిదైన ప్రతిదానినీ, అన్ని రకాల పాత పనికిమాలిన విషయాలనూ, అన్ని రకాల బృందం మనస్తత్వాన్నీ సమర్థించినవారా?

## గ) మహాసభానంతరం.
## రెండు పోరాట పద్ధతులు

మహాసభ చర్చలనూ వోటింగునూ గురించి ఇప్పుడు మనం పూర్తి చేసిన విశ్లేషణ in nuce (ఆరంభదశలో) మహాసభ తరువాత జరిగినదానినంతనూ వాస్తవంగా వివరించుతుంది. కనుక మన పార్టీలోని సంక్షోభంయొక్క తరువాతి దశలను గురించి క్లుప్తంగా చెప్పవచ్చు.

ఎన్నికలకు నిలబడడానికి మార్తోవ్, పొపోవ్‌ల నిరాకరణ పార్టీలో అభిప్రాయభేదాల మధ్య సాగే పోరాటంలో జగడాల వాతావరణాన్ని వెంటనే తెచ్చిపెట్టింది. మహాసభ అయిన మరునాడే కామ్రేడ్ గ్లేబొవ్, ఎన్నుకోబడని సంపాదకులు అకీమొవ్, మర్తీనొవ్‌ల వైపుకు పోడానికి నిజంగానే నిర్ణయించుకోడం నమ్మరాని విషయంగా భావిస్తూ, ఇదంతా ప్రధానంగా కోపం మూలంగానే జరిగిందని చెబుతూ, నాకూ ప్లెహానొవ్‌కూ ఒక సూచన చేశాడు. అదేమిటంటే, ఈ సమస్య శాంతియుతంగా పరిష్కరింపబడాలనీ, కౌన్సిలులో సంపాదక వర్గానికి తగిన ప్రాతినిధ్యం గ్యారంటీ చేయబడుతుందనే షరతుమీద (అంటే, కౌన్సిలులో వుండే ఇద్దరు ప్రతినిధులలోనూ ఒకరు తప్పకుండా పార్టీ మెజారిటీనుంచి తీసుకోబడాలి) నలుగురినీ "కో-ఆప్ట్" చేసుకోవాలనీ. ఈ షరతు ప్లెహానొవ్‌కూ, నాకూ న్యాయమైనదే అనిపించింది. ఎందుకంటే దానికి అంగీకరించడమంటే మహాసభలో జరిగిన పొరపాటును మౌనంగా అంగీకరించడమే, పోరాటానికి బదులు శాంతిని కోరడమే. ఇది అకీమొవ్‌కూ, మర్తీనొవ్‌కూ, యెగోరొవ్‌కూ, మాహొవ్‌కూ కంటె ప్లెహానొవ్‌కూ నాకూ మరింత సన్నిహితంగా వుండాలనే కోరిక. "కో-ఆప్టేషను"కు సంబంధించిన రాయితీ ఆవిధంగా వ్యక్తిగతమైనది అయింది, కోపతాపాలను పోగొట్టి శాంతిని పునరుద్ధరించుతుంది గనుక వ్యక్తిగతమైన రాయితీ ఇవ్వడానికి నిరాకరించడం తగదు. అందుచేత ప్లెహానొవూ నేనూ అందుకు అంగీకరించాము. కాని సంపాదకవర్గంలో మెజారిటీ ఆ షరతును నిరాకరించింది. గ్లేబొవ్

వెళ్లిపోయాడు. తరువాత ఏమి జరుగుతుందోనని మేము వేచిచూశాం: మార్తొవ్ మహాసభలో తాను తీసుకున్న వైఖరికి (మధ్యస్థవర్గపు ప్రతినిధి అయిన కామ్రేడ్ పొపొవ్‌కి వ్యతిరేకంగా తీసుకున్న వైఖరికి) కట్టుబడి వుంటాడా లేక ఆయన ఎవరి అడుగు జాడలనైతే అనుసరించాడో ఆ నిలకడలేని వారిది, చీలిక వైపు మొగ్గిన వారిదే తిరిగి పైచెయ్యి అవుతుందా.

మాకు యీ కింది సమస్య ఎదురైంది: కామ్రేడ్ మార్తొవ్ మహాసభలో తన "కలయిక"ను మిగతావాటితో సంబంధం లేని ఒక విడి రాజకీయ విషయంగా పరిగణించాలని ఎంచుకుంటాడా (si licet parva componere magnis* 1895లో ఫోల్మర్‌తో బేబెల్ కలయిక ఒక విడి ఘటన అయినట్టు) లేక ఈ కలయికను సుస్థిరపర్చుకొనగోరి, మహాసభలో తప్పు చేసినది ప్లెహానొవ్, నేనూ అని రుజువు చేయడానికి ప్రయత్నించి మన పార్టీలో అవకాశవాద పక్షానికి అసలైన నాయకుడు అవుతాడా? మరోవిధంగా చెప్పాలంటే ఈ ప్రశ్నను ఈవిధంగా సూత్రీకరించవచ్చు: ఇది ఒక జగడమా లేక రాజకీయ పార్టీ పోరాటమా? మహాసభ అయిన మర్నాడు అక్కడ వున్న కేంద్ర సంస్థల సభ్యులమైన మా ముగ్గురిలోనూ గ్లేబొవ్ మొదటి పరిష్కారం వైపు ఎక్కువగా మొగ్గాడు. పోట్లాడుకున్న పిల్లలను సఖ్యపర్చడానికి అత్యంత కృషి చేశాడు. కామ్రేడ్ ప్లెహానొవ్ రెండవ పరిష్కారం వైపు ఎక్కువగా మొగ్గాడు. కాని భీష్మించుకుని కూర్చున్నాడు. ఈ సందర్భంలో నేను "మధ్యస్థవర్గం" లేక "ఊబి" పాత్రను వహించి సమ్మతింపజేసే పద్ధతిని ఉపయోగించడానికి ప్రయత్నించాను. సమ్మతింపజేయడానికి జరిగిన వాగ్రూప ప్రయత్నాలను యీనాడు జ్ఞాపకం చేయడం ఎంతో చిక్కు వ్యవహారం అవుతుంది. కామ్రేడ్ మార్తొవ్, కామ్రేడ్ ప్లెహానొవ్‌లు చేసిన చెడ్డ పనిని నేను చేయను. కాని, సమ్మతింపజేసేటందుకు లిఖిత రూపంలో చేసిన ఒక ప్రయత్నంగా "మైనారిటీ" "ఇస్క్రా"వాళ్లలో ఒకరికి నేను రాసిన లేఖనుంచి కొన్ని భాగాలను ఇక్కడ తిరిగి చెప్పడం అవసరం అనుకుంటున్నాను.

> "...సంపాదకవర్గంలో పని జేయడానికి మార్తొవ్ నిరాకరణ, సహకరించడానికి ఆయనా, ఇతర పార్టీ రచయితల నిరాకరణ, కేంద్ర కమిటీలో పని చేయడానికి కొంతమంది వ్యక్తుల నిరాకరణ, బహిష్కరణ లేక సాత్విక ప్రతిఘటన గురించి ప్రచారం చేయడమూ మొదలైనవన్నీ మార్తొవ్, ఆయన మిత్రుల కోరికలకు

* చిన్న విషయాలను పెద్దవాటితో పోల్చవచ్చు ననుకుంటే. — సం.

వ్యతిరేకం అయినా, పార్టీలో చీలికకు తప్పక దారి తీస్తాయి. మార్తొవ్ తన వైఖరికి (మహాసభలో ఆయన అంత దృఢనిశ్చయంతో అవలంబించిన వైఖరికి) కట్టుబడి వున్నా, ఇతరులు అలా వుండరు. నేను చెప్పిన పర్యవసానం తప్పనిసరి అవుతుంది....

''అందుకని నన్ను నేను ఇలా ప్రశ్నించుకుంటున్నాను: వాస్తవంలో దేనిమీద మనం విడిపోతున్నట్టు?... మహాసభలో జరిగిన ఘటనలన్నిటినీ గురించీ, అనుభవాలను గురించీ నేను పర్యాలోచిస్తున్నాను. నేను తరచు విపరీతమైన ఆగ్రహస్థితిలో, ''ఆవేశంతో'' ప్రవర్తించినట్టు గుర్తిస్తున్నాను. ఆ వాతావరణం, ప్రతివర్తనలు, అభ్యంతరాలు, పోరాటం, వగైరాల సహజ ఫలితం అయిన దానిని ఒక తప్పు అని అనవచ్చుననుకుంటే, నా ఆ తప్పును ఎవరి ముందు అయినా సరే అంగీకరించడానికి నేను సిద్ధంగా వున్నాను. కాని, సాధించిన ఫలితాలనూ, ఆవేశపూరిత పోరాటపు పర్యవసానాన్నీ ఎంతో ప్రశాంతతతో పరిశీలిస్తే ఈ ఫలితాలలో పార్టీకి హానికలిగించేదీ, మైనారిటీకి అమర్యాదకరమైనదీ ఏదీ కూడ నాకు కనబడలేదు.

''ఒకరు మైనారిటీలో వుండటం వారికి బాధ కలిగించక మానదు; కాని మేము ఎవరి మీదనైనా ''అపవాదులు వేస్తున్నా'' మనే భావానికీ, ఎవరినైనా అవమానపర్చాలని గాని చిన్నబుచ్చాలని గాని అనుకున్నామనే భావానికీ వ్యతిరేకంగా నేను నిశ్చయంగా అసమ్మతి తెల్పుతున్నాను. అటువంటిది ఏమీ లేదు. రాజకీయ భేదాభిప్రాయాలు ఎదిరి పక్షానికి అవినీతినీ, కుయుక్తినీ, కుట్రనూ ఆపాదించే విధంగా సంఘటనలకు వ్యాఖ్యానం చెప్పేటందుకు దారితీయడాన్ని అనుమతించకూడదు. చీలిక ఆసన్నం అవుతున్న యీ వాతావరణంలో అలాంటివే అనేక యితర మాటలను ఎక్కువ తరచుగా వింటున్నాం. దీనికి అనుమతించకూడదు. ఎందుచేతనంటే అది nec plus ultra* అవివేకం తప్ప మరేమీ కాదు.

ఇదివరకు కొన్ని డజన్ల సార్లు వచ్చినట్టే, మార్తొవ్‌కీ నాకూ రాజకీయ (నిర్మాణపరమైన) అభిప్రాయభేదాలు వున్నాయి. నిబంధనావళిలోని మొదటి నిబంధనపై ఓడిపోయిన నేను, ఇక నాకు (మహాసభకూ) మిగిలిన దాంట్లో ప్రతీకారం కోసం నా శక్తికొలదీ ప్రయత్నించక తప్పలేదు. ఒక వైపున ఖచ్చితంగా ''ఇస్క్రా'' అనుయాయి అయినదైన కేంద్ర కమిటీ కోసమూ; మరో వైపున సంపాదకవర్గంలో ముగ్గురు సభ్యులే వుండేటందుకూ ప్రయత్నించక తప్పలేదు.... ఇష్టమొచ్చినట్టు

* తుది వరకూ. — సం.

గానూ అశ్రద్ధగానూ పని చేసే సంస్థకు బదులుగా అధికారిక సంస్థగా వుండగలి గేదీ ముగ్గురితో కూడిన సంపాదకవర్గం ఒక్కటే నని నేను అనుకుంటున్నాను. వ్యక్తిగత కారణాలతో కోపం వస్తుందనీ, బయటికి పోతారనీ వగైరా భయాలు వేటి తోనూ irrespective* ప్రతి సభ్యుడూ తన పార్టీ దృక్పథాన్ని ఎల్లప్పుడూ ప్రకటించి సమర్థించుకునే నిజమైన కేంద్రంగా వుండవలసింది అది ఒక్కటే.

"మహాసభలో జరిగిన ఘటనల దృష్ట్యా ముగ్గురితో కూడిన సంపాదకవర్గం ఒక రాజకీయ నిర్మాణాత్మక విధానాన్ని న్యాయసమ్మతం చేయడానికి నిస్సందేహంగా ఉద్దేశింపబడింది. అది ఒక విధంగా మార్తొవ్‌కు వ్యతిరేకంగా ఉద్దేశింపబడింది. అందులో సందేహం లేదు. అయితే అందుకు తెగతెంపులు చేయాలా? దాని మూలంగా పార్టీని చీల్చాలా?? ప్రదర్శనల సమస్యపై మార్తొవ్, ప్లెహానొవ్‌లు నన్ను వ్యతి రేకించలేదా? కార్యక్రమం సమస్యమీద మార్తొవూ, నేనూ ప్లెహానొవ్‌ను వ్యతిరే కించలేదా? ప్రతి ముగ్గురిలోనూ ఒకరు ఎల్లప్పుడూ మిగతా ఇద్దరికి వ్యతిరేకంగా లేరా? 'ఇస్క్రా'వాళ్లలో మెజారిటీ, 'ఇస్క్రా' శాఖలోనూ మహాసభలోనూ ఈ మార్తొవ్ విధానంలోని ప్రత్యేక వైఖరి నిర్మాణాత్మకంగానూ రాజకీయంగానూ పొర పాటు అని అనుకున్నప్పుడు ఇదంతా 'కుట్ర' అనీ, 'రెచ్చగొట్టడం' అనీ ఇంకా ఏమోమో అనీ ఆపాదించడానికి ప్రయత్నించడం నిజంగా అర్థరహితం కాదా? ఈ మెజారిటీని 'అధములు' అని తిట్టడం ద్వారా యీ వాస్తవాన్ని తోసిపారెయ్యడం అర్థరహితం కాదా?

"మార్తొవ్ అనుసరించిన విధానం తప్పు అనీ, ఆయనను సరిదిద్దవలసి వుందనీ మహాసభలో 'ఇస్క్రా'వాళ్లలో మెజారిటీ లాగనే నాకు ప్రగాఢ విశ్వాసం వుందని నేను మళ్లీ చెబుతున్నాను. ఇలా సరిదిద్దినందుకు కోపగించడం, దానిని ఒక అవమానంగా పరిగణించడం వగైరా సబబు కాదు. మేము ఎవరిమీదా ఎలాంటి 'అపవాదులూ' వేయలేదు, వేయడం లేదు, పనినుంచి ఎవరినీ తొలగించడమూ లేదు. ఒకరు కేంద్ర సంస్థనుంచి తొలగించబడ్డారు కనుక, చీలికను తీసుకురావడం ఊహాతీతమైన ఉన్మాదం అనిపిస్తోంది నాకు."**

---

* నిమిత్తం లేకుండా. — సం.

** ఈ లేఖ 1903 సెప్టెంబరులోనే (కొత్త కాలెండరు) రాయబడింది. ప్రస్తుత విషయానికి అసందర్భంగా వుంటుందని అనుకున్న భాగాలను వదిలివేశాను. నేను వదిలి

రాతమూలకంగా నేను చేసిన ఈ ప్రకటనలను ఇప్పుడు జ్ఞాపకం చేయడం అవసరమని ఎందుకు అనుకున్నానంటే, ఒక వైపున సంభావ్యమైన (ఉద్రిక్తమైన పోరాటంలో తప్పనిసరివి అయిన) వ్యక్తిగత కోపతాపాలకూ, బాధాకరమైన "ఆవేశంతో కూడిన" విమర్శలు మొదలైన వాటి మూలంగా కలిగే కోపతాపాలకూ, మరోవైపున ఒక నిర్దిష్టమైన రాజకీయ పొరపాటుకూ నిర్దిష్టమైన రాజకీయ విధానానికీ (మితవాద పక్షంతో కలయిక) మధ్య తక్షణమే ఒక విభజన రేఖను గీయాలని మెజారిటీ కోరుతున్నట్టు ఇవి ఖచ్చితంగా రుజువుచేస్తాయి.

మహాసభ అయిన వెనువెంటనే మైనారిటీ ప్రారంభించిన సాత్విక ప్రతిఘటనకు తక్షణమే మేము అది పార్టీని చీల్చడానికి దారితీసే ఒక చర్య అని హెచ్చరించామని ఈ ప్రకటనలు రుజువు చేస్తాయి. పార్టీ పట్ల భక్తివిశ్వాసాలు కలిగివుంటామని మహాసభలో వారు చేసిన ప్రకటనలకు ఈ చర్య పూర్తిగా విరుద్ధమని చేసిన హెచ్చరిక అది. కేవలం కేంద్ర సంస్థలనుంచి తొలగించబడినందుకు (అంటే వాటికి ఎన్నుకోబడలేదని) ఈ చీలిక తీసుకు రాబడుతోంది. ఎందుకంటే ఏ పార్టీ సభ్యునీ పనినుండి తొలగించాలని ఎవరూ ఎప్పుడూ అనుకోలేదు; మన రాజకీయ అభిప్రాయభేదం (అది ఒక తప్పనిసరి అయిన అభిప్రాయ భేదం, మహాసభలో మార్తొవ్ విధానం తప్పా మా విధానం తప్పా అన్నది ఇంకా వివరించబడి నిర్ణయించబడనపుడు) అంతకంతకు ఎక్కువగా ఒక జగడంలోకి వక్రీకరింపబడుతోంది. దానితోపాటు దూషణలు, అనుమానాలు, వగైరా వగైరాలు వస్తున్నాయి అని అవి రుజువు చేస్తాయి.

ఆ హెచ్చరికలు నిష్ప్రయోజనం అయాయి. వారిలో ఏ మాత్రం నిలకడలేని వారిది, పార్టీని ఏ మాత్రం గౌరవించని వారిది పైచెయ్యి అవుతోందని మైనారిటీ ప్రవర్తన తెలియజేసింది. దీని మూలంగా గ్లేబొవ్‌కు చేసిన ప్రతిపాదనకు మేమిచ్చిన సమ్మతిని ప్లెహానొవ్వూ, నేనూ ఉపసంహరించుకోవలసి వచ్చింది. ఎందుచేతనంటే మైనారిటీ తమ చర్యల ద్వారా సూత్రాల విషయంలోనే గాక, పార్టీపట్ల వుండవలసిన కనీస భక్తివిశ్వాసాల విషయంలో కూడా తమ రాజకీయ అస్థిరతను ప్రదర్శించుతూ వున్నప్పుడు, యీ సుప్రసిద్ధ "అనుస్యూతి" గురించి వారు చెప్పే మాటలకు విలువ ఏముంటుంది? కొత్తవీ అధిక

---

వేసినది ముఖ్యమైనది అని అనుకుంటే ఆ చిరునామాదారుడు దానిని తేలికగా సరిచేయవచ్చు. ఈ సందర్భంగా ఒక విషయం చెప్పదలస్తున్నాను. అదేమిటంటే, దానివల్ల ప్రయోజనం వుంటుందనుకుంటే నేను రాసిన ప్రయివేటు లేఖలను వేటినైనా సరే నా ప్రతికక్షులు ప్రచురించవచ్చు.

మవుతున్నవీ అయిన తమ భేదాభిప్రాయాలను నిర్మొగమాటంగా ప్రకటించిన వారు మెజారిటీలో వుండేలాగ పార్టీ పత్రికా సంపాదకవర్గంలోకి ''కో-ఆప్టు'' చేసుకోవాలనే డిమాండు లోని పూర్తి అసంబద్ధతను ప్లెహానొవ్ కంటె ఎక్కువ చమత్కారంగా అపహసించిన వారు మరెవరూ లేరు! కొత్తగా వచ్చిన అభిప్రాయభేదాలను పత్రికలలో, పార్టీ అంతటి దృష్టిలో బయటపెట్టడానికి ముందే కేంద్ర సంస్థలలో వున్న పార్టీ మెజారిటీ దానంతట అదే మైనారిటీగా మారిపోయిన సందర్భం ప్రపంచంలో ఎప్పుడైనా వుందా? అభిప్రాయ భేదాలు ఏమిటో ముందు ప్రకటింపబడాలి. అవి ఎంత ప్రగాఢమైనవో, ఎంత ముఖ్యమైనవో పార్టీ చర్చించాలి. రెండవ మహాసభలో చేసినది తప్పు అని రుజువు అయితే, పార్టీ ఆ తప్పును సరిదిద్దుకోవాలి. ఇప్పటికీ తెలియకుండా వున్న భేదాభిప్రాయాల వంకతో తప్పును సరి దిద్దుకోవాలని డిమాండు చేయటం ఆ డిమాండును చేస్తున్నవారి పూర్తి అస్థిరతనూ, రాజకీయ భేదాభిప్రాయాలను జగడంలో పూర్తిగా ముంచెత్తివేయడాన్నీ, మొత్తంగా పార్టీ పట్లనూ తమ స్వంత నమ్మకాలపట్లనూ వారికున్న అగౌరవభావాన్ని యావత్తునూ తెలియ జేసింది. ఒక సూత్రప్రాయమైన విశ్వాసాలు కలిగివుండి, ఏ సంస్థలో అయితే తమ దృక్ప థాన్ని ప్రవేశపెట్ట దల్చుకున్నారో ఆ సంస్థలో తమకు మెజారిటీ (ప్రయివేటుగా) లభి స్తేనేగాని ఇతరులను ఒప్పించడానికి ప్రయత్నించ నిరాకరించే వ్యక్తులు గతంలో లేరు, ఇక ముందు కూడా ఎవరూ వుండరు.

చివరకు, అక్టోబరు 4న కామ్రేడ్ ప్లెహానొవ్, ఈ అర్థరహిత స్థితిని అంతం చేయ డానికి ఆఖరి ప్రయత్నం చేస్తానని ప్రకటించాడు. పాత సంపాదకవర్గంలోని ఆరుగురు సభ్యులతోనూ కేంద్ర కమిటీ కొత్త సభ్యునితోనూ* కూడిన సమావేశం ఏర్పాటు చేయ బడింది. అందులో కామ్రేడ్ ప్లెహానొవ్, ''మెజారిటీ''కి వున్న రెండు స్థానాలకు పోటీగా ''మైనారిటీ''నుంచి నలుగుర్ని ''కో-ఆప్టు'' చేసుకోవాలనే డిమాండు ఎంత బేసబబో నిరూపిస్తూ మూడు గంటల తరబడి వాదించాడు. మేము ''బెదిరించి లొంగదీసు'' కోవా లనీ, అణచాలనీ, ముట్టడించాలనీ, శిరచ్ఛేదం చేయాలనీ లేక సమాధి చేయాలనీ అనుకుం టున్నామనే భయాలను అన్నిటినీ తొలగించేటందుకూ, మరోవైపున పార్టీ ''మెజారిటీ'' యొక్క హక్కులనూ స్థానాన్నీ కాపాడేటందుకూ గాను వారిలో ఇద్దర్ని కో-ఆప్టు చేసుకుం టామని ప్రతిపాదించాడు. ఇద్దర్ని కో-ఆప్టు చేసుకునే ప్రతిపాదన కూడా నిరాకరించ బడింది.

---

*ఈ కేంద్ర కమిటీ సభ్యుడు[45] మైనారిటీతో అదనంగా మరికొన్ని ప్రయివేటు, సమష్టి సంభాషణలు జరిపాడు. వాటిలో ఆయన అనవసరంగా వ్యాపింపజేయబడుతున్న

అక్టోబరు 6న ప్లెహానొవూ, ''ఇస్క్రా'' పాత సంపాదకులందరికీ ''ఇస్క్రా''కు వ్యాసాలు రాసేవారిలో ఒకడైన కామ్రేడ్ ట్రాట్స్కీకీ ఈ కింది అధికారపూర్వక లేఖను రాశాము:

''ప్రియమైన కామ్రేడ్స్,

'' 'ఇస్క్రా'లోనూ, 'జర్యా'[46]లోనూ పాల్గొనకుండా మీరు ఉపసంహరించుకున్నందుకు తన విచారాన్ని అధికారపూర్వకంగా తెలియజేయడం తన విధియని కేంద్ర పత్రిక సంపాదకవర్గం భావిస్తోంది. పార్టీ రెండవ మహాసభ అయిన వెనువెంటనేనూ, ఆతరువాత చాలా సార్లూనూ సహకరించవలసిందిగా మేము పదేపదే మీకు ఆహ్వానాలు పంపినప్పటికీ మీ దగ్గరనుంచి ఒక్క వ్యాసం కూడా మాకు రాలేదు. పనిలో పాల్గొనకుండా మీరు ఉపసంహరించుకోడానికి తాను ఎంత మాత్రం కారణం కాదని కేంద్ర పత్రిక సంపాదకవర్గం ప్రకటిస్తోంది. వ్యక్తిగతమైన కోపం ఏదీ కూడా పార్టీ కేంద్ర పత్రికలో మీరు పని చేయడానికి ఆటంకం కాకూడదు. అలా కాక మీ ఉపసంహరణ మాతో వున్న అభిప్రాయభేదాలు వేటి వల్లనైనా అయినట్టయితే, మీరు ఆ అభిప్రాయభేదాలను కూలంకషంగా వివరించడం పార్టీకి ఎంతో ప్రయోజనకరమని మేము భావిస్తున్నాము. అంతే కాదు, ఈ అభిప్రాయభేదాల స్వభావాన్నీ, వాటి లోతునూ మేము సంపాదకులుగా వున్న ప్రచురణలలో పార్టీ యావత్తుకూ సాధ్యమైనంత త్వరలో వివరించడం ఎంతో వాంఛనీయమని మేము భావిస్తున్నాము.''*

పాఠకుడు చూస్తున్నట్టుగా, ''మైనారిటీ'' చర్యలకు ప్రధానమైన కారణం వ్యక్తిగతమైన కోపమా లేక పార్టీ పత్రికనూ (పార్టీనీ) కొత్త మార్గంలో నడపాలనే కోరికా,

---

అసంబద్ధపు కట్టుకథలను ఖండించాడు. పార్టీపట్ల తమకున్న విధిని మరచిపోవద్దని విజ్ఞప్తి చేశాడు.

* కామ్రేడ్ మార్తొవ్‌కు రాసిన లేఖలో అదనంగా ఒక పుస్తకం గురించిన ప్రస్తావనా, ఈ కింది వాక్యమూ వున్నాయి: ''చివరకు, పనియొక్క ప్రయోజనం దృష్ట్యా, మీకు మేము మరోసారి ఇలా తెల్పుతున్నాము. మీరు మీ అభిప్రాయాలను పార్టీ అత్యున్నతాధికార సంస్థలో ప్రకటించి సమర్థించుకునేటందుకు మీకు అన్ని అవకాశాలూ కలుగజేసేటందుకుగాను కేంద్ర పత్రిక సంపాదకవర్గంలోకి మిమ్మల్ని కో-ఆప్టు చేసుకునేటందుకు మేము ఇప్పటికీ సిద్ధంగా వున్నాము.''

అదే అయితే, ఖచ్చితంగా ఆ మార్గం ఏమిటో అనేది ఇంతవరకు మనకి స్పష్టంగా తెలియడం లేదు. మీ యిష్టం వచ్చిన ఏ సాహిత్యం సహాయంతోనో లేక ఏ సాక్ష్యం సహాయంతోనో ఈ సమస్యను స్పష్టీకరించేటందుకు ఇప్పటికైనా మీరు ఒక డెబ్భై మంది పండితులను వినియోగించినా, వారు కూడా ఈ చిక్కును విడదీయలేరని నేను అనుకుంటాను. జగడాన్ని ఎప్పుడైనా తీర్చవచ్చునంటే నాకు సందేహం వుంది. ఈ చిక్కు దారాన్ని మీరు కత్తిరించవైనా కత్తిరించాలి లేదా తీసి పక్కన పెట్టివేయాలి.*

అక్టోబరు 6న రాయబడిన యీ లేఖకు సమాధానంగా అక్సెల్‌రోడ్, జసూలిచ్, స్త్రొవేర్, ట్రాట్స్కీ, కొల్‌త్సోవ్‌లు కొద్ది పంక్తులు రాశారు. అది ఏమిటంటే "ఇస్క్రా" పత్రిక కొత్త సంపాదకవర్గం చేతులలోకి పోయింది గనుక, యీ కింద సంతకాలు చేసిన తాము ఆ పత్రిక పనిలో పాల్గొనడం లేదు అని. కామ్రేడ్ మార్తొవ్ తన మనసులో వున్న దానిని మరికొంత ధారాళంగా తెలియజేశాడు. ఆయన మాకు యీ కింది లేఖను రాశాడు:

"రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబరు పార్టీ కేంద్ర పత్రిక సంపాదకవర్గానికి.

"ప్రియమైన కామ్రేడ్స్,

"అక్టోబరు 6న మీరు రాసిన లేఖకు సమాధానంగా ఈ కింది విషయాలను చెప్పదలచాను: ఒకే పత్రికలో కలసి పనిచేయడం విషయంపై మనం జరిపిన చర్చలన్నీ అక్టోబరు 4న కేంద్ర కమిటీ సభ్యుని సమక్షంలో జరిగిన సమావేశం తరువాత ముగిసినట్టుగా నేను భావిస్తున్నాను. కౌన్సిలులో మన 'ప్రతినిధి'గా కామ్రేడ్ లెనిన్‌ను ఎన్నుకోడానికి ఒప్పుకునే షరతుమీద అక్సెల్‌రోడ్, జసూలిచ్, స్త్రొవేర్, నేనూ సంపాదకవర్గంలో చేరాలి అనే మీ ప్రతిపాదనను మీరు ఉపసంహరించుకోవలసివచ్చిన కారణాలు ఏమిటో చెప్పడానికి మీరు ఆ సమావేశంలో నిరాకరించారు. సాక్షుల సమక్షంలో మీ అంతట మీరే చేసిన ప్రకటనలను సూత్రీకరించడానికి ఈ సమావేశంలో మీరు పదే పదే తప్పించుకున్న తరువాత, ప్రస్తుత పరిస్థితులలో 'ఇస్క్రా'లో పనిచేయ నిరాకరించడానికి గల నా కారణాలను ఒక లేఖలో వివరించనవసరం లేదని నేను అనుకుంటున్నాను. అటువంటి అవసరమే వస్తే పార్టీ యావత్తుకూ నేను దీన్ని గురించి వివరంగా విశదపరుస్తాను. సంపాదకవర్గంలోనూ కౌన్సిలులోనూ వుండడానికి నేను అంగీకరించాలని మీరిప్పుడు మరల చేస్తున్న ప్రతి

* కామ్రేడ్ ప్లెహానొవ్ బహుశా దీనికీ మాటలు చేర్చవచ్చు: "ఈ జగడం ప్రారంభించినవారు కోరే ప్రతి డిమాండుసూ తీర్చాలి." ఇది ఎందుకు అసాధ్యమైందో చూద్దాం.

పాదనను నేను ఎందుకు నిరాకరించానో రెండవ మహాసభ మినిట్స్‌నుంచి అప్పటికి పార్టీ యావత్తూ తెలుసుకోగల్గుతుంది....*

ఎల్. మార్తొవ్''

పూర్వపు పత్రాలతో జతచేసి చూస్తే ఈ లేఖ కామ్రేడ్ మార్తొవ్ తన ''ముట్టడి స్థితి''లో ఎంతో శ్రద్ధతో (ఆశ్చర్యార్థకాల, చుక్కల సహాయంతో) దాటవేసిన బహిష్కరణ, నిర్మాణక్రమ భంగము, అరాజకత్వము, చీలికకు సన్నాహాల సమస్యను — అనుమతింపదగిన, అనుమతింపరాని పోరాట పద్ధతుల సమస్యను — నిర్వివాదంగా స్పష్టం చేస్తుంది.

కామ్రేడ్ మార్తొవ్‌నూ, ఇతరులనూ వారికున్న అభిప్రాయభేదాలు ఏమిటో వివరించమని కోరుతున్నారు, ఉన్న గొడవంతా దేనిని గురించో వారి ఉద్దేశాలు ఏమిటో దాపరికం లేకుండా చెప్పమని అడుగుతున్నారు, చిరచిరలాడటం మానివేసి నిబంధనావళిలోని మొదటి నిబంధన విషయంలో చేసిన పొరపాటును (మితవాద పక్షం వైపు మొగ్గడంలో వారు చేసిన పొరపాటుతో దీనికి సన్నిహిత సంబంధం వుంది) ప్రశాంతంగా విశ్లేషణ జరపవలసిందని వారిని ఒప్పిస్తున్నారు. కాని కామ్రేడ్ మార్తొవ్, ఆయన అనుయాయులూ సంభాషణలు జరపడానికి నిరాకరిస్తున్నారు. ''మమ్మల్ని ఒత్తిడిచేస్తున్నారు. మమ్మల్ని బెదిరిస్తున్నారు!'' అని అరవడం మొదలుపెట్టుతున్నారు. ''భయంకరమైన మాటలను'' గురించిన ఎగతాళి ఈ నవ్వు పుట్టించే అరపుల తీవ్రతను తగ్గించలేదు.

మీతో కలసి పనిచేయడానికి నిరాకరించేవారిని ఒత్తిడిచేయడం ఎలా సాధ్యం? కామ్రేడ్ మార్తొవ్‌ను మేము అడిగాము. మైనారిటీగా వుండటానికి నిరాకరించే మైనారిటీని అవమానించడమూ, బెదిరించడమూ, అణచడమూ ఎలా సాధ్యమౌతుంది? మైనారిటీలో వుండటం వల్ల ఆవశ్యకంగానూ తప్పనిసరిగానూ కొన్ని ఇబ్బందులు వుంటాయి. ఆ ఇబ్బందులు ఏమిటంటే, కొన్ని సమస్యలపై ఎక్కువ వోట్లతో నిన్ను ఓడగొట్టే సంస్థలో నైనా చేరాలి లేదా ఆ సంస్థకు దూరంగా వుండి దానిపై దాడి అయినా చేయాలి. తత్ఫలితంగా సునిశితమైన విమర్శలకు గురికావాలి.

''ముట్టడి స్థితి''ని గురించిన కామ్రేడ్ మార్తొవ్ కేకల అర్థం, మైనారిటీలో వున్న వారు అన్యాయంగానూ విశ్వాసఘాతుకంగానూ ఎదిరించబడటం లేదా పాలించబడటం జరుగుతోందనా? అలాంటి ప్రకటనలో మాత్రమే ఏకొంచెమైనా అర్థం వుండి వుండవచ్చు

* అప్పుడు పునర్ముద్రింపబడుతున్న తన పుస్తకం గురించిన ప్రస్తావనకు మార్తొవ్ యిచ్చిన సమాధానాన్ని నేను ఇందులో ఇవ్వలేదు.

(మార్తొవ్ దృష్టిలో), అందుకనే, నేను మళ్లీ చెబుతున్నాను, మైనారిటీలో వుండటం వల్ల ఆవశ్యకంగానూ తప్పనిసరిగానూ కొన్ని ఇబ్బందులు వుంటాయి. కాని ఈ విషయంలో వున్న తమాషా అంతా ఏమిటంటే, కామ్రేడ్ మార్తొవ్ మనతో మాట్లాడటానికి నిరాకరించినంత కాలమూ ఆయనతో ఎంత మాత్రమూ పోరాడలేము! మైనారిటీ తాము మైనారిటీగా వుండటానికి నిరాకరించినంత కాలమూ వారిపై పరిపాలన ఎంత మాత్రమూ సాగించలేము!

ప్లెహానొవ్, నేనూ కేంద్ర పత్రిక సంపాదకవర్గంలో వుండగా అది తన అధికారాలను దాటిపోయిందని గాని, దుర్వినియోగపర్చిందని గాని చూపే ఒక్క వాస్తవాన్ని అయినా కామ్రేడ్ మార్తొవ్ ఉదహరించలేకపోయాడు. అలాగే మైనారిటీకి చెందిన కార్యకర్తలు కూడా కేంద్ర కమిటీ విషయంలో అలాంటి వాస్తవాన్ని ఒక్కదానిని అయినా ఉదహరించలేకపోయారు. కామ్రేడ్ మార్తొవ్ తన "ముట్టడి స్థితి"లో ఇప్పుడు ఎన్ని మెలికలు తిరిగినా ముట్టడి స్థితిని గురించిన కేకలు "సన్నని ఏడుపు" తప్ప మరేమీ కాదనేది మాత్రం పూర్తిగా నిర్వివాదమైన విషయం.

మహాసభచే నియమింపబడిన సంపాదకవర్గానికి వ్యతిరేకంగా కామ్రేడ్ మార్తొవ్, ఆయన అనుయాయులూ ఎంత అర్థరహితమైన వాదనలు తెస్తున్నారో, "మేము కట్టు బానిసలం కాము!" అని వారన్న వూతపదంలో బాగా తెలుస్తుంది ("ముట్టడి స్థితి," పేజి 34). ప్రజా సంఘాలకూ, సామూహిక క్రమశిక్షణకూ అతీతులైన "ఉన్నత వ్యక్తుల"లో తానొకడుగా ఎంచుకునే బూర్జువా మేధావి మనస్తత్వం ఇందులో అత్యంత స్పష్టంగా వెల్లడి అవుతుంది. "కట్టు బానిసలం కాము" అని చెప్పడం ద్వారా పార్టీలో పనిచేయడానికి తమ నిరాకరణకు అర్థం చెప్పడం అంటే, తమ్ము తాము పూర్తిగా బైటపెట్టుకోడమూ, తమ కింక వాదాలు ఏమీ లేవని ఒప్పుకోడమూ అవుతుంది, తమ అసంతృప్తికి ఎలాంటి ప్రేరణలనూ, ఎలాంటి సహేతుకమైన కారణాలనూ బొత్తిగా చూపలేకపోవడం అవుతుంది. మేము చేసిన ఏ పనివల్లనూ కూడా వారి నిరాకరణ సమర్థనీయం కాదని ప్లెహానొవ్, నేనూ ప్రకటిస్తున్నాము; తమకున్న అభిప్రాయభేదాలు ఏమిటో వివరించమని మేము వారిని కోరుతున్నాము, వారిచ్చే సమాధానం అంతా "మేము కట్టు బానిసలం కాము" అనే (కో-ఆప్టేషను విషయమై ఇంకా బేరం ఏదీ కుదరలేదు అని దానికి మరో మాట జతచేస్తున్నారు).

అవకాశవాద వాదనలవైపూ, అరాజక పదజాలంవైపూ తన ఉన్ముఖతను బైటపెడుతూ నిబంధనావళిలోని మొదటి నిబంధనపై జరిగిన వాదోపవాదాలలో ఇదివరకే ప్రదర్శితమైన మేధావి వ్యక్తిత్వానికి శ్రామికవర్గపు ప్రతి సంఘపు నిర్మాణమూ క్రమశిక్షణా కట్టు బానిసత్వం లాగ కనిపిస్తుంది, ఈ "పార్టీ సభ్యుల," ఈ పార్టీ "కార్యనిర్వాహకుల" దృష్టిలో

మరో పార్టీ మహాసభ సహితం ఒక కట్టుబానిస సంఘం అవుతుందనీ, ''ఉన్నత వ్యక్తులకు'' అది ఘోరమూ అసహ్యకరమూగా వుంటుందనీ పాఠకులు త్వరలోనే తెలుసుకుంటారు.... పార్టీ హోదాను ఉపయోగించుకోడానికి విముఖులు కానివారూ, అయితే తాము పెట్టు కునే యీ హోదా పార్టీ ప్రయోజనాలకూ, పార్టీ సంకల్పానికీ అనుగుణం కాదు అని ఎరిగి వున్న వారూ అయిన వారికి ఈ ''సంస్థ'' నిజంగా ఘోరమైనదే.

కొత్త ''ఇస్క్రా'' సంపాదకవర్గానికి నేను రాసిన లేఖలో వివరించబడినవీ, కామ్రేడ్ మార్తొవ్‌చే ఆయన ''ముట్టడి స్థితి''లో ప్రచురించబడినవీ అయిన కమిటీ తీర్మానాలు, మైనారిటీ ప్రవర్తన అంతా మహాసభ నిర్ణయాలను కేవలమూ ఉల్లంఘించడమూ, క్రియా శీలమైన ప్రత్యక్ష కార్యకలాపాలను పాడుచేయడమూ అవుతుందని వాస్తవంగా రుజువుచేస్తు న్నాయి. అవకాశవాదులతోనూ, ''ఇస్క్రా''ను ద్వేషించే వారితోనూ కూడివున్న మైనారిటీ పార్టీని విచ్ఛిన్నం చేసింది, దాని కార్యకలాపాలను పాడు చేసి అస్తవ్యస్తం చేసింది. మహా సభలో తమకు సంభవించిన వోటమికి ప్రతీకారం జరపడానికి తహతహలాడారు. రెండవ మహాసభలో తమపై ఆరోపించబడిన అవకాశవాదం, మేధావి అస్థిరత అనే నిందలను ఖం డించడంలో న్యాయమైన వినయ విధేయతతో కూడిన పద్ధతులతో (తమ వాదాన్ని పత్రిక లలో గాని, మహాసభలో గాని వివరించడంతో) తాము ఎన్నటికీ విజయం పొందలేమని గ్రహించి వారీ పనికి పూనుకున్నారు. పార్టీని ఒప్పించలేమని గ్రహించి వారు పార్టీని అస్త వ్యస్తం చేయడం ద్వారానూ, దాని కార్యకలాపాలన్నిటికీ ప్రతిబంధకాలను కల్పించడం ద్వారానూ తమ లక్ష్యాలను సాధించడానికి ప్రయత్నించారు. వారు (మహాసభలో తమ తప్పుల ద్వారా) మన పాత్రను బీటలువారజేశారని మందలిస్తే, దానికి సమాధానంగా వారు తమ శక్తినం తనూ వినియోగించి ముందే బీటలు దీసిన పాత్రను పూర్తిగా ముక్కలు ముక్కలు చేయ డానికి ప్రయత్నించారు.

వారి భావాలు ఎంత వికృతం అయాయంటే బహిష్కరణా, పని చేయడానికి నిరాక రించడమూ ''న్యాయమైన''* పోరాట ''పద్ధతులు''గా ప్రకటించబడ్డాయి. ఇప్పుడు కామ్రేడ్ మార్తొవ్ సున్నితమైన యీ అంశంచుట్టూనే తిరుగాడుతున్నాడు. కామ్రేడ్ మార్తొవ్ ఎలాంటి ''సూత్రబద్ధమైన మనిషి'' అంటే, మైనారిటీచే అవలంబించబడి నప్పుడు బహిష్కరణను సమర్థిస్తాడు. కాని తన పక్షం మెజారిటీ అయినప్పుడు, బహిష్క రణ మార్తొవ్‌కే ప్రమాదకరం అయినప్పుడు దానిని ఖండిస్తాడు!

---

* గనుల ప్రాంతం గురించిన తీర్మానం (''ముట్టడి స్థితి,'' పేజి 38).

సోషల్ డెమోక్రటిక్ కార్మికుల పార్టీలో న్యాయమైన పోరాట పద్ధతులు ఏమిటనే విషయంలో ఇది జగడమా లేక "సూత్రబద్ధమైన అభిప్రాయ భేదమా" అనే సమస్యను మనం విశ్లేషించనవసరం లేదని అనుకుంటాను.

---

"కో-ఆప్టేషన్"పై గొడవను ప్రారంభించిన కామ్రేడ్స్‌నుంచి సమాధానం రాబట్టడానికి చేసిన ప్రయత్నాలు (అక్టోబరు 4న, 6న చేసిన ప్రయత్నాలు) విఫలం అయిన తరువాత, కేంద్ర సంస్థలు చేయగల పని అంతా పోరాటంలో వినయ విధేయమైన పద్ధతులకు కట్టుబడివుంటామని వారు నోటిమాటగా చేసిన వాగ్దానాలు ఏమౌతాయోనని వేచి చూడడం తప్ప మరేమీ లేదు. అక్టోబరు 10వ తేదీన కేంద్ర కమిటీ, లీగుకు (లీగు మినిట్స్, పేజీలు 3–5 చూడండి) ఒక సర్క్యులర్ లేఖను పంపింది. అందులో తానిప్పుడు లీగు నిబంధనావళి ముసాయిదాను తయారు చేస్తున్నాననీ, ఆ పనిలో సహకరించవలసిందనీ లీగు సభ్యులను ఆహ్వానించింది. అప్పుడు లీగు కార్యనిర్వాహకవర్గం ఆ సంస్థ మహాసభను జరపడానికి వ్యతిరేకంగా (2–1 వోట్లతో – లీగు మినిట్స్, పేజి 20) నిర్ణయించింది. ఈ సర్క్యులర్ లేఖకు మైనారిటీని బలపర్చేవారు ఇచ్చిన సమాధానం, మహాసభ నిర్ణయాలకు తాము విధేయతతో కట్టుబడి వుంటామని చేసిన సుప్రసిద్ధ వాగ్దానం వట్టి మాటేననీ, నిజానికి పార్టీ కేంద్ర సంస్థలకు లోబడకూడదని మైనారిటీ గట్టిగా నిర్ణయించుకున్నదనీ, సహకరించవలసిందిగా చేసే విజ్ఞప్తులకు కుతర్కంతోనూ అరాజక పదజాలంతోనూ కూడిన దొంగ సాకులను చెప్పదలచుకుందనీ వెంటనే వెల్లడించింది. లీగు కార్యనిర్వాహక వర్గ సభ్యుడు డేయ్‌చ్ రాసిన అఖ్యాత బహిరంగ లేఖకు (పేజి 10) ప్లెహానొవ్, నేనూ, మెజారిటీని బలపర్చే ఇతరులూ ఇచ్చిన సమాధానంలో మా తీవ్ర అసమ్మతిని తెలియజేశాము. మేమిలా రాశాము: "పార్టీ క్రమశిక్షణను మొరటుగా ఉల్లంఘించడానికి అసమ్మతి తెల్పుతున్నాము. దాని ద్వారా లీగు కార్యనిర్వాహక సభ్యుడు పార్టీ సంస్థ నిర్మాణాత్మక కార్య కలాపాలకు అవరోధం కలిగిస్తున్నాడు. తన లాగే ఇతర కామ్రేడ్స్‌ను కూడా క్రమశిక్షణనూ, నిబంధనావళినీ ఉల్లంఘించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాడు. 'కేంద్ర కమిటీ ఆహ్వానం మీద, అలాంటి పనిలో నేను పాల్గొన జాలను' అనీ, 'కామ్రేడ్స్, దానిని (కేంద్ర కమిటీని) ఏ పరిస్థితులలోనూ లీగుకు నిబంధనావళిని తయారు చేయడానికి అనుమతించకూడదు' వగైరా అంటూను ఆయన చేసిన ప్రకటనలు, పార్టీ, సంస్థా నిర్మాణమూ, పార్టీ క్రమ శిక్షణ అనే మాటలకు గల అర్థం ఏమాత్రం తెలిసి వున్న వారిలోనైనా ఆగ్రహం మాత్రమే కలిగించే ప్రచార పద్ధతులు. కొత్తగా ఏర్పాటు చేయబడిన పార్టీ సంస్థకు వ్యతిరేకంగా

ఉపయోగించబడుతున్న మూలంగా, అవి నిస్సందేహంగా కా(మేడ్స్‌లో ఆ సంస్థపట్ల విశ్వాసాన్ని చెడగొట్టడానికి జరిగే (ప్రయత్నాలై ఉండడమూ, దీనికితోడు అవి లీగు కార్యనిర్వాహకవర్గ సభ్యుడనే అధికార ము(ద్రతో కేం(ద్ర కమిటీ పరోక్షంలో ఉపయోగించబడుతున్న మూలంగా ఇలాంటి పద్ధతులు మరింత సిగ్గుచేటైనవి అవుతాయి'' (పేజి 17).

అలాంటి పరిస్థితులలో లీగు మహాసభ ఒక జగడం తప్ప మరేమీ కాలేదు.

ఆరంభంనుంచీ కా(మేడ్ మార్తొవ్ మహాసభలో తాను అనుసరించిన ''వ్యక్తిగత వ్యవహారాలలో జోక్యం'' ఎత్తుగడలను కొనసాగించాడు, ఈ సారి కా(మేడ్ ప్లెహానొవ్‌పైన, ఆయన (ప్రయివేటు సంభాషణలను వ(క్రించి చెప్పడం ద్వారా చేశాడు. కా(మేడ్ ప్లెహానొవ్ ఆక్షేపణ తెల్పాడు, బాధ్యతా రహితంగానో, కోపంతోనో చేసిన నిందారోపణలను కా(మేడ్ మార్తొవ్ ఉపసంహరించుకోక తప్ప లేదు. (లీగు మినిట్స్, పేజీలు 39, 134.)

నివేదిక విషయం వచ్చింది. పార్టీ మహాసభలో నేను లీగు (ప్రతినిధిగా వున్నాను. నా నివేదికను సం(గహంగా చూస్తే చాలు (పేజి 43, తదుపరి పేజీలు) పాఠకునికి, మహాసభ వోటింగులను గురించిన విశ్లేషణ చిత్తును ఇచ్చినట్టు తెలుస్తుంది. అదే మరింత వివరంగా యీ పుస్తకం అయింది. ఆ నివేదికలోని (ప్రధానాంశం ఏమిటంటే, మార్తొవ్, ఆయన అనుయాయులూ తాము చేసిన తప్పుల మూలంగానే మన పార్టీలోని అవకాశవాద పక్షంలోకి పోయారని రుజువు చేయడం. తీ(వమైన వ్యతిరేకులు మెజారిటీగా వుండివున్న (శోతలకు యీ నివేదిక యివ్వబడినప్పటికీ, పార్టీ పోరాటంలోనూ వివాదంలోనూ అనుమతించదగని పద్ధతులను వేటినీ అందులో వారు కనుగొన లేకపోయారు.

తద్భిన్నంగా, మార్తొవ్ నివేదిక, నా నివేదికలోని కొన్ని (ప్రత్యేక అంశాలకు చిన్న ''సవరణలు'' మినహా (ఈ సవరణలు సరి అయినవి కావని పైన చూపాము) ఉ(ద్రిక్త (ప్రలాపం తప్ప మరేమీ కాదు.

ఈ వాతావరణంలో పోరాటాన్ని సాగించడానికి మెజారిటీ నిరాకరించడంలో ఆశ్చర్యం లేదు. కా(మేడ్ ప్లెహానొవ్ ''రభస''కు (పేజి 68) — నిజానికి అది ఒక ''రభసే''! — తన ఆక్షేపణను తెల్పి, ఆ నివేదిక సారాంశంపై తాను ఇదివరకే తయారు చేసిన అభ్యంతరాలను చెప్పకుండానే మహాసభనుంచి వెళ్లిపోయాడు. మెజారిటీని బలపర్చే ఇతరులు దాదాపు అందరూ కూడ, కా(మేడ్ మార్తొవ్ ''అసభ్య (ప్రవర్తనకు'' రాతపూర్వకమైన ఆక్షేపణను యిచ్చిన తరువాత మహాసభనుంచి వెళ్లిపోయారు (లీగు మినిట్స్, పేజి 75).

మైనారిటీ అవలంబించిన పోరాట పద్ధతులు అందరికీ కొట్టవచ్చినట్లు కనపడ్డాయి. మహాసభలో మైనారిటీ రాజకీయ పొరపాటు చేసిందనీ, అవకాశవాదం వైపు పోయిందనీ, బుంద్‌వాళ్లతోనూ, అకీమొవ్‌లతోనూ, (బూకెర్‌లతోనూ, యెగోరొవ్‌లతోనూ, మాహొవ్

లతోనూ పొత్తు కలిసిందనీ మేము నిందారోపణ చేశాము. మహాసభలో మైనారిటీ ఓడిపోయింది. ఇప్పుడది రెండు పోరాట పద్ధతులను, అంతులేని దాని పలురకాల ముట్టడులూ, దాడులూ, దండయాత్రలూ వగైరాలు అన్నీ కలిపి, ''రూపొందించింది.''

మొదటి పద్ధతి—పార్టీ కార్యకలాపాన్ని అంతటినీ అస్తవ్యస్తం చేయడం, పార్టీ పనిని చెడగొట్టడం ''కారణాలు చెప్పకుండా'' అన్నిటినీ, ప్రతి దాన్నీ ఆటంకపర్చడం.

రెండవ పద్ధతి—''రభస''ను రేపడం... వగైరా, వగైరా.*

ఈ ''రెండవ పోరాట పద్ధతి,'' లీగుయొక్క అపఖ్యాతికర ''సూత్రబద్ధమైన'' తీర్మానాలలో కూడ కనిపిస్తుంది. వీటిపై జరిగిన చర్చలలో ''మెజారిటీ'' సహజంగానే పాల్గొనలేదు. కామ్రేడ్ మార్తొవ్ తన ''ముట్టడి స్థితి''లో పునర్ముద్రణచేసిన యీ తీర్మానాలను పరిశీలిద్దాము.

కామ్రేడ్స్ ట్రాట్స్కీ, ఫోమీన్, డేయ్చ్, తదితరులూ సంతకాలు చేసిన మొదటి తీర్మానంలో పార్టీ మహాసభలోని ''మెజారిటీ''కి వ్యతిరేకంగా ఉద్దేశించిన రెండు ప్రధానాంశాలున్నాయి: (1) '''ఇస్క్రా' పాత విధానానికి సారభూతంగా వ్యతిరేకం అయిన ధోరణులు మహాసభలో వ్యక్తం అవడం మూలంగా, పార్టీ నిబంధనావళిని తయారు చేయడంలో కేంద్ర కమిటీ స్వాతంత్ర్యానికీ అధికారానికీ తగిన రక్షణలను కల్పించేటందుకు తీసుకోవలసినంత శ్రద్ధ తీసుకొనబడలేదని లీగు తన ప్రగాఢ విచారాన్ని ప్రకటించుతోంది'' (లీగు మినిట్స్, పేజి 83).

''సూత్రబద్ధమైన'' యీ అంశం అకీమొవ్‌యొక్క వాగాడంబరం లాంటిదే తప్ప మరేమీ కాదని మనం ఇదివరకే చూశాం. దాని అవకాశవాద స్వభావాన్ని పార్టీ మహాసభలో కామ్రేడ్ పొపోవ్ సహితం బయటపెట్టాడు! నిజానికి, ''మెజారిటీ'' కేంద్ర కమిటీయొక్క స్వాతంత్ర్యాన్నీ, అధికారాన్నీ రక్షించ దలచలేదనడం ఉబుసుపోని మాట తప్ప మరేమీ కాదు. ఒక విషయం చెబితే చాలు. సంపాదకవర్గంలో ప్లెహానొవ్వూ, నేనూ వున్నప్పుడు కౌన్సిలులో

---

* వలసవాద, ప్రవాస కాలనీల వాతావరణంలో ఎంతో మామూలు అయిన జగడాలకు, అవి ఎంత హీనమైన రూపంలో బైటపడినా, క్షుద్రమైన దురుద్దేశాలను అంటకట్టడం అవివేకం అవుతుందని నేను ఇదివరకే పేర్కొన్నాను. అది ఒక రకమైన అంటువ్యాధి, అసాధారణ జీవిత పరిస్థితుల మూలంగానూ, నరాల అస్వస్థత వగైరాల మూలంగానూ అది కలుగుతుంది. ఈ పోరాట పద్ధతియొక్క నిజమైన చిత్రాన్ని నేనిక్కడ ఇవ్వవలసి వచ్చింది ఎందుచేతనంటే కామ్రేడ్ మార్తొవ్ తన ''ముట్టడి స్థితి''లో మొత్తంగా ఆ పోరాట పద్ధతికి తిరిగి ఉపక్రమించాడు.

కేంద్ర కమిటీపై కేంద్ర పత్రిక ప్రాబల్యం లేదు. కాని మార్తొవ్ అనుయాయులు సంపాదకవర్గంలో చేరినప్పుడు కౌన్సిలులో కేంద్ర కమిటీపై కేంద్ర పత్రిక ప్రాబల్యాన్ని సంపాదించింది! మేము సంపాదకవర్గంలో వున్నప్పుడు విదేశాలలో నివసించే రచయితలపై కౌన్సిలులో రష్యాలోని కార్యకర్తల ప్రాబల్యం వుండేది; మార్తొవ్ అనుయాయులు దాన్ని కైవసం చేసుకున్నప్పటినుంచీ వ్యవహారం తద్భిన్నంగా వుంది. మేము సంపాదకవర్గంలో వున్నప్పుడు, కౌన్సిలు ఏ ఆచరణాత్మక వ్యవహారంలోనూ జోక్యం కలుగజేసుకోడానికి ఎన్నడూ ఒక్కసారి కూడా ప్రయత్నించలేదు; ఏకగ్రీవ కో-ఆప్టేషను జరిగినప్పటినుంచీ అలాంటి జోక్యం ఆరంభమైంది. పాఠకులు దీనిని గురించి వివరంగా త్వరలోనే తెలుసుకుంటారు.

మనం పరిశీలించుతున్న తీర్మానంలోని రెండవ అంశానికి వద్దాము: ''...పార్టీ అధికారిక కేంద్ర సంస్థలను ఏర్పాటు చేసేటప్పుడు, ఇప్పుడుంటున్న కేంద్ర సంస్థల అనుస్యూతిని కొనసాగించవలసిన అవసరాన్ని మహాసభ నిర్లక్ష్యం చేసింది....''

ఈ అంశంయొక్క సారాంశం కేంద్ర సంస్థలలో వ్యక్తుల కూర్పు సమస్య తప్ప మరేమీ కాదు. మహాసభలో పాత కేంద్ర సంస్థలు తమ అనర్హతను రుజువు చేసుకున్నాయనీ, అనేక తప్పులను చేశాయనే వాస్తవాన్ని దాటవేయడం మేలని ''మైనారిటీ'' ఎంచింది. కాని అన్నిటిలో అత్యంత హాస్యాస్పదమైనది ఏమిటంటే ఆర్గనైజింగు కమిటీ విషయంలో ''అనుస్యూతి''ని గురించి ప్రస్తావించడం. ఆర్గనైజింగు కమిటీలోని సభ్యులను అందర్నీ ధ్రువపరచాలని మహాసభలో ఎవరూ సూచననైనా చేయలేదన్న సంగతిని మనం చూశాం. ఆర్గనైజింగు కమిటీలో ముగ్గురు సభ్యుల జాబితా తనకు అపఖ్యాతికరమైనదని మహాసభలో మార్తొవ్ కోపంతో నిజంగా అరిచాడు. మహాసభలో ''మైనారిటీ'' ప్రతిపాదించిన తుది జాబితాలో ఆర్గనైజింగు కమిటీకి చెందిన ఒక సభ్యుడు మాత్రమే వున్నాడు (పొపోవ్, గ్లెబొవ్, లేక ఫొమీన్, ట్రాట్స్కీ), కాని ''మెజారిటీ'' ప్రతిపాదించిన జాబితాలో ముగ్గురిలోనూ ఆర్గనైజింగు కమిటీకి చెందిన ఇద్దరు సభ్యులున్నారు (త్రవీన్‌స్కీ, వసీల్యెవ్, గ్లెబొవ్). ''అనుస్యూతి'' గురించిన ఈ ప్రస్తావన ''సూత్రబద్ధమైన అభిప్రాయ భేదంగా'' నిజంగా పరిగణింపబడగలదా? అని మేము అడుగుతున్నాము.

కామ్రేడ్ అక్సెల్‌రోడ్ నాయకత్వాన పాత సంపాదకవర్గంలోని నలుగురు సభ్యులు సంతకాలు చేసిన మరో తీర్మానాన్ని తీసుకుందాం. ఇందులో ''మెజారిటీ''కి వ్యతిరేకంగా చేయబడిన ముఖ్యమైన నిందారోపణలు అన్నీ వున్నాయి. తరువాత ఇవి పత్రికలలో చాలాసార్లు పునరుద్ఘాటించబడ్డాయి. సంపాదకవర్గ సభ్యులచే సూత్రీకరించబడిన రూపంలో వాటిని అత్యంత సులువుగా పరిశీలించవచ్చు. ఈ నిందారోపణలు ''పార్టీ నిరంకుశ బ్యూరా

క్రటిక్ నిర్వహణ పద్ధతి''కి ''బ్యురాక్రటిక్ కేంద్రీకరణ''కు వ్యతిరేకంగా చేయబడ్డాయి. ఈ బ్యురాక్రటిక్ కేంద్రీకరణ ''నిజమైన సోషల్ డెమొక్రటిక్ కేంద్రీకరణ''కు విభిన్నమైనదిగా యీవిధంగా నిర్వచింపబడింది: అది ''ఆంతరంగిక ఐక్యతను గాక కేవలం యాంత్రికమైన పద్ధతుల ద్వారానూ, వ్యక్తిగత చొరవను, స్వతంత్రమైన సామాజిక కార్యకలాపాన్నీ ఒక క్రమపద్ధతిలో అణచివేయడం ద్వారానూ సాధింపబడి కొనసాగింపబడుతున్న బాహిరమైన, లాంఛనప్రాయమైన ఐక్యతను, ముందుంచుతుంది;'' అందుచేత అది ''స్వభావసిద్ధంగానే సమాజంలోని భాగాలను ఒకటిగా ఐక్యపర్చజాలదు.''

ఇక్కడ కామ్రేడ్ అక్సెల్‌రోడ్ అండ్ కంపెనీ ఏ ''సమాజం'' గురించి ప్రస్తావిస్తున్నారో భగవంతుడికే తెలియాలి. కామ్రేడ్ అక్సెల్‌రోడ్ వాంఛనీయమైన ప్రభుత్వ సంస్కరణల విషయంమీద జేమ్‌స్త్వో[47] విజ్ఞప్తిని రాస్తున్నాడో లేక ''మైనారిటీ'' ఫిర్యాదులను వెళ్లగక్కుతున్నాడో ఆయనకే స్పష్టంగా తెలియనట్టు కనిపిస్తోంది. అసంతృప్తి చెందిన ''సంపాదకులు'' గోలచేస్తున్న పార్టీలోని ''నిరంకుశత్వం'' అనే మాటలోని *అంతరార్థం* ఏమిటి? నిరంకుశత్వం అంటే, ఒక వ్యక్తియొక్క సర్వాధికారయుతమైన, అడ్డూ ఆపూలేని, పూచీలేని, ఎన్నుకొనబడని పరిపాలన అని అర్థం. ''మైనారిటీ'' సాహిత్యాన్నిపట్టి నిరంకుశాధిపతి అంటే వారి ఉద్దేశం *నేనే* కాని మరెవరూ కాదని మనకు అందరికీ బాగా తెలుసు. ఇప్పుడు వివాదంలో వున్న యీ తీర్మానం ముసాయిదా రాయబడి ఆమోదింపబడినప్పుడు నేను ప్లెహానొవ్‌తో పాటు కేంద్ర పత్రికలో వున్నాను. అందుకని ప్లెహానొవూ, కేంద్ర కమిటీలోని సభ్యులందరూనూ చేయవలసిన పనియొక్క ప్రయోజనాలను గురించిన తమ స్వంత అభిప్రాయాలను అనుసరించి గాక, నిరంకుశాధిపతి అయిన లెనిన్ *అభీష్టాన్ని* అనుసరించి ''పార్టీని పరిపాలిస్తున్నారు'' అనే తమ అభిప్రాయాన్ని కామ్రేడ్ అక్సెల్‌రోడ్, ఆయన సహచరులూ వ్యక్తపరుస్తున్నారు. నిరంకుశ పరిపాలన అనే ఈ ఆరోపణలో తప్పకుండా ఇమిడివున్న అర్థం, నిరంకుశాధిపతి తప్ప పాలక సంస్థలో వున్న సభ్యులందరూ మరొకరి చేతులలో కేవలం పరికరాలనీ, ఇతరుల అభీష్టానికి బంటులూ ఏజెంటులూ అనీ ప్రకటించడమే. మేము మరోసారి అడుగుతున్నాము: అత్యంత గౌరవనీయుడైన కామ్రేడ్ అక్సెల్‌రోడ్‌కి మట్టుకు ఇది నిజంగా ''సూత్రబద్ధమైన అభిప్రాయభేదమేనా''?

అంతే గాక, దేని నిర్ణయాలైతే న్యాయసమ్మతమైనవని తాము యధావిధిగా గుర్తించారో ఆ పార్టీ మహాసభనుంచి ఇప్పుడే తిరిగివచ్చిన మన ''పార్టీ సభ్యులు'' మాట్లాడుతున్న బాహిరమైన లాంఛనప్రాయమైన ఐక్యత ఏమిటి? ఏమాత్రమైన సుస్థిర ప్రాతిపదికపై సంఘటితపరచబడిన పార్టీలోనైనా పార్టీ మహాసభ మినహా ఐక్యతను సాధించే మరో పద్ధతి ఏదైనా వారికి తెలుసా? తెలిసి వుంటే, తాము పార్టీ రెండవ మహాసభను న్యాయసమ్మత

మైనదిగా ఎంత మాత్రం పరిగణించడం లేదని నిర్మొగమాటంగా ప్రకటించే ధైర్యం వారికి ఎందుకు లేదు? సంఘటితమైనది అనుకోబడే పార్టీలో ఐక్యతను సాధించే కొత్త పద్ధతులనూ తమ కొత్త అభిప్రాయాలనూ మనకి చెప్పడానికి వారు ఎందుకు ప్రయత్నించరు?

అంతేగాక, మన యీ వ్యష్టివాది మేధావులు మాట్లాడుతున్న "వ్యక్తిగత చొరవ అణచివేత" ఏమిటి? పార్టీ కేంద్ర పత్రిక వీరిని తమ అభిప్రాయభేదాలేమిటో వివరించమని ఇప్పుడే ప్రార్థించింది, కాని ఆ పని చేయడానికి బదులు వారు "కో-ఆప్టేషను" గురించి బేరాలాడటంలో నిమగ్నులైవున్నారు. మొత్తంమీద ప్లెహానొవూ, నేనూ లేక కేంద్ర కమిటీ, మాతో కలిసి ఎలాంటి "కార్యకలాపమూ" సాగించడానికి నిరాకరించే వారి చొరవనూ, స్వతంత్ర కార్యకలాపాన్నీ ఎలా అణచివేయగల్గుతాము? ఒక సంస్థలో గాని సమితిలో గాని భాగస్వామిగా నైనా వుండడానికి నిరాకరించేవారిని ఎవరినైనా ఎలా "అణచ"గలరు? ఎన్నుకోబడని సంపాదకులు "పరిపాలించబడటానికి నిరాకరించి" నప్పుడు ఆ "పరిపాలన పద్ధతులను" గురించి వారెలా ఫిర్యాదు చేయగలరు? మన కామ్రేడ్స్ అసలు మా మార్గదర్శకత్వం కిందనే ఎన్నడూ పనిచేయలేదు కనక, వారిని ఆదేశించడంలో మేము ఎలాంటి తప్పులూ చేసివుండజాలము.

యీ అపఖ్యాత బ్యూరాక్రసీ గురించిన అరుపులన్నీ కేంద్ర సంస్థలలోని వ్యక్తుల కూర్పు పట్ల తమకున్న అసంతృప్తికి ఒక ముసుగు మాత్రమేననీ, మహాసభలో తాము యధావిధిగా చేసిన ప్రతినను ఉల్లంఘించడాన్ని కప్పిపుచ్చుకునే అల్ప ప్రయత్నమే నన్నది స్పష్టమైందని నేను అనుకుంటాను. నీవు నా అభీష్టాన్ని అనుసరించి గాక దీనికి వ్యతిరేకంగా మహాసభచే నియమింపబడ్డావు గనుక బ్యూరాక్రటు అవుతావు; నీవు నా అంగీకారంమీద గాక మహాసభ చేసిన లాంఛనప్రాయ నిర్ణయాలను అనుసరించి నీ స్థానం తీసుకున్నావు గనుక లాంఛన ప్రాధాన్యవాది అవుతావు; నీవు పార్టీ మహాసభలో "యాంత్రిక" మెజారిటీని ఉదహరించి, కో-ఆప్టు చేసుకోబడాలనే నా కోరికను మన్నించవు గనుక, కేవలం యాంత్రికంగా పని చేస్తున్నవాడవవుతావు; మహాసభ బృందం సరళిని స్పష్టంగా తోసిపుచ్చడం వారికి ఇష్టంలేదు గనుక తమ బృంద "అనుస్యూతి" కొనసాగాలని పట్టుబట్టే పాత చిన్న జట్టుకు అధికారాన్ని అప్పగించడానికి నిరాకరిస్తున్నావు గనుక నీవు నిరంకుశాధిపతివి అవుతావు.

బ్యూరాక్రసీని గురించిన యీ కేకలకు నేను పేర్కొన్నది తప్ప మరో నిజమైన అర్థం ఏదీ లేదు.* ఈ పోరాట పద్ధతి మైనారిటీయొక్క మేధోపరమైన అస్థిరతను మరోసారి

---

* కామ్రేడ్ ప్లెహానొవ్ లాభకరమైన కో-ఆప్టేషను ప్రతిపాదనను చేసినంతనే మైనారిటీ పక్షం దృష్టిలో ఆయన "బ్యూరాక్రటిక్ కేంద్రీకరణ"ను బలపర్చేవాడు కాకుండా పోయాడన్న విషయాన్ని పేర్కొంటే చాలు.

రుజువు చేస్తుంది అంతే. కేంద్ర సంస్థల ఎన్నిక దురదృష్టకరమైనదని వారు పార్టీని ఒప్పించగోరుతున్నారు. ఆ పనిని వారు ఎలా చేస్తున్నారు? ప్లెహానొవ్, నేనూ నడుపుతున్న ''ఇస్క్రా'' విధానాన్ని విమర్శించడం ద్వారానా? కాదు, అలాంటి విమర్శను దేనినీ వారు చేయలేకున్నారు. వారు ఉపయోగించే పద్ధతి ఏమిటంటే, తాము ద్వేషించే కేంద్ర సంస్థల మార్గదర్శకత్వం కింద పనిచేయడానికి పార్టీలో ఒక భాగం నిరాకరించడం. కాని ప్రపంచంలో ఏ పార్టీకి చెందిన ఏ కేంద్ర సంస్థ గాని తన మార్గదర్శకత్వాన్ని నిరాకరించే వారిని ఆదేశించగలిగి వుండదు. కేంద్ర సంస్థల ఆదేశాలను నిరాకరించడమంటే పార్టీలో వుండడానికి నిరాకరించడమే అవుతుంది, అది పార్టీని విచ్ఛిన్నం చేయడమే అవుతుంది; అది నాశనం చేసే పద్ధతే గాని ఒప్పించే పద్ధతి కాదు. ఒప్పించడానికి బదులు నాశనం చేయడానికి జరిగే యీ ప్రయత్నాలు వారికి నిలకడ అయిన సూత్రాలు లేకపోవడాన్నీ, తమ భావాలలోనే తమకు విశ్వాసం లేకపోవడాన్నీ తెలియజేస్తాయి.

వారు బ్యూరాక్రసీని గురించి మాట్లాడుతున్నారు. బ్యూరాక్రసీ అనే మాటను రష్యన్ భాషలోకి స్థానంమీదా, పదవిమీదా కేంద్రీకరణగా అనువదించవచ్చు. బ్యూరాక్రసీ అంటే పని ప్రయోజనాలను తన స్వంత జీవికయొక్క ప్రయోజనాలకు లోబరచడం; అంటే దాని అర్థం పదవులమీద దృష్టిని కేంద్రీకరించడమూ పనిని నిర్లక్ష్యం చేయడమూ; అంటే దాని అర్థం భావాల కోసం పోరాడటానికి బదులు కో-ఆప్టేషను గురించి జగడమాడటం. ఈ రకమైన బ్యూరాక్రసీ అవాంఛనీయమైనదనీ, పార్టీకి హానికరమైనదనీ అనేమాట నిస్సందేహంగా నిజం. ఇప్పుడు మన పార్టీలో పోటీపడుతున్న రెండు పక్షాలలోనూ అలాంటి బ్యూరాక్రసీ ఎవరిదో నిర్ణయించే పనిని సురక్షితంగా పాఠకునికి వదలిపెట్టవచ్చు.... ఐక్యతను సాధించడంలో కేవల యాంత్రిక పద్ధతులు ఉపయోగింపబడటం గురించి మాట్లాడుతున్నారు. కేవల యాంత్రిక పద్ధతులు హానికరమనేది నిస్సందేహం. కాని పాత ధోరణికి వ్యతిరేకంగా నూతన ధోరణి జరిపే పోరాటంలో భావాలు సరి అయినవేనని పార్టీకి నమ్మకం కుదరక ముందేనూ, ఈ భావాలు పార్టీ ముందు వుంచబడక ముందేనూ ఆ వ్యక్తులకు పార్టీ సంస్థలలో పట్టంగట్టడం కంటె మొరటు అయిన మరింత యాంత్రికమైన పోరాట పద్ధతి మరేదైనా వుంటుందా అనే విషయాన్ని నిర్ణయించే పనిని కూడా పాఠకునికి వదిలి వేస్తాను.

కాని మైనారిటీ ఉపయోగించే యీ వూతపదాలకు బహుశా సూత్రబద్ధమైన అర్థం ఏదైనా వుందా? ప్రస్తుత విషయంలో ''మొగ్గను'' నిస్సందేహంగా ప్రారంభించిన అల్పమైన ప్రత్యేకమైన కారణంతో సంబంధంలేకుండా బహుశా అవి కొన్ని ప్రత్యేక భావాలను వేటినైనా వ్యక్తం చేస్తున్నాయా? ''కో-ఆప్టేషనుపై'' జరిగే జగడాన్ని మనం పక్కకు

నెట్టితే ఈ వూతపదాలు వేరొక భావాల పద్ధతిని తెల్పేవి అవుతాయా?

ఈ విషయాన్ని మనం ఈ దృక్కోణంనుంచి పరిశీలిద్దాం, అలా చేయడానికి ముందు, మనం అలాంటి పరిశీలన జరపడానికి లీగులో మొట్టమొదట ప్రయత్నించినవాడు కామ్రేడ్ ప్లెహానొవ్ అన్న విషయాన్ని చెప్పాలి. మైనారిటీ అరాజకవాదం వైపుకూ, అవకాశవాదం వైపుకూ మొగ్గుతోందనీ, కామ్రేడ్ మార్తొవ్ తన "ముట్టడి స్థితి"లో ఈ ఘటనను పూర్తిగా విడిచిపెట్టడం మేలని అనుకున్నాడనీ ఆయన పేర్కొన్నాడు. (కామ్రేడ్ మార్తొవ్ తన వైఖరి సూత్రబద్ధమైనదని* అంగీకరించడానికి ఎవరూ సిద్ధంగా లేనందుకు ఇప్పుడు కోపగించుకుంటున్నాడు.)

లీగు మహాసభలో ఒక సాధారణ ప్రశ్న లేవదీయబడింది. అదేమిటంటే, లీగు గాని ఒక కమిటీ గాని తన కోసం తయారు చేసే నిబంధనావళి కేంద్ర కమిటీచే ఆమోదింపబడకపోయినా, కేంద్ర కమిటీ దానిని ఆమోదించడానికి నిరాకరించినా అది చెల్లుతుందా చెల్లదా అని. ఇంత కంటె స్పష్టమైనది ఏదీ వుండదని ఎవరైనా అనుకుంటారు: నిబంధనావళి లాంఛనప్రాయమైన సంఘటితత్వాన్ని తెలియజేస్తుంది, మన పార్టీ నిబంధనావళిలోని 6వ నిబంధన ప్రకారం కమిటీలను ఏర్పాటుచేసే అధికారం స్పష్టంగా కేంద్ర కమిటీకి ఇవ్వబడింది. నిబంధనావళి ఒక కమిటీకి వుండే స్వేచ్ఛానువర్తన పరిమితులను నిర్వ

---

*సూత్రబద్ధమైన అభిప్రాయభేదాలను వేటినీ చూడడానికి లెనిన్ నిరాకరిస్తున్నాడని లేదా వాటిని కాదంటున్నాడని చెప్పే కొత్త "ఇస్క్రా" ఫిర్యాదు కంటె హాస్యాస్పదమైనది మరొకటి లేదు. మీ వైఖరి ఎక్కువగా సూత్రబద్ధంగా వున్నదైతే మీరు అవకాశవాదం వైపు మొగ్గారని నేను పదే పదే చేసిన ప్రకటనలను మీరు వెంటనే పరిశీలించడం మంచిది. మీ వైఖరి కనక ఎక్కువగా సూత్రబద్ధమైనది అయివుంటే, ఒక సైద్ధాంతిక పోరాటాన్ని మీరు పదవులపై జగడంగా దిగజార్చి వుండేవారు కాదు. అందుకు మిమ్మల్ని మీరే నిందించుకోవాలి. ఎందుచేతనంటే మిమ్మల్ని సూత్రబద్ధులైన మనుషులుగా పరిగణించడాన్ని అసాధ్యమయేటట్లు చేయడానికి కావలసినదంతా మీరే చేశారు. ఉదాహరణకు కామ్రేడ్ మార్తొవ్‌నే తీసుకోండి: ఆయన తన "ముట్టడి స్థితి"లో లీగు మహాసభను గురించి మాట్లాడినప్పుడు అరాజకవాదంపై ప్లెహానొవ్‌తో జరిగిన తగాదా గురించి ఏమీ చెప్పలేదు. కాని అందుకు బదులు, లెనిన్ ఒక అతీత కేంద్రం అనీ, లెనిన్ కన్నుగీటితే చాలు — కేంద్రం ఆజ్ఞలను జారీచేస్తుందనీ కేంద్ర కమిటీ లీగుమీద సవారి చేస్తోందనీ వగైరా వగైరా మనకి చెప్పాడు. తన ప్రస్తావన విషయాన్ని యీవిధంగా ఎన్నిక చేయడం ద్వారా కామ్రేడ్ మార్తొవ్ తన సిద్ధాంతాల సూత్రాల ప్రగాఢతను ప్రదర్శించాడనడంలో నాకు సందేహం లేదు.

చిస్తుంది. ఈ పరిమితులను నిర్వచించడంలో నిర్ణయాత్మకమైన అధికారం కేంద్ర కమిటీకే వుంటుంది గాని పార్టీ స్థానిక సంస్థలకు కాదు. అది ప్రాథమికమైన విషయం. ''సంఘటితపర్చడం'' అంటే సర్వదా ''నిబంధనావళిని ఆమోదించడం కాదని (లాంఛనప్రాయమైన నిబంధనావళి ప్రాతిపదికమీద సంఘటితపడాలనే కోరికను లీగు తనంతటా తాను వ్యక్తంచేసి వుండనట్టుగా), కుహనా పాండిత్య వాదనలు చేయడం కేవలం కుత్రతనం. కాని కామ్రేడ్ మార్తొవ్ సోషల్ డెమోక్రసీయొక్క ఓనమాలు కూడా మరచిపోయాడు (తాత్కాలికంగానే అని ఆశిద్దాం). ఆయన అభిప్రాయంలో నిబంధనావళి ఆమోదింపబడాలనే డిమాండు ''ఇంతకు ముందున్న విప్లవాత్మక 'ఇస్క్రా' కేంద్రీకరణకు బదులు బ్యూరాక్రటిక్ కేంద్రీకరణ ప్రవేశపెట్టబడటాన్ని'' సూచిస్తుంది అని మాత్రమే (లీగు మినిట్స్, పేజి 95). వాస్తవానికి అందులోనే సమస్యయొక్క ''సూత్రబద్ధమైన అంశం'' వుంది. అదే ప్రసంగంలో కామ్రేడ్ మార్తొవ్ ప్రకటించాడు (పేజి 96)—తన ''ముట్టడి స్థితి''లో దానిని విడిచి పెట్టడం మేలని అనుకున్నాడు!

కామ్రేడ్ ప్లెహానొవ్ వెంటనే కామ్రేడ్ మార్తొవ్‌కి సమాధానం చెప్పాడు. ''మహాసభయొక్క గౌరవానికి భంగకరం గనుక'' బ్యూరాక్రసీ, అధికారంలో వుల్లయ్య లాంటి పద ప్రయోగాలు చేయకుండా వుండమని కోరాడు (పేజి 96). దానిపై కామ్రేడ్ మార్తొవ్‌తో వాదోపవాదాలు జరిగాయి. ఈ పద ప్రయోగాలు ''సూత్రబద్ధమైన స్థానంనుంచి ఒక ధోరణిని లాక్షణీకరించడంగా'' మార్తొవ్ పరిగణించాడు. అప్పట్లో కామ్రేడ్ ప్లెహానొవ్, మెజారిటీని సమర్థించే ఇతరు లందరిలాగనే, ఈ పద ప్రయోగాలను వాటికున్న నిజమైన విలువను బట్టే అర్థంచేసుకున్నాడు. మనం ఈ మాట అనవచ్చుననుకుంటే, అవి ప్రత్యేకించి ''కో-ఆప్టేషను'' రంగానికి సంబంధించినవే గాని సూత్రానికి సంబంధించినవి కావని స్పష్టంగా గుర్తించాడు. అయినప్పటికీ, మార్తొవ్‌ల, డేయ్‌చ్‌ల పంతానికి మన్నన చూపాడు (పేజీలు 96–97), సూత్రాలని వారనుకునే వాటిని సూత్రబద్ధమైన స్థానం నుంచే పరిశీలించసాగాడు. ఆయనిలా అన్నాడు: ''అలాగే అయితే (అంటే, కమిటీలు తమ సంఘానికి రూపు రేఖలు దిద్దుకోడంలోనూ, తమ నిబంధనావళిని తయారుచేసుకోడంలోనూ స్వేచ్ఛానువర్తన కలిగివుంటే) మొత్తం అంతటికీ, అంటే పార్టీకి సంబంధించిన విషయంలో కూడా అవి స్వేచ్ఛానువర్తన కలిగివుంటాయి. అది బుంద్ దృక్పథం కూడా కాదు. పచ్చి అరాజకవాద దృక్పథం. అరాజకవాదులు సరిగ్గా అలాగే వాదిస్తారు: వ్యక్తుల హక్కులకు పరిమితి లేదు; వారు ఘర్షణపడవచ్చు; ప్రతి వ్యక్తీ తన హక్కులకున్న పరిమితిని తానే నిర్ణయించుకుంటాడు. స్వేచ్ఛానువర్తన హక్కుకు వుండే పరిమితులు ఆ గ్రూపుచే గాక అది ఏ మొత్తంలో అయితే ఒక భాగమై వుందో ఆ మొత్తంచేత నిర్ణయిం

పబడాలి. ఈ సూత్ర ఉల్లంఘనకు బుండ్ ఒక స్పష్టమైన ఉదాహరణ. అందుచేత, స్వేచ్ఛానువర్తన హక్కుయొక్క పరిమితులు మహాసభచేత లేక మహాసభ నెలకొల్పే అత్యున్నతాధికార సంస్థచేత నిర్ణయింపబడాలి. కేంద్ర సంస్థయొక్క అధికారం నైతికమైన, మేధోపరమైన ప్రతిష్ఠపై ఆధారపడి వుండాలి. ఆ విషయం నేను సహజంగానే అంగీకరిస్తాను. సంఘానికి చెందిన ప్రతివారూ ఆ సంఘంయొక్క నైతిక ప్రతిష్ఠ గురించి ఆలోచించాలి. కాని దాని అర్థం ప్రతిష్ఠ అవసరమే గాని, అధికారం అనవసరం అని కాదు.... అధికార శక్తిని భావాల శక్తికి పోటీపెట్టడం అరాజకవాదం. దానికి ఇక్కడ తావు వుండకూడదు'' (పేజి 98). ఈ ప్రతిపాదనలు అత్యంత ప్రాథమికమైనవి, వాస్తవానికి అవి ప్రత్యక్ష సత్యాలు. వాటిని వోటుకు పెట్టడం కూడా వింతగానే వుంది (పేజి 102). ''భావనలు ఇప్పుడు గజిబిజి చేయబడ్డాయి'' గనుకనే అవి సందేహించబడ్డాయి (ఆ పేజిలోనే). కాని మైనారిటీయొక్క మేధావి వ్యక్తితత్వం తప్పనిసరిగా వారిని మహాసభను విచ్ఛిన్నం చేయగోరే స్థితికి, మెజారిటీకి లోబడివుండడానికి నిరాకరించే స్థితికి తీసుకు వెళ్లింది; అరాజకవాద పదజాలంతో తప్పితే ఆ కోరికను సమర్థించుకో జాలకపోయారు. ప్లెహానొవ్ అవకాశవాదమూ, అరాజకవాదమూ వగైరా వగైరా అత్యంత తీవ్రమైన మాటలు ఉపయోగించాడని ఫిర్యాదులు చేయడం తప్పితే ఆయనకి సమాధానంగా మైనారిటీ ఏమీ చెప్పలేకపోవడం చాలా వినోదకరంగా వుంది. ఈ ఫిర్యాదులను ప్లెహానొవ్ ఎంతో సరిగానే పరిహసించాడు. ''జోరేసిజం, అరాజకవాదం అనే మాటలు అనుమతింపరానివీ, lèse-majesté (రాజ అవమానం), అధికారంలో పుల్లయ్య లాంటి మాటలు అనుమతింపతగినవీ ఎందుకయాయి'' అని ప్రశ్నించాడు. దానికి సమాధానం రాలేదు. కామ్రేడ్స్ మార్తొవ్, అక్సెల్‌రోడ్ అండ్ కంపెనీకి ఎల్లప్పుడూ ఇలాంటి వింత qui pro quo* జరుగుతూనే వుంది: వారి కొత్త వూతపదాలు స్పష్టంగా చీకాకు కలిగించేవిగా వున్నాయి; దాన్ని గురించిన ఏ ప్రస్తావన అయినా వారికి కోపం తెప్పిస్తోంది — వారు సూత్రబద్ధులైన మనుషులు కదా! కాని వారికి ఒక విషయం చెప్పాము. సంస్థలో ఒక భాగం మొత్తం సంస్థకు లోబడి వుండాలనే దాన్ని మీరు సూత్రబద్ధంగా నిరాకరిస్తే మీరు అరాజకవాదులు అవుతారు అని చెప్పాము. వారికి మళ్లీ కోపం వచ్చింది! — ఈ మాట మరీ ఘాటైనది కదా! మరోలా చెప్పాలంటే, వారు ప్లెహానొవ్‌తో పోరాడగోరుతున్నారు, కాని ఆయన వారిని నిజంగా తిరిగి దెబ్బకొట్టకుండా వుండే షరతుమీద!

---

* పరాభవం. — సం.

కామ్రేడ్ మార్తొవ్, తదితర ''మెన్షెవిక్కులూ''* యీ కింది ''వైరుధ్యా''నికి నన్ను ఎన్నిసార్లో కుత్రతనానికి తక్కువ కాని విధంగా నిందించారు. నేను రాసిన ''ఏం చెయ్యాలి?'' అనే గ్రంథంనుంచీ, లేదా ''ఒక కామ్రేడ్‌కి లేఖ''నుంచీ భావజాల ప్రభావాన్ని గురించి, పలుకుబడి కోసం జరిగే పోరాటం గురించి, వగైరా గురించి చెప్పిన ఒక భాగాన్ని ఉదహరించి దానిని నిబంధనావళి ద్వారా ప్రభావితం చేసే ''బ్యూరాక్రటిక్'' పద్ధతితోనూ, అధికారంమీద ఆధారపడి వుండాలనే ''నిరంకుశ'' ధోరణితోనూ, వగైరాలతోనూ గల వ్యత్యాసాన్ని చూపుతున్నారు. ఎంత నిష్కపటులు! ఇంతకు ముందు మన పార్టీ లాంఛన ప్రాయంగా సంఘటితమైన ఏక మొత్తంగా లేదనీ, కేవలం కొన్ని విడివిడి గ్రూపుల వెరసిగానే వుండిందనీ, అందుచేత ఈ గ్రూపుల మధ్య భావజాల ప్రభావానికి సంబంధించిన సంబంధాలు తప్ప మరేవీ సాధ్యం కాలేదనే విషయాన్ని వారప్పుడే మరచిపోయారు. ఇప్పుడు మనం ఒక సంఘటితమైన పార్టీ అయాము. దీనిలో అధికారాన్ని నెలకొల్పడమూ, భావాల శక్తిని అధికార శక్తిగా మార్చడమూ, కింది పార్టీ సంస్థలు ఉన్నత సంస్థలకు లోబడి వుండటమూ ఇమిడి వుంటాయి. నిజం చెప్పాలంటే, పాత సహచరుల లాభం కోసం ప్రత్యేకించి దీనికంతకీ మూలం ఎన్నికల విషయంలో మైనారిటీ మెజారిటీకి లోబడి వుండటానికి నిరాకరించడమే నని తెలిసినప్పుడు, అలాంటి ప్రాథమిక సూత్రాలను నెమరువేయడం సిగ్గుగా వుంటుంది! కాని సూత్రపరమైన స్థానంనుంచి చూస్తే నాలోని వైరుధ్యాలను ఇలా అంతులేకుండా బయటపెట్టడం అరాజకవాద పదజాల ప్రయోగం తప్ప మరేమీ కాదు అని తేలుతుంది. కొత్త ''ఇస్క్రా'' పార్టీ సంస్థ అనే హోదానూ, దాని హక్కులనూ పొందడానికి విముఖం కాదు కాని పార్టీలో మెజారిటీకి అది లోబడి వుండదలచుకోలేదు.

బ్యూరాక్రసీని గురించిన మాటలలో సూత్రమనేది ఏదైనా వుండి వుంటేనూ, అది పార్టీలో ఒక భాగం మొత్తం పార్టీకి లోబడి వుండాలనే కర్తవ్యాన్ని నిరాకరించే అరాజకవాద పద్ధతి కాకపోతేనూ, ఇక్కడ ఇక మనకున్నది అవకాశవాద సూత్రం. ఇది శ్రామికవర్గ పార్టీపట్ల కొందరు మేధావుల బాధ్యతను తగ్గించడానికీ, కేంద్ర సంస్థల పలుకుబడిని తగ్గించడానికీ, పార్టీలో అత్యంత తక్కువ నిలకడగలవారి స్వేచ్ఛానువర్తనను విస్తృతపర్చడానికీ, నిర్మాణాత్మక సంబంధాలను కేవలం నిర్లిప్తంగానూ మాటవరసకే వాటిని అంగీక

* రష్యన్ భాషలో ''బోల్షిన్‌స్ట్వో'' అంటే ''మెజారిటీ'' అనే మాటనుంచి ''బోల్షెవిక్'' అనేది వచ్చినట్లే ''మేన్షిన్‌స్ట్వో'' అంటే ''మైనారిటీ'' అనే మాటనుంచి ''మెన్షెవిక్'' అనేది వచ్చింది. — సం.

రించే స్థాయికి కుదించడానికీ ప్రయత్నిస్తుంది. దీనిని మనం పార్టీ మహాసభలో చూశాం. అక్కడ అకీమొవ్‌లూ, లీబెర్‌లూ "ఘోరమైన" కేంద్రీకరణను గురించి సరిగ్గా లీగు మహాసభలో మార్తొవ్ అండ్ కంపెనీ నోటినుంచి వెలువడిన ప్రసంగాల లాంటి వాటినే చేశారు. అవకాశవాదం యాదృచ్ఛికంగా గాక స్వభావసిద్ధంగానే పార్టీ నిర్మాణం గురించిన మార్తొవ్, అక్సెల్‌రోడ్‌ల "భావాల"కు దారితీస్తుందనీ, ఒక రష్యాలోనే గాక యావత్తు ప్రపంచంలోనూ కూడా అది అంతేననీ, కొత్త "ఇస్క్రా"లో కామ్రేడ్ అక్సెల్‌రోడ్ వ్యాసాన్ని పరిశీలించినప్పుడు చూద్దాం.

## ఘ) గొప్ప సుఖానికి స్వల్పమైన బాధలు అడ్డురాకూడదు

లీగు నిబంధనావళి కేంద్ర కమిటీ ఆమోదాన్ని పొందితీరాలన్న తీర్మానాన్ని లీగు నిరాకరించడం (లీగు మినిట్స్, పేజి 105) పార్టీ మహాసభలో మెజారిటీ వెంటనే ఏకగ్రీవంగా పేర్కొన్నట్టుగా "పార్టీ నిబంధనావళిని ఘోరంగా ఉల్లంఘించడమే." సూత్రబద్ధులైన వారి చర్యగా పరిగణింపబడిన ఈ ఉల్లంఘన కేవలం అరాజకవాదమే, మహాసభానంతర పోరాట వాతావరణంలో పార్టీ మైనారిటీ పార్టీ మెజారిటీతో "లెక్కలు తేల్చుకోడానికి" ప్రయత్నిస్తుందనే భావాన్ని అది తప్పక కలుగజేస్తుంది (లీగు మినిట్స్, పేజి 112); దాని అర్థం వారు పార్టీకి లోబడగోరటం లేదనీ, పార్టీలో వుండగోరటం లేదనీ. దాని నిబంధనావళిలో మార్పులు చేయాలని కేంద్ర కమిటీ చేసిన ప్రకటనపై ఒక తీర్మానాన్ని ఆమోదించడానికి లీగు నిరాకరించినప్పుడు (పేజీలు 124–125) తప్పని సరిగా దానిని బట్టి, పార్టీ శాఖ సమావేశంగా పరిగణింపబడ గోరుతూ అదే సమయంలో పార్టీ కేంద్ర సంస్థకు లోబడని ఈ సమావేశం అక్రమమైనదని ప్రకటించవలసి వుంటుంది. ఆప్రకారంగానే పార్టీ మెజారిటీ అనుచరులు ఒక అసభ్య ప్రహసనంలో తమకు ఎలాంటి భాగస్వామ్యం లేకుండా వుండేటందుకు గాను, యీ కుహనా పార్టీ సమావేశంనుంచి వెంటనే ఉపసంహరించుకున్నారు.

నిబంధనావళిలోని మొదటి నిబంధనపై నిలకడలేకపోడంలో బైటపడినదీ, నిర్మాణాత్మక సంబంధాలను నిర్లిప్తంగా గుర్తించేదీ అయిన మేధావి వ్యష్టివాదం ఆవిధంగా సహేతుక పరాకాష్ఠను, అంటే పార్టీ శాఖను విచ్ఛిన్నం చేసే దశను, చేరుకుంది. దీన్ని గురించి నేను సెప్టెంబరులోనే, అంటే ఒకటిన్నర నెలలు ముందుగానే జోస్యం చెప్పాను. అప్పుడు లీగు

మహాసభ ముగిసిన రోజు సాయంత్రం, కామ్రేడ్ ప్లెహానొవ్ పార్టీ కేంద్ర సంస్థలు రెండింటి లోని తన సహచరులతో చెప్పినది ఏమిటంటే, "తన కామ్రేడ్స్‌పై కాల్పులు జరపడాన్ని" తాను సహించలేననీ, "చీలిపోవడం కంటే ఆత్మహత్య చేసుకోడం మేలు" అనీ, పెద్ద కీడును తప్పించడానికి గరిష్ఠ వ్యక్తిగత రాయితీలు కల్పించడం అవసరమనీ, వాస్తవంలో వాటిపైనే (మొదటి నిబంధనపై తీసుకున్న తప్పుడు స్థానంలో కనుగొనవలసిన సూత్రాలపై కంటె ఎక్కువగా) ఈ వినాశకర పోరాటం సాగించబడుతోందనీ చెప్పాడు. కొంత సాధారణ పార్టీ ప్రాధాన్యతను పొందిన ప్లెహానొవ్‌యొక్క అటునుంచి ఇటు మారిన ఈ తిరుగుడును మరింత ఖచ్చితంగా వర్ణించేందుకు గాను, ప్రయివేటు సంభాషణలమీద గాని ప్రయివేటు లేఖలమీద గాని (ఇది అత్యావశ్యక ఆఖరి ఆశ్రయం) ఆధారపడటం గాక, పరిస్థితిని గురించి పార్టీ అంతటికీ ప్లెహానొవ్ చేసిన వ్యాఖ్యమీద, ఆయన "ఇస్క్రా" సంచిక 52లో "ఏం చెయ్యకూడదు" అనే శీర్షికతో రాసిన వ్యాసంమీదనే ఆధారపడటం ఉచితమని నేను భావిస్తున్నాను. ఆ వ్యాసం లీగు మహాసభ ముగిసిన వెనువెంటనే, కేంద్ర పత్రిక సంపాదకవర్గంనుంచి నేను రాజీనామా చేసిన తరువాతనూ (1903 నవంబరు 1), మార్తొవ్ అనుయాయులను కో-ఆప్టు చేసుకోడానికి పూర్వమూ (1903 నవంబరు 26) రాయబడింది.

"ఏం చెయ్యకూడదు" అనే వ్యాసంలోని ప్రధానమైన భావం – రాజకీయాలలో మనం ఎక్కువ మొండిగానూ, కఠినంగానూ, బిరుగానూ వుండకూడదనీ, అంటే చీలికను తప్పించడానికి రివిజనిస్టులకు (మనవైపు వస్తున్న వారిలోనూ లేక అస్థిరులైన వారిలోనూ) అరాజకపు వ్యష్టివాదులకు సహితం లొంగడం ఒక్కొక్కప్పుడు అవసరం అవుతుందనీ. అనిర్దిష్టమైన యీ సాధారణీకరణలు "ఇస్క్రా" పాఠకు లందరిలోనూ కలవరం కలుగజేయడం సహజమే. తన భావాలలోని నూతనత్వం మూలంగానూ, పాఠకులలో గతితార్కిక విజ్ఞానం లోపించడం మూలంగానూ తనను ఎవరూ అర్థం చేసుకోలేదని కామ్రేడ్ ప్లెహానొవ్ (తదుపరి వ్యాసాల్లో) చేసిన ఆడంబరమైన గంభీరమైన ప్రకటనలు చదివినప్పుడు నవ్వు రాకుండా వుండదు. నిజానికి "ఏం చెయ్యకూడదు" అనే వ్యాసం రాయబడినప్పుడు రెండు జెనీవా శివార్లలో నివసించుతుండిన ఒక డజను మంది మాత్రమే దానిని అర్థం చేసుకోగలిగారు, ఆ శివార్ల పేర్లు ఒకే అక్షరంతో ప్రారంభమవుతాయి.[48] కామ్రేడ్ ప్లెహానొవ్ దురదృష్టం ఏమిటంటే, మైనారిటీతో మహాసభానంతరం సాగిన పోరాట పరిణామాలు అన్నింటిలోనూ పాల్గొన్న ఈ డజను మంది కోసం ఉద్దేశింపబడిన సూచనల, మందలింపుల బీజగణిత సంకేతాల, చిక్కు ప్రశ్నల కలగుండు వ్యాసాన్ని పది వేలమంది పాఠకులకు పంచిపెట్టాడు. కామ్రేడ్ ప్లెహానొవ్‌కు ఈ దుస్థితి ఎందుకు వచ్చిందంటే ఆయన ఎంతో

అనుచితంగా ఉదహరించిన గతితర్కపు మౌలిక సూత్రాన్ని, అంటే, సాధారణ సత్యం అనేది లేదని, సత్యం ఎప్పుడూ నిర్దిష్టమైనదేనని అనే సూత్రాన్ని ఆయనే ఉల్లంఘించాడు. అందు చేతనే లీగు మహాసభ తరువాత మార్తొవ్ అనుయాయులకు లొంగిపోవాలనే అతి నిర్దిష్ట మైన భావానికి సాధారణ రూపాన్ని ఇవ్వడం అసందర్భం అయింది.

కామ్రేడ్ ప్లెహానొవ్ ఒక కొత్త నినాదంగా ప్రతిపాదించిన లొంగిపోడం అనేది రెండు సందర్భాలలో సమంజసమూ ఆవశ్యకమూ అవుతుంది: అదేమిటంటే, తనను లొంగ దీయడానికి ప్రయత్నిస్తున్నవారు చేస్తున్నది సరి అయినదేనని లొంగిపోయే మనిషికి నమ్మకం కుదిరినప్పుడు (ఈ సందర్భంలో నిజాయితీపరులైన రాజకీయవాదులు దాపరికం లేకుండా బహిరంగంగా తమ పొరపాట్లను ఒప్పుకుంటారు) లేక, ఎక్కువ కీడును తప్పించే టందుకు బేసబబు అయిన హానికరమైన డిమాండుకు లొంగవలసివచ్చినందుకు. ఇప్పుడు చర్చలో వున్న వ్యాసాన్ని పట్టి ఆ వ్యాసకర్తకు మనస్సులో వున్నది పైన చెప్పినవాటిలో రెండవదే అన్నది పూర్తిగా స్పష్టం: రివిజనిస్టులకూ, అరాజకపు వ్యష్టివాదులకూ (అంటే మార్తొవ్ అనుయాయులకు — లీగు మినిట్స్‌ను పట్టి ఇప్పుడు ప్రతి పార్టీ సభ్యునికీ ఇది తెలుసు) లొంగిపోడం గురించి ఆయన స్పష్టంగా చెబుతున్నాడు, చీలిక రాకుండా చేసే టందుకు అది ఆవశ్యకమని అంటున్నాడు. నవీనమైనదని కామ్రేడ్ ప్లెహానొవ్ అనుకునే భావం, గొప్ప సుఖానికి స్వల్పమైన బాధలు అడ్డురాకూడదని, పెద్ద పార్టీ చీలిక కంటె కొద్దిపాటి అవకాశవాదపు బుద్ధిహీనత, కొద్దిపాటి అరాజకపు వాగుడు మేలు అని అనే ఏమంత నవీనంకాని లోకజ్ఞానమే తప్ప మరేమీ కాదని మనకు తెలుసు. కామ్రేడ్ ప్లెహానొవ్ ఈ వ్యాసాన్ని రాసినప్పుడు మైనారిటీ మన పార్టీలో అవకాశవాద పక్షమనీ, వారు అరాజక వాద పద్ధతుల ద్వారా పోరాడుతున్నారనీ ఆయన స్పష్టంగా గుర్తించాడు. జర్మన్ సోషల్ డెమొక్రట్లు బెర్న్‌స్టైన్‌తో పోరాడినట్టే (తిరిగి si licet parva componere magnis*) వ్యక్తిగత రాయితీలు కల్పించడం ద్వారా యీ మైనారిటీతో పోరాడాలనే పథ కంతో కామ్రేడ్ ప్లెహానొవ్ ముందుకు వచ్చాడు. కామ్రేడ్ బెర్న్‌స్టైన్ (కామ్రేడ్ ప్లెహా నొవ్ ఒకప్పుడు మిస్టర్ బెర్న్‌స్టైన్ అని పిలవాలని ఎంతో ఇష్టపడిన బెర్న్‌స్టైన్ కాదు, కామ్రేడ్ బెర్న్‌స్టైన్) లాగ పరిసరాల ప్రభావానికి అంత ఎక్కువగా లొంగిపోయే వారిని ఎవరినీ తాను ఎరుగనని బేబెల్ తన పార్టీ మహాసభలో బహిరంగంగా ప్రకటించాడు: ఆయనను మన పరిసరాలలోకి తీసుకుందాము, ఆయనని మన రైహ్‌స్టాగ్** సభ్యునిగా చేద్దాము, రివి

* చిన్న విషయాలను పెద్దవాటితో పోల్చవచ్చుననుకుంటే. — సం.

** పార్లమెంటు. — సం.

జనిస్టు యెడల చూపే అయుక్తమైన కాఠిన్యంతో కాదు (సొబకేవిచ్[49]-Parvus రీతిగా) అతనిని "కారుణ్యంతో చంపడం" (kill with kindness) ద్వారా మనం రివిజనిజానికి వ్యతిరేకంగా పోరాడుదాము. ఈ సందర్భంలో ఒకటి జ్ఞాపకం చేస్తాను, ఇంగ్లీషు సోషల్ డెమోక్రట్ల ఒక సమావేశంలో జర్మన్ సర్దుబాటు వైఖరిని, కలహ విముఖతను, కారుణ్యాన్ని, వెసులుబాటుతనాన్ని సమర్థిస్తూ ఇంగ్లీషు సొబకేవిచ్-హైండ్‌మన్ చేసే దాడికి వ్యతిరేకంగా హెచ్చరిస్తూ కామ్రేడ్ ఎమ్. బేర్ (M. Beer) అలాగే చెప్పాడు. ఇప్పుడు అదే విధంగా కామ్రేడ్ ప్లెహనోవ్, కామ్రేడ్ అక్సెల్‌రోడ్, మార్తొవ్‌ల కొద్దిపాటి అరాజకవాదాన్ని అవకాశవాదాన్ని "కారుణ్యంతో చంపాలని" అనుకుంటున్నాడు. "అరాజకపు వ్యష్టివాదుల"ను గురించి ఎంతో స్పష్టంగానే సూచిస్తూ కామ్రేడ్ ప్లెహనోవ్ రివిజనిస్టులను గురించి బుద్ధిపూర్వకమైన అస్పష్ట పద్ధతిలో తన భావాలను వ్యక్తంచేసిన మాట నిజమే; అవకాశవాదంనుంచి ఛాందసంవైపు మొగ్గుతున్న "రబోచెయె దేలో"వాళ్ల గురించి తాను ప్రస్తావిస్తున్నాడే గాని ఛాందసంనుంచి రివిజనిజంవైపు మొగ్గనారంభించిన అక్సెల్‌రోడ్, మార్తొవ్‌ల గురించి కాదనే అభిప్రాయం కలుగజేసే విధంగా ఆయనాపని చేశాడు. ఇది కేవలం ఒక అమాయకపు సైనికతంత్రం,* పార్టీ ప్రచారపు శతఘ్ని కాల్పులకు తట్టుకోజాలని బలహీనమైన దుర్గం.

మనం వివరిస్తూన్న రాజకీయ తరుణంలో సందిగ్ధ వ్యవహారాల వాస్తవ పరిస్థితిని తెలిసిన వారు ఎవరైనా గాని, కామ్రేడ్ ప్లెహనోవ్ మనస్తత్వాన్ని అవగాహన చేసుకోవడానికి ప్రయత్నించేవారు ఎవరైనా గాని ఈ సందర్భంలో నేను ప్రవర్తించిన దానికి భిన్నంగా ప్రవర్తించి వుండజాలనని గుర్తిస్తారు. సంపాదకవర్గాన్ని వదలివేసినందుకు నన్ను మందలించిన మెజారిటీ మద్దతుదార్లను ఉద్దేశించి నేనీ విషయం చెబుతున్నాను. లీగు మహాసభ తరువాత కామ్రేడ్ ప్లెహనోవ్ వెనుదిరిగినప్పుడు, మెజారిటీని బలపరచేవాడుగా వుండే స్థితినుంచి ఏమైనా సరే సమాధానపడాలనే విధానాన్ని బలపర్చేవాడుగా తయారైనప్పుడు,

* పార్టీ మహాసభ తరువాత కామ్రేడ్స్ మర్తీనొవ్, అకీమొవ్, బ్రూకెర్‌లకు రాయితీలు కల్పించే ప్రశ్నే ఎన్నడూ రాలేదు. వారు కూడా "కో-ఆప్టేషను" కావాలని డిమాండు చేసినట్టు నాకు తెలియదు. కామ్రేడ్ స్త్రరోవేర్ గాని, కామ్రేడ్ మార్తొవ్ గాని "సగం పార్టీ" తరఫున తమ పత్రాలను, "వివరణలను" మాకు పంపినప్పుడు కామ్రేడ్ బ్రూకెర్‌తో వారు సంప్రదించారనేది కూడా నాకు సందేహమే.... లీగు మహాసభలో కామ్రేడ్ మార్తొవ్, "ర్యజానొవ్‌తో గాని, మర్తీనొవ్‌తో గాని కలయిక"ను గురించిన, వారితో ఒక "ఒప్పందానికి" లేక సంయుక్త "పార్టీ సేవకు" (సంపాదకుడుగా — లీగు మినిట్స్, పేజి 53) గాని గల

దానికి నేను ఉత్తమమైన వ్యాఖ్యానం చెప్పాల్సి వచ్చింది. బహుశా కామ్రేడ్ ప్లెహానొవ్ తన వ్యాసంలో పరస్పర సమ్మతమైన న్యాయమైన శాంతికి కార్యక్రమాన్ని ప్రతిపాదించదలిచాడా? అలాంటి కార్యక్రమం ఏదైనా ఉభయ పక్షాలూ తమ పొరపాట్లను నిజాయితీతో అంగీకరించడానికే దిగుతుంది. కామ్రేడ్ ప్లెహానొవ్ మెజారిటీకి ఆపాదించిన తప్పు ఏమిటి? రివిజనిస్టుల పట్ల అనుచితమైన, సొబకేవిచ్ లాంటి కాఠిన్యం వహించడం. కామ్రేడ్ ప్లెహానొవ్ గాడిదలను గురించి చమత్కరించినప్పుడు, లేదా — అక్సెల్‌రోడ్ సమక్షంలో — అరాజకవాదం గురించీ అవకాశవాదం గురించీ అత్యంత అజాగ్రత్తగా ప్రస్తావించినప్పుడు, ఆయన మనసులో ఏముందో మనకి తెలియదు. కామ్రేడ్ ప్లెహానొవ్ తన అభిప్రాయాన్ని "సాధారణంగా" చెప్పడం, అంతేగాక పుల్లయ్యనో ఎల్లయ్యనో గురించిన ప్రస్తావనతో చెప్పడం మేలని అనుకున్నాడు. అది అభిరుచికి సంబంధించిన విషయమనుకోండి. కాని, ఏమైనా, నేను నా వ్యక్తిగత కాఠిన్యాన్ని "ఇస్క్రా"వాళ్లకి రాసిన లేఖలోనూ, లీగు మహాసభలోనూ బహిరంగంగా ఒప్పుకున్నాను. అలాంటప్పుడు మెజారిటీ ఆ "పొరపాటు"ను చేయలేదని నేను ఎలా అనగలను? మైనారిటీ విషయంలో కామ్రేడ్ ప్లెహానొవ్ వారి పొరపాటును, అంటే రివిజనిజాన్నీ (అవకాశవాదం గురించి పార్టీ మహాసభలోనూ, జోరేసిజం గురించి లీగు మహాసభలోనూ ఆయన చేసిన వ్యాఖ్యానాలు చూడండి), చీలికవరకూ తీసుకు వచ్చిన వారి అరాజకవాదాన్నీ స్పష్టంగా పేర్కొన్నాడు. వ్యక్తిగత రాయితీలు యివ్వడం ద్వారానూ, మొత్తంమీద "kindness" (కారుణ్యం, వగైరా) చూపడం ద్వారానూ ఈ పొరపాట్లను ఒప్పుకునేటట్లు చేసి, వాటివల్ల కలిగే హానిని తొలగించడానికి చేసే అలాంటి ప్రయత్నాన్ని నేను ఆటంకపర్చగలనా? కామ్రేడ్ ప్లెహానొవ్ "ఏం చెయ్యకూడదు" అనే తన వ్యాసంలో రివిజనిస్టులలో "కొంత అస్థిరత మూలంగా మాత్రమే" రివిజనిస్టులు అయిన "ప్రతిస్పర్థులను కనికరించ"మని సూటిగా మాకు విజ్ఞప్తి చేసినప్పుడు అలాంటి ప్రయ

---

అవకాశం గురించిన భావాన్నే లొంగని రాజకీయ పరాక్రమశాలికుండే అత్యంత ఆగ్రహంతో తోసిపుచ్చాడు. లీగు మహాసభలో కామ్రేడ్ మార్తొవ్, "మర్తీనొవ్ ధోరణులను" తీవ్రంగా ఖండించాడు (పేజి 88). "అంతా కలసి నిబంధనావళిని వారే తయారుచేసి తమకు ఉచితమని తోచిన విధంగా వ్యవహరించే హక్కు కామ్రేడ్స్ అకీమొవ్, మర్తీనొవ్‌లకు కూడా వుందని" అక్సెల్‌రోడ్, మార్తొవ్‌లు నిస్సందేహంగా భావిస్తున్నారని కామ్రేడ్ అర్థడాక్స్ చమత్కారంగా సూచించినప్పుడు (పేజి 99), మార్తొవ్ అనుయాయులు దానిని, క్రీస్తును పీటరు నిరాకరించినట్టు నిరాకరించారు (పేజి 100: "అకీమొవ్‌ల, మర్తీనొవ్‌ల, మొదలైనవారి విషయంలో కామ్రేడ్ అర్థడాక్స్ భయాలు నిరాధారాలు").

త్నాన్ని నేను ఆటంకపర్చగలనా? ఈ ప్రయత్నంలో నాకు నమ్మకం లేకపోతే కేంద్ర పత్రిక విషయంలో వ్యక్తిగత రాయితీలు ఇచ్చేసి, మెజారిటీ స్థానాన్ని కాపాడటం కోసం కేంద్ర కమిటీకి పోవడం కాకుండా మరోలాగ చేయగలిగే వాడినా?* నేను అలాంటి ప్రయత్నాల కున్న అవకాశాన్ని బొత్తిగా కాదనలేకపోయాను, అక్టోబరు 6న రాసిన లేఖలో ఈ జగడా నికి కారణం "వ్యక్తిగత ఆగ్రహం" అని చెప్పడానికి నా అంతట నేనే మొగ్గినంతమాత్రాన చీలిక ఏర్పడే ప్రమాదానికి పూర్తి బాధ్యతను నామీదనే వేసుకొనలేకపోయాను. కాని, మెజా రిటీయొక్క స్థానాన్ని కాపాడటం నా రాజకీయ విధి అని భావించాను, ఇప్పటికీ భావిస్తున్నాను. ఈ విషయంలో కామ్రేడ్ ప్లెహానొవ్‌మీద ఆధారపడటం కష్టమూ అపాయకరమూ అయి వుండేది. ఎందుకంటే ఆయన "శ్రామికవర్గ నాయకుడికి తన పోరాట ధోరణులు రాజకీయ వివేకానికి భిన్నం అయినప్పుడు, వాటికి కళ్లాలు వదిలే హక్కు లేదు" అనే తన నిర్ణయా నికి వ్యాఖ్యానం చెప్పడానికి — నీవు కాల్పులు జరపవలసివస్తే (జెనీవాలో నవంబరు నెలలో వాతావరణ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని) మెజారిటీమీదనే కాల్పులు సాగించమనే అర్థం

---

* నేను avec armes et bagages (ఆయుధంతోనూ, సామానులతోనూ. — సం.) మారిపోయానని కామ్రేడ్ మార్తొవ్ చాలా సరిగా చెప్పాడు. మిలిటరీ ఉపమానాలు వాడటమంటే కామ్రేడ్ మార్తొవ్‌కి చాలా ఇష్టం: లీగుమీద దండయాత్ర, సైనికపోరాటం, మానని గాయాలు, వగైరా వగైరా. నిజం చెప్పాలంటే నాకు కూడా మిలిటరీ ఉపమానాలు వాడటం అంటే చాలా యిష్టం, అందులో ప్రత్యేకించి ఇప్పుడు పసిఫిక్ మహాసముద్రం నుంచి వచ్చే వార్తలను మనం అత్యంత ఆసక్తితో గమనించినప్పుడు.[50] కాని, కామ్రేడ్ మార్తొవ్, మిలిటరీ భాషనే ఉపయోగిస్తే కథ ఇలా వుంటుంది. పార్టీ మహాసభలో మేము రెండు దుర్గాలను పట్టుకున్నాము. మీరు వాటిమీద లీగు మహాసభలో దాడిచేశారు. మొదట కొం చెంసేపు పరస్పరం తుపాకులు కాల్చుకున్న తరువాత నా సహచరుడు, ఆ దుర్గాలలో ఒక దాని కమాండెంటు, శత్రువు రాకకు గేట్లు తెరిచాడు. సహజంగానే, నేను నాకున్న కొద్ది పాటి శతఘ్నులనూ తీసుకుని, దాదాపు ఏ రక్షణ ఏర్పాట్లూ లేకుండా వున్న రెండో దుర్గానికి మారాను, అత్యధిక సంఖ్యలో వున్న శత్రువు "ముట్టడి తట్టుకోడానికి." శాంతి ప్రతిపాదన సైతం చేశాను, రెండు రాజ్యాలతో నేను యెలా యుద్ధం చేయగలను? నా శాంతి ప్రతి పాదనకు సమాధానంగా యీ కొత్త మిత్రులు నా కడపటి దుర్గంమీద ఫిరంగులు కాలుస్తు న్నారు. నేను ఎదురు కాల్పులు జరుపుతున్నాను. దానిమీద నా పాత సహచరుడు — కమాం డెంటు — మహా ఆగ్రహంతో ఇలా అంటున్నాడు: "సుజనులారా చూడండి, యీ చేంబ ర్లేను ఎంత కజ్జాకోరుగా వున్నాడో!"

వచ్చేలాగ గతితార్కిక పద్ధతిలో వ్యాఖ్యానం చెప్పడానికి సిద్ధమై వున్నాడని పరిస్థితులన్నీ తెల్పాయి. మెజారిటీ స్థానాన్ని కాపాడటం అవశ్యకం అయింది. ఎందుకంటే విప్లవవాది యొక్క స్వతంత్ర(?) ఇచ్ఛ సమస్య గురించి మాట్లాడినప్పుడు కామ్రేడ్ ప్లెహానొవ్ — నిర్దిష్టమైన సమగ్రమైన పరిశీలన అవసరమైన గతితర్కాన్ని తిరస్కరించి — విప్లవవాదిలో వుండవలసిన విశ్వాస సమస్యను, పార్టీలో ఒక నిర్దిష్టమైన పక్షానికి నాయకత్వం వహిస్తూన్న "శ్రామికవర్గ నాయకుని"లో వుండవలసిన విశ్వాస సమస్యను చల్లగా దాటవేశాడు. అరాజకపు వ్యష్టివాదాన్ని గురించి మాట్లాడినప్పుడు, క్రమశిక్షణ ఉల్లంఘనలను "ఒక్కొక్కప్పుడు మనం చూడకుండా వదిలేయాలనీ, "విప్లవ భావంనుంచి దూరమవడంతో ఎంత మాత్రం సంబంధంలేని మనోభావంలో వేరూనివున్న" మేధావి లైసెన్సుకు "ఒక్కొక్కప్పుడు" లొంగాలనీ మనకు సలహా యిచ్చినప్పుడు కామ్రేడ్ ప్లెహానొవ్, పార్టీలోని మెజారిటీ యొక్క స్వతంత్ర ఇచ్ఛను కూడా లెక్కలోకి తీసుకోవాలనీ, అరాజకపు వ్యష్టివాదానికి ఏ మేరకు రాయితీలు ఇవ్వవచ్చు అనే విషయాన్ని నిర్ణయించే పనిని ప్రత్యక్ష కార్యకర్తలకు విడిచిపెట్టి తీరాలనీ మరచిపోయినట్టుంది. సాహిత్య స్థాయిలో క్రూరతనపు అరాజకవాదంతో పోరాడటం సులభం, కాని అదే సంఘంలో అరాజకపు వ్యష్టివాదితో ప్రత్యక్ష కార్యాచరణను కొనసాగించడం చాలా కష్టం. ఆచరణలో అరాజకవాదానికి ఇవ్వగల రాయితీల పరిమితిని నిర్ణయించే పనిని తనపై వేసుకున్న రచయిత తన మితిమీరిన, కేవల పిడివాద సాహిత్య దురహంకారాన్ని బయటపెట్టుకున్నవాడు మాత్రమే అవుతాడు. కామ్రేడ్ ప్లెహానొవ్ (ప్రాముఖ్యత కోసం బజారొవ్[51] చెప్పుతూ వుండిన విధంగా) మరో చీలిక సంభవిస్తే కార్మికులు మనలను అర్థంచేసుకోరు అని హుందాగా వ్యాఖ్యానించాడు; అయితే అదే సమయంలో ఆయన కొత్త "ఇస్క్రా"లో అంతులేని వ్యాసాల పరంపరను ప్రారంభించాడు. వాటి నిజమైన నిర్దిష్టమైన అర్థం ఏమిటో కార్మికులకే గాక యావత్తు ప్రపంచానికీ కూడ అగమ్యగోచరంగా వుండక తప్పలేదు. కేంద్ర కమిటీ సభ్యుడొకడు[52] "ఏం చెయ్యకూడదు" వ్యాసం ప్రూఫులు చదివినప్పుడు కామ్రేడ్ ప్లెహానొవ్‌ను, ఒక ప్రచురణ పరిమాణాన్ని (పార్టీ మహాసభయొక్క, లీగు మహాసభయొక్క మినిట్స్‌ను) కొంత తగ్గించి ప్రచురించాలనే ఆయన పథకం యీ వ్యాసంతో వమ్మైపోతుందని హెచ్చరించడంలో ఆశ్చర్యం లేదు. ఈ వ్యాసం కుతూహలాన్ని రేపుతుంది. సామాన్యునికి చురుకు కలిగించేదీ, అదే సమయంలో అతనికి పూర్తిగా అగమ్యగోచరమైనదీ అయిన విషయాన్ని అతని నిర్ణ

యానికి పెడుతుంది.* ప్రజలు కలవరపాటుతో "ఏం జరిగింది?" అని తప్పనిసరిగా అడిగేటట్టు చేస్తుంది. కామ్రేడ్ ప్లెహానొవ్ రాసిన యీ వ్యాసం దానిలోని వాదాల సాధారణత, అది చేసే సూచనల అస్పష్టత మూలంగా సోషల్ డెమోక్రసీ శత్రువులలో సంతోషాన్ని కలుగజేయడంలో ఆశ్చర్యం లేదు. "రివల్యుత్సియోన్నయ రొస్సీయా"[54] పత్రికలో చెక్కభజనలు, "ఒస్వొబొజ్దేనియే" పత్రికలో స్థిరమైన రివిజనిస్టులనుంచి వచ్చిన పరమానంద భరితమైన పొగడ్తలు. హాస్యాస్పదమైన విచారకరమైన యీ అపార్థాలన్నిటికీ మూలం, నిర్దిష్టమైన సమస్యలు వాటి నిర్దిష్టతతోనే పరిశీలింపబడాలి అనే గతితర్కపు మౌలిక సూత్రాన్ని ఉల్లంఘించడంలోనే వుంది. తరువాత కామ్రేడ్ ప్లెహానొవ్ దానినుంచి బయట పడటానికి ఎంతో హాస్యాస్పదంగానూ, విచారకరంగానూ ప్రయత్నించాడు.[55] ప్రత్యేకించి స్త్రూవె పొందిన ఆనందం ఎంతో సహజం: కామ్రేడ్ ప్లెహానొవ్ అనుసరించిన (బహుశా వాటిని సాధించలేకపోవచ్చు) "సదుద్దేశాల" (killing with kindness)** పట్ల ఆయన ఎంత మాత్రం ఆసక్తి కలిగి వుండలేదు; మన పార్టీలో అవకాశవాద పక్షం వైపు వచ్చిన మొగ్గుకు స్త్రూవె సంతసించాడు, సంతసించకుండా వుండలేడు. ఈ మొగ్గు కొత్త "ఇస్క్రా"లో ప్రారంభమైంది. అది అందరికీ స్పష్టంగా కనబడుతూనే వుంది. ఏ సోషల్ డెమోక్రటిక్ పార్టీలో అయినా అవకాశవాదం వైపు వచ్చే ప్రతి మొగ్గునూ, అది ఎంత స్వల్పమైనది అయినా, ఎంతో తాత్కాలికమైనది అయినా సంతసించేది ఒక్క రష్యన్ బూర్జువా డెమోక్రట్లు ఒక్కళ్లే కాదు. సూక్ష్మబుద్ధిగల శత్రువు అంచనా చాలా అరుదుగా కేవల అపార్థాలమీద ఆధారపడి వుంటుంది: ఒక మనిషి చేసిన తప్పును అతనిని

* మనం ఏకాంతంగా తీవ్రమైన, ఉద్రిక్తమైన వాదోపవాదాలు జరుపుకుంటున్నాము. ఆకస్మికంగా మనలో ఒకరు ఎగిరి గంతువేసి కిటికీ తలుపులు బార్లా తెరిచి సొబకేవిచ్ అనుయాయులపైన, అరాజకపు వ్యష్టివాదులపైన, రివిజనిస్టులపైన, వగైరాలపైన కేకలు వేయడం మొదలుపెడతాడు. పని లేని కుతూహలుర గుంపు సహజంగానే వీధిలో పోగవుతుంది. మన శత్రువులు సంతోషిస్తారు. వివాదపడుతున్న వారిలో మరికొందరు కూడ కిటికీ వద్దకు వెళ్లి ఎవరికీ ఏమీ తెలియని విషయాలను సూచిస్తూ విషయం అంతటిని గురించీ పొందిక అయిన వివరణను ఇవ్వగోరుతారు. దానిమీదట జగడాలను గురించి చర్చించడం నిరుపయోగమని "ఇస్క్రా" సంచిక 53 పేజి 8, 2వ కాలం, కిందినుండి 24వ పంక్తి) కిటికీ తలుపులు మూసివేయబడతాయి. "జగడాలను" గురించి "ఇస్క్రా"లో చర్చ ప్రారంభించడం నిరర్థకం, కామ్రేడ్ ప్లెహానొవ్[53] అది నిజానికి దగ్గరలో వుంటుంది!

** కారుణ్యంతో చంపడం. — సం.

ప్రశంసించే వారిని బట్టి చెప్పవచ్చు. పాఠకుడు అశ్రద్ధగా వుంటాడని, కామ్రేడ్ ప్లెహానొవ్ ఆశించడమూ, మెజారిటీ కో-ఆప్టేషను విషయంలో వ్యక్తిగతమైన రాయితీలు ఇవ్వడానికి బేషరతుగా అభ్యంతరం చెప్పింది గాని, పార్టీలో వామపక్షంనుంచి మితవాద పక్షానికి మారడానికి కాదని నిరూపించడానికి ప్రయత్నించడమూ వృథాప్రయాస. ఇక్కడున్న విషయం, చీలిక రాకుండా చేయడానికి (అది చాలా ప్రశంసనీయం) కామ్రేడ్ ప్లెహానొవ్ వ్యక్తిగతమైన రాయితీ కల్పించాడనేది కాదు. కాని నిలకడలేని రివిజనిస్టులతోనూ, అరాజకపు వ్యష్టివాదులతోనూ వాదించవలసిన అవసరాన్ని పూర్తిగా గుర్తించుతూనే ఆయన దానికి బదులు అరాజకవాదానికి ఆచరణలో రాయితీలు ఏమేరకు ఇవ్వవచ్చు అనే విషయంపై తాను విడిపోయిన మెజారిటీతో పోరాడటానికి ఎంచుకున్నాడు. ఇక్కడున్న విషయం కామ్రేడ్ ప్లెహానొవ్ సంపాదకవర్గంలోని వ్యక్తుల కూర్పును మార్చాడనేది కాదు, కాని రివిజనిజాన్నీ అరాజకవాదాన్నీ వ్యతిరేకించడంలో తన స్థానాన్ని వదలుకున్నాడు, పార్టీ కేంద్ర పత్రికలో ఆ స్థానాన్ని సమర్థించడం మానేశాడు.

ఆ సమయంలో మెజారిటీకి ఏకైక నిర్మాణయుత ప్రతినిధిగా వున్న కేంద్ర కమిటీ విషయానికి వస్తే అప్పుడు అరాజకవాదానికి ఆచరణలో రాయితీలు ఏమేరకు ఇవ్వవచ్చు అనే విషయంపై మాత్రమే కామ్రేడ్ ప్లెహానొవ్ దానినుంచి వేరైపోయాడు. నా రాజీనామా, killing with kindness అనే విధానానికి స్వేచ్ఛ యిచ్చిన నవంబరు తరువాత దాదాపు ఒక నెల గడచిపోయింది. అన్ని రకాల సంబంధాల ద్వారా ఈ విధానంయొక్క ఆవశ్యకతను పరీక్షించడానికి కామ్రేడ్ ప్లెహానొవ్ "ఏం చెయ్యకూడదు" అనే తన వ్యాసాన్ని ప్రచురించాడు. అది మార్తొవ్ అనుయాయులకు సంపాదకవర్గంలో చేరడానికి ఏకైక టిక్కెట్టు అయివుండింది — ఇప్పటికీ అయివుంది అని చెప్పాలి. నినాదాలు — రివిజనిజం (దీనితో మనం పోరాడాలి కాని ప్రతిస్పర్థిని కనికరిస్తూనూ) అరాజకపు వ్యష్టివాదం (దీనితో సరసమాడి కారుణ్యంతో చంపాలి) — ఈ టిక్కెట్టుమీద ప్రత్యేకలిపిలో ప్రస్ఫుటంగా ముద్రించబడ్డాయి. అయ్యలారా, దయచేసి లోపలికి రండి, మిమ్మల్ని నేను కారుణ్యంతో చంపుతాను — ఇదే కామ్రేడ్ ప్లెహానొవ్ సంపాదకవర్గంలోని తన కొత్త సహచరులకు యిచ్చిన ఆహ్వాన పత్రం ద్వారా చెప్పినది. సహజంగానే కేంద్ర కమిటీకి యిక మిగిలిందల్లా, దాని అభిప్రాయంలో అరాజకపు వ్యష్టివాదానికి ఆచరణలో రాయితీలు ఏమేరకు ఇవ్వవచ్చు అనే విషయంపై తన ఆఖరు మాటను (తుది హెచ్చరిక అంటే అదే — సాధ్యపడే శాంతి విషయమై ఆఖరు మాట) చెప్పడం. మీరు శాంతినైనా కోరాలి — అలాంటి సందర్భంలో మా కారుణ్యస్వభావాన్ని, శాంతి కాముకతను, రాయితీలు ఇవ్వడానికి సంసిద్ధత, వగైరాలను రుజువుచేసేటందుకు ఇక్కడ కొన్ని సీట్లు వున్నాయి (పార్టీలో శాంతికి హామీ వుండాలంటే

అంతకంటె ఎక్కువ సీట్లు మీకు ఇవ్వలేము, శాంతి అంటే వాదోపవాదాలు వుండవనే తాత్పర్యంలో కాదు, అరాజకపు వ్యష్టివాదంచే పార్టీ నాశనం కాకుండా వుండాలనే తాత్పర్యంలో); మీరు యీ సీట్లు తీసుకుని అకీమొవ్‌నుంచి ప్లెహానొవ్‌కేసి మెల్లిమెల్లిగా తిరిగి మొగ్గండి. లేదా మీరు మీ దృక్పథాన్ని కొనసాగించుతూ అభివృద్ధి చేస్తూ, పూర్తిగా అకీమొవ్ వైపు మొగ్గాలని (నిర్మాణాత్మక సమస్యలలో అయితే మాత్రమే) మీరు చెప్పేదే సరి అయినది గాని ప్లెహానొవ్ చెప్పేది కాదని పార్టీని ఒప్పించగోరాలి — అలాంటి సందర్భంలో మీ సొంత రచయితల గ్రూపును ఏర్పరచుకోండి, తదుపరి మహాసభలో ప్రాతినిధ్యం సంపాదించండి. 1903 నవంబరు 25వ తేదీన మార్తొవ్ అనుయాయులకు కేంద్ర కమిటీ యిచ్చిన తుది హెచ్చరికలో ఎంతో స్పష్టంగా వున్న యీ ప్రత్యామ్నాయం ("ముట్టడి స్థితి"నీ, "లీగు మినిట్స్‌పై వ్యాఖ్యానా"న్నీ చూడండి*) ప్లెహానొవూ, నేనూ 1903 అక్టోబరు 6న పాత సంపాదకులకు పంపిన లేఖకు పూర్తిగా అనుగుణంగా వుంది; అది వ్యక్తిగతమైన కోపం అయినా అవాలి (అలాంటి సందర్భంలో ఏమైతే అయిందని మేము "కో-ఆప్టు" కూడా చేసుకోవచ్చు), లేదా అది సూత్రబద్ధమైన అభిప్రాయభేదం అయినా అవాలి (అలాంటి సందర్భంలో మీరు మొట్టమొదట పార్టీని ఒప్పించాలి, ఆ తరువాత మాత్రమే కేంద్ర సంస్థలలో వ్యక్తుల కూర్పును మార్చడం గురించి మాట్లాడాలి). కేంద్ర

---

*మార్తొవ్ తన "ముట్టడి స్థితి"లో ప్రయివేటు సంభాషణలను ఉదహరించడం వగైరా పనులద్వారా కేంద్ర కమిటీ తుది హెచ్చరికపై కల్పించిన చిక్కు గురించి సహజంగానే నేనిప్పుడు చర్చించను. ఇది నేను కిందటి అధ్యాయంలో వివరించిన "పోరాటంలో రెండవ పద్ధతి," నరాల వ్యాధులలో నిపుణుడైనవాడు మాత్రమే ఆ చిక్కును విడదీయగలడు. సంప్రదింపులను ప్రచురించకూడదని కేంద్ర కమిటీతో ఒక ఒప్పందం వుందని కామ్రేడ్ మార్తొవ్ పట్టుబడుతున్నాడని మాత్రమే చెప్తే సరిపోతుంది. అత్యంత ఓపికతో వెతికినప్పటికీ ఆ ఒప్పందం ఈనాటి వరకూ దొరకలేదు. కేంద్ర కమిటీ తరఫున సంప్రదింపులు జరిపిన కామ్రేడ్ త్రవీన్‌స్కీ, "ఇస్క్రా" సంపాదకులకు నేను రాసిన లేఖను వెలుపల ప్రచురించడానికి నాకు హక్కు వున్నదని తాను భావించినట్లు రాతమూలకంగా నాకు తెలిపాడు.

కాని కామ్రేడ్ మార్తొవ్ ఉపయోగించిన ఒక వాక్యం నాకు ప్రత్యేకించి నచ్చింది. అదేమిటంటే, "అధ్వాన్నపు రకం బోనపార్టిజం."[56] కామ్రేడ్ మార్తొవ్ యీ భావాన్ని చాలా సముచితంగా తీసుకువచ్చాడని నేను అనుకుంటున్నాను. ఈ భావంలో వున్నదేమిటో నిష్పక్షపాతంగా పరిశీలిద్దాం. నా అభిప్రాయంలో దాని అర్థం లాంఛనప్రాయంగా చట్ట

కమిటీ యీ సున్నితమైన సమస్యా పరిష్కారాన్ని మార్తొవ్ అనుయాయులకే మరింత సత్వరమే వదిలిపెట్టగలదు, ఎందుకుంటే సరిగా ఇదే సమయంలో కామ్రేడ్ మార్తొవ్ తన profession de foi* ("మరోసారి మైనారిటీలో") ఈ కింది విధంగా రాశాడు:

"మైనారిటీకి ఒకే ఒక గౌరవానికి అర్హత వుందని చెప్పుకుంటున్నారు, అదేమిటంటే, 'ఓడిపోయి' నప్పటికీ మరో పార్టీని ఏర్పాటు చేయదని రుజువు చేసుకోడంలో మన పార్టీ చరిత్రలో మొదటిదై వుండటం. పార్టీయొక్క నిర్మాణాత్మక అభివృద్ధిని గురించిన తమ అభిప్రాయాలన్నిటినుంచే మైనారిటీ ఈ వైఖరిని తీసుకుంది; పార్టీయొక్క పూర్వపు కార్యకలాపాలతో తమకున్న గట్టి సంబంధాల చైతన్యంనుంచే యీ వైఖరి వచ్చింది. 'కాగితం విప్లవాల' తాంత్రిక శక్తిలో మైనారిటీకి నమ్మకం లేదు. పార్టీలోపల కేవలం భావజాలాత్మక ప్రచారం సాగించడం ద్వారానే వారు నిర్మాణానికి సంబంధించిన తమ సూత్రాల విజయాన్ని సాధించుతారు అనడానికి వారి ప్రయత్నాలు జీవితంలో లోతుగా వేరూని వుండటమే ఒక హామీ అని వారు గ్రహించారు." (కిందిగీతలు నావి.)

ఎంత సగర్వమైన, మహోజ్వలమైన మాటలు! అవి వట్టి మాటలు మాత్రమే అని ఘటనల ద్వారా తెలుసుకోడం ఎంత బాధాకరంగా వుంటుంది... కామ్రేడ్ మార్తొవ్! మీరు నన్ను క్షమిస్తారని ఆశిస్తాను, కాని ఇప్పుడు నేను మెజారిటీ తరపున ఈ "గౌరవం" మాకు దక్కాలని వాదిస్తాను. దానికి మీరు అర్హులు కారు. అది నిజంగా గొప్ప గౌరవం. దానికోసం పోరాడ తగినదే. ఎందుకంటే బృందం సరళినుండి చీలికల పట్ల అసాధారణబద్ధమైన పద్ధతులలో, కాని వాస్తవంలో ప్రజాభీష్టాన్ని (లేక పార్టీ అభీష్టాన్ని) ధిక్కరించి అధికారాన్ని సంపాదించడం. అంతేకదా కామ్రేడ్ మార్తొవ్? అది అంతే అయితే "అధ్వాన్నపు రకం బోనపార్టిజాన్ని" అనుసరించిన నేరం ఎవరిదో నిర్ణయించే పనిని ప్రజలకు నేను నిర్భయంగా వదిలేయవచ్చు. మార్తొవ్ అనుయాయులను తీసుకోకుండా వుండేటందుకు తమకున్న యీ లాంఛనప్రాయపు హక్కును ఉపయోగించుకుని వుండగలిగినప్పటికీ (అలా చేసివుంటే రెండవ మహాసభ అభీష్టంమీద ఆధారపడి ఉంది), లెనినూ, కామ్రేడ్ Y దానిని ఉపయోగించుకోలేదు. లేదా లాంఛనప్రాయంగా చట్టబద్ధమైన పద్ధతులలో ("ఏకగ్రీవ కో-ఆప్టేషను ద్వారా") సంపాదకవర్గాన్ని ఆక్రమించినవారి మద్దతు వుండి వుండేది — ఇది వాస్తవంగా రెండవ మహాసభ అభీష్టానికి అనుగుణంగా లేదని వారికి తెలుసు. ఈ అభీష్టాన్ని మూడవ మహాసభలో పరీక్షకు పెట్టడానికి వారు భయపడుతున్నారు.

* కార్యక్రమం, దృక్పథం వివరణ. — సం.

మైన చులకన వైఖరిని అవలంబించడం' ''అందితే జుట్టు లేకపోతే కాళ్లు పట్టుకోడం'' అనే సూత్రాన్ని అసాధారణమైన పట్టుదలతో అమలు జరపడం అనే సంప్రదాయాలు మనకి సంక్రమించాయి.

---

స్వల్పమైన బాధల కంటె (కో-ఆప్టేషన్ విషయమై జగడాల రూపంలో వున్న వాటి కంటె) గొప్ప సుఖం (ఐక్య పార్టీని కలిగి వుండటం) ఆధిక్యత వహించి తీరాలి. ఆధిక్యత వహించింది కూడ. నేను కేంద్ర పత్రికనుంచి రాజీనామా చేశాను. (ప్లెహానొవ్తూ, నేనూ కేంద్ర పత్రిక సంపాదకవర్గం తరపున ప్రతినిధిగా పార్టీ కౌన్సిలుకు పంపిన) కామ్రేడ్ Y కౌన్సిలునుంచి రాజీనామా చేశాడు. శాంతి విషయమై కేంద్ర కమిటీ చెప్పిన తుది మాటకు మార్తొవ్ అనుయాయులు ఒక యుద్ధ ప్రకటనతో సమానమైన లేఖతో సమాధానం యిచ్చారు (పైన పేర్కొన్న ప్రచురణలు చూడండి). అప్పుడు, అప్పుడు మాత్రమే, ప్రచురణ విషయమై నేను సంపాదకవర్గానికి నా లేఖను రాశాను (''ఇస్క్రా'' సంచిక 53). అది రివిజనిజం గురించి మాట్లాడటమూ, అస్థిరత, అరాజకపు వ్యష్టివాదం, వివిధ నాయకుల ఓటమి గురించి చర్చించడమూ అయితే, అయ్యలారా, జరిగినదంతా, మనం ఎలాంటి దాపరికం లేకుండా చెబుదాం — ప్రచురణ గురించిన ఆ లేఖయొక్క సారాంశం అది. సంపాదకవర్గం కోపంతో కూడిన తిట్లతోనూ అహంకార పూరితమైన మందలింపుతోనూ సమాధానం యిచ్చింది: ''బృందం సరళి జీవితపు అల్పత్వాన్నీ జగడాన్నీ'' రేపడానికి సాహసించవద్దు అని (''ఇస్క్రా'' సంచిక 53). అలాగనా అనుకున్నాను నాలో నేను: ''బృందం సరళి జీవితపు అల్పత్వమూ జగడమూనా?''... మంచిది, es ist mir recht, అయ్యలారా, ఆ విషయంలో నేను మీతో ఏకీభవిస్తాను. అంటే దాని అర్థం, ''కో-ఆప్టేషన్''పై జరిగిన యీ రచ్చనంతనూ బృందం సరళి జగడంగా మీరు సూటిగా జమకడుతున్నారన్నమాట. అది నిజమే, కాని యీ అపశృతి ఏమిటి? — అదే సంచిక 53లోని సంపాదకీయ వ్యాసంలో, అదే సంపాదకవర్గం (అని మనం అనుకోవాలి) బ్యూరాక్రసీని గురించీ, లాంఛన ప్రాధాన్యవాదం మొదలైన వాటిని గురించీ రాసింది.* కేంద్ర పత్రికకు కో-ఆప్టేషన్ కోసం జరిగిన పోరాట సమస్యను లేవనెత్తడానికి సాహసించకండి, ఎందుకంటే అది జగడం అవుతుంది. కాని మేము కేంద్ర కమిటీకి కో-ఆప్టేషను సమస్యను లేవనెత్తుతాము, దానిని జగడం అనము, ''లాంఛన ప్రాధాన్యవాదం'' విషయంమీద సూత్ర భేదం అంటాము. లేదు, ప్రియమైన కామ్రేడ్స్, మీరా

---

* ఆ తరువాత తేలిన విధంగా, ''అపశ్రుతి'' చాలా తేలికగా వివరించబడింది — అది

పని చేయడానికి అనుమతించకుండా వుండడానికి నాకు అనుమతినివ్వండి అనుకున్నాను, నాలో నేను. మీరు నా దుర్గంమీద కాల్పులు జరపగోరుతున్నారు, అయినా నేను నా శతఘ్నులను మీకు అప్పగింతపెట్టాలని డిమాండు చేస్తున్నారు. ఎంతటి హాస్యగాళ్లు మీరు! అందుకనే నేను "సంపాదకవర్గానికి లేఖ"ను ("'ఇస్క్రా' సంపాదకవర్గంనుంచి నేను ఎందుకు రాజీనామా చేశాను" అనేది) రాశాను, "ఇస్క్రా" వెలుపల దానిని ప్రచురించాను. వాస్తవంగా జరిగినది ఏమిటో క్లుప్తంగా చెబుతూనూ, ఈకింది విభజన ప్రాతిపదికపై శాంతి సాధ్యం కాదా అని మరోసారి అడుగుతూనూ రాశాను: మీరు కేంద్ర పత్రికను తీసుకోండి, మేము కేంద్ర కమిటీని తీసుకుంటాము. అప్పుడు ఏ పక్షమూ తాము పార్టీలో "పరాయి" వాళ్లుగా భావించుకోరు. అప్పుడు అవకాశవాదం వైపు వచ్చిన మొగ్గును గురించి మనం మొదట పత్రికలలోనూ, ఆతరువాత బహుశా పార్టీ తృతీయ మహాసభలోనూ వాదించుకుందాం.

శాంతి గురించిన యీ ప్రస్తావనకు జవాబుగా శత్రువు తనకున్న శతఘ్ని దళాలు అన్నిటితోనూ, కొన్సిలుతో సహా, కాల్పులు ప్రారంభించాడు. నా తలమీద గుళ్ల వర్షం కురిపించబడింది. నిరంకుశాధిపతి, ష్వెయ్‌త్సెర్, బ్యూరాక్రట్, లాంఛన ప్రాధాన్యవాది, అతీత కేంద్రం, ఏకపక్షవాది, తలబిరుసు, మొండి, సంకుచితమనస్కుడు, కజ్జాకోరు.... చాలా బాగుంది, మిత్రులారా! అయిందా, ఇంకా ఏమైనా వుందా? దుర్బలమైన మందుగుండు సామగ్రి అని చెప్పాలి....

ఇప్పుడు నా వంతు వచ్చింది. పార్టీ నిర్మాణం గురించి కొత్త "ఇస్క్రా"కున్న కొత్త భావాల సారాంశాన్నీ, పార్టీ "మెజారిటీ" గానూ, "మైనారిటీ" గానూ చీలిపోడానికీ యీ భావాలకూ గల సంబంధాన్నీ పరిశీలిద్దాం. ఈ చీలికయొక్క నిజమైన లక్షణం ఏమిటో రెండవ మహాసభలో చర్చలను వోటింగును గురించి చేసిన విశ్లేషణ ద్వారా చూపాము.

---

కేంద్ర పత్రిక సంపాదకుల మధ్య వున్న అపశ్రుతి. "జగడాన్ని గురించి రాసినవాడు ప్లెహానొవ్ (57వ సంచికలో "విచారకరమైన అపార్థం" అనే వ్యాసంలో ఆయన ఒప్పుకోలు చూడండి) "మన మహాసభ" అనే సంపాదకీయ వ్యాసాన్ని మార్తొవ్ రాశాడు ("ముట్టడి స్థితి," పేజి 84). వాళ్లిద్దరూ వేరు వేరు దిశలకు లాగుతున్నారు.

# జ) కొత్త "ఇస్క్రా." నిర్మాణ సమస్యలలో అవకాశవాదం

కొత్త "ఇస్క్రా" సూత్రాల గురించిన విశ్లేషణకు ప్రాతిపదికగా కామ్రేడ్ అక్సెల్‌రోడ్ రాసిన రెండు వ్యాసాలను* మనం నిస్సందేహంగా తీసుకోవాలి. ఆయనకి ఇష్టమైన పూత పదాల నిర్దిష్టమైన అర్థం ఏమిటో వివరంగా ఇదివరకే చెప్పబడింది. ఇప్పుడు మనం వాటి నిర్దిష్టమైన అర్థాన్ని ఒక పక్కన పెట్టి "మైనారిటీ" (ఏదో ఒక చిన్న అల్పమైన విషయంలో) ఏ ఇతర వివాదాలకంటె ప్రత్యేకించి యీ వివాదాలనే యిచ్చేటట్టు చేసిన ఆలోచనా విధానాన్ని తరచి చూడడానికి ప్రయత్నించాలి. ఈ వివాదాల పుట్టుకతోనూ "కో-ఆప్టేషను" సమస్యతోనూ నిమిత్తంలేకుండా వాటి వెనుకనున్న సూత్రాలను పరిశీలించాలి. రాయితీలు కల్పించడం ఈనాడొక ఫాషన్‌గా వుంది, అందుచేత కామ్రేడ్ అక్సెల్‌రోడ్‌కు ఒక రాయితీ కల్పిద్దాం, ఆయన "సిద్ధాంతాన్ని" "శ్రద్ధాసక్తులతో" తీసుకొందాం.

కామ్రేడ్ అక్సెల్‌రోడ్ ప్రధాన వాదం ("ఇస్క్రా" సంచిక 57) ఏమిటంటే, "మన ఉద్యమంలో ఆరంభంనుంచీ కూడా రెండు వ్యతిరేక ధోరణులు వున్నాయి. వాటి పరస్పర వైరుధ్యం పెరగకుండానూ, దాని పెరుగుదలతోపాటు ఉద్యమాన్ని దెబ్బ తీయకుండానూ వుండజాలదు." స్పష్టంగా చెప్పాలంటే, "సూత్రరీత్యా (రష్యాలోని) శ్రామికవర్గ ఉద్యమ లక్ష్యం, పాశ్చాత్య సోషల్ డెమోక్రసీ లక్ష్యం ఒకటే." కాని మన దేశంలో కార్మిక జన బాహుళ్యం "తనకు పరాయిది అయిన ఒక సామాజిక భాగంచే" అంటే తీవ్రవాద మేధావి వర్గంచే ప్రభావితం చేయబడుతోంది. అందుచేత కామ్రేడ్ అక్సెల్‌రోడ్ మన పార్టీలోని శ్రామికవర్గ ధోరణికీ తీవ్రవాద మేధావి ధోరణికీ మధ్య వైరుధ్యం వుందని నిర్ధారణ చేస్తున్నాడు.

ఈ విషయంలో కామ్రేడ్ అక్సెల్‌రోడ్ చెప్పినది నిస్సందేహంగా సరి అయినది. అలాంటి వైరుధ్యం (ఒక్క రష్యన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీలో మాత్రమే కాదు) వున్నదనడంలో ఎంతమాత్రం సందేహం లేదు. అంతే కాదు, నేటి సోషల్ డెమోక్రసీ, విప్లవకర

* ఈ వ్యాసాలు, "రెండేళ్ల 'ఇస్క్రా'" సంపుటిలో చేర్చబడ్డాయి. రెండవ భాగం, పేజి 122 (సెంట్ పీటర్స్‌బుర్గ్, 1906). (1907 ప్రచురణకు గ్రంథకర్త వివరణ. — సం.)

సోషల్ డెమో(క్రసీగానూ (ఇదే ఛాందసపు సోషల్ డెమో(క్రసీగా కూడ పేరు పొందింది), అవకాశవాద (రివిజనిస్టు, మం(త్రిత్వవాద,[57] సంస్కరణవాద) సోషల్ డెమో(క్రసీగానూ చీలిపోడానికి ఈ వైరుధ్యమే చాలవరకు కారణమని అందరికీ తెలుసు. ఇది మన ఉద్యమపు గత పదేళ్ల కాలంలోనూ రష్యాలో కూడ పూర్తిగా ద్యోతకమైంది. ఉద్యమంయొక్క (శ్రామిక వర్గ ధోరణిని ఛాందసపు సోషల్ డెమో(క్రసీ వ్యక్తంచేస్తోందనీ, (ప్రజాతం(త్ర మేధావి వర్గ ధోరణిని అవకాశవాద సోషల్ డెమో(క్రసీ వ్యక్తంచేస్తోందనీ కూడ అందరికీ తెలుసు.

కాని, అందరికీ తెలిసిన యీ విషయానికి ఎంతో సమీపంగా వచ్చిన తరువాత కా(మేడ్ అక్సెల్‌రోడ్ పిరికిగా దానినుంచి వెనక్కి తగ్గనారంభించాడు. రష్యన్ సోషల్ డెమో(క్రసీ చరి(త్రలో ఈ చీలిక మొత్తంమీదనూ, (ప్రత్యేకించి మన పార్టీ మహాసభలోనూ ఎలా (ప్రదర్శితమైందో, ఆయన పార్టీ మహాసభను గురించి ఇది రాస్తున్నప్పటికీ, విశ్లేషించడానికి కించిత్తు (ప్రయత్నం కూడా ఆయన చేయలేదు! కొత్త ''ఇ(స్క్రా''యొక్క ఇతర సంపాదకులందరిలాగనే కా(మేడ్ అక్సెల్‌రోడ్ ఈ మహాసభ మినిట్స్‌పట్ల చచ్చే భయాన్ని (ప్రదర్శిస్తున్నాడు. పైన చెప్పినదంతా చూసిన తరువాత ఇది మనకు ఆశ్చర్యం కలిగించకూడదు, కాని మన ఉద్యమంలోని వివిధ ధోరణులను పరిశీలించుతున్నానని చెప్పుకునే ''సిద్ధాంతవేత్త''లో ఇది నిశ్చయంగా సత్య భయం అనే జబ్బే. ఈ జబ్బు మూలంగా మన ఉద్యమంలోని ధోరణుల గురించిన ఇటీవలి, అత్యంత సరిఅయిన సమాచారంనుంచి వెనక్కి తగ్గుతూ కా(మేడ్ అక్సెల్‌రోడ్ మనోహరమైన పగటి కలలలో మోక్షాన్ని అపేక్షిస్తున్నాడు. ఆయనిలా రాశాడు: ''చట్టబద్ధ మార్క్సిజం లేక సగం మార్క్సిజం మన లిబరల్స్‌కి ఒక సాహిత్యపర నాయకుని సమకూర్చ లేదా? కొంటెచేష్టల చరి(త్ర విప్లవకర బూర్జువా డెమో(క్రసీకి ఛాందసపు, విప్లవకర మార్క్సిజంనుంచి ఒక నాయకుని ఎందుకు సమకూర్చకూడదు?'' కా(మేడ్ అక్సెల్‌రోడ్ ఎంతో మనోహరమైనదిగా భావించే యీ పగటికల గురించి మనం చెప్పగలిగిందల్లా చరి(త్ర ఒక్కొక్కప్పుడు కొంటెపనులు చేస్తే చరి(త్రను విశ్లేషణజరిపే పనికి పూనుకున్నవారి కొంటె ఆలోచనలకు అది ఒక సాకు కాదు. సగం మార్క్సిజం నాయకుని ముసుగునుంచి లిబరల్ పైకి తొంగిచూస్తే అతని ''ధోరణిని'' జాడతీయ గోరినవారు (అలా చేయగలిగినవారు) చరి(త్ర చేయగల కొంటెపనులను ఉదహరించలేదు, కాని ఆ నాయకుని మనస్తత్వాన్నీ, తర్కాన్నీ గురించి పదుల వందల ఉదాహరణలనూ బూర్జువా సాహిత్యంలో మార్క్సిజం (ప్రతిబింబాన్ని బయటపెట్టిన అతని సాహిత్యపర (ప్రత్యేక లక్షణాలను అన్నిటినీ చూపారు.[58] కా(మేడ్ అక్సెల్‌రోడ్ ''మన ఉద్యమంలోని సాధారణ విప్లవాత్మక, (శ్రామిక వర్గ ధోరణులను'' విశ్లేషించడానికి పూనుకుంటూ ఆయనెంతో అసహ్యించుకునే పార్టీలోని ఆ ఛాందసపు పక్షపు ఫలానా ఫలానా (ప్రతినిధులు ఆయా ధోరణులు చూపారనడానికి

నిదర్శనగా గాని సాక్ష్యంగా గాని దేనినీ, అసలు దేనినీ, చూపలేకపోతే తన్మూలంగా ఆయన తన భావదారిద్ర్యపు లాంఛనప్రాయ యోగ్యతా పత్రాన్ని ఇచ్చిన వాడు అవుతాడు. ఆయన చెప్పగలిగిందల్లా చరిత్ర చేయగల కొంటెపనులను ఉదహరించడం మాత్రమే అయితే, కామ్రేడ్ అక్సెల్‌రోడ్ స్థితి నిజంగా బలహీనమైనదే అయివుండాలి!

కామ్రేడ్ అక్సెల్‌రోడ్ చేసిన మరో ప్రస్తావన — "జాకొబిన్‌ల"కు, ప్రస్తావన — మరింత సుబోధకమైనదిగా వుంది. నేటి సోషల్ డెమోక్రసీ విప్లవకరమైనదిగానూ, అవకాశవాద పూరితమైనదిగానూ చీలిపోడం చాల కాలంగా — రష్యాలో మాత్రమే కాదు — "మహత్తర ఫ్రెంచి విప్లవ యుగంతో చారిత్రక సాదృశ్యాలకు" అవకాశం యిచ్చిందనే విషయం కామ్రేడ్ అక్సెల్‌రోడ్‌కు బహుశా తెలిసే వుంటుంది. నేటి సోషల్ డెమోక్రసీకి చెందిన జిరోండిస్టులు ప్రతిచోటా, ఎల్లప్పుడూ తమ ప్రతికక్షులను వర్ణించడానికి "జాకొబినిజం," "బ్లాంకీయిజం"[59] వగైరా పదాల ప్రయోగానికి ఉపక్రమించుతారని కామ్రేడ్ అక్సెల్‌రోడ్‌కు బహుశా తెలిసే వుంటుంది. అందుచేత మనం కామ్రేడ్ అక్సెల్‌రోడ్ కున్న సత్య భయాన్ని అనుకరించవద్దు, మన మహాసభ మినిట్స్ చూద్దాం, మనమిప్పుడు పరిగణించుతున్న ధోరణులనూ, చర్చించుతున్న సాదృశ్యాలనూ విశ్లేషించడానికీ పరిశీలించడానికీ కావలసిన సమాచారం వాటిలో దొరుకుతుందేమో తెలుసుకుందాం.

మొదటి ఉదాహరణ: కార్యక్రమం గురించి పార్టీ మహాసభలో జరిగిన చర్చ కామ్రేడ్ అకీమొవ్ (కామ్రేడ్ మర్తీనొవ్‌తో "పూర్తిగా ఏకీభవిస్తూ") ఇలా అన్నాడు: "రాజకీయ అధికారాన్ని హస్తగతం చేసుకోడం (శ్రామికవర్గ నియంతృత్వాన్ని) గురించిన అంశం అన్ని యితర సోషల్ డెమోక్రటిక్ పార్టీల కార్యక్రమాలతోనూ పోలిస్తే, ఏ విధంగా సూత్రీకరించబడిందంటే, నాయక సంఘంయొక్క పాత్ర తాను నాయకత్వం వహించే వర్గాన్ని వెనుకకు తోసివేసి, దానిని వేరు చేసేదిగా అర్థంవచ్చేటట్లు వ్యాఖ్యానించవచ్చు, వాస్తవంలో ప్లెహానొవ్ దీనిని అలాగే వ్యాఖ్యానించాడు. పర్యవసానంగా, మన రాజకీయ కర్తవ్యాల సూత్రీకరణ సరిగ్గా 'నరోద్నయ వోల్య' విషయంలాగనే వుంది" (మినిట్స్, పేజి 124). కామ్రేడ్ ప్లెహానొవూ, ఇతర "ఇస్క్రా" అనుయాయులూ కామ్రేడ్ అకీమొవ్‌తో వివాదపడి ఆయనను అవకాశవాది అని నిందించారు. ఈ వివాదం (చరిత్రయొక్క వ్యూహాజనితమైన కొంటెపనులలో గాక వాస్తవంలోనే) సోషల్ డెమోక్రసీకి చెందిన నేటి జాకొబిన్‌లకూ, నేటి జిరోండిస్టులకూ మధ్య వైరుధ్యాన్ని చూపుతుందని కామ్రేడ్ అక్సెల్‌రోడ్ తెలుసుకో లేదా? కామ్రేడ్ అక్సెల్‌రోడ్ (తాను చేసిన తప్పుల మూలంగా) సోషల్ డెమోక్రసీకి చెందిన జిరోండిస్టులతో చేరడంవల్లనే జాకొబిన్‌లను గురించి మాట్లాడటం ఆరంభించలేదా?

రెండవ ఉదాహరణ: "ప్రజాస్వామిక సూత్రాల పరమ విలువ" గురించిన "మౌలిక

సమస్య''పై ''తీవ్రమైన అభిప్రాయభేదం'' వుందని కామ్రేడ్ పొసదోవ్‌స్కీ చెప్పాడు (పేజి 169). ప్లెహానొవ్‌తో పాటు ఆయన వాటి పరమ విలువను తోసిపుచ్చుతున్నాడు. ''మధ్యస్థవర్గ'' లేక ఊబి నాయకులు (యెగోరొవ్), ''ఇస్క్రా'' వ్యతిరేకుల నాయకులు (గోల్డ్‌బ్లాట్) యీ అభిప్రాయాన్ని గట్టిగా వ్యతిరేకిస్తున్నారు, ''బూర్జువా ఎత్తుగడలను అనుకరిస్తున్నా''డని ప్లెహానొవ్‌ను నిందిస్తున్నారు (పేజి 170). ఛాందసత్వానికీ, బూర్జువా ధోరణికీ మధ్య సంబంధం గురించి కామ్రేడ్ అక్సెల్‌రోడ్ కున్న భావం సరిగ్గా ఇదే, వున్న తేడా అంతా ఏమిటంటే, అక్సెల్‌రోడ్ విషయంలో ఇది అస్పష్టంగా వుంది, గోల్డ్‌బ్లాట్ దానిని నిర్దిష్టమైన వాదోపవాదాలతో ముడిపెట్టాడు. మేము మళ్లీ ఇలా అడుగుతున్నాము: ఈ వివాదం కూడా నేటి సోషల్ డెమోక్రసీకి చెందిన జాకొబిన్‌లకూ, జిరోండిస్టులకూ మధ్యనున్న వైరుధ్యాన్ని స్పష్టంగా మనకి చూపుతోందని పార్టీ మహాసభలో కామ్రేడ్ అక్సెల్‌రోడ్ తెలుసుకో లేదా? జిరోండిస్టులతో చేరడంవల్లనే కదా కామ్రేడ్ అక్సెల్‌రోడ్ జాకొబిన్‌లకు వ్యతిరేకంగా ఈ గోలను రేపినది?

మూడో ఉదాహరణ: నిబంధనావళిలోని మొదటి నిబంధనపై జరిగిన వాదోపవాదాలు. ''మన ఉద్యమంలో శ్రామికవర్గ ధోరణులను'' సమర్థిస్తున్నది ఎవరు? కార్మికుడు సంఘటితమవడానికి భయపడడనీ, శ్రామికునికి అరాజకత్వం పట్ల సానుభూతి లేదనీ, ''సంఘటితపడండి!'' అనే ప్రేరణను అతడు విలువైనదిగా ఎంచుతాడనీ గట్టిగా చెబుతున్నది ఎవరు? పూర్తిగా అవకాశవాదంతో నిండివున్న బూర్జువా మేధావివర్గం గురించి హెచ్చరిస్తున్నది ఎవరు? సోషల్ డెమోక్రసీకి చెందిన జాకొబిన్‌లు. పార్టీలోకి తీవ్రవాద మేధావులను దొంగచాటుగా ప్రవేశపెట్టడానికి ప్రయత్నిస్తున్నది ఎవరు? ఆచార్యుల గురించి, హైస్కూలు విద్యార్థులను, స్వేచ్ఛావిహారులను, తీవ్రవాద యువజనులను గురించీ ఆందోళన చెందేది ఎవరు? జిరోండిస్టు లీబెర్‌తోపాటు జిరోండిస్టు అక్సెల్‌రోడ్.

''శ్రమ విమోచన'' బృందపు మెజారిటీపై పార్టీ మహాసభలో బహిరంగంగా ఆరోపించబడిన ''అవకాశవాదమనే తప్పుడు నిందారోపణ''కు వ్యతిరేకంగా కామ్రేడ్ అక్సెల్‌రోడ్ తనను ఎంత తెలివితక్కువగా సమర్థించుకున్నాడు! జాకొబినిజం, బ్లాంకీయిజం వగైరాలను గురించి అరువుతెచ్చుకున్న బెర్న్‌స్టైనియన్ పాటను పాడుతూ ఆయన ఆ నిందారోపణను స్థిరపర్చే విధంగా తన్ను తాను సమర్థించుకున్నాడు! పార్టీ మహాసభలో తీవ్రవాద మేధావుల గురించిన ఆందోళనతో నిండివున్న తన ప్రసంగాలను ముంచెత్తి వేసేటందుకు ఆ మేధావుల ఉపద్రవం గురించి కేకలు పెట్టాడు.

ఈ ''భయంకరమైన మాటలు'' — జాకొబినిజం వగైరా — అవకాశవాదాన్ని వ్యక్తం చేస్తాయి తప్ప మరేమీకాదు. తన వర్గ ప్రయోజనాలను తెలుసుకుని వున్న శ్రామికవర్గ

*సంఘంలో* తనని తాను పూర్తిగా మమేకం చేసుకునే జాకొబినిస్టే *విప్లవకర సోషల్ డెమొక్రటే*. ఆచార్యుల గురించీ, హైస్కూలు విద్యార్థుల గురించీ నిట్టూర్పులు విడిచే వాడు, శ్రామికవర్గ నియంతృత్వం అంటే భయపడేవాడు, ప్రజాస్వామిక డిమాండుల పరమ విలువ కోసం పరితపించేవాడు అయిన జిరోండిస్టే *అవకాశవాది*. రాజకీయ పోరాటాన్ని కుట్రకు పరిమిత పర్చే భావం సాహిత్యంలో కొన్ని వేల సార్లు ఖండించబడిన తరువాత, వాస్తవ పరిస్థితులచే చాలా కాలం క్రితమే ఖండించబడి పక్కకు నెట్టివెయ్యబడిన తరువాత, సామూహిక రాజకీయ ఆందోళనయొక్క ప్రాముఖ్యత వివరించబడి, అసహ్యం కలిగించేటంతగా నెమరువేయబడిన తరువాత, నేడింకా కుట్రదారీ సంస్థలలో ప్రమాదం వుందని ఒక్క అవకాశవాదులకు మాత్రమే కనిపిస్తుంది. కుట్ర గురించిన, బ్లాంకీయిజం గురించిన యీ భయానికి నిజమైన ఆధారం ఆచరణాత్మక ఉద్యమంలో ఎక్కడా కనబడదు (దీనిని చూపించడానికి బెర్న్‌స్టైన్ అండ్ కంపెనీ చాలకాలంగా వృథా ప్రయత్నం చేస్తున్నారు). బూర్జువా మేధావియొక్క జిరోండిస్టు పిరికితనమే దానికి ఆధారం. వీరి మనస్తత్వం నేటి సోషల్ డెమొక్రట్లలో చాలా తరచుగా వెల్లడి అవుతోంది. నలభై, అరవై దశకాలకు చెందిన ఫ్రెంచి కుట్రదారీ విప్లవకారుల ఎత్తుగడల గురించి ఒక *కొత్త* హెచ్చరిక *మాటను* (ఇదివరకిది కొన్ని వందల సార్లు చెప్పబడింది) చెప్పడానికి కొత్త "ఇస్క్రా" ప్రయాసపడి చేస్తున్న ప్రయత్నాల ("ఇస్క్రా" సంచిక 62, సంపాదకీయం) కంటె హాస్యాస్పదమైనది మరొకటి లేదు.[60] "ఇస్క్రా" ఆతరువాతి సంచికలో నేటి సోషల్ డెమొక్రసీకి చెందిన జిరోండిస్టులు ఎవరికైతే శ్రామిక జనబాహుళ్యం మధ్య సాగించే రాజకీయ ఆందోళనయొక్క ప్రాముఖ్యం, కార్మికవర్గాన్ని ప్రభావితం చేసేటందుకు పార్టీకి ప్రధాన సాధనంగా శ్రామిక పత్రికల ప్రాముఖ్యం ఏనాడో తెలుసుకుని జీర్ణం చేసుకున్న ప్రాథమిక సత్యమో, ఆ నలభై దశకపు ఫ్రెంచి కుట్రదారుల గ్రూపును మనకు చూపుతారనడంలో సందేహం లేదు.

అయినప్పటికీ, ఏదో కొత్త విషయాన్ని చెబుతున్నట్టుగా నటించుతూ ప్రాథమిక విషయాలను పునశ్చరణ చేసి ఓనమాలకు తిరిగి వెళ్లే కొత్త "ఇస్క్రా" పోబడి యాదృచ్ఛికం కాదు; వారిప్పుడు మన పార్టీలోని అవకాశవాద పక్షంలో చేరారు గనుక అక్సెల్‌రోడ్, మార్తొవ్ వున్న సన్నివేశపు అనివార్య పర్యవసానం అది. వారికి వేరే గత్యంతరం లేదు. మహాసభలో జరిగిన పోరాటం దృష్ట్యానూ, అక్కడ రూపొందిన అభిప్రాయభేదాల చీలికల దృష్ట్యానూ అసమర్థనీయమైన తమ స్థానాన్ని ఏదో రకంగా సమర్థించుకోడానికి తగిన కారణాన్ని *సుదూరపు గతంలో* కనుగొన ప్రయత్నించేటందుకు గాను వారు అవకాశవాద పదజాలాన్ని పునశ్చరణ చేయాలి, *వెనక్కి పోవాలి*. జాకొబినిజాన్నీ, బ్లాంకీయిజాన్నీ గురించిన అకీమొవ్ ఫక్కీ పాండిత్య ప్రకర్షలకు కామ్రేడ్ అక్సెల్‌రోడ్, "ఆర్థికవాదులే" గాక "రాజ

కీయవేత్తలు'' సహితం ''పక్ష పాతులు,'' అత్యంత ''సమ్మోహితులు,'' వగైరా వగైరా అయివున్నారని అర్థం వచ్చేట్టుగా అకీమొవ్ ఫక్కీ ప్రలాపాలను జతచేస్తున్నాడు. ఈ పక్షపాతానికీ, వ్యామోహానికీ అతీతంగా వున్నానని గర్వంగా చెప్పుకునే కొత్త ''ఇస్క్రా''లో ఈ విషయంమీద రాయబడే గంభీరమైన వ్యాసాలను చదివి ఎవరైనా కలవరపాటుతో ఇలా అడుగుతారు: వారు చిత్రిస్తున్నది ఎవరి రూపచిత్రం? అలాంటి మాటలు వారు ఎక్కడ వింటున్నారు?[61] రష్యన్ సోషల్ డెమొక్రట్లు ఆర్థికవాదులుగానూ రాజకీయవేత్తలుగానూ విడిపోయారన్న సంగతి చాలా కాలం క్రితమే పాతబడిపోయిందని ఎవరికి తెలియదు? పార్టీ మహాసభకు పూర్వం ఒకటి లేక రెండు సంవత్సరాల ''ఇస్క్రా'' ఫైల్సు తిరగవేయండి, ''ఆర్థికవాద'' వ్యతిరేక పోరాటం 1902 నాటికే తగ్గిపోయి అంతరించిపోయిందని తెలుసుకుంటారు; ఉదాహరణకు 1903 జూలైలో (సంచిక 43) ''ఆర్థికవాదపు రోజులు నిస్సందేహంగా గడచిపోయాయి'' అని చెప్పబడుతోందనీ, ఆర్థికవాదం ''మృతిచెంది పూడ్చిపెట్టబడినదిగా'' పరిగణింపబడుతోందనీ, రాజకీయవేత్తలకున్న ఎలాంటి వ్యామోహం అయినా స్పష్టంగా పురాతన లక్షణాలను పొందివుండటంగా పరిగణింపబడుతోందనీ మీరు తెలుసుకుంటారు. అయితే ''ఇస్క్రా'' కొత్త సంపాదకవర్గం యీ మృతిచెంది పూడ్చిపెట్టబడిన చీలికకు ఎందుకు మరలుతున్నారు? రెండు సంవత్సరాల క్రితం ''రబోచెయె దేలొ''లో వారు చేసిన తప్పులకు మహాసభలో అకీమొవ్ అనుయాయులతో మనం పోరాడామా? ఆ పని చేసివుంటే మనం కేవలం మూఢులమై వుండేవారం. మనం ఆ పని చేయలేదనీ, మహాసభలో మనం అకీమొవ్ అనుయాయులతో పోరాడింది ''రబోచెయె దేలొ''లో వారు చేసిన పాత, మృతిచెంది పూడ్చిపెట్టబడిన తప్పులకోసం కాదనీ, వారి వాదనలలోనూ మహాసభలో వారి వోటింగులోనూ వారు చేసిన కొత్త తప్పుల కోసమేననీ అందరికీ తెలుసు. ఏ తప్పులు నిజంగా గతకాలానివి, ఏవి ఇంకా సజీవమైవుండి వివాదానికి దారితీశాయి అనే విషయాన్ని మనం నిర్ణయించినది ''రబోచెయె దేలొ''లో వారు తీసుకున్న వైఖరిని పట్టి కాదు. మహాసభలో వారి వైఖరిని పట్టే. మహాసభ నాటికి ఆర్థికవాదులుగానూ, రాజకీయవేత్తలుగానూ వచ్చిన పాత చీలిక ఇంకెంతమాత్రం లేదు; కాని, వివిధ అవకాశవాద ధోరణులు ఇంకా వున్నాయి. అవి అనేక సమస్యలపై జరిగిన చర్చలలోనూ వోటింగులోనూ వ్యక్తం అయాయి, చివరికి అవి పార్టీ ''మెజారిటీ''గానూ, ''మైనారిటీ''గానూ విడిపోయిన కొత్త చీలికకు దారితీశాయి. అసలు విషయం ఏమిటంటే, ''ఇస్క్రా'' కొత్త సంపాదకవర్గం, ప్రత్యక్ష కారణాల మూలంగా, మన పార్టీలో వచ్చిన యీ కొత్త చీలికకూ, వర్తమాన అవకాశవాదానికీ వున్న సంబంధాన్ని దాటవేయడానికి ప్రయత్నిస్తూ, పర్యవసానంగా కొత్త చీలికను వదలి పాత చీలికకు మరలవలసి వచ్చింది. కొత్త చీలికయొక్క రాజకీయ మూలకారణాన్ని వివరించలేని వారి అశ

క్తత (లేదా, తాము ఎంత సర్దుబాటు వైఖరిని అవలంబిస్తున్నారో రుజువు చేసుకోడానికి దాని మూలకారణాన్ని కప్పిపుచ్చాలనే వారి కోరిక*) ఏనాడో అంతరించిపోయిన పాత చీలి కను గురించి పదేపదే ప్రస్తావించేట్టు చేస్తోంది. కొత్త చీలిక నిర్మాణానికి సంబంధించిన సమస్యలపై వచ్చిన అభిప్రాయభేదంపై ఆధారపడివుందనీ ఈ అభిప్రాయభేదం నిర్మాణ సూత్రాలపై (నిబంధనావళిలోని మొదటి నిబంధనపై) వివాదంతో ఆరంభించి అరా జకవాదులకు మాత్రమే తగివున్న "ఆచరణ"తో అంతమైందనీ అందరికీ తెలుసు. ఆర్థికవాదులుగానూ రాజకీయవేత్తలుగానూ విడిపోయిన పాత చీలిక. ప్రధానంగా ఎత్తు గడలకు సంబంధించిన సమస్యలపై వచ్చిన అభిప్రాయభేదంమీద ఆధారపడి వుంది.

పార్టీ జీవితంలో ఎంతో సంక్లిష్టమైన, నిజంగా సామయికమూ, జరూరూ అయిన సమస్యలనుంచి ఏనాడో పరిష్కరింపబడిన యిప్పుడు మళ్లీ కృత్రిమంగా తిరగదోడబడుతున్న సమస్యలకు పోయే యీ తిరోగమనాన్ని సమర్థించుకునే తన ప్రయత్నంలో కొత్త "ఇస్క్రా" వినోదకరమైన పాండిత్య ప్రకర్షా ప్రదర్శనకు పూనుకుంది. ఇది తోకపట్టుకొని పోయే విధానం తప్ప మరేమీ కాజాలదు. కామ్రేడ్ అక్సెల్‌రోడ్ ప్రవేశపెట్టిన ఒక గూఢమైన "భావం" కొత్త "ఇస్క్రా" రాతలన్నిటిలోనూ దండలో దారంలాగ వుంది. అది చెప్పేది ఏమిటంటే, ఆకారంకంటె సారం ఎక్కువ ముఖ్యమైనదనీ, పార్టీ నిర్మాణంకంటె కార్య క్రమమూ ఎత్తుగడలూ ఎక్కువ ముఖ్యమనీ, "సంఘంయొక్క జీవత్వం అది ఉద్యమంలో ప్రవేశపెట్టే విషయ వస్తు పరిమాణానికీ విలువకీ సాక్షాత్తు అనురూప నిష్పత్తిలో వుంటుం

* "ఇస్క్రా" సంచిక 53లో "ఆర్థికవాదం"మీద ప్లెహానొవ్ రాసిన వ్యాసం చూడండి. ఆ వ్యాసానికి యిచ్చిన ఉపశీర్షిక కొద్దిగా తప్పుగా ముద్రించబడినట్టు తోస్తుంది. "పార్టీ రెండవ మహాసభ గురించిన పర్యాలోచన" అన్న దానికి బదులు "లీగు మహాసభను గురించిన" లేక "కో-ఆప్టేషను గురించిన" అని వుండాలనుకుంటాను. కొన్ని పరిస్థితులలో వ్యక్తిగత హక్కుదారీ వాదనలకు రాయితీలు కల్పించడం ఎంత సమంజసం అయినప్పటికీ (కూప స్థమండూక దృక్పథంనుంచి కాక పార్టీ దృక్పథంనుంచి), పార్టీని ఆందోళనపరుస్తున్న సమస్యలను గజిబిజి చేయడమూ, ఛాందసత్వంనుంచి అవకాశవాదం వైపు మొగ్గ నారం భించిన మార్తొవ్, అక్సెల్‌రోడ్‌ల కొత్త తప్పులకు బదులు మర్తీనొవ్, అకీమొవ్‌ల పాత తప్పులను (కొత్త "ఇస్క్రా" తప్ప మరెవరూ నేడు జ్ఞాపకం చేయని వాటిని) తెచ్చిపెట్ట డమూ ఎంతమాత్రం అనుమతింపదగినది కాదు. వీరిప్పుడు కార్యక్రమానికీ ఎత్తుగడలకూ సంబంధించిన చాలా సమస్యలమీద అవకాశవాదంనుంచి ఛాందసత్వం వైపుకు మొగ్గడానికి సంసిద్ధం అయివుండవచ్చు.

దనీ,'' కేంద్రీకరణ ''అంతిమం'' కాదు, అది ''సర్వరక్షక తాయెత్తు'' కాదు, వగైరా వగైరా అని. మహత్తరమైన సంభీరమైన సత్యాలు! కార్యక్రమం నిజంగానే ఎత్తుగడలకంటె అక్షరమాల ముఖ్యం, వాక్య నిర్మాణంకంటె శబ్ద లక్షణం ముఖ్యం — కాని వాక్య నిర్మాణ పరీక్షలో తప్పిన తరువాత, మరో సంవత్సరం కింది తరగతిలోనే వుంచివేయబడినందుకు గర్వపడే వారిని గురించి మనం ఏమి చెబుతాము? నిర్మాణ సూత్రాలను గురించి (నిబంధనావళిలోని మొదటి నిబంధన) కామ్రేడ్ అక్సెల్‌రోడ్ అవకాశవాదిలాగ వాదించాడు, సంఘంలోపల అరాజకవాదిలాగ ప్రవర్తించాడు (లీగు మహాసభ) — ఇప్పుడాయన సోషల్ డెమోక్రసీని మరింత పరిపూర్ణం చేయడానికి ప్రయత్నిస్తున్నాడు: అందని ద్రాక్ష పళ్లు పులుపు! సరిగా చెప్పాలంటే, పార్టీ నిర్మాణం ఏమిటి? అది కేవలం ఒక రూపం. కేంద్రీకరణ ఏమిటి? ఏమైనా అది తాయెత్తు కాదు. వాక్య నిర్మాణం ఏమిటి? అది శబ్దలక్షణం కంటె తక్కువ ముఖ్యమైనది; అది శబ్దలక్షణపు ప్రాథమిక అంశాలను మేళవించే ఒక రూపం మాత్రమే.... ''పార్టీ నిబంధనావళి ఎంత పరిపూర్ణమైనదిగా కనిపించినప్పటికీ దానిని ఆమోదించడం ద్వారాకంటె పార్టీ కార్యక్రమాన్ని తయారుచేయడం ద్వారా మహాసభ, పార్టీ పని కేంద్రీకరణకు ఎంతో ఎక్కువ కృషిచేసిందని మేము అంటే, కామ్రేడ్ అలెక్సాంద్రొవ్ మాతో ఏకీభవించడా?'' అని ''ఇస్క్రా'' కొత్త సంపాదకవర్గం విజయోత్సాహంతో అడుగుతోంది (సంచిక 56, అనుబంధం). ఈ సాంప్రదాయిక పలుకులు, మానవజాతిలాగనే సోషల్ డెమోక్రసీ ఎల్లప్పుడూ తాను నెరవేర్చగలిగిన కర్తవ్యాలను మాత్రమే నిశ్చయించుకుంటుందనే కామ్రేడ్ క్రిచేవ్‌స్కీ చేసిన ప్రసిద్ధ ప్రవచనంకంటె ఏమాత్రం తక్కువ కాని, ఏమాత్రం తక్కువ శాశ్వతమైనది కాని చారిత్రక ఖ్యాతిని పొందుతాయని ఆశించాలి. ఎందుకంటే, కొత్త ''ఇస్క్రా''యొక్క ఈ పాండిత్య ప్రకర్ష సరిగ్గా అలాంటిదే. కామ్రేడ్ క్రిచేవ్‌స్కీయొక్క పదజాలం ఎందుకు అపహాస్యం పాలైంది? ఆయన ఎత్తుగడల విషయంలో సోషల్ డెమోక్రట్లలో ఒక విభాగం చేసిన తప్పును — సరిఅయిన రాజకీయ కర్తవ్యాలను నిర్ణయించడంలో వారి అశక్తతను — సామాన్య విషయాన్ని ఒక తత్వంగా నమ్మించదలచి సమర్థించడానికి ప్రయత్నించాడు కనుకనే. సరిగ్గా అదే విధంగా కొత్త ''ఇస్క్రా'' నిర్మాణ వ్యవహారాలలో సోషల్ డెమోక్రట్లలో ఒక విభాగం చేసిన తప్పును — కొంతమంది కామ్రేడ్ల మేధావితత్వపు అస్థిరతను, వారిని అరాజకపు పదజాల ప్రయోగాల నుపయోగించే స్థితికి తీసుకుపోయినదానిని — ఒక సామాన్య విషయంగా, నిబంధనావళికంటె కార్యక్రమం ఎక్కువ ముఖ్యమైనదనీ, కార్యక్రమానికి సంబంధించిన సమస్యలు పార్టీ నిర్మాణానికి సంబంధించిన సమస్యలకంటె ఎక్కువ ముఖ్యమైనవనీ చెప్పి సమర్థించడానికి ప్రయత్నిస్తోంది! ఇది తోకపట్టుకుని పోయే విధానం కాక మరేమిటి? ఇది మరో

సంవత్సరంపాటు కింది తరగతిలోనే వదలివేయబడినందుకు గర్వించడం కాక మరేమిటి?

నిబంధనావళిని ఆమోదించడం కంటె కార్యక్రమాన్ని ఆమోదించడం పార్టీ పని కేంద్రీకరణకు ఎక్కువ సహాయపడుతుంది. తత్వంగా నమ్మించబడిన యీ సామాన్య విషయం, సోషల్ డెమోక్రసీతోకంటె బూర్జువా శిథిలత్వంతో ఎంతో ఎక్కువ పోలిక కలిగివున్న తీవ్రవాద మేధావి మనస్తత్వాన్ని వెలిగక్కుతుంది! ప్రసిద్ధమైన యీ పదజాలంలో కేంద్రీకరణ అనే పదం ఆలంకారిక తాత్పర్యంలో మాత్రమే ఉపయోగించబడింది. ఆ వాక్య కర్తలు ఆలోచించ జాలకపోయినా, ఆలోచించడానికి ఇష్టపడకపోయినా, బుండ్ వాళ్లతో కలిసి ఒక కార్యక్రమాన్ని ఆమోదించడం మన ఉమ్మడి కృషిని కేంద్రీకరించడానికి దారితీయకపోగా, మనలను చీలికనుంచి అయినా రక్షించలేకపోయిందనే యదార్థాన్ని కనీసం జ్ఞాపకం అయినా చేసుకుని వుండవలసింది. కార్యక్రమానికీ, ఎత్తుగడలకూ సంబంధించిన సమస్యలపై ఐక్యత ఆవశ్యకం, కాని అది పార్టీ ఐక్యతకూ, పార్టీ పని కేంద్రీకరణకూ ఎంత మాత్రం తగిన షరతు కాదు. (హరి భగవంతుడా, భావనలన్నీ గందరగోళపర్చబడిన యీనాడు మనం ఎంత ప్రాథమిక విషయాలను నెమరు వేయవలసి వచ్చింది!) అంతేగాకా, పార్టీ ఐక్యతకూ, పార్టీ పని కేంద్రీకరణకూ నిర్మాణ ఐక్యత అవసరం. కేవలం ఒక కుటుంబ బృందంకంటె ఎంతో పెద్దదిగా పెరిగిన పార్టీలో లాంఛనప్రాయమైన నిబంధనావళి మెజారిటీకి మైనారిటీ లోబడివుండటం, మొత్తానికి ఒక భాగం లోబడివుండటం లేకుండానే ఇది అనూహ్యం. కార్యక్రమానికీ ఎత్తుగడలకూ సంబంధించిన మౌలిక సమస్యలపై ఐక్యత లేనంత కాలమూ మనం ఒక అనైక్యతా దశలోనూ విడివిడి బృందాల దశలోనూ వుండే వారమని నిర్మొగమాటంగా ప్రకటించాం; సంయుక్త నిర్మాణ రూపాలను గురించి అయినా మాట్లాడలేదు, కాని కార్యక్రమంలోనూ ఎత్తుగడలలోనూ అవకాశవాదాన్ని ఎదిరించి పోరాడే కొత్త సమస్యలను (అప్పటికి అవి నిజంగానే కొత్తవి) గురించి ప్రత్యేకించి చర్చించాం. ప్రస్తుతం యీ పోరాటం, పార్టీ కార్యక్రమంలోనూ ఎత్తుగడలపై పార్టీ తీర్మానాల లోనూ సూత్రీకరించబడిన విధంగా ఇప్పటికే తగినంత ఐక్యతను సాధించిందని మనమంతా అంగీకరిస్తాం; తరువాతి చర్యనూ, ఉమ్మడి అంగీకారంతో తీసుకోవలసి వచ్చింది, ఆ చర్యను మనం తీసుకున్నాం: అన్ని శాఖలనూ ఒకటిగా కలిపే ఐక్య సంఘంయొక్క రూపాలను విశదీకరించాం. కాని ఇప్పుడు ఈ నిర్మాణ రూపాలు సగం నాశనం చేయబడ్డాయి, మనం వెనక్కి లాగివేయబడ్డాం, అరాజకపు ప్రవర్తనకూ, అరాజక పదజాలానికీ, పార్టీ సంపాదక వర్గం స్థానంలో పాత అధ్యయన బృందాన్ని పునరుద్ధరించడానికీ లాగివేయబడ్డాం. పండిత ప్రసంగానికి వాక్య నిర్మాణ విజ్ఞానం కంటె అక్షరామాల ఎక్కువ సహాయకారి అనే వాదంతో యీ వెనుకడుగు సమర్థించబడుతోంది!

మూడు సంవత్సరాల క్రితం ఎత్తుగడల గురించిన సమస్యలలో వర్ధిల్లిన తోకపట్టు కుని పోయే తత్వం యీనాడు నిర్మాణానికి సంబంధించిన సమస్యల విషయంలో పునరుద్ధ రించబడుతోంది. కొత్త సంపాదకవర్గపు ఈకింది వాదాన్ని చూడండి. కామ్రేడ్ అలెక్సాం ద్రొవ్ ఇలా అంటున్నాడు: "పార్టీలోని సమరశీల సోషల్ డెమోక్రటిక్ ధోరణి సైద్ధాంతిక పోరాటం ద్వారా మాత్రమేగాక నిర్దిష్టమైన నిర్మాణ రూపాల ద్వారా కూడ కొనసాగింప బడాలి." దానిపై సంపాదకవర్గం ఉపదేశ ధోరణిలో ఇలా అంది: "సైద్ధాంతిక పోరాటం, నిర్మాణ రూపాల మధ్య యీ సారూప్యం చూపడం పర్వాలేదు. సైద్ధాంతిక పోరాటమన్నది ఒక క్రమం. నిర్మాణ రూపాలు, మారుతూన్న పరిణతిచెందుతూన్న విషయవస్తువును — పరిణతిచెందుతూన్న పార్టీ ప్రత్యక్ష కార్యకలాపాలను — అలంకరించడానికి ఉద్దేశింపబడిన రూపాలు మాత్రమే." (నమ్మండి నమ్మకపోండి, వారు చెప్పేది అది — సంచిక 56 అనుబంధం 4వ పేజి, మొదటి కాలం చివర!) అది, సరిగ్గా ఫిరంగిగుండు ఫిరంగిగుండే, బాంబు బాంబే అనే దానిని గురించిన పరిహాసం రీతిలో వుంది! సైద్ధాంతిక పోరాటం ఒక క్రమం, నిర్మాణ రూపాలు విషయవస్తువులు అలంకరించే రూపాలు మాత్రమే! వివాదంలో వున్న విషయం ఏమిటంటే, మన సైద్ధాంతిక పోరాటం దాన్ని అలంకరించేటందుకు ఉన్నత శ్రేణికి చెందిన రూపాలను, అందరూ విధేయులై వుండవలసిన పార్టీ నిర్మాణ రూపాలను కలిగి వుండాలా లేక పాత అనైక్యత పాత బృంద రూపాలలో వుండాలా అనేది. మనం ఉన్నత శ్రేణికి చెందిన రూపాలనుంచి మరింత అనిపుణమైన రూపాలకు వెనక్కి లాగబడుతున్నాం. సైద్ధాంతిక పోరాటం ఒక క్రమం అనీ రూపాలు కేవలం రూపాలే అనే వాదనతో సమర్థింపబడు తోంది. ఇది సరిగ్గా గతించిన రోజులలో కామ్రేడ్ క్రిచేవ్‌స్కీ మనలను ఎత్తుగడలు ఒక ప్లాను అనే స్థానంనుంచి ఎత్తుగడలు ఒక క్రమం అనే స్థానానికి వెనక్కి లాగడానికి ప్రయ త్నించినట్టుగానే వుంది.

"శ్రామికవర్గ స్వయం శిక్షణ" గురించి కొత్త "ఇస్క్రా" డాంబికపు మాటలు చూడండి. అది రూపం మూలంగా విషయవస్తువును చూడలేకపోయే ప్రమాదంలో పడి వున్నారని భావింపబడే వారిని ఉద్దేశించినది (సంచిక 58 సంపాదకీయం). ఇది అకీమొవ్ తత్వం నెం. 2 కాదా? అకీమొవ్ తత్వం నెం. 1 "శ్రామికవర్గ పోరాటం"యొక్క మరింత "ప్రగాఢమైన" విషయవస్తువును గురించి, శ్రామికవర్గ స్వయం శిక్షణ గురించి చెప్పడం ద్వారా ఎత్తుగడల కర్తవ్యాలను సూత్రీకరించడంలో సోషల్ డెమోక్రటిక్ మేధావులలోని ఒక విభాగంయొక్క వెనుకబాటుతనాన్ని సమర్థించింది. అకీమొవ్ తత్వం నెం. 2 పార్టీ నిర్మాణం కేవలం ఒక రూపం మాత్రమేనని శ్రామికవర్గ స్వయం శిక్షణ ముఖ్యమైన విష యమని అదే మాదిరి గంభీరమైన మాటల ద్వారా సిద్ధాంతం విషయంలోనూ నిర్మాణాన్ని

ఆచరణలో పెట్టడంలోనూ సోషల్ డెమోక్రటిక్ మేధావులలో ఒక విభాగపు వెనుకబాటు తనాన్ని సమర్థిస్తోంది. చిన్న తమ్ముణ్ణి గురించి ఎంతో శ్రద్ధ వహించే పెద్దమనుషులైన మీకు ఒక విషయం చెబుతాను, శ్రామికవర్గం నిర్మాణం గురించీ, క్రమశిక్షణ గురించీ భయపడదు! కేవలం పార్టీ అజమాయిషీ కింద వారు పనిచేసినంత మాత్రాన పార్టీ సభ్యులుగా గుర్తింపబడిన సంఘంలో చేరదల్చుకోని ఘనులైన ఆచార్యులనూ, హైస్కూలు విద్యార్థులనూ చేర్చుకోడానికి శ్రామికవర్గం ఏమీ చేయదు. శ్రామికవర్గం తన యావజ్జీవితం చేతనూ సంఘటితం కావడానికి తర్ఫీదు పొందింది, మేధావి గర్విష్ఠులు చాలామంది కంటె ఎంతో సంపూర్ణంగా తర్ఫీదు పొందింది. మన కార్యక్రమం గురించీ, ఎత్తుగడల గురించీ కొంత అవగాహన చేసుకున్న శ్రామికవర్గం, విషయవస్తువుకంటె రూపం తక్కువ ముఖ్యమైనదని వాదించడం ద్వారా నిర్మాణంలోని వెనుకబాటుతనాన్ని సమర్థించదు. మన పార్టీలో నిర్మాణం క్రమశిక్షణ సరళిలోనూ, అరాజకపు మాటల పట్ల వ్యతిరేకత తృణీకారం సరళిలోనూ స్వయం శిక్షణ కొరతపడినవారు కొంతమంది మేధావులే గాని శ్రామికవర్గం కాదు. అది సంఘటితమవడానికి పరిపక్వం కాలేదని అనడంలో నెం. 2 రకం అకీమొవ్‌లు, అది రాజకీయ పోరాటానికి పరిపక్వం కాలేదని చెప్పిన నెం. 1 రకం అకీమొవ్‌లు దూషించినట్టుగానే శ్రామికవర్గాన్ని దూషిస్తున్నారు. చైతన్యవంతుడైన సోషల్ డెమోక్రట్ అయి తాను పార్టీ సభ్యుడనని భావించే శ్రామికుడు ఎత్తుగడల విషయంలో తోకపట్టుకుని పోయే విధానాన్ని తోసిపుచ్చిన తృణీకారభావంతోనే నిర్మాణం విషయంలో తోకపట్టుకుని పోయే విధానాన్ని కూడా తోసిపుచ్చుతాడు.

కడపటిగా, కొత్త "ఇస్క్రా"లో "కార్యకర్త" ప్రదర్శించిన ప్రగాఢ పాండిత్య ప్రకర్షను చూడండి. ఆయనిలా అన్నాడు: "సరిగా అర్థంచేసుకుంటే విప్లవకారుల కార్యకలాపాలను ఐక్యపర్చి కేంద్రీకృతం చేసే 'సమరశీల' కేంద్రీకృత సంఘం వుండాలనే భావం (కింది గీతలు దానిని మరింత ప్రగాఢ మొనర్చడానికి) సహజంగా అలాంటి కార్యకలాపాలు వున్నప్పుడు మాత్రమే రూపొందగలదు (నూతనమూ, తెలివైనదీ!); నిర్మాణమే ఒక రూపం అయివున్నందువల్ల (వినండి, వినండి!) దాని విషయవస్తువు అయిన విప్లవాత్మక కార్యకలాపాల పెరుగుదలతో పాటు మాత్రమే ఏకకాలంలో అది పెరగ గలదు" (సంచిక 57) (కింది గీతలు వ్యాసకర్తవి, యీ ఉల్లేఖన అంతట్లో మాదిరిగానే). ఇది జానపద కథలో ఒకని అంత్యక్రియలను చూసి "ఇలాంటి శుభ దినాలే ఇంకా ఎక్కువ రావాలని కోరుతున్నాను" అని అన్న మనిషిని జ్ఞాపకం చేయడం లేదా? మన పార్టీలో సరిగ్గా మన కార్యకలాపాల రూపమే (అంటే మన నిర్మాణం) వాటి విషయవస్తువు కంటె చాల కాలంగా వెనుకబడివున్నదనీ నిరాశాజనక మైనంతగా వెనుకబడివున్నదనీ అర్థం చేసుకోని కార్యకర్తలు

(ఆ మాటయొక్క నిజమైన అర్థంలో) ఎవరూ లేరని నా నమ్మకం, వెనుకబడివున్నవారికి "పంక్తిలోనే వుండండి, ముందుకు పరుగెత్తకండి!" అని పార్టీలోని వెర్రివెంగళప్పలు మాత్రమే కేకవెయ్యగలుగుతారు. మాటవరసకి మన పార్టీని బుండ్‌తో పోల్చి చూద్దాం. బుండ్ విషయంలో కంటె మన పార్టీ పనిలోని విషయవస్తువు* అపారంగా సుసంపన్నమూ, మరింత బహుముఖమూ, విస్తృతమూ, ప్రగాఢమూ అయివుందనడంలో సందేహం లేదు. మన సైద్ధాంతిక భావాల పరిధి మరింత విశాలమైనది, మన కార్యక్రమం మరింత పరిణతి చెందినది, కార్మిక జనబాహుళ్యంలో మన పలుకుబడి (సంఘటితులైన చేతివృత్తుల వారిలో మాత్రమే కాదు) విస్తృతమైనదీ ప్రగాఢమైనదీ, మన ప్రచారమూ ఆందోళనా మరింత బహుముఖమైనవి; నాయకుల, సాధారణ సభ్యుల రాజకీయ కార్యకలాపం మరింత చురుకైనదిగా వుంది, ప్రదర్శనలలోనూ సార్వత్రిక సమ్మెలలోనూ ప్రజా ఉద్యమాలు మరింత మనసుకు నాటేవిగా వున్నాయి, శ్రామికవర్గేతర తరగతులలో మన కృషి మరింత శక్తివంతంగా వుంది. కాని "పద్ధతి"? బుండ్‌తో పోలిస్తే మన పనియొక్క "పద్ధతి" క్షమించరానంతగా వెనకబడి వుంది. అది ఎంత వెనకబడివుందంటే తన పార్టీ వ్యవహారాలను గురించి యోచిస్తున్నప్పుడు వూరికే "గోళ్లు గిల్లుకుంటూ" కూర్చోనివాడికి ఎవడికైనా అసహ్యం కలిగించి సిగ్గుతో ముఖం ఎర్రబారేటట్లు చేస్తుంది. మన పని సంఘటన దాని విషయవస్తువుకు వెనకబడివుందనేదే మనకున్న బలహీనత, మహాసభకు చాలా కాలం క్రితమూ, ఆర్గనైజింగు కమిటీ ఏర్పడడానికి చాలా కాలంక్రితమూ కూడా మనకున్న బలహీనత అదే. రూపంయొక్క బలహీనమైన అభివృద్ధిచెందని లక్షణం మూలంగా విషయవస్తువును మరింత అభివృద్ధి చేయడానికి ఎలాంటి గట్టి చర్య తీసుకోడం అయినా అసంభవం అవుతోంది; అది సిగ్గుచేటైన మాంద్యాన్ని కలుగజేస్తోంది, వృథాశ్రమకూ, మాటకూ చేతకూ మధ్య పరస్పర విరుద్ధతకూ దారితీస్తోంది. మన మందరం కూడా యీ పరస్పర వైరుధ్యంతోనే దౌర్భాగ్యంగా బాధపడుతున్నాం, దానికితోడు అక్సెల్‌రోడ్‌లూ,

---

* మన పార్టీ పనిలోని విషయవస్తువు పార్టీ మహాసభలో (కార్యక్రమం వగైరాలలో) విప్లవాత్మక సోషల్ డెమోక్రసీ సరళిలో "ఇస్క్రా" వ్యతిరేకులతోటి, ఊబితోటి పోరాట ఫలితంగా మాత్రమే రూపొందించబడిందనే విషయాన్ని నేను వదిలేస్తున్నాను. వారి ప్రతినిధులే మన "మైనారిటీ"లో అధిక సంఖ్యాకులుగా వున్నారు. "విషయవస్తువు" గురించిన యీ సమస్యలో మాటవరసకి, పాత "ఇస్క్రా" ఆరు సంచికలను (సంచికలు 46–51) కొత్త "ఇస్క్రా" పన్నెండు సంచికలతో (సంచికలు 25–63) పోల్చి చూడటం కూడ ఆసక్తిదాయకంగానే వుంటుంది. కాని అది మరొక సందర్భంలో చూద్దాం.

కొత్త ''ఇస్క్రా'' తాలూకు ''కార్యకర్తలూ'' రూపం సహజంగా, విషయవస్తువుతోపాటు ఏకకాలంలో మాత్రమే పెరగాలనే తమ గంభీరమైన వేదాంతం చెబుతారు!

నిర్మాణ సమస్యపై (నిబంధనావళిలోని మొదటి నిబంధన) చేసిన ఒక చిన్న తప్పు, అర్థంలేని దానికి పాండిత్యాన్ని సమకూర్చడానికీ, అవకాశవాద పదజాలాన్ని తాత్విక ధోరణిలో సమర్థించడానికీ ప్రయత్నిస్తే అది మనలను తీసుకుపోయేది అక్కడికే. మెల్లగా, పిరికిగా, వంకరటింకర దారుల్లో నడుస్తూ![62] — మనం ఎత్తుగడల సమస్యల విషయంలో యీ పల్లవి విన్నాం; ఇప్పుడు మళ్లీ నిర్మాణానికి సంబంధించిన సమస్యల విషయంలో కూడ వింటున్నాం. అరాజక వ్యష్టివాది తన అరాజకపు పెడమార్గాలను (ఆరంభంలో అవి యాదృచ్ఛికం అయివుండవచ్చు), ఒక భావ సరణి స్థాయికి, ప్రత్యేక సూత్రబద్ధ అభిప్రాయభేదాల స్థాయికి లేవనెత్తడం మొదలు పెడితే నిర్మాణ సమస్యలలో తోకపట్టుకుని పోయే విధానం అతని మనస్తత్వపు సహజ అనివార్య ఫలితం అవుతుంది. లీగు మహాసభలో యీ అరాజకత్వపు ఆరంభాలను చూశాం; కొత్త ''ఇస్క్రా''లో దానిని ఒక భావ సరణి స్థాయికి లేవనెత్తే ప్రయత్నాలను చూస్తున్నాం. ఈ ప్రయత్నాలు, సోషల్ డెమోక్రటిక్ ఉద్యమానికి అంటిపెట్టుకుని వున్న బూర్జువా మేధావియొక్క, తన వర్గ ప్రయోజనాలను తెలుసుకున్న శ్రామికునియొక్క దృక్పథాలమధ్య వుండే తేడాను గురించి పార్టీ మహాసభలో ఇదివరకే చెప్పబడిన దాన్ని స్పష్టంగా ధ్రువపరుస్తున్నాయి. ఉదాహరణకు, ఎవరి పాండిత్య ప్రకర్షను మనం ఇదివరకే చూశామో కొత్త ''ఇస్క్రా''కు చెందిన యీ ''కార్యకర్త'' పార్టీని కేంద్ర కమిటీ రూపంలో ఒక డైరెక్టరు నాయకత్వం కింద నడిచే ''బ్రహ్మాండమైన ఫ్యాక్టరీలాగ'' వూహిస్తున్నానని నన్ను నిరసిస్తున్నాడు (సంచిక 57, అనుబంధం). తన యీ భయంకరమైన మాట శ్రామికవర్గ సంఘంయొక్క ఆచరణగాని సిద్ధాంతంగాని తెలియని బూర్జువా మేధావియొక్క మనస్తత్వాన్ని తక్షణమే బైటపెడుతోందని యీ ''కార్యకర్త'' ఎంతమాత్రం వూహించలేదు. ఎందుకంటే, కొంత మందికి కేవలం ఒక భూతంలాగ కనబడే ఫ్యాక్టరీ, పెట్టుబడిదారీ సహకారంయొక్క అత్యున్నత రూపాన్ని చూపుతుంది. అది శ్రామికవర్గాన్ని ఐక్యపర్చింది, క్రమశిక్షణ గలవారినిగా చేసింది, సంఘటితం కావాలని బోధించింది, శ్రమించుతున్న దోచుకొనబడుతున్న జనాభాలోని అన్ని ఇతర విభాగాలకూ దానిని ముందుంచింది. పెట్టుబడిదారీ వ్యవస్థచే తర్ఫీదుచేయబడిన శ్రామికవర్గ సిద్ధాంతం అయిన మార్క్సిజం, అస్థిరులైన బూర్జువా మేధావులకు దోపిడి సాధనంగా వుండే ఫ్యాక్టరీకీ (పస్తుల భయంమీద ఆధారపడిన క్రమశిక్షణకూ), సంఘటితం కావడానికి సాధనంగా వుండే ఫ్యాక్టరీకీ (సాంకేతికంగా ఎంతో అభివృద్ధిచెందిన ఉత్పత్తి రూపం పరిస్థితులలో ఐక్యమొనర్చబడిన సమష్టి కృషిపై ఆధారపడిన క్రమశిక్షణకూ)

గల తేడాను గుర్తించాలని బోధిస్తూ వుండినది, వుంటోంది. బూర్జువా మేధావులకు ఎంతో కష్టంమీద వచ్చే క్రమశిక్షణనూ నిర్మాణాన్నీ శ్రామికవర్గం యీ ఫ్యాక్టరీ తర్ఫీదు మూలంగా చాలా తేలికగా అలవర్చుకుంటుంది. ఈ తర్ఫీదు అంటే వుండే చచ్చేటంత భయమూ, సంఘటితం చేసే అంశంగా దాని ప్రాముఖ్యాన్ని బొత్తిగా అర్థంచేసుకోలేకపోవడమూ పెటీ బూర్జువా పద్ధతి జీవితాన్ని ప్రతిబింబించే ఆలోచనల ప్రత్యేక లక్షణాలు. అవి జర్మన్ సోషల్ డెమోక్రట్లు Edelanarchismus అంటే ''కులీనుల'' అరాజకత్వం అనే రకం అరాజకవాదాన్ని ఉద్భవింపజేస్తాయి. నేను దానిని ఆభిజాత్య అరాజకవాదం అని అంటాను. ఈ ఆభిజాత్య అరాజకవాదం రష్యన్ నిహిలిస్టుల ప్రత్యేక లక్షణం. అతడు పార్టీ శాఖను ఘోరమైన ''ఫ్యాక్టరీ''గా భావిస్తాడు; మొత్తానికి ఒక భాగం లోబడివుండటాన్నీ, మెజారిటీకి మైనారిటీ లోబడివుండటాన్నీ ''కట్టుబానిసత్వం''గా పరిగణిస్తాడు (అక్సెల్‌రోడ్ వ్యాసాలు చూడండి); కేంద్రంయొక్క మార్గదర్శకత్వం కింద జరిగే శ్రమ విభజన అంటే ప్రజలను ''యంత్రాలలోని చక్రాలుగానూ, చక్రపు పళ్ళుగానూ'' మార్చివేయడమేనని (సంపాదకులను వ్యాసరచయితలుగా మార్చడం అలాంటి మార్పుల్లో ప్రత్యేకించి ఘోరమైన రకంగా పరిగణించుతూ) దానికి వ్యతిరేకంగా అతడు విషాదకర పరిహాసాత్మకమైన గోల చేస్తాడు; పార్టీయొక్క నిర్మాణపర నిబంధనావళి పేరు చెబితేనే అతని ముఖాకృతి తృణీకారపూరితం అవుతుంది, అసలు నిబంధనావళి అనేదే అవసరంలేదనే నిర్లక్ష్యపు వ్యాఖ్య వెలువడుతుంది (''లాంఛన ప్రాధాన్యవాదుల''ను ఉద్దేశించి చెప్పే మాట అది).

నమ్మరానిదిగా కనబడినప్పటికీ, కామ్రేడ్ మార్తొవ్ ''ఇస్క్రా'' సంచిక 58లో నన్ను ఉద్దేశించి, మరింతగా నమ్మించేందుకు నేను ''ఒక కామ్రేడ్‌కి లేఖ''లోనుంచి నా మాటలనే ఉదహరిస్తూ, సరిగ్గా ఇలాంటి నీతిబోధక వ్యాఖ్యనే చేశాడు. ఇది పార్టీ కాలంలోని బృందం సరళిని అరాజకవాదాన్ని కాపాడటాన్నీ కీర్తించడాన్నీ సమర్థించేటందుకు అనైక్యతా కాలంలోని బృందాలుగా వున్న కాలంలోని ఉదాహరణలను ఇవ్వడం ''ఆభిజాత్యపు అరాజకవాదం'' తోకపట్టుకుని పోవడం కాక మరేమిటి?

ఇంతకు పూర్వం మనకి నిబంధనావళి ఎందుకు అవసరం లేకపోయింది? ఎందుకంటే పార్టీలో అప్పుడు విడివిడి అధ్యయన బృందాలు, వాటి మధ్య ఎలాంటి నిర్మాణపర సంబంధాలూ లేకుండా వుండివున్నాయి. ఏ వ్యక్తి అయినా తన ఇచ్ఛ ప్రకారం ఒక బృందం నుంచి మరో బృందానికి మారగలిగేవాడు. ఎందుకంటే మొత్తం పార్టీయొక్క సూత్రీకృత సంకల్ప ప్రకటన ఏదీ అతనికి ఎదురయేది కాదు. బృందం లోపల వుండే తగాదాలు నిబంధనావళి ననుసరించి కాక ''పోరాటం ద్వారానూ, రాజీనామా చేస్తామనే బెదరింపుల ద్వారానూ'' పరిష్కరింపబడేవి. ''ఒక కామ్రేడ్‌కి లేఖ''లో మొత్తంమీద కొన్ని బృందాలయొక్క,

ప్రత్యేకించి ఆరుగురితోకూడిన మన సంపాదకవర్గ బృందంయొక్క అనుభవాన్ని క్రోడీక రిస్తూ అదే చెప్పాను. బృందాలు వుండిన కాలంలో అది సహజమూ అనివార్యమూ, కాని దానిని కీర్తించాలనీ, దానిని ఒక ఆదర్శంగా పరిగణించాలనీ ఎవరికీ ఎప్పుడూ తట్టలేదు; ప్రతివారూ అనైక్యతను గురించి ఫిర్యాదు చేసేవారు, ప్రతివారూ అందుకు ఖేదపడేవారు, విడివిడిగా వున్న బృందాలు లాంఛనప్రాయంగా కట్టుబాటుచేయబడిన పార్టీ శాఖగా ఇక్యం చేయబడేటట్లు చూడాలని ఆతురపడేవారు. ఇప్పుడు ఆ ఐక్యత ఏర్పడిన మీదట మనం వెనక్కి లాగబడుతున్నాం, అరాజకపు పదజాల ప్రయోగంతో ఉన్నతమైన నిర్మాణపర భావాల ముసుగు కింద వెనక్కి లాగబడుతున్నాం! ఒబ్లోమొవ్ సరళి[63] వదులు గౌనులకూ కాలి చెప్పులకూ అలవాటుపడిన వారికి నిబంధనావళి సంకుచితమైనదిగానూ, ఇబ్బందికరమైనదిగానూ, నీచ మైనదిగానూ, నిరంకుశమైనదిగానూ, బానిసబంధంగానూ, సైద్ధాంతిక పోరాటపు స్వేచ్ఛా యుతమైన "క్రమానికి" సంకెళ్ళగానూ కనబడుతుంది. సంకుచితమైన బృంద సంబం ధాలకు బదులు విస్తృతమైన పార్టీ సంబంధాన్ని ప్రవేశపెట్టడం కోసమే లాంఛనప్రాయ నిబంధనావళి అవసరమయిందని ఆభిజాత్యపు అరాజకవాదం అర్థంచేసుకోజాలదు. బృందం యొక్క ఆంతరంగిక సంబంధాలకు గాని బృందాల మధ్య సంబంధాలకు గాని ఒక రూపాన్ని కల్పించడం అప్పుడు అనవసరమూ అసాధ్యమూ అయివుండింది, ఎందుకంటే ఈ సంబం ధాలు వ్యక్తిగత స్నేహం మీదనో, కారణం ఏమిటో చెప్పబడని సహజజ్ఞానపు "విశ్వాసం" మీదనో ఆధారపడివుండేవి. పార్టీ సంబంధం వాటిలో దేనిమీదనూ ఆధారపడివుండ జాలదు, వుండకూడదు; అది లాంఛనప్రాయమైన, "బ్యురాక్రటిక్" పదాలతో కూడిన నిబం ధనావళిపై (క్రమశిక్షణారహితమైన మేధావి దృక్పథంలో అవి బ్యురాక్రటిక్) నెలకొల్పబడాలి, దానికి కచ్చితంగా కట్టుబడివుండటం ఒక్కటే బృందాలకు ప్రత్యేక లక్షణం అయిన మూర్ఖపు పట్టుదలనుంచీ, చలచిత్తాలనుంచీ, సైద్ధాంతిక పోరాటపు స్వేచ్ఛాయుత "క్రమం" పేరుతో సాగే బృంద జగడాలనుంచీ రక్షించగలదు.

కొత్త "ఇస్క్రా" సంపాదకవర్గం "విశ్వాసం సున్నితమైన విషయం, దానిని ప్రజల హృదయాలలోకీ మనస్సులలోకీ బలవంతాన ఎక్కించలేం" (సంచిక 56, అనుబంధం) అనే నీతిబోధక వ్యాఖ్యతో అలెక్సాంద్రొవ్‌ను మించిపోడానికి ప్రయత్నిస్తోంది. విశ్వాసాన్ని, గుడ్డి విశ్వాసాన్ని గురించిన ఇలాంటి మాటలు చెప్పడం ద్వారా తమ ఆభిజాత్యపు అరాజక వాదాన్నీ, నిర్మాణం విషయంలో తోకపట్టుకుని పోయే విధానాన్నీ పదేపదే బయటపెట్టు కుంటున్నామని సంపాదకవర్గం గుర్తించడం లేదు. నేను ఒక బృంద సభ్యుడను మాత్రమే అయివున్నప్పుడు — అది ఆరుగురు సంపాదకుల బృందం అయినా లేక "ఇస్క్రా" శాఖ అయినా — అవిశ్వాసం కారణాలమీద గాని లేదా కారణం గాని ఉద్దేశం గాని చెప్పకుండా

ఫలానా కామ్రేడ్‌తో కలసి పనిచేయ నిరాకరించడాన్ని సమర్థించుకునే హక్కు వుంటుంది. కాని ఇప్పుడు నేను పార్టీలో ఒక సభ్యుడను అయాను కనుక మొత్తంమీద విశ్వాసం లేదని వాదించే హక్కు నాకు వుండదు. ఎందుచేతనంటే అది పాత బృందం సరళి తాలూకు అన్ని రకాల చపలచిత్తాలకూ పిచ్చి ఆలోచనలకూ అవకాశాన్నిస్తుంది; నాకున్న ''విశ్వాసానికి'' గాని ''అవిశ్వాసానికి'' గాని తగిన కారణాలు చెప్పవలసివుంటుంది, అంటే, మన కార్యక్రమం, ఎత్తుగడలు, నిబంధనావళి — వీటికి సంబంధించి లాంఛనప్రాయంగా స్థిరపర్చబడిన సూత్రాన్ని ప్రస్తావించవలసివుంటుంది; కారణాలు చెప్పకుండా, నా ''విశ్వాసాన్ని'' లేక ''అవిశ్వాసాన్ని'' వూరికే ప్రకటించకూడదు, నా నిర్ణయాలు — సాధారణంగా పార్టీలోని ఏ విభాగమైనా చేసే అన్ని నిర్ణయాల లాగే — మొత్తం పార్టీ కంతటికీ నివేదించే క్రమపద్ధతి గుర్తించ వలసివుంటుంది. నా ''అవిశ్వాసాన్ని'' ప్రకటించుతున్నప్పుడు గాని, దాని ఫలితంగా ఏర్పడే అభిప్రాయాలకూ కోరికలకూ ఆమోదాన్ని పొందడానికి ప్రయత్నిస్తున్నప్పుడు గాని లాంఛన ప్రాయంగా నిర్ణయించబడిన క్రమపద్ధతికి కట్టుబడివుండటం నాకు విధాయకం. ''విశ్వాసానికి'' కారణం చెప్పవలసిన అవసరం లేదనే బృందం సరళి దృక్పథంనుంచి పార్టీ దృక్పథానికి మనం ఇప్పటికే పెరిగాం. ఇది మన విశ్వాసాన్ని ప్రకటించడంలోనూ, కారణం చెప్పడంలోనూ, మన విశ్వాసాన్ని పరీక్షించడంలోనూ లాంఛనప్రాయంగా నిర్ణయించబడిన క్రమ పద్ధతికి కట్టుబడివుండాలని డిమాండుచేస్తుంది. కాని మన సంపాదకవర్గం మనల్ని వెనక్కి లాగడానికి ప్రయత్నిస్తోంది, తోకపట్టుకుని పోయే తన విధానాన్ని పార్టీ నిర్మాణం గురించిన కొత్త భావాలు అంటోంది!

మన పార్టీ సంపాదకవర్గం అనబడేవారు సంపాదకవర్గంలో ప్రాతినిధ్యం కావాలని డిమాండు చేయగల రచయితల గ్రూపులను గురించి ఏవిధంగా వాదిస్తున్నారో చూడండి. ''మేము కోపగించుకోము, క్రమశిక్షణ గురించి కేకలువేయం,'' క్రమశిక్షణను ఎల్లప్పుడూ ప్రతిచోటా తక్కువ చూపు చూసే యీ అభిజాత్యపు అరాజకవాదులు మనకు నీతిబోధ చేస్తున్నారు. వివేకంగల పని అయితే ఆ గ్రూపుతో మనం ఆ ''వ్యవహారాన్ని పరిష్కరిస్తాం'' (sic!), లేదా దాని డిమాండులను పరిహసిస్తాం.

హతోస్మి, అసభ్య ''ఫ్యాక్టరీ'' లాంఛనతత్వానికి ఎంత మహోన్నతమైన, ఘనమైన నిరసన! కాని వాస్తవంలో అది, సంపాదకవర్గం పార్టీ సంస్థ కాదనీ పాత బృందంయొక్క అవశేషం అనీ భావించే సంపాదకవర్గంచే కొంచెం మెరుగుపెట్టబడి పార్టీకి అందించ బడిన పాత బృందం సరళి వాక్సరణియే. ఈ స్థానంయొక్క అంతర్గత బూటకత్వం, గతించి పోయినదని వారు కపటంగా ప్రకటించే అనైక్యతను సోషల్ డెమోక్రటిక్ సంఘంయొక్క సూత్రం స్థాయికి లేవనెత్తే అరాజకపు పాండిత్య ప్రకర్షకు అనివార్యంగా దారితీస్తుంది.

ఉన్నత పార్టీ సంస్థలూ, అధికార సంస్థలూ కింది పార్టీ సంఘాలు అధికార సంస్థలూ గల సంస్థాగత శ్రేణి ఏదీ అవసరంలేదు – ఆభిజాత్యపు అరాజకవాదం అలాంటి సంస్థాగత శ్రేణిని మంత్రులు, డిపార్టుమెంటులు, వగైరా బ్యూరాక్రటిక్ కల్పనలుగా పరిగణిస్తుంది (అక్సెల్‌రోడ్ వ్యాసం చూడండి); మొత్తానికి ఒక భాగం లోబడివుండవలసిన అవసరం లేదు; "వ్యవహారాల పరిష్కారం" గురించిన లేక అభిప్రాయభేదాలకు హద్దులు ఏర్పరచడం గురించిన పార్టీ పద్ధతులకు ఎలాంటి "లాంఛనప్రాయ బ్యూరాక్రటిక్" నిర్వచనలు చేయ వలసిన అవసరం లేదు. పార్టీ నిర్మాణపు "నికార్సైన సోషల్ డెమోక్రటిక్" పద్ధతుల గురించిన ఆడంబరపు మాటలచే పాత బృంద జగడాలకు పవిత్రత కలుగజేయాలి.

"ఫ్యాక్టరీ" అనే పాఠశాలలో తర్ఫీదు పొందిన శ్రామికుడు అరాజకపు వ్యష్టివాదానికి గుణపాఠం నేర్పగలిగింది ఇక్కడే. వర్గచైతన్యంగల కార్మికుడు మేధావితో కలవడానికి అయిష్ట పడే శైశవ దశనుంచి చాలా కాలం కిందటే బైటపడ్డాడు. వర్గచైతన్యంగల కార్మికుడు సోషల్ డెమోక్రటిక్ మేధావులలో వున్న అమూల్యమైన జ్ఞానసంపదనూ, విశాల రాజకీయ దృక్పథాన్నీ మెచ్చుకుంటాడు. కాని మనం నిజమైన పార్టీ నిర్మాణంతో ముందుకు సాగిన కొద్దీ వర్గచైతన్యంగల కార్మికుడు శ్రామికవర్గ సైన్యంలోని సైనికుని మనస్తత్వానికీ, అరాజక పదజాలాన్ని ప్రదర్శించే బూర్జువా మేధావి మనస్తత్వానికీ గల తేడాను తెలుసుకోడం నేర్చుకోవాలి. పార్టీ సభ్యుడు నెరవేర్చవలసిన కర్తవ్యాలను సాధారణ సభ్యులు మాత్రమే గాక "ఉన్నత స్థానాల్లో వున్నవారు" కూడా నెరవేర్చవలసి వుంటుందని పట్టుబట్టడం అతడు నేర్చుకోవాలి; ఎత్తుగడలకు సంబంధించిన విషయాలలో తోకపట్టుకుని పోయే విధానాన్ని గతకాలంలో ఏ తృణీకార భావంతో చూసేవాడో అదే తృణీకార భావంతో నిర్మాణానికి సంబంధించిన విషయాలలో తోకపట్టుకుని పోయే విధానాన్ని కూడ చూడడం అతడు నేర్చుకోవాలి!

నిర్మాణానికి సంబంధించిన విషయాల పట్ల కొత్త "ఇస్క్రా" వహించే వైఖరియొక్క చివరి ప్రత్యేక లక్షణం, అంటే కేంద్రీకరణకు వ్యతిరేకంగా స్వేచ్ఛానువర్తనవాదాన్ని అది సమర్థించడం, జిరోండిజంతోనూ, ఆభిజాత్యపు అరాజకవాదంతోనూ విడదీయరాని విధంగా ముడిపడివుంది. బ్యూరాక్రసీకీ, నిరంకుశాధిపత్యానికీ వ్యతిరేకంగా అది వేసే కేకల యొక్క, "'ఇస్క్రా'వాళ్లు కానివారి పట్ల" (మహాసభలో స్వేచ్ఛానువర్తనను సమర్థించిన వారి పట్ల) "అనుచితమైన అనాదరణ" గురించి దాని విచారం, "తిరుగులేని విధేయత" వుండాలనే డిమాండు గురించి దాని హాస్యాస్పదమైన కేకలు, "అధికారంలో వున్న పుల్లయ్య పాలన"ను గురించి వ్యథతో కూడిన ఫిర్యాదులు వగైరా వగైరాల సూత్రబద్ధమైన అర్థం

అదే (దానికి అలాంటి అర్థం ఏదైనా వుండివుంటే*). ఏ పార్టీలోనైనా అవకాశవాద పక్షం, కార్యక్రమం, ఎత్తుగడల విషయంలో గాని, నిర్మాణం విషయంలోగాని, వెనుకబాటుతనాన్ని అంతనీ ఎల్లప్పుడూ కాపాడుతుంది, సమర్థిస్తుంది. నిర్మాణంలో వెనుకబాటుతనానికి కొత్త "ఇస్క్రా" సమర్థన (తోకపట్టుకుని పోయే దాని విధానం) స్వేచ్ఛానువర్తనవాదానికి అది యిచ్చే సమర్థనతో సన్నిహిత సంబంధం కలిగివుంది. మొత్తంమీద చెప్పాలంటే, గత మూడేళ్లుగా పాత "ఇస్క్రా" చేసిన ప్రచారంవల్ల స్వేచ్ఛానువర్తనవాదం ఇప్పటికే ఎంత అపఖ్యాతి పాలైందంటే కొత్త "ఇస్క్రా" ఇంకా దానిని బహిరంగంగా సమర్థించడానికి సిగ్గుపడుతోందనేది నిజం; అది ఇప్పటికీ కేంద్రీకరణ పట్ల తన సానుభూతిని గురించి మనకి హామీ యిస్తోంది, కాని కేంద్రీకరణ అనే మాటను ప్రత్యేక లిపిలో ముద్రించడం ద్వారా మాత్రమే దానిని చూపుతోంది. నిజానికి అడుగడుగునా స్వేచ్ఛానువర్తనవాద దృక్పథాన్ని బయట పెట్టడానికి కొత్త "ఇస్క్రా"యొక్క "నికార్సైన సోషల్ డెమొక్రటిక్" (అరాజకవాదపు కాదా?) కుహనా కేంద్రీకరణ "సూత్రాల"కు కించిత్తు విమర్శనను వర్తింపజేస్తే చాలు. పార్టీ నిర్మాణం విషయంలో అక్సెల్‌రోడ్, మార్తొవ్‌లు అకీమొవ్ వైపుకు మొగ్గారన్నది ఇప్పుడు అందరికీ స్పష్టం కాలేదా? "'ఇస్క్రా'వాళ్లు కానివారి పట్ల అనుచితమైన అనాదరణ" అనే భావార్థకమైన మాటలలో వారే దానిని యథావిధిగా అంగీకరించ లేదా? మన పార్టీ మహాసభలో అకీమొవ్, ఆయన మిత్రులూ సమర్థించినది స్వేచ్ఛానువర్తవవాదాన్ని గాక మరి దేనిని?

లీగు మహాసభలో మార్తొవ్, అక్సెల్‌రోడ్‌లు సమర్థించినది స్వేచ్ఛానువర్తనవాదాన్నే (అరాజకవాదాన్ని కాకపోతే). అక్కడ వారు వినోదకరమైన ఉత్సుకతతో మొత్తానికి భాగం లోబడివుండనవసరం లేదనీ, మొత్తంతో తన సంబంధాన్ని నిర్వచించడంలో భాగం స్వేచ్ఛానువర్తనవాది అనీ, ఆ సంబంధం సూత్రీకరించబడిన విదేశాలలోని లీగు నిబంధనావళి పార్టీ మెజారిటీ అభీష్టానికీ, పార్టీ కేంద్రం అభీష్టానికీ విరుద్ధంగా సక్రమమైనదేననీ రుజువు చేయడానికి ప్రయత్నించారు. స్థానిక కమిటీలకు సభ్యులను నియమించేందుకు కేంద్ర కమిటీకి గల హక్కు విషయంలో కొత్త "ఇస్క్రా"లో (సంచిక 60) కామ్రేడ్ మార్తొవ్ ఇప్పుడు బహిరంగంగా సమర్థిస్తున్నది స్వేచ్ఛానువర్తనవాదాన్నే.[64] లీగు మహాసభలో స్వేచ్ఛానువర్తనవాదాన్ని సమర్థించేటందుకు కామ్రేడ్ మార్తొవ్ ఉపయోగించిన, కొత్త "ఇస్క్రా"లో

---

* ఈ అధ్యాయం మొత్తంమీద చేసినట్లే నేను ఇక్కడ ఈ గోలయొక్క "కో-ఆప్టేషనల్" అర్థాన్ని వదిలేశాను.

ఇప్పటికీ ఉపయోగిస్తూన్న కుర్రతనపు కుతర్కాన్ని గురించి నేనేమీ చెప్పను* — ఇక్కడ ముఖ్యమైన విషయం కేంద్రీకరణకు వ్యతిరేకంగా స్వేచ్ఛానువర్తనవాదాన్ని సమర్థించే నిస్సందేహమైన ధోరణిని గుర్తించడం. ఈ ధోరణి నిర్మాణ వ్యవహారాలలో అవకాశవాదానికి స్వాభావికమైనది.

బహుశా బ్యూరాక్రసీ భావనను విశ్లేషించడానికి జరిగిన ఒకేఒక ప్రయత్నం కొత్త ''ఇస్క్రా''లో (సంచిక 53) ''లాంఛనప్రాయమైన ప్రజాస్వామిక సూత్రానికీ'' (కింది గీతలు రచయితవి) ''లాంఛనప్రాయమైన బ్యూరాక్రటిక్ సూత్రానికీ'' మధ్య తేడాను చూపడం అయివుంటుంది. ఈ తేడాలో (దురదృష్టవశాత్తూ ''ఇస్క్రా''వాళ్ళు కాని వారిని గురించి ప్రస్తావించడం తప్ప దానిని మరేమీ అభివృద్ధిపరచడం గాని వివరించడం గాని జరగలేదు) కించిత్తు నిజం వుంది. ప్రజాస్వామ్యానికి వ్యతిరిక్తంగా బ్యూరాక్రసీ, అంటే స్వేచ్ఛానువర్తనవాదానికి వ్యతిరిక్తంగా కేంద్రీకరణ; అది అవకాశవాద సోషల్ డెమోక్రట్ల నిర్మాణ సూత్రానికి వ్యతిరేకంగా విప్లవకర సోషల్ డెమోక్రట్ల నిర్మాణ సూత్రం. ఇందులో మొదటిది కిందినుంచి పైకి వెళ్ళడానికి ప్రయత్నిస్తుంది, అందుచేత ఎక్కడ వీలైతే అక్కడా, సాధ్యమైనంతవరకూ అది స్వేచ్ఛానువర్తనవాదాన్ని సమర్థిస్తుంది, ''ప్రజాస్వామ్యం'' (తెలివి తక్కువ చొరవచే) అరాజకవాద స్థాయికి తీసుకుపోబడుతుంది. రెండవది పైనుంచి కిందికి వెళ్ళడానికి ప్రయత్నిస్తుంది, శాఖలతో సంబంధం విషయంలో కేంద్రంయొక్క హక్కుల అధికారాల విస్తరణను సమర్థిస్తుంది. అనైక్యత, విడివిడి బృందాలు వుండిన కాలంలో విప్లవ సోషల్ డెమోక్రట్లు దేనినుండి అయితే నిర్మాణాత్మకంగా ముందుకు సాగడానికి ప్రయత్నించారో ఆ ఉన్నత సంస్థ తప్పనిసరిగా ఆ బృందాలలో ఒకటీ, దాని కార్యకలాపాల మూలంగానూ దాని విప్లవాత్మక స్థిరత్వం మూలంగానూ అత్యంత ఎక్కువ పలుకుబడి కలిగినదీ అయివుండింది. (మన విషయంలో అది ''ఇస్క్రా'' శాఖ.) నిజమైన పార్టీ ఐక్యత పునరుద్ధరించబడి యీ ఐక్యతలో కాలం తీరిన బృందాలు రద్దు అయిపోయిన కాలంలో యీ ఉన్నత సంస్థ తప్పనిసరిగా పార్టీ మహాసభ అవుతుంది. అది పార్టీయొక్క అత్యున్నతాధికార సంస్థ; మహాసభ సాధ్యమైనంతవరకు, చురుకుగా పనిచేసే శాఖలన్నిటి

* నిబంధనావళిలోని వివిధ నిబంధనలను వివరించడంలో కామ్రేడ్ మార్తొవ్, భాగానికి మొత్తంతో గల సంబంధాన్ని గురించి చెప్పే దానిని: కేంద్ర కమిటీ ''పార్టీ బలాలను పంపకం చేస్తుంది'' అన్నదానిని (6వ నిబంధన) వదిలేశాడు. సభ్యులను ఒక కమిటీనుంచి మరో కమిటీకి బదలాయించకుండా ఎవరైనా బలాలను పంపకం చేయగలరా? అలాంటి ప్రాథమిక విషయాలను వివరించవలసి వచ్చినందుకు నిజంగా సిగ్గుపడుతున్నాను.

ప్రతినిధులతోనూ కూడినదై వుంటుంది. కేంద్ర సంస్థలను (తరచుగా పార్టీలోని వెనుకబడిన సభ్యులకంటే ఎక్కువ అభివృద్ధిచెందిన వారిని సంతృప్తి పరచేటట్టీ, పార్టీలోని అవకాశ వాద పక్షంకంటె విప్లవకర పక్షానికి ఎక్కువ ఇష్టమైనదిగా వుండేటట్టీ సభ్యత్వంతో) నియమించడం ద్వారా తరువాతి మహాసభ జరిగేటంతవరకూ వాటిని ఉన్నతాధికార సంస్థలుగా చేస్తుంది. ఏమైనా, సోషల్ డెమొక్రటిక్ యూరపియన్ల విషయం అది, సూత్రరీత్యా అరాజకవాదులకు ఎంతో అసహనీయంగా వున్న యీ ఆచారం కొద్దికొద్దిగా అయినప్పటికీ — చిక్కులూ సంఘర్షణలూ జగడాలూ లేకుండా కాదు — సోషల్ డెమొక్రటిక్ ఆసియా వాసులకు వ్యాపించ నారంభిస్తోంది.

నిర్మాణానికి సంబంధించిన విషయాలలో అవకాశవాదంయొక్క యీ మౌలిక లక్షణాలు (స్వేచ్ఛానువర్తనవాదం, అభిజాత్య లేక మేధావి అరాజకవాదం, తోకపట్టుకుని పోయే విధానం, జిరోండిజం) mutatis mutandis (తగిన మార్పులతో) విప్లవకర, అవకాశ వాద పక్షాలుగా చీలడం వున్న చోటల్లా (ఇది ఎక్కడ లేదు?) ప్రపంచంలోని అన్ని సోషల్ డెమొక్రటిక్ పార్టీలలోనూ కనబడుతూవుండడం ఎంతో ఆసక్తిదాయకమైన సంగతి. ఇటీవలనే ఇది, జర్మన్ సోషల్ డెమొక్రటిక్ పార్టీలో, 20వ సాక్సనీ నియోజకవర్గంలో ఎన్నికలలో దాని ఓటమి (గ్యోరె ఘటనగా ప్రసిద్ధి చెందింది)* పార్టీ నిర్మాణానికి సంబంధించిన సూత్రాల సమస్యను ముందుకు తెచ్చినప్పుడు ఎంతో ప్రస్ఫుటంగా బైటపడింది. చాలవరకు జర్మన్ అవకాశవాదుల పట్టుదల మూలంగానే యీ ఘటన సూత్రానికి సంబంధించిన సమస్య అయింది. గ్యోరె (మాజీ ఫాదరి, సుప్రసిద్ధ గ్రంథమైన "Drei Monate Fabrikarbeiter"** రచయిత, డ్రెస్డెన్ మహాసభ ''వీరులలో'' ఒకడు) స్వయంగానే తీవ్ర అవకాశవాది. సుసంగతమైన జర్మన్ అవకాశవాదుల పత్రిక "Sozialistische Monatshefte" (''సోషలిస్టు మాసపత్రిక'')[66] వెంటనే అతనిని ''సమర్థించింది.''

---

*1903 జూన్ 16న సాక్సనీ 15వ నియోజకవర్గంనుంచి గ్యోరె రైహ్‌స్టాగ్‌కు ఎన్నికయాడు, కాని డ్రెస్డెన్ మహాసభ[65] తరువాత ఆయన తన స్థానానికి రాజీనామా చేశాడు. రోజెనొవ్ మరణం మూలంగా ఖాళీ అయిన స్థానంలో 20వ నియోజకవర్గ ఓటర్లు గ్యోరెను అభ్యర్థిగా నిలబెట్టదలచారు. పార్టీ కేంద్ర కార్యనిర్వాహకవర్గమూ, సాక్సనీ ప్రాంతీయ పార్టీ కేంద్ర ఆందోళన కమిటీ ఆ ప్రతిపాదనను వ్యతిరేకించారు. గ్యోరె నామినేషనును నిషేధించే హక్కు వారికి లేనందువల్ల వారు, ఆయనే దానిని నిరాకరించేటట్లు చేయగలిగారు. ఎన్నికలలో సోషల్ డెమొక్రట్లు ఓడిపోయారు.

** ''ఫ్యాక్టరీ కార్మికునిగా మూడు నెలలు.'' — సం.

కార్యక్రమంలోని అవకాశవాదం సహజంగానే ఎత్తుగడలలోని అవకాశవాదంతోనూ, నిర్మాణంలోని అవకాశవాదంతోనూ ముడివడివుంటుంది. కామ్రేడ్ వోల్ఫ్‌గంగ్ హైనె "కొత్త" దృక్పథాన్ని వివరించడానికి పూనుకున్నాడు. సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలో చేరి తనతో పాటు అవకాశవాద ధోరణిలో ఆలోచించే అలవాట్లను కూడా తీసుకువచ్చిన యీ విశిష్ట మేధావియొక్క రాజకీయ రంగును గురించి పాఠకునికి కొంత తెలియజేసేటందుకు కామ్రేడ్ వోల్ఫ్‌గంగ్ హైనె, జర్మన్ రూపంలో కామ్రేడ్ అకీమొవ్ కంటె కొంచెం తక్కువ అనీ, జర్మన్ రూపంలో కామ్రేడ్ యెగోరొవ్ కంటె కొంచెం ఎక్కువ అనీ చెబితే సరిపోతుంది.

కామ్రేడ్ వోల్ఫ్‌గంగ్ హైనె "Sozialistische Monatshefte" పత్రికలో రంగంలోకి కొత్త "ఇస్క్రా"లో కామ్రేడ్ అక్సెల్‌రోద్ దిగినంత ఆడంబరంతోనే దిగాడు. ఆయన రాసిన వ్యాసంయొక్క శీర్షికే అమూల్యమైనది: "గ్యోరె ఘటనపై ప్రజాస్వామిక పరిశీలనలు" ("Sozialistische Monatshefte," సంచిక 4, ఏప్రిల్). అందులోని విషయాలు కూడా తక్కువ ఆర్భాట పూరితమైనవేం కాదు. "నియోజకవర్గ స్వతంత్ర ప్రతిపత్తిపై దురాక్రమణ"ను ఎదిరించుతున్నాడు, "ప్రజాస్వామిక సూత్రా"న్ని బలపరుస్తున్నాడు, ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకునే స్వేచ్ఛాయుత ఎన్నికలో "నియమిత అధికారుల" (అంటే పార్టీ కేంద్ర కార్యనిర్వాహకవర్గం) జోక్యాన్ని వ్యతిరేకిస్తున్నాడు, వివాదంలో వున్న విషయం యాదృచ్ఛిక సంఘటన కాదనీ, "పార్టీలో బ్యూరాక్రసీ వైపూ కేంద్రీకరణ వైపూ పోతున్న ఒక సార్వత్రిక పోకడ" అనీ వోల్ఫ్‌గంగ్ హైనె మనకు బోధించాడు, అది ముందే గమనించి వుండవలసిన పోకడ అనీ, కాని అదిప్పుడు ప్రత్యేకించి ప్రమాదకరం అవుతోందనీ ఆయన అన్నాడు. "పార్టీ జీవితానికి స్థానిక పార్టీ సంస్థలు వాహనాలు అనే విషయాన్ని విధిగా గుర్తించాలి" అని ఆయన చెప్పాడు ("మరోసారి మైనారిటీలో" అనే కామ్రేడ్ మార్తొవ్ పుస్తకంనుండి గ్రంథ చౌర్యం). "ముఖ్యమైన రాజకీయ నిర్ణయాలు అన్నీ ఒక కేంద్రంనుంచి రావడానికి మనం అలవాటు పడ"కూడదు, "జీవితంతో సంబంధం గోల్పోయే పిడివాద సూత్రాన్ని" గురించి పార్టీని హెచ్చరించాలి (పార్టీ మహాసభలో "జీవితానిదే పై చేయి అవుతుంది" అని చెప్పిన కామ్రేడ్ మార్తొవ్ ప్రసంగంనుంచి ఎరువు తెచ్చుకున్నది). తన వాదాన్ని మరింత పరిపూర్ణం చేస్తూ కామ్రేడ్ వోల్ఫ్‌గంగ్ హైనె ఇలా అన్నాడు: "...మనం విషయం మూలంలోకి పోయి అన్నిచోట్లలాగనే ఇక్కడ కూడా ఏమంత తక్కువ పాత్రను నిర్వహించని వ్యక్తిగత తగాదాలను పక్కకు నెట్టినట్టయితే, రివిజనిస్టులపై యీ ద్వేషం (కిందిగీతలు వ్యాసకర్తవి, రివిజనిజానికి వ్యతిరేకంగా పోరాడటానికీ, రివిజనిస్టులకు వ్యతిరేకంగా పోరాడటానికీ గల తేడాను స్పష్టంగా సూచిస్తాయనడం స్పష్టం) 'బైటివారి' పట్ల పార్టీ అధికారివర్గపు అపనమ్మకం ప్రధానంగా వెల్లడి

అవుతోంది.'' (హైనె ముట్టడి స్థితిని ఎదిరించడం గురించిన పుస్తకాన్ని ఇంకా చదివినట్టు లేదు, అందుకనే ఆయన ఆంగ్ల భాషీయాన్ని – Outsidertum అనుసరించాడు.) ''అది అసాధారణమైన వాటి పట్ల సంప్రదాయానికుండే అపనమ్మకం, వ్యక్తిగతమైన ప్రతిదాని పట్లా వ్యక్తిగతంకాని సంస్థ కుండే అపనమ్మకం (వ్యక్తిగత చొరవను అణచి వేయడం గురించి లీగు మహాసభలో అక్సెల్‌రోడ్ ప్రవేశపెట్టిన తీర్మానం చూడండి) – ఒక్క మాటలో చెప్పాలంటే, పార్టీలో బ్యురాక్రసీ వైపూ, కేంద్రీకరణ వైపూ పోతున్న పోకడగా మనం పైన నిర్వచించిన వైఖరి.''

''క్రమశిక్షణ'' భావం కామ్రేడ్ అక్సెల్‌రోడ్‌లో కలిగించిన ఘనమైన నిరసనకు ఎంత మాత్రం తక్కువకాని నిరసననే కామ్రేడ్ హైనెలో కూడ కలిగించింది.... ఆయనిలా రాశాడు: "'Sozialistische Monatshefte' పత్రికకు వ్యాసాలు రాసినందుకు రివిజనిస్టులను క్రమశిక్షణ లేనివారని నిందించారు. ఆ పత్రిక పార్టీ అదుపులో లేదు కనుక దాన్ని సోషల్ డెమోక్రటిక్ పత్రికగా గుర్తించ నిరాకరించారు. 'సోషల్ డెమోక్రటిక్' అనే భావాన్ని సంకుచితపర్చే యీ ప్రయత్నం, పూర్తి స్వాతంత్ర్యం వుండవలసిన భావ జాలాత్మక ఉత్పత్తి రంగంలో క్రమశిక్షణ గురించిన యీ పట్టుదల (జ్ఞాపక ముంచుకోండి: సైద్ధాంతిక పోరాటం ఒక క్రమం, నిర్మాణ రూపాలు కేవలం రూపాలు మాత్రమే) బ్యురాక్రసీ వైపూ వ్యక్తిత్వాన్ని అణచివేయడం వైపూ పోయే పోకడను రుజువు చేస్తుంది.'' ''సాధ్యమైనంత కేంద్రీకృతమైన ఒకే పెద్ద సర్వాత్మక సంఘాన్నీ, ఒకే ఎత్తుగడలనూ, ఒకే సిద్ధాంతాన్నీ'' నెలకొల్పే యీ ద్వేషనీయమైన పోకడనూ, ''తిరుగులేని విధేయత,'' ''గుడ్డి అణకువ'' వుండాలనే డిమాండునూ, ''అతిసూక్ష్మీకృత కేంద్రీకరణ,'' వగైరా వగైరాలనూ ఖండిస్తూ, అక్షరాలా ''అక్సెల్‌రోడ్ లాగే'' వోల్ఫ్‌గంగ్ హైనె ఇంకా చెప్పకు పోయాడు.

హైనె ప్రారంభించిన వివాదం వ్యాపించింది, సమస్యను మరుగుపర్చేటందుకు జర్మన్ పార్టీలో కో-ఆప్టేషను గురించిన జగడాలు లేవు కనుకనూ, జర్మన్ అకీమొవ్‌లు తమ రంగును మహాసభలలోనే గాక ఎల్లప్పుడూ, తమ స్వంత పత్రికలో బైటపెడుతున్నారు కనుకనూ యీ వాదం త్వరగానే నిర్మాణ సమస్యపై ఛాందసపు, రివిజనిస్టు ధోరణుల సూత్రాల పరిశీలనగా తయారైంది. విప్లవకర ధోరణి తరఫున మాట్లాడేవారిలో ఒకడుగా (ఈ ధోరణి సరిగ్గా మన పార్టీలో లాగనే ''నియంతృత్వ'' ''హింసాత్మక'' ధోరణులు, ఇతర భయంకర లక్షణాలు గలదిగా నిందించబడింది) కార్ల్ కౌట్స్కీ ముందుకు వచ్చాడు ("Neue Zeit", 1904, సంచిక 28లో, "Wahlkreis und Partei" – ''నియోజక వర్గమూ, పార్టీ'' అనే వ్యాసం). ఆయనిలా అన్నాడు: వోల్ఫ్‌గంగ్ హైనె వ్యాసం ''మొత్తం

రివిజనిస్టు ధోరణియొక్క ఆలోచనా విధానాన్ని తెలియజేస్తుంది.'' జర్మనీలోనే గాక ఫ్రాన్సు లోనూ, ఇటలీలోనూ కూడా అవకాశవాదులు స్వేచ్ఛానువర్తనవాదాన్ని, పార్టీ క్రమశిక్షణ సడలింపును, దాన్ని లేకుండా చేయడాన్ని గట్టిగా బలపర్చారు; ప్రతిచోటా వారి ధోరణులు అస్తవ్యస్తతకూ, ''ప్రజాస్వామిక సూత్రం'' అరాజకత్వంలోకి వక్రీకరించబడటానికీ దారి తీశాయి. నిర్మాణం విషయం గురించి కార్ల్ కౌట్స్కీ అవకాశవాదులకు ఇలా చెప్పాడు: ''ప్రజా స్వామ్యం అంటే అధికార రాహిత్యం కాదు; ప్రజాస్వామ్యం అంటే అరాజకవాదం కాదు; దాని అర్థం, ఇతర పాలనా రూపాలకు భిన్నంగా ప్రజానీకం తమ ప్రతినిధులపై సాగించే పరిపాలన, ఇందులో ప్రజాసేవకులుగా భావింపబడేవారే వాస్తవంలో వారి యజమానులు.'' వివిధ దేశాలలో అవకాశవాద స్వేచ్ఛానువర్తనవాదం నిర్వహించిన విధ్వంసకర పాత్రను కౌట్స్కీ వివరించాడు; ''అధిక సంఖ్యలో బూర్జువావర్గీయులు''* సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలోకి ప్రవేశించడమే అవకాశవాదాన్నీ, స్వేచ్ఛానువర్తనవాదాన్నీ, క్రమశిక్షణను ఉల్లం ఘించే ధోరణినీ బలపరుస్తోందని ఆయన చూపాడు; ''శ్రామికవర్గాన్ని విముక్తి చేసే ఆయు ధం నిర్మాణమే''ననీ, ''వర్గపోరాటంలో శ్రామికవర్గపు విలక్షణ ఆయుధం నిర్మాణమే''ననీ ఆయన మనకి మరోసారి జ్ఞాపకం చేశాడు.

ఫ్రాన్సులో కంటేనూ లేక ఇటలీలో కంటేనూ అవకాశవాదం బలహీనంగా వున్న జర్మనీలో ''స్వేచ్ఛానువర్తనవాద ధోరణులు ఇంతవరకూ నియంతలకూ అతి హింసాత్ములకూ వ్యతిరేకంగా, వెలికి**, భిన్నమతావలంబకుల వేటకూ వ్యతిరేకంగా దాదాపు ఉద్విగ్నమైన ఉపన్యాసాలకూనూ, అంతులేని అక్రమ నిందలకూ జగడాలకూనూ మాత్రమే దారితీశాయి, అవతలి పక్షం కనక సమాధానం చెబితే అవి అంతులేని పోరాటంగానే పరిణమిస్తాయి.''

జర్మనీలో కంటె పార్టీలో అవకాశవాదం ఇంకా బలహీనంగావున్న రష్యాలో, స్వేచ్ఛా నువర్తనవాదపు పోకడలు కొద్ది భావాలనూ, మరిన్ని ''ఉద్విగ్నమైన ఉపన్యాసాలనూ'' జగ డాలనూ కల్పించడంలో ఆశ్చర్యం లేదు.

---

* ఉదాహరణగా జోరేస్‌ను కౌట్స్కీ పేర్కొన్నాడు. వీరు అవకాశవాదం వైపు ఎంత ఎక్కువగా వైదొలగుతారో అంత ఎక్కువగానూ ''వారు పార్టీ క్రమశిక్షణను తమ స్వేచ్ఛా యుత వ్యక్తిత్వంమీద అనుమతింపరాని నిర్బంధంగా పరిగణించి తీరుతారు.''

** Bannstrahl – ఇది రష్యన్ భాషలోని ''ముట్టడి స్థితి,'' ''అత్యవసర చట్టాలు'' అనే మాటలకు సమానమైన జర్మన్ పదం. ఇది జర్మన్ అవకాశవాదుల ''భయంకరమైన మాట.''

కౌట్స్కీ యీ కింది నిర్ధారణకు రావడంలో ఆశ్చర్యం లేదు. ''అన్ని దేశాలలోని రివిజనిజమూ, రూపంలోనూ రంగులోనూ బహువిధం అయినప్పటికీ, నిర్మాణ సమస్యమీద వున్నంత సమరీతిగా మరే ఇతర సమస్యమీదా లేదనుకుంటాను.'' ఈ రంగంలో ఛాందసత్వం యొక్క రివిజనిజంయొక్క ప్రధానమైన పోకడలను కౌట్స్కీ కూడ ప్రజాస్వామ్యానికి వ్యతిరిక్తంగా బ్యూరాక్రసీ అనే ''భయంకరమైన మాట'' సహాయంతోనే నిర్వచించాడు. ఆయనిలా అన్నాడు: నియోజకవర్గాలు చేసే అభ్యర్థుల (పార్లమెంటుకు) ఎంపికను మార్చే హక్కును పార్టీ నాయకత్వానికి ఇవ్వడం, ''అన్ని రాజకీయ కార్యకలాపాలూ కిందినుంచి పైకి, ప్రజానీకపు స్వతంత్ర కార్యకలాపం ద్వారా జరగాలనీ, బ్యూరాక్రటిక్ పద్ధతిలో పైనుంచి కిందికి కాదనీ డిమాండు చేసే ప్రజాస్వామిక సూత్రంపై సిగ్గుమాలిన అతిక్రమణ.... కాని, ప్రజాస్వామిక సూత్రం అనేది ఏదైనా వుంటే, అది మైనారిటీపై మెజారిటీ ప్రాబల్యం వుండటమే, తద్భిన్నంగా కాదు....'' అని మనకి చెబుతున్నారు. ఏ నియోజకవర్గం నుంచి అయినా జరిగే పార్లమెంటు సభ్యుని ఎన్నిక పార్టీ అంతటికీ ముఖ్యమైన విషయం, అది తన ప్రతినిధుల ద్వారానే (Vertrauensmänner) అభ్యర్థుల నామినేషనును ప్రభావితంచేయాలి. ''ఇది అతి బ్యూరాక్రసీ అనిగాని కేంద్రీకరణ అనిగాని ఎవరైనా పరిగణిస్తే, మొత్తం పార్టీ సభ్యులందరి (sämtliche Parteigenossen) ప్రత్యక్ష వోటు ద్వారా అభ్యర్థి నామినేటు చేయబడాలని సూచించవచ్చు. అది ఆచరణయోగ్యం కాదన్నట్లయితే పార్టీ అంతటికీ సంబంధించిన చాలా యితర కర్తవ్యాలలాగే ఒకటి లేక కొన్ని పార్టీ సంస్థలచే ఇది అమలు జరపబడినప్పుడు ప్రజాస్వామ్యం లోపించిందని ఫిర్యాదు చేయకూడదు.'' అభ్యర్థుల ఎంపిక గురించి నియోజకవర్గాలు పార్టీ నాయకత్వంతో ''ఒక స్నేహపూరిత ఒప్పందానికి రావడం'' జర్మన్ పార్టీలో చాల కాలంగా ''సాధారణ నియమం'' అయివుంది. ''కాని, అనుక్తమైన యీ సాధారణ నియమం ఇంకెంతమాత్రం సరిపోనంతటి పెద్దదిగా పార్టీ పెరిగింది. ఒక సాధారణ నియమం మామూలు ఆచార వ్యవహారంగా అంగీకరింపబడనప్పుడు, దానిలోని ఒప్పందాలూ దాని అసలు ఉనికియే సందేహింపబడినప్పుడు అది నియమం కాకుండాపోతుంది. ఈ నియమాన్ని ప్రత్యేకంగా సూత్రీకరించడం, దానిని క్రోడీకరించడం....,'' మరింత కచ్చితమైన శాసనాత్మక నిర్వచన* (statutarische Festlegung), తదనుసారంగా నిర్మాణంలో మరింత ఎక్కువ కచ్చితత్వం (größere Straffheit) అవసరమౌతుంది.''

---

* అనుక్తంగా గుర్తింపబడిన సాధారణ నియమానికి బదులు లాంఛనప్రాయంగా నిర్వచింపబడిన శాసనాత్మక నియమాన్ని తెచ్చిపెట్టడం గురించి కౌట్స్కీ చేసిన యీ వ్యాఖ్య

ఆవిధంగా మనకి, వేరొక పరిసరంలో నిర్మాణ సమస్యపై పార్టీలోని అవకాశవాద పక్షానికీ విప్లవకర పక్షానికీ మధ్య సాగే అదే రకం పోరాటమూ, స్వేచ్ఛానువర్తనవాదానికీ కేంద్రీకరణవాదానికీ మధ్య, ప్రజాస్వామ్యానికీ "బ్యూరాక్రసీ"కీ మధ్య నిర్మాణాన్నీ, క్రమశిక్షణనీ సడలించే పోకడకూ బిగించే పోకడకూ మధ్య, నిలకడలేని మేధావి మనస్తత్వానికీ దృఢమైన శ్రామిక మనస్తత్వానికీ మధ్య, మేధావి వ్యష్టివాదానికీ శ్రామికవర్గ సంఘీభావానికీ మధ్య అదే రకం సంఘర్షణా కనిపిస్తాయి. ఈ సంఘర్షణ పట్ల బూర్జువా ప్రజాస్వామ్యంయొక్క — ఏదో ఒక రోజున కామ్రేడ్ అక్సెల్‌రోడ్‌కు చూపుతానని కొంటె చేష్టల చరిత్ర రహస్యంగా మాత్రమే వాగ్దానం చేసిన బూర్జువా ప్రజాస్వామ్యం కాదు, "ఒస్వొబొజ్దేనియె"కు చెందిన మన పెద్దమనుషుల కంటె తీసిపోని సూక్ష్మబుద్ధిగల పరిశీలన దృష్టిగల ప్రతినిధులను జర్మనీలో కలిగివున్న నిజమైన వాస్తవమైన బూర్జువా ప్రజాస్వామ్యంయొక్క — వైఖరి ఏమిటి? అని ఎవరైనా అడుగుతారు. ఈ కొత్త వివాదానికి జర్మన్ బూర్జువా ప్రజాస్వామ్యం వెంటనే ప్రతివర్తన చూపింది — రష్యన్ బూర్జువా ప్రజాస్వామ్యం లాగనే, ప్రతి చోటా ఎల్లప్పుడూ బూర్జువా ప్రజాస్వామ్యం చేసే లాగనే — సోషల్ డెమోక్రటిక్ పార్టీలోని అవకాశవాద పక్షాన్ని గట్టిగా సమర్థించింది. జర్మన్ స్టాక్ ఎక్స్‌చేంజి ప్రముఖ పత్రిక అయిన "ఫ్రాంక్‌ఫుర్ట్ పత్రిక"[67] ఉరుముగర్జనవంటి సంపాదకీయాన్ని ప్రచురించింది ("Frankfurter Zeitung," ఏప్రిల్ 7, 1904, సంచిక 97, సాయంకాల ప్రచురణ). అది, అక్సెల్‌రోడ్‌యొక్క సిగ్గుమాలిన గ్రంథ చౌర్యం జర్మన్ పత్రికలకు ఒక నిజమైన జబ్బు అవుతోందని తెలియజేస్తుంది. ఫ్రాంక్‌ఫుర్ట్ స్టాక్ ఎక్స్‌చేంజికి చెందిన ఉగ్ర డెమోక్రట్లు సోషల్ డెమోక్రటిక్ పార్టీలోని "నిరంకుశవాదాన్ని," "పార్టీ నియంతృత్వాన్ని," "పార్టీ అధికారుల నిరంకుశ పరిపాలనను," "రివిజనిజాన్ని మొత్తంగా ఒకేసారి శిక్షించడానికి" ఉద్దేశించబడిన "వెలులను" ("అవకాశవాదులు అనే తప్పుడు నిందారోపణ"ను జ్ఞాపకం తెచ్చుకోండి), "గుడ్డి విధేయత," "మొద్దుబారజేసే క్రమశిక్షణ," "సేవకుని లాగ లొంగివుండటం" డిమాండు, పార్టీ సభ్యులను "రాజకీయ శవాలు"గా మార్చడం కావాలనే పట్టుదలనూ (ఇది చక్రాల, చక్రాలపళ్ల కంటె బాగా బలమైనది!) ఆగ్రహంతో

---

లను మొత్తం "మార్పు"తో పోల్చి చూడటం ఎంతో జ్ఞానదాయకంగా వుంటుంది. పార్టీ మహాసభానంతరం మన పార్టీ అంతటిలోనూ, ప్రత్యేకించి సంపాదకవర్గంలోనూ యీ మార్పు జరుగుతోంది. ఉదాహరణకు, వి. ఐ. జసూలిచ్ ప్రసంగం (లీగు మహాసభలో, పేజి 66, తరువాతి పేజీలు) చూడండి. ఆమె యీ మార్పుయొక్క పూర్తి ప్రాధాన్యతను గుర్తించినట్లు కనబడదు.

ఖండిస్తున్నారు. సోషల్ డెమోక్రట్లలో ప్రజాస్వామ్య రహిత పాలనాక్రమాన్ని చూడగానే స్టాక్ ఎక్స్చేంజి యోధులు ఆగ్రహంతో ఇలా అరుస్తున్నారు: ''వ్యక్తియొక్క ప్రత్యేకత, వ్యక్తిత్వమూ అంతా అపకీర్తి పాలుచేయబడాలి, ఎందుచేతనంటే సాక్సనీ సోషల్ డెమోక్రట్ల పార్టీ మహాసభలో ఆ విషయంపై ప్రసంగించిన సిండర్‌మన్ అనేక మాటలలో చెప్పినట్టుగా అవి ఫ్రెంచి తరహా పరిస్థితులకూ, జోరేసిజంకూ, మిలెరానిజంకూ[68] దారితీయవచ్చుననే భయం వుంది.''

---

అందుచేత, నిర్మాణం గురించి కొత్త ''ఇస్క్రా'' కొత్త వూతపదాలలో సూత్రబద్ధ అర్థం అనేది ఏదైనా వుంటే అది అవకాశవాద అర్థం అనడంలో సందేహం యేమీ లేదు. ఈ నిర్ధారణ, విప్లవకర పక్షంగానూ అవకాశవాద పక్షంగానూ విడిపోయిన మన పార్టీ మహాసభ గురించిన యావత్తు పరిశీలనచేతనూ, నిర్మాణం విషయంలో అవకాశవాదం అదే పోకడలలోనూ అదే నిందారోపణలలోనూ చాలా తరచుగా అవే వూతపదాలలోనూ వ్యక్తం అయిన అన్ని యూరపియన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీల ఉదాహరణచేతనూ ధ్రువ పర్చబడింది. వివిధ పార్టీలకుండే జాతీయ విశిష్టతలూ, వేరు వేరు దేశాలలోని వేరు వేరు రాజకీయ పరిస్థితులూ వాటి ప్రభావాన్ని చూపి జర్మన్ అవకాశవాదాన్ని ఫ్రెంచి అవకాశ వాదానికీ, ఫ్రెంచి అవకాశవాదాన్ని ఇటాలియన్ అవకాశవాదానికీ, ఇటాలియన్ అవకాశ వాదాన్ని రష్యన్ అవకాశవాదానికీ పూర్తిగా భిన్నమైనవిగా చేసినమాట నిజమే. కాని పరి స్థితులలో ఈ తేడా వున్నప్పటికీ, అన్ని పార్టీలూ విప్లవకర పక్షంగానూ అవకాశవాద పక్షంగానూ విడిపోయిన సాదృశ్యమూ, నిర్మాణం విషయంలో అవకాశవాద ఆలోచనా విధా నంయొక్క పోకడలయొక్క సాదృశ్యమూ ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి.* మన మార్క్సి స్టుల, మన సోషల్ డెమోక్రట్ల శ్రేణులలో తీవ్రవాద మేధావులు ఎక్కువ సంఖ్యలో వుండ టంతో, వారి మనస్తత్వ రీత్యా వచ్చే అవకాశవాదం అనేక భిన్న రంగాలలోనూ అనేక భిన్న

---

* ఒకవైపున కామ్రేడ్స్ మర్తీనొవ్, అకీమొవ్‌లకూ, మరోవైపున కామ్రేడ్స్ ఫన్ ఫోల్మర్, ఫన్ ఎల్మ్ లేక జోరేస్, మిలెరాన్‌లకూ మధ్య తేడా చాలా ఎక్కువగా వున్నప్పటికీ, రష్యన్ డెమోక్రట్లలో ఎత్తుగడల సమస్యలపై ఆర్థికవాదులుగానూ రాజకీయ నాయకులు గానూ విడిపోయిన పాత చీలిక మొత్తం అంతర్జాతీయ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలో అవకాశవాదులుగానూ విప్లవవాదులుగానూ వచ్చిన చీలికకు సదృశమైనదిగా వుందనే విష యాన్ని నేడు ఎవరూ సందేహించరు. అలాగే రాజకీయంగా స్వాతంత్ర్యం లేని రాజకీయంగా

రూపాలలోనూ ఉండడం అనివార్యం. మనం మన ప్రపంచ దృక్పథానికి సంబంధించిన మౌలిక సమస్యలపైన, మన కార్యక్రమానికి సంబంధించిన సమస్యలపైన అవకాశవాదాన్ని ఎదిరించి పోరాడాము, లక్ష్యాలలో వున్న పూర్తి విభిన్నత సోషల్ డెమోక్రట్లకూ, మన చట్టబద్ధ మార్క్సిజాన్ని భ్రష్టం చేసిన లిబరల్స్‌కూ మధ్య తిరుగులేని చీలికకు అనివార్యంగా దారితీసింది. మనం, ఎత్తుగడల సమస్యలపై అవకాశవాదాన్ని ఎదిరించి పోరాడాము, అంత ముఖ్యంకాని యీ సమస్యలపై కామ్రేడ్స్ క్రిచేవ్‌స్కీ, అకీమొవ్‌లతో మన విభేదం సహజంగానే కేవలం తాత్కాలికమైనది, దాని వెంట వేరు వేరు పార్టీలను ఏర్పాటు చేయడమన్నది రాలేదు. ఇప్పుడు మనం నిర్మాణానికి సంబంధించిన సమస్యలపై మార్తొవ్ అక్సెల్‌రోడ్‌ల అవకాశవాదాన్ని ఓడించాలి. నిజానికి యీ సమస్యలు, కార్యక్రమం ఎత్తుగడల సమస్యల కంటె తక్కువ మౌలికమైనవే, కాని మన పార్టీ జీవితంలో ఇప్పుడవి ముందుకు వచ్చాయి.

అవకాశవాదాన్ని ఎదిరించి పోరాడటం గురించి మనం మాట్లాడేటప్పుడు, ప్రతి రంగంలోనూ నేటి అవకాశవాదపు ప్రత్యేక లక్షణాన్ని అంటే, దాని అస్పష్టతనూ, రూప రాహిత్యాన్నీ, మాయలమారితనాన్నీ ఎన్నటికీ మార్చిపోకూడదు. అవకాశవాది, తన స్వభావం చేతనే, ఒక స్పష్టమైన, నిర్ణాయకమైన వైఖరి తీసుకోకుండా ఎల్లప్పుడూ తప్పించుకుంటాడు, అతడు ఎల్లప్పుడూ మధ్యేమార్గాన్ని వెతుకుతాడు, అతడు ఎల్లప్పుడూ పరస్పరమూ ప్రత్యేకమైన రెండు దృక్పథాల మధ్య పాములాగ ఇటూ అటూ మెలికలు తిరుగుతాడు, తనకున్న అభిప్రాయ భేదాలను స్వల్పమైన సవరణలకూ, సందేహాలకూ, అమాయకపు ధర్మశీల సూచనలు, వగైరా వగైరాలకూ తగ్గించుకుంటూ రెండింటితోనూ ''ఏకీభవించడానికి'' ప్రయత్నిస్తాడు. కార్యక్రమానికి సంబంధించిన సమస్యలలో అవకాశవాది అయిన కామ్రేడ్ ఎడువార్డ్ బెర్న్‌స్టైన్, తన పార్టీయొక్క విప్లవాత్మక కార్యక్రమంతో ''ఏకీభవిస్తాడు,'' దానిని ''సమూలంగా మార్చడానికి'' అతడు నిస్సందేహంగా ఇష్టపడినప్పటికీ ఆ పని అకాలమైనదనీ, అయుక్తమైనదనీ, ''విమర్శ''యొక్క ''సాధారణ సూత్రాల''ను వివరిం

---

స్వతంత్రం అయిన దేశాల మధ్య పరిస్థితులలో బోలెడంత తేడా వున్నప్పటికీ పార్టీ నిర్మాణం గురించిన సమస్యలపై వచ్చిన ప్రధానమైన చీలికలలో వున్న సాదృశ్యం గురించి కూడ ఎలాంటి సందేహం వుండజాలదు. కొత్త ''ఇస్క్రా''యొక్క ఎంతో సూత్రబద్ధమైన సంపాదకవర్గం కౌట్స్కీకి హైనెకీ మధ్య వున్న వివాదం గురించి క్లుప్తంగా ప్రస్తావిస్తూనే (సంచిక 64) నిర్మాణ సమస్యలపై మొత్తంమీద అవకాశవాదమూ ఛాందసత్వమూ వ్యక్తం చేసిన సూత్రబద్ధమైన ధోరణులను చర్చించకుండా పిరికిగా తప్పించుకుంది.

చడం అంత ముఖ్యం కాదనీ భావిస్తాడు. (ఈ విమర్శ ప్రధానంగా బూర్జువా డెమోక్రసీ నుంచి సూత్రాలనూ పూతపదాలనూ గుణదోషవిచారణ చేయకుండా అరువుతీసుకోడమే అయివుంది.) ఎత్తుగడల సమస్యలలో అవకాశవాది అయిన కామ్రేడ్ ఫన్ ఫోల్మర్ కూడ విప్లవకర సోషల్ డెమోక్రట్ల పాత ఎత్తుగడలతో ఏకీభవిస్తాడు, నిర్దిష్టమైన ''మంత్రివర్గ'' ఎత్తుగడలను వేటినీ బహిరంగంగా సమర్థించడం కంటె ఎక్కువగా ఉపన్యాసాలకీ, స్వల్పమైన సవరణలకూ అవహేళనలకూ పరిమితపడి కూడా వుంటాడు. నిర్మాణ సమస్యలలో అవకాశవాదులైన కామ్రేడ్స్ మార్తోవ్, అక్సెల్‌రోడ్‌లు కూడ, ''నిబంధనావళిచే స్థిరపర్చ''బడగల సూత్రాలను ప్రకటిస్తామని ప్రత్యక్షంగా సవాలుచేసినప్పటికీ ఇంతవరకు అలాంటి స్పష్టమైన ప్రకటనను దేనినీ చేయలేదు; వారు కూడా నిర్మాణం గురించిన మన నిబంధనావళిని ''సమూలంగా మార్చడానికి'' ఇష్టపడతారు, తప్పకుండా ఇష్టపడవచ్చు (''ఇస్క్రా,'' సంచిక 58, పేజి 2, కాలం 3). కాని వారు మొట్టమొదట ''నిర్మాణానికి సంబంధించిన సాధారణ సమస్యల'' పట్ల శ్రద్ధవహించడం మేలనుకుంటారు. (ఎందు చేతనంటే మొదటి నిబంధన వున్నప్పటికీ కేంద్రీకృతమైన నిబంధనావళి అయిన మన నిబంధనావళిని నిజంగా సమూలంగా మార్చడం కొత్త ''ఇస్క్రా'' సరళిలో అమలు జరప బడినట్టయితే, అనివార్యంగా స్వేచ్ఛానువర్తనవాదానికి దారితీస్తుంది; కామ్రేడ్ మార్తోవ్ సూత్రరీత్యా స్వేచ్ఛానువర్తనవాదం వైపు మొగ్గుతున్నట్టు తనలో తనవరకైనా ఒప్పుకోడు.) అందుచేత, నిర్మాణానికి సంబంధించిన వారి ''సూత్రాలు'' ఇంద్రధనస్సులోని రంగులన్నిటినీ ప్రదర్శిస్తాయి. ప్రధానమైన అంశం నిరంకుశత్వానికీ బ్యూరాక్రసీకీ వ్యతిరేకంగానూ, గుడ్డి విధేయతకూ, చక్రాలు, చక్రాలలోని పళ్లకూ వ్యతిరేకంగానూ అమాయకపు ఉద్విగ్నపూరిత ఉపన్యాసాలతో కూడి వుంది — అవి ఎంత అమాయకమైన ఉపన్యాసాలంటే వాటిలో ఏది నిజంగా సూత్రానికి సంబంధించిన విషయమో, ఏది నిజంగా కో-ఆప్టేషన్‌కు సంబంధించిన విషయమో తెలుసుకోడం ఇప్పటికీ చాలా కష్టంగానే వుంది. కాని కాలం గడచినకొద్దీ వ్యవహారం అధ్వానం అవుతుంది; యీ ద్వేషించతగిన ''బ్యూరాక్రసీని'' విశ్లేషించి ఖచ్చితంగా నిర్వచించడానికి జరిగే ప్రయత్నాలు తప్పనిసరిగా స్వేచ్ఛానువర్తనవాదానికి దారితీస్తాయి; తమ వైఖరిని ''ప్రగాఢ మొనర్చడానికీ,'' దానిని సమర్థించుకోడానికీ జరిగే ప్రయత్నాలు వెనుకబాటుతనాన్ని సమర్థించడానికీ, తోకపట్టుకుని పోయే విధానానికీ, జిరోండిస్టు వాగాడంబరానికీ తప్పనిసరిగా దారితీస్తాయి. చివరకి నిజంగా నిర్దిష్టమైన ఏకైక సూత్రంగా అరాజకవాద సూత్రం ఉద్భవిస్తుంది. ఆ కారణంచేత అది ఆచరణలో ప్రత్యేకించి ప్రస్ఫుటంగా ప్రదర్శితమౌతుంది (ఆచరణ ఎల్లప్పుడూ సిద్ధాంతం కంటె ముందుకు సాగుతుంది). క్రమశిక్షణను గేలిచేయడం — స్వేచ్ఛానువర్తనవాదం — అరాజకవాదం — ఒక నిచ్చెనలాంటిది.

నిర్మాణం విషయాలలో మన అవకాశవాదం దానిమీద ఒక మెట్టుమీదనుంచి మరో మెట్టుకు గెంతుతూ, తన సూత్రాలను స్పష్టంగా ప్రకటించకుండా నేర్పుతో తప్పించుకుంటూ, ఒకసారి పైకి ఎక్కుతూ మరోసారి కిందికి దిగుతూ వుంటుంది.* కార్యక్రమానికీ, ఎత్తుగడలకూ సంబంధించిన విషయాలలో అవకాశవాదం సరిగ్గా అదే ఘట్టాలను ప్రదర్శిస్తూ వుంది: "ఛాందసత్వాన్నీ," సంకుచితత్వాన్నీ, అచలత్వాన్నీ గేలిచేస్తోంది — రివిజనిస్టు "విమర్శ," మంత్రిత్వవాదం — బూర్జువా ప్రజాస్వామ్యం.

క్రమశిక్షణ పట్ల యీ ద్వేషానికీ, చిన్నపుచ్చబడటం గురించిన ఆ నిరంతర దోషాన్వేషణకూ మానసికమైన సన్నిహిత సంబంధం వుంది. అది మొత్తంమీద నేటి అవకాశవాదులందరి రచనలన్నిటిలోనూ, ప్రత్యేకించి మన మైనారిటీ రచనలన్నిటిలోనూ కనబడుతుంది! వారు వేధింపబడుతున్నారు, తోసివేయబడుతున్నారు, ముట్టడింపబడుతున్నారు, బెదిరించబడుతున్నారు. బెదిరించేవారిని గురించీ బెదిరించబడేవారిని గురించీ

---

* నిబంధనావళిలోని మొదటి నిబంధనపై జరిగిన చర్చలను జ్ఞాపకంపెట్టుకున్న వారు, మొదటి నిబంధన విషయంలో కామ్రేడ్ మార్తొవ్, కామ్రేడ్ అక్సెల్‌రోడ్ చేసిన పొరపాటు పెంపొందింపబడి ప్రగాఢ మొనర్చబడినప్పుడు తప్పనిసరిగా నిర్మాణం విషయాలలో అవకాశవాదానికి దారితీశాయని ఇప్పుడు స్పష్టంగా చూస్తారు. కామ్రేడ్ మార్తొవ్‌యొక్క ప్రధానమైన భావం — పార్టీలో స్వయం సభ్యత్వం — అదే బూటక "ప్రజాస్వామ్యం," పార్టీని కిందినుంచి పైకి నిర్మించాలనే భావం. తద్భిన్నంగా నా భావం, పార్టీని పైనుంచి కిందికి, పార్టీ మహాసభనుంచి విడి పార్టీ శాఖలవరకూ నిర్మించాలనే తాత్పర్యంలో "బ్యురాక్రసీ" అయింది. బూర్జువా మేధావి మనస్తత్వమూ, అరాజకవాదపు వాగాడంబరమూ, అవకాశవాదపు తోకపట్టుకుని పోయే పాండిత్యప్రకర్ష అన్నీ మొదటి నిబంధనపై జరిగిన చర్చలలో ఇదివరకే ప్రదర్శింపబడ్డాయి. కామ్రేడ్ మార్తొవ్ తన "ముట్టడి స్థితి"లో (పేజి 20) కొత్త "ఇస్క్రా"చే "కొత్త భావాలు రూపొందించడం ఆరంభమైంది" అని అంటున్నాడు. ఆయనా, అక్సెల్‌రోడూ నిబంధనావళిలోని మొదటి నిబంధనతో ఆరంభించి యీ భావాలను ఒక కొత్త మార్గంలో నిజంగా ముందుకు తోస్తున్నారనే తాత్పర్యంలో అది నిజమే. వున్న చిక్కు అంతా ఏమిటంటే యీ మార్గం అవకాశవాద మార్గం. ఈ మార్గంలో వారు ఎంత ఎక్కువగా "పని చేస్తే," ఈ పని కో-ఆప్టేషను విషయమై జరిగిన జగడంనుంచి ఎంత ఎక్కువగా బైటపడితే, వారు అంత ఎక్కువ లోతుగానూ ఊబిలో దిగబడతారు. మహాసభలో కామ్రేడ్ ప్లెహానొవ్ ఇదివరకే దీనిని స్పష్టంగా గ్రహించాడు. "ఏం చెయ్యకూడదు" అనే తన వ్యాసంలో వారిని మరోసారి హెచ్చరించాడు: మిమ్మల్ని

పరిహాసకరమైన చతురోక్తి చేసిన ఆయనే బహుశా అనుమానించే దాని కంటె మరింత ఎక్కువ మానసిక, రాజకీయ సత్యం యీ వూతపదాలలో వుంది.[69] మైనారిటీ వారందరూ చిన్న పుచ్చుబడ్డామనే భావంతో బాధపడుతున్నవారూ, విప్లవకర సోషల్ డెమోక్రట్లచే ఎప్పుడో ఒకప్పుడు, ఏదో ఒక కారణంగా అవమానింపబడిన వారేనని తెలుసుకోడానికి మన పార్టీ మహాసభ మినిట్సు చూస్తే చాలు. అందులో పార్టీ మహాసభనుంచి ఉపసంహరించుకునేటంత ఎక్కువగా "అవమానింపబడిన" బుంద్‌వాళ్లూ, "రబోచెయె దేలొ"వాళ్లూ వున్నారు; మొత్తంమీద సంఘాల సంహారంచేతనూ, ప్రత్యేకించి వారి సంఘ సంహారం చేతనూ చచ్చేటంతగా అవమానపర్చబడిన "యూజ్నీ రబోచీ"వాళ్ళు వున్నారు; వేదికపైకి వచ్చినప్పుడల్లా అవమాన పరచబడిన కామ్రేడ్ మాహొవ్ వున్నాడు (ఎందుకంటే ఆయన వేదిక ఎక్కినప్పుడల్లా, అనివార్యంగా హాస్యాస్పదుడయాడు); నిబంధనావళిలోని మొదటి నిబంధన సందర్భంలో "అవకాశవాదం అనే తప్పుడు నిందారోపణ"చేతనూ ఎన్నికలలో తమ ఓటమిచేతనూ అవమానపరచబడిన కామ్రేడ్ మార్తొవ్, కామ్రేడ్ అక్సెల్‌రోడ్ వున్నారు. ఈ తీవ్రమైన అవమానాలన్నీ ఎంతో మంది కూపస్థమండూకాలు యీనాటికీ వూహించుతున్నట్టుగా అనుమతింపరాని చతురోక్తులు, మొరటు ప్రవర్తన, ఆవేశపూరిత వాగ్వాదం, తలుపులు మూసివేయడం, పిడికిళ్ళు చూపించడం, మొదలైన వాటి యాదృచ్ఛిక పర్యవసానాలు కాదు, "ఇస్క్రా" మూడు సంవత్సరాలపాటు సాగించిన సైద్ధాంతిక కృషియొక్క అనివార్యమైన రాజకీయ పర్యవసానమే. ఈ మూడేళ్ల కాలంలోనూ మేము వూరికే వాగడం గాక, కార్యరూపంలో ఆచరణలో పెట్టవలసిన దృఢాభిప్రాయాలను ప్రకటించి వున్నందువల్ల మహాసభలో "ఇస్క్రా" వ్యతిరేకులతోనూ, "ఊబి"తోనూ పోరాడక తప్పలేదు. ఎలాంటి ముసుగూ లేకుండానే ప్రథమశ్రేణిలో వుండి పోరాడిన మార్తొవ్‌తోపాటు, మేము ఎంత మందినో అవమానపరచినప్పుడు మేము చేయవలసి వచ్చినది మాత్రం ఏమిటంటే కామ్రేడ్ అక్సెల్‌రోడ్‌నూ, కామ్రేడ్ మార్తొవ్‌నూ కొంచెం ఎక్కువగా అవమానించడం, దానితో

---

కో-ఆప్టు చేసుకోడానికి కూడా నేను సంసిద్ధంగా వున్నాను, మీరు యీ మార్గంలో పోవద్దు, అది అవకాశవాదానికీ అరాజకవాదానికీ మాత్రమే దారితీయగలదు. ఈ మంచి సలహాను మార్తొవ్, అక్సెల్‌రోడ్ వినలేదు. ఏమిటి? ఈ మార్గాన్ని అనుసరించవద్దా? కో-ఆప్టేషన్ గోల అంతా జగడమాడటం తప్ప మరేమీ కాదని లెనిన్‌తో ఏకీభవించాలా? ఎన్నటికీ కాదు! మేము సూత్రబద్ధులమైన మనుషులమని ఆయనకి చూపుతాము! — వారలా చూపారు. వారికి కొత్త సూత్రాలు అనేవి ఏవైనా వుంటే అవి అవకాశవాద సూత్రాలే అని అందరికీ వారు స్పష్టంగా చూపారు.

కట్టలు తెగాయి. పరిమాణం గుణంగా మారింది. నాస్తీకరణ నాస్తీకరింపబడింది. అవమానించ బడిన వారందరూ తమ పరస్పర అసూయలను మరచిపోయి, ఏడుస్తూ ఒకరి ఒడిలో ఒకరు పడ్డారు. ''లెనినిజంపై తిరుగుబాటు''* పతాకాన్ని లేవనెత్తారు.

ప్రగతి నిరోధకులపై ప్రగతిశీలురు తిరుగుబాటు చేసేటప్పుడు తిరుగుబాటు దివ్య మైనది. విప్లవకర పక్షం అవకాశవాద పక్షంమీద తిరుగుబాటు చేస్తే అది మంచి పని, అవ కాశవాద పక్షం విప్లవకర పక్షంమీద తిరుగుబాటు చేస్తే అది చెడ్డ పని.

కామ్రేడ్ ప్లెహానొవ్ యీ చెడ్డ వ్యవహారంలో ఒక యుద్ధ ఖైదీ మాదిరిగా పాల్గొన వలసి వచ్చింది. ''మెజారిటీ''కి అనుకూలంగా ఏదో ఒక తీర్మానాన్ని ప్రతిపాదించిన వారి మాటలలో నేర్పులేని విడివిడి పదాలను వెతికి పట్టుకోడం ద్వారా ఆయన తన ''క్రోధాన్ని వెళ్లగక్కడానికి'' ప్రయత్నించి ''నిర్భాగ్యుడు కామ్రేడ్ లెనిన్! ఆయన ఛాందసపు వత్తాసు దార్లు బలేవాళ్లే!'' అని గేలిచేస్తున్నాడు (''ఇస్క్రా,'' సంచిక 63, అనుబంధం).

బాగుంది, కామ్రేడ్ ప్లెహానొవ్, నేను చెప్పగలిగిందల్లా ఇదే, నేను నిర్భాగ్యుణ్ణ యితే కొత్త ''ఇస్క్రా'' సంపాదకులు పరమ దరిద్రులు. నేను ఎంత నిర్భాగ్యుణ్ణయినా, పార్టీ మహాసభను చూడకుండా కళ్లు మూసుకుని కమిటీ సభ్యుల తీర్మానాలలో నా చమ త్కారానికి ఉపయోగపడే మాటల కోసం వెతికేటంతటి పూర్తి దిక్కుమాలిన స్థితికి ఇంకా పోలేదు. నేను ఎంత నిర్భాగ్యుణ్ణయినా ఎవరి వత్తాసుదార్లు అయితే పరాకుగా ఒక్క వికార మైన మాట ఉచ్చరించకుండా ప్రతి సమస్యపైనా — అది నిర్మాణానికిగాని ఎత్తుగడలకుగాని కార్యక్రమానికిగాని సంబంధించినదైనా సరే — మొండిగానూ అదేపనిగానూ విప్లవకర సోషల్ డెమోక్రటిక్ పార్టీ సూత్రాలకు పూర్తిగా వ్యతిరేకమైన సూత్రాలకు అంటిపెట్టుకుని వుండే వారికంటె వెయ్యి రెట్లు భాగ్యవంతుణ్ణి. నేను ఎంత నిర్భాగ్యుణ్ణయినా, అలాంటి వత్తాసు దార్లు నాపై కురిపించిన ప్రశంసలను ప్రజలకు తెలియకుండా దాచిపెట్టే స్థితికి ఇంకా రాలేదు. ఆ పని చేయవలసిన వారు కొత్త ''ఇస్క్రా'' సంపాదకులే.

పాఠక మహాశయా, రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబరు పార్టీకి చెందిన వొరొనెజ్ కమిటీ దేనిని బలపరుస్తుందో మీకు తెలుసా? తెలియకపోతే, పార్టీ మహాసభ మినిట్స్ చద

---

* ఆశ్చర్యం కలిగించే యీ మాట కామ్రేడ్ మార్తొవ్ ఉపయోగించినది (''ముట్టడి స్థితి,'' పేజి 68). నా ఒక్కడిమీద మాత్రమే ''తిరుగుబాటు'' లేవనెత్తడానికి ముందు ఒకటికి అయిదురెట్లు బలం వచ్చేవరకూ కామ్రేడ్ మార్తొవ్ వేచి వున్నాడు. కామ్రేడ్ మార్తొవ్ ఎంత మాత్రం నేర్పు లేకుండా వాదిస్తున్నాడు: తన ప్రతికక్షిని అత్యంతంగా శ్లాఘించడం ద్వారా అతనిని నాశనం చేయగోరుతున్నాడు.

వండి. వాటిని పట్టి ఆ కమిటీయొక్క వైఖరి కామ్రేడ్ అకీమొవ్‌చేతనూ, కామ్రేడ్ బ్రూకెర్ చేతనూ పూర్తిగా వ్యక్తం చేయబడిందని మీకు తెలుస్తుంది. వారు పార్టీ మహాసభలో మొదటినుంచి చివరిదాకా పార్టీలోని విప్లవకర పక్షాన్ని వ్యతిరేకించి పోరాడారు. కామ్రేడ్ ప్లెహానొవ్‌నుంచి కామ్రేడ్ పొపొవ్‌వరకూ అందరిచేతా అవకాశవాదులుగా కొన్ని డజన్ల సార్లు జమకట్టబడ్డారు. ఈ వొరొనెజ్ కమిటీ జనవరి నెలలో ప్రచురించిన తన కరపత్రంలో (నెం. 12, జనవరి 1904) ఈ కింది ప్రకటన చేసింది:

"క్రమంగా పెరుగుతున్న మన పార్టీ జీవితంలో కిందటేడు ఒక మహత్తరమైన ముఖ్యమైన ఘటన జరిగింది: అదే రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబరు పార్టీ రెండవ మహాసభ, దాని శాఖల ప్రతినిధుల మహాసభ. పార్టీ మహాసభను సమావేశపర్చడం చాలా సంక్లిష్టమైన విషయం, ఇప్పుడున్న రాజరిక పరిపాలనలో అది చాలా ప్రమాదకరమైన కష్టమైన పని. అందుచేత అది ఏమంత ఉత్తమమైన విధంగా జరిగివుండకపోవడంలో ఆశ్చర్యం లేదు, దుర్ఘటనలు ఏవీ జరగకపోయినప్పటికీ, ఆ మహాసభ పార్టీ కోర్కెలన్నిటినీ తీర్చలేకపోయింది. మహాసభను సమావేశపర్చడానికి 1902 కాన్ఫరెన్సు సమావేశం నియమించిన కామ్రేడ్స్ అరెస్టు చేయబడ్డారు, రష్యన్ సోషల్ డెమోక్రసీలో ఒక ధోరణికి మాత్రమే ప్రాతినిధ్యం వహించేవారు, అంటే 'ఇస్క్రాయిస్టులు,' ఆ మహాసభను ఏర్పాటు చేశారు. 'ఇస్క్రాయిస్టులు' కాని సోషల్ డెమోక్రట్లకు చెందిన చాలా శాఖలు మహాసభలో పాల్గొనేటందుకు ఆహ్వానింపబడలేదు; కొంతవరకు యీ కారణం మూలంగా పార్టీకి కార్యక్రమాన్నీ, నిబంధనావళినీ తయారు చేసే పనినీ మహాసభ అత్యంత అసంపూర్ణమైన విధంగా నిర్వహించింది; 'ప్రమాదకరమైన అపార్థాలకు దారితీయగల' ముఖ్యమైన లోపాలు నిబంధనావళిలో వున్నాయని ప్రతినిధులే అంగీకరించారు. మహాసభలో 'ఇస్క్రాయిస్టు'లలోనే చీలికవచ్చింది. 'ఇస్క్రా' క్రియాత్మక కార్యక్రమంతో ఇంతకు పూర్వం పూర్తిగా ఏకీభవించినట్టు కనబడిన మన ఆర్.ఎస్.డి.ఎల్.పి.లోని ప్రముఖ సభ్యులు చాలామంది, దానిలోని చాలా అభిప్రాయాలు, ప్రధానంగా లెనిన్, ప్లెహానొవ్ సమర్థించినవి, ఆచరణయోగ్యం కానివని తెలుసుకున్నారు. మహాసభలో వీరు పైచేయి సంపాదించినప్పటికీ, నిజ జీవితపు ధోరణీ, 'ఇస్క్రా'వాళ్లు కాని వారందరూ పాల్గొంటున్న ప్రత్యక్ష కార్యాచరణయొక్క అవసరాలూ సిద్ధాంతవేత్తలు చేసిన తప్పులను త్వరితంగా సరిదిద్దుతున్నాయి, మహాసభ తరువాత ఇప్పటికే ముఖ్యమైన మార్పులను ప్రవేశపెట్టాయి. 'ఇస్క్రా' ఎంతో మారింది, మొత్తంమీద సోషల్

డెమోక్రటిక్ పార్టీలోని కార్యకర్తలందరి డిమాండ్ల పట్లా జాగ్రత్తతో కూడిన శ్రద్ధవహించే ఆశ కనిపిస్తోంది. ఆవిధంగా, తరువాతి మహాసభలో యీ మహాసభ ఫలితాలు మార్చబడవలసి వున్నప్పటికీ, ప్రతినిధులకే స్పష్టం అయినట్టుగా, అవి అసంతృప్తికరంగా వున్నాయి. అందుచేత అవి పార్టీచే నిరాక్షేపణీయమైన నిర్ణయాలుగా అంగీకరింపబడజాలవు, అయినప్పటికీ పార్టీలోని పరిస్థితిని మహాసభ స్పష్టం చేసింది, పార్టీయొక్క తదుపరి సైద్ధాంతిక నిర్మాణాత్మక కార్యకలాపాలకు ఎంతో సమాచారాన్ని చేకూర్చింది, మొత్తం పార్టీ అంతటి కృషికీ అది అపారమైన జ్ఞాన బోధక విలువగల అనుభవం. మహాసభ చేసిన నిర్ణయాలనూ, అది తయారు చేసిన నిబంధనావళినీ శాఖలన్నీ పరిగణనలోకి తీసుకుంటాయి, కాని వాటిలో ప్రస్ఫుటంగా వున్న లోపాల దృష్ట్యా చాలా శాఖలు ప్రత్యేకించి వాటిచేతనే నడపబడటానికి ఒప్పుకోవు.

''పార్టీ అంతటి కృషికీ వున్న ప్రాముఖ్యతను పూర్తిగా గుర్తిస్తూ, వొరోనెజ్ కమిటీ మహాసభను ఏర్పాటు చేయడానికి సంబంధించిన అన్ని విషయాలలోనూ చురుకుగా ప్రవర్తించింది. మహాసభలో జరిగిన దాని అంతటి ప్రాముఖ్యతనూ అది పూర్తిగా గ్రహించుతోంది, కేంద్ర పత్రిక అయిన 'ఇస్క్రా'లో వచ్చిన మార్పుకు సంతోషిస్తోంది.

''పార్టీలోని కేంద్ర కమిటీలోని వ్యవహారాల పరిస్థితి ఇంకా మనకి సంతృప్తి కలిగించక పోయినప్పటికీ పార్టీని సంఘటితం చేసే క్లిష్టమైన పని సంయుక్త కృషిద్వారా పరిపూర్ణం చేయబడుతుందనే విశ్వాసం మనకుంది. తప్పుడు పుకార్ల దృష్ట్యా వొరోనెజ్ కమిటీ కామ్రేడ్స్‌కి ఒక విషయం తెలియజేస్తోంది. అదేమిటంటే వొరోనెజ్ కమిటీ పార్టీని వదలి పోయే ప్రశ్నే లేదని. వొరోనెజ్ కమిటీలాంటి కార్మిక సంఘం ఆర్.ఎస్.డి.ఎల్.పి.నుంచి ఉపసంహరించుకోడంవల్ల ఎంతటి ప్రమాదకరమైన పూర్వ దృష్టాంతం అయివుంటుందో, పార్టీకి ఇది ఎంత అపకీర్తి అవుతుందో, ఇదే ఉదాహరణను అనుసరించే కార్మిక సంస్థలకు ఇది ఎంత నష్టకరంగా వుంటుందో వొరోనెజ్ కమిటీ పూర్తిగా గుర్తించింది. మనం కొత్త చీలికలను కల్పించకూడదు, వర్గ చైతన్యంగల అందరు కార్మికులనూ సోషలిస్టులనూ ఒకే పార్టీలో ఐక్యపర్చడానికి పట్టువిడువకుండా ప్రయత్నించాలి. అంతే గాక, రెండవ మహాసభ ప్రారంభక మహాసభ కాదు, కేవలం క్రమానుగతమైంది. పార్టీనుంచి బహిష్కరించడమన్నది పార్టీ న్యాయస్థాన నిర్ణయం ద్వారా మాత్రమే జరగాలి, పార్టీనుంచి ఏ సోషల్ డెమోక్రటిక్ శాఖని బహిష్కరించే హక్కు ఏ శాఖకి చివరకు కేంద్ర కమిటీకి సహితం లేదు. అంతే గాక, రెండవ మహాసభచే ఆమోదింపబడిన నిబంధనావళిలోని ఎనిమిదవ నిబం

ధన ప్రకారం ప్రతి శాఖ తన స్థానిక వ్యవహారాలలో స్వేచ్ఛానువర్తన హక్కు కలిగి వుంటుంది, తదనుసారంగా వొరొనెజ్ కమిటీ నిర్మాణం గురించిన తన అభిప్రాయాలను అమలు జరిపేటందుకూ, వాటిని పార్టీలో సమర్థించుకునేటందుకూ పూర్తి హక్కు కలిగివుంది.''

కొత్త ''ఇస్క్రా'' సంపాదకులు ఈ కరపత్రాన్ని సంచిక 61లో ఉదహరించినప్పుడు యీ దూషణలోని రెండవ భాగాన్ని, ఇక్కడ మనం యిచ్చిన చివరి పేరాను మాత్రమే పునర్ముద్రించారు. సంపాదకులు వదలివేయనెంచిన దానిని పైన ప్రత్యేకించి ముద్రించాం.

వారు సిగ్గుపడ్డారు.

## చ) గతితర్కం గురించి కొద్ది మాటలు. రెండు విప్లవాలు

మన పార్టీలో వచ్చిన సంక్షోభంయొక్క పరిణామాన్ని మొత్తంగా తిలకిస్తే పోటీ పడుతున్న రెండు పక్షాల సంపుటి, కొన్ని చిన్న మినహాయింపులతో, మొత్తంమీద మారకుండా అంతటా అలాగే వుందని వెంటనే తెలుస్తుంది. అది మన పార్టీలో విప్లవకర పక్షానికీ అవకాశవాద పక్షానికీ మధ్య జరిగిన పోరాటం, కాని యీ పోరాటం భిన్న భిన్న దశలను దాటింది, ఇప్పటికే పోగైవున్న బోలెడంత సాహిత్యం, అసంపూర్ణమైన సాక్ష్య పరంపరలు, సందర్భశుద్ధి లేని ఉపన్యాస భాగాలు, విడివిడి నిందారోపణలు, వగైరా వగైరాలలో తన స్థానం తెలుసుకొనగోరేవారు ఎవరైనా యీ దశలు ప్రతిదానికీ వున్న విశిష్టలక్షణాలను పూర్తిగా తెలుసుకోవాలి.

ప్రధానమైన స్పష్టమైన దశలను వరుసగా లెక్కిద్దాం: (1) నిబంధనావళిలోని మొదటి నిబంధనపై జరిగిన వివాదం. ఇది నిర్మాణానికి సంబంధించిన ప్రధాన సూత్రాలపై జరిగిన సైద్ధాంతిక పోరాటం. ప్లెహానొవూ, నేనూ మైనారిటీలో వున్నాం. మార్తొవూ, అక్సెల్రోడూ అవకాశవాద సూత్రీకరణలను ప్రతిపాదించి అవకాశవాదుల ఒడిలో వున్నారు. (2) కేంద్ర కమిటీ అభ్యర్థుల జాబితాలపై ''ఇస్క్రా'' శాఖలో వచ్చిన చీలిక: అయిదుగురుతో కూడిన కమిటీలో ఫొమీన్ వుండాలా లేక వసీల్యెవ్ వుండాలా, ముగ్గురుతో కూడిన కమిటీలో ట్రాట్స్కీ వుండాలా లేక త్రవీన్‌స్కీ వుండాలా అనేది. ప్లెహానొవూ, నేనూ తిరిగి మెజారిటీ సంపాదించాం (తొమ్మిదిలో ఏడు), దీనికి కొంతవరకు కారణం మొదటి నిబంధన విషయంలో మేము మైనారిటీలో వుండటం. మార్తొవ్ అవకాశవాదులతో కలవడం అర్థమై

జింగు కమిటీ ఘటనపై నాకున్న తీవ్ర అనుమానాలను ధ్రువపర్చింది. (3) నిబంధనావళి వివరాలపై వివాదం కొనసాగడం. మార్తోవ్‌ను అవకాశవాదులు తిరిగి కాపాడుకున్నారు. మేము తిరిగి మైనారిటీలో వుండి కేంద్ర సంస్థలలో మైనారిటీ హక్కుల కోసం పోరాడాం. (4) ఏడుగురు తీవ్ర అవకాశవాదులూ మహాసభనుంచి ఉపసంహరించుకున్నారు. మేము మెజారిటీ అయి, ఎన్నికలలో కలయికను (''ఇస్క్రా''వాళ్ల మైనారిటీ, ''ఊబి,'' ''ఇస్క్రా'' వ్యతిరేకుల కలయికను) ఓడించాం. మార్తోవ్, పొపోవ్, ముగ్గురేసితో కూడిన మా కమిటీలో వుండటానికి నిరాకరించారు. (5) కో-ఆప్టేషనుపై మహాసభానంతర జగడం. ఉన్మత్త అరాజకవాద ప్రవర్తన, అరాజకవాదపు వాగాడంబరం. ''మైనారిటీ''లో ఏ మాత్రమూ నిలకడా, నిశ్చలబుద్ధీ లేనివారు పైచెయ్యి సంపాదించారు. (6) చీలికను నివారించడానికి ప్లెహానొవ్ "kill with kindness" విధానాన్ని అవలంబించాడు. ''మైనారిటీ'' కేంద్ర పత్రిక సంపాదకవర్గాన్నీ, కౌన్సిలునూ ఆక్రమించి, తన శక్తి కొద్దీ కేంద్ర కమిటీమీద దాడి చేసింది. ఈ జగడం అన్నిటా వ్యాపించుతూనేవుంది. (7) కేంద్ర కమిటీపై జరిగిన మొదటి దాడి తిప్పికొట్టబడింది. జగడం కొంతవరకు అణగినట్టు కనబడింది. పార్టీని బాగా ఆందోళన పరుస్తున్న రెండు కేవల సైద్ధాంతిక సమస్యలను ఇది వరకటికంటె మరింత ప్రశాంతతతో చర్చించడం సాధ్యమైంది. ఆ సమస్యలు ఇవి: (అ) అంతకు ముందున్న చీలికలన్నిటినీ రద్దుచేసి రెండవ మహాసభలో మన పార్టీ ''మెజారిటీ'' గానూ ''మైనారిటీ''గానూ చీలిపోడానికున్న రాజకీయ ప్రాముఖ్యత, వివరణ ఏమిటి? (ఆ) నిర్మాణం సమస్యపై కొత్త ''ఇస్క్రా'' తీసుకున్న కొత్త వైఖరికి సూత్రరీత్యా వున్న ప్రాముఖ్యం ఏమిటి?

ఈ దశలు ప్రతిదానిలోనూ పోరాట పరిస్థితులూ, దాడియొక్క తక్షణ ఆశయం వస్తుతః వేరు; ప్రతి దశా మొత్తం సైనిక దండయాత్రలో ఒక విడి పోరాటం. ప్రతి దాని నిర్దిష్ట పరిస్థితులనూ పరిశీలించితే తప్ప మన పోరాటాన్ని అర్థంచేసుకోనేలేము. ఆ పని జరిగితే యీ పరిణామం వైరుధ్యాల ద్వారా నిజంగా గతితర్కరీత్యా సాగిందని మనకి స్పష్టంగా తెలుస్తుంది: మైనారిటీ మెజారిటీగా అయింది; మెజారిటీ మైనారిటీగా అయింది; ప్రతి ఒక పక్షమూ దెబ్బకాచుకునే స్థితినుంచి ఎదురుదెబ్బకొట్టే స్థితికీ, ఎదురుదెబ్బకొట్టే స్థితినుంచి దెబ్బకాచుకునే స్థితికీ మారింది; సైద్ధాంతిక పోరాటపు ఆరంభ అంశానికి (నిబంధనావళిలోని మొదటి నిబంధన) ''నాస్తీకరణ జరిగి,'' సర్వవ్యాపక జగడానికి* తావిచ్చింది, కాని ఆ తరువాత ''నాస్తీకరణయొక్క నాస్తీకరణ'' ప్రారంభమైంది. వివిధ కేంద్ర

* జగడానికీ సూత్రబద్ధమైన భేదాలకూ మధ్య విభజన రేఖను గీసే క్లిష్ట సమస్య

సంస్థల విషయమై మనకు దేవుడిచ్చిన భార్యతో కాస్త ''రాసుకుని తిరిగి'' మనం ఆరంభ అంశానికి కేవలం సైద్ధాంతిక పోరాటానికి తిరిగివచ్చాం; కాని ఇప్పుడు యీ ''వాదం'' ''ప్రతివాద'' ఫలితాలన్నిటిచేతా సంపన్నం చేయబడి మరింత ఉన్నత సంయోజనం అయింది, అందులో మొదటి నిబంధనపై జరిగిన విడి, యాదృచ్ఛిక పొరపాటు నిర్మాణ వ్యవహారాల గురించిన అవకాశవాద అభిప్రాయాల కృతక వ్యవస్థగా తయారైంది, అందులో యీ యదార్థానికీ, మన పార్టీ విప్లవకర పక్షంగానూ అవకాశవాద పక్షంగానూ విడిపోయిన ప్రధాన చీలికకూ మధ్యగల సంబంధం అందరికీ అంతకంతకు ఎక్కువగా స్పష్టమైంది. ఒక్క మాటలో చెప్పాలంటే, ధాన్యం హేగెల్ సిద్ధాంతాన్ని అనుసరించి పెరగడమే కాదు రష్యన్ సోషల్ డెమోక్రట్లు కూడా హేగెల్ సిద్ధాంతాన్ని అనుసరించే తమలో తాము పోట్లాడు కుంటున్నారు.

కాని, మార్క్సిజం మొదట దేనినైతే తిరగవేసి తరువాత తన స్వంతం చేసుకుందో, ఆ మహత్తర హేగెలియన్ గతితర్కాన్ని, పార్టీలో విప్లవకర పక్షంనుంచి అవకాశవాద పక్షానికి మారే రాజకీయవేత్తల వంకరటింకర ప్రవర్తనలను సమర్థించే అసభ్యపు జిత్తులతోనూ, ఒకే క్రమంయొక్క వివిధ దశలకు చెందిన ప్రత్యేక ప్రకటనలనూ ప్రత్యేక పరిణామాత్మక అంశాలనూ కలగాపులగం చేసే అసభ్యపు అలవాటుతోనూ ఎప్పుడూ గందరగోళపర్చ కూడదు. నిజమైన గతితర్కం వ్యక్తుల పొరపాట్లను సమర్థించదు, అనివార్యమైన మార్పు లను పరిశీలించి, పరిణామ క్రమంయొక్క పూర్తి నిర్దిష్టత ఆధారంగా అవి అనివార్య మైనవని రుజువుచేస్తుంది. గతితర్కపు ప్రధాన సూత్రాలలో ఒకటేమిటంటే, సాధారణ సత్యం అనేది ఏదీ లేదు, సత్యం సర్వదా నిర్దిష్టమైనది.... మరో విషయం ఏమిటంటే, మహత్తర హేగెలియన్ గతితర్కాన్ని mettere la coda dove non va il capo (''తల దూరకపోతే తోకదూర్చడం'') అనే ఇటాలియన్ సామెతలో ఎంతో చక్కగా వ్యక్తం చేయబడిన ఆ అసభ్యపు లోక జ్ఞానంతో ఎప్పుడూ గందరగోళపర్చకూడదు.

మన పార్టీ పోరాటపు గతితార్కిక పరిణామ ఫలితం రెండు విప్లవాలు. కామ్రేడ్ మార్తొవ్ ''మరోసారి మైనారిటీలో'' అనే తన వ్యాసంలో సబబుగా వ్యాఖ్యానించినట్టుగా పార్టీ మహాసభ ఒక నిజమైన విప్లవం. ''ప్రపంచం విప్లవాలచే నడుస్తుంది; మనం కూడా ఒక విప్లవాన్ని తీసుకువచ్చాం!'' అనే మైనారిటీకి చెందిన చతుర భాషులు చెప్పింది కూడా

---

ఇప్పుడు దానంతటదే పరిష్కారమైంది: కో-ఆప్టేషనుకు సంబంధించినదంతా జగడం; మహాసభలో జరిగిన పోరాట విశ్లేషణకూ, నిబంధనావళిలోని మొదటి నిబంధనకూ అవకాశవాదం వైపూ, అరాజకవాదంవైపూ మొగ్గడానికి సంబంధించినదంతా సూత్రబద్ధ భేదం.

సరైనదే. మహాసభానంతరం వారు ఒక విప్లవాన్ని తీసుకువచ్చారన్న మాట నిజమే. మొత్తం మీద చెప్పాలంటే ప్రపంచం విప్లవాలచే నడుస్తుంది అనేది కూడా నిజమే. కాని యీ సాధారణ సూక్తి ప్రతి నిర్దిష్ట విప్లవంయొక్క నిర్దిష్టమైన ప్రాముఖ్యతనూ నిర్వచించ లేదు; మరువరాని కామ్రేడ్ మాహోవ్‌యొక్క మరువరాని మాటకు అర్థం చెప్పాలంటే, ఎక్కువ ప్రగతినిరోధకం లాంటి విప్లవాలు వున్నాయి. ఆ ప్రత్యేక నిర్దిష్ట విప్లవం "ప్రపంచాన్ని" (మన పార్టీని) ముందుకు నడిపిందో వెనక్కి తీసుకుపోయిందో నిర్ణయించగలగ డానికి ముందు ఆ విప్లవాన్ని తెచ్చిన అసలు శక్తి పార్టీలోని విప్లవకర పక్షమా, అవకాశవాద పక్షమా అనే సంగతినీ, ఆ యోధులను ఉత్తేజపర్చినది విప్లవకర సూత్రాలా లేక అవకాశ వాద సూత్రాలా అనే సంగతినీ మనం తెలుసుకోవాలి.

రష్యన్ విప్లవోద్యమ చరిత్ర యావత్తులోనూ మన పార్టీ మహాసభ అద్వితీయమైనది, అపూర్వమైనది. మొట్టమొదటి సారిగా ఒక రహస్య విప్లవకర పార్టీ రహస్య జీవితపు చీకటినుండి వెలుగులోకి రావడంలో విజయవంతం అయింది. మన పార్టీ ఆంతరంగిక పోరాటంయొక్క మొత్తం గమనాన్నీ, దాని ఫలితాన్నీ, కార్యక్రమానికీ, ఎత్తుగడలకీ, నిర్మాణానికీ సంబంధించిన వ్యవహారాలలో మన పార్టీ అంతటియొక్క, దాదాపు గమనీయమైన దాని ప్రతి భాగంయొక్క యావత్తు లక్షణాన్నీ ప్రతివారికీ చూపింది. మొట్టమొదటి సారిగా మనం బృందం సరళి అసంబద్ధతనూ విప్లవకర కూపస్థమండూకత్వాన్నీ వదలించుకోడంలోనూ డజన్లకొలదిగా వున్న అతి భిన్న గ్రూపులను ఏకం చేయడంలోనూ విజయం పొందాము. చాలా గ్రూపులు వాటిలో అవి తీవ్రంగా పోరాడుకుంటూ వుండేవి, కేవలం భావ శక్తితోనే ఒక దానికొకటి ముడివడి వుండేవి. ఇప్పుడవి (సూత్రరీత్యా, అంటే) మనం మొట్టమొదటి సారిగా వాస్తవంగా సృష్టించుతున్న మహత్తర మొత్తం కోసం — పార్టీ కోసం — తమ గ్రూపు ఏకాకిత్వాన్నీ, గ్రూపు స్వాతంత్ర్యాన్నీ త్యాగం చేయడానికి సంసిద్ధంగా వున్నాయి. కాని రాజకీయాలలో త్యాగాలు వూరికే రావు, పోరాటంలో వాటిని సాధించాలి. సంఘాల సంహారంపై సాగిన పోరాటం అవశ్యంగానే అత్యంత భీకరమైనది అయింది. స్వేచ్ఛాయుతమైన బహిరంగమైన పోరాటం అనే తాజా మందమారుతం తుఫానుగా తయారైంది. ఈ తుఫాను బృందం సరళి ప్రయోజనాల, మనోభావాల, సంప్రదాయాల అవశేషాలన్నిటినీ మినహాయింపులు లేకుండా తుడిచిపెట్టివేసింది — అది అలా చేయడం చాలా మంచి పనే అయింది! — మొట్టమొదటి సారిగా నిజమైన పార్టీ సంస్థలను సృష్టించింది.

కాని తాను ఫలానా అని చెప్పకోడం వేరు, అలా అయివుండటం వేరు. పార్టీ కోసం సూత్రరీత్యా బృందం సరళిని త్యాగంచేయడం వేరు, తన స్వంత బృందాన్ని పరిత్యజించడం వేరు. బాజుపట్టిన కూపస్థమండూక స్థితికి అలవాటు పడినవారికి యీ తాజా మంద

మారుతం ఇంకా చాలా తాజాగానే వుంది. ''మరోసారి మైనారిటీ''లో అనే తన వ్యాసంలో కామ్రేడ్ మార్తొవ్ సరిగా చెప్పినట్టు (ఏమరుపాటుగా) ''పార్టీ, తన మొదటి మహాసభ వల్ల కలిగిన ప్రయాసను తట్టుకో లేకపోయింది.'' సంఘాల సంహారంపై కలిగిన చిన్న బుచ్చబడ్డామనే భావం చాలా బలంగా వుండింది. ఉగ్రమైన తుఫాను మన పార్టీ వాహిని అడుగునవున్న బురదనంతనూ పైకి లేపింది: ఆ బురద తన ప్రతీకారాన్ని తీర్చుకుంది. పాత ఆచారాల పట్ల మూర్ఖభావం కలిగివున్న పాత బృందం సరళి ఇంకా బాల్యావస్థలో వున్న పార్టీ సరళిని ఓడగొట్టింది. పార్టీలోని అవకాశవాద పక్షం కూలదోయబడినప్పటికీ, అకీమొవ్ సాధించిన యాదృచ్ఛిక విజయంచే పునశ్శక్తివంతమై విప్లవకర పక్షంపై — తాత్కాలికంగానే అనుకోండి — గెలుపు సాధించింది.

ఫలితం కొత్త ''ఇస్క్రా.'' అది దాని సంపాదకులు పార్టీ మహాసభలో చేసిన తప్పును పెంపుచేసి ప్రగాఢ మొనర్చవలసివచ్చింది. పాత ''ఇస్క్రా'' విప్లవ పోరాటపు సత్యాలను బోధించింది. కొత్త ''ఇస్క్రా'' సర్దుబాటు వైఖరి, సరిపెట్టుకుపోయే వైఖరి అనే లోకజ్ఞానాన్ని బోధిస్తోంది. పాత ''ఇస్క్రా'' సమరశీల ఛాందసత్వపు పత్రిక. కొత్త ''ఇస్క్రా'' మనలో అవకాశవాదాన్ని తిరగ తోడుతోంది, ప్రధానంగా పార్టీ నిర్మాణ సమస్యలలో. పాత ''ఇస్క్రా,'' రష్యన్ అవకాశవాదుల, పశ్చిమ యూరపియన్ అవకాశవాదుల ఘనమైన అయిష్టాన్ని చూరగొన్నది. కొత్త ''ఇస్క్రా'' ''వివేకవంతం అయింది,'' తీవ్ర అవకాశవాదులైనవారు తనపై కురిపించే ప్రశంసలకు సిగ్గుపడటం త్వరలోనే మానుకుంటుంది. పాత ''ఇస్క్రా'' తన లక్ష్యం కేసి దృఢనిశ్చయంతో నడిచింది, దాని మాటలకూ చేతులకూ మధ్య పరస్పర విరుద్ధత లేదు. కొత్త ''ఇస్క్రా'' వైఖరిలోని స్వతస్సిద్ధమైన అసంబద్ధత — ఎవరి ఇచ్ఛతో గాని ఉద్దేశంతో గాని సంబంధం లేకుండానే — రాజకీయ కౌటిల్యానికి తప్పనిసరిగా దారితీస్తుంది. పార్టీ సరళిపై బృందం సరళి సాధించిన విజయాన్ని మరుగుపరచేటందుకు అది బృందం సరళిని దూషిస్తుంది. ఏ మాత్రం నిర్మాణయుతమైన ఏ పార్టీలోనైనా మైనారిటీ మెజారిటీకి లోబడివుండటం ద్వారా కాకుండా చీలికలను నివారించే మార్గాన్ని వూహించగల్గినట్టుగా అది కపటంగా చీలికలను ఖండిస్తుంది. విప్లవకర ప్రజాభిప్రాయాన్ని లక్ష్యపెట్టాలని అది చెబుతుంది, అయినప్పటికీ, అకీమొవ్ లాంటివారి పొగడ్తలను మరుగుపరుస్తూ పార్టీలోని విప్లవకర పక్షపు కమిటీల గురించి అల్పబుద్ధితో కూడిన అపనిందలు వేయడంలో నిమగ్నమై వుంటుంది.* ఎంత సిగ్గుచేటు! పాత ''ఇస్క్రా''ను వారెంత కళంకపర్చారు!

---

* యీ చక్కని పనికి ఒక స్థిరమైన రూపం కూడా తయారు చేయ

ఒక అడుగు ముందుకి, రెండడుగులు వెనక్కి.... అది వ్యక్తుల జీవితాలలోనూ జరుగుతుంది, జాతుల చరిత్రలోనూ జరుగుతుంది, పార్టీల అభివృద్ధిలోనూ జరుగుతుంది. విప్లవకర సోషల్ డెమోక్రటిక్ ఉద్యమం, శ్రామికవర్గ సంఘం, పార్టీ క్రమశిక్షణయొక్క సూత్రాలు తప్పనిసరిగానూ పూర్తిగానూ విజయం పొందుతాయనే విషయాన్ని క్షణ మాత్రమైనా సందేహించడం అత్యంత తప్పిదమైన పిరికితనం అవుతుంది. మనం ఇప్పటికే చాలా సాధించాం, అపజయాలకు దిగులుపడకుండా పోరాడుతూనే వుండాలి. దృఢనిశ్చయంతో పోరాడాలి. బృందం సరళి జగడాల కూపస్థమండూక పద్ధతులను నిరసించాలి. రష్యన్ సోషల్ డెమోక్రట్లు అందరినీ కలుపుతూ కష్టించి సంపాదించిన ఏక పార్టీ సంబంధాన్ని కాపాడటానికి చేతనైనదంతా చేయాలి. పట్టువిడువని క్రమబద్ధమైన కృషి ద్వారా పార్టీ సభ్యులందరికీ, ముఖ్యంగా కార్మికులకు, పార్టీ సభ్యుల విధులను గురించీ, పార్టీ రెండవ మహాసభలో జరిగిన పోరాటం గురించీ, మన విభేదాలకు గల అన్ని కారణాలనూ వాటి వివిధ దశలను గురించీ, అవకాశవాదంయొక్క ఘోర విపత్కర లక్షణం గురించీ పూర్తి చైతన్యంతో కూడిన అవగాహనను యిచ్చేటందుకు ప్రయత్నించాలి. ఆ అవకాశవాదం మన కార్యక్రమం, ఎత్తుగడల రంగంలో లాగనే పార్టీ నిర్మాణ రంగంలో కూడా నిస్సహాయంగా బూర్జువా మనస్తత్వానికి లొంగిపోతుంది. గుణదోష విచారణ చేయకుండా బూర్జువా ప్రజాస్వామ్య దృక్పథాన్ని అవలంబిస్తుంది. శ్రామికవర్గపు వర్గపోరాటమనే ఆయుధాన్ని మొద్దుబారచేస్తుంది.

అధికారం కోసం శ్రామికవర్గం సాగించే పోరాటంలో దానికి నిర్మాణం తప్ప మరో ఆయుధం లేదు. బూర్జువా ప్రపంచంలోని అరాజకపు పోటీ పరిపాలనచే విడదీయబడిన, పెట్టుబడి కోసం చేయవలసివచ్చే బలవంతపు శ్రమచే అణచివేయబడిన, పూర్తి దారిద్ర్యం, నిరాశ, భ్రష్టత్వాల "అధః పాతాళాలకు" నిరంతరం తోసివేయబడుతున్న శ్రామికవర్గం, మార్క్సిజం సూత్రాలపై సైద్ధాంతికంగా ఐక్యంకావడం ద్వారానూ, లక్షలాది శ్రమజీవులను కార్మికవర్గ సైన్యంగా సంఘటితపర్చే నిర్మాణ ఐక్యతచే పునశ్శక్తివంతమవడం ద్వారానూ మాత్రమే ఒక అజేయమైన శక్తి కాగలదు, తప్పకుండా అవుతుంది. రష్యన్ నిరంకుశాధికారపు పాతబడిన పరిపాలనగాని అంతర్జాతీయ పెట్టుబడియొక్క క్షీణ పరిపాలనగాని ఈ సైన్యాన్ని అడ్డగించజాలదు. ఎన్ని వంకరలు తిరిగినా, ఎన్ని వెనుకడుగులు వేసినా, నేటి సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలోని జిరోండిస్టుల అవకాశవాద వాగాడంబరం ఎంత వున్నా, వెనక్కి పోయే బృందం సరళి ఆత్మ సంతృప్తితో కూడిన ఉన్నత స్థితిలో వున్నా, మేధావి అరాజకవాదపు డంబాలూ ఆర్భాటాలూ ఎన్ని వున్నా, ఈ సైన్యం తన శ్రేణులను అంతకంతకు ఎక్కువ దృఢంగా సమీకరిస్తుంది.

---

బడింది: మెజారిటీకి చెందిన ఒక కమిటీ మైనారిటీకి చెందిన మరొక కామ్రేడ్ పట్ల అసహ్యంగా ప్రవర్తించిందని మన ప్రత్యేక విలేకరి తెలియజేశాడు.

అనుబంధం

# కా(మేడ్స్ గూసెవ్ డేయ్‌చ్‌ల మధ్య జరిగిన ఘటన

ఈ ఘటన కా(మేడ్స్ మార్తొవ్, స్త్రొవేర్‌ల లేఖలో పేర్కొనబడిన ''ఫోర్జరీ'' జాబితా అనబడే (కా(మేడ్ మార్తొవ్ ఉపయోగించిన మాట) దానితో సన్నిహితంగా ముడి పడివుంది. ఈ లేఖను ''ఒ'' అధ్యాయంలో ఉదహరించాను. దాని సారాంశం ఇది. కా(మేడ్స్ ష్టెయిన్, యెగోరొవ్, పొపొవ్, (టాట్స్కీ, ఫొమీన్‌ల పేర్లున్న జాబితా తనకు (గూసెవ్‌కు) కా(మేడ్ డేయ్‌చ్‌చే అందజేయబడిందని కా(మేడ్ గూసెవ్ కా(మేడ్ పవ్లోవిచ్‌కి తెలియజేశాడు (కా(మేడ్ పవ్లోవిచ్ ''లేఖ,'' పేజి 12). ఈ (ప్రకటన మూలంగా కా(మేడ్ గూసెవ్ ''బుద్ధిపూర్వకంగా అపవాదులు వేస్తున్నాడ''ని కా(మేడ్ డేయ్‌చ్ నిందారోపణ చేశాడు, కా(మేడ్ల మధ్యవర్తి కోర్టు కా(మేడ్ గూసెవ్ ''(ప్రకటన'' ''సరికాద''ని (ప్రకటించింది (''ఇస్క్రా,'' సంచిక 62లో కోర్టు నిర్ణయం చూడండి). ''ఇస్క్రా'' సంపాదకవర్గం కోర్టు నిర్ణయాన్ని (ప్రచురించిన తరువాత కా(మేడ్ మార్తొవ్ (ఈ సారి సంపాదకవర్గం కాదు) ''కా(మేడుల మధ్యవర్తి కోర్టు నిర్ణయం'' అనే శీర్షికతో ఒక (ప్రత్యేక కరప(త్రాన్ని (ప్రచురించాడు. అందులో ఆయన కోర్టు నిర్ణయం పూర్తి పాఠమే గాక, విచారణ కార్య కలాపాల మొత్తం రిపోర్టునూ, దానితోపాటు తన తాజా కలాన్నీ పునర్ము(ద్రించాడు. ఈ తాజా కలంలో కా(మేడ్ మార్తొవ్, ఇతర విషయాలతోపాటు ''ముఠా తగాదా (ప్రయో జనాల కోసం ఒక పేర్ల జాబితాను ఫోర్జరీ చేసిన సిగ్గుచేటు పనిని'' గురించి రాశాడు. రెండవ మహాసభకు (ప్రతినిధులుగా వచ్చిన కా(మేడ్స్ ల్యాదొవ్, గోరిన్‌లు ''మధ్యవర్తి కోర్టులో ఒక (ప్రేక్షకుడు'' అనే శీర్షికతో రాసిన కరప(త్రంలో ఈ కరప(త్రానికి సమాధానం యిచ్చారు. అందులో వారు ''కా(మేడ్ మార్తొవ్ కోర్టు నిర్ణయం పరిధిని దాటి పోయినం దుకూ, కా(మేడ్ గూసెవ్‌కు దురుద్దేశం వుందని ఆపాదించినందుకూ తీవ్ర నిరసన తెలి పారు.'' కోర్టు కా(మేడ్ గూసెవ్ (ప్రకటన సరికాదని చెప్పిందేగాని, ఆయన బుద్ధి పూర్వకంగా అపనిందలు వేశాడని చెప్పలేదన్నారు. కా(మేడ్ గూసెవ్ (ప్రకటన చాలా

సహజమైన పొరపాటు మూలంగా జరిగివుండవచ్చునని కామ్రేడ్స్ గోరిన్, ల్యాదొవ్‌లు వివరించారు, కామ్రేడ్ మార్తొవ్ ప్రవర్తన "అనుచితమైనద"నీ, ఆయన కామ్రేడ్ గూసెవ్‌కు దురుద్దేశం వుందని నిర్హేతుకంగా ఆపాదిస్తూ అనేక తప్పుడు ప్రకటనలను చేశాడనీ (ఈ కరపత్రంలో మళ్లీ చేశాడని) చెప్పారు. ఈ విషయంలో దురుద్దేశమనేదే వుండజాలదని వారన్నారు. నేను పొరపాటుపడకపోతే, ఆ సమస్యపై వున్న "సాహిత్యం" అంతా అది. దానిని వివరించడం నా కర్తవ్యమని భావిస్తున్నాను.

మొట్టమొదట, ఈ జాబితా (కేంద్ర కమిటీకి అభ్యర్థుల జాబితా) అవతరించిన సమయం గురించీ, పరిస్థితులను గురించీ పాఠకునికి స్పష్టమైన అభిప్రాయం వుండటం అవసరం. ఈ పుస్తకంలో నేను ఇదివరకే చెప్పినట్టుగా, మహాసభ సమయంలో "ఇస్క్రా" శాఖ తాను మహాసభకు సంయుక్తంగా సమర్పించగల కేంద్ర కమిటీ అభ్యర్థుల జాబితాను గురించి సమాలోచనలు జరిపింది. ఆ సమాలోచనలో ఏకాభిప్రాయం కుదరలేదు: "ఇస్క్రా" శాఖలోని మెజారిటీ త్రవీన్‌స్కీ, గ్లేబొవ్, వసీల్యెవ్, పొపొవ్, ట్రాట్‌స్కీలతో కూడిన జాబితాను ఆమోదించింది. కాని మైనారిటీ అందుకు నిరాకరించింది. త్రవీన్‌స్కీ, గ్లేబొవ్, ఫొమీన్, పొపొవ్, ట్రాట్‌స్కీలతో కూడిన జాబితామీద పట్టుపట్టింది. ఈ జాబితాలు ప్రతిపాదించబడి వోటింగు తీసుకోబడిన సమావేశం తరువాత "ఇస్క్రా" శాఖలోని రెండు విభాగాలూ కలుసుకోలేదు. రెండు విభాగాలూ మహాసభలో స్వేచ్ఛాయుత ప్రచార రంగం లోకి ప్రవేశించాయి. వాటి మధ్యనున్న యీ సమస్యను మొత్తం పార్టీ మహాసభలో వోటింగు ద్వారా పరిష్కరించ గోరాయి, ప్రతి విభాగమూ తన పక్షానికి ఎంత మంది ఎక్కువ ప్రతినిధులను తెచ్చుకోడానికి వీలైతే అంతమందినీ తెచ్చుకోడానికి ప్రయత్నించింది. మహాసభలో జరిగిన ఈ స్వేచ్ఛాయుత ప్రచారం, యీ చిన్న పుస్తకంలో నేను ఎంతో వివరంగా విశ్లేషించిన రాజకీయ వాస్తవాన్ని వెంటనే బైటపెట్టింది. అదేమిటంటే, మాపై విజయం సాధించేటందుకు "ఇస్క్రా"వాళ్ల మైనారిటీకి (మార్తొవ్ నాయకత్వాన), "మధ్యస్థ వర్గం" (ఊబి)యొక్క, "ఇస్క్రా" వ్యతిరేకులయొక్క మద్దతును పొందడం ఆవశ్యకం అయింది. ఇది ఎందుకు ఆవశ్యకం అయిందంటే, "ఇస్క్రా" వ్యతిరేకుల, "మధ్యస్థవర్గ" దండయాత్రకు వ్యతిరేకంగా "ఇస్క్రా" కార్యక్రమాన్నీ, ఎత్తుగడలనూ, నిర్మాణ పథకాలనూ ఏకతీరున బలపర్చిన అత్యధిక మెజారిటీ ప్రతినిధులు చాలా త్వరగానూ చాలా గట్టిగానూ మా పక్షం వహించారు. "ఇస్క్రా" వ్యతిరేకులకు గాని, "మధ్యస్థవర్గా"నికి గాని చెందివుండని 33 ప్రతినిధులలోనూ (వోట్లలోనూ) 24 మందిని మేము చాలా త్వరగా మా పక్షానికి తెచ్చుకుని వారితో "ప్రత్యక్ష ఒప్పందం" కుదుర్చుకున్నాం, "ఘనిష్ఠ మెజారిటీ"గా ఏర్పడ్డాం. మరో వైపున, కామ్రేడ్ మార్తొవ్‌కి తొమ్మిది వోట్లు మాత్రమే మిగి

లాయి: విజయం సాధించేటందుకు ఆయనకి ''ఇస్క్రా'' వ్యతిరేకుల, ''మధ్యస్థవర్గం'' యొక్క వోట్లు అన్నీ కావాలి — ఈ గ్రూపులతో (నిబంధనావళిలోని మొదటి నిబంధన విషయంలో లాగనే) ఆయన ''కలయికను'' ఏర్పర్చుకోవచ్చు, అంటే వారి మద్దతును పొందవచ్చు, కాని వారితో ఆయన ప్రత్యక్ష ఒప్పందాన్ని కుదుర్చుకోలేకపోయాడు — అలా ఎందుకు చేయలేకపోయాడంటే, మహాసభ పొడవునా ఆయన యీ గ్రూపులతో మనం పోరాడినంత తీవ్రంగానూ పోరాడాడు. కామ్రేడ్ మార్తొవ్ స్థానంయొక్క విషాద పరిహాసక స్థితి అందులోనే వుంది! తన ''ముట్టడి స్థితి''లో కామ్రేడ్ మార్తొవ్ యీ కింది ఘోర విషపు ప్రశ్నతో నన్ను నిర్మూలించడానికి ప్రయత్నించాడు: ''ఈ ప్రశ్నకు స్పష్టంగా సమాధానం చెప్పమని కామ్రేడ్ లెనిన్‌ను మేము వినయపూర్వకంగా అడుగుతున్నాము — మహాసభలో 'యూజ్నీ రబోచీ' గ్రూపు ఎవరికి పరాయిది?'' (పేజి 23, పాదాంత వివరణ). నేను వినయపూర్వకంగానూ స్పష్టంగానూ సమాధానం చెబుతున్నాను: కామ్రేడ్ మార్తొవ్‌కే వారు పరాయి వారు. దీనికి నిదర్శనం ఏమిటంటే నేను ''ఇస్క్రా''వాళ్లతో చాలా త్వరగా ప్రత్యక్ష ఒప్పందం చేసుకున్నాను, కాని కామ్రేడ్ మార్తొవ్ ''యూజ్నీ రబోచీ''తో గాని, కామ్రేడ్ మాహొవ్‌తో గాని, కామ్రేడ్ బ్రూకెర్‌తో గాని ప్రత్యక్ష ఒప్పందం చేసుకోలేదు, చేసుకోలేకపోయాడు.

ఈ రాజకీయ పరిస్థితిని గురించి మనకి స్పష్టమైన అభిప్రాయం వున్నప్పుడు మాత్రమే యీ ప్రసిద్ధ ''ఫోర్జరీ'' జాబితాను గురించిన అపఖ్యాత సమస్యయొక్క ''సారాంశాన్ని'' అర్థం చేసుకోగల్గుతాం. వ్యవహారాల వాస్తవ స్థితిని చూడండి: ''ఇస్క్రా'' శాఖ చీలిపోయింది, మహాసభలో మనం మన పేర్ల జాబితాలను సమర్థిస్తూ స్వేచ్ఛగా ప్రచారం చేస్తున్నాం. ఈ సమర్థన క్రమంలోనూ, అనేక ప్రయివేటు సంభాషణలలోనూ యీ జాబితాలు అనేకమైన వేరువేరు సంయోగాలలో మారాయి: అయిదుగురుతో కూడిన కమిటీకి బదులు ముగ్గురుతో కూడిన కమిటీ ప్రతిపాదించబడింది; ఒక కామ్రేడ్‌కి బదులు మరో కామ్రేడ్‌ను పెట్టే అన్ని రకాల ప్రత్యామ్నాయాలూ సూచించబడ్డాయి. ఉదాహరణకు, నాకు చాలా బాగా జ్ఞాపకం వుంది, మెజారిటీ మధ్య జరిగిన ప్రయివేటు సంభాషణలలో కామ్రేడ్స్ రూసొవ్, ఒసిపొవ్, పవ్లోవిచ్, దేదొవ్‌లు అభ్యర్థులుగా వుండాలని సూచించబడింది, చర్చలూ, వాదోపవాదాలూ జరిగిన మీదట ఆ అభ్యర్థులు ఉపసంహరించుకోబడ్డారు. ఇతరుల పేర్లు కూడా అభ్యర్థులుగా ప్రతిపాదింపబడి వుండవచ్చు, వాటిని గురించి నాకు తెలియదు. ఈ సంభాషణలలో మహాసభ ప్రతినిధులు ప్రతివారూ తమ అభిప్రాయాలను వెల్లడించారు, మార్పులు సూచించారు, వాదించారు, వగైరా. ఇది మెజారిటీలో మాత్రమే జరిగివుండటం ఎంతో అసంభావ్యం. వాస్తవానికి మైనారిటీలో కూడా ఇది రకమైన వ్యవహారం సాగిం

దనడంలో సందేహం లేదు. ఎందుచేతనంటే, కా(మేడ్స్ మార్తొవ్, స్త్రరొవేర్‌ల లేఖను పట్టి మనం తెలుసుకున్నట్టుగా, వారు మొదట ప్రతిపాదించిన అయిదు పేర్లకు (పొపోవ్, ట్రాట్స్కీ, ఫొమీన్, గ్లేబొవ్, త్రవీన్‌స్కీ) బదులు ఆ తరువాత మూడు పేర్లు — గ్లేబొవ్, ట్రాట్స్కీ, పొపోవ్ — ప్రతిపాదింపబడ్డాయి. అంతే గాక, గ్లేబొవ్ వారికి ఇష్టుడు కాదు, ఆయనకు బదులు ఫొమీన్‌ని పెట్టడానికి వారు సంసిద్ధంగా వున్నారు. (కా(మేడ్స్ ల్యాదొవ్, గోరిన్‌ల జాబితా చూడండి). ఈ పుస్తకంలో, మహాసభ ప్రతినిధులను గ్రూపులుగా నిర్వచిస్తూ నేను చేసిన విభజన, సంఘటనానంతరం చేపట్టబడిన విశ్లేషణ ప్రాతిపదికపై జరిగినదనే విషయం మరువకూడదు; వాస్తవానికి, ఎన్నిక ప్రచారంలో యీ గ్రూపులు అప్పుడే ఉద్భవించ నారంభిస్తున్నాయి, ప్రతినిధులు ఒకరి అభిప్రాయాలను మరొకరికి తెలియజేసుకోడం ఎంతో స్వేచ్ఛగా సాగింది; మనలను విభజించిన ''అడ్డుగోడ'' ఏదీ లేదు, ప్రతివారూ ప్రయివేటుగా విషయాలను చర్చించగోరే ఏ ప్రతినిధితోనైనా మాట్లాడారు. ఈ పరిస్థితులలో వచ్చిన వివిధ సంయోగాలు, జాబితాలు అన్నిటిలో ''ఇస్క్రా'' శాఖ మైనారిటీ యిచ్చిన జాబితాతోపాటు (పొపోవ్, ట్రాట్స్కీ, ఫొమీన్, గ్లేబొవ్, త్రవీన్‌స్కీ) దానికి ఏమంత తేడా లేని జాబితా: పొపోవ్, ట్రాట్స్కీ, ఫొమీన్, ష్టెయిన్, యెగోరొవ్‌ల పేర్లు రావడం ఎంత మాత్రం ఆశ్చర్యం కాదు. అభ్యర్థులలో అలాంటి సంయోగం రావడం చాలా సహజం, ఎందుచేతనంటే మన అభ్యర్థులు గ్లేబొవ్, త్రవీన్‌స్కీలు ''ఇస్క్రా'' శాఖలో మైనారిటీకి ఇష్టమైనట్టు లేదు. (''ఒ'' అధ్యాయంలోని వారి లేఖను చూడండి, ముగ్గురు సభ్యుల జాబితాలోనుంచి వారు త్రవీన్‌స్కీ పేరు తొలగించి గ్లేబొవ్ రాజీ అభ్యర్థి అని స్పష్టంగా చెప్పారు.) గ్లేబొవ్, త్రవీన్‌స్కీల స్థానంలో ఆర్గనైజింగు కమిటీ సభ్యులైన ష్టెయిన్, యెగోరొవ్‌లను పెట్టడం ఎంతో సహజం, పార్టీ మైనారిటీకి చెందిన ప్రతినిధులలో ఒక్కరు కూడా దానిని గురించి ఆలోచించకపోతే వింతగా వుండేది.

మనమిప్పుడు యీకింది రెండు ప్రశ్నలను పరిశీలిద్దాం: (1) యెగోరొవ్, ష్టెయిన్, పొపోవ్, ట్రాట్స్కీ, ఫొమీన్ పేర్లున్న జాబితాను తయారు చేసింది ఎవరు? (2) ఆ జాబితా ఆయనదేనని అన్నప్పుడు కా(మేడ్ మార్తొవ్‌కి ఎందుకంత పెద్ద కోపం వచ్చింది? మొదటి ప్రశ్నకు ఖచ్చితమైన సమాధానం చెప్పడానికి మహాసభకు వచ్చిన ప్రతినిధులందర్నీ ప్రశ్నించడం అవసరం అవుతుంది. ఇప్పుడది అసాధ్యం. ముఖ్యంగా, మైనారిటీకి చెందిన ప్రతినిధులలో (''ఇస్క్రా'' శాఖలో మైనారిటీ కాదు) ''ఇస్క్రా'' శాఖలో చీలికను తెచ్చిన జాబితాలను గురించి మహాసభలో విన్నవారెవరో, ''ఇస్క్రా'' శాఖలోని మెజారిటీ మైనారిటీ ప్రతిపాదించిన జాబితాలను గురించి వారు ఏమనుకున్నారో, ''ఇస్క్రా'' శాఖలోని మైనా

రిటీ ప్రతిపాదించిన జాబితాలో వాంఛనీయమైన మార్పులను వారేమైనా సూచించడం గాని, ఇతరులు సూచించగా వినడం గాని, తమ అభిప్రాయాలను తెలియజేయడం గాని జరిగిందో ధ్రువపర్చుకోడం అవసరం అవుతుంది. దురదృష్టవశాత్తూ, యీ ప్రశ్నలు మధ్యవర్తి కోర్టులో లేవదీయబడినట్టు లేదు, ఆ కోర్టు (దాని నిర్ణయం పాఠాన్ని పట్టి చూస్తే) అయిదుగురుతో కూడిన ఏ జాబితాలపై "ఇస్క్రా" శాఖ చీలిపోయిందో కూడా తెలుసు కోలేదు. ఉదాహరణకు, కామ్రేడ్ బెలోవ్ (ఆయనను నేను "మధ్యస్థవర్గం"లో జమ కడతాను), "డేయ్‌చ్‌తో తాను మంచి కామ్రేడ్లీ స్నేహం కలిగివున్నాననీ, డేయ్‌చ్ తనకు మహా సభ పనిపై ఆయన అభిప్రాయాలను చెబుతూ వుండేవాడనీ, డేయ్‌చ్ కనక ఏ జాబితా తరఫున అయినా ప్రచారం చేస్తూ వుండినట్లయితే తనకు ఆ విషయం చెప్పి వుండేవాడనీ సాక్ష్యం యిచ్చాడు." విచారపడవలసిన విషయం ఏమిటంటే, కామ్రేడ్ డేయ్‌చ్ కామ్రేడ్ బెలోవ్‌కు మహాసభలో "ఇస్క్రా" శాఖ ప్రతిపాదించిన జాబితాలపై తన అభిప్రాయాలను తెలిపాడా, తెలిపి వుంటే "ఇస్క్రా" శాఖలో మైనారిటీ ప్రతిపాదించిన అయిదుగురు జాబితాకు కామ్రేడ్ బెలోవ్ ప్రతివర్తన ఏమిటి, దానిలో వాంఛనీయమైన మార్పులను వేటినైనా ఆయన సూచించడం గాని, ఇతరులు సూచించగా వినడం గాని జరిగిందా అనేది తేలలేదు. ఇది స్పష్టం చేయబడలేదు కనక, కామ్రేడ్ బెలోవ్ ఇచ్చిన సాక్ష్యానికీ, కామ్రేడ్ డేయ్‌చ్ యిచ్చిన సాక్ష్యానికీ వైరుధ్యం కనిపిస్తుంది. దానిని గురించి కామ్రేడ్స్ గోరిన్, ల్యాదొవ్‌లు ఇదివరకే పేర్కొన్నారు, అంటే కామ్రేడ్ డేయ్‌చ్ తాను చెప్పిన దానికి భిన్నంగా "ఇస్క్రా" శాఖ సూచించిన "కొంత మంది కేంద్ర కమిటీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేశాడు." కామ్రేడ్ బెలోవ్ ఇంకా ఇలా సాక్ష్యమిచ్చాడు, "మహాసభలో సర్క్యులేటు చేయబడుతున్న జాబితాను గురించి మహాసభ ముగియడానికి రెండు రోజులు ముందు, ప్రయివేటు సంభాషణలో తను కామ్రేడ్స్ యెగోరొవ్, పొపోవ్‌లనూ, హార్కొవ్ కమిటీనుంచి వచ్చిన ప్రతినిధులనూ కలుసుకున్నప్పుడు విన్నాడు. కేంద్ర కమిటీ అభ్యర్థుల జాబితాలో తన పేరు చేర్చబడినందుకు యెగోరొవ్ ఆశ్చర్యం ప్రకటించాడు, ఎందుకంటే తన (యెగోరొవ్) అభిప్రాయంలో తన అభ్యర్థిత్వం మహాసభ ప్రతినిధులలో, మెజారిటీ వారైనా, మైనారిటీ వారైనా సాను భూతిని కలుగజేయదు" అని చెప్పాడు. ఇక్కడ చేసిన ప్రస్తావన "ఇస్క్రా" శాఖలో మైనారిటీని గురించే అనేది అత్యంత ముఖ్యమైన విషయం. ఎందుకంటే ఆర్గనైజింగు కమిటీ సభ్యుడూ, "మధ్యస్థవర్గ" ప్రముఖ వక్తా అయిన కామ్రేడ్ యెగోరొవ్ అభ్యర్థిత్వం మహాసభలోని మిగిలిన మైనారిటీలో సానుభూతిని పొందగల్గడమే గాక బహుశా పొందివుండేది. దురదృష్టవశాత్తూ, "ఇస్క్రా" శాఖకు చెందని పార్టీ మైనారిటీలో వున్న సుముఖత గురించి గాని, విముఖత గురించి గాని కామ్రేడ్ బెలోవ్‌నుంచి మనకేమీ తెలియలేదు. అయితే

అదే ముఖ్యమైనది, ఎందుకంటే యీ జాబితా ''ఇస్క్రా'' శాఖలోని మైనారిటీ వారి దేనని ఆపాదించినందుకు కామ్రేడ్ డేయ్‌చ్‌కి ఆగ్రహం వచ్చింది, మరి యీ జాబితా ఆ శాఖకు చెందని మైనారిటీనుంచే వచ్చివుండవచ్చు!

ఈ అభ్యర్థుల సంయోగాన్ని మొదట సూచించినది ఎవరో, మనలో ప్రతి ఒక్కరూ దానిని గురించి ఎవరినుంచి విన్నామో, సహజంగానే ఇప్పుడు జ్ఞాపకం చేసుకోడం చాలా కష్టమే. అన్నట్టు, నేను పేర్కొన్న రూసావ్, దేదావ్ పేర్లనూ, ఇతర అభ్యర్థుల పేర్లనూ మెజారిటీలో ఎవరు మొట్టమొదట ప్రతిపాదించారో నేను జ్ఞాపకం చేసుకోలేను. అభ్యర్థుల అన్ని రకాల సంయోగాల గురించిన అనేక సంభాషణలు, సూచనలు, పుకార్లలోనూ ''ఇస్క్రా'' శాఖలో గాని, మెజారిటీ వారి ప్రయివేటు సమావేశాలలో గాని నేరుగా వోటుకు పెట్టబడిన ''జాబితాలు'' నా మనసులో నాటివున్నవి. ఈ ''జాబితాలు'' ఎక్కువగా నోటి మాట ద్వారా అందరికీ తెలియజేయబడ్డాయి (''‘ఇస్క్రా’ సంపాదకవర్గానికి లేఖ,'' పేజి 4 కిందినుంచి 5వ పంక్తిలో నేను ''జాబితా'' అని చెప్పినది, నేను ఆ సమావేశంలో నోటి మాటతో ప్రతిపాదించిన అయిదుగురు అభ్యర్థుల సంయోగమే), కాని తరచుగా అవి కాగితంమీద నోటు చేసుకోబడి మొత్తంమీద మహాసభ సమావేశాల సమయంలో ప్రతినిధుల మధ్య అందజేసుకోబడటం కూడా జరిగింది. సమావేశాల అనంతరం అవి సామాన్యంగా చించివేయబడ్డాయి.

ఈ అపఖ్యాత జాబితా ఎక్కడినుంచి వచ్చిందో మనకు ఖచ్చితమైన సమాచారం తెలియదు గనక, ఇలా అని మాత్రమే వూహించవచ్చు: అందులో వున్న అభ్యర్థుల సంయోగం మైనారిటీకి చెందిన ఎవరో ఒక ప్రతినిధిచే, ''ఇస్క్రా'' శాఖలోని మైనారిటీకి తెలియకుండా సూచించబడి ఆ తరువాత మహాసభలో నోటి మాట ద్వారానూ, రాతమూలకంగానూ అందరికీ అందజేయబడి వుండాలి, లేదా ''ఇస్క్రా'' శాఖలో మైనారిటీకి చెందిన ఎవరో ఒక సభ్యుడు మహాసభలో యీ సంయోగాన్ని సూచించి ఆ తరువాత దానిని మరచిపోయి వుండాలి. ఈ కింది కారణాలవల్ల రెండవ వూహే ఎక్కువ సంభావ్యమైనదని నాకు అనిపిస్తోంది: అప్పటికే మహాసభలో ''ఇస్క్రా'' శాఖలో మైనారిటీ, కామ్రేడ్ ష్టెయిన్ అభ్యర్థిత్వం పట్ల నిస్సందేహంగా సానుభూతి కలిగివుంది (యిప్పటి పుస్తక పాఠం చూడండి); కామ్రేడ్ యెగోరొవ్ అభ్యర్థిత్వం విషయంలో యీ మైనారిటీకి ఆ అభిప్రాయం నిస్సందేహంగా మహాసభానంతరమే కలిగింది (ఎందుకంటే లీగు మహాసభలోనూ, ''ముట్టడి స్థితి''లోనూ కూడా ఆర్గనైజింగు కమిటీ, కేంద్ర కమిటీగా ఆమోదింపబడనందుకు విచారం వ్యక్తం చేయబడింది — యెగోరొవ్ ఆర్గనైజింగు కమిటీ సభ్యుడు) అందుచేత, ఆర్గనైజింగు కమిటీ సభ్యులను కేంద్ర కమిటీ సభ్యులుగా మార్చాలనే యీ భావం మైనా

రిటీకి చెందిన ఎవరో ఒక సభ్యునిచే మహాసభలో కూడ ప్రయివేటు సంభాషణలలో వ్యక్తం చేయబడిందని వూహించడం సహజం కాదా?

కాని, సహజమైన వివరణకు బదులు, కామ్రేడ్ మార్తొవ్, కామ్రేడ్ డేయ్‌చ్ ఇందులో ఏదో నీచమైన దానిని — ఒక కుట్రను, దుర్నీతిని, "అపఖ్యాతి పాలు చేయాలనే ఉద్దేశంతో బుద్ధిపూర్వకంగా అబద్ధపు పుకార్లను" వ్యాపింపజేయడాన్ని, "ముఠా తగాదా ప్రయోజనాల కోసం ఫోర్జరీ చేయడాన్ని," ఇంకా ఏమేమో — చూసేటందుకు మొగ్గుచూపారు. ఈ వికృతమైన అపేక్షకు కారణం ప్రవాసజీవితపు అనారోగ్యకర పరిస్థితులు లేదా నరాల అసాధారణ పరిస్థితి మాత్రమే అయివుండాలి, వ్యవహారాలు ఒక కామ్రేడ్ పరువు ప్రతిష్ఠల మీద అనుచితమైన దాడి చేసేటంతవరకు వెళ్లివుండకపోతే నేను ఈ సమస్యను చేపట్టి వుండేవాణ్ణే కాదు. ఒక్కసారి ఆలోచించండి: ఒక తప్పు ప్రకటనలోనూ, ఒక తప్పు పుకారులోనూ దురుద్దేశాన్ని కనిపెట్టడానికి కామ్రేడ్స్ డేయ్‌చ్‌కీ, మార్తొవ్‌కీ ఆధారాలు ఏమై వుండగలవు? వారి వికృతపు వూహలు యిలాంటి చిత్రాన్ని కల్పించాయేమో: మెజారిటీ వారిని "అపఖ్యాతి పాలు చేసింది," మైనారిటీ చేసిన రాజకీయ పొరపాటును (మొదటి నిబంధన, అవకాశవాదులతో కలవడం) ఎత్తి చూపడం ద్వారా కాక, మైనారిటీకి "బుద్ధిపూర్వకంగా తప్పుడు," "ఫోర్జరీ చేయబడిన" జాబితాలను ఆపాదించడం ద్వారా ఇది తమ తప్పు మూలంగా గాక, మెజారిటీ వారి నీచమైన, దుర్నీతికరమైన, సిగ్గుచేటైన చర్యల మూలంగానేనని ఆపాదించడానికే మైనారిటీ ఎంచుకొంది! ఒక "తప్పు ప్రకటన"లో దురుద్దేశాన్ని వెతకడం ఎంత యుక్తివిరుద్ధమైనదో పరిస్థితులను వివరించడం ద్వారా పైన చూపాము. కామ్రేడుల మధ్యవర్తి కోర్టు కూడా దీనిని స్పష్టంగా గుర్తించింది, అందులో దానికి ఎలాంటి అపవాదు గాని, దురుద్దేశం గాని, సిగ్గుచేటైనది ఏదీ గాని కనబడలేదు. కడపటిగా, పార్టీ మహాసభలోనే, ఎన్నికలకు ముందు "ఇస్క్రా" శాఖ మైనారిటీ, మెజారిటీతో యీ తప్పుడు పుకారు గురించి చర్చలకు దిగిందనే వాస్తవంచేతనూ, కామ్రేడ్ మార్తొవ్ తన అభిప్రాయాలను ఒక లేఖలో కూడా చెప్పాడనే వాస్తవంచేతనూ అది అత్యంత స్పష్టంగా రుజువైంది! మార్తొవ్ లేఖ మెజారిటీకి చెందిన 24 గురు ప్రతినిధుల సమావేశంలో చదివి వినిపించబడింది. అటువంటి జాబితా ఒకటి మహాసభలో సర్క్యులేటు చేయబడుతోందనే విషయాన్ని "ఇస్క్రా" శాఖ మైనారిటీకి తెలియకుండా దాచివుంచాలనే ఉద్దేశమే మెజారిటీకి ఎన్నడూ కలగలేదు: దానిని గురించి కామ్రేడ్ లెన్‌స్కీ కామ్రేడ్ డేయ్‌చ్‌కు చెప్పాడు (కోర్టు నిర్ణయం చూడండి); కామ్రేడ్ ప్లెహానొవ్ దానిని గురించి కామ్రేడ్ జసూలిచ్‌తో మాట్లాడాడు ("ఆమెతో మాట్లాడలేను, ఆమె నన్ను త్రేపొవ్ అనుకుంటున్నట్టుంది" అని కామ్రేడ్ ప్లెహానొవ్ నాతో అన్నాడు, తరువాత కూడ యీ జోకు చాలాసార్లు పునరుచ్చరింపబడింది,

మైనారిటీ ఎంత అసాధారణమైన ఉద్రిక్త స్థితిలో వుందో తెలుసుకోడానికి ఇది మరో నిదర్శన); ఈ జాబితా తనది కాదని ఆయన నాకిచ్చిన అభయం నాకు చాలునని నేను కామ్రేడ్ మార్తొవ్‌తో చెప్పాను (లీగు మినిట్స్, పేజి 64). దానిమీదట కామ్రేడ్ మార్తొవ్ (నా జ్ఞాపకం సరిఅయినదే అయితే కామ్రేడ్ స్తరొవేర్‌తో పాటు) బ్యూరోలో వున్న మాకు ఒక చీటీ పంపాడు, అది కొంచెం ఇంచుమించుగా ఇలా వుంది: "తమను గురించి వ్యాపింప జేయబడుతున్న అపఖ్యాతికరమైన పుకార్లను ఖండించేటందుకు మెజారిటీ వారి ప్రయివేటు సమావేశానికి హాజరు కానివ్వవలసిందిగా 'ఇస్క్రా' సంపాదకవర్గపు మెజారిటీ కోరుతోంది." దానికి నేనూ, ప్లెహానొవూ, అదే చీటీమీద ఇలా అని సమాధానం రాసి పంపాము: "అపఖ్యాతికరమైన పుకార్లను వేటినీ మేము వినలేదు. సంపాదకవర్గ సమావేశం అవసరమైతే దానిని వేరే ఏర్పాటు చేయాలి. ఇట్లు, లెనిన్, ప్లెహానొవ్." ఆ సాయంకాలం జరిగిన మెజారిటీ సమావేశంలో యీ విషయాన్ని 24 మంది ప్రతినిధులకూ మేము చెప్పాము. ఎలాంటి అపార్థాలూ కలగకుండా నివారించేటందుకు మా 24 గురూ సంయుక్తంగా ఒక కమిటీని ఎన్నుకుని కామ్రేడ్స్ మార్తొవ్, స్తరొవేర్‌లతో మాట్లాడేటందుకు వారిని పంపాలని నిర్ణయించబడింది. ఎన్నుకోబడిన ప్రతినిధులు, కామ్రేడ్స్ సొరోకిన్, సాబ్లినాలు వారి వద్దకు వెళ్లి, ముఖ్యంగా వారి ప్రకటన తరువాత, ఆ జాబితా మార్తొవ్‌దనిగాని స్తరొవేర్‌దనిగాని ఎవరూ ప్రత్యేకించి ఆపాదించడం లేదనీ, యీ జాబితా "ఇస్క్రా" శాఖ మైనారిటీనుంచి వచ్చిందా లేక యీ శాఖకు చెందని మహాసభలోని మైనారిటీనుంచి వచ్చిందా అనేది ఎంత మాత్రం ముఖ్యమైన విషయం కాదనీ వివరించారు. ఏమైనా, మహాసభలో మనం దర్యాప్తు ప్రారంభించి యీ జాబితా గురించి ప్రతినిధులందరినీ ప్రశ్నించలేము కదా! కాని దానితో సంతృప్తి చెందక కామ్రేడ్స్ మార్తొవ్, స్తరొవేర్‌లు లాంఛనప్రాయమైన నిరాకరణతో మాకొక లేఖ పంపారు (అధ్యాయం "ఒ" చూడండి). మా ప్రతినిధులైన కామ్రేడ్స్ సొరోకిన్, సాబ్లినాలు యీ లేఖను 24 మంది సమావేశంలో చదివి వినిపించారు. ఈ సంఘటన సమాప్తమైనదిగా పరిగణింపబడవచ్చునని అనిపించవచ్చు—యీ జాబితా ఎవరి దగ్గరనుంచి వచ్చిందో నిర్ధారణ చేయబడిందనే తాత్పర్యంలో కాదు (దానిని గురించి ఎవరైనా పట్టించుకుని వుంటే), కాని మైనారిటీకి "హానిని కలిగించాలని" గాని, ఎవరినీ "అపఖ్యాతి పాలు చేయాలని" గాని, "ముఠా తగాదా ప్రయోజనాల కోసం ఫోర్జరీ చేయడానికి" పూనుకోవాలని గాని ఉద్దేశం వుందనే భావం పూర్తిగా తొలగిపోయిందనే తాత్పర్యంలో. అయినప్పటికీ లీగు మహాసభలో (పేజీలు 63–64) కామ్రేడ్ మార్తొవ్, వికృతపు వూహచే కల్పించబడిన యీ నీచమైన కథను మళ్లీ పైకి తెచ్చాడు, అంతే కాదు, అనేక తప్పుడు ప్రకటనలను చేశాడు (ఉద్రిక్త స్థితి మూలంగా కావచ్చు). ఆ జాబితాలో ఒక బుందిస్టు పేరు

కూడా చేరివుందని చెప్పాడు. అది నిజం కాదు, మధ్యవర్తి కోర్టులో సాక్ష్యం ఇచ్చినవారం దరూ, కామ్రేడ్స్ స్టైయిన్, బెలోవ్‌లతో సహా, ఆ జాబితాలో కామ్రేడ్ యెగోరొవ్ పేరు వుందని చెప్పారు. ప్రత్యక్ష ఒప్పందం అనే తాత్పర్యంలో ఆ జాబితాలో ఒక కలయిక వుందని కామ్రేడ్ మార్తొవ్ అన్నాడు. అది నిజం కాదు, దానిని నేను ఇదివరకే వివరించాను. "ఇస్క్రా" శాఖ మైనారిటీనుంచి మరే యితర జాబితాలూ (మహాసభలోని మెజారిటీని యీ మైనారిటీనుంచి మళ్లగొట్టగలవి) "ఫోర్జరీ చేయబడినవి అయినా" లేవని కామ్రేడ్ మార్తొవ్ అన్నాడు. అది నిజం కాదు. ఎందుకంటే, కామ్రేడ్ మార్తొవ్ అండ్ కంపెనీ నుంచి మూడింటికి తక్కువకాని జాబితాలు వచ్చాయనీ, మెజారిటీ ప్రతినిధులు వాటిని ఆమోదించలేదనీ మహాసభలోని మెజారిటీ యావత్తుకూ తెలుసు (ల్యాదొవ్, గోరిన్‌లు ప్రచురించిన కరపత్రం చూడండి).

మొత్తంమీద, యీ జాబితా అంటే కామ్రేడ్ మార్తొవ్‌కు ఎందుకంత కోపం వచ్చింది? ఎందుచేతనంటే అది పార్టీలోని మితవాద పక్షంవైపు మొగ్గును తెలియజేసింది. అప్పుడు కామ్రేడ్ మార్తొవ్ అవకాశవాదం అనే "తప్పుడు నిందారోపణ"కు వ్యతిరేకంగా కేకలు వేశాడు, "తన రాజకీయ వైఖరి తప్పుగా చిత్రించబడు"తున్నందుకు ఆగ్రహం ప్రకటించాడు, కాని ఇప్పుడు యీ జాబితా కామ్రేడ్ మార్తొవ్‌దా, కామ్రేడ్ డేయ్‌చ్‌దా అన్న ప్రశ్నకు ఎలాంటి రాజకీయ ప్రాముఖ్యం వుండివుండజాలదనీ, సారభూతంగా, యీ జాబితాతో గాని, మరే యితర జాబితాతో గాని నిమిత్తం లేకుండా ఆ నిందారోపణ తప్పుకాదనీ, నిజమేననీ, ఆయన రాజకీయ వైఖరిని గురించి చేసిన లాక్షణీకరణ పూర్తిగా సరిఅయినదేననీ ప్రతివారూ తెలుసుకోగలరు.

యీ అపఖ్యాత ఫోర్జరీ జాబితా గురించిన యీ బాధాకరమైన కృతకమైన విషయం పర్యవసానం ఇలా వుంది:

(1) "ముఠా తగాదా ప్రయోజనాల కోసం ఒక పేర్ల జాబితాను ఫోర్జరీ చేసిన సిగ్గు చేటైన పనిని" గురించి కేకలు వేయడం ద్వారా కామ్రేడ్ గూసెవ్ పరువు ప్రతిష్ఠలను కళంకపర్చడానికి కామ్రేడ్ మార్తొవ్ చేసిన ప్రయత్నం అనుచితమైనదని అభివర్ణించడంలో కామ్రేడ్స్ గోరిన్, ల్యాదొవ్‌లతో కలవకుండా వుండలేం.

(2) మరింత ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టించే ఉద్దేశంతోనూ, పార్టీ సభ్యులు ప్రతి వికృతపు మితిమీరిన ప్రవర్తననూ శ్రద్ధాసక్తులతో పరిగణించవలసిన అవసరం లేకుండా చేసే ఉద్దేశంతోనూ, పార్టీ తృతీయ మహాసభలో, జర్మన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ నిర్మాణపు నిబంధనావళిలో వున్న యీకింది మాదిరి నిబంధనను ఆమోదించడం బహుశా యుక్తమై వుంటుంది. ఆ నిబంధనావళిలోని రెండవ నిబంధనలో ఇలా

వుంది: ''పార్టీ కార్యక్రమ సూత్రాలను మొరటుగా ఉల్లంఘించేవారు గాని, దుష్ప్రవర్తన గలవారు గాని ఎవరూ కూడ పార్టీలో సభ్యులుగా వుండజాలరు. పార్టీ సభ్యత్వం కొనసాగింపు సమస్య పార్టీ కార్యనిర్వాహకవర్గంచే ఏర్పాటు చేయబడే మధ్యవర్తి కోర్టుచే నిర్ణయింపబడాలి. పార్టీనుంచి ఫలానా సభ్యుని బహిష్కరించాలని డిమాండు చేసే వ్యక్తి సగం మంది న్యాయ నిర్ణేతలనూ, వెళ్లగొట్టబడాలనీ డిమాండు చేయబడిన వ్యక్తి మిగతా సగం మంది న్యాయ నిర్ణేతలనూ పార్టీనుంచి నామినేటు చేయాలి. అధ్యక్షుణ్ణి పార్టీ కార్యనిర్వాహకవర్గం నియమించాలి. ఈ మధ్యవర్తి కోర్టుయొక్క నిర్ణయంపై కంట్రోలు కమిషన్‌కు గాని, పార్టీ మహాసభకు గాని అప్పీలు చేసుకోవాలి.'' అలాంటి నిబంధన, దుష్ప్రవర్తన గురించి చులకనగా నిందారోపణలు చేసేవారికి (పుకార్లను వ్యాపింపజేసేవారికీ) వ్యతిరేకంగా చక్కని ఆయుధంగా ఉపయోగపడవచ్చు. అలాంటి నిబంధన వుంటే, అలాంటి నిందారోపణలన్నీ, వాటి కర్త, ఫిర్యాదీ పాత్రలో పార్టీ ముందుకు వచ్చి అర్థామైన పార్టీ సంస్థ తీర్పును కోరే నైతిక ధైర్యం లేనివాడైతే అవి అసభ్యకరమైన అపనిందలుగా జమ కట్టివేయబడతాయి.

1904 ఫిబ్రవరి – మే నెలలమధ్య
రచింపబడింది

# రష్యాలో విప్లవారంభం

జెనీవా, బుధవారం, జనవరి 25 (12)

రష్యాలో మహత్తర చారిత్రాత్మక ప్రాముఖ్యం కలిగిన ఘటనలు జరుగుతున్నాయి. శ్రామికవర్గం జారిజానికి వ్యతిరేకంగా తిరగబడుతోంది. శ్రామికవర్గం ప్రభుత్వంచేత, తిరుగుబాటు చెయ్యక గత్యంతరం లేని స్థితికి నెట్టబడింది. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా సమ్మె ఉద్యమాన్ని అభివృద్ధి చెందనిచ్చి, కొంచెం యించుమించుగా ఎటువంటి ఆటంకమూ లేకుండా విస్తృతమైన ప్రదర్శనను మొదలవనిచ్చిందనడంలోనూ, సైనిక బలాన్ని వినియోగించగలగడానికి అనువుగా పరిస్థితులను ఒక కొలిక్కి తేవడమే దాని ఉద్దేశం అనడంలోనూ యిప్పుడిక ఎంతమాత్రమూ సందేహం లేదు. పరిస్థితిని అలా ఒక కొలిక్కి తేవడంలో అది విజయవంతమైన ఫలితంగానే సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో రక్తం ఏరులైపారిన జనవరి 9వ తేదీ ఆదివారంనాడు – చెల్లింపబడిన వేలాది మంది మరణించడం, క్షత గాత్రులవడం సంభవించింది.[70] సైన్యం నిరాయుధులైన కార్మికులను, స్త్రీలను, బాలబాలికలను ఓడించింది. నేలమీద బోర్ల పడుకున్న కార్మికులను కాల్చడం ద్వారా సైన్యం శత్రువును పరాజితం చేసింది. జారు బంటులూ, మితవాద బూర్జువావర్గంలోని వాళ్ల యూరపియన్ తొత్తులూ ''మనం వాళ్లకి మంచి గుణపాఠం నేర్పాం!'' అని పరమ విషపూరితంగా చంకలు కొట్టుకుంటున్నారు.

ఔను, అది గొప్ప గుణపాఠమే, రష్యన్ శ్రామికవర్గం విస్మరించని గుణపాఠం. జారును అమాయకంగా నమ్మి, ''స్వయానా జారు'' ముందు క్లేశాలకు గురిచెయ్యబడిన ప్రజల విన్నపాన్ని శాంతియుతంగా సమర్పించాలని చిత్తశుద్ధితో కోరుకున్న కార్మికవర్గంలోని మిక్కిలి విద్యావిహీనమైన, వెనకబడిన విభాగాలకు జారుచేత స్వయంగానో లేక అతని పినతండ్రియైన గ్రాండ్ డ్యూక్ వ్లదీమిర్ చేతనో గుణపాఠం నేర్పబడింది.

కార్మికవర్గానికి అంతర్యుద్ధంలోని మహత్తర ప్రాముఖ్యంగల గుణపాఠం లభించింది; శ్రామికవర్గపు విప్లవ శిక్షణ విసుగుపుట్టించే, సర్వసామాన్యమైన, క్షుద్రమైన రోజువారీ

జీవితంలో నెలల్లోనూ, సంవత్సరాల్లోనూ సాధించగలదాని కన్న ఒక్క రోజులో పెద్ద ముందడుగు వేసింది. ''మరణం లేక స్వేచ్ఛ!'' అన్న వీరోచిత సెంట్ పీటర్స్‌బుర్గ్ శ్రామిక వర్గ నినాదం రష్యా అంతటా మార్మోగుతోంది. ఘటనలు అద్భుతావహమైన వేగంతో పరిణామం చెందుతున్నాయి. సెంట్ పీటర్స్‌బుర్గ్‌లోని సార్వత్రిక సమ్మె విస్తరిస్తోంది. సమస్త పారిశ్రామిక, పౌర, రాజకీయ జీవితమూ స్తంభించిపోయింది. జనవరి 10వ తేదీ సోమవారం నాడు కార్మికులకూ సైనికులకూ మధ్య ఘర్షణలు తీవ్రతరమయ్యాయి. అబద్ధాలకోరు ప్రభుత్వపు నివేదికలకు విరుద్ధంగా, రాజధానిలోని పలు పేటల్లో రక్తం ఏరులై పారుతోంది. కోల్పినొ కార్మికులు తిరుగుబాటు చేస్తున్నారు. శ్రామికవర్గం తనను తాను ఆయుధ సజ్జితం చేసుకొని, జనాన్ని కూడ ఆయుధ సజ్జితులను చేస్తోంది. కార్మికులు సెస్త్రొరేత్స్క్ ఆయుధాగారాన్ని వశపరుచుకున్నారట. వాళ్లు రివాల్వర్లను సేకరించుకొంటున్నారు, తమ పరికరాలను ఆయుధాలుగా పోతపోసుకుంటున్నారు, స్వేచ్ఛను సంపాదించుకొనే తెగువతో కూడిన ప్రయత్నంలో బాంబులను సేకరించుకొంటున్నారు. సార్వత్రిక సమ్మె రాష్ట్రాలకు విస్తరిస్తోంది. మాస్కోలో యిప్పటికే పదివేలమంది పనులు నిలిపేశారు. అక్కడ రేపటికి (జనవరి 13వ తేదీ, గురువారం) సార్వత్రిక సమ్మెకు పిలుపివ్వబడింది. రీగాలో తిరుగుబాటు ప్రజ్వలించింది. లోడ్జ్‌లో కార్మికులు ప్రదర్శనలు చేస్తున్నారు, వార్సాలో తిరుగుబాటుకి సన్నాహాలు జరుగుతున్నాయి, హెల్సింగ్‌ఫోర్స్‌లో శ్రామికవర్గ ప్రదర్శనలు జరుగుతున్నాయి. కార్మికుల్లో అసంతృప్తి పెరిగి, బాకూ, ఒదేస్స, కీయెవ్, హార్కొవ్, కోవ్నొ, వీల్నొలలో సమ్మె విస్తరిస్తోంది. సెవస్తొపొల్‌లో నౌకా గిడ్డంగులు, ఆయుధాగారాలు మంటలకు ఆహుతి అయ్యాయి, సైనికదళాలు తిరుగుబాటుదార్లపై కాల్పులు జరపడానికి తిరస్కరించాయి. రేవెల్, సరాతొవ్‌లలో సమ్మెలు జరుగుతున్నాయి. కార్మికులూ, రిజర్వులో వున్న సైనికులూ రదోమ్‌లో సైనిక దళాలతో ఘర్షణ పడ్డారు.

విప్లవం విస్తరిస్తోంది. ప్రభుత్వం దిక్కుతోచని పరిస్థితిలో పడింది. రక్తపాతంతో కూడిన దమనకాండ విధానంనుండి ఆర్థిక రాయితీల విధానానికి మారేందుకూ, కార్మికులకు ఎంగిలి తుంపులను వెయ్యడం ద్వారానో లేక తొమ్మిది గంటల పనిదినాన్ని వాగ్దానం చెయ్యడం ద్వారానో తనను తాను రక్షించుకొనేందుకూ అది ప్రయత్నిస్తోంది. అయితే ''రక్తప్లావిత ఆదివారపు'' గుణపాఠాన్ని విస్మరించడం సాధ్యం కాదు. సార్వజనిక, ప్రత్యక్ష, సమాన, రహస్య వోటింగు హక్కు ప్రాతిపదికపై రాజ్యాంగ నిర్ణయసభ తక్షణం సమావేశపరచబడాలన్న తిరుగుబాటుదారులైన సెంట్ పీటర్స్‌బుర్గ్ కార్మికుల డిమాండు సమ్మెచేస్తున్న కార్మికులందరి డిమాండు కావాలి. ప్రభుత్వాన్ని తక్షణమే కూల్చివెయ్యాలి! — జారును విశ్వసించిన సెంట్ పీటర్స్‌బుర్గ్ కార్మికులు సైతం జనవరి 9వ తేదీ మారణహోమానికి

జవాబిచ్చినది యీ నినాదంతోనే. తమ నాయకుడైన మతగురువు గెయోర్గీ గపోన్ ద్వారా వాళ్లు జవాబిచ్చారు. ఆ రక్తప్లావిత దినం తర్వాత గపోన్ యిలా ప్రకటించాడు: ''మాకిక జారు ఎంతమాత్రం లేడు. ఒక రక్తవాహిని ప్రజలనుంచి జారును వేరుచేస్తోంది. స్వాతంత్ర్య పోరాటం వర్ధిల్లాలి!''

విప్లవాత్మక శ్రామికవర్గం వర్ధిల్లాలి! అంటాం మనం. సార్వత్రిక సమ్మె, కార్మిక వర్గానికీ, పట్టణవాసపు పేదలకూ చెందిన జనాన్ని అంతకంతకు ఎక్కువ సంఖ్యలో ఉత్తేజితం చేసి, సమీకరిస్తోంది. జనాన్ని సాయుధులను చెయ్యడమన్నది విప్లవ తరుణపు తక్షణ కర్తవ్యం అవుతోంది.

సాయుధులైన జనం మాత్రమే ప్రజా స్వాతంత్ర్యానికి నిజమైన రక్షణ దుర్గంగా ఉండగలుగుతారు. శ్రామికవర్గం సాయుధమవడంలో ఎంత త్వరగా విజయం సాధిస్తే, తిరుగుబాటుదారుగానూ, విప్లవవాదిగానూ తన పోరాటస్థానాలను అది ఎంత దీర్ఘకాలం నిలుపుకొంటే, సైన్యం అంత త్వరగా ఊగిసలాడుతుంది; కట్టకడపటికి అంతకంతకు ఎక్కువమంది సైనికులు తాము ఏం చేస్తున్నారో గ్రహించనారంభిస్తారు, కిరాతకులకు వ్యతిరేకంగా, నిరంకుశుడికి వ్యతిరేకంగా, నిరాయుధులైన కార్మికుల, వాళ్ల భార్యాబిడ్డల హంతకులకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన చేరుతారు. సెంట్ పీటర్స్‌బుర్గ్‌లోని ప్రస్తుత తిరుగుబాటు ఫలితం ఏమైనప్పటికీ, మరింత విస్తృతమైన, మరింత చైతన్యపూరితమైన, మరింత సుసంఘటితమైన తిరుగుబాటుకు అది మొదటి మెట్టు అయితీరుతుంది. ప్రభుత్వం ప్రజలు పగతీర్చుకునే రోజును బహుశా వాయిదా వెయ్యగలగవచ్చు, కాని ఆ వాయిదా, విప్లవ దాడి తదుపరి అడుగును మరింత బృహత్తరం మాత్రమే చేస్తుంది. సోషల్ డెమోక్రట్లు యీ వాయిదాను, సంఘటిత పోరాటకులను సమీకృతం చేసుకొనేందుకూ, సెంట్ పీటర్స్‌బుర్గ్ కార్మికుల పోరాటోత్సవ ప్రారంభ వార్తను వ్యాపింపజేసేందుకూ మాత్రమే వినియోగించుకుంటారని దీని అర్థం. శ్రామికవర్గం పోరాటంలో చేరుతుంది, మిల్లులనూ, ఫ్యాక్టరీలనూ విడిచిపెట్టి, తనకోసం ఆయుధాలను సన్నద్ధం చేసుకొంటుంది. స్వేచ్ఛకోసం పోరాట నినాదాలు అంతకంతకు ఎక్కువ విస్తృతంగా, పట్టణవాస పేదలలోకీ, కోట్లాది రైతుల మధ్యకీ, తీసుకుపోబడుతాయి. ప్రతి ఫ్యాక్టరీలోనూ, ప్రతి నగరపు పేటలోనూ, ప్రతి పెద్ద గ్రామంలోనూ విప్లవ కమిటీలు నెలకొల్పబడుతాయి. తిరుగుబాటు చేసిన ప్రజలు జారిస్టు ప్రభుత్వ సంస్థలన్నింటినీ కూలదోసి, రాజ్యాంగ నిర్ణయసభను తక్షణమే సమావేశపరచాలని ఘోషిస్తారు.

కార్మికులనూ, మొత్తంమీద అందరు పౌరులనూ తక్షణం సాయుధులను చెయ్యడం, ప్రభుత్వ అధికారులనూ, సంస్థలనూ కూలదోసేందుకోసం విప్లవ బలగాలను సన్నద్ధం

చేసి, సంఘటితం చెయ్యడం — యిదే, అన్ని తరహాల విప్లవవాదులూ, ఉమ్మడి దెబ్బ తీసేందుకుగాను సమైక్యం కాగల, సమైక్యం కావలసిన ఆచరణాత్మక ప్రాతిపదిక. శ్రామికవర్గం సదా తన సొంత, స్వతంత్ర పంథాను అనుసరించాలి, సోషల్ డెమోక్రటిక్ పార్టీతో తన సంబంధాన్ని ఎన్నడూ బలహీనపడ నివ్వరాదు, మానవాళిని సమస్త దోపిడినుండీ విముక్తం చెయ్యడమన్న తన మహత్తర, అంతిమ లక్ష్యాన్ని ఎల్లప్పుడూ మనస్సులో ఉంచుకోవాలి. అయితే, సోషల్ డెమోక్రటిక్ శ్రామికవర్గ పార్టీయొక్క యీ స్వేచ్ఛ, యథార్థ విప్లవ తరుణంలో ఉమ్మడి విప్లవాత్మక దాడి ప్రాముఖ్యాన్ని మనం విస్మరించడానికి ఎన్నడూ దారితియ్యదు. సోషల్ డెమోక్రట్లమైన మనం బూర్జువా డెమోక్రటిక్ విప్లవవాదులతో ప్రసక్తి లేకుండా స్వతంత్రంగా వ్యవహరించగలం, వ్యవహరించాలి, శ్రామికవర్గపు వర్గ స్వేచ్ఛను కాపాడాలి. అయితే, తిరుగుబాటు జరిగేటప్పుడు, జారిజంమీద నేరుగా దెబ్బలు కొట్ట బడుతున్నప్పుడు, సైనిక దళాలకు వ్యతిరేకంగా ప్రతిఘటన సాగుతున్నప్పుడు, యావన్మంది రష్యన్ ప్రజల శాపోపహత శత్రువుయొక్క జైళ్లమీద దాడి చేసేటప్పుడు, వాళ్లతో చేతులు కలిపి మనం వెళ్లాలి.

యావత్ప్రపంచపు శ్రామికవర్గమూ యిప్పుడు యావత్తు రష్యా శ్రామికవర్గం వంక ఆతృతగా చూస్తోంది. రష్యాలో మన కార్మికవర్గంచేత వీరోచితంగా ప్రారంభింపబడిన జారిజం కూల్చివేత, సకల దేశాల చరిత్రలోనూ ఒక మూల మలుపు అవుతుంది. అన్ని దేశాల్లోని, ప్రపంచపు అన్ని భాగాల్లోని అన్ని జాతుల కార్మికుల కర్తవ్య నిర్వహణనూ యిది సుగమం చేస్తుంది. అందుచేత, ప్రతి సోషల్ డెమోక్రటూ, వర్గచైతన్యం గల ప్రతి కార్మికుడూ, తన భుజస్కంధాలపైన వున్న విస్తృత ప్రజా పోరాటపు బృహత్తర కర్తవ్యాలను గుర్తుంచుకోవాలి. యావన్మంది ప్రజల శత్రువుకు వ్యతిరేకంగా మొత్తం రైతాంగపు, మొత్తం శ్రామికుల, దోపిడికి గురయ్యే యావన్మంది ప్రజల అవసరాలకూ, ప్రయోజనాలకూ తను ప్రాతినిధ్యం వహిస్తున్న సంగతిని కూడా అతను మరచిపోకూడదు. ఇప్పుడు సెంట్ పీటర్స్‌బుర్గ్ శ్రామికవర్గ వీరులు అందరికీ ఆదర్శప్రాయులు.

విప్లవం వర్ధిల్లాలి!

తిరుగుబాటు చేస్తున్న శ్రామికవర్గం వర్ధిల్లాలి!

''వ్ప్యోర్యోద్'' 4వ సంచికలో,
జనవరి 31 (18), 1905న
ముద్రింపబడింది

# ప్రజాతంత్ర విప్లవంలో సోషల్ డెమోక్రసీయొక్క రెండు యెత్తుగడలు

## పీఠిక

విప్లవ కాలంలో, విప్లవ పార్టీల యెత్తుగడల నినాదాలను అంచనావేయడానికి ఆశ్చర్యకరమైనంత విస్తారంగా కొత్త సమాచారం సమకూర్చే ఘటనలతో సమంగా నడవడం చాలా కష్టం. యీ పుస్తకం ఒదేస్స ఘటనలకు* ముందు రాయబడింది. ''ఒక క్రమంగా తిరుగుబాటు'' అనే సిద్ధాంతం సృష్టించి, తాత్కాలిక విప్లవ ప్రభుత్వం కొరకు చేసే ప్రచారాన్ని నిరాకరించిన సోషల్ డెమోక్రట్లను కూడా యీ ఘటనలు తమ వ్యతిరేకులవైపు వాస్తవంగా పోయేటట్లు, లేదా పోవడం ప్రారంభించేటట్లు, నిర్బంధించినాయని మేము ''ప్రొలెతారియ్''[72] (నం. 9 – ''విప్లవం బోధిస్తుంది'')లో యిదివరకే చెప్పినాము. రాజకీయ అభివృద్ధియొక్క శాంతియుత దశలలో నమ్మశక్యంగానట్లు కనపడేటంత వేగంతోనూ, సమగ్రతతోనూ విప్లవం నిస్సందేహంగా బోధిస్తుంది. యిక ప్రత్యేకంగా ముఖ్యమైనది యేమిటంటే, అది నాయకులకే గాక, జనాలకు కూడా బోధిస్తుంది.

విప్లవం రష్యాలోని కార్మిక జనాలకు సోషల్ డెమోక్రటిజంను నేర్పుతుందనడంలో ఆవంత సందేహం కూడా లేదు. సమాజంలోని వివిధ వర్గాల నిజమైన స్వభావాన్ని ప్రదర్శించడం ద్వారా, మన ప్రజాస్వామ్యంయొక్క బూర్జువా స్వభావాన్నీ, బూర్జువా డెమోక్రటిక్ అర్థంలో విప్లవకరంగా వుంటూనే, తమలోపల ''సమాజకరణ'' భావాన్ని కాక, బూర్జువా వర్గానికీ, గ్రామీణ కార్మికవర్గానికీ మధ్య జరిగే నూతన వర్గపోరాట బీజాలను తమలో కలిగివున్న రైతాంగంయొక్క నిజమైన కాంక్షలనూ ప్రదర్శించడం ద్వారా విప్లవం సోషల్ డెమోక్రటిక్ పార్టీ కార్యక్రమాన్నీ, యెత్తుగడలనూ వాస్తవ ఆచరణలో రుజువుచేస్తుంది. రష్యాలో పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి సమస్యమీదా, మన ''సమాజపు'' ప్రజాస్వామ్య స్వభావ సమస్యమీదా, రైతు తిరుగుబాటు సంపూర్ణ విజయపు ప్రాముఖ్యం అనే సమస్య మీదా ''సోషలిస్టు రివల్యూషనరీ పార్టీ'' ముసాయిదా కార్యక్రమం[73]లో అంత స్పష్టంగా

---

* యుద్ధనౌక ''పొత్యోమ్కిన్''లో జరిగిన తిరుగుబాటుకు[71] ప్రస్తావన. (1907 కూర్పుకు రచయిత వివరణ. – సం.)

కనిపించే — పాత నరోదిజపు[74] పాత భ్రమలన్నిటినీ విప్లవం పూర్తిగా, నిర్దాక్షిణ్యంగా భగ్నం చేస్తుంది. మొదటి సారిగా వివిధ వర్గాలకు వాటి నిజమైన రాజకీయ పరీక్ష ప్రవేశం జరుగుతుంది. యీ వర్గాలు విప్లవంనుండి ఒక నిశ్చితమైన రాజకీయ రూపురేఖలతో బయటపడతాయి, యెందుకంటే, అవి తమ సిద్ధాంతకారుల కార్యక్రమంలోనూ, యెత్తుగడల నినాదాలలోనూ మాత్రమే కాక జనాల బహిరంగ రాజకీయ కార్యాచరణలో కూడా తమ్ము తాము పరీక్షకు గురిచేసుకొని వుంటాయి.

నిస్సందేహంగా విప్లవం మనకు నేర్పుతుంది, జనాలకు నేర్పుతుంది. కానీ, యిప్పుడు ఒక సమరశీల రాజకీయ పార్టీకి యెదురయ్యే సమస్య యేమిటంటే: విప్లవానికి మనం యేమైనా నేర్పగలమా? మనం విప్లవంమీద కార్మికవర్గ ముద్ర వేయడానికీ, విప్లవాన్ని నిజమైన, మాటల్లో కాదు, చేతల్లో నిర్ణయాత్మకమైన విజయానికి తీసుకపోడానికీ, ప్రజాతంత్ర బూర్జువావర్గంయొక్క అస్థిరత్వాన్నీ, అర్ధమనస్కతనీ, ద్రోహాన్నీ నిర్వీర్య పరచడానికీ మన సోషల్ డెమొక్రటిక్ సిద్ధాంతపు నిర్దుష్టతనూ, ఒకేఒక సమగ్ర విప్లవ వర్గమైన కార్మికవర్గంతో మన సంబంధాన్నీ ఉపయోగించుకోగలమా?

మన ప్రయత్నాలన్నిటినీ యీ లక్ష్యంవైపు నడిపించాలి. యీ లక్ష్య సాధన, ఒక వైపున, రాజకీయ సన్నివేశాన్ని గురించి మనం వేసే అంచనాయొక్క కచ్చితత్వంమీదా, మన యెత్తుగడల నినాదాల నిర్దుష్టతమీదా, మరొక వైపున, యీ నినాదాలకు కార్మిక జనాల నిజమైన పోరాట బలంయొక్క అండదండలు వుంటాయా అనే దానిమీదా ఆధారపడుతుంది. మన సకల పార్టీ శాఖల, బృందాల మామూలు, క్రమబద్ధ, దినచర్య పని అంతా, ప్రచార, ఆందోళన, సంస్థానిర్మాణాల పని, జనాలతో సంబంధాలను పటిష్ఠపరచడంవైపూ, విస్తృతపరచడంవైపూ నడిపించబడుతున్నది. యీ పని యెల్లప్పుడూ అవసరమైనదే, అయితే, విప్లవ తరుణంలో యిది చాలుతుందని చెప్పలేం. అలాంటి పరిస్థితిలో కార్మిక వర్గం బహిరంగ విప్లవ కార్యాచరణకోసం సహజ ప్రేరణ పొందుతుంది; మనం కార్యాచరణ లక్ష్యాలను సరిగా రూపొందించడం నేర్చుకోవాలి, తరువాత యీ లక్ష్యాలను వీలైనంత విస్తృతంగా తెలుసుకునేటట్లూ, అర్థంచేసుకునేటట్లూ చేయాలి. జనాలతో మన సంబంధాలను గురించి ప్రస్తుతం వ్యాపించిన నిరాశాతత్వం విప్లవంలో కార్మికవర్గ పాత్రను గురించి వుండే బూర్జువా భావాలకు తరుచుగా ముసుగుగా ఉపయోగపడుతుందనేది మరచిపోకూడదు. నిస్సందేహంగా కార్మికవర్గాన్ని తర్ఫీదుచేయడంలోనూ, సంఘటితం చేయడంలోనూ మనం చేయవలసింది యింకా చాలా వుంది; అయితే, యీ తర్ఫీదుచేసే, సంఘటితంచేసే పనిలో దేనికి ప్రధాన రాజకీయ ప్రాముఖ్యం యివ్వాలన్నదే సమస్య సారాంశం. ట్రేడ్‌యూనియన్‌లకూ, చట్టబద్ధంగా వుంటున్న సంఘాలకూనా, లేక సాయుధ తిరుగు

బాటుకూ, విప్లవ సైన్యాన్నీ, విప్లవ ప్రభుత్వాన్నీ సృష్టించే పనికీనా? కార్మికవర్గాన్ని తర్ఫీదు చేయడానికీ, సంఘటితం చేయడానికీ రెండూ ఉపయోగపడతాయి. సహజంగా, రెండూ అవసరమే. కానీ, ప్రస్తుత విప్లవంలో సమస్య యిలా వుంటుంది: కార్మికవర్గాన్ని తర్ఫీదుచేసే, సంఘటితంచేసే పనిలో దేనికి ప్రాముఖ్యం యివ్వాలి, మొదటిదానికా, రెండవ దానికా?

కార్మికవర్గం బూర్జువావర్గానికి సహాయకుని పాత్ర—నిరంకుశత్వంమీద చేసే తన దాడిలో శక్తివంతంగా వుంటూ, అయినా రాజకీయంగా నిర్వీర్యంగా వుండే సహాయకుని పాత్ర—నిర్వహిస్తుందా, లేక ప్రజా విప్లవ నాయక పాత్ర నిర్వహిస్తుందా అనే దాని మీద విప్లవ ఫలితం ఆధారపడుతుంది. బూర్జువావర్గ ప్రతినిధుల్లో మరికాస్త తెలివైన వాళ్లకి యిది బాగా తెలుసు. అందుకనే "ఒస్వొబొజ్దేనియె" అకీమొవిజాన్నీ, అనగా సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలో "ఆర్థికవాదాన్నీ," అనగా ట్రేడ్‌యూనియన్‌లనూ, చట్టబద్ధంగా వుంటున్న సంఘాలనూ యిప్పుడు ముందుకు తెస్తున్న ధోరణినీ పొగడుతోంది. అందుకనే స్ట్రూవె ("ఒస్వొబొజ్దేనియె," నం. 72లో) కొత్త "ఇస్క్రా" భావాలలో అకీమొవిస్టు ధోరణిని ఆహ్వానిస్తున్నాడు. అందుకనే అతను రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ మూడవ మహాసభ[75] నిర్ణయాల విప్లవ సంకుచితత్వాన్ని అంత తీవ్రంగా ఖండిస్తున్నాడు.

జనసామాన్యాన్ని నడిపించడానికి సోషల్ డెమోక్రటిక్ పార్టీ సరైన యెత్తుగడల నినాదాలు ఇవ్వడం ప్రస్తుత సమయంలో మహా ముఖ్యం. సూత్రరీత్యా సరైన యెత్తుగడల నినాదాల ప్రాముఖ్యాన్ని తక్కువపరచడంకంటె విప్లవ కాలంలో ప్రమాదకరమైనది యేమీ లేదు. ఉదాహరణకు "ఇస్క్రా" తన 104వ సంచికలో వాస్తవంగా సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలో తనకు వ్యతిరేకులైనవాళ్ల పక్షానికి పోతుంది, కానీ అదే సమయంలో, కాలానికి ముందు నడిచేటట్టివీ, పలు వైఫల్యాలతోనూ, తప్పులతోనూ అయినప్పటికీ, ఉద్యమం పురోగమించే మార్గాన్ని సూచించేటట్టివీ అయిన నినాదాలయొక్క, యెత్తుగడల నిర్ణయాలయొక్క ప్రాముఖ్యాన్ని కించపరుస్తుంది. కానీ, కేవలం ఘటనలవెంట కాళ్లీడ్చుకుంటూ నడవడం కాక, స్థిరమైన మార్క్సిస్టు సూత్రాల తత్వంలో కార్మికవర్గాన్ని నడిపించగోరే పార్టీకి సరైన యెత్తుగడల నిర్ణయాలను తయారుచేయడం యెంతో ముఖ్యమైనది. రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ మూడవ మహాసభ, పార్టీనుండి చీలిపోయిన భాగం* జరిపిన కాన్ఫరెన్సుల తీర్మానాలలో యెత్తుగడల అభిప్రాయాలయొక్క అత్యంత కచ్చితమైన, అత్యంత శ్రద్ధగా యోచింపబడిన, అత్యంత పరిపూర్ణమైన వ్యక్తీ

---

* రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ మూడవ మహాసభ (లండన్, మే 1905)కు

కరణ వుంది — విడివిడి రచయితలు యధాలాపంగా వ్యక్తం చేసిన అభిప్రాయాలు కాదు — సోషల్ డెమోక్రటిక్ కార్మికవర్గంయొక్క బాధ్యతాయుత ప్రతినిధులు అంగీకరించిన అభిప్రాయాలు. మన పార్టీ అన్ని పార్టీలకంటె ముందు వుంది, యెందుకంటే దానికి కచ్చితమైన, సర్వజనాంగీకృతమైన కార్యక్రమం వుంది. ''ఒస్వొబొజ్దేనియె'' ప్రజాతంత్ర బూర్జువావర్గంయొక్క అవకాశవాదానికి భిన్నంగా, సోషలిస్టు రివల్యూషనరీల విప్లవ పదాడంబరానికి భిన్నంగా, తన యెత్తుగడల తీర్మానాలపట్ల సూత్రబద్ధ వైఖరి తీసుకోవడంలో మన పార్టీ యితర పార్టీలకు ఆదర్శం కూడా నెలకొల్పాలి. విప్లవ కాలంలో మాత్రమే వాళ్లకు — ''ఒస్వొబొజ్దేనియె'' బూర్జువావర్గానికీ, సోషలిస్టు రివల్యూషనరీలకూ — ఒక ముసాయిదా కార్యక్రమంతో ముందుకు రావాలనీ, తమ కండ్లముందు జరుగుతున్నది బూర్జువా విప్లవమా అని మొదటి సారిగా దర్యాప్తు చేయాలనీ ఆలోచన హఠాత్తుగా వచ్చింది.

అందుకనే, రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ మూడవ మహాసభయొక్కా, కాన్ఫరెన్సుయొక్కా యెత్తుగడల తీర్మానాలను జాగ్రత్తగా అధ్యయనం చేయడమూ, మార్క్సిస్టు సూత్రాలనుండి వ్యతిక్రమణలు వాటిలో యేవి వున్నాయో నిర్వచించడమూ, ప్రజాస్వామ్య విప్లవంలో సోషల్ డెమోక్రటిక్ కార్మికవర్గపు నిర్దిష్ట కర్తవ్యాలను స్పష్టంగా అర్థం చేసుకోవడమూ విప్లవ సోషల్ డెమోక్రట్ల జరూరు కర్తవ్యమని మేము అనుకుంటున్నాము. యీ విషయానికే యీ పుస్తకం అర్పించబడింది. మొత్తం రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీయొక్క భావి సంపూర్ణ సమైక్యతకు ప్రాతిపదికగా యెత్తుగడల సమైక్యతకు దారివేయాలనీ, కేవలం నోటిమాటల హెచ్చరికలకు పరిమితం కాకూడదనీ నిజంగా కోరే వాళ్లకు మన యెత్తుగడలను మార్క్సిస్టు సూత్రాలయొక్కా, విప్లవ గుణపాఠాలయొక్కా దృక్పథంనుండి పరీక్షించి చూడడం కూడా అవసరం.

ఎన్. లెనిన్

జూలై 1905

---

బోల్షివిక్కులు మాత్రమే హాజరయ్యారు. కాగా, ''కాన్ఫరెన్సు'' (జెనీవా, అదే సమయం)లో మెన్షివిక్కులు మాత్రం పాల్గొన్నారు. ప్రస్తుత పుస్తకంలో, మెన్షివిక్కులు తరుచుగా ''కొత్త 'ఇస్క్రా'వాళ్లు'' అని ప్రస్తావించబడుతున్నారు; యెందుకంటే, వాళ్లు ''ఇస్క్రా''ను ప్రచురించడం కొనసాగిస్తూనే, కొత్త ''ఇస్క్రా''కూ, పాత ''ఇస్క్రా''కూ మధ్య అఖాతం వుందని, తమ అనుయాయుడైన ట్రాట్స్కీ ద్వారా ప్రకటించినారు. (1907 కూర్పుకు రచయిత వివరణ. — సం.)

# 1. జరూరు రాజకీయ సమస్య

ప్రస్తుత విప్లవ తరుణంలో యావత్ప్రజా రాజ్యాంగ నిర్ణయసభను సమావేశపరచే సమస్య యీనాటి జరూరు సమస్యే. యీ సమస్యను యెలా పరిష్కరించాలి అనే దానిమీద భిన్నమైన అభిప్రాయాలు వున్నాయి. మూడు రాజకీయ ధోరణులు రూపుదాలుస్తున్నాయి. జారిస్టు ప్రభుత్వం ప్రజా ప్రతినిధులను సమావేశపరచే అవసరాన్ని ఒప్పుకుంటుంది, కానీ అది యెట్టి పరిస్థితులలోనూ వాళ్ల సభ యావత్ప్రజాగా రాజ్యాంగ నిర్ణయ సభగానూ వుండనివ్వాలని కోరదు. బులీగిన్ కమిషన్[76] పనికి సంబంధించి పత్రికల వార్తలు నిజమైతే, ఆందోళన స్వేచ్ఛ లేకుండా, కఠినంగా పరిమితపరచే యోగ్యతల పద్ధతిమీద, లేదా సంకుచితమైన సాంఘిక అంతస్తులకు పరిమితమైన పద్ధతిమీద యెన్నుకోబడే సలహా సభకు ఒప్పుకోడానికి ప్రభుత్వం యిష్టపడుతున్నట్లుంది. విప్లవ శ్రామికవర్గం సోషల్ డెమోక్రటిక్ పార్టీచేత నడిపించబడుతున్నది గనుక, అధికారాన్ని రాజ్యాంగ నిర్ణయసభకు సంపూర్ణంగా బదలాయించాలని డిమాండు చేస్తుంది, యీ ప్రయోజనం కొరకు సార్వజనీన వోటు హక్కునూ, ప్రచారం సాగించడానికి సంపూర్ణ స్వేచ్ఛనూ మాత్రమే కాక, జారిస్టు ప్రభుత్వాన్ని వెంటనే కూలదోయడానికీ, దాని స్థానంలో తాత్కాలిక విప్లవ ప్రభుత్వాన్ని స్థాపించడానికీ కృషిచేస్తుంది. చివరి విషయం, లిబరల్ బూర్జువావర్గం "కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రటిక్ పార్టీ"[77] అనబడేదాని నాయకుల ద్వారా తన కోర్కెలను వ్యక్తం చేస్తూ, జారిస్టు ప్రభుత్వాన్ని కూలదోయడాన్ని డిమాండు చేయదు, అది తాత్కాలిక ప్రభుత్వ నినాదం యివ్వదు, యెన్నికలు పరమ స్వేచ్ఛగా, న్యాయంగా జరుగుతాయనీ, ప్రతినిధుల సభ నిజమైన యావత్ప్రజా, నిజమైన రాజ్యాంగ నిర్ణయసభగా వుంటుందనీ నిజమైన హామీలు వుండాలనీ పట్టుబట్టదు. నిజానికి, లిబరల్ బూర్జువా వర్గం, "ఒస్వొబొజ్దేనియె" ధోరణికి ఒకేఒక గురుతరమైన సాంఘిక అండ, జారుకూ విప్లవ ప్రజలకూ మధ్య సాధ్యమైనంత శాంతియుతమైన ఒప్పందాన్ని, అంతే కాక, తనకే,

అనగా బూర్జువావర్గానికి, గరిష్ఠ అధికారాన్నీ, విప్లవ ప్రజలకు — అనగా శ్రామికవర్గానికీ, రైతాంగానికీ — కనీస అధికారాన్నీ యిచ్చేటట్టి ఒప్పందాన్ని సాధించడానికి కృషిచేస్తున్నది.

ప్రస్తుత రాజకీయ పరిస్థితి యిదీ. సమకాలిక రష్యాలోని మూడు ప్రధాన సాంఘిక శక్తులకు అనుగుణంగా వున్న మూడు ప్రధాన రాజకీయ ధోరణులు అవీ. ''ఒస్వొబొజ్దేనియె'' వాళ్లు విప్లవంపట్ల తమ అయిష్టపు ధోరణిని, మరింత మొరటుగా, నగ్నంగా చెప్పాలంటే, ద్రోహపూరిత, విశ్వాసఘాతుక వైఖరిని, కప్పకోడానికి కుహనా ప్రజాతంత్ర పదబంధాలను యెలా ఉపయోగించేదీ మేము యిప్పటికే ఎన్నో సార్లు ''ప్రొలెతారియ్'' (నం. 3, 4, 5)లో చూపించినాము. యిక, యిప్పటి కర్తవ్యాలను సోషల్ డెమోక్రట్లు యెలా అంచనా వేసేదీ చూద్దాం. రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ మూడవ మహాసభా, పార్టీ నుండి విడిపోయిన భాగంయొక్క ''కాన్ఫరెన్సూ'' యిటీవల ఆమోదించిన రెండు తీర్మానాలూ దీనికి శ్రేష్ఠమైన సమాచారం సమకూరుస్తున్నాయి. యీ తీర్మానాలలో యేది రాజకీయ పరిస్థితిని యెక్కువ సరిగా అంచనావేస్తుంది, విప్లవ శ్రామికవర్గపు యెత్తుగడలను యెక్కువ సరిగా నిర్వచిస్తుంది అనే ప్రశ్నకి అపారమైన ప్రాముఖ్యం వుంది; ప్రచారకుడుగా, ఆందోళనకారుడుగా, ఆర్గనైజరుగా తన విధులను తెలివితేటలతో నిర్వహించగోరే ప్రతి సోషల్ డెమోక్రటూ, అసలు విషయంతో సంబంధంలేని వాటినన్నిటినీ నిర్లక్ష్యం చేసి, యీ సమస్యను అత్యంత గాఢమైన శ్రద్ధతో అధ్యయనం చేయాలి.

పార్టీ యెత్తుగడలు అంటే పార్టీయొక్క రాజకీయ ప్రవర్తన, లేదా దాని రాజకీయ కార్యకలాపాల స్వభావమూ, దిశా, పద్ధతులూనూ. నూతన కర్తవ్యాల విషయంలో, లేదా ఒక నూతన రాజకీయ పరిస్థితి దృష్ట్యా మొత్తం పార్టీ రాజకీయ ప్రవర్తనను కచ్చితంగా నిర్వచించడానికి యెత్తుగడల తీర్మానాలు పార్టీ మహాసభలలో ఆమోదించబడతాయి. అలాంటి నూతన పరిస్థితిని రష్యాలో ప్రారంభమైన విప్లవం సృష్టించింది — అనగా, ప్రజానీకంలో అపారమైన మెజారిటీకీ, జారిస్టు ప్రభుత్వానికీ మధ్య బాహాటమైన గండి ఏర్పడింది. కొత్త సమస్య నిజంగా యావత్ప్రజా, నిజంగా రాజ్యాంగ నిర్ణయసభను సమావేశపరచే ఆచరణాత్మక పద్ధతులకు సంబంధించినది (అలాంటి సభను గురించిన సమస్య సిద్ధాంత దృష్ట్యా సోషల్ డెమోక్రసీచేత దాని పార్టీ కార్యక్రమంలో యేనాడో, యితర పార్టీ లన్నిటి కంటె ముందుగా, పరిష్కరింపబడింది). ప్రజలు ప్రభుత్వంతో తెంచుకున్నారు గనుక, కొత్త వ్యవస్థను నెలకొల్పే అవసరాన్ని జనాలు గుర్తిస్తున్నారు గనుక, ప్రభుత్వాన్ని కూల దోయడం తన లక్ష్యంగా పెట్టుకున్న పార్టీ, తొలగింపబడిన పాత ప్రభుత్వం స్థానంలోకి యే ప్రభుత్వం రావలసిందీ తప్పనిసరిగా ఆలోచించాలి. యిక్కడ తాత్కాలిక విప్లవ ప్రభుత్వం గురించిన నూతన సమస్య ఉత్పన్నమౌతుంది. యీ సమస్యకు సంపూర్ణ సమాధానం యివ్వ

డానికి వర్గచైతన్యపూరిత శ్రామికవర్గపు పార్టీ యీకిందివాటిని స్పష్టపరచాలి: 1) యిప్పుడు పురోగతిలో వున్న విప్లవంలోనూ, దరహంమీద మొత్తం శ్రామికవర్గ పోరాటం లోనూ తాత్కాలిక విప్లవ ప్రభుత్వ ప్రాముఖ్యం; 2) తాత్కాలిక విప్లవ ప్రభుత్వంపట్ల తన వైఖరి; 3) యీ ప్రభుత్వంలో సోషల్ డెమోక్రట్లు పాల్గొనడానికి కచ్చితమైన పరి స్థితులు; 4) యే పరిస్థితులలో యీ ప్రభుత్వంమీద కిందనుండి ఒత్తిడి తేవాలి, అనగా దానిలో సోషల్ డెమోక్రట్లు లేని పక్షంలో. యీ సమస్యలన్నీ స్పష్టపరచబడినప్పుడు మాత్రమే యీ రంగంలో పార్టీ ప్రవర్తన సూత్రబద్ధంగా, స్పష్టంగా, స్థిరంగా వుం టుంది.

యిక, రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ మూడవ మహాసభ తీర్మానం యీ సమస్యలకు యెలా జవాబు యిచ్చేదీ చూద్దాం. ఇదీ తీర్మానపు పూర్తి పాఠం:

"తాత్కాలిక విప్లవ ప్రభుత్వంమీద తీర్మానం

"1) కార్మికవర్గంయొక్క ప్రత్యక్ష ప్రయోజనాలూ, అంతిమ సోషలిస్టు లక్ష్యాల కొరకు అది చేసే పోరాటంయొక్క ప్రయోజనాలూ సాధ్యమైనంత సంపూర్ణ రాజకీయ స్వేచ్ఛనూ, తత్పర్యవసానంగా, నిరంకుశ ప్రభుత్వ రూపం స్థానంలో ప్రజాతంత్ర రిప బ్లిక్‌ను పెట్టడాన్ని అపేక్షిస్తాయి గనుకా;

"2) రష్యాలో ప్రజాతంత్ర రిపబ్లిక్ స్థాపన విజయవంతమైన ప్రజా తిరుగుబాటు ఫలితంగా మాత్రమే సాధ్యమౌతుంది గనుకా; తాత్కాలిక విప్లవ ప్రభుత్వం యీ తిరుగు బాటుయొక్క అంగంగా వుంటుంది గనుకా, యీ ప్రభుత్వం మాత్రమే యెన్నికల ప్రచా రంలో సంపూర్ణ స్వేచ్ఛను నెలకొల్పడానికీ, నిజంగా ప్రజాభీష్టాన్ని వ్యక్తంచేసే రాజ్యాంగ నిర్ణయసభను, సార్వజనీన, సమాన వోటు హక్కు ద్వారా, ప్రత్యక్ష యెన్నికల ద్వారా, రహస్య వోటింగు ద్వారా యెన్నుకోబడిన సభను, సమావేశపరచడానికీ సమర్థమై వుంటుంది గనుకా;

"3) ప్రస్తుత సాంఘిక, ఆర్థిక వ్యవస్థకింద రష్యాలో యీ ప్రజాతంత్ర విప్లవం బూర్జువావర్గ పెత్తనాన్ని బలహీనపరచదు సరికదా, బలపరుస్తుంది గనుకా; బూర్జువా వర్గం రష్యన్ కార్మికవర్గంనుండి విప్లవ కాలపు లాభాలలో సాధ్యమైనవాటన్నిటినీ గుంజు కోడానికి ఒకానొక దశలో యేమేరకైనా పోతుంది గనుకా;

"రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ మూడవ మహాసభ యీవిధంగా తీర్మా నిస్తున్నది:

"అ) అత్యంత ప్రాయికమైన విప్లవ గతిని గురించీ, విప్లవంలో ఒకానొక తరుణంలో తాత్కాలిక విప్లవ ప్రభుత్వం ఆవిర్భవించడంయొక్క అవసరాన్ని గురించీ ఒక నిర్దిష్ట

అభిప్రాయాన్ని కార్మికవర్గంలో వ్యాప్తిచేయడం అవసరం; మన కార్యక్రమం (కనీస కార్యక్రమం)లోని సకల తక్షణ రాజకీయ, ఆర్థిక డిమాండ్ల పరిపూర్తిని ఆ తాత్కాలిక విప్లవ ప్రభుత్వంనుండి శ్రామికవర్గం డిమాండుచేస్తుంది;

''ఆ) బలాల మోహరింపుకూ, కచ్చితంగా ముందుగా నిర్ణయించలేని యితర అంశాలకూ లోబడి, మన పార్టీ ప్రతినిధులు సకల విప్లవ ప్రతీఘాత ప్రయత్నాలతోనూ సడలుబాటు లేని పోరాటం చేయడానికీ, కార్మికవర్గ స్వతంత్ర ప్రయోజనాలను రక్షించడానికీ తాత్కాలిక విప్లవ ప్రభుత్వంలో పాల్గొనవచ్చు;

''ఇ) అలా పాల్గొనడానికి అనుల్లంఘనీయమైన షరతు యేమిటంటే, తన ప్రతినిధులమీద కచ్చితమైన పార్టీ అజమాయిషీ వుంచడమూ, సంపూర్ణ సోషలిస్టు విప్లవం కొరకు కృషిచేసేదీ, తత్పర్యవసానంగా సకల బూర్జువా పార్టీలకూ రాజీ లేకుండా వ్యతిరేకమైనదీ అయిన సోషల్ డెమోక్రసీయొక్క స్వాతంత్ర్యాన్ని నిత్యం రక్షించడమూ;

''ఈ) తాత్కాలిక విప్లవ ప్రభుత్వంలో సోషల్ డెమోక్రట్లు పాల్గొనడం సాధ్యమైనా, కాకపోయినా, సోషల్ డెమోక్రటిక్ పార్టీచేత నడిపించబడే సాయుధ శ్రామికవర్గం విప్లవ లాభాలను రక్షించడానికీ, దృఢపరచడానికీ, విస్తృతపరచడానికీ తాత్కాలిక ప్రభుత్వంమీద నిత్యం ఒత్తిడి తేవాలనే భావాన్ని శ్రామికవర్గంయొక్క అత్యంత విస్తృత భాగాలలో మనం ప్రచారం చేయాలి.''

## 2. తాత్కాలిక విప్లవ ప్రభుత్వం గురించి ఆర్.ఎస్.డి.ఎల్.పి. మూడవ మహాసభ చేసిన తీర్మానంనుండి మనం నేర్చుకొనగలది యేమిటి?

రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ మూడవ మహాసభ తీర్మానం, దాని శీర్షిక నుబట్టి స్పష్టమౌతున్నట్లు, పూర్తిగా కేవలం తాత్కాలిక విప్లవ ప్రభుత్వ సమస్యకు అర్పించబడింది. కనుక, తాత్కాలిక విప్లవ ప్రభుత్వంలో సోషల్ డెమోక్రట్లు పాల్గొనడం అనేది ఆ సమస్యలో భాగం. మరొకవైపున, తీర్మానం తాత్కాలిక విప్లవ ప్రభుత్వాన్ని మాత్రమే చర్చిస్తుంది, మరి దేన్నీ చర్చించదు; తత్ఫలితంగా, దరహంమీద ''అధికారాన్ని గెలుచుకోవడం,'' వగైరాల సమస్య యిందులోకి బొత్తిగా రాదు. యీ సమస్యనూ, యిలాంటి సమస్యలనూ తొలగించడంలో మహాసభ చేసిన పని సరైనదా? నిస్సందేహంగా

సరైనది; యెందుకంటే, రష్యాలోని రాజకీయ పరిస్థితి అలాంటి సమస్యలను యేవిధంగానూ తక్షణ సమస్యలుగా పెట్టదు. తద్వ్యతిరేకంగా, నిరంకుశత్వాన్ని కూలదోసి, రాజ్యాంగ నిర్ణయసభను సమావేశపరిచే సమస్యను యిప్పుడు యావత్తు ప్రజలూ లేవనెత్తుతున్నారు. యెవరో ఒక రచయిత సకాలంలోనో, అకాలంలోనో ప్రస్తావించిన సమస్యలను కాక, అప్పటి పరిస్థితులనుబట్టీ, వస్తుగత సామాజిక అభివృద్ధి గతినిబట్టీ కీలకమైన రాజకీయ ప్రాముఖ్యం గల సమస్యలను పార్టీ మహాసభలు తీసుకొని, నిర్ణయించాలి.

ప్రస్తుత విప్లవంలోనూ, శ్రామికవర్గ సాధారణ పోరాటంలోనూ తాత్కాలిక విప్లవ ప్రభుత్వపు ప్రాముఖ్యం యేమిటి? శ్రామికవర్గపు తక్షణ ప్రయోజనాల దృష్ట్యానూ, ''సోషలిజంయొక్క అంతిమ లక్ష్యాల'' దృష్ట్యానూ, ''సాధ్యమైనంత సంపూర్ణ రాజకీయ స్వేచ్ఛ'' అవసరాన్ని మొట్టమొదటనే చూపించడం ద్వారా మహాసభ తీర్మానం యీ ప్రాముఖ్యాన్ని వివరిస్తుంది. యిక, మన పార్టీ కార్యక్రమం యిప్పటికే గుర్తించినట్లు, సంపూర్ణ రాజకీయ స్వేచ్ఛకు జారిస్టు నిరంకుశత్వాన్ని తొలగించి, దాని స్థానంలో ప్రజాతంత్ర రిపబ్లిక్‌ను వుంచడం అవసరం. ప్రజాతంత్ర రిపబ్లిక్ నినాదానికి మహాసభ తీర్మానం యిచ్చిన ప్రాముఖ్యం తర్క దృష్ట్యానూ, సూత్రరీత్యానూ అవసరం; యెందుకంటే, ప్రజాస్వామ్యం కొరకు అందరికంటే అగ్రశ్రేణిలో పోరాడే శ్రామికవర్గం సరిగ్గా సంపూర్ణ స్వేచ్ఛనే సాధించాలని ప్రయత్నిస్తుంది. అంతేకాక, ప్రస్తుత సమయంలో దీన్ని నొక్కిచెప్పడం మరింత ఉచితం; యెందుకంటే, సరిగ్గా యిప్పుడు రాజరికవాదులు, అనగా మన దేశంలో కాన్‌స్టిట్యూషనల్ ''డెమోక్రటిక్'' లేక ''ఒస్వాబొజ్దేనియె'' పార్టీ అనబడేవాళ్లు, ''ప్రజాస్వామ్య'' జండా యెగురవేస్తున్నారు. రిపబ్లిక్‌ను స్థాపించడానికి యావత్ ప్రజా సంబంధమైనదిగానూ (అనగా సార్వజనీన, సమాన వోటుహక్కు ద్వారా, ప్రత్యక్ష యెన్నికల ద్వారా, రహస్య వోటింగు ద్వారా యెన్నికైనది), రాజ్యాంగ నిర్ణయసభగానూ తప్పక వుండవలసిన ప్రజా ప్రతినిధుల సభ పరమావసరం. మహాసభ తీర్మానంలో తరువాత గుర్తింపబడినది సరిగ్గా అదే. కానీ, తీర్మానం అక్కడ ఆగదు. ''నిజంగా ప్రజాభీష్టాన్ని వ్యక్తంచేసే'' కొత్త వ్యవస్థను నెలకొల్పడానికి ప్రజా ప్రతినిధుల సభకు రాజ్యాంగ నిర్ణయసభ అని పేరుపెట్టడం చాలదు. ఆ సభకు ''రాజ్యాంగం తయారుచేసే'' అధికారమూ, శక్తీ వుండాలి. దీన్ని గుర్తించి మహాసభ తీర్మానం ''రాజ్యాంగ నిర్ణయసభ'' అనే లాంఛనప్రాయపు నినాదానికి పరిమితం కాకుండా, యే భౌతిక పరిస్థితులు మాత్రమే అలాంటి సభకు తన కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వహించగల సామర్థ్యాన్ని యిస్తాయో ఆ పరిస్థితులను జోడించింది. పేరుకు రాజ్యాంగ నిర్ణయసభ అయిన ఒక సభను వాస్తవంలో రాజ్యాంగ నిర్ణయసభ అయ్యేటట్లు చేసే పరిస్థితులను పేర్కొనడం తప్పనిసరి అవసరం; యెందుకంటే, మేము ఎన్నోసార్లు చెప్పినట్లు,

కాన్‌స్టిట్యూషనల్ రాజరికవాద పార్టీ ప్రాతినిధ్యం వహించే ఉదారవాద బూర్జువావర్గం యావత్ప్రజా రాజ్యాంగ నిర్ణయసభ నినాదాన్ని ఉద్దేశపూర్వకంగా వికృతపరుస్తూ, దానిని వట్టి మాటగా కుదిస్తున్నది.

విజయవంతమైన ప్రజా తిరుగుబాటు అంగంగా వుండే తాత్కాలిక విప్లవ ప్రభుత్వం మాత్రమే యెన్నికల ప్రచారం సాగించడానికి సంపూర్ణ స్వేచ్ఛను నెలకొల్పగలదనీ, నిజంగా ప్రజాభీష్టాన్ని వ్యక్తంచేసే సభను సమావేశపరచగలదనీ మహాసభ తీర్మానం ప్రకటించింది. యీ సూత్రీకరణ సరైనదా? దీన్ని వ్యతిరేకించాలని అనుకునేవాడెవడైనా జారిస్టు ప్రభుత్వం ప్రగతి వ్యతిరేక శక్తుల పక్షం వహించకుండా వుండడం సాధ్యమనీ, యెన్నికల కాలంలో అది తటస్థంగా వుండగలదనీ, ప్రజాభీష్టం నిజంగా వ్యక్తీకరణ పొందేటట్లు అది చూస్తుందనీ ఉద్ఘాటించవలసి వుంటుంది. అలాంటి ఉద్ఘాటనలు యెంత అసంబద్ధమైనవంటే, వాటిని బాహాటంగా సమర్థించడానికి యెవడూ సాహసించడు; కానీ మన "ఒస్వాబొజ్దేనియె"వాళ్ళు వాటిని ఉదారవాద ముసుగులో దొంగచాటుగా ప్రవేశపెడుతున్నారు. యెవరో ఒకరు రాజ్యాంగ నిర్ణయసభను సమావేశపరచాలి; యెవరో ఒకరు యెన్నికలలో స్వేచ్ఛకూ, న్యాయానికీ హామీ యివ్వాలి; యెవరో ఒకరు అలాంటి సభకు పూర్తి శక్తినీ, అధికారాన్నీ యివ్వాలి. తిరుగుబాటు అంగమైన విప్లవ ప్రభుత్వం మాత్రమే మనస్ఫూర్తిగా దీన్ని కోరగలదు, దీన్ని సాధించడానికి అవసరమైనదంతా చేయగలదు. జారిస్టు ప్రభుత్వం తప్పనిసరిగా దాన్ని వ్యతిరేకిస్తుంది. జారుతో రాజీ పడినదీ, ప్రజా తిరుగుబాటుమీద పూర్తిగా ఆధారపడనిదీ అయిన ఉదారవాద ప్రభుత్వం దీన్ని మనస్ఫూర్తిగా కోరజాలదు, అత్యంత మనస్ఫూర్తిగా కోరినా, సాధించజాలదు. కనుక మహాసభ తీర్మానం ఒకేఒక సరైన, పూర్తిగా స్థిరమైన ప్రజాతంత్ర నినాదాన్ని యిచ్చింది.

కానీ, ప్రజాతంత్ర విప్లవంయొక్క వర్గ స్వభావాన్ని గమనించకపోతే, తాత్కాలిక విప్లవ ప్రభుత్వం గురించిన అంచనా అసంపూర్ణంగానూ, తప్పుగానూ వుంటుంది. కనుక, విప్లవం బూర్జువావర్గ పరిపాలనను బలపరుస్తుందని తీర్మానం జోడించింది. యిలా బలపరచడం ప్రస్తుత వ్యవస్థలో, అనగా పెట్టుబడిదారీ, సాంఘిక, ఆర్థిక వ్యవస్థలో అనివార్యం. యేదో కొంత రాజకీయ స్వేచ్ఛను సంపాయించుకొన్న శ్రామికవర్గంమీద బూర్జువావర్గ పరిపాలన బలపడడం అనివార్యంగా అధికారం కొరకు ఆ రెండిటిమధ్యా జరిగే భీషణ పోరాటానికి దారితీయాలి, "శ్రామికవర్గంనుండి విప్లవ కాలపు లాభాలను గుంజుకోడానికి" బూర్జువావర్గం చేసే తెంపరి ప్రయత్నాలకు దారితీయాలి. కనుక ప్రజాస్వామ్యం కొరకు జరిగే పోరాటంలో అగ్రభాగాన వుండేదీ, ఆ పోరాటానికి నాయకత్వం వహించేదీ అయిన కార్మికవర్గం బూర్జువా ప్రజాస్వామ్యంలో వున్న కొత్త వైరుధ్యాలను గానీ, కొత్త పోరా

టాన్ని గానీ ఒక్క క్షణం కూడా మరవకూడదు.

యీవిధంగా, యిప్పుడు మేము సమీక్షించిన తీర్మాన భాగం తాత్కాలిక విప్లవ ప్రభుత్వంయొక్క ప్రాముఖ్యాన్ని, స్వేచ్ఛ కొరకూ, రిపబ్లిక్ కొరకూ జరిగే పోరాటంతో దానికి గల సంబంధం దృష్ట్యానూ, రాజ్యాంగ నిర్ణయసభతో దానికి గల సంబంధం దృష్ట్యానూ, కొత్త వర్గ పోరాటానికి భూమికను తయారుచేసే ప్రజాతంత్ర విప్లవంతో దానికి గల సంబంధం దృష్ట్యానూ పూర్తిగా అంచనా వేసింది.

తరువాతి ప్రశ్న: దరహంమీద తాత్కాలిక విప్లవ ప్రభుత్వంపట్ల శ్రామికవర్గ వైఖరి యేమిటి? మొట్టమొదట, తాత్కాలిక విప్లవ ప్రభుత్వం అవసరమనే విశ్వాసాన్ని కార్మిక వర్గంలో వ్యాప్తిచేయమని పార్టీకి సూటిగా సలహా యివ్వడం ద్వారా మహాసభ తీర్మానం దీనికి సమాధానం యిచ్చింది. కార్మికవర్గం యీ అవసరాన్ని గ్రహించేలా చెయ్యాలి. ''ప్రజాతంత్ర'' బూర్జువావర్గం జారిస్టు ప్రభుత్వాన్ని కూలదోసే సమస్యను పూర్వరంగంలో వుంచగా, మనం దానిని ముందుకు తెచ్చి, తాత్కాలిక విప్లవ ప్రభుత్వం అవసరమని పట్టు బట్టాలి. అంతేకాక, ప్రస్తుత కాలపు వస్తుగత చారిత్రక పరిస్థితులకూ, శ్రామికవర్గ ప్రజాతంత్ర లక్ష్యాలకూ అనుగుణంగా వుండే ఆచరణ కార్యక్రమాన్ని మనం అలాంటి ప్రభుత్వానికి రూపొందించాలి. యీ కార్యక్రమం మన పార్టీయొక్క యావత్తు కనీస కార్యక్రమం[78] — ఒకవైపున యిప్పుడున్న సామాజిక-ఆర్థిక సంబంధాల ప్రాతిపదికమీద పూర్తిగా సాధింపబడగలవీ, మరొకవైపున, తరువాతి ముందడుగుకు, సోషలిజంను సాధించడానికి, అవసరమైనవీ అయిన తక్షణ రాజకీయ, ఆర్థిక సంస్కరణల కార్యక్రమం.

యీవిధంగా, తీర్మానం తాత్కాలిక విప్లవ ప్రభుత్వపు స్వభావాన్నీ, ప్రయోజనాన్నీ స్పష్టంగా నిర్వచిస్తుంది. పుట్టుకలోనూ, మౌలిక స్వభావంలోనూ ఆ ప్రభుత్వం ప్రజా తిరుగుబాటుయొక్క అంగంగా వుండాలి. దాని లాంఛనగత ప్రయోజనం యావత్ప్రజా రాజ్యాంగ నిర్ణయసభను సమావేశపరచడంగా వుండాలి. దాని కార్యకలాపాల సారం శ్రామికవర్గ ప్రజాస్వామ్యపు కనీస కార్యక్రమాన్ని — నిరంకుశత్వంమీదా తిరుగుబాటు చేసిన ప్రజల ప్రయోజనాలను రక్షించగల యేకైక కార్యక్రమాన్ని — అమలుపరచడంగా వుండాలి.

తాత్కాలిక ప్రభుత్వం, తాత్కాలికమైనది మాత్రమే గనుక, యావత్తు ప్రజల ఆమోదాన్ని యింకా పొందని నిర్మాణాత్మక కార్యక్రమాన్ని అమలుపరచజాలదని వాదించ వచ్చు. ఆ వాదం ప్రగతి వ్యతిరేకుల, ''నిరంకుశవాదుల'' కూట తర్కంగా మాత్రమే వుంటుంది. నిర్మాణాత్మక కార్యక్రమాన్ని అమలుపరచకపోవడమంటే, లంచగొండి నిరంకుశత్వపు ఫ్యూడల్ వ్యవస్థ ఉనికిని సహించడ మన్నమాట. అలాంటి వ్యవస్థను విప్లవానికి ద్రోహులైనవాళ్ల ప్రభుత్వం మాత్రమే సహించగలదు గానీ, ప్రజా తిరుగుబాటుయొక్క

అంగమైన ప్రభుత్వం సహించజాలదు. రాజ్యాంగ నిర్ణయసభ సమావేశ స్వేచ్ఛను ధ్రువపరచక పోవచ్చుననే సాకుతో, రాజ్యాంగ నిర్ణయసభ ధ్రువపరిచిందాకా మనం ఆ స్వేచ్ఛను వినియోగించు కోకుండా వుండాలని యెవరైనా ప్రతిపాదించడం అపహాస్య మౌతుంది! అలాగే, తాత్కాలిక విప్లవ ప్రభుత్వం కనీస కార్యక్రమాన్ని వెంటనే అమలుపరచడానికి అభ్యంతర పెట్టడం కూడా అపహాస్య మౌతుంది.

కనీస కార్యక్రమపు అమలును తాత్కాలిక విప్లవ ప్రభుత్వపు కర్తవ్యంగా చేయడం ద్వారా, యీ తీర్మానం, గరిష్ఠ కార్యక్రమాన్ని తక్షణం అమలుపరచాలనీ, సోషలిస్టు విప్లవం కొరకు అధికారాన్ని గెలుచుకోవాలనీ అనే అసంబద్ధపు, అర్ధ అరాజకత్వపు భావాలను తొలగిస్తున్నదని చివరగా మనం గమనించాలి. రష్యా ఆర్థికాభివృద్ధి స్థాయీ (వస్తుగత పరిస్థితి), విశాల శ్రామికవర్గ జనాల వర్గచైతన్యంయొక్కా, సంఘటనయొక్కా స్థాయీ (వస్తుగత పరిస్థితితో విడదీయరాకుండా ముడివడిన వ్యక్తిపర పరిస్థితి) కార్మికవర్గంయొక్క తక్షణ, సంపూర్ణ విమోచనను అసాధ్యం చేస్తున్నాయి. అత్యంత అజ్ఞానులు మాత్రమే యిప్పుడు జరుగుతున్న ప్రజాతంత్ర విప్లవపు బూర్జువా స్వభావాన్ని చూడకుండా వుండ గలరు; అత్యంత అమాయక ఆశావాదులు మాత్రమే సోషలిజం లక్ష్యాలను గురించీ, దాన్ని సాధించే పద్ధతులను గురించీ యిప్పటికీ కార్మిక జనాలకు యెంత తక్కువగా తెలిసినదీ మరిచిపోగలరు. కార్మికుల విమోచనను కార్మికులే సాధించుకోవాలని మన కందరికీ విశ్వాసం వుంది; జనసామాన్యం వర్గచైతన్య పూరితులైతే తప్ప, యావత్తు బూర్జువావర్గంతో చేసే బహిరంగ వర్గ పోరాటంలో సంఘటితులై, తర్ఫీదూ, శిక్షణా పొందితే తప్ప, సోషలిస్టు విప్లవం అనే సమస్యే లేదు. మనం సోషలిస్టు విప్లవాన్ని వాయిదావేస్తున్నామనే అరాజక వాదుల ఆక్షేపణలకు సమాధానంగా మనం చెప్పేది యిది: మేము వాయిదావేయడం లేదు, ఒకేఒక సరైన మార్గంలో, అనగా ప్రజాతంత్ర రిపబ్లిక్ మార్గంలో, సాధ్యమైన ఒకేఒక పద్ధతిలో దానివైపు మేము మొదటి అడుగు వేస్తున్నాము. రాజకీయ ప్రజాస్వామ్య మార్గం ద్వారా తప్ప మరే యితర మార్గం ద్వారానైనా సోషలిజంను చేరుకోవాలని కోరేవాడెవడైనా ఆర్థికంగానూ, రాజకీయంగానూ అసంబద్ధమూ, ప్రగతి వ్యతిరేకమూ అయిన నిర్ధారణ లకు అనివార్యంగా వస్తాడు. మన మెందుకు ముందుకు పోయి మన గరిష్ఠ కార్యక్రమాన్ని అమలుపరచకూడదని తగిన సమయంలో కార్మికు లెవరైనా మనల్ని అడిగితే, ప్రజా స్వామ్యానికి అనుకూలంగా వున్న జనాలు యిప్పటికీ సోషలిజానికి యెంత దూరాన వున్నదీ, వర్గ వైరుధ్యాలు యిప్పటికీ యెంత అవికసితంగా వున్నదీ, కార్మికులు యిప్పటికీ యెంత అసంఘటితంగా వున్నదీ చూపిస్తాము. రష్యా అంతటా లక్షలాది కార్మికులను సంఘటిత పరచడానికి ప్రయత్నించండి! కోట్లమంది మన కార్యక్రమానికి సానుభూతి చూపేటట్లు

చేయడానికి ప్రయత్నించండి! అరాజకవాదుల ప్రగల్భపూరితమైన, శుష్కమైన మాటలకు పరిమితం కాకుండా మీరు యీ పని చేయడానికి ప్రయత్నించండి — యీ సంఘటనను సాధించడమూ, యీ సోషలిస్టు విజ్ఞానాన్ని వ్యాప్తిచేయడమూ ప్రజాతంత్ర పరివర్తనలను వీలైనంత పూర్తిగా సాధించడంమీద ఆధారపడతాయని మీరు వెంటనే గమనిస్తారు.

యీ విషయాన్నే కొనసాగిద్దాం. తాత్కాలిక విప్లవ ప్రభుత్వపు ప్రాముఖ్యమూ, దానిపట్ల కార్మికవర్గ వైఖరీ స్పష్టమైన వెంటనే, యీ ప్రశ్న ఉత్పన్నమౌతుంది: ఆ ప్రభుత్వంలో మనం పాల్గొనడం (పైనుండి చర్య) అనుమతించవచ్చునా, పాల్గొనవచ్చునంటే, యే పరిస్థితులలో? యేది కిందినుండి మన చర్యగా వుండాలి? యీ రెండు ప్రశ్నలకూ తీర్మానం కచ్చితమైన జవాబులు యిస్తుంది. సోషల్ డెమోక్రట్లు తాత్కాలిక విప్లవ ప్రభుత్వంలో (ప్రజాతంత్ర విప్లవ కాలంలో, రిపబ్లిక్ కొరకు పోరాటం జరిగే కాలంలో) పాల్గొనడాన్ని సూత్రరీత్యా అనుమతించవచ్చునని అది కంఠోక్తిగా ప్రకటిస్తుంది. యీ ప్రశ్నకు సూత్రరీత్యా వ్యతిరేకమైన జవాబు యిచ్చే అరాజకవాదులనుండీ, అలాంటి ప్రభుత్వంలో పాల్గొనడం మనకు అవసరమయ్యేటట్లు చేసే సన్నివేశం రావచ్చునని మనల్ని భయపెట్టడానికి ప్రయత్నించిన సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలో (మర్తీనావ్, కొత్త ''ఇస్క్రా''వాళ్లూ లాంటి) తోకవాదులనుండీ మనల్ని మనం యీ ప్రకటనద్వారా శాశ్వతంగా వేరుపరచుకున్నాం. తాత్కాలిక విప్లవ ప్రభుత్వంలో పాల్గొనడం మిలెరానిజంలో ఒక రకం అవుతుందనీ, బూర్జువా వ్యవస్థను పవిత్రపరచేదిగా అది సూత్రరీత్యా అనుమతించకూడనిదనీ, వగైరా అనే కొత్త ''ఇస్క్రా'' భావాన్ని యీ ప్రకటన ద్వారా రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ మూడవ మహాసభ తిరుగులేకుండా నిరాకరించింది.

కానీ, సూత్రరీత్యా అనుమతించడం అనే సమస్య ఆచరణరీత్యా ప్రయోజనకరమా అనే సమస్యను పరిష్కరించదు; యిది హేతు సమ్మతం. యీ కొత్త పోరాట రూపం — ''పైనుండి'' పోరాటం, పార్టీ మహాసభ గుర్తించినది — యే పరిస్థితుల్లో అవసరం? బలాబలాల తారతమ్యం, వగైరాలాంటి నిర్దిష్ట పరిస్థితులను గురించి ప్రస్తుతం మాట్లాడడం అసాధ్యమని చెప్పనక్కరలేదు; సహజంగానే తీర్మానం యీ పరిస్థితులను ముందుగా నిర్వచించదు. యీ విషయంమీద యే జోస్యమూ చెప్పడానికి తెలివిపరుడెవడూ ప్రస్తుతం సాహసించడు. మనం చేయగలదీ, చేయవలసిందీ యేమిటంటే, మన భాగస్వామ్యంయొక్క స్వభావాన్నీ, లక్ష్యాన్నీ నిర్ణయించడం. తీర్మానంలో చేయబడింది అదే. మనం యే ప్రయోజనాలకోసం పాల్గొంటామో ఆ రెంటినీ తీర్మానం సూచించింది: 1) విప్లవ ప్రతీఘాత ప్రయత్నాలమీద సడలని పోరాటం, 2) కార్మికవర్గంయొక్క స్వతంత్ర ప్రయోజనాల రక్షణ. విప్లవకర ప్రజలను భయపెట్టడానికీ, నిరంకుశత్వంపట్ల అణకువ ప్రదర్శించే

టట్లు వారిని పురికొల్పడానికి ఉదారవాద బూర్జువావర్గం ప్రగతి వ్యతిరేక మనస్తత్వం గురించి అంత ఉత్సాహంతో మాట్లాడడం ప్రారంభిస్తున్న సమయంలో (చూ: "ఒస్వొబొజ్దేనియె," నం. 71లో స్ట్రూవె రాసిన అత్యంత జ్ఞానదాయకమైన "బహిరంగ లేఖ"), కార్మికవర్గ పార్టీ విప్లవ ప్రతిఘాతంమీద నిజమైన యుద్ధం చేసే కర్తవ్యానికి దృష్టి నాకర్షించడం ప్రత్యేకంగా ఉచితం. అంతిమ పరిశీలనలో రాజకీయ స్వేచ్ఛా, వర్గ పోరాటమూ అనే బృహత్తర సమస్యలను బలం మాత్రమే పరిష్కరిస్తుంది; యీ బలాన్ని సిద్ధం చేయడమూ, సంఘటితం చేయడమూ ఆత్మరక్షణకే కాక, దాడికి కూడా క్రియాత్మకంగా ఉపయోగించడమూ మన పని. పారిస్ కమ్యూన్[79] రోజులనుండి దాదాపు అంతరాయం లేకుండా యూరప్‌లో రాజ్యంచేసిన దీర్ఘ రాజకీయ ప్రగతి వ్యతిరేకత "కింద నుండి" మాత్రమే ఆచరణ ప్రారంభం కాగలదనే భావానికీ, ఆత్మరక్షణ పోరాటాలను మాత్రమే చూడడానికీ మనల్ని మరీ యెక్కువగా అలవాటుపరచింది. నిస్సందేహంగా మనం యిప్పుడు కొత్త యుగంలో ప్రవేశించినాం – రాజకీయ ఉత్పతనాల, విప్లవాల దశ ప్రారంభమైంది. ప్రస్తుతం రష్యా దాటుతున్న దశ మాదిరి దశలో, మనం ఒకే మూసలో తయారైన పాత సూత్రాలకు పరిమితం కావడం అనుమతించరానిది. మనం పైనుండి చర్య అనే భావాన్ని ప్రచారం చేయాలి. అత్యంత చురుకైన దాడి చర్యకు సన్నద్ధం కావాలి, అలాంటి చర్యకు గల షరతులనూ, దాని రూపాలనూ అధ్యయనం చేయాలి. యీ షరతుల్లో రెండింటిని మహాసభ తీర్మానం ముందుకు తెచ్చింది: ఒకటి తాత్కాలిక విప్లవ ప్రభుత్వంలో సోషల్ డెమొక్రట్ల భాగస్వామ్యపు స్వరూపానికి సంబంధించినది (పార్టీ ప్రతినిధులమీద కఠినమైన పార్టీ అజమాయిషీ), మరొకటి ఆ భాగస్వామ్యపు స్వభావానికి సంబంధించినది (సంపూర్ణ సోషలిస్టు విప్లవాన్ని నిర్వహించే లక్ష్యాన్ని ఒక క్షణం కూడా కనుదప్పి పోనివ్వకుండా).

యీవిధంగా "పైనుండి" చర్యకు – యీ కొత్త, గతంలో దాదాపు యెప్పుడూ లేని పోరాట పద్ధతికి – సంబంధించిన పార్టీ విధానపు అన్ని పార్శ్వాలనూ తీర్మానం వివరించి, మనం పైనుండి ఆచరించజాలని సందర్భానికి కూడా యేర్పాట్లు చేసింది. యే సందర్భంలోనైనా మనం తాత్కాలిక విప్లవ ప్రభుత్వంమీద కిందనుండి ఒత్తిడి తేవాలి. కిందనుండి ఒత్తిడి తేగలగడానికి శ్రామికవర్గం సాయుధమై వుండాలి – యెందుకంటే, విప్లవ పరిస్థితిలో వ్యవహారాలు అసాధారణ వేగంతో బహిరంగ అంతర్యుద్ధ దశకు అభివృద్ధి చెందుతాయి – శ్రామికవర్గం సోషల్ డెమొక్రటిక్ పార్టీచేత నడిపించబడాలి. దాని సాయుధ ఒత్తిడియొక్క లక్ష్యం యేమిటంటే "విప్లవ లాభాలను రక్షించడమూ, దృఢపరచడమూ,

విస్తృతపరచడమూ''—అనగా, శ్రామికవర్గ ప్రయోజనాల దృష్ట్యా, మన కనీస కార్య క్రమాన్ని పరిపూర్తిచేసే లాభాలను.

దీనితో, తాత్కాలిక విప్లవ ప్రభుత్వం గురించి మూడవ మహాసభ చేసిన తీర్మానంమీద మన సంక్షిప్త పరిశీలనను ముగిస్తున్నాం. పాఠకుడు గమనించి వున్నట్లు, తీర్మానం యీ కొత్త సమస్య ప్రాముఖ్యాన్నీ, దానిపట్ల శ్రామికవర్గ పార్టీ వైఖరినీ, తాత్కాలిక విప్లవ ప్రభుత్వం లోపలా, బయటా పార్టీ అవలంబించవలసిన విధానాన్నీ వివరించింది.

యిక, యిదే సమస్యమీద ''కాన్ఫరెన్సు'' తీర్మానాన్ని పరిశీలిద్దాం.

## 3. ''జారిజంమీద విప్లవంయొక్క నిర్ణయాత్మక విజయం'' అంటే యేమిటి?

''కాన్ఫరెన్సు'' తీర్మానం ''అధికారాన్ని గెలుచుకోవడమూ, తాత్కాలిక విప్లవ ప్రభుత్వంలో పాల్గొనడమూ'' అనే సమస్యకు అంకితమైంది.* మేము యింతకు ముందే చెప్పినట్లు, సమస్యను ప్రదర్శించిన పద్ధతిలోనే గంద్రగోళం వుంది. ఒకవైపున, సమస్య సంకుచిత పద్ధతిలో ప్రదర్శింపబడింది: అది తాత్కాలిక ప్రభుత్వంలో మన భాగస్వామ్యాన్ని మాత్రమే చర్చిస్తుంది గానీ, దరహంమీద తాత్కాలిక ప్రభుత్వానికి సంబంధించి పార్టీ కర్తవ్యాలను చర్చించదు. మరొకవైపున, రెండు పూర్తిగా భిన్నమైన సమస్యల విషయంలో గంద్రగోళం జరిగింది; అవేమిటంటే, ప్రజాతంత్ర విప్లవంయొక్క ఒక దశలో మన భాగస్వామ్యం అనే సమస్యా, సోషలిస్టు విప్లవం అనే సమస్యా. నిజానికి, సోషల్ డెమొక్రటిక్ పార్టీ ''అధికారాన్ని గెలుచుకోవడం'' అంటే సరిగ్గా సోషలిస్టు విప్లవమే, ఆ మాటలను సూటి, మామూలు అర్థంలో ఉపయోగిస్తే దాని అర్థం మరేమీ కాజాలదు. కానీ, సోషలిస్టు విప్లవం కొరకు కాక, ప్రజాతంత్ర విప్లవం కొరకు అధికారాన్ని గెలుచుకోవడం అని మనం యీ పదాలను అర్థం చేసుకుంటే, అప్పుడు, తాత్కాలిక విప్లవ ప్రభుత్వంలో పాల్గొనడం గురించి మాత్రమే కాక, దరహంమీద ''అధికారాన్ని గెలుచుకోవడం'' గురించి కూడా మాట్లాడడంవల్ల లాభమేమిటి? ప్రజాతంత్ర విప్లవం గురించా, సోషలిస్టు విప్లవం గురించా, దేన్ని గురించి తాము మాట్లాడవలసిందీ మన ''కాన్ఫరెన్సు సభ్యులకు'' తమకే నిశ్చితంగా తెలియదని విదితమౌతున్నది. పేరుమోసిన తన ''రెండు నియంతృత్వాలు''లో

* యీ పుస్తకంలోని పేజీలు 400, 403–404, 407, 431, 433–434లో

కామ్రేడ్ మర్తీనొవ్ యీ గంద్రగోళాన్ని ప్రారంభించినాడని. యీ సమస్యకి సంబంధించిన సారస్వతాన్ని గమనించినవాళ్లకు తెలుసు; యీ తోకవాదపు నమూనా రచనలో (జనవరి 9కి ముందే కూడా) యీ సమస్య యెలా ప్రదర్శించబడిందీ జ్ఞాపకం చేసుకోడానికి కొత్త "ఇస్క్రా"వాళ్లు యిష్టపడడం లేదు. అయినప్పటికీ, అది కాన్ఫరెన్సుమీద సిద్ధాంత ప్రభావం నెరపిందనడంలో యేమీ సందేహం వుండజాలదు.

కానీ, తీర్మానం శీర్షిక గురించి యిది చాలు. తీర్మానంలోని విషయం దీనికంటె పోలి కేలేనంత గురుతరమైన, గంభీరమైన తప్పులను వెల్లడిస్తుంది. మొదటి భాగం యిది.

> "విజయవంతమైన ప్రజా తిరుగుబాటునుండి ఉత్పన్నమయ్యే తాత్కాలిక ప్రభుత్వాన్ని నెలకొల్పడం గానీ, లేక ప్రజలనుండి వచ్చే ప్రత్యక్ష విప్లవకర ఒత్తిడి మూలంగా యావత్ప్రజా రాజ్యాంగ నిర్ణయసభను నెలకొల్పడానికి నిర్ణయించే యేదో ఒక రకం ప్రాతినిధ్యపు సంస్థయొక్క విప్లవకర చొరవ గానీ జారిజంమీద విప్లవం యొక్క నిర్ణయాత్మక విజయానికి చిహ్నంగా వుండవచ్చు."

యీవిధంగా, జారిజంమీద విప్లవంయొక్క నిర్ణయాత్మక విజయానికి విజయవంతమైన తిరుగుబాటు గానీ, లేక... రాజ్యాంగ నిర్ణయసభను నెలకొల్పాలని ఒక ప్రాతినిధ్యపు సంస్థ చేసే నిర్ణయం గానీ చిహ్నంగా వుండవచ్చునని మనకు చెప్తున్నారు! యేమిటి దీని అర్థం? దీన్ని మనం యెలా అర్థం చేసుకోవాలి? నిర్ణయాత్మక విజయానికి రాజ్యాంగ నిర్ణయసభను నెలకొల్పాలనే "నిర్ణయం" చిహ్నంగా వుండవచ్చా?? అలాంటి "విజయమూ," "విజయవంతమైన ప్రజా తిరుగుబాటునుండి ఉత్పన్నమయ్యే" తాత్కాలిక ప్రభుత్వ స్థాపనా ఒకే ఫాయాలో పెట్టబడ్డాయి!! విజయవంతమైన ప్రజా తిరుగుబాటూ, తాత్కాలిక ప్రభుత్వాన్ని నెలకొల్పడమూ వాస్తవంలో జరిగిన విప్లవ విజయాన్ని సూచిస్తాయనీ, రాజ్యాంగ నిర్ణయసభను నెలకొల్పాలనే నిర్ణయం మాటల్లో మాత్రమే జరిగిన విప్లవ విజయాన్ని సూచిస్తాయనీ కాన్ఫరెన్సు గమనించలేదు.

ఉదారవాదులూ, "ఒస్వొబొజ్దేనియె"వాళ్లూ నిత్యం చేస్తున్న తప్పే కొత్త "ఇస్క్రా" మెన్షెవిక్కుల కాన్ఫరెన్సు చేసింది. "ఒస్వొబొజ్దేనియె"వాళ్లు "రాజ్యాంగ నిర్ణయ"సభను గురించి

యివ్వబడిన ఉల్లేఖనలతో పాఠకుడు తీర్మానపు పూర్తి పాఠాన్ని పునర్నిర్మించుకోవచ్చు. (1907 కూర్పుకు రచయిత వివరణ. యీ సంపుటంలో పేజీలు 275, 281–82, 287, 323, 327–28 చూడండి. – సం.)

వాగుతూ, బలమూ, అధికారమూ జారు చేతుల్లో నిలిచివుంటాయనే విషయాన్ని సిగ్గు పడుతూ గమనించకుండా, రాజ్యాంగ నిర్ణయసభను ''ఏర్పాటు చెయ్యాలంటే'' అలా చేసే బలం వుండాలనే విషయం మరచిపోతున్నారు. ప్రతినిధులు — వాళ్లు యెవరైనా సరే — చేసే ''నిర్ణయా''నికీ, ఆ నిర్ణయ పరిపూర్తికీ చాలా భేదం వుందనే విషయం కూడా కాన్ఫరెన్సు మరచిపోయింది. అధికారం జారు చేతుల్లో నిలిచివుండగా, యే ప్రతినిధులైనా సరే చేసే సకల నిర్ణయాలూ, 1848 జర్మన్ విప్లవ చరిత్రలో ప్రసిద్ధి కెక్కిన ఫ్రాంక్ ఫుర్ట్ పార్లమెంటు[80] ''నిర్ణయాల'' లాగ, దౌర్భాగ్యపు, వట్టి వాగుడుగా నిలిచిపోతాయనే విషయం కూడా కాన్ఫరెన్సు మరచిపోయింది. విప్లవ కార్మికవర్గ ప్రతినిధి అయిన మార్క్స్ తన "Neue Rheinische Zeitung"[81]లో ఫ్రాంక్ఫుర్ట్లోని ఉదారవాద ''ఒస్వొబొజ్దేనియె''వాళ్లను నిర్దాక్షిణ్యమైన వ్యంగ్యంతో అభిశంసించింది యెందుకంటే, సరిగ్గా, వాళ్లు గంభీరమైన మాటలు వల్లిస్తూ, రకరకాల ప్రజాతంత్ర ''నిర్ణయాలను'' చేప ట్టుతూ, రకరకాల స్వేచ్ఛలను ''రాజ్యాంగ నిర్ణయసభ''ను ''ఏర్పాటుచేస్తూ,'' వాస్తవంలో రాజు చేతుల్లో అధికారాన్ని వదలిపెట్టి, రాజు వశంలో వున్న సైనిక బలాలమీద సాయుధ పోరాటాన్ని యేర్పాటు చేయకుండా వుండినందుకు. ఫ్రాంక్ఫుర్ట్ ''ఒస్వొబొజ్దేనియె''వాళ్లు వాగుతుండగా, రాజు సమయం కొరకు వేచివుండి, తన సైనిక బలాలను దృఢపరచుకొన్నాడు, విప్లవ ప్రతిఘాతం నిజమైన బలంమీద ఆధారపడి ప్రజాతంత్రవాదులను, వాళ్ల ప్రశస్త మైన ''నిర్ణయాల''తో సహా, చిత్తుగా ఓడించింది.

విజయానికి అత్యవసరమైన షరతు దేనిలో లేదో దానినే కాన్ఫరెన్సు నిర్ణయాత్మక విజయంతో సమానంగా పెట్టింది. మన పార్టీయొక్క రిపబ్లికన్ కార్యక్రమాన్ని గుర్తించే సోషల్ డెమోక్రట్లు అలాంటి తప్పు చేయడం యెలా సాధ్యమైంది? యీ చిత్రమైన విషయాన్ని అర్థంచేసుకోడానికి, పార్టీనుండి విడిపోయిన భాగంమీద మూడవ మహాసభ చేసిన తీర్మానాన్ని చూడాలి.* యీ తీర్మానం మన పార్టీలో ''ఆర్థికవాదంతో పోలికలు గల'' వివిధ ధోరణులు వున్నాయనే విషయాన్ని ప్రస్తావిస్తున్నది. మన ''కాన్ఫరెన్సు సభ్యులు'' (వీళ్ల

---

*యీ తీర్మానాన్ని పూర్తిగా యిస్తున్నాం: '''ఆర్థికవాదం'తో పార్టీ పోరాటం చేసినప్పటినుండి, వివిధ ప్రమాణాల్లో, వివిధ విషయాల్లో 'ఆర్థికవాదం'తో పోలికలు గల ధోరణులు కొన్ని ఆర్.ఎస్.డి.ఎల్.పి.లో నిలిచివున్నాయి; అవి అన్నీ శ్రామికవర్గ పోరాటంలో వర్గచైతన్యపూరిత అంశాల ప్రాముఖ్యాన్ని కొంచెపరుస్తూ, దాన్ని సద్యోజనితత్వానికి లోబరచే ధోరణి ప్రదర్శిస్తున్నాయి. యీ ధోరణుల ప్రతినిధులు సంస్థానిర్మాణ సమస్యలమీద, సిద్ధాంత గతంగా, నియమబద్ధంగా చేసే పార్టీ పనితో సమన్వయం పొందని క్రమంగా సంస్థా

మర్తీనొవ్ సిద్ధాంత మార్గదర్శకత్వంకింద వుండడం యాదృచ్ఛికం కాదు), రాజకీయ పోరాటం గురించి, లేక యెనిమిది గంటల పనిదినం గురించి ''ఆర్థికవాదులు'' యేవిధంగా మాట్లాడినారో సరిగ్గా ఆవిధంగానే, విప్లవం గురించి మాట్లాడుతారు. ''ఆర్థికవాదులు'' వెంటనే ''దశల సిద్ధాంతాన్ని'' ముందుకు తెచ్చినారు: 1) హక్కుల కొరకు పోరాటం; 2) రాజకీయ ఆందోళన; 3) రాజకీయ పోరాటం; లేక, 1) పది గంటల పనిదినం; 2) తొమ్మిది గంటల పనిదినం; 3) యెనిమిది గంటల పనిదినం. యీ ''క్రమంగా యెత్తుగడల'' ఫలితాలు అందరికీ చాలా బాగా తెలుసు. యిప్పుడు, విప్లవాన్ని కూడా ప్రాథమికంగా, మట్ట సంగా యీ కింది దశలుగా విభజించడానికి మనం ఆహ్వానింపబడుతున్నాం: 1) జారు ప్రాతి నిధ్యపు సంస్థను సమావేశపరుస్తాడు; 2) యీ ప్రాతినిధ్య సంస్థ ''ప్రజల'' ఒత్తిడితో రాజ్యాంగ నిర్ణయసభను నెలకొల్పడానికి ''నిర్ణయిస్తుంది;'' 3) ... మూడవ దశను గురించి మెన్షెవిక్కులు తమలో తాము ఒక అంగీకారానికి రాలేదు; ప్రజల విప్లవకర ఒత్తిడిని జారి జంయొక్క విప్లవ ప్రతీఘాత ఒత్తిడి యెదుర్కొంటుందనీ, కనుక ''నిర్ణయం'' నెరవేర

---

నిర్మాణం అనే సూత్రాన్ని ప్రతిపాదిస్తున్నారు; ఆచరణలో వీళ్లు అనేక సందర్భాల్లో పార్టీ క్రమశిక్షణనుండి క్రమపద్ధతిగా వైదొలగుతూ, యితర సందర్భాల్లో, రష్యన్ జీవితపు వస్తుగత పరిస్థితులను పరిగణించకుండా, పార్టీలోని అత్యంత తక్కువ విజ్ఞాన ప్రబుద్ధమైన భాగానికి యెన్నిక సూత్రాన్ని విస్తృతంగా అమలుపరచాలనే భావాన్ని బోధిస్తూ, తద్వారా, పార్టీ సంబంధాలకు ప్రస్తుత సమయంలో సాధ్యమైన ఒకేఒక ప్రాతిపదికను బల హీనపరచడానికి ప్రయత్నిస్తున్నారు. యెత్తుగడల సమస్యల్లో వాళ్లు పార్టీ పని విస్తృతిని సంకుచితపరచే ప్రయత్నాన్ని వ్యక్తంచేస్తూ, ఉదారవాద బూర్జువా పార్టీలకు సంబంధించి పార్టీ పూర్తిగా స్వతంత్ర యెత్తుగడలు అవలంబించడానికి తమ వ్యతిరేకతను ప్రకటిస్తూ, మన పార్టీ ప్రజా తిరుగుబాటులో ఆర్గనైజర్ పాత్రను వహించడం సాధ్యమూ, వాంఛ నీయమూ అనే విషయాన్ని నిరాకరిస్తూ, యెట్టి పరిస్థితుల్లోనూ మన పార్టీ తాత్కాలిక ప్రజాతంత్ర విప్లవ ప్రభుత్వంలో పాల్గొనడాన్ని వ్యతిరేకిస్తున్నారు.

''విప్లవ సోషల్ డెమొక్రటిక్ పార్టీ సూత్రాలనుండి అలాంటి పాక్షిక పెడమార్గాలతో ప్రతి చోటా చురుకైన సిద్ధాంత పోరాటం సాగించాలని మహాసభ పార్టీ సభ్యుల నందరినీ ఆదే శిస్తున్నది; కానీ, అదే సమయంలో, యే ప్రమాణంలో నైనా అలాంటి అభిప్రాయాలు కలిగివున్నవాళ్లు, పార్టీ మహాసభలనూ, పార్టీ నిబంధనావళినీ గుర్తించి, పార్టీ క్రమశిక్షణకు పూర్తిగా లోబడే అనుల్లంఘనీయమైన షరతుమీద, పార్టీ శాఖలలో వుండవచ్చు.'' (1907 కూర్పుకు రచయిత వివరణ. — సం.)

కుండానైనా నిలిచిపోతుంది, లేదా చివరకు సమస్య ప్రజా తిరుగుబాటుయొక్క గెలుపుచేతనో, ఓటమిచేతనో నిర్ణయింపబడుతుందన్న విషయాన్ని వాళ్లు మరచిపోయారు. కాన్ఫరెన్సు తీర్మానం "ఆర్థికవాదుల" తర్కానికి నకలు తయారు చేస్తుంది: యెనిమిది గంటల పనిదినాన్ని విప్లవకర పద్ధతిలో సాధించడం గానీ, లేదా పది గంటల పనిదినాన్ని మంజూరు చెయ్యడం గానీ తొమ్మిది గంటల పనిదినానికి మారాలనే "నిర్ణయం" చేయడం గానీ కార్మికుల నిర్ణయాత్మక విజయానికి చిహ్నంగా వుండవచ్చు.... అది అంత మాత్రమే.

తిరుగుబాటు విజయాన్నీ, జారు సమావేశపరచిన ప్రాతినిధ్యపు సంస్థ "నిర్ణయాన్నీ" సమానంగా పెట్టాలని తీర్మానం రచయితలు ఉద్దేశించలేదనీ, వాళ్లు కేవలం రెండు సందర్భాలకూ పార్టీ యెత్తుగడలను సిద్ధం చేయదలచుకొన్నారనీ మనకు అభ్యంతరం చెప్పవచ్చు. దీనికి మా సమాధానం యిది: 1) తీర్మాన పాఠం ప్రాతినిధ్యపు సంస్థ నిర్ణయాన్ని "జారిజంమీద విప్లవంయొక్క నిర్ణయాత్మక విజయం" అని స్పష్టంగా, అసందిగ్ధంగా వర్ణిస్తుంది. బహుశా అది అజాగ్రత్తగా వాడిన మాటల ఫలితం కావచ్చు; బహుశా, మినిట్స్ చూసి, దానిని సవరించవచ్చు, కానీ, సవరించిందాకా, యిప్పుడున్న మాటలకు ఒక అర్థం మాత్రమే వుండగలదు, ఆ అర్థం "ఒస్వాబొజ్దేనియె" ధోరణికి పూర్తి అనుగుణంగా వుంది. 2) తీర్మానం రచయితలు యే వాదంలోకి జారిపడినారో ఆ "ఒస్వాబొజ్దేనియె" రకం ధోరణి కొత్త "ఇస్క్రా"వాళ్ల యితర రచనల్లో యింకా స్పష్టంగా వుంది. ఉదాహరణకు, తిఫ్లిస్ కమిటీ పత్రిక "సోత్సియాల్ డెమోక్రట్"[82] (జార్జియన్ భాషలో ప్రచురింపబడేది; "ఇస్క్రా" నం. 100 చేత ప్రశంసింపబడింది), "జేమ్‌స్కీ సొబోర్,[83] మన యెత్తుగడలూ" అనే వ్యాసంలో "జేమ్‌స్కీ సొబోర్‌ను మన ఆచరణ కేంద్రంగా చేయగల" "యెత్తుగడలు" (జేమ్‌స్కీ సొబోర్‌ను సమావేశపరచడం గురించి యింతవరకు నిశ్చితంగా యేమీ తెలియదు!) సాయుధ తిరుగుబాటూ, తాత్కాలిక విప్లవ ప్రభుత్వాన్ని నెలకొల్పడమూ అనే "యెత్తుగడల"కంటె "మనకు యెక్కువ అనుకూలం" అనేటంత వరకు పోయింది. తరువాత యీ వ్యాసాన్ని మళ్లీ ప్రస్తావిస్తాం. 3) యిటు విప్లవం గెలిచిన సందర్భంలోనూ, అటు అది ఓడిన సందర్భంలోనూ, యిటు విజయవంతమైన తిరుగుబాటు సందర్భంలోనూ, అటు తిరుగుబాటు గురుతరమైన శక్తిగా అభివృద్ధి కాని సందర్భంలోనూ పార్టీ అవలంబించవలసిన యెత్తుగడల ప్రాథమిక చర్చకు యే అభ్యంతరమూ వుండజాలదు. ఉదారవాద బూర్జువావర్గంతో ఒప్పందం కుదుర్చుకోడానికి జారిస్టు ప్రభుత్వం ప్రాతినిధ్యపు సభను సమావేశపరచడంలో కృతకృత్యం కావడం సంభవమే. అలాంటి సందర్భాన్ని ఊహించుకొని, మూడవ మహాసభ తీర్మానం "వంచనా విధానం" గురించీ, "కుహనా ప్రజాస్వామ్యం" గురించీ, "జేమ్‌స్కీ సొబోర్ అనబడేదానిలాంటి అపహాస్యకరమైన ప్రజా

ప్రాతినిధ్యం'' గురించి స్పష్టంగా చెపుతుంది.* కానీ, అసలు సంగతి యేమిటంటే, యిది తాత్కాలిక విప్లవ ప్రభుత్వంమీద చేసిన తీర్మానంలో చెప్పబడలేదు; యెందుకంటే, దీనికి తాత్కాలిక విప్లవ ప్రభుత్వంతో యేమీ సంబంధం లేదు. యీ సందర్భం తిరుగుబాటూ, తాత్కాలిక విప్లవ ప్రభుత్వ స్థాపనా అనే సమస్యను వాయిదా వేస్తుంది; యిది సమస్యను మారుస్తుంది, వగైరా. రకరకాల సమ్మేళనాలు సాధ్యమనేది, లేదా జయమూ, అపజయమూ రెండూ సాధ్యమనేది, లేదా సూటి మార్గాలూ, చుట్టు మార్గాలూ వుండవచ్చుననేది యీనాడు వివాద విషయం కాదు; అసలు విషయం యేమిటంటే, నిజమైన విప్లవ మార్గం యేది అనేదాన్ని గురించి కార్మికుల మనస్సులలో గంద్రగోళం సృష్టించడం సోషల్ డెమోక్రట్ చేయకూడని పని అనేది; విజయానికి ప్రధాన షరతు లేనిదాన్ని, ''ఒస్వాబొజ్దేనియె'' చేస్తున్నట్లు, నిర్ణయాత్మక విజయంగా వర్ణించడం చేయరాని పని అనేది. మనం యెనిమిది గంటల పనిదినాన్ని గెలుచుకోవడం కూడా సంభవమే, ఒక్క దెబ్బతో కాదు గానీ, దీర్ఘమైన చుట్టు మార్గంలో; కానీ, అలాంటి నిర్వీర్యతను — వాయిదాలు వేయడాన్నీ, ఆలస్యాలనూ, బేరాలనూ, ద్రోహాన్నీ, ప్రగతి వ్యతిరేకతనూ అరికట్టడానికి శ్రామికవర్గాన్ని

---

* విప్లవ ప్రాంగణంలో ప్రభుత్వపు యెత్తుగడలపట్ల వైఖరిమీద వున్న యీ తీర్మాన పాఠం యిది:

''ప్రస్తుత విప్లవ దశలో ప్రభుత్వం ఆత్మరక్షణార్థం ఒకవైపున ప్రధానంగా కార్మిక వర్గంలోని వర్గచైతన్యపూరిత అంశాలమీద లక్షింపబడిన మామూలు దమన చర్యల్ని తీవ్రతరం చేస్తూ, అదే సమయంలో 1) రాయితీలు యివ్వడం ద్వారా, సంస్కరణల వాగ్దానాల ద్వారా కార్మికవర్గాన్ని రాజకీయంగా కలుషితం చేయడానికీ, తద్వారా దాన్ని విప్లవ పోరాటం నుండి పక్కకు మళ్లించడానికీ ప్రయత్నిస్తుంది; 2) అదే లక్ష్యంతో, కమిషన్లకూ, కాన్ఫరెన్సులకూ తమ ప్రతినిధులను యెన్నుకోడానికి కార్మికులను ఆహ్వానించడం మొదలుకొని, జేమ్‌స్కీ సొబోర్ అనబడేదానిలాంటి అపహాస్యకరమైన ప్రజా ప్రాతినిధ్యాన్ని నెలకొల్పడందాకా గల కుహనా ప్రజాస్వామ్య రూపాల్లో తన రాయితీల కపట విధానాన్ని అలంకరిస్తుంది; 3) నల్ల నూర్లు[84] అనబడేవాళ్లను సంఘటితపరుస్తుంది, దరహంమీద ప్రజలలో ప్రగతి వ్యతిరేకులనూ, అజ్ఞానులనూ, జాతి, మత ద్వేషంతో కండ్లు కానని వాళ్ల నందరినీ విప్లవానికి వ్యతిరేకంగా రెచ్చగొడుతుంది; కనుక,

''యీకింది పనులు చేయాలని పార్టీ శాఖల నన్నిటినీ ఉద్బోధిస్తూ ఆర్.ఎస్.డి.ఎల్.పి. మూడవ మహాసభ తీర్మానిస్తున్నది:

అసమర్థం చేసే బలహీనతను — కార్మికులకు విజయంగా వర్ణించేవాణ్ని యేమనాలి? రష్యన్ విప్లవం, ఒకప్పుడు ''వ్పెర్యోద్''* అన్నట్లు, ''గర్భస్రావ ప్రాయమైన రాజ్యాంగం''తో ముగియడం సంభవమే; కానీ, యిది నిర్ణయాత్మకమైన పోరాటానికి సరిగా ముందు ఒక సోషల్ డెమోక్రట్ యీ గర్భస్రావాన్ని ''జారిజంమీద నిర్ణయాత్మక విజయం'' అనడాన్ని సహేతుకమనిపించగలదా? కీడులో కెల్ల కీడు జరిగితే, మనం రిపబ్లిక్‌ను గెలుచుకోకపోవడమే కాక, రాజ్యాంగం కూడా యెండమావిగా, ''షీపొవ్'' రకం రాజ్యాంగంగా[85] వుండడం సంభవమే; కానీ, ఒక సోషల్ డెమోక్రట్ మన రిపబ్లికన్ నినాదాన్ని నీళ్ల గార్చడం క్షంతవ్యమా?

నిజమే, కొత్త ''ఇస్క్రా''వాళ్లు యింతవరకు దానిని నీళ్లు గార్చేటంతవరకు పోలేదు. కానీ, యేమేరకు విప్లవతత్వం వాళ్లను విసర్జించిందీ, యేమేరకు నిర్జీవ దుష్పాండిత్యం ప్రస్తుత సమరశీల కర్తవ్యాలను చూడకుండా గుడ్డివాళ్లనుగా చేసిందీ వాళ్లు తమ తీర్మానంలో, అన్ని వుండగా, రిపబ్లిక్‌ను గురించి ఒక్క మాట అయినా చెప్పడం మరచిపోవడమే అత్యంత స్పష్టంగా వ్యక్తం చేస్తుంది. యిది నమ్మశక్యం కానిది, కానీ వాస్తవం. కాన్ఫరెన్సుయొక్క వివిధ తీర్మానాల్లో సోషల్ డెమోక్రటిక్ పార్టీ నినాదాలన్నీ ఆమోదించబడి,

---

అ) ప్రభుత్వం యిచ్చే రాయితీల ప్రగతి వ్యతిరేక ఉద్దేశాలను బట్టబయలు చేస్తూ, పార్టీ శాఖలు తమ ప్రచారంలోనూ, ఆందోళనలోనూ, ఒకవైపున, యీ రాయితీలు బలవంతంగా గుంజుకోబడినాయనీ, మరొకవైపున, శ్రామికవర్గానికి తృప్తికరమైన సంస్కరణలు చేయడం నిరంకుశత్వానికి పరమ అసాధ్యమనీ నొక్కిచెప్పాలి;

ఆ) యెన్నికల ప్రచారాన్ని వినియోగించుకొని పార్టీ శాఖలు కార్మికులకు ప్రభుత్వ చర్యల నిజమైన ప్రాముఖ్యాన్ని వివరించి, సార్వజనీన, సమాన వోటు హక్కూ, ప్రత్యక్ష యెన్నికలూ, రహస్య వోటింగూ అనే ప్రాతిపదికమీద విప్లవ పద్ధతుల ద్వారా రాజ్యాంగ నిర్ణయ సభను సమావేశపరచడం శ్రామికవర్గానికి అవసరమని చూపించాలి;

ఇ) యెనిమిది గంటల పనిదినాన్నీ, కార్మికవర్గంయొక్క యితర తక్షణ డిమాండ్లనూ విప్లవ పద్ధతిలో వెంటనే సాధించడానికి శ్రామికవర్గాన్ని సంఘటితపరచాలి;

ఈ) ప్రత్యేకంగా నల్ల నూర్ల చర్యలకూ, దరహంమీద ప్రభుత్వ నాయకత్వంకింద వున్న సకల ప్రగతి వ్యతిరేక శక్తులకూ సాయుధ ప్రతిఘటనను యేర్పాటుచేయాలి.'' (1907 కూర్పుకు రచయిత వివరణ. — సం.)

* జెనీవాలో ప్రచురింపబడిన వార్తాపత్రిక ''వ్పెర్యోద్'' 1905 జనవరినుండి పార్టీలోని బోల్షివిక్ విభాగపు పత్రికగా రావడం ప్రారంభమైంది. జనవరినుండి మే వరకు పద్దె

పునశ్చరణ చేయబడి, వివరించబడి, సవివరంగా విపులీకరించబడ్డాయి — కార్మికులు షాప్ స్టీవర్డులనూ, ప్రతినిధులనూ యెన్నుకునే విషయం కూడా విస్మరింపబడలేదు, కానీ తాత్కాలిక విప్లవ ప్రభుత్వంమీద తీర్మానంలో వాళ్లకు రిపబ్లిక్‌ను ప్రస్తావించే వీలే చిక్కలేదు. ప్రజల తిరుగుబాటు ''విజయం'' గురించీ, తాత్కాలిక ప్రభుత్వాన్ని నెలకొల్పడం గురించీ, యీ ''చర్యల''కూ, పనులకూ రిపబ్లిక్‌ను గెలుచుకోవడంతో యేమి సంబంధం వున్నదీ సూచించకుండా మాట్లాడడమంటే, శ్రామికవర్గ పోరాటానికి మార్గదర్శకత్వం యిచ్చే ఉద్దేశంతో కాక, శ్రామికవర్గ ఉద్యమం తోక పుచ్చుకు పోయే ఉద్దేశంతో తీర్మానం రాయడానికి సమానం.

సారాంశం యేమిటంటే: తీర్మానం మొదటి భాగం: 1) రిపబ్లిక్ కొరకు జరిగే పోరాటం దృష్ట్యానూ, నిజంగా యావత్ప్రజా ప్రాతినిధ్యం కలిగిన, నికరమైన రాజ్యాంగ నిర్ణయసభను సాధించుకునే దృష్ట్యానూ తాత్కాలిక విప్లవ ప్రభుత్వంయొక్క ప్రాముఖ్యాన్ని యే మాత్రమూ వివరించలేదు; 2) జారిజంమీద విప్లవంయొక్క నిర్ణయాత్మక విజయాన్నీ, సరిగ్గా నిజమైన విజయానికి ప్రధానమైన షరతు లేనట్టి పరిస్థితినీ ఒకే గాటన కట్టడం ద్వారా శ్రామికవర్గపు ప్రజాతంత్ర చైతన్యం గురించి బాగా తికమకపడింది.

## 4. రాజరికం రద్దు, రిపబ్లిక్ స్థాపన

యిక తీర్మానంలోని తరువాతి భాగానికి పోదాం:

> ''...రెండింట్లో యే ఒక సందర్భంలోనైనా అలాంటి విజయం విప్లవ యుగంలో నూతన దశను ప్రారంభిస్తుంది.
>
> ''తమ సాంఘిక ప్రయోజనాలు తీరడం కొరకూ, అధికారాన్ని ప్రత్యక్షంగా వశం చేసుకోవడం కొరకూ రాజకీయంగా విమోచన చెందిన బూర్జువా సమాజంలోని అంశాల మధ్య జరిగే పరస్పర పోరాట క్రమంలో మొత్తం రాజరిక వ్యవస్థా,

---

నిమిది సంచికలు వెలువడ్డాయి. మేలో, రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ మూడవ మహాసభ నిర్ణయం ద్వారా, ''వ్పెర్యోద్''కు బదులు ''ప్రొలెతారియ్'' ఆర్.ఎస్.డి.ఎల్.పి. కేంద్ర పత్రిక అయింది. (యీ మహాసభ లండన్‌లో మేలో జరిగింది; మెన్షెవిక్కులు దానికి హాజరు కాకుండా, జెనీవాలో తమ సొంత కాన్ఫరెన్సు యేర్పాటు చేసుకున్నారు.) (1907 కూర్పుకు రచయిత వివరణ. — సం.)

సాంఘిక అంతస్తులూ అంతిమంగా రద్దుకావడం — యిది సమాజాభివృద్ధియొక్క వస్తుగత పరిస్థితులు సద్యోజనితంగా ఉత్పన్నంచేసే యీ నూతన దశలోని కర్తవ్యం.

''కనుక, చారిత్రకంగా బూర్జువా స్వభావం కలిగిన యీ విప్లవ కర్తవ్యాలను నిర్వహించడానికి పూనుకునే తాత్కాలిక ప్రభుత్వం, విమోచన క్రమంలో జాతిలోని విరుద్ధ వర్గాల మధ్య జరిగే పరస్పర పోరాటాన్ని క్రమబద్ధం చెయ్యడంలో, విప్లవ కర అభివృద్ధిని ముందుకు తీసుకపోవడం మాత్రమే కాక, ఆ అభివృద్ధిలో పెట్టుబడిదారీ వ్యవస్థ పునాదులకు ప్రమాదకరంగా వుండే అంశాలతో పోరాటం కూడా చేయవలసి వుంటుంది.''

తీర్మానంలో ఒక స్వతంత్ర భాగంగా వున్న యీ భాగాన్ని పరిశీలిద్దాం. పైన ఉల్లేఖించిన వాదాలలోని మౌలిక భావం మహాసభ తీర్మానపు మూడవ నిబంధనలో వున్న భావంతో ఏకీభవిస్తుంది. కానీ, తీర్మానాల్లోని యీ భాగాలను తైపారు చేస్తే, వాటిమధ్య యీకింది తీవ్రమైన భేదం వున్నట్లు వెంటనే వెల్లడి అవుతుంది. విప్లవంయొక్క సాంఘిక, ఆర్థిక ప్రాతిపదికను సంక్షేపంగా వర్ణించిన మహాసభ తీర్మానం నిశ్చితమైన లాభాల కొరకు వర్గాల మధ్య జరిగే స్పష్టమైన పోరాటంమీద పూర్తిగా శ్రద్ధను కేంద్రీకరించి, శ్రామికవర్గపు సమరశీల కర్తవ్యాలను అగ్రస్థానంలో వుంచుతుంది. విప్లవపు సాంఘిక, ఆర్థిక ప్రాతిపదికను గురించి దీర్ఘమైన, అస్పష్టమైన, గందరగోళపు వర్ణన యిచ్చే కాన్ఫరెన్సు తీర్మానం నిశ్చితమైన లాభాల కొరకు జరిగే పోరాటం గురించి చాలా అస్పష్టంగా మాట్లాడి, శ్రామిక వర్గపు సమరశీల కర్తవ్యాలను పూర్తిగా పూర్వరంగంలో వదిలేస్తుంది. కాన్ఫరెన్సు తీర్మానం సమాజంలోని వివిధ శక్తుల మధ్య జరిగే పరస్పర పోరాట ప్రక్రియలో పాత వ్యవస్థ రద్దును గురించి చెపుతుంది. శ్రామికవర్గ పార్టీ అయిన మనం యీ రద్దును నిర్వహించాలనీ, ప్రజాతంత్ర రిపబ్లిక్ స్థాపన మాత్రమే పాత వ్యవస్థ నిజంగా రద్దయినట్లు సూచిస్తుందనీ, ఆ రిపబ్లిక్‌ను మనం గెలుచుకోవాలనీ, మనం దాని కొరకూ, సంపూర్ణ స్వేచ్ఛ కొరకూ నిరంకుశత్వంతోనే కాక, బూర్జువావర్గం మన లాభాలను మననుండి లాక్కోడానికి ప్రయత్నించినప్పుడు (అది తప్పకుండా ప్రయత్నిస్తుంది కూడా) దానితో కూడా పోరాడుతామనీ మహాసభ తీర్మానం చెపుతుంది. మహాసభ తీర్మానం కచ్చితంగా నిర్దేశించుకున్న తక్షణ లక్ష్యం కొరకు పోరాటం చేయాలని ఒక నిర్దిష్ట వర్గానికి పిలుపు యిస్తుంది. కాన్ఫరెన్సు తీర్మానం వివిధ శక్తుల మధ్య పరస్పర పోరాటం గురించి మాట్లాడుతుంది. మన తీర్మానం క్రియాత్మక పోరాటపు మనస్తత్వాన్ని వ్యక్తం చేస్తుంది, వాళ్ల తీర్మానం నిష్క్రియాత్మక సాక్షి మనస్తత్వాన్ని వ్యక్తం చేస్తుంది; మన తీర్మానం సజీవమైన ఆచరణ కొరకు చేసే విజ్ఞప్తితో

కూడి వుంది, వాళ్లది నిర్జీవపు దుష్పాండిత్యంతో నిండివుంది. ప్రస్తుత విప్లవం మన మొదటి చర్య మాత్రమే అనీ, దీని తర్వాత రెండవది వస్తుందనీ రెండు తీర్మానాలూ ప్రకటిస్తాయి; కానీ, మనం మరింత తొందరగా మొదటి చర్య తీసుకోవాలనీ, మరింత త్వరగా దానిని ముగించాలనీ, రిపబ్లిక్‌ను గెలుచుకోవాలనీ, విప్లవ ప్రతీఘాతాన్ని నిర్దాక్షిణ్యంగా నలిపివేయాలనీ, రెండవ చర్యకు భూమిక సిద్ధం చేయాలనీ ఒక తీర్మానం దీనినుండి నిర్ణయం లాగుతుంది. కానీ మరొక తీర్మానం మొదటి చర్యను గురించి శబ్దాడంబర వర్ణనలు ఓడుస్తూ (యీ మొరటు నుడికారాన్ని క్షమించండి) దానిని కేవలం నమలుతుంది. మహాసభ తీర్మానం పాతవే, అయినా నిత్య నూతనమైన మార్క్సిజపు భావాలను (ప్రజాతంత్ర విప్లవంయొక్క బూర్జువా స్వభావం గురించి), ఉపోద్ఘాతంగా, లేదా ప్రథమ ప్రాతిపదికగా తీసుకొని, దానినుండి, ప్రజాతంత్ర విప్లవం కొరకూ, సోషలిస్టు విప్లవం కొరకూ పోరాడే ప్రగతిశీల వర్గపు ప్రగతిశీల కర్తవ్యాలను గురించి నిర్ణయాలు లాగుతుంది. కాన్ఫరెన్సు తీర్మానం ఉపోద్ఘాతాన్ని దాటిపోకుండా, దానిని మళ్లీ మళ్లీ నమలుతూ, అతి తెలివి ప్రదర్శిస్తుంది.

చాలా కాలంనుండి రష్యన్ మార్క్సిస్టులను రెండు పక్షాలుగా విభజించిన భేదం సరిగ్గా యిదే: చట్టబద్ధ మార్క్సిజం[86] నాటి పాత రోజుల్లో నీతిబోధల పక్షంగానూ, సమరశీల పక్షంగానూ, అప్పుడప్పుడే తలెత్తుతూన్న ప్రజా ఉద్యమ కాలంలో ఆర్థిక పక్షంగానూ, రాజకీయ పక్షంగానూ. దరహంమీద వర్గపోరాటంయొక్కా, ప్రత్యేకంగా రాజకీయ పోరాటంయొక్కా లోతైన ఆర్థిక మూలాలకు సంబంధించిన సరైన మార్క్సిస్టు ప్రాతిపదికనుండి "ఆర్థికవాదులు" చిత్రమైన నిర్ణయం లాగినారు — మనం రాజకీయ పోరాటానికి పెడముఖం పెట్టాలనీ, దాని అభివృద్ధిని మందగింపజేయాలనీ, దాని విస్తృతిని సంకుచితపరచాలనీ, దాని లక్ష్యాలను తగ్గించాలనీ. తద్వ్యతిరేకంగా, రాజకీయవేత్తలు అవే ప్రాతిపదికలనుండి భిన్నమైన నిర్ణయాలు లాగినారు — మన ప్రస్తుత పోరాటపు మూలాలు మరింత లోతుగా వుండే కొద్దీ, యీ పోరాటాన్ని మనం మరింత విస్తృతంగా, మరింత ధైర్యంగా, మరింత కృతనిశ్చయంతో, మరింత చొరవతో చేయాలని. యిప్పుడు మన యెదుట అదే వివాదం, భిన్న పరిస్థితుల్లోనూ, భిన్న రూపంలోనూ వుంది. ప్రజాతంత్ర విప్లవం సోషలిస్టు విప్లవంకంటె చాలా భిన్నమైనదనీ, దానిలో "ఆసక్తి" గలవాళ్లు యేవిధంగానూ బీదలు మాత్రమే కాదనీ, యావత్తు బూర్జువా సమాజంయొక్క దుర్నివార్యమైన అవసరాలలో అది గాఢంగా వేర్లు పాతుకొనివుందనీ అనే ప్రాతిపదికలనుండి, పురోగామి వర్గం తన ప్రజాతంత్ర లక్ష్యాలను మరింత ధైర్యంగా రూపొందించాలనీ, వాటిని మరింత తీవ్రంగా, సంపూర్ణంగా వ్యక్తం చేయాలనీ, రిపబ్లిక్ అనే తక్షణ నినాదం యివ్వాలనీ, తాత్కాలిక విప్లవ ప్రభుత్వం

నెలకొల్పడమూ, విప్లవ ప్రతీఘాతాన్ని నిర్దాక్షిణ్యంగా నలిపివేయడమూ అవసరమనే భావాన్ని ప్రజలలో వ్యాప్తిచేయాలనీ అనే నిర్ణయం మనం లాగుతున్నాము. కానీ, మన వ్యతిరేకులైన కొత్త ''ఇస్క్రా''వాళ్లు యివే ప్రాతిపదికలనుండి యే నిర్ణయాలు లాగుతున్నారంటే, ప్రజాతంత్ర నిర్ణయాలను పూర్తిగా వ్యక్తంచేయకూడదనీ, ఆచరణాత్మక నినాదాలనుండి రిపబ్లిక్‌ను వదలేయవచ్చుననీ, తాత్కాలిక విప్లవ ప్రభుత్వం అవసరమనే భావాన్ని ప్రజల్లో మనం వ్యాప్తిచేయకుండా వుండవచ్చుననీ, రాజ్యాంగ నిర్ణయసభను సమావేశపరచాలనే కేవల నిర్ణయాన్ని నిర్ణయాత్మక విజయం అనవచ్చుననీ, విప్లవ ప్రతిఘాతంతో పోరాడే కర్తవ్యాన్ని మన క్రియాత్మక కర్తవ్యంగా మనం ప్రతిపాదించ నక్కరలేదనీ — దీని ఫలితంగా, అది ''పరస్పర పోరాట క్రమం''కు చేసే అస్పష్టమైన (మనం త్వరలో చూడబోయే టట్లు, తప్పగా సూత్రీకరింపబడిన) ప్రస్తావనలో మునిగిపోతుంది. యీ భాష రాజకీయ నాయకులది కాదు, చారిత్రక పత్రాగారాల గుమాస్తాల భాష!

కొత్త ''ఇస్క్రా''వాళ్ల తీర్మానంలోని వివిధ సూత్రీకరణలను మరింత సన్నిహితంగా పరీక్షించేకొద్దీ, దాని పూర్వోక్త మౌలిక లక్షణాలు మరింత స్పష్టమౌతాయి. ఉదాహరణకు, ''రాజకీయంగా విమోచన చెందిన బూర్జువా సమాజంలోని శక్తులమధ్య జరిగే పరస్పర పోరాట క్రమం'' గురించి అది చెపుతుంది. యీ తీర్మానం చర్చించే విషయాన్ని (తాత్కాలిక విప్లవ ప్రభుత్వాన్ని) మనసులో పెట్టుకొని, యెవరైనా ఆశ్చర్యంతో యిలా అడుగుతారు: ''మీరు పరస్పర పోరాట క్రమాన్ని ప్రస్తావిస్తుంటే, బూర్జువా సమాజాన్ని రాజకీయంగా బానిసత్వంలో వుంచే శక్తులను గురించి మీరు మౌనంగా యెలా వుండగలరు? 'కాన్ఫరెన్సు సభ్యులు' విప్లవం విజయవంత మౌతుందని అనుకున్నారు గనుక, యీ శక్తులు అప్పటికే అదృశ్యమై వుంటాయని వాళ్లు నిజంగా ఊహిస్తున్నారా?'' అలాంటి భావం దరహంమీద అసంబద్ధంగానూ, ప్రత్యేకంగా మహత్తరమైన రాజకీయ అమాయకత్వంయొక్క, రాజకీయ హ్రస్వదృష్టియొక్క వ్యక్తీకరణగానూ వుంటుంది. విప్లవ ప్రతీఘాతంమీద విప్లవం గెలిచిన తర్వాత, మొదటిది అదృశ్యం కాదు; తద్వ్యతిరేకంగా, అది కొత్త పోరాటాన్ని, మరింత భీషణం కూడా అయినదాన్ని అనివార్యంగా ప్రారంభిస్తుంది. విప్లవం విజయవంతమైనప్పుడు మనల్ని యెదుర్కొనే కర్తవ్యాలను పరిశీలించడం మన తీర్మానపు ఉద్దేశం గనుక, విప్లవ ప్రతీఘాత దాడులను తిప్పికొట్టే కర్తవ్యాలకు (మహాసభ తీర్మానంలో చేసినట్లు) ప్రచండమైన శ్రద్ధను అర్పించడం మన విధి — ప్రస్తుత విప్లవ దశ తర్వాత యేమి జరుగుతుంది అనే దానిమీద, లేదా ''రాజకీయంగా విమోచన చెందిన సమాజం'' అప్పటికే యేర్పడివున్నప్పుడు యేమి జరుగుతుంది అనేదానిమీద చేసే సాధారణ చర్చలలో సమరశీల పార్టీయొక్క యీ తక్షణ, జరూరు, ముఖ్య రాజకీయ కర్తవ్యాలను ముంచివేయడం

కాదు. రాజకీయాలు ఆర్థిక విషయాలకు లోబడివుంటాయనే సూక్తిని పునశ్చరణ చేయడం ద్వారా ఆర్థికవాదులు జరూరు రాజకీయ కర్తవ్యాలను అర్థంచేసుకోవడంలో తమకు గల అశక్తతను యెలా కప్పిపెడతారో అలాగే, రాజకీయంగా విమోచన చెందిన సమాజంలో పోరాటాలు జరుగుతాయనే సూక్తిని పునశ్చరణ చేయడంద్వారా కొత్త "ఇస్క్రా"వాళ్లు ఆ సమాజపు రాజకీయ విమోచనకు చెందిన జరూరు విప్లవ కర్తవ్యాలను అర్థంచేసుకోవడంలో తమకు గల అశక్తతను కప్పిపెడుతున్నారు.

"మొత్తం రాజరిక వ్యవస్థా, సాంఘిక అంతస్తులూ అంతిమంగా రద్దుకావడం" అనే నుడికారాన్ని తీసుకుందాం. స్పష్టమైన భాషలో, రాజరిక వ్యవస్థ అంతిమంగా రద్దు కావడమంటే, ప్రజాతంత్ర రిపబ్లిక్ స్థాపన అని అర్థం. కానీ, యీ నుడికారం మితిమీరినంత స్పష్టంగా, సరళంగా వుందని సహృదయుడైన మన మర్తీనొవ్వూ, ఆయనను మెచ్చుకునేవాళ్లూ అనుకుంటున్నారు. దీనిని "మరింత ప్రగాఢం" చేయాలనీ, "మరింత యుక్తిగా" పెట్టాలనీ వాళ్లు పట్టుబట్టుతున్నారు. ఫలితంగా, మనకు ఒకవైపున ప్రగాఢంగా కనపడడానికి చేసిన పరిహాసాస్పదమైన వ్యర్థ ప్రయత్నాలు కనపడుతున్నాయి. మరొకవైపున మనకు నినాదానికి బదులు వర్ణన, ముందుకు పోడానికి చేసే ఉద్రేకకరమైన ఉద్బోధకు బదులు విచార పూరితమైన పశ్చాద్పరిశీలన, కనపడుతున్నది. వెంటనే రిపబ్లిక్ కొరకు పోరాడాలనే తహతహ గల సజీవ వ్యక్తులు వున్నట్లు కాక plusquamperfectum* సమస్యను sub specie aeternitatis** దృష్ట్యా పరిశీలించే యెండిన శవాలు వున్నట్లు మనకు అభిప్రాయం కలుగుతున్నది.

యింకా చూద్దాం: "...తాత్కాలిక ప్రభుత్వం యీ బూర్జువా విప్లవం కర్తవ్యాలను నిర్వహించడానికి పూనుకుంటుంది." యిక్కడ, శ్రామికవర్గంయొక్క రాజకీయ నాయకులను యెదుర్కొనే ఒక నిర్దిష్ట సమస్యను మన కాన్ఫరెన్సు సభ్యును గమనించకపోవడంవల్ల కలిగిన ఫలితం మనకు వెంటనే కనపడుతుంది. దరహంమీద బూర్జువా విప్లవ లక్ష్యాలను నిర్వహించే భావి ప్రభుత్వాల పరంపర అనే సమస్య తాత్కాలిక విప్లవ ప్రభుత్వ నిర్దిష్ట సమస్యను వాళ్ల దృష్టినుంచి మరుగుపరచింది. మీరు సమస్యను "చారిత్రకంగా" పరిశీలించదలచుకుంటే, బూర్జువా విప్లవంయొక్క చారిత్రక కర్తవ్యాలను నిర్వహించింది యేవిధంగానూ "తాత్కాలికం" కాని ప్రభుత్వాల పరంపర అనీ, విప్లవాన్ని ఓడించిన ప్రభుత్వాలు కూడా ఆ ఓడిన విప్లవపు చారిత్రక కర్తవ్యాలను నిర్వహించవలసి వచ్చిందనీ యే

---

* సుదూర భూతకాలపు చర్యగా. — సం.

** అనంత కాలం. — సం.

యూరపియన్ దేశపు ఉదాహరణ అయినా మీకు తెలుపుతుంది. కానీ, మీరు చెప్పేదానిని ''తాత్కాలిక విప్లవ ప్రభుత్వం'' అనరు: యిది విప్లవ దశలోని ప్రభుత్వానికి యివ్వబడే పేరు, కూలదోయబడిన ప్రభుత్వం స్థానంలోకి వెంటనే వచ్చేదీ, ప్రజలనుండి వచ్చే యేదో ఒక ప్రాతినిధ్యపు సంస్థమీద కాక, ప్రజల తిరుగుబాటుమీద ఆధారపడేదీ అయిన ప్రభుత్వానికి యివ్వబడే పేరు. తాత్కాలిక విప్లవ ప్రభుత్వం విప్లవపు తక్షణ విజయం కొరకూ, విప్లవ ప్రతీఘాతానికి చేసే ప్రయత్నాలను వెంటనే తిప్పికొట్టడానికీ పోరాటం చేసే అంగం, దరహంమీద బూర్జువా విప్లవపు చారిత్రక లక్ష్యాలను నిర్వహించే అంగం కానేకాదు. మనం, లేదా యేదో ఒక ప్రభుత్వం బూర్జువా విప్లవపు యే లక్ష్యాలను సాధించివుండేదీ కచ్చితంగా నిర్ణయించే పనిని మనం భావి ''రూస్కయ స్తరినా''[87]కు చెందిన భావి చరిత్రకారులకు వదలేద్దాం — ముప్పై యేండ్ల తర్వాత ఆ పని చేయడానికి తగినంత వ్యవధి వుంటుంది. ప్రస్తుతం మనం రిపబ్లిక్ కొరకు చేసే పోరాటానికీ, ఆ పోరాటంలో శ్రామిక వర్గం అత్యంత చురుకుగా పాల్గొనడానికీ నినాదాలూ, ఆచరణాత్మక ఆదేశాలూ యివ్వాలి.

యీ కారణాల వలన, పైన ఉల్లేఖించిన తీర్మాన భాగంలోని చివరి ప్రతిపాదనలు కూడా అసంతృప్తికరంగా వున్నాయి. విరుద్ధ వర్గాలమధ్య పరస్పర పోరాటాన్ని తాత్కాలిక ప్రభుత్వం ''క్రమబద్ధం'' చేయవలసి వుంటుందనే నుడికారం అత్యంత అనుచితంగా వుంది, కనీసం అసందర్భంగా వుంది. మార్క్సిస్టులు అలాంటి ఉదారవాద ''ఒస్వొబొజ్దేనియె'' రకం సూత్రాలు ఉపయోగించకూడదు; వర్గ పోరాటపు అంగాలుగా కాక, దాని పనిచేసే ప్రభుత్వాలుగా వుండడం సాధ్యమని నమ్మమంటాయి అవి.... ప్రభుత్వం ''విప్లవకర అభివృద్ధిని ముందుకు తీసుకపోవడమే కాక, ఆ అభివృద్ధిలో పెట్టుబడిదారీ వ్యవస్థ పునాదులకు ప్రమాదకరంగా వుండే అంశాలతో పోరాటం కూడా చేయవలసి వుంటుంది.'' కానీ, యెవరి తరఫున తీర్మానం మాట్లాడుతున్నదో ఆ శ్రామికవర్గమే యీ ''అంశం''! శ్రామికవర్గం ప్రస్తుత సమయంలో సరిగ్గా యెలా ''విప్లవకర అభివృద్ధిని ముందుకు తీసుకపో''వలసిందీ (రాజ్యాంగబద్ధ బూర్జువావర్గం పోగోరేదానికంటె ముందుకు తీసుకపోవలసిందీ) సూచించడానికి బదులు, బూర్జువావర్గం విప్లవ విజయాలమీదికి యెదురుమళ్లినప్పుడు ఆ వర్గంతో పోరాటం చేయడానికి నిర్దిష్టమైన సన్నాహాలు చేసుకొమ్మని సలహా యివ్వడానికి బదులు, ఒక క్రమాన్ని గురించిన సాధారణ వర్ణన, మన కార్యకలాపాల లక్ష్యాలను గురించి యేమీ చెప్పని వర్ణన, మనకు లభిస్తున్నది. కొత్త ''ఇస్క్రా''వాళ్ల తమ అభిప్రాయాలను వ్యక్తంచేసే పద్ధతి గతితార్కిక భావాలకు పరాయిదైన పాత భౌతికవాదం గురించిన మార్క్స్ (ప్రసిద్ధమైన తన ''ఫాయెర్‌బాఖ్‌పై సూత్రీకరణల''లో చెప్పిన) అభిప్రాయాన్ని మనకు జ్ఞాపకంచేస్తుంది. తాత్వికులు ప్రపంచాన్ని కేవలం వివిధ

మార్గాలలో వ్యాఖ్యానించినారు, కానీ అసలు విషయం యేమిటంటే, దానిని మార్చడం అని మార్క్స్ అన్నాడు[88]. అదే విధంగా, కొత్త "ఇస్క్రా"వాళ్లు మన కండ్లముందు జరుగుతున్న పోరాట క్రమాన్ని గురించి సహించదగిన వర్ణనా, వివరణా యివ్వగలరు, కానీ యీ పోరాటానికి సరైన నినాదం యివ్వడానికి వాళ్లు బొత్తిగా అసమర్థులు. మంచి సైనికులూ, కానీ చెడ్డ నాయకులూ అయిన వాళ్లు విప్లవపు భౌతిక పూర్వావసరాలను గుర్తించి, పురోగామి వర్గాల అగ్రభాగాన నిలబడే పార్టీలు చరిత్రలో నిర్వహించగల, నిర్వహించవలసిన క్రియాత్మక, నాయకత్వ, మార్గదర్శక పాత్రను నిర్లక్ష్యం చేయడం ద్వారా చరిత్రను గురించిన భౌతికవాద అవగాహనను నిరసిస్తున్నారు.

# 5. "విప్లవాన్ని ముందుకు తీసుకుపోవడం" యెలా?

తీర్మానంలో తరువాతి భాగాన్ని ఉల్లేఖిద్దాం:

> "అలాంటి పరిస్థితుల్లో విప్లవాన్ని ముందుకు తీసుకపోయే అవకాశాన్ని పూర్తిగా కలిగించే స్థానాన్ని, బూర్జువా పార్టీల అస్థిరమైన, స్వార్థపూరితమైన విధానంతో అది చేసే పోరాటంలో దాని చేతులు కట్టివేయనిదీ, బూర్జువా ప్రజాస్వామ్యంలో కరిగిపోకుండా దానిని నిలబెట్టేదీ అయిన స్థానాన్ని కాపాడుకోడానికి సోషల్ డెమోక్రసీ ప్రయత్నించాలి.
>
> "కనుక సోషల్ డెమోక్రసీ తాత్కాలిక ప్రభుత్వంలో అధికారాన్ని వశం చేసుకోవడం గానీ, పంచుకోవడం గానీ తన లక్ష్యంగా పెట్టుకోకుండా, తీవ్ర విప్లవ ప్రతిపక్ష పార్టీగా నిలిచివుండాలి."

విప్లవాన్ని ముందుకు తీసుకపోయే అవకాశాన్ని అన్నిటికంటె బాగా నిస్సందేహం చేసే స్థానాన్ని ఆక్రమించాలనే సలహా మాకు నిజంగా సంతోషం కలిగిస్తున్నది. కానీ, యీ మంచి సలహాతోబాటు, వెంటనే, ప్రస్తుత రాజకీయ సన్నివేశంలో, ప్రజా ప్రతినిధులను సమావేశపరచడం గురించి పుకార్లూ, ఊహలూ, మాటలూ, పథకాలూ వున్న దశలో, విప్లవాన్ని సోషల్ డెమోక్రసీ యేవిధంగా ముందుకు తీసుకపోవలసిందీ సూటి సూచన వుండాలని మనం కోరుతాము. ప్రజలకూ, జారుకూ మధ్య "రాజీ" అనే "ఒస్వాబొజ్దేనియె" రకం సిద్ధాంతపు ప్రమాదాన్ని గ్రహించనివాళ్లు, లేదా రాజ్యాంగ నిర్ణయసభను సమావేశపర

చాలనే కేవల ''నిర్ణయాన్నే'' విజయం అనేవాళ్ళు, లేదా తాత్కాలిక విప్లవ ప్రభుత్వం అవసరమనే భావాన్ని చురుకుగా ప్రచారం చేసే కర్తవ్యాన్ని పెట్టుకోనివాళ్ళూ, లేదా ప్రజాతంత్ర రిపబ్లిక్ నినాదాన్ని పూర్వరంగంలో వదలేసేవాళ్ళూ విప్లవాన్ని యింకా ముందుకు తీసుకపోగలరా? అలాంటివాళ్ళు వాస్తవంలో విప్లవాన్ని వెనక్కి లాగుతారు; యెందుకంటే, ఆచరణాత్మక రాజకీయాలకు సంబంధించినంతవరకు వాళ్ళు ''ఒస్వొబొజ్దేనియె'' వైఖరి స్థాయికి మించి ఎదగలేదు. విప్లవ కాలంలో పార్టీయొక్క ప్రస్తుత, తక్షణ కర్తవ్యాలను నిర్వచించే యెత్తుగడల తీర్మానంలోనే వాళ్ళు రిపబ్లిక్ కోసం పోరాటం అనే నినాదాన్ని వదలేస్తే, నిరంకుశత్వం స్థానంలో రిపబ్లిక్‌ను పెట్టాలని డిమాండు చేసే కార్యక్రమాన్ని వాళ్ళు గుర్తించడంవల్ల ఉపయోగమేమిటి? యావత్ప్రజా రాజ్యాంగ నిర్ణయసభను సమావేశపరచాలనే నిర్ణయాన్ని నిర్ణయాత్మక విజయంగా పరిగణించడమూ, మరొకవైపున తాత్కాలిక విప్లవ ప్రభుత్వమూ, రిపబ్లిక్కూ అనే విషయంమీద యుక్తిగా మౌనం వహించడమూ అనేది యిప్పుడు ''ఒస్వొబొజ్దేనియె'' వైఖరికీ, రాజ్యాంగవాద బూర్జువావర్గ స్థానానికీ విశిష్ట లక్షణంగా వున్నది. విప్లవాన్ని ముందుకు తీసుకపోడానికీ, రాజరికవాద బూర్జువా వర్గం దాన్ని యే హద్దులదాకా తీసుకపోతుందో ఆ హద్దులను దాటి ముందుకు తీసుకపోడానికీ, బూర్జువా ప్రజాస్వామ్యపు ''అస్థిరత్వాన్ని'' పరిహరించే నినాదాలను చురుకుగా తయారుచేయడమూ, నొక్కిచెప్పడమూ, అగ్రరంగంలోకి తేవడమూ అవసరం. ప్రస్తుతం అలాంటి నినాదాలు రెండు మాత్రమే వున్నాయి: 1) తాత్కాలిక విప్లవ ప్రభుత్వం, 2) రిపబ్లిక్; యెందుకంటే, రాజరికవాద బూర్జువావర్గం యావత్ప్రజా రాజ్యాంగ నిర్ణయసభ అనే నినాదాన్ని అంగీకరించింది (''విమోచన సంఘం''[89] కార్యక్రమం చూడండి), విప్లవాన్ని నిర్వీర్యంచేసి, దాని సంపూర్ణ విజయాన్ని అరికట్టి, జారిజంతో మోసకారి బేరం కుదిరించుకోడానికి బడా బూర్జువావర్గానికి వీలుకలిగించే ప్రయోజనం కొరకే అంగీకరించింది. యిప్పుడు మనకు కనపడే దేమిటంటే, విప్లవాన్ని ముందుకు తీసుకపోడానికి యేవి మాత్రమే సమర్థమైనవో ఆ రెండు నినాదాలలో రిపబ్లిక్ నినాదాన్ని కాన్ఫరెన్సు పూర్తిగా మరచిపోయింది, తాత్కాలిక విప్లవ ప్రభుత్వం అనే నినాదాన్ని యావత్ప్రజా రాజ్యాంగ నిర్ణయసభ అనే ''ఒస్వొబొజ్దేనియె'' నినాదంతో సమానంగా పెట్టి, దానినీ, దీనినీ ''విప్లవంయొక్క నిర్ణయాత్మక విజయం'' అంటోంది!!

నిజంగా, రష్యన్ సోషల్ డెమోక్రసీయొక్క భావి చరిత్రకారునికి ప్రముఖ ఘటనగా వుండబోయే నిస్సందేహమైన వాస్తవం యిది అని మా నమ్మకం. ప్రజాతంత్ర విప్లవాన్ని ముందుకు తీసుకపోవలసిన అవసరాన్ని గురించి అందమైన మాటలు వున్నప్పటికీ, వాస్తవంలో దాన్ని వెనక్కి లాగి, రాజరికవాద బూర్జువావర్గంయొక్క ప్రజాతంత్ర నినాదాలకంటె

యేమాత్రమూ ముందుకు పోని తీర్మానాన్ని, 1905 మేలో జరిగిన సోషల్ డెమోక్రట్ల కాన్ఫరెన్సు ఆమోదించింది.

బూర్జువా ప్రజాస్వామ్యంలో శ్రామికవర్గం బలహీనమైపోయే ప్రమాదాన్ని నిర్లక్ష్యం చేశామని మనల్ని నిందించడం కొత్త "ఇస్క్రా"వాళ్లకు యిష్టం. రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ మూడవ మహాసభ చేసిన తీర్మానాల పాఠం ఆధారంతో యీ ఆరోపణను రుజువుచేయడానికి పూనుకొనే వ్యక్తిని చూడాలని వుంది మాకు. మా వ్యతిరేకులకు మా సమాధానం యిది — బూర్జువా సమాజంలో పనిచేసే సోషల్ డెమోక్రటిక్ పార్టీ కొన్ని సందర్భాల్లో బూర్జువా ప్రజాస్వామ్యం పక్కనే నడవకుండా రాజకీయాలలో పాల్గొనలేదు. యీ విషయంలో మనమధ్య గల భేదం యేమిటంటే, మేము విప్లవ, రిపబ్లికన్ బూర్జువా వర్గం పక్కన నడుస్తున్నాము, దానిలో లీనం కాకుండా, మరి మీరు ఉదారవాద, రాజరిక వాద బూర్జువావర్గం పక్కన నడుస్తున్నారు, మీరు కూడా దానిలో లీనం కాకుండానే. యిదీ పరిస్థితి.

కాన్ఫరెన్సు పేరుమీద మీరు రూపొందించిన యెత్తుగడల నినాదాలు "కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రటిక్" పార్టీ, అనగా రాజరికవాద బూర్జువావర్గపు పార్టీ, నినాదాలతో యేకీభవిస్తాయి. అంతే కాక, యీ యేకీభావాన్ని మీరు గమనించను కూడా లేదు, గుర్తించను కూడా లేదు; యీవిధంగా మీరు వాస్తవంగా "ఒస్వొబొజ్డేనియె"వాళ్ల అడుగుజాడల్లో నడుస్తున్నారు.

రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ మూడవ మహాసభ పేరుమీద మేము రూపొందించిన యెత్తుగడల నినాదాలు ప్రజాతంత్ర విప్లవ, రిపబ్లికన్ బూర్జువావర్గపు నినాదాలతో యేకీభవిస్తాయి. రష్యాలో యిలాంటి బూర్జువావర్గమూ, పెటీబూర్జువా వర్గమూ కలిసి యింకా పెద్ద ప్రజా పార్టీగా యేర్పడలేదు.* కానీ, రష్యాలో యిప్పుడు జరుగుతున్నదాన్ని గురించి పూర్తిగా అజ్ఞానులైనవాళ్లు మాత్రమే అలాంటి పార్టీయొక్క అంశాలు వున్నాయనే విషయాన్ని సందేహించగలరు. మేము (రష్యన్ మహా విప్లవం పురోగమిస్తే) సోషల్ డెమోక్రటిక్ పార్టీచేత సంఘటితం చేయబడిన శ్రామికవర్గాన్ని మాత్రమే కాక, మన పక్కన నడిచే సామర్థ్యం గల పెటీబూర్జువావర్గాన్ని కూడా నడిపించాలని అనుకుంటున్నాము.

---

* "సోషలిస్టు రివల్యూషనరీలు" అలాంటి పార్టీ అండ రూపంగాకంటె యెక్కువగా మేధావుల టెర్రరిస్టు బృందంగా వున్నారు. కానీ, యీ బృందపు కార్యకలాపాల వస్తుగత ప్రాముఖ్యాన్ని విప్లవ, రిపబ్లికన్ బూర్జువావర్గపు లక్ష్యాలను సాధించే యిదే కర్తవ్యానికి కుదించవచ్చు.

తన తీర్మానంద్వారా కాన్ఫరెన్సు తనకు తెలియకుండానే ఉదారవాద, రాజరికవాద బూర్జువావర్గం స్థాయికి దిగుతున్నది. పార్టీ మహాసభ తన తీర్మానంద్వారా, చైతన్యంతో, బ్రోకర్లుగా పనిచేయడానికి కాక, పోరాటం చేయడానికి సామర్థ్యం గల విప్లవ ప్రజాతంత్ర శక్తులను తన సొంత స్థాయికి యెత్తుతున్నది.

అలాంటి శక్తులు అత్యధికంగా రైతుల్లో కనపడతారు. పెద్ద సాంఘిక బృందాలను వాటి రాజకీయ ధోరణులను బట్టి వర్గీకరించడంలో, పెద్ద పొరపాటు పడే ప్రమాదం లేకుండా, విప్లవ, రిపబ్లికన్ ప్రజాస్వామ్యాన్ని రైతు జనసామాన్యంతో జతచెయ్యవచ్చు — సహజంగానే, యే అర్థంలో, యే మినహాయింపులతోనూ, అంతర్నిహితమైన షరతులతోనూ కార్మికవర్గాన్ని సోషల్ డెమోక్రసీతో జతచెయ్యగలమో అదే మాదిరి అర్థంలో, మినహాయింపులతో, షరతులతో. మరొక విధంగా చెప్పాలంటే, యీకింది మాటల్లో కూడా మన నిర్ధారణను రూపొందించవచ్చు: విప్లవ కాలంలో, కాన్ఫరెన్సు తన జాతివ్యాప్త* రాజకీయ నినాదాల ద్వారా, తనకు తెలియకుండానే, భూస్వామి బాహుళ్యం స్థాయికి దిగుతున్నది. పార్టీ మహాసభ తన జాతివ్యాప్త రాజకీయ నినాదాల ద్వారా, రైతు జనసామాన్యాన్ని విప్లవ స్థాయికి యెత్తుతున్నది. యీ నిర్ధారణను బట్టి మాకు విషమాలంకారాలపట్ల ప్రీతి వుందని నిందించదలచుకునేవాళ్లను మేము యీ సూత్రీకరణను పూర్వపక్షం చేయండని సవాల్‌చేస్తున్నాం: విప్లవాన్ని విజయవంతంగా ముగించడానికి మనం తగినంత బలంగా లేకపోతే, విప్లవం ''ఒస్వొబొజ్దేనియె'' అర్థంలో ''నిర్ణయాత్మక విజయం''తో, అనగా జారుచేత సమావేశపరచబడిన ప్రాతినిధ్యపు సంస్థ రూపంలో, అపహాస్యకరంగా మాత్రమే రాజ్యాంగ నిర్ణయసభ అని అనబడగల రూపంలో, ముగిస్తే — అప్పుడు అది భూస్వామ్య, బడా బూర్జువా శక్తులు ప్రబలంగా వుండే విప్లవం అవుతుంది. మరొకవైపున, మనం నిజంగా గొప్ప విప్లవాన్ని విజయవంతం చెయ్యగలిగిన అదృష్టం కలిగిన వాళ్లమైతే, చరిత్ర యీసారి ''గర్భస్రావా''న్ని అనుమతించకపోతే, మనం విప్లవాన్ని విజయవంతమైన ముగింపుదాకా, నిర్ణయాత్మక విజయందాకా, ''ఒస్వొబొజ్దేనియె'' అర్థంలోనో, కొత్త ''ఇస్క్రా'' అర్థంలోనో కాదు, నిర్వహించడానికి తగినంత బలంగా వుంటే — అప్పుడు అది కర్షక, కార్మిక అంశం ప్రబలంగా వుండే విప్లవం అవుతుంది.

అలాంటి ప్రాబల్యం సంభవమని మనం ఒప్పుకోవడాన్ని ఆసన్న విప్లవం స్వభావంలో బూర్జువాగా వుంటుందనే అభిప్రాయాన్ని మనం విసర్జించడంగా బహుశా కొంతమంది

---

* వేరే తీర్మానాల్లో చర్చింపబడిన ప్రత్యేక రైతు నినాదాలను యిక్కడ మేము ప్రస్తావించడం లేదు.

వ్యాఖ్యానించవచ్చు. ''ఇస్క్రా''లో యీ భావం దుర్వినియోగపరచబడడాన్ని బట్టి చూస్తే, యీ వ్యాఖ్యానానికి చాలా అవకాశం వుంది. అందువలన యీ సమస్యను చర్చించడం యేమాత్రమూ అనవసరం కాదు.

## 6. అస్థిర బూర్జువావర్గంతో చేసే పోరాటంలో తన చేతులు కట్టివేయబడే ప్రమాదం శ్రామికవర్గానికి యెక్కడనుండి వస్తున్నది?

రష్యన్ విప్లవపు బూర్జువా స్వభావం గురించి మార్క్సిస్టులకు పరమ విశ్వాసం వుంది. అంటే యేమిటి అర్థం? అర్థం యేమిటంటే, రాజకీయ వ్యవస్థలో ప్రజాతంత్ర మార్పులూ, సాంఘిక, ఆర్థిక మార్పులూ, రష్యాకు ఆవశ్యకంగా తయారైనట్టివి, వాటి పాటికవే పెట్టుబడిదారీ వ్యవస్థను బలహీనపరచవు, బూర్జువా పరిపాలనను బలహీనపరచవు; తద్వ్యతిరేకంగా, అవి మొదటిసారిగా, పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క విస్తృతమైన, సత్వరమైన, ఆసియా రకం కాదు, యూరపియన్ రకం అభివృద్ధికి నిజంగా రంగం తయారు చేస్తాయి; అవి మొదటిసారిగా, బూర్జువావర్గం ఒక వర్గంగా పరిపాలించడానికి వీలు కలిగిస్తాయి. సోషలిస్టు రివల్యూషనరీలు యీ భావాన్ని గ్రహించలేరు; యెందుకంటే, సరుకు ఉత్పత్తియొక్క, పెట్టుబడిదారీ ఉత్పత్తియొక్క అభివృద్ధి నియమాలను గురించి వాళ్లకు ఓనమాలు తెలియవు. రైతు తిరుగుబాటుయొక్క సంపూర్ణ విజయం కూడా, రైతులకు అనుకూలంగా, వాళ్ల కోరికల ప్రకారం జరిగే మొత్తం భూమియొక్క పునర్విభజన (''సాధారణ పునః పంపకం,'' లేదా అలాంటిది) కూడా పెట్టుబడిదారీ వ్యవస్థను బొత్తిగా ధ్వంసం చేయదనీ, తద్వ్యతిరేకంగా, దాని అభివృద్ధికి వూపు యిచ్చి, రైతాంగపు వర్గ విచ్ఛిత్తినే త్వరపరుస్తుందనీ వాళ్లు గ్రహించలేరు. యీ సత్యాన్ని గ్రహించలేకపోవడం వల్ల సోషలిస్టు రివల్యూషనరీలు తమకు తెలియకుండా పెటీబూర్జువావర్గపు సిద్ధాంతకారులు అవుతున్నారు. యీ సత్యాన్ని గురించి పట్టుబట్టడం సిద్ధాంత దృష్ట్యానే కాక, ఆచరణాత్మక రాజకీయాల దృష్ట్యా కూడా, సోషల్ డెమోక్రసీకి అపారమైన ప్రాముఖ్యం కలది; యెందుకంటే, ప్రస్తుత ''సాధారణ ప్రజాతంత్ర'' ఉద్యమంలో శ్రామికవర్గ పార్టీ సంపూర్ణ వర్గ స్వాతంత్ర్యం అనుల్లంఘనీయమైన షరతు అనేది దానినుండి యేర్పడుతుంది.

కానీ, ప్రజాతంత్ర విప్లవం (తన సాంఘిక, ఆర్థిక సారంలో బూర్జువా అయినట్టిది) శ్రామికవర్గానికి అపారమైన ప్రయోజనం కలదిగా వుండదని దానినుండి యేవిధంగానూ యేర్పడదు. ప్రజాతంత్ర విప్లవం ప్రధానంగా బడా పెట్టుబడిదారునికీ, ఫైనాన్షల్ ప్రభువుకూ, "వికాసవంతుడైన" భూస్వామికీ అనుకూలంగా వుండే రూపంలోనూ, కర్షకునికీ, కార్మికునికీ అనుకూలంగా వుండే రూపంలోనూ, రెండు రూపాలలోనూ జరగజాలదని దాని నుండి యేర్పడదు.

కొత్త "ఇస్క్రా"వాళ్ల బూర్జువా విప్లవం అనేదాని అర్థాన్నీ, ప్రాముఖ్యాన్నీ పూర్తిగా అపార్థం చేసుకుంటున్నారు. వాళ్ల వాదాలలో పూసల్లో దారంలా వున్న భావం యేమిటంటే, బూర్జువా విప్లవం బూర్జువావర్గానికి మాత్రమే అనుకూలంగా వుండగల దనేది. కానీ, దీనికంటె తప్పు అభిప్రాయం వుండదు. బూర్జువా విప్లవం అనేది బూర్జువా, అనగా పెట్టుబడిదారీ సాంఘిక ఆర్థిక వ్యవస్థ చట్రంనుండి వైదొలగని విప్లవం. బూర్జువా విప్లవం పెట్టుబడిదారీ అభివృద్ధి అవసరాలను వ్యక్తంచేస్తుంది, పెట్టుబడిదారీ వ్యవస్థ పునాదులను ధ్వంసంచేయదు సరికదా, తద్వ్యతిరేకంగా — వాటిని విశాలమూ, లోతూ చేస్తుంది. కనుక యీ విప్లవం కార్మికవర్గ ప్రయోజనాలను మాత్రమే కాక, యావత్తు బూర్జువా వర్గపు ప్రయోజనాలను కూడా వ్యక్తంచేస్తుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో కార్మికవర్గం మీద బూర్జువావర్గ పరిపాలన అనివార్యం గనుక, బూర్జువా విప్లవం బూర్జువావర్గ ప్రయోజనాలను వ్యక్తంచేసినంతగా శ్రామికవర్గ ప్రయోజనాలను వ్యక్తంచేయదని బాగా చెప్పవచ్చు. కానీ, బూర్జువా విప్లవం శ్రామికవర్గ ప్రయోజనాలను బొత్తిగా వ్యక్తంచేయదని అనుకోవడం పూర్తిగా అసంబద్ధం. యీ అసంబద్ధ భావం బూర్జువా విప్లవం శ్రామికవర్గ ప్రయోజనాలకు వ్యతిరేకమైనదనీ, అందువలన మనకు బూర్జువా రాజకీయ స్వేచ్ఛ అక్కర లేదనీ చెప్పే పురాతన నరోద్నిక్ సిద్ధాంతంతోనైనా సమానంగా వుంటుంది, లేదా బూర్జువా రాజకీయాల్లోనూ, బూర్జువా విప్లవంలోనూ, బూర్జువా పార్లమెంటరిజంలోనూ శ్రామికవర్గం పాల్గొనడాన్ని పూర్తిగా నిరాకరించే అరాజకవాదంతోనైనా సమానంగా వుంటుంది. సిద్ధాంత దృష్ట్యా చూస్తే, సరుకు ఉత్పత్తి ప్రాతిపదికమీద పెట్టుబడిదారీ అభివృద్ధి అనివార్యతను గురించి మార్క్సిజం చెప్పే ప్రాథమిక సూత్రాలను యీ భావం ఉపేక్షిస్తున్నది. సరుకు ఉత్పత్తిమీద ఆధారపడి, నాగరిక పెట్టుబడిదారీ దేశాలతో వర్తక సంబంధాలు గల సమాజం తన అభివృద్ధిలోని ఒకానొక దశలో తప్పనిసరిగా పెట్టుబడిదారీ మార్గం చేపట్టాలి అని మార్క్సిజం మనకు బోధిస్తుంది. రష్యా పెట్టుబడిదారీ అభివృద్ధిలో ప్రవేశించకుండా ముందుకు పోగలదనీ, లేదా పెట్టుబడిదారీ వ్యవస్థను తప్పించుకోగలదనీ, లేదా యిదే పెట్టుబడిదారీ వ్యవస్థ ఆధారంమీదనే, దీని చట్రంలోనే, వర్గపోరాటంకంటె భిన్నమైన

యేదో ఒక మార్గంలో దీనిని దాటవేయగలదనీ చెప్పే నరోద్నిక్, అరాజకవాద చెత్తతో మార్క్సిజం తిరుగులేకుండా తెగతెంపులు చేసుకున్నది.

యీ మార్క్సిస్టు సూత్రాలన్నీ దరహంమీదా, ప్రత్యేకించి రష్యాకు సంబంధించీ, సవివరంగా రుజువుచేయబడి, వివరించబడినాయి. పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క యితోధిక అభివృద్ధిలో తప్ప మరిదేనిలోనైనా కార్మికవర్గ మోక్షం కొరకు వెదకాలనే భావం ప్రగతి వ్యతిరేకమని యీ సూత్రాలనుండి యేర్పడుతుంది. రష్యాలాంటి దేశాల్లో కార్మికవర్గానికి గల బాధ అంతగా పెట్టుబడిదారీ వ్యవస్థ కాదు, పెట్టుబడిదారీ వ్యవస్థ తగినంతగా అభివృద్ధి కాకపోవడం. కనుక, కార్మికవర్గానికి పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క అత్యంత విస్తృత, స్వేచ్ఛాయుత, సత్వర అభివృద్ధిలో అత్యంత నిశ్చయంగా ప్రయోజనం వుంది. పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క విస్తృత, స్వేచ్ఛాయుత, సత్వర అభివృద్ధిని అడ్డగించే పాత వ్యవస్థ అవశేషాల నన్నిటినీ తొలగించడం కార్మికవర్గానికి పరమ అనుకూలం. బూర్జువా విప్లవం సరిగ్గా యెలాంటి ఉత్పాతనం అంటే, గతంయొక్క అవశేషాలను, ఫ్యూడల్ వ్యవస్థయొక్క అవశేషాలను (వీటిలో నిరంకుశత్వమే కాక, రాజరికం కూడా వుంది) అత్యంత కృతనిశ్చయంతో వూడ్చిపారేసేది, పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క అత్యంత విస్తృత, స్వేచ్ఛాయుత, సత్వర అభివృద్ధికి అత్యంత సంపూర్ణమైన హామీ యిచ్చేది.

అందువల్లనే బూర్జువా విప్లవం శ్రామికవర్గానికి అత్యున్నత ప్రమాణంలో అనుకూలమైనది. బూర్జువా విప్లవం శ్రామికవర్గ ప్రయోజనాలకు పరమ అవసరం. బూర్జువా విప్లవం యెంత సంపూర్ణంగా, కృతనిశ్చయంగా, స్థిరంగా వుంటే, అంత నమ్మకంగా వుంటుంది బూర్జువావర్గంమీదా, సోషలిజం కొరకూ శ్రామికవర్గం చేసే పోరాటం. శాస్త్రీయ సోషలిజంయొక్క ఓనమాలు కూడా తెలియనివాళ్లు మాత్రమే యీ నిర్ణయాన్ని కొత్తగా, వింతగా, విరోధాభాసగా పరిగణించగలరు. యితర విషయాలతోపాటు యీ నిర్ణయంనుండి, బూర్జువా విప్లవం ఒకానొక అర్థంలో బూర్జువావర్గానికికంటె శ్రామికవర్గానికి యెక్కువ అనుకూలం అనే సిద్ధాంతం యేర్పడుతుంది. యీ సిద్ధాంతం యీకింది అర్థంలో నిస్సందేహంగా సరైనది: శ్రామికవర్గానికి వ్యతిరేకంగా గతంయొక్క కొన్ని అవశేషాలమీద, ఉదాహరణకు రాజరికమూ, స్థాయీ సైన్యమూ, వగైరాలమీద ఆధారపడడం బూర్జువావర్గానికి అనుకూలం. బూర్జువా విప్లవం గతంయొక్క అవశేషాలనన్నిటినీ మరీ కృతనిశ్చయంతో వూడ్చిపారవేయకుండా, వాటిలో కొన్నిటిని నిలుపుకోవడం, అనగా యీ విప్లవం పూర్తి స్థిరంగా, సంపూర్ణంగా వుండకపోవడం, కృతనిశ్చయంగా, సడలుబాటు లేకుండా వుండకపోవడం, బూర్జువావర్గానికి అనుకూలం. సోషల్ డెమోక్రటు్లు తరుచుగా యీ భావాన్ని కాస్త భిన్నంగా యిలా వ్యక్తంచేస్తారు: బూర్జువావర్గం తనకు తాను ద్రోహం చేసుకుంటుం

దని, బూర్జువావర్గం స్వేచ్ఛా లక్ష్యానికి ద్రోహం చేస్తుందని, బూర్జువావర్గానికి స్థిరంగా ప్రజాస్వామికంగా వుండడం చేతకాదని. బూర్జువా ప్రజాస్వామ్య దిశలో అవసరమైన మార్పులు మరింత నిదానంగా, మరింత క్రమక్రమంగా, మరింత జాగరూకతతో, తక్కువ కృతనిశ్చయంతో, విప్లవం ద్వారా కాక సంస్కరణల ద్వారా జరగడం బూర్జువావర్గానికి యెక్కువ అనుకూలం. యీ మార్పులు ఫ్యూడల్ వ్యవస్థయొక్క "గౌరవనీయ" సంస్థలను (రాజరికం లాంటివాటిని) వీలైనంతవరకు మిగిలించడం బూర్జువావర్గానికి యెక్కువ అనుకూలం. యీ మార్పులు సామాన్య ప్రజల, అనగా రైతుల, ముఖ్యంగా కార్మికుల, స్వతంత్ర విప్లవ కార్య కలాపాలనూ, చొరవనూ, శక్తినీ వీలైనంత తక్కువగా అభివృద్ధిచేయడం బూర్జువావర్గానికి యెక్కువ అనుకూలం; యెందుకంటే, అవి యెక్కువ అభివృద్ధి అయితే, కార్మికులకు, ఫ్రెంచివాళ్లు అన్నట్లు, "ఒక భుజంనుండి మరొక భుజానికి రైఫిల్ మార్చుకోవడం" సులభమౌతుంది — అనగా, బూర్జువా విప్లవం తమకు సమకూర్చే ఆయుధాన్ని, విప్లవం తెచ్చే స్వేచ్ఛను, భూస్వామ్య దాస్య వ్యవస్థను తొలగించిన నేలమీద మొలకలెత్తే ప్రజాతంత్ర సంస్థలను బూర్జువావర్గంమీదికి మళ్లించడం సులభమౌతుంది.

తద్వ్యతిరేకంగా, బూర్జువా ప్రజాస్వామ్య దిశలో అవసరమైన మార్పులు సంస్కరణల రూపంలో కాక, విప్లవ రూపంలో జరగడం కార్మికవర్గానికి యెక్కువ అనుకూలం; యెందుకంటే, సంస్కరణ రూపం ఆలస్యమూ, వాయిదా వేయడమూ, జాతీయ వ్యవస్థలోని కుళ్లిపోయిన భాగాలు బాధాకరమైనంత నిదానంగా సమసిపోవడమూ గల రూపం. ఆ కుళ్లు వలన బాధపడేది అందరికంటె ముందు, అందరికంటె యెక్కువగా శ్రామికవర్గమూ, రైతాంగమూ. విప్లవ మార్గం సత్వర శస్త్రచికిత్స మార్గం, శ్రామికవర్గానికి అత్యంత తక్కువ బాధాకరమైన మార్గం, కుళ్లిపోతున్నదానిని తక్షణం తొలగించే మార్గం, రాజరికంపట్లా, దానితోపాటు వుండే యేహ్యమైన, నీచమైన, కుళ్లిన, హానికరమైన సంస్థల పట్లా అత్యంత తక్కువ విధేయతా, మన్ననా గల మార్గం.

కనుక, మన బూర్జువా ఉదారవాద పత్రికలు విప్లవ మార్గ సంభావ్యతను శోకించేదీ, విప్లవమంటే భయపడేదీ, విప్లవ భూతంతో జారును భయపెట్టడానికి ప్రయత్నించేదీ, విప్లవాన్ని పరిహరించడానికి అన్వేషించేదీ, సంస్కరణవాద మార్గానికి పునాదిగా దౌర్భాగ్యపు సంస్కరణల కొరకు సాష్టాంగపడేదీ, దాస్యభావం వహించేదీ సెన్సార్‌షిప్ మూలంగా మాత్రమే కాదు, బలవంతుల వలన భయం మూలంగా మాత్రమే కాదు. యీ దృక్పథం కలిగివుండేది "రూస్కియె వేదొమొస్తి," "సీన్ ఒతేచెస్త్వ," "నాష జీజ్న్," "నాషి ద్నీ,"[90] మాత్రమే కాదు, చట్ట వ్యతిరేకమైన, సెన్సార్ చేయబడని "ఒస్వొబొజ్దేనియె" కూడా. పెట్టుబడిదారీ సమాజంలో బూర్జువావర్గానికి ఒక వర్గంగా వుండే స్థానమే ప్రజాతంత్ర

విప్లవంలో దాని అస్థిరత్వానికి అనివార్యంగా దారితీస్తుంది. శ్రామికవర్గానికి ఒక వర్గంగా వుండే స్థానమే ఆ వర్గాన్ని స్థిరంగా ప్రజాతంత్రంగా వుండేటట్లు నిర్బంధిస్తుంది. శ్రామిక వర్గాన్ని బలీయం చేసే ప్రమాదమున్న ప్రజాతంత్ర ప్రగతికి భయపడి బూర్జువావర్గం వెనక్కి చూస్తుంది. కార్మికులు పోగొట్టుకొనే దేమీ లేదు, తమ శృంఖలాలు తప్ప. కానీ ప్రజాస్వామ్య తత్వం తోడ్పాటుతో వాళ్ళు పొందవలసింది యెంతైనా వుంది. అందువల్లనే, బూర్జువా విప్లవం తన ప్రజాతంత్ర పరివర్తనలు సాధించడంలో యెంత యెక్కువ స్థిరంగా వుంటే, అంత తక్కువగా అది బూర్జువావర్గానికి మాత్రమే అనుకూలమైనదానికి పరిమితమౌతుంది. బూర్జువా విప్లవం యెంత యెక్కువ స్థిరంగా వుంటే, అంత యెక్కువగా అది ప్రజాతంత్ర విప్లవం ద్వారా సమకూర్చే లాభాలను శ్రామికవర్గానికీ, రైతాంగానికీ కల్పిస్తుంది.

శ్రామికవర్గం బూర్జువా విప్లవానికి యెడంగా వుండకూడదనీ, దానిపట్ల ఉదాసీనంగా వుండకూడదనీ, బూర్జువావర్గాన్ని విప్లవానికి నాయకత్వం వహించనివ్వకూడదనీ, తద్వ్యతిరేకంగా, దానిలో అత్యంత చురుకైన పాత్ర వహించాలనీ, స్థిరమైన శ్రామికవర్గ ప్రజాస్వామ్యతత్వం కొరకూ, విప్లవం సాంతం నిర్వహించబడడం కొరకూ అత్యంత కృతనిశ్చయంతో పోరాడాలనీ మార్క్సిజం బోధిస్తుంది. రష్యన్ విప్లవపు బూర్జువా ప్రజాతంత్ర హద్దులను మనం దాటిపోలేము, కానీ యీ హద్దులను మనం విశేషంగా విస్తృత పరచగలం, యీ హద్దులలో మనం శ్రామికవర్గ ప్రయోజనాల కొరకూ, దాని తక్షణ అవసరాల కొరకూ, భావి సంపూర్ణ విజయం కొరకూ దాని బలాలను సిద్ధం చేసుకోడానికి దానికి వీలు కలిగించే పరిస్థితుల కొరకూ పోరాడగలం, పోరాడితీరాలి. బూర్జువా ప్రజాస్వామ్యంలో యెన్నైనా రకాలు వున్నాయి. యెగువ సభకు అనుకూలంగా వుంటూ, సార్వజనీన వోటు హక్కును "అడుగుతూ," కానీ రహస్యంగా, దొంగతనంగా పరిమిత రాజ్యాంగం కొరకు జారిజంతో బేరం కుదిరించుకునే జేమ్‌స్త్వో రాజరికవాది[91] కూడా బూర్జువా ప్రజాతంత్రవాదే. భూస్వాములమీదికీ, ప్రభుత్వ ఉద్యోగులమీదికీ ఆయుధాలు తీసుకొని, "అమాయక రిపబ్లికన్ వాదం"తో "జారును పారదోలాలని" ప్రతిపాదించే* రైతు కూడా బూర్జువా ప్రజాతంత్ర వాదే. జర్మనీలో వున్నలాంటి బూర్జువా ప్రజాతంత్ర వ్యవస్థలూ వున్నాయి, యింగ్లండులో వున్నలాంటివీ వున్నాయి; అలాగే ఆస్ట్రియాలో వున్నలాంటివీ వున్నాయి, అమెరికాలోనూ, స్విట్జర్లండులోనూ వున్నలాంటివీ వున్నాయి. ప్రజాతంత్రవాద ప్రమాణాలలోని యీ

* చూ: "ఒస్వొబొజ్దేనియె" నం. 71, పేజి 337, పాదవివరణ 2.

భేదాన్నీ, దాని రూపాలలోని భేదాన్నీ చూడకుండా, యెంతైనా యిది "బూర్జువా విప్లవమే," "బూర్జువా విప్లవ" ఫలితమే అనే "యుక్తిపర" అభిప్రాయ ప్రకటనలకు, ప్రజాతంత్ర విప్లవ కాలంలో, పరిమితమయ్యేవాడు నిజంగా దొడ్డ మార్క్సిస్టే అయివుండాలి.

వాస్తవంలో తమ హ్రస్వ దృష్టిని ఆడంబరంగా ప్రదర్శించుకునే మన కొత్త "ఇస్క్రా"వాళ్లు సరిగ్గా అలాంటి యుక్తిపరులు. సరిగ్గా, అస్థిరమైన బూర్జువా ప్రజాస్వామ్యతత్వానికీ స్థిరమైన శ్రామికవర్గ ప్రజాస్వామ్యతత్వానికీ మధ్య గల భేదం మాట అటుంచి, రిపబ్లికన్ విప్లవ బూర్జువా ప్రజాస్వామ్యానికీ, రాజరికవాద ఉదారవాద బూర్జువా ప్రజాస్వామ్యానికీ మధ్య గల భేదాన్ని చూడగలగడం అవసరమైన సమయంలో, స్థలంలో వాళ్లు విప్లవంయొక్క బూర్జువా స్వభావంమీద ఉపన్యాసాలకు పరిమితమౌతారు. ప్రస్తుత విప్లవంలో ప్రజాతంత్ర నాయకత్వం సమకూర్చడం సమస్య అయినప్పుడు, స్ట్రూవె అండ్ కంపెనీ వాళ్ల ద్రోహపూరిత నినాదాలకు భిన్నంగా ప్రగతిశీల ప్రజాతంత్ర నినాదాలను నొక్కిచెప్పడం సమస్య అయినప్పుడు, భూస్వాముల, పారిశ్రామికుల ఉదారవాద బేరాలకు భిన్నంగా కార్మిక, కర్షకుల నిజంగా విప్లవకరమైన పోరాటంయొక్క తక్షణ లక్ష్యాలను మొరటుగా, సూటిగా చెప్పడం సమస్య అయినప్పుడు, వాళ్లు—తాము నిజంగా "గుల్లలోని మనిషి"[92] లాగ అయినట్లు—"విరుద్ధ వర్గాల పరస్పర పోరాట క్రమం"ను గురించి విషాదపూరితమైన మాటలతో తృప్తిపడుతున్నారు. విషయపు సారాంశం యిది, మీరు గమనించనట్టిది: మన విప్లవం నిజమైన, అపారమైన విజయంలో పర్యవసిస్తుందా, లేక కేవలం దౌర్భాగ్యపు బేరంలోనా; అది కార్మిక, కర్షకుల విప్లవ ప్రజాతంత్ర నియంతృత్వందాకా పోతుందా, లేక షీపావ్ రకం ఉదారవాద రాజ్యాంగంలో నీరుగారిపోతుందా?!

యీ ప్రశ్నను లేవనెత్తడంలో మేము విషయంనుండి పూర్తిగా వైదొలగినట్లు పైకి కనిపించవచ్చు. కానీ, అది పైకి మాత్రమే అలా కనిపించవచ్చు. వాస్తవంలో, రష్యన్ సోషల్ డెమొక్రటిక్ లేబర్ పార్టీ మూడవ మహాసభయొక్క సోషల్ డెమొక్రటిక్ యెత్తుగడలకూ, కొత్త "ఇస్క్రా"వాళ్ల కాన్ఫరెన్సు ప్రారంభించిన యెత్తుగడలకూ మధ్య యిప్పటికే స్పష్టంగా కనపడుతున్న సూత్రగత భేదపు మూలంలో వున్నది సరిగ్గా యీ ప్రశ్నే. కార్మికుల పార్టీకి సాటిలేనంత క్లిష్టమూ, ముఖ్యమూ, ప్రాణప్రదమూ అయిన సమస్యలను, అనగా విప్లవ కాలంలో దాని యెత్తుగడల సమస్యలను, పరిష్కరించడంలో "ఆర్థికవాదపు" తప్పులను పునరుజ్జీవింపజేస్తూ, కొత్త "ఇస్క్రా"వాళ్లు యిప్పటికే రెండు కాదు, మూడు అడుగులు వెనక్కి వేసినారు. అందువల్లనే, మనం లేవనెత్తిన సమస్యను తదుచితమైన సకల శ్రద్ధతోనూ పరిశీలించాలి.

సోషల్ డెమోక్రసీ బూర్జువావర్గపు అస్థిర విధానంతో చేసే పోరాటంలో తన చేతులు కట్టివేసుకునే ప్రమాదాన్ని, బూర్జువా ప్రజాస్వామ్యంలో అది కరిగిపోయే ప్రమాదాన్ని, సూచిస్తుంది పైన ఉల్లేఖించిన కొత్త "ఇస్క్రా"వాళ్ల తీర్మాన భాగం. యీ ప్రమాదాన్ని గురించిన ఆలోచన నిర్దిష్టంగా కొత్త "ఇస్క్రా" సారస్వతంలో అంతటా వ్యాపించివుంది; మన పార్టీ చీలికలో యిమిడివున్న సూత్రంయొక్క సారంలో వుంది యిది ("ఆర్థికవాదం" వైపు జరిగిన మలుపుతో చీలికలోని కీచులాట పూర్తిగా మరుగుపడినప్పటినుండి). యీ ప్రమాదం నిజంగా వుందనీ, సరిగ్గా ప్రస్తుత సమయంలో, రష్యన్ విప్లవపు ఉచ్చ దశలో, యీ ప్రమాదం మరీ తీవ్రంగా వుందనీ మేము అసందిగ్ధంగా ఒప్పుకుంటాం. సిద్ధాంతకారులమైన — లేదా, నన్ను గురించి నాకు చెప్పుకోవడం యిష్టమైనట్లు — సోషల్ డెమోక్రసీయొక్క పత్రికా రచయితలమైన మనందరిమీదా పడే జరూరైన, అత్యంత బాధ్యతాయుతమైన కర్తవ్యం యేమిటంటే, యే దిశనుండి యీ ప్రమాదం వాస్తవంగా వచ్చేదీ తెలుసుకోవడం. యెందుకంటే, మన అనైక్యతయొక్క మూలం ఆ ప్రమాదం వుందా లేదా అనే వివాదం కాదు, అది "మైనారిటీ" తోకవాదం అనబడేదానితో కలుగుతున్నదా, లేక "మెజారిటీ" విప్లవవాదం అనబడేదానితో కలుగుతున్నదా అనే వివాదమే.

సకల దుర్వ్యాఖ్యానాలనూ, అపార్థాలనూ తొలగించడానికి మనం మొట్టమొదట యిది చెప్పాలి: మేము ప్రస్తావించే ప్రమాదం సమస్యయొక్క వ్యక్తిగత పార్శ్వంలో లేదు, వస్తుగత పార్శ్వంలో వుంది, పోరాటంలో సోషల్ డెమోక్రసీ తీసుకునే లాంఛనగత వైఖరిలో లేదు, యావత్తు ప్రస్తుత విప్లవ పోరాటపు భౌతిక ఫలితంలో వుంది. సమస్య యీ సోషల్ డెమోక్రటిక్ బృందమో, ఆ సోషల్ డెమోక్రటిక్ బృందమో బూర్జువా ప్రజాస్వామ్యంలో లీనమైపోవాలని కోరుతుందా అనేది కాదు, లేక తాము అలా చేస్తున్నట్లు వాళ్లు గుర్తిస్తారా అనేది కాదు. అలాంటి సూచన యెవరూ చేయరు. అలాంటి కోరిక మనసులో పెట్టుకున్నాడని యే సోషల్ డెమోక్రట్‌నూ మనం సందేహించం; అసలు యిది కోరికకు సంబంధించిన విషయం కానే కాదు. యీ సోషల్ డెమోక్రటిక్ బృందమో, ఆ సోషల్ డెమోక్రటిక్ బృందమో విప్లవ కాలమంతటా తన ప్రత్యేక రూపాన్నీ, వ్యక్తిత్వాన్నీ, బూర్జువా ప్రజాస్వామ్యంమీద ఆధారపడని స్వాతంత్ర్యాన్నీ లాంఛనగతంగా నిలుపుకుంటుందా అనేది కూడా కాదు సమస్య. వాళ్లు అలాంటి "స్వాతంత్ర్యాన్ని" కేవలం ప్రకటించడమే కాక, లాంఛనగతంగా దానిని నిలుపుకోవచ్చు కూడా; అయినప్పటికీ, బూర్జువావర్గపు అస్థిరత్వంతో చేసే పోరాటంలో వాళ్ల చేతులు కట్టివేయబడడం సంభవించవచ్చు. విప్లవపు అంతిమ రాజకీయ ఫలితం యెలా వుండవచ్చునంటే, సోషల్ డెమోక్రసీకి లాంఛనగత "స్వాతంత్ర్యం" వున్నప్పటికీ, ప్రత్యేక పార్టీగా దానికి సంపూర్ణ సంస్థా

గత వ్యక్తిత్వం వున్నప్పటికీ, వాస్తవంలో అది స్వతంత్రంగా వుండదు; తన కార్మికవర్గ స్వాతంత్ర్య ముద్రను అది ఘటనల గతిమీద వేయగలిగి వుండదు; అది యెంత దుర్బలంగా వుంటుందంటే, మొత్తంమీద, అంతిమ పరిశీలనలో, బూర్జువా ప్రజాస్వామ్యంలో అది ''లీనమై పోవడం'' చారిత్రక వాస్తవంగా వుంటుంది.

అది నిజమైన ప్రమాదం. యిక, ఆ ప్రమాదం యే దిశనుండి వచ్చేదీ చూద్దాం — మనం నమ్ముతున్నట్లు, కొత్త ''ఇస్క్రా'' ప్రాతినిధ్యం వహిస్తున్న సోషల్ డెమొక్రసీ దక్షిణ పక్షానికి వైదొలగడం వల్లనా, లేక, కొత్త ''ఇస్క్రా''వాళ్ళు నమ్ముతున్నట్లు, ''మెజారిటీ,'' ''వ్పెర్యోద్,'' వగైరాలు ప్రాతినిధ్యం వహిస్తున్న సోషల్ డెమొక్రసీ వామ పక్షానికి వైదొలగడం వల్లనా?

యీ ప్రశ్నకు జవాబు, మేము గుర్తుచేసినట్లు, వివిధ సాంఘిక శక్తుల ఆచరణయొక్క వస్తుగత సమ్మేళనంచేత నిర్ణయింపబడుతుంది. యీ శక్తుల స్వభావం రష్యన్ జీవితం గురించిన మార్క్సిస్టు పరిశీలనచేత సిద్ధాంతరీత్యా నిర్వచింపబడింది; ప్రస్తుతం అది విప్లవ గతిలో బృందాల, వర్గాల బహిరంగ చర్యలవల్ల ఆచరణరీత్యా నిర్ణయింపబడుతున్నది. మనం యిప్పుడు దాటుతున్న దశకు చాలాముందు మార్క్సిస్టులు చేసిన సమస్త సిద్ధాంత పరిశీలనా, విప్లవ ఘటనల అభివృద్ధిని గురించిన సకల పరిశీలనలూ తెలియజేసేదేమంటే, వస్తుగత పరిస్థితుల దృష్ట్యా రష్యాలో విప్లవానికి రెండు సాధ్యమైన గతులూ, ఫలితాలూ వున్నాయి. బూర్జువా ప్రజాతంత్ర పద్ధతుల్లో రష్యాలోని ఆర్థిక రాజకీయ వ్యవస్థ మార్పు చెందడం తప్పనిసరి, తప్పించుకోరానిది. ప్రపంచంలో యే శక్తీ అలాంటి మార్పును నివారించ లేదు. కానీ, దానిని నిర్వహిస్తున్న ప్రస్తుత శక్తుల సంయుక్త చర్య రెండు విధాలలో యేదో ఒక విధంగా పర్యవసించవచ్చు, ఆ మార్పుకు గల రెండు రూపాలలో యేదో ఒకదానిని కలిగించవచ్చు. 1) ''జారిజంమీద విప్లవంయొక్క నిర్ణయాత్మక విజయం''లో పరిస్థితులు ముగుస్తాయి, లేదా 2) నిర్ణయాత్మక విజయానికి బలాలు చాలక, జారిజంకూ, బూర్జువా వర్గంలోని అత్యంత ''అస్థిర,'' అత్యంత ''స్వార్థపూరిత'' శక్తులకూ మధ్య కుదిరే బేరంలో పరిస్థితులు ముగుస్తాయి. మొత్తంమీద, యెవరూ ముందే చూడజాలనట్టి, అనంత వైవిధ్యం గల వివరాలూ, సమ్మేళనాలూ యీ రెంటిలో యేదో ఒక ఫలితానికి దారితీస్తాయి.

యిక యీ రెండు సంభావ్యతలనూ, ఒకటి, వాటి సాంఘిక ప్రాముఖ్యం దృష్ట్యానూ, రెండు, యీ ఫలితంలో గానీ, ఆ ఫలితంలో గానీ సోషల్ డెమొక్రటిక్ పార్టీ వైఖరి (అది ''లీనమైపోవడం,'' లేదా ''దాని చేతులు కట్టివేయబడడం'') దృష్ట్యానూ పరిశీలిద్దాం.

''జారిజంమీద విప్లవంయొక్క నిర్ణయాత్మక విజయం'' అంటే యేమిటి? యీ నుడికారాన్ని వాడడంలో కొత్త ''ఇస్క్రా''వాళ్ళు దాని తక్షణ రాజకీయ ప్రాముఖ్యాన్ని కూడా

గ్రహించడం లేదని మనం యింతకు ముందే గమనించినాము. యీ ఘర్షణయొక్క వర్గ సారాంశాన్ని వాళ్ళు యింకా తక్కువ గ్రహించినట్లు కనపడుతుంది. నిశ్చయంగా, అనేక విప్లవ ప్రజాతంత్రవాదుల (గపోన్ లాంటివాళ్ల) లాగ, "విప్లవం," "రష్యన్ మహా విప్లవం" లాంటి మాటలచేత మార్క్సిస్టులం యెట్టి పరిస్థితులలోనూ మోసపోకూడదు. యే సాంఘిక శక్తులు "జారిజం"కు (అందరికీ పరమ సులభంగా అర్థమయ్యే నిజమైన శక్తి అయినట్టి దానికి) వ్యతిరేకంగా వున్నదీ, దానిమీద "నిర్ణయాత్మక విజయం" సంపాయించ గలిగిందీ మనకు నిశ్చితమైన జ్ఞానం వుండాలి. బడా బూర్జువావర్గమూ, భూస్వాములూ, ఫ్యాక్టరీ సొంతదార్లూ — "ఒస్వొబొజ్దేనియె"వాళ్లను అనుసరించే "సమాజం" — అలాంటి శక్తి కాజాలదు. వాళ్లు నిర్ణయాత్మక విజయాన్ని కోరను కూడా కోరరని మనకు కనపడుతున్నది. వాళ్ల వర్గ స్థానం మూలంగా వాళ్లకు జారిజంతో నిర్ణయాత్మక పోరాటం చేసే శక్తి లేదని మనకు తెలుసు. నిర్ణయాత్మక పోరాటంలో ప్రవేశించడానికి వీలులేనంత గాఢంగా వాళ్లని సొంత ఆస్తీ, పెట్టుబడీ, భూమీ బంధిస్తున్నాయి. జారిజం ధ్వంసం కావాలని కోరడానికి వీలులేనంత యెక్కువగా వాళ్లకు జారిజంతో అవసరం వుంది, దాని బ్యూరాక్రటిక్, పోలీసు, మిలిటరీ శక్తులను శ్రామికవర్గంమీదా, రైతాంగంమీదా, ఉపయోగించడానికి. "జారిజంమీద నిర్ణయాత్మక విజయం" సంపాయించగల ఏకైక శక్తి ప్రజలు, అనగా శ్రామికవర్గమూ, రైతాంగమూ — రెండు ప్రధాన, గొప్ప శక్తులను తీసుకొని, గ్రామీణ, పట్టణ పెటీబూర్జువావర్గాన్ని (యిది కూడా "ప్రజల"లో భాగమే) ఆ రెంటి మధ్య పంచితే. "జారిజంమీద విప్లవంయొక్క నిర్ణయాత్మక విజయం" అంటే శ్రామిక వర్గంయొక్కా, రైతాంగంయొక్కా విప్లవ ప్రజాతంత్ర నియంతృత్వాన్ని నెలకొల్పడం. "వ్పెర్యోద్" యేనాడో సూచించిన యీ నిర్ణయంనుండి మన కొత్త "ఇస్క్రా"వాళ్ళు తప్పించుకోలేరు. యే యితర శక్తీ జారిజంమీద నిర్ణయాత్మక విజయం సంపాయించదు.

ఆ విజయం సరిగ్గా నియంతృత్వంగా వుంటుంది; అనగా, అది సైనిక శక్తిమీదా, జనాలను సాయుధం చేయడంమీదా, తిరుగుబాటుమీదా తప్పనిసరిగా ఆధారపడాలి, "చట్టబద్ధ," "శాంతియుత" పద్ధతిలో నెలకొల్పబడిన యేదో ఒక రకం సంస్థలమీద కాదు. అది నియంతృత్వంగా మాత్రమే వుండగలదు; యెందుకంటే, శ్రామికవర్గానికీ, రైతాంగానికీ తక్షణమే, విధిగా ఆవశ్యకమైన మార్పులు సాధించడం భూస్వాములనుండీ, బడా బూర్జువాలనుండీ, జారిజంనుండీ తెంపరి ప్రతిఘటనను ఉత్పన్నం చేస్తుంది. నియంతృత్వం లేకుండా ఆ ప్రతిఘటనను బద్దలుచేసి, విప్లవ ప్రతీఘాత ప్రయత్నాలను తిప్పికొట్టడం అసాధ్యం. కానీ, సహజంగానే, అది సోషలిస్టు నియంతృత్వంగా కాక ప్రజాతంత్ర నియంతృత్వంగా వుంటుంది. అది (విప్లవాభివృద్ధిలోని మధ్యంతర దశల పరంపర లేకుండా) పెట్టుబడిదారీ వ్యవస్థ

పునాదులను మార్చజాలదు. మహా అయితే, అది భూ ఆస్తిని రైతాంగానికి అనుకూలంగా సమూలమైన పునఃపంపకం చేయవచ్చు; రిపబ్లిక్‌ను రూపొందించడంతో సహా స్థిరమైన, పరిపూర్ణమైన ప్రజాస్వామ్యం నెలకొల్పవచ్చు, గ్రామీణ జీవితంలోనే కాక, ఫాక్టరీ జీవితంలో కూడా ఆసియా రకం బానిసత్వపు దమనశీల లక్షణా లన్నిటినీ నిర్మూలించవచ్చు, కార్మికుల పరిస్థితులను సమగ్రంగా మెరుగుపరచడానికీ, వాళ్ల జీవన ప్రమాణం పెరగడానికీ పునాది వేయవచ్చు, యిక "last but not least"* — విప్లవ దావాగ్నిని యూరప్‌లోకి తీసుకపోవచ్చు. ఆ విజయం యేవిధంగానూ మన బూర్జువా విప్లవాన్ని సోషలిస్టు విప్లవంగా మార్చదు; ప్రజాతంత్ర విప్లవం బూర్జువా సామాజిక, ఆర్థిక సంబంధాల హద్దులను వెంటనే దాటిపోలేదు; అయినప్పటికీ, రష్యాయొక్క, యావత్తు ప్రపంచంయొక్క భావి అభివృద్ధికి ఆ విప్లవ ప్రాముఖ్యం అపారంగా వుంటుంది. రష్యాలో యిప్పుడు ప్రారంభమైన విప్లవపు నిర్ణయాత్మక విజయం లాగ యేదీ ప్రపంచ శ్రామికవర్గపు విప్లవ శక్తిని పెంచదు, దాని సంపూర్ణ విజయానికి దారితీసే మార్గపు దూరాన్ని తగ్గించదు.

ఆ విజయం యెంతవరకు సాధ్యమనేది వేరు విషయం. యీ విషయంలో అసమంజసమైనంతగా ఆశ పెట్టుకునే ధోరణి మనకు యెంతమాత్రమూ లేదు; యీ కర్తవ్యంలోని అపారమైన కష్టాలను మనం క్షణమాత్రం కూడా మరచిపోము; కానీ, మనం పోరాడడానికి పూనుకున్నాము గనుక, విజయాన్ని కాంక్షించాలి, సరైన మార్గాన్ని చూపించాలి. ఆ విజయానికి దారితీయగల ధోరణులు నిస్సందేహంగా వున్నాయి. నిజమే, కార్మికజన బాహుళ్యంమీద మన ప్రభావం — సోషల్ డెమోక్రటిక్ ప్రభావం — యింకా చాలా చాలా అరకొరగా వుంది; రైతు జన సామాన్యంమీద విప్లవకర ప్రభావం గణనీయంగా లేదు; కార్మికులూ, ముఖ్యంగా రైతులూ దారుణంగా అనైక్యంగా, వెనుకబడి, అజ్ఞానంలో వున్నారు. కానీ విప్లవం వేగంగా ఐక్యపరుస్తుంది, వేగంగా వికాసవంతుల్ని చేస్తుంది. దాని అభివృద్ధిలో ప్రతి అడుగూ జనాలను ఉత్తేజితం చేస్తుంది. వాళ్లను విప్లవ కార్యక్రమంవైపుకు, తమ నిజమైన, ప్రాణప్రదమైన ప్రయోజనాలను సంపూర్ణంగా, స్థిరంగా వ్యక్తంచేసే ఏకైక కార్యక్రమంగా, ప్రబలమైన శక్తితో ఆకర్షిస్తుంది.

చలన శాస్త్ర (mechanics) నియమాల ప్రకారం, చర్యా, ప్రతిచర్యా యెల్లప్పుడూ సమానం. చరిత్రలో కూడా, విప్లవంయొక్క వినాశకర శక్తి స్వేచ్ఛ కొరకు జరిగే కృషిని అణచివేయడం యెంత బలంగా, యెంత దీర్ఘకాలంగా జరిగిందనేదానిమీదా, కాలం తీరిన ''ఉపరినిర్మాణా''నికీ, మన కాలపు సజీవ శక్తులకూ మధ్య గల వైరుధ్యం యెంత

---

* చివరిదే కాని అముఖ్యమైనది కాదు. — సం.

ప్రగాఢంగా వున్నదనేదానిమీదా గణనీయమైన మేరకు ఆధారపడుతుంది. అంతర్జాతీయ రాజకీయ పరిస్థితి కూడా అనేక విషయాలలో రష్యన్ విప్లవానికి అత్యంత అనుకూలంగా రూపుదాలుస్తున్నది. కార్మిక, కర్షకుల తిరుగుబాటు యిప్పటికే ప్రారంభమైంది; అది చెదరుమదరుగా, సద్యోజనితంగా, దుర్బలంగా వుంది; కానీ, నిర్ణయాత్మక పోరాటం చేయడానికీ, నిర్ణయాత్మక విజయంవైపు పురోగమించడానికీ సామర్థ్యం గల శక్తుల ఉనికిని అది తిరుగులేకుండా, సందేహంలేకుండా రుజువుచేస్తుంది.

యీ శక్తులు అరకొరగా వుంటే, ఒప్పందం కుదుర్చుకోడానికి జారిజంకు వ్యవధి వుంటుంది; ఒప్పందాన్ని యీ కొసనా, ఆ కొసనా బులీగిన్‌లూ, స్ట్రూవెలూ యిప్పటికే సిద్ధంచేస్తున్నారు. అప్పుడు మొత్తం వ్యవహారమంతా పరిమిత రాజ్యాంగంతో ముగుస్తుంది, లేదా, కీడులోకెల్ల కీడు సంభవిస్తే, అపహాస్యకరమైన రాజ్యాంగంతో ముగుస్తుంది. యిది కూడా "బూర్జువా విప్లవం"గానే వుంటుంది, కానీ యిది గర్భస్రావం, అకాల ప్రసూతి, నెలతక్కువ బిడ్డగా వుంటుంది. సోషల్ డెమోక్రసీ దీన్ని గురించి యే భ్రమలూ పెట్టుకోదు. దానికి బూర్జువావర్గపు ద్రోహ స్వభావం తెలుసు; అది ధైర్యం కోల్పోదు, బూర్జువా రాజ్యాంగబద్ధ "షీపావ్" స్వర్గానికి చెందిన అత్యంత నీరసపు సాదా దినాల్లో కూడా శ్రామిక వర్గానికి పట్టు సడలని, ఓర్పుతో కూడిన, యెడతెగని వర్గ శిక్షణ యిచ్చే పనిని విసర్జించదు. ఆ ఫలితం యూరప్‌లోని పందొమ్మిదవ శతాబ్దపు దాదాపు అన్ని ప్రజాతంత్ర విప్లవాలలాగే రమారమిగా వుంటుంది; అప్పుడు మన పార్టీ అభివృద్ధి కష్టమైన, దీర్ఘమైన, కానీ పరిచితమైన, నలిగిన దారివెంట ముందుకు పోతుంది.

యిప్పుడు ఉత్పన్నమయ్యే ప్రశ్న యేమిటంటే: సంభావ్యమైన యీ రెండు ఫలితాల్లో దేనిలో సోషల్ డెమోక్రసీ చేతులు అస్థిర, స్వార్థపూరిత బూర్జువావర్గంతో చేసే పోరాటంలో వాస్తవంగా కట్టివేయబడతాయి, దేనిలో అది బూర్జువా ప్రజాస్వామ్యంలో వాస్తవంగా "లీనమైపోవడం," లేదా దాదాపు "లీనమైపోవడం" జరుగుతుంది?

యీ ప్రశ్నను స్పష్టంగా వేసుకుంటే చాలు, క్షణిక కష్టం కూడా లేకుండా జవాబు వస్తుంది.

బూర్జువావర్గం జారిజంతో ఒప్పందానికి రావడంద్వారా రష్యన్ విప్లవాన్ని భగ్నం చెయ్యగలిగితే, సోషల్ డెమోక్రట్ల చేతులు అస్థిర బూర్జువావర్గంతో చేసే పోరాటంలో వాస్తవంగా కట్టుబడిపోతాయి; శ్రామికవర్గం విప్లవంమీద తన స్పష్టమైన ముద్రను వేయజాలక పోవడమూ, శ్రామికవర్గ పద్ధతిలో, లేదా ఒకసారి మార్క్స్ అన్నట్లు, "సామాన్యుల పద్ధతిలో" జారిజంతో తేల్చుకోజాలక పోవడమూ అనే అర్థంలో సోషల్ డెమోక్రసీ బూర్జువా ప్రజాస్వామ్యంలో "లీనమైపోతుంది."

విప్లవం నిర్ణయాత్మక విజయం పొందితే—అప్పుడు మనం జారిజంతో జాకొబిన్ పద్ధతిలో, లేదా మీకు యిష్టమైతే, సామాన్యుల పద్ధతిలో తేల్చుకుంటాము. "ఫ్రెంచి టెరరిజం అంతా బూర్జువావర్గపు శత్రువులతోనూ నిరంకుశత్వంతోనూ, ఫ్యూడలిజంతోనూ, పశుబుద్ధితోనూ, సామాన్యుల పద్ధతిలో తేల్చుకోవడం తప్ప మరేమీ కాదు" అని 1848లో మార్క్స్ ప్రసిద్ధమైన "నోయె రైనిషె సైటుంగ్" పత్రికలో రాసినాడు (చూః "Marx Nachlass," మేరింగ్ కూర్పు, సంపుటం III, పేజి 211).[93] ప్రజాతంత్ర విప్లవ కాలంలో రష్యాలోని సోషల్ డెమొక్రటిక్ కార్మికులను "జాకొబినిజం" అనే భూతంతో భయపెట్టడానికి ప్రయత్నించేవాళ్లు మార్క్స్ చెప్పిన యీ మాటల ప్రాముఖ్యాన్ని గురించి యెప్పుడైనా ఆలోచించినారా?

సమకాలిక రష్యన్ సోషల్ డెమొక్రసీకి చెందిన జిరోండిస్టులు, కొత్త "ఇస్క్రా" వాళ్లు, "ఒస్వొబొజ్దేనియె"వాళ్లలో లీనం కారు, కానీ వాస్తవంలో, తమ నినాదాల స్వభావం దృష్ట్యా, వాళ్ల వెనుక వెళ్తారు. యిక "ఒస్వొబొజ్దేనియె"వాళ్లు, అనగా ఉదారవాద బూర్జువా వర్గ ప్రతినిధులు, నిరంకుశత్వంతో సంస్కరణవాద పద్ధతిలో, సౌమ్యంగా, అణకువగా, ప్రభువర్గాన్నీ, కులీనులనూ, రాజ్యాస్థానాన్నీ నొప్పించకుండా—జాగ్రత్తగా, దేనినీ పగలగొట్టకుండా—తెల్ల గ్లౌలు (రక్త పంకిల నీకొలస్ "ప్రజా ప్రతినిధులకు" (?) యిచ్చిన దర్శనంలో[94] ధరించడానికి పెత్రుంకేవిచ్ ఒక మొరటు అధికారినుండి అరువు తెచ్చుకున్నలాంటివి—చూః "ప్రొలెతారియ్," నం. 5*) ధరించిన పెద్దమనుషులకు తగినట్లు దయగా, వినయంగా తేల్చుకోవాలని కోరుతారు.

సమకాలిక సోషల్ డెమొక్రసీకి చెందిన జాకొబిన్‌లు—అనగా బోల్షెవిక్కులు, లేదా "వ్పెర్యోద్" మద్దతుదార్లు, లేదా "మహాసభ" బృందం, లేదా "ప్రొలెతారియ్" మద్దతుదార్లు[95], లేదా మరే పేరుపెట్టినా సరే—తమ నినాదాలద్వారా విప్లవ, రిపబ్లికన్ పెటీ బూర్జువావర్గాన్ని, ముఖ్యంగా రైతాంగాన్నీ ఒక వర్గంగా తన వ్యక్తిత్వాన్ని పూర్తిగా నిలుపుకునే శ్రామికవర్గాన్ని స్థిరమైన ప్రజాస్వామ్యవాద స్థాయికి లేవనెత్తాలని కోరుతారు. ప్రజలు, అనగా శ్రామికవర్గమూ, రైతాంగమూ, రాజరికంతోనూ, ప్రభువర్గంతోనూ "సామాన్యుల పద్ధతి"లో తేల్చుకోవాలనీ, స్వేచ్ఛ శత్రువులను నిర్దాక్షిణ్యంగా నాశనం చేయాలనీ, వాళ్ల ప్రతిఘటనను బలంతో నలిపివేయాలనీ, ఫ్యూడల్ దాస యాజమాన్యమూ, ఆసియా రకం ఆటవికతత్వమూ, మానవ నైచ్యమూ అనేవాటి పాపిష్ఠి వారసత్వానికి యేవిధమైన మినహాయింపులూ యివ్వకూడదనీ వాళ్లు [సమకాలిక జాకొబిన్‌లు] కోరుతారు.

* "తెల్ల గ్లౌలు ధరించిన 'విప్లవకారులు'" అనే లెనిన్ వ్యాసానికి యిక్కడ ప్రస్తావన. — సం.

అంటే, సహజంగానే, 1793 నాటి జాకొబిన్‌లను అనుకరించాలనీ, వాళ్ల అభిప్రాయాలనూ, కార్యక్రమాన్నీ, నినాదాలనూ, ఆచరణ పద్ధతులనూ అరువు తెచ్చుకోవాలనీ మనం విధిగా ప్రతిపాదిస్తున్నామని దీని అర్థం కాదు. అలాంటిదేమీ లేదు. మన కార్యక్రమం పాతది కాదు, కొత్తది – రష్యన్ సోషల్ డెమొక్రటిక్ లేబర్ పార్టీ కనీస కార్యక్రమం. మనకు ఒక కొత్త నినాదం వుంది: శ్రామికవర్గంయొక్కా, రైతాంగంయొక్కా విప్లవ ప్రజాస్వామిక నియంతృత్వం. విప్లవంయొక్క నిజమైన విజయాన్ని చూసిందాకా మనం బతికితే, సంపూర్ణ సోషలిస్టు విప్లవం కొరకు కృషిచేస్తున్న కార్మికవర్గ పార్టీ స్వభావానికీ, లక్ష్యాలకూ అనుగుణమైన కొత్త ఆచరణ పద్ధతులు కూడా మనకు వుంటాయి. పై పోలిక ద్వారా మేము కేవలం యిది వివరించ గోరుతున్నాము: పద్దెనిమిదవ శతాబ్దపు ప్రగతిశీల వర్గమైన బూర్జువావర్గపు ప్రతినిధులు జిరోండిస్టులుగా, జాకొబిన్‌లుగా విభజింపబడినట్లే, యిరవయ్యవ శతాబ్దపు ప్రగతిశీల వర్గమైన శ్రామికవర్గపు ప్రతినిధులు, అనగా సోషల్ డెమొక్రట్లు రెండు పక్షాలుగా (అవకాశవాద, విప్లవకర పక్షాలుగా) విభజింపబడివున్నారు. ప్రజాతంత్ర విప్లవం సంపూర్ణ విజయం పొందే పక్షంలో మాత్రమే, అస్థిర బూర్జువా వర్గంతో చేసే పోరాటంలో శ్రామికవర్గపు చేతులు స్వేచ్ఛగా వుంటాయి; ఆ పక్షంలో మాత్రమే అది బూర్జువా ప్రజాస్వామ్యంలో ''లీనమై'' పోకుండా, తన శ్రామికవర్గ ముద్రను, యింకా బాగా చెప్పాలంటే కార్మికవర్గ రైతాంగ ముద్రను, మొత్తం విప్లవంమీద వదలుతుంది.

ఒక్క మాటలో చెప్పాలంటే, అస్థిర బూర్జువా ప్రజాస్వామ్యంతో చేసే పోరాటంలో తన చేతులు కట్టివేయబడకుండా వుండాలంటే, శ్రామికవర్గం వర్గచైతన్యపూరితంగా వుండాలి, రైతాంగాన్ని విప్లవ చైతన్యోత్తేజితం చేయడానికి, దాని దాడికి మార్గదర్శకత్వం వహించడానికీ, తద్వారా స్థిరమైన శ్రామికవర్గ ప్రజాస్వామ్యవాద పంథాను స్వతంత్రంగా అనుసరించడానికీ తగినంత బలంగా వుండాలి.

అస్థిర బూర్జువావర్గంతో చేసే పోరాటంలో మన చేతులు కట్టివేయబడివుండే ప్రమాదం అనే సమస్యలో – కొత్త ''ఇస్క్రా''వాళ్లు అంత అప్రస్తుతంగా చర్చించినదానిలో – వున్న పరిస్థితులు అవి. బూర్జువావర్గం యెల్లప్పుడూ అస్థిరంగా వుంటుంది. ఫలానా షరతులూ, అంశాలూ తీరితే, బూర్జువా ప్రజాస్వామ్యాన్ని ప్రజల మనఃపూర్వక మిత్రునిగా మనం పరిగణించవచ్చునని, ఆ షరతులనూ, అంశాలనూ పేర్కొనడానికి చేసే ప్రయత్నాల*కంటె

---

* మూడవ మహాసభ తోసిపుచ్చిన స్త్రరోవేర్ తీర్మానంలో, జరిగిన ప్రయత్నాల లాంటివి, దానిలాగే అధ్వాన్నమైన తీర్మానంలో కాన్ఫరెన్సు చేసిన ప్రయత్నాల లాంటివి.[96]

అమాయకమైనదీ, నిరుపయోగమైనదీ మరేమీ వుండదు. శ్రామికవర్గం మాత్రమే ప్రజా స్వామ్యం కొరకు స్థిరమైన పోరాటం చేసే యోధుడుగా వుండగలదు. తన విప్లవ పోరాటంలో రైతు జనాలు కలిసినప్పుడు మాత్రమే అది ప్రజాస్వామ్యం కొరకు విజయవంతమైన పోరాటం చేసే యోధుడు కాగలదు. శ్రామికవర్గం యీ పోరాటానికి తగినంత బలంగా లేకపోతే, బూర్జువావర్గం ప్రజాతంత్ర విప్లవ అగ్రభాగాన వుండి, దానికి అస్థిర, స్వార్థపూరిత స్వభావం యిస్తుంది. శ్రామికవర్గంయొక్క, రైతాంగంయొక్క విప్లవ ప్రజాతంత్ర నియంతృత్వం తప్ప యేదీ దీనిని నివారించజాలదు.

యీవిధంగా, మనం యీ నిస్సందేహమైన నిర్ణయానికి వస్తున్నాము: కొత్త ''ఇస్క్రా'' యెత్తుగడలే తమ వస్తుగత ప్రాముఖ్యం ద్వారా బూర్జువా ప్రజాతంత్రవాదులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయి. జనవాక్య సేకరణదాకా పోయే సంస్థాగత వికీర్ణతను బోధించడమూ, రాజీ పడాలనే సూత్రమూ, పార్టీనుండి పార్టీ సారస్వతాన్ని విడదీయడమూ; సాయుధ తిరుగుబాటు లక్ష్యాలను తక్కువగా చూడడమూ; విప్లవ శ్రామికవర్గపు యావన్మంది ప్రజల రాజకీయ నినాదాలను రాజరికవాద బూర్జువావర్గపు నినాదాలతో గంద్రగోళపరచడమూ; ''జారిజంమీద విప్లవంయొక్క నిర్ణయాత్మక విజయానికి'' అవసరమైన వాటిని వక్రీకరించడమూ – యివన్నీ కలిసి సరిగ్గా యేదైతే శ్రామికవర్గాన్ని భయభ్రాంతంచేసి, విసంఘటితం చేసి, దాని అవగాహనను గంద్రగోళపరచి, విజయానికి గల ఏకైక మార్గాన్ని చూపించడానికీ, ప్రజలలోని సకల విప్లవ, రిపబ్లికన్ శక్తులనూ శ్రామికవర్గ నినాదానికి అంటిపెట్టుకునేటట్లు చేయడానికీ బదులు సోషల్ డెమోక్రసీ యెత్తుగడలను తక్కువగా చూస్తుందో ఆ తోకవాదపు విధానాన్ని విప్లవ కాలంలో ఉత్పన్నం చేస్తాయి.

---

తీర్మానాన్ని పరిశీలించడం ద్వారా మనకు కలిగిన యీ నిర్ణయాన్ని ధ్రువపరచడానికి, యిదే సమస్యను యితర కోణాలనుండి చూద్దాం. మొదట, జార్జియన్ పత్రిక ''సోత్సియాల్ డెమోక్రట్''లో నిష్కపటీ, ఉన్నదున్నట్లు మాట్లాడేవాడూ అయిన ఒక మెన్షెవిక్ కొత్త ''ఇస్క్రా'' యెత్తుగడలకు యెలా ఉదాహరణలు యిచ్చేదీ చూద్దాం. రెండవది, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో యెవరు వాస్తవంగా కొత్త ''ఇస్క్రా'' నినాదాలను ఉపయోగిస్తున్నదీ చూద్దాం.

# 7. "ప్రభుత్వంనుండి యధాతధవాదులను తొలగించే" యెత్తుగడలు

పైన ప్రస్తావించిన తిఫ్లిస్ మెన్షివిక్ "కమిటీ" పత్రిక ("సోత్సియాల్ డెమోక్రట్," నం. 1)లోని వ్యాసం పేరు "జేమ్‌స్కీ సొబోర్, మన యెత్తుగడలూ." దాని రచయిత మన కార్యక్రమాన్ని యింకా పూర్తిగా మరచిపోలేదు; అతను రిపబ్లిక్ నినాదం యిస్తున్నాడు, కానీ అతను యెత్తుగడలను చర్చించే తీరు యిదీ:

> "యీ లక్ష్యాన్ని (రిపబ్లిక్‌ను) సాధించడానికి రెండు మార్గాలు సూచించవచ్చు: ప్రభుత్వం సమావేశపరుస్తున్న జేమ్‌స్కీ సొబోర్‌ను [జాతీయ అసెంబ్లీ] పూర్తిగా ఉపేక్షించి, ప్రభుత్వాన్ని ఆయుధ బలంతో ఓడించి, విప్లవ ప్రభుత్వాన్ని స్థాపించి, రాజ్యాంగ నిర్ణయసభను సమావేశపరచడమూ, లేదా జేమ్‌స్కీ సొబోర్‌ను మన ఆచరణ కేంద్రంగా ప్రకటించి, దాని అంగనిర్మాణాన్నీ, కార్యకలాపాలనూ ఆయుధ బలంతో ప్రభావితం చేసి, అదే రాజ్యాంగ నిర్ణయసభ అయ్యేటట్లు గానీ, లేదా దానిద్వారా రాజ్యాంగ నిర్ణయసభను సమావేశపరచేటట్లు గానీ దాన్ని బలవంతంగా నిర్బంధపరచడమూ. యీ రెండు యెత్తుగడలూ పరస్పరం చాలా భిన్నమైనవి. వీటిలో యేది మనకు యెక్కువ అనుకూలమో చూద్దాం."

మనం పరిశీలించిన తీర్మానంలో తరువాత చేర్చబడిన భావాలను రష్యన్ కొత్త "ఇస్క్రా"వాళ్లు యిలా వెల్లడిస్తున్నారు. యిది చుసీమ యుద్ధానికి[97] ముందు, బులీగిన్ "బిల్లు" యింకా ప్రకటింపబడక ముందు రచింపబడిందని గుర్తుపెట్టుకోండి. ఉదార వాదులు కూడా సహనం కోల్పోతున్నారు, తమ అపనమ్మకాన్ని చట్టబద్ధ పత్రికల్లో వ్యక్తం చేస్తున్నారు; కానీ కొత్త "ఇస్క్రా" రకానికి చెందిన ఒక సోషల్ డెమోక్రట్ ఉదారవాదుల కంటె మరింత బోలాగా వున్నాడు. అతను జేమ్‌స్కీ సొబోర్ "సమావేశపరచబడుతున్న" దని ప్రకటిస్తూ, యిప్పటికింకా పుట్టని జేమ్‌స్కీ సొబోర్‌ను (లేక బహుశా "స్టేట్ దూమ," లేదా "సలహా శాసనసభ"నా?) మన ఆచరణ కేంద్రంగా చేయాలని ప్రతిపాదించేటంతగా జారును నమ్ముతున్నాడు. కాన్ఫరెన్సులో ఆమోదించబడిన తీర్మానాన్ని రచించిన వాళ్లకంటె నిష్కపటంగా, సూటిగా మాట్లాడేవాడైనందువలన మన తిఫ్లిస్ మనిషి యీ రెండు యెత్తుగడలనూ (నమ్మశక్యంగాని అమాయకత్వంతో అతను వివరించినవాటిని) సమానంగా పెట్టడు, రెండవది యెక్కువ "అనుకూలం" అని ప్రకటిస్తాడు. వినండి:

''మొదటి యెత్తుగడ. మీకు తెలిసినట్లు, వచ్చే విప్లవం బూర్జువా విప్లవం; అనగా, శ్రామికవర్గానికి మాత్రమే కాక, మొత్తం బూర్జువా సమాజానికి లాభకరమైన మార్పులను ప్రస్తుత వ్యవస్థలో తీసుకరావడం దాని ప్రయోజనం. ప్రభుత్వానికి అన్ని వర్గాలూ వ్యతిరేకంగా వున్నాయి, చివరకు పెట్టుబడిదార్లు కూడా. సమరశీల శ్రామికవర్గమూ, సమరశీల బూర్జువావర్గమూ ఒక విధంగా కలిసి నడుస్తూ, నిరంకుశత్వంమీద భిన్న పార్శ్వాలనుండి సంయుక్తంగా దాడిచేస్తున్నారు. ప్రభుత్వం పూర్తిగా ఏకాకి అయిపోయింది; దానికి ప్రజల సానుభూతి యేమీ లేదు. యీ కారణం వలన దాన్ని ధ్వంసం చేయడం చాలా సులభం. రష్యన్ శ్రామికవర్గం మొత్తంగా చూస్తే, తనంతకు తానే విప్లవాన్ని నిర్వహించడానికి యిప్పటికింకా తగినంత వర్గచైతన్యపూరితమూ, సంఘటితమూ కాదు. అది తనంతకు తానే విప్లవాన్ని నిర్వహించగలిగితే కూడా, అది శ్రామికవర్గ (సోషలిస్టు) విప్లవాన్ని నిర్వహిస్తుంది గానీ, బూర్జువా విప్లవాన్ని కాదు. కనుక, ప్రభుత్వం పొత్తుదార్లు లేకుండా వుండడమూ, అది ప్రతిపక్షాన్ని విభజించి, బూర్జువావర్గంతో చేతులు కలిపి, శ్రామికవర్గాన్ని యేకాకిని చేయడానికి అసమర్థంగా వుండడమూ మనకు లాభకరం....''

జారిస్టు ప్రభుత్వం బూర్జువావర్గాన్నీ, శ్రామికవర్గాన్నీ విభజించడానికి అసమర్థంగా వుండడం శ్రామికవర్గానికి లాభకర మన్నమాట! యీ జార్జియన్ పత్రికను ''ఒస్వొబొజ్దేనియె'' అనకుండా ''సోత్సియాల్ డెమొక్రట్'' అనడం పొరపాటువల్ల కాదా? దాని సాటిలేని ప్రజాతంత్ర విప్లవ తత్వాన్ని గమనించండి! పాపం యీ తిఫ్లిస్ మనిషి ''బూర్జువా విప్లవ'' భావానికి ఛాందస పండితులు యిచ్చే లోకవాదపు వ్యాఖ్యానంచేత పూర్తిగా గంద్రగోళపడినాడనేది తేటతెల్లంగా లేదా? ప్రజాతంత్ర విప్లవంలో శ్రామికవర్గం యేకాకి అయ్యే అవకాశాన్ని అతను చర్చిస్తాడు, కానీ ఒక స్వల్ప విషయాన్ని మరిచిపోయినాడు... రైతాంగాన్ని! శ్రామికవర్గానికి వుండగల పొత్తుదార్లలో అతను జేమ్‌స్త్వొ భూస్వాములను యెరుగును, వాళ్లను అభిమానిస్తాడు, కానీ రైతులను అతను యెరగడు. అందులోనూ యిది కాకసస్‌లో! కొత్త ''ఇస్క్రా'' తన వాదంలో, విప్లవకర రైతాంగాన్ని తన పొత్తుదారుని స్థాయికి లేవనెత్తడానికి బదులు, రాజరికవాద బూర్జువావర్గం స్థాయికి దిగజారుతున్నదని మనం చెప్పడం ఒప్పు కాదా?

''...లేకపోతే, శ్రామికవర్గ అపజయమూ, ప్రభుత్వ విజయమూ అనివార్యం. సరిగ్గా దీనికొరకే నిరంకుశత్వం కృషిచేస్తోంది. తన జేమ్‌స్కీ సొబోర్‌లో అది ప్రభువుల, జేమ్‌స్త్వొల, నగరాల, విశ్వవిద్యాలయాల, అలాంటి బూర్జువా సంస్థల

ప్రతినిధులను తన వైపుకు నిస్సంశయంగా ఆకర్షిస్తుంది. అది చిల్లర సౌకర్యాలతో వాళ్లను తృప్తిపరచడానికీ, తద్వారా వాళ్ళు తనతో రాజీపడడానికీ ప్రయత్నిస్తుంది. అది యీవిధంగా బలపడి, తన దెబ్బల నన్నిటినీ యేకాకిగా చేయబడిన శ్రామిక జనంమీద కురిపిస్తుంది. యీ దురదృష్టకర పర్యవసానాన్ని నివారించడం మన విధి. కానీ, మొదటి పద్ధతిద్వారా దీన్ని నివారించగలమా? జేమ్‌స్కీ సొబోర్‌ను యేమాత్రమూ లక్ష్యపెట్టకుండా, మనమే తిరుగుబాటుకు సన్నాహాలు ప్రారంభించి, ఒక శుభదినాన సాయుధంగా, యుద్ధానికి సిద్ధంగా వీధుల్లోకి వచ్చినామనుకుందాం. ఫలితం యెలా వుంటుందంటే, మనకు ఒక శత్రువు కాక, యిద్దరు శత్రువులు యెదురౌతారు: ప్రభుత్వమూ, జేమ్‌స్కీ సొబోర్. మనం సన్నాహాలు చేసుకుంటూ వుండగా, వాళ్ళు ఒకరితో ఒకరు రాజీపడి, ఒప్పందం చేసుకొని, తమకే అనుకూలంగా వుండే రాజ్యాంగం తయారుచేసి, అధికారాన్ని తమమధ్య పంచుకోగలిగారు. యీ యెత్తుగడ ప్రభుత్వానికి నేరుగా అనుకూలం; దీనిని మనం అత్యంత చురుకుగా నిరాకరించాలి...."

యిది మర్మం లేనిది! తిరుగుబాటుకు సన్నాహాలు చేసే "యెత్తుగడల"ను మనం కృతనిశ్చయంగా నిరాకరించా లన్నమాట, యెందుకంటే ఆమధ్యలో ప్రభుత్వం బూర్జువా వర్గంతో రాజీపడుతుంది గనుక! విప్లవ సోషల్ డెమోక్రసీకి యింత సిగ్గుచేటైన దీనికి దరిదాపుల్లోనైనా వుండేది మిక్కిలి పచ్చి "ఆర్థికవాదపు" పాత సారస్వతంలో యెవరికైనా కనిపిస్తుందా? కార్మిక, కర్షకుల తిరుగుబాట్లూ, ప్రజ్వలనాలూ యిప్పు డొకచోటా, అప్పు డొకచోటా జరుగుతూ వుండడం వాస్తవం. కానీ, జేమ్‌స్కీ సొబోర్ అనేది బులీగిన్ వాగ్దానం. యిక తిఫ్లిస్ నగరపు "సోత్సియాల్ డెమోక్రట్" నిర్ణయించే దేమిటంటే తిరుగుబాటుకు సన్నాహాలు చేసే యెత్తుగడలను నిరాకరించాలనీ, "ప్రభావ కేంద్రం" కొరకు కాచుకోవాలనీ – జేమ్‌స్కీ సొబోర్ కొరకు...

> "...తద్విరుద్ధంగా, రెండవ యెత్తుగడ యేమిటంటే, జేమ్‌స్కీ సొబోర్‌ను మన తనిఖీకిందికి తెచ్చుకోవడమూ, దానికి తన యిష్టం ప్రకారం వ్యవహరించ డానికీ, ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోడానికీ అవకాశం యివ్వకపోవడమూ.*

---

* జేమ్‌స్త్వో సభ్యులకు తమ యిష్టం అనేది లేకుండా చేసే సాధనమేమిటి? బహుశా ప్రత్యేకమైన గీటురాయి ఉపయోగించడం ద్వారానా?

''జేమ్‌స్కీ సొబోర్ నిరంకుశత్వంతో పోరాడుతుంది గనుక, మనం దాన్ని బలపరుస్తాం; అది నిరంకుశత్వంతో రాజీపడినప్పుడల్లా మనం దానితో పోరాడుతాం. చురుకైన జోక్యంద్వారానూ, బలంతోనూ మనం ప్రతినిధుల్లో చీలిక కలిగించి,* తీవ్రవాదులను మనవైపుకు సమీకరించి, యథాస్థితివాదులను ప్రభుత్వంనుండి తొలగించి, ఆవిధంగా మొత్తం జేమ్‌స్కీ సొబోర్‌ను విప్లవ పథంలో పెట్టుతాం. అలాంటి యెత్తుగడల మూలంగా ప్రభుత్వం యెల్లప్పుడూ యేకాకిగా వుంటుంది, ప్రతిపక్షం బలంగా వుంటుంది, ప్రజాతంత్ర వ్యవస్థను నెలకొల్పడం తద్వారా సులభమౌతుంది.''

సరే, సరే! ''ఆర్థికవాదపు'' అత్యంత వెకిలి రూపంవైపు కొత్త ''ఇస్క్రా''వాళ్ల మలుపును మనం అతిశయంగా చెప్తున్నామని యిప్పుడు యెవరినైనా అనమనండి. నిస్సంశయంగా యిది యీగల నిర్మూలించే ప్రసిద్ధమైన పొడిలాంటిది: మొదట యీగను పట్టుకో, తరువాత పొడిని యీగమీద జల్లు, అప్పు డది చచ్చిపోతుంది. బలంతో జేమ్‌స్కీ సొబోర్ ప్రతినిధుల్లో చీలిక కలిగించు, ''యథాస్థితివాదులను ప్రభుత్వంనుండి తొలగించు'' — మొత్తం జేమ్‌స్కీ సొబోర్ విప్లవ పథం అనుసరిస్తుంది.... యేవిధమైన ''జాకొబిన్'' సాయుధ తిరుగుబాటూ లేదు, సరిగ్గా అలాగ, సౌమ్యమైన, దాదాపు పార్లమెంటరీ పద్ధతిలో, జేమ్‌స్కీ సొబోర్ సభ్యులను ''ప్రభావితం చేయడం.''

పాపం రష్యా! అది యెప్పుడూ యూరప్ విసరిపారేసిన పాతకాలపు టోపీలు ధరిస్తుందని అంటారు. మనకింకా పార్లమెంటు అనేది లేదు, బులీగిన్ కూడా పార్లమెంటును వాగ్దానం చేయలేదు, కానీ మనకి పార్లమెంటరీ క్రెటినిజం[98] యెంతైనా వుంది.

''...యీ జోక్యం యెలా సాధించడం? మొట్టమొదట, సార్వజనీన, సమాన వోటుహక్కూ, రహస్య బాలట్‌ద్వారా ప్రత్యక్ష యెన్నికలూ అనే ప్రాతిపదికమీద జేమ్‌స్కీ సొబోర్‌ను సమావేశపరచాలని మనం డిమాండుచేస్తాం. యీ ఎన్నికల కార్యక్రమాన్ని ప్రకటించడంతోపాటు** యెన్నికల ప్రచారం సాగించడానికి సంపూర్ణ స్వేచ్ఛ, అనగా సభా, వాక్, పత్రికా స్వాతంత్ర్యమూ, వోటర్ల, అభ్యర్థుల అనుల్లం

* హారి దేవుడా, యిది నిశ్చయంగా యెత్తుగడలను ''ప్రగాఢం'' చేయడమే! వీధుల్లో పోరాడడానికి బలాలు లేవు, కానీ ''బలంతో'' ''ప్రతినిధులలో చీలిక కలిగించడం'' సాధ్యం. తిఖ్లిన్ కామ్రేడ్, మీరు అబద్ధమాడవలసివస్తే, ఆడండి, కానీ దానికి హద్దు వుంది....

** ''ఇస్క్రా''లోనా?

ఘనీయతా, సకల రాజకీయ ఖైదీల విడుదలా, చట్టం చేయబడాలి.* ప్రజలకు తెలియజేసి, వాళ్లను సిద్ధంచేయడానికి మనకు తగినంత వ్యవధి వుండేటట్లు యెన్నికలు వీలైనంత ఆలస్యంగా జరగాలి. సొబోర్‌ను సమావేశపరచడానికి సంబంధించిన నియమాల రచన ఆంతరంగిక శాఖ మంత్రి బులీగిన్ నాయకత్వాన ఒక కమిషన్‌కు అప్పగించబడింది గనుక, యీ కమిషన్‌మీదా, దీని సభ్యులమీదా మనం ఒత్తిడి ప్రయోగించాలి.** బులీగిన్ కమిషన్ మన డిమాండ్లను తీర్చడానికి నిరాకరించి***, ఆస్తిపరులకు మాత్రమే వోటు హక్కు యిస్తే, అప్పుడు మనం యీ యెన్నికలలో జోక్యం కలిగించుకొని, విప్లవ పద్ధతులద్వారా వోటర్లు ప్రగతిశీల అభ్యర్థులను యెన్నుకునేటట్లు చేసి, జేమ్‌స్కీ సొబోర్‌లో రాజ్యాంగ నిర్ణయసభను డిమాండు చేయాలి. చివరన, మనం సాధ్యమైన అన్ని చర్యలద్వారా — ప్రదర్శనలద్వారా, సమ్మెలద్వారా, అవసరమైతే తిరుగుబాటుద్వారా — రాజ్యాంగ నిర్ణయసభను సమావేశపరచడానికి, లేదా తానే రాజ్యాంగ నిర్ణయసభ అయినట్లు ప్రకటించడానికి జేమ్‌స్కీ సొబోర్‌ను నిర్బంధించాలి. సాయుధ కార్మికవర్గం రాజ్యాంగ నిర్ణయసభకు రక్షకుడుగా వుండాలి, రెండూ కలిసి**** ప్రజాతంత్ర రిపబ్లిక్‌వైపు పురోగమిస్తాయి.

''యివి సోషల్ డెమోక్రటిక్ యెత్తుగడలు, యివి మాత్రమే మనకు విజయం సంపాయిస్తాయి.''

కొత్త ''ఇస్క్రా''కు చెందిన యెవరో కొత్త రచయితనుండి, యే అధికారమూ, పలుకుబడీ లేనివానినుండి, యీ నమ్మశక్యం గాని చెత్త వచ్చిందని పాఠకుడు ఊహించకుండుగాక. యిది కొత్త ''ఇస్క్రా''వాళ్ల ఒక మొత్తం కమిటీ అయిన తిఫ్లిస్ కమిటీ పత్రికలో ప్రకటింపబడింది. అంతే కాదు. యీ చెత్తను ''ఇస్క్రా'' బాహాటంగా ఆమోదించింది. ఆ ''సోత్సియాల్ డెమోక్రట్'' సంచికను గురించి ''ఇస్క్రా'' నం. 100లో యిలా వుంది:

''మొదటి సంచిక ఆసక్తికరమైన, ప్రజ్ఞాయుతమైన పద్ధతిలో వెలువడింది. సమర్థుడైన సంపాదకుడూ, రచయితా అయినవాని అనుభవం గల చేయి కనపడు

---

* నీకొలస్‌చేతనా?

** ''యధాస్థితివాదులను ప్రభుత్వంనుండి తొలగించడ''మంటే యిదన్నమాట!

*** మనం యీ సరైన, గంభీరమైన యెత్తుగడలను అనుసరిస్తే, యిలాంటిది జరగజాలదు కదా!

**** రెండూ అంటే, సాయుధ శ్రామికవర్గమూ, ''ప్రభుత్వంనుండి తొలగించబడిన'' యధాస్థితివాదులూనా?

తున్నది.... తాను పెట్టుకున్న కర్తవ్యాన్ని యీ పత్రిక ఉజ్వలంగా నిర్వహిస్తుందని ధీమాగా చెప్పవచ్చు.''

అవును! కొత్త ''ఇస్క్రా'' ధోరణియొక్క సంపూర్ణ సిద్ధాంత క్షీణతను అందరికీ స్పష్టంగా చూపించడమే ఆ కర్తవ్యమైతే, అది నిజంగా ''ఉజ్వలంగా'' నిర్వహించబడింది. ఉదారవాద బూర్జువా అవకాశవాద స్థాయికి కొత్త ''ఇస్క్రా''వాళ్ల పతనాన్ని యింతకంటె ''ఆసక్తికరమైన, ప్రజ్ఞాయుతమైన, సమర్థమైన'' పద్ధతిలో యెవరూ వ్యక్తం చేయలేరు.

## 8. ''ఒస్వొబొజ్దేనియె,'' కొత్త ''ఇస్క్రా''ల ధోరణులు

కొత్త ''ఇస్క్రా'' ధోరణి రాజకీయ ప్రాముఖ్యాన్ని కళ్లకు కట్టినట్లు ధ్రువపరచే మరొక విషయానికి పోదాం.

''తన్ను తాను తెలుసుకోవడం యెలా'' (''ఒస్వొబొజ్దేనియె,'' నం. 71) అనే శీర్షిక గల అద్భుతమైన, ఉన్నతమైన, అత్యంత జ్ఞానదాయకమైన వ్యాసంలో స్ట్రూవెగారు మన అతివాద పార్టీల ''కార్యక్రమాత్మక విప్లవవాదం''మీద యుద్ధం సాగిస్తున్నాడు. అతను స్వయంగా నాతో మరీ అసంతృప్తి చెందాడు*. నాకు సంబంధించినంత వరకు స్ట్రూవెగారితో

* ''లెనిన్‌యొక్కా, ఆయన సహచరులయొక్కా విప్లవవాదంతో పోలిస్తే, బేబెల్ పశ్చిమ యూరపియన్ సోషల్ డెమోక్రసీకి చెందిన విప్లవవాదం, చివరకు కౌట్స్కీది కూడా, అవకాశవాద మౌతుంది; కానీ, యిప్పటికే మెత్తబరచబడిన యీ విప్లవవాదపు పునాదులు కూడా చరిత్రచేత బలహీనపరచబడి, తుడిచివేయబడినాయి.'' మహా ఆగ్రహపూరితమైన పోటు పొడిచినాడు. కానీ చచ్చిన శత్రువుమీద వేయగలిగినట్లు నామీద నేరమంతా వేయ వచ్చునని స్ట్రూవెగారు అనుకోకూడదు. యీకింది ప్రశ్నలకు జవాబు చెప్పమని నేను స్ట్రూవె గారిని సవాల్ చేయవలసి మాత్రం వుంది, యీ సవాల్‌ను ఆయన యెన్నటికీ అంగీకరించ డని నాకు తెలుసు. ''బేబెల్‌యొక్కా, కౌట్స్కీయొక్కా విప్లవవాదాన్ని'' అవకాశవాదమని నేను యెప్పుడు, యెక్కడ అన్నాను? బేబెల్, కౌట్స్కీల ధోరణితో ఏకీభవించని ప్రత్యేక మైన ధోరణి యేదైనా నేను అంతర్జాతీయ సోషల్ డెమోక్రసీలో సృష్టించినట్లు యెప్పుడు, యెక్కడ చెప్పుకున్నాను? బేబెల్‌కూ, కౌట్స్కీకీ మధ్య, — ఉదాహరణకు బ్రెస్లౌలో భూమి సమస్యమీద — ఉన్న విభేదాలకు[99] తీవ్రత విషయంలో కొద్దిగానైనా దరిదాపుల్లో వుండే విభేదాలు యిటు నాకూ, అటు బేబెల్‌కూ, కౌట్స్కీకీ మధ్య యెప్పుడు, యెక్కడ కనిపిం చినాయి? యీ మూడు ప్రశ్నలకూ జవాబు చెప్పడానికి స్ట్రూవె ప్రయత్నించుగాక.

నేను ఎంతో సంతృప్తిపడినాను: కొత్త ''ఇస్క్రా''వాళ్ల పునర్జనిత ''ఆర్థికవాదం''తోనూ, సోషలిస్టు రివల్యూషనరీలు ప్రదర్శించే సూత్రరాహిత్యంతోనూ చేసే పోరాటంలో నేను యింతకంటె మంచి పొత్తుదారుని కోరుకోలేను. సోషలిస్టు రివల్యూషనరీల ముసాయిదా కార్యక్రమంలో మార్క్సిజంకు చేసిన ''సవరణలు'' యెంత పూర్తిగా ప్రగతి వ్యతిరేకమైనదీ స్త్రూవె, ''ఒస్వొబొజ్దేనియె'' ఆచరణలో యెలా నిరూపించిందీ మరొకసారి యెప్పుడైనా చెప్తాను. కొత్త ''ఇస్క్రా'' ధోరణిని సూత్రరీత్యా స్త్రూవె ఆమోదించినప్పుడల్లా ఆయన ద్వారా నాకు చిత్తశుద్ధితో, విశ్వాసంతో జరిగిన నిజమైన సేవను గురించి మేము యిప్ప టికే పదేపదే చెప్పాం;* యిప్పుడు దాన్ని గురించి మరొకసారి చెప్తాం.

స్త్రూవెగారి వ్యాసంలో కొన్ని చాలా ఆసక్తికరమైన ప్రకటనలు వున్నాయి; వాటిని యిక్కడ మేము స్వల్పంగా మాత్రమే ప్రస్తావించగలం. ''వర్గ పోరాటంమీద కాక, వర్గ సహకారంమీద ఆధారపడడం ద్వారా రష్యన్ ప్రజాస్వామ్యాన్ని సృష్టించడం'' ఆయన ఉద్దేశం; ఆ పక్షంలో ''సాంఘికంగా అధిక సౌకర్యాలు గల మేధావివర్గం'' (ఉన్నత సమాజపు పాద

---

మా పాఠకులకు మేము చెప్పేది యిది: ఉదారవాద బూర్జువావర్గం తమ దేశంలోని సోషల్ డెమోక్రట్లు అత్యంత అసమంజసంగా వున్నారనీ, పొరుగు దేశంలోని వాళ్ల క్రామేడ్లు ''సౌజన్యమూర్తు''లనీ తమ అనుయాయులకు నమ్మజెప్పే పద్ధతికి సర్వత్రా, సర్వదా దిగజారుతుంది. జర్మన్ బూర్జువావర్గం వందలసార్లు ''సౌజన్యమూర్తు''లైన ఫ్రెంచి సోషలిస్టులను బేబెల్‌లకూ, కౌట్స్కీలకూ ఆదర్శంగా చూపించింది. యిటీవల ఫ్రెంచి బూర్జువావర్గం ''సౌజన్యమూర్తి'' అయిన బేబెల్‌ను ఫ్రెంచి సోషలిస్టులకు ఆదర్శంగా చూపించింది. యిది పాత జిత్తే, స్త్రూవెగారూ. యిలాంటి యెరను పసిపిల్లలూ, అజ్ఞానులూ మాత్రమే దిగమింగుతారు. కార్యక్రమానికీ, యెత్తుగడలకూ సంబంధించిన సకల ముఖ్య సమస్యలమీదా అంతర్జాతీయ విప్లవ సోషల్ డెమోక్రసీయొక్క సంపూర్ణ ఐకమత్యం తిరుగులేని వాస్తవం.

* ''ఏం చెయ్యకూడదు'' (''ఇస్క్రా,'' నం. 52) అనే వ్యాసాన్ని అవకాశవాదులకు లొంగుబాట్లు చేసే దిశలో ''గమనార్హమైన మలుపు''గా ''ఒస్వొబొజ్దేనియె'' వాచాలత్వంతో ఆహ్వానించింది. కొత్త ''ఇస్క్రా'' భావాల్లో అంతర్గతంగా వున్న సూత్రాలను ''ఒస్వొ బొజ్దేనియె,'' రష్యన్ సోషల్ డెమోక్రట్లలోని చీలికమీద వచ్చిన ఒక వార్తలో, ప్రత్యే కంగా పొగిడింది. ''మన రాజకీయ కర్తవ్యాలు'' అనే ట్రాట్స్కీ పుస్తకంమీద ''ఒస్వొబొజ్దే నియె'' వ్యాఖ్యానిస్తూ, యీ రచయిత అభిప్రాయాలకూ, ''రబోచెయె దేలొ'' వాళ్లయిన క్రిచేవ్‌స్కీ, మర్తీనొవ్, అకీమొవ్‌లు రాసినదానికీ, చెప్పినదానికీ (చూ: ''వ్పెర్యోద్''

సేవకుని వినయంతో స్త్రూవెగారు యెవరికి అణకువగా వుంటాడో ఆ ''సంస్కృతీ సంపన్న ప్రభువర్గం'' లాంటిది) ''తన సాంఘిక హోదా తూకాన్ని'' (అనగా తన డబ్బు సంచుల తూకాన్ని) యీ ''వర్గేతర'' పార్టీకి యిస్తుంది. ''బూర్జువావర్గం భయపడిందనీ, కార్మిక వర్గానికీ, స్వేచ్ఛా లక్ష్యానికీ ద్రోహం చేసిందనీ అనే పాతబడిన తీవ్రవాద అభిప్రాయపు'' నిష్ప్రయోజనత్వాన్ని యువజనులకు పరిచయం చేయాలనే కోరికను స్త్రూవె వ్యక్తం చేస్తాడు. (యీ కోరికకు మేము మనసారా స్వాగతం యిస్తాము. యీ మార్క్సిస్టు ''పాతబడిన అభిప్రాయం''తో స్త్రూవె చేసే యుద్ధంకంటె బాగా యేదీ దీని నిర్దుష్టతను ధ్రువపరచ జాలదు. స్త్రూవెగారూ, దయవుంచి మీ అద్భుతమైన పథకాన్ని వాయిదావేయకండి!)

రాజకీయంగా సున్నితమైన యీ రష్యన్ బూర్జువావర్గ ప్రతినిధి, వాతావరణంలో అత్యంత స్వల్పమైన మార్పుకు కూడా అంత ప్రతిస్పందించేవాడు, నేటితో యుద్ధం చేస్తున్నాడో ఆ ఆచరణాత్మక నినాదాలను గమనించడం మన విషయానికి ముఖ్యం. మొదటిది, అతను రిపబ్లికనిజం నినాదంతో యుద్ధం చేస్తున్నాడు. యీ నినాదం ''ప్రజా సామాన్యానికి దుర్గ్రాహ్యమూ, పరాయిదీ'' అని స్త్రూవెకు దృఢమైన విశ్వాసం (ఆయన చెప్పడానికి మరిచిపోయింది యేమిటంటే: బూర్జువావర్గానికి గ్రాహ్యమే, కానీ అనుకూలం కాదు!). మన అధ్యయన బృందాలలోని, బహిరంగ సభలలోని కార్మికులనుండి స్త్రూవెకు యెలాంటి జవాబు వస్తుందో చూడాలని వుంది మాకు, లేక, బహుశా, కార్మికులు ప్రజలు కాదంటారా? యిక, రైతుల మాట యేమిటి? వాళ్లు ఒకోసారి స్త్రూవె దేనిని ''అమాయక రిపబ్లిక నిజం'' (''జారును సాగనంపడం'') అని అంటున్నాదో దానికి లోబడతారు — కానీ, అమాయక రిపబ్లికనిజం స్థానంలో విజ్ఞానప్రబుద్ధ రిపబ్లికనిజం కాక, విజ్ఞానప్రబుద్ధ రాజరికవాదం వస్తుందని ఉదారవాద బూర్జువావర్గం నమ్ముతుంది. అది పరిస్థితులమీద ఆధారపడుతుంది, స్త్రూవెగారూ. భూమి యెస్టేట్ల ఖర్చుతో రైతాంగపు స్థితిలో తీవ్రమైన మెరుగుదల రావడాన్ని జారిజమూ, బూర్జువావర్గమూ వ్యతిరేకించక తప్పదు; కానీ యీ విషయంలో రైతాంగానికి కార్మికవర్గం సహాయం చేయకతప్పదు.

---

ప్రచురించిన ''సర్దుకుపోయే ఉదారవాది'' అనే కరపత్రం) మధ్య గల సామ్యాన్ని గుర్తించింది. రెండు నియంతృత్వాలమీద మర్తీనొవ్ పుస్తకానికి ''ఒస్వొబొజ్దేనియె'' స్వాగతం చెప్పింది (''వ్పెర్యోద్,'' నం. 9లోని వ్యాసం చూడండి). చివరి విషయం, ''మొదట విభజన రేఖ గీసి, తరువాత యేకంకండి'' అనే పాత ''ఇస్క్రా'' పాత నినాదంమీద స్తరొవేర్ ఆలస్యంగా చేసిన ఫిర్యాదులపట్ల ''ఒస్వొబొజ్దేనియె'' ప్రత్యేక సానుభూతి చూపించింది.

రెండవది, ''అంతర్యుద్ధంలో తప్పు యెప్పుడూ దాడి చేసినవానిదే'' అని స్ట్రూవె ఉద్ఘాటిస్తాడు. యీ భావం పైన చెప్పిన కొత్త ''ఇస్క్రా'' ధోరణులకు చాలా దగ్గరగా వుంది. సహజంగానే, అంతర్యుద్ధంలో దాడిచేయడం యెప్పుడూ అనుకూలమని మేము అనం; ఒకోసారి, ఆత్మరక్షణాత్మక యెత్తుగడలు తత్కాలానికి విధాయకంగా వుంటాయి. కానీ, స్ట్రూవె చేసిన ప్రతిపాదన లాంటిది 1905 నాటి రష్యాకు వర్తింపజేయడమంటే, సరిగ్గా ''పాతబడిన తీవ్రవాద అభిప్రాయాన్ని'' కొద్దిగా ప్రదర్శించడ మౌతుంది (''బూర్జువావర్గం భయపడి, స్వేచ్ఛా లక్ష్యానికి ద్రోహం చేస్తుంది''). యెవడైతే యిప్పుడు నిరంకుశత్వంమీదా, ప్రగతి వ్యతిరేకతమీదా దాడిచేయడానికి నిరాకరిస్తాడో, యెవడైతే అలాంటి దాడికి సన్నాహం చేయడో, యెవడైతే దానిని ప్రచారం చేయడో, అతనికి విప్లవ అనుచరుణ్ణని చెప్పుకునే హక్కు లేదు.

''రహస్యం,'' ''అల్లరి'' (అల్లరి అనేది ''సూక్ష్మరూపంలో తిరుగుబాటు'') అనే నినాదాలను స్ట్రూవె ఖండిస్తాడు. స్ట్రూవె యీ రెండిటినీ యేవగిస్తాడు — ''జనాలను సమీపించడం'' అనే దృక్పథంనుండి యేవగిస్తాడు. ఉదాహరణకు, ''ఏం చెయ్యాలి?'' అనే రచనలో — ఆయన దృష్టిలో ఒక అతివాద విప్లవకారుని రచనలో — అల్లరిని ప్రచారం చేసే యే ఘట్టాన్నైనా తాను చూపించగలడా అని స్ట్రూవెను అడగాలని వుంది మాకు. ''రహస్యం'' గురించి, ఉదాహరణకు మనకూ, స్ట్రూవెకూ మధ్య, నిజంగా చాలా భేదం వుందా? ''రహస్యంగా'' రష్యాలోకి కొనిరాబడి, ''విమోచన సంఘాని''కో, ఆర్.ఎస్.డి.ఎల్.పి.కో చెందిన ''రహస్య'' బృందాలకు ఉపయోగపడే ''చట్ట వ్యతిరేక'' పత్రికలలో మనం ఉభయులమూ పనిచేయడం లేదా? మన కార్మికుల సభలు తరుచుగా ''రహస్యంగా'' జరుగుతాయి — ఆ పాపం మేము చేస్తూనే వున్నాం. మరి, ''ఒస్వొబొజ్దేనియె'' పెద్దమనుషులు జరిపే సభల మాట యేమిటి? వాగడానికీ, యేహ్యమైన రహస్యం గల యేహ్యమైన గొరిల్లాలను నీచంగా చూడడానికీ తను కేమైనా ఆధారా లున్నాయా స్ట్రూవెగారూ?

నిజమే, కార్మికులకు ఆయుధాలు సరఫరా చేయడంలో కచ్చితమైన రహస్యం అవసరం. యీ విషయంమీద స్ట్రూవె కాస్త నిస్సంకోచంగా మాట్లాడుతున్నాడు. వినండి: ''తిరుగుబాటును, లేదా సాంకేతికార్థంలో విప్లవాన్ని గురించి యేమిటంటే, ప్రజాతంత్ర కార్యక్రమానికి అనుకూలంగా విస్తృతమైన ప్రచారం మాత్రమే సార్వత్రిక సాయుధ తిరుగుబాటుకు కావలసిన సాంఘిక మానసిక పరిస్థితులు సృష్టించగలదు. కనుక, తిరుగుబాటు అనేది ప్రస్తుత విమోచన పోరాటపు అనివార్యమైన చరమ దశ అనే దృక్పథంనుండి కూడా — యీ దృక్పథంతో నేను యేకీభవించను — ప్రజానీకంలో ప్రజాతంత్ర సంస్కరణ భావాలు కలిగించడం అత్యంత మౌలికమైన, అవసరమైన కర్తవ్యం.''

స్ట్రూవె సమస్యను దాటవెయ్యడానికి ప్రయత్నిస్తున్నాడు. అతను తిరుగుబాటు అనివార్యతను గురించి మాట్లాడుతున్నాడు, విప్లవ విజయానికి దాని అవసరాన్ని గురించి మాట్లాడకుండా. తిరుగుబాటు — సన్నాహాలు చేయబడనిది, సద్యోజనితమైనది, చెదరుమదరు అయినది — యిప్పటికే ప్రారంభమైంది. అది ప్రజల సంపూర్ణ, సమగ్ర తిరుగుబాటుగా అభివృద్ధి అవుతుందని యెవరూ దృఢంగా చెప్పలేరు; యెందుకంటే, అది విప్లవ బలాల స్థితి (పోరాటం జరిగేటప్పుడు మాత్రమే పూర్తిగా అంచనా వేయడానికి వీలైనవాటి)మీదా, ప్రభుత్వంయొక్కా, బూర్జువావర్గంయొక్కా ప్రవర్తనమీదా, కచ్చితంగా అంచనావేయడానికి వీలులేని కొన్ని యితర పరిస్థితులమీదా ఆధారపడుతుంది. ఒక నిర్దిష్ట ఘటనను గురించి పరమ నిశ్చయం అనే అర్థంలో — స్ట్రూవె సమస్యను అలా కుదించాలనుకుంటాడు — అనివార్యతను గురించి మాట్లాడడం అర్థంలేని పని. మీరు విప్లవం కొరకు పోరాడేవాళ్లైతే, మీరు మాట్లాడవలసింది తిరుగుబాటు అనేది విప్లవ విజయానికి అవసరమా అనేదాన్ని గురించీ, దాన్ని శక్తివంతంగా ప్రకటించడమూ, ప్రచారం చేయడమూ, దాని కొరకు చురుకైన సన్నాహాలు చేయడమూ అవసరమా అనేదాన్ని గురించీనీ. యీ భేదాన్ని స్ట్రూవె గ్రహించకుండా వుండలేడు: ఉదాహరణకు ఆయన సార్వజనీన వోటుహక్కు అవసరమనే సమస్యను, ప్రజాతంత్రవాదికి నిర్వివాదమైనదానిని, ప్రస్తుత విప్లవ గతిలో దాని సిద్ధియొక్క అనివార్యతతో — రాజకీయ కార్యకలాపాల్లో నిమగ్నులైన వాళ్లకు వివాదపూరితమూ, జరూరు కానిదానితో మరుగుపరచడం లేదు. తిరుగుబాటు అవసరమనే సమస్యను దాటవెయ్యడంద్వారా స్ట్రూవె ఉదారవాద బూర్జువావర్గపు రాజకీయ వైఖరి అంతరాంతర సారాన్ని వెల్లడిచేస్తున్నాడు. ప్రథమంగా, బూర్జువావర్గం నిరంకుశత్వాన్ని నలిపివేయడంకంటె, దానితో రాజీపడడం కోరుకుంటుంది; ద్వితీయంగా, బూర్జువావర్గం సకల సందర్భాలలోనూ సాయుధ పోరాటాన్ని కార్మికులమీద రుద్దుతుంది. స్ట్రూవె దాటవేతలోని నిజమైన అర్థం అది. అందుకనే అతను తిరుగుబాటు అవసరమనే సమస్యనుండి తిరోగమించి, దాని "సాంఘిక మానసిక" పరిస్థితులూ, ప్రాథమిక "ప్రచారమూ" అనే సమస్యవైపు పోతున్నాడు. 1848 నాటి ఫ్రాంక్‌ఫుర్ట్ పార్లమెంటులో బూర్జువా కోతలరాయుళ్లు, ప్రభుత్వ సాయుధ బలాలను తిప్పికొట్టవలసివుండినప్పుడు, ఉద్యమం సాయుధ పోరాట "అవసరానికి దారితీసి" వుండినప్పుడు, మాటలతో మాత్రం నచ్చజెప్పడం (సన్నాహక కాలంలో నూరు రెట్లు అవసరమైనది) చిల్లర విషయమూ, బూర్జువా నిష్క్రియత్వమూ, పిరికితనమూ అయినప్పుడు, తీర్మానాలూ, ప్రకటనలూ, నిర్ణయాలూ రచించడంలోనూ, "విస్తృత ప్రచారం" సాగించడంలోనూ, "సాంఘిక మానసిక పరిస్థితులు" తయారుచేయడంలోనూ తీరిక లేకుండా యెలా వున్నారో — అలాగే స్ట్రూవె కూడా తిరుగుబాటు

సమస్యను దాటవేసి మాటల చాటున దాక్కుంటున్నాడు. చాలామంది సోషల్ డెమోక్రట్లు ఉపేక్షించే విషయాన్ని ప్రస్తావె మనకు వెల్లడిచేస్తున్నాడు: చరిత్రలోని మామూలు, రోజు వారీ, సన్నాహక కాలాలకూ విప్లవ కాలానికీ భేదం యేమిటంటే, విప్లవ కాలంలో జనాల తీవ్రతా, ఉద్రిక్తతా, విశ్వాసాలూ ఆచరణలో తప్పక వ్యక్తం కావాలి, అవుతాయి.

మాటలు ఆచరణ కూడా అవుతాయి అనే విషయాన్ని అపభ్రంశ విప్లవవాదం గమనించదు; యీ ప్రతిపాదనను దరహంమీద చరిత్రకు, లేదా బహిరంగ రాజకీయ సామూహిక చర్య యేదీ జరగని చారిత్రక దశలకు, వర్తింపజేసినప్పుడు నిర్వివాదంగా వుంటుంది. యే తిరుగుబాటులూ యిలాంటి ఆచరణకు సమానం కావు; యిలాంటి ఆచరణను కృత్రిమంగా కలిగించవు. విప్లవ దశ ప్రవేశించినప్పుడు, పాత "ఉపరి నిర్మాణం" పైనుండి కిందిదాకా బీటలు వారినప్పుడు, తమ కోసం కొత్త ఉపరి నిర్మాణాన్ని సృష్టించుకొనే వర్గాల, జనాల బహిరంగ రాజకీయ ఆచరణ వాస్తవమైనప్పుడు, అంతర్యుద్ధం ప్రారంభమైనప్పుడు, ఆచరణకు మార వలసిన అవసరం గురించి సూటి నినాదం యివ్వకుండా పాత పద్ధతిలో "మాటలకు" పరి మితం కావడమూ, "మానసిక పరిస్థితులూ," దరహంమీద "ప్రచారమూ" అవసరమని వాదిస్తూ ఆచరణనుండి తప్పుకోడానికి ప్రయత్నించడమూ అనేవి నిరాసక్తతా, నిర్జీవత్వమూ, ఛాందసత్వమూ, లేకపోతే విప్లవానికి ద్రోహమూ అవుతాయని తోకవాదపు విప్లవకారులు గ్రహించలేరు. ప్రజాతంత్ర బూర్జువావర్గపు ఫ్రాంక్‌ఫుర్ట్ కోతలరాయుళ్ళు సరిగ్గా అలాంటి ద్రోహానికి, లేదా సరిగ్గా అలాంటి ఛాందస మతిహీనతకు స్మరణీయమైన చారిత్రక ఉదాహరణ.

అపభ్రంశ విప్లవవాదానికీ, విప్లవకారులలోని తోకవాదానికీ మధ్య గల యీ భేదాన్ని వివరించడానికి రష్యాలోని సోషల్ డెమోక్రటిక్ ఉద్యమ చరిత్ర యిచ్చే ఉదాహరణ మీకు కావాలా? అలాంటి వివరణ యిస్తాము. 1901, 1902 సంవత్సరాలను జ్ఞాపకం చేసు కోండి — యెంతో యిటీవలివి, అయినా యీనాడు మనకు అప్పుడే పురాతన చరిత్రలాగ కనిపించే సంవత్సరాలను. ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. అపభ్రంశ విప్లవవాదం "దాడి యెత్తుగడలను" గురించి హోరు ప్రారంభించింది ("రబోచెయె దేలొ"), "రక్తదాహపు కరపత్రాలు" (బెర్లిన్‌లో తయారైనవి, నా జ్ఞాపక శక్తి సరిగా వుంటే) విడుదల చేయ బడుతూ వుండినాయి, వార్తాపత్రికద్వారా దేశవ్యాప్తంగా ఆందోళన సాగించాలనే భావం "సాహిత్య బడాయి" అనీ, పడకకుర్చీ స్వభావం గలది అనీ దాడులు చేయబడుతూ వుండి నాయి (నదేజ్దిన్)[100]. తద్విరుద్ధంగా, "ఆర్థిక పోరాటం రాజకీయ ఆందోళనకు అత్యుత్తమ సాధనం" అనే బోధలో ఆనాడు విప్లవవాదుల తోకవాదం వ్యక్తీకరణ పొందింది. విప్లవ సోషల్ డెమోక్రట్లు యెలా ప్రవర్తించినారు? వాళ్లు యీ రెండు ధోరణులమీదా దాడిచేసినారు. వాళ్లు చిచ్చుబుడ్డి పద్ధతులనూ, దాడి యెత్తుగడల గురించిన కేకలనూ ఖండించినారు;

యెందుకంటే, బహిరంగ సామూహిక చర్య అనేది భవిష్యత్తుకు సంబంధించిన విషయమని అందరికీ తేటతెల్లంగా వుండింది, లేదా వుండివుండాలి. వాళ్ల తోకవాదాన్ని ఖండించి, యావన్మంది ప్రజల సాయుధ తిరుగుబాటుకు కూడా నినాదమిచినారు, తిరుగుబాటుకు సూటి విజ్ఞప్తి అనే అర్థంలో కాదు (ఆ కాలానికి చెందిన మా మాటలలో "కొట్లాట"కు యే విజ్ఞప్తీ స్ట్రూవెకు కనపడదు); అవశ్యంగా అనుమానించే అర్థంలో, "ప్రచారం" అనే అర్థంలో ((ప్రచారం గురించి స్ట్రూవెకు యిప్పుడు మాత్రమే ఆలోచన వచ్చింది – యోగ్యుడైన మన స్ట్రూవె యెప్పుడూ కాలానికి పలు సంవత్సరాలు వెనుక వుంటాడు), భయకంపితులైన, మోసపు వర్తకులైన బూర్జువావర్గపు ప్రతినిధులు యే "సాంఘిక మానసిక పరిస్థితుల" గురించి యిప్పుడు "విషాదంగా, అనుచితంగా" ఉపన్యాసాలు యిస్తున్నారో సరిగ్గా ఆ పరిస్థితులను తయారు చేయడం అనే అర్థంలో. ఆనాడు ప్రచారమూ, ఆందోళనా, ఆందోళనా, ప్రచారమూ వస్తుగత పరిస్థితులచేత ముందుకు తేబడినాయి. ఆనాడు ఒక అఖిల రష్యా పత్రిక – దేన్ని వారపత్రికగా ప్రచురించడం ఆదర్శంగా కనిపించిందో అది – తిరుగుబాటుకు సన్నాహాలు చేసే పనికి గీటురాయిగా ప్రతిపాదించబడగలిగి వుండింది ("ఏం చెయ్యాలి?"లో ప్రతిపాదించబడింది కూడా). ఆనాడు ప్రత్యక్ష సాయుధ చర్యకు బదులు సామూహిక ఆందోళనను కోరే నినాదాలు, చిచ్చుబుడ్డి పద్ధతులకు బదులు తిరుగుబాటుకు కావలసిన సాంఘిక, మానసిక పరిస్థితులను తయారుచేయడం, విప్లవ సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఒకేఒక సరైన నినాదాలుగా వుండినాయి. యీనాడు ఘటనలు యీ నినాదాలను దాటిపోయాయి; ఉద్యమం వాటిని వెనుక వదలింది; అవి పీలిక లైనాయి, "ఒస్వొబొజ్దేనియె" వంచననూ, కొత్త "ఇస్క్రా" తోకవాదాన్నీ కప్పడానికి మాత్రమే తగిన చింపిరి పాత లైనాయి!

బహుశా నేను పొరబడినానేమో? బహుశా విప్లవం యింకా ప్రారంభంకాలేదేమో? బహుశా వర్గాల బహిరంగ రాజకీయ ఆచరణకు సమయం యింకా రాలేదేమో? బహుశా యిప్పటి కింకా అంతర్యుద్ధం లేదేమో? విమర్శనాయుధానికి యింకా ఆయుధ విమర్శ అవశ్యమైన, విధాయకమైన తదనంతర, వారస, ధర్మకర్తృ, పరిపూరక సాధనం కాకూడదేమో?

యింట్లోనుండి బయటికి వెళ్లండి, మీచుట్టూ చూడండి, వీధుల్లో జవాబు కోసం వెదకండి. ప్రతిచోటా శాంతియుత, నిరాయుధ ప్రజా సమూహాలను కాల్చివేయడంద్వారా ప్రభుత్వమే అంతర్యుద్ధం ప్రారంభించలేదా? సాయుధ నల్ల నూర్లవాళ్లు నిరంకుశ ప్రభుత్వపు "వాదం"గా బయటికి రాలేదా? పౌరుల మిలీషియా అవసరమని బూర్జువావర్గం – బూర్జువా వర్గం కూడా – గుర్తించలేదా? "విప్లవ ఆచరణ బహిరంగ స్వభావం" (యీనాడు

మనం వున్నది అలాగే!) "యిప్పుడు ప్రజా సామాన్యంమీద శిక్షణాత్మక ప్రభావం నెర పడానికి ఒక అత్యంత ముఖ్యమైన షరతు" అని స్త్రూవె, ఆదర్శప్రాయమైన మితవాదీ, లాంఛనవాదీ అయిన స్త్రూవె, తానే అనడం లేదా? (సమస్యను దాటవెయ్యడానికి మాత్రమే అతను అలా అంటూవుండడం శోచనీయం!)

విప్లవ పక్షపాతులు యిప్పుడు సాయుధ తిరుగుబాటు సమస్యను యెలా చిత్రించాలి అనే విషయం గురించి కళ్లున్నవాళ్లకు యేమీ సందేహం వుండజాలదు. యీ సమస్యయొక్క మూడు చిత్రణలను — జనాలను యేమాత్రమైనా ప్రభావితం చేయగల స్వేచ్ఛాయుత పత్రికలలో వచ్చినవాటిని — పరిశీలించండి.

మొదటి చిత్రణ. రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ మూడవ మహాసభ తీర్మానం.* సార్వత్రిక ప్రజాతంత్ర విప్లవోద్యమం సాయుధ తిరుగుబాటు చెయ్యవలసిన

---

* యిది పూర్తి పాఠం:

"1) శ్రామికవర్గం, తన స్థానం మూలంగా, అత్యంత పురోగామి వర్గంగానూ, ఒకేఒక స్థిరమైన విప్లవకర వర్గంగానూ వుండి, తత్కారణంగా రష్యాలోని సార్వత్రిక ప్రజా తంత్ర విప్లవోద్యమంలో ప్రముఖ పాత్ర వహించవలసి వుంది గనుకా;

"2) యీ ఉద్యమం యిప్పటికే సాయుధ తిరుగుబాటు అవసరానికి దారితీసింది గనుకా;

"3) శ్రామికవర్గం యీ తిరుగుబాటులో తప్పనిసరిగా అత్యంత చురుకైన పాత్ర వహిస్తుంది గనుకా, యీ పాత్ర రష్యాలోని విప్లవ భవితవ్యాన్ని నిర్ణయిస్తుంది గనుకా;

"4) శ్రామికవర్గం, తన పోరాటాన్ని సిద్ధాంతపరంగానూ, ఆచరణపరంగానూ నడిపించే సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ పతాకకింద, ఏకైక, స్వతంత్ర రాజకీయ శక్తిగా సమైక్యమైనప్పుడు మాత్రమే, యీ విప్లవంలో ప్రముఖ పాత్ర వహించగలదు గనుకా;

"5) యీ పాత్రను నిర్వహించడం మాత్రమే బూర్జువా ప్రజాతంత్ర రష్యాలోని ఆస్తిపర వర్గాలమీద సోషలిజం కొరకు పోరాటం చేయడానికి శ్రామికవర్గానికి అత్యంత అనుకూలమైన పరిస్థితులను నిస్సందేహం చేస్తుంది గనుకా;

"అందువలన, సాయుధ తిరుగుబాటుద్వారా నిరంకుశత్వంతో ప్రత్యక్ష పోరాటం చేయడానికి శ్రామికవర్గాన్ని సంఘటితపరచే కర్తవ్యం ప్రస్తుత విప్లవ తరుణంలో పార్టీయొక్క ముఖ్యమైన, అత్యంత జరూరైన కర్తవ్యాలలో ఒకటి అని ఆర్.ఎస్.డి.ఎల్.పి. మూడవ మహాసభ గుర్తిస్తున్నది.

అవసరాన్ని యిప్పటికే కలిగించిందని బహిరంగంగా గుర్తించబడి, ప్రకటించబడింది. తిరుగుబాటుకు శ్రామికవర్గాన్ని సంఘటితపరచడం పార్టీ సారభూతమైన, ప్రధానమైన తప్పనిసరైన కర్తవ్యాల్లో ఒకటిగా యీనాటి ఎజెండాలో చేర్చబడింది. శ్రామికవర్గాన్ని సాయుధం చేయడానికీ, తిరుగుబాటుకు ప్రత్యక్ష నాయకత్వం వహించే అవకాశాన్ని నిస్సందేహం చేయడానికీ అత్యంత చురుకైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు యివ్వబడినాయి.

రెండవ చిత్రణ. ''ఒస్వొబొజ్దేనియె''లో ''రష్యన్ రాజ్యాంగవాదుల నాయకుడు'' (యూరపియన్ బూర్జువావర్గపు ''ఫ్రాంక్‌ఫుర్టర్ వార్తాపత్రిక'' అంతటి పలుకుబడిగల పత్రిక యిటీవల స్పష్టాంగా అలా వర్ణించింది), లేక రష్యన్ ప్రగతిశీల బూర్జువావర్గపు నాయకుడు రాసిన వ్యాసం, సూత్రాల ప్రకటనతో సహా. తిరుగుబాటు అనివార్యమనే అభిప్రాయంతో అతను యేకీభవించడు. రహస్య కార్యకలాపాలూ, కొట్లాటా అనుచితమైన విప్లవవాదపు నిర్దిష్ట పద్ధతులు. రిపబ్లికనిజం అనేది దిగ్భ్రాంతి పద్ధతి. సాయుధ తిరుగుబాటు అనేది నిజంగా కేవలం సాంకేతిక సమస్య; కానీ, ''మౌలికమైన, అత్యంత అవసరమైన కర్తవ్యం'' యేమిటంటే, సామూహిక ప్రచారం సాగించడమూ, సాంఘిక మానసిక పరిస్థితులను సంసిద్ధంచేయడమూ.

మూడవ చిత్రణ. కొత్త ''ఇస్క్రా'' కాన్ఫరెన్సు తీర్మానం. మన కర్తవ్యం తిరుగుబాటును సంసిద్ధంచేయడం. పథకీకృత తిరుగుబాటు అనే సమస్యే లేదు. ప్రభుత్వం విసంఘటితం కావడంచేతా, మన ఆందోళనచేతా, మనం సంఘటితం కావడంచేతా తిరుగు

---

''తదనుగుణంగా, పార్టీ శాఖల నన్నిటినీ మహాసభ యీవిధంగా ఆదేశిస్తున్నది:

''అ) ప్రచారంద్వారా, ఆందోళనద్వారా, ఆసన్న సాయుధ తిరుగుబాటు రాజకీయ ప్రాముఖ్యాన్ని మాత్రమే కాక, ఆచరణాత్మక సంఘటన పార్శ్వాన్ని కూడా శ్రామిక వర్గానికి వివరించాలి,

''ఆ) తిరుగుబాటు ప్రారంభంలోనూ, తిరుగుబాటు జరిగేటప్పుడూ గొప్ప ప్రాముఖ్యం వహించగల సామూహిక రాజకీయ సమ్మెల పాత్రను ఆ ప్రచారంలోనూ, ఆందోళనలోనూ వివరించాలి,

''ఇ) శ్రామికవర్గాన్ని సాయుధం చేయడానికి అత్యంత చురుకైన చర్యలు తీసుకోవాలి; అలాగే సాయుధ తిరుగుబాటుకూ, దానికి ప్రత్యక్ష నాయకత్వం వహించడానికీ పథకం తయారు చేయడానికి అత్యంత చురుకైన చర్యలు తీసుకోవాలి; దీనికిగాను, అవసరమైనప్పుడు, అవసరాన్నిబట్టి, పార్టీ కార్యకర్తల ప్రత్యేక బృందాలను నిర్మించాలి.'' (1907 నాటి కూర్పుకు రచయిత వివరణ. — సం.)

బాటుకు అనుకూల పరిస్థితులు సృష్టింపబడతాయి. అప్పుడు మాత్రమే "సాంకేతికమైన పోరాట సన్నాహాలకు దాదాపు గురుతరమైన ప్రాముఖ్యం యేర్పడగలదు."

అంతేనా? ఔను, అంతే. తిరుగుబాటు అవసరం అయిందా అనేది శ్రామికవర్గపు కొత్త "ఇస్క్రా" నాయకులకు యింకా తెలియని విషయం. శ్రామికవర్గాన్ని తక్షణ పోరాటానికి సంఘటితం చేయడం జరూరు కర్తవ్యమా అనేది వాళ్లకింకా స్పష్టం కాలేదు. అత్యంత చురుకైన చర్యలు అవలంబించాలని విజ్ఞప్తిచేయడం అనవసరం. యే పరిస్థితుల్లో యీ చర్యలకు "దాదాపు గురుతరమైన ప్రాముఖ్యం" యేర్పడ "వచ్చు" ననేది వివరించడం అంతకంటె యెంతో ముఖ్యం (1902లో కాదు, 1905లో)....

కొత్త "ఇస్క్రా" కామ్రేడ్స్, మర్తీనొవిజంవైపు మీరు తీసుకున్న మలుపు మిమ్మల్ని యెక్కడికి తీసుకపోయిందో యిప్పుడు కనపడుతున్నదా? మీ రాజకీయ తత్వం "ఒస్వొబొజ్దేనియె" తత్వానికి మారురూపమని మీరు గుర్తిస్తున్నారా? రాజరికవాద బూర్జువావర్గపు అడుగుజాడల్లో (మీ యిష్టానికి వ్యతిరేకంగా, మీకు తెలియకుండానే) మీరు నడుస్తున్నారని మీరు గుర్తిస్తున్నారా? చవి కోల్పోయిన సత్యాలను పునశ్చరణ చేస్తూ, కూటతర్కంలో మిమ్మల్ని మీరు మెరుగులు దిద్దుకుంటూ, మీరు ఒక విషయాన్ని – ప్యోత్ర్ స్త్రూవె స్మరణీయమైన వ్యాసంలోని స్మరణీయమైన మాటల్లో చెప్పాలంటే – "విప్లవ చర్యల బహిరంగ స్వభావం యిప్పుడు ప్రజా సామాన్యంమీద శిక్షణాత్మక ప్రభావం నెరపడానికి ఒక అత్యంత ముఖ్యమైన షరతు" అనే విషయాన్ని, మీరు గమనించలేదని యిప్పుడు మీకు స్పష్టమైందా?

## 9. విప్లవ కాలంలో తీవ్ర ప్రతిపక్ష పార్టీగా వుండడమంటే యేమిటి?

తాత్కాలిక ప్రభుత్వంమీది తీర్మానానికి మళ్లీ పోదాం. కొత్త "ఇస్క్రా"వాళ్ల యెత్తుగడలు విప్లవాన్ని ముందుకు తోయవు – ముందుకు తోసే అవకాశాన్ని తమ తీర్మానంద్వారా నిస్సందేహం చేయగోరుతారు వాళ్లు – అవి విప్లవాన్ని వెనక్కి లాగుతాయి అని మేము చూపించినాం. సరిగ్గా యీ యెత్తుగడలే అస్థిర బూర్జువావర్గంతో చేసే పోరాటంలో సోషల్ డెమోక్రసీకి చేతులు కట్టివేసేదీ, అది బూర్జువా ప్రజాస్వామ్యంలో లీనమైపోకుండా నివారించనిదీ అని మేము చూపించినాం. తీర్మానపు తప్పు ఆధారాలు సహజంగా యీ తప్పు నిర్ణయానికి దారితీస్తున్నాయి: "కనుక, సోషల్ డెమోక్రటిక్ పార్టీ తాత్కాలిక ప్రభుత్వంలో అధికారాన్ని

వశంచేసుకోవడం గానీ, పంచుకోవడం గానీ తన లక్ష్యంగా పెట్టుకోకుండా, తీవ్ర విప్లవ ప్రతిపక్ష పార్టీగా నిలిచివుండాలి.'' ఇందులో మొదటి భాగాన్ని, లక్ష్యాల ప్రకటన వున్నదాన్ని పరిశీలించండి. జారిజంమీద విప్లవంయొక్క నిర్ణయాత్మక విజయం సోషల్ డెమోక్రటిక్ కార్యకలాపాల లక్ష్యంగా కొత్త ''ఇస్క్రా''వాళ్లు పెట్టుకుంటున్నారా? అవును. నిర్ణయాత్మక విజయంయొక్క పరిస్థితులను వాళ్లు సరిగ్గా సూత్రీకరించలేక, ''ఒస్వొబొజ్దేనియె'' సూత్రీకరణలోకి దిగజారుతారు, కానీ వాళ్లు యీ లక్ష్యం నిశ్చయంగా పెట్టుకుంటున్నారు. తరువాత, వాళ్లు తాత్కాలిక ప్రభుత్వాన్ని తిరుగుబాటుతో ముడివేస్తున్నారా? అవును, తాత్కాలిక ప్రభుత్వం ''విజయవంతమైన ప్రజా తిరుగుబాటునుండి ఉద్భవిస్తుం''దని ప్రకటించడం ద్వారా వాళ్లు సూటిగా అలా ముడివేస్తున్నారు. చివరి విషయం, తిరుగుబాటును నడిపించే లక్ష్యం వాళ్లు పెట్టుకుంటున్నారా? అవును, వాళ్లు పెట్టుకుంటున్నారు. స్త్రూవె లాగే వాళ్లు తిరుగుబాటు తక్షణ అవసరమని ఒప్పుకోకుండా తప్పుకుంటున్నారు; కానీ, అదే సమయంలో వాళ్లు, స్త్రూవెకు భిన్నంగా, ''సోషల్ డెమోక్రటిక్ పార్టీ దాన్ని (తిరుగుబాటును) తన ప్రభావానికీ, నాయకత్వానికీ లోబరచుకోడానికీ, దాన్ని కార్మికవర్గ ప్రయోజనాలకు వినియోగించడానికీ కృషిచేస్తుంది'' అని అంటున్నారు.

యిది అద్భుతంగా సమన్వయం పొందుతున్నది కదూ? మేము శ్రామికవర్గ జనాల యొక్క, కార్మికవర్గేతర జనాలయొక్క తిరుగుబాటును మా ప్రభావానికీ, మా నాయకత్వానికీ లోబరచడమూ, దాన్ని మా ప్రయోజనాలకు వినియోగించడమూ అనే లక్ష్యాన్ని పెట్టుకుంటాం. కనుక, శ్రామికవర్గాన్నీ, అలాగే విప్లవ బూర్జువావర్గాన్నీ, పెటీబూర్జువా వర్గాన్నీ (''శ్రామికవర్గేతర బృందాలను'') తిరుగుబాటులో నడిపించే లక్ష్యాన్ని, అనగా, తిరుగుబాటు నాయకత్వాన్ని సోషల్ డెమోక్రటిక్ పార్టీకీ, విప్లవ బూర్జువావర్గానికీ మధ్య ''పంచుకునే'' లక్ష్యాన్ని మేము పెట్టుకుంటాము. తిరుగుబాటుకు, తాత్కాలిక ప్రభుత్వ (''విజయవంతమైన ప్రజా తిరుగుబాటునుండి ఉద్భవించినదాని'') స్థాపనకు దారితీసేదానికి విజయం సంపాయించే లక్ష్యాన్ని మేము పెట్టుకుంటాం. కనుక... తాత్కాలిక విప్లవ ప్రభుత్వంలో అధికారాన్ని వశంచేసుకోవడం గానీ, పంచుకోవడం గానీ మేము లక్ష్యంగా పెట్టుకో కూడదు!!

మన మిత్రులు తమ వాదాలను ఒకదానితో ఒకటి పొందించలేరు. వాళ్లు తిరుగుబాటు సమస్యను దాటవేసే స్త్రూవె దృక్పథానికీ, యీ జరూరు కర్తవ్యానికి పూనుకోవాలని మనల్ని ఆదేశించే విప్లవ సోషల్ డెమోక్రసీ దృక్పథానికీ మధ్య వూగిసలాడుతున్నారు. వాళ్లు తాత్కాలిక విప్లవ ప్రభుత్వంలో పాల్గొనడమంతా శ్రామికవర్గానికి ద్రోహమని సూత్రరీత్యా ఖండించే అరాజకవాదానికీ, తిరుగుబాటులో సోషల్ డెమోక్రటిక్ పార్టీ మార్గదర్శక ప్రభావం

ఉన్న పక్షంలో అలాంటి పాల్గొనడాన్ని డిమాండుచేసే మార్క్సిజానికీ* మధ్య వూగిసలాడుతు న్నారు. వాళ్లకు యే స్వతంత్ర వైఖరీ లేదు: జారిజంతో రాజీ చేసుకోగోరి, అందువలన తిరుగుబాటు సమస్యమీద తప్పుకోడాలకూ, జారుకోడాలకూ దిగవలసివచ్చిన స్ట్రూవె వైఖరీ లేదు, "పైనుండి" చేసే ఆచరణ నంతటినీ, బూర్జువా విప్లవంలో పాల్గొనడ మంతటినీ ఖండించే అరాజకవాదుల వైఖరీ లేదు. కొత్త "ఇస్క్రా"వాళ్లు జారిజంతో రాజీనీ, జారిజంమీద విజయాన్నీ ఒకటిగా గంద్రగోళపడుతున్నారు. వాళ్లు బూర్జువా విప్లవంలో పాల్గొన గోరుతారు. వాళ్లు మర్తీనొవ్ "రెండు నియంతృత్వాల"ను కాస్త దాటిపోయారు. వాళ్లు ప్రజల తిరుగుబాటును నడిపించడానికి కూడా అంగీకరిస్తారు — విజయం లభించిన వెంటనే ఆ నాయకత్వాన్ని విసర్జించడానికి (లేక, బహుశా, విజయానికి సరిగా ముందా?); అనగా విజయ ఫలితాలను తాము ఉపయోగించుకోడానికి కాక, యీ ఫలితాల నన్నిటినీ పూర్తిగా బూర్జువావర్గానికి అర్పించడానికి. "తిరుగుబాటును కార్మికవర్గ ప్రయోజనాలకు ఉపయోగించడం..." అని వాళ్లు అనేది యిదే.

యీ తికమకను యింకా వివరించడం అనవసరం. యీ తికమక "తీవ్ర విప్లవ ప్రతిపక్ష పార్టీగా నిలిచివుండడం" అనే సూత్రీకరణలో యెలా ఉద్భవించిందీ పరిశీలించడం మరింత ఉపయోగకరంగా వుంటుంది.

యిది అంతర్జాతీయ విప్లవ సోషల్ డెమొక్రసీ సుపరిచిత ప్రతిపాదనల్లో ఒకటి. యిది పరమ నిర్దుష్టమైన ప్రతిపాదన. పార్లమెంటరీ దేశాల్లో రివిజనిజానికీ, అవకాశవాదానికీ వ్యతిరేకులైనవాళ్లందరికీ యిది కొట్టిన పిండి. "పార్లమెంటరీ క్రెటినిజానికీ," మిలెరానిజానికీ, బెర్న్‌స్టైనిజానికీ,[101] టురాటి రకం ఇటాలియన్ సంస్కరణవాదానికీ న్యాయమైన, అవసరమైన యెదురుదెబ్బగా యిది సార్వత్రికంగా అంగీకరింపబడింది. మన మంచి కొత్త "ఇస్క్రా"వాళ్లు యీ ఉత్కృష్టమైన ప్రతిపాదనను నోటికి నేర్చుకొని, పట్టుదలగా ప్రయోగిస్తున్నారు.... కేవలం అనుచితంగా. పార్లమెంటరీ పోరాటపు భావాభివర్గాలు యే పార్లమెంటూ లేని పరిస్థితులకు రచించిన తీర్మానాలలో ప్రవేశపెట్టబడినాయి. తిరుగుబాటును గురించి యెవరూ మనస్ఫూర్తిగా మాట్లాడని రాజకీయ పరిస్థితి ప్రతిబింబమూ, వ్యక్తీకరణా అయినట్టి "ప్రతిపక్ష" భావం తిరుగుబాటు ప్రారంభమై, దానిలో విప్లవ సమర్థకులందరూ నాయకత్వం గురించి ఆలోచిస్తూ, మాట్లాడుతూ వున్న పరిస్థితికి అర్థరహితంగా అన్వయింపబడుతోంది. విజయవంతమైన తిరుగుబాటు జరిగే పక్షంలో

* చూ: "ప్రొలెతారియ్," నం. 3, "తాత్కాలిక విప్లవ ప్రభుత్వంమీద," రెండవ వ్యాసం, 1905.

పైనుండి ఆచరించే అవసరాన్ని విప్లవం యెప్పుడు మన యెదుట బెట్టిందో సరిగ్గా ఆ సమయంలో, పాత పద్ధతులతో "నిలబడా"లనే కోరిక, అనగా "కిందినుండి" మాత్రమే ఆచరించాలనేది ఆడంబరంగా, గోలగా వ్యక్తం చేయబడింది.

మన కొత్త "ఇస్క్రా"వాళ్లకు నిశ్చయంగా అదృష్టం లేదు! వాళ్లు సరైన సోషల్ డెమోక్రటిక్ ప్రతిపాదనను రూపొందించినప్పుడు కూడా, దానిని సరిగా అన్వయించడం వాళ్లకు తెలియదు. విప్లవం జరుగుతూ వుండి, అంతర్యుద్ధమూ, తిరుగుబాటు ప్రజ్వలనాలూ వుండి, అయినా యింకా పార్లమెంటు లేనప్పుడు, పార్లమెంటరీ పోరాటపు పదాలూ, భావాలూ రూపాంతరం చెంది, తద్విరుద్ధాలుగా మారుతాయని వాళ్లు గ్రహించలేదు. మన పరిశీలనలో వున్న పరిస్థితుల్లో, సవరణలు వీధి ప్రదర్శనల ద్వారా ప్రవేశపెట్టబడతాయనీ, ప్రశ్నలు సాయుధ పౌరుల దాడి చర్యల ద్వారా వేయబడతాయనీ, ప్రభుత్వ వ్యతిరేకత ఆ ప్రభుత్వాన్ని బలవంతంగా కూలదోయడం ద్వారా అమలుపరచబడుతుందనీ వాళ్లు గుర్తించలేదు.

మన జానపద కథలలోని సుప్రసిద్ధ కథానాయకుడు యెలా అనుచితమైనప్పుడు హితబోధ పునశ్చరణ చేసినాడో అలాగే మన మర్తీనొవ్ భక్తులు, వాళ్లే ప్రకటిస్తున్నట్లు, శత్రు చర్యలు ప్రారంభమైన సమయంలో, శాంతియుత పార్లమెంటరిజం పాఠాలు పునశ్చరణ చేస్తారు. "విప్లవపు నిర్ణయాత్మక విజయా"న్నీ, "ప్రజా తిరుగుబాటు"నూ ప్రస్తావిస్తూ ప్రారంభమయ్యే తీర్మానంలో "తీవ్ర ప్రతిపక్ష" నినాదపు యీ ఆడంబర ప్రతిపాదనకంటె అపహాస్యకరమైనది లేదు! పెద్దమనుషులారా, తిరుగుబాటు జరిగే కాలంలో "తీవ్ర ప్రతిపక్షం"గా వుండడమంటే యేమిటో ఊహించడానికి ప్రయత్నించండి! దాని అర్థం ప్రభుత్వాన్ని బహిర్గతంచేసి ఖండించడమా లేక దిగదోయడమా? దాని అర్థం ప్రభుత్వానికి వ్యతిరేకంగా వోటుచేయడమా, లేక దాని సాయుధ బలాలను బహిరంగ యుద్ధంలో ఓడించడమా? దాని అర్థం ప్రభుత్వ ఖజానాను భర్తీచేయడానికి నిరాకరించడమా, లేక తిరుగుబాటు అవసరాలకూ, కార్మికులనూ, కర్షకులనూ సాయుధం చేయడానికీ, రాజ్యాంగ నిర్ణయసభను సమావేశపరచడానికీ ఆ ఖజానాను విప్లవాత్మకంగా పట్టుకోవడమా? "తీవ్ర ప్రతిపక్షం" అనే భావం వ్యతిరేక చర్యలను మాత్రమే — బహిర్గతంచేసి ఖండించడమూ, వ్యతిరేకంగా వోటుచేయడమూ, నిరాకరించడమూ — వ్యక్తంచేస్తుందని మీకు తోచడంలేదా, పెద్దమనుషులారా? యిలా వ్యక్తంచేయడం యెందుకు? యెందుకంటే, యీ భావం పార్లమెంటరీ పోరాటానికి మాత్రమే, అంతేకాక, "నిర్ణయాత్మక విజయాన్ని" యెవరూ పోరాటపు తక్షణ లక్ష్యంగా చేయని దశకు మాత్రమే వర్తిస్తుంది. రాజకీయంగా అణచివేయబడిన ప్రజలు విజయం కొరకు చేసే తెంపరి పోరాటంలో సర్వతోముఖంగా కృతనిశ్చయమైన దాడి

ప్రారంభించిన క్షణంనుండి పరిస్థితులు యీ విషయంలో కీలకంగా మారుతాయని మీరు గ్రహించ నారంభించలేదా?

కార్మికులు మనల్ని యిలా అడుగుతారు: తిరుగుబాటు అనే జరూరు పనిని చురుకుగా ప్రారంభించాల్నా? తిరుగుబాటు ప్రారంభిస్తే, దాన్ని విజయవంతం చేయడానికి యేమి చేయాలి? విజయాన్ని యెలా ఉపయోగించుకోవాలి? అప్పుడు యే కార్యక్రమం అమలుపరచబడగలదు, అమలుపరచబడాలి? మార్క్సిజాన్ని మరింత గంభీరం చేస్తున్న కొత్త "ఇస్క్రా"వాళ్లు యిలా సమాధాన మిస్తారు: మనం తీవ్ర విప్లవ ప్రతిపక్ష పార్టీగా నిలిచివుండాలి.... మరి, యీ వీరులను ఆరితేరిన అల్పబుద్ధులని మన మనడం సరి కాదా?

# 10. "విప్లవ కమ్యూన్లూ," కార్మికవర్గంయొక్కా, రైతాంగంయొక్కా విప్లవ ప్రజాతంత్ర నియంతృత్వమూ

కొత్త "ఇస్క్రా" తన మాటల ద్వారా తాను యే వైఖరికి చేరుకుందో ఆ అరాజక వాద వైఖరికి ("కిందినుండి" మాత్రమే ఆచరణ, "కిందినుండీ, పైనుండీ" కాదు) కొత్త "ఇస్క్రా"వాళ్ల కాన్ఫరెన్సు అంటిపెట్టుకోలేదు. తిరుగుబాటు అవకాశాన్ని ఒప్పు కుంటూ, విజయావకాశాన్నీ, తాత్కాలిక విప్లవ ప్రభుత్వంలో పాల్గొనే అవకాశాన్నీ ఒప్పు కోకపోవడంలోని అసంబద్ధత మరీ కొట్టవచ్చినట్టు వుండింది. కనుక, తీర్మానం సమస్య యొక్క మర్తీనొవ్, మార్తొవ్ పరిష్కారంలోకి కొన్ని మినహాయింపులూ, నియంత్ర ణలూ ప్రవేశపెట్టింది. యీకింది తీర్మాన భాగంలో చెప్పబడిన యీ మినహాయింపులను పరిశీలిద్దాం:

> "కేవలం తిరుగుబాటు వ్యాప్తికి తోడ్పడడానికీ, ప్రభుత్వాన్ని విచ్ఛిన్నం చేయ డానికీ, యేదైనా ఒక పట్టణంలో గానీ, యేదైనా ఒక జిల్లాలో గానీ పాక్షికంగా, ఉపాఖ్యానవతుగా అధికారం వశంచేసుకొని, విప్లవ కమ్యూన్ను నెలకొల్పే అవసరాన్ని యీ యెత్తుగడలు ("తీవ్ర విప్లవ ప్రతిపక్ష పార్టీగా నిలిచివుండడం"), సహజంగానే, యేవిధంగానూ కాదనదు."

అలా అయితే, కిందినుండి మాత్రమే కాక, పైనుండి కూడా చర్యలు సూత్రరీత్యా అంగీకరించబడుతాయని అర్థం. "ఇస్క్రా" (నం. 93)లో ఎల్. మార్తొవ్‌యొక్క

ప్రసిద్ధమైన వ్యంగ్యవ్యాసంలో చెప్పబడిన ప్రతిపాదన విసర్జించబడి, ''వ్పెర్యోద్'' యెత్తుగడలు, అనగా ''కిందినుండి'' మాత్రమే కాక, ''పైనుండి'' కూడా చర్యలు సరైనవిగా అంగీకరించబడుతాయని అర్థం.

అంతే కాక, అధికారం వశంచేసుకోవడం (పాక్షికంగా, ఉపాఖ్యానవతుగా, వగైరా అయినా కూడా) స్పష్టంగా ఊహించేది అందులో సోషల్ డెమోక్రట్లు మాత్రమే పాల్గొనడాన్ని కాదు, శ్రామికవర్గం మాత్రమే పాల్గొనడాన్ని కాదు. ప్రజాతంత్ర విప్లవంలో ప్రయోజనం గలదీ, దానిలో చురుకుగా పాల్గొనేదీ శ్రామికవర్గం మాత్రమే కాదు అనే విషయంనుండి యిది యేర్పడుతుంది. తిరుగుబాటులో ''శ్రామికవర్గేతర బృందాలు'' (తిరుగుబాటుమీద కాన్ఫరెన్సు చేసిన తీర్మానంలోని మాటలు), అనగా బూర్జువావర్గం, కూడా పాల్గొనడమూ, పరిశీలనలో వున్న తీర్మానం ప్రారంభంలో చెప్పబడినట్లు, తిరుగుబాటు ''ప్రజా'' తిరుగుబాటుగా వుండడమూ అనే విషయంనుండి యిది యేర్పడుతున్నది. కనుక, తాత్కాలిక విప్లవ ప్రభుత్వంలో పెటీబూర్జువావర్గంతో కలిసి సోషలిస్టులు పాల్గొనడం కార్మికవర్గానికి ద్రోహం అనే సూత్రాన్ని కాన్ఫరెన్సు తోసిపుచ్చింది; ''వ్పెర్యోద్'' సాధించదలచుకున్నది యిదే.[102] ''ద్రోహం'' ద్రోహం కాకుండా పోదు, ద్రోహాత్మకమైన చర్య పాక్షికంగా, ఉపాఖ్యానవతుగా, స్థానికం వగైరాగా వున్నంత మాత్రాన. కనుక, తాత్కాలిక విప్లవ ప్రభుత్వంలో పాల్గొనడం అపభ్రంశ జోరేసిజంకు సమానమనే భావాన్ని కాన్ఫరెన్సు తోసిపుచ్చింది; ''వ్పెర్యోద్'' సాధించదలచుకున్నది యిదే. ప్రభుత్వం ప్రభుత్వం కాకుండా పోదు, దాని అధికారం అనేక పట్టణాలకు కాక, ఒకే ఒక పట్టణానికీ, అనేక జిల్లాలకు కాక, ఒకే ఒక జిల్లాకూ వ్యాపించినంత మాత్రాన, లేదా అది వహించే పేరు మూలంగా. యీవిధంగా, యీ సమస్య సిద్ధాంత ప్రదర్శనను, కొత్త ''ఇస్క్రా'' ప్రయత్నించిన పద్ధతిలో కాన్ఫరెన్సు తోసిపుచ్చింది.

విప్లవ ప్రభుత్వాలు యేర్పరచడంమీదా, వాటిలో పాల్గొనడంమీదా కాన్ఫరెన్సు విధించిన నియంత్రణలు, యిప్పుడు సూత్రరీత్యా అంగీకరించబడినట్టివి, సమంజసంగా వున్నాయేమో చూద్దాం. ''ఉపాఖ్యానవతు''కూ, ''తాత్కాలిక''కూ భేదమేమిటో మాకు తెలియదు. ''కొత్తదీ,'' విదేశీదీ అయిన మొదటి పదం ఆలోచనలో స్పష్టత లేకపోవడానికి ముసుగు మాత్రమే అని మా అనుమానం. అది ''మరింత గంభీరంగా'' కనిపిస్తుంది; కానీ వాస్తవానికి మరింత నిగూఢంగా, గందరగోళంగా మాత్రమే వుంది. ఒక పట్టణంలోనో, జిల్లాలోనో పాక్షికంగా ''అధికారం వశంచేసుకునే అవసరా''నికీ, మొత్తం రాజ్యపు తాత్కాలిక విప్లవ ప్రభుత్వంలో పాల్గొనడానికీ భేదం యేమిటి? ''పట్టణా''ల్లో జనవరి 9 ఘటనలు జరిగిన సెంట్ పీటర్స్‌బుర్గ్‌లాంటి పట్టణం చేరదా? జిల్లాల్లో అనేక రాజ్యాలకంటె పెద్ద

దైన కాకసన్ చేరదా? జైళ్లూ, పోలీసులూ, ఖజానా, వగైరాలను యేమి చేయాలనే సమస్య (ఒకప్పుడు కొత్త ''ఇస్క్రా''ను యిబ్బంది పెట్టిన సమస్య) ఒక జిల్లా మాట అటుంచి, ఒకే ఒక నగరంలో కూడా ''అధికారం వశంచేసుకున్న'' తక్షణమే మనల్ని యెదుర్కొనదా? మనకు చాలినన్ని బలాలు లేకపోతే, తిరుగుబాటు పూర్తిగా విజయవంతం కాకపోతే, లేదా విజయం నిర్ద్వంద్వంగా లేకపోతే, విడివిడి స్థలాల్లోనూ, విడివిడి నగరాల్లోనూ, అలాంటి వాటిలోనూ తాత్కాలిక విప్లవ ప్రభుత్వాలు స్థాపించవచ్చుననేది, సహజంగానే, యెవరూ నిరాకరించరు. కానీ దీనికంతటికీ ప్రస్తుత విషయంతో యేమి సంబంధం వుంది? ''విప్లవపు నిర్ణయాత్మక విజయం'' గురించీ, ''విజయవంతమైన ప్రజా తిరుగుబాటు'' గురించీ తీర్మాన ప్రారంభంలో మీరే చెప్పలేదా?? శ్రామికవర్గపు శ్రద్ధనూ, లక్ష్యాలనూ చీల్చడమూ, సార్వత్రికమూ, ఏకైకమూ, అఖండమూ, సంపూర్ణమూ అయినదానికి బదులు ''పాక్షిక''మైన దానిమీదికి దాని శ్రద్ధను మళ్లించడమూ అనే అరాజకవాదుల పనిని సోషల్ డెమొక్రట్లు యెప్పటినుండి చేపట్టినారు? ఒక పట్టణంలో ''అధికారం వశం చేసుకోవడా''న్ని ఊహిస్తూ మీరు ''తిరుగుబాటును వ్యాప్తి చేయడం'' గురించి మాట్లాడుతారు. వ్యాప్తి చేయడమంటే మరొక పట్టణానికని మేము ధైర్యంగా అనుకోవచ్చునా? — అన్ని పట్టణాలకూ అని మేము ఆశించ సాహసించవచ్చునా? పెద్దమనుషులారా, మీ తర్కాధారాలు యెంత పరస్పర విరుద్ధంగా, గంద్రగోళంగా వున్నాయో, అంత దోషయుక్తంగా, అవకతవకగా వున్నాయి మీ నిర్ణయాలు. దరహంమీద తాత్కాలిక విప్లవ ప్రభుత్వ సమస్యకు ఆర్.ఎస్.డి.ఎల్.పి. మూడవ మహాసభ సమగ్రమైన, స్పష్టమైన జవాబు యిచ్చింది. యీ జవాబు స్థానిక తాత్కాలిక ప్రభుత్వాల కన్నిటికీ కూడా వర్తిస్తుంది. కానీ, యీ సమస్యలో ఒక భాగాన్ని కృత్రిమంగా, హేతురహితంగా వేరుపరచడంద్వారా కాన్ఫరెన్సు జవాబు మొత్తంగా సమస్యను కేవలం దాటవేసి (అది కూడా విజయవంతంగా కాదు), గంద్రగోళం సృష్టిస్తుంది.

''విప్లవ కమ్యూన్లు'' అంటే యేమిటి? యీ భావం ''తాత్కాలిక విప్లవ ప్రభుత్వం''కంటె భిన్నమైనదా? భిన్నమైనదైతే యే విషయంలో? కాన్ఫరెన్సు పెద్దమనుషులకే తెలియదు. విప్లవ ఆలోచనలో గంద్రగోళం, అతి తరుచుగా జరిగేటట్లు, వాళ్లను విప్లవ శబ్ద వ్యామోహం వద్దకు తీసుకపోతున్నది. నిజంగా, సోషల్ డెమొక్రసీ ప్రతినిధులు చేసిన తీర్మానంలో ''విప్లవ కమ్యూన్లు'' అనే మాటలు వాడడం విప్లవ శబ్ద వ్యామోహం తప్ప మరేమీ కాదు. అరిగిపోయిన గతానికి చెందిన కొన్ని ''మనోహరమైన'' పదాలు భావి కాలపు కర్తవ్యాలను మరుగుపరచడానికి ఉపయోగించబడే మాదిరి శబ్ద వ్యామోహాన్ని మార్క్సు చాలాసార్లు ఖండించినాడు. అలాంటి సందర్భాల్లో, చరిత్రలో అప్పటికే తన పాత్రను

నిర్వహించిన పదంయొక్క మనోహరత్వం నిరుపయోగమైన, హానికరమైన చౌకబారు వస్తువు అవుతుంది, పిల్లల బచ్చెనకాయ అవుతుంది. మనం యెందుకు తాత్కాలిక విప్లవ ప్రభుత్వం స్థాపించబడాలని కోరేదీ, యిప్పటికే ప్రారంభమైన ప్రజా తిరుగుబాటు విజయం పొందిన మరుదినమే ప్రభుత్వంమీద మనం నిర్ణయాత్మక ప్రభావం నెరపితే సరిగ్గా యే మార్పులు మనం తీసుకవచ్చేదీ కార్మికులకూ, మొత్తం ప్రజలకూ మనం స్పష్టమైన, అసందిగ్ధమైన అభిప్రాయం కలిగించాలి. యివి రాజకీయ నాయకులను యెదుర్కొనే ప్రశ్నలు.

ఆర్.ఎస్.డి.ఎల్.పి. మూడవ మహాసభ యీ ప్రశ్నలకు పరమ స్పష్టంగా జవాబు యిచ్చి, యీ మార్పుల సంపూర్ణ కార్యక్రమం తయారుచేసింది — మన పార్టీ కనీస కార్యక్రమం. కానీ, ''కమ్యూన్'' అనే పదం యే జవాబూ యివ్వదు; అది కేవలం ప్రజల బుర్రలను శ్రవణపేయమైన మాటల సుదూరపు ప్రతిధ్వనితో, లేదా నిస్సారపు శైలీ గాంభీర్యంతో గంద్రగోళపరుస్తుంది. ఉదాహరణకు 1871 నాటి పారిస్ కమ్యూన్ స్మృతిని మనం యెంతగా గౌరవిస్తే అంతగా అనుమతించ రాని పని అవుతుంది, దాని పొరపాట్లనూ, దాని ప్రత్యేక పరిస్థితులనూ పరిశీలించకుండా, యథాలాపంగా దానిని ప్రస్తావించడం. అలా ప్రస్తావించడం కమ్యూన్ చేసిన ప్రతి పనినీ (1874లో, తమ ''ప్రణాళిక''లో) ప్రశంసించిన బ్లాంకీయిస్టుల — ఎంగెల్స్‌చేత పరిహసింపబడినవాళ్ల — అసంబద్ధ ఉదాహరణను పునశ్చరణ చేయడమౌతుంది[103]. తీర్మానంలో ప్రస్తావించబడిన యీ ''విప్లవ కమ్యూన్'' గురించి అడిగే కార్మికునికి కాన్ఫరెన్సు సభ్యుడు యేమి జవాబు యిస్తాడు? అతను చెప్పగలిగేదల్లా యేమిటంటే యిది చరిత్రలో ఒకానొక ప్రభుత్వానికి — ఆ కాలంలో ప్రజాతంత్ర విప్లవ అంశాలకూ, సోషలిస్టు విప్లవ అంశాలకూ మధ్య భేదం తెలుసుకోని, తెలుసుకోజాలని ప్రభుత్వానికి, రిపబ్లిక్ కొరకు పోరాడే కర్తవ్యాలనూ, సోషలిజం కొరకు పోరాడే కర్తవ్యాలనూ, గంద్రగోళపరచినదీ, వెర్సేల్స్‌మీద చురుకైన సైనిక దాడి చేయజాలక పోయినదీ, ఫ్రెంచి బాంకును వశపరచుకోకపోవడం అనే పొరపాటు చేసినదీ, వగైరా అయిన ప్రభుత్వానికి — వుండిన పేరు అని. ఒక్క మాటలో చెప్పాలంటే, మీరు పారిస్ కమ్యూన్‌ను ప్రస్తావించినా, మరొక కమ్యూన్‌ను ప్రస్తావించినా, మీ జవాబు యిలా వుంటుంది: యిది యెలాంటి ప్రభుత్వమంటే, మనది యెలా వుండకూడదో అలాంటిది. మంచి జవాబే, నిజంగా! తీర్మానం పార్టీ ఆచరణాత్మక కార్యక్రమం గురించి యేమీ చెప్పకుండా, అనుచితంగా చరిత్రనుండి పాఠాలు చెప్పడం ప్రారంభిస్తే, విప్లవకారుని ఛాందస నీతిబోధకూ, నిర్వీర్యతకూ అది సాక్ష్యం కాదా? మనం యే పొరపాటు చేసినామని నిష్ఫలంగా ఆరోపణ చేసినారో సరిగ్గా అదే పొరపాటును — యే విప్లవాలకు మధ్య భేదాన్ని యే ''కమ్యూనూ'' తెలుసుకోజాలకపోయిందో ఆ ప్రజాతంత్ర విప్లవాన్నీ, సోషలిస్టు విప్లవాన్నీ గంద్రగోళ పరచడమనే పొరపాటును — యిది వెల్లడించదా?

తిరుగుబాటును వ్యాప్తిచేయడమూ, ప్రభుత్వాన్ని విచ్ఛిన్నం చేయడమూ తాత్కాలిక ప్రభుత్వపు ("కమ్యూన్" అని అంత అనుచితంగా పేరుపెట్టబడినదాని) "ఏకైక" లక్ష్యంగా ప్రదర్శించబడినాయి. "ఏకైక" అనే పదం, దాని శబ్దార్థంలో తీసుకుంటే, యితర లక్ష్యా లన్నిటినీ తొలగిస్తుంది; "కిందినుండి మాత్రమే" అనే అసంబద్ధ సిద్ధాంతపు ప్రతిధ్వని యిది. యిలాంటి యితర లక్ష్యాల తొలగింపు హ్రస్వదృష్టికీ, ఆలోచనా రాహిత్యానికీ మరొక ఉదాహరణ. "విప్లవ కమ్యూన్," అనగా విప్లవ ప్రభుత్వం, ఒకేఒక పట్టణంలోనే అయినా సరే, సకల రాజ్య వ్యవహారాలనూ (తాత్కాలికంగా, "పాక్షికంగా, ఉపాఖ్యానవతుగా" అయినా సరే) అనివార్యంగా నిర్వహించవలసి వుంటుంది; రెక్కలకింద తల దాచిపెట్టుకొని, దీన్ని చూడ నిరాకరించడం మితిలేని తప్పు. యీ ప్రభుత్వం యెనిమిది గంటల పనిదినాన్ని శాసనం చేయవలసి వుంటుంది, ఫాక్టరీలమీద కార్మికుల తనిఖీ నెలకొల్పవలసి వుంటుంది, ఉచిత సార్వజనీన విద్యను నెలకొల్పవలసి వుంటుంది, జడ్జీల యెన్నికను ప్రవేశపెట్టవలసి వుంటుంది, రైతు కమిటీలను యేర్పాటు చేయవలసి వుంటుంది, వగైరా; ఒక్క మాటలో చెప్పాలంటే, అది నిశ్చయంగా యెన్నో సంస్కరణలు నిర్వహించవలసి వుంటుంది. యీ సంస్కరణలకు "తిరుగుబాటును వ్యాప్తి చేయడానికి తోడ్పడడం" అని పేరుపెట్టడం మాటలతో ఆడుకోవడమూ, పరమ స్పష్టత అవసరమైన విషయంలో గొప్ప గంద్రగోళాన్ని ఉద్దేశపూర్వకంగా కలిగించడమూ అవుతుంది.

---

కొత్త "ఇస్క్రా" కాన్ఫరెన్సు తీర్మానపు చివరి భాగం మన పార్టీలో పునరుద్ధరించబడిన మౌలిక ఆర్థికవాద ధోరణుల విమర్శ కొరకు కొత్త సమాచారం యేమీ యివ్వదు, కానీ పైన చెప్పినదాన్ని కాస్త భిన్నమైన కోణంనుండి తప్పక నిరూపిస్తుంది.

ఆ చివరి భాగం యిది:

> "ఒక సందర్భంలో మాత్రమే సోషల్ డెమోక్రసీ అధికారం వశంచేసుకోడానికీ, వీలైనంత కాలం నిలుపుకోడానికీ తన సొంత చొరవతో ప్రయత్నించాలి — అదేమిటంటే, సోషలిజంను సాధించడానికి కావలసిన పరిస్థితులు యిప్పటికే ఒకానొక (?) పరిపక్వతా స్థాయికి చేరుకున్న అభివృద్ధిచెందిన పశ్చిమ యూరపియన్ దేశాలకు విప్లవం వ్యాపించే పక్షంలో. ఆ సందర్భంలో రష్యన్ విప్లవపు పరిమిత చారిత్రక పరిధి గణనీయంగా విస్తరించగలదు, సోషలిస్టు సంస్కరణల పథంలో ప్రవేశించే అవకాశం ఉత్పన్నమౌతుంది.

''యావత్తు విప్లవ కాలంలో సోషల్ డెమోక్రటిక్ పార్టీ విప్లవ గతిలో ఒక దాని తర్వాత ఒకటి రాగల ప్రభుత్వాల కన్నిటికీ తన తీవ్ర విప్లవ ప్రతిపక్ష వైఖరిని నిలుపుకుంటుందనే ఉద్దేశంమీద తన యెత్తుగడలను ఆధారపరచడం ద్వారా సోషల్ డెమోక్రసీ, తన చేతుల్లో ప్రభుత్వాధికారం పడితే (??), దాన్ని వినియోగించుకోడానికి తన్ను తాను అత్యుత్తమంగా సిద్ధం చేసుకోగలదు.''

యిక్కడున్న మౌలిక భావం ''వ్పెర్యోద్'' పదేపదే సూత్రీకరించిందే. ''వ్పెర్యోద్'' చెప్పింది యేమిటంటే: ప్రజాతంత్ర విప్లవంలో సోషల్ డెమోక్రసీ సంపూర్ణ విజయానికి, అనగా శ్రామికవర్గపు, రైతాంగపు విప్లవ ప్రజాతంత్ర నియంతృత్వానికి మనం (మర్తీనొవ్‌లాగ) భయపడకూడదు, యెందుకంటే అలాంటి విజయం యూరప్‌ను మనం జాగృతం చేయగలిగేటట్లు చేస్తుంది; బూర్జువావర్గపు పెత్తనాన్ని తొలగించుకున్న తర్వాత యూరప్ సోషలిస్టు కార్మికవర్గం, తన వంతుగా, సోషలిస్టు విప్లవం సాధించడానికి మనకు తోడ్పడుతుంది. కానీ, కొత్త ''ఇస్క్రా''వాళ్ల చేతిలో యీ భావం యెలా నష్టపడిందో చూడండి. మేము వివరాలను చర్చించం; అధికారాన్ని వశంచేసుకోవడం హానికరమైన యెత్తుగడలు అని భావించే వర్గచైతన్యపూరిత పార్టీ చేతుల్లో అధికారం ''పడ''గలదనే అసంబద్ధ ఊహను చర్చించం; యూరప్‌లో సోషలిజంకు కావలసిన పరిస్థితులు ఒకానొక పరిపక్వతా స్థాయికి, దరహంమీద పరిపక్వతకు చేరుకొని వున్న విషయాన్ని చర్చించం; మన పార్టీ కార్యక్రమానికి యే సోషలిస్టు సంస్కరణలూ తెలియవు, సోషలిస్టు విప్లవం మాత్రమే తెలుసుననే విషయాన్ని చర్చించం. ''వ్పెర్యోద్'' భావానికీ, తీర్మానంలో ప్రదర్శించబడిన భావానికీ మధ్య గల ప్రధానమైన, మౌలికమైన భేదం తీసుకుందాం. ''వ్పెర్యోద్'' రష్యా విప్లవ శ్రామిక వర్గానికి క్రియాత్మకమైన కర్తవ్యం పెట్టింది: ప్రజాస్వామ్యం కొరకు జరిగే పోరాటంలో గెలవడమూ, యీ విజయాన్ని, యూరప్‌లోకి విప్లవాన్ని తీసుకపోడానికి, ఉపయోగించడమూ. తీర్మానం మన ''నిర్ణయాత్మక విజయా''నికీ (యీ విజయం కొత్త ''ఇస్క్రా'' అర్థంలో కాదు), యూరప్‌లో విప్లవానికీ మధ్య గల యీ లంకెను గ్రహించడంలేదు; అందువలన అది శ్రామికవర్గ కర్తవ్యాలను గురించి గానీ, శ్రామికవర్గపు విజయావకాశాలను గురించి గానీ మాట్లాడకుండా, దరహంమీద ఒక అవకాశం గురించి మాట్లాడుతుంది — ''విప్లవం వ్యాపించే సందర్భంలో...'' అనే అవకాశం గురించి. సాంఘికాభివృద్ధియొక్క నిర్ణీత దశలో వెంటనే యేమి సాధించగలిగేదీ, సోషలిజం కొరకు జరిగే పోరాటానికి ప్రజాతంత్ర పూర్వావసరంగా మొదట యేమి సాధించవలసిందీ మనసులో వుంచుకొని, ''ప్రభుత్వాధికారాన్ని'' శ్రామికవర్గ ప్రయోజనాలకు యెలా ''ఉపయోగించ''గలిగేదీ, ఉపయోగించ

వలసిందీ ''వ్పెర్యోద్'' సూటిగా, నిశ్చితంగా సూచించింది; రష్యన్ సోషల్ డెమొక్రటిక్ లేబర్ పార్టీ మూడవ మహాసభ తీర్మానంలో యిది చేర్చబడింది. యిక్కడ కూడా కాన్ఫరెన్సు తీర్మానం చాలా వెనుకబడింది; అది ''...వినియోగించుకోడానికి తన్ను తాను... సిద్ధం చేసుకోగలదు'' అని చెపుతుంది గానీ, యెలా వినియోగించుకోగలిగేదీ, యెలా తన్ను తాను సిద్ధం చేసుకొనేదీ, దేని కొరకు వినియోగించుకొనేదీ చెప్పదు. కొత్త ''ఇస్క్రా''వాళ్ల పార్టీలోని తమ ప్రముఖ స్థానాన్ని ''వినియోగించుకోడానికి తమ్ము తాము సిద్ధం చేసుకోగలిగి'' వుండవచ్చు ననడంలో మాకు సందేహం లేదు; కానీ అసలు విషయం యేమంటే, ఆ వినియోగానికి సంబంధించిన వాళ్ల అనుభవం చూస్తే, వాళ్ల సన్నాహం చూస్తే, అవకాశం వాస్తవ మవుతుందనే ఆశ పెద్దగా లేదు....

''అధికారాన్ని నిలుపుకునే అవకాశం'' నిజమైనది యెక్కడున్నదీ ''వ్పెర్యోద్'' చాలా నిశ్చితంగా చెప్పింది – యెక్కడున్నదంటే, శ్రామికవర్గపు, రైతాంగపు విప్లవ ప్రజాతంత్ర నియంతృత్వంలో, విప్లవ ప్రతీఘాత శక్తుల కన్నిటికీ పైచేయి కాగల వాటి ప్రజా సామూహిక బలంలో; ప్రజాతంత్ర సంస్కరణల్లో వాళ్ల ప్రయోజనాల అనివార్య ఏకీభావంలో. యిక్కడ కాన్ఫరెన్సు తీర్మానం నికరంగా యేమీ చెప్పదు; అది కేవలం సమస్యను దాటవేస్తుంది. నిశ్చయంగా, రష్యాలో అధికారాన్ని నిలుపుకునే అవకాశం రష్యాలోనే వున్న సాంఘిక శక్తుల అంగనిర్మాణంచేతా, యిప్పుడు మన దేశంలో జరుగుతున్న ప్రజాతంత్ర విప్లవపు పరిస్థితులచేతా నిర్ణయింపబడాలి. యూరప్‌లో శ్రామికవర్గ విజయం (యూరప్‌లోకి విప్లవాన్ని తేవడం అనేదానినుండి శ్రామికవర్గ విజయం అనేదానికి యింకా చాలా దూరం వుంది) రష్యన్ బూర్జువావర్గం తెంపరి విప్లవ ప్రతీఘాత పోరాటం చేసేటట్లు చేస్తుంది – కానీ కొత్త ''ఇస్క్రా''వాళ్ల తీర్మానం యీ విప్లవ ప్రతీఘాత శక్తిని గురించి ఒక్క మాట కూడా చెప్పదు; యీ శక్తి ప్రాముఖ్యం ఆర్.ఎస్.డి.ఎల్.పి. 3వ మహాసభ తీర్మానంలో అంచనా వేయబడింది. రిపబ్లిక్‌కొరకూ, ప్రజాస్వామ్యంకొరకూ మనం చేసే పోరాటంలో మనం శ్రామికవర్గంమీదలాగే రైతాంగంమీద కూడా ఆధారపడజాలకపోతే, మనం ''అధికారాన్ని నిలుపుకునే'' అవకాశం శూన్యం. అది శూన్యం కాకపోతే, ''జారిజంమీద విప్లవపు నిర్ణయాత్మక విజయం'' అలాంటి అవకాశాన్ని కలిగిస్తే, అప్పుడు మనం దానిని సూచించి, దానిని వాస్తవంలోకి మార్చడానికి చురుకుగా పిలుపు యిచ్చి, విప్లవం యూరప్‌లోకి తీసుకపోబడినప్పటి సందర్భానికి మాత్రమే కాక, దానిని అక్కడికి తీసుకపోయే లక్ష్యానికి కూడా ఆచరణాత్మక నినాదాలు యివ్వాలి. తోకవాదపు సోషల్ డెమొక్రట్లు ''రష్యన్ విప్లవపు పరిమిత చారిత్రక పరిధి''కి చేసిన ప్రస్తావన యీ ప్రజాతంత్ర విప్లవ లక్ష్యాలను గురించీ, దానిలో శ్రామికవర్గపు ప్రముఖ పాత్రను గురించీ వాళ్లకు గల పరిమిత అవగాహనకు ముసుగు వేయడానికి మాత్రమే ఉపకరిస్తుంది!

"శ్రామికవర్గపు, రైతాంగపు విప్లవ ప్రజాతంత్ర నియంతృత్వం" అనే నినాదానికి లేవనెత్తబడిన అభ్యంతరాలలో ఒకటి యేమిటంటే, నియంతృత్వం అనేది "ఏకైక ఇచ్ఛ"ను ఉద్దేశిస్తుందనీ ("ఇస్క్రా," నం. 95), శ్రామికవర్గానికీ, పెటీబూర్జువావర్గానికీ ఏకైక ఇచ్ఛ వుండజాలదనీ అనేది. యీ అభ్యంతరం సరైనది కాదు; యెందుకంటే, యిది "ఏకైక ఇచ్ఛ" అనే పదంయొక్క అభౌతిక, "జడాత్మక" అర్థంమీద ఆధారపడుతుంది. ఏకైక ఇచ్ఛ ఒక విషయంలో వుండి, మరొక విషయంలో లేకపోవచ్చు. సోషలిజంకు సంబంధించిన సమస్యలమీదా, సోషలిజం కొరకు జరిగే పోరాటంలోనూ ఐక్యత లేకపోవడం అనేది ప్రజాస్వామ్యానికి సంబంధించిన సమస్యలమీదా, రిపబ్లిక్ కొరకు జరిగే పోరాటంలోనూ ఇచ్ఛా ఏకత్వాన్ని అరికట్టదు. దీన్ని మరిచిపోవడమంటే ప్రజాతంత్ర విప్లవానికీ, సోషలిస్టు విప్లవానికీ మధ్య గల తార్కిక, చారిత్రక భేదాన్ని మరిచిపోవడ మన్నమాట. దీన్ని మరిచి పోవడమంటే యావత్ప్రజల విప్లవంగా వుండే ప్రజాతంత్ర విప్లవ స్వభావాన్ని మరిచి పోవడ మన్నమాట: అది "యావత్ప్రజల"ది అయితే, అది యేమేరకు యావత్ప్రజల అవసరాలను తీరుస్తుందో సరిగ్గా ఆమేరకు "ఇచ్ఛా ఏకత్వం" వుంది అని అర్థం. ప్రజాతంత్రవాదపు హద్దులకు అవల శ్రామికవర్గానికీ, కర్షక బూర్జువావర్గానికీ ఏకైక ఇచ్ఛ వుండడం అనే సమస్యే వుండజాలదు. వాటిమధ్య వర్గపోరాటం అనివార్యం; కానీ, యీ పోరాటం సోషలిజం కొరకు ప్రజలు చేసే అత్యంత సంపూర్ణమైన, విస్తృతమైన ప్రజా పోరాటంగా వుండబోయేది ప్రజాతంత్ర రిపబ్లిక్‌లోనే. ప్రపంచంలో అన్నిటికీ వున్నట్లే, శ్రామికవర్గపు, రైతాంగపు విప్లవ ప్రజాతంత్ర నియంతృత్వానికి ఒక గతమూ, ఒక భవిష్యత్తూ వున్నాయి. దాని గతం నిరంకుశత్వమూ, ఫ్యూడల్ దాస్యమూ, రాజరికమూ, అధిక సౌకర్యాలూ. యీ గతంతో చేసే పోరాటంలో, విప్లవ ప్రతీఘాతంతో చేసే పోరాటంలో, శ్రామికవర్గానికీ, రైతాంగానికీ ఇచ్ఛా ఏకత్వం సాధ్యమౌతుంది; యెందుకంటే, యిక్కడ ప్రయోజనాల ఏకత్వం వుంది.

దాని భవిష్యత్తు సొంత ఆస్తితో చేసే పోరాటం, యజమానితో వేతన కార్మికుడు చేసే పోరాటం, సోషలిజం కొరకు చేసే పోరాటం. యిక్కడ ఇచ్ఛా ఏకత్వం అసాధ్యం.* యిక్కడ మనముందున్న మార్గం నిరంకుశత్వంనుండి రిపబ్లిక్కుకు కాదు, పెటీబూర్జువా ప్రజాతంత్ర రిపబ్లిక్‌నుండి సోషలిజానికి.

---

* స్వేచ్ఛా పరిస్థితుల్లో మరింత విస్తృతంగా, వేగంగా జరిగే పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి ఇచ్ఛా ఏకత్వాన్ని అనివార్యంగా అంతం చేస్తుంది. విప్లవ ప్రతీఘాతాన్ని, ప్రగతి వ్యతిరేకతనీ యెంత త్వరగా నలిపివేస్తే, అంత త్వరగా ఆ అభివృద్ధి జరుగుతుంది.

నిజమే, వాస్తవ చారిత్రక పరిస్థితుల్లో, గతంయొక్క అంశాలూ, భవిష్యత్తుయొక్క అంశాలూ కలగలిసిపోతాయి; రెండు మార్గాలూ ఒకదాని నొకటి దాటుతాయి. సొంత ఆస్తితో పోరాటం చేసే వేతన శ్రమ నిరంకుశత్వంలో కూడా వుంది; అది ఫ్యూడల్ దాస్యంలో కూడా ఉద్భవిస్తుంది. కానీ, ముఖ్య అభివృద్ధి దశలను మనం తార్కికంగా, చారిత్రకంగా వింగ డించడాన్ని యిది యేమాత్రమూ నివారించదు. బూర్జువా విప్లవాన్నీ, సోషలిస్టు విప్లవాన్నీ మనమందరమూ పరస్పర విరుద్ధంగా చూస్తాం; వాటిని కచ్చితంగా వింగడించడం పరమ అవసరమని మనమందరమూ పట్టుబట్టుతాం. అయినప్పటికీ, చారిత్రక గతిలో, యీ రెండు విప్లవాల విడివిడి, ప్రత్యేక అంశాలూ కలగలిసిపోతాయనే విషయాన్ని నిరాకరించ గలమా? యూరప్‌లోని ప్రజాతంత్ర విప్లవాల దశలో ఎన్నో సోషలిస్టు ఉద్యమాలూ, సోష లిజాన్ని స్థాపించే ప్రయత్నాలూ జరగలేదా? యూరప్‌లో భావి సోషలిస్టు విప్లవం ప్రజా తంత్ర రంగంలో పూర్తి కాకుండా మిగిలిపోయిన చాలా భాగాన్ని యింకా పూర్తిచేయవలసి వుండదా?

శ్రామికవర్గం సోషలిజం కొరకు అత్యంత ప్రజాతంత్ర, రిపబ్లికన్ బూర్జువా, పెటీ బూర్జువా వర్గాలతో కూడా అనివార్యంగా వర్గపోరాటం చేయవలసి వుంటుందని సోషల్ డెమోక్రట్ క్షణం కూడా మరిచిపోకూడదు. యిది నిస్సందేహం. కనుక ప్రత్యేకమైన, స్వతంత్రమైన, కచ్చితంగా వర్గ పార్టీ అయిన సోషల్ డెమోక్రటిక్ పార్టీ పరమ అవ సరం. కనుక బూర్జువావర్గంతో కలిసి "సంయుక్తంగా దెబ్బ కొట్టే" మన యెత్తుగడల తాత్కాలిక స్వభావమూ, "శత్రువుమీద లాగ, మన పొత్తుదారునిమీద" కచ్చితమైన తనిఖీ వుంచవలసిన విధీ, వగైరా ఉత్పన్నమవుతాయి. యిదంతా నిస్సందేహం. అయినప్పటికీ అశాశ్వతమూ, తాత్కాలికమూ అయినా ప్రస్తుత సమయంలో ప్రాణప్రదమైనట్టి కర్తవ్యా లను మనం మరిచిపోవాలని గానీ, ఉపేక్షించాలని గానీ, నిర్లక్ష్యం చేయాలని గానీ దీనినుండి నిర్ణయం లాగడం అపహాస్యకరమూ, ప్రగతి వ్యతిరేకమూనూ. నిరంకుశత్వంతో పోరాటం సోషలిస్టులకు తాత్కాలికమైన, అశాశ్వతమైన కర్తవ్యం; కానీ యీ కర్తవ్యాన్ని ఉపేక్షిం చడం గానీ, నిర్లక్ష్యం చేయడం గానీ సోషలిజానికి ద్రోహమూ, ప్రగతి వ్యతిరేకతకు సేవా చేయడంతో సమానం. శ్రామికవర్గపు, రైతాంగపు విప్లవ ప్రజాతంత్ర నియంతృత్వం నిస్సందేహంగా అశాశ్వత, తాత్కాలిక సోషలిస్టు లక్ష్యం మాత్రమే; కానీ, ప్రజాతంత్ర విప్లవ దశలో యీ లక్ష్యాన్ని ఉపేక్షించడం పచ్చి ప్రగతి వ్యతిరేకత అవుతుంది.

నిర్దిష్ట పరిస్థితుల్లో నిర్దిష్ట రాజకీయ లక్ష్యాలు పెట్టుకోవాలి. అన్ని విషయాలూ సాపేక్షమైనవి, అన్ని విషయాలూ గడిచిపోతాయి, అన్ని విషయాలూ మారుతాయి. జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ రిపబ్లిక్ కొరకు డిమాండును తన కార్యక్రమంలో పెట్టలేదు. జర్మనీ

లోని పరిస్థితి యెలాంటిదంటే, ఆచరణలో యీ సమస్య సోషలిజం సమస్యనుండి విడదీయరానిది (జర్మనీ విషయంలో కూడా, ఎంగెల్సు 1891లో ఏర్‌ఫుర్ట్ కార్యక్రమంమీద చేసిన వ్యాఖ్యానాల్లో, రిపబ్లిక్‌యొక్క, రిపబ్లిక్ కొరకు జరిగే పోరాటంయొక్క ప్రాముఖ్యాన్ని కొంచెపరచరాదని హెచ్చరిక చేసినప్పటికీ![104]). రష్యన్ సోషల్ డెమోక్రసీలో తన కార్యక్రమంనుండీ, తన ప్రచారంనుండీ రిపబ్లిక్ కొరకు డిమాండును తొలగించే సమస్య యెప్పుడూ ఉత్పన్నం కాలేదు; యెందుకంటే, రిపబ్లిక్ సమస్యకూ, సోషలిజం సమస్యకూ విడదీయరాని లంకె వుందనడం సాధ్యం కాదు. రిపబ్లిక్ సమస్యకు ప్రత్యేకమైన ప్రాముఖ్యం యివ్వకపోవడం 1898 నాటి జర్మన్ సోషల్ డెమోక్రట్‌కు అతి సహజం; అది ఆశ్చర్యాన్ని గానీ, అభిశంసనను గానీ కలిగించదు. కానీ, 1848లో రిపబ్లిక్ సమస్యను వెనుకకు నెట్టే జర్మన్ సోషల్ డెమోక్రట్ విప్లవానికి పచ్చి ద్రోహిగా వుండేవాడు. అభౌతిక సత్యం అనేది యెక్కడా లేదు. సత్యం యెప్పుడూ నిర్దిష్టమైనది.

రష్యన్ నిరంకుశత్వంతో చేసే పోరాటం అంతమై, రష్యాలో ప్రజాతంత్ర విప్లవ దశ గడిచిపోయి వుండే కాలం వస్తుంది. అప్పుడు శ్రామికవర్గపు, రైతాంగపు "ఇచ్ఛా ఏకత్వం," ప్రజాతంత్ర నియంతృత్వం, వగైరాల గురించి మాట్లాడడమే అపహాస్యకరంగా వుంటుంది. ఆ కాలం వచ్చినప్పుడు శ్రామికవర్గ సోషలిస్టు నియంతృత్వ సమస్యను మనం సూటిగా చర్చిస్తాము, యింకా యెక్కువ సవివరంగా చర్చిస్తాము. ప్రస్తుతం పురోగామి వర్గపు పార్టీ జారిజంమీద ప్రజాతంత్ర విప్లవపు నిర్ణయాత్మక విజయం కొరకు అత్యంత చురుకుగా కృషిచేయక తప్పదు. నిర్ణయాత్మక విజయమంటే శ్రామికవర్గపు, రైతాంగపు విప్లవ ప్రజాతంత్ర నియంతృత్వం తప్ప మరేమీ కాదు.

గమనిక

1) "ఇస్క్రా"కూ, "వ్పెర్యోద్"కూ మధ్య జరిగిన వాదోపవాదాల్లో "ఇస్క్రా," యితర విషయాలతో పాటు, టురాటికి ఎంగెల్స్ రాసిన జాబును — ప్రజాతంత్ర విప్లవాన్నీ, సోషలిస్టు విప్లవాన్నీ ఒకటిగా గంద్రగోళపడవద్దని ఇటాలియన్ సంస్కరణవాదుల (భావి) నాయకునికి హెచ్చరిక చేస్తూ ఎంగెల్స్ రాసిన జాబును — ప్రస్తావించిందని మేము పాఠకునికి జ్ఞాపకం చేయదలచుకున్నాము. ఇటలీలోని ఆసన్న విప్లవం పెటీబూర్జువా, ప్రజాతంత్ర విప్లవంగా వుంటుందనీ, సోషలిస్టు విప్లవం కాదనీ ఎంగెల్స్ 1894లో ఇటలీలోని రాజకీయ పరిస్థితిని గురించి రాసినాడు.[105] ఎంగెల్స్ చేసిన సూత్రంనుండి "వ్పెర్యోద్" వైదొలగిందని "ఇస్క్రా" నిందించింది. యీ నింద అసమర్థనీయమైనది; యెందుకంటే, పందొమ్మిదవ శతాబ్దపు విప్లవాలలోని మూడు ప్రధాన శక్తుల మధ్య గల విభేదానికి సంబం

ధించిన మార్క్సు సిద్ధాంతపు నిర్దుష్టతను "వ్పెర్యోద్" (నం. 14) మొత్తంమీద అంగీకరించింది. యీ సిద్ధాంతం ప్రకారం, పాత వ్యవస్థకు వ్యతిరేకంగా, నిరంకుశత్వానికీ, ఫ్యూడలిజానికీ, ఫ్యూడల్ దాసుల వ్యవస్థకూ వ్యతిరేకంగా, యీ కింది శక్తులు నిలబడతాయి: 1) ఉదారవాద బడా బూర్జువావర్గమూ, 2) తీవ్రవాద పెటీబూర్జువావర్గమూ, 3) శ్రామికవర్గమూ. మొదటిది రాజ్యాంగబద్ధ రాజరికం కొరకు తప్ప మరి దేని కొరకూ పోరాడదు; రెండవది ప్రజాతంత్ర రిపబ్లిక్ కొరకు పోరాడుతుంది; మూడవది సోషలిస్టు విప్లవం కొరకు పోరాడుతుంది. సంపూర్ణ ప్రజాతంత్ర విప్లవం కొరకు జరిగే పెటీ బూర్జువావర్గపు పోరాటాన్నీ, సోషలిస్టు విప్లవం కొరకు జరిగే శ్రామికవర్గపు పోరాటాన్నీ ఒకటిగా గంద్రగోళపడడం సోషలిస్టుకు రాజకీయ దివాళాకోరుతనాన్ని యిచ్చే ప్రమాదం వుంది. యిలా వుంటుందని మార్క్సు చేసిన హెచ్చరిక యెంతో సమర్థనీయమైనది. కానీ, సరిగ్గా యీ కారణంవల్లనే "విప్లవ కమ్యూన్ల" నినాదం తప్పు; యెందుకంటే, చరిత్రలో ప్రసిద్ధికెక్కిన కమ్యూన్లు చేసిన అసలు పొరపాటే ప్రజాతంత్ర విప్లవాన్నీ, సోషలిస్టు విప్లవాన్నీ ఒకటిగా గంద్రగోళపడడం. తద్వ్యతిరేకంగా, శ్రామికవర్గపు, రైతాంగపు విప్లవ ప్రజాతంత్ర నియంతృత్వం అనే మన నినాదం యీ పొరపాటునుండి మనకు పూర్తి రక్షణ యిస్తుంది. కేవల ప్రజాతంత్ర విప్లవ హద్దులను నేరుగా దాటే సామర్థ్యం లేని విప్లవపు నిర్వివాద బూర్జువా స్వభావాన్ని గుర్తిస్తూనే, మన నినాదం యీ ప్రత్యేక విప్లవాన్ని ముందుకు తీసుకపోయి శ్రామికవర్గానికి అత్యంత అనుకూలమైన రూపాలు దానికి యివ్వడానికి కృషిచేస్తుంది. తత్ఫలితంగా, సోషలిజం కొరకు శ్రామికవర్గం చేసే యితోధిక పోరాటానికి అత్యున్నత విజయం సంపాయించడానికి ప్రజాతంత్ర విప్లవంనుండి గరిష్ఠ లాభాలు పొందడానికి మన నినాదం కృషిచేస్తుంది.

## 11. ఆర్.ఎస్.డి.ఎల్.పి. మూడవ మహాసభయొక్క కొన్ని తీర్మానాలనూ, "కాన్ఫరెన్సు" తీర్మానాలనూ స్థూలంగా పోల్చిచూడడం

తాత్కాలిక విప్లవ ప్రభుత్వ సమస్య ప్రస్తుతం సోషల్ డెమోక్రటిక్ ఉద్యమపు కీలక యెత్తుగడల సమస్య. కాన్ఫరెన్సుయొక్క యితర తీర్మానాలను యింత సవివరంగా చర్చించడం సాధ్యమూ కాదు, అవసరమూ కాదు. ఆర్.ఎస్.డి.ఎల్.పి. మూడవ మహాసభ తీర్మానాలలోని యెత్తుగడల ధోరణికీ, కాన్ఫరెన్సు తీర్మానాలలోని యెత్తుగడల ధోరణికీ

మధ్య గల సూత్రగతమైన భేదాన్ని, పైన పరిశీలించినదాన్ని, ధ్రువపరచే కొన్ని అంశా లను సంక్షేపంగా కేవలం ప్రస్తావించడానికి మేము పరిమితమౌతాము.

విప్లవ ప్రాంగణంలో ప్రభుత్వపు యెత్తుగడలపట్ల వైఖరికి సంబంధించిన సమస్యను తీసుకుందాం. మళ్లీ, ఆర్.ఎస్.డి.ఎల్.పి. మూడవ మహాసభ తీర్మానంలో యీ సమస్యకు సమగ్రమైన సమాధానం కనపడుతుంది. యీ తీర్మానం నిర్దిష్ట తరుణపు వివిధ పరిస్థి తులనూ, కర్తవ్యాలనూ అన్నిటినీ లెక్కలోకి తీసుకుంటుంది: ప్రభుత్వం యిచ్చిన సౌకర్యా ల్లోని బూటకాన్ని వెల్లడిచేయడం; "ప్రజా ప్రాతినిధ్యపు అపహాస్యాలను" వినియోగించు కోవడం; శ్రామికవర్గపు జరూరు డిమాండ్లను (ప్రధానమైనది యెనిమిది గంటల పని దినం) విప్లవకరంగా సాధించడం; చివరిది, నల్ల నూర్లవాళ్లను ప్రతిఘటించడం. కాన్ఫరెన్సు తీర్మానాల్లో యీ సమస్య పలు భాగాల్లో ముక్కలు ముక్కలుగా చర్చించబడింది: "దుష్ట ప్రగతి వ్యతిరేక శక్తులకు ప్రతిఘటన" యితర పార్టీలపట్ల వైఖరిమీద వున్న తీర్మానపు ఉపోద్ఘాతంలో మాత్రం ప్రస్తావించబడింది. ప్రాతినిధ్యపు సంస్థలకు జరిగే యెన్నికల్లో పాల్గొనడం బూర్జువావర్గంతో జారిజం చేసుకునే "రాజీల"తో సంబంధం లేకుండా చర్చించ బడింది. యెనిమిది గంటల పనిదినాన్ని విప్లవకర సాధనాలద్వారా సాధించడానికి పిలుపు యివ్వడానికి బదులు, "ఆర్థిక పోరాటం గురించి" అనే ఆడంబర శీర్షిక గల ఒక ప్రత్యేక తీర్మానం ("రష్యన్ సాంఘిక జీవితంలో కార్మిక సమస్య ఆక్రమించిన కేంద్ర స్థానం" గురించి గంభీరమైన, మహా మతిహీనమైన మాటల తర్వాత) "యెనిమిది గంటల పని దినాన్ని శాసనపూర్వకంగా స్థాపించడం" కొరకు ప్రచారం సాగించాలనే పాత వినాదాన్ని కేవలం పునశ్చరణ చేస్తుంది. ప్రస్తుత సమయంలో యీ నినాదపు అరకొరతనమూ, కాలా తీతత్వమూ రుజువు చేయనక్కరలేనంత తేటతెల్లంగా వున్నాయి.

బహిరంగ రాజకీయ ఆచరణ సమస్య. మన కార్యకలాపాల్లో ఆసన్నమైన సమూల మైన మార్పును మూడవ మహాసభ లెక్కలోకి తీసుకుంటుంది. రహస్య కార్యకలాపాలనూ, రహస్య సంస్థల అభివృద్ధినీ యే కారణంవల్లా గానీ విసర్జించకూడదు. యిది పోలీసులకు దొరికే మార్గంగా, ప్రభుత్వానికి మహా అనుకూలంగా వుంటుంది. కానీ, ఇప్పుడే బహిరంగ ఆచరణను గురించి కూడా మనం ఆలోచించాలి. అనుకూలమైన అలాంటి ఆచరణ రూపా లనూ, తత్పర్యవసానంగా ప్రత్యేక సంస్థలనూ — తక్కువ రహస్యమైనవాటిని — యీ లక్ష్యం కొరకు వెంటనే సిద్ధంచేయాలి. చట్టబద్ధ, అర్ధ చట్టబద్ధ సంస్థలను వినియో గించుకోవాలి, వాటిని, వీలైనంతవరకు రష్యాలోని భావి బహిరంగ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీకి స్థావరాలుగా మార్చే లక్ష్యంతో.

కాన్ఫరెన్సు యిక్కడ కూడా సమస్యను చీల్చి, అఖండ వివాదాలను యివ్వలేకపోయింది. కొట్టవచ్చినట్లు కనిపించే దేమిటంటే, చట్టబద్ధంగా పనిచేసే పత్రికా రచయితలకు "పద వులు యివ్వడం" గురించి చూడమని ఆర్గనైజింగు కమిటీకి యిచ్చిన పరిహాసాస్పదమైన ఆదేశం. తరువాత "కార్మికవర్గ ఉద్యమానికి సహాయంచేసే లక్ష్యం పెట్టుకున్న ప్రజా తంత్ర వార్తాపత్రికలను మన ప్రభావానికి లోబరచా"లనే పరమ అసంబద్ధ నిర్ణయం. మన చట్టబద్ద ఉదారవాద వార్తాపత్రికలన్నీ చెప్పుకున్న లక్ష్యం యిది; వాటిలో దాదాపు అన్నీ "ఒస్వాబొజ్దేనియె" ధోరణికి చెందినవి. "ఇస్క్రా" సంపాదకవర్గం తామే తమ సలహాను ఆచరించడం ప్రారంభించి, "ఒస్వాబొజ్దేనియె"ను సోషల్ డెమొక్రటిక్ ప్రభా వానికి లోబరచడం యెలాగో మనకొక ఉదాహరణ యెందుకివ్వకూడదు? పార్టీకి స్థావరాలు నెలకొల్పేటట్లుగా, చట్టబద్ధంగా యిప్పుడున్న సంఘాలను వినియోగించుకోవాలనే వివాదా నికి బదులు, మనకు మొదట, కార్మిక సంఘాలను గురించి మాత్రమే ఒక నిర్దిష్టమైన సలహా (పార్టీ సభ్యులు వాటిలో చురుకుగా వుండాలి) యివ్వబడింది; రెండవది, "కార్మికుల విప్లవ సంఘాలను"="అనధికారికంగా నిర్మించబడిన సంఘాలను"="విప్లవ కార్మిక క్లబ్బు లను" నడిపించాలని సలహా యివ్వబడింది. యీ "క్లబ్బులు" అనధికారికంగా నిర్మించబడిన సంఘాలుగా యెలా వర్గీకరించబడిందీ, అసలు యీ క్లబ్బులు యేమిటైందీ, భగవంతునికే తెలుసు. అత్యున్నత పార్టీ సంస్థనుండి నిశ్చితమైన, స్పష్టమైన ఆదేశాలకు బదులు, ఆషా మాషీగా గుర్తుపెట్టుకున్న కొన్ని ఆలోచనలూ, పండితులు తయారుచేసిన కొన్ని స్థూల మైన ముసాయిదాలూ వున్నాయి. పార్టీ తన పని అంతటిలోనూ సంపూర్ణంగా కొత్తదైన ప్రాతిపదికకు పరివర్తన ప్రారంభం గురించి సంపూర్ణ చిత్రం లేదు.

"రైతు సమస్య" పార్టీ మహాసభచేతా, కాన్ఫరెన్సుచేతా పూర్తిగా భిన్నంగా ప్రతిపాదించబడింది. మహాసభ "రైతు ఉద్యమంపట్ల వైఖరి"మీద ఒక తీర్మానం తయారు చేసింది; కాన్ఫరెన్సు "రైతుల్లో పని"మీద తీర్మానం తయారుచేసింది. మొదటి సంద ర్భంలో, జారిజంతో చేసే పోరాటపు సాధారణ జాతీయ ప్రయోజనాల కొరకు యావత్తు విప్లవ ప్రజాతంత్ర ఉద్యమాన్ని నడిపించే కర్తవ్యానికి ప్రాముఖ్యం యివ్వబడింది. రెండవ సందర్భంలో, సమస్య కేవలం సమాజంలోని ఒక నిర్దిష్ట భాగంలో చేసే "పని"కి కుదించ బడింది. మొదటి సందర్భంలో, ప్రజాతంత్ర మార్పుల నన్నిటినీ నిర్వహించడానికి విప్లవ రైతు కమిటీలను తక్షణం నిర్మించాలని మన ప్రచారానికి కేంద్ర ఆచరణాత్మక నినాదం యివ్వబడింది. రెండవదానిలో "కమిటీల నిర్మాణంకొరకు డిమాండు"ను రాజ్యాంగ నిర్ణయసభకు సమర్పించాలి. యీ రాజ్యాంగ నిర్ణయసభ కోసం మనమెందుకు కాచుకోవాలి? యిది నిజంగా రాజ్యాంగ నిర్ణయసభగా వుంటుందా? సన్నాహక చర్యగా అదే సమయంలో విప్లవ

రైతు కమిటీలను స్థాపించకుండా యిది స్థిరంగా వుంటుందా? యీ ప్రశ్నల నన్నిటినీ కాన్ఫరెన్సు గమనించలేదు. దాని తీర్మానాలన్నీ మనం పరిశీలిస్తూ వచ్చిన సాధారణ భావాన్ని ప్రతిబింబిస్తాయి – బూర్జువా విప్లవంలో మనం మొత్తం ప్రజాతంత్ర విప్లవాన్ని నడిపించడమూ, ఆ ఉద్యమాన్ని స్వతంత్రంగా సాగించడమూ అనే లక్ష్యాన్ని అనుసరించకుండా, మన ప్రత్యేక పనిని మాత్రం చేయాలి అనే భావాన్ని. ఆర్థిక పోరాటం సోషల్ డెమోక్రట్లు చేయవలసిందనీ, రాజకీయ పోరాటం ఉదారవాదులదనీ చెప్పే పొరపాటులో ''ఆర్థికవాదులు'' నిత్యం పడుతూ వుండినట్లు, కొత్త ''ఇస్క్రా''వాళ్లు తమ వాదాలన్నిటిలోనూ, బూర్జువా వర్గం విప్లవాన్ని నిర్వహించే క్రియాత్మక పని చేస్తూవుండగా మనం బూర్జువా విప్లవానికి యెడంగా ఒక మూల వినయంగా కూర్చోవాలనే భావంలో పడుతున్నారు.

చివరి విషయం, యితర పార్టీలపట్ల వైఖరిమీద చేసిన తీర్మానాన్ని కూడా గమనించాలి. ఆర్.ఎస్.డి.ఎల్.పి. మూడవ మహాసభ తీర్మానం బూర్జువా విమోచనోద్యమంలోని సమస్త పరిమితత్వాన్నీ, అరకొరతనాన్నీ బట్టబయలు చేసి, ఖండించాలనీ, అలాంటి పరిమితత్వం సంభవించగల ప్రతి సందర్భాన్నీ ప్రతి మహాసభలోనూ పేర్కొనడం, లేదా చెడ్డ బూర్జువాకూ, మంచి బూర్జువాకూ మధ్య భేదాన్ని గమనించడం అనే పసితనపు భావాన్ని మనసులో పెట్టుకోకూడదనీ చెపుతుంది. స్తరొవేర్ చేసిన పొరపాటును తిరిగి చేస్తూ, కాన్ఫరెన్సు ఆ పంథా కొరకు వెదకి, ప్రసిద్ధమైన ''గీటురాయి'' సిద్ధాంతాన్ని అభివృద్ధి చేసింది. బూర్జువావర్గానికి సాధ్యమైనంత కఠినమైన షరతులు విధించడం అనే చాలా మంచి భావం నుండి స్తరొవేర్ బయలుదేరాడు. కానీ, ఆమోదానికీ, ఒప్పందాలకూ, వగైరాలకు యోగ్యమైన బూర్జువా ప్రజాతంత్రవాదులను అలా యోగ్యంకాని బూర్జువా ప్రజాతంత్రవాదుల నుండి ముందుగానే వేరుచేసే ప్రయత్నం యేదైనా ఘటనలచేత వెంటనే కొట్టిపారవేయబడేదీ, శ్రామికవర్గ వర్గచైతన్యంలో గందరగోళాన్ని ప్రవేశపెట్టేదీ అయిన ''సూత్రా''నికి దారితీస్తుందనే విషయాన్ని అతను మరిచిపోయినాడు. పోరాటంలోని నిజమైన ఐక్యతకు యివ్వవలసిన ప్రాముఖ్యం ప్రకటనలకూ, వాగ్దానాలకూ, నినాదాలకూ యివ్వబడింది. ''సార్వజనీన, సమాన వోటు హక్కూ, ప్రత్యక్ష యెన్నికలూ, రహస్య వోటింగూ'' అలాంటి మౌలికమైన నినాదాలని స్తరొవేర్ విశ్వసించినాడు. రెండేళ్లు కూడా సరిగా గడవకముందే, ''గీటురాయి'' నిరుపయోగమని తేలింది, సార్వజనీన వోటు హక్కు నినాదాన్ని ''ఒస్వొబొజ్దేనియె''వాళ్లు చేపట్టినారు; తద్వారా వాళ్లు సోషల్ డెమోక్రసీకి యేమాత్రమూ దగ్గరకు రాకపోవడమే కాక, పైగా, ఆ నినాదం ద్వారానే కార్మికులను తప్పుదారి పట్టించడానికీ, సోషలిజంనుండి పక్కకు మళ్లించడానికీ ప్రయత్నించినారు.

యిప్పుడు కొత్త ''ఇస్క్రా''వాళ్లు అంతకంటె కూడా ''కఠినతరమైన'' ''షరతులు''

విధిస్తున్నారు. "ప్రజల స్వీయ ఆయుధధారణలో క్రియాత్మకంగా పాల్గొనడం" వరకు, దానితో సహా, "సంఘటిత శ్రామికవర్గపు కృతనిశ్చయమైన ప్రతి ఆచరణకూ చురుకైన, అసందిగ్ధమైన (!?) అండదండలు," వగైరాలను జారిజంయొక్క శత్రువులనుండి వాళ్ళు "డిమాండుచేస్తున్నారు." యీ పంథా యింతా ముందుకు తీసుకుపోబడింది; అయినప్పటికీ యిది మళ్ళీ యిప్పటికే పాతబడిపోయి, తన నిరుపయోగత్వాన్ని వెంటనే వెల్లడించింది. ఉదాహరణకు, రిపబ్లిక్ కొరకు యే నినాదమూ యెందుకు లేదు? సోషల్ డెమోక్రట్లు — "సాంఘిక అంతస్తులయొక్కా, రాజరికంయొక్కా వ్యవస్థ పునాదులతో సడలుబాటులేని విప్లవ యుద్ధ" ప్రయోజనాల కొరకు — బూర్జువా ప్రజాతంత్రవాదులనుండి రిపబ్లిక్ కొరకు పోరాటాన్ని తప్ప దేనినైనా "డిమాండు" చేయడం యెలా జరిగింది?

యీ సమస్య కేవలం రంధ్రాన్వేషణ కాదనీ, కొత్త "ఇస్క్రా"వాళ్ళ పొరపాటు కీలకమైన రాజకీయ ప్రాముఖ్యం గలదనీ "రష్యా విమోచన సంఘం"చేత రుజువు చేయబడింది (చూ: "ప్రొలెతారియ్," నం. 4).* యీ "జారిజంయొక్క శత్రువులు" కొత్త "ఇస్క్రా"వాళ్ల "షరతుల" నన్నిటినీ పూర్తిగా తీరుస్తారు. అయినా, యీ "రష్యా విమోచన సంఘం"యొక్క కార్యక్రమం (లేక కార్యక్రమ రాహిత్యం)లో "ఒస్వొబొజ్దేనియె" తత్వం రాజ్యం చేస్తున్నదనీ, "ఒస్వొబొజ్దేనియె"వాళ్లు దానిని సులభంగా లోబరచుకోగలరనీ మేము నిరూపించినాము. అయినప్పటికీ, "ఉదారవాద, ప్రజాతంత్ర పతాకను ప్రదర్శించినప్పటికీ, శ్రామికవర్గ విప్లవ పోరాటానికి నిజమైన అండదండలు యివ్వడానికి నిరాకరించే రాజకీయ పార్టీల నన్నిటినీ, ప్రజల బూటకపు మిత్రులుగా, వ్యతిరేకించడం సోషల్ డెమోక్రసీ కొనసాగిస్తుం"దని తీర్మానం చివరి భాగంలో కాన్ఫరెన్సు ప్రకటిస్తుంది. "రష్యా విమోచన సంఘం" యీ అండదండలను నిరాకరించకపోవడమే కాక, అత్యంత పట్టుదలగా వాగ్దానం చేస్తున్నది. యీ సంఘం నాయకులు "ఒస్వొబొజ్దేనియె"వాళ్లైనప్పటికీ "ప్రజల బూటకపు మిత్రులు" కాకపోవడానికి యిది హామీయా?

---

* 1905 జూన్ 4న వెలువడిన "ప్రొలెతారియ్," సంచిక 4లో "కొత్త విప్లవ కార్మిక సంఘం" అనే శీర్షికతో ఒక సుదీర్ఘ వ్యాసం వుంది. "రష్యా విమోచన సంఘం" అనే పేరు పెట్టుకొని, సాయుధ తిరుగుబాటు సహాయంతో రాజ్యాంగ నిర్ణయసభను సమావేశపరచే లక్ష్యం పెట్టుకున్న యీ సంఘపు విజ్ఞప్తుల సారం యీ వ్యాసంలో వుంది. అంతే కాక, అలాంటి నాన్‌పార్టీ సంఘాలపట్ల సోషల్ డెమోక్రట్ల వైఖరిని యీ వ్యాసం నిర్వచించింది. యేమేరకు యీ సంఘం క్రియాత్మకంగా వుండిందీ, విప్లవంలో దాని గతి యేమైందీ మనకు బొత్తిగా తెలియదు. (1907 కూర్పుకు రచయిత వివరణ. — సం.)

ముందుగా "షరతులు" సృష్టించడంద్వారా, అమోఘమైన నిర్వీర్యత మూలంగా అపహాస్యకరమైన "డిమాండ్లు" పెట్టడంద్వారా కొత్త "ఇస్క్రా"వాళ్లు తమ్ము తాము అపహాస్యకరమైన స్థితిలో పెట్టుకున్నారు. సజీవ వాస్తవాలను అంచనా వేయవలసి వచ్చేటప్పటికి వాళ్ల షరతులూ, డిమాండ్లూ అరకొర అని వెంటనే తేలిపోతున్నది. వాళ్ల సూత్రాల వెంటబడడం నిరర్థకం; యెందుకంటే, యే సూత్రమూ బూర్జువా ప్రజాతంత్రవాదులు ప్రదర్శించే వంచనయొక్కా, అస్థిరత్వంయొక్కా, సంకుచిత మనస్తత్వం యొక్కా వివిధ వ్యక్తీకరణ లన్నిటినీ ఆవరించజాలదు. యిది "గీటురాయి," సూత్రాల సమస్య గానీ, లిఖిత, ముద్రిత డిమాండ్ల సమస్య గానీ, బూటకపు "ప్రజల మిత్రుల"కూ, హృదయపూర్వకమైన "ప్రజల మిత్రుల"కూ మధ్య ముందుగానే భేదం చూసే సమస్య గానీ కాదు; బూర్జువా ప్రజాస్వామ్యం తీసుకునే ప్రతి "అనిశ్చిత" చర్యనూ సడలుబాటు లేకుండా విమర్శించే సోషల్ డెమోక్రట్లు చేసే పోరాటంలో వాళ్ల నిజమైన ఐక్యతకు సంబంధించిన సమస్య. "ప్రజాస్వామిక మార్పులో ప్రయోజనం గల సకల సాంఘిక శక్తుల నిజమైన సంఘటన" కొరకు కావలసింది కాన్ఫరెన్సు అంత శ్రద్ధగా, అంత వృథాగా కష్టపడి తయారు చేసిన "అంశాలు" కాదు, నిజంగా విప్లవకరమైన నినాదాలు యిచ్చే సామర్థ్యం. శ్రామికవర్గ లక్ష్యాలను రాజరికవాద బూర్జువావర్గపు స్థాయికి దించే నినాదాలు కాక, విప్లవ, రిపబ్లికన్ బూర్జువావర్గాన్ని శ్రామికవర్గ స్థాయికి యెత్తే నినాదాలు అవసరం దీనికి. దీనికి కావలసింది తిరుగుబాటులో అత్యంత చురుకుగా పాల్గొనడం, సాయుధ తిరుగుబాటు అనే జరూరు కర్తవ్యంనుండి కూటపాండిత్యంతో తప్పుకోవడం కాదు.

## 12. ప్రజాతంత్ర విప్లవంనుండి బూర్జువావర్గం వెనక్కి పోతే, ఆ విప్లవ విస్తృతి తగ్గుతుందా?

పై పంక్తులు రాసిన తర్వాత, కొత్త "ఇస్క్రా"వాళ్ల కాకసస్ కాన్ఫరెన్సులో ఆమోదింపబడి, "ఇస్క్రా"లో ప్రచురింపబడిన తీర్మానాల ప్రతి మాకు అందింది. Pour la bonne bouche (మంచి సమాప్తం కొరకు) మేము ప్రయత్నించినా యింతకంటె పసందైనదాన్ని కల్పించలేం.

"ఇస్క్రా" సంపాదకులు పూర్తి న్యాయంగా యిలా అన్నారు: "యెత్తుగడల మౌలిక సమస్యమీద అఖిల రష్యా కాన్ఫరెన్సు" (అనగా కొత్త "ఇస్క్రా"వాళ్ల కాన్ఫరెన్సు) "చేసిన నిర్ణయానికి *సమానమైన*" (నిజం!) "నిర్ణయానికి కాకసస్ కాన్ఫరెన్సు కూడా వచ్చింది."

“తాత్కాలిక విప్లవ ప్రభుత్వంపట్ల సోషల్ డెమొక్రసీ వైఖరికి సంబంధించిన సమస్యను కాకసస్ కామ్రేడ్ల ‘వ్ఫెర్యోద్’ బృందమూ, ఆ బృందంలో కలిసినట్టి మహాసభ అనబడే దాని ప్రతినిధులూ ప్రచారంచేసే కొత్త పద్ధతికి నిరాఘాటమైన వ్యతిరేకతా తత్వంలో పరిష్కరించినారు.” “బూర్జువా విప్లవంలో శ్రామికవర్గ పార్టీ యెత్తుగడల సూత్రీకరణ, కాన్ఫరెన్సు యిచ్చినట్టిది, అత్యంత ఉచితంగా వుందని ఒప్పుకోక తప్పదు.”

యిది పరమ సత్యం. కొత్త “ఇస్క్రా”వాళ్ల మౌలికమైన తప్పును గురించి యింతకంటె “ఉచితమైన” సూత్రీకరణను యెవరూ యిచ్చివుండలేరు. యీ సూత్రీకరణను పూర్తిగా యిస్తాం, మొదట పూలనూ, చివరలో పండ్లనూ ప్రస్తావిస్తూ.

కొత్త “ఇస్క్రా”వాళ్ల కాకసస్ కాన్ఫరెన్సు తాత్కాలిక ప్రభుత్వంమీద చేసిన తీర్మానం యిదీ:

“శ్రామికవర్గంలో సోషల్ డెమొక్రటిక్ చైతన్యాన్ని మరింత ప్రగాఢం చేయడానికీ” (నిజమే! “మర్తీనొవ్ పద్ధతిలో!” అని వాళ్ళు కలిపివుండవలసింది. చైతన్యాన్ని మరింత ప్రగాఢం చేయడానికి మాత్రమే, రిపబ్లిక్‌ను గెలుచుకోడానికి కాదా? విప్లవాన్ని గురించి యెంత “ప్రగాఢమైన” అవగాహన!) “శైశవ బూర్జువా రాజ్య వ్యవస్థను విమర్శించడానికి సంపూర్ణ స్వేచ్ఛను మన పార్టీకి సంపాయించడానికీ” (రిపబ్లిక్‌ను సంపాయించడం మన పని కాదు! మన పని విమర్శించడానికి స్వేచ్ఛను సంపాయించడం మాత్రమే. అరాజకవాద భావాలు అరాజకవాద భాషను ఉత్పత్తిచేస్తాయి: “బూర్జువా రాజ్య” వ్యవస్థ!) “విప్లవ పరిస్థితిని వినియోగించుకోవడం మా కర్తవ్యమని మేము భావిస్తున్నాము గనుక, యీ కాన్ఫరెన్సు సోషల్ డెమొక్రటిక్ తాత్కాలిక ప్రభుత్వాన్ని యేర్పరచడానికీ, అలాంటి ప్రభుత్వంలో చేరడానికీ తాను వ్యతిరేకమని ప్రకటిస్తూ” (స్పానిష్ విప్లవానికి పది నెలల ముందు బకూనినిస్టులు[106] చేసిన తీర్మానాన్ని, ఎంగెల్స్ ప్రస్తావించినదానిని, జ్ఞాపకం చేసుకోండి: “ప్రొలెతారియ్,” నం. 3 చూడండి[107]), “రాజ్య వ్యవస్థయొక్క ప్రజాతంత్రీకరణను ఆచరణీయ ప్రమాణంలో (!?) సంపాయించడానికి బూర్జువా తాత్కాలిక ప్రభుత్వంమీద బయటనుండి” (పైనుండి కాదు, కిందినుండి) “ఒత్తిడి ప్రయోగించడం అత్యంత అనుకూలమైన మార్గమని భావిస్తున్నది. సోషల్ డెమొక్రట్లు తాత్కాలిక ప్రభుత్వాన్ని యేర్పరచడం గానీ, అలాంటి ప్రభుత్వంలో చేరడం గానీ ఒకవైపున, వాళ్ళు అధికారం వశంచేసుకున్నప్పటికీ కార్మికవర్గపు జరూరు అవసరాలను, సోషలిజం సాధనతో సహా, తీర్చజాలరు గనుక” (రిపబ్లిక్ జరూరు అవసరం కాదు! రచయితలు తమ అమాయకత్వంలో, తాము బూర్జువా విప్లవాల్లో పాల్గొనడాన్ని నిరాకరిస్తున్నట్లు శుద్ధ అరాజకవాద భాష మాట్లాడుతున్న విషయాన్ని గమనించడం లేదు!), “కార్మికవర ం నాలు సోషల్

డెమోక్రటిక్ పార్టీపట్ల ఆశాభంగం పొంది, దాన్ని విసర్జించడానికి దారితీస్తుందనీ, మరొక వైపున, విప్లవంనుండి బూర్జువావర్గాలు వెనక్కిపోయేటట్లు చేసి, తద్వారా దాని విస్తృతిని తగ్గిస్తుందనీ కాన్ఫరెన్సు నమ్ముతోంది.''

అది కీలక విషయం. అక్కడే అరాజకవాద భావాలు పచ్చి అవకాశవాదంతో (పశ్చిమ యూరపియన్ బెర్న్‌స్టైనియన్‌ల విషయంలో కూడా నిత్యం జరిగేటట్లు) కలిసి పోయేది. ఊహించండి: తాత్కాలిక ప్రభుత్వంలో చేరకూడదు, యెందుకంటే, అది విప్లవంనుండి బూర్జువావర్గం వెనక్కిపోయేటట్లు చేసి, తద్వారా విప్లవ విస్తృతిని తగ్గిస్తుంది గనుక! యిక్కడ నిజంగా కొత్త ''ఇస్క్రా'' సిద్ధాంతమంతా వుంది, పరిశుద్ధమైన, స్థిరమైన రూపంలో: విప్లవం బూర్జువా విప్లవం గనుక, మనం బూర్జువా అల్పబుద్ధికి తల వంచి, దానికి దారి వదలాలి. మనం పాల్గొనడం బూర్జువావర్గం వెనక్కిపోయేటట్లు చేయవచ్చు ననే ఆలోచన పాక్షికంగా నైనా, క్షణం సేపైనా మనకు మార్గదర్శకమైతే, తద్వారా మనం కేవలం విప్లవ నాయకత్వ మంతటినీ బూర్జువావర్గాలకు అందజేస్తాం. తద్వారా మనం కార్మికవర్గ మంతటినీ బూర్జువావర్గపు పెద్దరికంకింద పెట్టి (సంపూర్ణ ''విమర్శనా స్వేచ్ఛ''ను నిలుపుకుంటూ!!) బూర్జువావర్గం వెనక్కిపోకుండా వుండేందుకుగాను కార్మిక వర్గం మితంగా, అణకువగా వుండేటట్లు నిర్బంధిస్తాము. మనం కార్మికవర్గపు అత్యంత ముఖ్యమైన అవసరాలను అనగా రాజకీయ అవసరాలను – ''ఆర్థికవాదులూ,'' వాళ్లను అను కరించేవాళ్లూ యెన్నడూ సక్రమంగా అర్థంచేసుకోనివాటిని – నిర్వీర్యపరుస్తాము, బూర్జువా వర్గం వెనక్కిపోకుండా వుండేందుకుగాను నిర్వీర్యపరుస్తాము. కార్మికవర్గం కోరిన మేరకు ప్రజాస్వామ్యాన్ని సాధించడానికి చేసే విప్లవ పోరాటపు వేదికనుండి మనం బూర్జువా వర్గంతో బేరమాడుతూ, విప్లవానికి ద్రోహం చేసి, మన సూత్రాలను ఖరీదుగా చెల్లించి, బూర్జువావర్గపు ఐచ్ఛిక ఆమోదాన్ని (''అది వెనక్కిపోకుండా వుండేందుకుగాను'') కొనే వేదికకు పూర్తిగా పోతాము.

విప్లవానికి ద్రోహం చేసి, కార్మికవర్గాన్ని బూర్జువావర్గాల దౌర్భాగ్యపు తోకగా మార్చే యెత్తుగడల సారాంశాన్ని కాకసస్ కొత్త ''ఇస్క్రా''వాళ్లు రెండు చిన్న పంక్తుల్లో వ్యక్తం చేయగలిగారు. కొత్త ''ఇస్క్రా'' ధోరణి తప్పులను బట్టి మనం పైన గ్రహించిన విషయం యిప్పుడు ఒక స్పష్టమైన నిశ్చితమైన సూత్రంగా, రాజరికవాద బూర్జువావర్గపు అడుగు జాడల్లో నడవడం అనే సూత్రంగా, గౌరవించబడడం మనకు కనపడుతోంది. రిపబ్లిక్ స్థాపన బూర్జువావర్గం వెనక్కిపోయేటట్లు చేస్తుంది (యిప్పటికే చేస్తోంది – స్త్రూవె ఒక ఉదాహరణ) గనుక, రిపబ్లిక్ కొరకు పోరాటం వద్దు. కార్మికవర్గం చేసే చురుకైన, స్థిరమైన ప్రజాతంత్ర డిమాండు ప్రతిదీ యెప్పుడైనా, ప్రపంచంలో యెక్కడైనా బూర్జువా

వర్గం వెనక్కిపోయేటట్లు చేస్తుంది గనుక — కార్మికులారా, మీ బొరియల్లో దాక్కోండి; బయటనుండి మాత్రమే పనిచేయండి; "బూర్జువా రాజ్య" వ్యవస్థ సాధనాలనూ, ఆయుధాలనూ విప్లవ ప్రయోజనాల కొరకు ఉపయోగించుకోవాలని కలలో కూడా అనుకోకండి; "విమర్శనా స్వేచ్ఛ"ను రిజర్వు చేసుకోండి!

"బూర్జువా విప్లవం" అన్న పదం గురించి వాళ్లకు గల అవగాహనలోనే వున్న మౌలిక దోషం పైకి వచ్చింది. యీ పదం గురించి మర్తీనొవ్‌కు, లేదా కొత్త "ఇస్క్రా"కు గల "అవగాహన" బూర్జువావర్గానికి లాభకరంగా కార్మికవర్గ లక్ష్యానికి నేరుగా ద్రోహం చేయడానికి దారితీస్తుంది.

పాత "ఆర్థికవాదాన్ని" మరిచిపోయి, దాన్ని అధ్యయనం చేయనివాళ్లకు, లేదా జ్ఞాపకం చేసుకోనివాళ్లకు "ఆర్థికవాదపు" ప్రస్తుత పునరుజ్జీవనాన్ని అర్థం చేసుకోవడం కష్టంగా వుంటుంది. బెర్న్‌స్టైనియన్ Credo[108]ను జ్ఞాపకం చేసుకోండి. దాని రచయితలు "కేవల కార్మికవర్గ" అభిప్రాయాలనుండీ, కార్యక్రమాలనుండీ యీ నిర్ణయం లాగారు: సోషల్ డెమోక్రట్లం ఆర్థిక విషయాల్లో, నిజమైన కార్మికవర్గ లక్ష్యంలో, రాజకీయ జిత్తుల నన్నిటినీ విమర్శించే స్వేచ్ఛలో, సోషల్ డెమోక్రటిక్ పనిని నిజంగా మరింత గంభీరం చేయడంలో ఆసక్తులం కావాలి. రాజకీయాలు ఉదారవాదులకు. "విప్లవవాదం"లో పడకుండా భగవంతుడు మనల్ని రక్షించు గాక: అది బూర్జువావర్గం వెనక్కి పోయేటట్లు చేస్తుంది. మొత్తం Credoను గానీ, "రబోచయ మీస్ల్" నం. 9 (1899 సెప్టెంబర్) విడి అనుబంధం గానీ మళ్లీ చదివేవాళ్లకు యీ వాదపు క్రమం అంతా కనపడుతుంది.

యీనాడు యిదే, కానీ విస్తృత పరిమాణంలో, యావత్తు రష్యన్ "మహా" విప్లవపు — నైష్ఠిక అల్పబుద్ధితత్వపు సిద్ధాంతకారులచేత అపభ్రంశమొనర్చబడి, ముందుగానే అపహాస్యంగా తయారుచేయబడిన విప్లవపు — అంచనాకు అన్వయించబడుతోంది! సోషల్ డెమోక్రట్లం విమర్శనా స్వేచ్ఛలోనూ, వర్గచైతన్యాన్ని మరింత ప్రగాఢం చేయడంలోనూ, బయటనుండి చేసే ఆచరణలోనూ ఆసక్తులం కావాలి. వాళ్లకు, బూర్జువావర్గాలకు, ఆచరణ స్వేచ్ఛా, విప్లవ (ఉదారవాద అన్నమాట) నాయకత్వం చలాయించడానికి సంపూర్ణ స్వేచ్ఛా, పైనుండి "సంస్కరణలు" అమలుపరచడానికి స్వేచ్ఛా వుండాలి.

విమర్శనాయుధాన్ని తొలగించి, దాని స్థానంలో ఆయుధాల విమర్శను పెట్టవలసిన అవసరం గురించి మార్క్సు చెప్పినదాన్ని[109] మార్క్సిజాన్ని వక్రీకరించే వీళ్లు యెన్నడూ ఆలోచించలేదు. వీళ్లు మార్క్సు పేరును వ్యర్థంగా తీసుకొని, వాస్తవంలో ఫ్రాంక్‌ఫర్ట్ బూర్జువా కోతలరాయుళ్ల తత్వంలో — యెవరు నిరంకుశత్వాన్ని నిర్నిబంధంగా విమర్శించి, ప్రజాతంత్ర చైతన్యాన్ని ప్రగాఢం చేసినారో, కానీ విప్లవ కాలం ఆచరణ కాలం, పైనుండీ,

కిందినుండీ చేసే ఆచరణ కాలం, అని గ్రహించలేదో వాళ్ల తత్వంలో — యెత్తుగడలమీద తీర్మానాలు రచిస్తారు. మార్క్సిజాన్ని కూటపాండిత్యంగా మార్చడం ద్వారా వీళ్లు పురోగామి అయిన, అత్యంత కృతనిశ్చయమైన, చురుకైన విప్లవకర వర్గపు భావజాలాన్ని ఆ వర్గం లోని అత్యంత వెనుకబడిన పొరల భావజాలంగా, కష్టమైన విప్లవ ప్రజాతంత్ర కర్తవ్యాల నుండి వెనక్కి తగ్గి, వాటిని చూసుకునే పని స్త్రూవెలాంటివాళ్లకు వదలిపెట్టేవాళ్ల భావజాలంగా, మార్చినారు.

సోషల్ డెమోక్రట్లు విప్లవ ప్రభుత్వంలో చేరడం వలన బూర్జువావర్గాలు విప్లవం నుండి వెనక్కిపోతే, తద్వారా వాళ్లు విప్లవపు "విస్తృతిని తగ్గిస్తారు."

రష్యన్ కార్మికులారా, అది వినండి: సోషల్ డెమోక్రట్లకు భయపడనివాళ్లు, జారిజంమీద విజయం కోరకుండా, దానితో రాజీ చేసుకోవాలనుకునే స్త్రూవెలాంటివాళ్లు విప్లవాన్ని అమలుపరిస్తే, దాని విస్తృతి మరింత శక్తివంతంగా వుంటుంది. పైన చెప్పిన రెండు సంభావ్యమైన ఫలితాల్లో మొదటిది సంభవిస్తే, అనగా షీపోవ్ రకం "రాజ్యాంగం" గురించి రాజరికవాద బూర్జువావర్గం నిరంకుశత్వంతో రాజీపడితే, విప్లవ విస్తృతి మరింత శక్తివంతంగా వుంటుంది!

మొత్తం పార్టీ మార్గదర్శకత్వం కొరకు తీర్మానాల్లో యిలాంటి సిగ్గుచేటైన విషయాలు రాసేవాళ్లు, లేదా యిలాంటి "ఉచితమైన" తీర్మానాలను ఆమోదించేవాళ్లు మార్క్సిజంనుండి దాని జీవాత్మను తరిమేసిన కూటపాండిత్యంచేత యెంతగా గుడ్డివాళ్లుగా చేయబడినారంటే, యీ తీర్మానాలు వాళ్ల యితర మంచి మాటల నన్నిటినీ వ్యర్థ పదాలుగా మారుస్తాయనే విషయాన్ని వాళ్లు గమనించరు. "ఇస్క్రా"లోని వాళ్ల వ్యాసాలలో యేదైనా, లేదా మన ప్రసిద్ధికెక్కిన మర్తీనొవ్ రాసిన పేరుమోసిన పుస్తకమైనా సరే తీసుకోండి — అక్కడ ప్రజా తిరుగుబాటును గురించీ, విప్లవాన్ని ముగింపుదాకా నిర్వహించడం గురించీ, అస్థిర బూర్జువావర్గంమీద చేసే పోరాటంలో సామాన్య ప్రజలమీద ఆధారపడడం గురించీ మాటలు మనకు కనపడుతాయి కానీ, బూర్జువావర్గపు వ్యతిరేకత ఫలితంగా "విప్లవ విస్తృతి తగ్గిపోతుం"దనే భావాన్ని అంగీకరించిన వెంటనే, లేదా ఆమోదించిన వెంటనే యీ శ్రేష్ఠమైన విషయాలన్నీ దౌర్భాగ్యపు మాటలౌతాయి. మార్గాంతరాలు యివి: మనం, ప్రజలతో కలిసి, విప్లవాన్ని నిర్వహించడానికీ, అస్థిర, స్వార్థపర, పిరికి బూర్జువావర్గం వున్నప్పటికీ జారిజంమీద సంపూర్ణ విజయం సాధించడానికీ కృషిచేయాలి; లేదా మనం యీ "వున్నప్పటికీ"ని అంగీకరించకుండా, బూర్జువావర్గం విప్లవంనుండి "వెనక్కిపోవచ్చు"నని భయపడతాం. రెండవ సందర్భంలో మనం కార్మికవర్గాన్నీ, ప్రజలనూ బూర్జువావర్గానికి అప్పగిస్తున్నాం — అస్థిర, స్వార్థపర, పిరికి బూర్జువావర్గానికి.

నా మాటలను దుర్వ్యాఖ్యానించాలనే యోచన చేయకండి. ఉద్దేశపూర్వకంగా ద్రోహం చేస్తున్నట్లు మిమ్మల్ని నిందిస్తున్నారని కేకలు వేయకండి. ''ప్రగాఢ'' మార్క్సిజం అనే యేటవాలునుండి దుర్వారంగా, తిరుగు లేకుండా కిందికి, చివరకది విప్లవ వ్యతిరేక, నిరాత్మ, నిర్జీవ బౌద్ధిక వేషం అయిందాకా జారిన పూర్వపు ''ఆర్థికవాదుల''లాగ మీకు తెలియకుండానే మీరు యెల్లప్పుడూ బురద గుంటవైపు పాకుతూ చివరకు గుంతలోకి పాకారు.

''విప్లవ విస్తృతి''ని నిర్ణయించే నిజమైన సాంఘిక శక్తులను గురించి మీరెప్పుడైనా ఆలోచించినారా? విదేశ రాజకీయ శక్తులనూ, అంతర్జాతీయ సమ్మేళనాలనూ వదిలేస్తున్నాం; అవి ప్రస్తుతం మనకు చాలా అనుకూలంగా వున్నాయి, కానీ వాటిని మనమందరమూ చర్చనుండి వదిలేస్తున్నాం — రష్యా ఆంతరంగిక శక్తుల సమస్యలో మనం ఆసక్తులమైనాము గనుక, న్యాయంగానే వదిలేస్తున్నాం. యీ ఆంతరంగిక సాంఘిక శక్తులను పరిశీలించండి. విప్లవానికి వ్యతిరేకంగా నిరంకుశత్వమూ, సామ్రాజ్య ఆస్థానమూ, పోలీసులూ, ఉద్యోగివర్గమూ, సైన్యమూ, కొద్దిమంది ప్రభువులూ మోహరించి వున్నారు. ప్రజల ఆగ్రహం గాఢమయ్యే కొద్దీ, సైనికులు తక్కువ విశ్వసనీయులౌతారు, ఉద్యోగివర్గం యెక్కువగా ఊగిసలాడుతుంది. అంతేకాక, బూర్జువావర్గం మొత్తంమీద యిప్పుడు విప్లవానికి అనుకూలంగా వుంది, పట్టుదలతో స్వేచ్ఛను గురించి ఉపన్యాసాలు యిస్తూ, అంతకంతకూ తరుచుగా ప్రజల పేరుమీద, విప్లవం పేరుమీద కూడా మాట్లాడుతోంది.* కానీ, విప్లవానికి అండదండలు యివ్వడంలో బూర్జువావర్గం అస్థిరమూ, స్వార్థపూరితమూ, పిరికీ అని మార్క్సిస్టులమైన మనందరికీ సిద్ధాంతంద్వారానూ, మన ఉదారవాదులనూ, జేమ్‌స్త్వోవాళ్లనూ, ''ఒస్వొబొజ్దేనియె''వాళ్లనూ దినదినమూ, గంటగంటా గమనించడం ద్వారానూ తెలుసు. దరహంమీద బూర్జువావర్గం, తన సంకుచిత, స్వార్థ ప్రయోజనాలు తీరిన వెంటనే, స్థిరమైన ప్రజాస్వామ్యంనుండి అది ''వెనక్కిపోయిన'' వెంటనే (యిప్పటికే అది వెనక్కిపోతోంది!), అనివార్యంగా విప్లవ ప్రతీఘాతం వైపు, నిరంకుశత్వం వైపు, విప్లవానికి వ్యతిరేకంగా, ప్రజలకు వ్యతిరేకంగా మళ్లుతుంది. యిక మిగిలింది ''ప్రజలు,'' అనగా శ్రామికవర్గమూ, రైతాంగమూ: కార్మికవర్గం మాత్రమే చివరిదాకా నడవగలదు; యెందుకంటే, అది ప్రజాతంత్ర విప్లవాన్ని దాటి చాలా ముందుకు పోతుంది. అందుకనే కార్మికవర్గం రిపబ్లిక్ కొరకు అగ్రభాగంలో నిలిచి పోరాడుతుంది, బూర్జువావర్గం

---

*యీ సందర్భంలో జోరేస్‌కు స్త్రూవె రాసిన బహిరంగ లేఖ ఆసక్తికరమైనది. యిది జోరేస్‌చేత "L'Humanité"[110]లోనూ, స్త్రూవెచేత ''ఒస్వొబొజ్దేనియె'' నం. 72లోనూ యిటీవల ప్రచురింపబడింది.

వెనక్కిపోయే సంభావ్యతను లెక్కలోకి తీసుకొమ్మనే మతిలేని, పనికిమాలిన సలహాను యేవగింపుతో నిరాకరిస్తుంది. రైతాంగంలో అనేక అర్ధ కార్మికవర్గ శక్తులు వున్నాయి, అలాగే పెటీబూర్జువా శక్తులూ వున్నాయి. యిది దాన్ని అస్థిరం కూడా చేస్తుంది, కార్మికవర్గం కచ్చితమైన వర్గ పార్టీగా సమీకృత మయ్యేటట్లు నిర్బంధిస్తుంది. కానీ, రైతాంగపు అస్థిరత్వం బూర్జువావర్గపు అస్థిరత్వం కంటె మౌలికంగా భిన్నమైనది; యెందుకంటే, ప్రస్తుతం రైతాంగపు ప్రయోజనం సొంత ఆస్తి వ్యవస్థను చెక్కుచెదరకుండా నిలపడంలో అంతగా లేదు, దాని ప్రయోజనం సొంత ఆస్తి ప్రధాన రూపాలలో ఒకటైన భూ యెస్టేట్లను స్వాధీనపరచుకోవడంలో వుంది. తద్వారా రైతాంగం సోషలిస్టు కాకుండా, పెటీబూర్జువాగా వుండడం మానుకోకుండా, ప్రజాతంత్ర విప్లవానికి హృదయపూర్వకమైన, అత్యంత తీవ్రమైన అనుయాయి కాగలదు. రైతాంగం అనివార్యంగా అలా అయ్యేది యెప్పుడంటే, దానికి విజ్ఞాన ప్రబోధం తెచ్చే విప్లవ ఘటనల గతి బూర్జువావర్గపు ద్రోహంచేత గానీ, కార్మిక వర్గపు ఓటమిచేత గానీ అకాలంలో ఆపివేయబడకుండా వున్నప్పుడు మాత్రమే. యీ షరతుకు లోబడి, రైతాంగం అనివార్యంగా విప్లవానికీ, రిపబ్లిక్కుకూ కోట అవుతుంది; యెందుకంటే, సంపూర్ణంగా విజయవంతమైన విప్లవం మాత్రమే రైతాంగానికి భూసంస్కరణల రంగంలో సమస్తమూ యిస్తుంది – (సోషలిస్టు రివల్యూషనరీలు ఊహించేటట్లు పెట్టుబడిదారీ వ్యవస్థను రద్దుచేయడానికి కాక) అర్ధ ఫ్యూడల్ దాస్యపు బురదనుండీ, పీడనా, దాస్యమూ అనే అంధకారంనుండీ బయటపడడానికీ, సరుకుల ఉత్పత్తి వ్యవస్థలోపల సాధ్యమైనంత మేరకు వాళ్ల జీవిత పరిస్థితులను మెరుగుపరచడానికీ రైతులు కోరుకునే, కలలు గనే, రైతులకు అవసరమయ్యే సమస్తమూ యిస్తుంది.

అంతే కాక, రైతాంగం తీవ్ర భూ సంస్కరణ అవకాశంచేతనే గాక, దాని సాధారణ శాశ్వత ప్రయోజనాలచేత కూడా విప్లవానికి అనుబంధింపబడుతుంది. కార్మికవర్గంతో కలిసి పోరాడేటప్పుడు కూడా రైతాంగానికి ప్రజాస్వామ్యం అవసరం; యెందుకంటే, ప్రజాస్వామ్య వ్యవస్థ మాత్రమే దాని ప్రయోజనాలను కచ్చితంగా వ్యక్తం చేయగలిగి, ఒక సముదాయంగా, మెజారిటీగా దాని ప్రాబల్యాన్ని నిస్సందేహం చేయగలదు. రైతాంగం మరింత విజ్ఞాన ప్రబుద్ధం అయ్యేకొద్దీ (జపాన్ యుద్ధం జరిగినప్పటినుండి,[111] విజ్ఞాన ప్రబోధాన్ని పాఠశాల గజంబద్దతో కొలవడానికి అలవాటుపడిన చాలామంది అనుమానించనంత వేగంతో అది వికాసవంతం అవుతున్నది), ఆమూలాగ్రమైన ప్రజాతంత్ర విప్లవం కొరకు అది మరింత స్థిరంగా, మరింత కృతనిశ్చయంగా నిలబడుతుంది; యెందుకంటే, బూర్జువావర్గానికి భిన్నంగా, అది ప్రజల ఆధిపత్యానికి భయపడవలసిందేమీ లేదు, తద్వ్యతిరేకంగా దానినుండి అది లాభపడుతుంది. రైతాంగం తన అమాయకత్వపు రాజరికవాదాన్ని తోసివేయడం ప్రారం

ఖించిన వెంటనే, ప్రజాతంత్ర రిపబ్లిక్ దాని ఆదర్శం అవుతుంది; యెందుకంటే, బూర్జువా వర్తకుల చైతన్యపూరిత రాజరికవాదంలో (యెగువ సభ, వగైరాలు వుండి) రైతాంగం ఖ్యానాడు అనుభవిస్తున్న అవే హక్కుల రాహిత్యమూ, పీడనా, అజ్ఞానమూ యిమిడి వున్నాయి — కానీ యూరపియన్ రాజ్యాంగబద్ధత అనే వార్నిష్‌తో కొద్దిగా పాలిష్‌చేయబడి.

అందువల్లనే, ఒక వర్గంగా బూర్జువావర్గం ఉదారవాద రాజరికవాద పార్టీ రక్షణ కిందికి పోవడానికి సహజంగా, అనివార్యంగా అభిముఖంగా వుండగా, రైతాంగం ఒక సమూహంగా విప్లవకర, రిపబ్లికన్ పార్టీ నాయకత్వంకిందికి పోవడానికి అభిముఖంగా వుంటుంది. అందువల్లనే, బూర్జువావర్గం ప్రజాతంత్ర విప్లవాన్ని ముగింపుదాకా నిర్వహించడానికి అసమర్థం కాగా, రైతాంగం ఆ పని చేయడానికి సమర్థమైనది; ఆ పనిలో దానికి తోడ్పడడానికి మనం శాయశక్తులా కృషిచేయాలి.

యిది చెప్పనక్కర లేదనీ, యిదంతా ఓనమాల విషయమనీ, సోషల్ డెమోక్రట్లకందరికీ బాగా అర్థమైన విషయమనీ ఆక్షేపణ చెప్పవచ్చు. కానీ అది నిజం కాదు; విప్లవంనుండి బూర్జువావర్గం దూరం కావడం మూలంగా విప్లవ "విస్తృతి తగ్గుతుంద"ని మాట్లాడేవాళ్లకు యిది అర్థం కాలేదు. అలాంటివాళ్లు మన భూ కార్యక్రమపు అర్థం తెలుసుకోకుండా, దాన్ని బట్టీ పట్టి, అందులోని మాటలు వల్లిస్తారు; లేకపోతే వాళ్లు కార్మికవర్గపు, రైతాంగపు విప్లవ ప్రజాతంత్ర నియంతృత్వ భావానికి, యావత్తు మార్క్సిస్టు ప్రపంచ దృక్పథంనుండీ, మన కార్యక్రమంనుండీ యేర్పడేదానికి, భయపడరు; లేకపోతే వాళ్లు రష్యన్ మహా విప్లవపు విస్తృతిని, బూర్జువావర్గం యే హద్దులదాకా పోవడానికి సిద్ధంగా వుందో ఆ హద్దులకు, పరిమితపరచరు. అలాంటివాళ్లు తమ అభౌతిక మార్క్సిస్టు విప్లవ నుడికారాలను తమ నిర్దిష్ట మార్క్సిస్టు వ్యతిరేక, విప్లవ వ్యతిరేక తీర్మానాలచేత ఓడిస్తారు.

విజయవంతమైన రష్యన్ విప్లవంలో రైతాంగం పాత్రను నిజంగా గ్రహించినవాళ్లు విప్లవంనుండి బూర్జువావర్గం వెనక్కిపోతే విప్లవ విస్తృతి తగ్గుతుందని కలలో కూడా అనరు. యెందుకంటే, వాస్తవంలో, రష్యన్ విప్లవం తన నిజమైన విస్తృతిని వహించడం ప్రారంభమయ్యేదీ, బూర్జువా ప్రజాతంత్ర విప్లవ యుగంలో సాధ్యమయ్యే అత్యంత విశాలమైన విప్లవ విస్తృతిని అది నిజంగా వహించేదీ యెప్పుడంటే, బూర్జువావర్గం దానినుండి వెనక్కిపోయినప్పుడూ, రైతు జనసామాన్యం కార్మికవర్గంతో పాటు చురుకైన విప్లవకారులుగా ముందుకు వచ్చినప్పుడూ మాత్రమే. చివరిదాకా స్థిరంగా నిర్వహించబడడానికి మన ప్రజాతంత్ర విప్లవం బూర్జువావర్గపు అనివార్యమైన అస్థిరత్వాన్ని నిర్వీర్యపరచగల (అనగా, సరిగ్గా "విప్లవంనుండి దాన్ని వెనక్కిపోయేటట్లు చేయగల" — "ఇస్క్రా"యొక్క కకేషియన్

అనుయాయులు తమ ఆలోచనా రాహిత్యంవల్ల దేనికి భయపడుతున్నారో ఆ పని చేయగల) శక్తులమీద ఆధారపడాలి.

శ్రామికవర్గం నిరంకుశత్వపు ప్రతిఘటనను బలంతో నలిపివేయడానికీ, బూర్జువా వర్గపు అస్థిరత్వాన్ని నిర్వీర్యపరచడానికీ రైతు జనసామాన్యాన్ని తనకు పొత్తుగా చేసుకొని, ప్రజాతంత్ర విప్లవాన్ని ముగింపుదాకా తీసుకపోవాలి. శ్రామికవర్గం బూర్జువావర్గపు ప్రతిఘటనను బలంతో అణచడానికీ, రైతాంగపు, పెటీబూర్జువావర్గపు అస్థిరత్వాన్ని నిర్వీర్యపరచడానికీ ప్రజానీకంలోని అర్ధ కార్మికవర్గ శక్తుల సముదాయాన్ని తనకు పొత్తుగా చేసుకొని, సోషలిస్టు విప్లవాన్ని సాధించాలి. యివి శ్రామికవర్గపు కర్తవ్యాలు, కొత్త "ఇస్క్రా" వాళ్లు విప్లవ విస్తృతిమీద చేసే సకల వాదాలలోనూ, తీర్మానాలలోనూ అంత సంకుచితంగా ప్రదర్శింపబడినట్టివి.

కానీ ఒక విషయాన్ని — విప్లవ "విస్తృతి"మీద జరిగే చర్చల్లో తరుచుగా కనుదప్పిపోయే విషయాన్ని — మరచిపోకూడదు. యిది యీ సమస్య ఉత్పన్నంచేసే కష్టాలకు సంబంధించిన ప్రశ్న కాదనీ, పరిష్కారాన్ని యేవిధంగా వెదకి సాధించాలనేదానికి సంబంధించినదనీ మరిచిపోకూడదు. విప్లవ విస్తృతిని శక్తివంతంగా, అజేయంగా చేయడం సులభమా, కష్టమా అనే ప్రశ్న కాదు యిది, ఆ విస్తృతిని మరింత బలీయం చేయడానికి యేమి చెయ్యాలి అనేది. మన అభిప్రాయాలు విభేదించేది మన కార్యకలాపాల మౌలిక స్వభావంమీద, అవి అనుసరించవలసిన దిశమీద. దీన్ని మేము నొక్కిచెప్పేది యెందుకంటే, శ్రద్ధలేని, నీతిలేని మనుషులు రెండు భిన్న సమస్యలను — యే దిశను అనుసరించాలి, లేదా రెండు భిన్న మార్గాల్లో దేన్ని యెన్నుకోవాలి అనే సమస్యనూ, ఫలానా మార్గంలో మన గమ్యాన్ని యెంత సులభంగా, లేదా యెంత త్వరగా చేరుకోవచ్చుననే దానికి సంబంధించిన సమస్యనూ — గంద్రగోళపరుస్తున్నారు గనుక.

పైన యీ చివరి సమస్యను బొత్తిగా చర్చించలేదు; యెందుకంటే యిది పార్టీలో అభిప్రాయభేదాలను గానీ, విభేదాలను గానీ సృష్టించలేదు. యీ సమస్య, సహజంగానే, మహా ముఖ్యమైనదీ, సకల సోషల్ డెమోక్రట్ల అత్యంత గురుతరమైన శ్రద్ధకు అర్హమైనదీ. కార్మికజనసామాన్యాన్నే కాక, రైతు జనసామాన్యాన్ని కూడా ఉద్యమంలోకి ఆకర్షించడంలో యిమిడివున్న కష్టాలను గురించి మరిచిపోవడం క్షమించరాని ఆశావాదం. యీ కష్టాలు ప్రజాతంత్ర విప్లవాన్ని ముగింపుదాకా నిర్వహించే ప్రయత్నాలను ఒకటికంటె యెక్కువసార్లు భగ్నం చేసినాయి; తత్ఫలితంగా అస్థిర, స్వార్థపర బూర్జువావర్గం అందరికంటె యెక్కువగా విజయం పొందింది; యెందుకంటే, అది ప్రజల బారినుండి రాజరికపు రక్షణ రూపంలో "లాభం పొందింది," అదే సమయంలో ఉదారవాదపు, లేదా "ఒస్వాబొజ్దేనియె"

ధోరణి "కన్యాత్వాన్ని నిలుపుకుంది." కానీ, కష్టమంటే అసాధ్యమని అర్థం కాదు. ముఖ్యమైనది యేమిటంటే, మనం యెన్నుకున్న మార్గం సరైనదనే విశ్వాసం వుండడం; యీ విశ్వాసం అద్భుతాలు సాధించగల విప్లవ శక్తినీ, విప్లవ ఉత్సాహాన్నీ నూరు రెట్లు వృద్ధి చేస్తుంది.

యెన్నుకోవలసిన మార్గం గురించి యీనాటి సోషల్ డెమోక్రట్ల మధ్య గల అఖాతం యెంత లోతుగా వున్నదీ కొత్త "ఇస్క్రా"వాళ్ల కాకసస్ తీర్మానాన్ని రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ మూడవ మహాసభ తీర్మానంతో పోల్చడం ద్వారా వెంటనే చూడవచ్చు. మహాసభ తీర్మానం యిలా అంటుంది: బూర్జువావర్గం అస్థిరమైనది, విప్లవ లాభాలు మనకు లేకుండా చేయడానికి తప్పక ప్రయత్నిస్తుంది. కనుక కార్మిక కామ్రేడ్స్, విప్లవానికి మరింత చురుకైన సన్నాహాలు చేయండి! సాయుధులు కండి, రైతాంగాన్ని మీ పక్కకు తిప్పుకోండి! పోరాటం లేకుండా మనం విప్లవ లాభాలను స్వార్థపర బూర్జువావర్గానికి అప్పగించం. కాకసస్ కొత్త "ఇస్క్రా"వాళ్ల తీర్మానం యిలా అంటుంది: బూర్జువావర్గం అస్థిరమైనది, విప్లవంనుండి వెనక్కిపోవచ్చు. కనుక కార్మిక కామ్రేడ్స్, తాత్కాలిక ప్రభుత్వంలో చేరాలని అనుకోవద్దు; యెందుకంటే, మీరు చేరితే, బూర్జువావర్గం నిశ్చయంగా వెనక్కిపోతుంది, తద్వారా విప్లవ విస్తృతి తగ్గుతుంది!

ఒక పక్షం యిలా అంటుంది: అస్థిర బూర్జువావర్గపు ప్రతిఘటన, లేక జడత్వం వున్నప్పటికీ విప్లవాన్ని ముగింపుదాకా ముందుకు తీసుకపొండి.

మరొక పక్షం యిలా అంటుంది: స్వతంత్రంగా విప్లవాన్ని ముగింపుదాకా ముందుకు తీసుకపోవాలని అనుకోకండి; యెందుకంటే, మీరు అలా చేస్తే, అస్థిర బూర్జువావర్గం విప్లవంనుండి వెనక్కిపోతుంది.

యివి రెండు పూర్తిగా పరస్పర విరుద్ధమైన మార్గాలు కావా? ఒక యెత్తుగడల సమాహారం మరొకదాన్ని పూర్తిగా తొలగిస్తుందనీ, మొదటి యెత్తుగడలు విప్లవ సోషల్ డెమోక్రసీయొక్క ఒకేఒక సరైన యెత్తుగడలు కాగా, రెండవ యెత్తుగడలు వాస్తవంలో శుద్ధ "ఒస్వొబొజ్దేనియె" రకం యెత్తుగడలు అనీ తేటతెల్లంగా లేదా?

# 13. ముగింపు.

## మనకు గెలిచే ధైర్యం వుందా?

రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలోని పరిస్థితితో పైపై పరిచయం గలవాళ్లు, లేదా "ఆర్థికవాదపు" రోజులనుండి పార్టీలో జరుగుతున్న అంతర్గత పోరాటపు మొత్తం చరిత్రను గురించి యేమీ తెలియకుండా కేవలం ప్రేక్షకులుగా అంచనావేసేవాళ్లు యిప్పుడు,

ముఖ్యంగా మూడవ మహాసభ తర్వాత, యెత్తుగడలమీద గల విభేదాలను చాలా తరుచుగా యీ చిన్న వాదంతో కొట్టిపారవేస్తారు — ప్రతి సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలోనూ రెండు సహజమైన, అనివార్యమైన, రాజీ పడిపోగల ధోరణులు వున్నాయనే వాదంతో. ఒక పక్షం మామూలు, ప్రస్తుతపు, రోజువారీ పనికి, ప్రచారాన్నీ, ఆందోళననూ అభివృద్ధి చేయడమూ, బలాలను తయారుచేయడమూ, ఉద్యమాన్ని ముమ్మరంచేయడమూ, మొదలైనవాటి అవసరానికి, ప్రత్యేక ప్రాముఖ్యం యివ్వగా, మరొక పక్షం ఉద్యమపు సమరశీల, సాధారణ రాజకీయ, విప్లవ కర్తవ్యాలకు ప్రాముఖ్యం యిచ్చి, సాయుధ తిరుగుబాటు అవసరాన్ని సూచించి, విప్లవ ప్రజాతంత్ర నియంతృత్వం, తాత్కాలిక విప్లవ ప్రభుత్వం అనే నినాదాలు యిస్తుందని వాళ్లు అంటారు. యే పక్షమూ అతిశయోక్తులు చెప్పకూడదని వాళ్లు అంటారు; రెండు సందర్భాల్లోనూ (దరహంమీద, సర్వత్రా) అతి చెడ్డదేననీ, వగైరా, వగైరా.

అలాంటి వాదాల్లో వున్న సాదా (కొటేషన్ మార్కుల్లో "రాజకీయ") విజ్ఞతలోని చౌకబారు సత్యం అతి తరుచుగా పార్టీయొక్క జరూరు, తీవ్ర అవసరాలను అర్థం చేసుకోలేని అశక్తతను మరుగుపరుస్తుంది. రష్యన్ సోషల్ డెమోక్రట్లమధ్య యీనాడు వున్న యెత్తుగడల విభేదాలను తీసుకోండి. సహజంగానే, పనికి సంబంధించిన రోజువారీ క్రమ చర్యకు యిచ్చే ప్రత్యేక ప్రాముఖ్యం, యెత్తుగడల గురించి కొత్త "ఇస్క్రా" వాదాల్లో మనకు కనపడేలాంటిది, దాని పాటికదే యెలాంటి ప్రమాదాన్ని గానీ, యెత్తుగడల విషయంలో యెలాంటి అభిప్రాయభేదాన్ని గానీ కలిగించజాలదు. కానీ, యీ అభిప్రాయభేదం కొట్టవచ్చినట్లు కనపడడానికి రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ మూడవ మహాసభ తీర్మానాలను కాన్ఫరెన్సు తీర్మానాలతో పోల్చిచూస్తే సరిపోతుంది.

యేమిటి మరి యిబ్బంది? మొట్టమొదటి విషయం, ఉద్యమంలోని రెండు ధోరణులను, రెండు కొసలను అనిర్దిష్టంగా గుర్తుపట్టడం చాలదు. ఫలానా సమయంలో ఫలానా ఉద్యమానికి గల జబ్బు యేమైందీ; ప్రస్తుత సమయంలో పార్టీకి నిజమైన రాజకీయ ప్రమాదం యేమైందీ నిర్దిష్టంగా తెలుసుకోవాలి. రెండవ విషయం, యిచ్చిన యెత్తుగడల నినాదాల వలన — లేక, బహుశా, కొన్ని నినాదాలు లేకపోవడం వలన — యే నిజమైన రాజకీయ శక్తులు లాభపడేదీ తెలుసుకోవాలి. కొత్త "ఇస్క్రా"వాళ్ల మాటలు వింటే, యెవరైనా యే నిర్ణయానికి వస్తారంటే, ప్రచారాన్నీ, ఆందోళననూ, ఆర్థిక పోరాటాన్నీ, బూర్జువా ప్రజాస్వామ్య విమర్శనూ తోసిపారవేసే ప్రమాదమూ, సైనిక సన్నాహాల్లోనూ, సాయుధ దాడుల్లోనూ, అధికార స్వాధీనంలోనూ, వగైరాలలో మితిమీరి మునిగిపోయే ప్రమాదమూ సోషల్ డెమోక్రటిక్ పార్టీకి యెదురయ్యాయనే నిర్ణయానికి వస్తారు. కానీ, వాస్త

వంలో, పూర్తిగా భిన్నమైన దిశనుండి పార్టీకి నిజమైన ప్రమాదం యెదురౌతోంది. ఉద్యమ స్థితితో పరిచయం వున్నవాళ్లు యెవరైనా, దాన్ని జాగ్రత్తగా, సాలోచనగా గమనించే వాళ్లు యెవరైనా, కొత్త "ఇస్క్రా" వాళ్ల భయాలు పరిహాసాస్పదంగా వున్నాయని గమనించకుండా వుండలేరు. రష్యన్ సోషల్ డెమొక్రటిక్ లేబర్ పార్టీ కార్యకలాపాలు యావత్తూ యిప్పటికే యెలాంటి నిశ్చితమైన, మార్పులేని రూపం ధరించినాయంటే, ప్రచారాందోళనలమీదా, బహిరంగ సభలమీదా, అప్పటికప్పుడు జరిగే సభలమీదా, కరపత్రాల, ప్రచార పత్రాల పంపకంమీదా, ఆర్థిక పోరాటానికి తోడ్పడడంమీదా, ఆ పోరాటపు నినాదాలను సమర్థించడంమీదా మన ప్రధాన శ్రద్ధ లగ్నమయ్యేటట్లు ఆ రూపం పూర్తిగా హామీ యిస్తుంది. 1890 దశకం మధ్యనుండి స్థిరపడిన యీ కర్తవ్యాలకు మొత్తం శ్రద్ధలో, శక్తిలో, కాలంలో తొంభై తొమ్మిది శాతం అర్పించని పార్టీ కమిటీ గానీ, జిల్లా కమిటీ గానీ, కేంద్ర ప్రతినిధుల సమావేశం గానీ, ఫాక్టరీ బృందం గానీ ఒక్కటి కూడా లేదు. ఉద్యమంతో బొత్తిగా పరిచయం లేనివాళ్లకు మాత్రమే యిది తెలియదు. అతి అమాయకులు మాత్రమే, లేదా విషయాలు తెలియనివాళ్లు మాత్రమే మహా ప్రాముఖ్యపు భంగిమతో కొత్త "ఇస్క్రా" వల్లించే చద్ది సత్యాలను యధాతథంగా అంగీకరిస్తారు.

వాస్తవం యేమిటంటే, తిరుగుబాటుకూ, సాధారణ రాజకీయ నినాదాలకూ, మొత్తం ప్రజా విప్లవానికి నాయకత్వం యివ్వడానికీ సంబంధించిన కర్తవ్యాల విషయంలో మితిమీరిన ఉబలాటం ప్రదర్శించకపోవడమే కాక, మనం, తద్వ్యతిరేకంగా, సరిగ్గా యీ విషయంలోనే, మహా కొట్టవచ్చినట్లు కనపడే వెనుకబాటుతనం ప్రదర్శిస్తున్నాం — మన అత్యంత గొప్ప బలహీనతగానూ, ఉద్యమానికి నిజమైన ప్రమాదంగానూ వున్న వెనుకబాటుతనం; ప్రమాదం యేమిటంటే, ఉద్యమం చేతల్లో విప్లవకరంగా వుండే స్థితినుండి మాటల్లో విప్లవకరంగా వుండే స్థితికి దిగజారిపోవచ్చు, కొన్నిచోట్ల దిగజారిపోతోంది. పార్టీ పనిని నిర్వహించే అనేక వందల సంస్థల్లో, బృందాల్లో ఒక్కటి కూడా, అది పుట్టినప్పటినుండి, కొత్త "ఇస్క్రా" ప్రబుద్ధులు కొత్త సత్యాలు ఆవిష్కరించినవాళ్ల భంగిమతో యిప్పుడు మాట్లాడే రోజువారీ పనిని నిర్వహించనిది మీకు కనపడదు. మరోవైపున, బృందాల్లో లెక్కలోకిరాని శాతం మాత్రమే, సాయుధ తిరుగుబాటు విధించే కర్తవ్యాలను అర్థంచేసుకున్నవీ, వాటిని నిర్వహించడం ప్రారంభించినవీ, జారిజంమీద జరిగే మొత్తం ప్రజా విప్లవాన్ని నడిపించవలసిన అవసరాన్నీ, ఆ ప్రయోజనానికి కొన్ని నిర్దిష్ట ప్రగతిశీల నినాదాలను, తదితరమైనవేవీ కాకుండా, యివ్వవలసిన అవసరాన్నీ గుర్తించినవి మీకు కనపడతాయి.

ప్రగతిశీలమైన, నిజంగా విప్లవకరమైన కర్తవ్యాలకు సమ్మతశక్యం కానంతగా మనం వెనుకబడినాము; అనేక సందర్భాల్లో మనకు వాటిని గురించిన స్పృహ కూడా కలగలేదు;

యీ విషయంలో మన వెనుకబాటుతనం మూలంగా విప్లవ బూర్జువా ప్రజాస్వామ్యం బలం పుంజుకుందని మనం కొన్నిచోట్ల గమనించలేదు. కానీ, కొత్త ''ఇస్క్రా'' రచయితలు ఘటనల గతికీ, యీనాటి అవసరాలకూ వీపులు మళ్లించి, ''పాతను మరిచిపోవద్దు! కొత్తతో కొట్టుకపోవద్దు!'' అని పట్టుదలగా పునశ్చరణ చేస్తూ వున్నారు. కాన్ఫరెన్సు ప్రధానమైన తీర్మానా లన్నిటిలోనూ యిది మార్పులేని ముఖ్య సూత్రం. కాగా, మహాసభ తీర్మానాల్లో, అలాగే మార్పు లేకుండా, యీవిధంగా వుంది: పాతను ధ్రువపరుస్తూ (కానీ, సరిగ్గా అది పాతది గనుకనే, సాహిత్యంలోనూ, తీర్మానాల్లోనూ, అనుభవంచేతా యిప్పటికే స్థిరపరచబడి, నమోదుచేయబడినాయి గనుకనే, వాటిని మళ్లీ మళ్లీ నెమరువేయడానికి ఆగకుండా), మనం కొత్త కర్తవ్యాన్ని ముందుకు తెస్తాం, దానిమీద దృష్టిని కేంద్రీకరిస్తాం, కొత్త నినాదం యిస్తాం, నిజంగా విప్లవకరమైన సోషల్ డెమోక్రట్లు దాన్ని అమలుపరచడానికి వెంటనే పూనుకోవాలని డిమాండు చేస్తాం.

సోషల్ డెమోక్రటిక్ యెత్తుగడలలోని రెండు ధోరణుల సమస్య నిజంగా వున్నది యిలా. విప్లవ యుగం కొత్త కర్తవ్యాలను ముందుకు తెచ్చింది; పరమ గుడ్డివాళ్లు మాత్రమే వాటిని చూడటంలో విఫలమవుతారు. కొందరు సోషల్ డెమోక్రట్లు యీ కర్తవ్యాలను తటపటాయించకుండా గుర్తించి, యీనాటి దినచర్యలో చేర్చి, యిలా ప్రకటిస్తారు: సాయుధ తిరుగుబాటు ఆలస్యాన్ని సహించదు; వెంటనే, చురుకుగా దానికి సన్నద్ధులు కండి; నిర్ణయాత్మక విజయానికి అది అవిసర్జనీయమని జ్ఞాపకముంచుకోండి; రిపబ్లిక్ కొరకూ, తాత్కాలిక ప్రభుత్వం కొరకూ, కార్మికవర్గపు, రైతాంగపు విప్లవ ప్రజాతంత్ర నియంతృత్వం కొరకూ నినాదాలు ముందుకు తీసుకరండి. కానీ, యితర సోషల్ డెమోక్రట్లు వెనక్కి తగ్గుతారు, కాలహరణం చేస్తారు, నినాదాలు యివ్వడానికి బదులు ఉపోద్ఘాతాలు రాస్తారు; పాతను ధ్రువపరుస్తూ, కొత్తను చూపడానికి బదులు, వాళ్లు దీర్ఘంగా విసుగు కలిగిస్తూ, పాతను నములుతారు, కొత్తను పరిహరించడానికి సాకులు సృష్టిస్తారు, నిర్ణయాత్మక విజయానికి కావలసిన పరిస్థితులను నిర్ణయించడానికి గానీ, సంపూర్ణ విజయాన్ని సాధించాలనే కోర్కెకు మాత్రమే అనుగుణంగా వుండే ఆ నినాదాలను ముందుకు తీసుకపోవడానికి గానీ అసమర్థంగా వుంటారు.

యీ తోకవాదపు రాజకీయ ఫలితం మన కళ్లెదుట వుంది. రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీలోని ''మెజారిటీ''కీ, విప్లవ బూర్జువా ప్రజాస్వామ్యానికీ మధ్య రాజీని గురించిన కట్టుకథ ఒక్కగా నొక్క రాజకీయ వాస్తవంచేత గానీ, బోల్షెవిక్కుల ఒక్కగా నొక్క ముఖ్య తీర్మానంచేత గానీ, రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ మూడవ మహాసభయొక్క ఒక్కగా నొక్క పత్రంచేత గానీ ధ్రువపరచబడని కట్టుకథగానే వుంది. మరో

వైపున, ''ఒస్వొబొజ్దేనియె'' ప్రాతినిధ్యం వహించే అవకాశవాద, రాజరికవాద బూర్జువా వర్గం కొత్త ''ఇస్క్రా'' బృందం ప్రచారంచేసే ''సూత్రాల''లోని ధోరణులకు చాలా కాలంగా స్వాగతమిస్తూ, యిప్పుడు వాస్తవంగా వాళ్లను తమ స్వప్రయోజనానికి వినియోగించుకుంటూ, ''రహస్యా''నికీ, ''గలాటా''కీ, విప్లవంయొక్క ''సాంకేతిక'' పార్శ్వాన్ని అతిశయోక్తిగా చెప్పడానికీ, సాయుధ తిరుగుబాటు నినాదాన్ని బహిరంగంగా ప్రకటించడానికీ, అతివాద డిమాండ్ల ''విప్లవతత్వా''నికీ, వగైరా, వగైరాలకు వ్యతిరేకంగా ఉద్దేశింపబడిన వాళ్ల పడికట్టు పదాలనూ, ''భావాల''నూ అవలంబిస్తోంది. కాకసస్‌లోని మెన్షెవిక్ సోషల్ డెమొక్రట్ల మొత్తం కాన్ఫరెన్సు తీర్మానమూ, ఆ తీర్మానానికి కొత్త ''ఇస్క్రా'' సంపాదకుల ఆమోదమూ పొరపాటు పడజాలని పద్ధతిలో మొత్తం విషయాన్ని రాజకీయంగా క్రోడీకరిస్తున్నాయి: శ్రామికవర్గం విప్లవ ప్రజాతంత్ర నియంతృత్వంలో పాల్గొనే పక్షంలో బూర్జువావర్గం వెనక్కిపోతే యెలా! యిది విషయాన్ని ఒక్క మాటలో చెప్పి, శ్రామికవర్గం రాజరికవాద బూర్జువావర్గానికి తోకగా రూపాంతరం చెందడానికి చివరి మెరుగులు దిద్దుతుంది. కొత్త ''ఇస్క్రా'' తోకవాదపు రాజకీయ ప్రాముఖ్యం యీవిధంగా వాస్తవంలో రుజువు చేయబడింది — యెవరో ఒక వ్యక్తి చేసే ఆషామాషీ అభిప్రాయ ప్రకటనచేత గాక, ఒక మొత్తం ధోరణిచేత, ప్రత్యేకంగా ఆమోదింపబడిన ఒక తీర్మానంచేత.

యీ వాస్తవాలను గురించి ఆలోచించేవాడెవడైనా సోషల్ డెమొక్రటిక్ ఉద్యమంలోని రెండు పక్షాలకూ, రెండు ధోరణులకూ చేసే మామూలు ప్రస్తావనల నిజమైన ప్రాముఖ్యం గ్రహిస్తాడు. యీ ధోరణుల సమగ్ర అధ్యయనానికి బెర్న్‌స్టైనిజాన్ని పరిశీలించాలి. సరిగ్గా యిదే పద్ధతిలో బెర్న్‌స్టైనియన్‌లు మన చెవుల్లో ఊదరపెడుతూ వుండేవారు — శ్రామిక వర్గపు నిజమైన అవసరాలనూ, దాని శక్తులను పెంచే కర్తవ్యాలనూ, కార్యకలాపాలన్నిటినీ ప్రగాఢం చేయడం, అనగా నూతన సమాజపు మూలశక్తులను సన్నద్ధం చేసే కర్తవ్యాన్నీ, ప్రచారాందోళనల కర్తవ్యాన్నీ గ్రహించేది తామే అని. బెర్న్‌స్టైన్ యిలా అంటాడు: వున్నదాన్ని మోమోటం లేకుండా గుర్తించాలని మనం డిమాండుచేస్తాం, తద్వారా ''అంతిమ లక్ష్యం'' యేదీ లేకుండా ''ఉద్యమాన్ని'' ఆమోదిస్తాం, ఆత్మరక్షణార్థక యెత్తుగడలను మాత్రం ఆమోదిస్తాం, ''బూర్జువావర్గం వెనక్కిపోకుండా'' భయగ్రస్త యెత్తుగడలు బోధిస్తాం. ఆవిధంగా బెర్న్‌స్టైనియన్‌లు విప్లవ సోషల్ డెమొక్రట్ల ''జాకొబినిజం''కు వ్యతిరేకంగా, ''కార్మికుల చొరవ''ను గ్రహించలేని ''పత్రికా రచయితల''కూ, వగైరా, వగైరాలకు వ్యతిరేకంగా గోలచేసినారు. వాస్తవంలో, అందరికీ తెలిసినట్లు, విప్లవకర సోషల్ డెమొక్రట్లు రోజువారీ, చిల్లర పనినీ, బలాలను సమీకరించడమూ, వగైరా, వగైరాలను విసర్జించాలని యెన్నడూ ఆలోచించను కూడా లేదు. వాళ్లు డిమాండు చేసిందల్లా అంతిమ

లక్ష్యాన్ని స్పష్టంగా గ్రహించాలని, విప్లవ కర్తవ్యాలను స్పష్టంగా ముందుకు తేవాలని; వాళ్ళు కోరింది అర్థ శ్రామిక, అర్థ పెటీబూర్జువా పొరలను శ్రామికవర్గపు విప్లవ స్థాయికి యెత్తడం — శ్రామికవర్గపు విప్లవ స్థాయిని "బూర్జువావర్గం వెనక్కిపోకుండా" లాంటి అవకాశవాద ఆలోచనలకు కుదించడం కాదు. బహుశా, పార్టీలోని మేధావి అవకాశవాద పక్షానికీ, శ్రామికవర్గ విప్లవ పక్షానికీ మధ్య గల అఖాతాన్ని యీ ప్రశ్న అత్యంత స్పష్టంగా వ్యక్తంచేస్తుంది: dürfen wir siegen? "మనకు గెలిచే ధైర్యం వుందా?" మనం గెలవడం సమంజసమా? గెలవడం మనకు ప్రమాదకరంగా వుండదా? మనకు గెలవవలసిన బాధ్యత వుందా? యీ ప్రశ్న పైకి అంత విడ్డూరంగా వున్నప్పటికీ, లేవనెత్తబడింది, లేవనెత్తబడవలసి వుండింది; యెందుకంటే, అవకాశవాదులు విజయానికి భయపడినారు, విజయం ద్వారా కష్టాలు వస్తాయని జోస్యం చెపుతూ, విజయం కొరకు సూటిగా పిలుపు యిచ్చే నినాదాలను అపహాస్యం చేస్తూ, శ్రామికవర్గాన్ని విజయంనుండి బెదరగొట్టినారు.

మేధావి అవకాశవాద ధోరణిగానూ, శ్రామికవర్గ విప్లవ ధోరణిగానూ యిదే మౌలిక విభజన మనమధ్య కూడా వుంది, కానీ, యీ గణనీయమైన భేదంతో: యిక్కడ మనకు యెదురైనది సోషలిస్టు విప్లవ సమస్య కాదు, ప్రజాతంత్ర విప్లవ సమస్య. "మనకు గెలిచే ధైర్యం వుందా?" అనే ప్రశ్న, పైకి అంత అసంబద్ధంగా కనపడేది, మనలో కూడా లేవనెత్తబడింది. అది మర్తీనొవ్‌చేత తన "రెండు నియంతృత్వాలు"లో లేవనెత్తబడింది; మనం తిరుగుబాటుకు బాగా సన్నద్ధమైతే, దాన్ని పూర్తి విజయవంతంగా నిర్వహిస్తే, భయంకరమైన దౌర్భాగ్యం కలుగుతుందని దానిలో అతను జోస్యం చెప్పినాడు. తాత్కాలిక విప్లవ ప్రభుత్వాన్ని చర్చించే కొత్త "ఇస్క్రా"వాళ్ళ సాహిత్య మంతటిలోనూ యీ ప్రశ్న లేవనెత్తబడింది; బూర్జువా అవకాశవాద ప్రభుత్వంలో మిలెరాన్ పాల్గొనడాన్ని పెటీబూర్జువా విప్లవ ప్రభుత్వంలో వార్లెన్ పాల్గొనడంతో[112] గంద్రగోళపడడానికి వ్యర్థమైనవైనా పట్టు విడువని ప్రయత్నాలు సర్వదా చేయబడినాయి. "బూర్జువావర్గం వెనక్కిపోకుండా" అని తీర్మానంద్వారా ధ్రువపరచబడింది. యిక, ఉదాహరణకు, కౌట్స్కీ వ్యంగ్యంగా మాట్లాడడానికి ప్రయత్నిస్తూ, తాత్కాలిక విప్లవ ప్రభుత్వం గురించి మన వివాదం బిడ్డ పుట్టక ముందే పేరు పెట్టడంలాగుంది అని అన్నప్పటికీ, యుక్తిపరులూ, విప్లవకారులూ అయిన సోషల్ డెమోక్రట్లు కూడా, తాము కర్ణాకర్ణిగా మాత్రమే విన్నదాన్ని గురించి మాట్లాడినప్పుడు, తప్పటడుగు వేయవచ్చునని మాత్రమే యీ వ్యంగ్యం రుజువు చేస్తుంది. జర్మన్ సోషల్ డెమోక్రట్లు బిడ్డను కనడానికి (సోషలిస్టు విప్లవాన్ని నిర్వహించడానికి) యిప్పటికీ అంత దగ్గరలో లేదు; కానీ బిడ్డను కనడానికి మనకు "ధైర్యం వుందా" అనే వివాదానికి సూత్రాల దృష్ట్యా, ఆచరణాత్మక రాజకీయాల దృష్ట్యా అపారమైన ప్రాముఖ్యం

వుండింది. రష్యన్ సోషల్ డెమోక్రట్లు "తమ బిడ్డను కన"గలగడానికి (ప్రజాతంత్ర విప్లవాన్ని నిర్వహించేందుకు) యింకా అంత దగ్గరలో లేరు; కానీ, మనకు బిడ్డను కనే "ధైర్యం వుందా" అనే ప్రశ్న రష్యా మొత్తం భవిష్యత్తుకూ, రష్యన్ సోషల్ డెమోక్రసీ భవిష్యత్తుకూ అత్యంత ప్రాముఖ్యం గలది. మనకు గెలిచే "ధైర్యం వుంది" అనే నమ్మకం వుంటే తప్ప, సైన్యాన్ని చురుకుగా, విజయవంతంగా సమీకరించడమూ, నడిపించడమూ సాధ్యం కాదు.

మన పాత "ఆర్థికవాదు"లను తీసుకుందాం. వాళ్లు కూడా తమ వ్యతిరేకులు కుట్రదారులనీ, జాకొబిన్‌లనీ (చూ: "రబోచెయె దేలొ," ముఖ్యంగా నం. 10, రెండవ మహాసభలో కార్యక్రమంమీద చర్చలో మర్తీనొవ్ ఉపన్యాసమూ), రాజకీయాల్లో మునగడంద్వారా వాళ్లు జనసామాన్యానికి దూరమౌతున్నారనీ, వాళ్లు కార్మికోద్యమ మౌలిక సూత్రాలను గమనించడం లేదనీ, కార్మికుల చొరవను నిర్లక్ష్యం చేస్తున్నారనీ, వగైరా, వగైరా అనీ గోల చేసినారు. వాస్తవంలో "కార్మికుల చొరవ"యొక్క యీ మద్దతుదార్లు అవకాశవాద మేధావులు, శ్రామికవర్గ కర్తవ్యాలను గురించి తమ సొంత సంకుచిత కూపస్థమండూక అవగాహనను కార్మికులమీద రుద్దడానికి ప్రయత్నించినవాళ్లు. వాస్తవంలో "ఆర్థికవాదం" యొక్క వ్యతిరేకులు, పాత "ఇస్క్రా"ద్వారా యెవరైనా గమనించగలిగినట్లుగా, సోషల్ డెమోక్రటిక్ పనిలో యే పార్శ్వాన్నీ నిర్లక్ష్యమూ చేయలేదు, వెనక్కి నెట్టలేదు, ఆర్థిక పోరాటాన్ని యేమాత్రమూ మరిచిపోనూ లేదు; అదే సమయంలో వాళ్లు జరూరు, తక్షణ రాజకీయ కర్తవ్యాలను వాటి సంపూర్ణ విస్తృతిలో ప్రదర్శించగలిగి, తద్వారా కార్మిక పార్టీ ఉదారవాద బూర్జువావర్గపు "ఆర్థిక" తోకగా రూపాంతరం చెందడాన్ని వ్యతిరేకించినారు.

రాజకీయాలు ఆర్థిక విషయాలమీద ఆధారపడతాయని "ఆర్థికవాదులు" కంఠతా నేర్చుకొని, దాని అర్థం రాజకీయ పోరాటాన్ని ఆర్థిక పోరాటానికి కుదించడమని "గ్రహించినారు." ప్రజాతంత్ర విప్లవం దాని ఆర్థిక సారంలో బూర్జువా విప్లవమని కొత్త "ఇస్క్రా"వాళ్లు కంఠతా నేర్చుకొని, దాని అర్థం శ్రామికవర్గపు ప్రజాతంత్ర లక్ష్యాలను బూర్జువా మితతత్వపు స్థాయికి, యే స్థాయి దాటితే "బూర్జువావర్గం వెనక్కిపోతుందో" ఆ స్థాయికి, దించడమని "గ్రహించినారు." తమ పనిని ప్రగాఢంచేసే సాకుమీద, కార్మికుల చొరవను రేపి శుద్ధ వర్గ విధానాన్ని అనుసరించే సాకుమీద, "ఆర్థికవాదులు" వాస్తవానికి కార్మికవర్గాన్ని ఉదారవాద బూర్జువా రాజకీయవాదుల చేతుల్లోకి అప్పగిస్తున్నారు, అనగా సరిగ్గా అలాంటి వస్తుగత ప్రాముఖ్యం గల మార్గంలో పార్టీని నడిపిస్తున్నారు. అదే సాకులమీద కొత్త "ఇస్క్రా"వాళ్లు వాస్తవానికి బూర్జువావర్గానికి లాభకరంగా, ప్రజాతంత్ర విప్లవంలోని శ్రామికవర్గ ప్రయోజనాలకు ద్రోహంచేస్తున్నారు, అనగా సరిగ్గా

అలాంటి వస్తుగత ప్రాముఖ్యం గల మార్గంలో పార్టీని నడిపిస్తున్నారు. రాజకీయ పోరాటంలో నాయకత్వం సోషల్ డెమోక్రట్ల పని కాదనీ, సక్రమమైన పద్ధతిలో ఉదారవాదులదనీ "అర్థికవాదులు" అనుకున్నారు. ప్రజాతంత్ర విప్లవ క్రియాత్మక నిర్వహణ సోషల్ డెమోక్రట్ల పని కాదనీ, సక్రమమైన పద్ధతిలో ప్రజాతంత్ర బూర్జువావర్గానిదనీ కొత్త "ఇస్క్రా" వాళ్లు అనుకుంటున్నారు; యెందుకంటే, శ్రామికవర్గపు మార్గదర్శకత్వమూ, ప్రబలమైన పాత్రా విప్లవ "విస్తృతిని తగ్గిస్తా"యని వాళ్లు వాదిస్తారు.

టూకీగా చెప్పాలంటే, కొత్త "ఇస్క్రా"వాళ్లు, రెండవ పార్టీ మహాసభలో పుట్టడం వల్లనే కాక, ప్రజాతంత్ర విప్లవంలో శ్రామికవర్గపు యెత్తుగడల కర్తవ్యాలను వాళ్లు యిప్పుడు ప్రదర్శించే పద్ధతిలో కూడా, "అర్థికవాదాన్ని" అనుకరిస్తున్నారు. వాళ్లు కూడా పార్టీలోని మేధావి అవకాశవాద పక్షానికి చెందినవారు. సంస్థా నిర్మాణ రంగంలో వాళ్లు మేధావుల అరాజకవాద వ్యక్తిత్వంతో ప్రథమ దర్శనం యిచ్చి, "ప్రక్రియగా విసంఘటనం"తో ముగించినారు. కాన్ఫరెన్సు ఆమోదించిన "నిబంధనావళి"[113]లో వాళ్లు పార్టీ శాఖనుండి పార్టీ ప్రచురణ కార్యకలాపాలను వేరుచేయడాన్నీ, పరోక్షమైన, దాదాపు నాలుగు దశల యెన్నికల వ్యవస్థనూ, ప్రజాతంత్ర ప్రాతినిధ్యానికి బదులు బోనపార్టిస్టు జనవాక్య సేకరణల వ్యవస్థనూ, చివరన, భాగానికీ, సమస్తానికీ మధ్య "అంగీకారాల" సూత్రాన్నీ నెలకొల్పినారు. పార్టీ యెత్తుగడల్లో వాళ్లు అదే జారుడు బల్లమీదుగా దిగజారినారు. "జేమ్‌స్త్వో ప్రచార పథకం"[114]లో వాళ్లు జేమ్‌స్త్వో సభ్యులకు విజ్ఞాపనలు "అత్యున్నత రకం ప్రదర్శన" అని ప్రకటించి, రాజకీయ రంగంలో రెండు క్రియాశీల శక్తులను మాత్రమే (జనవరి 9 తేదీ ప్రాంగణంలో!) – ప్రభుత్వాన్నీ, బూర్జువా ప్రజాతంత్రవాదులనూ – గుర్తించినారు. నూటి, ఆచరణాత్మక నినాదాన్ని తొలగించి, దాని స్థానంలో, ఆయుధాలు ధరించాలనే గాఢమైన కాంక్ష గల ప్రజలను సాయుధులను చేయాలనే పిలుపును పెట్టడంద్వారా వాళ్లు ప్రజలను సాయుధం చేయాలనే జరూరు కర్తవ్యాన్ని "మరింత గంభీరం" చేసినారు. తమ అధికారిక తీర్మానాలలో వాళ్లు సాయుధ తిరుగుబాటుకూ, తాత్కాలిక ప్రభుత్వ స్థాపనకూ, విప్లవ ప్రజాతంత్ర నియంతృత్వానికీ సంబంధించిన కర్తవ్యాలను వికృత పరచి, నిర్వీర్యపరచినారు. "బూర్జువావర్గం వెనక్కిపోకుండా" – వాళ్ల తాజా తీర్మానంలోని యీ చివరి మాట వాళ్ల దారి పార్టీని యెక్కడికి తీసుకపోయేదీ స్పష్టంగా తెలుపుతుంది.

రష్యాలోని ప్రజాతంత్ర విప్లవం, దాని సాంఘిక ఆర్థిక సారంలో, బూర్జువా విప్లవం. కానీ, యీ సరైన మార్క్సిస్టు నిర్వచనాన్ని కేవలం పునశ్చరణ చేయడం చాలదు. దీన్ని సక్రమంగా అర్థం చేసుకోవలసి వుంది, రాజకీయ నినాదాలకు సక్రమంగా అన్వయించవలసి వుంది. యీనాటి, అనగా పెట్టుబడిదారీ, ఉత్పత్తి సంబంధాలమీద ఆధారపడిన రాజ

కీయ స్వేచ్ఛ అంతా, దరహంమీద, బూర్జువా స్వేచ్ఛ. స్వేచ్ఛ కొరకు డిమాండు ప్రాథమికంగా బూర్జువావర్గ ప్రయోజనాలను వ్యక్తంచేస్తుంది. దాని ప్రతినిధులు యీ డిమాండును మొట్టమొదట లేవనెత్తినవాళ్లు. దాని మద్దతుదార్లు తాము సంపాయించిన స్వేచ్ఛను ప్రతిచోటా యజమానులలాగా ఉపయోగించి, దాన్ని మితమైన కచ్చితమైన బూర్జువా మోతాదులకు కుదించి, విప్లవ శ్రామికవర్గాన్ని శాంతికాలంలో నిగూఢ పద్ధతుల్లో అణచివేయడంతోనూ, కల్లోల కాలంలో కిరాతకంగా అణచివేయడంతోనూ జోడించినారు.

కానీ, దీన్నిబట్టి, స్వేచ్ఛా పోరాటాన్ని వ్యతిరేకించాలని, లేదా అపహాస్యం చేయాలని తిరుగుబాటు "నరోద్నిక్కు"లూ, అరాజకవాదులూ, "ఆర్థికవాదులూ" మాత్రమే నిర్ణయించగలరు. యీ మేధావి కూపస్థమండూక సూత్రాలు శ్రామికవర్గంమీద కొంత కాలంపాటు మాత్రమే, దాని అభీష్టానికి వ్యతిరేకంగా, రుద్దబడగలవు. శ్రామికవర్గం తనకు రాజకీయ స్వేచ్ఛ అవసరమనీ, అందరికంటె యెక్కువగా అవసరమనీ అంతఃప్రవృత్తుల్ద్వారా యెల్లప్పుడూ గుర్తించింది — ఆ స్వేచ్ఛయొక్క తక్షణ ఫలితం బూర్జువావర్గాన్ని పటిష్ఠపరచడంగా, సంఘటితపరచడంగా వుండబోయేటప్పటికీ. శ్రామికవర్గం తన మోక్షాన్ని యెదురు చూసేది వర్గపోరాటాన్ని తప్పుకోవడంద్వారా కాదు, దాన్ని అభివృద్ధి చేయడంద్వారా, దాని విస్తృతినీ, చైతన్యాన్నీ, సంఘటననూ, కృతనిశ్చయత్వాన్నీ విస్తృతపరచడంద్వారా. రాజకీయ పోరాట కర్తవ్యాలను అపహాస్యం చేసేవాడెవడైనా సోషల్ డెమోక్రట్‌ను ప్రజానాయకుని నుండి ట్రేడ్‌యూనియన్ కార్యదర్శిగా మారుస్తాడు. ప్రజాతంత్ర బూర్జువా విప్లవంలోని శ్రామికవర్గ కర్తవ్యాలను అపహాస్యం చేసేవాడెవడైనా సోషల్ డెమోక్రట్‌ను ప్రజా విప్లవ నాయకునినుండి స్వేచ్ఛాయుత కార్మిక సంఘ నాయకునిగా మారుస్తాడు.

అవును, ప్రజా విప్లవం. "ప్రజలు" అనే పదంయొక్క బూర్జువా ప్రజాతంత్ర దుర్వినియోగంతో సోషల్ డెమోక్రసీ పోరాడింది, యెంతో సమంజసంగా పోరాడుతోంది. ప్రజలలోపల గల వర్గ వైరుధ్యాలను అర్థం చేసుకోలేకపోవడాన్ని మూసిపెట్టడానికి యీ పదాన్ని ఉపయోగించకూడదని సోషల్ డెమోక్రసీ డిమాండు చేస్తుంది. కార్మికవర్గ పార్టీకి సంపూర్ణ వర్గ స్వాతంత్ర్యం వుండడం అవసరమని అది నిర్ద్వంద్వంగా పట్టుబట్టుతుంది. కాని, శ్రామికవర్గం తనలో తాను బంధింపబడేటట్లుగా, సంకుచిత హద్దులకు పరిమితమయ్యేటట్లుగా, ప్రపంచ ఆర్థిక పాలకులు వెనక్కిపోతారనే భయంతో తన కార్యకలాపాలను నిర్వీర్యపరచేటట్లుగా అది "ప్రజలను" "వర్గాలు"గా విభజించదు; మధ్య వర్గాల అర్ధ మనస్కతా, ఊగిసలాటా, అనిశ్చితత్వమూ లేని పురోగామి వర్గం యావత్ప్రజల హితం కొరకు, యావత్ప్రజల అగ్రభాగాన మరింత శక్తితో, ఉత్సాహంతో పోరాడాలని అది ఆ పని చేస్తుంది.

దీనినే అంత తరుచుగా అర్థం చేసుకోలేకపోతున్నది యీనాటి కొత్త "ఇస్క్రా" వాళ్లు — ప్రజాతంత్ర విప్లవంలో క్రియాశీల రాజకీయ నినాదాలకు బదులు, సకల విభక్తులలోనూ, లింగాలలోనూ మార్చబడిన "వర్గ" అనే పదంయొక్క కేవల పాండిత్య పూరిత పునశ్చరణను పెట్టేవాళ్లు!

ప్రజాతంత్ర విప్లవం స్వభావరీత్యా బూర్జువా విప్లవం. "సాధారణ భూమి పునః పంపకం" లేక "భూమీ, స్వేచ్ఛా" అనే నినాదం — దళితులైన, అజ్ఞానులైన, కానీ కాంతి కొరకూ, ఆనందం కొరకూ తీవ్రంగా తపించేటట్టి రైతు జనసామాన్యపు అత్యంత విస్తృత వ్యాప్తి గల ఆ నినాదం — బూర్జువా నినాదం. కానీ, బూర్జువా స్వేచ్ఛా, బూర్జువా పురోగతీ తప్ప శ్రామికవర్గానికీ, రైతాంగానికీ నిజమైన స్వేచ్ఛకు మరొక మార్గం లేదనీ, వుండ జాలదనీ మార్క్సిస్టులమైన మనం తెలుసుకోవాలి. సంపూర్ణ రాజకీయ స్వేచ్ఛ తప్ప, ప్రజాతంత్ర రిపబ్లిక్ తప్ప, శ్రామికవర్గపు, రైతాంగపు విప్లవ ప్రజాతంత్ర నియంతృత్వం తప్ప, సోషలిజాన్ని దగ్గరకు తెచ్చే మార్గం ప్రస్తుత సమయంలో యేదీ లేదనీ, వుండ జాలదనీ మనం మరిచిపోకూడదు. పురోగామి వర్గపు, ఒకేఒక విప్లవకరమైన వర్గపు — యెలాంటి మినహాయింపులూ, సందేహాలూ, వెనుక చూపులూ లేకుండా విప్లవకరమైన వర్గపు — ప్రతినిధులంగా మనం సాధ్యమైనంత విస్తృతంగా, ధైర్యంగా, గరిష్ఠమైన చొరవతో, ప్రజాతంత్ర విప్లవ కర్తవ్యాలను యావత్ప్రజల యెదుట బెట్టాలి. యీ కర్తవ్యాలను చులకన చేయడమంటే సిద్ధాంతం దృష్ట్యా మార్క్సిజంను అపహాస్యం చేయడం, దాన్ని కూపస్థమండూక పద్ధతిలో వక్రీకరించడం అవుతుంది; ఆచరణాత్మక రాజకీయాల్లో అది విప్లవ హితాన్ని బూర్జువావర్గం చేతుల్లో, విప్లవాన్ని స్థిరంగా నిర్వహించే కర్తవ్యంనుండి అనివార్యంగా వెనక్కిపోయేదాని చేతుల్లో, పెట్టడమౌతుంది. విప్లవంయొక్క సంపూర్ణ విజయానికి పోయే దారిలో వున్న కష్టాలు చాలా పెద్దవి. కార్మికవర్గ ప్రతినిధులు తమకు చేతనైనంతా చేసిన తర్వాత, వాళ్ల ప్రయత్నాలు ప్రగతి వ్యతిరేకత ప్రతిఘటనచేతా, బూర్జువా వర్గపు ద్రోహంచేతా, జనాల అజ్ఞానంచేతా ఓడింపబడితే, వాళ్లను యెవరూ నిందించ జాలరు. కానీ, సోషల్ డెమోక్రటిక్ పార్టీ గెలవడానికి భయపడి, "బూర్జువావర్గం వెనక్కిపోకుండా" అనే భావానికి లోబడి, ప్రజాతంత్ర విప్లవపు విప్లవాత్మక చురుకుదనాన్ని తగ్గిస్తే, విప్లవ ఉత్సాహాన్ని చల్లబరిస్తే, దాన్ని అందరూ ఖండిస్తారు, అందరికంటె యెక్కువగా వర్గచైతన్యపూరిత శ్రామికవర్గం ఖండిస్తుంది.

విప్లవాలు చరిత్రయొక్క వాహనాలు, అని మార్క్స్ అన్నాడు.[115] విప్లవాలు దోపిడీ చేయబడే, పీడిత ప్రజల పండగలు. విప్లవ సమయంలోలాగ మరెప్పుడూ ప్రజా సముదాయం నూతన సమాజ వ్యవస్థ సృష్టికర్తగా అంత చురుకుగా ముందుకు వచ్చే స్థితిలో వుండదు.

క్రమక్రమ పురోగతి అనే అల్పబుద్ధుల పరిమితమైన కొలతబద్దతో కొలిస్తే, అలాంటి సమయాలలో ప్రజలు అద్భుతాలు నిర్వహించగలరు. కానీ, అలాంటి సమయంలో విప్లవ పార్టీల నాయకులు కూడా తమ లక్ష్యాలను మరింత సమగ్రంగా, మరింత ధైర్యంగా ముందుకు తీసుకపోవాలి — తమ నినాదాలు యెల్లప్పుడూ జనాల విప్లవ చొరవకంటె ముందు వుండేటట్లుగా, దివిటీలాగ ఉపకరించేటట్లుగా, మన ప్రజాతంత్ర, సోషలిస్టు ఆదర్శాన్ని, దాని పూర్తి పరిమాణంలో, దీప్తిలో, వాళ్లకు వెల్లడించి, సంపూర్ణ, పరమ, నిర్ణయాత్మక విజయానికి అత్యంత దగ్గరి, సూటి దారి వాళ్లకు చూపించేటట్లుగా. విప్లవానికీ, సూటి దారికీ భయపడి, రాజీల డొంకతిరుగుడు చుట్టుదారులు సృష్టించే కర్తవ్యాన్ని "ఒస్వాబొజ్దేనియె" బూర్జువావర్గపు అవకాశవాదులకు వదలేద్దాం. అలాంటి దారులలో దేకుతూ పోయేటట్లు మనం బలవంతంగా నిర్బంధింపబడితే, చిల్లర, రోజువారీ పనిలో కూడా మన విధిని నిర్వర్తించగలం. కానీ, మొదట, నిర్దాక్షిణ్యమైన పోరాటంలో దారి యెన్నిక నిర్ణయింపబడనివ్వండి. జనాల వెల్లివిరిసే యీ శక్తినీ, విప్లవ ఉత్సాహాన్నీ మనం సూటి, నిర్ణయాత్మక మార్గం కొరకు నిర్దాక్షిణ్యమైన, స్వార్థత్యాగపూరితమైన పోరాటం చేయడానికి వినియోగించకపోతే, మనం విప్లవ ద్రోహులం, వంచకులం అవుతాం. బూర్జువా అవకాశవాదులు భావి ప్రగతి వ్యతిరేకతను పిరికిపందల్లాగా భయంతో మననం చేసుకోనివ్వండి. ప్రగతి వ్యతిరేకత భయంకరంగా వుండదలచుకొన్నదనే ఆలోచనగానీ, బూర్జువావర్గం వెనక్కిపోదలచుకొన్నదనే ఆలోచనగానీ కార్మికులను భయపెట్టదు. కార్మికులు బేరాలు కుదిరించుకోవచ్చునని అనుకోరు; వాళ్లు చిల్లర సౌకర్యాలు అడగడం లేదు. వాళ్లు ప్రయత్నించేది ప్రగతి వ్యతిరేక శక్తులను నిర్దాక్షిణ్యంగా నలిపివేయడానికి, అనగా శ్రామికవర్గపు, రైతాంగపు విప్లవ ప్రజాతంత్ర నియంతృత్వాన్ని నెలకొల్పడానికి.

నిజమే, కార్మికవర్గపు జీవరక్తాన్ని దాని దోపిడీదార్లు బాధాకరంగా, స్థిరంగా పీల్చే ఉదారవాద పురోగతి అనే ప్రశాంత "ప్రయాణపు" కాలాల్లోకంటె కల్లోలపు కాలాల్లో మన పార్టీ నౌకకు పెద్ద ప్రమాదాలు వుంటాయి. నిజమే, "తీవ్ర ప్రతిపక్షపు," లేదా కేవల పార్లమెంటరీ పోరాటపు కర్తవ్యాలకంటె విప్లవ ప్రజాతంత్ర నియంతృత్వపు కర్తవ్యాలు అగణితంగా యెక్కువ కష్టంగా, క్లిష్టంగా వుంటాయి. కానీ, ప్రస్తుత విప్లవ పరిస్థితిలో ప్రశాంత ప్రయాణాన్నీ, సురక్షిత "ప్రతిపక్ష" మార్గాన్నీ తెలిసితెలిసి యెన్నుకోగలవాడెవడైనా విప్లవం ముగిసిందాకా, ఉత్సవ దినాలు గడచిందాకా ఆగడం మంచిది; అప్పుడు నిర్జీవపు రోజువారీ జీవితం మళ్లీ ప్రారంభమై, తన సంకుచిత నిత్యకృత్యపు ప్రమాణాలు అసహ్యమైనంత అపశ్రుతిగా కనిపించవు, పురోగామి వర్గపు కర్తవ్యాలను అంత విరూపంగా వికృతపరచవు.

యావత్ప్రజల అగ్రభాగాన, ముఖ్యంగా రైతాంగపు అగ్రభాగాన — సంపూర్ణ స్వాతంత్ర్యం కొరకు, స్థిరమైన ప్రజాతంత్ర విప్లవం కొరకు, రిపబ్లిక్ కొరకు! కష్టజీవుల, పీడితుల అగ్రభాగాన — సోషలిజం కొరకు! ఆచరణలో యిది విప్లవ శ్రామికవర్గపు విధానంగా వుండాలి. విప్లవ కాలంలో కార్మిక పార్టీ యెత్తుగడలకు సంబంధించిన ప్రతి సమస్యనూ, ప్రతి ఆచరణాత్మక అడుగునూ ఆవరించి, నిర్ణయించవలసిన వర్గ నినాదం యిది.

## ఉత్తరకాండ

### మరొకసారి "ఒస్వొబొజ్దేనియె" ధోరణి, మరొకసారి కొత్త "ఇస్క్రా" ధోరణి

"ఒస్వొబొజ్దేనియె" నం. 71–72, "ఇస్క్రా" నం. 102–103 యీ పుస్తకం 8వ అంశంలో చర్చించిన సమస్యమీద పుష్కలంగా అదనపు సమాచారం యిస్తున్నాయి. యీ సంపన్నమైన సమాచార మంతటినీ వినియోగించుకోవడం అసాధ్యం కనుక, అత్యంత ముఖ్యమైన అంశాలకు మాత్రం మేము పరిమిత మౌతాము: మొదటిది, సోషల్ డెమోక్రసీలో "ఒస్వొబొజ్దేనియె" పొగడే రకం "వాస్తవికతా," అది దానిని యెందుకు పొగడవలసి వుండేదీ; రెండవది, విప్లవ భావానికీ, నియంతృత్వ భావానికీ మధ్య గల సంబంధం.

## I. బూర్జువా ఉదారవాద వాస్తవికవాదులు సోషల్ డెమోక్రటిక్ "వాస్తవికవాదు"లను యెందుకు పొగడుతారు?

"రష్యన్ సోషల్ డెమోక్రసీలో చీలిక" అనీ, "ప్రపంచ జ్ఞానంయొక్క విజయం" అనీ శీర్షికలు గల వ్యాసాలు ("ఒస్వొబొజ్దేనియె," నం. 72) సోషల్ డెమోక్రసీమీద ఉదారవాద బూర్జువావర్గ ప్రతినిధుల అభిప్రాయాన్ని, వర్గచైతన్యపూరిత కార్మికులకు అసాధారణమైన విలువ గలదాన్ని, వ్యక్తంచేస్తున్నాయి. ప్రతి సోషల్ డెమోక్రట్ యీ వ్యాసాలను పూర్తిగా చదవాలనీ, వీటిలోని ప్రతి వాక్యంమీదా యోచన చేయాలనీ మేము గట్టిగా సిఫారస్ చేస్తున్నాము. మొట్టమొదట, యీ రెండు వ్యాసాల్లోని అత్యంత ముఖ్యమైన ప్రతిపాదనలను ఉల్లేఖిస్తాము.

"ఒస్వొబొజ్దేనియె" యిలా రాసింది:

“సోషల్ డెమోక్రటిక్ పార్టీని రెండు పక్షాలుగా చీల్చిన విభేదాల నిజమైన రాజకీయ అర్థాన్ని గ్రహించడం బయటినుండి చూసే ప్రేక్షకునికి బాగా కష్టం. ఉద్యమ ప్రయోజనాల్లో కొంత రాజీని అనుమతించే ‘మైనారిటీ’ పక్షానికి భిన్నంగా, ‘మెజారిటీ’ పక్షాన్ని యెక్కువ తీవ్రమైనదీ, అచంచలమైనదీ అని నిర్వచించడం పూర్తిగా సరైనది కాదు, యెట్టి సందర్భంలోనూ సమగ్రమైన వర్ణన కాదు. యేమైనప్పటికీ, నైష్ఠిక మార్క్సిజపు సాంప్రదాయిక పిడిసూత్రాలను బహుశా లెనిన్ పక్షంకంటె యెక్కువ పట్టుదలతో కూడా, మైనారిటీ పక్షం అనుసరిస్తున్నది. యీకింది వర్ణన మరింత కచ్చితంగా వున్నట్లు మాకు కనపడుతుంది. ‘మెజారిటీ’ మౌలిక రాజకీయ మనస్తత్వం యేమిటంటే అభౌతికమైన విప్లవతత్వమూ, తిరుగుబాటుతత్వమూ, యే సాధనాలచేతనైనా సరే ప్రజాసామాన్యంలో తిరుగుబాటు రేపి, వాళ్ల తరఫున వెంటనే అధికారం స్వాధీనం చేసుకోవాలనే ఆతురతా; కొంత వరకు యిది ‘లెనినిస్టు’లను సోషలిస్టు రివల్యూషనరీలకు దగ్గరగా తెచ్చి, వాళ్ల మనస్సులలో యావత్ప్రజల రష్యన్ విప్లవ భావం వర్గపోరాట భావాన్ని మరుగు పరిచేటట్లు చేస్తుంది. ‘లెనినిస్టులు’ ఒకవైపున ఆచరణలో సోషల్ డెమోక్రటిక్ సిద్ధాంతపు సంకుచిత మనస్తత్వంలో అధిక భాగాన్ని విసర్జిస్తూ, మరొకవైపున, విప్లవతత్వపు సంకుచిత మనస్తత్వంలో పూర్తిగా మునిగిపోయినారు. వాళ్లు తక్షణ తిరుగుబాటును సిద్ధంచేయడం తప్ప, సకల ఆచరణాత్మక కార్యకలాపాలనూ విసర్జిస్తారు, సకల చట్టబద్ధ, అర్ధ చట్టబద్ధ ఆందోళన రూపాలనూ, యితర ప్రతిపక్ష ధోరణులతో ఆచరణలో ఉపయోగకరమైన యెలాంటి రాజీనీ సూత్ర దృష్ట్యా ఉపేక్షిస్తారు. తద్వ్యతిరేకంగా, మైనారిటీ పక్షం మార్క్సిస్టు సిద్ధాంతానికి స్థిరంగా అంటిపెట్టుకుంటూ, అదే సమయంలో మార్క్సిస్టు ప్రపంచ దృక్పథంలోని వాస్తవిక అంశాలను నిలుపుకుంటుంది. ‘శ్రామికవర్గ’ ప్రయోజనాలను బూర్జువావర్గ ప్రయోజనాలకు పోటీగా పెట్టడం యీ పక్షపు మౌలిక భావం. కానీ, మరొకవైపున శ్రామికవర్గ పోరాటం — సహజంగానే, సోషల్ డెమోక్రసీయొక్క మార్చరాని పిడి సూత్రాలచేత నిర్ణయింపబడిన కొన్ని హద్దులకు లోబడి — వాస్తవిక దృష్టి గల ప్రశాంత మనస్కతతో, యీ పోరాటపు సకల నిర్దిష్ట పరిస్థితుల, లక్ష్యాల స్పష్టమైన గుర్తింపుతో, అవగతం చేసుకోబడింది. యీ రెండు పక్షాల్లో యేదీ తన మౌలిక దృక్పథాన్ని స్థిరంగా అనుసరించదు; యెందుకంటే, తమ సిద్ధాంత, రాజకీయ కార్యకలాపాల్లో అవి సోషల్ డెమోక్రటిక్ నీతిశతకంలోని కఠినమైన సూత్రాల చేత బంధింపబడ్డాయి; ‘లెనినిస్టులు,’ కనీసం కొంతమంది సోషలిస్టు రివల్యూష

నరీల లాగా, అచంచలమైన తిరుగుబాటుదారులు కాకుండానూ, 'ఇస్క్రా'వాళ్లు కార్మికవర్గపు నిజమైన రాజకీయ ఉద్యమ ఆచరణాత్మక నాయకులు కాకుండానూ యీ సూత్రాలు నిరోధిస్తాయి.''

అత్యంత ముఖ్యమైన తీర్మానాలలోని వాక్యాలను ఉల్లేఖించిన తర్వాత, ''ఒస్వొబొజ్దేనియె'' రచయిత తన సాధారణ ''భావాలను'' వివరించడానికి పూనుకొని, వాటిమీద పలు నిర్దిష్ట అభిప్రాయాలు యిచ్చినాడు. మూడవ మహాసభతో పోలిస్తే, ''మైనారిటీ కాన్ఫరెన్సు సాయుధ తిరుగుబాటుపట్ల పూర్తి భిన్నమైన వైఖరి అవలంబిస్తుంది'' అని అతను అంటాడు. ''సాయుధ తిరుగుబాటుపట్ల వైఖరి అనే సందర్భంలో'' తాత్కాలిక ప్రభుత్వంమీద వాళ్ల వాళ్ల తీర్మానాల్లో ఒక భేదం వుంది. ''కార్మికుల ట్రేడ్‌యూనియన్‌ల విషయంలో కూడా అలాంటి భేదమే వెల్లడి అవుతున్నది. కార్మికుల రాజకీయ విద్యలోనూ, సంస్థానిర్మాణంలోనూ యీ అత్యంత ముఖ్యమైన ప్రారంభిక విషయంమీద 'లెనినిస్టులు' తమ తీర్మానంలో ఒక్క మాట కూడా చెప్పలేదు. తద్వ్యతిరేకంగా, మైనారిటీ పక్షం చాలా తూకం గల తీర్మానం రచించింది.'' ఉదారవాదుల విషయంలో రెండు పక్షాలూ యేకాభిప్రాయంలో వున్నాయని అతను అంటాడు, కానీ మూడవ మహాసభ ''ఉదారవాదుల పట్ల వైఖరిమీద రెండవ మహాసభలో ఆమోదింపబడిన ప్లెహానొవ్ తీర్మానాన్ని మక్కీకి మక్కీగా పునశ్చరణచేసి, ఉదారవాదులకు మరింత అనుకూలంగా వుండి, అదే మహాసభలో ఆమోదింపబడిన స్తరొవేర్ తీర్మానాన్ని నిరాకరిస్తుంది.'' రైతు ఉద్యమంమీద మహాసభ తీర్మానమూ, కాన్ఫరెన్సు తీర్మానమూ మొత్తంమీద యేకీభవించినప్పటికీ ''భూస్వాముల యెస్టేట్లనూ, యితర భూమినీ విప్లవాత్మకంగా స్వాధీనం చేసుకునే భావాన్ని 'మెజారిటీ' పక్షం యెక్కువగా నొక్కిచెప్పగా, 'మైనారిటీ' పక్షం ప్రజాతంత్ర రాజ్యం కొరకూ, పరిపాలనాత్మక సంస్కరణ కొరకూ చేసే డిమాండును తన ఆందోళనకు ఆధారంగా చేసుకోవాలనుకుంటుంది.''

చివరి విషయం, ''ఒస్వొబొజ్దేనియె'' ''ఇస్క్రా'' నం. 100నుండి ఒక మెన్షెవిక్ తీర్మానాన్ని ఉల్లేఖిస్తుంది; దాని ప్రధాన నిబంధన యిలా వుంది: ''రహస్య కార్యకలాపాలు మాత్రమే ప్రస్తుతం పార్టీ జీవితంలో జనబాహుళ్యం చాలినంతగా పాల్గొనేటట్లు చేయజాలవు గనుక, కొంతవరకు జనబాహుళ్యం చట్ట వ్యతిరేక సంఘంగా పార్టీకి పోటీగా వుండే స్థితికి దారితీస్తాయి గనుక, పార్టీ చట్ట బద్ధ ప్రాతిపదికమీద కార్మికుల ట్రేడ్‌యూనియన్ పోరాటానికి నాయకత్వం వహించి, యీ పోరాటాన్ని సోషల్ డెమోక్రటిక్ కర్తవ్యాలతో కచ్చితంగా అనుసం

ధించాలి.'' యీ తీర్మానంమీద వ్యాఖ్యానిస్తూ, ''ఒస్వాబొజ్దేనియె'' యిలా ఉద్ఘాటించింది: ''లోకజ్ఞానపు విజయంగా, సోషల్ డెమొక్రటిక్ పార్టీలో ఒక నిర్దిష్టమైన భాగానికి యెత్తుగడల విషయంలో జ్ఞానోదయం అవుతున్నదనేదానికి సాక్ష్యంగా యీ తీర్మానానికి మేము హృదయపూర్వకంగా స్వాగతం యిస్తున్నాం.''

''ఒస్వాబొజ్దేనియె''యొక్క గమనార్హమైన అభిప్రాయాలన్నీ యిప్పుడు పాఠకుని ముందు వున్నాయి. యీ అభిప్రాయాలు వస్తుగత సత్యానికి అనుగుణంగా వుండడం అనే అర్థంలో, సరిగా వున్నట్లు పరిగణించడం, సహజంగానే, తీవ్రమైన తప్పు అవుతుంది. ప్రతి సోషల్ డెమొక్రటూ అడుగడుగునా వాటిలోని తప్పులను కనిపెడతాడు. యీ అభిప్రాయాలన్నీ ఉదారవాద బూర్జువావర్గపు ప్రయోజనాలనూ, దృక్పథాలనూ పూర్తిగా ఒంటబట్టించు కొన్నాయనీ, యీ అర్థంలో అవి పక్షపాతంతోనూ, పక్షపాతపు ఉద్దేశంతోనూ కూడివున్నాయనీ మరచిపోవడం పసితనం అవుతుంది. వస్తువులు పుటాకారపు అద్దంలోనో, కుంభాకారపు అద్దంలోనో ప్రతిఫలించిన విధంగానే అవి సోషల్ డెమొక్రట్ల అభిప్రాయాలను ప్రతిఫలిస్తాయి. కానీ, అంతిమ పరిశీలనలో, యీ బూర్జువా వక్రీకృత అభిప్రాయాలు బూర్జువా వర్గపు వాస్తవ ప్రయోజనాలను ప్రతిబింబిస్తాయని మరచిపోవడం యింకా పెద్ద పొరపాటు అవుతుంది. బూర్జువావర్గం ఒక వర్గంగా తనకు సోషల్ డెమొక్రసీలోని యే ధోరణులు ప్రయోజనకరంగా, దగ్గరగా, అనుబంధితంగా, అనుకూలంగా వున్నదీ, యే ధోరణులు హానికరంగా, దూరంగా, పరాయివిగా, ప్రతికూలంగా వున్నదీ నిస్సంశయంగా సరిగా అర్థం చేసుకుంటుంది. బూర్జువా తత్వవేత్తగానీ, బూర్జువా పత్రికా రచయితగానీ సోషల్ డెమొక్రసీని, అది మెన్షెవిక్‌దైనా సరే, బోల్షెవిక్‌దైనా సరే, యెన్నడూ సరిగా అర్థంచేసుకోలేడు. కానీ, అతను కొంచెం తెలివిగల పత్రికా రచయిత అయితే, తన వర్గ అంతఃప్రవృత్తి సహాయంతో సోషల్ డెమొక్రటిక్ ఉద్యమంలోని యీ ధోరణి గానీ, ఆ ధోరణి గానీ బూర్జువా వర్గానికి యే విలువ గలిగి వుండవచ్చునో విలువ సారాన్ని యెప్పుడూ గ్రహిస్తాడు – దాన్ని అతను వికృత రూపంలో ప్రదర్శించినప్పటికీ. అందువల్లనే మన శత్రువు వర్గ అంతః ప్రవృత్తి, అతని వర్గ అభిప్రాయం, ప్రతి వర్గచైతన్యపూరిత కార్మికుని గాఢ శ్రద్ధకు యెప్పుడూ అర్హమౌతుంది.

కనుక, ''ఒస్వాబొజ్దేనియె''వాళ్లు వ్యక్తంచేసిన రూపంలో రష్యన్ బూర్జువావర్గపు వర్గ అంతఃప్రవృత్తి మనకు తెలియజేసే దేమిటి?

అది కొత్త ''ఇస్క్రా'' ప్రాతినిధ్యం వహించిన ధోరణిపట్ల నిశ్చితంగా సంతృప్తి వ్యక్తం చేసి, వాస్తవికతకూ, ప్రశాంత మనస్కతకూ, లోకజ్ఞానానికీ, దాని తీర్మానాల సౌష్ఠవానికీ,

యెత్తుగడల సమస్యలమీద దానికి జ్ఞానోదయం అవుతున్నందుకూ, దాని కార్యవాదానికీ, వగైరాలకు దాన్ని ప్రశంసిస్తుంది; అది మూడవ మహాసభ ధోరణిపట్ల అసంతృప్తి వ్యక్తం చేసి, దాని సంకుచితత్వానికీ, విప్లవతత్వానికీ, తిరుగుబాటుతత్వానికీ, ఆచరణాత్మకంగా ఉపయోగకరమైన రాజీలను అది నిరాకరించినందుకూ, వగైరాలకు దాన్ని అభిశంసిస్తుంది. సరిగ్గా అత్యంత కచ్చితమైన వాస్తవాల సహాయంతో మన సారస్వతంలో పదేపదే రుజావు చేయబడినదే బూర్జువావర్గానికి దాని వర్గ అంతఃప్రవృత్తి సూచిస్తుంది – యేదంటే, కొత్త "ఇస్క్రా"వాళ్లు యీనాటి రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలోని అవకాశవాద పక్షమనీ, వాళ్ల వ్యతిరేకులు విప్లవ పక్షమనీ. ఉదారవాదులు మొదటివాళ్ల ధోరణులపట్ల సానుభూతి కలిగివుండక తప్పదు, రెండవవాళ్ల ధోరణులను అభిశంసించక తప్పదు. కార్మికవర్గ "కార్యవాదం, ప్రశాంత మనస్కత, సౌష్టవాల"ద్వారా, దాని కార్యకలాపాల రంగాన్ని పెట్టుబడిదారీ వ్యవస్థ, సంస్కరణలూ, ట్రేడ్‌యూనియన్ పోరాటమూ, వగైరాల చట్రం లోపల వాస్తవంగా పరిమితపరచడంద్వారా, బూర్జువావర్గం లాభపడుతుందని బూర్జువావర్గపు సిద్ధాంతకారులుగా ఉదారవాదులకు యెంతో బాగా తెలుసు. కార్మికవర్గ "విప్లవ సంకుచిత మనస్తత్వమూ," తన సొంత వర్గ లక్ష్యాలను పెంపొందించుకోడానికి యావత్ప్రజల రష్యన్ విప్లవంలో నాయకత్వం సంపాయించుకోడానికి దాని ప్రయత్నాలూ – యివి బూర్జువా వర్గానికి ప్రమాదకరమైనవి, భయం కలిగించేవి.

"వాస్తవికత" అనే పదంయొక్క వాస్తవమైన అర్థం, దాని "ఒస్వొబొజ్దేనియె" అవగాహనలో, యిదే అని, అది యింతకుముందు "ఒస్వొబొజ్దేనియె"చేతా, స్త్రూవేచేతా ఉపయోగించబడిన పద్ధతినిబట్టి, యితర విషయాలతోపాటు తేటతెల్లంగా వుంది. "ఒస్వొబొజ్దేనియె" "వాస్తవికత" అర్థం యిదే అని "ఇస్క్రా"యే ఒప్పుకోక తప్పలేదు. ఉదాహరణకు, "ఇస్క్రా" నం. 73–74 అనుబంధంలోని "తరుణం!" అనే వ్యాసం జ్ఞాపకం చేసుకోండి. యీ వ్యాస రచయిత (రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ రెండవ మహాసభలో "ఊబి" అభిప్రాయాలను స్థిరంగా ప్రతిపాదించినవాడు) "మహాసభలో అకీమొవ్ అవకాశవాదపు నిజమైన ప్రతినిధిగా కంటే దాని ప్రేతం పాత్ర వహించినాడు" అనే అభిప్రాయాన్ని మోమోటం లేకుండా వ్యక్తంచేసినాడు. "ఇస్క్రా" సంపాదకులు ఒక గమనికలో యీకింది విధంగా ప్రకటించడంద్వారా "తరుణం!" వ్యాస రచయితను వెంటనే దిద్దవలసివచ్చింది:

> "యీ అభిప్రాయంతో యేకీభవించజాలం. కార్యక్రమంమీద క్రామేడ్ అకీమొవ్‌కు గల అభిప్రాయాలమీద అవకాశవాద ముద్ర స్పష్టంగా వుంది. యీ విష

యాన్ని 'ఒస్వొబొజ్దేనియె' విమర్శకుడు కూడా అంగీకరించినాడు; అతను — దాని ఒక యిటీవలి సంచికలో — అకీమొవ్ 'వాస్తవిక' — రివిజనిస్టు అన్నమాట — ధోరణి అనుయాయి అని ప్రకటించినాడు."

యీవిధంగా, "ఒస్వొబొజ్దేనియె" "వాస్తవికత" కేవలం అవకాశవాదమనీ, మరేమీ కాదనీ "ఇస్క్రా" స్వయంగా రుజువు చేస్తుంది. "ఉదారవాద వాస్తవికత"మీద దాడి చేయడం ("ఇస్క్రా," నం. 102)లో "ఇస్క్రా" తన వాస్తవికతకు తాను ఉదారవాదుల చేత పొగడబడడం గురించి యిప్పుడు యేమీ చెప్పకపోతే, అలాంటి పొగడ్త యే అభిశంసన కంటె కూడా చేదుగా వుండడం యీ మౌనానికి కారణం. అలాంటి పొగడ్త ("ఒస్వొబొజ్దేనియె" కేవలం యాదృచ్ఛికంగా గానీ, మొదటిసారి గానీ చేసింది కాదు) ఉదారవాద వాస్తవికతకూ, కొత్త "ఇస్క్రా"వాళ్ల మొత్తం యెత్తుగడల స్థావరంలోని పొరపాటు ఫలితంగా వాళ్ల ప్రతి తీర్మానంలోనూ స్పష్టంగా కనపడే సోషల్ డెమొక్రటిక్ "వాస్తవికత" (అవకాశవాదం అన్నమాట) ధోరణులకూ మధ్య గల సన్నిహితత్వాన్ని వాస్తవంగా రుజువుచేస్తుంది.

నిజంగా రష్యన్ బూర్జువావర్గం "యావత్ప్రజల" విప్లవంలో తన అస్థిరత్వాన్ని, దురాశనూ యిప్పటికే పూర్తిగా వెల్లడించింది — స్త్రూవె వాదాల్లోనూ, ఉదారవాద వార్తా పత్రికల్లో అధిక భాగపు మొత్తం ధోరణిలోనూ, వస్తువులోనూ, జేమ్స్త్వో సభ్యుల్లో అధిక భాగపు, మేధావులలో అధిక భాగపు దరహంమీద త్రుబెత్స్కోయ్, పెత్రుంకేవిచ్, రోదిచెవ్ అండ్ కో వాళ్ల అనుయాయు లందరి రాజకీయ ప్రకటనల స్వభావంలోనూ వెల్లడించింది. బూర్జువావర్గం యెల్లప్పుడూ స్పష్టమైన అవగాహనను వెల్లడించదనుకోండి, కానీ, మొత్తం మీద తన వర్గ అంతఃప్రవృత్తిద్వారా అది ఒకవైపున, శ్రామికవర్గమూ, "ప్రజలూ" ఫిరంగుల మేతగానూ, నిరంకుశత్వాన్ని మోదే సమ్మెటగానూ తన విప్లవానికి అవసరమనీ, కానీ, మరొకవైపున, శ్రామికవర్గమూ, విప్లవ రైతాంగమూ "జారిజంమీద నిర్ణయాత్మక విజయం" పొంది, ప్రజాతంత్ర విప్లవాన్ని పరిపూర్తిదాకా తీసుకపోతే, వాళ్లు తనకు తీవ్ర ప్రమాదకరంగా వుంటారనీ అది చాలా బాగా తెలుసుకోగలదు. అందుకనే, విప్లవంలో "మితమైన" పాత్రతో తృప్తిపడేటట్లూ, మరింత ప్రశాంత మనస్కంగా, కార్యవాదిగా, వాస్తవికంగా వుండేటట్లూ, "బూర్జువావర్గం వెనక్కిపోకుండా" అనే సూత్రంచేత దాని కార్యకలాపాలను అది నడిపించేటట్లూ శ్రామికవర్గాన్ని పురికొల్పడానికి బూర్జువావర్గం తన శాయశక్తులా కృషిచేస్తుంది.

తాము కార్మికవర్గ ఉద్యమాన్ని వదలించుకోలేమని మేధావి బూర్జువాలకు బాగా తెలుసు. అందుకనే వాళ్లు శ్రామికవర్గ ఉద్యమం అనేదానికి వ్యతిరేకంగా గానీ, శ్రామికవర్గ

వర్గపోరాటం అనేదానికి వ్యతిరేకంగా గానీ బయటికి రారు — వాళ్లు సమ్మె హక్కుకూ, సౌజన్యపూరిత వర్గపోరాటానికీ నోటిమాటల సానుభూతి కూడా చూపిస్తారు; యెందుకంటే, వాళ్లు కార్మికోద్యమాన్నీ, వర్గపోరాటాన్నీ బ్రెంటానో అర్థంలోనో, హిర్ష్—డుంకేర్ అర్థంలోనో గ్రహిస్తారు. మరొక విధంగా చెప్పాలంటే, కార్మికులు తమ "తిరుగుబాటు తత్వా"న్నీ, "సంకుచిత మనస్తత్వపు విప్లవతత్వా"న్నీ, "ఆచరణాత్మక ఉపయోగం గల రాజీల"పట్ల తమ వ్యతిరేకతనూ, "యావత్ప్రజల రష్యన్ విప్లవం"మీద తమ వర్గపోరాటపు ముద్రను, శ్రామికవర్గ స్థిరత్వమూ, శ్రామికవర్గ దీక్షా, "సామాన్యుల జాకొబినిజం" అనేవాటి ముద్రను వేయడం గురించి తమ హక్కులనూ, ఆశలనూ విసర్జిస్తే మాత్రమే, వాళ్లు కార్మికులకు సమ్మె హక్కునూ, సంస్థా స్వాతంత్ర్యాన్నీ (కార్మికులు సొంతంగా వాస్తవంలో ఇంచుమించు సాధించుకున్నవాటిని) "ఒప్పుకోడా"నికి పూర్తి సిద్ధంగా వున్నారు. అందుకనే రష్యా అంతటా మేధావి బూర్జువాలు కార్మికులకు (బూర్జువా) ప్రశాంత మనస్కతా, (ఉదారవాద) కార్యవాదమూ, (అవకాశవాద) వాస్తవికతా, (బ్రెంటానో) వర్గపోరాటమూ,[116] (హిర్ష్—డుంకేర్) ట్రేడ్‌యూనియన్లూ,[117] మొదలైన భావాలు యెక్కించడానికి శాయశక్తులా కృషిచేస్తూ, వేలకొలది మార్గాలూ, సాధనాలూ — పుస్తకాలూ,* ఉపన్యాసాలూ, సంభాషణలూ, వగైరా, వగైరా — ఉపయోగిస్తున్నారు. వర్గపోరాటమూ, ట్రేడ్‌యూనియన్లూ అనే నినాదాలు "కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రటిక్ పార్టీ"కీ, "ఒస్వొబొఝ్దేనియె" రకం పార్టీకీ చెందిన బూర్జువాలకు మరీ అనుకూలంగా వున్నాయి; యెందుకంటే, అవి రూపంలో మార్క్సిస్టు నినాదాలలాగే వుండి, కొన్ని చిన్న విషయాలు తొలగించి, స్వల్పంగా వికృతపరిస్తే సోషల్ డెమోక్రటిక్ నినాదాలుగా సులభంగా భ్రమకలిగించగలవు, ఒకోసారి సోషల్ డెమోక్రటిక్ నినాదాలుగా చలామణి కాగలవు. ఉదాహరణకు చట్టబద్ధ ఉదారవాద వార్తాపత్రిక "రస్స్వేత్"[118] (దీన్ని "ప్రొలెతారియ్" పాఠకులతో మరింత వివరంగా చర్చించడానికి యెప్పుడైనా ప్రయత్నిస్తాము) తరచుగా వర్గపోరాటం గురించీ, బూర్జువావర్గం శ్రామికవర్గాన్ని మోసగించే అవకాశం గురించీ, కార్మికోద్యమం గురించీ, శ్రామికవర్గపు చొరవ గురించీ, వగైరా, వగైరాల గురించీ యెంత "జంకులేని" విషయాలు చెప్తుందంటే, అప్రమత్తుడు గాని పాఠకుడు గానీ, వికాసవంతుడు గాని కార్మికుడు గానీ దాని "సోషల్ డెమోక్రటిజం" నిజమైనదని సులభంగా నమ్మవచ్చు. కానీ, వాస్తవంలో, అది సోషల్ డెమోక్రటిజంకు బూర్జువా అనుకరణ, వర్గపోరాట భావానికి అవకాశవాద విరూపం, వికట రూపం.

---

* చూడండి: ప్రొకొపోవిచ్, "రష్యాలో కార్మిక సమస్య."

యీ బ్రహ్మాండమైన (జనాలమీద దాని ప్రభావం దృష్ట్యా బ్రహ్మాండమైన) బూర్జువా వంచన మూలంలో ఒక ప్రేరణ వుంది, కార్మికవర్గ ఉద్యమాన్ని ప్రధానంగా ట్రేడ్‌యూనియన్ ఉద్యమంగా కుదించడానికీ, దాన్ని స్వతంత్ర విధానంనుండి (అనగా, విప్లవకరమూ, ప్రజాతంత్ర నియంతృత్వంవైపు మళ్లింపబడినదీ అయిన విధానంనుండి) వీలైనంత దూరంలో వుంచడానికీ, "కార్మికుల మనస్సులలో యావత్ప్రజల రష్యన్ విప్లవ భావాన్ని వర్గపోరాట భావం మరుగుపరచేటట్లు చేయడానికీ."

"ఒస్వొబొజ్డేనియె" సూత్రాన్ని మేము తలక్రిందులు చేసినాము – దీన్ని పాఠకుడు గ్రహిస్తాడు. యిది శ్రేష్ఠమైన సూత్రం, ప్రజాతంత్ర విప్లవంలో శ్రామికవర్గ పాత్ర మీద రెండు అభిప్రాయాలను వ్యక్తంచేసేది – బూర్జువా అభిప్రాయాన్నీ, సోషల్ డెమొక్రటిక్ అభిప్రాయాన్నీ. బూర్జువావర్గం శ్రామికవర్గాన్ని ట్రేడ్‌యూనియన్ ఉద్యమానికి పరిమితం చేయాలనీ, తద్వారా "దాని మనస్సులో యావత్ప్రజల రష్యన్ విప్లవ భావాన్ని వర్గపోరాట భావం (బ్రెంటానొ రకం) మరుగుపరచేటట్లు చేయా"లనీ కోరుతుంది – పూర్తిగా, కార్మికుల మనస్సులలో "శుద్ధ కార్మికవర్గ ఉద్యమ" భావం రాజకీయ పోరాట భావాన్ని మరుగుపరచేటట్లు చేయడానికి ప్రయత్నించిన Credoయొక్క బెర్న్‌స్టైనియన్ రచయితల తత్వంలో తద్వ్యతిరేకంగా, సోషల్ డెమొక్రటిక్ పార్టీ కార్మికవర్గపు వర్గపోరాటాన్ని యావత్ప్రజల రష్యన్ విప్లవంలో నాయకత్వ స్థానానికి అభివృద్ధి చేయాలని కోరుతుంది – అనగా, ఆ విప్లవాన్ని శ్రామికవర్గపు, రైతాంగపు ప్రజాతంత్ర నియంతృత్వానికి తీసుకపోవాలని కోరుతుంది.

బూర్జువావర్గం శ్రామికవర్గానికి యిలా చెపుతుంది: మన దేశంలో విప్లవం యావత్ప్రజల విప్లవం. కనుక, ఒక ప్రత్యేక వర్గంగా మీరు మీ వర్గపోరాటానికి పరిమితం కావాలి; "లోక జ్ఞానం" పేరుమీద మీరు మీ శ్రద్ధను ప్రధానంగా ట్రేడ్‌యూనియన్లకూ, వాటి చట్టబద్ధీకరణకూ అర్పించాలి; యీ ట్రేడ్‌యూనియన్లను "మీ రాజకీయ శిక్షణలోనూ, సంస్థా నిర్మాణంలోనూ అత్యంత ముఖ్యమైన ప్రారంభక విషయం"గా పరిగణించాలి, విప్లవ సన్నివేశంలో మీరు అధిక భాగం కొత్త "ఇస్క్రా" తీర్మానంలాంటి "సుష్టైన" తీర్మానాలు రచించాలి; "ఉదారవాదులకు మరింత అనుకూలంగా వున్న" తీర్మానాలను మీరు లక్ష్యం చేయాలి; "కార్మికవర్గపు నిజమైన రాజకీయ ఉద్యమ ఆచరణాత్మక నాయకులు" అయ్యే ధోరణి గల నాయకులను మీరు కోరుకోవాలి; మీరు "మార్క్సిస్టు ప్రపంచ దృక్పథంలోని వాస్తవిక అంశాలను పదిలపరచాలి (దురదృష్టవశాత్తూ మీకు యిప్పటికే యీ "అశాస్త్రీయ" నీతిశతకపు "కఠిన సూత్రాల" జాడ్యం సోకివుంటే).

సోషల్ డెమోక్రట్లు శ్రామికవర్గానికి యిలా చెపుతారు: మన దేశంలో విప్లవం యావత్ప్రజల విప్లవం. కనుక అత్యంత ప్రగతిశీలమైన, ఒకేఒక ఆమూలాగ్రంగా విప్లవ కరమైన వర్గంగా మీరు దానిలో అత్యంత చురుకైన పాత్ర మాత్రమే కాక, నాయక పాత్ర కూడా నిర్వహించడానికి ప్రయత్నించాలి. కనుక మీరు ప్రధానంగా ట్రేడ్‌యూనియన్ ఉద్యమంగా అర్థం చేసుకోబడిన వర్గపోరాటపు సంకుచితంగా ఊహించబడిన చట్రంలోపల పరిమితం కాకూడదు; తద్వ్యతిరేకంగా, మీ వర్గపోరాటంలో యీనాటి యావత్ప్రజల ప్రజా తంత్ర రష్యన్ విప్లవపు సకల లక్ష్యాలూ మాత్రమే కాక, తదనంతర సోషలిస్టు విప్లవ లక్ష్యాలు కూడా చేరేటట్లుగా, దాని చట్రాన్నీ, వస్తువునూ విస్తృతపరచడానికి మీరు ప్రయ త్నించాలి. కనుక ట్రేడ్‌యూనియన్ ఉద్యమాన్ని ఉపేక్షించకుండా, అత్యంత స్వల్పమైన చట్టబద్ధ అవకాశాలనైనా వినియోగించుకోడానికి నిరాకరించకుండా మీరు విప్లవ కాలంలో, జారిజంమీద ప్రజల సంపూర్ణ విజయానికీ, ప్రజాతంత్ర రిపబ్లిక్‌నూ, నిజమైన రాజకీయ స్వేచ్ఛనూ సాధించడానికీ ఏకైక మార్గంగా, సాయుధ తిరుగుబాటుయొక్క, విప్లవ సైన్య, విప్లవ ప్రభుత్వ నిర్మాణంయొక్క కర్తవ్యాలను ముందుకు తేవాలి.

కొత్త "ఇస్క్రా" తీర్మానాలు, తమ పొరపాటు పంథా మూలంగా, యీ సమస్య మీద తీసుకున్న అర్ధ మనస్కపు, అస్థిర వైఖరిని గురించి, సహజంగానే బూర్జువావర్గానికి అంత అనుకూలమైనదాన్ని గురించి, మాట్లాడడం అనవసర మౌతుంది.

## II. కామ్రేడ్ మర్తీనొవ్ సమస్యను మళ్లీ "ప్రగాఢం" చేస్తున్నాడు

"ఇస్క్రా" 102, 103 సంచికలలోని మర్తీనొవ్ వ్యాసాలకు వెళ్దాం. ఎంగెల్స్, మార్క్సులనుండి యిచ్చిన కొన్ని ఉల్లేఖనలకు మన వ్యాఖ్యానం తప్పు అనీ, తన వ్యాఖ్యానం సరి అనీ రుజువుచేయడానికి మర్తీనొవ్ చేసిన ప్రయత్నాలకు, సహజంగానే, మేము జవాబు యివ్వం. యీ ప్రయత్నాలు యెంత చిల్లరగా వున్నాయంటే, మర్తీనొవ్ జిత్తులు యెంత తేటతెల్లంగా వున్నాయంటే, సమస్య యెంత స్పష్టంగా వుందంటే, యీ అంశాన్ని మళ్లీ చర్చించడం యేమీ ఆసక్తికరంగా వుండదు. "పని క్రమంలో బకూనినిస్టులు" అనే ఎంగెల్స్ రచనకూ, "కమ్యూనిస్టు లీగుకు కేంద్ర కమిటీ విజ్ఞప్తి" అనే 1850 మార్చి నాటి మార్క్సు రచనకూ[119] పూర్తి అనువాదాలు, "ప్రొలెతారియ్" బృందం యిప్పుడు తయారు చేసేవి, ప్రచురింపబడినప్పుడు మర్తీనొవ్ తన సంపూర్ణ తిరోగమనంలో ఉప

యోగించిన సరళమైన పన్నాగాలను ఆలోచనాశీలి అయిన ప్రతి పాఠకుడూ సులభంగా గుర్తుపట్టగలడు. మర్తీనొవ్ తిరోగమనాన్ని పాఠకునికి స్పష్టపరచడానికి అతని వ్యాసం నుండి ఒక్క ఉల్లేఖన యిస్తే చాలు.

103వ సంచికలో మర్తీనొవ్ యిలా అన్నాడు: "తాత్కాలిక ప్రభుత్వాన్ని నెలకొల్పడం విప్లవాన్ని ముందుకు తీసుకెళ్లడానికి వీలైన, అవసరమైన మార్గమని 'ఇస్క్రా' ఒప్పుకుంటుంది, కానీ సరిగ్గా భవిష్యత్తులో సోషలిస్టు విప్లవం కొరకు రాజ్య యంత్రాంగంమీద సంపూర్ణమైన అజమాయిషీ సంపాయించగలగడానికి సోషల్ డెమోక్రట్లు బూర్జువా తాత్కాలిక ప్రభుత్వంలో పాల్గొనే అవసరాన్ని నిరాకరిస్తుంది." అనగా, ఖజానాకూ, బాంకులకూ విప్లవ ప్రభుత్వ బాధ్యతను గురించీ, "జైళ్లూ," వగైరాలను స్వాధీనపరచుకోవడంలోని ప్రమాదం గురించీ, అసాధ్యతను గురించీ తనకు గల భయాలన్నీ అసంబద్ధమైనవని "ఇస్క్రా" యిప్పుడు అంగీకరిస్తోంది. కానీ, "ఇస్క్రా" గతంలో లాగే విషయాలను గందరగోళపరుస్తోంది, ప్రజాతంత్ర నియంతృత్వమూ, సోషలిస్టు నియంతృత్వమూ ఒకటిగా తికమక పడుతోంది. యీ గందరగోళం అనివార్యం; తిరోగమనాన్ని మరుగుపరచడానికి యిదొక మార్గం.

కానీ, కొత్త "ఇస్క్రా"కు చెందిన తికమక బుర్రలలో మర్తీనొవ్ తికమక బుర్ర నం. 1గా ముందుకొచ్చినాడు – కావలిస్తే ప్రతిభాన్వితుడైన తికమక బుర్ర అనవచ్చు. సమస్యకు "ప్రగాఢత్వం" యివ్వడానికి శ్రమపడి చేసే ప్రయత్నాలతో దానిని గందరగోళపరచడంద్వారా అతను తాను తీసుకున్న వైఖరియొక్క బూటక మంతటినీ బట్టబయలుచేసే కొత్త సూత్రీకరణలవద్దకు అనివార్యంగా "చేరుతాడు." "ఆర్థికవాదపు" రోజుల్లో అతను యెలా స్లెహొనొవ్‌ను "మరింత ప్రగాఢం" చేసిందీ, "యజమానులతోనూ, ప్రభుత్వంతోనూ ఆర్థిక పోరాటం" అనే సూత్రాన్ని యెలా సృష్టించిందీ జ్ఞాపకం చేసుకోండి. యీ ధోరణి యొక్క బూటకాన్ని వ్యక్తంచేయడానికి "ఆర్థికవాదుల" రచనలన్నిటిలోను దీనిని మించినది లేదు. యీనాడు కూడా అంతే. మర్తీనొవ్ కొత్త "ఇస్క్రా"కు పట్టుదలతో సేవ చేస్తాడు, దాదాపు నోరు తెరిచిన ప్రతిసారీ అతను కొత్త "ఇస్క్రా" బూటకపు వైఖరిని అంచనావేయడానికి కొత్త, శ్రేష్ఠమైన సమాచారం మనకు అందిస్తాడు. లెనిన్ "నిగూఢంగా విప్లవ భావం స్థానంలో నియంతృత్వ భావాన్ని పెట్టినాడు" అని అతను 102వ సంచిక (పుట 3, కాలం 2)లో అన్నాడు.

మొత్తంమీద కొత్త "ఇస్క్రా"వాళ్లు మనమీద చేసిన అభియోగాలన్నిటినీ యీ అభియోగానికి కుదించవచ్చు. అయితే యీ అభియోగానికిగాను మనం మర్తీనొవ్‌కు కృతజ్ఞులం! అతను యీవిధంగా తన అభియోగాన్ని సూత్రీకరించడం ద్వారా, కొత్త "ఇస్క్రా"

భావాలతో చేసే పోరాటంలో మనకు అత్యంత అమూల్యమైన సేవ చేసినాడు! "ప్రొలెతారియ్"మీద దాడులను "మరింత ప్రగాఢం" చేయడానికీ, యీ దాడులను "నిజంగా సూత్రబద్ధంగా" సూత్రీకరించడానికీ మర్తీనావ్‌ను మరింత తరుచుగా మనమీదికి వుసికొల్పాలని మనం "ఇస్క్రా" సంపాదకులను తప్పక ప్రార్థించాలి. యెందుకంటే, మర్తీనావ్ సూత్రాల స్థాయిలో వాదించడానికి యెంత శ్రమపడితే, అంత హీనంగా అతని వాదాలు కనిపిస్తాయి. కొత్త "ఇస్క్రా" ధోరణిలోని వెలుతులను యెంత స్పష్టంగా అతను వెల్లడిస్తే, అంత విజయవంతంగా అతను అసంబద్ధతకు కుదించడం (reductio ad absurdum) అనే ఉపయోగకరమైన అధ్యాపన చర్యను నిర్వహిస్తాడు (కొత్త "ఇస్క్రా" సూత్రాలను అసంబద్ధతకు కుదిస్తూ).

"వ్పెర్యోద్," "ప్రొలెతారియ్" నియంతృత్వ భావాన్నీ, విప్లవ భావాన్నీ "ఒకదాని స్థానంలో మరొకటి పెట్టగలిగినవిగా" ఉపయోగిస్తాయి. "ఇస్క్రా" అలాంటి "ఒకదాని స్థానంలో మరొకటి పెట్టగలగడాన్ని" కోరదు. అంతే, అత్యంత గౌరవనీయమైన కామ్రేడ్ మర్తీనావ్! మీకు తెలియకుండానే మీరు గొప్ప సత్యం చెప్పినారు. "ఇస్క్రా" విప్లవానికి వెనుక బడుతున్నదనీ, తన కర్తవ్యాలకు "ఒస్వొబొజ్దేనియె" యిచ్చే సూత్రీకరణలోకి వైదొలగుతున్నదనీ, కాగా "వ్పెర్యోద్," "ప్రొలెతారియ్" ప్రజాతంత్ర విప్లవాన్ని ముందుకు తీసుకపోయే నినాదాలు యిస్తున్నాయనీ మేము చెప్పే వాదాన్ని యీ కొత్త సూత్రీకరణతో మీరు ధ్రువపరిచినారు.

యిది అర్థం కాని విషయమా, కామ్రేడ్ మర్తీనావ్? యీ సమస్య ప్రాముఖ్యం దృష్ట్యా, మీకు సవివరమైన వివరణ యివ్వడానికి ప్రయత్నిస్తాం.

వ్యక్తిగత ఆస్తినీ, విక్రయ సరుకుల ఉత్పత్తినీ గుర్తించడానికి పూర్తి అనుకూలమైనవీ, యీ హద్దులను దాటిపోజాలనివీ అయిన కొన్ని సామాజిక వర్గాలూ, బృందాలూ, పౌరలూ పరిస్థితుల ఒత్తిడిచేత, నిరంకుశత్వంయొక్కా, దరహంమీద మొత్తం ఫ్యూడల్ వ్యవస్థయొక్కా నిరుపయోగత్వాన్ని గుర్తించేటట్లూ, స్వేచ్ఛ కొరకు చేసే డిమాండులో కలిసేటట్లూ నిర్బంధింపబడతాయనే వాస్తవంలో, యితర విషయాల్లో లాగే, ప్రజాతంత్ర విప్లవపు బూర్జువా స్వభావం వ్యక్తమౌతుంది. "ఉన్నత సమాజం"చేత డిమాండుచేయబడుతూ, భూస్వాములచేతా, పెట్టుబడిదార్లచేతా మాటల (కేవలం మాటల!) వెల్లువలో ప్రచారం చేయబడే యీ స్వేచ్ఛయొక్క బూర్జువా స్వభావం అంతకంతకూ స్పష్టంగా వ్యక్తమౌతోంది. అదే సమయంలో, స్వేచ్ఛ కొరకు కార్మికులు చేసే పోరాటానికీ, బూర్జువావర్గం చేసే పోరాటానికీ మధ్య, శ్రామికవర్గ ప్రజాస్వామ్యతత్వానికీ; ఉదారవాద ప్రజాస్వామ్యతత్వానికీ మధ్య, గల మౌలిక భేదం యెక్కువ దృగ్గోచర మౌతున్నది. కార్మికవర్గమూ, దాని వర్గచైతన్య

పూరిత ప్రతినిధులూ ముందుకు పురోగమిస్తూ, యీ పోరాటాన్ని ముందుకు తీసుక పోతున్నారు; దాన్ని పరిపూర్తిదాకా తీసుకపోవడానికి భయపడకుండా మాత్రమే కాదు, ప్రజా తంత్ర విప్లవంయొక్క అత్యంత దూరపు అవధులను దాటి చాలా ముందుకు పోవడానికి కూడా ప్రయత్నిస్తున్నారు. అస్థిరమూ, స్వార్థపూరితమూ అయిన బూర్జువావర్గం స్వేచ్ఛా నినాదాలను వంచనతో, పాక్షికంగా మాత్రమే అంగీకరిస్తుంది. యేదో ఒక నిర్దిష్ట రేఖ ద్వారా, లేక నిర్దిష్ట "అంశాలను" పట్టీకట్టడం ద్వారా (స్త్రువేర్ తీర్మానం, లేదా కాన్స రెన్సు తీర్మానంలోని వాటిలాగా), యే హద్దులకు అవల స్వేచ్ఛయొక్క బూర్జువా మిత్రుల యీ వంచన, లేదా స్వేచ్ఛకు దాని బూర్జువా మిత్రులు చేసే యీ ద్రోహం ప్రారంభమ య్యేదీ నిర్ణయించడానికి చేసే ప్రయత్నాలన్నీ అనివార్యంగా విఫలమౌతాయి. యెందుకంటే, బూర్జువావర్గం (నిరంకుశత్వంయొక్కా, కార్మికవర్గంయొక్కా) రెండు కాల్పుల మధ్య చిక్కు కొన్నట్టిది, ఒక అంగుళం యెడమకూ, ఒక అంగుళం కుడికీ జరగడంద్వారా సర్దు కుంటూ, నిత్యం బేరమాడుతూ, వేయి మార్గాలద్వారా తన స్థానాన్నీ, నినాదాలనూ మార్చుకోగలదు. శ్రామికవర్గ ప్రజాస్వామ్యతత్వంయొక్క కర్తవ్యం అలాంటి నిర్జీవపు "అంశా లను" సృష్టించడం కాదు; అది అభివృద్ధి అయ్యే రాజకీయ సన్నివేశాన్ని నిరంతరం విమర్శిం చడం, బూర్జువావర్గపు నిత్య నూతన, అనూహ్య అస్థిరత్వాలనూ, ద్రోహాలనూ బట్టబయలు చేయడం.

రహస్య సారస్వతంలో స్త్రూవె రాజకీయ ప్రకటనల చరిత్రను, అతనితో సోషల్ డెమో క్రసీ చేసిన యుద్ధపు చరిత్రను, జ్ఞాపకం చేసుకోండి, శ్రామికవర్గ ప్రజాస్వామ్యతత్వపు రక్షకుడైన సోషల్ డెమోక్రసీ యీ కర్తవ్యాలను యెలా నిర్వహించిందీ మీకు స్పష్టంగా కనపడుతుంది. స్త్రూవె శుద్ధ షీపావ్ నినాదంతో ప్రారంభించినాడు: "హక్కులూ, అధికారయుత జెమ్‌స్త్వో" ("జర్యా"లోని "జెమ్‌స్త్వో ప్రాసెక్యూటర్లూ, ఉదారవాదపు హన్నిబాలులూ" అనే నా వ్యాసం చూడండి). సోషల్ డెమోక్రసీ అతన్ని బహిర్గతంచేసి, ఖండించి నిశ్చితంగా రాజ్యాంగవాదపుదైన కార్యక్రమంవైపు తరిమింది. విప్లవ ఘటనల మరీ సత్వరమైన పురోగతి ధర్మమా అని యీ "త్రోపుళ్లు" పనిచేసినప్పుడు, పోరాటం ప్రజాస్వామ్యతత్వపు తరువాతి సమస్యకు మారింది: సాధారణంగా ఒక రాజ్యాంగం మాత్రం కాక, సార్వజనీన, సమాన వోటుహక్కుకూ, ప్రత్యక్ష యెన్నికలకూ, రహస్య వోటుకూ వీలుకలిగించే రాజ్యాంగం. మనం "శత్రువు"నుండి యీ కొత్త స్థావరాన్ని "పట్టుకున్న ప్పుడు" ("ఒస్వొబొజ్దేనియె లీగు" సార్వజనీన వోటుహక్కును అవలంబించడం), మనం మరింత నొక్కడం ప్రారంభించినాము; మనం రెండు సభల వ్యవస్థ వంచననూ, బూటకాన్నీ, "ఒస్వొబొజ్దేనియె లీగు" వాళ్లు సార్వజనీన వోటుహక్కును పూర్తిగా గుర్తించకపోవ

డాన్నీ బట్టబయలుచేసి ఖండించినాం; మనం వాళ్ల రాజరికవాదాన్ని చూపించి, వాళ్ల ప్రజా స్వామ్యతత్వంలోని మోసపు వర్తకుని స్వభావాన్ని, లేదా, మరొకవిధంగా చెప్పాలంటే, డబ్బు పంచుల "ఒస్వొబొజ్దేనియె" వీరులు రష్యన్ మహా విప్లవ ప్రయోజనాలను అమ్మివేయడాన్ని, బట్టబయలుచేసి, ఖండించినాం.

చివరి విషయం, నిరంకుశత్వపు మొండితనమూ, అంతర్యుద్ధపు ప్రచండమైన పురోగతీ, రాజరికవాదులు రష్యాను యే స్థితిలోకి తోసినారో ఆ స్థితి హీనత్వమూ మహా మొద్దు బుర్రలలోకి కూడా యెక్కడం ప్రారంభమైంది. విప్లవం వాస్తవం అయింది. విప్లవాన్ని గుర్తించడానికి విప్లవకారుడవడం అవసరంలేదు. నిరంకుశ ప్రభుత్వం వాస్తవంగా మన కన్నుల ముందు విచ్ఛిన్నమౌతూవుండింది. చట్టబద్ధ పత్రికల్లో ఒకానొక ఉదారవాది (గ్రెదె స్క్యూల్) అన్నట్లు, యీ ప్రభుత్వంపట్ల వాస్తవమైన అవిధేయత ప్రారంభమైంది. నిరంకుశత్వం, శక్తివంతమైనట్లు కనిపిస్తున్నప్పటికీ, శక్తిహీనమని రుజువైంది; వర్ధమాన విప్లవంలోని ఘటనలు సజీవంగా కుళ్లిపోతున్న యీ పరభాగ్యోపజీవన యంత్రాంగాన్ని కేవలం పక్కకు తోసివేయడం ప్రారంభించినాయి. సంబంధాలు వాస్తవంలో రూపుదాలు స్తుండగా వాటిమీద తమ కార్యకలాపాలను (మరింత సరిగా చెప్పాలంటే తమ మోసపు రాజ కీయ బేరాలను) ఆధారపరచవలసివచ్చిన ఉదారవాద బూర్జువాలు విప్లవాన్ని గుర్తించవలసిన అవసరాన్ని తెలుసుకోవడం ప్రారంభించినారు. వాళ్లు అలా చేసేది విప్లవకారులైనందువల్ల కాదు, విప్లవకారులు కాకపోయినప్పటికీ. వాళ్లు అలా చేసేది విధిలేక, తమ యిష్టానికి వ్యతి రేకంగా, విప్లవ విజయాన్ని కోపంతో చూస్తూ, బేరం కుదిరించుకోవాలని కాక, జీవన్మ రణ పోరాటం చేయాలని కోరే నిరంకుశత్వంమీద విప్లవతత్వపు నింద వేస్తూ. పుట్టుకతో మోసపు వర్తకులు గనుక వాళ్లు పోరాటాన్నీ, విప్లవాన్నీ ద్వేషిస్తారు, కానీ పరిస్థితులు వాళ్లను విప్లవ భూమిమీద నిలబడేటట్లు నిర్బంధిస్తాయి, వాళ్ల కాళ్లకింద మరొక భూమి యేదీ లేదు గనుక.

మనకు మహా విజ్ఞానదాయకమైన, మహా వినోదకరమైన దృశ్యం కనిపిస్తున్నది. బూర్జువా ఉదారవాద సానులు విప్లవ దుస్తులు ధరించడానికి ప్రయత్నిస్తున్నారు. "ఒస్వొబొజ్దేనియె"వాళ్లు — risum teneatis, amici!* — "ఒస్వొబొజ్దేనియె"వాళ్లు విప్లవం పేరుమీద మాట్లాడడం ప్రారంభిస్తున్నారు! వాళ్లు "విప్లవానికి భయపడడం లేదు" అని ("ఒస్వొబొజ్దేనియె," నం. 72లో స్త్రూవె) మనకు నమ్మజెప్పడం ప్రారం భిస్తున్నారు!!! "విప్లవ అగ్రభాగాన వుంటా"మని వాళ్లు చెప్పుకుంటున్నారు!!!

---

* మిత్రులారా, నవ్వు అణచుకోండి! — సం.

యిది అత్యంత ముఖ్యమైన ఘటన — బూర్జువా ఉదారవాదపు పురోగతిని మాత్రమే కాక, అంతకంటె యెక్కువగా, తనను గుర్తించేటట్లు నిర్బంధించిన విప్లవోద్యమపు నిజమైన విజయాల పురోగతిని కూడా సూచిస్తుంది. విప్లవ పక్షాన నిలబడడం తనకు యెక్కువ అనుకూలమని బూర్జువావర్గానికి కూడా అనిపించడం మొదలైంది; యెందుకంటే నిరంకుశత్వం అంతగా పడిపోయేటట్లుంది. కానీ, మరొకవైపున, మొత్తం ఉద్యమం చేరిన కొత్త, ఉన్నత స్థాయిని సూచించే యీ ఘటన మనకు కొత్త, ఉన్నత కర్తవ్యాలను పెడుతున్నది కూడా. విప్లవాన్ని బూర్జువావర్గం గుర్తించడం చిత్తశుద్ధితో కూడినదిగా వుండజాలదు, బూర్జువా సిద్ధాంతవేత్తల వ్యక్తిగత నిజాయితీ యెలా వున్నప్పటికీ. ఉద్యమపు యీ ఉన్నత దశలోకి కూడా బూర్జువావర్గం స్వార్థాన్నీ, అస్థిరత్వాన్నీ, బేరమాడే తత్వాన్నీ, చిల్లర ప్రగతి వ్యతిరేక జిత్తులనూ తేకతప్పదు. మన కార్యక్రమం పేరుమీద, మన కార్యక్రమాన్ని విస్తృతపరుస్తూ యిప్పుడు మనం విప్లవపు తక్షణ నిర్దిష్ట కర్తవ్యాలను మరో విధంగా రూపొందించాలి. నిన్న చాలినది యీనాడు చాలదు. బహుశా నిన్న విప్లవాన్ని గుర్తించాలనే డిమాండు పురోగామి ప్రజాతంత్ర నినాదంగా సరిపోయింది. యీనాడు అది చాలదు. ప్రూవె కూడా విప్లవాన్ని గుర్తించేటట్లు అది నిర్బంధించింది. పురోగామి వర్గం యిప్పుడు యీ విప్లవపు జరూరైన, అత్యవసరమైన కర్తవ్యాలలోని సారాన్నే కచ్చితంగా నిర్వచించాలి. ప్రూవెలు ఒకవైపున విప్లవాన్ని గుర్తిస్తూ, మరొకవైపున మళ్లీమళ్లీ తమ గాడిద చెవులను వెళ్లబెడతారు, శాంతియుత పర్యవసానపు అవకాశం గురించీ, అధికారం తీసుకొమ్మని "ఒస్వొబొజ్దేనియె" బృందాన్ని నికొలస్ పిలవడం గురించీ, వగైరా, వగైరాల గురించి పాత పాట పాడతారు. "ఒస్వొబొజ్దేనియె"వాళ్లు విప్లవాన్ని గుర్తించేది దాన్ని నిర్వీర్యపరచడానికీ, వాళ్లకు అది మరింత సురక్షితంగా వుండేటట్లు దానికి ద్రోహం చేయడానికీ. "విప్లవం" అనే నినాదపు అరకొరతనాన్ని శ్రామికవర్గానికీ, యావత్ప్రజలకూ చూపించడం యిప్పుడు మన కర్తవ్యం; విప్లవ సారానిదే స్పష్టమైన, అసందిగ్ధమైన, స్థిరమైన, కృతనిశ్చయమైన నిర్వచనాన్ని కలిగివుండడం యెంత అవసరమైందీ మనం చూపించాలి. విప్లవపు నిర్ణయాత్మక విజయాన్ని నిర్దుష్టంగా వ్యక్తంచేయగల ఒకేఒక నినాదం యీ నిర్వచనాన్ని అందిస్తుంది — శ్రామికవర్గపు, రైతాంగపు విప్లవ ప్రజాతంత్ర నియంతృత్వ నినాదం.

మాటల దుర్వినియోగం రాజకీయాల్లో మామూలు విషయం. ఉదాహరణకు, "సోషలిస్టులం" అని యింగ్లీషు బూర్జువా ఉదారవాదపు మద్దతుదార్లూ ("We all are socialists now"* అని గర్‌కోర్ట్ అన్నాడు), బిస్మార్క్ మద్దతుదార్లూ,

* "యిప్పుడు మనమందరమూ సోషలిస్టులం." — సం.

పోపు 13వ లియో మిత్రులూ పిలుచుకునేవారు. "విప్లవం" అనే పదం కూడా దుర్వినియోగానికి పూర్తిగా లోబడుతుంది; ఉద్యమాభివృద్ధిలోని ఒకానొక దశలో అలాంటి దుర్వినియోగం అనివార్యం. స్త్రూవె విప్లవం పేరుమీద మాట్లాడడం ప్రారంభించినప్పుడు, త్యేర్ మనకు జ్ఞాపకం రాక తప్పలేదు. ఫిబ్రవరి విప్లవానికి కొద్ది రోజులు ముందు యీ భయంకర భూతం, యీ అత్యంత సమగ్రంగా మూర్తీభవించిన బూర్జువావర్గపు రాజకీయ నీచత్వం, ప్రజలలో తుఫాను సిద్ధమౌతున్నదని పసిగట్టి, తాను విప్లవ పార్టీకి చెందినట్లు పార్లమెంటులో ప్రకటించినాడు! (చూ: మార్క్స్, "ఫ్రాన్సులో అంతర్యుద్ధం.") విప్లవ పార్టీలో "ఒస్వొబొజ్డేనియె" చేరిక రాజకీయ ప్రాముఖ్యం సరిగ్గా త్యేర్ చేరిక లాంటిదే. రష్యన్ త్యేర్‌లు తాము విప్లవ పార్టీకి చెందడం గురించి మాట్లాడినప్పుడు, దాని అర్థం విప్లవ నినాదం అరకొరగా మారిందనీ, అర్థరహితమనీ, విప్లవం ఒక వాస్తవమై, అత్యంత భిన్నమైన శక్తులు దాని పక్షానికి పోతున్నాయి గనుక యే కర్తవ్యాలనూ నిర్ణయించదనీ.

మార్క్సిస్టు దృక్పథంనుండి విప్లవం అంటే యేమిటి? కాలం తీరిన రాజకీయ ఉపరి నిర్మాణాన్ని, దేనికీ కొత్త ఉత్పత్తి సంబంధాలకూ మధ్యన గల వైరుధ్యం ఒకానొక తరుణంలో దాని పతనాన్ని కలిగించిందో ఆ ఉపరినిర్మాణాన్ని, బలవంతంగా ధ్వంసం చేయడం. యిటు నిరంకుశత్వానికీ అటు పెట్టుబడిదారీ రష్యాయొక్క యావత్తు వ్యవస్థకూ, దాని బూర్జువా ప్రజాతంత్ర అభివృద్ధి సమస్త అవసరాలకూ మధ్య గల వైరుధ్యం యిప్పుడు దాని పతనాన్ని కలిగించింది; యీ వైరుధ్యం చాలా కాలం కృత్రిమంగా అణచిపెట్టబడినందున ఆ పతనం మరింత తీవ్రంగా వుంది. ఉపరినిర్మాణం ప్రతి కీలువద్దా చీలుతోంది, ఒత్తిడికి లొంగుతోంది, బలహీన మవుతోంది. అత్యంత భిన్నమైన వర్గాల, బృందాల ప్రతినిధులద్వారా ప్రజలు, తమ సొంత కృషితో, తామే యిప్పుడు ఒక కొత్త ఉపరినిర్మాణాన్ని నిర్మించుకోవాలి. అభివృద్ధియొక్క ఒకానొక దశలో, పాత ఉపరినిర్మాణపు నిరుపయోగత్వం అందరికీ తేటతెల్ల మౌతుంది, విప్లవం అందరిచేతా గుర్తింపబడుతుంది. యిప్పుడు కర్తవ్యం యేమిటంటే, యే వర్గాలు కొత్త ఉపరినిర్మాణాన్ని నిర్మించవలసిందీ, యెలా నిర్మించవలసిందీ నిర్వచించడం. యిది నిర్వచించబడకపోతే, విప్లవ నినాదం ప్రస్తుత సమయంలో వుత్తది, అర్థం లేనిది; యెందుకంటే, నిరంకుశత్వపు దుర్బలత్వం గ్రాండ్ డ్యూకులను కూడా, "మస్కోవ్‌స్కియె వేదొమొస్తి"[120]ని కూడా విప్లవకారులనుగా చేస్తున్నది! యిది నిర్వచించబడకపోతే, పురోగామి వర్గపు పురోగామి ప్రజాతంత్ర కర్తవ్యాల గురించిన ప్రసక్తి వుండజాలదు. "శ్రామికవర్గపు, రైతాంగపు ప్రజాతంత్ర నియంతృత్వం" అనే నినాదం ఆ నిర్వచనాన్ని సమకూరుస్తుంది. కొత్త ఉపరినిర్మాణపు కొత్త "నిర్మాతలు" ఆధారపడగల,

ఆధారపడవలసిన వర్గాలనూ, కొత్త ఉపరినిర్మాణపు స్వభావాన్నీ (సోషలిస్టు నియంతృత్వం కంటె భిన్నమైన "ప్రజాతంత్ర" నియంతృత్వం), దాన్ని యెలా నిర్మించవలసిందీ (నియంతృత్వం — అనగా బలంతో చేసే ప్రతిఘటనను బలవంతంగా అణచివేయడమూ, ప్రజల్లోని విప్లవ వర్గాలను సాయుధం చేయడమూ) యీ నినాదం నిర్వచిస్తుంది. యీ విప్లవ ప్రజాతంత్ర నియంతృత్వ నినాదాన్ని — విప్లవ సైన్యమూ, విప్లవ ప్రభుత్వమూ, విప్లవ రైతు కమిటీలూ అనే నినాదాన్ని — యిప్పుడు గుర్తించడానికి నిరాకరించేవా డెవడైనా విప్లవ కర్తవ్యాలను గ్రహించడంలో పూర్తిగా విఫలమై, ప్రస్తుత పరిస్థితి సృష్టించిన కొత్త, ఉన్నత కర్తవ్యాలను నిర్వచించడానికి అశక్తుడుగా నైనా వుండాలి, లేదా "విప్లవం" అనే నినాదాన్ని దుర్వినియోగపరుస్తూ ప్రజలను మోసగించి విప్లవానికి ద్రోహంచేస్తూ నేనా వుండాలి.

కామ్రేడ్ మర్తీనొవూ, అతని మిత్రులూ మొదటి రకానికి ఉదాహరణ, స్త్రూవే, "కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రటిక్" జేమ్‌స్త్వో పార్టీ సమస్తమూ రెండవ రకానికి ఉదాహరణ.

కామ్రేడ్ మర్తీనొవ్ యెంత తెలివిపరుడుగా, కుశాగ్రబుద్ధిగా వుండినాడంటే, సరిగ్గా విప్లవ కర్తవ్యాలు నియంతృత్వ నినాదంచేత నిర్వచింపబడాలని విప్లవాభివృద్ధి అపేక్షించిన సమయంలో నియంతృత్వ భావాన్నీ, విప్లవ భావాన్నీ మనం "ఒకదాని స్థానంలో మరొకటి పెట్టగలిగినవిగా" చేసినామని అతను మనల్ని నిందించినాడు! కామ్రేడ్ మర్తీనొవ్ వెనుక వదలివేయబడేటంతగా, చివరి దశకంటె ముందు దశలో, "ఒస్వొబొజ్దేనియె" యే స్థాయిని అందుకున్నదో ఆ స్థాయిలో, దారి కోల్పోయేటంతగా మళ్లీ దురదృష్టవంతుడుగా వుండినాడు, "విప్లవాన్ని" (మాటల్లో) గుర్తించడమూ, శ్రామికవర్గపు, రైతాంగపు ప్రజాతంత్ర నియంతృత్వాన్ని (అనగా చేతల్లో విప్లవాన్ని) గుర్తించడానికి నిరాకరించడమూ యీనాడు "ఒస్వొబొజ్దేనియె" రాజకీయ వైఖరిని తీసుకోవడంతో సమానం, అనగా ఉదారవాద రాజరికవాద ప్రయోజనాలకు అనుగుణంగా వుంటుంది. స్త్రూవె ద్వారా యిప్పుడు ఉదారవాద బూర్జువావర్గం విప్లవానికి అనుకూలంగా మాట్లాడుతోంది. విప్లవ సోషల్ డెమోక్రట్లద్వారా వర్గచైతన్యపూరిత శ్రామికవర్గం శ్రామికవర్గపు, రైతాంగపు నియంతృత్వాన్ని డిమాండుచేస్తున్నది. మరి యీ దశలో కొత్త "ఇస్క్రా" ప్రబుద్ధుడు వివాదంలో జోక్యం కలిగించుకొని, "నియంతృత్వ భావాన్నీ, విప్లవ భావాన్నీ ఒకదాని స్థానంలో మరొకటి పెట్టకండి!" అని నోరు చించుకుంటున్నాడు. కొత్త "ఇస్క్రా"వాళ్లు తీసుకున్న తప్పు వైఖరి వాళ్లు "ఒస్వొబొజ్దేనియె" ధోరణి తోకవద్ద నిత్యం దేకుతూ వుండేటట్లు వాళ్ల నొసట రాసిందనే మాట నిజం కాదా?

"ఒస్వొబొజ్దేనియె"వాళ్ళ ప్రజాస్వామ్యతత్వాన్ని గుర్తించే విషయంలో ఒక్కొక్క మెట్టే (సోషల్ డెమోక్రట్ల వెనుకనుండి పొడవకుండా కాదు) యెక్కుతున్నారని మేము చూపించినాము. మొదట మనమధ్య వివాదాంశం యేమిటంటే: షిపొవిజమా (హక్కులూ, అధికారయుత జెమ్‌స్త్వొ), లేక రాజ్యాంగవాదమా? తరువాత అది: పరిమిత వోటుహక్కా, లేక సార్వజనీన వోటుహక్కా? ఆ తరువాత: విప్లవాన్ని గుర్తించడమా, లేక నిరంకుశత్వంతో మోసపు వర్తకుని బేరమా? అంతిమంగా, యిప్పుడు: శ్రామికవర్గపు, రైతాంగపు నియంతృత్వం లేకుండా విప్లవాన్ని గుర్తించడమా, లేక ప్రజాతంత్ర విప్లవంలో యీ వర్గాల నియంతృత్వం కావాలనే డిమాండును గుర్తించడమా? "ఒస్వొబొజ్దేనియె"వాళ్ల పెద్దమనుషులు (వాళ్ళ యిప్పటివాళ్లైనా ఒకటే, బూర్జువా ప్రజాతంత్రవాదులలోని వామపక్షంలో వాళ్ల వారసులైనా ఒకటే) మరొక అడుగు యెక్కడం, అనగా కాలక్రమాన (బహుశా క్రామేడ్ మర్తీనొవ్ మరొక అడుగు యెక్కేటప్పటికి) నియంతృత్వ నినాదాన్ని కూడా గుర్తించడం, సాధ్యమూ, ప్రాయికమూ. రష్యన్ విప్లవం ముందుకు పోవడం కొనసాగి, నిర్ణయాత్మక విజయం సాధిస్తే, యిది అనివార్యంగా జరుగుతుంది. అప్పుడు సోషల్ డెమోక్రసీ వైఖరి యెలా వుంటుంది? ప్రస్తుత విప్లవం సంపూర్ణ విజయం పొందితే, ప్రజాతంత్ర విప్లవం అంతమై, సోషలిస్టు విప్లవం కొరకు కృతనిశ్చయమైన పోరాటం ప్రారంభ మౌతుంది. యీనాటి రైతాంగపు డిమాండ్లు తీరడమూ, ప్రగతి వ్యతిరేకత పూర్తిగా ఓడిపోవడమూ, ప్రజాతంత్ర రిపబ్లిక్‌ను సాధించడమూ బూర్జువా విప్లవతత్వానికి, పెటీబూర్జువా విప్లవతత్వానికి కూడా, చిట్టచివరి హద్దుగా, సోషలిజం కొరకు శ్రామికవర్గం చేసే నిజమైన పోరాటానికి ప్రారంభంగా వుంటాయి. ప్రజాతంత్ర విప్లవం యెంత సంపూర్ణంగా వుంటే అంత త్వరగా, అంత విస్తృతంగా, అంత శుభ్రంగా, అంత కృతనిశ్చయంగా వుంటుంది యీ కొత్త పోరాటపు అభివృద్ధి: "ప్రజాతంత్ర" నియంతృత్వ నినాదం ప్రస్తుత విప్లవం యొక్క చారిత్రకంగా పరిమితమైన స్వభావాన్నీ, కొత్త వ్యవస్థ ఆధారంమీద సమస్త పీడననుండీ, సమస్త దోపిడీనుండీ కార్మికవర్గపు సంపూర్ణ విమోచన కొరకు జరిగే కొత్త పోరాటపు అవశ్యకతనూ వ్యక్తంచేస్తుంది. అనగా, ప్రజాతంత్ర బూర్జువావర్గం, లేక పెటీబూర్జువావర్గం మరొక మెట్టు యెక్కినప్పుడు, విప్లవం మాత్రమే కాక విప్లవంయొక్క సంపూర్ణ విజయం జరిగిన ఘటన అయినప్పుడు, మనం ప్రజాతంత్ర నియంతృత్వ నినాదం స్థానంలో (బహుశా కొత్త, భావి మర్తీనొవ్‌ల భయభ్రాంతపు కేకలమధ్య) శ్రామికవర్గపు సోషలిస్టు నియంతృత్వం అనే నినాదాన్ని అనగా సంపూర్ణ సోషలిస్టు విప్లవ నినాదాన్ని పెట్టుతాము.

# III. నియంతృత్వంమీద అపభ్రంశ బూర్జువా అభిప్రాయాలూ, మార్క్సిస్టు అభిప్రాయాలూ.

1848 నాటి "నోయె రైనిషె సైటుంగ్"లోని మార్క్సు వ్యాసాలకు మేరింగ్ రాసి, ప్రచురించిన వివరణల్లో అతను ఒక విషయం చెప్పినాడు: "ప్రజాస్వామ్యాన్ని సాధించడానికి యేకైక మార్గంగా నియంతృత్వాన్ని తక్షణం ప్రవేశపెట్టడాన్ని" ("Marx' Nachlass," సంపుటం 3, పేజి 53)[121] ఆ పత్రిక డిమాండు చేసిందవేది ఆ పత్రికమీద బూర్జువా ప్రచురణలు వేసే నిందల్లో ఒకటి. అపభ్రంశ బూర్జువా దృక్పథంనుండి నియంతృత్వ మనేదీ, ప్రజాస్వామ్య మనేదీ ఒకటి వున్నచోట మరొకటి వుండజాలని పదాలు. బూర్జువాలు వర్గపోరాట సిద్ధాంతాన్ని అర్థంచేసుకోలేక, రాజకీయ రంగంలో వివిధ బృందాల చిల్లర కీచులాటలను చూడడానికి అలవాటుపడి, నియంతృత్వమంటే సకల స్వేచ్ఛలనూ, ప్రజాతంత్రపు హామీలనూ రద్దుచేయడమనీ, సకల రకాల యిష్టా రాజ్యమనీ, నియంత వ్యక్తిగత ప్రయోజనాల కొరకు అధికారాన్ని సకల విధాలా దుర్వినియోగపరచడమనీ అర్థం చేసుకుంటారు. వాస్తవానికి సరిగ్గా యీ అపభ్రంశ బూర్జువా అభిప్రాయమే మన మర్తీనొవ్ రచనల్లో వ్యక్తమయ్యేది; అతను "వ్పెర్యోద్"కూ, "ప్రొలెతారియ్"కీ నియంతృత్వ నినాదంపట్ల గల పక్షపాతానికి కారణం లెనిన్‌కు "తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలనే గాఢమైన కాంక్ష" వుండడమని ఆరోపించి ("ఇస్క్రా," నం. 103, పేజి 3, కాలం 2), కొత్త "ఇస్క్రా"లో తన "కొత్త దాడిని" ముగించినాడు. యీ మనోహరమైన వివరణ, పూర్తిగా, "నోయె రైనిషె సైటుంగ్"మీదా, నియంతృత్వాన్ని బోధించడంమీదా బూర్జువాలు చేసే అభియోగాల స్థాయిలో వుంది. విప్లవ భావాన్నీ, నియంతృత్వ భావాన్నీ "ఒకదాని స్థానంలో మరొకటి పెట్టు"తున్నాడని మార్క్సును కూడా నిందించినారు ("సోషల్ డెమోక్రట్లు" కాదు, బూర్జువా ఉదారవాదులు!). వ్యక్తిగత నిరంకుశత్వంకంటె భిన్నమైన వర్గ నియంతృత్వపు అర్థాన్నీ, సోషలిస్టు నియంతృత్వ కర్తవ్యాలకంటె భిన్నమైన ప్రజాతంత్ర నియంతృత్వ కర్తవ్యాలనూ మర్తీనొవ్‌కు వివరించడానికి, "నోయె రైనిషె సైటుంగ్" అభిప్రాయాలను చర్చించడం అనుచితంగా వుండదు.

1848 సెప్టెంబర్ 14న "నోయె రైనిషె సైటుంగ్" యిలా రాసింది: "విప్లవం తర్వాత రాజ్యపు ప్రతి తాత్కాలిక సంస్థకూ నియంతృత్వం, అందులోనూ చురుకైనది, అవసరం. నియంతగా వ్యవహరించనందుకు, పాత సంస్థల అవశేషాలను వెంటనే బద్దలు చేసి, తొలగించనందుకు మేము మొదటినుండీ కాంప్‌హౌసెన్‌ను" (1848 మార్చి 18 తర్వాత

ప్రధానమంత్రిని) "నిందించినాం. కాంప్‌హౌసెన్‌గారు రాజ్యాంగవాద భ్రమలతో తన్ను తాను జోకొట్టుకొంటూ వుండగా, ఓడిపోయిన పార్టీ (అనగా ప్రగతి వ్యతిరేక పార్టీ) బ్యూరాక్రసీలోనూ, సైన్యంలోనూ తన స్థానాలను పటిష్ఠపరచుకొని, అక్కడక్కడ బహిరంగ పోరాటానికి కూడా సాహసించ ప్రారంభించింది."[122]

కాంప్‌హౌసెన్ మంత్రివర్గంమీద రాసిన దీర్ఘ వ్యాసాలలో "నోయె రైనిషె సైటుంగ్"లో సవివరంగా ప్రతిపాదించబడినదంతా యీ మాటలు కొద్ది సూత్రాల్లో క్రోడీకరిస్తాయి అని మేరింగ్ సముచితంగా అన్నాడు. యీ మార్క్స్ మాటలు మనకు యేమి చెప్పినాయి? తాత్కాలిక విప్లవ ప్రభుత్వం నియంతృత్వంగా వ్యవహరించాలనీ (నియంతృత్వ నినాదమంటేనే "ఇస్క్రా" బెదురుకుంటుంది గనుక అది బొత్తిగా గ్రహించజాలని సూత్రం యిది), అలాంటి నియంతృత్వపు కర్తవ్యం పాత సంస్థల అవశేషాలను ధ్వంసంచేయడమనీ (యిది సరిగ్గా, పైన చూపించినట్లు, విప్లవ ప్రతీఘాతంతో చేసే పోరాటంమీద రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ మూడవ మహాసభ తీర్మానంలో స్పష్టంగా చెప్పబడిందీ, కాన్ఫరెన్సు తీర్మానంలో వదలివేయబడిందీ). మూడవదీ, చివరిదీ, పై మాటలనుండి యేర్పడేదీ యేమిటంటే, విప్లవమూ, బహిరంగ అంతర్యుద్ధమూ జరిగే కాలంలో "రాజ్యాంగవాద భ్రమలు" కలిగివున్నందుకు బూర్జువా ప్రజాతంత్రవాదులను మార్క్స్ ఖండించినాడు. 1848 జూన్ 6 నాటి "నోయె రైనిషె సైటుంగ్"లోని వ్యాసంద్వారా యీ మాటల అర్థం మరీ తేటతెల్లం అవుతుంది. మార్క్స్ యిలా రాసినాడు: "జాతీయ రాజ్యాంగనిర్ణయ సభ అన్నిటికంటెముందు చురుకుదనం, విప్లవకరమైన చురుకుదనం, కలిగివుండాలి. కానీ, ఫ్రాంక్‌ఫుర్ట్ సభ యిటు పార్లమెంటరిజంలో బడిపిల్లల అభ్యాసాల్లో నిమగ్నమై, అటు ప్రభుత్వాన్ని దాని యిష్టం వచ్చినట్లు వ్యవహరించనిస్తున్నది. యీ విద్వత్ సభ, పరిణత ఆలోచనానంతరం, అత్యంత శ్రేష్ఠమైన కార్యక్రమాన్నీ, అత్యంత శ్రేష్ఠమైన రాజ్యాంగాన్నీ తయారుచేయడంలో సఫల మౌతుందని అనుకుందాం; కానీ, యీ మధ్యలో జర్మన్ ప్రభుత్వాలు కార్యక్రమంలో తుపాకిసన్నీని చేరిస్తే, అత్యంత శ్రేష్ఠమైన కార్యక్రమంవల్లా, రాజ్యాంగంవల్లా యేమి ఉపయోగం?"[123]

నియంతృత్వ నినాదపు అర్థం అది. "రాజ్యాంగ నిర్ణయసభను యేర్పాటుచేయాలనే నిర్ణయా"న్ని నిర్ణయాత్మక విజయమని అనే, లేదా "తీవ్ర విప్లవ ప్రతిపక్ష పార్టీగా నిలిచి వుండాలని" మనల్ని ఆహ్వానించే తీర్మానాలపట్ల మార్క్స్ వైఖరి యెలా వుండేదీ దీన్ని బట్టి మనం తెలుసుకోవచ్చు.

జాతుల జీవితంలోని గొప్ప సమస్యలు బలంద్వారా మాత్రమే పరిష్కార మౌతాయి. మొదట దౌర్జన్యానికీ, అంతర్యుద్ధానికీ దిగేది మామూలుగా ప్రగతి వ్యతిరేక వర్గాలే; "కార్య

క్రమంలో తుపాకిసన్నీని చేర్చ''డానికి మొదటివాళ్లు వాళ్లు – రష్యన్ నిరంకుశత్వం జనవరి 9నుండి ప్రతిచోటా క్రమపద్ధతిగా, దీక్షగా చేస్తున్నట్లు. అలాంటి పరిస్థితి ఉత్పన్నమైంది గనుక, రాజకీయ కార్యక్రమంలో తుపాకిసన్నీ నిజంగా ప్రధాన అంశం అయింది గనుక, తిరుగుబాటు విధాయకమూ, జరూరూ అని తేలింది గనుక – రాజ్యాంగవాద భ్రమలూ, పార్లమెంటరిజంలో బడిపిల్లల అభ్యాసాలూ విప్లవంపట్ల బూర్జువా ద్రోహానికి కేవలం ముసుగు అవుతాయి, బూర్జువావర్గం విప్లవంనుండి "వెనక్కి పోవడాన్ని" మరుగు పరిచే ముసుగు. ఆ సందర్భంలో నిజంగా విప్లవకరమైన వర్గం ప్రతిపాదించవలసింది సరిగ్గా నియంతృత్వ నినాదమే.

యీ నియంతృత్వపు కర్తవ్యాల సమస్యమీద మార్క్స్ "నోయె రైనిషె సైటుంగ్"లో యిలా రాసినాడు: "కాలంతీరిన ప్రభుత్వాల ప్రగతి వ్యతిరేక ప్రయత్నాలకు వ్యతిరేకంగా జాతీయ సభ నియంతృత్వంగా వ్యవహరించి, తద్వారా, దేనిమీద సకల తుపాకిసన్నీలూ, రైఫిల్ మడమలూ ముక్కలు ముక్కలయ్యేవో ఆ ప్రజాభిప్రాయ శక్తిని సంపాయించుకొని వుండవలసింది.... కానీ యీ సభ జర్మన్ ప్రజలను తనవెంట లాక్కుపోడానికి బదులు, లేదా వాళ్లవెంట తాను లాక్కుపోబడడానికి బదులు, వాళ్లను విసిగిస్తున్నది."[124] మార్క్స్ అభిప్రాయంలో, జాతీయ సభ "జర్మనీలో వాస్తవంగా వున్న వ్యవస్థనుండి ప్రజల సర్వసత్తాకత అనే సూత్రానికి వ్యతిరేకమైన ప్రతిదాన్నీ తొలగించి" వుండవలసింది, ఆ తరువాత అది "విప్లవంద్వారా గెలుచుకోబడిన ప్రజల సర్వసత్తాకతను సకల దాడులనుండి సురక్షితం చేయడానికి, తాను నిలిచివున్న విప్లవ భూమిని దృఢపరచి"[125] వుండవలసింది.

కనుక, 1848లో విప్లవ ప్రభుత్వానికి, లేదా నియంతృత్వానికి మార్క్స్ పెట్టిన కర్తవ్యాలు, వాటి సారంలో, ప్రథమంగా, <u>ప్రజాతంత్ర</u> విప్లవమే: విప్లవ ప్రతీఘాతం నుండి రక్షణా, ప్రజల సర్వసత్తాకతకు విరుద్ధమైన ప్రతిదానినీ వాస్తవంగా తొలగించడమూ. అది విప్లవ ప్రజాతంత్ర నియంతృత్వం తప్ప మరేమీ కాదు.

తరువాత: మార్క్స్ అభిప్రాయంలో, యే వర్గాలు యీ కర్తవ్యాన్ని (ప్రజల సర్వసత్తాకత అనే సూత్రాన్ని చేతల్లో పూర్తిగా అమలుపరిచి, విప్లవప్రతీఘాతపు దాడులను తిప్పికొట్టే కర్తవ్యాన్ని) సాధించ గలిగివుండేవి, సాధించి వుండవలసింది? మార్క్స్ "ప్రజల"ను గురించి మాట్లాడుతాడు. కానీ, "ప్రజల" ఐక్యత గురించీ, ప్రజలలోపల వర్గపోరాటం లేకపోవడం గురించీ వుండే పెటీబూర్జువా భ్రమలతో ఆయన నిత్యం నిర్దాక్షిణ్యంగా పోరాడినాడని మనకు తెలుసు. "ప్రజలు" అనే మాట వాడడంలో మార్క్స్ వర్గ విభేదాలను నిర్లక్ష్యం చేయలేదు, విప్లవాన్ని పరిపూర్తిదాకా తీసుకపోగల నిర్దిష్ట అంశాలను ఐక్యపరిచినాడు.

మార్చి 18 నాటి బెర్లిన్ శ్రామికవర్గ విజయం తర్వాత విప్లవ ఫలితాలు ద్విముఖంగా వుండినాయని "నోయె రైనిషె సైటుంగ్" రాసింది: "ఒకవైపున ప్రజల ఆయుధధారణా, సంఘాల హక్కూ, వాస్తవంగా ప్రజల సర్వసత్తాకతను సాధించడమూ; మరొకవైపున రాజరికాన్నీ, కాంప్‌హౌసెన్ – హాన్సెమన్ మంత్రివర్గాన్నీ, అనగా బడా బూర్జువావర్గ ప్రతినిధుల ప్రభుత్వాన్నీ నిలిపివుంచడం. ఆవిధంగా, విప్లవానికి ఫలితాల పరంపరలు రెండు వుండినాయి; అవి అనివార్యంగా పరస్పరం దూరం కావలసి వుండినాయి. ప్రజలు విజయం సాధించినారు, వాళ్లు నిశ్చితంగా ప్రజాతంత్ర స్వభావం గల స్వేచ్ఛలను గెలుచుకున్నారు, కానీ తక్షణ అధికారం వాళ్ల చేతుల్లోకి పోకుండా, బడా బూర్జువావర్గం చేతుల్లోకి పోయింది. టూకీగా చెప్పాలంటే, విప్లవం పరిపూర్తి కాలేదు. ప్రజలు బడా బూర్జువావర్గ ప్రతినిధులను మంత్రివర్గం యేర్పాటుచేయనిచ్చినారు; యీ బడా బూర్జువావర్గ ప్రతినిధులు పాత ప్రష్యన్ ప్రభువర్గానికీ, బ్యూరాక్రసీకీ పొత్తు ప్రతిపాదించడం ద్వారా తమ లక్ష్యం యేమైందీ వెంటనే వెల్లడించినారు. ఆర్నిమ్, కానిట్జ్, ష్వేరిన్‌లు మంత్రివర్గంలో చేరినారు.

"నిత్యం విప్లవ వ్యతిరేకమైన బడా బూర్జువావర్గం ప్రజలకు, అనగా కార్మికులకూ, ప్రజాతంత్ర బూర్జువావర్గానికీ, భయపడి, ఆత్మరక్షణ కొరకూ, దాడి కొరకూ ప్రగతి వ్యతిరేకులతో పొత్తు చేసుకుంది."[126] (క్రింది గీతలు నావి.)

యీవిధంగా, "రాజ్యాంగ నిర్ణయసభను యేర్పాటుచేయాలనే నిర్ణయం" మాత్రమే కాక, వాస్తవంగా దాన్ని సమావేశపరచడం కూడా విప్లవ నిర్ణయాత్మక విజయానికి చాలదు! సాయుధ పోరాటంలో పాక్షిక విజయం తర్వాత కూడా (1848 మార్చి 18న సైన్యాలమీద బెర్లిన్ కార్మికుల విజయం), "అసంపూర్ణ" విజయం, "పరిపూర్తిదాకా తీసుకపోబడని" విప్లవం, సంభవమే. మరి, దేనిమీద దాని పరిపూర్తి ఆధారపడుతుంది? యెవరి చేతుల్లోకి తక్షణ అధికారం పోతుందనేదానిమీద అది ఆధారపడుతుంది – పెత్రుంకేవిచ్‌ల, రోదిచెవ్‌ల, అనగా కాంప్‌హౌసెన్‌ల, హాన్సెమన్‌ల, చేతుల్లోకా, లేక ప్రజల, అనగా కార్మికుల, ప్రజాతంత్ర బూర్జువాల, చేతుల్లోకా అనేదానిమీద. మొదటి సందర్భంలో, బూర్జువావర్గానికి అధికారం వుంటుంది, శ్రామికవర్గానికి "విమర్శనా స్వేచ్ఛా," "తీవ్ర విప్లవ ప్రతిపక్ష పార్టీగా నిలిచి వుండే" స్వేచ్ఛా. విజయం లభించిన వెంటనే బూర్జువావర్గం ప్రగతి వ్యతిరేకులతో పొత్తు చేసుకుంటుంది (ఉదాహరణకు, సెంట్ పీటర్స్‌బుర్గ్ కార్మికులు సైనికులతో చేసే వీధి పోరాటంలో పాక్షిక విజయం మాత్రమే పొంది, ప్రభుత్వం యేర్పాటుచేసే పనిని పెత్రుంకేవిచ్ అండ్ కంపెనీవాళ్లకు వదలిపెడితే, రష్యాలో కూడా యిది అనివార్యంగా జరుగుతుంది). రెండవ సందర్భంలో, విప్లవ ప్రజాతంత్ర నియంతృత్వం, అనగా విప్లవపు సంపూర్ణ విజయం, సాధ్యమౌతుంది.

యిక, "ప్రజాతంత్ర బూర్జువావర్గ" (demokratische Bürgerschaft) అంటే నిజంగా మార్క్సు యేమని ఉద్దేశించిందీ మరింత కచ్చితంగా నిర్వచించవలసి వుంది; "ప్రజాతంత్ర బూర్జువావర్గా"న్నీ, కార్మికులనూ కలిపి ఆయన ప్రజలు అన్నాడు, బడా బూర్జువావర్గానికి భిన్నంగా.

యీ ప్రశ్నకు స్పష్టమైన జవాబు 1848 జూలై 29 నాటి "నోయె రైనిషె సైటుంగ్"లోని ఒక వ్యాసంలోని యీ భాగంనుండి లభిస్తుంది: "...1848 నాటి జర్మన్ విప్లవం 1789 నాటి ఫ్రెంచి విప్లవానికి వ్యంగ్యచిత్రం మాత్రమే.

"1789 ఆగస్టు 4న, బాస్టీల్ కోట ముట్టడి జరిగిన మూడు వారాల తర్వాత, ఫ్రెంచి ప్రజలు ఒక్క రోజులో ఫ్యూడల్ భారాల నన్నిటినీ తొలగించివేసినారు.

"1848 జూలై 11న, మార్చి మార్గావరోధాలు జరిగిన నాలుగు నెలల తర్వాత, ఫ్యూడల్ భారాలు జర్మన్ ప్రజలమీద వుండినాయి. Teste Gierke cum Hansemanno*.

"1789 నాటి ఫ్రెంచి బూర్జువావర్గం ఒక క్షణం కూడా తన పొత్తుదార్లైన రైతులను నట్టేటిలో వదలలేదు. గ్రామీణ ప్రాంతంలో ఫ్యూడలిజంను ధ్వంసంచేయడంమీదా, స్వతంత్ర భూయజమాన (grundbesitzenden) రైతు వర్గాన్ని సృష్టించడం మీదా తన పరిపాలన ఆధారపడుతుందని దానికి తెలుసు.

"1848 నాటి జర్మన్ బూర్జువావర్గం తనకు అత్యంత సహజమైన పొత్తుదార్లూ, తన రక్తం పంచుకున్నవాళ్లూ, యెవరు లేకుండా తాను ప్రభువర్గంమీద శక్తిలేనిదో వాళ్లూ అయిన రైతులకు నిస్సంకోచంగా ద్రోహంచేస్తున్నది.

---

* "సాక్షులు: శ్రీమాన్ గీర్కె, శ్రీమాన్ హాన్సెమన్." హాన్సెమన్ బడా బూర్జువావర్గ పార్టీకి ప్రాతినిధ్యం వహించిన మంత్రి (రష్యన్ ప్రతిరూపం: త్రుబెత్స్కోయ్, లేదా రోదిచెవ్, మొదలైనవాళ్లు); హాన్సెమన్ మంత్రివర్గంలోని వ్యవసాయ మంత్రి గీర్కె. అతను ఒక పథకం తయారుచేసినాడు, "ఫ్యూడల్ భారాలు రద్దుచేయడానికి" "సాహస" పథకం. యిది "నష్టపరిహారం లేకుండా" అని చెప్పుకున్నప్పటికీ, వాస్తవంలో చిన్న, అముఖ్యమైన భారాలను రద్దుచేస్తూ, అంతకంటె ముఖ్యమైనవాటిని నిలిపివుంచేది, లేదా నష్టపరిహారం చెల్లించేది. గీర్కె రష్యన్ కబ్లుకోవ్‌లనూ, మనుయిలోవ్‌లనూ, గేర్‌త్సెన్‌స్టైన్‌లనూ, రైతుయొక్క యింకా అలాంటి బూర్జువా ఉదారవాద మిత్రులనూ – "రైతు భూస్వామ్య విస్తరణను" కోరుతారు గానీ, భూస్వాములను నొప్పించ గోరనివాళ్లను – పోలుతాడు,

"ఫ్యూడల్ హక్కుల కొనసాగింపూ, (బూటకపు) రద్దు ముసుగులో వాటిని ఆమోదించడమూ — యిది 1848 నాటి జర్మన్ విప్లవపు ఫలితం. కొండను తవ్వగా దొరికిన యెలక."[127]

మనకు నాలుగు ముఖ్య ప్రతిపాదనలను యిచ్చే విశేష జ్ఞానదాయకమైన భాగం యిది: 1) అసంపూర్తి జర్మన్ విప్లవానికీ, పూర్తి ఫ్రెంచి విప్లవానికీ భేదం యేమిటంటే, బూర్జువా వర్గం దరహంమీద ప్రజాస్వామ్యతత్వానికి మాత్రమే కాక, ప్రత్యేకంగా రైతాంగానికి కూడా ద్రోహంచేసింది. 2) రైతుల స్వతంత్ర వర్గాన్ని సృష్టించడం ప్రజాతంత్ర విప్లవ పరిపూర్తికి పునాది. 3) అలాంటి వర్గాన్ని సృష్టించడమంటే ఫ్యూడల్ నిర్బంధ సేవలు రద్దుచేయడమూ, ఫ్యూడలిజంను ధ్వంసం చేయడమూ, అయితే, అలా అని యింకా సోషలిస్టు విప్లవం కాదు. 4) రైతులు బూర్జువావర్గానికి, అనగా ప్రజాతంత్ర బూర్జువావర్గానికి, "అత్యంత సహజమైన" పొత్తుదార్లు; వాళ్లు లేకుండా యీ వర్గం ప్రగతి వ్యతిరేకత మీద "శక్తి లేనిది."

నిర్దిష్ట జాతీయ విశేషాలకు తగిన మార్పులు చేసుకుంటే, ఫ్యూడలిజం స్థానంలో భూదాస్య వ్యవస్థను పెడితే, యీ ప్రతిపాదన లన్నీ 1905 నాటి రష్యాకు పూర్తిగా వర్తిస్తాయి. నిస్సందేహంగా, మార్క్సు వివరించిన రూపంలో మనం జర్మనీ అనుభవంనుండి నేర్చుకొనడం ద్వారా, విప్లవంయొక్క నిర్ణయాత్మక విజయం కొరకు యిది తప్ప యే యితర నినాదానికీ రాలేము: శ్రామికవర్గపు, రైతాంగపు విప్లవ ప్రజాతంత్ర నియంతృత్వం. నిస్సందేహంగా, 1848లో ప్రతిఘటించే ప్రగతి వ్యతిరేకులకూ, ద్రోహపూరిత బూర్జువా వర్గానికీ భిన్నంగా మార్క్సు చెప్పిన "ప్రజల"లో ప్రధాన భాగాలు శ్రామికవర్గమూ, రైతాంగమూ. నిస్సందేహంగా, రష్యాలో కూడా ఉదారవాద బూర్జువావర్గమూ, "ఒస్వొబొజ్దేనియె" వాళ్లలాంటి పెద్దమనుషులూ రైతాంగానికి ద్రోహం చేస్తున్నారు, చేస్తారు, అనగా కుహనా సంస్కరణలకు పరిమితమై, భూస్వాములకూ, రైతాంగానికీ మధ్య జరిగే నిర్ణయాత్మక యుద్ధంలో భూస్వాముల పక్షం వహిస్తారు. యీ పోరాటంలో శ్రామికవర్గం మాత్రమే రైతాంగానికి చివరిదాకా అండదండలు యివ్వగలదు. చివరన, నిస్సందేహంగా, రష్యాలో కూడా రైతుల పోరాట విజయం, అనగా భూమి సమస్తమూ రైతాంగానికి బదలాయించబడడం, సంపూర్ణ ప్రజాతంత్ర విప్లవమౌతూ, పరిపూర్తిదాకా తీసుకపోబడిన విప్లవపు సాంఘిక ప్రాతిపదికగా వుంటుంది; కానీ యిది యేవిధంగానూ సోషలిస్టు విప్లవమూ కాదు, పెటీబూర్జువావర్గపు సిద్ధాంతకారులైన సోషలిస్టు రివల్యూషనరీలు మాట్లాడే "సాంఘికీకరణా" కాదు. రైతు తిరుగుబాటు విజయం, ప్రజాతంత్ర విప్లవ విజయం, కేవలం, ప్రజాతంత్ర రిపబ్లిక్ ప్రాతిపదికమీద, సోషలిజం కొరకు జరిగే నిజమైన, నిర్ణయాత్మకమైన పోరాటానికి దారి సిద్ధంచేస్తుంది. యీ పోరాటంలో రైతాంగం, భూయాజమాన్య

వర్గంగా, యెలాంటి పాత్ర నిర్వహిస్తుందంటే, ప్రజాస్వామ్యం కొరకు జరిగే పోరాటంలో బూర్జువావర్గం యిప్పుడు నిర్వహిస్తున్న యిదే ద్రోహపూరిత, అస్థిర పాత్రే. దీన్ని మరిచి పోవడమంటే సోషలిజంను మరిచిపోవడమే, శ్రామికవర్గపు నిజమైన ప్రయోజనాల, కర్తవ్యాల విషయంలో ఆత్మవంచనా, పరవంచనా చేయడమే.

1848లో మార్క్సు కుండిన అభిప్రాయాలను చెప్పడంలో వెలితి లేకుండా వుండ డానికి, ఆనాటి జర్మన్ సోషల్ డెమోక్రసీకీ (లేక, ఆ కాలపు భాషలో చెప్పాలంటే, శ్రామిక వర్గపు కమ్యూనిస్టు పార్టీకీ), యీనాటి రష్యన్ సోషల్ డెమోక్రసీకీ మధ్య గల ఒక ముఖ్య భేదాన్ని నొక్కిచెప్పడం అవసరం. మేరింగ్ అన్నది యిది:

" 'నోయె రైనిషె సైటుంగ్' రాజకీయ రంగంలో 'ప్రజాస్వామ్యపు పత్రిక'గా వెలు వడింది. దాని వ్యాసా లన్నిటిలోనూ వుండిన ధోరణి అసందిగ్ధంగా వుండింది. కానీ, సూటి అర్థంలో, అది బూర్జువావర్గ ప్రయోజనాలకు వ్యతిరేకమైన శ్రామికవర్గ ప్రయోజనాల కంటె యెక్కువగా, నిరంకుశత్వానికీ, ఫ్యూడలిజంకూ వ్యతిరేకమైన బూర్జువా విప్లవ ప్రయో జనాలను వెనకేసుకవచ్చింది. విప్లవ సంవత్సరాల్లో స్వతంత్ర శ్రామికవర్గ ఉద్యమం గురించి దాని రాతలలో అతి స్వల్పం కనపడుతుంది; కానీ, దానితోపాటు, మోల్, షాప్పెర్‌ల సంపా దకత్వంకింద, కొలోన్ కార్మిక సంఘు[128] ప్రత్యేక పత్రిక వారానికి రెండుసార్లు వెలువడుతూ వుండింది. యేమైనప్పటికీ, యీనాటి పాఠకునికి ఆశ్చర్యం కలిగించే దేమిటంటే, ఆనాటి జర్మన్ కార్మికవర్గ ఉద్యమానికి 'నోయె రైనిషె సైటుంగ్' అర్పించిన స్వల్ప శ్రద్ధ – దాని అత్యంత సమర్థ మేధావి అయిన స్టెఫాన్ బోర్న్ పారిస్‌లోనూ, బ్రస్సెల్స్‌లోనూ మార్క్సు, ఎంగెల్సుల శిష్యుడై, 1848లో వాళ్ల పత్రికకు బెర్లిన్ విలేకరిగా వుండిన ప్పటికీ. కార్మికులలో తాను చేసిన ఆందోళనకు వ్యతిరేకంగా మార్క్సు, ఎంగెల్సులు యెప్పుడూ ఒక మాట కూడా అనలేదని బోర్న్ తన 'స్మృతుల'లో అన్నాడు. కానీ, ఎంగెల్సు తదనంతర ప్రకటనలనుబట్టి, వాళ్లు కనీసం యీ ఆందోళనా పద్ధతులతో అసంతృప్తులై వుండడం చాలా ప్రాయిక మనిపిస్తుంది. జర్మనీ అధిక భాగంలోని శ్రామికవర్గంయొక్క అప్పటి కింకా పూర్తిగా అవికసితమైన వర్గచైతన్యానికి బోర్న్ చాలా లొంగుబాట్లు – 'కమ్యూ నిస్టు ప్రణాళిక' దృక్పథంనుండి విమర్శకు నిలవని లొంగుబాట్లు – చేయవలసి వచ్చినందున వాళ్ల అసంతృప్తి సమర్థనీయం. అయినప్పటికీ బోర్న్ తన ఆందోళనను సాపేక్షంగా ఉన్నతమైన స్థాయిలో నిలపగలిగాడు గనుక వాళ్ల అసంతృప్తి అసమర్థనీయం.... నిస్సందే హంగా, కార్మికవర్గపు ప్రధాన ఆసక్తి బూర్జువా విప్లవాన్ని సాధ్యమైనంత ముందుకు తోయ డమని అనుకోవడంలో మార్క్సు, ఎంగెల్సులు చారిత్రకంగానూ, రాజకీయంగానూ ఒప్పు. అయినప్పటికీ, కార్మికవర్గ ఉద్యమ ప్రాథమిక అంతఃప్రవృత్తి అత్యంత ఉజ్వలమైన ఆలో

చనాశీలుర భావాలను సరిదిద్దగల దనేదానికి గమనార్హమైన రుజువు యీ విషయంద్వారా లభిస్తుంది: 1849 ఏప్రిల్‌లో వాళ్ళు ఒక నిర్దిష్టమైన కార్మికుల సంఘంపట్ల తమ అనుకూలతను ప్రకటించి, ప్రత్యేకంగా తూర్పు ఎల్బ్ (తూర్పు ప్రష్యా) శ్రామికవర్గం సిద్ధం చేస్తూవుండిన కార్మికుల మహాసభలో పాల్గొనడానికి నిశ్చయించినారు.''

యీవిధంగా, 1849 ఏప్రిల్‌లో మాత్రమే, ఒక విప్లవ వార్తాపత్రిక దాదాపు సంవత్సరంగా వెలువడుతూ వుండిన తర్వాత (''నోయె రైనిషె సైటుంగ్'' 1848 జూన్ 1న ప్రచురణ ప్రారంభించింది), మార్క్స్, ఎంగెల్సులు ఒక ప్రత్యేక కార్మికుల సంఘం పట్ల తమ అనుకూలతను ప్రకటించినారు! అంతవరకు వాళ్ళు కేవలం ఒక ''ప్రజాస్వామ్యం యొక్క పత్రిక''ను, ఒక స్వతంత్ర కార్మికుల పార్టీతో సంస్థాపరమైన సంబంధాలు యేవీ లేకుండా, నడుపుతూవుండినారు! మన యీనాటి ప్రమాణాలతో చూస్తే రాక్షసంగానూ, అప్రాయికంగానూ కనపడే యీ వాస్తవం ఆనాటి జర్మన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీకీ, యీనాటి రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీకీ మధ్య గల అపారమైన భేదాన్ని స్పష్టంగా చూపిస్తుంది. యీ వాస్తవం చూపిస్తుంది ఉద్యమంలోని శ్రామికవర్గ లక్షణాలు, దాని లోపలి శ్రామికవర్గ ధార, జర్మన్ ప్రజాతంత్ర విప్లవంలో యెంత తక్కువగా కనిపిస్తూ వుండిందీ (ఆర్థికంగానూ, రాజకీయంగానూ 1848లో జర్మనీ వెనుకబాటుతనం మూలంగా – రాజ్యంగా దాని అనైక్యత మూలంగా). స్వతంత్ర శ్రామికవర్గ పార్టీని నిర్మించవలసిన అవసరం గురించి యీ కాలంలోనూ, కాస్త ఆ తరువాతా మార్క్స్ పదే పదే చేసిన ప్రకటనలను అంచనావేయడంలో దీన్ని మరిచిపోకూడదు (ఉదాహరణకు, ప్లెహానొవ్ మరిచిపోయినట్లు). మార్క్స్ యీ ఆచరణాత్మక నిర్ధారణకు వచ్చింది ప్రజాతంత్ర విప్లవ అనుభవ ఫలితంగా మాత్రమే, దాదాపు ఒక సంవత్సరం తర్వాత – ఆ కాలంలో జర్మనీలోని వాతావరణమంతా అంత అల్పబుద్ధిగా, అంత పెటీబూర్జువాగా వుండింది. మనకు యీ నిర్ధారణ అంతర్జాతీయ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమం అర్ధ శతాబ్ది అనుభవపు సుప్రసిద్ధ, స్థిరమైన లాభం – దేని ప్రాతిపదికమీద మనం రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీని నిర్మించడం ప్రారంభించినామో ఆ లాభం. మన విషయంలో, ఉదాహరణకు, శ్రామిక వర్గ విప్లవ వార్తాపత్రికలు కార్మికవర్గపు సోషల్ డెమోక్రటిక్ పార్టీకి వెలుపల వుండడం, లేదా అవి ఒక క్షణం సేపైనా కేవలం ''ప్రజాస్వామ్యంయొక్క పత్రికలు''గా వెలువడడం అనే సమస్య వుండజాలదు.

కానీ, మార్క్స్‌కూ, స్టెఫాన్ బోర్న్‌కూ మధ్య కనపడీ కనపడకుండా వ్యక్తం కాసాగిన వైరుధ్యం మన విషయంలో, మన విప్లవపు ప్రజాతంత్ర ప్రవాహంలోని శ్రామికవర్గ ధారయొక్క మరింత శక్తివంతమైన వ్యక్తీకరణ మూలంగా, మరింత వికసిత రూపంలో

వుంది. స్టెఫాన్ బోర్న్ సాగించిన ఆందోళనపట్ల మార్క్సు, ఎంగెల్సుల ప్రాయికమైన అసంతృప్తిని గురించి చెపుతూ, మేరింగ్ మరీ మెత్తగా, మరీ తప్పించుకొనే పద్ధతిలో మాట్లాడినాడు. 1885లో బోర్న్‌ను గురించి ఎంగెల్సు రాసింది యిది ("Enthüllungen über den Kommunistenprozeß zu Köln," Zürich*, 1885కు ఆయన రాసిన పీఠికలో).

"కమ్యూనిస్టు లీగు"[129] సభ్యులు ప్రతిచోటా అతివాద ప్రజాతంత్ర ఉద్యమంలో అగ్రభాగాన నిలబడి, తద్వారా, లీగు విప్లవ కార్యకలాపాలకు శ్రేష్ఠమైన పాఠశాల అని రుజువుచేసినారు. "బ్రస్సెల్స్‌లోనూ, పారిస్‌లోనూ లీగులో చురుకైన సభ్యుడుగా పనిచేసిన కంపోజిటర్ స్టెఫాన్ బోర్న్ బెర్లిన్‌లో 'కార్మికుల సంఘం' (Arbeiterverbrüderung) స్థాపించినాడు; అది బాగా వ్యాపించి, 1850దాకా వుండింది. ప్రజ్ఞ గల యువకుడూ, అయినా రాజకీయంగా ప్రసిద్ధుడు కావాలని మరీ తొందరపడినవాడూ అయిన బోర్న్ గుంపును కూర్చుకోడానికి అడ్డమైనవాళ్ళతో (Krethi und Plethi) 'చెలిమి చేసుకొన్నాడు;' అతను విరుద్ధ ధోరణుల మధ్య ఐక్యతను, అవ్యవస్థలోకి సర్దుబాటును తేగలిగిన వ్యక్తి కానేకాదు. తత్పర్యవసానంగా, సంఘపు అధికారిక ప్రచురణలలో, 'కమ్యూనిస్టు ప్రణాళిక' లోని భావాలు గిల్డు స్మృతులతోనూ, గిల్డు ఆశలతోనూ, లూయీ బ్లాంక్, ప్రూడన్‌లలోని ముక్కలతోనూ, రక్షణవాదంతోనూ, వగైరాలతో పంచకూళ్ల కషాయంగా కలపబడినాయి; ఒక్క మాటలో చెప్పాలంటే, వాళ్ళు అందరినీ సంతోషపెట్టడానికి ప్రయత్నించినారు (allen alles sein). ప్రత్యేకంగా, సమ్మెలూ, ట్రేడ్‌యూనియన్‌లూ, ఉత్పత్తిదార్ల సహకార సంఘాలూ యేర్పాటు చేసినారు వాళ్ళు, కానీ, అన్నిటినీ మించి, యే రంగంలో మాత్రమే అలాంటి విషయాలు సుస్థిరమైన పునాదిమీద సాధించబడగలవో ఆ రంగాన్ని, రాజకీయ విజయంద్వారా, మొదట జయించాలనేది విస్మరించినారు (కింది గీతలు నావి). తరువాత, ప్రగతి వ్యతిరేకత విజయాలు విప్లవ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొనే అవసరాన్ని కార్మిక సంఘం నాయకులు గుర్తించేటట్లు చేసినప్పుడు, తమచుట్టూ పోగుచేయబడిన గంద్రగోళపు గుంపు సహజంగానే వాళ్లను నట్టేటిలో వదలిపెట్టింది. బోర్న్ 1849 మేలో డ్రెస్డెన్ తిరుగుబాటులో[130] పాల్గొని, అదృష్టవశాత్తు తప్పించుకొని పోయినాడు. కానీ, శ్రామికవర్గపు మహత్తర రాజకీయ ఉద్యమానికి భిన్నంగా, 'కార్మిక సౌభ్రాతృత్వం' అనే సంఘం వట్టి విడిసంఘం అని తేలింది; అది యెక్కువగా కాగితంమీద మాత్రమే బతికి, యెంత అప్రధాన పాత్ర వహించిందంటే, 1850దాకా దాన్ని, తరువాత పలు

* "కొలోన్ కమ్యూనిస్టు విచారణ బండారం," జూరిచ్. – సం.

సంవత్సరాలదాకా దాని మిగిలిన శాఖలనూ అణచివేయవలసిన అవసరం ప్రగతి వ్యతిరేకతకు కనిపించలేదు. బోర్న్ – అతని అసలు పేరు Buttermilch* – రాజకీయంగా ప్రసిద్ధుడు కాలేదు, చిన్న స్విస్ ప్రొఫెసర్ అయి, మార్క్సును గిల్డు భాషలోకి యిక యెంత మాత్రమూ అనువదించడం లేదు, నమ్రుడైన రెనాన్‌ను తన సొంత వెక్కసపు జర్మన్ భాషలోకి అనువదిస్తున్నాడు."[132]

ప్రజాతంత్ర విప్లవంలో సోషల్ డెమొక్రసీయొక్క రెండు యెత్తుగడలను ఎంగెల్సు అంచనావేసింది అలా!

మన కొత్త "ఇస్క్రా"వాళ్లు కూడా "అర్థికవాదం"వైపు మొగ్గుతున్నారు – "జ్ఞానోదయం" అయినందుకు రాజరికవాద బూర్జువావర్గపు పొగడ్తలు పొందేటంత అసమంజసమైన పట్టుదలతో కూడా. వాళ్లు కూడా తమచుట్టూ గంద్రగోళపు గుంపును కూర్చుకుంటారు, "అర్థికవాదుల"ను ప్రస్తుతిస్తూ, "చొరవ," "ప్రజాస్వామ్యం," "స్వయంప్రతిపత్తి," వగైరా, వగైరా నినాదాలతో అవికసిత జనసామాన్యాన్ని ఉద్రేకపరచే వక్తలలాగా ఆకర్షిస్తూ; వాళ్ల కార్మిక సంఘాలు కూడా తరుచు హ్లొస్తకోవ్[133] రకం కొత్త "ఇస్క్రా" పేజీల్లో మాత్రమే వుంటాయి. వాళ్ల నినాదాలూ, తీర్మానాలూ "శ్రామికవర్గపు మహత్తర రాజకీయ ఉద్యమం"యొక్క కర్తవ్యాలను అర్థంచేసుకోవడంలో అదే వైఫల్యాన్ని వ్యక్తంచేస్తాయి.

1905 జూన్ – జూలైల్లో రచింపబడింది

---

* ఎంగెల్సును అనువదించడంలో Buttermilch (మజ్జిగ – అను.) పదాన్ని వ్యక్తివాచకంగా కాక, జాతివాచకంగా గ్రహించి నేను మొదటి కూర్పులో పొరపాటు చేసినాను. సహజంగానే యీ పొరపాటు మెన్షెవిక్కులకు గొప్ప ఆహ్లాదం కలిగించింది. నేను "ఎంగెల్సును మరింత ప్రగాఢం" చేసినానని కొల్త్సోవ్ రాసినాడు ("రెండేండ్లు" అనే వ్యాస సంపుటిలో పునర్ముద్రితం); "తొవారిష్"[131]లో ప్లెహానొవ్ యిప్పటికీ దీన్ని జ్ఞాపకం చేసుకుంటున్నాడు – టూకీగా చెప్పాలంటే, అది జర్మనీలోని 1848 నాటి కార్మికోద్యమంలోని రెండు ధోరణుల సమస్యను దాటవేయడానికి శ్రేష్ఠమైన సాకును సమకూర్చింది – బోర్న్ ధోరణినీ (మన "అర్థికవాదుల" ధోరణిలాంటి దానిని), మార్క్సిస్టు ధోరణినీ. ప్రత్యర్థి పొరపాటును ఆసరాగా తీసుకోవడం, అది బోర్న్ పేరుకు సంబంధించినదైనా, యెంతైనా సహజం. కానీ, అనువాదానికి చేసిన దిద్దుబాటును రెండు యెత్తుగడల సమస్య సారాన్ని దాటవేయడానికి ఉపయోగించుకోవడమంటే అసలు సమస్యను తప్పించుకోవడం. (1907 కూర్పుకు రచయిత వివరణ. – సం.)

# వివరణలు

1 "ఇస్క్రా" ("నిప్పు రవ్వ") – వి. ఐ. లెనిన్ 1900లో స్థాపించిన మొదటి అఖిల రష్యా రహస్య మార్క్సిస్టు పత్రిక. మొదటి సంచిక లైప్జిగ్‌లోనూ, తదుపరి సంచికలు మ్యూనిహ్, లండన్, జెనీవాలలోనూ వెలువడ్డాయి.

మార్క్సిస్టు పార్టీ స్థాపన కోసం జరిగిన పోరాటంలోనూ, సోషల్ డెమోక్రటిక్ గ్రూపులను ఐక్యం చెయ్యడంలోనూ, పార్టీ కార్యక్రమాన్నీ, నిబంధనావళినీ రూపొందించడంలోనూ, ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభను సమావేశపరచడంలోనూ "ఇస్క్రా" నిర్ణయాత్మకమైన పాత్ర వహించింది. పార్టీ కార్యక్రమాన్ని రూపొందించడంలో సంపాదకవర్గంలో వచ్చిన అభిప్రాయభేదాలు, ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభ అనంతరం, ఆ పత్రిక మెన్షెవిక్కుల చేతుల్లోకి పోయేందుకు దారితీశాయి. అప్పటినుంచి లెనినిస్టు, బోల్షెవిక్ "ఇస్క్రా" పాత "ఇస్క్రా" అనీ, మెన్షెవిక్, అవకాశవాద "ఇస్క్రా" కొత్త "ఇస్క్రా" అనీ పిలవబడసాగాయి. – 13.

2 మెన్షెవిక్ ఎమ్. మకద్జుబ్ (మారుపేరు "కార్యకర్త") రాసిన "మన పార్టీ కర్తవ్యాల సమస్య. పార్టీ నిర్మాణం గురించి" అన్న వ్యాసానికి యిది ప్రస్తావన. ఈ వ్యాసం 1904 జనవరి 15 నాటి "ఇస్క్రా" 57వ సంచికలో ప్రచురింపబడింది. – 17.

3 1900 అక్టోబరులో లెనిన్ రాసిన "'ఇస్క్రా' సంపాదకవర్గపు ప్రకటన" ఒక విడి కరపత్రంగా ప్రచురింపబడింది. ఐక్యమై, విప్లవకర సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఏకైక పతాకం కింద పోరాడే పార్టీ ఏర్పాటు కోసం తమ కృషినంతనీ ఉన్ముఖం చెయ్యమని రష్యన్ సోషల్ డెమోక్రట్లకు ఆ "ప్రకటన" విజ్ఞప్తి చేసింది. అటువంటి ఐక్యత ఆదేశాల ద్వారా సాధింపబడజాలదనీ, కార్యక్రమాన్నీ, ఎత్తుగడలకి సంబంధించిన సమస్యలనూ సర్వతోముఖంగా చర్చించే ప్రాతిపదికపైననే అది సాధ్యమనీ ఆ ప్రకటన పేర్కొంది. "మనం ఐక్యమయ్యేందుకు ముందూ, ఐక్యమయ్యేందుకోసమూ

మన మధ్య ఉన్న అభిప్రాయభేదాలను కచ్చితంగానూ, నిర్దిష్టంగానూ స్పష్టీకరించుకోవాలి." – 17.

4 1902 నాటి కాన్ఫరెన్సు – ఇది 1902 మార్చి 23–28 తేదీల్లో (ఏప్రిల్ 5–10) బెలొస్తోక్‌లో జరిగిన ఆర్.ఎస్.డి.ఎల్.పి. కమిటీల, శాఖల ప్రతినిధుల కాన్ఫరెన్సు. ఆ కాన్ఫరెన్సును ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభగా మార్చాలనీ, ఆవిధంగా రష్యన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీలో తమ స్థానాలను బలపరచుకోవాలనీ, పెంపొందుతున్న "ఇస్క్రా" పలుకుబడిని స్తంభింపజెయ్యాలనీ అవకాశవాదులు ఆశించారు. అయితే, సాపేక్షంగా ఆ కాన్ఫరెన్సు తక్కువ ప్రాతినిధ్యం కలిగినదైనందువల్లా (రష్యాలో పనిచేస్తున్న ఆర్.ఎస్.డి.ఎల్.పి. శాఖల్లో నాలుగు మాత్రమే దానికి తమ ప్రతినిధులను పంపాయి), ఆ కాన్ఫరెన్సులో తీవ్రమూ, మౌలికమూ అయిన విభేదాలు వెల్లడైనందువల్లా అవకాశవాదుల యీ ప్రయత్నం భగ్నమైంది. – 17.

5 బుంద్ ("లిథువేనియా, పోలండు, రష్యా దేశాల యూదు కార్మికుల అఖిల యూనియన్") – ఒక అవకాశవాద, పెటీబూర్జువా, జాతీయవాద పార్టీ. ఇది 1897లో స్థాపించబడింది. ఆర్.ఎస్.డి.ఎల్.పి. మొదటి మహాసభలో (1898) బుంద్, ప్రత్యేకించి యూదు శ్రామికవర్గానికి సంబంధించిన సమస్యల్లో మాత్రం స్వయం ప్రతిపత్తి కలిగిన శాఖగా ఆర్.ఎస్.డి.ఎల్.పి.లో చేరింది.

నిర్మాణానికి సంబంధించి ఆర్.ఎస్.డి.ఎల్.పి. మొదటి మహాసభ నెలకొల్పిన సంబంధాలను రద్దుచేసేందుకు 1901లో బుంద్ ముందుకొచ్చింది. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభలో, యూదు శ్రామికవర్గానికి యేకైక ప్రతినిధిగా పరిగణించాలన్న బుంద్ డిమాండు తిరస్కరింపబడ్డాక, బుంద్, పార్టీని వదిలి బయటకి పోయింది.

1906లో బుంద్ మళ్లీ పార్టీలో చేరింది. ఆర్.ఎస్.డి.ఎల్.పి.లో బుంద్ యెప్పుడూ పార్టీ అవకాశవాద పక్షాన్నే బలపరుస్తూ, బోల్షెవిక్కులకీ, బోల్షెవిజానికీ వ్యతిరేకంగా పోరాటం సాగిస్తూ వచ్చింది. అక్టోబరు సోషలిస్టు మహా విప్లవానంతరం బుంద్ నాయకత్వం విప్లవ ప్రతీఘాతకులతో చేరింది. 1921లో బుంద్ తనని తాను రద్దుచేసుకుంది.

"రబోచెయె దేలొ" ("కార్మిక లక్ష్యం") – 1899–1902 సంవత్సరాల్లో జెనీవాలో ప్రచురింపబడిన ఆర్థికవాద పత్రిక. "రబోచెయె దేలొ" సంపాదకవర్గం విదేశాల్లోని ఆర్థికవాదులకు ("రబోచెయె దేలొ"వాళ్లు) ఒక కేంద్రంగా ఉంటూండేది.

రష్యన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఎత్తుగడల, నిర్మాణపర సమస్యల విష

యంలో యీ పత్రిక అవకాశవాద వైఖరిని అవలంబించి, రైతాంగపు విప్లవకర శక్తి సామర్థ్యాలను నిరాకరించింది, వగైరా. "రబోచెయె దేలొ" గ్రూపు శ్రామికవర్గపు రాజకీయ పోరాటాన్ని ఆర్థిక పోరాటానికి లోబరచాలన్న అవకాశవాద భావాలను ప్రచారం చేసింది, కార్మికోద్యమంలో సద్యోజనితత్వానికి దాసోహమంది, పార్టీ నాయకత్వ పాత్రను తిరస్కరించింది. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభలో "రబోచెయె దేలొ"వాళ్లు పార్టీలోని అత్యంత మితవాద, అవకాశవాద పక్షానికి ప్రాతినిధ్యం వహించారు. – 19.

6 "యుాజ్నీ రబోచీ" ("దక్షిణాది కార్మికుడు") గ్రూపు – ఈ పేరు గల ఒక రహస్య పత్రిక సమర్థించేవాళ్లతో 1900 ఆకురాలు కాలంలో రష్యా దక్షిణ ప్రాంతంలో ఏర్పడిన ఒక సోషల్ డెమోక్రటిక్ గ్రూపు.

"యుాజ్నీ రబోచీ" గ్రూపు శ్రామికవర్గపు రాజకీయ పోరాటాన్నీ, నిరంకుశ ప్రభుత్వపు కూలదోతనీ అతి ముఖ్య కర్తవ్యంగా పరిగణించింది. అది టెరరిజాన్ని వ్యతిరేకించి, ప్రజా సామూహిక విప్లవోద్యమాన్ని పెంపొందించడం అవసరమన్న వాదాన్ని బలపరచింది. అదే సమయంలో, ఆ గ్రూపు ఉదారవాద బూర్జువావర్గపు పాత్రను అతిగా అంచనా వేసి, రైతు ఉద్యమ ప్రాముఖ్యాన్ని అలక్ష్యం చేసింది.

"ఇస్క్రా"ను పేరుకు మాత్రం ప్రధాన పత్రికగా పరిగణిస్తూ, ఆచరణలో ప్రధాన సమస్యల్లో ఊగిసలాడిన సంఘాల్లో ఒకదానిగా "యుాజ్నీ రబోచీ" గ్రూపును లెనిన్ పరిగణించాడు.

ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభ "యుాజ్నీ రబోచీ" గ్రూపునూ, అలాగే యితర స్వతంత్ర సోషల్ డెమోక్రటిక్ గ్రూపులనూ, శాఖలనూ రద్దుచేసింది. – 19.

7 "దేశాంతర రష్యన్ రివల్యూషనరీ సోషల్ డెమోక్రట్ల లీగు" లెనిన్ చొరవతో జెనీవాలో 1901 అక్టోబరులో నెలకొల్పబడి, విదేశాల్లో "ఇస్క్రా" శాఖగా పనిచేసింది. ఈ లీగు ఆ పత్రికకు పాదార్థిక తోడ్పాటునిచ్చి, దాన్ని రష్యాకు పంపించేందుకు యేర్పాట్లు చేసింది, సుబోధకమైన మార్క్సిస్టు సాహిత్యాన్ని ప్రచురించింది. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభ యీ లీగును విదేశాల్లో ఏకైక పార్టీ శాఖగా ఆమోదించింది.

ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభ అనంతరం మెన్షెవిక్కులు యీ లీగులో తిష్ఠవేసి, లెనిన్‌కీ, బోల్షెవిక్కులకీ వ్యతిరేకంగా పోరాటం సాగించారు. 1903 అక్టోబరులో జరిగిన ఆ లీగు రెండవ మహాసభలో మెన్షెవిక్కులు, ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభలో ఆమోదింపబడిన పార్టీ నిబంధనావళికి భిన్నమైన కొత్త లీగు

నిబంధనావళిని ఆమోదించారు. అప్పటినుంచి ఆ లీగు మెన్షెవిజానికి ఒక దుర్గంగా వుంటూ, 1905దాకా కొనసాగింది. – 20.

8 "బొర్బా" ("పోరాటం") గ్రూపు – 1900 వేసవిలో పారిస్‌లో నెలకొల్పబడిన యీ గ్రూపుకి 1901 మేలో యీ పేరు వచ్చింది. రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలోని విప్లవకర, అవకాశవాద ధోరణుల మధ్య రాజీ కుదర్చాలని యీ గ్రూపు ప్రయత్నించింది. తన ప్రచురణల్లో యీ గ్రూపు మార్క్సిస్టు విప్లవ సిద్ధాంతాన్ని అపభ్రంశం చేసి, పార్టీ నిర్మాణానికి సంబంధించిన లెనిన్ సూత్రాలను ప్రతిఘటించింది. సోషల్ డెమోక్రటిక్ అభిప్రాయాలనూ, ఎత్తుగడలనూ అనుసరించకపోవడం, నిర్మాణ సూత్రాలకు విరుద్ధమైన కార్యకలాపాలు సాగించడం, రష్యాలోని సోషల్ డెమోక్రటిక్ శాఖలతో సంబంధాలు లేకపోవడం – వీటి మూలంగా, ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభలో పాల్గొనేందుకు యీ గ్రూపుకి అనుమతి లభించలేదు. ఆ మహాసభ నిర్ణయం మేరకు యీ గ్రూపు రద్దుచేయబడింది. – 25.

9 పి. క్రాసికొవ్ (పవ్లోవిచ్) రాసిన "ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభను గురించి కామ్రేడ్సుకి లేఖ"కు యిది ప్రస్తావన. ఈ లేఖ 1904లో జెనీవాలో పార్టీ ముద్రణాలయం చేత ఒక ప్రత్యేక సమాచార పత్రంగా ప్రచురింపబడింది. – 26.

10 విధిగా కట్టుబడి వుండాలనే ఆదేశాలు – ఏదైనా ప్రాతినిధ్య సంస్థ ప్రతినిధికి వోటర్లు యిచ్చే ఆదేశాలు.

సోషలిస్టు దేశాల్లో డెప్యూటీలు వోటర్ల యీ ఆదేశాలను విధిగా అనుసరించాలి, లేకపోతే వాళ్లను ఉపసంహరించవచ్చు, బూర్జువా దేశాల్లో యిందుకు భిన్నంగా డెప్యూటీలు వోటర్ల యిచ్ఛకు కట్టుబడివుండాల్సిన అవసరం లేదు. – 28.

11 "రబోచయ మీస్ల్" ("కార్మికుల చింతన") గ్రూపు బాహాటమైన అవకాశవాద అభిప్రాయాలను ప్రచారం చేసింది. అది కార్మికవర్గం రాజకీయ పోరాటం జరపరాదని చెప్పింది, దాని కర్తవ్యాలను, విడివిడి సంస్కరణలకు, ప్రధానంగా ఆర్థిక స్వభావం కలిగిన డిమాండ్లకు కుంచించింది. కార్మికోద్యమంలో సద్యోజనితత్వానికి దాసోహమన్న "రబోచయ మీస్ల్" గ్రూపు ప్రతినిధులు స్వతంత్రమైన శ్రామికవర్గ పార్టీ స్థాపనను వ్యతిరేకించి, విప్లవ సిద్ధాంత ప్రాముఖ్యాన్ని తక్కువ చూపు చూశారు.

"రబోచయ మీస్ల్" గ్రూపు అదే పేరుతో, 1897 అక్టోబరునుంచి 1902 డిసెంబరుదాకా, ఒక పత్రికను ప్రచురించింది. – 34.

12 "ఆర్థిక" ధోరణి లేక "ఆర్థికవాదం" – 19వ శతాబ్ది అంతంలోనూ, 20వ శతాబ్ది ఆరంభంలోనూ రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలో తలెత్తిన ఒక అవకాశవాద ధోరణి; అంతర్జాతీయ అవకాశవాదపు రష్యన్ రకాల్లో యిదొకటి.

"ఆర్థికవాదులు" కార్మికవర్గ కర్తవ్యాలను ఆర్థిక పోరాటానికి పరిమితం చేశారు, కార్మికవర్గ పార్టీ నాయకత్వ పాత్రను తిరస్కరించారు, కార్మికోద్యమ సద్యోజనితత్వానికి దాసోహమన్నారు. – 34.

13 వ్యవసాయ కార్యక్రమం – ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభచేత ఆమోదింపబడింది. అది రైతు ఉద్యమం సాపేక్షంగా అభివృద్ధి చెందని పరిస్థితుల్లో, గ్రామీణ ప్రాంతంలో జారుకీ, భూస్వాములకీ వ్యతిరేకంగా విప్లవ పోరాటంలోకి రైతాంగాన్ని రాబట్టడమే పార్టీ ప్రధాన కర్తవ్యం అయిన పరిస్థితుల్లో రూపొందించబడింది. అందుచేత, రైతాంగపు విప్లవ పోరాట ప్రథమ దశలో బోల్షెవిక్ వ్యవసాయ కార్యక్రమం యీ కింది చర్యలను సంకల్పించింది: పన్నులు వెయ్యదగిన ఒక వర్గంగా రైతాంగంమీద పడే అన్ని నిర్బంధ సేవలనీ రద్దుచెయ్యడం; రైతాంగం తమ భూమిని తాము అవసరమనుకున్న పద్ధతిలో వినియోగించుకునే స్వేచ్ఛను పరిమితం చేసే చట్టాలన్నింటినీ రద్దుచెయ్యడం; చర్చికీ లేక మఠాలకీ చెందిన భూములను జప్తుచెయ్యడం, అలాగే, మంత్రులకీ లేక రాజు కుటుంబానికీ చెందిన ఎస్టేట్లనూ, భూముల్నీ జప్తుచెయ్యడం; భూ బానిసత్వ సంబంధాల అవశేషాలను రద్దుచేసి, 1861లో భూ బానిసత్వం రద్దుచెయ్యబడినప్పుడు రైతుల దగ్గర్నుంచి లాగేసుకున్న గ్రామీణ కమ్యూన్లకు చెందిన భూములను, చీల్చి వెయ్యబడిన భూములను వాళ్ళకి తిరిగి యిచ్చేందుకు రైతు కమిటీలను నెలకొల్పడం. చీల్చి వెయ్యబడిన భూములు మిక్కిలి మంచివి లేక యేవి లేకపోతే రైతులు సేద్యం చెయ్యడం సాధ్యం కాదో అలాంటి భూములు, పచ్చికబీళ్ళు, పచ్చికమైదానాలు, రోడ్లు, మొదలైనవి.

చీల్చివెయ్యబడిన భూములను తిరిగి యివ్వాలన్న డిమాండు లక్ష్యం, భూస్వాములకు వ్యతిరేకంగా రైతాంగపు వర్గపోరాటాన్ని రెచ్చగొట్టడమే. ఇది చారిత్రకంగా కొద్ది కాలానికి చెందినది, అంటే, సామూహిక రైతు ఉద్యమం మొదలయ్యేదాకా ఉద్దేశింపబడినది. భూస్వాముల భూమి జప్తు, బడా భూస్వాముల ఆస్తి హరణం, మొత్తం భూమి అంతటి జాతీయకరణ – యిదే లెనినిస్టు వ్యావసాయిక కార్యక్రమపు కేంద్ర అంశం.

ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభలో వ్యవసాయ కార్యక్రమంమీద చర్చ అవకాశవాదులకు వ్యతిరేకంగా తీవ్ర పోరాట వాతావరణంలో సాగింది. అవకాశవాదులు రైతాంగపు విప్లవకర పాత్రనూ, నిరంకుశ రాజరికాన్ని కూలదోసేందుకూ, సోషలిజాన్ని విజయవంతం చేసేందుకూ కార్మికులకీ రైతులకీ మధ్య పొత్తు సాధ్యతనూ నిరాకరిం

చారు. చీల్చివేయబడిన భూములకు వెనకటి ప్రాధాన్యం పోయిందన్న కారణంతో, ఆ భూములను రైతులకు తిరిగి యివ్వడాన్ని కూడా వాళ్ళు వ్యతిరేకించారు.

నిరంకుశ రాజరికానికీ, భూస్వాములకీ వ్యతిరేకంగా రైతాంగాన్ని నిర్ణయాత్మక పోరాటాలకు సన్నద్ధం చెయ్యడంలో లెనినిస్టు వ్యవసాయ కార్యక్రమం ముఖ్య పాత్ర వహించింది. – 44.

14 ఇది భూమి సాధారణ పునఃపంపకానికి ప్రసావన. జారిస్టు రష్యాలో రైతాంగంలో విస్తృతంగా వ్యాప్తిలో ఉన్న వివాదం ఇది. – 47.

15 సోషలిస్టు రివల్యూషనరీలు (ఎస్.ఆర్.లు) – 1901–23 మధ్య రష్యాలో పెటీ బూర్జువావర్గపు అభిప్రాయాలను వ్యక్తంచేసిన ఒక వామపక్ష, బూర్జువా ప్రజాతంత్ర పార్టీ సభ్యులు. సోషలిస్టు రివల్యూషనరీలు శ్రామికవర్గానికీ, రైతాంగానికీ మధ్య వర్గ వ్యత్యాసాలను చూడటంలో విఫలురయారు, రైతాంగంలో వర్గ శ్రేణీకరణనూ, వైరుధ్యాలనూ మభ్యపుచ్చారు. విప్లవంలో శ్రామికవర్గపు నాయకత్వ పాత్రను కూడా వాళ్ళు తిరస్కరించారు.

సోషలిస్టు రివల్యూషనరీలు ప్రతిపాదించిన వ్యవసాయ కార్యక్రమం భూమిపై వ్యక్తిగత స్వామ్యాన్ని రద్దుచెయ్యాలనీ, భూమిని సమాన వినియోగ సూత్రాల ప్రకారం కమ్యూన్లకు అధీనం చెయ్యాలనీ సూచించింది. బూర్జువా ప్రజాతంత్ర విప్లవ కాలంలో యీ డిమాండు రైతాంగపు ప్రయోజనాలనూ, ఆకాంక్షలనూ వస్తుపరంగా వ్యక్తంచేసింది. సోషలిస్టు రివల్యూషనరీలు యీ కార్యక్రమాన్ని "భూమి సమాజీకరణ" కార్యక్రమంగా చలామణీ చెయ్యాలని ప్రయత్నించారు. అయితే దానిలో సోషలిస్టు సారాంశమేమీ లేదు. ఎందుకంటే, లెనిన్ పేర్కొన్నట్లు, భూమిపై వ్యక్తిగత స్వామ్యాన్ని రద్దుచెయ్యడ మొక్కటే పెట్టుబడి పెత్తనాన్నీ, జనసామాన్యపు దైన్యాన్నీ తుదముట్టించదు.

1917 ఫిబ్రవరి నాటి బూర్జువా ప్రజాతంత్ర విప్లవం తర్వాత, మెన్షెవిక్కుల తోబాటు సోషలిస్టు రివల్యూషనరీలు విప్లవ ప్రతీఘాత తాత్కాలిక ప్రభుత్వానికి ప్రధానమైన రక్షణ దుర్గంగా వున్నారు. వాళ్ళ నాయకులు ఆ ప్రభుత్వంలో సభ్యులుగా కూడా పనిచేశారు. విదేశీ సైనిక జోక్యం, అంతర్యుద్ధ కాలంలో (1918–20) సోషలిస్టు రివల్యూషనరీలు సోవియట్ వ్యతిరేక తిరుగుబాట్లను ఏర్పాటు చేసి, సోవియట్ ప్రభుత్వ నాయకులకీ, కమ్యూనిస్టు పార్టీ నాయకులకీ వ్యతిరేకంగా వ్యక్తిగత టెరరిస్టు చర్యలకు పూనుకున్నారు. 1923లో సోషలిస్టు రివల్యూషనరీ పార్టీ విచ్ఛిన్నమైపోయింది. – 51.

16 లెనిన్ వ్యాసం "దేనితో ప్రారంభించాలి?" 1901 మేలో "ఇస్క్రా" 4వ సంచికలో ప్రచురింపబడింది. లెనిన్ ఆ వ్యాసంలో సోషల్ డెమొక్రటిక్ కార్యకలాపాల్లో కొత్త మలుపునూ, పార్టీ ఏర్పాటులో ఆచరణాత్మకమైన తొలి అడుగునూ, పార్టీ యితోధికాభివృద్ధికీ, సంఘాన్ని ప్రగాఢమూ విస్తృతమూ చేసేందుకూ ప్రధాన మార్గదర్శక సూత్రం — అఖిల రష్యా రాజకీయ పత్రిక స్థాపనే అని సవిస్తరంగా వివరించాడు. "పత్రిక సమష్టి ప్రచారకుడూ, సమష్టి ఆందోళనకర్తా మాత్రమే కాదు, అదొక సమష్టి సంఘటనకర్త కూడా" అని రాశాడు లెనిన్. — 52.

17 "నిర్మాణానికి సంబంధించిన మన కర్తవ్యాలపై ఒక కామ్రేడ్‌కి లేఖ" — 1902 సెప్టెంబరులో లెనిన్ రాసిన యీ లేఖ మొట్టమొదటి సారిగా 1902లో సైక్లోస్టైలు చెయ్యబడింది. ఇది పార్టీ శాఖల్లో విస్తృతంగా ప్రచారమైంది. 1904 జనవరిలో "ఒక కామ్రేడ్‌కి లేఖ," లెనిన్ ముందుమాటతో, చివరి మాటతోబాటు ఒక విడి పుస్తకంగా ప్రచురింపబడింది. — 54.

18 పార్టీ కౌన్సిలు (1903–1905) — కేంద్ర కమిటీ, కేంద్ర పత్రిక సంపాదకవర్గాల కార్యకలాపాలను సమన్వయం చేసి, సమైక్యం చేసేందుకూ, దానితోబాటు యితర పార్టీలతో వ్యవహరించేందుకూ గాను, పార్టీ నిబంధనావళికి అనుగుణంగా ఏర్పాటు చెయ్యబడిన పార్టీ అత్యున్నత సంస్థ. ఈ కౌన్సిలు అయిదుగురు సభ్యులతో కూడి వుంటుంది. ఈ అయిదుగురిలో ఒకరిని పార్టీ మహాసభ నియమించింది. యిద్దరు కేంద్ర కమిటీచేతా, యిద్దరు కేంద్ర పత్రిక సంపాదకవర్గంచేతా నియమింపబడ్డారు. కేంద్ర పత్రిక సంపాదకవర్గాన్ని మెన్షెవిక్కులు చేజిక్కించుకున్న తర్వాత, ఆ కౌన్సిలు బోల్షెవిక్కులతో పోరాటానికి ఒక పరికరం అయింది. ఆ కౌన్సిల్లో లెనిన్ పార్టీ ఐక్యత కోసం ఎడతెగని పోరాటం జరిపాడు, ఆయన విచ్ఛిన్న కార్యకలాపాలనూ, మెన్షెవిక్కుల చీలిక కార్యకలాపాలనూ బహిర్గతంచేసి, ఖండించాడు. ఆర్.ఎస్.డి.ఎల్.పి. మూడవ మహాసభ ఆమోదించిన నిబంధనావళిని అనుసరించి పార్టీ కౌన్సిలు రద్దుచెయ్యబడింది. — 57.

19 మార్తొవ్‌చేత రచింపబడి, 1904లో జెనీవాలో ప్రచురింపబడిన చిన్న పుస్తకం "రష్యన్ సోషల్ డెమొక్రటిక్ పార్టీలో 'ముట్టడి స్థితి'కి వ్యతిరేకంగా పోరాటం (ఎన్. లెనిన్ లేఖకి సమాధానం)"ను లెనిన్ ప్రస్తావిస్తున్నాడు. — 57.

20 జాకొబిన్లు — ఫ్రెంచి మహా విప్లవ కాలంలో వున్న రెండు రాజకీయ గ్రూపుల్లో ఒకదాని పేరు. జాకొబిన్లు అప్పట్లో విప్లవకర వర్గమైన బూర్జువావర్గపు అత్యంత

కృతనిశ్చయులైన ప్రతినిధులు. నిరంకుశ ప్రభుత్వాన్నీ, ఫ్యూడలిజాన్నీ రద్దుచెయ్యడం అవసరమని వాళ్ళు వాదించారు. – 59.

21 జోరేసిస్టులు – ఫ్రెంచి సోషలిస్టు ఉద్యమంలోని మితవాద, సంస్కరణవాద పక్షానికి నాయకత్వం వహించిన జె. జోరేస్ అనుయాయులు. "విమర్శనా స్వేచ్ఛ" కోసం డిమాండు మాటున జోరేసిస్టులు మార్క్సిస్టు మూల సూత్రాలను సంస్కరించేందుకు ప్రయత్నించారు. శ్రామికవర్గానికీ, బూర్జువావర్గానికీ మధ్య వర్గ సహకారం కావాలని ప్రబోధించారు. 1902లో వాళ్ళు ఫ్రెంచి సోషలిస్టు పార్టీని స్థాపించారు. అది సంస్కరణవాద వైఖరిని అవలంబించింది. – 69.

22 "జెమ్ల్యా ఇ వోల్య" ("భూమీ, స్వేచ్ఛా") – 1876 శరదృతువులో పీటర్స్‌బుర్గ్‌లో ఏర్పడిన విప్లవకర నరోద్నిక్కుల సంఘం. అంతిమ లక్ష్యంగా సోషలిజాన్ని అది పరిత్యజించకపోయినప్పటికీ, "జెమ్ల్యా ఇ వోల్య" "ఈనాటి ప్రజా డిమాండ్లు" అంటే, "భూమీ, స్వేచ్ఛా" కోసం డిమాండ్లు తీర్చడాన్ని తక్షణ లక్ష్యంగా ప్రతిపాదించింది. ఆ సంఘ సభ్యులు ప్రధానంగా వోల్గా నదీ తీర ప్రాంతాల్లోనూ, రష్యా మధ్య ప్రాంతంలోనూ ప్రచారం సాగించారు. కార్మికుల అధ్యయన బృందాల్లో కొన్నింటితో వాళ్ళకు సంబంధాలు ఉన్నప్పటికీ, కార్మికవర్గపు అగ్రగామి దళ పాత్రను వాళ్ళు తిరస్కరించినందునా, రాజకీయ పోరాట ప్రాధాన్యాన్ని అర్థంచేసుకోనందునా, కార్మికోద్యమానికి వాళ్ళు నాయకత్వం వహించలేకపోయారు, నాయకత్వం వహించకోరలేదు కూడా.

"జెమ్ల్యా ఇ వోల్య" సభ్యులు కచ్చితమైన కేంద్రీకరణ, క్రమశిక్షణల ప్రాతిపదికపైన ఘనిష్ఠమైన సంఘాన్ని నెలకొల్పారు. 1876–77 శీతకాలంలో ఆమోదింపబడిన "జెమ్ల్యా ఇ వోల్య" నిబంధనావళి మెజారిటీ నిర్ణయానికి మైనారిటీ కట్టుబడివుండాలనీ, ప్రతి ఒక్క సభ్యుడూ సంఘం మేలు కోసం విధిగా పనిచేసితీరాలనీ, వగైరా నియమాలను నిర్దేశించింది.

1879 నాటికి, రైతుల మధ్య తమ సోషలిస్టు ఆందోళన కార్యక్రమం విఫలమైనందునా, ప్రభుత్వ నిర్బంధ చర్యలు ముమ్మరమైనందునా, ఆ సంఘ సభ్యుల్లో అధిక సంఖ్యాకులు తమ కార్యక్రమం అమలుకు రాజకీయ టెరరిజమనే ప్రధాన పోరాట పద్ధతిలోకి మళ్ళనారంభించారు. ఆ సంఘంలో తలెత్తిన అభిప్రాయభేదాల కారణంగా అది చీలిపోయింది. – 70.

23 "నరోద్నయ వోల్య" ("ప్రజా స్వేచ్ఛ") – టెరరిస్టు నరోద్నిక్కుల యీ రహస్య రాజకీయ సంఘం, "జెమ్ల్యా ఇ వోల్య" సంఘం చీలిపోయిన ఫలితంగా, 1879 ఆగ

స్టులో ఏర్పడింది. నరోద్నిక్ ఊహాజనిత సోషలిజం వైఖరులకు యింకా కట్టుబడి వుంటూనే, "నరోద్నయ వోల్య" సభ్యులు అదే సమయంలో నిరంకుశ రాజరికపు కూలదోతనూ, రాజకీయ స్వేచ్ఛా సాధననూ తమ అతి ముఖ్య లక్ష్యంగా పరిగణించి, రాజకీయ పోరాటాన్ని చేపట్టారు.

"నరోద్నయ వోల్య" సభ్యులు జారిస్టు నిరంకుశ రాజరికానికి వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడారు. కాని "క్రియాశీల" వీరులూ, "క్రియాశూన్య" జనసామాన్యం అన్న తప్పుడు సిద్ధాంతాన్ని నమ్మిన మూలంగా, ప్రజల భాగస్వామ్యం లేకుండా, తమ సొంత కృషి ద్వారా, వ్యక్తిగత టెరరిస్టు చర్యల ద్వారా, సమాజాన్ని పునర్నిర్మించగలమని ఆశించారు. 1881లో, ప్రభుత్వం క్రూరమైన ప్రతీకార చర్యలకూ, మరణశిక్షలకూ, కవ్వింపు చర్యలకూ పూనుకొని, "నరోద్నయ వోల్య"ని అణచివేసింది.

"నరోద్నయ వోల్య" సభ్యుల తప్పుడు, ఊహాజనిత కార్యక్రమాన్ని విమర్శిస్తూనే, జారిజానికి వ్యతిరేకంగా వాళ్ళు జరిపిన నిస్వార్థ పోరాటాన్ని లెనిన్ చాలా గౌరవ దృష్టితో ప్రస్తుతించాడు. – 70.

24 మనీలొవిజం (అసమ్మతి సూచకంగా) – ఆత్మ సంతృప్తితో కూడిన నిర్లిప్తతను ప్రదర్శించడం, శుష్కమైన పగటి కలలు కనడం, సోమరితనం. (గోగొల్ రాసిన "మృత జీవులు" అనే నవలలోని మనీలొవ్ అనే పాత్రను బట్టి యీ పేరు వచ్చింది.) – 73.

25 ఇది 1900లో హాంబుర్గ్‌లో తాపీపనివారి సమ్మె జరిగిన సందర్భంగా 122 మంది సభ్యులు గల తాపీపనివారి గ్రూపు ప్రవర్తనకు సంబంధించిన ప్రస్తావన. "Free Masons' Union" ("తాపీపనివారి స్వేచ్ఛా సంఘం") సభ్యులైన యీ 122 మంది తాపీపనివారూ, ట్రేడ్ యూనియన్ నాయకత్వపు ఆదేశాలను ధిక్కరించి సమ్మెకాలంలో కట్టుకూలి రేట్లపై పనిచేశారు. "హాంబుర్గ్ తాపీపనివారి సంఘం" యీ గ్రూపు సభ్యుల సమ్మె విచ్ఛిన్నకర కర్యకలాపాలను గురించి, వారు సభ్యులుగా వున్న ఆయా స్థానిక పార్టీ శాఖలకు ఫిర్యాదుచేసింది. అవి యీ విషయాన్ని జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ కేంద్ర కమిటీ ముందు పెట్టాయి. మధ్యవర్తిత్వం కోసం కేంద్ర కమిటీ నియమించిన పార్టీ కోర్టు "తాపీపనివారి స్వేచ్ఛా సంఘం" సభ్యులైన ఆ సోషల్ డెమోక్రట్ల ప్రవర్తనను ఖండించింది గాని, వాళ్లను పార్టీనుంచి బహిష్కరించాలన్న ప్రతిపాదనను తోసిపుచ్చింది. – 77.

26 లెనిన్ 1897 చివరిలో తను రాసిన "రష్యన్ సోషల్ డెమోక్రట్ల కర్తవ్యాలు" అనే వ్యాసాన్ని ప్రస్తావిస్తున్నాడు. – 80.

27 మెన్షెవిక్ ఎస్. జ్బొరోవ్‌స్కీ (కోస్త్రిచ్) ప్రతిపాదించగా మహాసభ తిరస్కరించిన తీర్మానం పార్టీ నిబంధనావళిలోని మొదటి నిబంధనను యిలా సూత్రీకరించింది: "పార్టీ కార్యక్రమాన్ని గుర్తించి, దానికి పాదార్థికంగా తోడ్పాటునిస్తూ, ఏదో ఒక పార్టీ శాఖ నాయకత్వంలో పార్టీకి వ్యక్తిగతంగా సహాయం చేసేవాడిని సభ్యుడుగా ఆ పార్టీ శాఖ పరిగణిస్తుంది." – 81.

28 జెనీవాలోని పార్టీ ముద్రణాలయంలో 1903 డిసెంబరులో ముద్రింపబడిన తన "'ఇస్క్రా' సంపాదకవర్గానికి లేఖ ('ఇస్క్రా' సంపాదకవర్గంనుంచి నేనెం దుకు రాజీనామా చేశాను)"ను లెనిన్ యిక్కడ ప్రస్తావిస్తున్నాడు. – 92.

29 ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభలో 16 మంది "ఇస్క్రా" సభ్యులు వున్నారు. వారిలో తొమ్మిది మంది లెనిన్ నాయకత్వంలో మెజారిటీగానూ, ఏడుగురు మార్తొవ్ నాయకత్వాన మైనారిటీగానూ ఏర్పడ్డారు. – 94.

30 ఇవాన్ ఇవానొవిచ్, ఇవాన్ నికీఫొరొవిచ్ – గోగొల్ కథల్లోని పాత్రలు. – 96.

31 ఔగేయన్ గుర్రపుశాలలు – గ్రీక్ పురాణాల ప్రకారం ఎల్లిడ రాజు ఔగేయస్‌కి చెందిన యుగాల తరబడిగా శుభ్రం చెయ్యని పెద్దపెద్ద మురికి గుర్రపుశాలలు. హెర్క్యులెస్ అనే భీమబలుడు ఒకే ఒక్క రోజులో వాటినన్నింటినీ శుభ్రం చేశాడు. "ఔగేయన్ గుర్రపుశాలలు" అనే పదబంధం పౌర వ్యవహారాల్లోనూ, వ్యాపారంలోనూ ఉన్న విస్తారమైన చెత్తా చెదారానికీ, మురికికీ లేక విపరీతమైన నిర్లక్ష్యానికీ, క్రమరాహిత్యానికీ పర్యాయపదం అయింది. – 96.

32 "శ్రమ విమోచన" గ్రూపు – జి. వి. ప్లెహానొవ్ 1883లో జెనీవాలో స్థాపించిన తొట్టతొలి రష్యన్ మార్క్సిస్టు గ్రూపు. రష్యాలో మార్క్సిజాన్ని వ్యాపింపజెయ్యడానికి ఆ గ్రూపు విస్తారమైన కృషి జరిపింది. మార్క్సిజం మూల పురుషుల రచనలను యీ గ్రూపు రష్యన్ భాషలోకి అనువదించి, విదేశాల్లో ప్రచురించి, రష్యాలో పంచింది. ప్లెహానొవ్ రచనలు మార్క్సిస్టు భావాలను వ్యాపింపజెయ్యడంలో ముఖ్యమైన పాత్ర వహించాయి. ఆ గ్రూపు అంతర్జాతీయ కార్మికోద్యమంతో సంబంధాలు నెలకొల్పుకుంది. అయితే "శ్రమ విమోచన" గ్రూపు తీవ్రమైన పొరపాట్లు కూడా చేసింది. అవే ప్లెహానొవ్, తదితర సభ్యులూ భవిష్యత్తులో అవలంబించిన అవకాశవాద అభిప్రాయాలకు దారితీశాయి. ఆ గ్రూపు 1903దాకా ఉంది. – 98.

33 జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ మహాసభ (1895) బ్రెస్లౌలో అక్టోబరు 6–12 తేదీల మధ్య జరిగింది. ఆ మహాసభ వ్యవసాయ కార్యక్రమ ముసాయిదా చర్చపైన

తన దృష్టిని కేంద్రీకరించింది. ఆ ముసాయిదాలో తీవ్రమైన పొరపాట్లు వున్నాయి. శ్రామికవర్గ పార్టీని "యావత్ ప్రజా" పార్టీగా మార్చాలన్నది ప్రత్యేకించి ఈ పొరపాట్లలో ఒకటి. అవకాశవాదులు కాకుండా ఆ ముసాయిదాను ఎ. బేబెల్, వి. లీబ్‌క్నెఖ్ట్‌లు బలపరచారు. ఆ వ్యవసాయ కార్యక్రమ ముసాయిదాను ఆ మహాసభలో కార్ల్ కౌట్స్కీ, క్లారా జెట్కిన్, తదితర సోషల్ డెమోక్రట్లూ తీవ్రంగా విమర్శించారు. ముసాయిదా వ్యవసాయ కార్యక్రమాన్ని మెజారిటీ వోట్లతో ఆ మహాసభ తిరస్కరించింది. – 102.

34 ఇది గ్యోతె రాసిన "ఫౌస్ట్"లో మార్గరెటా మాటలకు ప్రస్తావన (మెఫిస్టోఫెల్‌తో స్నేహంచేసినందుకు మార్గరెటా ఫౌస్ట్‌ను చీవాట్లు పెడుతుంది). ఆ మాటల్ని జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ మహాసభలో తాను చేసిన ప్రసంగంలో క్లారా జెట్కిన్ జ్ఞప్తిననుసరించి ఉల్లేఖించింది. – 103.

35 అరక్చేయెవ్ సరళి – రష్యన్ మంత్రి ఎ. ఎ. అరక్చేయెవ్ పేరుమీద వచ్చిన మాట. 1815–25 మధ్య ప్రభుత్వ వ్యవహారాలను నిర్వహించిన అరక్చేయెవ్ అత్యంత అభివృద్ధి నిరోధక విధానాన్నీ, సైన్యంలో అతి కఠినమైన క్రమశిక్షణనూ, కవాతు పద్ధతులనూ అనుసరించాడు. – 109.

36 థియోక్రసీ (గ్రీకు పదం "థియోస్" – భగవంతుడు, "క్రటోస్" – అధికారం) – ఒక పరిపాలన రూపం. అందులో ప్రభుత్వాధిపతి (సాధారణంగా రాజు) ఏక కాలంలో మతాధిపతిగా కూడా వుంటాడు.

పి. అక్సెల్‌రోడ్ రాసిన "రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమాన్ని ఐక్యం చెయ్యడమూ, దాని కర్తవ్యాలూ" అన్న వ్యాసాన్ని లెనిన్ యిక్కడ ప్రస్తావిస్తున్నాడు. 1903 డిసెంబరు 15న "ఇస్క్రా" 55వ సంచికలో ప్రచురింపబడిన యీ వ్యాసం బోల్షెవిక్ పార్టీ నిర్మాణ సూత్రాలకు వ్యతిరేకంగా ఉద్దేశింపబడింది. – 110.

37 ఆర్.ఎస్.డి.ఎల్.పి. మొదటి మహాసభ (1898) 1894లో జెనీవాలో నెలకొల్పబడిన "దేశాంతర రష్యన్ సోషల్ డెమోక్రట్ల యూనియన్"ను విదేశాల్లో పార్టీ ప్రతినిధిగా గుర్తించింది. కాని, 1899నుంచి ఆ యూనియన్ నాయకత్వం అవకాశవాద వైఖరిని వహించింది, ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభ 1903లో ఆ యూనియన్‌ను రద్దుచేసింది. – 121.

38 Tagesordnung వ్యాఖ్య – పార్టీ రెండవ మహాసభ ఎజెండా, కాలపరిమితుల ముసాయిదాకి సంబంధించిన తన వ్యాఖ్యలను లెనిన్ అలా పిలిచాడు. – 126.

39 ప్రముఖ పార్టీ నాయకుడు జి. ఎమ్. క్రిజిజనోవ్‌స్కీకి యిది ప్రస్తావన. – 128.

40 ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభలో అర్థికవాది అకీమొవ్ ప్రసంగాన్ని లెనిన్ ఇక్కడ ప్రస్తావిస్తున్నాడు. "ఇస్క్రా" ప్రతిపాదించిన పార్టీ ముసాయిదా కార్యక్రమాన్ని అతను, కార్యక్రమ పాఠంలో "శ్రామికవర్గం" అన్న పదం ప్రథమా విభక్తిలో కాక, షష్ఠీ విభక్తిలో వాడబడిన కారణం చూపి విమర్శించాడు. శ్రామికవర్గ ప్రయోజనాలనుంచి పార్టీని వేరుజేసే ధోరణి దానిలో కనబడుతున్నదని అకీమొవ్ అభిప్రాయపడ్డాడు. – 155.

41 "ఒస్వొబొజ్దేనియె" ("విమోచన") – ఉదారవాద బూర్జువావర్గపు రహస్య పత్రిక. ఈ పత్రిక 1902–05 మధ్య ష్టుట్‌గార్ట్‌లోనూ, పారిస్‌లోనూ ప్రచురింపబడింది. – 156.

42 మహీధరం, జిరోండా – ఫ్రెంచి మహా విప్లవ కాలంలోని రెండు బూర్జువావర్గ రాజకీయ గ్రూపుల పేర్లు.

మహీధరం – అన్నది జాకొబిన్ల పేరు (వివరణ 20 చూడండి).

జిరోండిస్టులు – ప్రధానంగా వర్తక-పారిశ్రామిక, వ్యావసాయిక బూర్జువావర్గానికి ప్రాతినిధ్యం వహించారు. బడా బూర్జువావర్గానికి దుర్గమైన జిరోండా డిపార్టుమెంటు (జిల్లా)నుంచి వాళ్లకి యీ పేరు వచ్చింది. జాకొబిన్లకి భిన్నంగా, జిరోండిస్టులు విప్లవానికీ, విప్లవ ప్రతీఘాతానికీ మధ్య ఊగిసలాడి, రాజరికంతో రాజీ విధానాన్ని అనుసరించారు.

"సోషలిస్టు జిరోండా" – సోషల్ డెమొక్రటిక్ ఉద్యమంలోని అవకాశవాద ధోరణికి లెనిన్ యీ పేరు పెట్టాడు. ఆర్.ఎస్.డి.ఎల్.పి. బోల్షెవిక్కులుగానూ, మెన్షెవిక్కులుగానూ విడిపోయాక, మెన్షెవిక్కులు కార్మికోద్యమంలో జిరోండిస్టు ధోరణికి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు లెనిన్ తరచుగా వక్కాణించి చెప్తూవచ్చాడు. – 166.

43 వొరొనెజ్ కమిటీ, సెంట్ పీటర్స్‌బుర్గ్ "కార్మిక సంఘం" అర్థికవాదుల చేతుల్లో ఉన్నాయి, లెనిన్ "ఇస్క్రా" పట్లా, మార్క్సిస్టు పార్టీ నిర్మాణం కోసం అది వేసిన పథకంపట్లా అవి శత్రు వైఖరిని వహించాయి. – 168.

44 స్తరొవేర్ తుది హెచ్చరిక – స్తరొవేర్ (ఎ. పొత్రేసొవ్) జి. వి. ప్లెహానొవ్‌కి 1903 అక్టోబరు 21 (నవంబరు 3)న రాసిన లేఖ. ఈ లేఖలో పొత్రేసొవ్ మెన్షెవిక్ ప్రతిపక్షం తరఫున వాదించి, "ఇస్క్రా" పాత సంపాదకవర్గాన్ని పునరుద్ధరించాలనీ, కేంద్ర కమిటీకీ, పార్టీ కౌన్సిలుకీ (వివరణ 18 చూడండి) మెన్షెవిక్కులను కో-అప్ట్

చేసుకోవాలనీ, దేశాంతర రష్యన్ రివల్యూషనరీ సోషల్ డెమోక్రట్ల లీగు రెండవ మహాసభ (వివరణ 7 చూడండి) ఆమోదించిన నిర్ణయాల చెల్లుబాటును గుర్తించాలనీ డిమాండు చేశాడు. – 168.

45 కేంద్ర కమిటీలోని ఆ కొత్త సభ్యుడు ఫ్రీడ్రిక్ లేన్గ్నిక్. వృత్తి విప్లవకారుడూ, బోల్షెవిక్కూ అయిన లేన్గ్నిక్, 1903 సెప్టెంబరులో రష్యానుంచి జెనీవాకు వచ్చాడు. – 177.

46 "జర్యా" ("ఉషస్సు") – మార్క్సిస్టు శాస్త్రీయ, రాజకీయ పత్రిక. "ఇస్క్రా" సంపాదకవర్గం దీన్ని ష్టుట్‌గార్ట్‌లో 1901–02 సంవత్సరాల్లో ప్రచురించింది. మొత్తంమీద దీని సంచికలు నాలుగు వెలువడ్డాయి. – 178.

47 జేమ్‌స్త్వో – ప్రభువర్గాల నాయకత్వాన వుండిన స్థానిక స్వపరిపాలన సంస్థ. యీ సంస్థలు రష్యాలోని కేంద్ర ప్రాంతాల్లో 1864లో ప్రవేశపెట్టబడ్డాయి. వీటి కార్యకలాపాలు స్థానిక ఆర్థిక వ్యవహారాలకు పరిమితమైనవి: ఆస్పత్రులు యేర్పాటు చేయడం, రోడ్లు నిర్మించడం, ఇన్సూరెన్స్ వగైరా. యీ కార్యకలాపాలు గవర్నర్లచేతా, హోం మంత్రిత్వ శాఖచేతా అజమాయిషీ చేయబడ్డాయి. – 187.

48 జెనీవా నగరపు రెండు శివార్లకు – carouge, cluse లకు – బహుశా యిది ప్రస్తావన. అక్కడ మెజారిటీని బలపరచేవారూ, మైనారిటీని బలపరచేవారూ ఉండేవారు. – 195.

49 సొబకేవిచ్ – ఎన్. ఎస్. గోగొల్ రాసిన నవల "మృత జీవులు"లోని ఒక దురాశాపాతకుని పాత్ర. అతని ఆసక్తులు తన వ్యక్తిగత సంక్షేమానికీ, తన తిండితీర్థాలకీ మాత్రమే పరిమితమై వుంటాయి. – 197.

50 1904–05 సంవత్సరాల్లో రష్యా–జపాన్ యుద్ధం జరుగుతోంది. దీన్ని జపానే మొదలెట్టింది. 1904లోని ప్రధాన ఘటన పోర్ట్ ఆర్థర్‌మీద జపాన్ నౌకా సైన్యం జరిపిన దాడి, 1905లో ముక్డెన్ దగ్గర రష్యన్ సైన్యమూ, చుసీమ దగ్గర రష్యన్ నౌకా సైన్యమూ ఘోర పరాజయం పాలయ్యాయి. శాంతి ఒడంబడికతో ముగిసిన ఆ యుద్ధం, రష్యాలోని వైరుధ్యాలన్నింటినీ మరింతగా పెంపొందించి, విప్లవాన్ని త్వరితం చేసింది. – 199.

51 బజారొవ్ – తుర్గేనెవ్ రాసిన "తండ్రులూ, కొడుకులూ" అన్న నవలలో ప్రధాన పాత్ర. – 200.

52 బోల్షెవిక్ ఎఫ్. లేన్గ్నిక్‌కి యిది ప్రస్తావన. – 200.

53 "ఇస్క్రా" 53వ సంచికలో (1903 నవంబరు 25), లెనిన్ రాసిన "'ఇస్క్రా' సంపాదకవర్గానికి లేఖ"తోబాటు, జి. వి. ప్లెహానొవ్ రాసిన సంపాదకవర్గ సమాధానం కూడా ప్రచురింపబడింది. లెనిన్ తన లేఖలో, బోల్షెవిక్కులకీ, మెన్షెవిక్కులకీ మధ్య సూత్రాల విషయంలో తలెత్తిన అభిప్రాయభేదాల మధ్య పత్రికల్లో చర్చావేదిక నిర్వహింపబడాలని సూచించాడు. ఈ అభిప్రాయభేదాలను "బృందపు సరళి జీవితానికి సంబంధించిన జగడాలు"గా అభివర్ణించి, ప్లెహానొవ్ లెనిన్ సూచనను తిరస్కరించాడు. – 201.

54 "రివలుత్సియోన్నయ రొస్సీయా" ("విప్లవ రష్యా") – 1900–05 మధ్య సోషలిస్టు రివల్యూషనరీల పార్టీ రహస్య పత్రిక. 1902 జనవరినుండి అది సోషలిస్టు రివల్యూషనరీ పార్టీ అధికార పత్రికగా విదేశాల్లో ప్రచురింపబడింది. – 201.

55 ప్లెహానొవ్ రాసిన "హాస్యాస్పదమైన అపార్థం" (1903 డిసెంబరు 15వ తేదీ నాటి "ఇస్క్రా" 55వ సంచిక), "విచారకరమైన అపార్థం" (1904 జనవరి 15 నాటి "ఇస్క్రా" 57వ సంచిక) అనే వ్యాసాలకు లెనిన్ ప్రస్తావన. – 201.

56 బోనపార్టిజం – సైన్యంమీదా, అభివృద్ధి నిరోధక వైఖరులు కలిగిన రైతాంగ శ్రేణిమీదా ఆధారపడిన విప్లవ ప్రతీఘాత నియంతృత్వం. ఈ నియంతృత్వం, వర్గ శక్తుల మధ్య వున్న అస్థిర సరితూకపు పరిస్థితుల్లో పరస్పరం పోరాడే వర్గాల మధ్య ఎత్తుగడలు పన్నింది. అది ప్రజాస్వామ్యంమీదా, విప్లవోద్యమంమీదా దాడి విధానానికి వాగాడంబరాన్ని జోడించింది. (1799లో సైనిక నియంతృత్వాన్ని నెలకొల్పిన నెపోలియన్ బోనపార్ట్‌నుంచి ఈ పదం ఉత్పన్నమైంది.) – 203.

57 మంత్రిత్వవాదం (లేక "మంత్రిత్వవాద సోషలిజం," లేక "మిలెరానిజం") – బూర్జువా వర్గపు అభివృద్ధి నిరోధక ప్రభుత్వాల్లో సోషలిస్టులు పాల్గొనాలన్న అవకాశవాద ఎత్తుగడలు. 1899లో, బూర్జువా ప్రభుత్వంలో మంత్రిగా చేరిన ఫ్రెంచి సోషలిస్టు మిలెరాన్ పేరుమీద వచ్చిన పదం యిది. – 208.

58 "చట్టబద్ధ మార్క్సిజం"యొక్క అత్యంత ప్రముఖ ప్రతినిధి పి. స్త్రూవె అభిప్రాయాలకు యిది ప్రస్తావన. స్త్రూవె 1894లో "రష్యా ఆర్థికాభివృద్ధి సమస్యకు విమర్శనాత్మక వివరణలు" అన్న పుస్తకం రాశాడు. 1894 ఆకురాలు కాలంలో, సెంట్ పీటర్స్‌బుర్గ్ అధ్యయన బృందంలో, "బూర్జువా సాహిత్యంలో మార్క్సిజం ప్రతి

బింబం'' అనే అంశంపై లెనిన్ క్లుప్తంగా ప్రసంగించాడు. ఆ ప్రసంగపు ప్రధానాంశాలు పి. స్త్రూవె, తదితర "చట్టబద్ధ మార్క్సిస్టుల'' అభిప్రాయాల ఖండనకు ఉద్దేశింపబడ్డాయి. తర్వాత, 1894 చివరా, 1895 మొదట్లోనూ లెనిన్ రచించిన "నరోదిజపు ఆర్థిక సారాంశం, స్త్రూవెగారి పుస్తకంలో దానిమీద విమర్శ''కు పై ప్రధానాంశాలు ప్రాతిపదిక అయ్యాయి. – 208.

59 బ్లాంకీయిజం – ప్రముఖ ఫ్రెంచి విప్లవకారుడూ, ఊహాజనిత కమ్యూనిజపు సుప్రసిద్ధ ప్రతినిధీ అయిన లూయీ ఔగుస్ట్ బ్లాంకీ పేరుతో ముడిబడిన రాజకీయ ధోరణి.

బ్లాంకీయిస్టులు వర్గపోరాటాన్ని తిరస్కరించారు; విప్లవానికి అనువైన పరిస్థితి లేకపోయినప్పటికీ, విప్లవకర వర్గంతో సంబంధం లేని కుట్రదారుల ఒక చిన్న గ్రూపు విజయవంతంగా తిరుగుబాటును నిర్వహించగలదని విశ్వసించారు. – 209.

60 ఎల్. మార్తొవ్ రాసిన "సన్నాహం చెయ్యడానికి మార్గం యిదేనా?'' అనే వ్యాసానికి యిది ప్రస్తావన. "ఇస్క్రా''లో ప్రచురింపబడిన యీ వ్యాసంలో, అఖిల రష్యా సాయుధ తిరుగుబాటుకు సన్నాహాలను మార్తొవ్ ఖండించాడు. అవి వట్టి ఊహాజనితం, కుట్ర తప్ప మరేమీ కావని అన్నాడు. – 211.

61 రష్యన్ మహాకవి ఎమ్. యె. లేర్మొన్‌తొవ్ గీతం "జర్నలిస్టు, పాఠకుడు, రచయిత'' నుంచి లెనిన్ యిక్కడ ఒక పంక్తిని ఉల్లేఖిస్తున్నాడు. – 212.

62 "సమకాలీన రష్యన్ సోషలిస్టు కీర్తన'' అనే వ్యంగ్య రచననుండి లెనిన్ యిక్కడ ఉల్లేఖిస్తున్నాడు. అది "జర్యా'' సంచిక 1 (1901 ఏప్రిల్)లో ప్రచురింపబడింది. తమ ఎత్తుగడలను సద్యోజనిత ఉద్యమానికి అన్వయించేందుకు ప్రయత్నిస్తున్న ఆర్థిక వాదులను రచయిత యిందులో అపహాస్యం చేశాడు. ఈ "కీర్తన''ను ఎల్. మార్తొవ్ రచించాడు. – 219.

63 ఒబ్లోమొవ్ సరళి – దుర్బల సంకల్పం, అకర్మణ్యత, సోమరితనం. ఐ. ఎ. గొంచరోవ్ "ఒబ్లోమొవ్'' పేరుతో రచించిన నవలలోని ప్రధాన పాత్ర ఒబ్లోమొవ్‌నుంచి ఈ పేరు ఉత్పన్నమైంది. – 221.

64 1904 ఫిబ్రవరి 25న "ఇస్క్రా''లో ఎల్. మార్తొవ్ రచించిన "తరవాత వంతు ఎవరిది?'' అన్న వ్యాసానికి ప్రస్తావన యిది. ఆ వ్యాసంలో మార్తొవ్, స్థానిక కమిటీల కూర్పు విషయంలో స్థానిక పార్టీ కమిటీలకు ఆర్.ఎస్.డి.ఎల్.పి. కేంద్ర కమిటీ నుంచి "స్వతంత్రం'' కావాలని వాదించాడు. – 224.

65 జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ డ్రెస్డెన్ మహాసభ 1903 సెప్టెంబరు 13–20 తేదీలలో జరిగింది. పార్టీ ఎత్తుగడలు, రివిజనిజానికి వ్యతిరేకంగా పోరాటం అనే సమస్యలమీద ఆ మహాసభ తన దృష్టిని కేంద్రీకరించింది. కాని, ఆ మహాసభ సుసంగతమైన వైఖరిని అవలంబించలేదు: జర్మన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలోని రివిజనిస్టులను మహాసభ పార్టీనుండి బహిష్కరించలేదు, మహాసభానంతరం రివిజనిస్టులు తమ అవకాశవాద అభిప్రాయాల ప్రచారాన్ని కొనసాగించారు. – 226.

66 "Sozialistische Monatshefte" ("సోషలిస్టు మాసపత్రిక") – జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీలోని అవకాశవాదుల ప్రధాన పత్రిక (జర్నల్), అంతర్జాతీయ అవకాశవాద పత్రికల్లో ఒకటైన యీ జర్నల్ 1897నుంచి 1933వరకు బెర్లిన్‌లో ప్రచురింపబడింది. – 226.

67 "Frankfurter Zeitung" ("ఫ్రాంక్‌ఫుర్ట్ పత్రిక") – 1856నుంచి 1943వరకు మెయిన్ నదీ తీరాన గల ఫ్రాంక్‌ఫుర్ట్‌లో ప్రచురింపబడిన జర్మన్ బడా స్టాక్ ఎక్స్‌చేంజి వ్యాపారుల దినపత్రిక. 1949లో "Frankfurter Allgemeine Zeitung" ("ఫ్రాంక్‌ఫుర్ట్ సార్వజనిక వార్తాపత్రిక") పేర యిది పునరుద్ధరింపబడింది. – 231.

68 మిలెరానిజం – మంత్రిత్వవాదం చూడండి (వివరణ 57). – 232.

69 "తరవాత వంతు ఎవరిది?" అన్న వ్యాసానికి అనుబంధంగా ప్రచురింపబడిన "ఆర్.ఎస్.డి.ఎల్.పి. సంక్షిప్త రాజ్యాంగం" అనే వ్యంగ్య రచనకు యిది ప్రస్తావన. ఎల్. మార్తొవ్ రచించిన యీ "సంక్షిప్త రాజ్యాంగం" 1904 జనవరి 25 నాటి "ఇస్క్రా" 58వ సంచికలో ప్రచురింపబడింది. బోల్షెవిక్ నిర్మాణ సూత్రాలను గురించి వ్యంగ్యంగా ప్రస్తావిస్తూ అతను బోల్షెవిక్కులు మెన్షెవిక్కులపట్ల అన్యాయ వైఖరి వహిస్తున్నారని ఆరోపించాడు. బోల్షెవిక్కులు "బెదిరించేవాళ్ళు," మెన్షెవిక్కులు "బెదిరింపబడుతున్నవాళ్ళు" అన్న అర్థంలో మార్తొవ్ రాశాడు. – 236.

70 రష్యాలో 1905వ సంవత్సరం ముఖ్యమైన చారిత్రక సంఘటనలతో మొదలైంది. జనవరి 3న, సెంట్ పీటర్స్‌బుర్గ్‌లోని పుతీలొవ్ కర్మాగారంలో (ఈనాడు అది లెనిన్‌గ్రాడ్‌లో ఎస్. ఎమ్. కీరొవ్ పేర వున్న కర్మాగారం) ఒక సమ్మె చెలరేగింది. దానిలో 13 వేలమంది కార్మికులు పాల్గొన్నారు. ఇతర పరిశ్రమల్లోని కార్మికులు ఆ సమ్మెదారులను బలపరిచారు, దానితో జనవరి 7న అది సార్వత్రిక సమ్మె అయింది.

జారిస్టు ప్రభుత్వం కార్మికోద్యమాన్ని శాయశక్తులా అణచివేసేందుకు ప్రయత్నించింది. దాన్ని మొగ్గలోనే తుంచేసి, కార్మికులను భయభ్రాంతులను చెయ్యగలమన్న ఆశతో ప్రభుత్వం కార్మికులను రక్తవాహినుల్లో ముంచెత్తేందుకు సన్నాహాలు మొదలెట్టింది. 40 వేలమందికి పైగా సైనికులూ, పోలీసులూ సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో కేంద్రీకరింపబడ్డారు. 9 వేలమంది కార్మికులను సభ్యులుగా కలిగి, మతబోధకుడు గపోన్ నాయకత్వంలో వున్న "సెంట్ పీటర్స్‌బుర్గ్ ఫాక్టరీ, కర్మాగార కార్మికుల సంఘం" ప్రత్యేకించి చురుకుగా ఉండేది. సెక్యూరిటీ పోలీసు ఏజెంటైన గపోన్, కార్మికులు జారు దగ్గరకు ఊరేగింపుగా వెళ్లి, తమ మహజరును ఆయనకు సమర్పించాలని ప్రతిపాదించాడు. కార్మికులు గపోన్‌ని నమ్మి, అతని ప్రతిపాదనను అంగీకరించారు. ఆ మాదిరి మహజర్ల వల్ల ఫలితమేమీ ఉండదని బోల్షివిక్కులు హెచ్చరించారు, కాని, ఆ ఊరేగింపును నివారించడం తమ వల్ల కాదని గ్రహించిన బోల్షివిక్కులు, కార్మికులతో బాటు తామూ వెళ్లేందుకు నిర్ణయించుకున్నారు.

బోల్షివిక్కులు చేసిన హెచ్చరిక పూర్తిగా సరైనదని రుజువైంది. 1905 జనవరి 9వ తేదీ, ఆదివారం రోజున, సెంట్ పీటర్స్‌బుర్గ్‌కి చెందిన 1 లక్షా, 40 వేల మంది శ్రామికులు, తమ భార్యా బిడ్డలతో బాటు – తద్వారా తమ ఊరేగింపుయొక్క శాంతియుత స్వభావాన్ని వక్కాణిస్తూ – జారు భవనానికి బయల్దేరారు. అక్కడ వాళ్లకి తుపాకి కాల్పులు ఎదురయ్యాయి. వెయ్యి మందికి పైగా మృత్యువాతబడ్డారు, రెండు వేలమంది గాయపడ్డారు. 1905 జనవరి 9వ తేదీకి "రక్తప్లావిత ఆదివారం"గా పేరు వచ్చింది. – 256.

71 <u>యుద్ధనౌక "పొత్యోమ్కిన్"లో తిరుగుబాటు</u> 1905 జూన్ 14 (27)న ప్రజ్వరిల్లింది. తిరుగుబాటు చేసిన ఆ యుద్ధనౌక, సార్వత్రిక సమ్మె సాగుతున్న ఒదేస్సకి వచ్చింది. కాని, ఒదేస్స కార్మికులూ, నావికులూ సంయుక్త కార్యాచరణలకు ఏర్పడిన సానుకూల పరిస్థితులను వినియోగించుకోలేదు. ఒదేస్స బోల్షివిక్ శాఖ, దాని సభ్యులు చాలమంది అరెస్టు చెయ్యబడినందువల్లా, వారి మధ్య ఐక్యత కొరవడినందువల్లా, బలహీనపడింది. మెన్షివిక్కులు సాయుధ తిరుగుబాటును వ్యతిరేకించి, కార్మికులనూ, నావికులనూ దాడికి పూనుకోకుండా వెనక్కిలాగారు. జారిస్టు ప్రభుత్వం "పొత్యోమ్కిన్" తిరుగుబాటుదారులను అణచిపారెయ్యవలసిందిగా మొత్తం నల్ల సముద్ర నౌకాదళానికి ఆజ్ఞ జారీచేసింది. కాని, ఆ నావికులు "పొత్యోమ్కిన్" యుద్ధనౌకమీద కాల్పులు జరిపేందుకు నిరాకరించారు. ఆఫీసర్లకు నౌకలను ఉపసంహరించక గత్యంతరం లేకపోయింది. "పొత్యోమ్కిన్" పదకొండు రోజులబాటు నల్ల సముద్రంలో

తిరుగాడాక, ఆహార పదార్థాలూ, బొగ్గూ తరిగిపోయిన కారణంగా, నావికులు నౌకను రుమేనియన్ తీరానికి చేర్చి స్థానిక అధికారులకు లోబరచవలసివచ్చింది. ఆ నౌక సైనికుల్లో అధిక సంఖ్యాకులు విదేశాల్లో ఉండిపోయారు, రష్యాకు తిరిగివచ్చిన వాళ్లు నిర్బంధింపబడి, కోర్ట్ మార్షల్ చెయ్యబడ్డారు.

"పొత్యోమ్కిన్" తిరుగుబాటు విఫలమైంది, కాని, ఓ పెద్ద ఓడలోని నావికులు విప్లవంలో చేరడమన్నది నిరంకుశ రాజరికానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాభివృద్ధిలో ముఖ్యమైన ఒక ముందడుగు అయింది. – 260.

72 "ప్రొలెతారియ్" ("శ్రామికుడు") – బోల్షెవిక్ రహస్య వారపత్రిక పేరు. ఆ ఆర్.ఎస్.డి.ఎల్.పి. కేంద్ర పత్రిక ఆర్.ఎస్.డి.ఎల్.పి. మూడవ మహాసభ నిర్ణయం మేరకు స్థాపించబడింది. ఆ పత్రిక ప్రధాన సంపాదకుడు లెనిన్. 1905 మే–నవంబరు మాసాల మధ్య జెనీవాలో ప్రచురింపబడిన ఆ పత్రిక పాత, లెనినిస్టు "ఇస్క్రా" విధానాన్ని అనుసరించింది. – 260.

73 సోషలిస్టు రివల్యూషనరీ పార్టీ కార్యక్రమం ఫిన్లాండులో 1905 డిసెంబరు 29 నుంచి 1906 జనవరి 6వరకు జరిగిన మొదటి మహాసభలో ఆమోదింపబడింది. – 260.

74 నరోదిజం – రష్యన్ విప్లవోద్యమంలో 1860, 1870 దశకాల్లో తలెత్తిన ఒక పెటీబూర్జువా ధోరణి. జారిస్టు నిరంకుశ రాజరికపు రద్దు కోసమూ, రైతాంగానికి భూస్వాముల భూముల బదలాయింపు కోసమూ నరోద్నిక్కులు బాహాటంగా ముందుకొచ్చారు. అదే సమయంలో, రష్యాలో పెట్టుబడిదారీ సంబంధాల అభివృద్ధి క్రమబద్ధతను వాళ్లు నిరాకరించారు, ఆ కారణంగా, శ్రామికవర్గాన్ని కాక రైతాంగాన్ని వాళ్లొక విప్లవ శక్తిగా పరిగణించారు. వాళ్లు గ్రామ కమ్యూనులో సోషలిజం బీజం వుందని భావించారు. నిరంకుశ రాజరికానికి వ్యతిరేకంగా తిరగబడమని రైతులను చైతన్యోద్దీపితులను చేసే ప్రయత్నంలో నరోద్నిక్కులు "ప్రజల మధ్యకి" వెళ్లారు. కాని వాళ్లకి అక్కడ తోడ్పాటు లభించలేదు.

నరోద్నిక్ సోషలిజం ఊహాజనిత సోషలిజం మాదిరిది. అందుకు అది సమాజపు వాస్తవికాభివృద్ధిమీద ఆధారపడకపోవడమే కారణం. విప్లవ ప్రజాస్వామ్యంనుంచి లిబరలిజందాకా నరోదిజం అనేక దశలు గడిచింది.

1880, 1890 దశకాల్లో నరోద్నిక్కులు జారిజంతో రాజీ మార్గాన్ని చేబట్టారు, కులాక్కుల ప్రయోజనాలను సమర్థించారు, మార్క్సిజానికి వ్యతిరేకంగా పోరాడారు. – 261.

75 ఆర్.ఎస్.డి.ఎల్.పి. మూడవ మహాసభ లండన్‌లో 1905 ఏప్రిల్ 12–27 (ఏప్రిల్ 25– మే 10) తేదీల మధ్య జరిగింది. బోల్షివిక్కుల సన్నాహంతో జరిగిన ఆ మహాసభ లెనిన్ నాయకత్వంలో నిర్వహింపబడింది. మెన్షివిక్కులు దానిలో పాల్గొనేందుకు నిరాకరించి, తమ సొంత కాన్ఫరెన్సును జెనీవాలో జరుపుకున్నారు.

ఆ మహాసభ అప్పట్లో రష్యాలో పరిణతమవుతున్న విప్లవానికి సంబంధించిన ప్రధాన సమస్యలను చర్చించి, శ్రామికవర్గంయొక్కా, దాని పార్టీయొక్కా కర్తవ్యాలను నిర్ణయించింది. బూర్జువా ప్రజాతంత్ర విప్లవంలో పార్టీ వ్యూహాత్మక పథకాన్నీ, ఎత్తుగడల పంథానీ అది నిర్ణయించింది. సాయుధ తిరుగుబాటును సంఘటితం చెయ్యడమే పార్టీ ప్రధాన, తక్షణ కర్తవ్యం. సాయుధ తిరుగుబాటు విజయం ఫలితంగా, విప్లవ ప్రతిఘాతాన్ని అణచివేసేందు కోసమూ, సోషలిస్టు విప్లవానికి పరివర్తన కోసం అనువైన పరిస్థితులను కల్పించేందుకోసమూ, ఒక తాత్కాలిక విప్లవ ప్రభుత్వాన్ని ఏర్పాటు చెయ్యాలని ఆ మహాసభ సూచించింది.

ఆర్.ఎస్.డి.ఎల్.పి. మూడవ మహాసభకి మహత్తరమైన చారిత్రక ప్రాముఖ్యం వుంది. అదే మొదటి బోల్షివిక్ మహాసభ, ప్రజాస్వామ్య విప్లవ విజయం కోసం, పార్టీకీ, కార్మికవర్గానికీ సమరశీలమైన ఒక కార్యక్రమాన్ని అది సమకూర్చింది. – 262.

76 బులీగిన్ కమిషన్ – జారు శాసనం మేరకు, 1905 ఫిబ్రవరిలో, దేశాంగ మంత్రి ఎ. బులీగిన్ అధ్యక్షతన ఏర్పాటు చెయ్యబడిన ఒక ప్రత్యేక సమావేశం. అభివృద్ధి నిరోధక ప్రభువర్గానికి చెందినవాళ్లతోనూ, బడా భూస్వాములతోనూ అది కూడివుంది. స్టేట్ దూమ సమావేశానికీ, దూమ ఎన్నిక నిబంధనలకూ అదొక ముసాయిదా బిల్లును తయారుచేసింది. ఆ బిల్లూ, ఆ నిబంధనలూ 1905 ఆగస్టు 6(19)న జారు ప్రకటనతోబాటు వెల్లడింపబడ్డాయి. ఈ దూమకి ఎన్నిక హక్కులు భూస్వాములకూ, పెట్టుబడిదారులకూ, కొద్దిమంది సంపన్న రైతులకూ మాత్రమే పరిమితం చెయ్యబడ్డాయి. స్టేట్ దూమకి యే శాసనాలనూ ఆమోదించే హక్కు లేదు. జారుకి ఒక సలహా సంస్థగా అది కొన్ని సమస్యలమీద చర్చలు జరపగలదు, అంత మాత్రమే.

బులీగిన్ దూమను క్రియాశీలంగా బాయ్‌కాట్ చెయ్యవలసిందిగా కార్మికులకీ, రైతులకీ బోల్షివిక్కులు విజ్ఞప్తి చేశారు. విప్లవం ముమ్మరమవుతున్న మూలంగానూ, అక్టోబరు రాజకీయ సమ్మె మూలంగానూ బులీగిన్ దూమకి ఆ ఎన్నికలు జరగలేదు. –264.

77 కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రటిక్ పార్టీ (కాడెట్లు) – రష్యాలో లిబరల్ రాజరికవాద బూర్జువావర్గపు ప్రధాన పార్టీ. అది 1905 అక్టోబరులో స్థాపించబడింది. దాని

సభ్యత్వం బూర్జువావర్గపు, భూస్వాముల, బూర్జువా మేధావుల ప్రతినిధులతో కూడి వుంది. ప్రథమ ప్రపంచ యుద్ధ కాలంలో జారిస్టు ప్రభుత్వపు దురాక్రమణపర విదేశాంగ విధానాన్ని కాడెట్లు క్రియాశీలంగా సమర్థించారు. 1917 ఫిబ్రవరి బూర్జువా ప్రజాతంత్ర విప్లవ కాలంలో వాళ్ళు రాజరికాన్ని కాపాడాలని ప్రయత్నించారు. బూర్జువా తాత్కాలిక ప్రభుత్వంలో ప్రముఖ స్థానాన్ని వహించిన కాడెట్లు ప్రజా వ్యతిరేక, విప్లవ ప్రతీఘాత విధానాన్ని అనుసరించారు. అక్టోబరు సోషలిస్టు విప్లవం విజయవంతమైన దరిమిలా కాడెట్లు సోవియట్ అధికారానికి బద్ధ శత్రువులయ్యారు. – 264.

78 ఆర్.ఎస్.డి.ఎల్.పి. కనీస కార్యక్రమం – ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభ ఆమోదించిన పార్టీ కార్యక్రమంలో ఒక అంతర్భాగం. అది బూర్జువా ప్రజాతంత్ర విప్లవ కర్తవ్యాలను యిలా నిర్వచించింది: జారిజాన్ని కూల్చివెయ్యడం, ప్రజాస్వామ్య రిపబ్లిక్‌ను స్థాపించడం; ఎనిమిది గంటల పనిదినాన్ని ప్రవేశపెట్టడం; జాతులకు సమాన హక్కులు, వాటికి స్వయం నిర్ణయ హక్కు; గ్రామీణ ప్రాంతాల్లో భూస్వామ్య దాస్య విధానాన్ని రద్దుచేయడం.

ఆ కార్యక్రమంలోని రెండవ భాగం – గరిష్ఠ కార్యక్రమం – సోషలిస్టు విప్లవ కర్తవ్యాలను యీ కింది విధంగా నిర్ణయించింది: పెట్టుబడిదారీ వ్యవస్థని కూల్చి వెయ్యడం, శ్రామికవర్గ నియంతృత్వాన్ని నెలకొల్పడం.

పార్టీ కార్యక్రమంలోని మొదటి భాగం 1917లో ఫిబ్రవరి బూర్జువా ప్రజాతంత్ర విప్లవ ఫలితంగానూ, రెండవ భాగం అక్టోబరు సోషలిస్టు మహా విప్లవ ఫలితంగానూ నెరవేర్చబడ్డాయి. – 270.

79 పారిస్ కమ్యూన్ – చరిత్రలో శ్రామికవర్గ నియంతృత్వాన్ని నెలకొల్పిన తొలి అనుభవం. 1871 తిరుగుబాటు ఫలితంగా నెలకొల్పబడిన కార్మికవర్గపు విప్లవ ప్రభుత్వం 72 రోజులపాటు – మార్చి 18నుంచి మే 28వరకు – నిలిచింది. శాసనాలు చెయ్యడమే కాక, వాటి నిర్వహణ సంస్థ అయిన పారిస్ కమ్యూన్, చర్చిని రాజ్యంనుంచీ, పాఠశాలని చర్చినుంచీ వేరుచేసింది. కార్మికులు, నగరాల్లో వుండే పేదలు, మొదలైనవాళ్ళ ఆర్థిక పరిస్థితిని మెరుగొనర్చే లక్ష్యంతో అది చాలా చర్యలను అమలు జరిపింది.

కాని, ఫ్రెంచి బాంకును జాతీయం చేసే విషయంలో సంకోచం, పారిస్‌లో విప్లవ ప్రతీఘాత శక్తులను తుడిచిపెట్టకుండా ఊగిసలాడటం, దెబ్బ కాసుకునే ఎత్తుగడలను

అనుసరించడం, రైతాంగంతో పొత్తుకి వున్న ప్రాముఖ్యాన్ని తక్కువ అంచనా వెయ్యడం — యివి పారిస్ కమ్యూన్ పతనాన్ని త్వరితం చేశాయి.

1871 మే 21వ తేదీన, విప్లవ ప్రతీఘాత త్యేర్ ప్రభుత్వపు సైనికులు పారిస్ కార్మికులను రక్తవాహినుల్లో ముంచారు. కమ్యూనార్డులు మే 28దాకా బారికేడ్ల దగ్గర నిలబడి పోరాడారు. — 273.

80 ఫ్రాంక్‌ఫర్ట్ పార్లమెంటు — జర్మనీలో 1848 మార్చి విప్లవానంతరం సమావేశపరచబడిన అఖిల జర్మనీ జాతీయ అసెంబ్లీ. నిరంకుశ ప్రభుత్వానికీ, జర్మనీ విచ్ఛిత్తికీ వ్యతిరేకంగా కృతనిశ్చిత పోరాటం కోసం జనసామాన్యాన్ని సంఘటితం చేసేందుకు బదులు, అది తన కార్యకలాపాలను సామ్రాజ్య రాజ్యాంగచట్టంమీద నిష్ఫలమైన చర్చలకు దిగజార్చింది. — 276.

81 "Neue Rheinische Zeitung" ("కొత్త రైన్ వార్తాపత్రిక") — 1848 జూన్ 1నుంచి 1849 మే 19వరకు కొలోన్‌లో ప్రచురింపబడిన దినపత్రిక. జర్మన్, యూరపియన్ విప్లవాలకు సంబంధించిన అతి ముఖ్యమైన సమస్యలపై ఆ పత్రిక వైఖరులను నిర్ణయించే సంపాదకీయ వ్యాసాలను, ప్రధానంగా కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్‌లు రాశారు. — 276.

82 "సోత్సియాల్ డెమొక్రట్" — ఒక మెన్షెవిక్ జార్జియన్ భాషా పత్రిక. అది తిఫ్లీస్ (యిప్పుడు త్బిలీసి)లో 1905 ఏప్రిల్‌నుంచి నవంబరుదాకా ప్రచురింపబడింది. మొత్తంమీద 6 సంచికలు వెలువడ్డాయి. జార్జియన్ మెన్షెవిక్కుల నాయకుడైన ఎన్. జోర్దానియా ఆ పత్రిక సంపాదకుడు.

1905 ఏప్రిల్ 7 (20) నాటి "సోత్సియాల్ డెమొక్రట్" మొదటి సంచికలో ప్రచురింపబడిన "జేమ్‌స్కీ సొబోర్, మన ఎత్తుగడలు" అనే వ్యాసాన్ని జోర్దానియా రాశాడు. ఈ వ్యాసంమీద విమర్శనాత్మక విశ్లేషణను యీ సంపుటంలోని 305–310 పేజీలలో చూడండి. — 278.

83 జేమ్‌స్కీ సొబోర్ — రష్యాలో 16–17 శతాబ్దాల్లో అత్యున్నత వర్గ ప్రాతినిధ్య సంస్థ. అది రాజ్య ప్రాముఖ్యం గల వ్యవహారాలను నిర్ణయిస్తూ వుండేది. — 278.

84 నల్ల నూర్లు — విప్లవోద్యమానికి వ్యతిరేకంగా పోరాడేందుకుగాను జారిస్టు పోలీసులు ఏర్పాటుచేసిన రాజరికవాద ముఠాలు. ఈ ముఠాల సభ్యులు విప్లవకారులను హత్య చేశారు, ప్రగతిశీల మేధావులమీద దాడులు జరిపారు, యూదు వ్యతిరేక సామూహిక హత్యాకాండలు నిర్వహించారు. — 279.

85 "షిపోవ్" రకం రాజ్యాంగం — డి. షిపోవ్ అనే మితవాద లిబరల్ రూపొందించిన ముసాయిదా రాజ్యాంగానికి లెనిన్ పెట్టిన పేరు. ముంచుకొస్తున్న విప్లవాన్ని అటకాయించే ప్రయత్నంలోనూ, అలాగే జారిస్టు ప్రభుత్వంనుంచి జేమ్‌స్త్వోలకు అనుకూలంగా కొన్ని రాయితీలను రాబట్టేందుకూ, జారు ఆధ్వర్యంకింద సలహాదారీ ప్రాతినిధ్య సంస్థనొకదాన్ని ఏర్పాటుచెయ్యాలని డి. షిపోవ్ ప్రతిపాదించాడు. ఈ మాదిరి బేరం ద్వారా జనసామాన్యాన్ని మోసగించాలనీ, రాజరికాన్ని పరిరక్షించాలనీ, అదే సమయంలో తమ స్వంతం కోసం కొన్ని రాజకీయ హక్కులను సంపాదించుకోవాలనీ మితవాద లిబరల్సు వాంఛించారు. — 280.

86 చట్టబద్ధ మార్క్సిజం — మార్క్సిజానికి యిదొక ఉదారవాద బూర్జువా వక్రీకరణ. ఇది రష్యాలో 1890వ దశకంలో ఉదారవాద బూర్జువా మేధావివర్గంలో స్వతంత్రమైన ఒక సామాజికార్థిక ధోరణిగా తలెత్తింది. అప్పటికి రష్యాలో మార్క్సిజం విస్తృతంగా వ్యాపించింది. బూర్జువా మేధావులు, మార్క్సిజం పేరుమీద, తమ భావాలను చట్టబద్ధ పత్రికల్లో వ్యాపింపజెయ్యనారంభించారు. వాళ్లు మార్క్సిజంలోని ప్రధాన విషయాన్ని — శ్రామికవర్గ విప్లవానికీ, శ్రామికవర్గ నియంతృత్వానికీ సంబంధించిన బోధనను — పక్కకి నెట్టేశారు. — 283.

87 "రూస్కయ స్తరినా" ("రష్యన్ ప్రాచీనత") — 1870నుంచి 1918దాకా సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో ప్రచురింపబడిన ఒక చారిత్రక మాసపత్రిక. — 286.

88 కార్ల్ మార్క్స్ రచించిన "ఫాయెర్‌బాఖ్‌పై సూత్రీకరణల"కు యిది ప్రస్తావన. — 287.

89 "విమోచన సంఘం" — 1904లో స్థాపించబడిన ఒక ఉదారవాద రాజరిక సంఘం. "విమోచన సంఘం" విదేశాల్లో ప్రచురింపబడుతూ వుండిన "ఒస్వొబొజ్దేనియె" అనే పత్రిక చుట్టూ 1902నుంచి సమీకృతులైన ఉదారవాద బూర్జువా మేధావులనూ, జేమ్‌స్త్వో ఉద్యమానికి చెందిన కొందరు "వామపక్ష" ప్రతినిధులనూ ఐక్యం చేసింది. 1905 జూలైలో "విమోచన సంఘం" "జేమ్‌స్త్వో రాజ్యాంగవాదుల సంఘం"తోబాటు రష్యాలోని ప్రధాన బూర్జువా పార్టీ అయిన కాన్‌స్టిట్యూషనల్ డెమొక్రటిక్ పార్టీలో మూలశక్తిగా వుంది. — 288.

90 "రూస్కియె వేదొమొస్తి" ("రష్యన్ వార్తలు") — మాస్కోలో 1863నుంచి 1918 వరకు ప్రచురింపబడిన ఒక పత్రిక. అది మితవాద ఉదారవాద మేధావివర్గపు అభిప్రా

యాలను వ్యక్తంచేసింది. 1905నుంచి ఆ ప్రతిక కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రటిక్ పార్టీ మితవాద పక్షపు అధికార ప్రతిక అయింది.

"సీన్ ఒతేచెస్త్వ" ("పితృభూమి పుత్రుడు") – సెంట్ పీటర్స్‌బుర్గ్‌నుంచి 1856నుంచి 1900వరకూ, 1904–05 కాలంలోనూ ప్రచురింపబడిన ఒక ఉదారవాద దినప్రతిక. 1905 నవంబరునుంచి అది సోషలిస్టు రివల్యూషనరీ పార్టీ అధికార ప్రతికగా వుంది.

"నాష జీజ్న్" ("మన జీవితం") – సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో మధ్యమధ్య విరామాలతో 1904–06 కాలంలో ప్రచురింపబడిన ఉదారవాద దినప్రతిక.

"నాషి ద్నీ" ("మన రోజులు") – సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో 1904–06 కాలంలో ప్రచురింపబడిన ఉదారవాద దినప్రతిక. – 294.

91 జేమ్‌స్త్వో సభ్యుడు – జేమ్‌స్త్వోల (1864లో రష్యాలోని మధ్య గుబేర్నియాల్లో అత్యంత పరిమితమైన అధికారాలు కలిగిన స్థానిక స్వపరిపాలన సంస్థల) సభ్యుడు. జేమ్‌స్త్వో సభ్యుల్లో నిరంకుశ రాజరికానికి వ్యతిరేకులైన మేధావులూ, ఉదారవాద భూస్వాములూ ఉన్నారు. కాని, ప్రతిపక్షంలో వున్నప్పటికీ, అదే సమయంలో వాళ్ళు విప్లవ యితోధికాభివృద్ధిపట్ల భయం చూపారు. 1905 అక్టోబరు 17 నాటి జారు ప్రణాళికను వాళ్ళు బలపరిచారు. నిజానికి ఆ ప్రణాళిక, శుష్క వాగ్దానాల ద్వారా జనసామాన్యాన్ని విప్లవ పోరాటంనుంచి మళ్ళించేందుకు ఉద్దేశింపబడిన జిత్తు మాత్రమే; కాగా, వాళ్ళు దాన్నొక నూతన "రాజ్యాంగచట్టబద్ధ శకం"గా పరిగణించారు. – 295.

92 "గుల్లలోని మనిషి" – యిదే పేరు గల ఎ. పి. చేహోవ్ కథలో ఒక వ్యక్తి. మార్పు అన్నా, చొరవ అన్నా భయపడే సంకుచిత మనస్తత్వపు కూపస్థమండూక ప్రాయునికి సాహిత్య ప్రతిరూపం. – 296.

93 లెనిన్ యిక్కడ "Aus dem literarischen Nachlaß von Karl Marx, Friedrich Engels und Ferdinand Lassalle. Herausgegeben von Franz Mehring," Band III, Stuttgart, 1902, S. 211 ("ఫ్రాంజ్ మేరింగ్ సంపాదకత్వంలో, కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్, ఫెర్డినాండ్ లాసాల్‌ల సాహిత్య వారసత్వంనుంచి," సంపుటం III, ష్టుట్‌గార్ట్, 1902, పేజి 211). – 302.

94 1905లో జూన్‌లో ఎన్నుకోబడిన స్థానిక స్వయంపాలన సంస్థల ప్రతినిధులకు రెండవ నికొలస్ జారు (1905 జనవరి 9 నాటి ఘటనల కారణంగా రక్తపంకిల నికొలస్)

యిచ్చిన స్వాగతానికి యిది ప్రస్తావన. ఆ ప్రతినిధివర్గం జారుకి సమర్పించిన మహజరులో ప్రజా ప్రతినిధులను సమావేశపరచి, తమతోబాటు ఒక "పునరుద్ధరిత వ్యవస్థ"ను నెలకొల్పవలసిందిగా కోరింది. ఆ మహజరులో రహస్య వోటింగు పద్ధతితోబాటు సార్వత్రిక, ప్రత్యక్ష, సమాన వోటింగు హక్కును గాని, లేక స్వేచ్ఛాయుత ఎన్నికలకు హామీ కల్పించాలని గాని కోరే డిమాండ్లు యేమీ లేవు. – 302.

95 "వ్పెర్యోద్" మద్దతుదార్లు, "మహాసభ" బృందం, "ప్రొలెతారియ్" మద్దతుదార్లు – బోల్షెవిక్కుల వేర్వేరు పేర్లు. వాళ్లు సమావేశపరచిన మూడవ మహాసభను బట్టీ, వాళ్ల పత్రికలు "వ్పెర్యోద్," "ప్రొలెతారియ్" పత్రికలనుబట్టీ వాళ్లకి యీ పేర్లు వచ్చాయి. – 302.

96 ఉదారవాదుల (లిబరల్సు) పట్ల వహించవలసిన వైఖరిని గురించి ఎ. ఎన్. ప్రొత్రేసొవ్ (స్తరొవేర్) ప్రతిపాదించిన తీర్మానానికి యిది ప్రస్తావన. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభ యీ తీర్మానాన్ని ఆమోదించింది (1903). – 303.

97 1905 మేలో చుసీమ దీవి దగ్గర జరిగిన నౌకా పోరాటానికి యిది ప్రస్తావన. రష్యన్ నౌకాదళ నిర్మూలనతో ఆ యుద్ధం ముగిసింది. – 305.

98 లెనిన్ రచనల్లో తరచుగా కనిపించే పార్లమెంటరీ క్రెటినిజం (పార్లమెంటరీ బుద్ధిమాంద్యం) అనే పదబంధం మార్క్స్, ఎంగెల్స్‌లచేత ప్రయోగింపబడింది. పార్లమెంటరీ విధానాన్ని సర్వశక్తివంతంగానూ, ఏ పరిస్థితుల్లోనైనాసరే పార్లమెంటరీ కార్యకలాపాలనే ఏకైక, ప్రధాన రాజకీయ పోరాట రూపంగానూ పరిగణించే అవకాశవాదులను ఉద్దేశించి లెనిన్ యీ పదబంధాన్ని ప్రయోగించాడు. – 308.

99 1895 అక్టోబరు 6–12 తేదీల మధ్య జరిగిన జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ బ్రెస్లౌ మహాసభలో వ్యవసాయ కార్యక్రమ ముసాయిదాపై జరిగిన చర్చల క్రమంలో వెల్లడైన అభిప్రాయభేదాలకు యిది ప్రస్తావన. – 310.

100 లెనినిస్టు "ఇస్క్రా" పథకాన్ని ఖండిస్తూ నదేజ్దిన్ (మారుపేరు ఎ. ఒ. జెలేన్‌స్కీ) రాసిన వ్యాసానికి యిది ప్రస్తావన. లెనిన్ "ఏం చెయ్యాలి?" అన్న తన పుస్తకంలో యీ దాడిని ఎన్నడో 1902లోనే విమర్శించాడు. – 315.

101 బెర్న్‌స్టైనిజం – అంతర్జాతీయ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలోని ఒక అవకాశవాద ధోరణి. జర్మనీలో 19వ శతాబ్ది చివర తలెత్తిన ఆ ధోరణి, అత్యంత బాహాటమైన రివిజనిస్టు ఇ. బెర్న్‌స్టైన్ పేరుతో వ్యవహరింపబడింది. – 321.

102 "సోషల్ డెమోక్రటిక్ ఉద్యమం, తాత్కాలిక విప్లవ ప్రభుత్వం," "శ్రామికవర్గ, రైతాంగాల విప్లవ ప్రజాస్వామ్య నియంతృత్వం" అన్న లెనిన్ వ్యాసాలకు ప్రస్తావన యిది. ఈ వ్యాసాలు బోల్షెవిక్ పత్రిక "వ్పెర్యోద్" 13, 14 సంచికల్లో ప్రచురింపబడ్డాయి. – 321.

103 పారిస్ కమ్యూన్ మాజీ సభ్యులైన బ్లాంకీయిస్టుల గ్రూపుచేత ప్రచురింపబడిన కార్యక్రమం లెనిన్ దృష్టిలో వుంది (ఎంగెల్స్ రాసిన వ్యాసాన్ని "ప్రవాసుల సాహిత్యం. II. బ్లాంకీయిస్టు కమ్యూనార్డు ప్రవాసుల కార్యక్రమం" చూడండి). – 326.

104 జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఏర్‌ఫుర్ట్ కార్యక్రమం – ఏర్‌ఫుర్ట్‌లో 1891 అక్టోబరులో జరిగిన మహాసభలో ఆమోదింపబడింది. పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం అనివార్యంగా అంతమొంది, దాని స్థానంలో సోషలిస్టు ఉత్పత్తి విధానం వచ్చితీరుతుందన్న మార్క్సిస్టు బోధనమీద ఆధారపడి ఆ కార్యక్రమం రూపొందించబడింది. కార్మిక వర్గం రాజకీయ పోరాటాన్ని నిర్వహించవలసిన అవసరాన్ని కూడా అది వక్కాణించి, యీ పోరాటంలో నాయకుడుగా పార్టీ పాత్రను అది నిర్వచించింది. అయితే, ఆ ఏర్‌ఫుర్ట్ కార్యక్రమంలో అవకాశవాదానికి పెద్ద లొంగుబాట్లు కూడా వున్నాయి. ఏర్‌ఫుర్ట్ ముసాయిదా కార్యక్రమాన్ని "1891 నాటి సోషల్ డెమోక్రటిక్ ముసాయిదా కార్యక్రమ విమర్శకు ఒక చేర్పు" అన్న తన వ్యాసంలో ఎంగెల్స్ సవిస్తరంగా విమర్శించాడు. రెండవ ఇంటర్నేషనల్‌కి చెందిన పార్టీలు ఏర్‌ఫుర్ట్ కార్యక్రమాన్ని ఒక నమూనాగా పరిగణించాయి. ఎంగెల్స్ రాసిన వ్యాసం వాస్తవానికి మొత్తం ఆ రెండవ ఇంటర్నేషనల్ అవకాశవాదంమీదనే విమర్శ. కాని, జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ నాయకులు ఎంగెల్స్ విమర్శను పార్టీ సాధారణ సభ్యులకు తెలియకుండా మరుగుపరచి, ఆ కార్యక్రమ తుది పాఠాన్ని సవివరంగా తీర్చిదిద్దే సమయంలో యీ విమర్శను పట్టించుకోలేదు. శ్రామిక వర్గ నియంతృత్వ సమస్య దాటవేతనే ఆ కార్యక్రమంలోని ప్రధాన లోపంగా పరిగణించిన లెనిన్, అవకాశవాదానికి పిరికిగా లొంగిపోవడమేనని పేర్కొన్నాడు. – 332.

105 1894 జనవరి 26న ఎఫ్. టురాటికి ఎంగెల్స్ రాసిన లేఖ. – 332.

106 బకూనినిస్టులు – అరాజకవాద సిద్ధాంతకర్త, మార్క్సిజానికీ, శాస్త్రీయ సోషలిజానికీ ప్రత్యర్థి అయిన ఎమ్. ఎ. బకూనిన్ అనుచరులు.

బకూనినిస్టు సిద్ధాంతాన్నీ, ఎత్తుగడలనీ మార్క్స్, ఎంగెల్స్, లెనిన్‌లు నిశితంగా ఖండించారు. – 339.

107 ''ప్రొలెతారియ్'' పత్రిక 3వ సంచికలో లెనిన్ వ్యాసం ''తాత్కాలిక విప్లవ ప్రభుత్వం గురించి'' (రెండో వ్యాసం) ప్రచురింపబడింది. అందులో ఆయన ఎంగెల్స్ రచించిన ''పని క్రమంలో బకూనినిస్టులు. స్పెయిన్‌లో 1873 వేసవిలో తిరుగుబాటు సమీక్ష'' అనే వ్యాసంనుంచి ఉల్లేఖించాడు. ఎంగెల్స్ ఆ వ్యాసంలో బకూనినిస్టుల తీర్మానాన్ని విమర్శించాడు. దాన్నే లెనిన్ ప్రస్తావిస్తున్నాడు. – 339.

108 Credo (''క్రెడో'') – విశ్వాస చిహ్నం, కార్యక్రమం, ఒకరి ప్రపంచ దృక్పథపు వర్ణన.

అది 1899లో ఆర్థికవాదుల బృందమొకటి ప్రకటించిన ఒక ప్రణాళిక పేరు. ఆ ప్రణాళిక రష్యన్ ఆర్థికవాదపు అత్యంత బాహాటమైన వ్యక్తీకరణ. – 341.

109 ''న్యాయశాస్త్రానికి సంబంధించిన హేగెలియన్ తత్వశాస్త్ర విమర్శకు ఒక చేర్పు'' అన్న తన వ్యాసంలో కార్ల్ మార్క్స్ అన్న మాటలకు యిది ప్రస్తావన. – 341.

110 ''L'Humanité'' (''మానవాళి'') – ఫ్రెంచి సోషలిస్టు పార్టీ అధికార పత్రికగా జాన్ జోరేస్ 1904లో స్థాపించిన దినపత్రిక. 1905లో ఆ పత్రిక రష్యాలో విప్లవారంభాన్ని అభినందించి, రష్యన్ విప్లవ సహాయార్థం నిధుల పోగు చేతకు ఏర్పాటు చేసింది. 1920 డిసెంబరునుంచి ఆ పత్రిక ఫ్రెంచి కమ్యూనిస్టు పార్టీ అధికార పత్రిక అయింది. – 343.

111 1904–05 నాటి రష్యా–జపాన్ యుద్ధానికి యిది ప్రస్తావన. – 344.

112 ఫ్రెంచి కార్మికోద్యమంలోనూ, మొదటి ఇంటర్నేషనల్‌లోనూ, 1871 నాటి పారిస్ కమ్యూన్ కౌన్సిల్‌లోనూ ప్రముఖ వ్యక్తి అయిన లూయీ ఎజేన్ వార్లెన్ భాగస్వామ్యానికి యిది ప్రస్తావన. – 352.

113 1905లో జెనీవా మెన్షెవిక్ కాన్ఫరెన్సులో ఆమోదింపబడిన నిర్మాణ ''నిబంధనావళి''కి యిది ప్రస్తావన. – 354.

114 ''జేమ్‌స్త్వో ప్రచార పథకం'' – జేమ్‌స్త్వో కార్యకర్తల మహాసభలకూ, సభలకూ, విందులకూ తోడ్పాటునిచ్చేందుకు మెన్షెవిక్కులు వేసిన పథకం. ఆ సమావేశాల్లో మితవాద రాజ్యాంగబద్ధమైన డిమాండ్ల దృష్ట్యా ప్రసంగాలు చెయ్యబడేవి, తీర్మానాలు ఆమోదింపబడేవి. – 354.

115 కార్ల్ మార్క్స్ ''ఫ్రాన్సులో వర్గపోరాటం, 1848–1850.'' – 356.

116 బ్రెంటానో వర్గపోరాటం (బ్రెంటానిజం) — శ్రామికవర్గపు విప్లవాత్మకేతర వర్గపోరాటాన్ని గుర్తించే ఉదారవాద బూర్జువా బోధన. పెట్టుబడిదారీ చట్రం లోపల, ఫాక్టరీ చట్టాల ద్వారానూ, కార్మికుల్ని ట్రేడ్‌యూనియన్లలో సంఘటితులను చెయ్యడం ద్వారానూ కార్మిక సమస్యా పరిష్కారం సాధ్యమని వాదించడం, బోధించడం. జర్మన్ ఆర్థికవేత్తా, అర్థశాస్త్రంలో బూర్జువా ఉదారవాద సంస్కరణవాద ప్రముఖ ప్రతినిధుల్లో ఒకడూ అయిన లూయో బ్రెంటానో (1844–1931) పేరునుంచి దానికి యీ పేరు వచ్చింది. — 365.

117 హిర్ష్–డుంకేర్ ట్రేడ్‌యూనియన్లు — బూర్జువా ప్రోగెసివ్ పార్టీ నాయకులైన ఎమ్. హిర్ష్, ఎఫ్. డుంకేర్‌లు 1868లో జర్మనీలో ఏర్పాటుచేసిన సంస్కరణవాద ట్రేడ్‌యూనియన్లు. శ్రమ, పెట్టుబడి — యీ రెండింటి ప్రయోజనాల "సామరస్యాన్ని" ప్రబోధించిన హిర్ష్–డుంకేర్ ట్రేడ్‌యూనియన్ల నాయకులు కార్మికులతోబాటు పెట్టుబడిదారులను కూడా యీ ట్రేడ్‌యూనియన్లలో చేర్చుకోవడం సాధ్యమని భావించారు. వాళ్లు సమ్మె పోరాటావశ్యకతను తిరస్కరించి, ట్రేడ్‌యూనియన్ ఉద్యమ కర్తవ్యాలను పరస్పర సహాయ నిధులకూ, సాంస్కృతిక, విద్యా సంస్థలకూ పరిమితం చేశారు. — 365.

118 "రస్వేత్" ("ఉషస్సు") — సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో 1905 మార్చినుంచి డిసెంబరువరకు ప్రచురింపబడిన ఉదారవాద చట్టబద్ధ దినపత్రిక. — 365.

119 "పని క్రమంలో బకూనినిస్టులు. స్పెయిన్‌లో 1873 వేసవిలో తిరుగుబాటు సమీక్ష" అన్న ఎంగెల్స్ వ్యాసపు రష్యన్ అనువాదాన్ని లెనిన్ సంస్కరించాడు. ఆర్.ఎస్.డి.ఎల్.పి. కేంద్ర కమిటీ ప్రచురణకర్తలు జెనీవాలో 1905లో వేరే చిన్న పుస్తకంగా ప్రచురింపబడింది, 1906లో అది సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో పునర్ముద్రింపబడింది.

కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్‌లు 1850 మార్చిలో రచించిన "కమ్యూనిస్టు లీగుకు కేంద్ర కమిటీ విజ్ఞప్తి", రష్యన్ భాషలో, 1906లో సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో ప్రచురింపబడిన "కొలోన్‌లో కమ్యూనిస్టు కుట్ర కేసు విచారణ" అన్న మార్క్స్ పుస్తకానికి అనుబంధంగా ప్రచురింపబడింది. — 367.

120 "మస్కొవ్‌స్కియె వేదొమొసి" ("మాస్కో గజెట్") — మాస్కో విశ్వవిద్యాలయంచేత 1756నుంచి ప్రచురింపబడిన పత్రిక. ఆ పత్రిక భూస్వాములలోని, మతగురువులలోని అత్యంత అభివృద్ధి నిరోధక విభాగాల అభిప్రాయాలను వ్యక్తంచేసింది. 1905నుంచి

అది "నల్ల నూర్ల"వాళ్ల ప్రముఖ అధికార పత్రిక అయింది. అది అక్టోబరు సోష లిస్టు విప్లవం నాటిదాకా వెలువడింది. – 373.

121 ఫ్రాన్జ్ మేరింగ్ సంపాదకత్వంలో, "కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్, ఫెర్డినాన్డ్ లాసాల్ సాహిత్య వారసత్వంనుంచి" అనే గ్రంథానికి మేరింగ్ రాసిన ఉపోద్ఘాతాన్ని లెనిన్ ఉటంకిస్తున్నాడు. ("Aus dem literarischen Nachlaß von Karl Marx, Friedrich Engels und Ferdinand Lassalle. Herausgegeben von Franz Mehring," Band III, Stuttgart, 1902, S. 53) 382–383 పేజీలలో లెనిన్ అదే ఉపోద్ఘాతాన్ని ఉటంకిస్తున్నాడు. – 376.

122 K. Marx, "Die Krisis und die Kontrerevolution" ("సంక్షోభం, విప్లవ ప్రతిఘాతం"). – 377.

123, 124 K. Marx, F. Engels, "Programme der radikal-demokratischen Partei und der Linken zu Frankfurt" ("ఫ్రాంక్‌ఫుర్ట్‌లో రాడికల్ డెమొక్రటిక్ పార్టీ, ఫ్రాంక్‌ఫుర్ట్ వామపక్షాల కార్యక్రమాలు" అన్న వ్యాసంనుంచి లెనిన్ ఉల్లేఖిస్తున్నాడు. – 377, 378.

125 ఫ్రెడరిక్ ఎంగెల్స్ రచించిన "Die Frankfurter Versammlung" ("ఫ్రాంక్ ఫుర్ట్ సమావేశం") అన్న వ్యాసంనుంచి లెనిన్ ఉల్లేఖిస్తున్నాడు.

ఎంగెల్స్‌యొక్క ఆ వ్యాస కర్తృత్వం, రష్యన్ భాషలో కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్‌ల రచనలను ద్వితీయ ముద్రణ కోసం తయారుచేస్తున్న సమయంలో ధృవీకరింప బడింది. – 378.

126 F. Engels, "Die Berliner Debatte über die Revolution" ("విప్లవం గురించి బెర్లిన్‌లోని చర్చలు") చూడండి. – 379.

127 K. Marx, "Der Gesetzentwurf über die Aufhebung der Feudallasten" ("ఫ్యూడల్ నిర్బంధ సేవలు రద్దు గురించిన బిల్లు") చూడండి. – 381.

128 ఆరంభంలో కొలోన్ కార్మిక సంఘపు అధికార పత్రిక శీర్షిక "Zeitung des Arbeiter-Vereins zu Köln" ("కొలోన్ కార్మిక సంఘపు పత్రిక"). దాని ఉపశీర్షిక "Freiheit, Brüderlichkeit, Arbeit" ("స్వాతంత్ర్యం, సోదరత్వం, శ్రమ"). ఆ పత్రిక 1848 ఏప్రిల్‌నుంచి అక్టోబరువరకు ప్రచురింపబడింది. అది కొలోన్ కార్మిక సంఘపు, రైన్ రాష్ట్రంలోని, తదితర కార్మిక సంఘాల కార్యకలాపాలను

వర్ణించేది. ఈ పత్రిక ప్రచురణ నిలిపివేయబడినప్పుడు, అక్టోబరు 26నుంచి కొలోన్ కార్మిక సంఘం తన పత్రిక ప్రచురణను "Freiheit, Brüderlichkeit, Arbeit" అన్న శీర్షికతో పునరుద్ధరించింది. ఈ శీర్షికతో, ఆ పత్రిక ప్రచురణ, స్వల్ప విరామాలతో, 1849 జూన్ 24దాకా కొనసాగింది. – 382.

129 ''కమ్యూనిస్టు లీగు'' – శ్రామికవర్గపు తొలి అంతర్జాతీయ కమ్యూనిస్టు సంఘం. ఇది మార్క్స్, ఎంగెల్స్‌ల నాయకత్వాన, 1847 జూన్‌లో, లండన్‌లో స్థాపించబడింది.

ఆ లీగు కార్యక్రమాన్నీ, నిర్మాణ సూత్రాలనూ రూపొందించడంలో మార్క్స్, ఎంగెల్స్‌లు ప్రత్యక్షంగా పాల్గొన్నారు. వాళ్లు కార్యక్రమ పత్రమైన ''కమ్యూనిస్టు ప్రణాళిక''ను కూడా రచించారు. అది 1848 ఫిబ్రవరిలో ప్రచురింపబడింది. ఆ కమ్యూనిస్టు లీగుయొక్క అతి ప్రముఖ నాయకులు దరిమిలా మొదటి ఇంటర్నేషనల్‌లో ప్రముఖ పాత్ర వహించారు. – 384.

130 డ్రెస్డెన్‌లో 1849 మే 3–8 తేదీల్లో సాయుధ తిరుగుబాటు జరిగింది. సాక్సోనియా రాజు సామ్రాజ్యపు రాజ్యాంగచట్టాన్ని ఆమోదించకపోవడమే ఆ తిరుగుబాటుకు కారణం. బారికేడ్ల దగ్గర పోరాటంలో కార్మికులు ప్రధాన పాత్ర వహించగా బూర్జువా వర్గమూ, పెటీబూర్జువావర్గమూ తిరుగుబాటులో దాదాపు యేమాత్రమూ పాల్గొలేదు. ఆ తిరుగుబాటు అణచివేయబడింది. – 384.

131 ''అది సాధ్యమా?'' అన్న శీర్షికతో జి. వి. ప్లెహానొవ్ రచించిన వ్యాసానికి యిది ప్రస్తావన. ఆ వ్యాసం ''తొవారిష్చ్'' అన్న పత్రికలో, సంచిక 381, 1907 సెప్టెంబరు 26 (అక్టోబరు 9) ప్రచురింపబడింది.

''తొవారిష్చ్'' (''కామ్రేడ్'') – బూర్జువా దినపత్రిక. అది సెంట్ పీటర్స్‌బుర్గ్‌లో 1906–07 సంవత్సరాల్లో ప్రచురింపబడింది. అది లాంఛనప్రాయంగా యే ప్రత్యేక రాజకీయ పార్టీకీ అధికార పత్రిక కాకపోయినా, వాస్తవంలో అది వామపక్ష కాన్‌స్టిట్యూషనల్ డెమొక్రట్ల వాణి. ఆ పత్రికకి మెన్షివిక్కులు కూడా రచనలు పంపుతూ వుండేవారు. – 385.

132 F. Engels, "A Contribution to the History of the Communist League" (''కమ్యూనిస్టు లీగు చరిత్రకి చేర్పు''). – 385.

133 ఖ్లెస్తకోవ్ – ఎన్. వి. గోగొల్ రచించిన సుఖాంత నాటకం ''ఇన్‌స్పెక్టర్ జనరల్''లో ప్రముఖ పాత్ర. ఇతను బడాయికీ, అబద్ధాల కోరుతనానికీ ప్రతిరూపం. – 385.

# పేర్ల సూచి


అకీమొవ్ (మహ్నొవేత్స్), వి. పి. (Akimov-Makhnovets) (1872–1921) – రష్యన్ సోషల్ డెమోక్రట్, మెన్షెవిక్, "ఆర్థికవాద"పు ప్రముఖ ప్రతినిధుల్లోనూ, తీవ్ర అవకాశవాదుల్లోనూ ఒకడు. – 21, 22, 24, 26, 27, 29, 35, 43, 47, 64–66, 74, 75, 79–81, 86, 89–91, 93, 101, 105, 107–11, 113–15, 121–25, 130, 140, 141, 143, 149, 150, 155, 156, 160, 163–66, 168, 169, 170–72, 184, 185, 194, 197, 198, 203, 209, 211–13, 216, 217, 224, 227, 228, 232, 233, 238, 244, 311, 363, 364.

అక్సెల్‌రోడ్, పి. బి. (Axelrod) (1850–1928) – రష్యన్ సోషల్ డెమోక్రట్, మెన్షెవిక్ నాయకుల్లో ఒకడు. 1900నుండి "ఇస్క్రా" సంపాదకవర్గ సభ్యుడు. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభ తర్వాత మెన్షెవిక్ పార్టీలో చురుకుగా పనిచేశాడు. అక్టోబరు సోషలిస్టు విప్లవంపట్ల శత్రు వైఖరి అవలంబించాడు. విదేశాలనుండి సోవియట్ రష్యాకు వ్యతిరేకంగా సాయుధ జోక్యాన్ని అభ్యర్థించాడు. – 9, 14, 28, 51, 53, 59, 60, 65, 68–73, 75, 77, 80, 81, 84–86, 91, 92, 102, 107, 108, 110, 111, 134, 138, 154, 163, 167, 168, 169, 171, 179, 186, 187, 192, 194, 197, 198, 207–11, 213, 214, 218, 220, 223, 224, 227, 228, 231, 233–36, 240.

అక్సెల్‌రోడ్, ఎల్. ఐ. (ఆర్థడాక్స్) (Axelrod-Orthodox) (1868 – 1946) – తత్వవేత్త, సాహిత్య విమర్శకురాలు, సోషల్ డెమోక్రట్, ఆర్.ఎస్.డి.ఎల్.పి.

కోస్తిచ్ – చూ: జ్బారోవ్‌స్కీ, ఎమ్. ఎస్.

కాట్స్కీ (Kautsky), కార్ల్ (1854–1938) – జర్మన్ సోషల్ డెమోక్రసీ, రెండవ ఇంటర్నేషనల్ నాయకుల్లో ఒకడు. మొదట్లో మార్క్సిస్టు, తర్వాత మార్క్సిజాన్ని పరిత్యజించి, అవకాశవాద రకాలలో అత్యంత హానికరమయిన రకం – సెంట్రిజం (కాట్స్కీవాదం)యొక్క సిద్ధాంతవేత్తగా తయారయాడు. జర్మన్ సోషల్ డెమోక్రసీ సైద్ధాంతిక పత్రిక "Die Neue Zeit" సంపాదకుడు. – 9, 82, 144, 228–30, 233, 310, 311, 352.

క్నిపోవిచ్, ఎల్. ఎమ్. (దేదొవ్) (Knipovich-Dedov) (1856–1920) – వృత్తి విప్లవకారిణి, బోల్షెవిక్, రష్యాలోని స్థానిక పార్టీ శాఖలతో "ఇస్క్రా" సంబంధాల్లో ప్రముఖ పాత్ర వహించింది. – 248, 251.

క్నున్యాంట్స్, బి. ఎమ్. (రూసొవ్) (Knunyants-Rusov) – వృత్తి విప్లవకారుడు, బోల్షెవిక్, ట్రాన్స్ కకేషియాలో సోషల్ డెమోక్రటిక్ ఉద్యమపు ఆర్గనైజర్లలో ఒకడు. – 33, 34, 91, 94, 101, 105, 123, 124, 129, 133, 248, 251.

క్ర్జిజనోవ్‌స్కీ, జి. ఎమ్. (త్రవీన్‌స్కీ) (Krzhizhanovsky-Travinsky) (1872–1959) – కమ్యూనిస్టు పార్టీ తొట్టతొలి నాయకుల్లో ఒకడు, ప్రముఖ సోవియట్ విజ్ఞానశాస్త్రజ్ఞుడు, ఇంజనీరు, విద్యుచ్ఛక్తి రంగంలో నిపుణుడు. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడుగా పరోక్షంలో యెన్నుకోబడ్డాడు. – 103, 141, 186, 203, 240, 247, 249.

క్రాసికొవ్, పి. ఎ. (పవ్లోవిచ్) (Krasikov-Pavlovich) (1870–1939) – వృత్తి విప్లవకారుడు, బోల్షెవిక్. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభ తర్వాత మెన్షెవిక్కులకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో చురుకుగా పాల్గొన్నాడు. తదుపరి దశలో ప్రముఖ రాజనీతిజ్ఞుడు. – 26–28, 32, 34, 88–90, 102, 109, 110, 113, 115, 124, 128, 130, 140, 246, 248.

క్రిచేవ్‌స్కీ, బి. ఎన్. (Krichevsky) (1866–1919) – రష్యన్ సోషల్ డెమోక్రట్, "ఆర్థికవాద" నాయకుల్లో ఒకడు. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభ తర్వాత సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంనుంచి నిష్క్రమించాడు. – 214, 216, 233, 311.

క్రూప్స్కయా, ఎన్. కె. (సాబ్లినా) (Krupskaya-Sablina) (1869–1939) – వృత్తి విప్లవకారిణి, కమ్యూనిస్టు పార్టీ, సోవియట్ రాజ్య ప్రముఖ కార్యకర్త, వి. ఐ. లెనిన్ భార్య. – 98, 253.

క్రోఖ్మల్, వి. ఎన్. (ఫొమీన్) (Krokhmal-Fomin) (1873–1933) – రష్యన్ సోషల్ డెమోక్రట్, మెన్షివిక్. – 120, 164, 185, 186, 240, 246, 247, 249.

గపోన్, జి. ఎ. (Gapon) (1870–1906) – మతగురువు. జారిస్టు ప్రభుత్వ భద్రత విభాగానికి ఏజెంటు. 1905 జనవరి 9న జారుకి మహజరు తెచ్చిన కార్మికుల ఊరేగింపు ఏర్పాటు చేశాడు. ఊరేగింపుమీద కాల్పులు జరిగిన తర్వాత, అతని ద్రోహపూరిత ప్రవర్తనను బయటపెట్టి, కార్మికులు అతన్ని ఉరితీశారు. – 258, 299.

గర్కోర్ట్ (Harcourt), విల్యమ్ గెయోర్గ్ గ్రెన్విల్ వెనబెల్స్ వెర్నోన్ (1827–1904) – న్యాయవాది, యింగ్లీషు రాజనీతిజ్ఞుడు, 1894–98లలో లిబరల్ పార్టీ నాయకుడు. – 372.

గల్పేరిన్, ఎల్. వై. (Y) (Galperin-Ygrek) (1872–1951) – రష్యన్ సోషల్ డెమోక్రట్, రష్యాలో రహస్య సాహిత్య వ్యాప్తిలో విశేష కృషిచేశాడు. ఆర్.ఎస్. డి.ఎల్.పి. రెండవ మహాసభ తర్వాత బోల్షివిక్కులలో చేరాడు, కాని తర్వాత త్వరలోనే మెన్షివిక్కులపట్ల రాజీ వైఖరి అవలంబించాడు. – 204, 205.

గీర్కె (Gierke) – లిబరల్, ప్రష్యన్ చేంబర్ ఆఫ్ డిప్యూటీస్ సభ్యుడు, వ్యవసాయ మంత్రి (1848). – 380.

గూసెవ్, ఎస్. ఐ. (డ్రాబ్కిన్, వై. డి.) (Gusev-Drabkin) (1874–1933) – వృత్తి విప్లవకారుడు, బోల్షివిక్. – 33–35, 48, 100, 110, 246, 254.

గేర్ట్స్ – చూ: ఉల్యానొవ్, డి. ఐ.

గేర్ట్సెన్ష్టైన్, ఎమ్. వై. (Hertzenstein) (1859–1906) – రష్యన్ ఆర్థికవేత్త, కాడెట్ పార్టీ నాయకుల్లో ఒకడు, మాస్కోలోని వ్యవసాయ ఇన్స్టిట్యూట్ ప్రొఫెసరు వ్యవసాయ సమస్యమీద ఆ పార్టీ సిద్ధాంతవేత్త. – 380.

గోర్స్కీ — చూ: షోట్‌మన్, ఎ. వి.

గోరిన్-గాల్కిన్, వి. ఎఫ్. (Gorin-Galkin) (1863–1925) – వృత్తి విప్లవకారుడు, బోల్షెవిక్. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభ తర్వాత మెన్షెవిక్కులను గట్టిగా వ్యతిరేకించాడు. – 34, 49, 246, 247, 250, 254.

గోల్డ్‌బ్లాత్ — చూ: మెదెమ్ వి. డి.

గ్యోరె (Göhre), పాల్ (1864–1928) – జర్మన్ రాజనీతిజ్ఞుడు, పత్రికారచయిత; అవకాశవాది. – 226, 227.

గ్రెదెస్కూల్, ఎన్. ఎ. (Gredeskul) (జననం 1864) – న్యాయశాస్త్రజ్ఞుడు, వ్యాస రచయిత, కాడెట్ పార్టీ సభ్యుడు. 1905లో "మీర్" ("శాంతి") పత్రిక ప్రచురణలో పాల్గొన్నాడు, 1905 డిసెంబరులో "ప్రభుత్వ వ్యతిరేక" వ్యాసాలను ప్రచురించినందుకుగాను ఆ పత్రిక మూసివేయబడింది. – 371.

గ్లేబొవ్ — చూ: నొస్కోవ్, వి. ఎ.

చేంబర్లేన్ (Chamberlain), జోసెఫ్ (1836–1914) – ఇంగ్లీషు రాజనీతిజ్ఞుడు, 1895–1903లలో గ్రేట్ బ్రిటన్ విదేశాంగ శాఖలో వలసదేశాల వ్యవహారాల మంత్రి, రాజకీయ అభిప్రాయాల రీత్యా మొదట లిబరల్, 1890 దశకం ప్రారంభంనుంచి కన్సర్వేటివ్, ఇంగ్లీషు వలసవాద విస్తరణ సిద్ధాంతకారుల్లో ఒకడు. – 199.

జసూలిచ్, వి. ఐ. (Zasulich) (1849–1919) – రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలో ప్రముఖ వ్యక్తి. 1878లో ఆమె సెంట్ పీటర్స్‌బుర్గ్ గవర్నరు త్రేపొవ్‌ని హత్య చేయడానికి ప్రయత్నించింది. 1903నుంచి మెన్షెవిక్ నాయకుల్లో ఒకతె. – 107, 134, 179, 231, 252.

జెట్కిన్ (Zetkin), క్లారా (1857–1933) – జర్మన్ కార్మికోద్యమంలోనూ, అంతర్జాతీయ కార్మికోద్యమంలోనూ ప్రముఖ వ్యక్తి, జర్మన్ కమ్యూనిస్టు పార్టీ స్థాపకుల్లో ఒకతె; ఆర్. లుక్సెంబుర్గ్, ఎఫ్. మేరింగ్, కె. లీబ్‌క్నెఖ్ట్‌లతో కలిసి అవకాశవాదానికి వ్యతిరేకంగా చురుకుగా పోరాటం జరిపింది. – 103.

జెమ్ల్యాచ్క, ఆర్. ఎస్. (ఒసిపొవ్) (Zemlyachka-Osipov) (1876–1947) –

వృత్తి విప్లవకారిణి, బోల్షెవిక్, కమ్యూనిస్టు పార్టీ, సోవియట్ ప్రభుత్వ ప్రముఖ వ్యక్తి. – 151, 248.

జెల్యాబొవ్, ఏ. ఐ. (Zhelyabov) (1851–1881) – ప్రముఖ రష్యన్ విప్లవ కారుడు, "నరోద్నయ వోల్య" పార్టీ ఆర్గనైజరు, నాయకుడు. రెండవ అలెక్సాండ్ర్ జారుపై హత్యా ప్రయత్నాల నిర్వాహకుడు. తర్వాత ఉరితీయ్యబడ్డాడు. – 75.

జోరేస్ (Jaurès), జాన్ (1859–1914) – ఫ్రెంచి, అంతర్జాతీయ సోషలిస్టు ఉద్యమంలో ప్రముఖ వ్యక్తి, సైనికవాదానికీ, యుద్ధాలకూ వ్యతిరేకంగా పోరాడాడు, చరిత్రకారుడు. ఫ్రెంచి సోషలిస్టు పార్టీ స్థాపకుల్లో ఒకడు, ఫ్రెంచి సోషలిస్టు పార్టీలో అవకాశవాద దక్షిణపక్ష నాయకుడు. 1904లో "L'Humanité" పత్రి కను స్థాపించాడు, దాని సంపాదకుడుగా పనిచేశాడు.

రాబోయే యుద్ధానికి వ్యతిరేకంగా శాంతి కోసం జోరేస్ చేసిన పోరాటం మూలంగా సామ్రాజ్యవాద బూర్జువావర్గాల ద్వేషానికి గురయ్యాడు. ప్రథమ ప్రపంచ సామ్రాజ్య వాద యుద్ధానికి ముందు కిరాయి హంతకుడిచేత ఆయన హత్యచెయ్యబడ్డాడు. – 229, 232, 343.

జోర్దానియా, ఎన్. ఎన్. (కొస్త్రోవ్) (Jordania-Kostrov) (1869–1953) – రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలో పాల్గొన్నాడు, కకేషియన్ మెన్షెవిక్కుల నాయకుల్లో ఒకడు. – 48, 155, 156.

జ్బొరోవ్‌స్కీ, ఎమ్. ఎస్. (కోస్తిచ్) (Zborowski-Kostich) (1879–1935) – సోషల్ డెమోక్రట్, మెన్షెవిక్. ప్రథమ రష్యన్ విప్లవ కాలంలో (1905–1907) విస్తృత కార్మిక మహాసభను సమావేశపరచాలనే రద్దువాదుల (లిక్విడేటర్ల)ను బల పరచాడు. – 43, 49, 81.

టురాటి (Turati), ఫిలిప్పో (1857–1932) – ఇటాలియన్ కార్మికోద్యమ కార్య కర్తల్లో ఒకడు. ఇటాలియన్ సోషలిస్టు పార్టీ స్థాపకుల్లో (1892) ఒకడు, దాని దక్షిణ, సంస్కరణవాద పక్షానికి నాయకుడు. – 321, 332.

ట్రాట్స్కీ, ఎల్. డి. (బ్రోన్‌స్టైన్) (Trotsky-Bronstein) (1879–1940) – రష్యన్ సోషల్ డెమోక్రట్. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభలో "ఇస్క్రా" అల్పసంఖ్యాక వర్గానికి చెందినవాడు. మహాసభ తర్వాత సోషలిస్టు విప్లవ సైద్ధాంతిక, ఆచరణ సమస్యలపై బోల్షెవిక్కులను వ్యతిరేకించాడు. 1905–07

విప్లవ ఓటమి తర్వాత, పార్టీని రద్దుచేయాలని వాదించేవాళ్లను సమర్థించాడు. 1917 నాటి ఫిబ్రవరి బూర్జువా-ప్రజాతంత్ర విప్లవానంతరం విదేశాలనుంచి రష్యాకు తిరిగి వచ్చిన తర్వాత ఆర్.ఎస్.డి.ఎల్.పి.(బి.) ఆరవ మహాసభలో బోల్షెవిక్ పార్టీలో చేరాడు. కాని ట్రాట్స్కీ బోల్షెవిక్కుల వైఖరిని స్వీకరించక, లెనినిజానికీ, పార్టీ విధానానికీ వ్యతిరేకంగా లోపాయికారీ పోరాటం సాగించాడు. అక్టోబర్ సోషలిస్టు విప్లవం తర్వాత యితను అనేక బాధ్యతాయుత పదవులు వహించాడు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకుగాను 1927లో ట్రాట్స్కీ పార్టీనుంచి బహిష్కరింపబడ్డాడు. 1929లో సోవియట్ యూనియన్‌నుంచి బహిష్కరింపబడ్డాడు. 1932లో యితని సోవియట్ పౌరసత్వం రద్దుచేయబడింది. – 9, 23, 26, 48, 49, 51, 66, 87, 88, 99, 101, 103, 113, 124, 125, 130, 141, 166, 170, 178, 179, 185, 186, 240, 246, 247, 249, 263, 311.

డేయ్‌చ్, ఎల్. జి. (Deutsch) (1855–1941) – రష్యన్ విప్లవోద్యమంలో పాల్గొన్నాడు, 1903నుంచి మెన్షెవిక్కుల నాయకుల్లో ఒకడు. – 33, 34, 43, 100, 116, 135, 136, 183, 185, 191, 246, 250–52, 254.

తహ్తార్యేవ్, కె. ఎమ్. (స్త్రాహోవ్) (Takhtarev-Strakhov) (1871–1925) – రష్యన్ సోషల్ డెమోక్రట్, 1900లో "ఆర్థికవాదుల" పత్రిక అయిన "రబోచయ మీస్ల్" ("కార్మికుల చింతన") సంపాదకుడు. పార్టీ చీలిక తర్వాత మెన్షెవిక్కులపట్ల సానుభూతి చూపాడు, కాని ఆ తర్వాత పార్టీ పనిని వదలిపెట్టాడు. – 86.

తొపురీడ్జె, డి. ఎ. (కార్‌స్కీ) (Topuridze-Karsky) (1871–1942) – జార్జియన్ సోషల్ డెమోక్రట్, మెన్షెవిక్. – 48, 91, 124.

త్యేర్ (Thiers), అడొల్ఫ్ (1797–1877) – ఫ్రెంచి బూర్జువా రాజనీతిజ్ఞుడు, చరిత్రకారుడు. ప్రధాన మంత్రి (1836–1840), రాజ్యాంగ నిర్ణయసభ సభ్యుడు (1849–1851), రిపబ్లిక్ అధ్యక్షుడు (1871–73). పారిస్ కమ్యూనార్డుల కసాయి హంతకుల్లో ఒకడు. – 373.

త్రవీన్‌స్కీ – చూ: క్రిజిజనోవ్‌స్కీ, జి. ఎమ్.

త్రుబెత్స్కోయ్, ఎస్. ఎన్. (Trubetskoi) (1862–1905) – రష్యన్ ప్రభువు,

లిబరల్; భావవాద తత్వవేత్త మితవాద రాజ్యాంగం ద్వారా జారిస్టు విధానాన్ని స్థిర పరచడానికి ప్రయత్నించాడు. – 364, 380.

త్రేపోవ్, ఎఫ్. ఎఫ్. (Trepov) (1812–1889) – 1873–78 మధ్య సెంట్ పీటర్స్‌బుర్గ్ గవర్నరు. 1878లో రాజకీయ ఖైదీల పట్ల క్రూరంగా ప్రవర్తించిన త్రేపోవ్‌ని హత్యచేసేందుకు వి. ఐ. జసూలిచ్ ప్రయత్నించింది. ఆ ప్రయత్నంలో త్రేపోవ్ గాయపడ్డాడు. – 252.

త్సరోవ్ – చూ: లోకెర్‌మన్, ఎ. ఎస్.

త్సేయ్‌త్లిన్, ఎల్. ఎస్. (బెలోవ్) (Tseitlin-Belov) (జననం 1877) – రష్యన్ సోషల్ డెమోక్రట్; 1898నుండి కార్మిక అధ్యయన బృందాల్లో ప్రచారం చేశాడు. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభ తర్వాత మెన్షివిక్కులతో చేరిపోయాడు. – 34, 43, 250, 254.

దేదొవ్ – చూ: క్రిపోవిచ్, ఎల్. ఎమ్.

నదేజ్దిన్, ఎల్. (జెలేన్‌స్కీ, వై. ఒ.) (Nadezhdin-Zelensky) (1877–1905) – రష్యన్ సోషల్ డెమోక్రట్, తన రాజకీయ కార్యకలాపాలను నరోద్నిక్‌గా ప్రారంభించాడు, తర్వాత సోషల్ డెమోక్రట్ అయాడు. లెనినిస్టు "ఇస్క్రా"కు వ్యతిరేకంగా పోరాడాడు. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభ తర్వాత మెన్షివిక్ పత్రికా రచయితగా వున్నాడు. – 73, 113, 315.

నికీతిన్, ఐ. కె. (స్తెపానొవ్) (Nikitin-Stepanov) (1877–1944) – రష్యన్ సోషల్ డెమోక్రట్, బోల్షివిక్. – 43.

నికొలాయెవ్, ఎల్. వి. (మెద్వేదెవ్) (Nikolayev-Medvedev) – రష్యన్ సోషల్ డెమోక్రట్, ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభ తర్వాత మెన్షివిక్కులలో చేరాడు. – 43, 91.

నీకొలస్ II (రొమానొవ్) (రక్తపంకిల) (Nicholas II-Romanov) (1868–1918) – రష్యా చివరి చక్రవర్తి (1894–1917). – 302, 309, 378.

నీత్స్‌షె (Nietzsche), ఫ్రీడ్రిఖ్ (1844–1900) – అభివృద్ధి నిరోధక జర్మన్ తత్వవేత్త, ఫాసిస్టు భావజాలపు ఆద్యుల్లో ఒకడు. – 146, 147.

మంత్రిగా నియమించబడ్డాడు. సలహాసంస్థగా వుండే స్టేట్ దూమను సమావేశపరచడానికి ఒక బిల్లు తయారుచేసే కార్యక్రమాన్ని నిర్వహించాడు. – 301, 305, 307, 309.

బెర్న్‌స్టైన్ (Bernstein), ఎడువార్డ్ (1850–1932) – జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ, రెండవ ఇంటర్నేషనల్ తీవ్ర అవకాశవాద పక్ష నాయకుడు; రివిజనిజానికీ, సంస్కరణవాదానికీ సిద్ధాంతకర్త. మార్క్సిస్టు వర్గపోరాట సిద్ధాంతాన్నీ, పెట్టుబడిదారీ విధానపు అనివార్య పతనాన్ని గురించిన బోధననీ, సోషలిస్టు విప్లవానికీ, శ్రామికవర్గ నియంతృత్వానికీ సంబంధించిన సిద్ధాంతాన్నీ బెర్న్‌స్టైన్ తిరస్కరించాడు. ఆయనా, ఆయన అనుచరులూ అవలంబించిన సైద్ధాంతిక దృక్పథాలూ, అవకాశవాద కార్యకలాపాలూ కార్మికవర్గ ప్రయోజనాలకు ప్రత్యక్ష ద్రోహంగా పరిణమించాయి.– 196, 210, 211, 233, 340, 341, 351, 366.

బెలోవ్ – చూ: త్సేయ్‌త్లిన్, ఎల్. ఎస్.

బేబెల్ (Bebel), ఔగుస్ట్ (1840–1913) – జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ, అంతర్జాతీయ కార్మికోద్యమ ప్రముఖ కార్యకర్తల్లో ఒకడు. ప్రతిభా సంపన్నుడైన వ్యాసరచయిత, అద్భుతమైన వక్త. జర్మన్, యూరపియన్ కార్మికోద్యమాభివృద్ధిపై బేబెల్ యెక్కువ ప్రభావం నెరపాడు. తన కార్యకలాపాల తుది దశలో ఆయన సెంట్రిస్టు స్వభావం గల కొన్ని తప్పులను చేశాడు – అవకాశవాదంపై తగినంతగా పోరాడలేదు, పార్లమెంటు పోరాట రూపాలకు అధిక ప్రాముఖ్యాన్నిచ్చాడు. – 102, 103, 173, 196, 310, 311.

బేర్ (Beer), మాక్స్ (1864–1943) – జర్మన్ దేశస్థుడు, సోషలిజం చరిత్రకారుడు, 1901నుండి లండన్‌లో "Vorwärts" ("ముందుకు") అనే పత్రికకు విలేకరి. – 197.

బోర్న్, స్టెఫాన్ (అసలు పేరు బుట్టర్‌మిల్ష్) (Born-Buttermilch) (1824–1898) – జర్మన్ కార్మికుడు, ప్రెస్ కంపాజిటర్. మొదట "కమ్యూనిస్టు లీగు" సభ్యుడు, తరువాత సంస్కరణవాద, "కార్మిక సౌభ్రాతృత్వం" అనే సంఘాన్ని ఏర్పాటుచేశాడు. 1849లో డ్రెస్డెన్ తిరుగుబాటులో పాల్గొన్నాడు. – 382–85.

బౌమన్, ఎన్. ఇ. (సొరోకిన్) (Bauman-Sorokin) (1873–1905) – వృత్తి విప్లవకారుడు, బోల్షెవిక్ పార్టీ ప్రముఖుడు, "ఆర్థికవాదాన్ని" గట్టిగా వ్యతిరేకించాడు; "ఇస్క్రా" శాఖ స్థాపకుల్లో ఒకడు. "నల్ల నూర్లవాళ్ల"చేత చంపబడ్డాడు. – 26, 98, 135, 136, 253.

బ్రూకెర్ – చూ: మహోవ్నెట్స్, ఎల్. పి.

బ్రౌన్ – చూ: స్తెపానొవ్, ఎస్. ఐ.

బ్లాంక్ (Blanc), లూయీ (1811–1882) – ఫ్రెంచి పెటీబూర్జువా సోషలిస్టు, చరిత్రకారుడు; పెట్టుబడిదారీ వ్యవస్థలో వర్గవైరుధ్యాల సమరస పరిష్కారం అసాధ్యమనే భావాన్ని ఒప్పుకోలేదు, శ్రామికవర్గ విప్లవానికి వ్యతిరేకి, బూర్జువావర్గంతో రాజీపడే వైఖరిని అవలంబించాడు. – 384.

మందెల్‌బెర్గ్, వి. వై. (పొసదోవ్‌స్కీ) (Mandelberg-Posadovsky) (జననం 1870) – వైద్యుడు, రష్యన్ విప్లవోద్యమంలో పాల్గొన్నాడు, ప్రచారకుడు. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభ తర్వాత – మెన్షెవిక్. – 37, 38, 43, 75, 131–33, 138, 210.

మకజూబ్, ఎమ్. ఎస్. (పానిన్, కార్యకర్త) (Makadzyub-Panin) (జననం 1876) – రష్యన్ సోషల్ డెమొక్రట్, మెన్షెవిక్, విస్తృత కార్మిక మహాసభను సమావేశపరచాలనే అక్సెల్‌రోడ్ ప్రతిపాదనను సమర్థించాడు. – 105, 106, 110, 217, 219.

మనుయీలొవ్, ఎ. ఎ. (Manuilov) (1861–1929) – రష్యన్ బూర్జువా అర్థశాస్త్రజ్ఞుడు, కాడెట్ పార్టీలో ప్రముఖుడు, "రూస్కియె వేదొమొస్తి" ("రష్యన్ గజెట్") అనే వార్తాపత్రిక సంపాదకుల్లో ఒకడు. – 380.

మర్తీనొవ్, ఎ. ఎస్. (పికెర్) (Martynov-Pieker) (1865–1935) – రష్యన్ సోషల్ డెమొక్రట్, "ఆర్థికవాద" ప్రముఖ ప్రతినిధుల్లో ఒకడు; మెన్షెవిక్ నాయకుల్లో ఒకడు, తదనంతరం కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు. – 9, 21, 24, 26, 28, 29, 36, 44, 47, 48, 50–52, 75, 80–82, 123–25, 130, 149, 150, 155, 156, 160, 163, 165, 168, 169, 172, 197, 198, 209, 213, 232, 275, 277,

285, 311, 312, 319, 321–23, 328, 339, 341, 342, 352, 353, 367–69, 374–76.

మహ్నొవేత్స్, ఎల్. పి. (బ్రూకెర్) (Makhnovets-Brouckère) (1876–1965) – రష్యన్ సోషల్ డెమొక్రట్, "ఆర్థికవాద" ప్రతినిధి, పార్టీ రెండవ మహాసభకు సన్నాహాలు జరుగుతున్న దశలో లెనిన్ "ఇస్క్రా"ను వ్యతిరేకించిన వొరొనెజ్ పట్టణ ఆర్.ఎస్.డి.ఎల్.పి. కమిటీ నాయకుల్లో ఒకతె. – 21, 22, 24, 26, 36, 79, 80, 83, 90, 99, 123, 148, 149, 160, 163, 164, 168, 184, 197, 238, 248.

మార్క్స్ (Marx), కార్ల్ (1818–1883) – ప్రతిభా సంపన్నుడైన ఆలోచనాపరుడు, ప్రపంచ శ్రామికవర్గ నాయకుడు, శాస్త్రీయ కమ్యూనిజం, గతితార్కిక, చారిత్రక భౌతికవాదం, శ్రామికవర్గ అర్థశాస్త్రాల మూలపురుషుడు. – 147, 276, 286, 287, 301, 302, 325, 333, 341, 356, 367, 373, 376–78, 380–85.

మార్తొవ్, ఎల్. (త్సెదెర్‌బౌమ్, వై. ఓ.) (Martov-Tsederbaum) (1873–1923) – రష్యన్ సోషల్ డెమొక్రట్, మెన్షివిక్ నాయకుల్లో ఒకడు. 1900లో "ఇస్క్రా" పత్రిక ప్రచురణకు సన్నాహాలు చేశాడు, దాని సంపాదకవర్గంలో ఒకడు. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభకు (1903) "ఇస్క్రా" ప్రతినిధి. మహాసభలో అవకాశవాద అల్పసంఖ్యాక వర్గానికి నాయకత్వం వహించాడు. అప్పటి నుంచి మెన్షివిక్ కేంద్ర సంస్థల్లో ప్రముఖ వ్యక్తి, మెన్షివిక్ పత్రికా సంపాదకుడు. ప్రథమ ప్రపంచ యుద్ధకాలంలో సెంట్రిస్టు వైఖరిని అవలంబించాడు. 1917లో అంతర్జాతీయవాద మెన్షివిక్కుల బృందానికి నాయకత్వం వహించాడు. అక్టోబరు సోషలిస్టు విప్లవం తర్వాత సోవియట్ అధికారాన్ని వ్యతిరేకించాడు. 1920లో జర్మనీకి వలసపోయాడు. – 9, 14, 20–23, 26, 28–32, 36, 38–41, 43, 44, 46, 48, 50, 52–59, 63–68, 71, 73–77, 79–85, 87–100, 102, 103, 106–26, 133–35, 137–44, 146–51, 155, 156, 160, 161, 163–68, 170–76, 178–86, 190–99, 202–06, 211, 213, 220, 224, 227, 233–37, 240–42, 244, 246–49, 252–54, 323.

మాహొవ్ – చూ: కలఫాతి, డి. పి.

మాహ్లిన్, ఎల్. డి. (ఒర్లోవ్) (Makhlin-Orlov) (1880–1925) – రష్యన్ సోషల్ డెమోక్రట్, ప్రచారకుడు. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభ తర్వాత మెన్షెవిక్‌గా మారాడు. – 34, 35, 135, 151.

మిలెరాన్ (Millerand), అలెగ్జాండ్ర్ ఎటియేన్ (1859–1943) – ఫ్రెంచి రాజకీయవేత్త. 19వ శతాబ్ది పదవ దశకంలో సోషలిస్టుగా వుండి, ఫ్రెంచి సోషలిస్టు ఉద్యమంలో అవకాశవాద ధోరణికి నాయకుడయ్యాడు. 1899లో ఫ్రెంచి బూర్జువా వర్గ ప్రగతి వ్యతిరేక ప్రభుత్వంలో చేరాడు. 1904లో సోషలిస్టు పార్టీనుంచి బహిష్కృతుడై, యితర మాజీ సోషలిస్టులతో కలిసి "స్వతంత్ర సోషలిస్టులు" అనే పార్టీని స్థాపించాడు. 1920–24 ఫ్రెంచి రిపబ్లిక్ అధ్యక్షుడు. – 232, 352.

మీషెనెవ్, జి. ఎమ్. (మురవ్యోవ్) (Mishenev-Muravyov) (మరణం 1906) – రష్యన్ సోషల్ డెమోక్రట్, బోల్షెవిక్; మెన్షెవిక్కులను గట్టిగా వ్యతిరేకించాడు. – 34, 116, 117, 130–32, 135, 138.

మీష్కిన్, ఐ. ఎన్. (Myshkin) (1848–1885) – రష్యాలో నరోద్నిక్ ఉద్యమ ప్రముఖ కార్యకర్త, రహస్య సాహిత్య ప్రచురణ నిర్వాహకుల్లో ఒకడు. – 75.

మురవ్యోవ్ – చూ: మీషెనెవ్, జి. ఎమ్.

మెదెమ్, వి. డి. (గ్రిన్‌బెర్గ్, గోల్డ్‌బ్లాత్) (Medem-Goldblatt) (1879–1923) – రష్యన్ సోషల్ డెమోక్రట్, బుండ్ నాయకుల్లో ఒకడు, "ఇస్క్రా" వ్యతిరేకి. – 38, 65, 105, 149, 210.

మెద్వేదెవ్ – చూ: నికొలాయెవ్, ఎల్. వి.

మేరింగ్ (Mehring), ఫ్రాన్జ్ (1846–1919) – జర్మనీ కార్మికోద్యమంలో ప్రముఖ వ్యక్తి, జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ వామపక్ష అగ్ర నాయకుల్లో ఒకడు, సిద్ధాంతవేత్త. జర్మన్ కమ్యూనిస్టు పార్టీ స్థాపనలో ప్రముఖ పాత్ర వహించాడు. – 302, 376, 377, 382, 384.

మొషీన్‌స్కీ, ఐ. ఎన్. (ల్వోవ్) (Moshinsky-Lvov) (1875–1954) – రష్యన్ సోషల్ డెమోక్రట్, మెన్షెవిక్. – 42, 43,

మోల్ (Moll), యోసెఫ్ (1812–1849) – జర్మన్, అంతర్జాతీయ కార్మికోద్యమంలో ప్రముఖ వ్యక్తి, "న్యాయవంతుల లీగు" నాయకుడు, "కమ్యూనిస్టు లీగు" కేంద్ర కమిటీ సభ్యుడు. – 382.

యూదిన్ – చూ: ఐజెన్‌ష్టాట్ట్, ఐ. ఎల్.

యెగోరొవ్ – చూ: లేవిన్, వై. వై.

రూసొవ్ – చూ: క్నున్యాంత్స్, బి. ఎమ్.

రెనాన్ (Renan), ఎర్నెస్ట్ జోసెఫ్ (1823–1892) – ఫ్రెంచి శాస్త్రజ్ఞుడు, క్రిస్టియన్ మత చరిత్రకారుడు, భావవాద తత్వవేత్త. క్రిస్టియన్ మతం మొదటి దశ విస్తరణకు సంబంధించిన రచనలు చేశాడు. ప్రజాస్వామ్యాన్నీ, 1871 పారిస్ కమ్యూన్‌నీ బాహాటంగా వ్యతిరేకించాడు. – 385.

రొమానొవ్, వి. ఎ. (Romanov) (1847–1909) – మహా ప్రభువు, చక్రవర్తి రెండవ నికొలస్ పినతండ్రి. జారు ఆదేశం మేరకు 1905 జనవరి 9న కార్మికులపై కాల్పులు జరిపినవాళ్ళకి నాయకత్వం వహించాడు. – 256.

రోజనొవ్, వి. ఎన్. (పొపొవ్) (Rozanov-Popov) (1876–1939) – రష్యన్ సోషల్ డెమోక్రట్, "యూజ్నీ రబోచీ" గ్రూపు సభ్యుడు, ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభ తర్వాత మెన్షెవిక్ పార్టీలో చురుకుగా పనిచేశాడు. – 27, 30, 35, 39, 43, 53, 57, 64–66, 75, 81, 82, 98, 103, 107–12, 130, 135, 141, 150, 170, 172, 173, 185, 186, 226, 238, 241, 246, 247, 249, 250.

రోజెనొవ్ (Rosenow), ఎమిల్ (1871–1904) – జర్మన్ సోషల్ డెమోక్రట్, పత్రికారచయిత, చాలా సోషల్ డెమోక్రటిక్ పత్రికల్లో పనిచేశాడు. 1898–1903లలో రైహ్‌స్టాగ్ సభ్యుడుగా వున్నాడు. – 226.

రోదిచెవ్, ఎఫ్. ఐ. (Rodichev) (1853–1932) – న్యాయవాది, కాడెట్ పార్టీ నాయకుల్లో ఒకడు. – 364, 379, 380.

ర్యజానొవ్, డి. బి. (గోల్డెన్‌డాహ్) (Ryazanov-Goldendakh) (1870–1938) – 1889నుండి రష్యన్ సోషల్ డెమోక్రట్. "బొర్బా" అనే సాహిత్య గ్రూపు ఆర్గనైజర్లలో ఒకడు. ఆ గ్రూపు లెనిన్ పార్టీ నిర్మాణ సూత్రాలపట్ల వ్యతిరేక వైఖరి వహించింది. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభ ఆ గ్రూపును మహాసభ కార్యకలాపాల్లో పాల్గొనవీల్లేదని నిర్ణయించి, దాని ప్రతినిధిగా ర్యజానొవ్‌ను మహాసభకు ఆహ్వానించాలనే ప్రతిపాదనను తిరస్కరించింది. – 27, 29, 139, 197.

లాంగె – చూ: స్త్రొపాని, ఎ. ఎమ్.

లియో XIII (జియొక్కినొ విన్చెంత్సో, కౌంట్ పెచ్చి) (Vincenzo Gioacchino Pecci) (1810–1903) – రోమన్ పోపు (1878లో ఎన్నుకోబడ్డాడు). కేథలిక్ మతాన్ని బూర్జువా సమాజానికి అనుగుణంగా అన్వయించి, పోపు రాజకీయ పాత్రను పునరుద్ధరించాలని ప్రయత్నించాడు. – 373.

లీబ్‌క్నెఖ్ట్ (Liebknecht), విల్‌హెల్మ్ (1826–1900) – జర్మన్ కార్మికోద్యమంలోనూ, అంతర్జాతీయ కార్మికోద్యమంలోనూ ప్రముఖ వ్యక్తి, జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆర్గనైజర్లలోనూ నాయకుల్లోనూ ఒకడు, మార్క్స్, ఎంగెల్స్‌ల అనుచరుడు. 1875నుండి తన జీవితాంతంవరకు లీబ్‌క్నెఖ్ట్ జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడుగానూ, దాని కేంద్ర పత్రిక "Vorwärts"కు ("ముందుకు") బాధ్యుడైన సంపాదకుడుగానూ పనిచేశాడు. మార్క్స్, ఎంగెల్స్‌లు ఆయనకు విశేషమైన ప్రాముఖ్యమిచ్చి, ఆయన కార్యకలాపాలను నడిపించారు, కాని అదే సమయంలో అవకాశవాదులపట్ల ఆయన రాజీవాద వైఖరిని విమర్శించారు. – 102, 103, 147.

లీబెర్, ఎమ్. ఐ. (గోల్డ్‌మన్) (Lieber-Goldman) (1880–1937) – 1898 నుంచి రష్యన్ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలో పాల్గొన్నాడు. బుండ్ నాయకుల్లో ఒకడు. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభలో "ఇస్క్రా" వ్యతిరేక, అత్యంత దక్షిణపక్ష వైఖరిని వహించాడు. మహాసభ తర్వాత మెన్షెవిక్‌గా మారాడు. – 41, 42, 44, 48, 50–52, 64–66, 81, 84, 87–89, 105, 113–15, 123, 143, 149, 163, 164, 194, 210.

లెన్‌స్కీ – చూ: విలెన్‌స్కీ, ఎల్. ఎస్.

లెనిన్, వి. ఐ. (ఎన్. లెనిన్) (Lenin). – 10, 21, 23, 54, 56, 57, 72, 75, 79, 80, 82–84, 86, 88, 91, 94, 97, 100, 101,

108, 110, 111–13, 119, 120, 122, 126, 133, 134, 137, 138, 140, 142, 143, 155, 173, 179, 181, 182, 187, 188, 190, 204, 237–38, 240, 247, 248, 253, 302, 310, 360, 368, 376.

లేన్గ్నిక్, ఎఫ్. వి. (వసీల్యెవ్) (Lengnik-Vasilyev) (1873–1936) – వృత్తి విప్లవకారుడు, బోల్షెవిక్, 1893నుంచి సోషల్ డెమొక్రటిక్ ఉద్యమంలో పాల్గొన్నాడు. 1903–05లలో ఆర్.ఎస్.డి.ఎల్.పి. కేంద్ర కమిటీ సభ్యుడు. – 186, 240, 247.

లేవిన్, వై. వై. (యెగోరొవ్) (Levin-Egorov) (జననం 1873) – రష్యన్ సోషల్ డెమొక్రట్, "యూజ్నీ రబోచీ" గ్రూపు నాయకుల్లో ఒకడు. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభ తర్వాత మెన్షెవిక్కుల్లో చేరిపోయాడు. – 26–29, 32–34, 37–39, 41–49, 51, 53, 64–66, 69, 91, 107, 110–12, 116, 117, 123–25, 148, 149, 156, 168, 172, 184, 210, 227, 246, 249–51, 254.

లేవినా, ఇ. ఎస్. (ఇవనోవ్) (Levina-Ivanov) (1874–1905) – రష్యన్ సోషల్ డెమొక్రట్, "యూజ్నీ రబోచీ" గ్రూపు కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంది. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభ తర్వాత మెన్షెవిక్కులలో చేరిపోయింది. – 43.

లోకెర్మన్, ఎ. ఎస్. (త్సర్యోవ్) (Lokerman-Tsaryov) (1880–1937) – రష్యన్ సోషల్ డెమొక్రట్, ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభలో సెంట్రిస్టు వైఖరి తీసుకున్నాడు, మహాసభ తర్వాత మెన్షెవిక్గా మారాడు. – 43, 91, 105, 132.

ల్యాదొవ్, ఎమ్. ఎన్. (మందెల్ష్టామ్) (Lyadov-Mandelstamm) (1872–1947) – వృత్తి విప్లవకారుడు, బోల్షెవిక్. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభ తర్వాత రష్యాలోనూ, విదేశాల్లోనూ మెన్షెవిక్కులకు వ్యతిరేకంగా చురుకుగా పోరాడాడు.– 34, 151, 246, 247, 249, 250, 254.

ల్వోవ్ – చూ: మొషీన్స్కీ, ఐ. ఎన్.

వసీల్యెవ్ – చూ: లేన్గ్నిక్, ఎఫ్. వి.

వార్లేన్(Varlin), లూయీ ఎజేన్ (1839–1871) – ఫ్రెంచి విప్లవకారుడు, 1871

నాటి పారిస్ కమ్యూన్ సుప్రసిద్ధ కార్యకర్తల్లో ఒకడు. 1865లో మొదటి ఇంటర్నేషనల్‌లో చేరాడు, దాని పారిస్ శాఖల ఆర్గనైజర్లలోనూ, నాయకుల్లోనూ ఒకడు. వెర్సేల్స్ సైనికులచేత కాల్చివెయ్యబడ్డాడు. – 352.

విలెన్‌స్కీ, ఎల్. ఎస్. (లెన్‌స్కీ) (Vilensky-Lensky) (1880–1950) – రష్యన్ సోషల్ డెమోక్రట్, ప్రచారకుడు. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభ తర్వాత బోల్షెవిక్‌గా మారాడు. – 43, 91, 252.

వ్లదీమిర్ (ప్రిన్స్) – చూః రొమానొవ్, వి. ఎ.

షాప్పెర్ (Schapper), కార్ల్ (1812–1870) – జర్మన్ కార్మికోద్యమంలోనూ, అంతర్జాతీయ కార్మికోద్యమంలోనూ ప్రముఖ వ్యక్తి, "కమ్యూనిస్టు లీగు" కేంద్ర కమిటీ సభ్యుడు, 1848–1849 నాటి జర్మన్ విప్లవంలో పాల్గొన్నాడు. 1850లో "కమ్యూనిస్టు లీగు" చీలిక కాలంలో ఉగ్రవాద "వామపక్ష" గ్రూపు నాయకుల్లో ఒకడు. 1865లో మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిలు సభ్యుడు. – 382.

షోట్‌మన్, ఎ. వి. (గోర్‌స్కీ) (Shotman-Gorsky) (1880–1939) – రష్యన్ సోషల్ డెమోక్రట్. ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభలో పీటర్స్‌బుర్గ్ కమిటీ ప్రతినిధి, అధికసంఖ్యాకుల "ఇస్క్రా"ను సమర్థించాడు. మహాసభ తర్వాత బోల్షెవిక్‌గా మారాడు. – 43.

ష్ట్రాయిన్ – చూః అలెక్సాంద్రొవా, వై. ఎమ్.

ష్వైయ్‌త్సెర్ (Schweitzer), యోహన్ బాప్టిస్ట్ (1833–1875) – జర్మన్ రచయిత, సామాజిక కార్యకర్త; ప్రష్యన్ ప్రభుత్వంతో రాజీపడాలనే లాసాల్ అవకాశవాద యెత్తుగడలను అనుసరించాడు. – 206.

ష్వేరిన్ (Schwerin), మాక్సిమిలియన్ (1804–1872) – ప్రష్యన్ రాజకీయవేత్త, ప్రగతి వ్యతిరేక కులీనవర్గ, బ్యూరాక్రసీల ప్రతినిధిగా వ్యవహరించాడు. 1848లో (మార్చి – జూన్) కాంప్‌హౌజెన్ మంత్రివర్గంలో చేరాడు. తన జీవితపు చివరి దశలో బడా బూర్జువావర్గ ప్రయోజనాలను వ్యక్తంచేసే జాతీయ ఉదారవాద పార్టీలో చేరాడు. – 379.

సాబ్లినా – చూః క్రూప్‌స్కయా, ఎన్. కె.

సొరోకిన్ – చూః బౌమన్, ఎన్. ఎ.

స్త్రరొవేర్ – చూ: ప్రొత్రేసొవ్, ఎ. ఎస్.

స్తెపానొవ్ – చూ: నికీతిన్, ఐ. కె.

స్తెపానొవ్, ఎస్. ఐ. (బ్రౌన్) (Stepanov-Braun) (1876–1935) – వృత్తి విప్లవకారుడు, బోల్షెవిక్. – 151.

స్తొపాని, ఎ. ఎమ్. (లాంగె) (Stopani-Lange) (1871–1932) – వృత్తి విప్లవ కారుడు, బోల్షెవిక్, ఆర్.ఎస్.డి.ఎల్.పి. రెండవ మహాసభకు సన్నాహాలు చెయ్యడంలో చురుగ్గా పాల్గొన్నాడు. అక్టోబరు సోషలిస్టు విప్లవం తర్వాత ప్రముఖ రాజనీతిజ్ఞుడు, పార్టీ కార్యకర్త. – 26, 34, 49, 132, 136.

స్త్రాహొవ్ – చూ: తప్తుర్యోవ్, కె. ఎమ్.

స్త్రూవె, పి. బి. (Struve) (1870–1944) – రష్యన్ బూర్జువా ఆర్థికవాది, పత్రికా రచయిత, కాడెట్ పార్టీ నాయకుల్లో ఒకడు. 1890 దశకంలో "చట్టబద్ధ మార్క్సిజానికి" ప్రముఖ ప్రతినిధి, మార్క్సు సిద్ధాంతానికి "చేర్పులూ," దానిపై "విమర్శలూ" చేసేందుకు సిద్ధపడ్డాడు. మార్క్సిజాన్నీ, కార్మికోద్యమాన్నీ బూర్జువా వర్గ ప్రయోజనాలకు అన్వయించడానికి ప్రయత్నించాడు. అక్టోబరు సోషలిస్టు విప్లవం తర్వాత సోవియట్ అధికారానికి శత్రువుగా మారి వ్రాంగెల్ విప్లవ ప్రతీఘాత ప్రభుత్వంలో మంత్రి పదవి వహించాడు. తర్వాత వైట్‌గార్డ్ ప్రవాసిగా జీవితం గడిపాడు. – 154–56, 201, 262, 273, 296, 301, 310–21, 340, 342, 343, 363, 364, 370–74.

హల్తూరిన్, ఎస్. ఎస్. (Khalturin) (1856–1882) – రష్యన్ విప్లవ కార్మికుల్లో ఒకడు. "రష్యన్ కార్మికుల ఉత్తరాది సంఘం" అనే రహస్య సంఘ ఆర్గనైజరు. స్వతంత్ర కార్మిక పత్రికను ప్రచురించడానికి కృషిచేశాడు. ఒదేస్స నగరపు సైనిక ప్రాసెక్యూటర్‌ని హత్యచేసేందుకు జరిగిన ప్రయత్నంలో పాల్గొన్నందుకు ఉరితీయబడ్డాడు. – 75.

హాన్సెమన్ (Hansemann), డేవిడ్ యుస్తుస్ (1790–1864) – ప్రష్యన్ రాజనీతిజ్ఞుడు, జర్మన్ బడా పెట్టుబడిదారు, రైనిష్ లిబరల్ బూర్జువా నాయకుల్లో ఒకడు. 1848 మార్చినుండి సెప్టెంబర్‌వరకు ప్రష్యా ఆర్థిక మంత్రి; ప్రగతినిరోధకులతో రాజీపడే ద్రోహపూరిత విధానంవైపు మొగ్గాడు. – 379, 380.

హైండ్మన్ (Hyndman), హెన్రీ మయర్స్ (1842–1921) – ఇంగ్లీషు రాజనీతిజ్ఞుడు, బ్రిటిష్ సోషలిస్టు పార్టీ (1911) స్థాపకుల్లో ఒకడు. 1916లో జరిగిన ఆ పార్టీ మహాసభలో ఆయన సోషల్ జాతీయ దురహంకారవాద వైఖరి ఖండింపబడ్డాక, ఆయన ఆ పార్టీనుంచి బయటకు వెళ్లిపోయాడు. – 197.

హైనె (Heine), వోల్ఫ్గంగ్ (1861–1944) – జర్మన్ రాజనీతిజ్ఞుడు, సోషల్ డెమోక్రట్, వృత్తి రీత్యా వకీలు, సోషల్ డెమోక్రటిక్ పార్టీలో అతివాద అవకాశవాదులైన బెర్న్‌స్టైన్ అనుచరులను సమర్థించాడు. – 227, 228, 233.

Y – చూ: గల్పేరిన్, ఎల్. ఐ

పాఠకులకు మనవి

ఈ పుస్తకం అనువాదాన్ని గురించీ, కూర్పును గురించీ మీ అభిప్రాయాలను "ప్రగతి" ప్రచురణాలయానికి తెలియ జెయ్యండి.

మీ అభిప్రాయాలను ఈకింది చిరునామాకు పంపండి:

Progress Publishers
17, Zubovsky Boulevard
Moscow, USSR

మా ప్రచురణలు దొరికే చోట్లు:

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
చంద్రం బిల్డింగ్స్
విజయవాడ – 520004

విశాలాంధ్ర బుక్ హౌస్
ఏలూరు రోడ్డు
విజయవాడ – 520002

విశాలాంధ్ర బుక్ హౌస్
బాంక్ రోడ్డు
హైదరాబాదు – 500001

విశాలాంధ్ర బుక్ హౌస్
కాలేజి రోడ్డు
అనంతపురం – 515004

విశాలాంధ్ర బుక్ హౌస్
11–1–37 గాంధీ రోడ్డు
తిరుపతి – 517501

విశాలాంధ్ర బుక్ హౌస్
సూపర్ బజారు ఎదుట
మెయిన్ రోడ్డు
విశాఖపట్టణం – 530002

విశాలాంధ్ర బుక్ హౌస్
రష్యన్ షాపింగ్ కాంప్లెక్స్
స్టీల్ ప్లాంట్ టౌన్‌షిప్
విశాఖపట్టణం — 530039

విశాలాంధ్ర బుక్ హౌస్
మెయిన్ రోడ్డు
హనుమకొండ
వరంగల్ – 506011

విశాలాంధ్ర బుక్ హౌస్
మెయిన్ రోడ్డు
అరండల్ పేట
గుంటూరు – 522002

సోవియట్ యూనియన్‌లో ముద్రింపబడింది

వి. ఐ. లెనిన్ "సంకలిత రచనలు" మూడవ సంపుటంలో "మాస్కో తిరుగుబాటు గుణపాఠాలు," "జాతుల స్వయంనిర్ణయ హక్కు," "సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ," "శ్రామికవర్గ విప్లవపు సైనిక కార్యక్రమం" మొదలైనవి ఉన్నాయి.